Acc No: 28484

శ్రీమదాంధ్ర మహాభారతము

ఉద్యోగ పర్వము

తిక్కన సోమయాజి

వ్యాఖ్యాతలు

డా॥ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి

శ్రీ జన్నాభట్ల వీరేశ్వరశాస్త్రి

డా॥ సూరం శ్రీనివాసులు

ప్రచురణ

ఆర్షవిజ్ఞాన ట్రస్టు

హైదరాబాదు

2000

ప్రథమ ముద్రణ : ప్రమాధి-మాఘము

ప్రతులు : 1,000

© ఆర్షవిజ్ఞాన ట్రస్టు

ప్రతులకు :

1. **శ్రీ పమిడిఘంటం శ్రీరఘురామ్**
అడ్వకేట్
శ్రీరామసదనం ప్లాట్ నెం. 1361, రోడ్ నెం. 45
జూబ్లీ హిల్స్, హైదరాబాదు – 500 033
ఫోన్ : 040 - 3608237

2. **డా॥ టి.ఆర్.కె. మూర్తి**
11-192ఎ, శివాలయం వెనుక
పోలకంపాడు, తాడేపల్లి పోస్టు - 522 501
ఫోను : 0866-425093

వెల : 200 - 00

ముద్రణ : కళాంజలి గ్రాఫిక్స్
నారాయణ గూడా
హైదరాబాదు - 500 029,

జస్టిస్ **పమిడిఘంటం కోదండరామయ్య**
ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి
ఆర్షవిజ్ఞానట్రస్టు స్థాపకాధ్యక్షులు

శ్రీరామసదనం,
జూబ్లీహిల్స్,
హైదరాబాద్- 500033

ముందుమాట

ఆర్ష విజ్ఞాన ట్రస్టువారు ఆచార్య శ్రీ పుల్లెల శ్రీరామచంద్రుడుగారు రచించిన శ్రీమద్వాల్మీకి రామాయణము టీకా తాత్పర్య సహితముగా పది సంపుటములుగా ప్రచురించిరి. ఆంధ్రదేశమంతయు నిది జనాదరణమును పొంది కొన్ని భాగములు విస్తృతముగా రెండుమూడు ప్రచురణలుకూడా పొందవలసివచ్చినది.

రామాయణమునకు విస్తృత వ్యాఖ్య మహాభారతము. వాల్మీకి రామాయణమును కావ్యముగా వెలయించి రనుట నిర్వివాదము. అందుచే దీనియందలి ఉపదేశమును సమగ్రముగ తెలిసికొనుటకు భారతము చదువుట అత్యావశ్యకము. తెలుగుల పంటగా కవిత్రయం వారు భారతమును తెనిగించి తెలుగువారికి దాని యెడల ఎనలేని అభిరుచిని అభిమానమును కలుగునట్లు చేసిరి. ఈ భారతమునందలి విరాటోద్యోగపర్వములు తెలుగు భారతమునకు మకుటాయమానములు. వీనిని ప్రముఖ విద్వాంసులు టీకా తాత్పర్య సహితముగా వెలయించి ఈనాటి యువతరము వారికి దీనియందు అభిరుచిని కలిగించి ప్రజ్వలింప జేయుటకు దివ్యమయిన ప్రక్రియ చేపట్టిరి. అందుచే ఈ ట్రస్టు వారు ఈ రెండు పర్వములను ప్రచురించుట జరిగినది.

శ్రీ మహాభారతమునందలి ఆదిపంచకమునకు బ్రహ్మశ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రిగారు గద్యానువాదము చేసి ప్రచురించియున్నారు. ఈ ప్రణాళికలో భాగముగా వారి అనువాదము భీష్మపర్వమునుండి ఆర్ష విజ్ఞాన ట్రస్టువారు ప్రచురించు చున్నారు.

శాంతరస ప్రధానమయిన భారతమునకు శాంతి సప్తకము మూలము. ఆ శాంతి సప్తకమును మూల శ్లోక తాత్పర్యములతో కూడా ఈ ట్రస్టువారు ప్రచురించుచున్నారు. కావున తెలుగువారు ఈ భారత రామాయణములను సమగ్రముగ అధ్యయనము చేసి వ్యాసవాల్మీకులు ప్రసాదించిన చతుర్విధ పురుషార్థములను సమృద్ధిగా ఆస్వాదించి ఆదర్శప్రాయులయిన మానవులుగా వెలుగొందుదురని భావించుచున్నాము.

ఈ యజ్ఞమునకు సహాయపడిన వదాన్యులకు వ్యాసభగవానులు సర్వ సంపత్సమృద్ధిని ప్రసాదింతురని నా ప్రార్థనము.

వేదవ్యాస గుణావాస విద్యాధీశ సతాంవశ
మాం నిరాశం గతక్లేశం కుర్వనాశం హరే2నిశమ్.

సం॥ ప. కోదండ రామయ్య

ట్రస్టు బోర్డు సభ్యులు

శ్రీ పొత్తూరి వెంకటేశ్వరరావు — అధ్యక్షులు
అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడెమీ, హైదరాబాదు

శ్రీ పల్లెంపాటి వెంకటేశ్వర్లు — సభ్యులు
కాకతీయ సిమెంట్సు లిమిటెడ్, హైదరాబాదు

శ్రీ ఆకెళ్ల సత్యనారాయణమూర్తి — సభ్యులు
హైదరాబాదు

శ్రీ నీలంరాజు మురళీధర — సభ్యులు
హైదరాబాదు

డా. ముక్తి నూతలపాటి గురునాథ్ — సభ్యులు
విజయవాడ

డా. ఉప్పలూరి బిందుమాధవ్ — సభ్యులు
వాటర్లూ, కెనడా

శ్రీ పమిడిఘంటం శ్రీరఘురామ్ — సభ్యులు
హైదరాబాదు

ఆర్ష విజ్ఞాన ట్రస్టు

శ్రీరామ సదనము
ప్లాట్ నెం. 1361, రోడ్ నం. 45,
జూబ్లీ హిల్సు కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటి
హైదరాబాదు - 500 033

ప్రముఖ న్యాయవాదులు, రాజ్యసభ సభ్యులు

కీ.శే. పర్వతరెడ్డి బాబులురెడ్డిగారి జ్ఞాపకార్థము

వారి కుమారులు

రాజ్యసభ సభ్యులు గౌ. ప్రభాకరరెడ్డిగారిచే

ఈ సంపుటము ముద్రించి ప్రచురించటమైనది.

మనవి

విశ్వజనహిత కాంక్షతో సమాహిత మనస్కులైన మహర్షుల ముఖ వినిస్సృతాలు భారత, భాగవత, రామాయణాలు. అందులో భారతము వేదవ్యాస మహర్షి ప్రణీతము. ప్రపంచ వాఙ్మయంలోనే బృహత్గ్రంథంగా వాసికెక్కింది భారతం. విశ్వజనులకు ఇహపరాలు రెండిటా త్రోవచూపటానికి వ్యాసమహర్షి ఎంతోతపన చెంది భారతాన్ని వ్రాశాడు. సమాజాన్ని ఉద్ధరించటానికి ఆయనపడిన శ్రమ ఇంత అంత అనరానిది. తనకళ్ళముందు జరిగిన కథను స్వీకరించి ఇహానికి ధర్మాన్ని పరానికి అద్వైతాన్ని రంగరించి భారతం చెప్పాడు. అందుకే "యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి నతత్ క్వచిత్" అని ప్రసిద్ధి పొందింది. వేదాల్లోని విషయమంతా క్రోడీకరించి సామాన్యజనుల కుపయోగ పడే రీతిలో భారతాన్ని మలచాడు. అందుకే అది పంచమవేదం అయింది.

అసలా వ్యాస శబ్దంలోనే ఒక చమత్కృతి కలదు. వకార యకార సకారముల సంపుటి అది. అందున్నవి మూడునూ బీజాక్షరములు, వకారం అమృత బీజం. యకారం వాయుబీజం. సకారం సర్వతత్వాత్మకం. అమృత ప్రాయాలైన వాక్కులు ప్రాణతుల్యమైన వాయువువలె సర్వహృదయాంతరాల్లో ప్రవేశించు శక్తి ఆ వ్యాసశబ్ద సంపుటిలో ఇమిడియున్నదని భావించుటలో దోషం లేదు. ఇంతటి మహత్త్వపూర్ణమైన వ్యాసునికి కృతజ్ఞతా సూచకంగా భారతీయులు ఋషితర్పణంలో "కృష్ణద్వైపాయనాదయో యే ఋషయః తాన్ ఋషీగ్ం స్తర్పయామి" అని వ్యాస మహర్షినే ముందుగా పేర్కొంటున్నారు.

భారత వైశిష్ట్యాన్ని గ్రహించిన వారిలో తెలుగువారు ప్రథములు. ఆంధ్రమహాభారతములో నన్నయ వ్యాస భారతమును గురించి

"ధర్మ తత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని
అధ్యాత్మవిదులు వేదాంతమనియు
నీతి విచక్షణుల్ నీతిశాస్త్రంబని
కవివృషభులు మహాకావ్యమనియు ....
కొనియాడుచుండ వివిధ వేదతత్త్వ వేది వేదవ్యాసుడు...
విశ్వజనీనమై పరగుచుండ జేసె భారతంబు" అని భారత ప్రాశస్త్యాన్ని ఉగ్గడించారు. దాన్నే తిక్కనగారు కొనసాగిస్తూ ధర్మాద్వైత స్థితితో భారతాఖ్యమగు లేఖ్యమైన ఆమ్నాయాన్ని వ్రాసినట్లు చెప్పుకొన్నాడు. అనగా భారతంలో తాను వీక్షించిన ప్రధాన విషయాలలో మొదటిది ధర్మము రెండవది అద్వైతము. ఇహపరాలు రెండిటికి అవసరమైన వివి. తిక్కన వ్రాసిన భారతభాగం పదునైదు పర్వాలు. ఆ పర్వాలలో మొదటిది విరాటము రెండవది ఉద్యోగము. **"భారతేసారముద్యోగమ్"** అని ప్రసిద్ధి నొందింది ఉద్యోగపర్వం. రాజనీతి ప్రదర్శనానికి అనువైనది. భారతకథలో ప్రధానమైన రాయబారాలు ఇందేకలవు. ఈ రాయబారాలలో ఎన్నియో ధర్మవిశేషాలు వేరువేరు పాత్రలముఖంగా వ్యక్తీకరింపబడ్డాయి. అందుప్రధానమైనది విదురనీతి. సర్వజనోపయుక్తాలయిన నీతివిశేషాలకు నిలయం విదురనీతి.

ఇంతటి వైశిష్ట్యం కలిగిన భారతంలో తిక్కన ప్రత్యేకతలు ఎన్నో ఉన్నాయి. వింటే భారతం వినాలి తింటే గారెలే తినాలి' అనే నానుడి తెలుగుభారతాన్ని గురించే పుట్టింది. అందునా విరాటోద్యోగాలను దృష్టిలో పెట్టుకొని వచ్చినదయి ఉంటుంది. ఏ ఘట్టాన్ని తీసుకొన్నా తిక్కన తెలుగుదనం ఉట్టిపడేటట్లు చిత్రీకరిస్తాడు. ఆయన పలుకుబడులు పదబంధాలు తెలుగువారి హృదయాలకు హత్తుకుపోతాయి.

మెత్తనిపులి, పెట్టనికోట, అశక్త దుర్జనత్వము మొదలైనవి తిక్కన ప్రసాదించిన పలుకుబడులు. ఈ విరాటోద్యోగపర్వాలు ఇతరకవులకు ఎంతోమందికి ప్రేరకాలయ్యాయి. తిక్కన భారతాన్ని అనుసరించే తిరుపతి వేంకటకవులు పాండవోద్యోగము, పాండవ విజయము అనే నాటకాలు వ్రాశారు. అక్షర జ్ఞానం కూడా లేని గొడ్లమేపుకొనేవారు సైతం చెల్లియో చెల్లకో, అదిగో! ద్వారక. బావా! ఎప్పుడు వచ్చితీవు. మొదలైన పద్యాలు పాడుకుంటూనే ఉంటారు.

జనహితవ్యాఖ్యను గురించి :

సమానభావాలు కలిగిన కొంతమంది కలిసి జనహిత వ్యాఖ్యాతలుగా ఏర్పడి విరాటపర్వాన్ని వ్యాఖ్యానించాము. అది టి.టి.డి. వారి ఆర్థిక సహాయంతో ముద్రితమై జనహిత వ్యాఖ్యగా ప్రసిద్ధి వహించింది. తెలుగుభారతానికి ఎన్నో కోణాలలో ప్రాశస్త్యం ఉన్నది. అందులో మేము ధర్మానికి, సాహిత్యానికి, పాత్రోన్మీలనానికి ప్రాధాన్య మిచ్చాము. పద్యానికి ప్రతిపదార్థము, భావము వ్రాసిన తరువాత అవసరమైన చోట్ల విశేషాంశాలు వ్రాశాము. ఈ విశేషాంశాలలో పై ప్రాధాన్యము గమనింపవచ్చు. ఈ వ్యాఖ్యాప్రణాళిక అంతా విరాటపర్వానికి వలెనే సాగించాము. విషయ సూచికలలో సంస్కృత పర్వసంఖ్యలు ఉస్మానియావారి ప్రతినుండి యథాతథంగా గ్రహించాము. కానీ మేము విశేషాలలో సంస్కృత పర్వసంఖ్యలు చాలవరకు నీలకంఠీయమును అనుసరించి వేశాము.

ప్రచురణను గురించి :

ఈ ఉద్యోగ పర్వ జనహితవ్యాఖ్యను ప్రచురించటమెలా అని కొట్టుమిట్టాడుతున్న మమ్ము వెన్నుతట్టి ముందుకు నడిపించి ముద్రణభారమును వహింతునని ప్రోత్సహించిన ఆర్షవిజ్ఞానట్రస్టు స్థాపకాధ్యక్షులు శ్రీ పమిడి ఘంటం కోదండరామయ్యగారు. వారి ప్రోత్సాహమే లేనిచో ఈ జనహితవ్యాఖ్య మూలపడి ఉండేదే. వారికి మా కృతజ్ఞతాభివందనాలు.

పరంపరయా శ్రీ కోదండ రామయ్యగారిని పరిచయము చేసిన శ్రీ భాగవతుల వెంకటేశ్, శ్రీ ఎస్. ఆదినారాయణమూర్తి గార్లకు కృతజ్ఞతాభివందనములు.

తెలుగువారు గర్వించదగిన గ్రంథం కవిత్రయభారతం. తెలుగువాడై పుట్టినందుకుగాను చనిపోయే లోపులో ఒక్కసారైనా భారతం చదవాలని వ్యాసభావావిష్కరణంలో నిష్ణాతులైన తెలుగు కవిత్రయం యొక్క భారతం చదవకుండా చనిపోరాదని వ్యాఖ్యాతల ఆకాంక్ష.

అక్షరాస్యులైన తెలుగువారు అందరూ కవిత్రయ భారతాన్ని ఆస్వాదించాలని ఈ వ్యాఖ్యాతలు "భారతం చదవండి జనహితులై మెలగండి" అని నినదిస్తూ ఉంటారు. ఒకసారి కవిత్రయభారతం చదివిన వారు "అయ్యో ఇప్పటిదాకా చదవలేక పోయామే" ఎంతకాలం వృథా చేశామోకదా" అని అనుకుంటారుట. భారత కవిత్వ రుచి పట్టుబడేవరకే ఇతర కావ్యాలు చదువుతా"రని పింగళి వారంటారు.

అటువంటి భారతానికి ఇది జనహితులయొక్క వ్యాఖ్య. జనహితమైన వ్యాఖ్య. ఇది ప్రయోజన మహితమైతే మాకు ఆనందము. విష్ణురూపాయ నమశ్శివాయ" అని పంచాక్షరిని దశాక్షరి చేసి ఉపాసించిన పదహారణాల తెలుగు వ్యక్తి తిక్కన యొక్క మనసు ఆనంద పరవశమవుతుంది. మీరూ ఇక ఆనంద పారవశ్యం పొందుతారా మరి!

సెలవు

ఇట్లు

జనహిత వ్యాఖ్యాతలు

ఉద్యోగపర్వ జనహిత వ్యాఖ్యాతల పరిచయము

1. డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి

జననము : 20-4-1939

తల్లిదండ్రులు : పేరమ్మ, సత్యనారాయణ;

విద్యాభ్యాసము : భాషాప్రవీణ, మొదటితరగతి ప్రథముడు
శ్రీ మార్కండేయ ఓరియంటల్ కళాశాల - ఆగిరిపల్లి
ఎం.ఏ. మొదటితరగతి - ప్రథముడు ఆంధ్ర విశ్వవిద్యాలయము;
పి.హెచ్‌డి. రససిద్ధాంతము ఆంధ్రుల వరివస్య;

ఉద్యోగము : పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్తు తెలుగు పండితుడు; భీమవరం,
అమలాపురం, ఏలూరు, నాగార్జున సాగర్ కళాశాలల్లో తెలుగు ఉపన్యాసకుడు

ముద్రిత రచనలు : 1. సంస్కృత భాణ సాహిత్యము 2. రస సిద్ధాంతము ఆంధ్రుల వరివస్య
3. భారత నిరుక్తి- నన్నయ రుచిరార్థ సూక్తి 4. భారత నిరుక్తి- తిక్కన సరసోక్తి
5. భారత నిరుక్తి - ఎఱ్ఱన ధర్మోక్తి 6. శ్రీ మదాంధ్ర మహాభారతము- విరాట
పర్వము - జనహిత వ్యాఖ్య- 7. మహాభారత ప్రశ్నోక్తి (భారత క్విజ్) 550
ప్రశ్నలు 8. శివ సహస్రనామ నిరుక్తి 9. తప్పులు లేని శివసహస్ర నామములు

చిరునామా : **డా॥ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి**
11-192ఎ, శివాలయం వెనుక, **పోలకంపాడు,**
వయా తాడేపల్లి పోష్టు - 522 501, ఫోన్ : 0866-425093

2. శ్రీ జన్నాభట్ల వీరేశ్వర శాస్త్రి, ఎం.ఏ.,

జననము : 9-6-1936

తల్లిదండ్రులు : వెంకట నరసమ్మ, రామచంద్ర సిద్ధాంతి

విద్యాభ్యాసము : 1. భాషా ప్రవీణ. శ్రీ మార్కండేయ ఓరియంటల్ కళాశాల, ఆగిరిపల్లి
2. ఎం.ఏ (తెలుగు) ఆంధ్ర విశ్వవిద్యాలయం

ఉద్యోగము : 1 తెలుగు ఉపన్యాసకుడు హిందూ కళాశాల - గుంటూరు

ముద్రిత రచనలు : 1. అనుగీత ; 2. శ్రీమదాంధ్ర మహాభారతము - విరాట పర్వము - జనహిత వ్యాఖ్య
3. శ్రీ మహాభారతము - ఉపాఖ్యానములు 4. భీమేశ్వర పురాణ వ్యాఖ్య;
5. పురుష సూక్తము-శ్రీ సూక్తము

చిరునామా : **శ్రీ జన్నాభట్ల వీరేశ్వరశాస్త్రి**
రిటైర్డు తెలుగు లెక్చరర్
సంపత్ నగర్, గుంటూరు - 522 004
ఫోన్ : 0863-356456

3. డాక్టర్ సూరం శ్రీనివాసులు

జననము : 5-6-1951,

తల్లిదండ్రులు : శేషమ్మ, హనుమంతయ్యలు

విద్యాభ్యాసము : 1. సాహిత్య శిరోమణి - వేదసంస్కృత కళాశాల నెల్లూరు

2. ఎం.ఏ., (తెలుగు, సంస్కృతము)

3. పిహెచ్.డి. (Hasya and prahasana)

ఉద్యోగము : 1. ఏలూరు, చిననింద్రకొలను, పొన్నూరు, ఓరియంటల్ కళాశాలలలో సంస్కృతోపన్యాసకుడు-

తాడికొండ, తిమ్మసముద్రము కళాశాలలో ప్రిన్సిపాల్.

2. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమాధ్యాపక బహుమతిగ్రహీత

ముద్రిత రచనలు : 1. సంస్కృత భాణ సాహిత్యము

2. భారతనిరుక్తి- నన్నయరుచిరార్థసూక్తి

3. భారతనిరుక్తి - తిక్కన సరసోక్తి

4. భారతనిరుక్తి - ఎఱ్ఱన ధర్మోక్తి

5. శ్రీమదాంధ్ర మహాభారతము విరాట పర్వము - జనహితవ్యాఖ్య

6. సంస్కృత ప్రహసన సాహిత్యము

7. సామనస్యము

చిరునామా : **డా॥ సూరం శ్రీనివాసులు**
ప్రిన్సిపల్
ఎస్.జి.వి. ఓరియంటల్ డిగ్రీ కళాశాల
తిమ్మసముద్రం, ప్రకాశం జిల్లా - 523185

ఆంధ్ర మహాభారతము

ఉద్యోగ పర్వము - ప్రథమాశ్వాసము

ఉద్యోగ పర్వము - ద్వితీయాశ్వాసము

ఉద్యోగ పర్వము - తృతీయాశ్వాసము

ఉద్యోగ పర్వము - చతుర్థాశ్వాసము

రోషమయ మహాతరువు సుయోధను(,డురు
స్కంధ మందులోన(గర్ణు(,డలరు(
గొమ్మ సౌబలుండు, గుసుమ ఫలములు దు
శ్శాసనుండు, మూలశక్తి తండ్రి. ఉద్యో 1-355

ధర్మజుండు ధర్మతరు, వర్జును(డు ఘన
స్కంధ, మనిల సుతు(డు శాఖ, కవలు
పుష్పఫలము; లేను, భూసురులును, వేద
ములు(దదీయమైన మూలచయము. 1-356

శ్రీమదాంధ్ర మహాభారతము
ఉద్యోగ పర్వము - ప్రథమాశ్వాసము

జనహిత వ్యాఖ్య

క॥ **శ్రీ గౌరీ పల్లవ పుట**
యోగాశ్రయ మంజరీ సముజ్జ్వల మూర్తీ!
యోగీంద్ర సంత తాంత
ర్యాగ పరీపాక రూప హరిహరనాథా! 1.

అ: శ్రీ గౌరీ...................... మూర్తీ: ; శ్రీ గౌరీ = లక్ష్మీ దేవి, పార్వతీదేవి అనెడి ; పల్లవపుట = చిగురు గుత్తుల ; యోగ = బంధమును; ఆశ్రయ = ఆశ్రయించిన (కలిగిన); మంజరీ = పూలగుత్తి వలె ; సముజ్జ్వల మూర్తీ ! = ప్రకాశవంతమయిన రూపము కలవాడా!; యోగీంద్ర --- రూప ; యోగీంద్ర = ఉపాసకుల యొక్క/ మహర్షులయొక్క : సంతత = నిరంతరమయిన ; అంతర్యాగ = అంతర్యాగము యొక్క ; పరీపాక రూప = ఫల స్వరూపమయిన వాడా! హరిహరనాథా!

భా: హరిహరనాథా! చిగురుల గుబురులతో కూడిన పూలగుత్తివలె లక్ష్మీ పార్వతులతో కలిసి దేదీప్యమానముగా వెలుగొందుచున్నావు. యోగులు ఆచరించే అంతర్యాగానికి ఫలరూపముగా వెలుగుచున్నావు.

వి: హరిహరనాథుడు పూలగుత్తి వంటివాడు. పూల గుత్తికి చిగురుటాకుల కలయికతో మరింత శోభ చేకూరును. అట్లే లక్ష్మీపార్వతుల కలయికతో హరిహరనాథునకు సముజ్జ్వలత్వము కలిగినది. అతడు శక్తిమంతుడయినాడు.

పల్లవ,పుట, యోగపదములు మంత్రశాస్త్ర ప్రసిద్ధములు. పల్లవ మనగా ప్రధాన మంత్రమునకు చివర అంగమంత్రము చేర్చుట; సంపుటమనగా ముందు చేర్చుట; యోగమనగా మొదట,చివరకూడా చేర్చుట. పల్లవపుట యోగములతో మంత్రసిద్ధి సముజ్జ్వలమగునని శాస్త్రము.

హరిహరనాథుడు అంతర్యాగ పరీపాక రూపుడు, అంతర్యాగమనగా మనస్సులో చేయు యాగము. అనగా సతతము భావన మొనర్చుట. అంతర్యాగమును యోగులు చేయుదురు. అది జ్ఞానహేతువు. అటువంటి అంతర్యాగమునకు ఫలరూమమయిన వాడు హరిహరనాథుడు.

లౌకికముగ ఏకార్య మొనరించుచున్నను ఆత్మ మాత్రము భగవంతుని చేరి యుండుటకు చేయు సాధనమిది. ఇట్టి సాధనమును గురించియే యీ క్రింది శ్లోకము చెప్పుచున్నది.

ఆత్మా త్వం, గిరిజా మతి : ,పరిజనాః ప్రాణాః, శరీరం గృహమ్
పూజా తే విషయోపభోగరచనా, నిద్రా సమాధిస్థితిః
సంచారః పదయోః ప్రదక్షిణ విధిః ,స్తోత్రాణి సర్వా గిరః
యద్యత్కర్మ కరోమి తత్త దఖిలం శంభో ! తవారాధనమ్.

(పరమేశ్వరా! నా ఆత్మ నీవే. బుద్ధి అమ్మయే (పార్వతి). ప్రాణములు పరిజనులే. శరీరము ఆలయమే. విషయానుభవయత్నమంతయు నీపూజయే. నిద్ర సమాధి. ఈ కాళ్లు తిరిగినదంతయు నీకు ప్రదక్షిణమే. ఈ నాలుక పలికిన పలుకులు నీ స్తోత్రములే. నేను ఏ పని చేసినను అది అంతయు, నీ ఆరాధనమే.) అంతర్యాగమునకు పూజాపుష్పము లివి :-

అహింసా ప్రథమం పుష్పం పుష్పమింద్రియ నిగ్రహః
దయాపుష్పం క్షమాపుష్పం జ్ఞాన పుష్పంచ పంచమమ్
ఏవం విధై స్సుపుష్పైశ్చ పూజయే త్పరమేశ్వరమ్

ఈ అంతర్యాగ స్వరూపమును తిక్కన శాంతి పర్వము 5వ ఆశ్వాసమున వివరించినాడు.

వ: దేవా! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె. 2.

భా: *హరిహరనాథా! వైశంపాయనుడు జనమేజయునితో ఇలా అన్నాడు.*

--: పాండవులు కృష్ణాదులం గూడి భావికార్యవిధానము నాలోచించుట :--

సం. 5-1- 1

తే: ఎలమి నభిమన్యు పెండిలి యివ్విధమునఁ
జేసి, యుల్లాసలక్ష్మి కైసేసి మత్స్య
మనుజపతి యన్వయంబు పావనము సేసి
దినచతుష్టయానంతరమునఁ బ్రియమున. 3.

అ: ఎలమిన్= సంతోషంతో: అభిమన్యుపెండిలి= అభిమన్యుని యొక్క పెళ్లి; ఈ+ విధమునన్ + చేసి; ఉల్లాస లక్ష్మి = ఉత్సాహం అనే లక్ష్మిని ; కైసేసి= అలంకరించి;(పొంది) మత్స్యమనుజపతి + అన్వయంబు= మత్స్య మహారాజు అయిన విరాటుని వంశం: పావనము చేసి= పవిత్రం చేసి; దిన చతుష్టయ + అనంతరమునన్ = నాలుగు రోజుల తర్వాత : ప్రియమునన్ = ప్రీతితో.

భా:*ఇలా సంతోషంగా అభిమన్యుని వివాహం చేసి, ఉల్లాసం పొంది, విరాటుని వంశం పావనం చేసి , నాల్గు రోజుల తరువాత ప్రియంతో................ (తరువాతి పద్యంతో అన్వయం)*

వి: 1). అజ్ఞాత వాసంతో కుంగిపోయిన పాండవులకు దక్షిణ, ఉత్తర గోగ్రహణాలతో ఉత్సాహమూ, ఉల్లాసమూ కలిగాయి. భావి కాలంలో తమకే జయం కలుగుతుందనే ఆత్మ విశ్వాసం కలిగించింది ఉత్తర గోగ్రహణం. దానికి మరింత దోహదం చేసింది విరాటుని సంబంధం. విరాటుని సంబంధం పాండవులకు ప్రోత్సాహాన్ని ఇచ్చింది. పాండవులతో సంబంధం విరాటునికి సంతోషాన్ని ఇచ్చింది.

2) ఉత్తరాభిమన్యుల వివాహం వల్ల విరాటుని వంశం పావనం అయింది. కన్యాదానం చేస్తే ఆ కన్యాదానం వల్ల కన్యాదాత యొక్క పదితరాల వాళ్లు నరకం నుండి విముక్తి పొందుతారట. "దశ పూర్వేషాం దశాపరేషాం మద్వంశ్యానాం నరకాదుత్తీర్య శాశ్వత బ్రహ్మలోకే నిత్య నివాస సిద్ధ్యర్థం సాలంకృత కన్యాదానమహం కరిష్యే '' అని వివాహంలో సంకల్పం చేస్తున్నారు. వరుని సాక్షాత్తు నారాయణ స్వరూపునిగా భావించి కన్యాదానం చేయడం వైదిక సంప్రదాయం.

3) ఉల్లాస లక్ష్మి అనడంలో ఉల్లాసాన్ని లక్ష్మిగా రూపకం చేశాడు తిక్కన.

వ: ధర్మతనయుండు దమ్ములుం గొడుకులుం బరివేష్టించి యుండ విశాల రమణీయంబగు విరాటు కొలువు కూటంబున కరిగి యందు. 4.

అ: పరివేష్టించి యుండన్ = చుట్టూ ఉండగా

భా: *తమ్ముళ్లూ, కొడుకులూ చుట్టూ ఉండేటట్లుగా ధర్మరాజు విరాటుని ఆస్థానంలోకి వెళ్లి అందులో........*

వి: కొడుకు లనగా అభిమన్యుడు,ఉపపాండవులు; ఉపపాండవులు ద్రుపదుని నగరంనుండి అభిమన్యుని పెళ్లికి వచ్చినవారు.

క: విరటుఁడుఁ బాంచాలుండును
హరియును రాముండు వారి యనుజ తనూజుల్
పరిణయ సమాగతాఖిల
ధరణీశులు బలసియుండఁ దద్దయు నెమ్మిన్. 5.

అ : విరటుడున్+ పాంచాలుండును = విరాటుడూ, ద్రుపదుడూ: హరియును = కృష్ణుడూ; రాముండు = బలరాముడూ; వారి యనుజ తనూజుల్ = వారి తమ్ముళ్లూ, కొడుకులూ; పరిణయ సమాగత - అఖిల ధరణీశులు = పెళ్లికి వచ్చిన రాజులందరూ; బలసి యుండన్ = చుట్టూ ఉండగా ; తద్దయు నెమ్మిన్ = మిక్కిలి సుఖంగా (ఉన్న సమయంలో అని తరువాతి వచనంతో అన్వయం).

భా : *విరాటుడూ, ద్రుపదుడూ, కృష్ణుడూ, బలరాముడూ, వారి తమ్ముళ్లూ, కొడుకులూ, ఇంకా పెళ్లికి వచ్చిన రాజులూ పరివేష్టించి సుఖంగా కొలువున్న సమయంలో.*

వి: **వారి యనుజ తనూజుల్**

1.విరాటుని తమ్ములు : శతానీకుడు, మదిరాక్షుడు, సూర్యదత్తుడు -

కొడుకులు: శంఖుడు, ఉత్తరుడు

2. **ద్రుపదుని తమ్ముడు** : సత్యజితుడు;
కొడుకులు : ధృష్టద్యుమ్నుడు, శిఖండి, యుధామన్యుడు.
3. **కృష్ణుని తమ్ములు** సాత్యకి మొదలయిన వారు.
కొడుకులు : ప్రద్యుమ్నుడు మొదలయినవారు.

వ: ఉన్న సమయంబున సభాసదులైన మానవేంద్రులు నానా విధంబులఁ గృష్ణ యుధిష్ఠిరులతో సంభాషణంబులు సేయుచుండఁ బాండవ కార్యార్థియై కృష్ణుండు దదీయ వచనంబులు వారించి వారలఁ గలయం గనుంగొని యిట్లనియె. 6.

అ: సభాసదులు= సభలోనివారు; మానవ + ఇంద్రులు = రాజులు ; యుధిష్ఠిరుడు = ధర్మరాజు; పాండవ కార్య + అర్థియై= పాండవుల పని కోరినవాడై, (ఆపని కోసం)

భా: *అందరూ పరివేష్టించి ఉన్నపుడు సభలో ఉన్న రాజులు అనేక రీతుల కృష్ణునితోనూ ,ధర్మరాజుతోను మాట్లాడుతున్నారు. అపుడు కృష్ణుడు పాండవుల పనిమీద దృష్టి నిలిపి వారందరిని నివారించి సభఅంతా కలయచూసి ఇలా అన్నాడు.*

వి: ఇక్కడ కృష్ణుడు స్వయంగా కల్పించుకొని మాట్లాడుతున్నాడు. ధర్మరాజు అభ్యర్థన ఏమీ లేదు. దానికి కారణం తృతీయాశ్వాసం 242వ పద్యంలో చెపుతాడు. కృష్ణుడు రాయబారానికి వెళ్లడంలో కూడా కృష్ణుడే ధర్మరాజు కంటే ముందు తాను వెళ్లవలసి వస్తుందేమో అంటాడు సంజయునితో. చూడుడు.... ఉద్యోగ -1-360 పద్యము. ఇన్నిటిని దృష్టిలో పెట్టుకొని తిక్కన 'పాండవ కార్యార్థియై' అనే పదం ప్రయోగించాడు. ఇచ్చట మూలంలో కూడా ఇదే పదం "పాండవ కార్యహేతోః " అని ఉంది.

మ: కపట ద్యూతమునందు సౌబలునిచేఁ గౌంతేయు లాత్మీయ రా
జ్య పదభ్రంశముఁ బొంది, సత్యనిరతిన్ శక్తాత్ములై యుండియుం
గుపిత స్వాంతులు గాక తత్సమయ సంక్షోభంబు గాకుండఁగా
విపినావాసము గూఢచర్యయును గావింపం దలం పొప్పదే ! 7.

అ : కపట ద్యూతమునందున్ = మాయజూదంలో; సౌబలునిచేన్ = శకునిచేత; కౌంతేయులు = కుంతీకుమారులయిన పాండవులు ; ఆత్మీయ రాజ్యపద, భ్రంశమున్ పొంది= తమదైన రాజ్యపదవినుండి తొలగినవారై; శక్త+ ఆత్ములై ఉండియున్ = సమర్థులై ఉండికూడా; సత్యనిరతిన్= సత్యంమీది ఆసక్తితో; కుపిత స్వాంతులు కాక= కోపించిన మనసుకలవారుకాక, (కోపించక); తత్సమయ సంక్షోభంబు కాకుండఁగాన్ = ఆ ప్రతిజ్ఞాభంగం కాకుండా; విపిన + ఆవాసము= అరణ్య వాసమూ; గూఢచర్యయును= అజ్ఞాత వాసమూ; కావింపన్ తలంపు = చేయదలచుట; ఒప్పదే = తగదా(శ్లాఘ్యము).

భా: *మాయజూదంలో శకుని చేత పాండవులు రాజ్యపదవి కోల్పోయి, సమర్థులై ఉండి కూడా సత్యనిరతితో కోపించక ప్రతిజ్ఞాభంగం కాకుండా అరణ్యవాసం, అజ్ఞాతవాసం చేయాలనుకొనడం సముచితంగా లేదూ!*

వి: 1) కపట ద్యూతము: జూదం మోసంతో కూడినదని అభిప్రాయం. లేకపోతే రెండవసారి ఆడవలసిన పని లేదు. ఆ కపటతలో శకుని అందెవేసిన చెయ్యి.

2) **ఆత్మీయ రాజ్యపద భ్రంశము** : ఈ రాజ్యమంతా యుధిష్ఠిరునిదే. తండ్రిది కావడం మాత్రమే కాదు. దిగ్విజయం చేసి వృద్ధి పొందించుకొన్నది కూడాను అని దీని భావం.

3) **శక్తాత్ములై యుండియున్**: పాండవులు జూదంలో మోసపోయారు. రాజ్యంపోగొట్టుకున్నారు. కాని పాండవులు అపుడే పరాక్రమించి రాజ్యం సంపాదించుకోగలరు. అంతటి సమర్థులే అయినా మాటమీద నిలబడి అరణ్యవాసమూ, అజ్ఞాతవాసమూ చేశారు. ఇది చాలా సమంజసంగా ఉంది అని కృష్ణుని భావం.

సమర్థుడై యుండి కూడా సహనం వహించేవాడు పుణ్యపురుషు డని విదురుడు (ఉద్యోగ - 2-42 వ పద్యంలో) చెపుతాడు. పాండవులు పుణ్య పురుషులని అభిప్రాయం.

ఆ : తలఁచి నట్ల వ్రతము సలిపి, యమ్మాడ్కిఁబం
డ్రెండు వత్సరములు పాండవేయు
లకట! క్రూర సత్త్వ యాతుధానావలి
తోడఁ గాననమునఁ గూడి మనరె! 8.

అ: అకట!; తలఁచినట్లు + అ = అనుకొన్నట్లే; వ్రతము సలిపి= నియమం ఆచరించి; ఆ + మాడ్కిన్ = ఆ విధంగా ; పండ్రెండు వత్సరములు; పాండవేయులు = పాండవులు; కాననమునన్ = అడవిలో; క్రూర సత్త్వ, యాతుధాన+ ఆవలి తోడన్ = క్రూరమృగాలు, రాక్షసుల గుంపులతో; కూడి మనరె! = కలిసి జీవించలేదా!

భా : *పాండవులు అనుకొన్నట్లుగానే నియమాచరణం చేసి 12 ఏళ్లు అడవిలో క్రూర మృగాలమధ్య రాక్షసులతో జీవించలేదా!*

వి: క్రూరమృగాలూ, రాక్షసులూ ఉపకారులకు సయితం అపకారం చేస్తారు. "అమ్మాడ్కి" అనడంలో వారు పడిన కష్టాలన్నీ అప్పటికే అందరికీ తెలిశాయన్నమాట. కృష్ణుడు ఒక ప్రక్క వారిపై అందరికీ జాలి కలిగేటట్లు ప్రసంగిస్తున్నాడు. అది కృష్ణుని ఉక్తి చాతుర్యం.

క: పదపడి దుస్తరమగు నీ
పదుమూఁడగు నేఁడు గడవఁబడుట యరిది; త
మ్మెదు రెఱుఁగమికై యాపద
లొదవిన సైరించి, రిట్టి యునికియుఁ గలదే! 9.

అ: పదపడి= తరువాత ; దుస్తరమగు = తరింప కష్టమయిన; పదుమూఁడు అగుఏడు = పదమూడో సంవత్సరం ; కడవన్ పడుట = గడవడం; అరిది = ఆశ్చర్యమే; తమ్ము= తమను (పాండవులను); ఎదురు = శత్రువు (కౌరవులు) ; ఎఱుఁగమికై = తెలియకుండా ఉండేటందుకు; ఆపదలు- ఒదవినన్ = కష్టాలు సంభవించినా, సైరించిరి = సహించారు ;ఇట్టి= ఇటువంటి ; ఉనికియున్ కలదే! = అవస్థ (ఎక్కడయినా) ఉందా?

భా: *పదమూడో సంవత్సరం అజ్ఞాతవాసం దాటడం చాలా కష్టమయినదే. తమను శత్రువులు గుర్తుపట్టకుండా ఉండాలని, ఎటువంటి కష్టాలయినా సహించారు. ఇటువంటి దురవస్థ ఎక్కడయినా ఉంటుందా?*

వి: అజ్ఞాత వాసంలో పాండవుల కళ్లముందు జరిగిన ద్రౌపదీ పరాభవాన్నీ, కీచక వధనూ గుర్తు చేస్తున్నాడు కృష్ణుడు.

క: **మీరలు ధర్మజువర్తన**
గౌరవ మెఱుఁగుదుర కాదె! కావున నా గాం
ధారీ తనూభవులకును
వీరలకును హితము కా వివేకప్రౌఢిన్. 10.

అ: మీరలు = మీరు; ధర్మజు వర్తన గౌరవము = ధర్మరాజు యొక్క ప్రవర్తనలోని గొప్పదనం; ఎఱుఁగుదురు + అ, కాదె! = ఎరుగుదురేకదా! ; కావునన్ ; ఆ గాంధారీ తనూభవులకును= ఆ గాంధారీ పుత్రులు కౌరవులకూ; వీరలకును= పాండవులకూ; హితమకాన్ = హితమే అయ్యేటట్లు; వివేక ప్రౌఢిన్ = జ్ఞాన (విచక్షణ) విశేషంతో ....

భా : *మీరంతా ధర్మరాజు ప్రవర్తనలోని గొప్పతనం ఎరుగుదురు కదా! అందుచేత కౌరవులకూ పాండవులకూ హితం చేకూరేటట్లుగా వివేకంతో ....ఆలోచించండి.*

వి: ధర్మరాజు ప్రవర్తన ఉదాత్తమైనది. గాంధారీ తనూభవు లనడంలో అసూయాగుణం తొంగి చూస్తోంది. అసూయా గుణం వల్లనే గాంధారి ఉదరతాడనం చేసుకొన్నది. ఈ రెండు గుణాలకూ అనుగుణంగా ఆలోచించండి అని సూచన.

తే : **ధర్మ మార్గంబు దప్పక తలఁపుఁ డొక్క**
తెఱఁగు; ధర్మువు దప్పి యుధిష్ఠిరుండు
వడయ నొడఁబడఁ డయ్యింద్రపదవి యైన;
నుచిత గతి నెంత వడసిన నుల్లసిల్లు. 11.

అ: ధర్మ మార్గంబు + తప్పక = ధర్మమార్గం విడవక; ఒక్క తెఱఁగు = ఒక విధానం; తలపుఁడు= ఆలోచించండి; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; ధర్మువు + తప్పి = ధర్మం విడిచి; ఆ + ఇంద్ర పదవి - ఐనన్; పడయన్= పొందటానికి; ఒడఁబడఁడు= అంగీకరింపడు; ఉచితగతిన్= తగిన రీతిలో (ధర్మమార్గంలో); ఎంత+ పడసినన్ = ఎంత తక్కువ పొందినా; ఉల్లసిల్లున్ = సంతృప్తి పడతాడు.

భా: *ధర్మమార్గం తప్పకుండా ఒక పద్ధతి ఏదయినా ఆలోచించండి. ధర్మం విడిస్తే ధర్మరాజు ఇంద్రపదవి కూడా ఒల్లడు. న్యాయమార్గంలో ఎంత వచ్చినా సంతోషిస్తాడు.*

వి: సంస్కృతంలో ఇక్కడ
"అధర్మయుక్తం చ న కామయేత రాజ్యం సురాణామపి ధర్మరాజః"
ధర్మార్థయుక్తం చ మహీపతిత్వం గ్రామేऽపి కస్మింశ్చి దయం బుభూషేత్. 5-1-14

"అని గ్రామమయినా అంటే తెలుగులో "ఉచిత గతి నెంత వడసిన నుల్లసిల్లు " అన్నాడు తిక్కన.

వ: **కావునఁ బాండవులకుఁ బితృధనంబగు రాజ్యంబు గపట ద్యూతంబున దుర్యోధనుం డపహరించుటయు, నది వీరలు దిగ్విజయంబుఁ జేసి యలవరించుకొన్న పదంబగుటయు, ధర్మసూను మహానుభావంబు విచారింపక ధార్తరాష్ట్రులు పరిభవించినం దెగి యితండు వారలకుం గీడు రోయమియు; నీ రెండు దెఱంగుల వారికిం బంచి కుడువం దగుటయుం, దలపోసి తగిన కార్యంబు సెప్ప నర్హుల రేనును నాకన్నంత సెప్పెద వినుండు.** 12.

అ : అలవరించుకొన్న పదంబు = సంపాదించుకొన్న పదవి; పరిభవించు = అవమానించు ; తెగి= తెగించి; రోయమి = అన్వేషింపక పోవడం; పంచికుడువన్ = పంచుకొని తినడానికి, అనుభవించడానికి; అర్హులరు = తగినవారు; ఏనును = నేనుకూడా; నా కన్నంత = నేను చూసినంత.

భా: *పాండవుల తండ్రి సొమ్మయిన రాజ్యం మాయజూదంలో దుర్యోధనుడు అపహరించడమూ, అది పాండవులు దిగ్విజయం చేసి పొందిన పదవి కావడమూ, ధర్మరాజు ప్రభావం ఆలోచించకుండా కౌరవులు పరాభవిస్తే తెగించి ఇతడు (ధర్మరాజు) వారికి కీడు తలపెట్టకపోవడమూ, ఈ రెండువక్షాలవారికీ వంచుకొని అనుభవించడం సముచితమవడమూ, ఇవన్నీ ఆలోచించి తగిన పని ఏమిటో చెప్పటానికి తగిన వారు మీరు. నేనూ నాకు తెలిసినంత చెపుతా వినండి.*

క: **కుంతీ తనయులు సమయము**
శాంతతమై నడపి 'తమ భుజాబలమును దు
ర్దాంతోద్యమ శౌర్యము నెఱఁ
గింతు' మనుచు నున్నవారు గినుకెదఁ గదురన్. 13.

అ: కుంతీ తనయులు = కుంతి కొడుకులు, పాండవులు; సమయము= ప్రతిజ్ఞ; శాంతతమై నడపి=ప్రశాంతంగా పూర్తి చేసి; తమ భుజాబలమును; దుర్దాంత+ఉద్యమ, శౌర్యమును= అణచశక్యం కాని ప్రయత్నమూ, పరాక్రమమూ; ఎఱఁగింతుము= చూపిస్తాం; అనుచున్; కినుక=కోపం; ఎదన్ కదురన్= మనసులో హెచ్చుగా; ఉన్నవారు= ఉన్నారు.

భా: *పాండవులు ప్రశాంతంగా ప్రతిజ్ఞ నెరవేర్చి తమభుజబలాన్నీ,ఉత్సాహ పరాక్రమాలనూ ప్రకటించాలని ఉద్రేకపడుతున్నారు.*

క: **వీరి తలంపెఱిఁగిన గాం**
ధారీ తనయుఁడు సుహృద్వితానముఁ గూర్చం
"బోరఁ బరిమార్తుఁ గొంచెపు
వారై యున్నెడన" యని యవశ్యము గడఁకన్. 14.

అ: వీరి తలంపు= వీరి అభిప్రాయం; ఎఱిఁగినన్ = తెలిస్తే; గాంధారీ తనయుఁడు= గాంధారి కొడుకు దుర్యోధనుడు; కొంచెము+వారు-ఐ-ఉన్న-ఎడన= దుర్బలులుగా ఉన్నప్పుడే; పోరన్= యుద్ధంలో; పరిమార్తున్=సంహరించి వేస్తాను, అని; అవశ్యము- కడఁకన్=అణచరాని ఉత్సాహంతో; సుహృత్- వితానమున్= స్నేహితుల సముదాయాన్ని; కూర్చున్= చేకూర్చుకొంటాడు.

భా: *వీరి ఉద్దేశం తెలిస్తే దుర్యోధనుడు "వీరిని దుర్బలులుగా ఉండగానే యుద్ధంలో సంహరిస్తా"నని అధికోత్సాహంతో మిత్రుల నందరినీ సమీకరించుకొంటాడు.*

వి: శత్రువును బాలుడుగా ఉండగానే సంహరించాలి. అనగా బలం సమీకరించుకోకముందే తుదముట్టించాలి. చిన్నగా ఉండగా అయితే కార్యం గోటితో పోతుంది. అదే పెద్దవాడయిన తర్వాత అయితే గొడ్డలి కావాల్సివస్తుంది. సులభంగా కార్యనిర్వహణం కుదరదు.అండ దశలోనే పామును చంపటం మంచిదంటారు కదా!

క: **అలఘు బల విక్రమోదా**
త్తుల కైనను బలములేక దోర్గర్వముమై
గెలువఁగ వశమె? సహాయము
కలిమి ననంతంబులగు పగఱసైన్యములన్. **15.**

అ: సహాయము కలిమిన్ = సహాయ సంపదతో; అనంతములగు పగఱ సైన్యములన్= అంతులేని శత్రుసైన్యాలను; అలఘు బల విక్రమ+ఉదాత్తులకున్ ఐనను = అధికబల పరాక్రమాలు కలవారికయినా ;బలము=బలగం లేకుండా (చతురంగ బలాల సహాయంలేకుండా); దోర్గర్వము మైన్= కేవలం భుజబలంతో; గెలువఁగన్+వశమా?= జయింప శక్యమా?

భా: *సైన్యం లేకుండా కేవలం భుజబలంతో సహాయ సంపన్నమయిన శత్రుసేనను జయించడం ఎంతో బల పరాక్రమాలు కలవారికయినా సాధ్యం కాదు.*

క: **కావునఁ బాండవ పక్షము**
భూవల్లభ కోటి యిచటఁ బ్రోవగు; నిమ్మై
నీ వీరులు నా వీరులు
దేవాసురు లట్ల యనికిఁ దెగుదురు గడిమిన్. **16.**

అ: కావునన్ ; పాండవ పక్షము భూవల్లభకోటి = పాండవుల పక్షంలో ఉండే రాజుల సమూహం; ఇచటన్; ప్రోవు అగున్ = పోగవుతుంది; ఇమ్మైన్= ఈ విధంగా; ఈ వీరులును - ఆ వీరులును; కడిమిన్= పూనికతో- ఉత్సాహంతో; దేవ + అసురులు అట్ల = దేవ దానవుల వలె; అనికిన్ = యుద్ధానికి; తెగుదురు = తెగిస్తారు.

భా: *అందుచేత పాండవ పక్షంలోని రాజులు ఇక్కడ పోగవుతారు. ఇలా పాండవులూ ,కౌరవులూ దేవదానవుల లాగా యుద్ధానికి సాహసిస్తారు.*

వి: 'ఈ వీరులూ ఆ వీరులూ దేవతలూ రాక్షసులూ లాగా' అనడంలో క్రమాలంకారం

కనపడుతుంది. ఈ అలంకారం వల్ల కృష్ణుడి అభిప్రాయం కూడా సూచితమవుతోంది. పాండవులు దేవతల వంటి వారనీ, కౌరవులు రాక్షసుల వంటి వారనీ చివరకు దేవాంశ కల పాండవులే జయిస్తారనీ సూచన.

వ: ఇది యిక్కడి తెఱంగునకుఁ దోఁచిన తలం, పక్కడి వారి చిత్తవృత్తి యెట్టి దగుట యెఱుఁగ, మెదిరి మతం బెఱుంగక యెట్టి కార్యంబు నిశ్చయింప వెరవగునే! కావున నియ్యవసరంబునఁ దగిన మానిసి నందులకుం బుచ్చవలయు; దుర్యోధనుండు వీరికి రాజ్యంబు పాలిచ్చిన మే లగుఁ: గాక తక్కిన నప్పటికిఁ బోలిన పని సూచుకొంద' మని పలికిన విని, బలదేవుం డియ్యకొని రాజలోకంబు నాలోకించి యిట్లనియె. 17.

అ: ఎదిరి మతంబు= శత్రువు ఉద్దేశం/ఎదుటి వాని అభిప్రాయం; వెరవగునే= తగునే; యుక్తమగునా; ఈ+అవసరంబునన్= ఈ సమయంలో; అందులకున్= అక్కడికి; పుచ్చవలయున్= పంపించాలి; రాజ్యంబుపాలు= రాజ్యభాగం; ఇయ్యకొని= సమ్మతించి; రాజలోకంబున్= రాజుల సముదాయాన్ని; ఆలోకించి= చూసి.

భా: *ఇది ఇక్కడి పద్ధతికి తోచిన ఊహ; అక్కడి వారి మనస్సు ఎలా ఉందో తెలియదు. ఎదుటి వాని అభిప్రాయం తెలుసుకోకుండా కార్యం నిశ్చయించడం మంచిది కాదు. అందుచేత ఇపుడు తగిన మనిషిని కౌరవుల దగ్గరకు పంపాలి. దుర్యోధనుడు వీరికి రాజ్యభాగం ఇస్తే మంచిదే. ఇవ్వకపోతే అప్పటికి తగిన పని ఆలోచిద్దాం, అన్నాడు కృష్ణుడు. ఆ మాటలు విని బలరాముడు సమ్మతించి రాజుల నందరినీ చూసి ఇలా అన్నాడు.*

క॥ హరి వాక్యము వింటిరె! యిది
యిరు దెఱఁగుల జనములకును హితమును ధర్మో
త్తరమును నై యున్నది; యీ
వెరవున శక్యంబు మనకు వీరలఁ దీర్పన్. 18.

అ: హరి వాక్యము = కృష్ణుని మాట; వింటిరే? = విన్నారా?; ఇది; ఇరు తెఱఁగుల = రెండు పక్షాల; జనములకును; హితమును; ధర్మ+ ఉత్తరమును-ఐ ఉన్నది= ధర్మ ప్రధానం అయిఉంది; ఈ వెరవునన్ = ఈ ఉపాయంతో; మనకున్; వీరలన్ = కౌరవపాండవులను; తీర్పన్ శక్యంబు = చక్కదిద్దటం సాధ్యమవుతుంది.

భా: *కృష్ణుని మాటలు విన్నారు కదా! ఈ పద్ధతి రెండు పక్షాల వారికీ హితమయినదీ ధర్మ ప్రధానమయిన దీను. ఈ విధానంతో మనం వీరి సమస్య పరిష్కరించవచ్చు.*

చ॥ తమ సగపాలు గోలుపడి దానిన యిప్పుడు గోరు వీరికిన్
సముచిత వృత్తి నిచ్చి తమ సామున సంతసమంది యున్కి యు
క్తము ధృతరాష్ట్రసూనునకు; దాన నపాయము లేక యుండుఁ గో
ప ముడిగి వీరు సేయుదురు బాంధవ మిజ్జగముం బ్రియంపడున్. 19.

అ: తమ సగపాలు - కోలుపడి = తమ సగభాగం కోల్పోయి; ఇపుడు; దానిన = దానినే; కోరు వీరికిన్ = కోరే వీరికి (పాండవులకు); సముచిత వృత్తిన్+ ఇచ్చి= తగిన రీతిలో ఇచ్చి; తమ సామునన్ = తమ సగంతో; సంతసమంది- ఉన్కి= సంతోషించి జీవించడం; ధృతరాష్ట్ర సూనునకున్ = ధృతరాష్ట్రుని కుమారుడయిన దుర్యోధనునకు ; యుక్తము= మంచిది; దానన్ = దాని వల్ల (తో) ; అపాయము లేక ఉండున్= ఏ అపాయమూ లేకుండా (రెండు పక్షాలకూ) సుఖంగా ఉంటుంది, వీరు= ఈపాండవులు; కోపము-ఉడిగి= కోపం వదలి; బాంధవము -చేయుదురు= పూర్వపురీతిగా బంధుభావంతో ప్రవర్తిస్తారు; ఈ+జగమున్=ఈ లోకమంతయూ; ప్రియము+పడున్= సంతోషపడుతుంది.

భా: *తమ సగభాగం కోల్పోయి మళ్లీ దానినే కోరే పాండవులకు తగిన రీతిలో దాన్ని ఇచ్చి, తమ సగంతో దుర్యోధనుడు సంతృప్తి పడటం సముచితం . దాని వల్ల ఏ అపాయమూ లేకుండా ఉంటుంది. వీరు కూడా కోపం విడిచి బంధుత్వం నెరపుతారు. ఈ లోకమంతా కూడా సంతోషిస్తుంది.*

వి: కృష్ణుడు మాట్లాడిన తీరుకూ, బలరాముడు మాట్లాడుతున్న తీరుకూ తేడా కనిపిస్తోంది."అక్కడి వారి మనసులు తెలుసుకొనేందుకు ఎవరినయినా పంపాలి. దుర్యోధనుడు వీరికి రాజ్యభాగం ఇస్తే మంచిదే" అని మాత్రం అన్నాడు కృష్ణుడు. వెళ్లినవాడు ప్రార్థించాలి అని కృష్ణుని మాటల్లో గోచరించదు. కాని బలరాముని మాటల్లో ఆ 'కోరిక' చోటు చేసుకొంది. ఈ పద్యంలో 'సగపాలు కోరుతున్నారు' అని కనిపిస్తోంది. తరువాతి పద్యాల్లో ఆ కోరిక కోరడంలో "ప్రార్థించి అడగాలి వినయంతో" అని గోచరిస్తుంది. ఇందులోనే కృష్ణబలరాముల స్వభావంలో మనసులో తేడా కనపడుతుంది. ఈ విషయాన్నే సాత్యకి స్పష్టం చేస్తాడు.

కృష్ణుడు విషయాన్ని ఎత్తుకొంటూనే "కపట ద్యూతమునందు సౌబలునిచే' అంటూ జూదం మోసంతో కూడినది అంటాడు. కాని బలరాముడు అందులో దోషంలేదంటాడు 22వ వచనంలో.

వ: కావున నిక్కార్యం బెడసేయక యొక్కరుం బనుప వలయు; వాడునుం జని యభిమతంబు సాధించునప్పుడు. 20.

అ: ఎడ- చేయక=అలస్యం చేయకుండా ; పనుప వలయున్= పంపించాలి; అభిమతంబు=కోరిక.

భా: *అందుచేత ఈ పనిలో ఆలస్యం చేయక ఒకరిని పంపించాలి. అతడు కూడా వెళ్లి కోరిక సాధించేటప్పుడు, మాట్లాడేటప్పుడు....................*

ఆ: మాట పొందెఱింగి యోటమై నల్లన
చేరి కౌరవేంద్రు చిత్తవృత్తి
కనుగుణంబు గాఁగ నానతుం డగుచుఁ బ్రా
ర్థించి యడుగ కున్నఁ దెఱఁగు పడదు. 21.

అ: మాట పొందు+ఎఱింగి= మాట పొందిక తెలిసి; ఓటమైన్=వినయంతో; అల్లన చేరి=మెల్లగా చేరి; కౌరవ+ఇంద్రు-చిత్తవృత్తికిన్ = దుర్యోధనుని మనః ప్రవృత్తికి; అనుగుణంబుగాఁగన్ = తగినట్లుగా; ఆనతుండు+అగుచున్= వినయంకలవాడగుచు; ప్రార్థించి; అడుగకున్నన్= అడగకపోతే; తెఱఁగు పడదు= చక్కపడదు (నెరవేరదు).

భా: ఆ వెళ్లినవాడు మాట పొందిక తెలిసి వినయంతో చేరి దుర్యోధనుని మనఃప్రవృత్తికి అనుకూలంగా అడకువతో ప్రార్థిస్తూ అడగకపోతే కార్యం నెరవేరదు.

వ: అది యెట్లనిన, ధర్మనందనుం డతని యుద్ధతికిం బుయిలోడి మెయివడిగల నడవడిం బ్రవర్తిల్లు చుండియుం జూదంబు వెంట మోసపోయి తొడరి చిక్కునం బడియె; నదియును నతం డక్షవిద్యాపాటవంబు దనకు మిగుల లేమిం జేసియు, బంధుజనంబులు దన్ను వారించుటయుఁ దా నాడుట మాని గాంధారరాజు నియమించినం దత్కళాకౌశలంబునఁ బరిణతుండు గావున నాశకుని యాడి, యుధిష్ఠిరుం డొడ్డిన యొడ్డమియు గెలుచుచు వచ్చె; నట్లగుట నాతని యందును గొఱంతలే; దిత్తెఱంగున వార లధర్మపరులని నిందింపరాకునికి కారణంబుగా వీరలు పుచ్చిన మానిసి వినయంబు తోన యిక్కార్యంబు దీర్చికొని రావలయు' ననిన సాత్యకి గోపించి యిట్లనియె. 22.

అ: ఉద్ధతికిన్= గర్వానికి; పుయిలోడి = సంకోచించి ; మెయివడి= సమ్మతి, సౌమ్యత; గాంధారరాజున్= శకునిని; పరిణతుండు= నేర్పుకలవాడు- పరిపక్వమయిన నైపుణ్యం కలవాడు; ఒడ్డమి= పందెం; కొఱంత= దోషం; నిందింపరాకునికి= నిందింపరాకపోవడం; పుచ్చిన మానిసి= పంపించిన మనిషి.

భా: అది ఎలా అంటే ధర్మరాజు దుర్యోధనుని గర్వానికి వెనుకాడి అనుకూలంగా ప్రవర్తిస్తూ ఉండికూడా జూదంలో పడి మోసపోయి చిక్కుల్లో పడ్డాడు. అందులోనూ దుర్యోధనుడు తనకు అక్షవిద్యలో నేర్పులేకపోవటం చేతనూ, బంధువులు వద్దని దుర్యోధనుని నివారించటం చేతనూ దుర్యోధనుడు ఆడటం మానేసి శకునిని నియమించాడు. అతడు ఆ విద్యలో నేర్పరి కాబట్టి ధర్మరాజు ఒడ్డిన పందెము లన్నీ గెలుస్తూ వచ్చాడు. అందుచేత అతనిలోనూ తప్పులేదు. ఈ రీతిగా వాళ్లు అధర్మపరులని నిందింపకుండా వీళ్లు పంపించిన ఆమనిషి వినయంతో కార్యం సాధించుకు రావాలి" అంటే ఆ మాటలు విని సాత్యకి కోపించి ఇలా అన్నాడు.

వి: ఇక్కడ రామకృష్ణుల అభిప్రాయాల్లో కొంత భేదం గోచరిస్తుంది. 1) జూదం విషయంలో ఎవరిదీ తప్పు కాదు అంటాడు బలరాముడు. కాని కృష్ణుడు ఎత్తుకొంటూనే "కపట ద్యూతము నందు" అంటూ మొదలు పెడతాడు.2) కృష్ణుని అభిప్రాయంలో "పాండవులు దుర్యోధనుని రాజ్యభాగం అడగనవసరం లేదు. అతడే యివ్వాలి. అలా యిస్తే మేలు

కలుగుతుంది." కాని బలరాముని అభిప్రాయంలో "పాండవులు తమ సగభాగం కోరుతున్నారు. తమ సగభాగంతో తృప్తి పడితే దుర్యోధనునకు మేలు కలుగుతుంది. కాని వెళ్లినవాడు వినయంతో ప్రార్థించాలి. దుర్యోధనుని మనఃప్రవృత్తి కనుగుణంగా- అలా అడగకపోతే పని జరగదు."

ఇదంతా పరిశీలిస్తే కృష్ణుని మాటలు రాజనీతి పరిణతాలుగా కనిపిస్తాయి. బలరాముని మాటలు సూటిగా, కార్యవాదపరంగా కనిపిస్తాయి. కృష్ణుని మాటల తీరును పరోక్షంగా విమర్శించడమే గాకుండా సవరిస్తున్నట్లు ఉంది. ఇక్కడ రామకృష్ణులిరువురికీ పాండవకౌరవు లిరువురూ చెరిసగం అనుభవించడం అభిమతమే. కాని ఆ భాగం పొందేతీరులో మతభేదం గోచరిస్తుంది.

-- : సాత్యకి దుర్యోధను కడకు దూతం బంపఁగూడదని చెప్పుట : --
సం 5-3-1.

ఆ: ఇట్టు లాడఁ దగునె? యిది నీక పోలు; ని
న్నేమనంగ నేర్తు, నిత్తెఱంగు
పాడి గాఁగఁబూని పలుకంగఁ జెవి యొడ్డి
యాదరించు వారి నందుఁ గాక! 23.

అ: ఇట్టులు; ఆడన్ తగునె?= మాట్లాడదగునా? ; ఇది; నీకు + అ=నీకే; పోలున్= తగును- చెల్లును; నిన్నున్; ఏమి+అనంగన్-నేర్తున్= నిన్నేమనగలను; ఈ+తెఱంగు=ఈ పద్ధతి; పాడి-కాఁగన్= న్యాయం అని; పూని పలుకంగన్=చెపితే; చెవియొడ్డి= చెవులొగ్గి; ఆదరించు వారిన్ అందున్ కాక= వినేవారి ననాలి కాని.

భా: *ఇలా మాట్లాడవచ్చునా? ఇది నీకే చెల్లింది. నిన్నే మనగలం? ఈ విధానం న్యాయం ధర్మం అని నీవంటూ ఉంటే దాన్ని చెవి ఒగ్గి వింటూ ఉండే వారి నంటాను గాని!*

వి: నీదేకాదు. వినేవాళ్లు ఊరుకుంటే వారిదీ తప్పే అని ఈ నుడికారానికి అర్థం. ఇది చక్కని ఉక్తి చమత్కారం.

క: వేడుక పుట్టిన జూదం
బాడెనె ధర్మజుఁడు? వారలందరు దమలోఁ
గూడికొని పిలిచి బలిమిన
యాడి కపట జయము గొనుట యిది దగ వగునే? 24

అ: ధర్మజుఁడు = ధర్మరాజు; వేడుక పుట్టినన్= కుతూహలం కలిగి; జూదంబు+ ఆడెనె? = జూదం ఆడినాడా?; వారలు+అందఱు= కౌరవులంతా; తమలోన్ కూడికొని=తమలోతాము కూడబలుకుకొని; పిలిచి; బలిమినయాడి=బలవంతంగా ఆడించి; కపటజయముగొనుట=మోసంతో జయించటం; ఇది తగవు అగునే?= ఇది ధర్మమవుతుందా?

భా: ధర్మరాజు వేడుకపుట్టి జూదం ఆడాడా? కౌరవులంతా కూడబలుకుకొని ధర్మరాజును పిలిపించి బలవంతాన ఆడించి మోసంతో జయం పొందటం ధర్మం అవుతుందా?

వి: నాల్గవ పాదంలో 'ఆడి' అనేది అంతర్భావిత ప్రేరణం (ఆడించి) గా అర్థం చెప్పబడింది. అలా కాదనుకుంటే. మరో చమత్కారం ఉంది.కౌరవులంతా బలవంతాన ఆడారు. ధర్మరాజు నిజానికి ఆడినట్లు కాదు. అందుచేత అది జయం కాదు. కపట జయమే- అని. అక్కడ ఆడి అనటానికి కర్త 'వారలందరు' అవుతుంది. ధర్మరాజు కాదు.

క: ధర్మతనూభవుదెస దు
ష్కర్మము రూపించి సభనొకండును మైమైఁ
బేర్మి సెడక పోనేర్చునె?
ధార్మికు లింకెట్టి వారు? తథ్యం బరయన్. 25.

అ: ధర్మతనూభవు దెసన్= ధర్మరాజు పక్షాన; దుష్కర్మమున్=చెడ్డపనిని; రూపించి= ఆరోపించి; సభన్=సభలో; ఒకండును= ఒకడయినా; ఏఒక్కడూ; మైమైన్=అనుపద్రవంగా/ మామూలుగా; పేర్మిచెడక పోనేర్చునే?=గౌరవం చెడిపోకుండా వెళ్లగలడా?; (ధర్మరాజునే అట్లా అంటే........) తథ్యం బరయన్= నిజమాలోచిస్తే; ధార్మికులు ఇంకన్ ఎట్టివారు?=ధార్మికులంటే ఇంక ఎటువంటివారు?

భా: ధర్మరాజు మీద చెడ్డపని ఆరోపించి సభలోంచి ఎవడయినా గౌరవం చెడకుండా మామూలుగా యథాపూర్వంగా వెళ్లగలడా- నిజం పరిశీలిస్తే ధార్మికులంటే ఇంకెవ రున్నారు?

వి: ధర్మరాజును మించిన ధార్మికులు లేరని తాత్పర్యం. అందుకే ధర్మరాజు మీద తప్పు ఆరోపిస్తే వాడు సభలోంచి గౌరవంగా వెళ్లడని సూచిస్తున్నాడు. శారీరకంగా-మానసికంగా కూడా గౌరవంతో వెళ్లడు.

చ: పలికిన చందముల్ నెఱపి, పైతృకమై చను రాజ్యభాగ మి
మ్ములఁబడయం దలంచి బలముం జలమున్ నెఱపం గడంగు వీ
రలు నొరువేఁడఁ బోదురె? యరాతులు సాధుల మెత్తురే? రణం
బుల జయలక్ష్మిఁ జేకొనుటఁ బోలునె యొండొక రాజధర్మముల్? 26.

అ: పలికిన చందముల్=చేసిన ప్రతిజ్ఞలు; నెఱపి=చెల్లించి; నెరవేర్చి; పైతృకమై చను= పితృభాగమయిన; రాజ్యభాగము; ఇమ్ములన్= ప్రీతితో ,ఇంపుగా; పడయన్-తలంచి= పొందగోరి; బలమున్= బలాన్నీ; చలమున్=పట్టుదలనూ; నెఱపన్-కడంగు-వీరలు= చెల్లించుకొనేందుకు ప్రయత్నించే వీరు; ఒరున్= ఇతరుని; వేఁడన్-పోదురే=యాచిస్తారా?; అరాతులు= శత్రువులు; సాధులన్ మెత్తురే= మంచివారిని (మెత్తని వారిని) మెచ్చుకుంటారా? ఒండొక రాజధర్మముల్=ఇతరమయిన రాజ ధర్మాలు ఏవయినా; రణంబులన్=యుద్ధాలలో;

జయలక్ష్మిన్=విజయం అనే లక్ష్మిని; చేకొనుటన్= పొందడంతో; పోలునె?= సరిపోలుతాయా?

భా: *చేసిన ప్రతిజ్ఞలు చెల్లించి, పితృసంబంధ మయిన రాజ్యభాగం సుఖంగా పొందదలచి బలమూ, పట్టుదలా ప్రకటించాలని ప్రయత్నించేవీరు (పాండవులు) ఇతరులను వేడుకొంటారా? శత్రువులు సాధువులను మెచ్చుకుంటారా? రణరంగంలో విజయం పొందడంతో ఏ ఇతర ధర్మాలయినా సరిపోలుతాయా?*

వి: అరాతి=సంహరించేవాడని వ్యుత్పత్తి- అరాతులు సంహరించేస్వభావం కలవారు- వారు సన్మార్గులను మెచ్చుకోరని భావం.

పాండవులు తామన్న మాటలు నిలబెట్టుకొన్నారు. ఇక నిలబెట్టుకోవలసినదీ, రాజ్యం సగౌరవంగా ఇవ్వవలసినదీ కౌరవులే. రాజ్యంతో ఉన్నపుడు పాండవులు బలమూ, చలమూ నెఱపినవారే. రాజ్యాన్ని గ్రహించి పూర్వవైభవంతో ఉండాలను కొంటున్నారు. అంతేగాని శత్రువును యాచింపబోవటంలేదు. అదీగాక యాచిస్తే మాత్రం శత్రువు ఇస్తాడా? వాడు అరాతి-అనగా సంహరణ స్వభావం కలవాడు. అందుచేత ఇవ్వడు. అంతేకాదు. వీరు క్షత్రియులు. యుద్ధంలో జయించడం క్షత్రియ ధర్మం. దాన్ని మించిన రాజధర్మం లేనేలేదు గదా. అని సాత్యకి అభిప్రాయం.

తే: సముచితములగు మాటలఁ జక్కఁబడక
తక్కెనే నుక్కివుండగు ధార్తరాష్ట్రుఁ
గ్రూర శరముల నే నియ్యకొలుపు వాఁడ
నవనిఁ గౌంతేయులకు నిచ్చునట్లు గాఁగ. 27.

అ: సముచితములు అగు మాటలన్= తగిన మాటలతో; (దుర్యోధనుడు) చక్కన్ పడక= దారికి రాక; తక్కెన్ ఏనిన్= తప్పిపోతే; ఉక్కివుండు-అగు= మూర్ఖుడయిన; ధార్త రాష్ట్రున్= దుర్యోధనుని; క్రూర శరములన్= వాడిబాణాలతో, ఏను=నేను; కౌంతేయులకున్=పాండవులకు; అవనిన్= భూమిని (రాజ్యభాగాన్ని); ఇచ్చునట్లు గాఁగన్= ఇచ్చేటట్టుగా; ఇయ్యకొలుపువాఁడన్= అంగీకరింపజేస్తాను.

భా: *తగిన మాటలతో ఆ దుర్యోధనుడు దారికి రాకపోతే కఠినమైన నా బాణాలతో వానిని పాండవులకు రాజ్యభాగం ఇచ్చేటట్లు నేను ఒప్పింపజేస్తాను.*

క: భీమార్జునులకు రణమున
నే మగలును బ్రతియె? వీరు నేనును సైన్యో
ద్దాములమై నడచిన నే
భూమీశులు నెదిరి బ్రదికి పోవం గలరే! 28.

అ: రణమునన్= యుద్ధంలో; భీమార్జునులకున్; ఏమగలును= ఏవీరులయినా; ప్రతియె= సాటి వస్తారా; వీరు; నేనును; సైన్య-ఉద్దాములము+ఐ=సైన్యంతో భయంకరులమై; నడచినన్=యుద్ధానికి నడిస్తే; ఏ భూమీశులును= ఏరాజులయినా సరే; ఎదిరి= మమ్మ్ము ఎదిరించి; బ్రదికి పోవన్+కలరే= బ్రతికి పోగలుగుతారా?

భా: భీమార్జునులకు యుద్ధంలో ఏ వీరులు సాటిరాగలరు? వీరూ, నేనూ సైన్యంతో నడిస్తే ఏ రాజులు మమ్మల్ని ఎదిరించి బ్రతికి బయటపడగలరు?

ఆ: కవల వారుఁ గొడుకుగమియుఁ బాంచాల వ
ర్గంబు వృష్ణి వరులుఁ గడఁగి రేని
నొక్క మాత్రలోన నువ్వేత్తు గొనరె? దు
ర్యోధనాది శతము నుద్దవిడిన. 29.

అ: కవలవారున్=నకుల సహదేవులూ; కొడుకుగమియున్=కొడుకుల సమూహమూ (ఉపపాండవులు, అభిమన్యుఘటోత్కచాదులు) పాంచాల వర్గంబు = ద్రుపదుడు వారి యొక్క సంబంధులు ; వృష్ణి వరులు = కృష్ణ సంబంధులు (వృష్ణి వంశస్థులు తాము); కడఁగిరి+ఏనిన్=తలపడితే ; దుర్యోధన+ఆది శతమున్= దుర్యోధనుడు మొ॥ వాని తమ్ముల నూర్గురినీ ; ఉద్దవిడిన= ఒక్కుమ్మడిగా; ఒక్కమాత్రలోనన్= ఒక్కత్రుటి కాలంలో; ఉవ్వెత్తుగొనరె?=నిశ్శేషంగా చంపివేయరా?

భా: నకుల సహదేవులూ, ఉపపాండవులూ, ద్రుపదుడు మొ॥ వారు, వృష్ణి వంశస్థులూ, అందరూ తలపడితే దుర్యోధనుడు మొ॥వారినీ ,తమ్ముళ్లు నూరుగురినీ ఒక్కుమ్మడిగా ఒక్క ముహూర్తకాలంలో చంపివెయ్యరా?

క: ఈ మత్స్యపతి సహాయము
గా మాకుం దీర్పరాని కార్యము గలదే!
సామాద్యుపాయపరుఁ డు
ద్దామ భుజాబలయుతుం డితఁడు కేవలుఁడే! 30.

అ: ఈ మత్స్యపతి= మత్స్యదేశానికి రాజయిన ఈ విరాటుడు; సహాయము కాన్= సహాయపడితే; మాకున్; తీర్పరాని= కడతేర్చలేని; కార్యము కలదే! = పని ఉందా?; సామ+ఆది-ఉపాయపరుడు= సామము మొ॥ ఉపాయాలు తెలిసిన వాడూ; ఉద్దామ-భుజాబలయుతుండు= అణచరాని భుజబలంతో కూడినవాడూ; ఇతడు= ఈ మత్స్యరాజు; కేవలుఁడే=సామాన్యుడా?

భా: ఈ విరాటుని సహాయంతో మేము చేయలేని పని లేదు. సామదానాది ఉపాయాలు తెలిసినవాడూ,భుజబలశాలీ అయిన విరాటుడు సామాన్యుడా?

వి: ఉపాయాలు నాలుగు- సామ, దాన, భేద, దండోపాయాలు. ఇవి తెలిసినవాడు అనగా రాజనీతిజ్ఞుడు. ఇది మొదటి విశేషణం. రెండో విశేషణంతో అతని పరాక్రమం ప్రస్ఫుటమవుతుంది. అనగా బుద్ధిబలమూ, భుజబలమూ రెండూ కలవాడని అర్థం.

క: నామతమునఁ గార్యము సం
గ్రామము సేయుటయ; యిట్లు గా కీలోనన్
సామ వచనంబు లక్కురు
భూమీశ్వరు తోడ నాడఁ బుచ్చెద రేనిన్. 31.

అ: నా మతమునన్= నా అభిప్రాయంలో (అయితే); కార్యము=కర్తవ్యం; సంగ్రామము-చేయుటయ=యుద్ధం చేయడమే; ఇట్లుగాక=ఇలాకాక; ఈ లోనన్=ఈలోగా; ఆ+కురుభూమి-ఈశ్వరుతోడన్=ఆ దుర్యోధనునితో; సామవచనంబులు= మృదువుగా సంధిమాటలు; ఆడన్= ఆడుటకు/చెప్పేందుకు; పుచ్చెదరు+ఏనిన్= పంపించేటట్లయితే.......

భా: *నాకు మాత్రం యుద్ధం చెయ్యడమే కర్తవ్యమని తోస్తోంది. అదే నా అభిప్రాయం. అలాకాక ఈ లోగా ఆ కౌరవరాజు దుర్యోధనునితో సామంగా మాట్లాడేందుకు పంపించేటట్లయితే..........*

వి: సాత్యకి మాటలు చాలా సూటిగా, ఘాటుగా ఖండితంగా కనిపిస్తాయి. సంస్కృతంలో ఇక్కడ ఇంకా స్పష్టంగా ఉంది.

నాధర్మో విద్యతే కశ్చిత్ శత్రూన్ హత్వాతతాయినః
అధర్మ మయశస్యంచ శాత్రవాణాం ప్రయాచనమ్
హృద్గత స్తస్య యః కామ స్తం కురుధ్వ మతంద్రితాః
నిసృష్టం ధృతరాష్ట్రేణ రాజ్యం ప్రాప్నోతు పాండవః
అథ పాండుసుతో రాజ్యం లభతాం వా యుధిష్ఠిరః
నిహతా వా రణే సర్వే స్థాస్యన్తి వసుధాతలే. సం.భా.5-3-21,22,23

ఉ: దైన్యము దక్కి దూత యుచితంబుగఁ "బాండునృపాలు పాలు రా
జన్యవరుండు ధర్మజుఁడు సమ్మతి వేఁడెడు" నన్న; లోక సా
మాన్యవిధిం దగంగ గరిమంబున నిచ్చినఁ బుచ్చికొంద; మ
న్యోన్య విరుద్ధ భాషణము లాడినఁ దత్ఫల మాతఁ డందెడున్. 32

అ: దూత= వెళ్లిన రాయబారి; దైన్యము-తక్కి= దైన్యం విడిచి; ఉచితంబుగన్= తగినట్లు; రాజన్యవరుండు= రాజులలో శ్రేష్ఠుడయిన; ధర్మజుఁడు; పాండునృపాలు పాలు= పాండురాజు భాగం; సమ్మతిన్=గౌరవంగా; వేడెడున్=అభిలషిస్తున్నాడు; అన్నన్=అంటే; లోకసామాన్య విధిన్= లోక సామాన్యరీతిలో; తగంగ=తగినట్లు; గరిమంబునన్ ఇచ్చినన్=గౌరవంగా ఇస్తే; పుచ్చికొందము = పుచ్చుకుందాం; అన్యోన్య విరుద్ధ భాషణములు ఆడినన్=పరస్పరం విరుద్ధంగా మాట్లాడితే ; తత్ఫలము=దానిఫలితం; అతఁడు=ఆ దుర్యోధనుడే ; అందెడున్=పొందుతాడు.

భా: *దైన్యం విడిచి రాయబారి తగినట్లుగా " రాజశ్రేష్ఠుడయిన ధర్మరాజు గౌరవంతో పాండురాజు రాజ్యభాగం పొందగోరుతున్నాడు" అని అంటే లోక సామాన్యమయిన రీతిలో అతడు గౌరవంగా ఇస్తే పుచ్చుకుందాం. లేక పరస్పర విరుద్ధంగా మాట్లాడితే దాని ఫలితం అతడే అనుభవిస్తాడు.*

వి: 1.ఈ పద్యాభిప్రాయం అంతా అమూలకమే. ఇది తిక్కనగారి నిష్కర్ష-వ్యాఖ్యానమూను. సంస్కృతంలో సాత్యకి మాటల్లో "క్షత్రియునికి యాచనం ధర్మంకాదు. యుద్ధమే

ధర్మం'' అనేది కనిపిస్తుంది. ఇదే చివరిమాట.''ధర్మరాజు రాజ్యం పొందనైనా పొందాలి. లేదా అందరూ చావనైనా చావాలి'' ఈ మాటతో ముగిస్తాడు సంస్కృతంలో సాత్యకి.

2. **సమ్మతి వేడెడు**: ఇక్కడ సమ్మతిన్= గౌరవంతో అని అర్థం చెప్పబడింది. కాని దీనికింకా అర్థాలు చెపుతారు. సమ్మతి అంటే- అంగీకారము అని మరో అర్థం ఉంది. దాన్ని బట్టి ''చేసిన బాసలు నెరవేర్చుకొన్న (పాండవులకు) ధర్మరాజుకు ధర్మపరంగా రాజ్యం సంక్రమించినట్లే- కాని దానికి ధర్మరాజు పెద్దల అంగీకారాన్ని కోరుతున్నాడు.'' అని భావం చెపుతారు. అనగా కోరేది అంగీకారాన్నే కాని రాజ్యాన్ని కాదు.

వ: అనిన ద్రుపదుం డిదిపోలు, బలదేవుమాట మాటగాదు. బలపరాక్రమ వంతుండును సహాయ సంపన్నుండును దుష్టాత్ముండు నైన దుర్యోధనుండు ప్రియవచనంబుల రాజ్యంబు పాలిచ్చుట కియ్యకొనమి సిద్ధంబు; యుద్ధంబునంగాని చక్కంబడఁడని పలికి మఱియు నిట్లనియె. 33.

అ: ఇది+పోలు=ఇది బాగుంది/ తగును.; ఇయ్యకొనమి= ఇవ్వకపోవడం; చక్కంబడఁడు = త్రోవకురాడు.

భా: ఆ మాటలకు ద్రుపదుడు ఇది బాగుంది. బలరాముని మాట సరైన మాటకాదు. బల పరాక్రమాలూ, సహాయమూ కల దుష్టుడు దుర్యోధనుడు ప్రియ వచనాలతో రాజ్యభాగం ఇవ్వడు. ఇది నిశ్చయం. యుద్ధంతో కాని అతడు చక్కబడడు. అని ఇంకా ఇలా అన్నాడు.

వి: దుర్యోధనుని లక్షణాలలో బలపరాక్రమాలు కలిగి ఉండటమూ, సహాయం కలిగి ఉండటమూ ఈ రెండూ దోషాలుకావు. కాని దుష్టత్వం కలిగి ఉండటం దోషం. ఈ దుష్టత్వం కలిగినపుడు పై రెండూ దుష్టత్వాన్ని విజృంభింపజేస్తాయి. అపుడు సామవచనాలు తలకెక్కవు.

'దుర్యోధనుని మనసుకు అనుగుణంగా దూత ఎంత వినీతుడై పలికినా అవి అతని మనసుకు ఎక్కవు' అని బలరాముని మాటను ద్రుపదుడు నేర్పుగా తిరస్కరిస్తున్నాడు. అతడి దగ్గర మన ఉపాయాలు ఏమీ చెల్లవు. దండోపాయం తప్ప అని నిశ్చయిస్తున్నాడు.

క: మృదు భాషణముల దుర్జన
హృదయములు ప్రసన్నతా మహిమఁబొందునె? యె
ల్లిదముగఁగొని యంతంతకు
మదమెక్కుంగాక దురభిమానము పేర్మిన్. 34.

అ: దుర్జనహృదయములు=దుర్మార్గుల మనస్సులు; మృదు భాషణములన్ =మెత్తని మాటలతో; ప్రసన్నతా మహిమన్ పొందునె? =ప్రసన్నము లవుతాయా?/నిర్మలములవుతాయా?; దురభిమానము పేర్మిన్=ఎక్కువ దురభిమానం ఉండటంచేత; (మృదుభాషణములను)

ఎల్లిదముగన్ కొని= చులకనగా తీసుకొని; అంతంత కున్=అంతకంతకు; మదము-ఎక్కున్ గాక=గర్వం ఎక్కువవుతుంది గాని.

భా: *మెత్తని మాటలతో దుర్జనుల మనస్సులు ప్రసన్నములు కావు. పైగా దురభిమానంతో చులకనగా గ్రహించి అంతకంతకు గర్వం ఎక్కువవుతుంది.*

వి: ఇది దుర్యోధనుని స్వభావాన్ని చెప్పే పద్యం. దుష్టుని దగ్గర దురభిమాని దగ్గర మార్దవం పనికిరాదు. వాడిదగ్గర మార్దవం అసమర్థతగా పరిగణింపబడుతుంది. వ్యాసుడీ భావాన్ని స్పష్టంగా చెపుతాడు.

గర్దభే మార్దవం కుర్యాత్ గోషు తీక్ష్ణం సమాచరేత్
మృదు దుర్యోధనే వాక్యం యో బ్రూయా త్పాపచేతసి
మృదువై మన్యతే పాపో భాషమాణ మశక్తిజమ్
జిత మర్థం విజానీయా దబుధో మార్దవే సతి 5-4-5,6.

వ: **అదియునుం గాక.** 35

భా: అదీ గాక

తే: **కూటికై ద్రోణభీష్ములు గుమతి యనక**
యనుసరింతురు, ధృతరాష్ట్రుఁడును దనూజు
తృష్ణ నూనిన వాఁడు, రాధేయు బోఁటి
తులువ లెల్లను నతని సద్బుద్ధి యండ్రు. 36.

అ: ద్రోణభీష్ములు;(దుర్యోధనుని) కూటికై= కూటికోనందీనంగా; కుమతి అనక=దుర్మార్గుడనుకోకుండా; అనుసరింతురు=వాడివెంట తిరుగుతారు; ధృతరాష్ట్రుడును; తనూజు తృష్ణన్=పుత్రుడి మీది వ్యామోహాన్ని; ఊనినవాడు=పొందినవాడు; రాధేయుబోఁటి తులువలుఎల్లను = కర్ణుడు లాంటి తుంటరులంతా; అతనిన్=ఆ దుర్యోధనుని; సద్బుద్ధి-అండ్రు=సద్బుద్ధి కలవాడని అంటారు.

భా: *ఆ ద్రోణుడు, భీష్ముడూ దుర్మార్గు డనుకోకుండా కూటికోసం ఆ దుర్యోధనుని అనుసరిస్తారు. ఇక ఆ ధృతరాష్ట్రుడు పుత్రుడి మీద వ్యామోహం కలవాడు. కర్ణుడులాంటి తులువ లంతా ఆ దుర్యోధనుని సద్బుద్ధి అంటూ ఉంటారు.*

వి: రాధేయుడు వంటి అనడంలో శకుని కనిపిస్తున్నాడు.
అనువర్త్స్యతి తం చాపి ధృతరాష్ట్రః సుతప్రియః
భీష్మద్రోణౌచ కార్పణ్యాత్ మౌర్ఖ్యా ద్రాధేయ సౌబలౌ
అని మూలం. **కార్పణ్యాత్**- అన్నదానికి "**కూటికై**" అని తిక్కన వివరణ-వ్యాఖ్య.

వ: **కావున నతండు దుర్వినీతుండై యుండు, నెల్లభంగుల సంగరంబు గాఁగలయది, యీ సమయంబున బలంబులుం గూర్చికొని పిలువందగు రాజులం బిలిచి**

పుచ్చువలయు; సుయోధనుండును దోడాసపడి పుచ్చు; నుచిత పరులగు నరపతులు దొలుతఁ జెప్పిన వారిక సహాయత్వంబుఁ జేయంజూతురు. మనము వెసగల కాలరుల వేగంబ పుచ్చి శల్య కేకయ ధృష్టకేతు జరాసంధతనయ ప్రభృతులయిన భూపతులకును వారివారి బంధుమిత్ర జనంబులకును నెఱింగించి పుచ్చుట కార్యం; బిది నాకుం బోలిన తెఱంగని పలికి, తన కెలన సముచితాసనంబున నున్న విప్రవరుంజూచి. 37.

అ: దుర్వినీతుండై=దుష్ప్రవర్తనకలవాడై; ఎల్లభంగులన్=అన్నివిధాలా; సంగరంబు=యుద్ధం;కాగలయది=వస్తుంది; పిలిచిపుచ్చవలయు=పిలిపించాలి;తోడు-ఆసపడి=సహాయంకోరి; పుచ్చున్=పంపుతాడు; తొలుత చెప్పినవారికిన్-అ=ముందు అడిగినవారికే; వెస=వేగం; కాలరులు=దూతలు-వార్తాహరులు; పోలిన=మంచిదని తోచిన; తెఱంగు=పద్ధతి; తనకెలన= తన ప్రక్క;

భా: అందుచేత ఆ దుర్యోధనుడు దుర్మార్గుడయి ఉంటాడు. అన్ని విధాలా యుద్ధమే వస్తుంది. ఈ సమయంలో బలాలు సమకూర్చుకొని పిలవదగిన రాజుల్ని పిలిపించాలి. దుర్యోధనుడూ సహాయం కోరి రాజులకోసం దూతలను పంపుతాడు. ఔచిత్యం ఎరిగిన రాజులు ముందు అడిగిన వారికే సహాయపడతారు. మనం వేగం కల దూతలను పంపి, శల్యుడు,కేకయుడు, ధృష్టకేతుడు, సహదేవుడు మొ॥ రాజులకూ ,వారి వారి బంధువులకూ ,స్నేహితులకూ చెప్పి పంపడం తగినపని అని నాకు తోస్తోంది"

అని ప్రక్కనే కూర్చున్న బ్రాహ్మణుని చూసి..........................

**క: ఇతఁడు మదీయాగ్రపురో
హితుఁ;డితనికి నెల్లపనులు నెఱిఁగించి, తగన్
ధృతరాష్ట్రు కడకుఁ బనుపుఁడు,
చతుర వచన రచనఁ గఱపి సంప్రీతి మెయిన్. 38**

అ: ఇతఁడు; మదీయ+అగ్ర పురోహితుఁడు=నా ప్రధాన పురోహితుడు; ఇతనికిన్, ఎల్ల పనులున్, ఎఱిఁగించి; చతుర వచనరచనన్= నేర్పుగా మాట్లాడే తీరును; కఱపి= నేర్పి; సంప్రీతి మెయిన్= సంతృప్తికరంగా; తగన్= తగునట్లుగా; ధృతరాష్ట్ర కడకున్; పనుపుఁడు=పంపండి.

భా: ఇతడు నా ప్రధాన పురోహితుడు. ఇతనికి అన్ని విషయాలూ చెప్పి, నేర్పుగా మాట్లాడే తీరు చెప్పి సంప్రీతితో ధృతరాష్ట్రుని దగ్గరకు పంపండి.

వి: అగ్రపురోహితుడు= రాజునకూ, రాజ్యానికీ ,ప్రజలకూ హితం కోరి ప్రవర్తించేవాడు పురోహితుడు. అటువంటి వారిలో ఇతడు ప్రధానుడు. రాజునకు సంబంధించిన వైదిక విషయాల్లోనూ, లౌకిక విషయాల్లోనూ కూడా ఇతని సలహా రాజుకు ఉంటుందన్నమాట. అందుకే అతడు ద్రుపదునికి ప్రక్కనే సముచితాసనం మీద కూర్చున్నాడు.'చతుర వచన రచనఁగఱపి' అనడంచేత అతనికి చతురంగా మాటలాడటం రాదని కాదు. 'మీ కనుకూలంగా, మీ సమస్యకు

సంబంధించిన వచనాలు ఏరీతిలో చెప్పాలో ఆ రీతిలో చెప్పి' అని అర్థం. మీ విషయాలు కొత్త గనుక అవి నేర్పి అని భావం.

ఉ: ఆతని సమ్ముఖంబునఁ దదగ్ర తనూజు కడన్, మరున్నదీ
జాతుని సన్నిధిం, గలశసంభవు నొద్దఁ, గ్రమోచితంబుగా
"నీ తెఱఁగిట్టులాడు". మని యేర్పడ నంతయుఁజెప్పి పుచ్చఁగా,
నీతి మెయిం దగం బలుక, నెయ్యము లాభముఁ బెంపుఁజొప్పడున్. 39

అ: ఆతని సమ్ముఖంబునన్=ఆధృతరాష్ట్రుని ఎదుట; తత్-అగ్ర తనూజుకడన్=అతని పెద్దకొడుకు దుర్యోధనుని దగ్గర; మరుత్+నదీజాతుని సన్నిధిన్=గంగాపుత్రుడు భీష్ముని దగ్గర; కలశసంభవు నొద్దన్=ద్రోణుని దగ్గర; క్రమ+ఉచితంబుగాన్=క్రమానికి తగినట్లు; 'ఈ తెఱఁగు-ఇట్టులు-ఆడుము' అని= 'ఈపని, ఈ విధంగా మాట్లాడు' అని; ఏర్పడన్=స్పష్టంగా; అంతయున్ చెప్పివుచ్చగా=అంతా చెప్పివంపితే; నీతివెంయిన్= నీతితో; తగన్ వలుకన్= తగినట్లు(అతడు)మాట్లాడితే; నెయ్యములాభమున్ పెంపున్=చుట్టరికమూ ,స్నేహమూ, లాభమూ.; గొప్పతనమూ; చొప్పడున్=కలుగుతాయి.

భా: ఆ ధృతరాష్ట్రుని సమక్షంలో;,వాని పెద్దకొడుకు దుర్యోధనునిదగ్గర, భీష్మద్రోణులసన్నిధిలో సక్రమంగా "ఇది -ఈ పని -ఇట్లా మాట్లాడు" అని స్పష్టంగా అంతా చెప్పి పంపితే అతడు నీతితో మాట్లాడితే ఇద్దరకూ స్నేహమూ ,లాభమూ, మహత్త్వమూ అన్నీ కలుగుతాయి.

వి: ధృతరాష్ట్రునికడ, దుర్యోధనునికడ అనుటలో దుర్యోధనుని దురభిమానంమీద ఎత్తిపొడుపు. తరువాత భీష్మద్రోణుల మీద భక్తిగౌరవాలు ప్రస్ఫుటమవుతాయి.

వ: అనిన వాసుదేవుండు'పాంచాలపతి వచనంబు లుచితంబు లయి యున్నయవి యిబ్భంగిన చేయవలయు' నని పలికి మఱియు నిట్లనియె. 40

అ: ఈ+భంగిన = ఈ విధంగానే; పాంచాలపతి=ద్రుపదుడు

భా: అపుడు శ్రీకృష్ణుడు "ద్రుపదుని మాటలు తగి ఉన్నాయి. ఈ విధంగానే చెయ్యాలి' అని ఇంకా ఇలా అన్నాడు.

క: కౌరవులకుఁ బాండవులకు
నారయ నే నొక్కరూప; యట్లగుటఁదగన్
వారును వీరును దమతమ
నేరిమి మెయి ధరణి యేలి నెగడఁగఁ జూతున్. 41

అ: అరయన్= ఆలోచిస్తే ; కౌరవులకున్; పాండవులకున్; నేను; ఒక్కరూపు+అ= సమానుడనే. అట్లు+అగుటన్=అట్లా అవడంచేత; తగన్= తగునట్లుగా; వారును, వీరును,

తమతమ; నేరిమి మెయిన్=నేర్పులతో; ధరణి= భూమి; ఏలి నెగడఁగన్= పరిపాలించి ప్రవర్తిస్తూ ఉంటే; చూతున్=చూస్తాను.

భా: కౌరవులకూ ,పాండవులకూ కూడా నేను సమానుడనే. అందుచేత వారూ వీరూ తమతమ నిపుణతలతో భూపాలనం చేస్తూ ఉంటే చూచి సంతోషిస్తాను.

వి: ఒక్కరూప- అనడంలో చుట్టరికంలో అని భావం.

తే: పెండ్లి కని పిల్వఁ బంచినఁ బ్రియము తోడ
నేగు దెంచితి, మిన్నాళ్లు నెల్ల యొప్పి
దములఁ జూచితి, మియ్యెడఁ దడవు గాఁగ
నిలువఁ దీఱదు, పోయి రావలయు మాకు. 42

అ: పెండ్లికిన్ అని= అభిమన్యుని వివాహాని కని; పిల్వన్ పంచినన్ = ఆహ్వానిస్తే; ప్రియముతోడన్=ప్రీతితో; ఏగు దెంచితిమి= వచ్చాము; ఇన్నాళ్లు; ఎల్ల ఒప్పిదములన్=అన్నివేడుకలూ; చూచితిమి; ఈ + ఎడన్ = ఇక్కడ; తడవు కాఁగన్= ఇంకా చాలాకాలం; నిలువన్ తీఱదు= ఉండే తీరికలేదు; పోయి రావలయు మాకు= మేము వెళ్లి రావాలి.

భా: అభిమన్యుని వివాహానికి అని పిలిస్తే సంతోషంతో వచ్చాం. ఇన్నాళ్లూ అన్ని వేడుకలూ కళ్లారా చూశాం. ఇక ఇక్కడ ఎంతోకాలం ఉండే వీలుకాదు. ఇక మేం వెళ్లి రావాలి."

వ: అని పలికి ద్రుపదు నాలోకించి మీరు మాకెల్లవారికి గురుస్థానంబు. మీమాట యనిన ధృతరాష్ట్రుండు బహుమానంబు సేయు, మిమ్ము శాంతనవుండునుం గొనియాడు; మీయందు ద్రోణ కృపాచార్యులు సఖ్యంబు వాటింతు"రట్లగుటంజేసి. 43.

అ: గురుస్థానంబు= గురుపదవిలో ఉన్నవారు; బహుమానంబు చేయు= మన్నించు; శాంతనవుండు= భీష్ముడు (శంతనుని కుమారుడు); కొని యాడు=ప్రశంసిస్తాడు; సఖ్యంబు= స్నేహం.

భా: అని ద్రుపదుని చూసి ' మీరు మా అందరికీ గురుస్థానంలో ఉన్నారు. మీ మాట అంటే ధృతరాష్ట్రుడు గౌరవిస్తాడు. మిమ్మల్ని భీష్ముడు శ్లాఘిస్తాడు. మీ పట్ల ద్రోణుడూ ,కృపుడూ స్నేహం పాటిస్తారు. అందుచేత..................

వి: ఇప్పు డిక్కడున్న వారందరికీ ద్రుపదుడు గురుస్థానీయుడు. పాండవులు,కృష్ణుడు, బలరాముడు వీరి ముందుతరం వాడు- పాండవులకు మామ- కృష్ణాదులకు తండ్రి వరుస- అందుచేత గురుస్థానీయుడు. దానికి తోడు కౌరవపక్షంలో పెద్దలంతా అతని పట్ల గౌరవభావం కలవారు. అందుచేత కృష్ణుడు అతనిని పెద్దచేసి చెప్పాడు. సముచితమూ, ఉదాత్తమూ అయిన సంభాషణ.

తే: పాండ వార్థమై యొక్కరుఁ బనుప మీక
భరము, మీ పలు కందఱ పలుకు; మీరు
తెఱఁగు పఱుపంగ మిగిలి యుద్రేకు లైన
వార చెడువారు; విమల విచార విభవ ! 44.

అ: విమల విచార విభవ!= నిర్మలమయిన ఆలోచనా నిపుణత కలవాడా! (ద్రుపద మహారాజా!); పాండవార్థమై=పాండవుల కోసం; (కౌరవుల దగ్గరకు) ఒక్కరున్= ఒకరిని; పనుపన్= పంపించడానికి; మీకున్+ భరము= మీదేభారం; మీ పలుకు అందరపలుకు= మీ మాటే అందరిమాట; మీరు తెఱగు పఱుపంగ=మీరు సంధి ప్రయత్నం చేస్తూ ఉంటే; మిగిలి=(మీమాట) అతిక్రమించి; ఉద్రేకులైనవార= ఉద్రేకించినవారే; చెడువారు= చెడిపోయేవారు.

భా: *నిర్మలమయిన ఆలోచన కల ద్రుపద మహారాజా! పాండవుల కోసం ఎవరినయినా ఒకరిని పంపడం మీదే బాధ్యత. మీమాటేఅందరి మాట. మీరు సంధి చేస్తూఉంటే మీమాట కాదని యుద్రేకిస్తే వారే చెడిపోతారు.*

వి: ఇందులో ద్రుపదుని పెద్దతనాన్ని గురించి చెపుతున్నాడు. పాండవులకు కావలసిన వాడు ద్రుపదుడు. అందుచేత బాధ్యతనుకూడ గుర్తు చేస్తున్నట్లు, 'మీక భరము' అనడంలో మీకే తగును అని కూడ అర్థం.

క: పొందైన లెస్స, విరసపుఁ
గ్రందయ్యెడు చందమైన, రాజుల నెల్లన్
ముందర రావించి క్రమం
బొందఁగ మముఁ బిలువఁ బంపుఁ డొయ్యన పిదపన్. 45.

అ: పొందు-ఐనన్ -లెస్స= సంధి జరిగితే మంచిదే; విరసము-క్రందు=వికటించి గొడవ; అయ్యెడు=కలిగే; చందము ఐనన్=పద్ధతి వస్తే; క్రమంబు-ఒందఁగన్=వరుసగా; రాజులన్-ఎల్లన్=రాజుల నందరినీ; ముందర రావించి= ముందుగా రప్పించి; పిదపన్=తరువాత; ఒయ్యనన్= మెల్లగా; మమున్ పిలువన్ పంపుడు= మమ్మల్ని పిలిపించండి.

భా: *సంధికుదిరితే మంచిదే- కాక విరసంతో భేదమే కలిగితే ముందు మిగిలిన రాజులందరినీ రప్పించి తర్వాత మెల్లగా మాకు కబురు చెయ్యండి.*

క: మీ పనుపున రాజ్యము పా
లీ పాండు తనూభవులకు నీ కున్న, భుజా
టోప భయంకరుఁ డర్జును
కోపానల మడరి ముట్టికొనదే వారిన్. 46.

అ: మీ పనుపునన్= మీ నియోగంతో-ఆజ్ఞతో; రాజ్యముపాలు= రాజ్యభాగం; ఈ పాండు తనూభవులకున్= ఈ (పాండురాజ కుమారులకు) పాండవులకు; ఈ కున్నన్= ఇవ్వకపోతే

వారిన్ = వారిని; భుజ+ఆటోప భయంకరుఁడు=భుజబలంతో భయంకరుడయిన; అర్జును కోపానలము= అర్జునుని యొక్క కోపం అనే అగ్ని ; అడరి=వ్యాపించి; ముట్టికొనదే=దహించి వేయదా?

భా: మీ ఆజ్ఞతో రాజ్యభాగం ఈ పాండవులకు ఇవ్వకపోతే భుజబల భయంకరుడయిన అర్జునుని కోపాగ్ని వారిని దహించి వేయదా?

వి: మీ పనుపున అనడంలో ద్రుపదుడికి అప్పటి రాజులలో ఉన్న గౌరవభావం స్పష్టపడుతుంది. అర్జునుని కోపం అగ్ని వంటిది. అది ముట్టుకుంటే చావే శరణ్యం. కోపం అనే దాన్ని అగ్నిగా రూపొందించాడు కావున రూపకాలంకారం.

అర్జునుని కోపం గురించి చెప్పడంలో ఇక్కడ ఒక ఔచిత్యం ఉంది. ద్రుపదుడికి అర్జునుడంటే చాలా ఇష్టం. అంతేకాదు. తనకూ ఇష్టమే అర్జునుడంటే.

చ: అని గమనోన్ముఖుండయి మురాంతకుఁడా ద్రుపదుండు ధర్మనం
దనుఁడు వృకోదరాదులగు తమ్ములు మత్స్య మహీవిభుండుఁ ద
న్ననుప, హలాయుధ ప్రభృతి యాదవలోకము తోడ రా, ముదం
బున నిజపట్టణంబునకుఁబోయె సముజ్జ్వల వైభవంబునన్. 47.

అ: అని; మురాంతకుఁడు= కృష్ణుడు; గమన+ఉన్ముఖుండు-అయి=వెళ్లటానికి/ ప్రయాణానికి సిద్ధమయి; ఆద్రుపదుండు; ధర్మనందనుడు; వృకోదరాదులు-అగు తమ్ములు= భీమాది సోదరులు; మత్స్యమహీవిభుండున్= విరాటుడూ; తన్ను- అనుపన్=తనను సాగనంపగా; హల+ఆయుధ ప్రభృతి యాదవలోకము=బలరాముడు మొదలయిన యాదవుల సముదాయం; తోడరాన్=కూడా రాగా; ముదంబునన్=సంతోషంతో; సముజ్జ్వల వైభవంబునన్= ప్రకాశించే వైభవంతో; నిజపట్టణంబునకున్ పోయెన్= తన పట్టణమయిన ద్వారకకు వెళ్లిపోయాడు.

భా: అని కృష్ణుడు ప్రయాణానికి సిద్ధమయినాడు. ద్రుపదుడూ, ధర్మరాజూ, భీమాది సోదరులూ, విరాటుడూ తనను సాగనంపగా బలరామాదులయిన యాదవులంతా కూడా రాగా కృష్ణుడు వైభవంతో ద్వారకకు వెళ్లాడు.

వ: వివాహ మహోత్సవంబునకు వచ్చిన తక్కటి రాజులును సంగ్రామ సన్నాహంబునకై తమతమ పురంబులకుం జనిరి తదనంతరంబ. 48.

అ: తక్కటి =మిగిలిన; సంగ్రామ సన్నాహంబు=యుద్ధానికి ప్రయత్నం;

భా: పెళ్లికి వచ్చిన మిగతా రాజులు యుద్ధానికి సన్నాహం కోసం తమతమ పట్టణాలకు వెళ్లిపోయారు - తరువాత.

క: సమరమునకుఁ దగు నుద్యో
గమునఁ బ్రవర్తిల్లి రెలమిఁ గౌంతేయులు, మ
త్స్యమహీనాథుఁడు సన్నా
హము సేసెన్ ద్రుపదవిభుఁడు నాయిత మయ్యెన్. 49

అ: కౌంతేయులు=కుంతీకుమారులు పాండవులు; ఎలమిన్= సంతోషంతో; సమరమునకున్=యుద్ధానికి; తగు+ఉద్యోగమునన్= తగిన ప్రయత్నంతో; ప్రవర్తించిరి= నడచుకొన్నారు; మత్స్యమహీనాథుఁడు=మత్స్యరాజు విరాటుడు; సన్నాహము-చేసెన్=యుద్ధసన్నాహం చేశాడు. ద్రుపదవిభుఁడున్=ద్రుపదుడూ; ఆయితమయ్యెన్= సిద్ధమయ్యాడు.

భా: *పాండవులు సంతోషంతో యుద్ధానికి తగిన ప్రయత్నం ప్రారంభించారు-మత్స్యరాజు విరాటుడూ; ద్రుపదుడూ ఇద్దరూ యుద్ధానికి సన్నద్ధులయ్యారు.*

వ: **ఇట్లు సన్నద్ధులై వెలి వీడు విడిసి తమకు ననురక్తులయిన రాజుల పాలికిం దగు దూతలం బుచ్చి; రట దుర్యోధనుండు వీరల చందంబు విని తాను దన బంధు మిత్రగణంబైన రాజలోకంబు నెల్ల రావించిన. 50**

అ: సన్నద్ధులై= సిద్ధపడినవారై; వెలివీడు విడిసి= ఊరు బయట (సేనతో) విడిదిచేసి; అనురక్తులు= అనురాగము(ప్రేమ) కలవారు; పుచ్చిరి=పంపారు; వీరల చందంబు=వీరి పద్ధతి; రాజలోకంబు=రాజుల యొక్క సముదాయం.

భా: *ఇట్లా పాండవులు యుద్ధానికి సన్నాహం చేసి ఊరిబయట విడిసి తమమీద ప్రేమగల రాజుల దగ్గరకు తగిన దూతలను పంపారు. అక్కడ దుర్యోధనుడు వీరి తీరు అంతా తెలుసుకొని తానుకూడా తన చుట్టాలూ స్నేహితులూ అయిన రాజుల సమూహాన్ని అంతా రప్పిస్తే (రావించాడు అప్పుడు)*

వి: తమకు అనురక్తులయిన అంటే తమమీద-తమయందు అనురాగం కల అని సప్తమ్యర్థం చెప్పాలి.

క: **ఇభ తురగ స్యందన గతి**
రభసంబునఁ బృథివి యద్రువ, రాఁదొడఁగిరి, భూ
విభులు నలు దిక్కులను లో
క భయంకర లీల నుభయ కటకంబులకున్. 51.

అ: భూవిభులు =రాజులు; నలుదిక్కులను=నాలుగు దిక్కులనుండి; లోకభయంకరలీలన్ = లోకులందరికీ భయం కలిగే రీతిలో; ఉభయకటకంబులకున్= రెండు సేనా శిబిరాలకూ (కౌరవ శిబిరానికీ, పాండవ శిబిరానికీ) ఇభ, తురగ, స్యందన, గతి రభసంబునన్= ఏనుగుల యొక్క, గుర్రాలయొక్క, రథాల యొక్క, కాల్బలము యొక్క తీవ్రత (వేగము) చేత; పృథివి=నేల (భూమి); అద్రువన్= అదిరిపోయేటట్లు; రాన్ తొడఁగిరి=రావడం మొదలు పెట్టారు.

భా: *రాజులంతా నలుదిశల నుండీ లోక భయంకరంగా రెండు సేనాశిబిరాలకూ చతురంగ బలాలతో నేల అదిరిపోయేటట్లు రావడం మొదలు పెట్టారు.*

వి: 'అబ్రువన్' అనేటప్పుడు అకారం లఘువు. ఇది వ్యాకరణంలో ప్రత్యేకంగా చెప్పబడింది.

--: ద్రుపదుఁడు దన పురోహితుని దుర్యోధనుకడకు దూతగాఁ బంపుట :--
సం: 5-5-28.

వ: అట్టి సమయంబున నజాతశత్రు ననుమతి వడసి పాంచాలపతి వయోజ్ఞాన వృద్ధుండైన తన పురోహితుం గురుపతి పాలికిఁ బుచ్చువాఁడై యతని రావించి. 52.

అ: పాంచాలపతి = పాంచాల దేశమునకు రాజైన ద్రుపదుడు; వయోజ్ఞాన వృద్ధుఁడు=వయస్సుచేత జ్ఞానముచేత వృద్ధుడు ; పుచ్చువాఁడు+ఐ= పంపించాల నుకొన్నవాడై.

భా: ఆసమయంలోధర్మజుని అనుమతితో ద్రుపదుడు వయోవృద్ధుడూ జ్ఞానవృద్ధుడూ అయిన తన పురోహితుని ధృతరాష్ట్రుని దగ్గరకు పంపించాలి అనుకొని అతనిని రప్పించి....................(ఇలా అన్నాడు అని తర్వాతి పద్యంతో అన్వయం)

వి: వయస్సు అనుభవాన్నీ, జ్ఞానం ప్రతిభనూ తెలుపుతాయి. రెండూ ఉంటే సమగ్రత ఏర్పడుతుంది ఏ విషయానికయినా సరే.

క: హితుడవు మతిమంతుండవు
చతుర వచన కోవిదుఁడవు సమయజ్ఞుఁడ వు
న్నత వంశ వర్ధనుఁడ విం
గిత వేదివి నెచ్చెలివి సుకృతి వట్లగుటన్. 53.

అ: హితుఁడవు=నా హితంకోరేవాడవు- అప్తుడవు ; మతిమంతుండవు= బుద్ధిమంతుడవు- తెలివైనవాడవు; చతుర వచన కోవిదుడవు=చతురంగా మాట్లాడటంలో పండితుడవు ; సమయజ్ఞుఁడవు=కాలమెరిగి మాట్లాడగలవాడవు- సమయస్ఫూర్తికలవాడవు; ఉన్నతవంశవర్ధనుండవు =ఉన్నతమయిన వంశాన్ని వృద్ధిపొందించేవాడవు; ఇంగిత వేదివి=ఇతరుల మనసులలోని అభిప్రాయాలను తెలుసుకొగలవాడవు; నెచ్చెలివి=స్నేహితుడవు; సుకృతివి=పుణ్యాత్ముడవు, మంచిపనులు చేసేవాడవు; అట్లు+అగుటన్= అందుచేత

భా: నీవు నాకు హితుడవు. తెలివైనవాడవు. చాతుర్యంతో మాట్లాడగలవు. సమయానికి తగినట్లు మాట్లాడగలవు. సద్వంశంలో పుట్టి దాని పేరు నినుమడింపజేసే వాడవు. ఎదుటివాని మనోగతమయిన భావాలను ముందుగానే కనిపెడతావు. నా స్నేహితుడవు. పుణ్యాత్ముడవు. అందుచేత....................(అని మీది పద్యంతో అన్వయం)

వి: 1. ఇందులో దూతకు ఉండవలసిన లక్షణాలు చెపుతున్నాడు.

2. ఈ పదబంధాలకు ముగ్ధుడయి పెద్దన తనకు తెలియకుండానే "హితుడవు చతురవచోనిధి" వంటూ చక్కని కందం వ్రాశాడు. చూ. (మను-1-15)

తే: నాకుఁ గర్తవ్య మగుపని నీకుఁ జేయఁ
దగవు; గావున నెల్లవిధములఁ బూని
పాండ వార్థంబు ధృతరాష్ట్రు పాలి కరిగి
నేర్పు వాటించి కార్యంబు దీర్పవలయు. 54

అ: నాకున్ కర్తవ్యము అగుపని=నేను చేయదగినపని; నీకున్ చేయన్ తగవు= నీవు చేయడం న్యాయము; కావునన్= అందుచేత; ఎల్లవిధములన్= అన్ని విధాలా; పూని= శ్రద్ధవహించి; పాండవ+అర్థంబు=పాండవులకోసం; ధృతరాష్ట్రు పాలికిన్+ అరిగి=ధృతరాష్ట్రుని దగ్గరకు వెళ్లి; నేర్పు+పాటించి=నిపుణత వహించి; కార్యంబు=పని; తీర్పవలయు=నెరవేర్చాలి.

భా: నాకు కర్తవ్యమయిన పని నీవు చేయడం న్యాయం. కనుక అన్ని విధాలా శ్రద్ధవహించి పాండవుల కోసం ధృతరాష్ట్రుని దగ్గరకు వెళ్లి నేర్పుగా కార్యం నెరవేర్చాలి.

వి: నాకుఁగర్తవ్య మగు పని నీకు జేయఁదగవు=రాజు చేయవలసిన కర్మలు కొన్ని పురోహితుడు చేయడం సంప్రదాయం. దాన్ని దృష్టిలో ఉంచుకొని ద్రుపదుడీమాట అన్నాడు. అతడు నేర్పరి కనుక వైదిక కర్మలేకాక లౌకిక కార్యాలు కూడా చేయగలడు. అందుకే అది న్యాయమే అని కూడా సమర్థిస్తున్నాడు ద్రుపదుడు.

వ: అని చెప్పి యొడంబఱిచి యతనితో మఱియు నిట్లనియె. 55

అ: ఒడంబఱిచి= ఒప్పించి

భా: ఇలా చెప్పి పురోహితుని ఒప్పించి ద్రుపదుడు పురోహితునితో ఇంకా ఇలా అన్నాడు.

క: విను కొడుకు గొన్న వేఁదుఱ
కొని కొట్టిన తిండి కాఁడు కుటిలుం డతఁడా
జనపతి చందము ధర్మజు
ననుపమ శీలంబు నెఱుఁగు దది యట్లుండెన్. 56

అ: విను= వినుము; కుటిలుండు= కుత్సితుడు; అతఁడు; కొడుకు+కొన్న= కొడుకు పొందిన; వేఁదుఱు+అ= పిచ్చినే; కొని= పొంది; కొట్టిన తిండి కాడు= దానితోనేజీవించేవాడు; ఆ జనపతి చందమున్=ఆరాజు తీరూ; ధర్మజు=ధర్మరాజు యొక్క; అనుపమ శీలంబున్= సాటిలేని సత్ప్రవర్తననూ; (నీవు) ఎఱుఁగుదు= ఎరుగుదువు కదా!; అది అట్లుండెన్= అది అలా ఉండనియ్యి

భా: ఆ ధృతరాష్ట్రుడు చాలా కుత్సితుడు. కొడుకు మీది వ్యామోహంతో వాడికి పట్టిన పిచ్చినే తానూ పొంది ప్రవర్తిస్తాడు. అతని తీరూ నీకు తెలియనిది కాదు. ధర్మరాజు సత్ప్రవర్తనమూ తెలియనిది కాదు. సరే అది అలా ఉండనియ్యి.

వి: ఇందులో ద్రుపదుడు ధృతరాష్ట్రునికి ధర్మరాజుకు కల భేదం చెపుతున్నాడు. ధృతరాష్ట్రుడు కుటిలుడు. ఇతడు ధర్మజుడు. అతనిది కొడుకు గొన్నవేదుఱు- ఇతనిది అనుపమ శీలం- ఇవి నీకు తెలిసినవే కదా అని స్థిరపరుస్తున్నాడు.

తే: పుడమి పాలు పాండవులకు నడుగఁబోయి
నీవు ధృతరాష్ట్రుతో ధర్మనిష్ఠమైన
యుచిత మాడిన నందుఁ బోటొడ్డియున్న
దొరల భృత్యుల మనములు దిరుగఁబడవె? 57.

అ: నీవు; పాండవులకున్; పుడమి పాలు=భూభాగము/ రాజ్యభాగం; అడుఁగన్ పోయి= అడగటానికి వెళ్లి; ధృతరాష్ట్రుతోన్; ధర్మనిష్ఠమైన=ధర్మము నందేనిలిచిన; ఉచితము-ఆడినన్=తగిన మాటలు మాట్లాడితే; అందున్= ఆపక్క; పోటు-ఒడ్డి యున్న=యుద్ధానికి సిద్ధమై ఉన్న; దొరల=రాజుల యొక్క; భృత్యుల=సేవకుల యొక్క; మనములు=మనస్సులు; తిరుగన్ పడవె? = తిరగ బడవా?

భా: పాండవుల రాజ్యభాగం అడిగేందుకు వెళ్లి నీవు ధృతరాష్ట్రునితో ధార్మికంగా ఉచితంగా మాట్లాడితే ఆ పక్షాన పోరాడటానికి వచ్చిన రాజుల మనసులు తిరగబడకుండా ఉంటాయా?

వి: తిరగబడటం అంటే 1) యుద్ధ విముఖములు కావా 2) మనవైపుకు తిరగబడవా అని రెండర్థాలు.

"మనాంసి తస్య యోధానాం ధ్రువ మావర్తయిష్యతి"
అన్న వ్యాస వాణికి సరియైన తెలుగుసేత.

కం: గురు భీష్మాదుల మనములు
దురములకుం జొరకయుండ దుర్యోధనుఁడా
తురుఁడై యొడఁబఱుపఁగ ని
ప్పురుసున నెరవైన ఁజీచ్చువడు బలమెల్లన్. 58.

అ: గురు భీష్మ-ఆదుల= ద్రోణుడు భీష్ముడు మొదలగు వారి; మనములు= మనస్సులు; దురములకున్= యుద్ధములకు; చొరకయుండన్=ఇష్టపడకుండా ఉంటే; దుర్యోధనుడు;ఆతురుఁడై=ఆతురతకలవాడై; ఒడఁబఱుపఁగన్=అంగీకరింపజేయటానికి; ఈ+వరుసునన్=ఈవిధంగా;ఎరవైనన్=వేరయినచో(భేదముకలిగినచో); బలము+ ఎల్లన్=సైన్యమంతా; ఁజీచ్చువడున్=భయపడును/ వెనుకాడును.

భా: (నీ మాటలతో) ద్రోణభీష్మాదుల మనస్సులు యుద్ధ విముఖములయితే దుర్యోధనుడు కలతచెంది వారిని ఒప్పించటానికి ప్రయత్నిస్తూ తానుఒక్కడూ వేరయితే సైన్యమంతా కూడా భయపడుతుంది, నిశ్చేష్టమవుతుంది.

ఉ: పాండుతనూభవుల్ వడినపాటులు బంధులకెల్లఁ దెల్పుచుం
పండిత వృద్ధ సజ్జనుల పాలికిఁ బోయి కులోచితంబు గా
కుండుట సూపి చెప్పుచుఁ బ్రియోక్తులఁ దక్కటి వారి నిట్లు మే
లొండొ కచంద మొప్ప దని యుల్లములం దలపోయఁ జేయుచున్. 59.

అ: పాండుతనూభవుల్= పాండవులు(పాండురాజు కుమారులు); పడిన పాటులు= పడిన కష్టాలు; బంధులకున్+ఎల్లన్=చుట్టాలందరికీ; తెల్పుచున్=తెలియజేస్తూ; పండిత, వృద్ధ సజ్జనుల పాలికిన్ పోయి= పండితుల దగ్గరకూ, పెద్దల దగ్గరకూ, సన్మార్గుల దగ్గరకూ వెళ్లి; కుల+ఉచితంబు- కాకుండుట= ఈ పద్ధతి వారి వంశానికి తగనిది అని; చూపి చెప్పుచున్= దృష్టాంత పూర్వకంగా చెపుతూ; ప్రియ+ఉక్తులన్= ఇంపైన మాటలతో; తక్కటి వారిన్= మిగిలిన వారినికూడా;ఇట్లు మేలు= ఈవిధమైతేమేలు ;ఒండొక చందము= మరోవద్ధతి;ఒవ్వదు= తగదు; అని; ఉల్లములన్=మనస్సులలో; తలపోయన్ చేయుచున్=అనుకొనేటట్లు చేస్తూ.................................. ముందు వచనంతో అన్వయం.

భా: పాండవులు పడ్డ కష్టాలు బంధువులందరికీ తెలుపుతూ పండితుల దగ్గర కూ, పెద్దలదగ్గరకూ, సజ్జనుల దగ్గరకూ పోయి ఇది మీ వంశానికి తగదని ఉదాహరణ పూర్వకంగా చెప్పి, మిగిలినవారు కూడా "ఇదే మేలు మరో పద్ధతి మంచిది కాదు" అని అనుకొనేటట్లు ప్రియంగా మాట్లాడాలి.

వి: పండిత శబ్దంతో కృపద్రోణులూ; వృద్ధశబ్దంతో భీష్మ, బాహ్లికాదులూ; సజ్జన శబ్దంతో విదురాదులూ మనసులో మెదులుతారు.

వ: మరియు సమస్త జనంబుల మనంబులు నిక్కడ వ్రాలునట్టి యుపాయంబు లెన్నిగల, వన్నియు నయ్యైతగవులమై నాచరించుచుఁ జరియించునది; యిచ్చట విరాటు కొలువు కూటంబునం బుట్టిన కృష్ణాదుల సంవాదంబు తెఱంగును మనయెఱింగినయదియె, తదనురూపంబుగాఁ బలికి పాండవులకుఁ దేజోలాభంబుం గావించుట కర్తవ్యంబు; నీవు కరినగరంబున వసియించి ధృతరాష్ట్ర ధార్తరాష్ట్ర గాంగేయ విదుర గురు కృపాదుల కడకరిగి నానాఁటికి వారి వారి చిత్తంబుల తెఱం గెఱింగి ప్రవర్తింపుము; దైవగతింజేసి నీయొడ్డిన సూత్రంబునకు సుయోధనుం డొడంబడియె నేనియు నదియ సకలజన సమ్మతంబయిన విధంబగు, దాన నజాతశత్రుండును బ్రీతుండగుఁ, బోయి రమ్మని నిశ్చయంబు సేసిన నమ్మహీసుర వరుండు. 60.

అ: వ్రాలు=నిలుచు; తగవుమైన్= ఉపాయాలతో, నేర్పులతో; చరియించునది =ప్రవర్తించాలి; నానాఁటికిన్ =రోజురోజుకూ; ఒడ్డిన సూత్రంబునకున్=పన్నిన పన్నుగడకు; ఒడంబడియెన్-ఏని=అంగీకరిస్తే; అదియ=అదే; దానన్ = దానివల్ల; అజాత శత్రుండును = ధర్మరాజు కూడా; ప్రీతుండగున్=సంతోషిస్తాడు; ఆ+మహీసురవరుండు=ఆ బ్రాహ్మణోత్తముడు.

భా: ఇంకా అందరి మనస్సులూ ఇక్కడ మొగ్గే ఉపాయాలు అన్నీ ఆయా పద్ధతులలో ఆచరిస్తూ ప్రవర్తించు. ఇక్కడ విరాటుని కొలువులో పుట్టిన కృష్ణాదుల సంభాషణలతీరు మనకు తెలిసినదే కదా! దాని కనుగుణంగా అక్కడ మాట్లాడి పాండవులకు

తేజోలాభంబు కలిగించడం(మన)కర్తవ్యం. నీవు హస్తినాపురానికి వెళ్ళి అక్కడ ఉండి ధృతరాష్ట్రుడు, కొడుకులూ, భీష్ముడూ, విదురుడూ, ద్రోణుడూ, కృపుడూ మొదలయిన వారి దగ్గరకు వెడుతూ ప్రతిరోజు వారి మనస్సు లెరిగి ప్రవర్తించుము. దైవ వశాత్తు నీ పన్నుగడకు దుర్యోధనుడు అంగీకరిస్తే అదే అందరికీ ఇష్టమయిన పద్ధతి. దానివల్ల ధర్మరాజూ సంతోషిస్తాడు. వెళ్ళిరా'' అని నిశ్చయించాడు ద్రుపదుడు. అపుడా బ్రాహ్మణుడు............

వి: పాండవుల కష్టాలు వర్ణించి చెపితే కౌరవపక్షంలో వారి మనస్సులన్నీ ఇటువైపు మొగ్గు చూపాలన్నమాట. ఇది ప్రజల సానుభూతి సంపాదించుకొనటానికి ఒక మార్గం. పురోహితుడు ఇంగితవేది కనుక ఇతరుల మనస్సులలోని విషయాలు గ్రహించగలడు. తదనుగుణంగా ప్రవర్తించు అని ద్రుపదుని ఆకాంక్ష.

సకల జనసమ్మతమయిన పద్ధతి ధర్మరాజుకు సంతోషాన్ని చేకూరుస్తుంది అనడం ధర్మరాజు యొక్క ఉదాత్తతను తెలుపుతుంది.

క: మును పాంచాల విభుని వీ
డ్కొని ధర్మజు భీము నరు నకులు సహదేవుం
గని యనుమతుఁడై యందఱు
ననుపఁగ మన్ననలు వడసి యరిగెన్ బ్రీతిన్. 61.

అ: మును= ముందుగా; పాంచాల విభునిన్=ద్రుపదుని; వీడ్కొని=విడచి, (తరువాత) ధర్మజున్,భీమున్,నరున్,నకులున్, సహదేవున్; కని= దర్శించి; అనుమతుఁడై=వారి దగ్గర అనుమతి పొందినవాడై; అందఱున్ అనుపఁగన్= అందరూ పంపించగా; మన్ననలు-వడసి= సత్కారములు పొంది; ప్రీతిన్ అరిగెన్= సంతోషంతో బయలుదేరి వెళ్లాడు.

భా: ముందుగా ద్రుపదుని వీడ్కోలు పొంది, తరువాత పాండవుల అనుమతీ, వారి సత్కారాలూ పొంది, వారిచే వీడ్కోలు పొంది సంతోషంతో బయలుదేరి వెళ్లాడు ద్రుపదపురోహితుడు.

వి: ముందు ద్రుపదుని వీడ్కొని, తరువాత పాండవుల అనుమతిపొందడం ఔచిత్య శోభితంగా ఉంది.

-: దుర్యోధనుండును నర్జునుండును శ్రీకృష్ణుని దర్శింపఁబోవుట :- సం.5-7-2.

వ: అంత నక్కడ దుర్యోధనుండు సకల రాజన్యసామాన్యంబుగా గోపాలదేవు పాలికి దూతంబుచ్చుట దగవగునే యని విచారించి. 62.

అ: సకల రాజన్య సామాన్యంబుగాన్= రాజులందరితో సమానంగా; పుచ్చుట=పంపుట; తగవు-అగునే!= న్యాయమవుతుందా? ; విచారించి= ఆలోచించి.

భా: అక్కడ హస్తినాపురంలో దుర్యోధనుడు "అందరు రాజులకూ పంపినట్లుగా శ్రీకృష్ణుని దగ్గరకు కూడా దూతను పంపడం న్యాయమా" అని ఆలోచించి

వి: వాళ్లు సామాన్య రాజులు గనుక దూతను పంపడం సముచితం- అతడు గోపాలదేవుడు కనుక దూతను పంపకుండా తానే వెళ్లాలనుకొని ఆలోచించాడు. ఇది దుర్యోధనుని లోని ఔచిత్యానికి నిదర్శకం.

క: **వెరవుమెయిఁ దాన కతిపయ**
పరిజన సహితముగ నరిగె బటుతురగ గతి
స్ఫురణాను మోదలీలా
భరితుఁ డగుఁచు వేగిరంపుఁ బయనములఁ దగన్. 63.

అ: వెరవు మెయిన్= నేర్పుతో; తాను+అ=తానే; పటు.... భరితుఁడు, పటు= అధికమయిన; తురగగతిస్ఫురణ=గుఱ్ఱపునడక యొక్క విలాసముతో, అనుమోదలీలా= అనుమోదించే/ సంతోషించే రీతితో; భరితుఁడు=నిండినవాడు; అగుచున్; వేగిరంపు-పయనములన్=వేగవంతమయినప్రయాణాలతో; తగన్ = తగునట్లు; కతిపయపరిజన సహితముగన్ = కొద్దిమంది సేవకులతో కూడి; అరిగెన్=(ద్వారకకు)వెళ్లాడు.

భా: నేర్పుతో దుర్యోధనుడు గుఱ్ఱమెక్కి వేగంగా ప్రయాణిస్తూ కొద్దిమంది పరిజనులను వెంటనిడుకొని తానే స్వయంగా ద్వారకకు వెళ్లాడు.

వి: 1.స్వయంగా వెళ్లడం కృష్ణుని మీదనున్న భక్తికి చిహ్నంగా ఉండాలని ఆ దుర్యోధనుని అభిప్రాయం.

2. **వేగిరింపుఁబయనములు** అని పాఠము.అపుడు వేగిరపరచే ప్రయాణాలు అని అర్థం

వ: **చని తదీయపుర ప్రవేశంబు సేసె నాదివసంబున ధనంజయుండును గోవిందుం గానవచ్చె నట్టియెడ.** 64.

అ: చని=వెళ్లి;తదీయ పురప్రవేశంబు కృష్ణునిదైన ద్వారకానగరప్రవేశం; ధనంజయుండు= అర్జునుడు.

భా: వెళ్లి ద్వారకానగరం ప్రవేశించాడు దుర్యోధనుడు. అదే రోజున అర్జునుడూ కృష్ణుని చూడటానికి వచ్చాడు. అట్టి సమయంలో..

తే: **అతడు పవడింప మును కౌరవాధినాథుఁ**
డరిగి తలయంపి దెస నున్నతాసనమున
నుండెఁ; బదపడి కాల్కడ యొద్ద కల్లఁ
జని వినమ్రుఁడై నిలుచుండె సవ్యసాచి. 65.

అ: అతఁడు= కృష్ణుడు; పవడింపన్= పండుకొని ఉండగా; మును=ముందుగా; కౌరవాధినాథుఁడు=దుర్యోధనుడు; అరిగి=వెళ్లి; తలయంపిదెసన్= తలవైపున; ఉన్నత+ ఆసనమునన్-ఉండెన్= ఎత్తయిన ఆసనంమీద కూర్చున్నాడు; వదపడి=తర్వాత; సవ్యసాచి=అర్జునుడు; కాల్కడయొద్దకు=కాళ్లదగ్గరకు; అల్లన్చని=మెల్లగా వెళ్లి; వినమ్రుడై నిలుచుండెన్= వినయంతో నిలుచున్నాడు.

భా: కృష్ణుడు పరుండి ఉన్నాడు. ముందుగా దుర్యోధనుడు వెళ్లి తల దగ్గరున్న ఎత్తయిన ఆసనం మీద కూర్చున్నాడు. తర్వాత అర్జునుడు వెళ్లి వినయంతో కాళ్లదగ్గర నిలిచాడు.

వి: కౌరవాధినాథుడు ఉన్నతాసనంమీద కూర్చోడం అతని అహంభావాన్ని వ్యక్తం చేస్తుంది. అర్జునుడు వినమ్రుడై నిలవడం అతని భక్తి భావాన్ని ,శరణాగతిని తెలియజేస్తుంది. అందుకే భగవానుడు ముందుగా అర్జునుని చూశాడు. అహంకారం పోయి వినయంతో భక్తితో నిలిచాడు కనుక.

66.

వ: అంత.

భా: అప్పుడు

క: మేలుకని కృష్ణుఁ డర్జును
నాలోకించి మఱి కౌరవాధిపుఁ గని త
త్కాలోచిత బహుమతిమైఁ
జాలఁ బ్రియం బిరువురకుఁ బ్రసన్నతఁ జేసెన్. 67.

అ: కృష్ణుడు; మేలుకని= మేల్కొంచి; అర్జునున్; ఆలోకించి=చూసి; మఱి=తరువాత; కౌరవ+అధిపున్ కని= దుర్యోధనుని చూసి; తత్ కాల+ఉచిత బహుమతిమైన్= ఆసమయానికి తగిన గౌరవంతో; ఇరువురకున్=ఇద్దరికీ; ప్రసన్నతన్=సంతోషంతో; చాలన్ ప్రియంబు-చేసెన్= ఎంతో ప్రీతి చేకూర్చాడు.

భా: కృష్ణుడు నిద్రనుండి మేల్కొంచి అర్జునుని చూసి పిమ్మట దుర్యోధనుని చూసి సంతోషంతో ఇద్దరికీ ఆ సమయానికి తగ్గ గౌరవసత్కారాలతో చాలా ప్రీతి చేకూర్చాడు.

68.

వ: తదనంతరంబ.

అ: తత్+ అనంతరంబ= ఆ తరువాత

భా: అయిన తరువాత

ఉ: వారలఁ జూచి కేశవుఁడు, వచ్చిన కార్యము సెప్పుఁడన్న న
క్కౌరవ నాథుఁ డిట్లనియెఁ, " గయ్యము సేయువగన్ సహాయముం
గోరి భవత్సకాశమునకుం జనుదెంచితి; మేము వీరు నీ
కారయ నొక్క రూప హృదయంబునఁ బేర్చిన బాంధవంబునన్" 69.

అ: కేశవుఁడు; వారలన్ చూచి; వచ్చిన కార్యము చెప్పుఁడు అన్నన్=వచ్చిన పని చెప్పండి అంటే; ఆ కౌరవనాథుఁడు =ఆ దుర్యోధనుడు; ఇట్లు అనియెన్; కయ్యము= యుద్ధము; చేయు వగన్= చేసే అభిలాషతో; సహాయమున్ కోరి= (నీ)సహాయం కోరి; భవత్-సకాశమునకున్= నీ దగ్గరకు; చనుదెంచితి= వచ్చాను; ఏము= మేమూ ;వీరు=వీరూ(పాండవులూ); హృదయంబునన్ పేర్చిన=మనసులో పెరిగిన; బాంధవంబునన్= చుట్టరికంలో; నీకున్; అరయన్= పరిశీలిస్తే; ఒక్కరూపు-అ= ఒకే విధం-.ఒకటే

భా: కృష్ణుడు వారిద్దరినీ చూసి "వచ్చినపని చెప్పండి" అన్నాడు. అపుడు దుర్యోధనుడు ఇలా అన్నాడు. యుద్ధంలో సహాయం కోరి నీ దగ్గరకు వచ్చాము- మేమిద్దరమూ బంధుత్వవిషయంలో నీకు సమానులమే.

క: మున్నేను గానవచ్చితి
నిన్ను, సుజను లైనవారు నెమ్మిని మునుమున్
గన్నం దగఁ గైకొంద్రు; స
మున్నత సౌజన్య సారయుతుఁడవు నీవున్. 70.

అ: మున్ను=ముందుగా;ఏను=నేను;నిన్నున్; కానవచ్చితి=చూశాను; సుజనులైన వారు=సజ్జనులు; మునుమున్ కన్నన్=మున్ముందుగా చూస్తే;నెమ్మిని=ప్రేమతో; తగన్=తగునట్లు;కైకొంద్రు=స్వీకరిస్తారు; నీవున్=నీవుకూడా; సమున్నత సౌజన్య సార యుతుఁడవు=ఉదాత్తమయిన మంచితనంతో కూడిన వాడవు.

భా: ముందుగా నేను నిన్ను చూశాను. సజ్జనులు ముందు చూసినవారినే స్వీకరిస్తారు. నీవుకూడా ఎంతో సౌజన్యం కలవాడవు.

వి: సుజనుల లక్షణం ముందు చూసినవారిని ఆదరించడం. సౌజన్యం అంటే సుజనుల స్వభావం. నీవుసమున్నత సౌజన్యసారయుతుడవు. కాబట్టి నన్నేతప్పక ఆదరించాలి. అని భావం.

వ: కావున లోకంబు పాడి విచారించి నాకుం దోడు గావలయు ననిన వాసుదేవుం డిట్లనియె. 71.

అ: లోకంబుపాడి=లోకముయొక్క న్యాయం- ధర్మం;తోడు కావలయున్= సహాయపడాలి;వాసుదేవుడు= వసుదేవుని కుమారుడు (కృష్ణుడు)

భా: అందుచేత లోకధర్మం తలచి నాకు సహాయపడాలి అంటే కృష్ణు డిట్లా అన్నాడు.

ఉ: నీవిట మున్న వచ్చి తిది నిక్కము, పార్థునిఁ దొల్తఁగాంచితిం,
గావున మీకు నిద్దఱకు గౌరవ మొప్పఁగఁ దోడుపాటు స
ద్భావము; దీనికిం దెఱఁగు దప్పక యుండఁగ నేర్పరించెద,
నీవలపెట్టులట్ల తగ నీవును నీతఁడు గోరికొం డొగిన్. 72.

అ: నీవు; ఇట=ఇక్కడకు; మున్న=ముందే; వచ్చితి=వచ్చావు; ఇది నిక్కము= ఇది నిజం; పార్థునిన్=అర్జునుని;(నేను) తొల్తన్=ముందుగా; కాంచితిన్=చూశాను; కావునన్; మీకున్; ఇద్దఱకున్; గౌరవము- ఒప్పఁగన్= సగౌరవంగా; తోడుపాటు=తోడ్పడటం; సద్భావము=మంచిపని/ సౌజన్యం; దీనికిన్=ఈ పద్ధతికి(ఇద్దరికీ తోడ్పడటానికి); తెఱఁగు తప్పక= న్యాయం తప్పకుండా; ఉండఁగన్ ఏర్పరించెదన్=ఉండేటట్లు ఏర్పాటు చేస్తాను. మీ వలపు ఎట్టులు= మీ అభిలాష ఎట్లాగో; అట్ల=అట్లా; తగన్; నీవును; ఈతడు; ఒగిన్=చక్కగా; కోరికొండు=కోరుకోండి.

భా: నువ్వు ముందే వచ్చావు-కాని నేను ముందుగా అర్జునుని చూశాను. అందుచేత మీ యిద్దరికీ తోడ్పడటం న్యాయం. అన్యాయం తప్పకుండా ఒక ఏర్పాటు చేస్తాను మీ యిష్టం వచ్చినట్లు కోరుకోండి.

క: **నా పాటియ పదివేవురు**
గోపాలురు గలరు సమరకోవిదబాహా
టోపాభిరామమూర్తులు 73.
చాపాద్యాయుధ కళావిశారదచిత్తుల్.

అ: నా పాటియ= నాతో సమానులే ; పదివేవురు= పదివేలమంది; గోపాలురు; కలరు; (వారు) సమర–కోవిద –బాహా-ఆటోప-అభిరామ మూర్తులు= యుద్ధమునందునిపుణమైన, భుజముల, విజృంభణచేత, అభిరామమయిన స్వరూపంకలవారు. చాప.......... చిత్తుల్;=చాప+ఆది=ధనుస్సు మొదలయిన; ఆయుధకళా= ఆయుధముల విద్యలో; విశారద=నిపుణమయిన; చిత్తుల్= మనస్సులు కలవారు.

భా: నాతో సమానులయిన గోపాలురు పదివేల మంది ఉన్నారు. వారు యుద్ధవిద్యలో ఆరితేరినవారు. భుజబల విజృంభణంతో అభిరామ మయిన స్వరూపం కలవారు. ఆయుధ విద్యలన్నీ నేర్చినవారు.

క: **నారాయణాభిధానులు**
వారలు గయ్యంబు సేయు వా రొక్కెడ నే
నూరక నిరాయుధ వ్యా 74.
పారతమై నుండువాఁడఁ బరమాప్తుడనై.

అ: నారాయణ+అభిధానులు= నారాయణులు అనే పేరుగలవారలు; ఒక్క+ఎడన్= ఒకవైపు; కయ్యంబు-చేయువారు=యుద్ధంచేసేవారు; నేను; ఊఁరక; నిరాయుధ వ్యాపారతమైన్= ఆయుధంతో పని లేకుండా ; పరమ+ఆప్తుఁడనై=మిక్కిలి ఆప్తుడనై; ఉండువాడన్=ఉంటాను.

భా: నారాయణ అనేపేరుగల ఆ గోపాలురు ఒక పక్షాన యుద్ధం చేస్తారు. నేను మాత్రం ఆయుధం పట్టకుండా పరమాప్తుడనై ఉంటాను.

క: **వా రొకతల, యే నొకతల,**
యీరెండు దెఱంగులందు నెయ్యదిప్రియ మె
వ్వారికిఁ జెప్పుఁడు; దొలితొలి
గోరికొనన్ బాలునికిఁ దగుం బాడిమెయిన్. 75.

అ: వారు= ఆ నారాయణగోపాలురు; ఒకతల= ఒకపక్షం; ఏను=నేను; ఒకతల=ఒకపక్షం; ఈ రెండు తెఱంగులందున్=ఈరెండు పక్షాలలో; ఎవ్వారికిన్ ఎయ్యది ప్రియము=ఎవరికేది ఇష్టమో; చెప్పుడు; పాడిమెయిన్=న్యాయాన్ని అనుసరించి; తొలితొలి కోరికొనన్ =ముందు కోరుకోవడం; బాలునికిన్ తగున్=బాలుడికి తగును.

భా: వారొక పక్షం. నేనొక పక్షం. ఈ రెండు పక్షాలలో మీలో ఎవరికేది హితమో కోరుకోండి. ధర్మాన్ని బట్టి ముందుగా బాలుడు కోరుకొనడం ఉచితం.

-: అర్జునుఁడు శ్రీకృష్ణునిం దనకు సహాయునిఁగాఁ గోరికొనుట :-
సం. 5-7-18.

క: **అని పలికి హరి గిరీటిం**
గనుఁగొని "కొండుకవు నీవు గావున నీకున్
మును గోరఁ బాడి," యనవుడు
విని కృష్ణునిఁ గోరి కొనియె విజయుం డెలమిన్. 76.

అ: అని, పలికి,హరి=కృష్ణుడు; కిరీటిన్=అర్జునుని; కనుఁగొని=చూసి; నీవు; కొండుకవు=చిన్నవాడవు; కావున; నీకున్; మును=ముందు; కోరన్=కోరటానికి; పాడి=ధర్మం; అనవుడున్=అనగానే; విని; విజయుండు=అర్జునుడు; ఎలమిన్=సంతోషంతో; కృష్ణునిన్ కోరికొనియెన్.

భా: అని చెప్పి కృష్ణుడు అర్జునుని చూసి "నీవు చిన్నవాడవు కాబట్టి నీవు ముందు కోరుకోవడం ధర్మం" అన్నాడు. వెంటనే అర్జునుడు ఎంతో సంతోషంతో కృష్ణుని కోరుకొన్నాడు.

ఆ: **దాని కాత్మఁబొంగి, ధార్తరాష్ట్రుఁడు వారి**
నపహరించి కొనినయట్ల కాఁగఁ
దలఁచి, చెన్ను మీఱి, బలములఁగైకొని
చనియెఁ బ్రీతి, రాము సదనమునకు. 77.

అ: దానికిన్= అర్జునుడు అట్లాకోరుకొన్నందుకు; ఆత్మన్ పొంగి= మనసులో పొంగిపోయి; ధార్తరాష్ట్రుడు= ధృతరాష్ట్రుని కుమారుడు దుర్యోధనుడు; వారిన్=ఆనారాయణ గోపాలురు పది వేల మందినీ; అపహరించికొనిన యట్ల కాగన్ తలచి= దక్కించుకొన్నట్లు

అనుకొని, చెన్నుమీఱి=శోభిల్లి; ప్రీతిన్= సంతోషంతో; బలములన్ కైకొని= బలగాలను తీసుకొని; రాము సదనమునకున్ చనియెన్= బలరాముని గృహానికి వెళ్లాడు.

భా: ఆ కోరుకోవడానికి దుర్యోధనుడు పొంగిపోయి ఆ బలాన్నంతనూ అపహరించినంతగా సంతోషించాడు. వెంటనే బలగాలను గ్రహించి బలరాముని భవనానికి వెళ్లాడు.

వ: చని యతనింగని సమ్మానంబు వడసి తన వచ్చినకార్యం బెఱింగించిన దుర్యోధనునకు బలదేవుం డిట్లనియె. 78.

అ: సమ్మానంబు-పడసి= సత్కారం పొంది; తన వచ్చిన కార్యంబు= తాను వచ్చినపని

భా: వెళ్లి బలరాముని దర్శించి అతని సత్కారం పొంది తాను వచ్చినపని చెప్పాడు దుర్యోధనుడు. అపుడు బలరాముడు ఇలా అన్నాడు.

క: అభిమన్యు వివాహమునకుఁ
ప్రభువర్గం బెల్ల గూడఁబడియుండఁగ నా
సభ నీకై యేఁ బలికితి,
నిభపురమున మాటవుట్టదే యీవు వినన్. 79.

అ: అభిమన్యు వివాహమునకున్= అభిమన్యుని పెండ్లికి; ప్రభువర్గంబు-ఎల్లన్ = రాజసమూహం అంతా; కూడన్ పడియుండఁగన్=కలిసినప్పుడు; ఆ సభన్= ఆ సభలో; నీకున్-ఐ= నీకోసం, నీ పక్షాన; ఏన్=నేను; పలికితిన్=మాట్లాడాను; ఇభపురము నన్=హస్తినలో; ఈవు వినన్=నీవు వినేటట్లు; మాట పుట్టదే= వార్త పుట్టలేదా?

భా: ఉత్తరాభిమన్యుల పరిణయంలో రాజులంతా కూడిన సభలో నీ పక్షాన నేను మాట్లాడాను. హస్తినాపురానికి ఆ వార్త చేరలేదా? నీవు వినలేదా?

వ: దానికిఁ గొంద ఱసహ్యపడి పాండవపక్షపాతంబునం బ్రతికూల వచనంబులు పలికిన నవి కృష్ణునకుఁ బ్రియంబులై యుండె నట్లగుటం జేసి. 80

భా: నా మాటలకు కొందరు సహింపలేక పాండవ పక్షపాతంతో నాకు వ్యతిరేకంగా మాట్లాడారు. ఆ మాటలు కృష్ణునికి ప్రియం అనిపించాయి. అందుచేత

తే: అతనిఁబాసి యొక్కింత ప్రొద్దైన నిలువఁ
జాలమియు మూలముగ విరసంపుమాట
లాడనొల్లమి నేమియు ననక, యంత
నుండి యొక నిశ్చయమ్మమై నున్నవాఁడ. 81.

అ: అతనిన్ పాసి=ఆకృష్ణుని విడచి; ఒక్కింత ప్రొద్దు ఐనన్=కొద్దిసేపయినా; నిలువన్ చాలమియు =ఉండలేకపోవడం; మూలముగ=కారణముగా; విరసము+మాటలు= వ్యతిరిక్తమయిన మాటలు; ఆడన్ ఒల్లమిన్=ఆడుటకు ఇష్టంలేక; ఏమియున్ అనక=ఏమీ అనకుండా; అంతనుండి=అప్పటినుండి; ఒక నిశ్చయమ్ము పైన్=ఒక నిశ్చయంతో; ఉన్నవాఁడన్=ఉన్నాను.

భా: *కృష్ణుని విడిచి నేను కొద్దిసేపుకూడా ఉండలేను. అందుచేత అక్కడ విరసంగా మాట్లాడక ,అప్పటినుండి ఒక నిశ్చయానికి వచ్చాను.*

వ: **అది యెయ్యది యంటేని.** 82.

అ: ఏ+అది=ఎయ్యది; అంటి+ఏని= అంటేని

భా: *ఆ నిశ్చయం ఏమిటి అంటే.................(చెపుతున్నా)*

క: **మీరును వారును జేలమునఁ**
బోరెడు నెడ, నెద్ది యెట్లు వోయిన నెఱి నే
నూరక యుండుదుఁ దోడె
వ్వారికిఁ బో నింత నిక్కువం బెబ్భంగిన్. 83.

అ: మీరును;వారును;చేలమునన్=మాత్సర్యంతో/ పట్టుదలతో; పోరెడు-ఎడన్=పోరాడేటప్పుడు; ఎద్ది ఎట్లు పోయినన్=ఏది ఎట్లా పోయినా; నెఱిన్=పూర్తిగా; నేను; ఊరక ఉండుదున్; తోడు=సహాయం; ఎవ్వారికిన్=ఎవరికీ; పోను=వెళ్లను; ఏ+భంగిన్=ఏవిధంగానయినా; ఇంత నిక్కువంబు=ఇది అంతా సత్యం

భా: *మీరూ వారూ యుద్ధం చేసేటప్పుడు ఏది ఎట్లా అయినా నేను మాత్రం ఊరుకుంటాను. ఎవరికీ సహాయపడను. ఇది అన్ని విధాలా నిజం.*

వి: ఏది.ఎట్లాపోయినా అనేది చక్కని తెలుగు నుడికారం.

వ: **అనిన విని దుర్యోధనుండు దానికియ్యకొని సవినయంబుగా బలదేవుని వీడ్కొని, వాసుదేవు నామంత్రణంబు సేసి కృతవర్మపాలికిం జని, యాతఁ డొక్కయక్షౌహిణి తోడఁ దన్నుం గలయ వచ్చువాఁడయి యూఱడంబలికినఁ బ్రియం బంది, నిజపురంబున కరిగెఁ దదనంతరంబు కృష్ణుం డర్జునున కిట్లనియె.** 84.

అ: ఇయ్యకొని=అంగీకరించి;ఆమంత్రణంబు-చేసి=వీడ్కొని; ఊఱడం బలుకు=మనశ్శాంతి కల్గునట్లు మాట్లాడు; నిజపురము=తనపట్టణము.

భా: *ఆ మాటలు విని దుర్యోధనుడు సరే అని ఒప్పుకొని వినయంతో*

బలరాముని వీడ్కొని, తరువాత కృష్ణుని వీడ్కొని: కృతవర్మ దగ్గరకు వెళ్లాడు. అతడు 'ఒక అక్షౌహిణీ సైన్యంతో నిన్ను చేరుతాను' అని చెప్పాడు. దానికి దుర్యోధనుడు సంతోషించి హస్తినాపురానికి వెళ్లిపోయాడు. ఆ తరువాత కృష్ణుడు అర్జునునితో ఇలా అన్నాడు.

వి: **కృతవర్మ:** ఇతడు భోజదేశాధిపతి. హృదికుని తమ్ముడు. యుద్ధంలో చివరిదాకా ఉన్నాడు. దుర్యోధనుని పక్షంలో యుద్ధం చేశాడు.

క: **నారాయణ గోపాలుర**
భూరి పరాక్రములఁ గురువిభుఁడు గొన, సంగ్రా
మారంభరహితు నన్నుం
గోరి కొనుట నీకు మేలగునె? తలపోయన్. 85.

అ: భూరి పరాక్రములన్=ఎంతో పరాక్రమం కలవారిని; నారాయణ గోపాలురన్; కురువిభుఁడు కొనన్= దుర్యోధనుడు తీసుకొంటే; సంగ్రామ +ఆరంభ రహితున్=యుద్ధ ప్రయత్నంలేని వాడను; నన్నున్; కోరికొనుట; నీకున్; తలపోయన్ =ఊహించగా; మేలగునె?= శ్రేయస్కరమా?

భా: *మిక్కిలి పరాక్రమవంతులయిన నారాయణ గోపాలురు పదివేలమందిని దుర్యోధనుడు తీసికొంటే యుద్ధంచెయ్యని నన్ను నీవు కోరుకోవడం నీకు మేలు కలిగిస్తుందా?*

క: **అనుటయు నాతఁడు హరి కి**
ట్లను "నేను రణంబునకు సహాయం బొల్లన్
విను సుప్రసిద్ధుండవు నీ
వని సేసినఁ బేరు నీక యగు నెప్పాటన్. 86.

అ: అనుటయున్=అనగానే; ఆతఁడు=అర్జునుడు; హరికిన్=కృష్ణునికి; ఇట్లు అనున్; "నేను; రణంబునకున్=యుద్ధానికి; సహాయంబు; ఒల్లన్=కోరను; విను; సుప్రసిద్ధుడవు నీవు= మిక్కిలి ప్రసిద్ధి వహించిన వాడవు నీవు; అని చేసినన్=(నీవు) యుద్ధం చేస్తే; ఏ-పాటన్=ఏవిధంగా నయినా; పేరు నీకు-అ-అగున్=పేరు నీకే వస్తుంది.

భా: *వెంటనే అర్జునుడు కృష్ణునితో ఇలా అన్నాడు."యుద్ధానికి నేను సహాయం అడగను. నీవు ప్రసిద్ధుడవు కాబట్టి నీవు యుద్ధం చేస్తే పేరు నీకే వస్తుంది.*

వ: **నీ కెదురై జయంబు గొనరా; దట్లగుటంజేసి విజయ మూలంబగు నీ తోడును వలయు; నీవు సమరంబు సేయకునికియుం బ్రియంబు కావున నిన్నుం గోరికొంటి నని చెప్పి మరియు నిట్లనియె.** 87.

అ: ఎదురు-ఐ=ఎదురుగా;విజయమూలంబు=విజయానికి కారణము; వలయున్=కావాలి; సమరంబు=యుద్ధము; చేయకునికియున్=చేయకపోవడంకూడా;

భా: నీకెదురుగా నిలిచి జయం పొందలేము. అందుచేత విజయానికి కారణమయిన నీ సహాయం కూడా కావాలి నీవు యుద్ధం చేయక పోవడం కూడా నాకు ఇష్టమే. కాబట్టి నిన్ను కోరుకొన్నాను". అని ఇంకా ఇలా అన్నాడు.

వి: తోడు అంటే ప్రక్కన ఉండటం అని అర్థం

క: **సారథ్యం బొనరింపు మ**
పారకృపాలీల నెల్లభంగుల; నాకీ
గౌరవమును జిరకాలము
గోరినయది; దీని నిమ్ము గుణరత్న నిధీ! 88.

అ: గుణరత్ననిధీ!= సద్గుణాలనే రత్నాలకు నిధియైనవాడా; అపారకృపాలీలన్ =అంతులేని దయా విలాసంతో; ఎల్లభంగులన్= అన్ని విధాలా; సారథ్యంబు+ఒనరింపుము నాకు=నాకు సారథ్యం చెయ్యి; ఈ గౌరవమును=ఈగౌరవం కూడా; చిరకాలము కోరిన-అది=చాలాకాలం నుండి కోరినది; దీనిన్ ఇమ్ము.

భా: సద్గుణనిధీ! దయతో నాకు అన్నివిధాలుగా సారథ్యం చెయ్యి. ఈ గౌరవం నేను చాలాకాలం క్రిందటనే కోరాను. ఇపుడు దీన్ని ఇయ్యి. అనుగ్రహించు.

క: **అనినఁ గిరీటికి హరి యి**
ట్లను, "నీదగు కోర్కిదీర్చుటది నాకు వ్రతం
బనఘా! తగ సారథ్యం
బొనరించెద నీకు నసమయుద్ధక్రీడన్." 89.

అ: అనినన్;కిరీటికి=అర్జునునికి; హరి=కృష్ణుడు; ఇట్లు+అనున్; నీది+అగు కోర్కె=నీదయిన కోరిక; తీర్చుట+అది=తీర్చటం అనేది; నాకు వ్రతంబు; అనఘా!= పుణ్యాత్మా అసమ యుద్ధక్రీడన్=సాటిలేని రణ క్రీడలో; నీకున్; తగన్=తగినట్లు; సారథ్యంబు-ఒనరించెదన్=సారథికృత్యం నెరవేరుస్తాను.

భా: అపుడు అర్జునునితో కృష్ణుడు ఇలా అన్నాడు. పుణ్యాత్మా! నీకోరిక తీర్చడమే నా వ్రతం. యుద్ధక్రీడలో నీకు తగినట్లు నేను సారథ్యం చేస్తాను.

వి: అర్జునుడు ఎల్లభంగుల సారథ్యం బొనరింపుము అని కృష్ణుని అడిగాడు. కృష్ణుడు నీకు **తగినట్లు సారథ్యం చేస్తాను** అన్నాడు. సారథ్యం అన్న మాటలో ఎంత అర్థమయినా ఉంది. నీ రథాన్ని నడిపిస్తాను. నిన్ను నడిపిస్తాను అని కూడా అర్థం.

క: **అని యూఱడించి నరుఁదో**
డ్కొని ధర్మతనూజు నొద్దకుం బ్రియ మెసఁగం
జనుదెంచెం గార్యాలో
చనమును దగఁజేయు బుద్ధి శౌరి గడంకన్. 90.

అ: అని; ఊఱడించి=సమాధానపరచి; శౌరి=కృష్ణుడు; కార్య+ఆలోచనమును తగన్ చేయు బుద్ధిన్= ముందు చేయవలసిన కార్యాన్ని గూర్చి ఆలోచించే ఉద్దేశంతో ; కడంకన్ నరున్ తోడ్కొని=ఉత్సాహంతో అర్జునుని తీసుకొని; ప్రియము-ఎసఁగన్= (అర్జునునకు ధర్మరాజుకు) ప్రియం కలిగేటట్లు; ధర్మతనూజు నొద్దకున్; చనుదెంచెన్=వచ్చాడు.

భా: అని అర్జునుని ఒప్పించి కృష్ణుడు ముందు కర్తవ్యాన్ని గురించి ఆలోచించడానికి అర్జునునితోసహా ధర్మరాజు దగ్గరకు వచ్చాడు. ఆతనిరాక ధర్మజాదులకు ఎంతో ప్రీతి కలిగించింది. కృష్ణునికీ అది ప్రీతి కరమయింది.

వ: **అంత నట శల్యుపాలికిం బోయినదూత లతనింగని సముచితాలాపంబుల సమర సహాయత్వంబునకుఁగోరి పిలిచినం బ్రీతుండై యతండును బుత్త్రమిత్ర సమేతంబుగా నానాసేనాతిసంకులంబుగాఁ గదలి పాండవు లున్నయెడకు నిత్య ప్రయాణంబుల నడచు సమయంబున.** 91.

అ: సముచిత+ఆలాపంబులన్=తగిన మాటలతో; సమర సహాయత్వంబు నకున్ =యుద్ధంలో సహాయానికి; నానాసేనా-అతి సంకులంబుగాన్=అనేక విధాలయిన సేనలతో మిక్కిలి సంకీర్ణంగా; నిత్యప్రయాణంబులన్=నిత్యమూ చేసే ప్రయాణాలతో

భా: అక్కడ శల్యుని దగ్గరకు వెళ్లిన దూతలు అతనిని చూసి తగిన మాటలతో యుద్ధానికి సహాయ పడుమని ఆహ్వానిస్తే శల్యుడు ప్రీతిచెంది పుత్రులతో స్నేహితులతో నానావిధాలయిన సేనలతో బయలుదేరి పాండవులున్న చోటికి నిత్యప్రయాణాలు చేస్తూ నడచి వస్తున్న సమయంలో.

వి: రోజూ కొంతదూరం ప్రయాణంచేసి మంచి చోటుచూసుకొని రాత్రి ఒకచోట విడిదిచేస్తారు. మళ్లీ ఉదయమే బయలుదేరుతారు. ఇటువంటి ప్రయాణాలను నిత్యప్రయాణాలు అంటారు.

-: దుర్యోధనుడు శల్యసహాయంబు గోరుట:-
సం 5-8-6

తే: **ఇంతయును విని కౌరవాధీశ్వరుండు**
దక్షులగు నాప్తజనములఁ దత్క్షణంబ
మద్రనాథుని చనియెడు మార్గమునకుఁ
బుచ్చి, యెడనెడ నతుల విభూతి మెఱయ. 92.

అ: ఇంతయును విని=ఈ విషయం అంతా తెలుసుకొని; కౌరవ+ అధి.+ ఈశ్వరుండు = దుర్యోధనుడు; మద్రనాథుని చనియెడు మార్గమునకున్= శల్యుడు వెళ్లే మార్గానికి; దక్షులగు-ఆప్తజనములన్=సమర్థులయిన ఆప్తులను; తత్క్షణంబ=వెంటనే; పుచ్చి=పంపి; ఎడన్ ఎడన్=అక్కడక్కడ; అతుల విభూతి మెఱయన్=సాటిలేని ఐశ్వర్యం/వైభవం కనపడేటట్లు...

భా: శల్యుడు వస్తున్నట్లు తెలుసుకొని వెంటనే దుర్యోధనుడు శల్యుని మార్గానికి సమర్థులయిన ఆప్తులను పంపి అక్కడక్కడ వైభవం కన్పించేటట్లు (ఏర్పాట్లు చేశాడు)

వి: మద్రనాథుని చనియెడుమార్గమునకు=శల్యుని యొక్క వెళ్లే మార్గమునకు- అనగా శల్యుడు వెళ్లే మార్గమునకు అని అర్థం. ప్రాచీనకాలపు రచన అట్లా ఉండేది.

సీ: అరుదారు మేలుక ట్లాయితంబై చూడ
నొప్పారి తనుపగు చప్పరములుఁ
బరపైన చెలువంబు గరగరికయుఁదియ్య
తెలినీరుఁ గలిగిన దీర్ఘికలును
బొడవైన ముప్వంచఁ బొలుచునట్లుగ నేనుఁ
గులకు గుఱ్ఱములకుఁ గొట్టములును
ముందర బయలైన చందంబుఁ జతురాభి
మతమైన యాస్థాన మండపములు
ఆ: బియ్యములును నేయుఁబెరుగును గూర గా
యలును వంటకట్టియలును గడ్డి
కవణములును బెల్లుగా నొడఁగూర్చి ని
గూఢవృత్తిఁ దానుఁ గూడ నడచె. 93.

అ: అరుదారు= వింత అయిన; మేలుకట్లు=చాందినీలు (పందిరి అడుగు భాగమున కట్టిన స్వచ్ఛమయిన వస్త్రములు); ఆయితంబు-ఐ=సిద్ధమై; చూడన్-ఒప్పారి=చూచేందుకు అందంగా ఉండి; తనుపు-అగు=చల్లనయిన; చప్పర ములున్ =పందిళ్లను; పరపైన= విశాలమయిన; చెలువంబు=ఆకారమూ; గరగరి కయు = నిర్మలత్వము(స్వచ్ఛత); తియ్యతెలినీరున్=తియ్యని స్వచ్ఛమయిన నీరును; కలిగిన; దీర్ఘికలును=దిగుడు బావులును; పొడవు-ఐన; ముప్వంచన్=మూడు పంచల వసారాలతో; పొలుచునట్లుగన్=ఒప్పునట్లుగా; ఏనుఁగులకున్, గుఱ్ఱములకున్; కొట్టములును= విశ్రాంతిశాలలును; ముందర=ముందుభాగంలో; బయలు-ఐన చందంబు= ఆరు బయలుగా ఉన్న విధానమూ(ఆచ్ఛాదన లేకుండా); చతుర-అభిమతము-ఐన=గుండ్రంగా తీర్చి కోరిన ప్రమాణం కల; (నేర్పరులకు కూడ సమ్మతమయిన) ;ఆస్థాన మండపములు; బియ్యములును; నేయున్= నెయ్యి;పెరుగును; కూరగాయలును;వంట కట్టియలు =వంటకొరకు కట్టెలు పుల్లలు మొ॥; గడ్డి; కవణములును=దాణాలు- గుఱ్ఱము మొ॥వాని ఆహారము; పెల్లుగాన్=అధికంగా/ విరివిగా;

ఒడఁగూర్చి=సమకూర్చి; తానుకూడన్= దుర్యోధనుడు కూడా; నిగూఢవృత్తిన్=రహస్యంగా; నడచెన్=వెళ్లాడు.

భా: వింతవింతలయిన చాందినీలతో అందంగా కనువిందుగూర్చే చల్లని పందిళ్లు; నిర్మలమయిన నీరుకల విశాలమయిన దిగుడు బావులూ; మూడు ప్రక్కల వసారాలుకల పొడవయిన ఏనుగుల గుఱ్ఱాల శాలలూ; ముందుభాగాన విశాలమయిన ప్రదేశం కల (కొలువుకు అనుకూలమయిన) ఆస్థానమండపాలూ; నెయ్యి ,బియ్యం ,పెరుగు ,కూరగాయలు ,వంటచెఱకు గడ్డి ,దాణాలు మొదలయిన వన్నీ విరివిగా సమకూర్చి రహస్యంగా ఎవరికీ తెలియకుండా దుర్యోధనుడు కూడా వెళ్లాడు.

వి: ప్రయాణాలతో అలసిపోయినవారికి చల్లని పందిళ్లు విశ్రాంతి నిస్తాయి. అట్లే దిగుడు బావులు స్వచ్ఛమయిన తియ్యని నీటితో ఉంటే వాటిలో నీరు దిగి ముంచుకోవచ్చు. ఏనుగులకు, గుఱ్ఱాలకూ సాలలుంటే అవి విశ్రాంతి తీసుకుంటే మరుసటి రోజు చక్కగా ప్రయాణిస్తాయి. విడిది చేసినపుడు రాజులు ఆరుబయట కొలువు తీరుతారు. అపుడు సైన్యమంతా ఆరుబయట నిలుస్తుంది. రాజులు మండపాల మీద కూర్చుంటారు. దానికి తగినట్లు (అర్ధచంద్రాకార) ఆస్థానమండపాలు కట్టిస్తారు. అంటే వారికి, వారి వాహనాలకూ అవసరమయిన సంభారములు సామగ్రి అంతా సమకూర్చాడు! వారు కష్టపడ నక్కరలేకుండా.

వ: ఇవ్విధంబున విడిదల పయనంపు సంపదలు పొంపిరివోవం దనకు సమకట్టిన సమస్త వస్తువుల యవైకల్యంబునకు శల్యుండు సంతుష్టాంతరంగుండై, నిజపరిజనంబులం జూచి, యిట్లు చతురంబుగా మనకు వలయు వాని సంపాదించుటకుఁ బ్రవర్తకులైన యుధిష్ఠిరామాత్యులెవ్వారు? వారలం దోడ్కొని రండు, వారలు ప్రసాదదానంబున కర్హు, లని పలుకునవసరంబున, నటమున్న పలుదెఱంగులఁ బనులు సేయుచున్న తన పల్లాయనంబు వారిలోఁ గలసి మరువడియున్న కౌరవేశ్వరుం డమ్మాటలు విని;" యతనికిఁ బొడసూప నిదియ సమయం" బని సముచిత ప్రకారంబునఁ దన్నెఱింగించుకొని, వినయంబునఁ గనిన, నతండును సంభ్రమంబునం గాఢాలింగనంబు సేసి, కనకాసనంబున నునిచి, యింతయు నిమ్మహాత్ము నుద్యోగంబున నయ్యెం గావలయునని తలంచి, విస్మయుం బంది," నీకెయ్యది యిష్టంబు గోరు మిచ్చెద " ననిన గాంధారీనందనుండు పరమానందంబునం బొంది యిట్లనియె. 94.

అ: విడిదల- పయనము-సంపదలు= విడిదిలలోనూ, ప్రయాణాలలోను అవసరమయిన సంపదలు– సామగ్రి; పొంపిరివోవన్=వెల్లివిరిసేటట్లు; సమకట్టిన=సమకూర్చిన; అవైకల్యము=చక్కని ఏర్పాటు (తీర్చిదిద్ది ఉండటం); సంతుష్ట+అంతరంగుఁడు=సంతోషించిన మనసుకలవాడు; నిజపరిజనములు =తనసేవకులు; చతురంబుగాన్=నేర్పుగా/ నిపుణంగా; ప్రవర్తకులు=కారకులు, (నడపువారు); యుధిష్ఠిర+అమాత్యులు=ధర్మరాజు యొక్క మంత్రులు;ప్రసాద దానంబునకున్=అనుగ్రహించేందుకు; పలుకు-అవసరంబునన్= పలికేసమయంలో; అటమున్న=అంతకుముందే; పల్లాయనంబువారు=సేవకులు;

మరువడియున్న= దాగియున్న; పొడసూపన్=కనిపించటానికి; ఇదియ=ఇదే; సముచిత ప్రకారంబునన్=తగిన రీతిలో; గాఢ+ఆలింగనంబు=బిగికౌగిలి; కనక+ఆసనంబు=బంగారు ఆసనం; ఉద్యోగంబునన్=ప్రయత్నంచేత; అయ్యెన్ కావలయు=అయింది కాబోలు; గాంధారీ నందనుండు = గాంధారీదేవి యొక్క కొడుకు దుర్యోధనుడు.

భా: ఇలా విడుదలలో ప్రయాణసంభారాలు వెల్లివిరిసేటట్లు తనకు చేకూర్చిన పదార్థాలను చూసి శల్యుడు సంతోషించి తన పరిచారకులను చూసి "ఇలా నేర్పుగా మనకు కావలసిన వానిని సంపాదించే ధర్మజుని మంత్రులెవరు? వారిని తీసుకురండి వారు మన అనుగ్రహానికి అర్హులు" అని చెప్పేటప్పుడు, అంతకుముందే వారి సేవకులలో దాగియున్న దుర్యోధనుడు ఆ మాటలు విని తగిన రీతిలో అతనిని తెలియపరచుకొని దర్శనం చేశాడు. శల్యుడు దుర్యోధనుని గాఢంగా కౌగిలించుకొని బంగారు ఆసనమిచ్చాడు. ఈ ఏర్పాట్లన్నీ ఇతని వల్లనే జరిగాయి అనుకొని "నీకేం కావాలో కోరుకో, ఇస్తాను" అన్నాడు. వెంటనే దుర్యోధనుడు పరమానందంతో ఇలా అన్నాడు.

క: **సత్య సరస్వతి వగు; మౌ**
చిత్యవిశారదము నీదు చిత్తము; నియమౌ
దాత్త్యంబు మెఱయ, నాకు న
మాత్యుఁడవై పూని నడుపు మత్సైన్యంబున్. 95.

అ: (నీవు) సత్య సరస్వతివి అగుము=సత్యవాక్కులు కలవాడవు కమ్ము; నీదు చిత్తము=నీమనస్సు; ఔచిత్య విశారదము=ఔచిత్యంతో ప్రసిద్ధి చెందినది; నియమ+ఔదాత్త్యంబు మెఱయన్=నియమం మీది ఉదాత్తతతో (సత్యవ్రతం మీది గొప్పదనంతో); నాకున్; అమాత్యుఁడవు +ఐ=మంత్రివై; మత్-సైన్యంబున్=నా సైన్యాన్ని; పూని=వహించి; నడుపు=నడిపించుము.

భా: నీవు సత్యవాగ్మివి కమ్ము. నీ మనస్సు ఔచిత్యంతో ప్రశస్తి కెక్కినది. సత్యవ్రత నియమంతో నాకు మంత్రివై నా సేనను నడిపించుము.

వి: **నీకేం కావాలో కోరుకో ఇస్తాను** అని వాగ్దానం చేశాడు శల్యుడు. దుర్యోధనుడు వెంటనే మాట నిలుపుకో అని తన కోరిక చెపుతున్నాడు. ముందు నేర్పుతో వాగ్దానం చేయించుకొని తరువాత కోరిక ప్రకటించడం మోసానికి ప్రథమసోపానం.

ఆ: **తలఁపఁ బాండవులును ధార్తరాష్ట్రులు నీకు**
నొక్కరూప భక్తియుక్తిఁ ; జాల
నీవు నన్ను మాననీయుండు గాఁగ న
నుగ్రహించి తగఁ బరిగ్రహింపు. 96.

అ: తలఁపన్= భావించిచూస్తే; పాండవులును; ధార్తరాష్ట్రులు=ధృతరాష్ట్రుని

కుమారులయిన కౌరవులును; నీకున్;(శల్యునకు) ; భక్తియుక్తిన్=భక్తి కలిగి యుండడంలో; ఒక్కరూప-సమానమే; నీవు; నన్నున్; మాననీయుండుకాఁగన్= గౌరవింపదగిన వాడుగా; చాలన్=మిక్కిలి;అనుగ్రహించి; తగన్ తగునట్లు; పరిగ్రహించు=స్వీకరించుము.

భా: పాండవులూ ,కౌరవులూ నీకు సమానులే. అందులో నన్ను గౌరవింపదగినవానిగా నీవు అనుగ్రహించి నన్ను స్వీకరించుము.

చ: **అనవుడు శల్యుఁ డియ్యకొని యట్టిదకాదె! విభేదవృత్తి నా**
మనమున లేదు, పాండవసమాజము మీరును నొక్కరూప, కా
వున నిది లెస్సమాట, దగవుం దలపోయఁగ మున్ను ప్రీతిఁ గాం
చిన నిను నెమ్మిఁ గూడుటయ, చేయుదు నిట్టుల యెల్లభంగులన్.97

అ: అనవుడు=అనగానే; శల్యుఁడు; ఇయ్యకొని=ఒప్పుకొని; అట్టిదకాదె=అలాగే కదా!; విభేదవృత్తి=మీ యిరువురిపై భేదభావం; నా మనమునన్;లేదు; పాండవ సమాజము=పాండవుల సమూహము; మీరును; ఒక్కరూప=సమానమే; కావునన్, ఇది, లెస్సమాట=మంచిమాట; తలపోయఁగన్=ఆలోచిస్తే; మున్ను=ముందుగా; ప్రీతిన్ =సంతోషంతో; కాంచిన=దర్శించిన; నినున్; నెమ్మిన్=అనురాగంతో; కూడుటయు =కలియడమే; తగవు=న్యాయం; ఎల్లభంగులన్=అన్నివిధాలా; ఇట్టుల=ఇట్లే; చేయుదున్ =చేస్తాను.

భా: అపుడు శల్యుడంగీకరించి"అంతేకదా! మీ పై భేదభావం నా మనస్సులో లేదు. పాండవులూ ,మీరూ నాకు సమానులే. కాబట్టి ఇది సరైన మాట. ఇంకా ఆలోచిస్తే ముందుగా దర్శించిన నిన్ను కలియడమే న్యాయం. సరే! అన్ని విధాలా ఇలాగే చేస్తాను.

ఉ **దానఁగొఱంత లే, దభిమతం బిది గాకయుఁ గల్గెనేనియుం**
బూని యొనర్తు; నన్నఁ గురుపుంగవుఁ డెంతయుఁ బొంగి "నీవు స
మ్మానము సేసి, నాకిటు లమాత్యుఁడవైన పదంబుకంటె మే
లై నుతి కెక్కు కోర్కి యెటు లారసి చూచిన నొండు గల్గునే" 98

అ: దానన్=అందులో; కొఱంత లేదు=లోటు లేదు; అభిమతంబు= నీ యిష్టం; ఇది కాకయున్ కల్గెనేనియున్=ఇది కాకుండా మరొక్కటి కల్గినా; పూని-ఒనర్తు=శ్రద్ధ వహించి చేస్తాను; అన్నన్=అని పలికితే; కురుపుంగవుఁడు=దుర్యోధనుడు; ఎంతయున్-పొంగి=ఎంతో పొంగిపోయి; నీవు; సమ్మానము-చేసి=గౌరవించి; నాకున్; ఇటులు=ఈవిధంగా; అమాత్యుడవు ఐన = మంత్రివయిన; పదంబుకంటె=ఇటువంటి అదృష్టంకంటె; మేలై=గొప్పదై; నుతికెక్కు=ప్రశంసింపబడే; కోర్కి=కోరిక; ఎటులు-ఆరసి చూచినన్=ఎట్లా ఆలోచించి చూసినా; ఒండు కల్గునే=మరొకటి ఉంటుందా?

భా: దానికేమీ కొరత లేదు; ఇదికాక ఇంకా మరొకకోరిక ఉన్నా చెప్పు చేస్తాను అన్నాడు శల్యుడు. ఆ మాటకు దుర్యోధనుడు పొంగిపోయి "నీవు ఇట్లా నాకు మంత్రి

వవడం కంటె ప్రశస్తమయిన కోరిక ఎంత ఆలోచిస్తే మాత్రం మరొకటి ఉంటుందా? అన్నాడు.

వ: **అనిన విని వికచవదనుండగుచు మద్రేశ్వరుండు.** 99.

అ: వికచ వదనుండు= వికసించిన ముఖం కలవాడు; మద్ర - ఈశ్వరుడు = మద్రదేశపురాజు (శల్యుడు)

భా: *ఆ మాటలు విని విప్పారిన ముఖంతో శల్యుడు(ఇలా అంటున్నాడు).*

క: **"చను నీవు హస్తి నగరం**
బున; కేనును బాండు భూపపుత్రులఁ బ్రీతిం
గని, యట వత్తు; నవశ్యం
బును వారలఁ జూడవలయుఁ బోయెద;" ననినన్. 100.

అ: నీవు; హస్తినగరంబునకున్; చను=వెళ్లుము; ఏనును=నేనుకూడా; పాండు భూప పుత్రులన్=పాండురాజు కుమారులయిన పాండవులను; ప్రీతిన్ కని=ప్రీతితో చూసి; అట వత్తున్ =హస్తినకు వస్తాను; వారలన్=ఆ పాండవులను;అవశ్యంబును=తప్పక; చూడవలయున్=చూడాలి; పోయెదన్=వెళ్లివస్తా';' అనినన్= అనగానే.

భా: *" నీవు హస్తినాపురానికి వెళ్లు-నేను పాండవులను చూసి వస్తాను. పాండవులను తప్పక చూడవలసి ఉంది. వెళ్లివస్తాను" అనగానే (దుర్యోధనుడు ఇలా అంటున్నాడు).*

ఆ: **"అట్లకాక వేగ మటవోయి మరలుండు,**
వరము మఱవకుండవలయు, మిమ్ము
జేరి నెగడు వాఁడఁ, గారుణ్యమున నిట
యరసి యుండుఁ" డనియెఁ గురువిభుండు. 101.

అ: అట్లకాక=అట్లేకాని;వేగము-అటపోయి=వేగంగాఅక్కడకువెళ్లి; మరలుండు= తిరిగిరండి; వరము = నాకిచ్చిన వరమును; మరవకుండ వలయున్= మరవకూడదు సుమా!;మిమ్ముచేరి=మిమ్మల్నిఆశ్రయించి;నెగడువాఁడన్=వృద్ధి పొందువాడను; కారుణ్యమునన్= దయతో; ఇట అరసియుండుడు=ఇటువైపు కటాక్షించి ఉండండి; అనియెన్; కురువిభుండు.

భా: *"అలాగే! వేగంగా వెళ్లి తిరిగిరండి, నాకిచ్చిన వరం మాట మరచిపోకండి. మిమ్ము ఆశ్రయించి బ్రతుకు వాడను. దయతో ఇటు కటాక్షించి ఉండండి" అన్నాడు దుర్యోధనుడు.*

వ: **అనవుడు.** 102.

భా: అనగానే

క: దరహాసముతో మద్రే
శ్వరుఁ డాలింగనము సేసి "సందియపడ కీ
వరుగు" మని యనుప నాతఁడు
కరిపురికిం జనియె మది వికాసముఁ బొందన్. 103.

అ: మద్ర+ఈశ్వరుఁడు=మద్రదేశపు రాజయిన శల్యుడు; దరహాసముతో =చిరునవ్వు నవ్వుతూ; ఆలింగనము-చేసి=దుర్యోధనుని కౌగిలించి; సందియ పడక= సందేహించక; ఈవు=నీవు; అరుగుము=వెళ్లు; అని అనుపన్=అని సాగనంపగా; ఆతఁడు=దుర్యోధనుడు; మది వికాసమున్ పొందన్= మనోవికాసంతో: కరిపురికిన్ చనియెన్=హస్తినకు వెళ్లాడు.

భా: చిరునవ్వుతో శల్యుడు దుర్యోధనుని కౌగలించుకొని "సందేహపడకు. నీవు వెళ్లు" అని సాగనంపాడు. అపుడు దుర్యోధనుడు మనోవికాసంతో హస్తినాపురానికి వెళ్లాడు.

-: *శల్యుఁడు పాండవులఁ జూడ నుపప్లావ్యంబునకు వచ్చుట*:-
సం. 5-8-15

వ: **అంత శల్యుండు నుపప్లావ్యంబునకుం జని, స్కంధావారంబు దఱియం జొచ్చి, ధర్మనందను నివాసంబున కరిగిన నతండు దమ్ములుం దానును ద్రౌపదీ సుభద్రలు నభిమన్యు ప్రభృతి పుత్రవర్గంబును నెదురువచ్చి కృతప్రణాములై తోడ్కొనిపోయి కాంచనాసనంబున నునిచి యర్ఘ్యపాద్యంబు లిచ్చి కుశలం బడిగిన సర్వంబును గుశల సంపన్నంబ యని వారల నందఱ నభినందించి యుధిష్ఠిరుం బునరాలింగనంబు సేసి యిట్లనియె.** 104.

అ: స్కంధా వారంబు=సేనా శిబిరము; తఱియన్ చొచ్చి=ప్రవేశించి; పుత్ర వర్గంబు= పుత్రుల సముదాయము; కృతప్రణాములు=చేయబడిన నమస్కారములు కలవారు (అనగా నమస్కరించిన వారు) కాంచన+ఆసనము=బంగారు ఆసనము; ఉనిచి=కూర్చుండబెట్టి; అర్ఘ్యపాద్యంబులు=అర్ఘ్యము ,పాద్యము; పునః-ఆలింగనంబుచేసి=మరల కౌగిలించి

భా: అపుడు శల్యుడు ఉపప్లావ్యానికి వెళ్లి సేనాశిబిరం ప్రవేశించి ధర్మరాజు నివాసానికి వెళ్లాడు. వెంటనే ధర్మరాజు ,తమ్ములూ ,ద్రౌపదీ సుభద్రలు ,అభిమన్యుడు మొ॥ కుమారులు ఎదురు వచ్చి నమస్కరించి శల్యుని తీసుకువెళ్లి బంగారు సింహాసనం మీదకూర్చుండబెట్టి అర్ఘ్య పాద్యాలు ఇచ్చి కుశలం అడిగారు. శల్యుడు ***అంతా కుశలమే*** అని వారి నభినందించి ధర్మరాజును మళ్లీ కౌగిలించుకొని ఇలా అన్నాడు.

క: **జనరహితం బగువనమున**
ననుజన్ములు ద్రుపద భూవరాత్మజయును నీ
వును నింతకాల మలయక
యునికి కడున్ దుష్కరము మహోదాత్తమతీ! 105.

అ: మహా+ఉదాత్తమతీ=ఎంతో ఉన్నతమయిన మనస్సుకలధర్మజా! ;జనరహితంబు -అగు=జనసంచారంలేని ; వనమునన్=అడవిలో; అనుజన్ములు= తమ్ములు; ద్రుపదభూవర-ఆత్మజయును=ద్రుపద మహారాజు కూతురయిన ద్రౌపదియు; నీవును; ఇంతకాలము=ఇన్నేళ్లు; అలయక-ఉనికి=ఏ కష్టము పొందకుండా ఉండటం; కడున్ దుష్కరము=చాలా కష్టమయిన పని.

భా: *ధర్మరాజా! నిర్జనమయిన అరణ్యంలో తమ్ములూ ద్రౌపదీ నీవూ ఇంతకాలం ఏ కష్టమూలేకుండా ప్రవర్తించడం నిజంగా చాలా కష్టమయిన కృత్యం.*

ఆ: **దానికంటె నరిది దలపోయ నజ్ఞాత**
వాస ముజ్జ్వలాంగ భాసమాను
లైన మీకు; మీ దయాసూనృతాదుల
పెంపు మిమ్ముఁ గడవఁ బెట్టకున్నె. 106.

అ: తలపోయన్=ఆలోచిస్తే; దానికంటెన్=ఆ అరణ్యవాసంకంటె; అజ్ఞాతవాసం; ఉజ్జ్వల+అంగ భాసమానులైన మీకు=కాంతివంతమయిన శరీరంతో భాసించేమీకు; అరిది=చాలా కష్టమయిన పని; మీ దయా సూనృతాదుల పెంపు=మీ దయా సత్యాదుల అతిశయం; మిమ్మున్; కడవన్ పెట్టక-ఉన్నె=గట్టెక్కింపకుండా ఉంటుందా.

భా: *అరణ్యవాసం కంటె కష్టమయింది అజ్ఞాతవాసం. ఉజ్జ్వలమయిన శరీరశోభలుకల మీకు మరీ కష్టం. అయినా మీ దయాసత్యాలు మిమ్మల్ని గట్టెక్కించకుండా ఉంటాయా. అవే మిమ్మల్ని రక్షించాయి.*

వి: పాండవులు ఉజ్జ్వలమయిన ఆకారం కలవారు అనగా స్ఫురద్రూపులు. ప్రసిద్ధులు. అటువంటివారు ఇతరులకు తెలియకుండా అజ్ఞాతంగా సంవత్సరంపాటు ఉండటం చాలా కష్టం- అని భావం.

క: **ఇమ్మహి యెల్లను నీ మది**
యుమ్మలికకుఁ జాల నొచ్చె; నుర్వీవర! నీ
విమ్మెయి నిప్పు డఖిలదురి
తమ్ములుఁ గడచుటకు సమ్మదమ్మునఁ బొదలెన్. 107.

అ: ఉర్వీవర!=రాజా!; నీమది ఉమ్మలికకున్=నీమనసులోని వ్యథకు; ఈ+మహి

ఎల్లను; ఈ ప్రపంచం అంతా; చాల నొచ్చెన్= ఎంతో దుఃఖించింది; నీవు;ఇప్పుడు; ఇమ్మెయిన్=ఈ విధంగా;అఖిలదురితమ్ములున్=అన్ని కష్టాలూ; కడచుటకున్=దాటి నందుకు; సమ్మదమ్మునన్ పొదలెన్=సంతోషంతో నిండిపోయింది.

భా: *ధర్మజా! నీ కష్టానికి ప్రపంచం అంతా ఎంతో విలపించింది. నొచ్చుకొంది. ఇపుడు నీవు మళ్లీ కష్టాలన్నీ దాటినందుకు సంతోషిస్తోంది.*

వ: **అని యుచిత సంభాషణంబులు సేసి, దుర్యోధనుండు దన్నుం గొంచిన విధంబును, నతండు ప్రార్థించిన తెఱంగును, దానికిఁదా నియ్యకొనుటయుం; జెప్పిన, ధర్మనందనుం డతని కిట్లనియె.** 108.

అ: ఇయ్యకొనుట=అంగీకరించుట.

భా: *అని తగినట్లు మాట్లాడి; దుర్యోధనుడు తనను (శల్యుని) దర్శించిన తీరూ, అతడు ప్రార్థించినతీరూ, దానికి తాను అంగీకరించడమూ చెపితే ధర్మరాజు అతనికి ఇలా అన్నాడు.*

తే: **మేలు సేసితి, రొక్కరి మెచ్చి వారి**
కోర్కి దీర్చుట పెద్దల గుణమ కాదె!
యది మదీయ చిత్తమునకు హర్ష కరమ,
తివిరి యొక్కటి వేఁడెద నవధరింపు. 109.

అ: మేలు-చేసితిరి=మంచిపని చేశారు; ఒక్కరికి మెచ్చి=ఒకరిని మెచ్చుకొని; వారి,కోర్కి, తీర్చుట; పెద్దల గుణము+ అ కాదె!=పెద్దవారి సద్గుణమేకదా!; అది; మదీయ చిత్తమునకున్=నా మనస్సుకు; హర్షకరమ=సంతోషదాయకమే; తివిరి=కుతూహలపడి; ఒక్కటి వేడెదన్=ఒక్కకోరిక కోరుతాను; అవధరింపు=వినుము.

భా: *చాలా మంచిపని చేశారు. ఎవరినయినా మెచ్చుకొని వారి కోరిక తీర్చడం ఉన్నతులయిన వారి సద్గుణం; అలా మీరు చేయడం నాకు సంతోషకరమే. కాని కుతూహలంతో నేను ఒక్కటి అడుగుతాను వినండి.*

వ: **పార్థునకుఁ గృష్ణుండు సారథ్యంబు సేయువాఁడై యున్నవాఁడు, కర్ణుండు పార్థుతో నెప్పుడు మచ్చరించుచునుండు, వీరిరువురకు సంగ్రామంబైన యప్పుడు కృష్ణునకుఁ బ్రతిసారథ్యం బొనరింప మీరకాని యక్కడం దక్కొరుండు లేఁడు, గావున నవశ్యంబును మీకుం గర్ణసారథ్యంబు గర్తవ్యంబు గాఁగలయది, సమరసమయంబున నిరాకరించి పలికి కర్ణు చిత్తంబునకుం గలంక పుట్టించి, పార్థు రక్షింపవలయు, నకృత్యంబని యనుమానింపక మత్ప్రార్థనంబున నెల్లభంగుల నివ్విధం బనుష్ఠింప వలయు, నని యభ్యర్థించిన సమ్మతించిశల్యుండిట్లనియె.** 110.

అ: పార్థునకున్=అర్జునునకు; మచ్చరించు= అసూయపడు; సంగ్రామము= యుద్ధము; ప్రతిసారథ్యము=ఎదుటసారథ్యం చేయటం; మీరకాని=మీరేకాని; తక్కొరుండు = మరొకడు; అవశ్యంబును=తప్పక; కర్తవ్యంబు కాఁగలయది=చేయదగినపని అవుతుంది; కలంక =కలత; అకృత్యంబు=చేయరాని పని; మత్+ప్రార్థనంబునన్=నా ప్రార్థనచేత; ఎల్లభంగులన్=అన్ని విధాలా; అనుష్ఠింప వలయున్= ఆచరించాలి; అభ్యర్థించినన్=ప్రార్థిస్తే; సమ్మతించి=అంగీకరించి;

భా: అర్జునునకు కృష్ణుడు సారథ్యం చేస్తాడు. కర్ణుడు అర్జునునితో ఎప్పుడూ అసూయపడుతూ ఉంటాడు. వీరిద్దరికీ యుద్ధం జరిగినప్పుడు కృష్ణుడికి ఎదుట సారథ్యం చేయటానికి మీరు తప్ప ఆ పక్షాన మరొకడు లేడు. అందుచేత తప్పక మీరు కర్ణునికి సారథ్యం చేయవలసి వస్తుంది. యుద్ధసమయంలో కర్ణుని నిరాకరించి మాట్లాడి అతని మనస్సునకు కలత పుట్టించి అర్జునుని రక్షించాలి. అకార్యం అని అనుమానించకుండా నా ప్రార్థన మన్నించి అన్ని విధాలా ఈ పని మీరు చేయాలి' అని ప్రార్థించాడు. దానికి శల్యుడు సమ్మతించి ఇలా అన్నాడు.

వి: ఇట్లా ధర్మరాజు అడగటం అకార్యం- ఆవిషయం ధర్మరాజుకూ తెలుసు. ఇది ధర్మరాజు పాత్రకు తగినదేనా? అనే ప్రశ్న ఉదయిస్తుంది కొంతమంది పాఠకులకు.

ఇందులో కొంత కౌటిల్యం కనిపిస్తుంది. నిజమే. కాని ఒక రాజనీతి కూడా ఇందులో ఉంది. తనకు సాయపడటానికి వస్తున్న శల్యుని మోసగించి దుర్యోధనుడు తన పక్షానికి త్రిప్పుకొన్నాడు. మాయావి అయిన వాని పట్ల మాయావి గానే ప్రవర్తించాలి. దుర్యోధనుడు మాయచేసి శల్యుని శరీరాన్ని వశపరచుకొంటే ధర్మరాజు శల్యుని మనసును వశపరచుకొన్నాడు

క: అగు నిది వోలును, నాకుం,
దగ వట్టిద; కర్ణునకు రథంబు గడప నీ
వగుదని కోరిన కౌరవ
జగతీశ్వరు ప్రార్థనంబుఁ జలుపఁగ వలయున్. **111.**

అ: అగును=అవును;ఇది,పోలును నాకున్=నాకిది తగును; తగవు-అట్టిద =న్యాయంకూడా అదే; కర్ణునకున్; రథంబు గడపన్=రథం నడపటానికి ; నీవు; అగుదువు అని=ఉండాలి అని; కోరిన కౌరవజగతీశ్వరు ప్రార్థనంబు=కోరిన. దుర్యోధనుని ప్రార్థన; చలుపఁగన్ వలయున్=మన్నించి ఆచరించాలి.

భా: అవును నిజమే. ఇది నాకు తగినదే. న్యాయం కూడా అదే! కర్ణునకు నీవు రథం తోలాలి అని దుర్యోధనుడు కోరిన ప్రార్థనను మన్నించవలసినదే.

క: కర్ణుని సారథి నైనను
నిర్ణయమున కేను బార్థునిం గాచెద; నా
దుర్ణయ విచారు నెమ్మెయిఁ
గర్ణ కఠోరంబులాడి కలఁతుం బోరన్. **112.**

అ: కర్ణుని, సారథిని-ఐనను=కర్ణుని సారథిని అయినా; నేను; నిర్ణయమునకున్=నిశ్చయానికి/ నిశ్చయంగా; పార్థునిన్=అర్జునుని; కాచెదన్=రక్షిస్తాను; ఏ+మెయిన్=ఏవిధంగానయినా; కర్ణకఠోరంబులు ఆడి=నిష్ఠురంగా మాట్లాడి; ఆ దుర్ణయ విచారున్=పాపపు ఆలోచన కల ఆ కర్ణుని; పోరన్=యుద్ధంలో; కలఁతున్=కలత చెందిస్తాను.

భా: *కర్ణుని సారథినయినా నేను నిశ్చయంగా పార్థుని రక్షిస్తాను. పాపాత్ముడయిన ఆ కర్ణుని నిష్ఠురోక్తులతో యుద్ధంలో కలత పరుస్తాను.*

తే: దర్పమును దేజమును మాయఁదలరఁ బలికి
చిక్కువఱచిన, నేయంగఁ జేతులాడ
కునికి; రాధాతనూజు నర్జునుఁడు దీవ్ర
బహుళ బాణ పరంపర పాలు పఱచు. 113.

అ: దర్పమును= గర్వమూ; తేజమును=పరాక్రమమూ; మాయన్ =నశించేటట్లు; తలరన్ పలికి=భయపడేటట్లు మాట్లాడి; చిక్కు-పఱచినన్= బాధిస్తే; ఏయ ంగన్ =కొట్టటానికి బాణాలు వేయడానికి; చేతులు; ఆడక+ఉనికి=ఆడకపోవడంచేత; రాధాతనూజున్=కర్ణుని; అర్జునుఁడు; తీవ్ర బహుళ బాణ పరంపర పాలు పఱచు =తీవ్రమయిన ఎన్నో బాణసమూహాలకు గురి చేస్తాడు.

భా: *గర్వ పరాక్రమాలు తొలగిపోయేటట్లు, భయపడేటట్లు మాట్లాడి కలత పరిస్తే కొట్టటానికి కర్ణుని చేతులు స్తంభించి పోతాయి. అపుడు అర్జునుడు కర్ణుని తన బాణాలకు గురిచేస్తాడు.*

చ: ఇది యొకఁ డేల నీవు మది నెయ్యది గోరినఁ జేయు వాఁడ,నాఁ
డదయత సూతసూతి సభ నాడిన మాటకుఁ జాల నొచ్చి మా
హృదయములెల్ల నీవలన నెంతయుఁ బక్షము సేయు; నక్కటా!
యదియును గాక మీ పడిన యాపద లెవ్వరి నొవ్వఁజేయవే! 114.

అ: ఇది ఒకఁడు ఏల?= ఇది ఒకటే ఏమిటి?; నీవు; మదిన్=మనస్సులో; ఎయ్యది కోరినన్=ఏది కోరినా; చేయు వాఁడన్=చేస్తాను; నాఁడు=ఆరోజున (ద్యూత సభలో ద్రౌపదీ వస్త్రాపహరణం రోజున) సూత సూతి=కర్ణుడు; అదయతన్= దయలేకుండా; సభన్=సభలో; ఆడిన మాటకున్=మాట్లాడిన చెడ్డమాటకు; చాల నొచ్చి=చాలా బాధపడి; మా హృదయములు ఎల్లన్=మా మనస్సులన్నీ; నీవలనన్=నీవైపు; ఎంతయున్=మిక్కిలి; పక్షము చేయున్=మొగ్గు చూపుతున్నాయి; అక్కటా!=అయ్యో! ;అదియును గాక; మీ పడిన యాపదలు= మీరు పడ్డ కష్టాలు; ఎవ్వరిన్=ఎవరినైనా; నొవ్వన్ చేయవే!=నొచ్చుకొనేటట్లు చేయకుండా ఉంటాయా?

భా: *ఈ పని ఒకటే ఏమిటి? నీవు కోరినది ఏదయినా చేస్తాను;.ఆద్యూత సభలో నిర్దయుడై మాట్లాడిన కర్ణుని మాటకు మా మనస్సులు చాలా నొచ్చుకున్నాయి. అందుచేత*

ఎక్కువగా నీ వైపే మొగ్గుతున్నాయి. అదీగాక ధర్మజా! మీరు పడిన కష్టాలు ఎవరిని నొప్పించకుండా ఉంటాయి? అందరికీ బాధాకరములే అవుతాయి. ఆ సానుభూతియే కారణమని భావము.

వి: ద్రౌపదిని సభలోకి తీసుకువచ్చినపుడు దుర్యోధనుని తమ్ముడు వికర్ణుడు ఇది అధర్మం అని వాదించాడు. ద్రౌపది 'ధర్మ విజిత' కాదు అన్నాడు. 'ఏకవస్త్ర అయిన ఈమెను ఇక్కడకు తీసుకురావటం అన్యాయం' అన్నాడు.

అపుడు కర్ణుడు వానిని వారించాడు. పైగా ఇలా అన్నాడు "భార్యకు దైవవిహితుండయిన భర్త యొక్కరుండ. ఇది యనేక భర్తృక కావున బంధకి యనంబడు నిట్టిదాని విగతవస్త్రం జేసి తెచ్చినను ధర్మవిరోధంబు లేదు" అన్నాడు.

ఈ మాటలే దుర్యోధనునికి ఆలోచన నిచ్చాయి. వెంటనే దుర్యోధనుడు దుశ్శాసనుని పిలిచి పాండవుల వస్త్రాలూ, ద్రౌపది వస్త్రమూ అపహరించమని ఆజ్ఞాపించాడు.

ఇట్లా ద్రౌపదీ వస్త్రాపహరణానికి కర్ణుడు ప్రేరకు డయ్యాడు.

ఈ కర్ణుని మాటలు ప్రజలకు బాధాకరములయ్యాయి. చూ. 2-2-229 (ఆం.మ.భా)

ఆ: ఇట్లు పడితి ననుచు నెద నీవు వగవకు,
గారవమున నీ మనోరథమ్ము
ఫలము నొందు నెల్లభంగుల; దేవత
లయినఁ బడుదురొక్క యవసరమున. 115.

అ: ఇట్లు+పడితిన్-అనుచున్=ఇట్లా కష్టాలు పడ్డాననుకొని; ఎదన్=మనసులో; నీవు; వగవకు=చింతించకు; నీ మనోరథమ్ము=నీకోరిక; గారవమునన్=గౌరవంతో; ఎల్లభంగులన్=అన్ని విధాలా; ఫలము-నొందు=సఫలం అవుతుంది; తీరుతుంది; ఒక్క అవసరమునన్=ఒకొక్క సమయంలో; దేవతలయినన్=దేవతలయినా; పడుదురు=కష్టాలు పడవలసి వస్తుంది

భా: ఇట్లా కష్టాలు పడ్డానని నీవు బాధపడకు. నీ కోరిక(త్వరలోనే) సఫలమవుతుంది. దేవతలయినా ఒక్కొక్కప్పుడు కష్టాలు పడవలసి వస్తుంది.

క: వాసవుఁడు దొల్లి నిజకాం
తా సహితముగాఁగ నధిక దైన్యము నొందెన్,
మీ సంపద పెద్దయె? విధి
సేసినగతిఁ బడకయుండ శివునకు వశమే! 116.

అ: తొల్లి=పూర్వం; వాసవుఁడు=ఇంద్రుడు; నిజకాంతా సహితము కాఁగన్= తన భార్యతో సహా; అధిక దైన్యము-పొందెన్=ఎంతో దీనతను పొందాడు; మీ సంపద పెద్దయె?=అతని సంపదముందు మీ సంపద ఎంత పెద్దది?; విధి చేసిన గతిన్= విధి ఏర్పరచిన అవస్థలో; పడకయుండన్=పడకుండా ఉండటానికి; శివునకున్=శివునకయితే మాత్రం; వశమే=శక్యమా!

భా: పూర్వం ఇంద్రుడు కూడా శచీదేవితో సహా ఎంతో దైన్యం పొందాడు. అతని సంపదముందు మీ సంపద ఎంతటిది? విధి చేసిన దశలో (అది దుర్దశ అయినా మహాదశ అయినా) పడకుండా ఉండటానికి శివునకు కూడా శక్యం కాదు.

వ: అనిన విని ధర్మనందనుం "డింద్రుండు శచీ సమేతంబుగా నట్టి దురవస్థ యేమి కారణంబున నెత్తెఱంగున ననుభవించె" నని యడిగిన మద్రపతి 'దొల్లింటి యితిహాసంబు సెప్పెద విను, మని యిట్లనియె. దేవతల యందు మాన్యుండై త్వష్టయను పేరం బరగువాఁడు వాసవునకుం గీడు దలంచి మూఁడు దలలవాని నొక్కని సృజియించి విశ్వరూప నామధేయుం జేసిన నతం డింద్రపదవిం గోరి ఘోర తపంబు సేయుచున్న దానికి భయం బంది నిలింపపతి యప్సర: స్త్రీలఁ దత్తపో భంగంబు సేయుండని నియమించి పంచిన. 117.

అ: ఏ+తెఱంగునన్=ఏరీతిగా; తొల్లింటి ఇతిహాసంబు=పూర్వగాథ; మాన్యుండు= గౌరవింపదగినవాడు; నిలింప పతి=దేవేంద్రుడు; తత్-తపోభంగంబు చేయుండు=ఆతని తపస్సును చెడగొట్టుడు; పంచినన్=పంపితే

భా: ఆ మాటలు విని ధర్మరాజు "ఇంద్రుడు శచీదేవితో ఏ కారణాన దురవస్థ ఎట్లా అనుభవించాడు?" అని అడిగాడు. అయితే పూర్వగాథ చెపుతానని శల్యుడిట్లా చెప్పాడు. దేవతలలో ప్రశస్తి కెక్కిన త్వష్ట అనేవాడు ఇంద్రునకు కీడు తలపెట్టి మూడు తలల వానిని ఒకనిని సృష్టించాడు. వాడి పేరు విశ్వరూపుడు. అతడు ఇంద్రపదవి కోరి ఘోరమయిన తపస్సు చేస్తూ ఉండగా దానికి ఇంద్రుడు భయపడి అప్సరసలను ఆతని తపస్సు భంగం చేయుడని పంపాడు.

**క: వారి విలాసంబులను వి
హారముల విలోకనముల నాలాపములన్
మార వికారం బాతనిఁ
జేరద; యన్నాకపతియు సిగ్గెదఁగదురన్. 118.**

అ: వారి విలాసంబులను=ఆ అప్సరసల(శృంగార) విలాసాల చేతనూ; విహారములన్ =విహారముల చేతనూ; విలోకనములన్=చూపులతోనూ; ఆలాపములన్ =మాటలతోనూ; మారవికారంబు=మన్మథ వికారం; ఆతనిన్=ఆమునిని; చేరద=చేరలేదు. ఆ మహర్షికి మన్మథ వికారం కలగలేదు; ఆ+నాక పతియున్= స్వర్గమునకు పతి అయిన ఆ యింద్రుడు; సిగ్గు; ఎదన్ కదురన్=మనస్సులో కలుగగా......................

***భా:** వారి చేష్టలూ, విహారాలూ (నడకలూ) చూపులూ, సంభాషణలూ ఆతనికి మన్మథ వికారం కల్గింపలేక పోయాయి. అపుడు ఆ ఇంద్రుడు సిగ్గుపడి................*

తే: తలరి యమ్మునిఁ దెగఁ జూచి, ధర్మరహితుఁ
డగుట యెవ్వరు నెఱుఁగని యట్లు గాఁగ
నేడు గాలంబు గడపిన, నెఱిఁగి భూత
గణము లాక్రోశ మొనరింపఁగా నతండు. 119

అ: తలరి=త్వరపడి; ఆ+మునిన్=ఆ మహర్షిని; తెగన్ చూచి=నరికివేసి చంపి; ధర్మరహితుఁడు అగుట=తాను అధర్మమాచరించినట్లు; ఎవ్వరు ఎఱుఁగని యట్లు కాఁగన్=ఎవరికీ తెలియకుండా ఉండేటట్లు; ఏడుకాలంబు గడపినన్=సంవత్సరం గడిపితే; ఎఱిఁగి=ఈవిషయం తెలుసుకొని, భూతగణములు=పంచభూతాలు; ఆక్రోశము-ఒనరింపఁగాన్=ఆక్రోశిస్తే; అతడు=ఆ యింద్రుడు

భా: తొందరపడి ఇంద్రుడు ఆ మునిని నరికి చంపేశాడు. కాని అట్లాతాను ధర్మరహితుడయిన విషయం ఎవరికీ తెలియకుండా ఒక సంవత్సరంపాటు గడిపాడు. ఇది తెలిసి పంచభూతాలూ ఆక్రోశించాయి. అపుడు ఇంద్రుడు.......................

వ: తన దుష్కర్మ ప్రకటం బగుటకు రోసి, యొక్కవిషమ వ్రతం బాచరించి, సముద్రతరుధరణీ స్త్రీజనంబులయందు బ్రహ్మహత్యవి భాగించి పెట్టి, నిజకల్మషంబుఁ బాపి కొని మునిగణసేవితుండయి సముల్లాసంబునం బొందియునికికిఁద్వష్ట గోపించి 120.

అ: దుష్కర్మ=చెడ్డపని; ప్రకటంబు-అగుటకు=బయటపడినందుకు; రోసి = అసహ్యం చుకొని; విషమవ్రతంబు=కఠినమయిన నియమం కల వ్రతం; నిజ కల్మషంబు= తన పాపము; పాపికొని = పోగొట్టుకొని; మునిగణ సేవితుండయి= మునుల సముదాయంతో సేవింపబడిన వాడయి; ఉనికికి = ఉండుటకు.

భా: తాను చేసిన చెడ్డపని బయట పడినందుకు అసహ్యంచుకొని, ఒక కఠిన వ్రతం ఆచరించి; సముద్రం, చెట్లు, భూమి, స్త్రీలు-ఈ నలుగురియందూ బ్రహ్మహత్య విభజించి పెట్టి, తన పాపం పోగొట్టుకొని మునులతో సేవింపబడుతూ సంతోషంపొంది ఉన్నాడు ఇంద్రుడు. అట్లా ఉన్నందుకు త్వష్ట కోపించి................

తే: "అనపరాధుఁ దపోనిధి, నధిక శాంతి
యుక్తుఁ, జంపిన పాపాత్ము,నుఱక పట్టి
మ్రింగఁజాలెడు వాని నుత్తుంగ దేహ
నేను సృజియింతుఁ,జూడుఁడీ యీ క్షణంబ" 121.

అ: అనపరాధున్=అపరాధము చేయని వానిని; తపోనిధిన్=తపస్విని; అధిక శాంతి యుక్తున్=మిక్కిలి శాంతితో కూడిన వానిని; చంపిన, పాపాత్మున్; ఉఱక=ఊరికే /నిష్కారణంగా

అవలీలగా; పట్టి=గ్రహించి; మ్రింగన్ చాలెడు వానిన్=మ్రింగివేయగల వానిని; ఉత్తుంగ దేహున్ = (ఎత్తయిన) ఉన్నతమయిన శరీరం కలవానిని; ఈ క్షణంబ = ఈ క్షణంలోనే; సృజియింతున్=సృష్టిస్తాను; చూడుఁడీ!=చూడండి.

భా: *నిరపరాధిని, తపస్విని, శాంతియుతుని చంపిన పాపాత్ముని పట్టి మ్రింగగల ఉన్నత శరీరుని ఈ క్షణమే సృష్టిస్తాను చూడండి.*

చ: అనుచుఁ గడంగి, నిష్ఠమెయి నగ్నిముఖం బొనరించి, వేలిమిం
దనయు సృజించి, లోకవిదితంబున వృత్ర సమాఖ్య యిచ్చి,"మ
ద్వినుత తపోబలంబునఁ బ్రదీపితతేజుఁడవై జయింపు నీ"
వని నియమించి, పంచె నమరాధిపుతో సమరంబు సేయఁగన్. 122.

అ: అనుచున్ కడంగి=అంటూ పూనుకొని, నిష్ఠమెయిన్=నియమంతో; అగ్ని ముఖంబు-ఒనరించి=అగ్నిని ప్రతిష్ఠించి; వేలిమిన్=హోమ కుండంలో; తనయున్ సృజించి=కుమారుని సృష్టించి; లోకవిదితంబుగన్=లోకమునకు తెలిసేటట్లు; వృత్ర సమాఖ్య ఇచ్చి=వృత్రుడని పేరుపెట్టి; నీవు; మద్వినుత తపోబలంబునన్= ప్రశస్తికెక్కిన నాతపోబలంచేత; ప్రదీపిత తేజుఁడవై=ప్రకాశించే తేజస్సు కలవాడవై; జయింపు=జయించుము; అని; నియమించి=నిర్ణయించి; అమర+అధిపుతోన్=ఇంద్రునితో; సమరంబు-చేయగాన్=యుద్ధం చేయటానికి; పంచెన్=పంపించాడు.

భా: *అని నిష్ఠతో అగ్ని వేల్చి హోమకుండంలో కుమారుని సృష్టించి వృత్రుడని పేరు పెట్టి 'నా తపస్సు యొక్క బలంతో తేజస్వివై ఇంద్రుని జయించు' అని నిర్ణయించి ఇంద్రుని మీదికి యుద్ధానికి పంపాడు.*

- : ఇంద్రుఁడు వృత్రాసురునితో యుద్ధంబు సేయుట :-

సం. 5-9-45.

చ: పనిచిన నాతఁడుం జనియె, బాహుబలంబున నేచి వాసవుం
డని కెదురేఁగు దెంచె, నిటు లద్భుత సంగరమైన చోట న
య్యనిమిషనాథుఁ బట్టుకొని యంగద వృత్రుఁడు మ్రింగె దేవత
ల్మనమున బెగ్గలింపఁగఁ జలంబు బలంబును జూపి యుగ్రుఁడై. 123.

అ: పనిచినన్=పంపగా; అతడున్=అవృత్రుఁడు; చనియెన్=వెళ్లాడు; వాసవుండు= ఇంద్రుడు; బాహుబలంబునన్ +ఏచి=భుజబలంతో విజృంభించి; అనికిన్ =యుద్ధానికి; ఎదురు+ఏఁగుదెంచెన్=ఎదురు వచ్చాడు; ఇటులు; అద్భుత సంగరము=ఆశ్చర్యకరమైన యుద్ధము; అయినచోటన్ =జరిగిన ప్రదేశంలో; వృత్రుఁడు; చలంబు= పట్టుదల; బలంబును; చూపి=ప్రదర్శించి; ఉగ్రుఁడై=కోపము కలిగినవాడై; అ+అనిమిషనాథున్=ఆ దేవేంద్రుని; పట్టుకొని; దేవతల్; మనమునన్=మనస్సులో; బెగ్గలింపఁగన్=భయపడేటట్లు; అంగదన్=ఉత్సాహముతో; మ్రింగెన్=ఇంద్రుని మ్రింగెను.

భా: త్వష్ట పంపితే వృత్రుడు ఇంద్రుని మీదికి దండెత్తాడు. ఇంద్రుడు భుజబలంతో విజృంభించి యుద్ధం చేశాడు. అపుడు ఆ యుద్ధములో పట్టుదల ,బలము ప్రదర్శించి వృత్రుడు ఉగ్రుడై దేవేంద్రుని పట్టుకొని మ్రింగివేశాడు. అది చూచి దేవతలందరూ భీతి చెందారు.

వి: ఇచట అంగద అను శబ్దమునకు కోపము నర్థమునిచ్చి ఇదే పద్యమును సూర్యరాయాంధ్ర నిఘంటువులో ఉదాహరించిరి. దానిలో సంస్కృత మూలము కూడ నీయబడెను. మూలములో "కోప సమన్వితః" అని యున్న పదమునకు ఈ 'యంగద' శబ్దము తెలుగులో ప్రయోగింప బడినదని తలంచి వారు 'కోపము' అను అర్థమును ఇచ్చినట్లు తోచుచున్నది. కాని ఈ పద్యము చివర ఉగ్రుడై అని యున్నది. ఇది కోపసమన్వితః అను దానికి అనువాద ప్రాయము. అపుడు అంగద శబ్దమునకు కోపము అని అర్థము చెప్పుట పునరుక్తి ప్రాయమగును. ఈ అర్థము మరెచ్చటనూ కన్పట్టదు. కావున 'ఉత్సాహముతో' అను నర్థము నిర్ణయింపబడినది.

వ: ఇట్లు మ్రింగినం ద్రిదశగణంబులు దత్ క్షణంబ యా దైత్యునకు నావులించునట్టి యాలస్యం బావహించిన. 124.

అ: త్రిదశగణంబులు=దేవతలసమూహంబులు;తత్క్షణంబ=వెంటనే; దైత్యునకు=రాక్షసునకు; ఆలస్యము=అలసత, మాంద్యము;

భా: ఇట్లా మ్రింగితే దేవతలు వెంటనే ఆ రాక్షసునికి ఆవులింత వచ్చేటట్లు మాంద్యమును కలిగించారు.

తే: అసురనాథుండు నలసత యడర నీల్గి
యావులించిన నత్తఱి నమర విభుఁడు
దన శరీరంబు సంకుచితంబు సేసి
కడు జవంబునఁ గుప్పించి వెడల నుఱికె. 125.

అ: అసురనాథుండు=రాక్షసరాజయినవృత్రుడు;అలసత -అలసత్వము; అడరన్=కలిగేటట్లు;నీల్గి-విఱుచుకొని;ఆవులించినన్; అత్తఱి=ఆసమయంలో;అమర విభుఁడు=దేవేంద్రుడు; తన శరీరంబున్; సంకుచితంబు+చేసి=చిన్నది చేసి; కడుజవంబునన్= మిక్కిలి వేగంతో; కుప్పించి=అదిమి పట్టి; వెడల నుఱికె=బయటికి ఉరికాడు.

భా: వృత్రుడు అలసత్వంతో ఒడలు విరుచుకొని ఆవులించాడు. అపుడు ఇంద్రుడు తన శరీరాన్ని కుంచింపచేసుకొని ఒక్కసారిగా కుప్పించి బయటకు ఉరికాడు.

క: వెలలి బలరిపుఁడు చలమునఁ
గలహమునకుఁ జొచ్చె వృత్రు ఘన బాహుబలం
బలవికి మీఱెను దంభ్రి వి
మల తపమునఁ జేసి సురల మనములు దలఁకన్. 126.

అ: బలరిపుఁడు=ఇంద్రుడు;వెలలి=వృత్రునినోటినుండిబయల్వెడలి; చలమునన్= పట్టుదలతో; కలహమునకున్ చొచ్చెన్=యుద్ధానికి సంసిద్ధుడయ్యాడు; తండ్రి విమల తపమునన్ చేసి=తన తండ్రి యొక్క నిర్మల మయిన తపస్సు చేత; సురల మనములు =దేవతల మనస్సులు; తలఁకన్=భయపడేటట్లు;వృత్రు=వృత్రుని యొక్క; ఘనబాహు బలంబు=అధికమయిన భుజబలము; అలవికి మీఱెను=పరిమితికి మీరెను.

భా: *వృత్రుని నోటినుండి బయటపడి ఇంద్రుడు పట్టుదలతో మళ్లీ యుద్ధానికి వచ్చాడు. కాని వృత్రుని భుజబలం తండ్రి తపోబలంతో ఇంద్రుని అలవికి మీరి పోయింది. దానితో దేవతల మనస్సులు భీతి చెందాయి.*

వ: ఇట్లధికబలుండైన వృత్రు నాటోపంబు సహింపం జాలక సురపతి దెరలి, మరలి, పఱచి, మందరగిరి శిఖరంబున కరిగినం గనుకనిం జని యనిమిషు లతనిం గూడుకొని వృత్ర వధోపాయంబు విచారించునెడ; నవ్వాసవుండును దన మనంబున నిశ్చయించి, **127.**

అ: అధికబలుండు= ఎక్కువ బలము కలవాడు; ఆటోపము=విజృంభణము; సురపతి=దేవేంద్రుడు;తెరలి=యుద్ధమునుండి తొలగి; మరలి=వెనుదిరిగి; పఱచి=పారిపోయి; కనుకనింజని=భయంతో వెళ్లి; కూడుకొని= కలునుకొని; అనిమిషులు=దేవతలు; వధ+ఉపాయము=వధించే ఉపాయం; విచారించునెడన్= ఆలోచిస్తున్నపుడు.

భా: *ఇట్లా అధిక బలవంతుడయిన వృత్రాసురుని విజృంభణాన్ని సహించలేక ఇంద్రుడు యుద్ధం నుండి మందరపర్వత శిఖరానికి పారిపోయాడు. దేవతలు భయంతో వెళ్లి అతనిని కలిసికొని వృత్రుని వధించే ఉపాయం ఆలోచించారు. అపుడు ఇంద్రుడు తన మనస్సులో నిశ్చయించుకొని ఇలా అన్నాడు.*

క: "హరిఁ గాంచి యతని చెప్పిన
పరమోపాయంబు సేసి బ్రదుకుద" మనినన్
సుర లదియ కర్జమని య
మ్మురమర్దను కడకుఁ జనిరి మునులుం దారున్. **128.**

అ: హరిన్=విష్ణుని; కాంచి=దర్శించి; అతని చెప్పిన పరమ+ఉపాయంబు-చేసి=అతడు చెప్పిన చక్కని ఉపాయం ప్రకారం చేసి; బ్రదుకుదము=జీవించుదాం; అనినన్; సురలు=దేవతలు; అదియ కర్జము+అని=అదే మంచిపని అని; మునులున్ తారున్=మునులూ, తామూ; ఆ+మురమర్దను కడకున్=మురాసురుని చంపిన ఆ విష్ణుమూర్తి దగ్గరకు; చనిరి=వెళ్లారు.

భా: *'విష్ణువును దర్శించి అతడు చెప్పిన ఉపాయం ఆచరించి జీవిద్దాము' అన్నాడు ఇంద్రుడు. దేవతలంతా అదే మంచిపని అన్నారు. అపుడు మునులూ ,దేవతలూ అంతా విష్ణుమూర్తి దగ్గరకు వెళ్లారు.*

వ: **ఇట్లు దివిజానీకంబును మునిలోకంబును బాకశాసనుం బురస్కరించుకొని. 129.**

అ: దివిజ+అనీకంబు=దేవతల సముదాయము; పాకశాసనున్=ఇంద్రుని; పురస్కరించు కొని=ముందు పెట్టుకొని

భా: *ఇలా దేవతలూ, ఋషులూ ఇంద్రుని ముందిడుకొని ....*

మ: **చని యాదైత్యు తెఱంగు సెప్పి, యతులోత్సాహంబుమై నెప్పుడున్**
దనుజవ్రాతము త్రుళ్ళడంచి, దివిజేంద్ర శ్రీవిలాసంబు పెం
పున బొందించుట నీకు నైజము గదా భూతేశ! ఘోరారిమ
ర్దన సంక్రీడ యొనర్పు లోకముల కత్యంత ప్రమోదంబుగన్. 130.

అ: చని=వెళ్లి; ఆ దైత్యు తెఱంగు-చెప్పి=ఆ రాక్షసుని తీరు చెప్పి; భూతేశ! =పంచ -భూతములకూ ప్రభువయిన విష్ణుమూర్తీ!; అతుల+ఉత్సాహంబు-మైన్=సాటిలేని ఉత్సాహంతో; ఎప్పుడున్=ఎల్లప్పుడూ; దనుజవ్రాతము=రాక్షసుల సమూహము యొక్క; త్రుళ్లు-అడంచి=గర్వమణచి; దివిజ+ఇంద్ర-శ్రీ-విలాసంబు=దేవేంద్రుని సంపద్విలాసం; పెంపున బొందించుట=అభివృద్ధి చెందించుట; నీకు; నైజము కదా!=స్వభావం కదా!; లోకములకున్; అత్యంత ప్రమోదంబుగన్=మిక్కిలి సంతోషం కలిగేటట్లు ;ఘోర+అరి-మర్దన-సంక్రీడ-ఒనర్పు=భయంకరమయిన శత్రువులను సంహరించడం అనే లీల చేపట్టుము.

భా: *(దేవతలు)వెళ్లి విష్ణునికి ఆరాక్షసుని తీరు చెప్పారు. "భూతేశా! నీవెపుడూ ఉత్సాహంతో రాక్షసుల గర్వమణచి వేస్తూ ఉంటావు. ఇంద్రుని సంపద రక్షిస్తూ ఉంటావు. ఇది నీకు స్వభావం కదా! ఇపుడు శత్రు మర్దనం చెయ్యి"అన్నారు.*

క: **అనిన విని "యొకటి సెప్పెద"**
వినుఁ "డాతని తోడ నమర విభునకుఁ దగఁ బొం
దొనరింపుఁ డొక్క సమయం
బున నడఁకువఁ గులిశధారఁ బొందెద నేనున్." 131.

అ: అనినన్విని (హరి)ఒకటి-చెప్పెదన్=చెపుతాను;వినుడు;"ఆతని తోడన్=ఆరాక్షసునితో; అమర విభునకున్=ఇంద్రునకు; తగన్=తగునట్లు; పొందు=స్నేహం; ఒనరింపుఁడు=చేకూర్చండి; నేనున్=నేను; ఒక్క సమయంబునన్=ఎప్పుడో అప్పుడు; అడఁకువన్=రహస్యంగా; కులిశధారన్=వజ్రపు అంచును; పొందెదన్=పొందుతాను.

భా: *ఆ మాటలు విని హరి ఇలా అన్నాడు. ఒకమాట చెపుతా వినండి" ముందు మీరు ఇంద్రునికిఆఆరాక్షసునితో స్నేహం కుదర్చండి.ఏదో ఒక సమయంలో నేను అదృశ్యంగా ఇంద్రుని వజ్రాయుధపు అంచును చేరుతాను.*

వ: మదీయ తేజో విశేషంబున నప్పురుహూతున కుత్సాహంబు సంభవింపం గలయది, యప్పు డనాయాసంబునఁ బగతు వధియింప నగు, నని గదాధరుం డూఱడిలం బలికిన, బలసూదన ప్రముఖ నిఖిల సుర లోకంబును సంతసిల్లి మగిడి వచ్చి, వృత్రుకడ కు మునిజనంబులం బుచ్చిన వారును జని, యతని కిట్లనిరి. 132.

అ: మదీయతేజో విశేషంబునన్=నాదయిన విశేషమయినతేజస్సు చేత; ఆ+ పురుహూతునకు=ఆ ఇంద్రునకు; సంభవింపన్ కలయది=కలుగుతుంది; అనాయాసంబునన్= శ్రమలేకుండా;పగతున్=శత్రువును;గదాధరుండు=విష్ణువు; బలసూదన ప్రముఖ నిఖిల సురలోకంబును= ఇంద్రుడు మొదలయిన దేవతల సముదాయం బును;పుచ్చినన్=పంపితే

భా: నా తేజస్సుచేత ఇంద్రునికి ఉత్సాహం కలుగుతుంది. అప్పుడు తేలికగా శత్రువును వధింప వచ్చును. "అని విష్ణుమూర్తి ఊరడించాడు. తరువాత ఇంద్రాది దేవతలు సంతోషించి తిరిగి వచ్చి వృత్రుని దగ్గరకు మునులను పంపారు. వారు వెళ్లి అతనితో (వృత్రునితో) ఇలా అన్నారు.

క: భుజబల దుర్జయుఁ డింద్రుం
డజయ్యుఁడవు నీవు; నీకు నతనికి మీలో
విజయము దక్కదు; మీరే
చి జగంబులు నొవ్వ రణము సేయఁగ నేలా? 133.

అ: ఇంద్రుండు; భుజబల దుర్జయుఁడు=బాహుబలం చేత జయింప కష్టమయిన వాడు; నీవు; అజయ్యుఁడవు=జయింపశక్యం కాని వాడవు; నీకున్; అతనికిన్; మీలోన్; విజయము; దక్కదు; జగంబులు; నొవ్వన్=బాధ పడేటట్లు; మీరు-ఏచి=మీరిద్దరూ విజృంభించి; రణము=యుద్ధము; చేయఁగన్ఏలా=చేయడమెందుకు?

భా: ఇంద్రుడు భుజబల దుర్జయుడు; నీవు అయితే అసలే (అజయ్యుడవు) జయింప శక్యంకాని వాడవు; మీలో మీకు ఎవరికీ జయం లభించదు. మీరు విజృంభించి లోకాలు భయపడేటట్లు యుద్ధం చేయడమెందుకు?

వి: ఇంద్రుడు దుర్జయుడని (జయింప కష్టమయినవాడని) వృత్రుడు అజయ్యుడని (జయింప శక్యం కాని వాడని) చెప్పడంలో మునుల భాషణౌచిత్యం గోచరిస్తుంది.

క: మైత్రీ సౌఖ్యముఁ బోలునె
శాత్రవ మెమ్మెయిఁ దలంప? శక్రశ్రీకిం
బాత్రమవై యింపుగఁ ద
న్మిత్రుఁడ వగు; మిదియ మేలు మీ యిద్దఱకున్. 134.

అ: తలంపన్=ఆలోచిస్తే; శాత్రవము = శత్రుత్వము; ఏ+మెయిన్ = ఏవిధంగా

నయినా; మైత్రీ సౌఖ్యమున్ పోలునె? = స్నేహం వల్ల వచ్చే సౌఖ్యంతో సరిపోలుతుందా?; శక్రశ్రీకిన్ = ఇంద్రుని సంపదకు; పాత్రమవు+ ఐ =అర్హుడవై; ఇంపుగన్=ప్రీతితో; తత్-మిత్రుఁడవు-అగుము = ఆ ఇంద్రునికి స్నేహితుడవు కమ్ము; మీ ఇద్దఱకున్; ఇదియమేలు =ఇదే శ్రేయస్కరం/ మంచిది.

భా: శత్రుత్వం ఎప్పుడూ మైత్రితో సరిపోలదు. ఇంద్రుని సంపద నీవూ అనుభవిస్తూ ప్రీతితో అతనికి స్నేహితుడవు కమ్ము. మీ యిద్దరికీ ఇదే మంచిది.

వ: అనవుడు వృత్రాసురుండు "తేజంబువానికి నానవడియెడు మాయిరువురకు సఖ్యంబు సమకూర నేర్చునే!" యనుటయు నమ్మునులు "సత్పురుష సాంగత్యంబు సంభవించినం జేయమి నీతిగాదు మహేంద్రుండు సకలలోక సమ్మత సద్భావుండు గావున నతని తోడి చుట్టరికంబు మే" లనిన నొడంబడి యతండు వారల కిట్లనియె. **135.**

అ: తేజంబువాని =తేజస్సుయొక్క తారతమ్యము; సఖ్యంబు=మైత్రి; చేయమి=చేయకపోవడం;

భా: అనగానే వృత్రుడు "పరాక్రమంలోని తారతమ్యానికి ఆశించే మాయిద్దరికీ స్నేహం చేకూరుతుందా?" అన్నాడు. వెంటనే మునులు "సజ్జనులతో సహవాసం లభించినపుడు చేయక పోవడం నీతి కాదు; ఇంద్రుడు సకలలోకాలు సమ్మతించిన మంచితనం కలవాడు. అందుచేత అతనితో స్నేహం మేలు" అన్నారు. ఆ మాటలకు అంగీకరించి వృత్రుడు మునులతో ఇలా అన్నాడు.

క: ఏ నొక్క తెఱఁగు సెప్పెద,
దానిం గాదనక చేసి తగ మీరలు సం
ధానము దృఢముగఁ జేయుం
డా నాకేశునకు నాకు నధికప్రీతిన్. **136.**

అ: ఎను=నేను; ఒక్క తెఱఁగు=ఒక పద్ధతి; చెప్పెదన్; దానిన్; కాదు-అనక=తిరస్కరించక; చేసి; ఆ నాక+ఈశునకున్=స్వర్గానికి రాజయిన ఆ యింద్రునకూ; నాకున్; అధిక ప్రీతిన్=ఎంతో సంతోషంతో; మీరలు; సంధానము=సంధి; దృఢముగన్=గట్టిగా; చేయుండు.

భా: నేనొక విధానం చెపుతాను. దాన్ని కాదనకుండా చేసి అధిక ప్రీతితో నాకూ ఆ ఇంద్రునికీ బలమైన చక్కని సంధి చేకూర్చండి.

వ: అది యెయ్యది యనిన "నార్ద్రం బగుదానను, శుష్కంబైన సాధనంబునను, దరువునం, బాషాణంబున, శస్త్రాస్త్రంబుల, దివంబున, రాత్రియందును, నేను

వధ్యుండఁగాకుండవలయు" ననిన వారును దానికి నొడంబడి, యవ్వరంబు లొసంగి, వృత్ర వజ్రధరులకు మిత్రభావం బొనరించి, మగుడంజని యత్తెఱంగు వాసవున కెఱింగించి నిజనివాసంబుల కరిగిరి. సురనాథుండు సుఖంబుండి పెద్ద కాలంబునకుం దన మనంబునఁ బాయని వైరంబు సైరింపంజాలక దామోదరుని పూనికయు, మునిజనంబు సేసిన సంధివిధంబును, నిరూపించి రిపుం బరిభవింప రంధ్రాన్వేషణంబు సేయుచుండి యొక్కనాఁడు. 137.

అ: ఆర్ద్రంబగు దానను=తడిదానితో; శుష్కంబు=ఎండినది; తరువునన్=చెట్టుతో; పాషాణంబునన్=రాతితో;దినంబునన్=పగటిపూట;వధ్యుండు=చంపదగినవాడు; ఒడంబడి= అంగీకరించి; వజ్రధరుఁడు=ఇంద్రుడు; మిత్రభావంబు=స్నేహము; మగుడన్ చని=తిరిగి వచ్చి; వాసవునకున్=ఇంద్రునకు; నిజ నివాసంబులకున్=తమ గృహాలకు; పాయని=విడువని; వైరంబు=శత్రుత్వము; సైరింపన్ చాలక=సహింపలేక; దామోదరుని పూనికయున్=విష్ణుని భావమును;రిపున్=శత్రువును; పరిభవింపన్=అవమానించటానికి; రంధ్ర+అన్వేషణంబు=తప్పులు వెదకుట

భా: అది ఏది అంటే "తడి దానిచేతనూ, ఎండుదాని చేతనూ, చెట్టుచేతనూ, రాతిచేతనూ, శస్త్రాలు అస్త్రాల చేతనూ, పగటిపూటకానీ, రాత్రి కానీ, నేను చావకూడదు" అంటే వారు దానికి ఒప్పుకొని ఆ వరాలు ఇచ్చి వృత్రాసురునికీ ఇంద్రునికీ స్నేహం చేకూర్చి, మళ్లీ వెళ్లి ఆ విషయం అంతా ఇంద్రునికి చెప్పి వెళ్లిపోయారు. దేవేంద్రుడు సుఖంగా ఉండి చాలా కాలానికి కూడా తన మనస్సునువీడని వైరం సహించలేక, విష్ణువు ప్రయత్నమూ, మునీశ్వరులు చేసిన సంధినీ భావించి శత్రువును జయించటానికి అతని దోషాలు వెదకుతూ ఒక రోజున....................

వి: ఇందులో వృత్రుడు వరాలు కోరుతూ సంధ్యాసమయాన్ని మరిచాడు. ఇది కేవలం పొరపాటు. ఎంత తెలివయిన వారయినా ఒకప్పుడు పొరపాటు పడతారు. వారి కర్మననుసరించి. అందుకే "బుద్ధిః కర్మానుసారిణీ" అనే నానుడి వచ్చింది.

**చ: జలనిధి తీరభూమిఁ దనశత్రుఁ గనుంగొని "వీని నిప్డు దో
ర్బల మెసఁగంగ నాదు భిదురంబునఁ ద్రుంచెద, రాత్రి గాదు తాఁ
దలఁప దివంబు గాదిది, యుదగ్ర పరాక్రమ యోగ్య సంధ్య నా
యలవుఁ జలంబుఁజూప నెపమై తగు సాధన మెద్ది గల్గునో." 138.**

అ: జలనిధి తీరభూమిన్=సముద్ర తీర ప్రదేశంలో; తన శత్రున్=తన శత్రువయిన వృత్రుని; కనుంగొని=చూసి; వీనిన్; ఇప్డు=ఇప్పుడు; దోర్బలము-ఎసఁగంగన్=(నా)భుజబలం ప్రకటిత మయ్యేటట్లు; నాదు భిదురంబునన్=నా యొక్క వజ్రాయుధంతో; త్రుంచెదన్ = సంహరి స్తాను;ఇది=ఈసమయం; రాత్రి కాదు; తాన్ తలఁపన్=భావింపగా; దివంబు కాదు=పగలు కాదు;

ఉదగ్రపరాక్రమ యోగ్య=తీవ్రమయిన శౌర్యం ప్రకటించేందుకు తగినదయిన; సంధ్య =సంధ్యా కాలము; నా అలవున్=నా బలమూ;చలంబున్=పట్టుదలనూ; చూపన్= ప్రదర్శించేందుకు; నెపమై తగు=మిషయై ఒప్పే; సాధనము=పరికరము; ఎద్ది కల్గునో=ఏది దొరకునో!

భా: *ఇంద్రుడు సముద్రతీరాన వృత్రుని చూచి ఒకరోజున "వీని నిప్పుడు నా వజ్రంతో సంహరిస్తాను. ఇది రాత్రీకాదు, పగలూ కాదు. పరాక్రమార్హమయిన సంధ్యాకాలం. ఇపుడు నాబలమూ పట్టుదల, మాత్సర్యము ప్రదర్శించేందుకు తగిన నెపం ఏమి దొరకుతుందో" (అని ఆలోచిస్తున్నాడు అని ముందు పద్యంతో అన్వయం)*

క: **అని తలఁచుచు నచ్చట నొక**
వననిధి ఫేనంబుఁ జూచి వాసవుఁ "డార్ద్రం
బును శుష్కంబును గాదిది"
యనుచుం గులిశమునఁ గూర్చి యధికరయమునన్. 139.

అ: అని, తలఁచుచున్; అచ్చటన్; ఒక; వననిధి ఫేనంబున్-చూచి= సముద్రపు నురుగును చూసి; వాసవుఁడు= ఇంద్రుడు; ఇది; ఆర్ద్రంబును శుష్కంబును కాదు=తడిదీ కాదు, ఎండినదీ కాదు; అనుచున్=అంటూ; కులిశమునన్ కూర్చి= వజ్రానికి తగిలించి; అధిక రయమునన్= ఎక్కువ వేగంతో......................

భా: *అని ఆలోచిస్తూ అక్కడ ఉన్న సముద్రపునురుగును చూసి యింద్రుడు "ఇది తడిదీ కాదు పొడిదీ కాదు." అనుకుంటూ ఆ నురుగును వజ్రాయుధానికి కూర్చి వేగంగా...........................*

తే: **దాన వృత్రుని వ్రేయ, నత్తఱి మురారి**
యందుఁ దగ సంక్రమించి యయ్యసురఁ జంపె;
జిష్ణుఁ డతిభక్తి విష్ణుఁ బూజించె నాత్మ;
నఖిలలోకంబులకు మోద మావహిల్లె. 140.

అ: దానన్= దానితో; వృత్రుని వ్రేయన్=వృత్రాసురుని కొట్టగా; ఆ+తఱిన్=సరిగా ఆ సమయంలో; మురారి=విష్ణుమూర్తి; తగన్ సంక్రమించి=ఆ వజ్రాయుధాన్ని ఆవేశించి; ఆ+అసురన్ చంపెన్=ఆ రాక్షసుని చంపాడు. జిష్ణుఁడు =ఇంద్రుడు; ఆత్మన్=మనస్సులో; అతిభక్తిన్=మిక్కిలి భక్తితో; విష్ణున్=విష్ణుని; పూజించెన్; (అపుడు) అఖిలలోకంబులకును=అన్ని లోకాలకూ; మోదము-ఆవహిల్లెన్=సంతోషంకలిగింది.

భా: *ఆ నురుగుతో కూర్చిన వజ్రంతో ఇంద్రుడు వృత్రుని కొట్టాడు. సరిగా అదే సమయంలో విష్ణుమూర్తి ఆ వజ్రాయుధాన్ని సంక్రమించి ఆరాక్షసుని చంపాడు. అపుడు ఇంద్రుడు అతి భక్తితో విష్ణుని పూజించాడు. లోకాలన్నిటికీ సంతోషం కలిగింది.*

వ: ఇవ్విధంబునం బగతుం బరిమార్చి, పేర్చి యింద్రుఁడు నిజపురంబునకుం జనియె; మరియును భూతసంఘం "బిట్లు బ్రహ్మహత్య సేయం దగునే!" యని యతని నిందించినం బ్రభుత్వ సంపద సెడుటయు. 141.

అ: ఈ+విధంబునన్=ఈరీతిగా; పగతున్=శత్రుని; పరిమార్చి=చంపి; పేర్చి=సంతసించి; నిజపురంబునకున్=తన పట్టణానికి; భూతసంఘంబు=(పంచ)భూతముల సముదాయము; బ్రహ్మహత్య=బ్రాహ్మణుని సంహరించుట; ప్రభుత్వ సంపద=రాజ్యసంపద; చెడుటయున్=తొలగిపోగా;

భా: *ఇట్లా శత్రువును సంహరించి సంతోషంతో ఇంద్రుడు తన పట్టణానికి వెళ్లాడు. తరువాత పంచ భూతాలూ "ఇట్లా బ్రహ్మహత్య చేయవచ్చునా?" అని ఇంద్రుని నిందించాయి. దానితో అతని రాజ్యసంపదలు నశించాయి. (అపుడు)*

ఆ: నీచదశకు వచ్చి నిషధాచలంబున
కరిగి సురవరేణ్యుఁ డడఁగి యుండె;
నమరులెల్లఁ గలఁగి యన్యోన్య పీడన
భయముఁ బొంది, కూడఁ బాఱి తమకు. 142.

అ: సురవరేణ్యుఁడు=ఇంద్రుడు; నీచ దశకు వచ్చి=హీనస్థితికి వచ్చి; నిషధ+అచలంబునకున్ అరిగి=నిషధ పర్వతానికి వెళ్లి; అడఁగి యుండెన్=దాగుకొన్నాడు; అమరులు-ఎల్లన్=దేవతలంతా; కలఁగి=కలత చెంది; అన్యోన్య పీడనభయమున్ = ఒకరినొకరు పీడించుకొనడం చేత భయమును; పొంది; కూడన్ పాఱి=కలిసి ఏకమై; తమకున్............

భా: *ఇంద్రుడు నీచస్థితికి దిగజారి నిషధపర్వతం మీదికి వెళ్లి దాగుకొన్నాడు. దేవతలంతా కలతపడి పరస్పర బాధల వల్ల భయపడి అంతా కలిసి తమకు.............. (రక్షణ కావాలి అంటూ నహుషుని చేరారు అని ముందు పద్యంతో అన్వయం)*

క: కావలియై సురరాజ్య
శ్రీ పాలింపంగఁ దగు విశేషంబున సం
భావితుఁడు నహుషుఁడని చని
యా విభుఁ గని తారు మునులు నతనికి నెమ్మిన్. 143.

అ: కావలియై=రక్షకుడై;సురరాజ్యశ్రీ=దేవతలరాజ్యలక్ష్మిని;పాలింపంగన్ తగు=పాలింపగల; విశేషంబునన్=విశేషంతో; సంభావితుఁడు=అర్హమైన వాడు; నహుషుడు-అని; చని=వెళ్లి; ఆవిభున్ కని; తారు=తాము(దేవతలు); మునులున్; అతనికిన్=ఆ నహుషునికి; నెమ్మిన్=నేర్పుతో /ఆసక్తితో................

భా: రక్షణ వహించి దేవరాజ్యాన్ని పాలింపగల విశేషమూవిభూతీ కలవాడు నహుషుడని దేవతలూ ,మహర్షులూ అతని దగ్గరకు వెళ్లి,అతనికి నేర్పుతో...........................

-: దేవతలు నహుషుని సురరాజ్యాభిషిక్తునిం జేయుట :-

సం. 5-11-21.

వ: **పాకశాసను తెఱం గెఱింగించి యిట్లనిరి.** 144.

అ: పాకశాసను తెఱంగు=ఇంద్రుని పరిస్థితి

భా: *ఇంద్రుని పరిస్థితి తెలిపి ఇలా అన్నారు.*

క: **"ర మ్మింద్రపదవి సేకొని**
మమ్మెల్లను నరయు" మనిన మానవపతి "నా
కమ్మహిమకుఁ దగుమాహా
త్మ్యమ్ము గలదె నన్ను నేల యలఁచెద? " రనినన్. 145.

అ: రమ్ము; ఇంద్రపదవి;చేకొని=స్వీకరించి; మమ్ము-ఎల్లను; అరయుము= పాలింపుము/రక్షించుము; అనినన్; మానవపతి= రాజు; నాకున్; ఆ+మహిమకున్=ఆ గౌరవానికి; తగు=తగిన; మాహాత్మ్యమ్ము=శక్తి; కలదె=నాకు ఉందా?(లేదు); నన్నున్; ఏల అలఁచెదరు?=ఎందుకు శ్రమపెడతారు?; అనినన్=అంటే

భా: *'వచ్చి ఇంద్రపదవి స్వీకరించి మమ్మల్ని రక్షించు' అంటే నహుషుడు "అగౌరవానికి తగిన శక్తి నాకు లేదు. నన్నెందుకు బాధిస్తారు?" అన్నాడు. అన్నాకూడా (విడవక..................)*

వ: **అంత నిలువక యత్యంత ప్రార్థనంబు సేసి,** 146.

అ: నిలువక=ఆగక; అత్యంత ప్రార్థనంబు చేసి =మిక్కిలిగా ప్రార్థించి,

భా: *అంతటితో ఊరుకోక దేవతలు ఎంతగానో ప్రార్థించి..........*

క: **యమ వరుణాది త్రిదశులు**
దమతమ శక్తి ప్రభావదర్పంబులు భూ
రమణునకుఁ బంచి యిచ్చిరి
ప్రమోద మెసఁగంగ ముని సభా మధ్యమునన్. 147.

అ: యమ వరుణ ఆది త్రిదశులు= యముడు వరుణుడు మొదలగు దేవతలు; తమ తమ శక్తి ప్రభావదర్పంబులు= తమ శక్తి, మహిమ, గర్వము అన్నీ; భూరమణునకున్; ముని సభామధ్యమునన్ = ఋషుల సభలో; ప్రమోదము+ఎసఁగంగన్=సంతోషం అతిశయించేటట్లు; పంచి-ఇచ్చిరి=పంచి ఇచ్చారు.

భా: *యముడు ,వరుణుడు మొదలయిన దేవతలు సంతోషంతో మునిసభామధ్యంలో నహుషునికి తమ తమ శక్తులూ, ప్రభావాలూ, ఉత్సాహాలూ అన్నీ పంచి యిచ్చారు.*

వ: ఇవ్విధంబున నిచ్చి, యధికబలసమన్వితుం గావించి, తోడ్కొని పోయి, పూజ్యంబగు దివిజరాజ్యంబున కభిషిక్తుం జేసిన, నతండును బరమధర్మపరుండై కిన్నర కింపురుష గరుడ గంధర్వ సిద్ధ విద్యాధరాది సమస్త దేవయోనుల వలనను దేజోభాగంబులు పుచ్చికొని, మహానుభావుండై దివ్యముని సేవ్యంబయిన యద్దేవేంద్ర పదంబు సేకొని, తుంబురు నారదాది వినోదపాత్రంబులును, రంభాద్యప్సరోగణంబులుం గొలువ నభిమత భోగంబు లనుభవించుచు, మదంబు మిగిలి, మన్మథాధీనుండై వర్తిల్లు సమయంబున నొక్కనాఁడు. 148.

అ: అధికబలసమన్వితున్=ఎక్కువబలంతో కూడిన వానిని; పూజ్యంబు= పూజింపదగినది; దివిజరాజ్యంబునకున్=దేవరాజ్యానికి; అభిషిక్తున్ చేసినన్= పట్టాభిషేకం చేస్తే; పరమ ధర్మపరుండై=చక్కని శ్రేష్ఠమయిన ధర్మము ఆచరించే వాడయి; దేవయోనులు=దేవతలు; తేజస్+భాగంబులు=తేజస్సు యొక్క భాగాలు; వినోదపాత్రంబులు=వినోదముకల్గించు వ్యక్తులు; అభిమతభోగంబులు=కోరిన భోగాలు; మదంబు మిగిలి= గర్వించి, మత్తెక్కి; మన్మథ + అధీనుండై=మన్మథునకు వశమయి

భా: ఇలా ఇచ్చి అధికబలుడుగా చేసి, నహుషుని తీసికొనిపోయి దేవరాజ్యానికి అభిషేకంచేశారు. అతడు కిన్నరాదులనుండి తేజస్సు పొంది పరమధార్మికుడై, దేవేంద్ర పదవి గ్రహించి నారదాదులూ, రంభ మొ॥ అప్సరసలూ సేవిస్తూ ఉంటే ఇష్టభోగా లనుభవిస్తూ మత్తెక్కి ప్రవర్తిస్తున్న సమయంలో మన్మథునికి వశమయి ఒకనాడు........

తే: మహిత లావణ్యమున నసమాన యనఁగఁ
జనిన పౌలోమి యానహుషునకు నయన
మార్గగోచర యగుటయు, మదన బాణ
భిన్న హృదయుఁడై ధృతిఁ బాయఁ బెట్టి యతఁడు. 149.

అ: మహిత లావణ్యమునన్=గొప్ప అందంలో; అసమాన=సాటిలేనిది; అనఁగన్ చనిన= అని ప్రసిద్ధికెక్కిన; పౌలోమి= శచీదేవి;ఆనహుషునకున్;నయనమార్గగోచర - అగుటయున్ =కంటికికనపడగానే;అతఁడు=నహుషుడు;మదన,బాణ,భిన్న హృదయుఁడై=మన్మథబాణాలతో చెదరిన, మనస్సు కలవాడై; ధృతిన్ పాయన్ పెట్టి= ధైర్యం వదలిపెట్టి

భా: అందకత్తెలలో అసమానురాలయిన శచీదేవి ఒకనాడు నహుషునికి కనిపించింది. వెంటనే నహుషునికి మన్మథబాణాలతో మనసు చెదిరి ధైర్యం సడలి పోయింది. అతడు అనుకుంటున్నాడు..................

క: "సురలోక రాజ్యపదవిన్
గరిమంబున నున్న నన్నుఁ గవయం బరమా
దర లీలఁ జతుర యగు నీ
సరసిజముఖి రామి యేమి చందమొ? తలఁపన్". 150.

అ: సురలోకరాజ్య పదవిన్=దేవలోకపు రాజపదవిలో(దేవేంద్రపదవిలో) గరిమంబునన్= గొప్పదనంతో ఉన్న; నన్నున్; పరమ+ఆదరలీలన్=ఎంతో ఆదర విలాసంలో, చతుర అగు =నిపుణురాలయిన; ఈ సరసిజముఖి=ఈ పద్మముఖి(పద్మం వంటి ముఖంకల ఈమె); కవయన్ రామి=కలియటానికి రాకపోవడం; ఏమి చందమొ తలపన్=(ఆలోచిస్తే) ఎందుకో?

భా: *"లీలా విలాసాల్లో చతురురాలయిన ఈ పద్మముఖి దేవేంద్రపదవిలో ఉన్న నన్ను ఆదరంతో కలియటానికి రాకపోవడం ఏమిటి? ఎందువల్ల?"*

క: అని యప్పొలఁతిం బిలిపిం
చిన, నదియును భయమునొంది శీఘ్రమ దేవే
జ్యుని సదనమునకు "శరణం"
బనుచుఁ జనుటయును వాసవాచార్యుండున్. 151.

అ: అని;అ+పొలతిన్=ఆవనితను;పిలిపించినన్;అదియును=ఆశచీదేవి; భయమునొంది; శీఘ్రమ=వెంటనే; శరణంబు-అనుచున్=శరణు అంటూ; దేవ+ఇజ్యుని=దేవతల గురువయిన బృహస్పతి యొక్క; సదనమునకున్=ఇంటికి; చనుటయున్=వెళ్ళడమూ;(వెంటనే) వాసవ+ఆచార్యుండున్=ఇంద్రుని గురువయిన బృహస్పతి.......................

భా: *అని అనుకొని ఆ కాంతను పిలిపించాడు. ఆమె భయపడి వెంటనే "శరణు' అంటూ బృహస్పతి యింటికి వెళ్ళింది. అపుడు బృహస్పతి.............*

వ: పరమాదరంబున నద్దేవిని గారవించి "నిన్ను నహుషు దుర్వినయంబుఁ బొరయకుండ నరయువాఁడ నాఖండలుండును నాయత్నంబున నవశ్యంబును దడయక వచ్చు"నని యూరడించిన. 152.

అ: పరమ+ఆదరంబునన్=ఎంతో ఆదరంతో; అ+దేవిని=ఆ శచీదేవిని, దుర్వినయంబున్=దుష్ప్రవర్తనము/ చెడ్డనడవడి; ఆఖండలుండు=ఇంద్రుడు; అవశ్యంబును=తప్పక; తడయక=ఆలసించక;

భా: *(బృహస్పతి) ఎంతో ఆదరంతో ఆమెను గౌరవించి "నిన్ను నహుషుని దుష్ప్రవర్తన పొందకుండా రక్షిస్తాను- నా ప్రయత్నం వల్ల ఇంద్రుడు కూడా త్వరగా తప్పక వస్తాడు" అని ఊరడించాడు.*

క: అది యెల్ల నెఱిఁగి కోపం
బొదవఁగ నహుషుండు "గురున కుచితమె యేన
మ్ముదితం బిలిపింపఁగఁ దన
సదనంబున నునుచు" టనియె సంక్షుభితుండై. 153.

అ: అది=ఆ విషయం; ఎల్లన్=అంతా; ఎఱిఁగి; నహుషుండు; సంక్షుభితుండై=కలతచెంది; కోపంబు-ఒదవఁగన్=కోపంకలగగా;"ఏను=నేను; ఆ + ముదితన్= ఆవనితను (శచిని); పిలిపింపఁగన్ = పిలిపిస్తే; తన సదనంబునన్=తన యింట్లో; ఉనుచుట=దాచి యుంచుట ; గురునకున్; ఉచితమె? = తగునా?; అనియెన్=అన్నాడు.

భా: ఆ విషయమంతా తెలుసుకొని నహుషుడు క్షుభితుడై కోపించి "నేనా వనితను పిలిపిస్తే తన భవనంలో ఉంచడం (నిలుపడం) గురువుకు తగునా? " అన్నాడు.

చ: **అనుడు మునీంద్రులున్ సురలు "నక్కట! నీ మహనీయ గౌరవం**
బునకుఁ బరాంగనం గవయుబుద్ధి జనించుట యీడుగాదు", నా
విని" మును పూని యిమ్మెయి వివేకము గౌతము భార్యఁ బాక శా
సనుఁ డెడఁ గోరుచోఁ గఱపఁ జాలర మీ రది యెట్లుసెప్పుఁడా?" 154.

అ: అనుడున్=అనగానే; ముని+ఇంద్రులున్ సురలున్=మహర్షులూ, దేవతలూ;"అక్కట!=అయ్యో; నీ మహనీయగౌరవంబునకున్=గొప్పదయిన నీయింద్ర గౌరవానికి; పర+ అంగనన్=ఇతరుల భార్యను; కవయుబుద్ధి =కలిసేబుద్ధి; జనించుట=పుట్టుట; ఈడుకాదు=తగినది కాదు; నాన్విని=అనగా విని; (నహుషుడు) ఈ+మెయి వివేకము=ఇటువంటి బోధన; మునుపూని=పూర్వమే వహించి, పాకశాసనుఁడు=ఇంద్రుడు; గౌతము భార్యన్=అహల్యను; ఎడన్ కోరుచోన్=మనసులో కోరినప్పుడు; మీరు; కఱపన్ చాలర=నేర్పలేకపోయారే!;అది ఎట్లు చెప్పుడా?=అదేమిటి చెప్పండి.

భా: అపుడు దేవతలూ మహర్షులూ "నీ గొప్పతనానికి నీకు పరస్త్రీని కలిసే బుద్ధి పుట్టడం తగదు." అన్నారు. వెంటనే నహుషుడు'ఈ బోధన పూర్వమే ఇంద్రుడహల్యను కోరినప్పుడు చేయలేకపోయా రెందుచేత? (.......అంటూ.........

వ: **అనుచు నతండును గడుఁ గోపించిన, భయంబుఁ గొని వారలాపౌలోమి నతని పాలికిం దోడ్కొని వచ్చువారై పూని, బృహస్పతి కడకుం జని, యద్దేవియు వినుచుండ నిట్లనిరి. 155.**

అ: భయంబున్కొని=భయపడి; ఆ పౌలోమిన్=ఆ శచీదేవిని

భా: అంటూ అతడూ కోపపడ్డాడు. దానికి భయపడి వారు శచీదేవిని అతని దగ్గరకు తీసుకురావాలని బృహస్పతి దగ్గరకు వెళ్లి శచీదేవి వింటూ ఉండగా ఇలా అన్నారు.

క: **నహుషుఁడు మహేంద్ర పదవీ**
సహితుఁడు; శచికిన్ వరింపఁజను నాతని; లో
క హితంబుగాఁ: బుచ్చుము
మహాత్మ! తచ్చిత్తమున యమర్షం బడఁగన్. 156.

అ: నహుషుఁడు; మహేంద్రపదవీ సహితుడు=దేవేంద్ర పదవితో కూడినవాడు; ఆతనిన్;శచికిన్=శచీదేవికి;వరింపన్చనున్=వరింపదగును-(అతనిని శచీదేవి వరింపవచ్చు); మహాత్మా!=మహనీయుడవయిన బృహస్పతీ!; తచ్చిత్తమునయమర్షంబు=ఆనహుషుని మనసులోని కోపము; అడఁగన్=అణగేటట్లు; లోకహితము కాఁగన్=లోకులందరికీ హితమయ్యేటట్లు; పుచ్చుము=పంపుము.(శచిని నహుషుని దగ్గరకు)

భా: *నహుషుడు మహేంద్రపదవితో కూడి ఉన్నాడిప్పుడు. అందుచేత శచీదేవి అతనిని వరింపవచ్చు. కావున బృహస్పతీ! అతని మనస్సులోని కోపం తగ్గేందుకూ, లోకహితం కోసమూ శచీదేవిని అతని దగ్గరకు పంపుము.*

వి: చిత్తమునయమర్షంబు-షష్ఠి

క: **అనవుడు శోకం బడరఁగ**
ననిమిషగురుఁజూచి యిట్టులను శచి "యటు వు
చ్చిన దూఱు రాదె?నను శుచి
యని మీ కొనియాడు టెల్ల నన్నతము గాదే!" 157.

అ: అనవుడున్=అనగానే; శోకంబు-అడరఁగన్=దుఃఖం పెల్లుబుకుతూ ఉండగా; శచి; అనిమిషగురున్=దేవతాగురువయిన బృహస్పతిని; చూచి; ఇట్టులు+అను; అటు-పుచ్చినన్=అట్లా నన్ను పంపితే; దూఱు రాదె?=నింద కల్గదా?; ననున్; శుచి అని=పవిత్రురాలు అని; మీ కొనియాడుట-ఎల్లన్=మీరు ప్రశంసించడం అంతా; అన్నతము కాదె!=అసత్యం కాదా?"

భా: *అనగానే శచీదేవి శోకిస్తూ బృహస్పతితో ఇలా అంది. "అలా నన్ను నహుషుని దగ్గరకు పంపితే నింద పుట్టదా? నన్ను మీరంతా పవిత్రురాలని కొనియాడే మాట అసత్యం కాదా?"*

వ: **అనిన విని దరహసితవదనుం డగుచుఁ బురుహూతపురోహితుండు.158**

అ: పురుహూత పురోహితుండు=ఇంద్రుని పురోహితుడు (బృహస్పతి)

భా: ఆ మాటలు విని చిరునవ్వు నవ్వుతూ బృహస్పతి................

క: **నహుషుండు పనుచువాఁ డటె!**
విహితానుష్ఠానపరులు వీరటె! తా లో
కహితం బటె! యిది మనకున్
మహనీయమ కాక యెట్లు మానఁగవచ్చున్? 159.

అ: నహుషుండు;పనుచువాఁడు+అటె=ఆజ్ఞాపించేవాడట;విహిత-అనుష్ఠాన పరులు =విధింపబడినదానిని ఆచరించేవారు; వీరటె=ఈ మహర్షులట (దేవతలట); తాన్=అది; లోకహితంబటె=లోకములకు హితమయినదట; ఇది మనకున్; మహనీయ మకాక=ఇది మనకు గొప్పదేకదా; ఎట్లు మానఁగవచ్చున్=ఎట్లామానగలం?

భా: నహుషుడు ఆజ్ఞాపించే వాడట. వీరు ఆచరించే వారట- పైగా అది లోకహితమట- అది గొప్పది కాదా మరి- అది చేయకుండా మనం ఎట్లా మానగలం?

వ: అని యుల్లసం బాడి యనిమిషులను జూచి యిట్లనియె. 160.

అ: ఉల్లసంబు+ఆడి=అధిక్షేపించి/పరిహసించి; అనిమిషులన్=దేవతలను

భా: అని ఎత్తిపొడిచి దేవతలను చూసి ఇలా అన్నాడు.

తే: "శరణు సొచ్చిన రక్షింపఁ జాలియుండి
కడపి పుచ్చిన నూర్ధ్వ లోకములు దప్పుఁ
బుణ్య కర్మంబు లఫలతఁ బొందు" ననఁడె
కమలగర్భుండు దొల్లి జగద్ధితముగ. 161.

అ: శరణు-జొచ్చినన్=శరణు వేడితే; రక్షింపన్‌చాలియుండి = రక్షింపగలిగియు ండి; కడపి పుచ్చినన్=రక్షించకుండా పంపివేస్తే; ఊర్ధ్వలోకములు తప్పున్=పుణ్య లోకాలనుండి భ్రష్టుడవుతాడు; పుణ్యకర్మంబులు=అతడు చేసే మంచి పనులు; అఫలతన్ పొందున్= సఫలములు కావు/ ఫలించవు" (అని); తొల్లి=పూర్వం; జగత్+హితముగన్ =లోకహితంగా; కమల గర్భుండు=బ్రహ్మ; అనఁడె?=అనలేదా!

భా: *"ఎవరయినా శరణు కోరితే రక్షింపగలిగి ఉండి కూడా రక్షింపకుండా పంపించివేస్తే పుణ్యలోకాలు తప్పిపోతాయి; చేసే పుణ్యకర్మలు నిష్ఫలము లవుతాయి" అని పూర్వం లోకహితంగా బ్రహ్మ చెప్పలేదా? (చెప్పాడు కదా!)*

వ: అని యనురూపాలాపంబుల నిషేధింప, వార " లట్లేనిఁ గర్తవ్యం బెయ్యది యూహింపు" మనిన," నద్దేవి నహుషు కడకుం జని సముచితంబుగాఁ దదీయ సాంగత్యంబున కెడ వలికి కొని వచ్చునది, యటమీఁద మన మందఱముం బురందరున కభ్యుదయం బగు తెఱం గాచరించువార" మనుటయు వాచస్పతి వచనంబులకు సంతసించి సురసంయమి సంఘంబు లరిగిన యనంతరంబ. 162.

అ: అనురూప+ ఆలాపంబులన్=అనుగుణమయిన సంభాషణలతో; నిషేధింపన్= కాదనగా; కర్తవ్యంబు=చేయదగినవని;సముచితంబుగాన్=తగినట్లు;తదీయ సాంగత్యమునకున్=ఆతనితోకలయికకు; ఎడ-వలికి కొని=వ్యవధి పుచ్చుకొని; పురందరునకు=ఇంద్రునకు;అభ్యుదయంబు=శ్రేయస్సు; వాచస్పతి =బృహస్పతి; సురసంయమి సంఘంబులు= దేవతల, మునుల సముదాయములు

భా: అని అనుకూలంగా మాట్లాడి నిషేధించాడు. అపుడు వారు " అలా అయితే ఇపుడు చేయవలసిన పని ఆలోచింపు" మన్నారు. అపుడు బృహస్పతి " ఆ శచీదేవి

నహుషుని దగ్గరకు వెళ్ళి ,తగినట్లు మాట్లాడి ,అతనితో కలయికకు కొంత వ్యవధి తీసుకొని రావాలి. ఆ తరువాత మనమంతా ఇంద్రునికి శ్రేయస్సు కలిగే మార్గం ఆచరిద్దాం" అన్నాడు. .అతని మాటలకు సంతోషించి దేవతలూ ,మునులూ వెళ్లిపోయారు. తరువాత.

క: **పౌలోమియు నా నహుషుని**
పాలికిఁ జనుటయు, నతండు భావజ వికృతి
వ్యాలోల మానసుండయి
లీలా సంభావనా లలిత ముఖుఁ డయ్యెన్. 163.

అ: పౌలోమియున్=శచీదేవి; ఆ నహుషుని పాలికిన్=ఆనహుషుని దగ్గరకు; చనుటయున్=వెళ్లగా; అతండు; భావజ వికృతి వ్యాలోల మానసుండు-అయి=మన్మథ వికారం చేత మిక్కిలి చలించిన మనస్సుకలవాడయి; లీలా సంభావనా లలిత ముఖుఁడు-అయ్యెన్=విలాసాలను భావించుకొని లలితమయిన (ప్రసన్నమయిన) ముఖం కలవాడయ్యాడు.

భా: *శచీదేవి నహుషుని దగ్గరకు వెళ్లింది. అతడు మన్మథవికారం చేత చలించిన మనస్సుతో విలాసాలను భావించుకొని ప్రసన్నుడయ్యాడు.*

వ: **అట్టియెడ.** 164.

భా: *అప్పుడు*

ఉ: **అల్లన యింతి యిట్లనియె "నారసి వాసవు కల్మి లేమియుం**
దెల్లముగా నెఱింగికొని, తేఁకువ లేకిట వచ్చుటొప్పు; నా
యుల్లము శంకితం బగుచు నుండఁగ, వేగిరపాటు మేలె? నీ
వెల్ల నెఱుంగు, దిప్పు డెడ యిచ్చుట యుక్తము, నాకుఁజూడఁగన్." 165

అ: అల్లన=మెల్లగా; ఇంతి=స్త్రీ(శచి); ఇట్లు-అనియెన్; ఆరసి=పరిశీలించి; వాసవు కల్మిలేమియున్=ఇంద్రుడు ఉన్నాడో లేడో; తెల్లముగాన్- ఎఱింగికొని=స్పష్టంగా తెలుసుకొని; తేఁకువలేక=జంకులేక; ఇటవచ్చుట ఒప్పున్=ఇక్కడకు రావడం తగును; నా ఉల్లము=నా మనస్సు; శంకితంబు అగుచున్ ఉండన్=సందేహిస్తూ ఉండగా; వేగిరపాటు మేలె?=తొందరపాటు మంచిదా?; నీవు; ఎల్లన్=అంతా; ఎఱుంగుదు; చూడఁగన్=పరిశీలిస్తే; ఇప్పుడు; నాకు; ఎడ ఇచ్చుట=కొంత వ్యవధి ఇవ్వడం; యుక్తము=తగినది;

భా: *మెల్లగా శచీదేవి ఇలా అంది. "ఇంద్రుడు ఉన్నాడోలేడో స్పష్టంగా తెలుసుకొని జంకు లేకుండా ఇక్కడకు రావడం మంచిది; నా మనస్సు సందేహంతో ఊగులాడుతూ ఉండగా తొందరపాటు మంచిదా? నీకన్నీ తెలుసు-ఇపుడు కొంత వ్యవధి నాకు ఇవ్వడం ఉచితం."'*

వ: **అని యొడంబఱచి కొండొక కాలం బెడ వలికికొని యింద్రాణియు**

మగుడం జనుదెంచె; నమరగణంబును ముని జనసహితంబుగా విష్ణుదేవుపాలికి రహస్యవృత్తిం బోయి జిష్ణునిదురితంబు వాపుటఁ గోరిన శౌరి గరుణాయత్తచిత్తుండై.166.

అ: ఒడంబఱచి=అంగీకరింపజేసి; కొండొక కాలంబు=కొంతకాలం; ఎడ-పలికి కొని=వ్యవధి పుచ్చుకొని; ఇంద్రాణి=శచీదేవి; అమరగణంబు=దేవతల సముదాయం; రహస్య వృత్తిన్=రహస్య ప్రవర్తనతో; జిష్ణుని దురితంబు=ఇంద్రుని పాపము; పాపుట=పోగొట్టుట; శౌరి=విష్ణువు; కరుణా-ఆయత్త చిత్తుండు=దయతో కూడిన మనస్సు కలవాడు.

భా: *అని ఒప్పించి కొంతకాలం వ్యవధి గ్రహించి శచీదేవి తిరిగి వచ్చింది; దేవతల సమూహం మునులతో సహా విష్ణువు దగ్గరకు రహస్యంగా వెళ్లి ఇంద్రుని పాపం పోగొట్టుమని కోరారు. అపుడు విష్ణుడు కరుణాయుత మయిన మనస్సు కలవాడయి............*

క: **"హయమేధంబున నాకుం**
బ్రియ మొనరింపఁగ వృత్రభేదికిఁ బుణ్యో
దయమగు" నావుడు వారలు
రయమునఁ జని రందఱుం బురందరు కడకున్. 167.

అ: హయమేధంబునన్=అశ్వమేధయాగంతో; నాకున్; ప్రియము ఒనరింపఁగన్ =ప్రీతి చేకూరిస్తే; వృత్రభేదికి =వృత్రుని చంపిన ఇంద్రునికి; పుణ్య-ఉదయమగున్=పుణ్యం కలుగుతుంది; నావుడున్= అనగానే; వారలు; అందఱున్; పురందరు కడకున్=ఇంద్రుని దగ్గరకు; రయమునన్ చనిరి =వేగంగా వెళ్లారు.

భా: 'అశ్వమేధయాగం చేసి నాకు ప్రీతి కలిగిస్తే ఇంద్రునికి పుణ్యం కలుగుతుంది' అనగానే వారంతా వెంటనే ఇంద్రుని దగ్గరకు వెళ్ళారు.

-: ఇంద్రుడు నహుషు తేజోవిశేషంబు సూచి మఱుఁగువడుట :-
సం. 5-13-16

క: **చని యతని నశ్వమేధం**
బునఁ గల్మష రహితుఁజేయఁ; బురుహూతుండుం
దన పురికి నరిగి నహుషుం
గని తత్తేజో విశేష కంపితుఁ డయ్యెన్. 168.

అ: చని=వెళ్లి; అశ్వమేధంబునన్=అశ్వమేధయాగంతో; అతనిన్=ఆయింద్రుని; కల్మష రహితున్ చేయన్=పాప రహితునిగా చేస్తే; పురుహూతుండున్=ఇంద్రుడునూ; తన పురికిన్ అరిగి; నహుషున్ కని; తత్ తేజస్ విశేష కంపితుఁడు అయ్యెన్=ఆతని గొప్ప తేజస్సు చేత చలించిపోయాడు.

భా: *వారంతా వెళ్లి అశ్వమేధ యాగంతో ఇంద్రుని పాపరహితునిగా చేశారు. అపుడు ఇంద్రుడు తన పట్టణానికి వెళ్లి నహుషుని చూసి ఆతని తేజో విశేషానికి*

చలించిపోయాడు.

వ: **ఇట్లు వృత్రారి దన బ్రహ్మహత్య వాయుటయే కాని నహుషునంత బలంబు లేమింజేసి భయాకులిత చిత్తుండై.** 169.

అ: వృత్ర+అరి=వృత్రుని శత్రువు (ఇంద్రుడు); పాయుట=విడుచుట; లేమిన్ చేసి=లేకపోవడం వల్ల ; భయ+అకులిత చిత్తుండై=భయముతో కలత చెందిన మనస్సు కలవాడై.

భా: ఇలా ఇంద్రుడు తన బ్రహ్మహత్యాపాతకం పోవడమే కాని తన కు నహుషునికున్నంత శక్తి లేకపోవడంచేత భయపడి..............................

క: **ఎందేనిఁజనియె; నాతని**
సుందరియును నెమ్మనమున శోకోద్రేకం
బొంది "పురందరుఁ డరిగిన
కందువ యే నిప్పు డెట్లు గాంతునొ? " యనుచున్. 170.

అ: ఎందేనిన్ చనియెన్=ఎక్కడికో వెళ్లిపోయాడు; అతని సుందరియును =అతని భార్య శచి; నెమ్మనమునన్=మనస్సులో; శోక+ఉద్రేకంబు-ఒంది=శోకాతిశయం పొంది (దుఃఖించి); పురందరుడు-అరిగిన=ఇంద్రుడు వెళ్లిన; కందువ=ప్రదేశము జాడ; ఏను=నేను; ఇప్పుడు; ఎట్లు; కాంతునో= తెలియుదునో; అనుచున్

భా: *ఎక్కడికో వెళ్లిపోయాడు ఇంద్రుడు. ఆతని భార్య శచీదేవి శోకించి తన భర్త వెళ్లిన ప్రదేశం తన కిప్పుడెట్లా తెలుస్తుందా అనుకొంటూ................*

వ: **నిశాసమయంబున నుపశ్రుతి నారాధించినఁ దదీయాధి దేవత 'నీసత్యంబు వలన నీ మగనిం గను' దని చెప్పి, యనంతరంబు సాకారయై పొడసూపినఁ, బౌలోమి "నీవెవ్వ" రని యడిగిన నదియును "భవత్పాతివ్రత్య సత్యశౌచంబులకుఁ బ్రియంబంది వచ్చితి నుపశ్రుతి నని జెప్పి "నీకుం బాక శాసనుం జూపెద ర"మ్మని తోడ్కొని "హిమవంతంబు నుత్తరంబున మంజుమంతంబను మహాశైలంబున కరిగి, దానియందు శతయోజన విస్తీర్ణంబైన యొక్క సరోవరంబు సొచ్చి, యచ్చట నుల్లసిల్లు పంచవర్ణ కమనీయంబులగు కమలంబులలో నొక్కనాళంబు భేదించి ముందటఁ బ్రవేశించె, నింద్రాణియుం దోడన చని తదీయ తంతుమధ్యంబున సూక్ష్మరూపంబున నున్న సురపతిం గన్నంత, నయ్యుపశ్రుతి యదృశ్య యగుటయు.** 171

అ: నిశాసమయంబునన్=రాత్రి సమయంలో; తదీయ+అధిదేవత=దానికి సంబంధించిన దేవత; కనుదు=చూస్తావు; సాకారయై=రూపు దాల్చినదై; పొడసూపినన్=కనపడితే; పౌలోమి=శచీదేవి; భవత్-పాతివ్రత్యము=నీయొక్క పతివ్రతా స్వభావము; పాకశాసనున్=ఇంద్రుని; శత యోజన విస్తీర్ణము=నూరు యోజనాల విశాలమయిన; పంచవర్ణ కమనీయంబులు=అయిదు రంగులతో అందమయినవి; ఇంద్రాణి=శచీదేవి; తోడన=వెనువెంటనే; తదీయ తంతు మధ్యంబునన్=ఆ పద్మపు తూడు యొక్క నాళాల మధ్యలో; అదృశ్యమగుట=అంతర్ధానమగుట.

భా: రాత్రి సమయంలో ఉపశ్రుతిని ఆరాధించింది శచీదేవి. అపుడు దాని అధిదేవత "నీ సత్యం వల్ల నీ భర్తను పొందుతావు" అని చెప్పి రూపంతో సాక్షాత్కరించింది. అంత శచీదేవి 'నీవెవ్వరవు' అని అడిగింది. అది "నీ పాతివ్రత్యానికీ ,సత్యానికీ ,శౌచానికీ ప్రీతిచెంది వచ్చాను ఉపశ్రుతిని " అని చెప్పి "నీకు ఇంద్రుని చూపిస్తాను ర" మ్మని శచీదేవితో హిమవత్పర్వతానికి ఉత్తరాన ఉన్న మంజుమంతమనే పర్వతం మీద నూరుయోజనాల విస్తీర్ణంకల సరస్సు ప్రవేశించి ,అక్కడున్న అయిదురంగుల పద్మాల నాళాలలో ఒక నాళాన్ని భేదించి తాను ముందు ప్రవేశించింది. వెనుకనే శచీదేవి ప్రవేశించి ఆ నాళాల మధ్యలో సూక్ష్మరూపంతో ఉన్న ఇంద్రుని చూచింది. వెంటనే ఉపశ్రుతి అంతర్ధానమయింది.

క: పతిసన్నిధి పడసి మహా
ద్భుత మందెడు శచి తదీయపూర్వ సుకర్మ
స్తుతి సేయుచు నిలచిన; నతఁ
డతివం గని సంభృతాదరాత్ముం డగుచున్. 172.

అ: పతి సన్నిధి పడసి= భర్తయొక్క చేరువను పొంది; మహాద్భుతము-అందెడు=గొప్ప సంతోషాన్ని పొందే; శచి; తదీయ పూర్వ సుకర్మ స్తుతి చేయుచున్=అమె యొక్క పూర్వ పుణ్యాన్ని స్తుతిస్తూ; నిలచినన్=నిలబడగా; అతఁడు=ఆ యింద్రుడు; అతివన్ కని=భార్యను (శచిని) చూసి; సంభృత-ఆదర-ఆత్ముండగుచున్=నిండైన ఆదరంతో కూడిన మనస్సుకలవాడయి.....

భా: భర్త దగ్గరకు వచ్చి ఎంతో సంతోషించే శచీదేవి తనపూర్వపుణ్యాన్ని ప్రశంసిస్తూ నిలిచింది. అపు డింద్రుడు శచిని చూసి ఎంతో ఆదరంతో (ఇలా అంటున్నాడు)

ఉ: ఇచ్చట నేను నిల్చు టిది యెట్టు లెఱింగితి? నన్నుఁగాన నీ
వచ్చిన కార్యమేమి? యనవద్యగుణోత్తర! చెప్పు; నావుడుం
బొచ్చెము లేక యా నహుషు పోయినపోకలు, దానికిం దగం
జెచ్చెరఁ గాలయాపనము సేసిన భంగియుఁ జెప్పె దేవియున్. 173

అ: ఇచ్చటన్; నేను నిల్చుట-ఇది= నేనిక్కడ ఉన్నాను అనే విషయం; ఎట్టులు; ఎఱింగితి(వి)? =తెలుసుకొన్నావు?; నన్నున్ కానన్=నన్ను దర్శించటానికి; నీ వచ్చిన కార్యమేమి? =నీవు వచ్చిన పని ఏమిటి?; అనవద్యగుణ+ఉత్తర!=నిర్దోషమయిన గుణములతో శ్రేష్ఠురాలా!; చెప్పు=చెప్పుము; నావుడున్=అనగానే; దేవియున్=శచీదేవి; ఆ నహుషు పోయినపోకలు=ఆనహుషుడు ప్రవర్తించిన తీరు; దానికిన్; చెచ్చెరన్=వెంటనే; కాలయాపనము చేసిన భంగియున్=కాలక్షేపం చేసిన తీరూ; పొచ్చెము లేక=దాపరికము లేకుండా; చెప్పెన్.

భా: 'ఇక్కడ నేనున్నానని నీకెట్లా తెలిసింది? (నన్ను చూసేందుకు) ఏమి పనిమీద వచ్చావు? శుభగుణశీలా చెప్పుము' అంటే శచీదేవి వెంటనే నహుషుని ప్రవర్తన, దానికి తా ను కాలక్షేపం చేసిన తీరూ దాచకుండా చెప్పింది.

వ: చెప్పి యుపశ్రుతి తెఱంగును నతని కెఱింగించి, "దేవా! నీ విత్తఱిం బ్రకాశుండవై, భవత్ప్రతాపంబున నహుషునకుఁ బరాభవం బొనరించి, నన్ను రక్షింపక తక్కిన, నుక్కివుండగు నతని పాపనిశ్చయంబున నాపద వచ్చు, "ననిన విని వల్లభకు దివిజవల్లభుం డిట్లనియె. 174.

అ: ఈ+తఱిన్=ఈసమయంలో; ప్రకాశుండవై=బయటపడి; భవత్ప్రతాపంబునన్=నీ యొక్క పరాక్రమంతో; పరాభవము=అపజయము; ఉక్కివుండు =దుష్టుడు; పాపనిశ్చయంబు నన్=పాపపు నిర్ణయంతో; దివిజవల్లభుడు=దేవతలరాజు

భా: అని చెప్పి ఉపశ్రుతి విశేషం కూడా అతనికి చెప్పి "దేవా! నీ వీసమయంలో బయటపడి నీ పరాక్రమంతో నహుషుని జయించి నన్ను రక్షింపకుండా ఊరుకుంటే దుర్మార్గుడయిన నహుషుని పాపకృత్యం వల్ల ఆపద కలుగుతుంది" అంది. ఆ మాటలు విని శచీదేవితో ఇంద్రుడిలా అన్నాడు.

క: **ఆ నహుషు బాహుగర్వ మ**
నూనంబై యున్నయది, సముజ్జ్వల మునిస
న్మాన ప్రవృద్ధమగుటను,
దానం గాలంబు వేచెదను జయమునకున్. 175.

అ: సముజ్జ్వల...... మగుటను; సమ్+ఉజ్జ్వల=మిక్కిలి విజృంభించిన; ముని=మహర్షుల యొక్క; సన్మాన=సత్కారముచేత; ప్రవృద్ధము+అగుటను=వృద్ధిపొందిన దగుటచే; ఆ నహుషు బాహుగర్వము=ఆనహుషుని భుజగర్వం; అనూనంబై-ఉన్నయది= కొఱతలేనిదై ఉన్నది; దానన్=అందుచేత; జయమునకున్=జయించటానికి; కాలంబు=సమయం; వేచెదను=ఎదురు చూస్తున్నాను.

భా: మునుల తపోబలంతో వృద్ధిపొందిన ఆనహుషుని భుజగర్వం లోటులేనిదిగా ఉంది. అందుచే జయించే సమయంకోసం వేచి ఉన్నాను.

చ: **తఱి యగు నంతకున్ రిపునుదగ్రత సైచుట నీతి; నీవు నా**
కఱపిన యట్ల చేయుము; తగంజని యాతనిఁ గాంచి, "నన్ను నె
త్తెఱఁగున నైనఁ బొందఁగ మదిం దలపోఁతయ కల్గెనేనిఁ గ్ర
చ్చఱ మునివర్గవాహనుఁడవై చనుదె" మ్మను మంతఁ దీఱెడున్. 176.

అ: తఱి-అగునంతకున్=సమయం వచ్చేదాకా; రిపు +ఉదగ్రత=శత్రువు యొక్క విజృంభణను; సైచుట=సహించుట; నీతి=రాజనీతి; నీవు; నాకఱపిన అట్లు=నేను చెప్పినట్లు; చేయుము; తగన్=సముచితంగా; చని=వెళ్లి;ఆతనిన్ కాంచి=ఆ నహుషుని దర్శించి; "నన్నున్; ఏ+తెఱఁగునన్ ఐనన్=ఏ విధంగా నయినా; పొందఁగన్=పొందటానికి; మదిన్=మనసులో; తలపోఁతయు కల్గెనేని=ఆలోచన కలిగితే; క్రచ్చఱన్=వెంటనే; మునివర్గ

వాహనుఁడవై=మహర్షులసముదాయము వాహనముగా కలవాడవై; చనుదెమ్ము=రమ్ము" అనుము=అని చెప్పుము; అంతన్ తీఱెడున్=అంతటితో పనితీరుతుంది.

భా: సమయం వచ్చేవరకూ శత్రువు యొక్క విజృంభణను సహించడం రాజనీతి. నీవు నేను చెప్పినట్లు చేయుము. సముచితంగా-వెళ్లి అతనిని చూసి "నన్ను నీవు పొందదలిస్తే ముని వర్గాన్ని వాహనంగా చేసుకొని(పల్లకి మీద) రా;" అని చెప్పు, అంతటితో మనపని సానుకూలమవుతుంది.

ఆ: అనిన 'నట్లకాక'యని పతివీడ్కొని
యింతి నహుషుపాలి కేఁగుదెంచె;
నతఁడు దమక మడర నద్దేవిఁ బెద్దయు
నాదరించి యిష్ట మడుగుటయును. 177.

అ: అనినన్; 'అట్ల-కాక' అని=సరే అని; పతిన్ వీడ్కొని=భర్తను వదలి; ఇంతి = కాంత (శచి) నహుషుపాలికిన్=నహుషుని దగ్గరకు; ఏఁగుదెంచెన్=వచ్చింది; అతఁడు=ఆ నహుషుడు; తమకము-అడరన్=మోహమధికము కాగా; ఆ+దేవిన్=ఆ శచీదేవిని; పెద్దయున్=మిక్కిలిగా; ఆదరించి; ఇష్టము=ఆమె కోరిక/అభీష్టము; అడుగుటయును =అడగడమూ (తర్వాతి వచనంతో అన్వయం)

భా: అంటే 'అట్లాగే' అని శచీదేవి ఇంద్రునినుండి నహుషుని దగ్గరకు వచ్చింది. ఆ నహుషుడు మోహంతో ఆమెను ఎంతగానో ఆదరించి ఆమె అభీష్టాన్ని గురించి అడిగాడు.

వ: ఇంద్రాణియు నిట్లనియె; "మన నిరూపించిన సమయంబునకుఁ గొండొక తడవుగలదు, కాలం బగుటయు నిన్ను వరియించెద, నీవు మహాముని వాహనుండవు గా వలయు, నది నాకుఁ బ్రియంబు, నీకునన్య సామాన్యంబైన యానంబు దేజోవిశేషకరం బగు" ననిన నప్పలుకులకు నహుషుండు ప్రహర్షచిత్తుండై. 178.

అ: ఇంద్రాణి=ఇంద్రునిభార్య;కొండొకతడవు=కొంతసమయము; అనన్య సామాన్యంబు = ఇతరులకు శక్యంకానిది; యానంబు=వాహనము; తేజోవిశేషకరంబు-అగు=అధికమైన తేజస్సును కలిగిస్తుంది; ప్రహర్షచిత్తుండు+ఐ=సంతోషించిన మనస్సు కలవాడై

భా: శచీదేవిఇట్లా అంది;"మనం నిర్ణయించుకొన్న సమయానికి ఇంకాకొంతకాలం మిగిలిఉంది. సమయంకాగానే నిన్ను నేను వరిస్తాను. కాని నీవు మునీశ్వరులను వాహనం చేసుకొని రావాలి. అది నాకు చాలా ఇష్టం. ఇతరులకు సాధ్యంకాని ఆ వాహనం నీకు తేజస్సును చేకూరుస్తుంది" ఆ మాటలకు నహుషుడు మనసులో ఎంతో సంతోషించాడు.

ఆ: ఏను దక్క నొరుల కెవ్వరికైన న
వ్వాహనంబు నెక్కవశమె? నీకు
సమ్మదంబుగాఁగ సప్తర్షిగణము నా
యందలంబు మోవ నరుగుదెంతు. 179.

అ: ఏను-తక్క=నేను తప్ప; ఒరులకున్=ఇతరులకు; ఎవ్వరికిన్-ఐనన్= ఎవరికయినా; ఆ+వాహనంబున్; ఎక్కవశమె?; నీకున్; సమ్మదంబు-కాగన్=సంతోషం కలిగేటట్లు; సప్త+ఋషి-గణము=సప్తమహర్షుల సముదాయం; నా అందలంబు మోవన్= నా పల్లకిని మోయగా; అరుగుదెంతున్=వస్తాను.

భా: నేను తప్ప ఇంకెవరూ అటువంటి వాహనం ఎక్కలేరు. ఎక్కడం వారికి శక్యం కాదు. నీకు సంతోషం కలిగేటట్లు అట్లాగే సప్త మహర్షులూ నాపల్లకి మోయగా నేను నీ దగ్గరకు వస్తాను.

వి: సప్తర్షులు: వశిష్ఠుడు, అత్రి, గౌతముడు, కశ్యపుడు, భరద్వాజుడు,జమదగ్ని, విశ్వామిత్రుడు.

క: **అని, వనితఁ బంచి యప్పుడ**
మునులం బిలిపించి మౌర్ఖ్యమునఁ దనకున్ వా
హనముగఁ జేసి యొకింతయు
ననుమానము లేక తిరిగె నతఁ డెల్లెడలన్. 180.

అ: అని; వనితన్ పంచి=శచీదేవిని పంపించివేసి; అప్పుడ=అప్పుడే/ వెంటనే; మునులన్ పిలిపించి; మౌర్ఖ్యమునన్= మూర్ఖస్వభావంతో; తనకున్ వాహనముగన్ చేసి=తనకు వాహనంగా చేసుకొని; అతఁడు=ఆ నహుషుడు; ఒకింతయున్ అనుమానము లేక=ఏమాత్రము సంకోచము లేకుండా; ఎల్ల-ఎడలన్= అన్ని ప్రదేశాల్లోనూ; తిరిగెన్=సంచరించాడు.

భా: అట్లా చెప్పి శచిని పంపించి వెంటనే మునులను రప్పించి మూర్ఖుడై వారిని తనకు వాహనంగా చేసుకొని నిస్సంకోచంగా అంతటా తిరగడం మొదలు పెట్టాడు.

క: **చని పౌలోమియు సురగురుఁ**
గని, "నహుషుఁడు వేచియున్నకాలం బెడ లే,
దనిమిషనాథున కిత్తఱి
ననుగ్రహము సేయవలయు నవహితబుద్ధిన్. 181.

అ: పౌలోమియున్=శచీదేవి; చని=వెళ్లి; సురగురున్‌కని=బృహస్పతిని చూసి; "నహుషుఁడు వేచి ఉన్న కాలంబు=నహుషుడు నిరీక్షించే సమయం; ఎడలేదు=దూరంగా లేదు/ ఎంతోకాలం లేదు; ఈ+తఱి=ఈ సమయంలో; అవహిత బుద్ధిన్=సమాహితమయిన మనస్సుతో/ ఏకాగ్రబుద్ధితో; అనిమిషనాథునకున్=ఇంద్రునకు; అనుగ్రహము-చేయవలయున్=అనుగ్రహము చూపాలి.

భా: శచీదేవి బృహస్పతి దగ్గరకు వెళ్లి "నహుషుడు నిరీక్షించే సమయం దగ్గరపడుతున్నది. ఈ సమయంలో ఇంద్రునిపై ఏకాగ్రబుద్ధితో అనుగ్రహం ప్రకటించాలి.'

వ: **శరణాగతనైన నన్ను రక్షింపు" మనిన నతం డిట్లనియె.** 182.

అ: శరణ+ఆగతను=శరణుకోరి వచ్చినదానను

భా: శరణుకోరి వచ్చిన నన్ను రక్షింపుము" అనగానే ఆ బృహస్పతి ఇలా అన్నాడు.

క: " ఆ నహుషువలన నాపద
రా నీ; నాతనికి నాతురత గావింపం
బూని యొనర్చెద వేలిమి;
దానను, ముని వాహనత, గత స్థైర్యుఁ డగున్. 183.

అ. ఆనహుషువలనన్;ఆపదరానీను=ఆపదరానివ్వను; ఆతనికిన్; ఆతురతన్ కావింపన్=తొందరపాటు(మోహము/ తమకము) కలిగించేందుకు; పూని=ప్రయత్నించి; వేలిమిఒనర్చెదన్=హోమముచేస్తాను; దానను=దానివల్లనూ; మునివాహనతన్=మునులను వాహనంగా చేసుకొనడం వల్లనూ;(అతడు) గత స్థైర్యుఁడు-అగున్=మానసిక స్థిరత లేనివాడవుతాడు.

భా. ఆ నహుషుని వల్ల నీకేమీ ఆపద రానివ్వను. అతనికి తొందరపాటు కలిగేటట్లు హోమం చేస్తాను. దానివల్లనూ, ఇంకా అతడు మునులను వాహనంగా చేసుకొనడం వల్లనూ అతడు మానసిక ధైర్యమును కోల్పోతాడు.

క: వెరవున నీ పతి యునికియు
నరసెద" నని యూఱడించి యప్పుడ వైశ్వా
నరు నర్చితుఁజేసి పురం
దరు తెఱఁగుం జెప్పి యతనిఁ దడవం బనిచెన్. 184.

అ: వెరవునన్=ఉపాయముతో;నీపతి-ఉనికియున్=నీభర్తఅయిన ఇంద్రుడు న్నచోటునూ; అరసెదన్=అన్వేషిస్తాను/ వెదకుతాను; అని-ఊఱడించి; అప్పుడ=వెంటనే; వైశ్వానరున్=అగ్నిహోత్రుని; అర్చితున్ చేసి=పూజించి; పురందరు తెఱగున్ చెప్పి=ఇంద్రుని పరిస్థితి తెల్పి; అతనిన్=ఇంద్రుని; తడవన్ పనిచెన్=వెదకమని ఆజ్ఞాపించాడు.

భా: నేర్పుతో నీ భర్తను కూడ వెదకిస్తాను అని చెప్పి ఆ శచిని ఊరడించి బృహస్పతి వెంటనే అగ్నిని పూజించాడు. అగ్ని ప్రత్యక్షమయ్యాడు. అతనికి ఇంద్రుని పరిస్థితి చెప్పి అతనిని వెదకవలసినదిగా ఆజ్ఞాపించాడు.

-: అగ్నిదేవుఁ డింద్రుని వెదకి బృహస్పతికిం దెలుపుట:-
సం.5-15-27

వ: పనిచిన వహ్నియు వనితా రూపంబునం జని, మనోగతి యగుటం జేసి సర్వదిశలును భూమ్యంతరిక్షంబులును గిరివిపినంబులును గొండొక సేపునకుం గలయం జూచి, సంక్రందను నెందునుం గానక మగిడి వచ్చి, వాచస్పతికి నత్తెఱం గెఱింగించి, నాకు జలంబులు ప్రవేశింపరామి నంద పరికింపనేరనైతి;నప్పుల వలన నగ్నియు, బ్రాహ్మణుల వలన క్షత్రియ జాతియు,నశ్మంబువలన లోహంబును నుద్భవించె; వాని వాఁడిమి యెల్ల యెడలనుం జెల్లుఁదమతమ జన్మస్థానంబులయం దడఁగుం; గావున నీళ్లు నాకు సంక్షయంబు సేయుట సుప్రసిద్ధం బనిన విని యనిమిషగురుండు హవ్యవాహను నత్యంత గౌరవంబునం గనుంగొని. 185.

అ: పనిచినన్=పంపగా; వహ్నియున్=అగ్ని; వనితారూపంబునన్= స్త్రీ రూపంలో; మనోగతి=మనస్సుయొక్క గమనము వంటి గమనము-అనగా మనోవేగము; సర్వదిశలును=అన్ని దిక్కులూ; భూమి-అంతరిక్షంబులును=భూమి,ఆకాశమూ; గిరివిపినంబులును=పర్వతాలూ, అరణ్యాలూ; కొండొకసేపునకున్ =కొద్దిసేపటిలోనే; కలయన్ చూచి=పరిశీలించి; సంక్రందనున్ =ఇంద్రుని; మగిడి=తిరిగి; అ+తెఱంగు=అ పద్ధతి (అవార్త); అప్పులు=నీరు; అశ్మము=రాయి; ఎల్లయెడలను=అంతట; సంక్షయంబు=నాశనము; అనిమిషగురుండు=దేవతల గురువు; హవ్యవాహనున్ = అగ్నిహోత్రుని

భా: బృహస్పతి ఆజ్ఞతో అగ్ని బయలుదేరాడు స్త్రీ రూపంలో- మనోవేగంతో వెళ్లి అన్ని దిక్కులూ పరికించాడు. భూమ్యాకాశాలలో అన్ని పర్వతాలూ, అరణ్యాలూ కలయజూశాడు. ఎక్కడా ఇంద్రుడు కనపడలేదు. తిరిగి వచ్చి బృహస్పతికి ఆ విషయం చెప్పి ఇంకా ఇలా అన్నాడు. "నేను నీళ్లలో ప్రవేశింపలేను కావున నీళ్లలోచూడలేదు. నీళ్లనుండి అగ్నిపుట్టినది. బ్రాహ్మణుల వలన క్షత్రియులు పుట్టారు. రాతినుండి లోహం జనించింది. అందుచేత వాని శక్తి ఇతరత్రా అంతటా చెల్లుతుంది కాని తమతమ జన్మస్థానాల దగ్గర అణిగి పోతుంది. నాకు నీళ్లు నాశమును చేకూర్చడం ప్రసిద్ధమే కదా", అనిన ఈ మాటలు విని బృహస్పతి అగ్నిని ఎంతో గౌరవించి ఇలా అన్నాడు.

మ: సకల స్థావర జంగమంబులు భవత్సాన్నిధ్యమాత్రంబునన్
వికసిల్లుం; గ్రతువైభవంబులుఁ జతుర్వేదంబులున్ నీవ; పా
వక! నీయంద జలంబులుం గలిగె, విశ్వవ్యాప్తిమై నున్న నీ
కొక చోటెట్లు లగమ్యమయ్యె? నిను నీ వూహింపు పెంపారఁగన్. 186.

అ: సకల స్థావర జంగమంబులు = (స్థావరములు = స్థిరమయినవి, జంగమంబులు=కదిలేవి) అన్ని చరాచరాలూ; భవత్ + సాన్నిధ్య మాత్రంబునన్ = నీవు

సమీపమందుండటం చేతనే; వికసిల్లున్=ప్రకాశిస్తాయి; క్రతు వైభవంబులున్=నాల్గు వేదాలూ; నీవ+నీవే; పావక!=ఓ అగ్నిహోత్రుడా!; నీయంద=నీలోనే; జలంబులున్ కలిగెన్=నీళ్లు కూడా ఉన్నాయి; విశ్వవ్యాప్తిమైన్-ఉన్న=విశ్వమంతటావ్యాపించిఉన్న; నీకున్;ఒకచోటు; ఎట్టులు;అగమ్యమయ్యెన్?=ప్రవేశింపరానిదయింది?; పెంపారఁగన్=వైభవముతో; నినున్ నీవు ఊహింపు=నిన్ను నీవు ఊహించుకో.

భా: *సకల చరాచర ప్రకృతీ నీ ఎదుట ఉంటే చాలు ప్రకాశిస్తుంది. యజ్ఞాలూ, వేదాలూ నీవే- నీరూపాలే! నీలోనే జలములున్నాయి. నీవు విశ్వమంతటా వ్యాపించి ఉన్నావు. అటువంటి నీకు ఒకచోటు చొరరాని దెట్లు అవుతుంది? నిన్ను నీవు ఒక్కసారి వైభవంతో ఊహించుకో.*

ఉ: **ఏనును బ్రహ్మ మంత్రముల నెంతయు నీ కభివృద్ధిఁ జేసెదం,**
గాన విశంకతన్ సలిలగామివి గ; మ్మనినం గృశానుఁడుం
బూనిక నేఁగి వారినిధి భూరి నదీ సరసీ తటాక సం
తానము రోయుచుం జని శతక్రతుఁ డున్న సరోవరంబునన్. 187.

అ: ఏనును=నేను కూడా;బ్రహ్మమంత్రములన్=వేదమంత్రాలతో;నీకున్, ఎంతయున్=మిక్కిలి; అభివృద్ధిన్-చేసెదన్=అభివృద్ధికలిగిస్తాను/ అభ్యుదయం కలిగిస్తాను; కాన=అందుచేత; విశంకతన్=నిస్సందేహంగా; సలిలగామివి కమ్ము=నీటిలో ప్రవేశించు; అనినన్=అనగానే; కృశానుఁడున్=అగ్నియు; పూనికన్ ఏగి=ఉత్సాహంతో వెళ్లి; వారినిధి,భూరినదీ, సరసీ,తటాక సంతానమున్=సముద్రాలూ, పెద్దనదులూ, చెరువులూ, మడుగులూ మొదలయిన వాని సమూహాలన్నీ; రోయుచున్ చని=వెదకుతూ వెళ్లి; శతక్రతుఁడు-ఉన్న=ఇంద్రుడున్న; సరోవరంబునన్=చెరువులో..............

భా: *నేనుకూడా నీకు బ్రహ్మ మంత్రాలతో పుష్టినీ, అభ్యుదయాన్నీ కలిగిస్తాను. నీవు నిశ్శంకంగా వెళ్లి నీటిలో ప్రవేశించు;'' అనగానే అగ్ని ఉత్సాహంతో వెళ్లి సముద్రాలూ,నదులూ, సరస్సులూ వెదకుతూ వెళ్లి వెళ్లి ఇంద్రుడున్న చెరువులో.................*

ఉ: **అంబురుహంబులం గలయ నారసి, చొచ్చియొకండు, నాళ సూ**
త్రంబున నున్న యింద్రుఁ గని, రాగమునన్ గురునొద్ద కగ్ని శీ
ఘ్రంబున నేఁగుదెంచి, తన కన్న తెఱం గెఱిఁగింప; నాతఁడు
ల్లంబున నుల్లసిల్లి, సురలన్ మునులం దగఁగూర్చి గ్రక్కునన్. 188.

అ: అంబురుహంబులన్=పద్మాలను; కలయన్ అరసి=కలయజూసి; ఒకండు చొచ్చి=ఒక దానిలో ప్రవేశించి; నాళ సూత్రమ్మునన్ ఉన్న=తామర తూడులో ఉన్న; ఇంద్రున్ కని=ఇంద్రుని చూసి; రాగమునన్=ఉత్సాహముతో; అగ్ని; గురు నొద్దకున్=బృహస్పతి దగ్గరకు; శీఘ్రంబునన్ ఏగుదెంచి=వేగంగా వెంటనే వచ్చి; తనకన్నతెఱంగు ఎఱిఁగింపన్=తాను చూసిన విధానం చెపితే; అతఁడు=ఆ బృహస్పతి; ఉల్లంబునన్ ఉల్లసిల్లి=మనసులో సంతోషించి;

గ్రక్కునన్=వెంటనే; సురలన్=దేవతలనూ; మునులన్=మహర్షులనూ; తగన్ కూర్చి=తగునట్లు కలుపుకొని...............

భా: చెరువులో పద్మాల నన్నిటినీ కలయజూశాడు అగ్ని. అందులో ఒకదానిలో ప్రవేశించి, దాని తూడులో ఉన్న ఇంద్రుని చూసి వెంటనే బృహస్పతి దగ్గరకు వచ్చి తాను చూసినదంతా చెప్పాడు. వెంటనే బృహస్పతి దేవతలనూ ,ఋషులనూ కూర్చుకొని............

మ: దివిజాధీశ్వరు పాలికిం జని కృతార్థీభూత చేతస్కుఁడై,
వివిధ స్తోత్ర పరంపరా చతుర వాగ్విన్యాసతం బ్రీతుఁజే
సి, "వరిష్ఠం బగునీదు కృత్యము ననుష్ఠింపంగ నీ వుత్సహిం
పవు, నీకేమి కొఱంత? వృత్ర వధ యే పాపంబు రూపింపుమా. 189.

అ: దివిజ+అధి+ఈశ్వరు పాలికిన్=దేవేంద్రుని దగ్గరకు; కృతార్థీభూత చేతస్కుఁడై =కృతార్థతనొందినమనస్సుకలవాడై; చని=వెళ్లి; వివిధ..........విన్యాసతన్=వివిధ=అనేకములయిన; స్తోత్ర=స్తుతుల;పరంపరా=వరుసలలో; చతుర=నేర్పుకల;వాక్-విన్యాసతన్=మాటల విన్యాసంతో; (ఇంద్రుని) ప్రీతున్ చేసి=సంతుష్టుని చేసి; వరిష్ఠంబగు=శ్రేష్ఠమయిన; నీదుకృత్యమున్=నీ పనిని; అనుష్ఠింపంగన్=చేయటానికి; నీవు; ఉత్సహింపవు?=ఉత్సాహపడవు?; నీకేమి కొఱంత? =నీకేమిలోటు? వృత్రవధ=వృత్రాసురుని సంహరించడం; ఏపాపంబు=ఎంతపాపం? ఏమంతపాపం? అసలదిపాపమా?; రూపింపుమా?=నిరూపించు/ ఆలోచించు.

భా: (మునులతో ,దేవతలతో) బృహస్పతి కృతార్థుడై ఇంద్రుని దగ్గరకు వెళ్లాడు. ఎన్నో స్తుతులతో ఇంద్రుని సంతృప్తి పరిచారు. "నీవు శ్రేష్ఠమయిన నీ కర్తవ్యం నెరవేర్చవు.- ఎందువలన? నీకేమి లోటు? వృత్రాసుర వధ ఏం పాపం? పాపంకాదు. ఆలోచించు.

క: శరనిధి ఫేనంబున నా
హరి పొంది, జగద్విరోధియగు వృత్రునిఁ దాఁ
బరిమార్చ, నీకు విజయము
దొరకొనియెం గాక! దీన దోసము గలదే! 190.

అ: శరనిధి ఫేనంబునన్=సముద్రపు నురుగులో;ఆహరి పొంది=ఆ విష్ణువు ప్రవేశించి; జగత్ విరోధియగు=లోకాలకు శత్రువయిన; వృత్రునిన్=వృత్రాసురుని, తాన్=తాను; పరిమార్చన్=చంపితే; నీకున్; విజయము; దొరకొనియెన్ కాక=లభించింది గాని;దీనన్=దీనిలో; దోసము కలదే!=దోషం ఉందా?

భా: సముద్రపు నురుగులో హరి ప్రవేశించి లోక శత్రువయిన వృత్రాసురుని సంహారం చేశాడు. దానితో నీకు విజయం లభించింది. అంతేకాని దీనిలో దోషం ఏముంది? (ఏమీ లేదు)

వ: **అని సముచితంబుగా సంబోధించిన గురుని సంభాషితంబుల నిర్దోషితుండయి నిజరూపంబు వహించి సకల సుమనోముని సహితంబుగా నతని సంభావించి జంభారి "గర్తవ్యం బెయ్యది" యని యడిగిన నాచార్యుం 'డితం డెఱింగినను విస్పష్టంబుగా నహుషు వృత్తాంతం బంతయు వివరించెదంగాక' యని తలంచి యిట్లనియె.** 191.

అ: సముచితంబుగాన్=తగినట్లు; సంబోధించినన్=ప్రబోధం కలిగిస్తే; నిర్దోషితుండయి =నిర్దోషిగా చేయబడినవాడయి; నిజరూపంబు=తనరూపం; సకల సుమనస్-ముని సహితంబుగాన్=దేవతలు, మునులు అందరితో కూడా; జంభారి=ఇంద్రుడు; కర్తవ్యంబు =చేయవలసినపని; ఆచార్యుండు=బృహస్పతి.

భా: *అని తగిన రీతిలో ప్రబోధించాడు బృహస్పతి. అతని మాటలతో నిర్దోషి అయి ఇంద్రుడు నిజరూపం ధరించి దేవతలనూ, మహర్షులనూ, బృహస్పతినీ పూజించి "ఇపుడు చేయవలసిన పని ఏది?" అని అడిగాడు. అపుడు గురుడు "ఇతనికి తెలిసినా సరే స్పష్టంగా నహుషుని చరిత్ర అంతా చెప్పుదును." అని అనుకొని ఇలా అన్నాడు.*

క: **నాఁ డట్లు నీవు నీదగు**
పోఁడిమి సెడి యడఁగుటయును,భువనంబుల కె
వ్వాఁడును రక్షకుఁడయ్యెడు
వాఁడి మగఁడు లేమిఁ, ద్రిదశవర్గము మునులున్. 192.

అ: నాఁడు=ఆనాడు; అట్లు=అవిధంగా; నీవు; నీదగు పోడిమి చెడి=నీలక్షణం విడిచి; అడఁగుటయును=అణిగిదాగి ఉండటమూ; భువనంబులకున్=లోకాలకు; ఏ-వాఁడును=ఎవడూ; రక్షకుఁడు అయ్యెడు=రక్షింపగ గల; వాఁడి మగఁడు లేమిన్=పరాక్రమశాలి లేకపోవడం చేత; త్రిదశవర్గమున్-మునులున్=దేవతలూ, మహర్షులూ.........

భా: *ఆనాడు నీవట్లా నీధర్మం విడిచి దాగిపోతే లోకాలకు రక్షకుడుగా నిలువగల పరాక్రమశాలి ఎవడూ లేకపోవడం చేత దేవతలూ మునులూ (ఇలా అనుకున్నారు).*

ఉ: **ఒండొరుచేతఁ బీడవడ నోపక, రక్షకుఁడైనవాని నా**
ఖండలతుల్యు నేమిగతిఁ గాంతు మొకో!యనుచున్నచోట "ను
ద్దండ బలైక రక్ష్యము శతక్రతు రాజ్యము, దాని నేల న
న్యుండు సమర్థుఁడే?" యనుచు నొల్లరు దివ్యులలోన నెవ్వరున్. 193.

అ: ఒండొరుచేతన్=ఒకరొకరిచేత;-పీడ-పడన్-ఓపక=బాధ పొందలేక; రక్షకుఁడు-ఐనవానిన్=రక్షింపగల వానిని; ఆఖండలతుల్యున్=ఇంద్రునితో సమానుడయిన వానిని; ఏమిగతిన్ కాంతుము ఒకో!=ఏవిధంగా పొందుతామో కదా!; అనుచున్నచోట =అనుకొంటున్న చోట; శతక్రతురాజ్యము=ఇంద్రుని రాజ్యము; ఉద్దండ,బల-ఏక, రక్ష్యము=అధికమయిన బలము

కలవానిచేతనే రక్షింప దగినది; దానిన్=అటువంటి రాజ్యమును; ఏలన్=పాలించుటకు; అన్యుండు=ఇతరుడు; సమర్థుడే!=సమర్థుడా? (కాడు) అనుచున్; దివ్యులలోనన్=దేవతలలో; ఎవ్వరున్=ఎవరూ; ఒల్లరు=అంగీకరింపలేదు.

భా: *ఇతరులచేత పీడనొందకుండా రక్షింపగల వానిని ఇంద్రసమానుని ఎట్లా పొందగలము? అనుకొంటున్న సమయంలో దేవతలు "దేవేంద్రుని రాజ్యం మహాబలవంతుని చేత మాత్రమే రక్షింపబడదగినది- దానిని పాలించటానికి ఇతరుడు తగునా? అంటూ ఎవరూ దానికి అంగీకరించలేదు.*

వ: **అట్టి సమయంబున మునిజన సహితంబుగ ననిమిషులు నహుషు కడకుం జని మనంబుల మనుజుండను ననుమానంబుదక్కి యతని నింద్రపదవిఁ బరిపాలించుటకుం బ్రార్థించిననతండును దాను హీనబలుండనని శంకించినం దమతమతేజంబుల యంశంబులతనికొసంగి శక్తిమంతుంగావించి యభిషిక్తుం జేసిన.** **194.**

అ: అనిమిషులు=దేవతలు; హీనబలుండు=తక్కువబలము కలవాడు; అంశంబులు=భాగంబులు; శక్తిమంతుఁడు=శక్తికలవాడు

భా: *అపుడు మునులతో సహా దేవతలు నహుషుని దగ్గరకు వెళ్లారు. మనస్సులలో 'మనుష్యుడ'నే అనుమానం విడిచి అతనిని ఇంద్రపదవి వహించటానికి ప్రార్థించారు. అతడు తాను బలం తక్కువవాడనని సందేహించాడు. అపుడు దేవతలూ మహర్షులూ తమతమ తేజస్సుల భాగాలు అతనికిచ్చి నహుషుని శక్తికలవానినిగా చేసి పట్టాభిషిక్తుని చేశారు.*

క: **మహనీయ భవత్పదవీ**
మహితుండై, నహుషుఁడేచి, మనమున ధర్మ
స్పృహ దక్కి తన్ను నిప్పుడు
వహియింపగ సన్మునీంద్రవర్గముఁ బనిచెన్. **195.**

అ: మహనీయ భవత్ పదవీ మహితుండై=గొప్పదయిన నీఇంద్రపదవితో మహిమ కలవాడయి; నహుషుఁడు; ఏచి=విజృంభించి/ గర్వించి; మనమునన్=మనసులో; ధర్మస్పృహ-తక్కి=ధర్మాసక్తి విడిచి; ఇప్పుడు; తన్ను; వహియింపఁగన్=మోయటానికి; సత్మునీంద్ర వర్గమున్=మహర్షుల సముదాయాన్ని; పనిచెన్=ఆజ్ఞాపించాడు.

భా: *గొప్పదయిన ఇంద్రపదవితో నహుషుడు గర్వించి, మనసులో ధర్మస్పృహ విడిచి ,తన్ను మోయటానికి మహర్షులను ఆజ్ఞాపించాడు.*

ఆ: **ఇదియకాదు, మఱియు నెన్నియు దుర్విన**
యములు గలవువాని, కలసి నిన్ను

వెదక వచ్చితిమి; వివేకహీనుండగు
నతనిఁజెఱుప నిప్పు డవసరంబు; 196.

అ: ఇదియకాదు= ఇదేకాదు; మఱియున్=ఇంకా; వానికిన్; ఎన్నియున్=ఎన్నో; దుర్వినయములు కలవు=దుష్టకార్యములు కలవు; (కావున) అలసి=అలసిపోయి;నిన్ను; వెదక వచ్చితిమి=నిన్ను అన్వేషింపవచ్చాము; వివేకహీనుండు అగు అతనిన్=వివేకం లేని అతనిని; చెఱుపన్=నశింప జేయుటకు; ఇప్పుడు; అవసరంబు= తగిన సమయం.

భా: ఇదేకాదు. అతని దగ్గర ఇంకా ఎన్నో తప్పుపనులున్నాయి. అందుచేత నిన్ను అన్వేషిస్తూ వచ్చాము. వివేకం లేని అతనిని పడగొట్టేందుకు ఇది తగిన సమయం.

వ: **అది యెట్లంటేని వినుము; నాఁడు హరిపంపునం జేసిన యశ్వమేధంబున నీ వపగత కల్మషుండవైనను నహుషునకుఁ దేజోహాని లేమిం జేసి యతని నాక్రమింప రాదయ్యె, నిప్పుడు మహామునుల నధఃకరించి యతండు నిస్తేజుం డై యున్నవాఁడు గావున నీ చేతం జెడు, నట్లగుటయుం దురగమేధ ఫల పరిపాకంబ; యింక నుత్సాహంబు సేయు" మనుచున్న సమయంబున యమ వరుణ కుబేరులు సోమ సహితంబుగా నరుగుదెంచి పురందరుం గాంచిన, నతండు ప్రియంబంది యప్పటి కార్యంబు తెలింగు వారల కెఱింగించి, తగిన సంభాషణంబుల వారలఁ బ్రీతచేతస్కులంజేసి, దృష్టివిషయ దుస్సహుండైన నహుషు గెలుచు నుపాయంబు విచారించు నవసరంబున.** 197.

అ: హరిపంపు=విష్ణువు యొక్క ఆజ్ఞ; అపగత కల్మషుండు=పోయిన పాపము కలవాడు; తేజన్-హాని=తేజస్సు తగ్గుట; లేమిన్‌చేసి=లేకపోవడంచేత; అధఃకరించి = అవమానించి; నిస్తేజుఁడు=తేజస్సులేనివాడు; సోమ సహితంబుగాన్=చంద్రునితో కలసి; ప్రీతచేతస్కులన్ =ప్రీతిచెందిన మనస్సుకలవారిని, దృష్టివిషయదుస్సహుడు=చూపుచేతనే సహింపరానివాడు; అవసరంబునన్=సమయంలో

భా: అది ఎలా అంటే విను. ఆనాడు నీవు హరి ఆజ్ఞతో అశ్వమేధయాగంచేసి కల్మషరహితుడ వయ్యావు. కాని అప్పటికి ఆనహుషునికి తేజోహాని కల్గలేదు. అందుచేత అపుడు నహుషుని జయింపలేకపోయావు.ఇపుడు అతడు మహామునులను అవమానించి తేజోవిహీనుడయ్యాడు. అందుచే నీచేత ఓడింపబడతాడు. అదీ నీ అశ్వమేధయాగఫలమే. ఇక నీవు ఉత్సహించవచ్చు అంటూ ఉన్న సమయంలో యముడు, వరుణుడు, కుబేరుడు, చంద్రుడు వచ్చి ఇంద్రుని చూశారు. అతడు ప్రీతిచెంది వారికి విషయం చెప్పి ప్రీతి కల్గించాడు. చూపులతో దుస్సహుడయిన నహుషుని గెలిచే ఉపాయం ఆలోచించే సమయంలో...........

క: కష్టుండగు నా నహుషుఁడు
నష్టాత్మకుఁడయ్యెఁ; దివిజనాయక! నీయు
త్కృష్ట చరితమున సురలకుఁ
దుష్టిగ నిజరాజ్య సంగతుఁడ వగు" మనుచున్. 198.

అ: కష్టుండు-అగు=దుష్టుడయిన; అనహుషుఁడు;నష్టాత్మకుఁడు-అయ్యె=తేజోహీనుడయ్యాడు; దివిజ నాయక!=దేవతానాయకుడా!; నీ ఉత్కృష్ట చరితమునన్ =నీమంచి చరిత్రచేత; నురలకున్=దేవతలకు; తుష్టిగన్=సంతోషం కలిగేటట్లు; నిజరాజ్య సంగతుఁడవు=నీయొక్క రాజ్యంతో కూడిన వాడవు; అగుము;అనుచున్......................

భా: దుర్మార్గుడయిన ఆ నహుషు డిపుడు తేజోవిహీనుడయ్యాడు. దేవేంద్రా! నీ గొప్ప చరిత్రతో దేవతలకు సంతృప్తి కలిగేటట్లునీరాజ్యపదవిపొందుము అంటూ...... (అగస్త్యుడు వస్తున్నాడు- ఈమాటలన్నీ అగస్త్యునివి)

క: **మునివరుఁడైన యగస్త్యుఁడు**
సనుదెంచిన శతమఖుండు సమ్మతి నుచితా
సనమిడి యర్ఘ్యముఁ బాద్యము
నొనరిచి యిట్లనియె సవినయోక్తి నతనితోన్. 199.

అ: మునివరుఁడైన=మునులలో శ్రేష్ఠుడయిన; అగస్త్యుడు; చనుదెంచినన్ =వస్తే; శతమఖుండు=ఇంద్రుడు; సమ్మతిన్=సంతోషంతో; ఉచిత+ఆసనము-ఇడి=తగిన ఆసనంవేసి; అర్ఘ్యము; పాద్యమున్ ఒనరిచి=అర్ఘ్య పాద్యాదులు ఇచ్చి; సవినయ+ఉక్తిన్=వినయంతో కూడిన మాటలతో; అతనితోన్= ఆ అగస్త్యునితో; ఇట్లు అనియెన్.

భా: నీవిక ఇంద్రపదవిని పొందుమంటూ అగస్త్యుడు వచ్చాడు. అప్పుడు సంతోషంతో ఇంద్రుడు అగస్త్యునికి ఆసనమూ, అర్ఘ్యపాద్యాదులు సమర్పించి వినయంతో ఇలా అన్నాడు.

వి: అర్ఘ్యపాద్యములు; ఇవి రెండును షోడశోపచారములలోనివి.

అర్ఘ్యము=పూజకొరకయిన ద్రవ్యము. - ఇది చేతికిత్తురు (హస్తయో రర్ఘ్యం సమర్పయామి)

పాద్యము= పాదములు కడుగుకొనుటకు నీళ్లు.......ఇది కాళ్ల పై పోయుదురు. పాదయోః పాద్యం సమర్పయామి

ఎనిమిది అర్ఘ్యములు: పెరుగు, నెయ్యి, తేనె, అక్షతలు, గఱిక, నువ్వులు,దర్భ, పుష్పములు.

ఆ: **అధిక విభవ మెసఁగ, నసమానశక్తి స**
నాథుఁడగుచునున్న నహుషుఁ డిప్పు
డేమికతన భాగ్యహీనుఁడై యుజ్జ్వల
శ్రీ దొఱంగె మునివరేణ్య! చెపుమ. 200.

అ: మునివరేణ్య=ముని శ్రేష్ఠుడవయిన అగస్త్యుడా! ;అసమాన శక్తి సనాథుఁ

దగుచున్ ఉన్న= సాటిలేని శక్తితో కూడిన వాడవుతున్న; నహుషుఁడు; ఇపుడు; ఏమికతనన్ =ఏకారణంచేత; భాగ్యహీనుఁడై=భాగ్యంలేక; ఉజ్జ్వలశ్రీ-తొఱంగెన్=ఉజ్జ్వలమయిన లక్ష్మిని విడిచాడు?; చెపుమ = చెప్పుము

భా: అగస్త్య మహర్షీ! ఎంతో వైభవంతోనూ, సాటిలేని శక్తితోనూ కూడిన నహుషుడు ఇపుడు ఏకారణంగా లక్ష్మిని, భాగ్యాన్ని విడిచాడో చెప్పు.

-: అగస్త్యుఁడింద్రునకు నహుషు భ్రష్టతఁ దెలుపుట :-
సం: 5-17-7

వ: అనిన విని యమ్మునీంద్రుం డిట్లనియె నన్నహుషుని మోచి వేసరుచున్న మును లతనికడ గోష్ఠి వినోదంబుల నుండి "బ్రాహ్మణంబు లయిన మంత్రంబులు గోసంప్రోక్షణంబు నందుఁజెప్పంబడి యుండు నవి నీకుఁ బ్రమాణ భూతంబులగునే?" యని యడిగినం బాప నిశ్చయుండై యతం "డమ్మంత్రంబులు ప్రమాణంబులు గా" వనిన నే నమ్మాట నిషేధించి "పూర్వాచార్యుల చేత నభినందితంబులగు మంత్రంబులు నిందించుట యజ్ఞానం"బని వివాదంబుసేసిన నతండు కోపించి మదీయమస్తకంబు దన్నిన నతనిం గనుంగొని పుణ్యహీనుండును దేజోహానిదీనుండును నగుట యుపలక్షించి నీవు పూజనీయులయిన మహామునుల నిన్ను వహింపంబనిచితి వారలు గొనియాడు మంత్రంబులు గర్హించి తదియునుంగాక నన్ను నవమానించితి గావున నింద్రపదభ్రష్టుండవై బహుసంవత్సరంబులు భూలోకంబున నురగరూపంబున నుండుమని శాపంబిచ్చి పదంపడి యనుగ్రహించి భవదీయ వంశజాతుండయి యజాతశత్రుండను పెంపు గలిగి యుధిష్ఠిరనామధేయుండైన యొక్క సత్పురుషుని సందర్శనంబున దురితంబులఁ బాసి పుణ్యలోకంబు వడయువాఁడ వనినఁ దత్క్షణంబ. 201.

అ: వేసరుచున్న=శ్రమపడుచున్న/ బాధపడుచున్న; గోష్ఠివినోదంబులన్-ఉండి=సరస సంభాషణ రూపమయిన వినోదాలలో తేలుతూఉండి; పాపనిశ్చయుండు =పాపపు నిశ్చయం కలవాడు; అభినందితంబులు=ప్రశంసింపబడినవి; మదీయ మస్తకంబు =నాదయిన తల; పుణ్యహీనుండు=తరిగిన పుణ్యముకల వాడు; తేజోహానిదీనుండు =తేజస్సు పోవడంచేత దీనత్వము పొందినవాడు; ఉపలక్షించి=తెలిసికొని; వహింపన్ పనిచితి=మోయుటకు ఆజ్ఞాపించావు; గర్హించితి =నిందించావు; అదియునున్‌గాక; ఉరగము=పాము; పదంపడి=తరువాత; భవదీయ వంశజాతుండు = నీ వంశంలో పుట్టినవాడు; అజాత శత్రుండు=శత్రువులు పుట్టనివాడు;. పెంపు=గొప్పదనము/కీర్తి,

భా: ఆమాటలు విని అగస్త్యుడు ఇంద్రునితో ఇలా అన్నాడు. ఆ నహుషుని

మోస్తూ బాధపడే మహర్షులు ఒకసారి అతనిదగ్గర గోష్ఠిసలుపుతూ ఉండగా మహర్షులు సహుషుని 'బ్రాహ్మణమంత్రాలు గోసంప్రోక్షణంలో చెప్పబడినవి నీకు ప్రమాణము లగునా కావా" అని అడిగారు. అపుడు నహుషుడు 'అవి ప్రమాణములు కావు' అన్నాడు. ఆమాట నేను కాదని 'పూర్వ పండితులచే ప్రశంసింపబడిన మంత్రములను నిందించటం అజ్ఞానం' అని వివాదపడ్డాను. నహుషుడు కోపించి నాతల తన్నాడు. అతడు తేజోవిహీనుడూ పుణ్యహీనుడూ అయ్యాడని తెలిసికొని "నీవు మహామునులను నిన్ను మోయుమని ఆజ్ఞాపించావు. వారు ప్రశంసించే మంత్రములను నిందించావు. అదీగాక నన్ను అవమానించావు. అందుచేత ఇంద్రపదవినుండి భ్రష్టుడవై భూలోకంలో పాముగా పడిఉండుమని శపించాను. తరువాత అనుగ్రహించి మీ వంశంలో పుట్టిన యుధిష్ఠిరుని దర్శనం వల్ల ఈ పాపం పోయి మళ్లీ పుణ్యలోకం పొందుతావు' అన్నాను. వెంటనే అతడు...........

క: **స్వర్గ పరిభ్రష్టుండై**
దుర్గతికిం బోయె నతఁడు; దుష్టాత్ములకున్
దౌర్గత్యము, సుజనులకు న
నర్గళ సద్గతియు నగుట యరుదే యెందున్? 202.

అ: స్వర్గ పరిభ్రష్టుండు+ఐ=స్వర్గమునుండి జారినవాడయి; అతఁడు=ఆ నహుషుడు; దుర్గతికిన్ పోయెన్; దుష్ట+ఆత్ములకున్=దుర్మార్గులకు; దౌర్గత్యము=దురవస్థ; సుజనులకున్; అనర్గళ సద్గతియున్=అడ్డులేని సద్గతీ; అగుట=కలుగటం; ఎందున్ అరుదే!=ఎక్కడయినా ఆశ్చర్యమా?

భా: స్వర్గలోకం నుండి జారి నహుషుడు దుర్గతిని పొందాడు. దుర్జనులకు దుర్గతి, సజ్జనులకు సద్గతి కలగడం ఎక్కడయినా ఉందికదా!

మ: **అనినన్ దేవతలుం దపోధనులు నత్యానందముం బొంది, రా**
మునిఁ బూజించె నమర్త్యనాథుఁడు మనోమోదంబు సంధిల్ల,న
య్యనురాగంబు చరాచరంబులకు హృద్యంబయ్యె, సర్వాప్సరో
జనముం గౌశికుఁగానవచ్చె సుభగైశ్వర్యంబు శోభిల్లఁగన్. 203.

అ: అనినన్=ఆ మాటలకు; దేవతలున్; తపోధనులున్=మహర్షులూ; అతి+ ఆనందమున్-పొందిరి=ఎంతోసంతోషంపొందారు;అమర్త్యనాథుఁడు=దేవేంద్రుడు; మనోమోదంబు సంధిల్లన్=మనస్సంతోషం కలిగేటట్లు; ఆ మునిన్=ఆ అగస్త్యుని; పూజించెన్; ఆ+అనురాగంబు= ఆయిద్దరి ప్రేమ గౌరవాలూ; చర+అచరంబులకున్ =స్థావరజంగమాలకు అనగా ప్రకృతికంతకూ; హృద్యంబు+అయ్యెన్=మనోహరంగా అనిపించింది/ హృదయంగమ మయింది; సర్వ+అప్సరస్ జనమున్= అప్సరసలంతా; సుభగ+ఐశ్వర్యంబు-శోభిల్లఁగన్=ప్రీతితో కూడిన వైభవము ప్రకాశించేటట్లు; కౌశికున్=ఇంద్రుని; కానవచ్చెన్=చూడవచ్చారు.

భా: అగస్త్యుని మాటలకు దేవతలూ , మునులూ చాలా సంతోషించారు. ఇంద్రుడు సంతోషంతో ఆ మహర్షి అగస్త్యుని పూజించాడు. వారిరువురి అనురాగమూ సకలచరాచర ప్రకృతికీ హృదయంగమంగా తోచింది. ఇంతలో అప్సరసలంతా ప్రీతితో ఐశ్వర్యంతో ఇంద్రుని చూడవచ్చారు.

వ: తదనంతరంబ 204.

భా: *ఆ తరువాత*

ఉ: పావకుఁడాదిగా దిగధిపాలురుఁ గిన్నర సిద్ధ సాధ్యులున్
దేవగురుండుఁ దోన చనుదేరఁగ వైభవ ముల్లసిల్ల నై
రావణ దంతి నెక్కి యమరావతికిం జని యింద్రుఁడా శచీ
దేవియుఁదాను మోదమునఁదేలి రభీష్టవినోద లీలలన్. 205.

అ: పావకుఁడు-ఆదిగాన్=అగ్ని మొదలయిన; దిక్-అధిపాలురున్= దిక్పాలకులును; కిన్నర సిద్ధ సాధ్యులున్=కిన్నరులూ, సిద్ధులూ, సాధ్యులూ (వీరంతా దేవగణాలు); దేవ గురుండున్=దేవతల గురువయిన బృహస్పతియును; తోన చనుదేరఁగన్=కూడా రాగా; వైభవము-ఉల్లసిల్లన్=వైభవం ప్రకాశించేటట్లు; ఐరావణదంతిన్ ఎక్కి=ఐరావతమనే ఏనుగునెక్కి; అమరావతికిన్ చని= స్వర్గరాజధాని అయిన అమరావతికి వెళ్లి; ఇంద్రుడు; ఆ శచీదేవియున్; తాను; మోదమునన్=సంతోషంతో; అభీష్ట వినోదలీలలన్=ఇష్టమయిన వినోదాలలో , విలాసాలలో; తేలిరి =సుఖించారు.

భా: అగ్ని మొదలయిన దిక్పాలకులూ, కిన్నరులూ, సిద్ధులూ, సాధ్యులూ, బృహస్పతీ కూడా రాగా ఎంతో వైభవంతో ఇంద్రుడు ఐరావత మెక్కి అమరావతి చేరి శచీదేవితో కలిసి ఇష్టవినోదాలతో ఆనందించాడు.

వి: దిక్పాలురు: తూర్పు- ఇంద్రుడు; ఆగ్నేయము-అగ్ని; దక్షిణము-యముడు; నైఋతి-నిరృతి; పశ్చిమము-వరుణుడు; వాయవ్యము-వాయువు; ఉత్తరము-కుబేరుడు; ఈశాన్యము-ఈశానుడు. తూర్పునకు తానే(ఇంద్రుడే)కనుక మిగిలిన అగ్నినుండి చెప్పాడు.

వ: ఇవ్విధంబున మహానుభావుండగు నమ్మహేంద్రుండు. 206.

భా: *ఈ రీతిగా అంతమహాత్ముడయిన ఇంద్రుడు కూడా.............*

క: ఆజ్ఞా భంగం బయినం
బ్రాజ్ఞేతరు నట్లు దుఃఖపడి యుండడె తా
నజ్ఞాతవాసమును గా
లజ్ఞతఁ జలుపండె? యన్యులకు వగపేలా? 207.

అ: ఆజ్ఞాభంగంబు -అయినన్=ఇంద్రుని ఆజ్ఞ(పరిపాలన) భంగం అయితే; ప్రాజ్ఞ+ఇతరు-అట్లు=మూఢుని వలె; దుఃఖపడి-ఉండడె?=దుఃఖించలేదా?; తాను=ఆ ఇంద్రుడు; కాలజ్ఞతన్=సమయ మెరిగినవాడయి; అజ్ఞాతవాసమును=అజ్ఞాతవాసంకూడా; చలుపండె?= ఆచరించలేదా?; (అంతటి వాడే అట్లా అయితే) అన్యులకున్=ఇతరులకు; వగపు-ఏలా? =దుఃఖమెందులకు.

భా: *తన ప్రభుత్వం పోతే ఇంద్రుడు సామాన్యుని వలె దుఃఖించలేదా? కాలస్వభావ మెరిగి అంతటివాడు కూడా అజ్ఞాతవాసం చేశాడు కదా! అంతటి వాడే అట్లా అయితే ఇతరులకు దుఃఖం ఎందులకు ? ఇతరులు దుఃఖించనవసరం లేదు.*

క: **కావున మీ పడిన యర**
ణ్యావాసక్లేశమునకు, నజ్ఞాత విధిన్
సేవకుల రయిన దానికి
నోవకుఁడీ మీరు లఘు మనోవృత్తులరై. 208.

అ: కావునన్; మీపడిన=మీరు పొందిన; అరణ్య+ఆవాసక్లేశమునకున్ = అరణ్యావాస కష్టానికీ; అజ్ఞాత విధిన్=అజ్ఞాతవాసంలో; సేవకులరు- అయిన దానికిన్ =సేవకులు అయినందులకూ; మీరు; లఘుమనోవృత్తులరు + ఐ=కించపరచుకొనిన మనః ప్రవృత్తి కలవారయి; నోవకుఁడీ =నొచ్చుకొనకుడు.

భా: *అందుచేత మీరు పొందిన అరణ్యావాస కష్టానికీ, అజ్ఞాతవాసంలో సేవకు లయినందులకూ చిన్నబుచ్చుకొని బాధపడకండి.*

వ: **అని యిట్లు చెప్పి శల్యుండు సభాసదులం గలయం గనుంగొని** 209.

భా: *అని ఇలా చెప్పి శల్యుడు సభలోని వారందరినీ కలయజూసి (ఇలా అంటున్నాడు)*

ఉ: **కౌరవనాథుఁడా నహుషు క్రైవడి నాశముఁబొందు; వాసవ**
శ్రీరమణీయుఁడై జయము సేకొని ధర్మజు డంబురాశి వే
లారశనా సముజ్జ్వల విలాస మనోహర మేదినీ వధూ
సార సమగ్ర భోగముల సన్నుతికెక్కెడుఁ దానుఁదమ్ములున్. 210.

అ: కౌరవనాథుఁడు=దుర్యోధనుడు; ఆనహుషుక్రైవడి=ఆనహుషుని వలె; నాశమున్ పొందున్=నశిస్తాడు; ధర్మరాజు; వాసవశ్రీరమణీయుఁడై=ఇంద్రుని వైభవముతో; జయము - చేకొని=విజయం పొంది; తాను తమ్ములున్=తానూ, తన తమ్ములూ; అంబురాశి.....భోగములన్; అంబురాశి=సముద్రము యొక్క; వేలా=చెలియలి కట్ట అనే; రశనా=మొలత్రాటి చేత; సముజ్జ్వల=అధికమయిన; మేదినీ వధూ=భూదేవి యొక్క;సార=శ్రేష్ఠమును; సమగ్ర= సంపూర్ణమునయిన; భోగములన్=వైభవాలతో; సన్నుతికిన్ ఎక్కెడున్=ప్రశస్తి వహిస్తాడు

భా: దుర్యోధనుడు నహుషుని వలె రాజ్యభ్రష్టుడై నశిస్తాడు. ధర్మరాజు మహేంద్ర వైభవంతో జయిస్తాడు. తానూ ,తమ్ములూ చతుస్సముద్రముద్రిత భూవలయా న్నంతనూ పాలించి సమగ్ర వైభవం అనుభవిస్తారు.

వ: అని పలికి వెండియు నతండు పాండవాగ్రజున కిట్లనియె. 211.

అ: వెండియున్=మరల; పాండవ-అగ్రజునకున్=పాండవులలో పెద్దవాడయిన ధర్మరాజునకు

భా: అని చెప్పి ఇంకా శల్యుడు ధర్మరాజుతో ఇలా అన్నాడు.

క: సౌఖ్యంబులు వొందు జగ
త్ప్రఖ్యాతులుఁ జెందుఁదగఁ బురందర విజయో
పాఖ్యానము విన్నను ద
ద్వ్యాఖ్యానము సేసినన్ జనావలి కనఘా! 212.

అ: అనఘా! =పుణ్యాత్ముడా! ;పురందర విజయ+ఉపాఖ్యానము=ఈ ఇంద్రవిజయ కథ; విన్నను=విన్నా; తత్ వ్యాఖ్యానము చేసినన్=దానిని వ్యాఖ్యానించినా; జనావలికిన్=జనుల సముదాయానికి;తగన్; సౌఖ్యంబులుపొందున్=సుఖాలు కలుగుతాయి;జగత్ ప్రఖ్యాతులు= జగత్ప్రశస్తి; చెందున్=కలుగును.

భా: ఇంద్రవిజయం అనే ఈ కథ విన్నా ,దాన్ని వివరించి చెప్పినా జనులకు సుఖాలు కలుగుతాయి. కీర్తి కలుగుతుంది.

క: మోహరము నడచు చుండఁగ
నీ హరివిజయంబు విను నరేంద్రుఁడు రిపుసం
దోహంబు గెల్చుటకు సం
దేహం బించుకయు లేదు ధీరవిచారా! 213.

అ: ధీర విచారా!=ధీరమయిన ఆలోచన కల ధర్మరాజా! ;మోహరము= యుద్ధము; నడచుచుండఁగన్=జరుగుతూ ఉండగా; ఈ హరివిజయంబున్= ఈ ఇంద్ర విజయాన్ని; విను; నరేంద్రుఁడు=రాజు; రిపు సందోహంబు=శత్రుసమూహాన్ని; గెల్చుటకున్=గెలవటానికి; సందేహంబు-ఇంచుకయు లేదు=కొద్దిగాకూడా సందేహం లేదు.

భా: యుద్ధం జరుగుతూ ఉండగా ఈ ఇంద్రవిజయ కథ విన్న రాజు శత్రువులను జయించడంలో సందేహంలేదు.

వ: అనిన విని ధర్మనందనుండు మద్రపతిం బ్రస్తుతించి" మహానుభావా! భవదీయ భాషణ శ్రవణంబునఁ జిత్తంబు కలంక దేఱె" నని సంభావించి యతనికి

సముచితంబులగు మజ్జనభోజనంబు లొనరించి యనంతరంబ యతండు పయనం బునకు నుద్యోగించిన. 214.

అ: మద్రపతిన్=శల్యుని; భవదీయ భాషణ శ్రవణంబునన్=నీ మాటలు వినడం చేత; చిత్తంబు=మనస్సు; కలంక+తేఱెన్=నిర్మలమయింది; సంభావించి =ప్రశంసించి; మజ్జన భోజనంబులు=స్నానము, భోజనము; ఉద్యోగించినన్=ప్రయత్నింపగా;

భా: ఆ మాటలు విని ధర్మరాజు " నీమాటలు విని నా మనస్సు ఇపుడు నిర్మలమయిందని " శల్యుని ప్రశంసించి, అతనికి తగిన స్నానభోజనాది మర్యాదలు చేసి, ఆ తరువాత అతడు ప్రయాణానికి సిద్ధం అయితే..........(తరువాతి పద్యంతో అన్వయం)

వి: కష్టాలలో, సంకటసమయాల్లో , వ్యగ్రస్థితిలో ఉన్నపుడు పెద్దల ధార్మిక వచనాలు మనస్సును నిర్మలం చేస్తాయి. ప్రశాంత పరుస్తాయి. వెలుగు చూపుతాయి. ధైర్యం చేకూరుస్తాయి.

ఆ: అతని ననుప నేఁగి యధికసంప్రీతి నే
తెంచు నప్పు డయ్యుధిష్ఠిరుండు
"రణములోన మీరు రాధేయుఁబలుకుట
మఱవకుండ వలయు మమ్ముఁదలఁచి." 215.

అ: అతనిన్=ఆ శల్యుని; అనుపన్-ఏగి=సాగనంపటానికి వెళ్లి; అధిక సంప్రీతిన్= మిక్కిలి ప్రీతితో; ఏతెంచునప్పుడు=వెనుతిరిగి వచ్చేటప్పుడు; ఆ-యుధిష్ఠిరుండు= ఆ ధర్మరాజు; మమ్మున్ తలఁచి= మమ్మల్ని మనసులో పెట్టుకొని; రణములోన=యుద్ధంలో; మీరు; రాధేయున్=కర్ణుని; పలుకుట=కించపరచి మాట్లాడటం విషయం ; మఱవకుండ వలయున్=మరచిపోరాదు సుమా! (అన్నాడు).

భా: శల్యుని సాగనంపేందుకు వెళ్లి ధర్మరాజు తిరిగివస్తూ చివరగా శల్యునితో "మమ్మల్ని దృష్టిలో ఉంచుకొని యుద్ధంలో మీరు ఆ కర్ణుని తేలిక చేసి మాట్లాడే విషయం మరవకండి" అన్నాడు.

క: అనుటయు మద్రేశ్వరుఁడా
తని నూఱడఁబలికి గాఢతరముగ నాలిం
గన మొనరించి చనియె హ
స్తి నగరికి బలమ్ముతో నతి త్వరితగతిన్. 216.

అ: అనుటయున్;మద్ర-ఈశ్వరుఁడు=మద్రదేశాధిపతిఅయినశల్యుడు; అతనిన్= ధర్మరాజును; ఊఱడన్ పలికి=సంతృప్తి పరచేటట్లు మాట్లాడి; గాఢతరముగన్=మిక్కిలి గాఢంగా; ఆలింగనము-ఒనరించి=కౌగిలించుకొని; బలమ్ముతోన్=బలగంతో; అతి త్వరితగతిన్=వేగంగా; హస్తి నగరికిన్=హస్తినాపురానికి; చనియెన్.

భా: *ఆ మాటలకు శల్యుడు ధర్మరాజు ఊరడిల్లేటట్లు, సంతృప్తి పడేటట్లు పలికి గాఢంగా కౌగలించుకొని బలగంతో త్వరగా హస్తినాపురానికి వెళ్లిపోయాడు.*

వి: గాఢతరముగన్=వెనుకటికంటె గాఢంగా అని అర్థం. మొదట వచ్చినపుడు 104వ పద్యంలో శల్యుడు ధర్మరాజును కౌగలించుకొన్నాడు. అప్పటి కంటె ఈ ఆలింగనం గాఢతరంగా ఉందని భావం. శల్యుని ప్రీతి సూచితం.

వ: **అట్టి యవసరంబున.** 217.

భా: *ఆ సమయంలో*

-: సాత్యక్యాదులు సేనా సమేతంబుఁగ బాండవులం జేరవచ్చుట :-
సం. 5-19-1

మ: **సకలారాతి భయంకరుండగుచు నుత్సాహంబు పాటించి, నే**
లకు వ్రేఁగయ్యెడు భంగి వచ్చె, రణలీలా కౌతుకం బొప్పఁదా
నొక యక్షౌహిణీ తోడఁ బాండవ బలం బుల్లాసముం బొంద సా
త్యకి బాహాబల గర్వనిర్వహణ విద్యాప్రౌఢి సంరూఢుఁడై. 218.

అ. సాత్యకి=కృష్ణునిసోదరుడు;బాహా....రూఢుడై;బాహాబల= భుజబలంయొక్క; గర్వనిర్వహణ=గర్వమును నిర్వహించే; విద్యా=విద్యయందు; ప్రౌఢి=నేర్పుతో; సంరూఢుడై=ప్రసిద్ధి వహించినవాడై; సకల-అరాతి భయంకరుండు-అగుచున్ =శత్రువులందరకు భయం కలిగిస్తూ; ఉత్సాహంబు+పాటించి=ఉత్సాహం వహించి; రణలీలా కౌతుకంబు-ఒప్పన్=యుద్ధవిలాసాలలో కుతూహలం కలుగగా; పాండవ బలంబు; ఉల్లాసమున్ పొందన్= ఉత్సాహాన్ని పొందేటట్లు; తాను=ఆ సాత్యకి; నేలకున్ వ్రేగు అయ్యెడు భంగిన్= భూమికి భారమనిపించే లాగ; ఒక అక్షౌహిణి తోడ వచ్చెన్=ఒక అక్షౌహిణి సైన్యంతో వచ్చి పాండవులను చేరాడు.

భా: *బాహుబల గర్వితుడయిన సాత్యకి శత్రుభీకరుడై ఉత్సాహంతో, రణకుతూహలంతో పాండవుల బలం విజృంభించేటట్లు నేల బరువెక్కి పోతోందా అనేటట్లు ఒక అక్షౌహిణి సేనతో వచ్చి చేరాడు.*

వి: 1. **సాత్యకి**- శిని కుమారుడయిన సత్యకి పుత్రుడు-ఇతడే యయుధానుడు

2. **అక్షౌహిణి**=21870 రథాలు; అన్ని ఏనుగులు; 65610 గుఱ్ఱాలు, 109350 కాల్బలము కలిగిన సేన.

వ: **అంతం జేదిపతియగు ధృష్టకేతుండును, జరాసంధ నందనుండగు సహదేవుండును జెఱొక్క యక్షౌహిణీ తోడం జనుదెంచిరి. సహోదరు లేవురగు కేకయపతులు నేకాక్షౌహిణీ సమేతులై యేఁగుదెంచిరి. తదనంతరంబ.** 219.

అ: చేదిపతి=చేది దేశపురాజు; ఏవురు=అయిదుగురు; ఏక-అక్షౌహిణీ-సమేతులుఐ = ఒక అక్షౌహిణి సేనతో కూడిన వారై

భా: అపుడు చేదిరాజయిన ధృష్టకేతుడూ, జరాసంధుని కొడుకయిన సహదేవుడూ ఒక్కొక్క అక్షౌహిణి సైన్యంతో వచ్చి పాండవులను చేరారు: కేకయరాజులు అయిదుగురు (వీరు అన్నదమ్ములు) ఒక అక్షౌహిణితో వచ్చారు. తరువాత.............

క: కొడుకులుఁ దానును గుఱ్ఱపు
దడములఁ గరిఘటల భటరథవ్రాతములం
బుడమి చలింపఁగ ద్రుపదుఁడు
గడు వేడుకఁదోడు సూపెఁ గౌంతేయులకున్. 220.

అ. కొడుకులున్-తానును; గుఱ్ఱపు దడములన్ = గుఱ్ఱపుదళాలతో; కరిఘటలన్ = ఏనుగుల సముదాయాలతో, భట, రథ వ్రాతములన్ = భటుల రథాల సమూహాలతో; పుడమి చలింపఁగన్ = భూమి అదిరి పోయేటట్లు; ద్రుపదుఁడు; కడువేడుకన్ = ఎంతో కుతూహలంతో; కౌంతేయులకున్ = పాండవులకు; తోడు - చూపెన్ = సహాయమయ్యాడు.

భా: అశ్వదళాలతో, కరి సైన్యంతో, రథాలతో భటులతో భూమి కంపించేటట్లు ద్రుపదుడూ అతనికొడుకులూ వచ్చి పాండవులకు సాయమయ్యారు.

వ: అదియును నొక యక్షౌహిణికిం గలిగి యొప్పె, నయ్యవసరంబున ననుజ తనుజ సమేతుండును, బార్వతీయమహీపాల సహితుఁడునై యొక యక్షౌహిణీ యొడ్డనంబు దీర్చి. 221.

అ: కలిగి=సరిపడి; అనుజ తనుజ సమేతుండు=తమ్ములతో, కొడుకులతో కూడినవాడు; ఒడ్డనంబు=వ్యూహము.

భా: అది (ద్రుపదుని సేన) ఒక అక్షౌహిణి అయింది. అప్పుడు తమ్ముళ్లతో కొడుకులతో కలిసి పర్వతరాజులతో కూడినవాడై (విరాటుడు).ఒక అక్షౌహిణి సేన కూర్చుకొని.......................ముందరి పద్యంతో అన్వయం.

వి: పార్వతీయ మహీపాలురు: పర్వత ప్రదేశాల రాజులు.
సంస్కృతంలో పార్వతీయై ర్మహీపాలై: అని మాత్రం ఉంది.

క: చిందముల మ్రోఁతఁ బగతుర
డెందంబుల తోడ దిక్తటీ సంధులు నం
దంద పగులంగఁ గుంతీ
నందనులకుఁ దోడు మత్స్యనాథుఁడు సూపెన్. 222.

అ: చిందముల మ్రోఁతన్=శంఖాల ధ్వనితో; పగతుర=శత్రువులయొక్క; డెందంబులతోడన్=గుండెలతోపాటు; దిక్తటీ సంధులున్=దిక్కుల సంధులు కూడా; అందంద పగులంగన్ = అక్కడికక్కడే పగిలి పోయేటట్లు; మత్స్యనాథుఁడు=మత్స్యదేశపు రాజు విరాటుడు; కుంతీనందనులకున్=పాండవులకు; తోడు చూపెన్ = సహాయం ప్రకటించాడు.

భా: *శంఖధ్వనుల వల్ల శత్రువుల గుండెలతో పాటు దిక్కుల సంధులు కూడా బద్దలయ్యేటట్లు విరాటుడు వచ్చి అక్షౌహిణీ సైన్యంతో పాండవులకు సాయమయ్యాడు.*

వ: పాండ్యవిభుండు లోనుగాఁ బలుదెసల నుండి వచ్చిన బలం బొక్క యక్షౌహిణికిం గలిగి యొప్పె. 223.

అ: లోనుగాన్=మొదలుగా; పలుదెసలనుండి=చాల దిక్కులనుండి

భా: *పాండ్యరాజు మొదలుగా (గలవారు)చాల దిక్కులనుండి వచ్చిన సేన ఒక అక్షౌహిణి అయింది.*

క: ఏడక్షౌహిణు లిమ్మెయిఁ
గూడెం బాండు నృపసుతులఁ గ్రూరాహవ సం
క్రీడా వినోదమునకుం
దోడు పడంబూని యతి కుతూహలవృత్తిన్. 224.

అ: క్రూర+ఆహవ-సంక్రీడా-వినోదమునకున్=కఠినమయిన యుద్ధక్రీడా వినోదానికి; అతి కుతూహలవృత్తిన్=మిక్కిలి కుతూహల ప్రవృత్తితో; తోడుపడన్+పూని =సహాయపడగోరి; పాండు నృపసుతులన్=పాండవులను; ఏడు+అక్షౌహిణులు;ఈ+ మెయిన్=ఈవిధంగా; కూడెన్=కలిశాయి.

భా: *క్రూరమయిన యుద్ధక్రీడలో కుతూహలంతో సాయపడాలనే భావంతో ఏడక్షౌహిణుల సైన్యం ఈ రీతిగా పాండవులను చేరింది.*

వ: ఇవ్విధంబునం గూడి పెరిగి యుధిష్ఠిరు సైన్యంబు గయ్యంబునకుం గాలు ద్రవ్వుచు నుండె; నంత, నక్కడం గిరాత కాంచన సైన్య నిచయంబులం గూర్చికొని సమరంబునకు నమరి యొక్క యక్షోహిణి గల భగదత్తుండు సుయోధనుం గలసె; భూరి పరాక్రముండయిన భూరిశ్రవుండును, మహాబలుండయిన శల్యుండును నేకాక్షౌహిణీ సమేతంబుగా నేతెంచిరి; వారల యట్ల సన్నద్ధుఁడై కాంభోజ నాథుండైన సుదక్షిణుండను యవనేశ్వరుండు వచ్చె; నత్తెఱంగున సమకట్టి జయద్రథ ప్రముఖులైన సింధు సౌవీర నరపతు లరుగుదెంచిరి; మాహిష్మతీ పతియగు నీలుండును, యాదవ వీరుండగు కృతవర్మయు, నవంతీశ్వరులు సోదరులు నగు విందానువిందు లిరువురునుంగా నిన్నలువురు నొక్కొక్క యక్షౌహిణీ తోడఁజనుదెంచిరి; మఱియునుం బలుదెసల నుండి

వచ్చికూడిన వాహినులు మూఁడక్షౌహిణులకుం గలిగె, ధార్త రాష్ట్రులకుఁదోడు పడం బూనిన యవి పదునొకం డక్షౌహిణులయ్యె నట్టి యెడ. 225.

అ: నిచయము=సముదాయము; సమరము=యుద్ధము; భూరిపరాక్రముండు = అధిక పరాక్రమంకలవాడు; ఈ+నలువురు=ఈ నలుగురూ; వాహినులు=సేనలు; ధార్తరాష్ట్రులు=ధృతరాష్ట్రుని కుమారులు కౌరవులు; దెస=దిక్కు

భా: ఈవిధంగా సైన్యాలతో కలిసి ధర్మజుని సైన్యం కయ్యానికి కాలుదువ్వుతోంది. ఇక అక్కడ సుయోధనుని పక్షంలో.............కిరాత కాంచన సైన్యాలతో ఒక అక్షౌహిణితో భగదత్తుడు సుయోధనుని చేరాడు. భూరిశ్రవుడు ఒక అక్షౌహిణితోను, అట్లాగే శల్యుడు ఒక అక్షౌహిణి తోను వచ్చి చేరాడు. వారిలాగానే యుద్ధానికి సన్నద్ధుడై కాంభోజదేశాధిపతి సుదక్షిణుడు వచ్చాడు. అలాగే జయద్రథుడు మొ॥ సింధు, సౌవీర దేశాధిపతులూ వచ్చారు. మాహిష్మతీ నగరాధిపతి నలుడూ , యాదవ వీరుడు కృతవర్మ, అవంతీనగరాధిపతులు విందుడు, అనువిందుడు- ఈనలుగురూ నాలుగు అక్షౌహిణులతో వచ్చారు. ఇంకా వివిధ దిక్కుల నుండి వచ్చిన సేనలు మూడు అక్షౌహిణులయ్యాయి. ఇట్లా కౌరవులకు సాయపడాలని వచ్చినవి మొత్తం 11 అక్షౌహిణులయ్యాయి.

క: సవరణల నొప్పి యనిఁబాం
డవ బలముల మార్కొనంగఁ గడంగుచు నత్యు
త్సవమునఁ బేర్చిన సేనల
కవకాశము లేదు విడియ హస్తిపురమునన్. 226.

అ: సవరణలన్-ఒప్పి=యుద్ధపరికరాలతో కూడి,(సామగ్రితో కూడి) అనిన్=యుద్ధంలో; పాండవబలములన్; మార్కొనంగన్=ఎదిరించటానికి; కడంగుచున్ =సిద్ధపడుతూ; అతి+ఉత్సవమునన్=మిక్కిలి ఉత్సాహంతో; పేర్చిన=అతిశయించిన; సేనకున్; హస్తిపురమునన్; విడియన్=నిలిచేందుకు; అవకాశములేదు=చోటులేదు.

భా: యుద్ధసామగ్రితో పరికరాలతో వచ్చి పాండవసేనలను ఎదిరించే కుతూహలంతో ఉత్సాహపడే సేనలకు హస్తినాపురంలో విడిదిచేయటానికి చోటుచాలలేదు.

క: నానాముఖముల విడియం
గా నియమించెను బలంబుఁగౌరవపతి యా
సేనల దొరలకు నిలువఁగ
నైనను నెడలేమి నధిక హర్షం బెసఁగన్. 227.

అ: ఆ సేనల దొరలకున్= ఆసైన్యాధిపతులకు; నిలువఁగన్ ఐనను=నిలిచేందుకు కూడా; ఎడలేమిన్=చోటులేక పోవడంతో; కౌరవపతి సుయోధనుడు; అధిక హర్షంబు -

ఎసఁగన్=ఎంతో సంతోషం కలుగగా; బలంబున్=ఆ సేనలను; నానాముఖములన్=అనేక ప్రదేశాల్లో; విడియంగాన్ నియమించెను=విడిది చేయనాజ్ఞాపించాడు.

భా: *ఆ వచ్చిన సైన్యాధిపతులు నిలబడటానికి కూడా చోటు చాలలేదు హస్తిపురంలో-అపుడు దుర్యోధనుడు సంతోషంతో వారందరినీ వేర్వేరు (దిక్కులలో) ప్రదేశాల్లో (చుట్టు ప్రక్కల) ఉండమని ఆదేశించాడు.*

వ: **ఇత్తెఱంగునం గురుజాంగలంబున, రౌహిత కారణ్యంబున, మరుదేశంబున, నహిచ్ఛత్రంబునఁ గాలకూటంబున, గంగా కూలంబున, వారణావతంబున, వటస్థానంబున విచ్చలవిడి విడిసి దనధాన్యాది సమస్త వస్తువుల కలిమింజేసి యెలమి మిగిలియున్నంత.** 228.

అ: ఈ+తెఱంగునన్=ఈ విధంగా;కలిమిన్చేసి=కలిగిఉండటంవల్ల; ఎలమి= సంతోషం; మిగిలి= అధికమై; కూలము=ఒడ్డు/తీరము.

భా: *ఈ విధంగా 1.కురుజాంగలంలోనూ, 2. రౌహితకం అనే అడవిలోనూ, 3. మరుదేశంలోనూ, 4.అహిచ్ఛత్రంలోనూ, 5.కాలకూటంలోనూ, 6. గంగా తీరంలోనూ, 7.వారణావతంలోనూ,8. వటస్థానంలోనూ విచ్చలవిడిగా ఎక్కడపడితే అక్కడ విడిసి ఉన్నారు. ధనధాన్యాదులయిన సంభారాలన్నీ పుష్కలంగా ఉన్నాయి. అలా సంతోషంతో కుతూహలంతో ఉండగా......................*

-: ద్రుపద పురోహితుని రాయబారము :-
సం: 5-20-1

క: **పాంచాల మహీవల్లభు**
పంచిన భూదేవుఁ డుచితభంగి నగరి కే
తెంచి ధృతరాష్ట్రుఁ బ్రీతిం
గాంచి కృపద్రోణ విదుర గంగా సుతులన్. 229.

అ: పాంచాల మహీవల్లభు పంచిన=పాంచాల రాజయిన ద్రుపదుడు పంపిన; భూదేవుఁడు=బ్రాహ్మణుడు; ఉచిత భంగిన్=తగిన రీతిగా; నగరికిన్=హస్తిపురానికి; ఏతెంచి=వచ్చి; ప్రీతిన్=ప్రీతితో; ధృతరాష్ట్రున్ కాంచి=ధృతరాష్ట్రుని చూసి;కృప, ద్రోణ, విదుర, గంగాసుతులన్=కృపుని, ద్రోణుని, విదురుని, భీష్ముని........................

భా: *ద్రుపదుడు పంపిన పురోహితుడు హస్తిపురానికి వచ్చి ముందు ధృతరాష్ట్రుని దర్శించి తరువాత కృపుని, ద్రోణుని, విదురుని, భీష్ముని-.......(వారి వారి ఇళ్ల కడ చూశాడని ముందు వచనంతో అన్వయం)*

వి: ద్రుపదపురోహితుడు హస్తిపురానికి బయలు దేరినట్లు 61వ పద్యంలో చెప్పాడు. తరువాత కృష్ణుని కోరుకోవడం, శల్యుని వృత్తాంతం చెప్పి, ఇరువురి బలాలను వివరించి, ఇపుడు హస్తిపురానికి పురోహితుడు వచ్చినట్లు చెపుతున్నాడు. రావటానికి ఇంతకాలం పట్టిందని సూచించడం.

వ: వారి వారి మందిరంబులకుం జని కని సముచితాలాపంబులం బ్రసన్నచిత్తులం జేసి, దుర్యోధను సందర్శనంబును నిర్వర్తించి, నిత్యనిపుణారాధనంబున ధృతరాష్ట్రు నభిముఖుం గావించి, యొక్కనాఁ డక్కౌరవేశ్వరు పేరోలగంబున సమస్త సేనాపతులం గలయం గనుంగొని యిట్లనియె. 230.

అ: సముచిత+ఆలాపంబులన్=తగిన సంభాషణలతో; ప్రసన్నచిత్తులన్-చేసి=ప్రీతి చెందిన మనస్సుకలవారిగా చేసి; నిత్య,నిపుణ+ఆరాధనంబునన్=ప్రతిరోజూ చేసే నేర్పుతో కూడిన ఆరాధనతో (సేవతో); అభిముఖున్ కావించి=తనవిషయంలో అసక్తి చూపేటట్లు చేసుకొని; పేరోలగంబునన్=నిండు సభలో.

భా: కృపుని, ద్రోణుని, విదురుని, భీష్ముని వారి వారి భవనాలకు వెళ్లి ద్రుపదపురోహితుడు తగినట్లు వారితో సంభాషించి వారిని సుముఖులను చేసుకొన్నాడు. తరువాత దుర్యోధనుని సందర్శించాడు. ప్రతిరోజూ ధృతరాష్ట్రుని నేర్పుగా ఆరాధించి సుముఖుని గావించుకొని ఒకరోజున ఆ కౌరవరాజు నిండుసభలో సేనాపతు లందరినీ కలయజూచి అందరితో ద్రుపదపురోహితుడు ఇట్లా అన్నాడు.

వి: రాజసందర్శనానికి నిత్యనిపుణారాధనం కావాలి. అదీగాక రాయబారిగా వచ్చినవాడు అందరిమనసులనూ ఆకట్టుకోవాలి. దానివల్ల తేజోలాభం ఉంటుంది.

సీ: ధృతరాష్ట్ర పాండు భూపతులు సహోదరు
లగుటయు, వారల యాత్మజులకుఁ
దమతమ తండ్రుల ధనములు గైకొనఁ
దగుటయు మీకు నందఱకుఁజూడ
నుచితంబ కాదె! యట్లుండెఁ దొల్లింటి చం
దంబును మనకుఁ దెల్లంబ కాదె!
ప్రాణగొడ్డము లగు పనుల వారలఁ దీర్పఁ
దలఁచినఁబుణ్యంబు కలిమిఁజేసి

తే: బాహుబలమొప్ప నిజరాజ్యపదవిఁబొంది
యున్న వంచన మెయి మహిఁగొన్న తెఱఁగు
నెఱుఁగుదురకాదె! దీనికి నెల్ల నియ్యు
కొనియె నీ పెద్దరాజు నేమనఁగ నేర్తు. 231.

అ: ధృతరాష్ట్ర పాండు భూపతులు; సహోదరులు=సోదరులు; అగుటయున్=

అవడంచేత; వారల- ఆత్మజులకున్ = వారి కొడుకులకు; తమతమ తండ్రుల ధనములు; కై కొనన్ + తగుటయున్=స్వీకరింప దగిఉండటం; మీకున్+అందఱకున్; చూడన్=పరికింపగా; ఉచితంబు+కాదె=తగినదే కదా!; అట్లు+ఉండెన్=అది అట్లా ఉంది; తొల్లింటి చందంబును= పూర్వం జరిగినరీతి; మనకున్; తెల్లంబకాదె=స్పష్టమే కదా! ప్రాణ గొడ్డములు+ అగుపనులన్= ప్రాణాలు పోగొట్టేపనుల చేత; వారలన్=ఆ పాండవులను; తీర్పన్ తలఁచినన్= సంహరింపదలపగా; పుణ్యంబు కలిమిన్చేసి = వారికి పుణ్యం ఉండటం చేత; బాహుబలము+ఒప్పన్=తమభుజ పరాక్రమంతో; నిజ రాజ్యపదవిన్ పొంది ఉన్నన్=తమ రాజ్య పదవిని పొంది యుండగా; వంచన మెయిన్=మోసంతో; మహిన్=భూమిని(రాజ్యాన్ని); కొన్న తెఱఁగు=లాగుకొన్న తీరు; ఎఱుఁగుదురకాదె=మీరందరూ ఎరిగినదేకదా; దీనికిన్+ఎల్లన్=దీనికంతకూ ఇయ్య కొనియెన్=అంగీకరించాడు; ఈ పెద్దరాజున్=ఈముసలి రాజును; ఏమి+అనఁగన్- నేర్తున్?=ఏమనగలను?/ఏమనాలి?

భా: ధృతరాష్ట్రుడూ, పాండురాజూ అన్నదమ్ములవడంచేత, వారి కొడుకులు తమ తండ్రుల ఆస్తులు స్వీకరించ వలసియుండడం మీ అందరికీ తగిన పద్ధతియే కదా! అది అట్లా ఉండనియ్యండి. పూర్వం జరిగిన విశేషాలన్నీ మనకు స్పష్టంగా తెలిసినవేకదా! ప్రాణాలు తీసే పనులతో పాండవులను చంపాలనుకోగా వారి పుణ్యవశాత్తూనూ, వారి భుజశక్తితోనూ తమ రాజ్యం సంపాదించుకొని రాజ్యం చేస్తూ ఉంటే వారిని మోసగించి రాజ్యం లాగుకొన్న తీరూ అందరూ ఎరుగుదురుకదా! ఇదంతా ఈ ముసలి రాజు అంగీకరించాడు. ఏమనగలను?

వి: 1.ఈ దూత పాండవపక్షమున వచ్చినవాడు. అయినా మధ్యవర్తిగా భావించుకొని, అటువంటి భావన ఎదుటివారికి కలిగేటట్లుగా మాట్లాడుతున్నాడు. దానికోసం “తొల్లింటి చందంబును మనకు తెల్లంబకాదె” అని **మన**శబ్దాన్ని ఉపయోగించాడు.

పాండవుల రాజ్యం పరాక్రమప్రాప్తమనీ, దాన్ని కౌరవులు మోసపుజూదంతో లాగుకొన్నారనీ చాలానేర్పుగా చెప్పాడు. దాని నంతనూ అంగీకరించిన ధృతరాష్ట్రుని ఏమనవలెనో తెలియదనడం- ఇది విప్రస్వాభావికంగా ఉంది అని ముమ్ముందు భీష్ముడే విమర్శిస్తాడు.

2. ప్రాణగొడ్డము అనేది అనింద్యగ్రామ్యమని చిన్నయసూరి.

శా: నారీరత్నము నట్లు దెచ్చి సభలోన న్వారలుం జూడఁగాఁ
జీరల్ ప్రోవులు గాఁగఁజేయుటయు, లచ్చిం బుచ్చుకోలున్, మహో
గ్రారణ్యస్థలి నిల్పఁబంచుటయు, దైన్యవ్యక్తిమై పల్కులున్
సైరింపంజను పాండవేయులకు నీ సంధిక్రమం బొప్పదే! 232.

అ: నారీరత్నమున్=స్త్రీ రత్నమయిన ద్రౌపదిని; అట్లు తెచ్చి= ఆవిధంగా (ఆ అవస్థలో) తీసుకొని వచ్చి; సభలోనన్; వారలున్ చూడఁగాన్=వారు(భర్తలు) చూస్తూ ఉండగానే; చీరల్; ప్రోవులు కాఁగన్ చేయుటయున్=పోగులు పెట్టడమూ; (చీరలు ఒలిచి పోగులు పెట్టటమూ); లచ్చిన్-పుచ్చుకోలున్=వారి రాజ్యలక్ష్మిని లాగుకోవడమూ; మహా+ఉగ్ర+అరణ్య-స్థలిన్=

మహాభయంకరమయిన అటవీ ప్రదేశాల్లో; నిల్వన్=నివసించుటకు; పంచుటయున్ =ఆజ్ఞాపించడమూ; దైన్యవ్యక్తిమై=హీనత తోచేవిధానంతో; పల్కులున్=మాటలూ; సైరింపన్ చను=సహింపగలిగిన; పాండవేయులకున్; ఈ సంధిక్రమంబు=ఈసంధికార్యం; ఒప్పదే!=తగదా? (తగును.)

భా: స్త్రీరత్న మనదగిన ద్రౌపదిని అట్లా తీసుకువచ్చి సభలో భర్తలయెదుటనే చీర లాలిపించడమూ; రాజ్యలక్ష్మిని మోసంతో లాగుకోవడమూ; అరణ్యాల్లో నివసించమని ఆజ్ఞాపించడమూ; హీనతతో మాట్లాడడమూ- ఇవన్నీ సహించిన పాండవులకు ఈ సంధికూడ తగినదే.

వి: 1.అట్లు అనడంలో ఏకవస్త్రయైన ద్రౌపది పరిస్థితి వ్యక్తమవుతుంది.

2.దైన్య వ్యక్తిమై-పాండవులను దుశ్శాసనాదులు చాలా హీనంగా అనుచితంగా మాట్లాడారు అరణ్యాలకు పంపుతూ-

క: వీరల వృత్తముఁబాండుకు
మారుల వర్తనము తెఱఁగు మాత్సర్యము లే
కారసి ధృతరాష్ట్రునకున్
గారవమున బుద్ధి సెప్పఁగాఁదగు మీకున్. 233.

అ: వీరల వృత్తమున్=వీరియొక్క ప్రవర్తనమూ (కౌరవుల); పాండుకుమారుల; వర్తనము తెఱఁగు=ప్రవర్తన తీరూ; మాత్సర్యము లేక=అసూయలు విడిచి; ఆరసి=సమీక్షించి; గారవమునన్=గౌరవంతో; ధృతరాష్ట్రునకున్; బుద్ధి+చెప్పగాఁన్=కర్తవ్యంచెప్పడం; మీకున్ తగున్=మీకు తగును.

భా: ఈ కౌరవుల ప్రవర్తన, ఆపాండవుల ప్రవర్తన రెండూ అసూయలేకుండా పరిశీలించి గౌరవంగా ధృతరాష్ట్రునికి బుద్ధిచెప్పడం మీకు తగును.

వి: ధృతరాష్ట్రుని సభలో ధృతరాష్ట్రునికి బుద్ధి చెప్పమని భీష్మాదులను కోరుతున్నాడు ద్రుపదపురోహితుడు. ఇందులో అసలు విప్రస్వభావం గోచరిస్తుంది. అదికూడా సంస్కృతంలో కంటె తెలుగులో మరింత స్పష్టంగా కనిపిస్తుంది. సంస్కృతంలో "అనునేతు మిహార్హన్తి ధృతరాష్ట్రం సుహృజ్జనాః" అంటూ అనునయింప దగును" అంటాడు. తెలుగులో '**బుద్ధి చెప్పదగును** అంటాడు. ఇందులో వాక్కులో తీవ్రత ధ్వనిస్తుంది "

తే: పాండవులు గౌరవులతోడి పగకు నొల్ల,
రఖిల భూప్రజా నాశన మగుటఁ జేసి;
వార లసదని తలఁపంగ వలవ, దధిక
ధర్మపరులైన కతమునఁ దగవు నడచె. 234.

అ: అఖిల భూప్రజానాశనము అగుటన్-చేసి=భూప్రజలందరూ నశించిపోతారని;

పాండవులు; కౌరవులతోడి;పగకున్=విరోధానికి;ఒల్లరు=అంగీకరింపరు;(దాన్నిబట్టి) వారలు=పాండవులు; అసదు+అని=అల్పులు అని, తక్కువవారని; తలఁపంగన్ వలవదు = అనుకోరాదు;(వారు) అధిక ధర్మపరులైన కతమునన్=వారు మిక్కిలి ధార్మికులు అయిన కారణంగా; తగవు నడచె=న్యాయం నడిచింది.

భా: పాండవులు. కౌరవులతో విరోధానికి ఒప్పుకోరు. దానివల్ల భూప్రజలంతా నశించిపోతారని. ,అలా అని వారు బలహీనులని అనుకోరాదు. అధిక ధర్మపరులయిన కారణంగా ధర్మంగా న్యాయంగా చెల్లిపోయింది.

వి: వారు సమర్థులయినా సహనం వహిస్తున్నారనీ, అది పుణ్యపురుషుల లక్షణం అనీ సూచన.

వ: అందుఁగూడినవి యేడక్షౌహిణు లిందుఁగూడినవి పదునొకం డక్షోహిణులని తలంతురేని వినుండు. 235.

భా: ఆ పక్షంలో(పాండవపక్షంలో) చేరినవి ఏడక్షోహిణుల సైన్యం మాత్రమే. (మా)పక్షంలో చేరినవి పదకొండు అక్షోహిణులని అనుకొంటే..........వినండి (చెపుతున్నాను)

క: బాహుబలఘనుఁడు భీముఁడు
సాహసరసికాత్ముఁడయిన సాత్యకియు మహో
గ్రాహవ భూమి సహస్రా
క్షోహిణు లట్లగుట మీరు సూడరె యెందున్. 236.

అ: బాహుబల ఘనుఁడు=భుజశక్తితో గొప్పవాడయిన; భీముఁడున్; సాహస రసికాత్ముఁడు -అయిన=సాహసమనే రసంతో నిండిన హృదయంకల; సాత్యకియున్; మహా+ఉగ్ర+ఆహవ భూమిన్=మిక్కిలి భయంకరమయిన రణభూమిలో; సహస్ర+ అక్షోహిణులు=వేయి అక్షౌహిణుల పెట్టు; అట్లు+అగుట=అట్లా విజృంభించడం; ఎందున్=ఎక్కడా; మీరు; చూడరె!=చూడలేదా?

భా: భుజబలఘనుడయిన భీముడూ, సాహసపరుడయివ సాత్యకీ రణభూమిలో వెయ్యి అక్షోహిణుల పెట్టు అవడం మీరెపుడూ చూడలేదా?

వి: వీరిరువురూ పాండవ పక్షంలో ఆవేశంపాలు ఎక్కువ కలవారు. అందుచేత వీరిరువురినీ ముందుగా చెప్పాడు.

క: గాండీవ ధన్వు నాహవ
పాండిత్యముఁదలఁప నతని 'ఖండనమున మా
ర్కొండు'నని యొకఁడు గడఁగుట
కొండం గని తగరు దాఁకఁ గోరుట గాదే! 237.

అ: గాండీవధన్వు-ఆహవ పాండిత్యమున్=గాండీవమనే ధనుస్సుకల అర్జునుని యుద్ధనైపుణ్యమును; తలఁపన్=తలచుకొంటే; అతనిన్=ఆ అర్జునుని; భండనమునన్ =యుద్ధంలో; మార్కొండును=ఎదుర్కొంటాను; అని; ఒకఁడు; కడఁగుట=పూనుకోవడం; (ఎటువంటిదనగా) కొండన్ కని=పర్వతాన్ని చూసి; తగరు=గొఱ్ఱెపొట్టేలు; తాఁకన్ కోరుట కాదే! ఢీకొనాలని అనుకోవటం కాదూ!

భా: ఆ అర్జునుని యుద్ధనైపుణ్యం తలచుకొంటే 'అతనిని యుద్ధంలో నేనొక్కడినీ ఎదిరిస్తా'నని ఎవడయినా పూనుకొంటే అది ఎటువంటి దనగా....... గొఱ్ఱెపొట్టేలు పర్వతాన్ని చూసి ఢీకొనాలని అనుకోవడం వంటిది.

వి: 1.పొట్టేలు కొండను తాకితే తల బద్దలవుతుంది కాని పర్వతానికేమీ చేటురాదు.

2 .ఒకడు అనేది ఒక్కడూ అని ఏకవచనబోధకమే కాకుండా ఒక అల్పుడు అనేభావం కూడా బోధిస్తుంది.

క: ఆ బీభత్సుని భూరి భు
జా బలమును దుర్నివార శౌర్యము శరవి
ద్యాబహుళతయును బందికి
నై బవరముఁజేసి నట్టి హరుఁడ యెఱుంగున్. 238.

అ: ఆ బీభత్సుని=ఆ అర్జునుని యొక్క; భూరి భుజాబలమును=అధికమయిన భుజశక్తీ; దుర్నివార శౌర్యమున్=వారింప శక్యంగాని పరాక్రమమూ; శరవిద్యా బహుళతయును= అనేక విధములయిన బాణ విద్యలూ; పందికిన్+ఐ=పందికోసం; బవరమున్ చేసినట్టి=యుద్ధం చేసిన; హరుఁడు+అ=శివుడే ; ఎఱుంగున్.

భా: ఆ అర్జునుని భుజబలమూ; వారింపరాని పరాక్రమమూ; ధనుర్విద్యా నైపుణ్యమూ- ఇవన్నీ పందికోసం యుద్ధం చేసిన ఆ శివుడికే తెలుసును.

వి: పాశుపతాస్త్రం ఇవ్వడానికి అర్జునుని పరీక్షించిన సమయంలో అర్జునునితో శివుడు యుద్ధం చేశాడు. ఆ యుద్ధంలో అర్జునుడు అప్రతిహతమయిన పరాక్రమాన్ని ప్రదర్శించాడు. అందుచేత ఆ పరాక్రమం ఏమిటో ఆ శివుడికే తెలుసు అన్నాడు.

వ: అదియునుం గాక. 239.

భా: అంతేకాక

మ: వివిధోపాయ పరాయణుండు రిపుదోర్వీర్యాపహార క్రియా
ప్రవణోద్యోగుఁడు మంత్ర రక్షణ కళా ప్రావీణ్య గణ్యుండు ధై
ర్య వివేకాది గుణోత్తరుం డఖిల విద్యాజాల సంవేది మా
ధవుఁడా దిక్కటె! పాండవేయుల కసాధ్యం బెద్దియుం గల్గునే? 240.

అ: వివిధ+ఉపాయ-పరాయణుండు=అనేక విధములయిన ఉపాయములందు ఆసక్తి కలవాడూ; రిపు-దోర్వీర్య+అపహార క్రియా-ప్రవణ+ఉద్యోగుఁడు=శత్రువుల యొక్క భుజబలాన్ని అపహరించే పనిలో నిమగ్నమయిన ప్రయత్నం కలవాడూ; మంత్ర రక్షణ కళా ప్రావీణ్యగణ్యుండు=అలోచనము, రక్షణము అనే కళలలో నేర్పుచేత లెక్కింపదగినవాడు; ధైర్య వివేక+ఆది గుణ+ఉత్తరుండు=ధైర్యమూ, వివేకమూ మొదలయిన గుణాలచేత ఉత్తముడూ; అఖిల, విద్యాజాల సంవేది=అన్ని విద్యల సముదాయాలనూ తెలిసిన వాడూ; (అయిన) మాధవుఁడు=కృష్ణుడు; ఆదిక్కు-అటె= ఆదిక్కున ఉన్నాడట-(అపుడు). పాండవేయులకున్; అసాధ్యంబు=సాధింపరానిది; ఎద్దియున్=ఏదిఅయినా ;కల్గునే=ఉండునా?

భా: *ఆకృష్ణుడు వివిధమయిన ఉపాయాలు తెలిసి ఆచరించేవాడూ, శత్రుపరాక్రమాన్ని అపహరించే క్రియలో నేర్పరి; ఆలోచన, రక్షణ అనే రెండు విద్యలలో చక్కని నేర్పుకలవాడు.,సర్వవిద్యలూ తెలిసిన వాడు.- ఇన్ని శక్తులు కల కృష్ణుడు పాండవుల పక్షంలో ఉన్నాడు. ఇకవారికి అసాధ్యం ఏముంటుంది?*

వి: సంస్కృతంలో "బుద్ధిమత్తాంచ కృష్ణస్య బుద్ధ్యాయుధ్యేత కోనరః" అని స్వల్పంగా కృష్ణుని గూర్చి ఉన్నది. దాన్ని ఆధారంగా తిక్కన మత్తేభం కూర్చాడు. అనగా "బుద్ధిమత్తాంచ కృష్ణ స్య" అనే దానికి తిక్కనగారి వ్యాఖ్యానమిది.

1.. ఉపాయములు నాలుగు-ఇవి శత్రువును లోబరచుకొనటానికి పాటిస్తారు. 1. సామము, 2. దానము, 3. భేదము, 4. దండము. ఈ ఉపాయములను సమగ్రంగా తెలిసికొని ప్రవర్తించేవాడు కృష్ణుడు.

2. కేవలము ఉపాయాలు మాత్రమే తెలిసిన వాడనుకోరాడు. శత్రువుల గర్వం భంజించే క్రియాశూరత కూడ కలవాడని రెండో సమాసం చెపుతుంది.

3. మంత్ర..........మంత్రమనగా ఆలోచన; రక్షణమనగా పాలనము- అనగా ఆలోచన- ఆచరణ రెండింటిలోనూ లెక్కింపదగిన వాడు.

ద్రుపద పురోహితుడు పాండవుల దగ్గరనుండి బయలుదేరే సమయానికి కృష్ణుడు పాండవపక్షంలో చేరినట్లు-అర్జునుడు కృష్ణుని కోరికొన్నట్లు-పురోహితునికి తెలియదు. పురోహితుడు హస్తినకు చేరేటప్పటికి "కృష్ణుడు అర్జునునికి సారథ్యం చేస్తా నన్నా" డని వార్తలు తెలుసుకొని ఉంటాడు.

ఆ: అదను దప్పకుండ నమ్మహాత్ముల నెమ్మిఁ
బిలువఁబంచి హితముఁ బ్రియము రెండు
పక్షములకు నగుట పాటించి తగవుమైఁ
గొంత భూమి యిచ్చి కూడి మనుఁడు. 241.

అ: అదను-తప్పకుండన్=సమయం మించి పోకుండా; ఆ + మహాత్ములన్ =మహనీయులయిన పాండవులను; నెమ్మిన్=ప్రేమతో;పిలువన్ పంచి=పిలిపించి; రెండు పక్షములకున్; హితము; ప్రియము; అగుటన్ పాటించి=కలుగుటను భావించి/ కలుగు నని తలచి; తగవుమైన్=న్యాయంతో; కొంత భూమి-ఇచ్చి; కూడి మనుఁడు=కలిసి మెలిసి జీవించండి.

భా: కాలం మించిపోకుండా పాండవులను ప్రేమతో పిలిపించి- రెండు పక్షాలకు ఈ పద్ధతి వలన హితమూ, ప్రీతీ కలుగుతుందని తలచి-న్యాయంగా వారికి కొంత భూమి ఇచ్చి- అందరూ కలిసి మెలిసి జీవించండి.

వి: 1. కూడి మనుఁడు అనడంలో కూడితే మనుగడ ఉంటుంది. లేకపోతే మనుగడ లేదనే భావంకూడా లేకపోలేదు.

2. కొంతభూమి ఇవ్వడం కూడా తగవుమై ఇవ్వాలి. అట్లా ఇవ్వకపోయినా మనుగడ లేదనే సూచన.

చ: అనవుడు భీష్ముఁడిట్లనియె; నక్కట! భాగ్యము గాదె పాండు నం
దను లొకయాపదం బడక ధర్మగతిం దగ నందఱున్ సుహృ
జ్జనులను గృష్ణునిం గలసి సమ్మద మొందుటయుం బ్రశాంతిమై
మనముల నీసుదక్కి మృదు మార్గము వట్టుటయుం దలంపఁగన్. 242

అ: అనవుడు=అనగానే; భీష్ముఁడు-ఇట్లు-అనియెన్; పాండు నందనులు= పాండురాజు కుమారులయిన పాండవులు; ఒక ఆపదన్ పడక=ఏ ఆపదా పొందకుండా; తగన్=తగినట్లు; ధర్మగతిన్=ధర్మప్రవర్తనతో; అందఱున్; సుహృత్+జనులను=స్నేహితులనూ; కృష్ణునిన్=కృష్ణునీ; కలసి; సమ్మదము+ఒందుటయున్=సంతోషం పొందడమూ; ప్రశాంతిమై=ప్రశాంతతతో; మనములన్-ఈసు-తక్కి=మనస్సులలో అసూయ విడిచి; మృదుమార్గము-పట్టుటయున్=సౌమ్యమయిన మార్గం పట్టడమూ; తలంపన్=ఇదంతా పరిశీలిస్తే; భాగ్యము కాదె!=మన అదృష్టము కదా!

భా: అపుడు భీష్ముడు ఇలా అన్నాడు. పాండవులు ఏ అపదా పొందకుండా ధర్మవర్తనులై స్నేహితులందరినీ ,కృష్ణునీ కలిసి సంతోషంతో ఉండడమూ- వారు శాంత స్వభావులై అసూయలు విడిచి ఈ సాధుమార్గం తొక్కడమూ- ఇదంతా పరిశీలిస్తే మన అదృష్టమే అనిపిస్తుంది.

క: నీ వాక్యము విప్ర స్వా
భావికమై యిట్లు శ్రుతికిఁ బరుషం బైనన్
భావింపఁ గార్యమున యం
దే విధమున సభకు నింత యిష్టంబగునే! 243.

అ: నీ వాక్యము=నీమాటలు; విప్ర స్వాభావికమై=బ్రాహ్మణ స్వభావాన్ని బట్టి; ఇట్లు; శ్రుతికి=చెవికి; పరుషంబు ఐనన్=కఠినంగా ఉన్నప్పటికీ; భావింపన్=ఆలోచిస్తే; కార్యమున యందు=ప్రయోగం విషయంలో/ క్రియావిషయంలో; ఏ విధమునన్=అన్ని విధాలా; సభకున్; ఇంత ఇష్టంబు అగునే!=ఇంత అంగీకృతం అయిందే!(అనగా బాగా ఇష్టమయింది.)

భా: నీవు బ్రాహ్మణుడవు కాబట్టి నీ మాటలు (నీ స్వభావానికి అనుగుణంగా) చెవికి పరుషంగా ఉన్నా క్రియా విషయంలో మాత్రం ఈ సభవారందరికీ అన్ని విధాలా ఇష్టంగా ఉన్నాయి.

వి: సమయజ్ఞుడయిన భీష్ముడు ఇక్కడ పురోహితుని మాటలతో కార్యం చెడిపోకుండా ఉండేందుకు ఈ మాట మాట్లాడాడు. ఇది పైకి కఠినంగా ఉన్నా సభలో వారందరికీ ఇది ఇంత ఇష్టంగా ఉందే అనడంవల్ల అందరి అభిప్రాయాన్నీ అతడు సంగ్రహించినట్లు భావించినట్లు అనుకోవాలి. అందరినీ సమర్థిస్తూ చెప్పినట్లు అయింది. అది భీష్ముని పెద్దతనానికి చిహ్నంగా గుర్తించవచ్చు. దీనివల్ల సభలోవారికి కొంత ఆనుకూల్యం కూడా ఘటిల్లుతుంది.

చ: సమయము యూఁది పాండవు లశక్తుల చాడ్పున నిందునాఁడు బ
న్నముపడి చన్న దైన్యము, వనంబునఁబడ్డ విషాద వేదనా
శ్రమము, విరాటు వీట లఘుసంచరణంబున దాఁగి యున్న దుః
ఖమును జగం బెఱుంగదె! యకల్మషులం బఱుపంగఁ బాడియే! 244

అ: పాండవులు; సమయము+అ=ప్రతిజ్ఞనే; ఊఁది= ప్రమాణంగా గ్రహించి; అశక్తుల చాడ్పునన్=అసమర్థులవలె; ఇందు నాఁడు=ఇక్కడ ఈ సభలో ఆనాడు; బన్నము+ పడి= అవమానము పడి; చన్న=వెళ్లిన; దైన్యము=దీనత, హీనత; వనంబునన్-పడ్డ=అరణ్యంలో పడిన; విషాద వేదనాశ్రమము=దుఃఖము వల్ల కలిగిన బాధా, శ్రమా (రెండూ); విరాటు వీటన్=విరాటుని పట్టణంలో; లఘు సంచరణంబునన్=అల్ప ప్రవర్తనతో; దాఁగియున్న దుఃఖమును; జగంబు-ఎఱుంగదె!=లోకానికి తెలియదా?; అకల్మషులన్=నిర్దోషులను; పఱుపంగన్=అవమానపరచడం; పాడియే?=న్యాయమా?

భా: ఒడంబడికనే ప్రమాణంగా తీసుకొని పాండవులు ఈ సభలో అశక్తుల వలె ఆనాడు అవమానం పొంది వెళ్లిపోయిన దైన్యమూ, అరణ్యాల్లో పడిన విషాదమూ వేదనా , శ్రమమూ; విరాటుని పురంలో అల్పులవలె రహస్యంగా ప్రవర్తించిన దుఃఖమూ లోకం ఎరుగదా? నిర్దోషులయిన వారిని భంగపరచడం న్యాయం కాదు.

వి: ఇందులో భీష్ముని ఆవేదన వ్యక్తమవుతోంది. సభలో చేసిన అవమానం భీష్ముని ఈనాటికీ బాధిస్తోంది. అయినా ఇద్దరినీ (పాండవులనూ, కౌరవులనూ) దక్కించుకోవాలని అతని తపన.

క: పితృ ధనమగు పా లుచిత
స్థితి వారల కిచ్చి నిర్విశేషుండై యీ
పతి లోకము మెచ్చఁగ నిజ
సుత నివహము నట్ల వారిఁజూడఁగ వలయున్. 245.

అ: పితృధనము+అగుపాలు=తమ తండ్రి ఆస్తి అయిన రాజ్యభాగం; ఉచితస్థితిన్= తగిన రీతిలో మర్యాదతో; వారలకున్ ఇచ్చి; నిర్విశేషుండు+ఐ=భేదము లేని వాడయి; ఈ పతి= రాజయిన ఈ ధృతరాష్ట్రుడు; లోకము మెచ్చఁగన్=లోకులంతా ప్రశంసించేటట్లు; నిజసుత నివహమునట్ల=తన కొడుకుల సముదాయము వలెనే; వారిన్=పాండవులను; చూడఁగ వలయున్=చూడాలి.

భా: తమ తండ్రి పాలు మర్యాదగా వారికిచ్చి, భేద బుద్ధిలేకుండా, ఈ రాజు తన కొడుకులను చూసినట్లే పాండవులను కూడా చూడాలి. అపుడు లోకం ప్రశంసిస్తుంది.

వ: **అట్లుంగాక.** 246.

భా: అంతేకాకుండా

చ: **కడవఁగ జూదమాడి యవుఁగాదన నేరక, సత్యభాషణం**
బెడలిన వచ్చు ధర్మగతి హీనత కోర్వక, రాజ్యహీనతం
బడుటకు నోర్చి ధర్మజుఁడు పంచిన సైరణ సేసెఁగాక క
వ్వడి నెఱిగిన్క కెట్టి మగవారును నోర్తురె యిజ్జగంబులన్. 247.

అ: కడవఁగన్=అతిశయించేటట్లు(ఒకరి నొకరు మీరునట్లు); జూదమాడి; అవును-కాదు;అననేరక=అనలేక; సత్యభాషణంబు-ఎడలినన్=సత్యవచనం వదలితే; వచ్చు=వచ్చే; ధర్మగతి హీనతకున్=ధర్మమార్గనాశనమునకు/ అధర్మవర్తనానికి; ఓర్వక=సహింపక; రాజ్యహీనతన్ పడుటకున్ ఓర్చి=దానివల్ల వచ్చే రాజ్య భ్రష్టతకే ఓర్చి; ధర్మజుడు=ధర్మరాజు; పంచినన్=ఆజ్ఞాపిస్తే (పరాక్రమం వలదని); సైరణ చేసెన్=సహనం వహించాడు; కాక=లేకపోతే; కవ్వడి నెఱిగిన్కకున్=అర్జునుని నిండు క్రోధానికి; ఈ జగంబులన్= ఈ లోకాల్లో; ఎట్టి మగవారును=ఎంత శూరులయినా; ఓర్తురె?=తట్టుకోగలరా?

భా: జయాభిలాషతో జూదమాడి "అవును కాదు" అనలేక, సత్యం తప్పితే వచ్చే అధర్మానికి ఓర్వలేక, రాజ్యభ్రష్టతనే సహించి ధర్మరాజు వలదని వారిస్తే అగిపోయాడు కాని లేకపోతే అర్జునుని కోపానికి ఎంత శూరులయినా తట్టుకోగలరా?

వ: **అనిన విని కర్ణుండు గనలి యిట్లనియె.** 248.

అ: కనలి=కోపించి

భా: ఆ మాటలు విని కర్ణుడు కోపించి ఇలా అన్నాడు.

క: **జనులెల్ల నెఱింగిన యీ**
పని యేటికి నుగ్గడింపఁ బలుమఱు? దుర్యో
ధనున కయి శకుని జూదం
బున మేదిని గెలిచె; ధర్మపుత్రుండోడెన్. 249.

అ: జనులెల్లన్=ప్రజలంతా; ఎఱింగిన యీ పని; పలుమఱు=ఇన్ని సార్లు ; ఉగ్గడింపన్ ఏటికి?= చెప్పడమెందుకు?; దుర్యోధనునకున్+అయి=దుర్యోధనుని కోసం; శకుని జూదంబునన్=జూదంలో; మేదిని=భూమిని; గెలిచెన్; ధర్మపుత్రుండు=ధర్మరాజు; ఓడెన్=ఓడిపోయాడు.

భా: అందరికీ తెలిసిన ఈ పని గూర్చి ఇన్ని సార్లు చెప్పడమెందుకు? దుర్యోధనుని కోసం శకుని జూదమాడి భూమి గెల్చాడు. ధర్మరాజు ఓడిపోయాడు. (ఇంతే).

ఆ: దీన నేమి తప్పు? కానకు నేఁగిన
యతఁడు సమయవృత్తి నాక్రమించి
"తండ్రిపాలు మాకుఁ దగు" నంచు నడియరి
తనము సేసి రాక తప్పు గాక. 250.

అ: దీనన్-ఏమి తప్పు?=దీనిలో తప్పుఏముంది?; కానకున్ ఏఁగిన=అరణ్యానికి పోయిన; అతఁడు=ఆధర్మరాజు; సమయవృత్తిన్=నియమం చేసుకొన్న ప్రవర్తనను; ఆక్రమించి=ఉల్లంఘించి; తండ్రిపాలు మాకు తగును అంచున్= మాతండ్రి రాజ్యభాగం మాకు తగునంటూ; అడియరి తనము -చేసిరాక=మూర్ఖత్వంతో రావడం; తప్పుగాక=తప్పు గాని.

భా: *దీనిలో తప్పేముంది? అడవులకు వెళ్లిన ఆ ధర్మరాజు పూర్తిగా ప్రతిజ్ఞ నెరవేర్చకుండా అజ్ఞాతవాసం అతిక్రమించి, మా తండ్రిపాలు మాకు తగునంటూ మూర్ఖత్వంతో రావడం తప్పుకాని..................*

వి: ధర్మరాజుదే తప్పుకాని దుర్యోధనుడు చేసిన దానిలో తప్పేమీ లేదని కర్ణుని అభిప్రాయం.

క: విరటుఁడు ద్రుపదుఁడుఁదోడుగ
బరవసమున నెత్తి విడిసి బలిమి నడిగినం
గురుపతియు వెఱచి యిచ్చునె
ధరలోఁజక్క సగ మిట్టి తగవులు గలవే! 251.

అ: విరటుఁడు; ద్రుపదుఁడున్; తోడుగన్=తోడురాగా; బరవసమునన్=పట్టుదలతో; ఎత్తి విడిసి=సేనలతో ఎత్తి వచ్చి; బలిమిన్=బలవంతంగా; అడిగినన్=అడిగితే; కురుపతియున్= కురురాజు; వెఱచి=భయపడి; ధరలోన్= భూమిలో(రాజ్యంలో); చక్క సగము=సరిసమానంగా సగభాగం; ఇచ్చునె?= ఇస్తాడా?; ఇట్టి; తగవులు=న్యాయాలు; కలవే?=ఎక్కడయినా ఉన్నాయా?

భా: *విరాటుడు ,ద్రుపదుడు తోడురాగా పట్టుదలతో ఎత్తి వచ్చి బలవంతంగా అడిగితే రాజు భయపడి సగభాగం ఇస్తాడా? ఇటువంటి న్యాయం ఎక్కడయినా ఉందా? (ఎక్కడా ఇట్టి న్యాయం ఉండదు. ఆభయం మా కురురాజుకు లేదని కర్ణుడు భరోసా ఇస్తున్నాడు.)*

వ: అనిన గాంగేయుండు గటకటంబడి కర్ణున కిట్లనియె. 252.

అ: గాంగేయుండు=గంగకుమారుడు (భీష్ముడు); కటకటంబడి = కోపపడి

భా: *ఆ మాటలకు భీష్ముడు కోపించి కర్ణునితో ఇలా అన్నాడు.*

ఉ: చిక్కని పోటు మానిసి విసీ! వినువారలు నవ్వ నేమిగా
నెక్కుడు మాటలాడెద? వహీన పరాక్రమశాలి యర్జునుం
డొక్కఁడ యార్వురన్ మనల నుగ్రరణంబున గెల్చె నిన్న, నే
డిక్కడఁ బల్కులన్ గెలిచె దీ వతనిన్ మనరాజుకొల్వునన్. 253.

అ: చిక్కని పోటు మానిసివి=దృఢమైన యుద్ధవీరుడివి (తయారయ్యావు అని ఎత్తిపొడుపు); ఇసీ!=ఛీ! (ఇది అసహ్య భావాన్ని జుగుప్సనూ సూచిస్తుంది); వినువారలు నవ్వన్=వినేవాళ్లు నవ్వేటట్లు; ఏమిగాన్ ఎక్కుడు మాట లాడెదవు?= ఎందుకు పెద్దమాటలు మాట్లాడతావు? ; నిన్న=నిన్నటికి నిన్న; అహీన పరాక్రమశాలి=అధిక పరాక్రమవంతుడయిన: అర్జునుండు; ఒక్కడు+అ=ఒక్కడే; ఉగ్రరణంబునన్=భయంకరమయిన యుద్ధంలో; మనలన్ ఆర్వురన్ గెల్చెన్; నేడు= ఇప్పుడు; ఇక్కడ మనరాజు కొల్వునన్=ఇక్కడ రాజసభలో; ఈవు=నీవు; అతనిన్= ఆ అర్జునుని; పల్కులన్ గెలిచెదు=మాటలతో గెలుస్తున్నావు.

భా: *గొప్పగా పొడిచే యుద్ధవీరుడివి తయారయ్యావు-ఛీ!- వినేవాళ్లు నవ్వేటట్లు ఎందుకంత పెద్దమాటలు మాట్లాడతావు? నిన్నటికి నిన్న అర్జునుడు ఒక్కడే మన ఆరుగురిని జయించాడు. నీ విప్పుడిక్కడ రాజసభలో కూర్చుని అతనిని మాటలతో గెలుస్తున్నావు.*

వి: ఇసీ!అనడంలోభీష్మునికికర్ణునిమాటలపట్లఉన్నఅసహ్యాభావం వ్యక్త మవుతుంది."బ్రతుకు తక్కువ. బడాయి ఎక్కువ" అన్నట్లుగా మాట్లాడుతున్నావు- ఎవరయినా వింటే నవ్విపోతారు- అట్లా ఎప్పుడూ మాట్లాడకని హెచ్చరిక.

అతడు నిన్ననే యుద్ధంలో మనలనందరినీ ఓడించాడు. ఇపుడు ఇక్కడ రాజసభలో కూర్చుని మాటలతో గెలుస్తున్నావు. వాక్శూరత పనికిరాదు- అని సూచన.

ఆర్వురు: 1. భీష్ముడు, 2.ద్రోణుడు,3.కృపుడు, 4. అశ్వత్థామ, 5.కర్ణుడు, 6. దుర్యోధనుడు. ఈ ఆరుగురితో అర్జునుడు ఉత్తర గోగ్రహణంలో వేరువేరుగానూ, సామూహికంగానూ కూడా యుద్ధంచేసి ఓడించాడు.

క: నరుఁడాల వెనుక వచ్చినఁ
గురురా జడుగంగ నీవు గురుఁడును గృపుఁడున్
గురుసుతుఁడు వినఁగ వారల
చిరసమయము దెగుట యేను జెప్పనె తెలియన్. 254.

అ: నరుఁడు=అర్జునుడు; ఆలవెనుక వచ్చినన్= (ఉత్తర గోగ్రహణం చేసినపుడు) ఆవుల వెనుక రాగా; కురురాజు=దుర్యోధనుడు; అడుగంగన్=అడిగితే; నీవు; గురుఁడును= ద్రోణుడూ; కృపుఁడున్; గురుసుతుఁడు=అశ్వత్థామ; వినఁగన్=వింటూ ఉండగా; ఏను=నేను; వారల = పాండవుల యొక్క; చిరసమయము-తెగుట=అజ్ఞాతవాస సమయము అయిపోవడం; తెలియన్-చెప్పనె?=తెలియ జెప్పలేదా?

భా: *ఉత్తర గోగ్రహణంలో అర్జునుడు ఆవుల వెంట వచ్చినపుడు దుర్యోధనుడు అడిగితే మీరంతా (నీవూ ,ద్రోణుడూ ,కృపుడూ ,అశ్వత్థామ) వింటూ ఉండగా నేను పాండవుల అజ్ఞాతవాసకాలం అయిపోయినట్లు చెప్పలేదూ!*

వి: చెప్పనె-తెలియన్=తెలియజెప్పనె- ఈవిధంగా ప్రయోగాలు పూర్వకావ్యాల్లో కనిపిస్తాయి.

తే: అనిన ధృతరాష్ట్రుఁ డాపగాతనయు భక్తి
ననునయించి, రాధేయునిఁగినిసి, ప్రియము
దోఁపఁ దానిట్టు లనియె నా ద్రుపదమనుజ
పతిపురోహితుతోడ సంభ్రమములేక. 255.

అ: అనినన్; ధృతరాష్ట్రుడు; ఆపగా తనయున్= నదీపుత్రుడయిన భీష్ముని; భక్తిన్=భక్తితో; అనునయించి=బతిమాలి; రాధేయునిన్=కర్ణుని; కినిసి=కోపపడి; ద్రుపదమనుజపతి పురోహితుతోడన్= ద్రుపదమహారాజు యొక్క పురోహితునితో; సంభ్రమములేక= తొట్రుపాటు లేకుండా; ప్రియము-తోఁపన్=ప్రీతి కన్పడేటట్లు; తాను=ఆ ధృతరాష్ట్రుడు; ఇట్టులు-అనియెన్;

భా: *ఆ మాటలకు ధృతరాష్ట్రుడు భీష్ముని భక్తితో బతిమలాడాడు. కర్ణుని మీద కోప్పడ్డాడు. (తొట్రు పడకుండా నిర్భీతిగా) ప్రీతి కన్పడేటట్లు ధృతరాష్ట్రుడు ద్రుపదపురోహితునితో ఇలా అన్నాడు.*

ఉ: మంచిగ నేను బంధులును మంత్రి జనంబులుఁ బెద్దలున్ విచా
రించి, సమస్త భూప్రజకుఁ బ్రీతిగ, బిడ్డల పాలికిప్డు పు
త్తెంచెద సౌమ్యు నొక్కరు; మదీయ మనోగతి వారిఁ గూడి వ
ర్తించు తెఱంగు గైకొనుట తెల్లము కౌరవజాతి కెంతయున్. 256.

అ: నేను; బంధులును = చుట్టాలూ; మంత్రి జనంబులున్; పెద్దలున్; మంచిగ=బాగా; విచారించి=ఆలోచించి; సమస్త భూప్రజకున్=జనులందరికీ; ప్రీతిగన్= సంతోషము కల్గునట్లుగా; బిడ్డలపాలికిన్ =పాండుపుత్రుల దగ్గరకు/ పిల్లల దగ్గరకు; ఇప్డు=ఇపుడు; ఒక్కరు సౌమ్యున్ = ఒక సౌమ్య స్వభావుని; పుత్తెంచెదన్=పంపిస్తాను; మదీయ మనోగతి= నామనః ప్రవర్తన; వారిన్=పాండవులను; కూడి=కలిసి; వర్తించు తెఱంగు=ప్రవర్తించు తీరును; కైకొనుట=గ్రహించడం; కౌరవ జాతికిన్-ఎంతయున్ తెల్లము= కురువంశానికంతకూ పూర్తిగా తెలుసును.

భా: *నేనూ ,చుట్టాలూ ,మంత్రులూ ,పెద్దలూ అందరమూ కలిసి బాగా ఆలోచించి ప్రజలందరికీ ప్రీతి కలిగేటట్లు పిల్లల (పాండవుల) దగ్గరకు ఇపుడు ఒక సౌమ్య స్వభావుని పంపిస్తాను. నా మనస్సు వారి (పాండవులతో) తో కలిసి జీవించాలనే పద్ధతిని గ్రహించినట్లు కౌరవ జాతికంతకూ తెలుసు.*

వి: 1. బిడ్డల పాలికి అనడంలో దయాగుణం వ్యక్తమవుతుంది. వాత్సల్యము కూడా.
2. సౌమ్యుని అనేది సంజయునికి తగిన విశేషణం.

తే: "నీవు మున్నేఁగు" మని యతనికి విభూష
ణాంబరమ్ములతోఁ దమ్ములంబుఁ బెట్టి
వీడుకో లిచ్చి పుచ్చిన విప్రవరుఁడు
పాండుజనపాలతనయుల పాలి కరిగె. 257.

అ: నీవు; మున్ను+ఏఁగుము=ముందు వెళ్లుము; అని; అతనికిన్=ఆ ద్రుపదపురోహితునికి; విభూషణ+అంబరమ్ములతోన్=అలంకారాలూ, బట్టలతో; తమ్ములంబున్ పెట్టి=తాంబూలమిచ్చి; వీడుకోలు ఇచ్చి=వీడ్కోలు ఇచ్చి; పుచ్చినన్=పంపిస్తే; విప్రవరుఁడు = బ్రాహ్మణ శ్రేష్ఠుడు; పాండు జనపాలతనయుల పాలికిన్= పాండురాజు పుత్రుల దగ్గరకు; అరిగెన్=వెళ్లాడు.

భా: *నీవు ముందుగా వెళ్లుమని ఆ పురోహితునికి వస్త్రాభరణాలూ, తాంబూలమూ ఇచ్చి వీడ్కోలిచ్చి పంపాడు. అతడు అపుడు పాండవుల దగ్గరకు వెళ్లాడు.*

వి: విభూషణాంబరమ్ములతో తమ్ములమ్ము పెట్టుట-ఈనాటికీ సంప్రదాయము. వచ్చినవాడు బ్రాహ్మణుడు, పాత్రుడు అగుటచేతనూ, తాము రాచవారగుటచేతను, ఈ సంప్రదాయమునకు ఔచిత్యము చేకూరినది.

వ: ఇట్లు సని వారలం గని యతండు సముచిత సంభాషణంబుఁ దనపోయి వచ్చిన తెఱం గెఱింగించె నిట ధృతరాష్ట్రుండును బుత్ర, మిత్ర వృద్ధామాత్య సహితంబుగా నాస్థానాసీనుండయి యుండి సంజయు రావించి యతని కిట్లనియె. 258.

అ: చని=వెళ్లి; తెఱంగు=విధానము; ఆస్థాన+ఆసీనుండయి=కొలువులో కూర్చుండి; పుత్ర, మిత్ర,వృద్ధ+ అమాత్య సహితంబుగాన్=కొడుకులు, స్నేహితులు, పెద్దలు, మంత్రులు వీరితో కూడి;

భా: *ద్రుపద పురోహితుడు తిరిగి పాండవుల దగ్గరకు పోయి తగిన రీతిలో సంభాషించి తాను వెళ్లి వచ్చిన విశేషాలన్నీ చెప్పాడు. ఇక ఇక్కడ ధృతరాష్ట్రుడు కొడుకులతోనూ, మిత్రులతోనూ, పెద్దలతోనూ మంత్రులతోనూ కూడి కొలువుచేసి సంజయుని రప్పించి అతనితో ఇలా అన్నాడు.*

తే: పాండు నరపాల సుతు లుపప్లావ్యమునకు
వచ్చియున్నారు, నీవేఁగి వాసుదేవ
సహితముగ వారిఁగని తద్వ్రసాద మేమి
భంగి మాను నమ్మెయిఁ దగఁబలుక వలయు. 259.

అ: పాండునరపాలసుతులు=పాండురాజు కుమారులు;ఉపప్లావ్యమునకున్= ఉపప్లావ్యం అనేపురానికి; వచ్చియున్నారు; నీవు; (అచ్చటకు) ఏఁగి=వెళ్లి; వాసుదేవ సహితముగన్=కృష్ణునితో సహా; వారిన్ కని=పాండవులను దర్శించి; తత్-విషాదము= వారి దుఃఖం; ఏమి భంగిన్ మానున్=ఏ విధంగా పోతుందో; ఆ+మెయిన్=ఆవిధంగా; తగన్=సముచితంగా; పలుకవలయున్=మాట్లాడాలి.

భా: పాండవులు ఉపప్లావ్యానికి వచ్చి ఉన్నారు. నీవక్కడకు వెళ్ళి కృష్ణునితో సహా వారిని దర్శించాలి. వారి విచారం ఏ రీతిగా తొలగుతుందో ఆరీతిగా మాట్లాడి రావాలి.

-: ధృతరాష్ట్రుడు సంజయునిఁ బాండవుల యొద్దకుఁ బంపుట :-

సం: 5-22-1

క: "మీ యయ్య మీరు వనవా
సాయాసము నిస్తరించి యభ్యుదయమునన్
డాయుట విని ముదితాత్ముం
డై యిట పుత్తెంచె నన్ను" ననుమీ మొదలన్. 260.

అ: మీరు; (పాండవులు) వనవాస+ఆయాసమున్=అరణ్యవాస కష్టాన్ని; నిస్తరించి=దాటి; అభ్యుదయమునన్=అభివృద్ధితో; డాయుట=సమీపించి వచ్చుట, మీ అయ్య విని= మీ పెద తండ్రి అయిన ధృతరాష్ట్రుడు విని; ముదిత +ఆత్ముండై=సంతోషించి; నన్నున్; ఇట=ఇక్కడకు; పుత్తెంచెన్=పంపించాడు; అను మీ మొదలన్=అని మొదటగా చెప్పు సుమా,

భా: *"మీరు అరణ్యవాసం పూర్తిచేసి అభ్యుదయం పొంది వచ్చారని విని మీ పెదనాన్న ధృతరాష్ట్రుడు ఎంతో సంతోషించి నన్ను ఇక్కడకు పంపించాడు" అని నీవు ముందుగా చెప్పాలి సుమా!*

వి: మొదటి మాట నీవీ విధంగా అనాలి అని ధృతరాష్ట్రుడు సంజయునితో అంటున్నాడు. అంటే ధృతరాష్ట్రుని మనసులోని తపన వ్యక్తమవుతుంది. ఏవిధంగా నయినా వారిని శాంతింపజేయాలని ధృతరాష్ట్రుని అభిప్రాయం.

వ: **అని చెప్పి చుట్ట నున్నవారలతో నిట్లనియె.** 261.

భా: *సంజయునితో ఈ విధంగా చెప్పి పక్కనున్న మిత్రులతో ,వృద్ధులతో ఇలా అన్నాడు.*

వి: ముందు సభలోని వారిని అంగీకరింపజేసి తరువాత సంజయుని పంపడం మంచిదని ధృతరాష్ట్రుని అభిప్రాయం.

క: **దుర్యోధనుండు గార్యా
కార్యజ్ఞుడు గామి నిట్టి కలఁక గలిగెఁగా
కార్యులు దృఢధైర్యులు రణ**

ధుర్యులు నగు పాండుసుతులు దోషాన్వితులే! 262.

అ: దుర్యోధనుండు;కార్య+అకార్యజ్ఞుఁడు=మంచిపని,చెడ్డపనితెలిసినవాడు; కామిన్ =కాకపోవడం చేత; ఇట్టి కలఁక కలిగెన్ కాక; ఇటువంటి చికాకు కలిగింది కాని; (లేకపోతే) ఆర్యులు; దృఢధైర్యులు=గట్టి ధైర్యంకలవారు; రణధుర్యులు=యుద్ధంలో సమర్థులూ; అగు; పాండుసుతులు=పాండవులు; దోష+అన్వితులే!=దోషంతో కూడిన వారా? (కారని భావం).

భా: *అసలీ దుర్యోధనుడు కార్యాకార్యాలు తెలియని వాడు కావడం చేత ఈ చికాకు కలిగింది కాని కాకపోతే పాండవులలో దోషం ఏముంది?*

వి: కార్యాకార్యజ్ఞుడు=చేయదగిన పనిఏదో, చేయకూడని పని ఏదో తెలిసినవాడు. అనగా మంచీ చెడూ తెలిసినవాడు.

క: క్షీరోదకవృత్తి మనము
వారలునుం గలసి బ్రదుక వలదే నెమ్మిన్
వా రిడుమలఁ బడఁదగియెడు
వారే! పితృభాగ మేలువారలు గారే! 263.

అ: క్షీర+ఉదక వృత్తిన్=పాలూ, నీళ్లూ కలిసినట్లుగా; మనము; వారలున్; కలసి; నెమ్మిన్=స్నేహంతో; బ్రదుకవలదే?=జీవించవద్దా?; వారు=పాండవులు; ఇడుమలన్=కష్టాలను; పడన్ తగియెడు వారే?=పడదగినవారా?; పితృభాగము=తమ తండ్రిపాలు; ఏలువారలు కారే=పాలింపదగిన వారు కారా?

భా: *పాలూ ,నీళ్లూ వలె మనమూ పాండవులూ కలిసి ప్రేమతో జీవించవద్దా? వారు కష్టాలు పడదగినవారా?(కారు). తమ తండ్రి రాజ్యభాగం వారు మాత్రం ఏలుకోదగ్గవారు కారా? (తగిన వారే అని భావం).*

వి: పాలూ, నీళ్లూ లాగా కలిసి ఉండటం అంటే- కలవడంలోనే పోలికగాని ఒకరు పాలని, మరొకరు నీళ్లని అర్థం చెప్పరాదు. కానిఆ సూచన లేకపోలేదు. పాలూ, నీళ్లూ కలియడం తేలిక- విడగొట్టడం కష్టం. దాన్ని మాత్రమే గ్రహించాలి. కాని ఇందులో పాలు కౌరవులనీ, నీరు పాండవులనీ స్ఫురిస్తుంది ఎదుటివారికి. దానికి సమాధానం (పరోక్షంగా) కృష్ణుడు రాయబారానికి వెళ్లినపుడు 3-258 వ పద్యంలో గోచరిస్తుంది.

ఆ: మనల నింక నమ్మ రనృతాత్ము లన్యాయ
పరులు గర్వు లనుచుఁ బాండుసుతులు
గూడి మనుట కియ్యకొననేర రైనను
ధర్మజుండు గలఁడు దగవు నడప. 264.

అ: అనృతాత్ములు=అబద్ధాలకోరులు; అన్యాయపరులు; గర్వులు=గర్వము కలవారు; అనుచున్=అని; మనలన్=మనలను; పాండు సుతులు=పాండవులు; ఇంక నమ్మరు; కూడి మనుటకున్=కలిసి జీవించటానికి; ఇయ్యకొన నేరరు=అంగీకరింపరు; ఐనను=అయినా; తగవు నడపన్=న్యాయాన్ని నిర్వహించేందుకు; ధర్మజుండు కలఁడు=ధర్మరాజు ఉన్నాడు.

భా: అసత్యవాదులనీ, అన్యాయపరులనీ, గర్వులనీ మనలనింక పాండవులు నమ్మరు. మనతో కలిసి జీవించటానికి వారు ఒప్పుకోరు. అయినా ధర్మం నడపటానికి ధర్మరాజు ఉన్నాడనుకో.

వి: ధర్మరాజు ధర్మపరాయణతమీద ధృతరాష్ట్రునికి అంత నమ్మకం.

వ: అని పలికి వెండియు, 265.

భా: అని చెప్పి ఇంకా ఇలా అన్నాడు.

మ: మన కీకుండఁగ వచ్చునే మనము దుర్మానంబు వాటించి యొ
ప్పని కార్యంబులు పట్టి వారికిఁ దగం బాలీక గర్వంబు లా
డిన నిక్కంబగు నల్క నర్జునుఁడు గాండీవంబు మోపెట్టఁ గృ
ష్ణుని సారథ్యమునై జగత్త్రితయ సంక్షోభంబు గాకుండునే! 266.

అ: మనకున్+ఈకుండఁగన్-వచ్చునే=వారి రాజ్యభాగం వారికి మనం ఇవ్వకుండా పోవచ్చునా?; మనము=మనం (కౌరవులు); దుర్మానంబు-పాటించి=దురభిమానం వహించి; ఒప్పని కార్యంబులు-పట్టి=తగని పనులు చేపట్టి; వారికిన్=ఆ పాండవులకు; తగన్ పాలు-ఈక=తగిన రాజ్యభాగం ఇవ్వక; గర్వంబులు-ఆడినన్=గర్వంగా మాట్లాడితే; నిక్కంబగు అల్కన్=నిజమయిన కోపంతో; అర్జునుడు; గాండీవంబున్; మోపెట్టన్=సంధింపగా; కృష్ణుని సారథ్యమున్ ఐ=కృష్ణుని సారథ్యం తోడయి; జగత్-త్రితయ సంక్షోభంబు=మూడులోకాలు సంక్షోభించే స్థితి; కాకుండునే=రాకపోతుందా?/ రాకుండా ఉంటుందా? (ఉండదు).

భా: మనం మాత్రం వారి రాజ్యభాగం వారికి ఇవ్వకుండా ఉండవచ్చునా? దురభిమానంతో తగని పనులు చేసి వారి పాలు వారికివ్వక గర్వోక్తులు పలికితే ఆ అర్జునుడు గాండీవం సంధించి కృష్ణుని సారథ్యంతో మూడులోకాలూ సంక్షోభింప జేయకుండా ఉంటాడా?

తే: అలఘుగదఁ బూంచికొని భీముఁ డతి రయమునఁ
గురుకుమారులపైఁ దీవ్రకోప మెసఁగఁ
గవియు టాత్మ భావించినఁ గంప మడరు
నిక్క మెవ్వరు మార్కొని నిలుచు వారు? 267.

అ: భీముడు; అలఘుగదన్ = పెద్దగదను; పూంచికొని=ధరించి, అతిరయమునన్ =మిక్కిలి వేగంతో; తీవ్రకోపము-ఎసఁగన్=అధిక కోపంతో; కురుకుమారుల పైన్=కౌరవులపై; కవియుట=కలియబడుట, ఎదిరించుట; ఆత్మన్ భావించినన్=మనసులో తలచుకుంటే; కంపము+అడరు=వణకు పుడుతుంది; నిక్కము=నిజంగా; మార్కొని=అతనిని ఎదిరించి; ఎవరు; నిలుచువారు?=నిలవగలరు?

భా: ఆ భీముడు పెద్ద గద పట్టుకొని తీవ్ర కోపంతో కౌరవులమీద పడుతున్న దృశ్యం తలచుకొంటే శరీరం కంపించి పోతుంది నాకు. నిజంగా అతనిని ఎదిరించి నిలవగలవా రెవ్వరున్నారు (మనలో).

సీ: **కవ లగ్రజన్ములకంటె నేమిటఁగీడు?**
ద్రుపదుఁడల్పుండె? తత్సుతులు బాహు
గర్వ సమగ్రులు గారె? విరాటుండు
నాతని తమ్ములు నాత్మజులును
నసదులే? సాత్యకి యలఁతులఁబోయెడు
వాఁడె? వృష్ణి కుమార వరు లనేకు
లట్టి యోధులు పోర నరవాయి గొందురే?
పాండ్యుండుఁ గేకయపతులు నాది

తే: **యైన బంధులు మిత్రులు నగ్గలికలఁ**
గొఱఁత వడియెడు వారె? యందఱను గెల్వ
నోపినను రుద్రునకు నైన నోర్వరాని
ధర్మపుత్రుకోపమునకుఁ దలఁక వలదె? 268.

అ: కవలు=నకుల సహదేవులు; అగ్రజన్ములకంటె=అన్నల కంటె; ఏమిటన్ కీడు= ఎందులో తక్కువ?; ద్రుపదుఁడు; అల్పుండె?=తక్కువవాడా?; తత్సుతులు=అతని కొడుకులు; బాహు గర్వ సమగ్రులు కారె?=భుజ గర్వంతో కూడిన వారు కారా?; విరాటుండున్; అతని తమ్ములున్; ఆత్మజులును=కొడుకులూ;అసదులే?=అశక్తులా?; సాత్యకి;అలఁతులన్=అల్పులతో; పోయెడు వాఁడె?=తీరేవాడా? వృష్ణికుమారవరులు=వృష్ణి వంశవీరులు; అనేకులు=చాలమంది; అట్టి యోధులు=అటువంటి వీరులే; పోరన్=యుద్ధంలో; అరవాయి కొందురే?=వెనుదీస్తారా? పాండ్యుండున్=పాండ్యరాజూ; కేకయపతులున్=కేకయదేశపురాజులూ; ఆదియైన బంధువులు = మొదలయిన చుట్టాలూ; మిత్రులు= స్నేహితులూ; అగ్గలికలన్=పరాక్రమంలో; కొఱత+పడియెడు వారె?=తగ్గిపోయే వారా?; అందఱను గెల్వన్ ఓపినను= ఈ అందరినీ జయింప గలిగినా చివరకు; రుద్రునకున్ ఐనన్ ఓర్వరాని=శివునకయినా ఎదిరింపరాని; ధర్మపుత్రు=ధర్మరాజు యొక్క; కోపమునకున్; తలఁక వలదె= భయపడవద్దా?

భా: ఆ నకుల,సహదేవులు మాత్రం భీమార్జునుల కంటె ఎందులో తక్కువ; ద్రుపదుడు తక్కువ వాడా? అతని తమ్ములూ కొడుకులూ తక్కువ వారా? ఆ సాత్యకి, వృష్ణికుమారులూ సామాన్యులా? వారు యుద్ధంలో వెనుబాటు ఎరుగుదురా? పాండ్యరాజు కేకయరాజులు మొదలయిన బంధుమిత్రులు పరాక్రమంలో తీసిపోయేవారా? ఒకవేళ ఈ పైవారందరినీ జయించినా చివరకు ఆ రుద్రుడుకూడా సహింపలేని ధర్మరాజు కోపాని కయినా జంకవద్దా!

వ: అని పిలికి సంజయు దిక్కు మొగంబై యెల్లవారును విన నిట్లనియె. 269.

అ: ఎల్లవారును = అందరూ

భా: *అని చెప్పి సంజయుని వైపు ముఖం పెట్టి అందరూ వినేటట్లు ఇలా అన్నాడు..*

వి: *ధృతరాష్ట్రుడు గ్రుడ్డి వాడయినా ఎవరేప్రక్కన ఉన్నదీ స్పష్టంగా మనసులో ఎరిగినవాడు. ఆయన ప్రజ్ఞాచక్షుడు.*

తే: నీవు ధర్మజు పాలికి నెమ్మినరుగు;
మతఁడు పేరోలగంబున్న యవసరమునఁ
గాన్పు; మతనికి ననుజ వర్గంబునకును
బంధులకు నింపుపుట్టంగఁ బలుకు మచట. 270.

అ: నీవు; ధర్మజుపాలికిన్=ధర్మరాజు దగ్గరకు; నెమ్మిన్= క్షేమంగా; అరుగుము = వెళ్లుము; అతఁడు=ఆ ధర్మరాజు; పేరు+ఓలగంబు-ఉన్న= నిండునభలో ఉన్న; అవసరమునన్=సమయంలో; కాన్పుము=కనపడుము; అచటన్= ఆపేరోలగంలో; అతనికిన్=ఆ ధర్మరాజుకూ; అనుజ వర్గంబునకును=తమ్ములకూ; బంధులకున్=చుట్టాలకూ; ఇంపు+పుట్టంగన్=సంతోషం కలిగేటట్లు; పలుకుము.

భా: *నీవు సుఖంగా ధర్మరాజు దగ్గరకు వెళ్లు. అతడు సభలో ఉండగా దర్శనం చేసుకో- అక్కడ అతనికీ ,తమ్ములకూ ,బంధువులకూ ప్రీతిగా-మాట్లాడు.*

వి: ఇక్కడ బంధువులంటే ముఖ్యంగా కృష్ణుడు. ఆ తరువాత విరాటుడూ; ద్రుపదుడూ మొదలయినవారు.

క: నెయ్యము వాటించి కడుం
దియ్య మెసఁగ నలుక లెల్లఁ దీఱు నటులుగాఁ
గయ్య మను తలఁపు లోనుగ
నయ్యమనందనుఁడు మానునట్టి తెఱఁగునన్. 271.

అ: నెయ్యము+పాటించి; స్నేహభావం వహించి; కడున్=మిక్కిలి; తియ్యము+ఎసఁగన్=ఇంపు కలుగగా; అలుకలు-ఎల్లన్=కోపాలన్నీ; తీఱునటులుగాన్= తగ్గేటట్లుగా; కయ్యమను తలఁపు=యుద్ధమనే భావము; లోనుగన్=మొదలుగా (గల భావం); ఆ+యమనందనుఁడు= యముని కుమారుడయిన ఆ ధర్మరాజు; మానునట్టి తెఱఁగునన్= విడిచి పెట్టే విధానంతో...............

భా: *స్నేహం వహించి వారికి ప్రీతి కలిగేటట్లూ, కోపం తీరేటట్లూ, యుద్ధమనే మాట మనసులోకి రాకుండా ధర్మరాజు ప్రవర్తించేటట్లు(నీవు శాంతంగా కార్యం నిర్వహించుకు రావాలి.)*

-: సంజయుఁ డుపప్లావ్యంబున నున్న పాండవుల యొద్దకు వచ్చుట :- సం:5-22-39

వ: శాంతి ప్రకారంబునం గార్యంబు నడపి యొక్కటి యై మనుట యొడఁగూర్చి రమ్ము రథంబెక్కి పొ"మ్మని తగిన తెఱంగున వీడ్కొలిపిన సంజయుండునుం జని యుపప్లావ్యంబు సొచ్చి ,మాధవు మందిరంబున కరిగి, యభ్యంతర వినోదంబుల నరసహితుండై యున్న యన్నారాయణునకుం దనరాక యెఱింగించి పుచ్చి, తగఁబ్రవేశించి, భయభక్తి వినయ సంభ్రమంబులు మెఱయ వారలంగాంచి యమ్మహాత్ము లిరువుర సంభావనంబులును సంభాషణంబులునుం బడసి, సంప్రీత చేతస్కుండయి, మఱునాఁడు ధర్మతనయు నొడ్డోలగంబున్న సమయంబు వేచి; సముచితంబుగా నతనిం గని సాష్టాంగంబుగాఁ బ్రణమిల్లిన నతండుం బ్రియ పూర్వకంబుగా నాదరించి సమీపంబున నునిచికొనం గొలిచి యుండి యతని కిట్లనియె. 272.

అ: శాంతి ప్రకారంబునన్=ప్రశాంతమయిన పద్ధతిలో; ఒక్కటియై మనుట=కలిసి జీవించడం; ఒడఁగూర్చి=చేకూర్చి; అభ్యంతర వినోదంబులన్=లోపలి యింటిలో చేసుకొనే వినోదాలతో ; పుచ్చి=పంపి; సంభావనములు=సత్కారములు; సంప్రీతచేతస్కుండయి=ప్రీతి చెందిన మనస్సుకలవాడయి; ఒడ్డోలగంబు=నిండు సభ; ప్రణమిల్లు=నమస్కరించు;

భా: *ఆ ధర్మరాజు మనసులో యుద్ధమనే ఊహ రాకుండా ఉండేటట్లు శాంతి విధానంతో కార్యం నడుపుము. కలిసి అందరూ ఒకటిగా జీవించే ఏర్పాటు చేసి రా! రథం ఎక్కి వెళ్లు, అని వీడ్కొలిపాడు. సంజయుడు ఉపప్లావ్యం చేరాడు. కృష్ణుడున్న మందిరానికి వెళ్లి, అక్కడ అర్జునునితో లోపలి గృహంలో వినోదాలతో కాలక్షేపం చేస్తున్న కృష్ణునికి తనరాక తెలిపి, తగిన రీతిలో ప్రవేశించి ,భయమూ ,భక్తీ ,వినయమూ తొణికిసలాడేటట్లు వారిని దర్శించాడు. వారిద్దరూ సంజయుని సత్కరించి సంభాషించారు. సంజయుడు సంతోషించాడు. మరునాడు ధర్మరాజు సభతీర్చేవరకూ సంజయుడు నిరీక్షించి ,తగినట్లుగా అతనిని దర్శించి సాష్టాంగంగా నమస్కరించాడు. ధర్మరాజు సంజయుని ప్రీతితో ఆదరించి, దగ్గర ఒక ఆసనం మీద కూర్చుండబెట్టి ఇలా అన్నాడు.*

వి: 1. సాష్టాంగంబుగాన్= స+అష్ట+అంగంబుగా- నేలమీద పడి చేసే నమస్కారం. ఎనిమిది అవయవాలు నేలకు తాకేటట్లు నమస్కరించడం.

ఉరసా శిరసా దృష్ట్యా మనసా వచసా తథా
పద్భ్యాం కరాభ్యాం కర్ణాభ్యాం ప్రణామో2ష్టాంగ ఉచ్యతే.

ఱొమ్ము, శిరస్సు, కనులు, మనస్సు, వాక్కు(నోరు), కాళ్లు, చేతులు, చెవులు- ఈఎనిమిది అవయవాలు

తే: **భాగ్యమున నిన్నుఁగనుఁగొనఁ బడసి నాదు**
చూడ్కి చరితార్థమయ్యె; నస్తోక పుణ్య
ధనుఁడు మీ తండ్రి ధృతరాష్ట్ర ధరణీ నాథుఁ
డిందు మీయున్కి విని ప్రియ మెసక మెసఁగ. 273.

అ: భాగ్యమునన్= నా భాగ్యవశాత్తు; నిన్నున్; కనుఁగొనన్-పడసి=జూడగలిగి; నాదు చూడ్కి = నాచూపు; చరితార్థ మయ్యెన్=సఫలమయింది; అస్తోక పుణ్యధనుఁడు=అధికమయిన పుణ్యమనే ధనం కల; మీ తండ్రి; ధృతరాష్ట్ర ధరణి నాథుఁడు= ధృతరాష్ట్ర మహారాజు; ఇందు మీయున్కిన్=ఇక్కడమీ ఉనికిని గురించి; విని;ప్రియము=ప్రీతి; ఎసకము-ఎసఁగన్= అతిశయించగా..................... తరువాతి పద్యంతో అన్వయం.

భా: *నా అదృష్ట వశాన నిన్ను మళ్లీ చూడగలిగాను. నాచూపు సఫలమయింది. పుణ్యాత్ముడయిన ఆ ధృతరాష్ట్ర మహారాజు మీరిక్కడ ఉన్నారని వినిఎంతో సంతోషంతో.......... "(మీ యోగక్షేమాలు తెలుసుకొని రమ్మని నన్ను పంపాడు' అని ముందు పద్యంతో అన్వయం)*

వి: సంజయునిలో సజ్జనత్వమూ, అంతకుమించిన తెలివితేటలూ ఉన్నాయి. మొదటి మాట, నాచూడ్కి చరితార్థమయింది" అనడం అతని సజ్జనత్వానికి నిదర్శనం. మీ తండ్రి అనడం అతని అపారమయిన ప్రజ్ఞకు నిదర్శనం. మిమ్మల్ని తండ్రిలా ఆదరిస్తున్నాడనీ, మేమంతా అట్లాగే అనుకొంటున్నామనీ సంజయుడు భావిస్తున్నట్లుగా ధర్మరాజు అనుకోవాలి. అందుకోసం ఆ పదం ప్రయోగించాడు. అరణ్యాజ్ఞాతవాస విషయాల ప్రసక్తి విడచి "ఇక్కడ మీరున్నారని" అంటూ ప్రారంభించడంలో సంజయుని ప్రజ్ఞ విశదమవుతుంది. కోప,దుఃఖ సందర్భాలు గుర్తు చేయకుండా కార్యం నిర్వహించుకోవాలి.

క: **అనుజులు నీవును ద్రోవది**
యును బుత్రచయంబు నున్న యోగక్షేమం
బున తెఱఁగారయఁ బుత్తెం
చె నితాంత స్నేహపూర్ణ చేతోవృత్తిన్. 274.

అ: అనుజులు=తమ్ములూ; నీవును; ద్రోవదియును=ద్రౌపదీ; పుత్రచయంబున్ =పుత్రులసముదాయమూ; ఉన్న; యోగక్షేమంబునన్ తెఱఁగు=యోగక్షేమాల పద్ధతి; ఆరయన్=తెలుసుకోడానికి/ విచారించడానికి; నితాంత స్నేహపూర్ణచేతన్-వృత్తిన్=అధికమయిన స్నేహంతో నిండిన మనఃప్రవృత్తితో; పుత్తెంచెన్=నన్ను పంపించాడు.

భా: *నీ తమ్ములూ, నీవూ ద్రౌపదీ, కొడుకులూ; వీరి యోగక్షేమాలు విచారించి రమ్మని స్నేహపూర్వకమయిన మనస్సుతో ధృతరాష్ట్రుడు (నన్ను) పంపించాడు.*

వి: సంజయుడు 'నేను' 'నన్ను' అనే పదాలు లేకుండా వాక్యం పూర్తిచేశాడు. ఈ వాక్య నిర్మాణంలో వినయమూ, అహంకార రాహిత్యమూ ప్రతిఫలిస్తాయి. దాన్ని ధర్మరాజు గుర్తించి తరువాతి పద్యంలో తగిన సమాధానం చెపుతున్నాడు.

వ: **అనిన సూతనందనునకు ధర్మనందనుం డిట్లనియె.** 275.

భా: *అనగానే సంజయునితో ధర్మరాజు ఇలా అన్నాడు.*

వి: *తిక్కన సంజయ ధర్మరాజులకు- సూతనందన-ధర్మనందన పదాలు ప్రయోగించాడు. ఇప్పటిదాకా సంజయుడు చాలా చతురంగా మాట్లాడాడు. సూతనందనుడే అంత నేర్పుగా మాట్లాడితే ధర్మనందనుడు ఎంత నిపుణంగా మాట్లాడతాడు? చూడాలి. అనే ఉత్కంఠ కూడా పాఠకులకు కల్గిస్తున్నాడు.*

క: **ఆరాజు మాదెసం గల**
కారుణ్యము కతమునను సుఖంబున నిట్లు
న్నారము; నినుఁ బుత్తెంచిన
గారవమున నాదుమది వికాసముఁబొందెన్. 276.

అ: ఆరాజు =ఆ ధృతరాష్ట్రుడు; మాదెసన్ కల=మాపై చూపిన; కారుణ్యము కతమునను=దయకారణంగా; సుఖంబునన్; ఇట్లు; ఉన్నారము=ఉన్నాము; నినున్; పుత్తెంచిన=పంపిన; గారవమునన్=ప్రేమచేత/వాత్సల్యంచేత; నాదుమది=నామనస్సు ; వికాసమున్ పొందెన్=వికసించింది.

భా: *ఆ ధృతరాష్ట్ర మహారాజుకు మా మీద ఉన్న దయవల్ల ఇదిగో సుఖంగా ఇలా ఉన్నాము. (నీవూ చూస్తున్నావుగా) నిన్ను పంపినందువల్ల నా మనస్సు వికసించింది.*

వి: 1. **ఆరాజు**:- సంజయుడు మాట్లాడుతూ "మీ తండ్రి" అనీ ధృతరాష్ట్ర ధరణినాథుడనీ అన్నాడు. దానికి సమాధానంగా ధర్మరాజు ఆ రాజు అని మాత్రమే అన్నాడు. అనగా రాజధర్మాన్ని ప్రదర్శిస్తున్నాడు కాని పితృధర్మాన్ని ధృతరాష్ట్రుడు ప్రదర్శించడంలేదని చురక.

2. **ఇట్లు**: సుఖంబున నిట్లు న్నారము=ఇట్లు అనడంలో ఇదిగో ఇలా ఉన్నాం అని దెప్పిపొడుపు కూడా లేకపోలేదు.

3. **నినున్**: ఎవరినో సామాన్యుని పంపకుండా నిన్ను పంపినందులకు అనడంలో సంజయుని మీద ఉన్న ఆదరం వ్యక్తమవుతుంది.

4. 'నీ అహంకార రాహిత్యాన్ని గుర్తించాను' అనే భావం కూడా ఈ 'నిను' అనే పదంలో లేకపోలేదు.

'నిన్ను పుత్తెంచిన' అనడంలో మరో విశేషం ఉంది. ఇది సంస్కృత మూలంలో ఉంది.

"చాలా కాలానికి కురువృద్ధుడయిన మహారాజు ధృతరాష్ట్రుని క్షేమం నీ వల్ల విని సాక్షాత్తుగా మహారాజును చూసినంత సంతోషాన్ని పొందుతున్నాను" అంటాడు ధర్మరాజు.

చిరాదిదం కుశలం భారతస్య శ్రుత్వా రాజ్ఞః కురువృద్ధస్య సూత
మన్యే సాక్షా ద్దృష్ట మహం నరేంద్రం దృష్ట్వైవ త్వాం సంజయ ప్రీతియోగాత్
5-23-7

ఇంత భావాన్ని తిక్కన "నిను పుత్తెంచిన గారవమున" అనే నిర్మాణంలో పొదిగాడు.

క: అమ్మనుజేశ్వరునకు సే
మమ్మే? పుత్రకులు సుఖులె? మనుమలు సమ్మో
దమ్మునఁ బెరిఁగెదరే? నగ
రమ్ముల భూములను శుభపరంపర గలదే? 277.

అ: ఆ+మనుజ+ఈశ్వరునకున్= అధృతరాష్ట్ర మహారాజునకు; సేమమ్మే=కుశలమా?; పుత్రకులు=కుమారులు; సుఖులె?=సుఖంగా ఉన్నారా?; మనుమలు; సమ్మోదమ్మునన్=సంతోషంతో; పెరిగెదరే?=పెరుగుతున్నారా?; నగరమ్ములన్=నగరాలలోనూ; భూములను=జనపదాల్లోనూ; శుభపరంపర+కలదే?=శుభాలు నిరంతరంగా కలుగుతున్నాయా?

భా: *ఆ మహారాజు గారికి క్షేమమేనా? దుర్యోధనుడు మొ॥ కుమారులు సుఖంగా ఉన్నారా? లక్ష్మణుడు మొ॥ మనుమలు సుఖ సంతోషాలతో పెరుగుతున్నారా?; పట్టణాల్లోనూ పల్లెలలోనూ శుభపరంపర చెల్లుతోందా? నిత్యకళ్యాణం పచ్చతోరణంగా ఉందా?*

వి: మేము ఉన్నపుడు నిత్యకళ్యాణంగా ఉండేది. ఇప్పుడుందా? అనే భావం అందులో స్ఫురిస్తుంది.

సీ: ద్రోణుండుఁ గృపుఁడును ద్రోణసుతుండును
సుఖమున్నవారె? సుశ్లోకుఁడైన
భీష్ముండు కుశలియే, పెద్దతనం బిచ్చి
యాతనిఁ గౌరవులనుసరించి
మెలఁగుదురే? బ్రాహ్మణులకు మన్నన గల్గి
యుండునే? నేమర్థి నొసఁగి నట్టి
వృత్తులు సెల్లునే? యొత్తురువొండుల
వలనఁ బుట్టదు గదా? కలఁకులందుఁ

తే: బుట్టినప్పుడు గాండీవి భుజబలంబు
దలఁతురే? భీమసేను గదావిహార
ముగ్గడింతురె? కవలు మహోగ్ర రిపుల
భూము లంతంత కొత్తుట పొగడఁబడునె? 278.

అ: ద్రోణుండున్; కృపుఁడును; ద్రోణసుతుండును= అశ్వత్థామయును; సుఖము-ఉన్నవారె?=సుఖంగా ఉన్నారా?; సుశ్లోకుడు+ఐన= సత్కీర్తి కల; భీష్ముండు; కుశలియే?=కుశలముగా నున్నాడా?; పెద్దతనం బిచ్చి; ఆతనిన్=భీష్ముని; కౌరవులు; అనుసరించి; మెలఁగుదురే?=ప్రవర్తిస్తున్నారా?; బ్రాహ్మణులకున్; మన్నన=గౌరవము; కల్గియుండునే=ఉంటోందా?; నేము=మేము; అర్థిన్=ప్రీతితో; ఒసఁగి నట్టి=ఇచ్చిన; వృత్తులు=జీవనోపాధులు ;చెల్లునే=

చెల్లుతున్నాయా; ఒండులవలనన్=ఇతరుల వల్ల శత్రువుల వల్ల; ఒత్తొరువు=పీడ;,బాధ పుట్టదు కదా?; అందున్ కలఁకులు=అక్కడ కలహాలు; పుట్టినప్పుడు=కలిగినపుడు; గాండీవి=అర్జునునియొక్క; భుజబలంబు; తలఁతురే? =తలచు కొంటున్నారా? భీమసేను=భీముని యొక్క; గదా విహారము; ఉగ్గడింతురె? =చెప్పుకుంటారా?; కవలు=నకుల సహదేవులు; మహా+ఉగ్రరిపుల భూములు=భయంకరులయిన శత్రువుల భూములను; అంతంతకున్ ఒత్తుట=ఒత్తికొని ఆక్రమించుట; పొగడఁబడునె?=ప్రశంసింప బడుతూ ఉంటుందా?

భా: *గురువర్యులు ద్రోణులూ, కృపులూ, క్షేమంగా ఉన్నారా? గురుపుత్రుడయిన అశ్వత్థామ కుశలమేనా? సచ్చరిత్రుడయిన మా పితామహుడు భీష్ముడు కుశలమా? వారికి కౌరవులు పెద్దతనం ఇచ్చి గౌరవిస్తున్నారా?-బ్రాహ్మణులకు గౌరవం ఉందా? మేము ఇచ్చిన జీవనోపాధులు (అగ్రహారాలు) చెల్లుతున్నాయా? శత్రుబాధ లేకుండా ఉందా? ఏవయినా యుద్ధాలు వచ్చినపుడు అర్జునుని భుజపరాక్రమాన్నీ ,భీముని గదావిహారాన్నీప్రజలు చెప్పుకొంటున్నారా? నకుల సహదేవులు శత్రురాజ్యాలను ఆక్రమించడం గురించి ప్రజలు ప్రశంసిస్తున్నారా?*

వి: ఇందులో ధర్మరాజు ఉక్తిచాతుర్యం గోచరిస్తుంది. ద్రోణాదుల యోగక్షేమాలు అడుగుతూ మధ్యలో మమ్మల్ని ఎవరయినా తలచుకొంటున్నారా? అని తన బలాన్ని వ్యంగ్యరీతిలో ప్రకటిస్తున్నాడు. అనగా ధర్మరాజు వినయ పూర్వకంగానే పౌరుషం ప్రకటిస్తున్నాడన్నమాట. ఇటువంటి తీరులన్నీ చక్కగా గ్రహించి సంజయుడు "ధర్మసూతి మెత్తని పులి" అన్నాడు (చూడుడు ఉద్యోగ. 2-14)

మ: ఒకనాఁడా తమముందటన్ బలుమఱున్ హోరాటమై నేల యొ
త్తికొనంగా బవరంబులన్ గెలువఁగా; దెల్లంబుగాఁజూచి పాం
డుకుమారాళి నుతింపకుండుదురె? యాటోపంబునన్ ఘోషయా
త్రకు గంధర్వులు వచ్చినప్పటి చరిత్రం బాత్మలం బాయునే! 279

అ: ఒకనాఁడా?=ఒకరోజునా?;పలుమఱున్=ఎన్నో సార్లు; తమముందటన్ =తమ ముందే; హోరాటమైన్=ఆటోపంతో; నేల ఒత్తికొనంగాన్=శత్రుభూములను ఆక్రమించగా; బవరంబులన్=యుద్ధాలలో; గెలువగా; తెల్లంబుగాన్ చూచి=స్పష్టంగా చూసి; ప్రజలు పాండుకుమార + ఆళిన్=పాండురాజ కుమారులయిన పాండవులను; నుతింపకుండుదురె? =ప్రశంసింపకుండా ఉంటారా?; ఆటోపంబునన్=ఆడంబరంతో; ఘోషయాత్రకు; గంధర్వులు; వచ్చినప్పటి చరిత్రంబు; ఆత్మలన్ పాయునే=మనస్సులనుండి తొలగిపోవునా?/ మరిచిపోదురా?

భా: *ఎన్నోసార్లు అందరి ఎదుట పాండవులు శత్రుభూముల నాక్రమించడమూ, యుద్ధంలో గెలవటమూ స్పష్టంగా కనులారా చూసి కూడా ప్రజలు పాండవులను పొగడకుండా ఉంటారా? నిన్నమొన్న ఘోషయాత్రకు గంధర్వులు వచ్చినపుడు జరిగిన సన్నివేశం మరిచి పోగలరా? ఎవరయినా? (ఎవరూ మరువలేరని భావం).*

వి: ఒక ప్రక్క తనబలాన్ని ప్రకటిస్తూనే రెండోప్రక్క కౌరవుల అవమానాన్ని గుర్తుచేయడం ధర్మరాజు ఉక్తి చాతుర్యం.

క: **వినుము మనము మధ్యస్థుల**
మని నర్జును నెదిరి సంజయా! యిట మున్నె
వ్వనికిని మానముఁ బ్రాణం
బునుఁదగఁ దక్కించుకొనఁగఁ బోలెనె చెపుమా? 280.

అ: సంజయా!; వినుము; మనము; మధ్యస్థులము= మధ్యవర్తులము; అర్జునున్; ఎదిరి=ఎదిరించి; ఇటమున్ను=ఇంతకుముందు; ఎవ్వరికిని=ఎవరికయినా సరే; మానమున్= గౌరవమూ; ప్రాణంబును; తగన్; తక్కించుకొనఁగన్-పోలెనె?=తక్కించుకొన శక్యమయిందా? చెపుమా=చెప్పుము.

భా: *సంజయా మనం మధ్యస్థులుగా మాట్లాడుకొందాం. ఇంతకుముందు ఎపుడయినా ఎవరయినా అర్జునుని ఎదిరించి మానప్రాణాలు కాపాడుకోగలిగారా (అర్జునుని ఎదిరించిన వారికి మానమూ ప్రాణమూ దక్కవని భావం).*

వి: "మనము మధ్యస్థులము" అనడంలో వాక్చమత్కృతి, నిపుణత గోచరిస్తుంది. ఎదుటి వ్యక్తిని తనతో కలుపుకొని మిగిలినవారిని దూరం చేసిమాట్లాడే తీరుఅది. మాటల్లో మాత్రం మధ్యస్థులము అంటూ ఉంటాడు.

పైకి ఈ పద్యం గంధర్వుల నుద్దేశించినట్లు అనిపిస్తుంది. కాని అందులో కౌరవులకు భవిష్యత్సూచన కూడా లేకపోలేదు.

క: **దుర్యోధను నింటం దగు**
కార్యమునకు ఖడ్గమునకుఁ గలవాఁడై చా
తుర్యంబు మెఱయు కర్ణుని
యార్యత్వము సెల్లుచున్న యదియే? నెమ్మిన్. 281.

అ: దుర్యోధను నింటన్=దుర్యోధనుని ఇంట్లో ; తగు కార్యమునకున్=ఏ కార్యానికయినా; ఖడ్గమునకున్=యుద్ధానికయినా; కలవాఁడై=సమర్థుడయి; చాతుర్యంబు మెఱయు=నేర్పు ప్రదర్శించే; కర్ణుని ఆర్యత్వము=కర్ణుని పెద్దరికం; నెమ్మిన్=సుఖంగా; చెల్లుచున్నయదియే? =చెల్లుతోందా?

భా: *'ఆ దుర్యోధనుని గృహంలో కార్యానికీ ఖడ్గానికీ కూడా తానే అయి నేర్పుగా ప్రవర్తించే ఆ కర్ణుని పెద్దతనం చెల్లుతోందా?*

వి: కార్యానికీ ఖడ్గానికీ అన్నిటికీ కర్ణుడిమాటే చెల్లుతోంది దుర్యోధనుని యింట్లో. కార్యమంటే ఆలోచన; ఖడ్గమంటే యుద్ధము. అనగా శారీరకమయిన పనికీ, మానసికమయిన పనికీ అన్నిటికీ కర్ణుడే కావలసివస్తున్నాడు దుర్యోధనునకని భావం. కర్ణుని క్షేమం ద్రోణాదులతో కలిపి అడగకుండా ప్రత్యేకించి ఈ చివర అడగటంలో ధర్మరాజుకు కర్ణునిపై గల విలక్షణ దృష్టిని తిక్కన వ్యక్తం చేస్తున్నాడు.

సంస్కృతంలో కుశలప్రశ్నలలో బాహ్లికునీ, సోమదత్తునీ, భూరిశ్రవునీ,

యుయుత్సునీ, మొదలయినవారి నందరినీ తడవినాడు. కాని సంస్కృతంలో కూడా విదురుని ప్రసక్తి లేకపోవడం గమనార్హం.

వ: **అనిన విని సంజయుండును వినయంబుగా నిట్లనుఁ గురురాజు నొద్ద నవినీతులు నీతిమంతులు, సత్త్వ సంపన్నులు దురహంకారులు మఱియు వివిధ ప్రకారులు నయి బెరసియుండుదురు. వారొకళ్లొకళ్ల మాటలం బోయెడు వారు గారు. కావున వారినంత యనం బనిలేదు. నా విన్నపంబు చిత్తగింపుము. 282.**

భా: *ధర్మరాజు మాటలు విని సంజయుడు వినయంతో ఇలా అంటున్నాడు. ధృతరాష్ట్రుని దగ్గర అవినీతిపరులూ ఉన్నారు. నీతిపరులూ ఉన్నారు. శక్తిసంపన్నులూ ఉన్నారు. దురహంకారులూ ఉన్నారు. అంతేకాదు .అనేక విధాల జనులు పరివేష్టించి ఉంటారు. వారు ఒకరిమాట ఒకరు వినరు. కాబట్టి వారిని గురించి అంతగా అడగవలసిన పనిలేదు. నా విన్నపం విను.*

వి: ధర్మరాజు మాటలకు తగిన సమాధానం ఇది. ఈ వచనం కర్ణుని గురించి చివరగా అడిగినందుకు తగిన సమాధానం. చివరనుండియే చెపుతున్నాడు. వారిని గురించి అంతగా పట్టించుకోవలసిన పనిలేదని సమాధానం. నీప్రశ్న అనవసరమని మృదువుగా ఖండించాడన్నమాట.

క: **పొం దొందఁగఁ దలఁచితి నీ**
విందు శిశిరమైన విమల హృదయంబున; వా
రందఱకును సేమం బిట
ముందఱలేకున్న నేఁడు మొదలుగఁ గలుగున్. 283.

అ: నీవు: ఇందు శిశిరమైన=చంద్రుని వలె చల్లనయిన ;విమల హృదయంబునన్= నిర్మల మనస్సుతో; పొందు+ఒందఁగన్ తలఁచితి=స్నేహం చేయదలచావు.-ఇట ముందఱ లేకున్నన్= ఇంతకు ముందు లేకపోయినా; వారందఱకును; సేమంబు=క్షేమం; నేఁడు మొదలుగన్ కలుగున్=ఇప్పటినుండి కలుగుతుంది.

భా: *చంద్రునివలె చల్లనైన నిర్మలమనస్సుతో నీవు కౌరవులతో పొందుకోరావు. వారందరికీ క్షేమం ఇప్పటిదాకా లేకపోయినా ఇప్పటినుండి కలుగుతుంది.*

వి: 1. వారందఱకును సేమంబు=వారందరికీ క్షేమమే అని అక్కడికి ఒక వాక్యంగా విడదీసి చెప్పవచ్చు.

2. ఇంతకుముందే ద్రుపద పురోహితుని ద్వారా సంధికై పొందుకై రాయబారం పంపాడు ధర్మరాజు. దాన్ని ఇపుడు సంజయుడు ప్రస్తావిస్తున్నాడు. నీవు పొందుకోరుతున్నావు కనుక ఇతఃపూర్వం వారికి క్షేమం ఉన్నాలేకపోయినా ఇక మీదట కలుగుతుంది అని తనకు అనుకూల మార్గంలో ధర్మరాజును మలచుకొంటున్నాడు.

క: **ధృతరాష్ట్ర భూపతికి వృ**
ద్ధత కతమునఁ జిత్తమొక విధముగామి సుతో
ద్ధతి మాన్పఁడ నాఁడ; మనః
క్షతి పిదపం బుట్టి; యిపుడు శాంతుం డయ్యేన్. 284.

అ: ధృతరాష్ట్రభూపతికిన్= ధృతరాష్ట్ర మహారాజుకు; వృద్ధతకతము నన్= ముసలితనంచేత; చిత్తము=మనస్సు; ఒక విధము-కామిన్=నిశ్చలంగా ఉండక పోవడంచేత; నాఁడు=ఆనాడు (సభలో ద్రౌపదీ పరాభవఘట్టంలో) సుత+ఉద్ధతి=కొడుకు యొక్క గర్వాన్ని; మాన్పఁడ=మాన్పలేకపోయాడు; పిదపన్= ఆతరువాత; మనఃక్షతి పుట్టి= మనస్తాపం కలిగి; ఇపుడు; శాంతుండు+అయ్యేన్=ప్రశాంతుడయ్యాడు

భా: *ఆ ధృతరాష్ట్రుడు ముసలితనం చేత ఆనాడు సభలో దుర్యోధనుని ఔద్ధత్యమును మాన్పలేక పోయాడు. తరువాత అతడు ఎంతో మనస్తాపం చెందాడు. ఇపుడు మళ్లీ మీరు అభ్యుదయం చెందినట్లు విని చాలా శాంతించాడు.*

వి: ధృతరాష్ట్రుని ఎదుట ద్రౌపది పరాభవింపబడటానికి సంజయుడు ఇపుడు సమాధానం చెప్పి ధర్మరాజును శాంతపరుస్తున్నాడు. ధర్మరాజు "మా పెదతండ్రి కుశలమా" అని అడగకుండా "అమ్మనుజేశ్వరునకు" అన్నాడు. అందులోని ఆంతర్యం సంజయుడెరిగి తగినట్లు సమర్థిస్తున్నాడు. ధృతరాష్ట్రుడు తరువాత ఎంతో బాధపడ్డాడని- అంతేకాదు మళ్లీ మీరు తిరిగి వచ్చారని విని ప్రశాంతు డయ్యాడని.

తే: **ఇట్టి చందంబు లెల్లను నీవు పుణ్య**
చిత్తవృత్తిమై సైఁచినఁ జెల్లివచ్చు;
నీ యజాత శత్రుత్వంబు నిఖిలలోక
విశ్రుతము గాదె ధర్మప్రవీణ హృదయ! 285.

అ: ఇట్టి చందంబులు-ఎల్లను=ఇటువంటి పద్ధతులు(నడకలు) అన్నీ;ఈవు; పుణ్యచిత్తవృత్తిమైన్=పుణ్య దృష్టికల మనస్సుతో; సైఁచినన్=క్షమిస్తే; చెల్లివచ్చు=చెల్లుతాయి; ధర్మప్రవీణ హృదయ!=ధర్మమునందు నిపుణమయిన మనస్సుకల ధర్మరాజా!; నీ-అజాత శత్రుత్వంబు=నీవు శత్రువులు కలగని వాడవన్నలక్షణం; నిఖిలలోక విశ్రుతము కాదె!=అన్ని లోకాలలోనూ ప్రసిద్ధి వహించినదికదా!

భా: ఇటువంటి పద్ధతులన్నీ నీవు పుణ్యదృష్టితో సహిస్తేనే చెల్లుతాయి. ధర్మనిపుణుడవయిన ధర్మరాజా! నీ అజాత శత్రుత్వం అన్నిలోకాలకూ తెలిసినదే కదా!

వి: **అజాతశత్రుత్వము:** అజాత శత్రుడు అంటే పుట్టని శత్రువులు కలవాడని వ్యుత్పత్తి. అతనికి శత్రువులనేవారు పుట్టరు. అయితే దుర్యోధనాదులు శత్రువులుకారా అని సందేహం. దీనికి సమాధానం ఇది. దుర్యోధనాదులకు ధర్మరాజు శత్రువేకాని ధర్మరాజుకు దుర్యోధనాదులు శత్రువులు కారు. అనగా శత్రుభావం ధర్మరాజు మనసులో లేదని అర్థం. దాన్ని ఆసరాగా చేసుకొని అజాతశత్రుత్వాన్ని నిర్ధారిస్తున్నాడు సంజయుడు.నీకు శత్రుత్వం ఏకోశాన లేదనే విషయంతో తనపని సాధించుకొంటున్నాడు సంజయుడు.

చ: **జగముల నెల్లెడన్ దురిత సంతమసంబు జయింపఁగోరి పొ**
ల్పుగఁ బరమేష్ఠి నిల్పిన వెలుంగు మహీసురు; లట్టి వారికిం
దగవు ఘటింప సత్పురుష దత్తములై చను జీవనంబు లెం
త గుమతులైన మార్తురె? పదంపడి యాయువు శ్రీయు నొల్లరే! 286.

అ: జగములన్ ఎల్లెడన్=లోకాలన్నిటిలోనూ; దురితసంతమసంబున్=పాపమనే చీకటిని; జయింపఁగోరి=పోగొట్టాలనుకొని; పొల్పుగన్=నేర్పుగా; పరమేష్ఠి=బ్రహ్మ; నిల్పిన వెలుంగు=సృష్టించిన దీపములే; మహీసురులు=బ్రాహ్మణులు; అట్టివారికిన్=అటువంటివారికి; తగవు ఘటింపన్=న్యాయము చేకూర్చుటకై; సత్పురుష దత్తములై చను=సజ్జనులచే ఇవ్వబడిన; జీవనంబులు=జీవనోపాధులు; ఎంతకుమతులయినన్=ఎంత దుర్బుద్ధి కలవారయినా సరే! మార్తురె?=నశింపజేయుదురా? తొలగిస్తారా?; పదంపడి=తరువాత; ఆయువు=ఆయుర్దాయము, జీవితము; శ్రీయున్=సంపదనూ; ఐశ్వర్యమునూ;ఒల్లరే!=ఒల్లరా; (అక్కరలేదా?)

భా: *లోకంలో నెలకొని ఉన్న పాపం అనే చీకటిని పోగొట్టడానికి సృష్టికర్త నిలిపిన వెలుగులే బ్రాహ్మణులు. అటువంటి వారికి సత్పురుషులచే న్యాయము చేకూర్చుటకై ఇవ్వబడి చెల్లుతున్న జీవనోపాధులను ఎవరయినా తొలగిస్తారా? తర్వాత వారికి ఆయువు, సంపదా అక్కరలేదా?*

వి: బ్రాహ్మణులకు మన్నన కల్గియుండునే?
యే మర్థి నొసగినట్టి వృత్తులు సెల్లునే?
అన్న ప్రశ్నకు ఇది సమాధానం.

పాపం చీకటి వంటిది. చీకటి భయం కలిగిస్తుంది. పుణ్యం వెలుగు వంటిది. వెలుగు వికాసాన్ని ఇస్తుంది. పుణ్యాపాపాలే మంచిచెడులు. పాపాన్ని పోగొట్టి పుణ్యవర్తనం ప్రజలకు అలవరించేందుకు సృష్టికర్త ఆదర్శప్రాయంగా సత్త్వగుణప్రధానులయిన విప్రులను సృష్టించాడు. వారి జీవనం సాత్త్వికమయినది. మార్గదర్శకమయినది. వారికి సత్పురుషులూ, మహారాజులూ కొన్ని జీవనోపాధులనిచ్చేవారు. వాటిపై పన్ను మొ॥ఉండవు. వాటిని ఎంత దుర్బుద్ధులయినా మరల తీసుకోరు. లాగికొనరు అని భావం. అట్లా లాక్కుంటే వారికి ఆయువూ, సంపదా ఉండవని భావం. అంతేకాదు. మీరు మాత్రం ఊరుకుంటారా? మీరిచ్చిన మాన్యాలు లాగివేస్తే? అనికూడా అర్థం.

ఉ. **ఒక్కొకచోఁగడంగి ప్రతియోధులు మార్కొనునప్పు డాత్మలన్**
నెక్కొని మోములం బొడము నెవ్వగతోడ జనంబు"లిట్టియం
దక్కట! భీముఁడైన మన యర్జునుఁడైనను మాద్రి పుత్త్రులం
దొక్కరుఁడైన నీ పగఱ నుక్కడఁగింపరె! యొక్క వ్రేల్మిడిన్. 287.

అ: ఒక్కొకచోన్ = ఒక్కొక్క సమయంలో; ప్రతియోధులు = శత్రువులు; కడంగి పూనుకొని; మార్కొను నప్పుడు = ఎదిరించేటప్పుడు, ఆత్మలన్ నెక్కొని = మనస్సుల లోవ్యాపించి/ మనస్సులో నుండి పొరలి; మోములన్ పొడము = ముఖాల్లో కనపడే; నెవ్వగ తోడన్ = నిండు

విచారంతో; జనంబులు = ప్రజలు; అక్కట/ఇట్టి యందు= ఇటువంటి సమయంలో; భీముఁడైన = భీముడయినా; మన అర్జునుండైనను; మాద్రి పుత్త్రులందు= నకుల సహదేవులలో;ఒక్కరుఁడైనన్; ఒక్క వ్రేల్మిడిన్ = ఒక్క క్షణ కాలంలో/ చిటికెలో; ఈ పగఱన్ = ఈ శత్రువులను;ఉక్కడ గింపరె?= మట్టు పెట్టరా?

భా: ఒక్కొక్కప్పుడు శత్రువులు చుట్టుముట్టి ఎదిరించినప్పుడు ప్రజలు మనసులోంచి ముఖాల్లోకి పెల్లుబికిన దుఃఖంతో ఇలా అనుకుంటారు **ఈ సమయంలో మన భీముడు కాని అర్జునుడు కాని నకుల సహదేవులెవరయినా కానీ ఉండి ఉంటే వీరిని చిటికెలో సంహరించి ఉండేవారు.**

వి. 1. ఇట్టియందు .... ఇక్కడ నుండి ప్రజలు అనుకొనే మాటలు. ఇవి వచ్చే పద్యంలో కూడా ఉన్నాయి.

2. కలకు లందు పుట్టినప్పుడు అన్న ప్రశ్నకు ఇది సమాధానం.

క: **వారొక యాగ్రహ వృత్తిం**
గూరియు, ధర్మంబు సెడుటకుం జాలరు, దు
ర్వార బలులయ్యుఁబాండుకు
మారులు శాంతాత్మ"లండ్రు మనుజాధీశా! 288

అ: మనుజ+అధి+ఈశా=ధర్మరాజా; వారు=ఆ పాండవులు; ఒక ఆగ్రహవృత్తిన్ = ఒక్కొక్కప్పుడు కోప ప్రవృత్తిని; కూరియున్=పొందినా; ధర్మంబు-చెడుటకున్ = ధర్మంచెడిపోవటానికి; చాలరు=ఇష్టపడరు; పాండుకుమారులు; దుర్వారబలులు +అయ్యున్=వారింపరాని బలం కలిగినవారయినా; శాంత+ఆత్ములు=ప్రశాంత మనస్సుకలవారు; అండ్రు =అంటారు.

భా: *ధర్మరాజా! (పాండవులను గూర్చి ప్రజలు ఇంకా ఇలా చెప్పుకొంటారు)* **పాండవులు ఎపుడయినా కోపం వచ్చినాసరే ధర్మం చెడిపోవటానికి మాత్రం ఇష్టపడరు. మిక్కిలి బలపరాక్రమాలున్నా పాండవులు శాంత మనస్కులు.** అని ప్రజలు చెప్పుకుంటారు.

వి: ఆగ్రహపదం తెలుగులో కోపం అనే అర్థాన్ని కూడా ఇస్తుంది.

పాండవులు గుర్తున్నారా ప్రజలకు? అని ధర్మరాజు తనబలాన్ని ప్రకటించాడు. దానికి తగిన సమాధానం ఇందులో సంజయుడు చెవుతున్నాడు. ''పాండవులు పరాక్రమవంతులేకాని ధర్మం దృష్టిలో పెట్టుకొని శాంతంగా ఉంటారు'' అని ప్రజలు చెప్పుకొంటున్నారు అన్నాడు సంజయుడు. ఆపేరు పోగొట్టుకోకు అని ధర్మరాజుకు సంజయుని సూచన.

క: **నలువురు తమ్ములు భవదా**
ప్తులుఁ గృష్ణుడు వినుచునుండ భూవర! నీకేఁ
గొలువునను విన్నవింపం
బలుకులు గల వవధరింపు పరిపాటిమెయిన్. 289.

అ: భూవర!=రాజా!;నలువురుతమ్ములు=నీతమ్ములునలుగురూ; భవత్+ ఆప్తులున్=నీయొక్క ఆప్తులూ; కృష్ణుఁడున్; వినుచున్ ఉండన్=వింటూ ఉండగా; నీకున్;

ఏన్=నేను; కొలువునను=కొలువులో ;విన్నవింపన్=విన్నవించుకొనేందుకు; పలుకులు; కొన్ని మాటలు; కలవు; పరిపాటి మెయిన్= అనుపూర్వితో (క్రమం తప్పకుండా); అవధరింపు=వినుము

భా: ధర్మరాజా! తమ్ములు నలువురూ; నీ ఆప్తులూ ,కృష్ణుడూ వింటూ ఉండగా కొలువులో నీకు నేను విన్నవింపవలసిన మాటలు కొన్ని ఉన్నాయి. అనుపూర్వితో విను. (శ్రద్ధగా క్రమంగా విను)

వి: అందరూ వింటూ ఉండగా నేనునీకు విన్నవింపదగిన పలుకులున్నాయన్నాడు సంజయుడు. ఇక్కడ నేను అనే మాట సాభిప్రాయంగా సంజయుడు ప్రయోగించాడు. దానికి ముందు పద్యంలో ధర్మరాజు తగిన సమాధానం చెప్పాడు. ఈ మాటలు నావి సుమా అని మున్ముందు తప్పించుకొనేందుకు వీలుగా సంజయుడు "నేను" అన్నాడు.

చ: **అనవుడు "వీరె తమ్ములును నాప్తులుఁ గృష్ణుఁడు వీరె తక్కకొ**
ల్వునఁ గలయట్టి సర్వజనులున్ వినుచుండెద; రయ్య నిన్నునే
మను మని పంచెఁ జెప్పు మది యంతయు నేర్పడ"నన్న ధర్మనం
దను గరువంపుఁబల్కుల విధంబునకున్ మదిలోన నుల్కుచున్. 290.

అ: అనవుడు=అనగానే; వీరె తమ్ములునున్; ఆప్తులున్; కృష్ణుడు వీరె; తక్కకొల్వున గలయట్టి సర్వజనులున్=కొలువులోని మిగిలిన జనులందరూ కూడా; వినుచుండెదరు=వింటూ ఉంటారు; అయ్య=ధృతరాష్ట్రుడు; నిన్నున్ ; ఏమి+అనుము+అని పంచెన్=ఏమి చెప్పమని పంపించాడో; అది అంతయున్, ఏర్పడన్=స్పష్టంగా; చెప్పుము; అన్న=అని నటువంటి; ధర్మనందను=ధర్మరాజు యొక్క; గరువము+పల్కుల విధంబునకున్=నిపుణమయిన మాటల తీరుకు; మదిలోనన్=మనస్సులో; ఉల్కుచున్=బెదురుతూ- (సంజయుడు అంటున్నాడని ముందు పద్యంతో అన్వయం).

భా: *సంజయుడు అట్లా అనగానే ధర్మరాజు ఇలా అన్నాడు. "ఇరుగో వీరే నా తమ్ములు. వీరే అప్తులు- కృష్ణుడు ఇంకా కొలువులో మిగిలిన ప్రజలంతా కూడా వింటారు. నిన్ను ఆ ధృతరాష్ట్రుడు ఏమి చెప్పమని పంపాడో అది అంతా స్పష్టంగా చెప్పు" అన్నాడు. నిపుణమయిన ఈ ధర్మరాజు మాటలకు సంజయుడు మనసులో ఉలికిపడి ఇలా అన్నాడు.*

వి: **నీవు** విన్నవించుకోవలసిన అవసరంలేదు. ఆ ధృతరాష్ట్రుడు ఏమి చెప్పమన్నాడో అవి చెప్పు అన్నాడు ధర్మరాజు. సంజయుడు తప్పుకొనేందుకు వీలులేకుండా బిగించాడు ధర్మరాజు. అందుచేత సంజయుడు ఉలికి పడ్డాడు. మాటలలో తన దొంగతనం బయటపడిందని.

2. వీరే కాదు. కొలువులోని సమస్త ప్రజలూ వింటారు కనుక జాగ్రత్తగా మాట్లాడు అని హెచ్చరిక.

ఆ: **సంజయుండు కృష్ణు సద్భక్తి నీక్షించి**
పవనపుత్త్రుఁ బార్థుఁ గవల ద్రుపద
తనయు సవినయమునఁ గనుఁగొని, ప్రీతిఁ బాం
చాలు మత్స్య ధరణిపాలుఁ జూచి. 291.

అ: సంజయుండు; కృష్ణున్=కృష్ణుని; సద్భక్తిన్=చక్కని భక్తిభావంతో; ఈక్షించి=చూసి; పవనపుత్త్రున్=భీముని ;పార్థున్=అర్జునుని; కవలన్=నకుల సహదేవులనూ; ద్రుపద తనయున్=ద్రుపదుని కొడుకు ధృష్టద్యుమ్నునీ; సవినయమునన్=వినయంతో; కనుఁగొని=చూసి; ప్రీతిన్=ప్రియంగా; పాంచాలున్=ద్రుపదుని; మత్స్యధరణిపాలున్=మత్స్యదేశపురాజు విరాటునీ; చూచి;

భా: *సంజయుడు వెంటనే కృష్ణుని భక్తితో చూశాడు. భీమునీ, అర్జునునీ, నకుల సహదేవులనూ ధృష్టద్యుమ్నునీ వినయంతో చూశాడు. ఎంతో ప్రీతితో ద్రుపదునీ, విరాటునీ చూసి.......... ఇలా అంటున్నాడు.*

వ: సావధానులరై వినుండని పలికి యుధిష్ఠిరు దెసకు మోడ్పుఁగేలు నిగిడించి యిట్లనియె. 292.

అ: సావధానులరు-ఐ=శ్రద్ధ కలిగిన వారై; మోడ్పు-కేలు=ముకుళింపజేసినహస్తం; నమస్కారం.

భా: *అవధానంతో శ్రద్ధతో వినండని పలికి ధర్మరాజుకు నమస్కరించి ఇలా అన్నాడు.*

ఉ: శాంతతఁ బొంది కార్యము దెసన్ ధృతరాష్ట్ర మహీశుఁ డాత్మ న
త్యంతముఁ దేఱి నన్నిట ప్రియంబునఁ బంచెడు నప్డు నాకుఁదే
రెంతయు వేడ్కఁ దాన వెరవేర్పడఁ జెప్పుచుఁ బన్నఁబంచె; ని
ట్లింత ఘటించెఁబొందు; మనమీ పదనం దెలి వొందఁగాఁ దగున్. 293.

అ: ధృతరాష్ట్ర మహీశుఁడు= ధృతరాష్ట్ర మహారాజు; శాంతతన్ పొంది= శాంతుడయి; కార్యము దెసన్= ముందుచేయవలసిన పని విషయంలో; అత్యంతమున్=మిక్కిలి; తేఱి=ప్రసన్నుడై; నన్ను;,ఇట=ఇక్కడకు; ప్రియంబునన్ = ప్రీతితో; పంచెడు నప్డు = పంపించేటప్పుడు; ఎంతయు; వేడ్కన్=ఎంతో కుతూహలంతో; వెరవు-ఏర్పడన్ చెప్పుచున్=ఉపాయం చెపుతూ; నాకు;తేరు=రథం; తాన=తానే (ధృతరాష్ట్రుడే) పన్నన్ పంచెన్=సిద్ధము చేయ నాజ్ఞాపించాడు; పొందు=స్నేహం; ఇట్టు ఇంతఘటించె=ఇదిగో ఇంత కలిగింది; మనము; ఈ పదనన్=సమయంలో/అదనులో; తెలివి+ఒందగాన్-తగున్=మేల్కొనాలి,

భా: *మీరు అభ్యుదయం పొందినట్లు విని (284 పద్యం) ధృతరాష్ట్రుడు ప్రశాంతుడయి; ముందుజరుగవలసిన విషయంలో ఎంతో నిర్మలుడై నన్నిక్కడకు ప్రీతితో పంపాడు. ఆ పంపేటప్పుడు ఎంతో కుతూహలంతో తానే నాకు రథం ఏర్పాటుకు తగిన ఉపాయం కూడా చెప్పి పంపాడు. ఇంతస్నేహభావం కలిగింది. ఇపుడు మనం దాన్ని తెలుసుకొని వ్యవహరిద్దాం.*

వి: సంజయుని మాటలనేర్పు ఇందులో గోచరిస్తుంది. 283 పద్యంలో ధర్మరాజుతో 'నీవు పొందుకోరుతున్నావు' అన్నాడు. ఆ వాక్యానికి పోషకంగా ఇపుడు" ధృతరాష్ట్రుడు ఎంతో నిర్మలుడయ్యాడు. తనంతతానే రథం ఏర్పాటు చేయించి నన్ను పంపాడు. సంధి యింతగా

చేకూరింది. అది ఈ సమయంలో గ్రహించి తెలివిగా వ్యవహరించాలి'' అంటున్నాడు. ఆ తెలివిగా వ్యవహరించే తీరుకూడా తరువాతి పద్యాల్లో చెపుతున్నాడు.

2. 'మనం' అని ధర్మరాజును కలుపుకొని మాట్లాడటం కూడా ఒక చాతుర్యం.

క: **చులుకని కార్యము సేయం**
దలఁచుట మీయట్టి సర్వధర్మజ్ఞులు శాం
తులు ననఁ బ్రసిద్ధులగు పె
ద్దలకుం దగవగునె యెవ్విధంబునఁజూడన్ . 294.

అ: ఏ + విధంబునన్ - చూడన్ = ఏ విధంగా చూసినా; సర్వధర్మజ్ఞులు = అన్ని ధర్మాలు తెలిసినవారు; శాంతులు = శాంతి పరులు; అనన్ ప్రసిద్ధులగు మీయట్టి పెద్దలకున్= అని ప్రసిద్ధికెక్కిన మీ వంటి పెద్దవారికి; చులుకని కార్యము - చేయన్ - తలఁచుట = చులకన పని చేయాలను కోవడం; తగవు-అగునె? = న్యాయమవుతుందా?

భా: ఏ విధంగా చూసినా తేలిక పని, నీచపు పని చేయాలనుకోవడం ధర్మమెరిగిన వారనీ,శాంతులనీ ప్రసిద్ధికెక్కిన మీ వంటి పెద్దలకు న్యాయమా? తగునా?

ఆ: **మడుఁగుఁ జీరయందు మసి దాఁకినట్లు మీ**
సత్కులమునఁ గల్మషంబు గౌర
వేంద్రుకతనఁ బొందె; నింతయుఁ బాపంగ
నీవ నేర్తు కార్యనిపుణ హృదయ! 295.

అ: మడుఁగు -చీరయందు=ఉతికిన వస్త్రంమీద ; మసి తాఁకినట్లు; మీ సత్కులమునన్= మీ సద్వంశంలో; కౌరవేంద్రుకతనన్=దుర్యోధనుని వలన; కల్మషంబు పొందె=మచ్చ ఏర్పడింది; కార్యనిపుణ హృదయ = కార్యంలో నేర్పుకలమనస్సు కలవాడా! ; ఇంతయున్ పాపంగన్= ఆమసి అంతా పోగొట్టడానికి; నీవు-అ-నేర్తు= నీవే తగుదువు, (నీవే పోగొట్టగలవు.)

భా: తెల్లగా ఉతికిన బట్టమీద మసి తాకినట్లుగా స్వచ్ఛమైన మీ వంశానికి దుర్యోధనుని వల్ల మచ్చఏర్పడింది. (పని నిర్వహించడంలో నేర్పున్న మనసు కల) ధర్మరాజా! ఆ మచ్చపోగొట్టడం నీ వల్లనే అవుతుంది. నీవే పోగొట్టగలవు.

అలం: ఉపమ

చ: **అఖిల జనక్షయంబయి జయాపజయంబులు రెండునుం దుదిన్**
సుఖములు గాని యీ పనికిఁజొత్తురె యుత్తము; లట్లు కాకయా
నిఖిల సుఖంబు లేమిటికి? నీవని వృద్ధజనంబు బాలురన్
సఖులను బంధులన్ గురులఁ జంపితయేని దయాపయోనిధీ! 296.

అ: అఖిల జనక్షయంబు+అయి=జనులంతా చనిపోయి; జయ+అపజయములు= జయమూ, పరాజయమూ; రెండునున్ = రెండూ; తుదిన్ = చివరకు; సుఖములు కాని =

సుఖం చేకూర్చని; ఈ పనికిన్=ఈ యుద్ధకార్యానికి; ఉత్తములు=ఉత్తములు (మీవంటివారు); చొత్తురె?=తలపడతారా?; దయాపయోనిధీ!=దయకు సముద్రంవంటివాడా!;అట్లుకాక=ఆ ఉత్తములవలెకాక; నీవు;అనిన్=యుద్ధంలో;వృద్ధజనంబున్=ముసలి వారిని;బాలురన్; సఖులను = స్నేహితులనూ; బంధులన్ = చుట్టాలనూ; గురులన్ = గురువులనూ; చంపితయని=చంపినట్లయితే; (వచ్చే) ఆ నిఖిల సుఖంబులు=ఆవచ్చే సుఖాలన్నీ; ఏమిటికి?= ఎందుకు?/ ఎవరికోసం?

భా: *యుద్ధం వల్ల జయం కలిగినా అపజయం కలిగినా ప్రజలంతా చనిపోతారు. జయమయినా ,అపజయమయినా చివరకు సుఖం,చేకూరదు. యుద్ధం వల్ల-అటువంటి పనికి ఉత్తములు పాల్పడరు .అలా కాక్రనీవు యుద్ధంలో వృద్ధులనూ, బాలురనూ, స్నేహితులనూ, బంధువులనూ, గురువులనూ చంపితే ఆ తరువాత సుఖాలన్నీ ఎందుకు ఎవరికోసం ? అదీగాక అవి సుఖా లవుతాయా!*

వి: యుద్ధ వైముఖ్యం కలిగిస్తున్నాడు ఇందులో.

ఉ: **పెట్టని కోట నీకు హరి; భీముఁడు నర్జునుఁడున్ రణంబునం**
దొట్టిన మంట; లాకొలఁది యోధుల సాత్యకియున్ విరాటుఁడుం;
జుట్టపుమేరు వుగ్రరణశోభితుఁ డీద్రుపదుండు; నిన్ను ని
ట్టట్టన వచ్చునే సురలకైనను? నొల్లవుగాక చివ్వకున్. 297.

అ: హరి=కృష్ణుడు; నీకున్; పెట్టని కోట=కట్టనక్కరలేని కోట (వంటివాడు); భీముఁడున్; అర్జునుఁడున్; రణంబునందున్=యుద్ధంలో; ఒట్టిన మంటలు=ప్రజ్వరిల్లే మంటలు; సాత్యకియున్; విరాటుఁడున్; ఆ కొలఁది యోధుల= అంతమాత్రపు వీరులే; ఈ ద్రుపదుండు; ఉగ్రరణ శోభితుఁడు=భయంకరమయిన యుద్ధంలో శోభించేవాడు; చుట్టపు మేరువు=బంధువుల విషయంలో మేరుపర్వతం వంటి వాడు; చివ్వకున్=యుద్ధానికి; ఒల్లవుగాక=ఒప్పుకోవు కాని; (లేకపోతే); సురలకైనను=దేవతలకయినా; నిన్నున్; ఇట్టట్టు అనవచ్చునే=కదల్ప శక్యమా!?

భా: *నీకు కృష్ణుడు పెట్టనికోటవంటివాడు. (రక్షణ విషయంలో) భీముడూ అర్జునుడూ యుద్ధంలో మండే మంటలవంటి వారు. సాత్యకీ,విరాటుడూ కూడా అంతటి పరాక్రమవంతులే. (భీమార్జునులయంతటి) ఈ ద్రుపదమహారాజు బంధువులకు సాయపడటంలో బాగా శోభించేవాడు. నీవు యుద్ధానికి ఇష్టపడవు కాని లేకపోతే నిన్ను దేవతలకయినా కదల్పశక్యమా?*

వి: **1. పెట్టని కోట :** ఇది చక్కని జాతీయం, కోట రక్షణను ఇస్తుంది. దాన్ని కట్టుకొనటానికి చాలా కష్టపడాలి. కాని ఇపుడా కోట కష్టపడకుండా లభించింది ధర్మరాజుకు కృష్ణుడు యుద్ధం లో ఆయుధం పట్టలేదు కాని ఎన్నో అస్త్రాలను అడ్డుకొని రక్షించాడు. ఈ విషయంలో తిక్కన ఈ "పెట్టనికోట" పద ప్రయోగం చాలా సముచితంగా ఉంది.

2. ఒట్టిన మంటలు : భీమార్జునులు ఇరువురూ దావానలం లాగా శత్రు సైన్యాలనే అడవిని దహింప జేయగలరు. కౌరవులను అడవిగా ముందు పోల్చుతాడు.

3. **చుట్టపుమేరువు** : బంధువులపై ప్రీతితో కోరిన దిచ్చే వ్యక్తిని ఇలా అంటారు. మేరువు బంగారు పర్వతం. ధైర్యానికి ప్రతీక - పాండవులకు కొండంత అండ ద్రుపదుడే అని సంజయుని అభిప్రాయం.

4.**ఒల్లవుగాక చివ్వకున్** = ఈ మాట సంజయుని ఉక్తి చాతుర్యానికి నిదర్శనం - ముందరకాళ్లకు బంధం వేయడం. యుధిష్ఠిరుడనే మాటకు సార్థకత చేకూరుస్తూ మాట్లాడుతున్నాడు. యుద్ధమందు స్థిరమయిన వాడు ధర్మరాజు. అందుకే "నిన్ను ఇట్టట్టన వచ్చునే" అంటున్నాడు.

వ: **మఱియు నక్కడ.** 298.

భా: *అంతేకాదు. ఆ పక్షంలో*

ఉ: **ద్రోణుఁడు భీష్ముఁడుం గృపుఁడు ద్రోణసుతుండును గర్ణశల్యులుం**
బ్రాణములా సుయోధనుని పాలివయంద్రు; నిజాను జన్ము ల
క్షీణ పరాక్రముల్; సుతు లజేయులు; బాహ్లికసోమదత్తు లా
స్థాణునకైన నోడరు; వశంబె జయింపఁగ వారి నేరికిన్. 299

అ: ద్రోణుఁడు; భీష్ముఁడున్; కృపుఁడు; ద్రోణసుతుండును = అశ్వత్థామయూ; ప్రాణములు=తమ ప్రాణాలు; ఆసుయోధనుని పాలివి+అ+-అంద్రు=ఆ దుర్యోధనుని పాలివే అంటారు; నిజ+అనుజన్ములు=తన తమ్ములు; అక్షీణ పరాక్రముల్=తగ్గని పరాక్రమం కలవారు; సుతులు=లక్ష్మణుడు మొదలయిన కుమారులు; అజేయులు=జయింపదగనివారు; బాహ్లిక సోమదత్తులు; ఆ స్థాణునకున్-ఐనన్=ఆ పరమశివునకు కూడ; ఓడరు=జంకరు; వారిన్=వారిని; జయింపఁగన్=జయించడానికి; ఏరికిన్=ఎవరికయినా; వశంబె!=శక్యమా?

భా: *ద్రోణుడూ, భీష్ముడూ, కృపుడూ, అశ్వత్థామా, కర్ణ శల్యులూ దుర్యోధనుని కోసం ప్రాణాలయినా విడవటానికి సిద్ధంగా ఉన్నారు. దుశ్శాసనాదులు మహాపరాక్రమవంతులు; కొడుకులు జయింపశక్యం కాని వారు. మిగిలిన బాహ్లికుడు సోమదత్తుడు మొదలయినవారు సాక్షాత్తు శివునికి కూడా ఓడిపోరు. వారిని జయించడం ఎవరితరం? ఎవరికీ శక్యం కాదు.*

వి: 1. ద్రోణాదులు తమప్రాణాలు సుయోధనుని అధీనంలో ఉన్నాయి అని అంటారు. ఈ సంజయుని మాటలో కొంత సూచన కూడ లేకపోలేదు. వారంతా యుద్ధంలో దుర్యోధనుని కోసం **ప్రాణాలు** ధారపోస్తారని.

2. **బాహ్లికుడు-సోమదత్తుడు:** శంతనుని తమ్ముడు బాహ్లికుడు. బాహ్లికుని కొడుకు సోమదత్తుడు. సోమదత్తుని కొడుకు భూరిశ్రవుడు. వీరు ముగ్గురూ భారతయుద్ధంలో కౌరవుల పక్షాన యుద్ధం చేశారు.

ఆ: **అధిప! యిట్టి మీకు నన్యోన్యకలహంబు**
నాకుఁజూడ మే లనంగరాదు
రెండు పక్షములకుఁ బ్రియము హితంబును
నాత్మఁ గోరువారి నడిగి చూడు. 300.

అ: అధిప!=రాజా; ఇట్టిమీకు= ఇంతబలంకల మీకు; అన్యోన్యకల హంబు= పరస్పర విరోధం-యుద్ధం; నాకున్ చూడన్= నా అభిప్రాయంలో; మేలు అనంగ రాదు = మంచిద నిపించదు; రెండు పక్షములకున్ ప్రియము హితంబును; ఆత్మన్=మనసులో; కోరువారిని; అడిగిచూడు.

భా: ధర్మరాజా! ఇంత బలవంతులయిన మీకు పరస్పర యుద్ధం మంచిదిగా నాకు తోచడం లేదు. మీ ఇరుపక్షాలవారికీ ప్రియమునూ హితమునూ కోరేవారిని అడిగి చూడు. నీకే తెలుస్తుంది.

వి: రెండు పక్షాలకూ హితం కోరేవారంటే ఇక్కడ కృష్ణుడు మొ॥వారు. అక్కడ భీష్మద్రోణాదులు అనుకోవాలి.

వ: అని పలికి సూతనందనుండు గొలువు గలయం గనుంగొని. 301.

అ: సూతనందనుండు=సూతుని కుమారుడు-సంజయుడు.

భా: అని చెప్పి సంజయుడు కొలువంతా కలయజూచి ఇలా అంటున్నాడు.

ఉ: మ్రొక్కెద వాసుదేవునకు; మోడ్చెదఁ జేతులు సవ్యసాచికిం;
దక్కటి మిత్రబాంధవ హిత ప్రియ మంత్రి వయస్యకోటికిన్
స్రుక్కుచు విన్నవించెద; నసూయలు దక్కి యనుజ్ఞ సేయుఁడీ
యిక్కరుణాకరున్ శరణ మే నిదె వేఁడెదఁ గ్రోధశాంతికిన్. 302.

అ: వాసుదేవునకున్=కృష్ణునికి; మ్రొక్కెదన్=నమస్కరిస్తాను; సవ్యసాచికిన్ =అర్జునునకు; చేతులు మోడ్చెదన్=నమస్కరిస్తాను; తక్కటి=మిగిలిన; మిత్ర..........కోటికిన్=మిత్ర=స్నేహితులకు; బాంధవ=బంధువులకు; హిత=హితులకు; ప్రియమంత్రి=ప్రియులయినమంత్రులకు;వయస్య కోటికిన్=సమానుల సముదాయానికి; స్రుక్కుచున్=జంకుతూ; విన్నవించెదన్=విజ్ఞాపనం చేసుకొంటాను?; అసూయలు-తక్కి=అసూయా స్వభావాన్ని విడిచి; అనుజ్ఞ-చేయుఁడీ=ఆజ్ఞాపించండి; ఈ+కరుణా +ఆకరున్=దయానిలయుడయిన ఈ ధర్మరాజును; క్రోధశాంతికిన్=కోపం శాంతించేందుకు; ఏను=నేను; ఇదె=ఇదిగో; శరణము వేడెదన్=శరణు కోరుతున్నాను.

భా: కృష్ణునకు నమస్కరిస్తున్నాను. అలాగే అర్జునునకూ నమస్కారం. మిగిలిన మిత్రులూ, బంధువులూ, హితులూ, మంత్రులూ, వయస్యులూ అందరకూ వినయంతో జంకుతూ విన్నవిస్తున్నాను. మనసులో అసూయవిడిచి ఆజ్ఞాపించండి. ముందుగా ఈ ధర్మరాజును కోపం ఉపశమింపజేయమని శరణు వేడుతున్నాను.

వి: ఇందులో సంజయుని వాక్చాతుర్యమే కాకుండా వినయమూ గోచరిస్తుంది. కృష్ణార్జునులకు నమస్కరించడంలో వారి ప్రాధాన్యం కనపడుతుంది. స్రుక్కుచు విన్నవించెద అనేది వినయాన్ని సూచిస్తుంది. "అసూయలు దక్కి" అనడంలో ఒక విశేషం ఉంది. సామాన్యంగా రాజులకు ఒకరి యందొకరికి అసూయ ఉంటుంది. దానివల్లనే ఒకరిమాట ఒకరికి గిట్టదు. సహజంగా ఉండే ఆ అసూయవిడిచి ఆలోచించి ఆజ్ఞాపించమని వేడుకొన్నాడు.

అంతేకాదు. "ముందరి కాళ్లకు బంధం" వలె ఒకమాట అన్నాడు. ధర్మరాజును కోపం ఉపసంహరించుకోమని. అనగా ధర్మరాజు మనస్సు అప్పటికే కోపంతో నిండిపోయిందని స్థిరపరుస్తున్నాడు. అది అతని వాక్చాతుర్యం. అయితే ధర్మరాజు ఇంకా నాలుగు ఆకులు ఎక్కువ చదివాడు.

వ: అనుచుం బ్రణామ పూర్వకంబుగాఁ బాండవాగ్రజువదనంబునం జూడ్కి నిలిపి, "దేవా! యుపశమించుటలెస్స, యిమ్మెయికిం గురుపితామహుండును సంతసిల్లు నాతని కనుమతం బయిన తెఱంగు సర్వలోక సమ్మతం బగు" నన విని ధర్మనందనుం డిట్లనియె. 303.

అ: ప్రణామ పూర్వకంబుగాన్=నమస్కారపూర్వకంగా; (ముందుగా నమస్కరించి) పాండవాగ్రజు వదనంబునన్= ధర్మరాజు ముఖంలో; లెస్స=మంచిది; ఈ+మెయికిన్=ఈ పద్ధతికి; కురు పితామహుండును=భీష్ముండునూ; అనుమతము=ఇష్టము.

భా: సంజయుడు ఇలా అంటూ ముందుగా ధర్మరాజుకు నమస్కరించి అతని ముఖంలో చూపునిలిపి ధర్మరాజా! ఉపశమించడం మంచిది. నీవు శాంతిస్తే భీష్ముడు సంతోషిస్తాడు. అతని కిష్టమయిన పద్ధతి లోకానికంతకూ సమ్మత మవుతుంది. అనగానే ఆ మాటలు విని ధర్మరాజు ఇలా అన్నాడు.

వి: భీష్ముడంటే ధర్మరాజుకు చాలా గౌరవ భావం ఉంది. ఆవిషయం గ్రహించాడు. సంజయుడు. అందుకు ఈ మాట అన్నాడు. 'నీవు ఉపశమిస్తే భీష్ముడు సంతోషిస్తాడు' అని.

ఏతద్రాజ్ఞో భీష్మపురోగమస్య
మతం యద్వః శాంతి రిహోత్తమాస్యాత్

అన్న వ్యాసుని వాణికి "ఆతని కనుమతంబయిన తెఱంగు సర్వలోక సమ్మతంబగు' అని తిక్కన వ్యాఖ్యానించి మెఱుగు పెట్టాడు.

ఉ: నెయ్యము దప్ప నొండొకటి నీ చెవి సోఁకెనె నాదుపల్కులం
దియ్యెడ సంజయా! యనికి నెమ్మెయి నల్కెదు నీవు? మాకుఁ దాఁ
గయ్యము దక్కిమన్కి తగు కార్యము గాదొకొ! పోరితంబు లే
కయ్యెడు నర్థ సిద్ధి; వెడఁగైనను నొల్లక యొండు సేయునే! 304.

అ: సంజయా!; ఈ+ఎడన్=ఇప్పుడు- ఇక్కడ- ఈ సమయంలో; నాదు పల్కులందు=నామాటల్లో; నెయ్యము దప్పన్=స్నేహమే తప్ప; ఒండు-ఒకటి=మరొకటి; నీచెవి సోకెనె?=నీకు వినపడిందా?; అనికిన్=యుద్ధానికి; ఏ+మెయన్= ఏ విధంగా ఎందుకు- అల్కెదు నీవు=నీవు భయపడతావు? కయ్యము దక్కి మన్కి=యుద్ధం విడిచి జీవించడం; మాకున్; తగు కార్యము కాదొకొ?=తగిన పని కాదా?; పోరితంబు లేక=యుద్ధం కాకుండానే; అర్థ సిద్ధి అయ్యెడున్=ప్రయోజనం సిద్ధిస్తోంది?; వెడఁగు+ఐనను=ఎంత అవివేకి అయినా; ఒల్లక=దాన్ని ఒప్పుకోక; ఒండు-చేయునే?=మరొకటి చేస్తాడా? అనగా యుద్ధానికి సిద్ధపడతాడా?

భా: *సంజయా ఇప్పుడు నామాటల్లో స్నేహమూ పొందూ తప్ప మరొకటి నీకు వినపడిందా? యుద్ధానికి ఎందుకు భయపడతావు నీవు? మాకు మాత్రం యుద్ధంలేకుండా జీవించడం ఉచితమయిన పనికాదా? యుద్ధం లేకుండానే ప్రయోజనం సిద్ధిస్తున్నప్పుడు ఎంత అవివేకి అయినా ఆమార్గమే కోరుకుంటాడు కాని యుద్ధాన్ని కోరుకొంటాడా? కోరుకొనడని భావం.*

వి: "దేవా ఉపశమించుట లెస్స-క్రోధశాంతికి కోరుతున్నాను" అంటూ సంజయుడు ధర్మరాజు మీద 'క్రోధం' అనే నెపం వేస్తున్నాడు. దాన్ని గ్రహించి ధర్మరాజు "నా మాటలో యుద్ధాన్ని గురించి ప్రస్తావనే లేదు కదా నీవెందుకు కలహాన్ని గురించి భయపడుతున్నట్లు మాట్లాడుతున్నావు?" అని నిగ్గదీస్తున్నాడు. ఇద్దరూ ఒకరిని మించినవారు మరొకరు-మాటలలో ఎవరూ ఎవరికీ దొరకరు.

యుద్ధం లేకుండానే రాజ్యం సిద్ధిస్తున్నప్పుడు మాకు యుద్ధ ప్రసక్తి ఎందుకు? అనడంలో ధర్మరాజు వాక్చాతుర్యం తెలుస్తుంది. వాళ్లు రాజ్యం ఇస్తారని అనకుండానే ధర్మరాజు ఈ మాటలంటున్నాడు. దీన్నే ఈరోజుల్లో చాలా 'లౌక్యంగా' మాట్లాడటం అంటున్నారు.

క: **జనులకు నెల్లను బథ్యము**
లనఁగా, ధర్మానుగతము లగు ననఁ, బొగడం
జను పనులు సేయు భీమా
ర్జునులే దుష్కర్మమునకు రోయని వారల్. 305.

అ: జనులకున్ఎల్లను=ప్రజలందరికీ;పథ్యములు-అనఁగాన్=హితములనీ; ధర్మ+అనుగతములు అగు - అనన్ = ధర్మాన్ని అనుసరించినవి అనేటట్లు; పొగడన్ చను పనులు+ చేయు= ప్రశంసార్హమయిన పనులు చేసే; భీమార్జునులే?=భీముడూ, అర్జునుడూనా?, దుష్కర్మము నకున్=చెడ్డపనికి; రోయని వారల్=వెనుదీయని వారు?- అసహ్యించుకోనివారు?

భా: *జనులందరికీ హితమయినవీ ధార్మికమయినవీ పనులు చేస్తారని ప్రశస్తికెక్కిన భీమార్జునులా చెడ్డపనికి అసహ్యించుకొననివారు?*

వి: "భీముడు నర్జునుడున్ రణంబునందు ఒట్టిన మంటలు" అని సంజయుడన్న మాటకు ఇది సమాధానం. భీముడు అర్జునుడూ మంచీచెడూ లేకుండా అందరినీ మంటలాగా కాల్చివేస్తారన్న భావానికి సమాధానంగా ఈమాట ధర్మరాజు అన్నాడు.

క: **మది సుఖముగోరి దుఃఖం**
బొదవం గల కార్యములకు నుత్సాహముసే
యుదు రొప్పని తృష్ణంబడి,
చదు రేమియు లేనియట్టి జను లాతురులై. 306.

అ: చదురు-ఏమియులేని యట్టి జనులు=చాతుర్యం ఏమీలేని ప్రజలు; ఒప్పని తృష్ణన్ పడి=దురాశకు లోనయి? ఆతురులై=ఉత్కంఠ కలవారయి; మదిన్=మనస్సులో; సుఖము

కోరి= తమ సుఖాన్ని కోరుకొని; దుఃఖంబు; ఒదవన్‌గల=ఇవ్వగలిగిన; కార్యములకున్=పనులకు; ఉత్సాహము చేయుదురు=ఉత్సాహపడతారు.

భా: *నిపుణులుకాని జనులు దురాశతో ఉత్కంఠితులయి తమ సుఖం కోరుతూ దుఃఖం కలిగించే పనులు చేస్తూఉంటారు.*

వి: కోరికకు అనుకూలంగాకాక ప్రతికూలంగా చేసుకొనేవాడు చతురుడుకాడు. నేర్పరికాడు. ఇదిపైకి సామాన్యార్థంగా చెప్పినట్లు ఉంది. కాని మనసులో దుర్యోధనుడున్నాడు దీనికి ఉదాహరణ ప్రాయంగా ధర్మరాజుకు.

ఆ: యోగ్య తృష్ణ దారు లుచితంపుఁ గొలఁదిమై
నడచినట్టి వారు బెడిదములకు
నంత సొత్తు రెట్లు? సంతాపకారుల
కాక పెనఁకువలు సుఖంబు లగునె? 307.

అ: యోగ్యతృష్ణన్=అర్హమయిన/తగిన కోరికతో/ ఆశతో; ఉచితము+కొలఁదిమైన్=తగిన రీతితో; దారులు=మార్గములు; నడచినట్టి వారు=ప్రవర్తించినవారు; అంతన్=అంతలోనే (అంత స్వల్పకాలంలోనే); బెడిదములకు=క్రూరపు పనులకు; ఎట్లు-చొత్తురు?=ఎట్లా పూనుకొంటారు?; పెనఁకువలు=యుద్ధాలు; సంతాపకారుల-కాక= దుఃఖాన్నే కలిగిస్తాయి కాని; సుఖంబు లగునె?=సుఖాన్ని కలిగిస్తాయా?

భా: *అర్హమయిన ఆశతో (మితమయిన ఆశతో) తగినరీతితో ప్రవర్తించినవారు కఠినమయిన కృత్యాలకు పాల్పడరు. యుద్ధాలు ఎపుడయినా సంతాపాన్నే కలిగిస్తాయి కాని సంతోషాన్ని కలిగిస్తాయా?*

వి: 1.ఆశ అవసరమే మానవునకు. కాని అనర్హమయిన ఆశ ఉండరాదు. అర్హమయిన ఆశతో ధార్మికంగా ప్రవర్తించాలి. అటువంటివారు క్రూరకృత్యాలకు ఎన్నడూ పాల్పడరు. ఇచట యోగ్యతృష్ణ తగిలి అనే పాఠం ఉంది. అది సులభ వ్యాఖ్యార్హంగా ఉంది. సముచితంగా కూడా కనపడుతుంది.

2.ఇది పాండవులను దృష్టిలోపెట్టుకుని

వ: భోగంబులు వలదా యని తలంతు మేని. 308

భా: *రాజకుమారులు భోగాలు అనుభవించవద్దా అని అనుకొంటే......................*

తే: వస్త్ర మాల్యాను లేపనావసరములును
జతుర తూర్యత్రయంబుల సమయములును
నేము వెలిగాఁగ మా తండ్రి కించు నెట్లు
పుత్రులన వట్టి మమ్మేల పోవఁద్రోచు. 309.

అ: వస్త్ర, మాల్య+అనులేపన+అవసరములును=వేషం, దండలు,నగలు, మైపూతలు మొ॥నవి పూసుకొనే సమయాలూ; చతుర తూర్యత్రయంబుల సమయములును =నిపుణమయిన తూర్యత్రయాల సమయాలూ; ఏము వెలి కాగ=మేము లేకుండా; మాతండ్రికిన్ =మాతండ్రి అయిన ధృతరాష్ట్రునికి; ఎట్లు ఇంచున్=ఎలా ఇష్టమవుతుంది? పుత్రులను పట్టి=తనకుమారులనే గ్రహించి; మమ్ము+ఏల పోవన్‌త్రోచున్=మమ్మల్ని ఎందుకు వెళ్లగొడతాడు?

భా: వస్త్రాలు ధరించేటప్పుడు, దండలు ఆభరణాలు మొ॥ ధరించేటప్పుడు; గంధము మొ॥ మైపూతలు పూసుకొనే సమయాల్లోనూ; ,తూర్యత్రయాల సమయాలూ మేము లేకుండా ఆ ధృతరాష్ట్రునికి ఎలా రుచిస్తోంది? ఇష్టమవుతోంది? తన పుత్రులనే పట్టుకొని మమ్మల్ని ఎందుకు వెళ్లగొడతాడు?

వి: 1. **తూర్యత్రయములు**: ఉదయము, మధ్యాహ్నము, సాయంకాలము. ఈమూడు కాలాల్లోనూ వైతాళికులు రాజులయొక్క యువరాజులయొక్క పరాక్రమాలు కీర్తిస్తూ బహుపరాకులు చెపుతారు. అపుడు అందరి పేర్లూ పరాక్రమాలు ఉగ్గడిస్తారు. ఆ సమయాల్లో మా పేర్లు లేకుండా మేము లేకుండా ఉంటే ధృతరాష్ట్రునికి ఎలా నచ్చుతోంది? అని ప్రశ్న.

2. **మా తండ్రి**: ఇది దెప్పుడు మాట. సంజయుడు అప్పుడప్పుడు ధృతరాష్ట్రుని 'మీ తండ్రి' అంటూ ఉంటాడు. దానికిది దెప్పడం.

వ: **అయినను నొకమాట సెప్పెద సమచిత్తుఁడవై వినుమని యిట్లనియె.** 310

భా: అయినా ఒకమాట చెపుతాను సమబుద్ధితో విను ,అని ఇలా అన్నాడు ధర్మరాజు.

క: **తానైన నపుడు వక్రుం**
డై నీతి పథంబు విడిచె నక్కట పతి మ
మ్మైనను జక్కని తెరువునఁ
బూని నడవుఁడనుచు నిపుడు బుద్ధులు సెప్పెన్. 311.

అ: అక్కట!;పతి=ఆ ధృతరాష్ట్రుడు; తాను-ఐనన్=తానయితే; అపుడు=ఆనాడు సభలో; వక్రుండై=వంకరబుద్ధి కలవాడై; నీతి పథంబు విడిచెన్=నీతి మార్గాన్ని విడిచి పెట్టాడు; మమ్ము-ఐనను=మమ్మల్ని అయితే; చక్కని తెరువునన్ పూనినడవుడు అనుచున్=మంచి మార్గంలో ప్రవర్తించండి అంటూ; ఇపుడు; బుద్ధులు-చెప్పెన్=బుద్ధులు చెపుతాడు/ చెప్పాడు.

భా: మహారాజు ధృతరాష్ట్రుడు తానేమో అపుడు కుటిలుడై,కపటియై నీతిమార్గం విడిచిపెట్టాడు. ఇపుడు మమ్మల్ని నీతిమార్గంలో నడవమని బుద్ధులు చెపుతున్నాడు.

క: **ఎదిరిం దమయట్టులకా**
మదిఁ దలఁచినఁ బొసఁగుఁగాక " మాకుం గుడు మిం
డిదె మీరు వ్రక్కఁ గొనుఁ"డని
చదురడిచిన మనసు పొందు చక్కం బడునే? 312.

అ: ఎదిరిన్=ఎదుటి వాని; తమ యట్టులకాన్=తమవలెనే; మదిన్ తలఁచినన్=మనసులో భావిస్తే; పొసఁగున్ కాక=కుదురుతుంది కాని,"మాకున్ కుడుము-ఇండు=మాకు కుడుము (పూర్తిగా) ఇవ్వండి; ఇదె మీరువ్రక్కన్ కొనుడు=ఇదిగో మీరీ ముక్క తీసుకోండి" అని; చదురడిచినన్=పరిహాసం చేస్తే /అతి తెలివిగా మాట్లాడితే; మనసు పొందు=మనస్సులోని స్నేహభావం; చక్కంబడునే=కుదురుతుందా?

భా: *ఎదుటివానిని కూడా తమవలెనే చూస్తే కుదురుతుంది కాని "మాకు కుడుమివ్వండి ,ఈ ముక్క మీరు తీసుకోండి" అంటూ హేళన చేస్తే పొందు కుదురుతుందా?*

వ: **అని చూపి చెప్పి వెండియు.** 313.

భా: *అని ఉదాహరణ పూర్వకంగా ,దృష్టాంతపూర్వకంగా చెప్పి,*

ఉ: **సంపద దక్కియుండఁగ నశక్తులనం జను మమ్ముఁబిల్చి పూ**
జింపఁగ నంత బేలె పతి? సెప్పెడు వారల బుద్ధి నాఁడ మ
న్నింపఁడ! యింక నేల యగు? నీ వడియాసల వచ్చి రిత్తగా
రింపక మాను; మాతని చరిత్రము నీకును మాకు వింతయే. 314.

అ: సంపదతక్కియుండఁగన్=రాజ్యసంపద అంతా పోగొట్టుకుని; అశక్తులు+అనన్+చను=అసమర్థులు అనిపించుకొంటున్న; మమ్మున్; పిల్చి; పూజింపగన్=పూజించి రాజ్యం ఇవ్వడానికి; పతి=ధృతరాష్ట్రుడు; అంతబేల;+ఏ=అంత తెలివి తక్కువ వాడా?; చెప్పెడువారల=హితం చెప్పేవారి యొక్క; బుద్ధి; నాఁడ=ఆనాడే సభలోనే; మన్నింపఁడు + అ=మన్నించలేదు; ఇంకన్=ఇంకా ఇపుడు; ఏల యగు? =ఎలా అవుతుంది?; నీవు; అడియాసలన్=వ్యర్థమయిన ఆయాసలతో; వచ్చి; రిత్తన్=వ్యర్థంగా; కారింపక మానుము = బాధింపక మానుము; ఆతని చరిత్రము; నీకును; మాకున్; వింతయే=కొత్తదా?

భా: *సంపదంతా పోగొట్టుకొని అశక్తులుగా ఉన్న మమ్మల్ని పిల్చి పూజించటానికి (మీ)రాజు అంత తెలివి తక్కువవాడా? ఎంతమంది హితం చెప్పినా ఆనాడే వారి మాట మన్నించలేదు. ఇక ఇప్పుడు చేస్తాడా? నీవు అనవసర ప్రయాసపడి వచ్చి మమ్మల్ని వృథాగా బాధించకు; అతని చరిత్ర నీకూ మాకూ తెలియనిదేమీ కాదు. కొత్తదేమీ కాదు.*

క: **తగు మాట లాంబికేయుం**
డగునని కై కొనునె యెన్నఁడైనను? గొడుకున్

మగఁటిమి గలఁ డనియెడు న
మ్మిగఁ జూచుచు నుండు, విషము మ్రింగినయేనిన్. 315.

అ: ఆంబికేయుండు=అంబికా పుత్రుడయిన ధృతరాష్ట్రుడు; తగుమాటలు=మంచి మాటలు; అగునని కైకొనునె ఎన్నడైనను?=అవునని గ్రహిస్తాడా ఎప్పుడయినా?; కొడుకున్=దుర్యోధనుని; మగఁటిమి-కలఁడు అనియెడు=పరాక్రమం కలవాడు అనే; నమ్మిగన్=నమ్మకంతో; చూచుచున్ ఉండున్; (అతడు) విషము మ్రింగినయేనిన్= అతడు విషము మ్రింగి చావటానికి సిద్ధంగా ఉన్నాసరే!

భా: ఉచితములయిన పలుకులను ఆ ధృతరాష్ట్రుడు ఎన్నడూ స్వీకరింపడు. కొడుకయిన దుర్యోధనుడు మహాపరాక్రమవంతుడని నమ్ముతూ ఉంటాడు. అతడు విషము మ్రింగి చావటానికి సిద్ధంగా ఉన్నాసరే ఆ ధృతరాష్ట్రునికి నమ్మకం పోదు.

వి: కలఁడు అంటే కలవాడని అర్థం. ఇందులో ధృతరాష్ట్రుని అనుచితమయిన పుత్రవ్యామోహం సూచింపబడింది.

క: జూదపుసిరి యాసపడం
గాదని విదురుండు సెప్పఁగా నప్పుడు క
ర్ణాదుల పలుకులు విని
పతి యాదరణము సేయకున్న నంతన తీరున్. 316.

అ: జూదపుసిరి=జూదం వల్ల వచ్చే సంపద; ఆసపడన్+కాదని=ఆశపడకూడదని-విదురుండు; చెప్పఁగాన్=చెపితే; (వింటే ఆనాడే సరిపోయేది); కర్ణాదుల పలుకులు విని; పతి= ధృతరాష్ట్రుడు; ఆదరణము చేయకున్నన్=ఆదరింపకపోతే; అంతన తీరున్=అప్పటితోనే సమస్య తీరిపోయేది. కర్ణాదుల మాటలు విని చెడిపోయాడు.

భా: జూదంవల్ల వచ్చే సిరిని ఆశించకూడదని విదురుడు చెప్పాడు. ఆ మాట విని కర్ణాదుల మాటలు ఆదరింపకపోతే అప్పటితోనే తీరిపోయేది. ఆ కర్ణాదుల మాటలువినడం వల్లనే ఇంతవరకూ వచ్చిందని భావం.

క: ధృత రాష్ట్రుం డిట మీఁదను
సుతులును శకునియును సూతసుతుఁడును దను నే
గతి నడపించిరి వారల
మతమ యనుష్ఠించుఁగాక మరలం బడునే? 317.

అ: ధృతరాష్ట్రుండు; ఇటమీదను=ఇకముందు కూడా; సుతులును=దుర్యోధనాది పుత్రులూ; శకునియును; సూతసుతుఁడును=కర్ణుడూ; తనున్=తనను; ఏగతినడపించిరి=ఏ విధంగా నడిపిస్తారో; వారల మతమ=ఆవిధంగా వారి పద్ధతినే; అనుష్ఠించును+కాక=ఆచరిస్తాడు కాని; మరలం బడునే?=మరోదారిత్రొక్కుతాడా?

భా: పూర్వమే కాదు ఇపుడుకూడా ధృతరాష్ట్రుడు తనను కొడుకులూ శకునీ కర్ణుడూ ఎలా నడిపిస్తే అలా నడుస్తాడే కాని వారిని విడవడు, విముఖుడు కాడు.

క: **కార్యము తెఱఁగిట్టిది, నీ**
వార్యచరితమునకుఁ జొచ్చి యాడెదు, నీకా
దుర్యోధను నవినయ మని
వార్యం బని యెఱుఁగరామి వలనో వెడఁగో. 318

అ: కార్యము తెఱఁగు=జరిగే పని తీరు; ఇట్టిది; నీవు; ఆర్యచరితమునకున్+ చొచ్చి= పెద్దమనిషి ప్రవర్తనను గురించి; ఆడెదు=మాట్లాడుతావు; నీకున్; ఆ దుర్యోధను-అవినయము=ఆ దుర్యోధనుని అవినీతి; అనివార్యంబని=నివారింపదగనిదని; ఎఱుగరామి వలనో=తెలియక పోవడం వల్లనా?; (లేక) వెడఁగో=అవివేకమా?

భా: *జరిగే కార్యవిధానం ఇట్లా ఉంటుంది. కాని నీవేమో సజ్జన చరిత్రను గురించి మాట్లాడుతావు. .నీకా దుర్యోధనుని అవినయం నివారించదగనిదని తెలియకపోవడం వల్లనా? లేక నీ అవివేకమా? తెలియటం లేదు.*

క: **చక్రధరు లెక్క గొనఁడు;ప**
రాక్రమ నిధి యర్జునునకు రాధేయ భుజా
విక్రమ మెదురుగ ఁగొని ని
ర్వక్రముఁ జేసి కొనువాఁడు రాజ్యం బెల్లన్. 319.

అ: (ఆ దుర్యోధనుడు) చక్రధరున్=కృష్ణుని; లెక్కగొనఁడు=లెక్కచేయడు; పరాక్రమనిధి=పరాక్రమానికి నిలయం అయిన; అర్జునునకున్; రాధేయ భుజావిక్రమమున్=కర్ణుని భుజ పరాక్రమాన్ని; ఎదురుగన్ కొని=ఎదురు పెట్టుకొని; రాజ్యంబు-ఎల్లన్=రాజ్యాన్ని అంతనూ; నిర్వక్రమున్ చేసికొనువాఁడు= నిరాటంకంగా పరిపాలిస్తాడు.

భా: *ఆ దుర్యోధనుడు కృష్ణునే లెక్కచేయడు. మహాపరాక్రమవంతుడయిన అర్జునునకు కర్ణుని బాహుపరాక్రమాన్ని ముందు పెట్టుకొని రాజ్యం అంతా నిరాటంకంగా పరిపాలిస్తాడు. నిష్కంటకంగా రాజ్యం చేసుకుంటాడు.*

వి: ఇది ఒకవిధమయిన దెప్పి పొడుపు.

వ: **అని పలికి వెడవెడ యలుక వొడమిన మఱియు నిట్లనియె.** 320.

అ: వెడవెడ=కొద్దికొద్దిగా; అలుక=కోపం

భా: *అని చెప్పి కొద్దికొద్దిగా కోపంరాగా ఇంకా ధర్మరాజు ఇలా అంటున్నాడు.*

శా: **చాపాచార్యుఁడు భీష్ముఁడుం గృపుఁడు నశ్వత్థామయుం గర్ణుఁడున్**
భూపశ్రేష్ఠుఁడు దారు మున్నెఱుఁగరే పో రెట్టుఁగయ్యంబు లా

శాపాశంబులు చుట్ట లా వెఱిఁగియుం జావేఁడి మార్కొందు రిం
తేపో తమ్ముఁగపిధ్వజప్రభల యంధీభూతులం జేయవే. 321.

అ: చాప+ఆచార్యుడు=ధనురాచార్యుడయిన ద్రోణుడూ; భీష్ముఁడున్; కృపుఁడున్; అశ్వత్థామయున్; కర్ణుఁడున్; భూపశ్రేష్ఠుఁడు=రాజరాజు దుర్యోధనుడూ; తారు=తాము; పోరు మున్ను ఎఱుగరే=యుద్ధం పూర్వం ఎరుగని వారా?; లావు-ఎఱిఁగియున్=తమబలం శత్రుబలం తెలిసికూడా; కయ్యంబులు; ఎట్లున్=ఏవిధంగానయినా; ఆశాపాశంబులు చుట్టన్=ఆశ అనే పాశాలు చుట్టివేస్తే; చావేఁడి=చావగోరి; మార్కొందురు=ఎదిరిస్తారు; ఇంతే-పో=ఇంతేపోజరిగేది; తమ్మున్=తమను; కపిధ్వజప్రభలు+అ=ఆ అర్జునుని కాంతులే; అంధీభూతులన్-చేయవే?=గ్రుడ్డివారిని చేసివేయవా?

భా: *ద్రోణుడూ, భీష్ముడూ, కృపాచార్యుడూ, అశ్వత్థామా, కర్ణుడూ, దుర్యోధనుడూ, వీరంతా పూర్వం యుద్ధం ఎరుగని వారా? తమబలం శత్రుబలం రెండూ తెలిసినా ఆశాపాశం చుట్టివేస్తుంది. దానితో చావగోరి మమ్ము ఎదిరిస్తారు. ఇంతే జరిగేది. అసలు తమ్ము కపిధ్వజ కాంతులే గుడ్డివారిగా చేసివేస్తాయి.*

వి: శత్రుబలం తెలిసినా అంత కళ్లుమూసుకుపోయి ఎదిరిస్తారా? అంటే 1. ఆశాపాశం 2. కపిధ్వజ ప్రభలు- వీనితో వారికి కళ్లుమూసుకుపోతాయి అని భావం.

క: **మును మమ్ముఁ బొగడి పదపడి**
యని వారల గెలువ నరిది యని పొత్తుగఁ జె
ప్పిన మాటకు నే నొడఁబడ
విను సంజయ పక్షపాత వృత్తి విడువుమీ! 322.

అ: మును=ముందుగా; మమ్మున్ పొగడి; పదపడి=తరువాత; అనిన్=యుద్ధంలో; వారలన్=ఆకౌరవాదులను/భీష్మాదులను; గెలువన్ అరిది=జయించడం కష్టం అని; పొత్తుగన్=స్నేహంతో కలుపుగోలుతనంతో; చెప్పినమాటకున్;నేను; ఒడఁబడన్=అంగీకరింపను; విను; సంజయ! ;పక్షపాత వృత్తి=పక్షపాతంతోకూడిన ప్రవర్తన; విడువుమీ!=విడిచిపెట్టు.

భా: *సంజయా! ముందు (పద్యంలో 297లో) మమ్ము ప్రస్తుతించి ,తరువాత (299లో) వారిని జయించడం కష్టం అంటూ పొత్తుగోరిచెప్పిన మాటకు నేనొప్పుకోను. నీవు పక్షపాతయుతమయిన ప్రవర్తన విడిచిపెట్టాలి.*

స్రగ్ధర **గాండీవజ్యారవం బుత్కటమయి పెలుచం గ్రమ్మినన్,భీముబాహా**
దండం బేపారి శుంభద్గద జడియుచు రౌద్రంబుగాఁదోఁచినన్, వే
దండద్వంద్వంబు మాడ్కిం దఱిమి కవలు మాద్యద్గతిం దాఁకినం; జా
కుండం బోకుండఁ గౌరవ్యులకు వశమె? బిట్టుల్కి మూర్ఛిల్ల కుండన్.323.

అ: గాండీవ జ్యా రవంబు=అర్జునుని గాండీవం యొక్క నారి ధ్వని; ఉత్కటమయి=

అధికమయి; పెలుచన్ క్రమ్మినన్=అంతటా వ్యాపిస్తే; భీము బాహాదండంబు=దండం వంటి భీముని భుజం; ఏపారి=పొంగి; శుంభత్-గద=ఉజ్జ్వలమయిన గద; జడియుచున్=త్రిప్పుతూ; రౌద్రంబుగాన్-తోచినన్=భయంకరంగా కనిపిస్తే; కవలు=నకుల సహదేవులు; వేదండద్వంద్వంబు మాడ్కిన్=ఏనుగుల జంటవలె; తఱిమి=వెన్నంటి ; మాద్యత్-గతిన్-తాకినన్=మదించినరీతిలో చుట్టుముడితే; కౌరవ్యులకున్=ఆ కౌరవులకు; చాకుండన్=చావకుండా ఉండటానికి (వశమా) పోకుండన్=పారిపోకుండా ఉండటానికి (వశమా); బిట్టు-ఉల్కి=మిక్కిలి భయపడి; మూర్ఛిల్లకుండన్=మూర్ఛపోకుండా ఉండటానికి ;వశమె?=శక్యమా.

భా: అర్జునుడు గాండీవంపుచ్చుకొని ఒక్కసారి ధనుష్టంకారం చేస్తే అది ప్రతిధ్వనిస్తూ పెద్దగా వ్యాపిస్తే; భీముడు దండంవంటి తన బాహువుతో గదపుచ్చుకొని భయంకరంగా అందరినీ సంహరిస్తూ కనపడితే; నకుల సహదేవులు జంట ఏనుగులవలె తరుముతూ మీదపడితే ఆ కౌరవులు చావకుండా పోగలరా? పారిపోకుండా ఉండగలరా? మూర్ఛపోకుండా నిలువగలరా?

వి: ఇందులో క్రమాలంకారం కూడా గోచరింపకపోదు.
అర్జునుడు..................క్రమ్మినన్ చాకుండన్ వశమె? అని,
భీముడు....................తోచినన్- పోకుండన్ వశమె? అని,
కవలు.......................తాకినన్=మూర్ఛిల్లకుండన్ వశమె? అని, క్రమాన్వయం ఉంది.

లేదా మూడూ ముగ్గురికీ చెప్పవచ్చు. ఏదయినా పద్యానికి హుందాతనాన్నే యిస్తుంది.
2. ఇది స్రగ్ధరా వృత్తం.

మ,ర,భ,న,య,య,య అనే గణాలు ఉంటాయి. 1-8-15 అక్షరాలు యతి స్థానాలు.

వ: కావున **324.**

భా: అందుచేత.

చ: రణముల వారలన్ గెలువ రా దనుపల్కు లటుండనిమ్ము; స
ద్గుణుఁడవు నీవు వచ్చితి, ప్రకోపశమంబుగఁబల్కి తింక సై
రణ దగఁ జేయువారము పరాభవమొందియు మున్ను వారి దు
ర్గుణములు సైఁచు టీవు నొకకొంత యెఱుంగుదు వింత యేటికిన్.325.

అ: రణములన్=యుద్ధములలో; వారలన్=ఆ కౌరవులను; గెలువరాదు= జయింపరాదు; అను పల్కులు అటు ఉండనిమ్ము= అనే మాటలు అట్లా ప్రక్కన పెట్టు; సద్గుణుఁడవు నీవు=సద్గుణాలు కల నీవు; వచ్చితి=వచ్చావు; ప్రకోపశమంబుగన్=కోపం ఉపశమించేటట్లు; పల్కితి=మాట్లాడావు; ఇంక=ఇకనుండి; సైరణ=సహనాన్ని; తగన్

చేయువారము=తగునట్లు ఆచరిస్తాము; పరాభవము-ఒందియు=అవమానం పొందికూడా; మున్ను=పూర్వం; వారి దుర్గుణములు=కౌరవుల దుర్గుణాలు; సైఁచుట=క్షమించుట; ఈవును=నీవూ; ఒకకొంత ఎఱుంగుదువు=కొంత ఎరుగుదువు; ఇంత ఏటికిన్=ఇన్ని మాటలెందులకు.

భా: *యుద్ధంలో కౌరవ పక్షంలో వారిని గెలవలేము అనేమాట లట్లాఉంచు; ముందు సజ్జనుడ వయిన నీవు వచ్చావు. కోపం ఉపశమించేటట్లు మాట్లాడావు. చాలా సంతోషం. నీవన్నట్లే మేము సహనమే వహిస్తాము. అవమానం పొందికూడా మేము పూర్వం ఆ కౌరవుల దుర్గుణాలు సహించడం నీవూ కొంత ఎఱుగుదువు కదా! ఇన్ని మాటలెందుకు?*

వి: 1. "వశంబె జయింపగ వారినేరికిన్" అంటూ 299వ పద్యంలో సంజయుడన్న మాటలను ధర్మరాజు ఖండిస్తున్నాడు.

ఉ: ఇంకను నట్లకాఁ దలఁపు మేమొకకీడునకుం దొడంగ మా
శంకలు దక్కు మయ్యకు విచారము గల్గినయేని బాంధవం
బంకుర మొత్త మావలన నక్కటికం బొలయంగ మమ్ము నే
వంకకుఁ బోవనీక గరువంబు జగంబు ప్రశంస సేయఁగన్. 326.

అ: ఇంకను=ఇకమీదకూడా;అట్లకాన్తలపుము=అట్లాగే చేస్తానని అనుకో; ఏము=మేము; ఒక కీడునకున్ తొడంగము=ఏకీడుకూ పూనుకోము; ఆ శంకలు తక్కుము =ఆఅనుమానాలు విడిచిపెట్టు; అయ్యకున్= ధృతరాష్ట్రునికి; విచారము-కల్గినయేని=ఆలోచన ఉంటే; బాంధవంబు=చుట్టరికము; అంకురము+ఒత్తన్=మొలకెత్తేటట్లు; మావలనన్=మా పక్షాన; అక్కటికంబు+ఒలయంగన్=దయ కలిగేటట్లు; మమ్మున్; ఏవంకకున్=ఏవక్రమార్గానికీ; పోవనీక=పోనీయకుండా; గరువంబు=ప్రేమ/వాత్సల్యము; జగంబు ప్రశంస-చేయఁగన్= లోకమంతా; ప్రస్తుతించేటట్లు................

భా: *పూర్వమేకాదు. ఇపుడూ మేము అంతే అనుకో- మేము ఏ కీడుకూ పూనుకోము. నీకా అనుమానమే వద్దు. ఆ ధృతరాష్ట్రునికి ఆలోచనే ఉంటే మామీద చుట్టరికం మొలకెత్తేటట్లు దయచూపిస్తూ మమ్ము ఏవంకకూ పోనీయకుండా లోకమంతా తమ ప్రేమను ప్రశం సించేటట్లు............*

వి: బాంధవం ఇదివరకు చచ్చిపోయింది. ఇపుడది మళ్ళీమొలకెత్తాలి అని ధర్మరాజు సూచన. లేకపోతే మేమేదయినా క్రూరకృత్యం చేయవలసివస్తుందని కూడా సూచనలేకపోలేదు.

క: రండని పిలువఁ బనిచి పా
లిండని కొడుకులకుఁ జెప్పి యింద్రప్రస్థం
బొండెను వేఱొక పట్టణ
మొండెను మాకిచ్చియనుచుటుచితమ కాదే! 327.

అ: రండు+అని=రమ్మని; పిలువన్ పనిచి=పిలిపించి; పాలు-ఇండు అని=రాజ్య భాగం ఇమ్మని; కొడుకులకున్ చెప్పి; ఇంద్రప్రస్థంబు ఒండెను=ఇంద్రప్రస్థపురమయినా; వేఱొక పట్టణము; ఒండెను=అయినా; మాకిచ్చి; అనుచుట=పంపించడం; ఉచితమ కాదే!=తగినదికాదా?

భా: *రమ్మని మమ్మల్ని హస్తినకు పిలిపించి, రాజ్యభాగం ఇమ్మని కొడుకులకు చెప్పి (ధృతరాష్ట్రుడు) ఇంద్రప్రస్థపురం కాని మరేదయినా పట్టణంకాని మాకిచ్చి పంపడం సముచితం కాదూ!*

వి: ద్రౌపదీ వివాహం అయ్యాక ధృతరాష్ట్రుడు చేసిన పని ఇదే. రాజ్యభాగం పేరు చెప్పి మమ్మల్ని హస్తినాపురం నుండి వెడలగొట్టాడు కదా! పోనీ ఇప్పుడయినా అది చేసినా మంచిదే. ఇదివరలో ఖాండవప్రస్థం అనే అడవి ఇచ్చారు. పోనీ ఇపుడు మరో అడవి...... అని ధర్మరాజు సూచన.

ఉ: **నావిని సంజయుండు నరనాథునకిట్లను; నెట్టి తప్పులుం**
బోవఁగఁ ద్రోచి తాలిమియ పూనుదు, గావున నిన్నిమాట లి
ట్లీవు వినంగ నాడియును నేఁదనివోవక విన్నవించెదన్;
నీ విభవం బహింసయు ననింద్య చరిత్రమకాక యన్యమే. **328.**

అ: నా విని=ఆమాటలనగా విని; సంజయుండు; నరనాథునకున్=ధర్మరాజుతో; ఇట్లు అనున్; ఎట్టి తప్పులున్=ఎంతటి తప్పులయినా; పోవఁగన్ త్రోచి=నెట్టివేసి; తాలిమియ=సహనాన్నే; పూనుదు=వహిస్తావు; కావునన్=అందుచేత; ఇన్నిమాటలు; ఇట్లు; ఈవు=నీవు; వినంగన్ ఆడియును=వినేటట్లు చెప్పినా; నేన్=నేను; తనివోవక=సంతృప్తిచెందక; విన్నవించెదన్; నీ విభవంబు=నీ గొప్పదనం అంతా; అహింసయున్; అనింద్యచరిత్రము =నిందింపదగని శీలమూ; కాక; అన్యమే=ఇతరమా?

భా: *ధర్మజుని ఆ మాటలు విని సంజయుడు ఇలా అన్నాడు. "ఎటువంటి తప్పులయినా నీవు పక్కకునెట్టి సహనం వహిస్తావు. కాబట్టే ఇన్ని మాటలు నీకు చెప్పికూడా ఇంకా తృప్తిలేక విన్నవిస్తున్నాను. నిజానికి నీ వైభవం అంతా 1. అహింస 2. నీ నిష్కళంక చరిత్రమూ కాక ఏమున్నాయి?"*

వి: ధర్మరాజుకు పేరు రెండింటివల్ల వచ్చింది. 1. అహింస , 2. అనింద్య చరిత్రము. ఈరెంటినీ ఆధారం చేసుకొని సంజయుడు ధర్మరాజును ప్రశంసిస్తూ నే మాటలతో పడగొట్టాలని చూస్తున్నాడు. క్రియలేని ప్రశంసలు ఇవన్నీ. అందుకే శుష్కప్రియాలు, శూన్యహస్తాలు అని సంజయురాయబారాన్ని తిరుపతి వెంకట కవులు అంటారు.

క: **పాలీక కౌరవులు దు**
శ్శీలతఁ జెడఁ దలఁచిరేనిఁ జెప్పెద రుధిరా
భీలాన్నంబున కంటెను
మేలగు భిక్షాన్నమైన మీనడవడికిన్. **329.**

అ: కౌరవులు; పాలు+ఈక=మీ రాజ్యభాగం మీకు ఇవ్వక; దుశ్శీలతన్=చెడు ప్రవర్తనతో; చెడన్ తలఁచిరి+ఏనిన్=చెడిపోదలిస్తే; చెప్పెదన్=నేనంటున్నాను; మీ నడవడికిన్=మీ పూర్వపు మచ్చలేని ప్రవర్తనకు; రుధిర+అఖిల+అన్నంబునకంటెను=నెత్తురుతో భయంకరమయిన అన్నంకంటె; భిక్షా+అన్నమైనన్=బిచ్చపు కూడయినా; మేలు-అగున్=మంచిదవుతుంది./శ్రేయస్కరం.

భా: *కౌరవులు ఒకవేళ మీ రాజ్యం పాలు మీ కివ్వకుండా దుర్మార్గంతో చెడిపోదలిస్తే "మచ్చలేని మీ ప్రవర్తనకు నెత్తురుకూడు కంటె భిక్షాన్నమయినా మేలు" అని నేను అంటాను*

వి: ఇందులో చెప్పెద అన్న దానిలో సంజయుని నేర్పుఅంతా ఇమిడిఉంది. ఇది తన అభిప్రాయం అయినట్లుగా స్ఫురింపజేస్తున్నాడు. ధృతరాష్ట్రుడు ఇది ఇస్తానని ఏమీ చెప్పలేదు. అందుచేత సంజయుడు ఏదో ఒకటి చెప్పాలి. వాడేమీ ఇవ్వకపోతే అంటే తన అభిప్రాయంగా చెపుతున్నాడు. "ఒక్కటియై మనుట, శాంతి ప్రకారంబునకార్యంబు నడిపి" అనేవి రెండూ దీనివల్ల సాధ్యమవుతాయి.

వ: అది యెట్లంటేని. 330

భా: *అది ఎలా అంటే......*

సీ: రాజసూయ మహాధ్వరం బట్లునడపి స
ద్ద్విజులకు సురలకుఁదృప్తిఁ జేసి
శాంతియు దాంతియు సకలలోకంబులఁ
బొగడొంద బ్రదికిన పుణ్యమూర్తి
విట్టి నీ చరితంబు హింసాకళంకిత
మగుటెంత యొప్పదు నదియుఁ గాక
దుర్ణయ వృత్తి దుర్ద్యూతంబు పుట్టించి
యంతలు సేసిన యట్టివారి

తే: నేల గర్వంబు సెల్లంగ నిచ్చి జగము
చేతఁదిట్టులు వడునట్లు సేసిపోయి
తేల? యడవుల నిమ్మెయి నిడుమ గుడిచి
తేల? తాల్మియ ధనముగా నింత వడితి. 331.

అ: రాజసూయ మహా+అధ్వరంబు=రాజసూయ యాగం; అట్లు నడిపి=అంత వైభవంగా చేసి; సత్-ద్విజులకున్=సద్బ్రాహ్మణులకు; సురలకున్=దేవతలకూ; తృప్తిన్ చేసి=తృప్తికలిగించి; శాంతియున్ దాంతియున్ =శమమూ, దమమూ; సకలలోకంబులన్=అన్ని లోకాల్లోనూ; పొగడొందన్=ప్రసిద్ధివహింపగా; బ్రదికిన పుణ్యమూర్తివి; ఇట్టి నీ చరితంబు; హింసా

కళంకితమగుట=హింసచేత మలినమవటం; ఎంత-ఒప్పదు=ఏమాత్రమూ తగదు; అదియున్ కాక; దుర్ణయవృత్తిన్=దుర్నీతితో కూడిన ప్రవర్తనతో; దుర్ద్యూతంబు పుట్టించి = మాయ జూదం కల్పించి; అంతలుచేసిన అట్టి వారిన్=అంత దుర్మార్గం చేసిన కౌరవులను; గర్వంబు-చెల్లంగన్ ఇచ్చి=గర్వం చెల్లనిచ్చి; జగముచేతన్; తిట్టులు-పడునట్లు-చేసి=నిందలు పొందేటట్లు చేసి; పోయితి ఏల?=ఎందుకు పోయావు?; ఈ+మెయిన్=ఈవిధంగా; అడవులన్ =అడవుల్లో ఏల-ఇడుమ-కుడిచితివి?=ఎందుకు కష్టం అనుభవించావు? ; తాల్మియ=సహనమే; ధనముగా; ఏల ఇంత-పడితి?=ఎందుకు ఇంత కష్టపడ్డావు?

భా: *అంత మహా వైభవంగా రాజసూయయాగం చేసి, దేవతలకూ సద్బ్రాహ్మణులకూ తృప్తికలిగించి; శమదమాల్లో అన్నిలోకాల్లోనూ ప్రశస్తికెక్కి చక్కగా బ్రతికిన పుణ్యమూర్తివి నీవు. ఇటువంటి నీ చరిత్ర ఇపుడు ఈ హింసతో మచ్చపడటం సమంజసంకాదు. అంతేకాదు దుర్నీతితో కపటద్యూతం కల్పించి అంతఅవమానం చేసిన కౌరవులకు వారి గర్వం చెల్లనిచ్చి లోకం చేత తిట్లు పడేటట్లు చేసి ఎందుకు వెళ్లిపోయావు? అడవుల్లో కష్టాలు ఎందుకుపడ్డావు? సహనమే సంపదగా ఇంత కష్టపడింది ,భరించింది ఎందుకు?*

వి: 1. ధర్మజుని రాజసూయం చాలా ప్రసిద్ధి వహించింది. (చూడుడు సభాపర్వం 2ఆ-115,116,117 పద్యాలు)

2. "జగముచేత తిట్టులు వడునట్లు సేసిపోయితి" అనడంలో ధర్మజుడు చాలా తెలివిగా వ్యవహరించాడని సంజయుని అభిప్రాయంగా తోస్తుంది.

క: **తుదిఁ బోయి క్రూరకర్మా**
స్పదమగు తెఱఁగునకుఁ జొచ్చి బంధుల గురులన్
వెదకి వధియించు సౌఖ్యం
బదియేటికి? నార్యనింద్య మస్థిరమరయన్. 332.

అ: తుదిన్‌పోయి=చివరికి వచ్చి; క్రూరకర్మ+అస్పదమగు=కఠినపు పనికి నిలయమయిన ; తెఱఁగునకున్-చొచ్చి=పద్ధతికి పూనుకొని; (యుద్ధానికి పూనుకొని), బంధులన్=చుట్టాలనూ; గురులన్=గురువులనూ; వెదకి; వధియించు=చంపే; సౌఖ్యంబు=సుఖం; అదిఏటికిన్=అది ఎందుకు?; (అది) ఆర్యనింద్యము=సజ్జనులు నిందించేది; అరయన్=విచారిస్తే; అస్థిరము= అశాశ్వతము.

భా: *అంత నిష్కలంకమూ పవిత్రమూ సహనప్రధానమూ అయిన జీవితం గడిపి చివరకు వచ్చి యిపుడు క్రూరకర్మమయిన యుద్ధానికి సిద్ధపడి అందులో బంధువులనూ గురువులనూ చంపి మూటకట్టుకొనే ఆ సౌఖ్యం ఎందుకు? ఆలోచిస్తే అది చాలా నింద్యమయినదీ, అశాశ్వతమయినదీను.*

వి: 1. బంధువులనే పదంతో భీష్మాదులనూ; గురులన్ అనేపదంతో కృపాచార్యద్రోణాచార్యులనూ స్ఫురింపజేస్తున్నాడు.

2. యుద్ధంవల్ల సుఖం కలగదనీ ఒకవేళ సుఖం కలిగినా దాన్ని సజ్జనులు నిందిస్తారనీ, అదికూడా అశాశ్వతమనీ సూచన.

తే: **అల్పులకు మ్రింగఁ జేఁదైన హాలహలము**
భంగిఁ బొంగెడు కోపంబు మ్రింగికొనఁగ
నీలగళు నెన్ని నిన్నెన్నఁ బోలు,నట్టి
నీవు సాలినఁగా కేల నెగడుఁ బేరు? 333

అ: అల్పులకున్=సామాన్యులకు; మ్రింగన్=మ్రింగటానికి; చేదు+ఐన = చేదుగాఉన్న; హాలహలముభంగిన్=విషం వలె; పొంగెడు=పొంగివచ్చే; కోపంబున్; మ్రింగి కొనగన్=దిగమ్రింగటానికి; నీలగళున్-ఎన్ని=శివుని చెప్పి; నిన్నున్; ఎన్నన్ పోలున్=చెప్పదగును; అట్టినీవు; చాలినన్ కాక=ఇష్టపడితేతప్ప; ఏలపేరునెగడున్=ఎలా పేరు వస్తుంది?

భా: *అల్పులకు మింగటానికి చేదైన విషంలాగా పొంగిపొరలే కోపాన్ని దిగమ్రింగుకొనటానికి ముందుగా శివుని చెప్పి తర్వాత నిన్నే చెప్పాలి; అటువంటి సహనశీలి అయిన నీవు ఇష్టపడితే తప్ప-కోపం దిగమ్రింగితే తప్ప-పేరు ఎలా వస్తుంది?*

వి: 1. శివుడు విషం మ్రింగి లోకాలకు మేలు చేకూర్చాడు. అలాగే నీవు కోపం దిగమ్రింగుకొని ప్రజలకు మేలు చేయుమని సంజయుని అభిలాష.

2. ధనవ్యామోహం తీరిన తరువాత సంక్రమించేది కీర్తివ్యామోహం. పేరు కావాలి. దానికి ధర్మరాజులోబడుతాడని సంజయుని ఊహ.

3. చాలు అనే క్రియకు "సహించు" అని అర్థంచెపితే ఇక్కడ బాగుంటుంది. కాని నిఘంటువులలో కానరాదు.

చ: **అనవుడుఁ బాండురాజ తనయాగ్రణి సంజయు మోముఁజూచి యి**
ట్లను; నదియెల్ల నీపలికినట్టిద; ధర్మువులట్లయుండి బో
ధను లరయంగ వచ్చిన నధర్మములై చెడుఁగొన్ని; ధర్మవ
ర్తనములు గాకతోఁచి తుదిఁధర్మములై చనుఁ గొన్ని కర్మముల్. 334

అ: అనవుడున్=అనగానే; పాండురాజ తనయ+అగ్రణి=పాండురాజు కొడుకుల్లో పెద్దవాడయిన ధర్మరాజు; సంజయు మోమున్=సంజయుని ముఖాన్ని; చూచి; ఇట్లు; అనున్; అది ఎల్లన్=అది అంతా; నీపలికిన+అట్టిది+అ=నీవు చెప్పినట్లే; కొన్ని కర్మముల్=కొన్ని పనులు; ధర్మువులు అట్ల ఉండి=ధర్మాలవలెనే కనపడి; బోధనులు=జ్ఞానులు; అరయంగ వచ్చినన్=సమీక్షించితే; అధర్మములై చెడున్; కొన్ని; ధర్మవర్తనములు కాకతోఁచి=అధర్మాలుగా కనపడి; తుదిన్=చివరకు; ధర్మములై చనున్=ధర్మములయి తీరుతవి.

భా: *అపుడు ధర్మజుడు సంజయుని మొగం చూసి ఇలా అన్నాడు. నీ వన్నది నిజమే. కొన్ని పైకి ధర్మాలుగా కనపడి సూక్ష్మంగా పరిశీలిస్తే అధర్మమై చెడిపోతాయి. మరికొన్ని పైకి అధర్మాలుగా కనపడి చివరకు ధర్మాలయి చెల్లుతాయి.*

వ: కావున నన్ను దూఱఁదలంచితేని నా చేయునది ధర్మం బధర్మంబని నిరూపించి మఱిదూఱుము, కోపంబు నివారింపం దగు; నహింసయ యుత్తమధర్మం; బగు నట్లయినను వంశదూషకులును లోకకంటకులునునగు పాపాత్ముల నిర్మూలంబుగాఁ జెఱచుట ధర్మంబని పెద్దలచేత విందు; మదియట్లుండె; సంగ్రామంబు రాజులకు ధర్మంబవుంగాదని నీవచెప్పు; మట్లుంగాక యిది కర్తవ్యంబిది యకర్తవ్యంబని మనల శాసింప వాసుదేవుండు గలండు మనకీవితర్కం బేటికి? నితండు ధర్మాధర్మ విదులకు గురుండు, గార్యాకార్యనిరూపకులకు శిక్షకుం డుచితానుచితజ్ఞులకుఁ బ్రదర్శకుం,డితని పంపునం గాదె యదుభోజాంధక వృష్ణి సృంజయకేకయ ప్రభృతి భూపతిప్రకరంబు ప్రశస్త పథంబునం బ్రవ ర్తిల్లు చున్నయది మాకు నితని బుద్ధియ సమస్త పురుషార్థమ్ములకు మూలంబగుట నితని వచనం బవశ్యంబు నలంఘనీయం బనిన విని జనార్దనుండు సంజయున కిట్లనియె. 335

అ: దూఱన్ తలంచితేని=నిందించాలనుకుంటే; వంశ దూషకులు=వంశాన్ని చెఱిచేవారు; లోకకంటకులు=లోకులను బాధించేవారు; సంగ్రామంబు=యుద్ధం; వితర్కంబు=ఆలోచనము; కర్తవ్యము=చేయదగినది; ఉచిత+అనుచితజ్ఞులు=తగినది తగనిది తెలిసినవారు; పంపు=ఆజ్ఞ; ప్రభృతి=మొదలగు; భూపతి ప్రకరంబు=రాజుల సముదాయం; ప్రశస్త పథంబునన్=మంచి మార్గంలో పురుషార్థములు=ధర్మము, అర్థము, కామము, మోక్షము; అవశ్యంబు=తప్పక; అలంఘనీయంబు=దాటరానిది.

భా: అందుచేత నన్ను నిందించాలనుకుంటే నేను చేసేది ధర్మమో అధర్మమో నిరూపించి మరీ నిందించు, కోపం తగ్గించుకోవలసినదే. అహింస ఉత్తమమైన ధర్మమే అయినా వంశనాశకులనూ, లోకకంటకులనూ నిర్మూలంగా సంహరించడం ధర్మం అని పెద్దలవలన విన్నాను. అది అలా ఉండనియ్యి. యుద్ధం అనేది రాజులకు ధర్మం అవునా కాదా నీవే చెప్పు. అదీగాక కర్తవ్యమేదో కానిదేదో మనలను ఆజ్ఞాపించడానికి కృష్ణుడున్నాడు. మనకెందుకీ ఆలోచన? ఇతడు ధర్మాధర్మాలు తెలిసిన వారికి గురువు; కార్యాకార్యములు నిరూపించి చెప్పేవారికి శిక్షకుడు. ఉచితమేదో అనుచిత మేదో చెప్పగలవారికి చూపిచెప్పగలవాడు. ఈతని ఆజ్ఞచేతనే కదా యదు, భోజ, అంధక,వృష్ణి,సృంజయ, కేకయులు మొ॥ రాజులంతా చక్కని మార్గంలో ప్రవర్తిస్తున్నారు. విశేషించి మాకు ఇతని బుద్ధియే అన్ని పురుషార్థాలను చేకూర్చుతుంది కావున ఇతని మాట దాటనిది. అంటే విని కృష్ణుడు సంజయునితో ఇలా అన్నాడు.

ఉ: పాండుతనూజకోటికి శుభం బెడఁగోరుదు నెప్పు నాంబికే
యుండును బుత్రపౌత్ర మహిమోజ్జ్వలుఁ డక్కట చేటు మేలె యం
చుండుదు నట్లుఁ గాక తెలివొంది యతండిట వీరి ఁదేర్పఁగా
నిండుమనంబుతోఁ బనిచె నిన్నని దీనికిఁ బ్రీతిఁ బొందితిన్. 336.

అ: పాండుతనూజకోటికిన్=పాండవులందరికీ;శుభంబు;ఎడన్=మనసులో; ఎప్డున్=ఎల్లప్పుడూ;కోరుదున్; అంబికేయుండును=అంబికాకుమారుడయిన ధృతరాష్ట్రుడూ; పుత్ర పౌత్ర మహిమా+ఉజ్జ్వలుఁడు=కొడుకులూ మనుమలతో తామరతంపరగా ఉన్నతంగా ఉన్నవాడు; అక్కట!; చేటు=వినాశం; మేలె = మంచిదా?; అంచున్+ఉండుదున్=అంటూ ఉంటాను; అట్లు కాక=అలాచేటు పొందక; తెలివొంది=తెలిసికొని; అతండు=ఆ ధృతరాష్ట్రుడు; వీరిన్=పాండవులను; తేర్పఁగాన్=ప్రసన్నులను చేయడానికి; నిండుమనంబుతోన్= సంపూర్ణమనస్సుతో;నిన్ను పనిచెన్=పంపించాడు; అని; దీనికిన్=ఈ పనికి; ప్రీతిన్ పొందితిన్= సంతుష్టుడ నయ్యాను.

భా: నేను పాండవులకు ఎల్లప్పుడూ శుభమే కోరుతూ ఉంటాను. ఆ ధృతరాష్ట్రుడు కూడా పుత్రులూ ,మనుమలతో ఉజ్జ్వలంగా ఉన్నవాడు. వీరిరువురకూ వినాశం కలగడం మేలుకాదు అనుకొంటూ ఉంటాను. అతడుకూడా తెలివొంది ఈ పాండవులను ప్రసన్నులను చేసుకొనేందుకు సంపూర్ణ మనస్సుతో నిన్ను పంపించాడని ప్రీతి చెందాను.

ఆ: నీవు నుచితవృత్తి నెయ్యంబు ధర్మంబు
వినయ మొప్పఁదెలిపి, వీరుశాంతిఁ
బొందునట్టి భంగి పొసఁగఁ బల్కుటయును
నాకు సమ్మదం బొనర్చె నిపుడు. 337.

అ: నీవున్=నీవుకూడా; ఉచితవృత్తిన్=తగినరీతిలో; నెయ్యంబు=స్నేహం; ధర్మంబు; వినయము+ఒప్పన్=వినయంతో; తెలిపి; వీరు=పాండవులు; శాంతిన్-పొందునట్టి=ప్రశాంతి పొందే; భంగి=రీతి; పొసఁగన్ పల్కుటయును= నేర్పుగా సంగతంగా మాట్లాడటమూ; నాకున్; ఇపుడు; సమ్మదంబు-ఒనర్చె=సంతోషం చేకూర్చింది.

భా: నీవుకూడా తగినట్లు స్నేహమూ, ధర్మమూ వినయంతో చెప్పి; ఈ పాండవులు శాంతించేతీరు సంగత మయ్యేటట్లు మాట్లాడటం నాకిపుడు సంతోషం కలిగించింది.

ఆ: అనఘ యిట్టు లంతయును దలఁపం గడు
నెనసినట్టు లుండెనేని వింటె
పాండవాగ్రజన్మపలుకుల చందంబు
సూడ సంధిలేని చొప్పు దోఁచె. 338

అ: అనఘ!=పుణ్యాత్మా సంజయా!; ఇట్టులు=ఈవిధంగా; అంతయును; తలఁపన్= ఊహించేందుకు; కడున్=మిక్కిలి; ఎనసినట్టులు-ఉండెన్-ఏని= కూడినట్లు/ పొసగినట్లు ఉన్నప్పటికీ వింటె=విన్నావా? పాండవ+అగ్రజన్మ పలుకుల చందంబు=ధర్మరాజు మాటలతీరు; చూడన్=చూస్తే; సంధిలేని చొప్పు=సంధిలేని తీరుపద్ధతి; తోఁచెన్=కనపడింది.

భా: సంజయా! ఇలా అంతా పొందుపొసగినట్లు తోచినా ఆ ధర్మరాజు మాటలతీరు చూస్తే సంధిలేని పద్ధతి గోచరించింది విన్నావా.

క: **అది యట్టిద! సంధానము**
దుదినెమ్మెయిఁ గల్గు? నెట్లు దుర్యోధనుఁ డు
న్మదుఁడు, ధృతరాష్ట్ర భూవిభు
హృదయంబు తెఱంగు గొంత యెఱుఁగుదుము గదా! 339

అ: అది; అట్టిద= అటువంటిదే!; తుదిన్=చివరకు; సంధానము=సంధి; ఏ+మెయిన్ =ఏవిధంగా; కల్గున్=కలుగుతుంది? ఎట్లున్=ఎట్లాఅయినా; దుర్యోధనుడు; ఉన్మదుడు= గర్వంకలవాడు; ధృతరాష్ట్ర భూవిభు=ధృతరాష్ట్ర మహారాజు యొక్క; హృదయంబు తెఱంగు=మనసుతీరు; కొంత; ఎఱుగుదుము కదా!

భా: అది అంతే. చివరకు సంధి ఎలా పొసగుతుంది? ఆ దుర్యోధనుడు చాలా గర్వం కలవాడు. ధృతరాష్ట్రుని మనసు పద్ధతి కూడా మనం కొంత ఎరుగుదుము కదా!

క: **ఆరాజు సేయు నెయ్యము**
గారామును జెప్పె దీవు గడుఁ దీపులుగా
వీరు దమపాలు వడయక
నేరిమి మాటలన తీరనేర్తురె చెపుమా. 340

అ: ఆరాజు+ చేయు= ఆ ధృతరాష్ట్రుడు చూపే; నెయ్యము = స్నేహమూ; గారామును=గారాబమునూ; ఈవు=నీవు; కడుతీపులుగా=ఎంతో మధురంగా; చెప్పెదు =చెపుతున్నావు; వీరు =ఈ పాండవులు; తమపాలు+పడయక=తమరాజ్యభాగం పొందకుండా; నేరిమి మాటలన =నేర్పుకల మాటలతో మాత్రమే; తీరనేర్తురె?=సంతృప్తి పడతారా? చెపుమా!=చెప్పు.

భా: ఆ ధృతరాష్ట్రుడు చేసే స్నేహమూ ,గారాబమూ ,వాత్సల్యమూ నీవు చాలా **తియ్యగా** చెపుతావు. కాని ఈ పాండవులు తమపాలు పొందకుండా కేవలం నేర్పుగా మాట్లాడినంతమాత్రాన సంతృప్తిపడతారా చెప్పు.

వి: శుష్కప్రియాలు శూన్యహస్తాలయితే సంతృప్తిపడతారా? అని తేల్చాడు. సంజయుని రాయబారంలోని గుట్టుని రట్టుచేశాడు కృష్ణుడు

ఉ: **వీరలు పెద్దద్రవ్వ కొకవెంట నొడంబడి తేఱిశాంతులై**
కౌరవకోటిఁ గూడి మనఁగా మదిఁగోరుట పెంపుఁ దాల్మియుం
గారుణికత్వముం దగవుగాదె! జగంబున పాడిఁ దండ్రిపా
లీరని తెంపుసేసి పయినెత్తిన నెత్తిరి గాక ద్రోహమే. 341

అ: వీరలు=ఈ పాండవులు; పెద్దఱవ్వక=ఎక్కువతిరగతోడక;ఒకవెంటన్-ఒడంబడి=ఒకరీతిగా అంగీకరించి; తేజి=ప్రసన్నత పొంది;శాంతులై;కౌరవకోటిన్ కూడిమనఁగాన్=కౌరవుల సముదాయంతో కలిసి జీవించటానికి; మదిన్ కోరుట=మనసులో అభిలషించటం; పెంపున్=వారి గొప్పతనమూ; తాల్మియున్=సహనమూ; కారుణికత్వమున్ = దయాస్వభావమూ; తగవున్ కాదె!=న్యాయమూ కదా!; జగంబునపాడిన్=లోకన్యాయంతో; తండ్రిపాలు=తమ తండ్రిరాజ్యభాగం; ఈరు+అని=ఇవ్వరని; తెంపు-చేసి=సాహసించి; పయినెత్తినన్ ఎత్తిరికాక=దండెత్తితే దండెత్తారు కాక; ద్రోహమే?=అది ద్రోహమవుతుందా?

భా: *వీరు అట్టే వెనకటిసంగతులన్నీ పెల్లగించక ఒకరీతిగా సరిపెట్టుకొని ప్రసన్నులూ, ప్రశాంతులూ అయి కౌరవులతో కలిసి జీవించాలనుకోవటం నిజంగా వారి గొప్పతనమూ సహనమూ ,దయా ,న్యాయమూ కదా! లోక న్యాయంతో వారి తండ్రిపాలు వారికివ్వరని సాహసించి దండెత్తవచ్చునుగాక అది ద్రోహమవుతుందా?*

క: విను మవమానము పడియి
ట్లునికిఁ బడయు పొగడుకంటె; నుజ్జ్వలులై మా
ర్కొనిన నదిలెస్స; యెట్లయి
నను వీరికిఁ బోటుమేలు నాకుంజూడన్. 342.

అ: వినుము=సంజయా! విను; అవమానము పడి; ఇట్లు; ఉనికిన్=ఉండటంతో; పడయు=పొందే; పొగడుకంటెన్=ప్రశంసకంటె; ఉజ్జ్వలులై=ప్రకాశమానులై; మార్కొనినన్=ఎదిరిస్తే; అది లెస్స =అది మంచిది; నాకున్ చూడన్=నా దృష్టితో చూస్తే; ఎట్లు-అయినను= ఏవిధంగా అయినా; వీరికిన్=ఈపాండవులకు; పోటు మేలు=యుద్ధం మంచిది.

భా: *సంజయా! అవమానం పొంది ఇలా పడిఉండి పొందే ప్రస్తుతి కంటె విజృంభించి ఎదిరిస్తే వీరికి మంచిది. పాండవులకు యుద్ధమే మేలనిపిస్తోంది నాకు.*

వి: క్షత్రియధర్మ దృష్ట్యా చెప్పినమాట ఇది. సహనం వల్ల ప్రశంస వస్తుంది కాని రాజ్యం రాదని. ఇది ఒకకోణంలోంచి చూస్తే సరియే అనిపిస్తుంది.

వ: సంగ్రామంబు రాజులకు ధర్మం బవ్వుం గాదని నీవ చెప్పుమని యుధిష్ఠిరుండు నిన్నడిగెఁ గదా! ద్విజాతులకు యజనయాజనాది కర్మకరణ విభాగంబు ధర్మ శాస్త్రాచార్యులు విధించునప్పుడు రాజు లిచ్చువారుగాని వేఁడుకొనువారు గారని చెప్పుట సకలలోక ప్రసిద్ధంబు. సర్వవర్ణాశ్రమ ధర్మపరిపాలనంబు సేయునట్టి రాజులు దార నిజధర్మంబు వదలుదురా? యదియునుంగాక పాడితోడి యార్జనంబునం దమకుఁగలకలిమి యనుభవించుచు సత్పథంబున నడచుచుండఁ దమ్మొరు లన్యాయం బు సేసిన యప్పటికిం గదా యాశస్త్రాస్త్ర ధర్మంబు లింద్రాదులగు పెద్దలు గావించిరి; నీ చెప్పెడి ధర్మంబులు గౌరవులకుం జెప్పవలవదా? వారలు గదా మీఁదెఱుంగక కొఱఁతనుఱుకులై చెడుతెరువునం బోయెడువా రని పలికి మఱియు నిట్లనియె. 343.

అ: సంగ్రామంబు=యుద్ధం; యుధిష్ఠిరుండు=ధర్మరాజు; ద్విజాతులు= రెండు జన్మలు కలవారు. 1.బ్రాహ్మణులు, 2. క్షత్రియులు- వీరికి ఉపయనముండును. అది మరొక జన్మగా భావిస్తారు. తార=తామే; ఆర్జనము=సంపాదన; కలిమి=సంపద; సత్పథంబు= మంచిమార్గము; తమ్ము+ఒరులు=తమను ఇతరులు; మీఁదు-ఎఱుంగక=భవిష్యత్తు తెలియక ముందు జరిగేది ఊహించలేక; చెడుతెరువు=చెడ్డమార్గం; కొఱతనుఱుకులు=కొఱ్ఱుమీదికి దూకేవారు/ ప్రాణంమీదికి తెచ్చు కునేవారు.

భా: యుద్ధం రాజులకు ధర్మ మవుతుందా కాదా అని ధర్మరాజు నిన్ను అడిగాడు కదా! బ్రాహ్మణులకూ క్షత్రియులకూ షట్కర్మలూ నిశ్చయించేటప్పుడు ధర్మశాస్త్రకర్తలు "రాజులు ఇచ్చేవారే కాని పుచ్చుకొనేవారు కార" ని చెప్పటం లోక ప్రసిద్ధం. సర్వవర్ణాలు,ఆశ్రమాలు- వీటి ధర్మాలు రక్షించే రాజులు తమ ధర్మాన్ని వదులుతారా? అదీగాక న్యాయంగా సంపాదించుకొన్న సంపదను అనుభవిస్తూ సన్మార్గంలో నడుస్తూ ఉండగా తమను ఇతరులు అన్యాయం చేస్తే అప్పటికోసం కదా శస్త్రాస్త్ర ధర్మాలు ఇంద్రాదులయిన పెద్దలు నిర్ణయించారు. నీవు చెప్పే ధర్మాలు ఆ కౌరవులకు చెప్పరాదా వారేకదా ముందు జరిగేది తెలియకుండా దుర్మార్గంలో పోయేవారు!" అని యింకా ఇలా అన్నాడు.

వి: 1) యజనము 2) యాజనము 3) అధ్యయనము 4) అధ్యాపనము 5) దానము 6)ప్రతిగ్రహము. ఇవి షట్కర్మలు. ఈ ఆరూ బ్రాహ్మణులుచేయవచ్చును.

1) యజనము=యాగం చేయడం
2) యాజనము=యాగం చేయించడం
3) అధ్యయనము=వేదం చదువుకోవడం
4) అధ్యాపనము=వేదం చెప్పడం
5) దానము=దానం చేయడం
6) ప్రతిగ్రహము=పుచ్చుకోవడం(దానం)

ఇందులో 3 మాత్రమే క్షత్రియులు చేయవచ్చును. అవి 1)యజనము 2) అధ్యయనము 3)దానము. మిగిలిన మూడూ క్షత్రియులు చేయరాదు. దానము చేయవచ్చునే కాని పుచ్చుకోరాదు.

II) వర్ణాశ్రమములు- వర్ణాలు4. బ్రాహ్మణులు,క్షత్రియులు,వైశ్యులు,శూద్రులు.
ఆశ్రమాలు నాలుగు: 1)బ్రహ్మచర్యము, 2) గార్హస్థ్యము 3)వానప్రస్థము 4) సన్యాసము

క: నెట్టన సభలో వేపుర
కట్టెదుర, నరాతితనము గాకెంతయు, వా
రెట్టి తులువలో, ద్రౌపది
నట్టుల పతిచెడిదె? జూదమాడరె యెందున్? 344.

అ: వారు=ఆకౌరవులు;ఎట్టి=ఎంతటి;తులువలో=నీచులో ఎంతయున్ + అరాతితనముగాక=ఎంత శత్రుత్వమో కాకపోతే; నెట్టన=సాహసించి; సభలోన్; వేపురకడు+

ఎదురన్=వేయిమంది సమక్షంలో (ఎదుట); ద్రౌపదిన్; అట్టులు=ఆవిధంగా; పఱిచెడిదె?= అవమానపరచవచ్చా?; జూదమాడరె?ఎందున్=ఎంతమందిజూదమాడరు? ఎక్కడయినా.......

భా: ఆ కౌరవులు ఎంత హీనులో కదా! వారిలో ఎంత శత్రుత్వమో-లేకపోతే వేయిమంది సభలో ద్రౌపదిని అలా అవమానపరుస్తారా? లోకంలో ఎక్కడయినా జూదమాడకుండా ఉంటారా? జూదం ఎంతమంది ఆడటంలేదు? అంతేగాని ఇంత దుర్మార్గానికి ఒడిగడతారా?

వ: అనవుడు సంజయుండు" దేవా! నీ చిత్తంబున నిడి దాని నింత గొనియాడినఁ గర్జం బొడఁగూడునే!" యనిన వాసుదేవుం డిట్లనియె. 345.

అ: అనవుడు=అనగానే; నీ చిత్తంబునన్-ఇడి=నీమనసులో పెట్టుకొని; కొనియాడినన్=చెపితే, కర్జంబు=కార్యం; ఒడఁగూడునే=సిద్ధిస్తుందా?

భా: కృష్ణుడిట్లా అంటే వెంటనే సంజయుడు దేవా! దీనిని ఇంతగా మనసులో పెట్టుకొని మాట్లాడితే కార్యం సిద్ధిస్తుందా? అంటే కృష్ణుడు మళ్లీ ఇలా అంటున్నాడు.

వి: సంజయుడు సమయంలో కల్పించుకొని అన్నాడు. వికటిస్తోందని వెంటనే గ్రహించాడు సంజయుడు. అందుకే అంతగా నీవు మనసులో ఆ విషయం పట్టించుకోరాదని చెపుతున్నాడు.

అయినా కృష్ణుడింకా రెండాకులు ఎక్కువ చదివినవాడు. దాన్నే మరింత నొక్కిచెపుతున్నాడు.

ఉ: అత్తఱి భీష్మముఖ్యులగు నచ్చటి వృద్ధజనంబు లెల్ల నో
రెత్తక యూరకుండిరి, మహీశ్వరుచిత్త మెఱుంగ కున్కిఁ, దా
నొత్తి కుమారులం గినియ నోపఁడ యక్కట! మాన్పఁగన్న నా
చిత్తమ కాదు లోకముల చిత్తములెల్లను సంతసింపవే! 346.

అ: ఆ+తఱి=ఆ సమయంలో; భీష్మముఖ్యులు-అగు=భీష్ముడు మొదలయిన; అచ్చటి వృద్ధజనంబులు ఎల్లన్=అక్కడి పెద్దలంతా; నోరు-ఎత్తక-ఊరకుండిరి; మహీశ్వరు చిత్తము+ఎఱుంగక-ఉన్కి= ఆ ధృతరాష్ట్రుని మనసు తెలియకపోవడంచేత; తాను=ఆ ధృతరాష్ట్రుడు; ఒత్తి=నిర్బంధించి; కుమారులన్;కినియన్-ఓపడు-అ=కోపపడలేకపోయాడే! అక్కట!; మాన్పన్కన్నన్=మాన్పగలిగితే; నా చిత్తము+అ=నా మనస్సే కాదు; లోకముల చిత్తములు+ఎల్లను; సంతసింపవే=సంతోషించవా?

భా: అపుడు భీష్ముడు మొదలయిన పెద్దలంతా ధృతరాష్ట్రుని హృదయం తెలుసుకోలేక నోరుమూసుకు కూర్చున్నారు. ఆ ధృతరాష్ట్రుడు గట్టిగా కొడుకులను కోప్పడలేదే! అలా నివారింపగలిగితే నా మనస్సే కాదు లోకుల మనస్సులన్నీ సంతోషించవూ?

వి. కృష్ణుడు సంతోషిస్తే లోకాలన్నీ సంతోషించినట్లే.

ఉ: తిట్టులఁబోయి యక్కొలువు తేఁకువవారలలోని కింతిఁ దా
నట్టులు దుస్ససేనుఁ డదయాకృతి ముందల పట్టియీడ్వఁగా
నెట్టు సహించె మామ? సతియేడ్పు టెలుంగున కెట్టులోర్చె? నీ
పట్టున సేమ మారయఁగఁ బంచుట కెట్టులు నేర్చెఁ గ్రమ్మరన్. 347.

అ: తిట్టులన్-పోయి=నిందిస్తూ; నిందలకు పాల్పడి; ఆ+కొలువు=ఆ కొలువులోని; తేఁకువ వారలలోనికి=గౌరవాస్పదులయిన వారిలోనికి; ఇంతిన్=ద్రౌపదిని;అదయా + ఆకృతి= దయావిహీనుడయిన; దుస్ససేనుడు; తాను; అట్టులు=అవిధంగా; ముందల+పట్టి+ ఈడ్వఁగాన్= తలముందుభాగపు జుట్టు పట్టుకొని ఈడ్చుకురాగా; మామ=ధృతరాష్ట్రుడు; ఎట్టు సహించె?; సతి=కోడలయిన ద్రౌపది యొక్క; ఏడ్పు+ఎలుంగునకు=శోకస్వరానికి; ఎట్టులు-ఓర్చె?=ఎలా సహించాడు?; క్రమ్మఱన్=మరల; ఈవట్టున=మళ్లీ ఈ సమయంలో; సేమము +ఆరయఁగన్=యోగక్షేమాలు తెలుసుకురావటానికి; పంచుటకున్=నిన్ను పంపటానికి; ఎట్టులు నేర్చె?=ఎట్లా నేర్చాడు?

భా: దయాహీనుడయిన ఆ దుశ్శాసనుడు నిందలకు పాల్పడి గౌరవ హితులున్న ఆ సభలోనికి ద్రౌపదిని జుట్టుపట్టుకొని యీడ్చుకు వస్తే ధృతరాష్ట్రుడు ఎలా సహింపగలిగాడు? అంతమందిలో సతియొక్క శోకస్వరాన్ని ఎలా వినగలిగాడు? మళ్లీ ఇపుడు వీరి క్షేమసమాచారాలు తెలుసుకురమ్మని నిన్ను ఏ మొగం పెట్టుకు పంపాడు?

వి: ఆ ధృతరాష్ట్రుడు ఏపని అయినా చేయగలడు. అతనిది కేవలం మొసలి కన్నీరని కృష్ణుని భావం.

చ: ఇది దగదంచు నడ్డపడు నింతకు నేరక సభ్యులందరున్
మది మఱగొన్న యట్టియెడ మానినికిం దనుఁ దాన కాచికో
లొదవిన దానఁజేసి సభ నొచ్చెము దక్కినఁ బాండునందనుల్
బ్రదికిరిగాక; యయ్యెడరు రాజకుమారుల కోర్చునట్టిదే! 348.

అ: ఇది తగదు అంచు=స్త్రీకి సభలో ఇటువంటి అవమానం తగదని; అడ్డపడు+ ఇంతకు నేరక= అడ్డపడటానికి కూడా చాలక; సభ్యులు-అందరున్; మది మఱగొన్న+అట్టి- ఎడన్=మనసులో దైన్యం పొందిన సమయంలో; మానినికిన్=అభిమానవతి అయిన ద్రౌపదికి; తనున్ తాన కాచికోలు ఒదవినన్=తననుతాను రక్షించుకోవడం తటస్థించితే; దానన్-చేసి=దానివల్ల; సభన్ ఒచ్చెము-తక్కినన్=సభలో అవమానం తప్పితే; పాండునందనుల్=పాండవులు; బ్రదికిరి కాక=బ్రతికిపోయారుకాని; ఆ+ఎడరు=ఆ అవమానం; రాజకుమారులకున్=రాజపుత్రులకు; ఓర్చునట్టిదే!=సహింపదగినదేనా?

భా: ఇది తగనిపని అంటూ సభ్యులు అంతా అడ్డపడటానికి కూడా చాలక దైన్యం పొందిన సమయంలో ద్రౌపది తనను తాను రక్షించుకోవడం చేత సభలో అవమానం తప్పి పాండవులు బ్రతికిపోయారు కాని ఆ అవమానం రాజకుమారులు ఓర్వదగినదేనా?

వ: సంజయా! వినవే యప్పుడు సభాసదులకుఁ గర్ణశూలంబు లగునట్లుగా గర్ణుండు. 349.

అ: కర్ణశూలంబులు=చెవికి శూలాల వంటివి

భా: సంజయా! విన్నావు కదా అపుడు సభలోనివారి చెవులకు శూలాలుగా గ్రుచ్చుకొనేటట్లు కర్ణుడు(ఏమన్నాడో)

క: "లే రిచట మగలు నీకును
వీరలు జూదమున నోడి విడిచిరి నిన్నున్
వారిజలోచన! నీపైఁ
గూరిమి గలమగని వెదకికొను మొరు" ననఁడే? 350

అ: ఇచట; నీకును; మగలు; లేరు; వీరలు జూదమునన్-ఓడి=అపజయం పొంది; నిన్నున్; విడిచిరి; వారిజలోచన!=పద్మాల వంటి కనులు కల ద్రౌపదీ! ;నీ పైన్; కూరిమికల=నీమీద ప్రేమఉన్న; ఒరున్ మగనిన్=మరో భర్తను; వెదకికొనుము; అనఁడే!=అనలేదా?

భా: ("దౌపదీ! ఇక్కడ నీకు భర్తలెవరూ లేరు. వీరు(పాండవులు) జూదంలో ఓడిపోయి నిన్ను విడిచిపెట్టారు. అందుచేత నీ మీద ప్రేమ ఉన్న మరో భర్తను వెదకుకొనుము. "అని అనలేదా?

క: నరునకు నది వాఙ్మయ మగు
శరమై హృదయంబు నాఁటి చలియింపక దు
ర్భర వేదనఁ జేయంగాఁ
జిరకాలము దచ్చికిత్స సేసెనె చెపుమా. 351.

అ: అది = కర్ణుని ఆమాట; నరునకున్ = అర్జునునకు; వాఙ్మయమగుశరమై = మాటల రూపుదాల్చిన బాణమై; హృదయంబు నాటి = మనసులో గ్రుచ్చుకొని; చలియింపక = కదలక; దుర్భర వేదనన్ - చేయంగాన్ = భరింపరాని బాధకలిగిస్తే ; చిరకాలము = చిరకాలంగా, ఎంతో కాలం నుండి; తత్-చికిత్స-చేసెనె? = దానికి తగిన వైద్యం చేశాడా?; చెపుమా; = చెప్పుము.

భా: కర్ణుడన్న ఆ మాటలు అర్జునుని హృదయంలో వాఙ్మయమైన బాణంవలె గ్రుచ్చుకొని దుర్భరమయిన వేదన కలిగిస్తోంది. ఎంతోకాలంగా దానికి తగిన చికిత్స అర్జునుడు చేయనేలేదు.

వి: ఆ బాణం తీసివేసి మందు వేయలేదు అర్జునుడు. అనగా కర్ణుని ఏమీ అనలేదు. ఏమీ చేయలేదు అని భావం.ఇంతకాలంగా ఎంతవేదన అనుభవిస్తున్నాడో ఊహించావా? అని ప్రశ్న.

వ: మరియు దుశ్శాసనుండు "వీర లందఱును గొడ్డువోయిన వారలు

పౌరుషంబు గల మానిసి యిందెవ్వ?" డనియె, నతని చెప్పినట్ల పెద్దగాలం బేని వీరలు గొడ్డువోయిరి గాక వీరి దెస వారికి నేమి ఫలించె? వెండియుఁ దత్సమయంబునఁ బుట్టిన మాట లుగ్గడించునట్టివి గా వీ సంధి కార్యం బత్యంత దుర్ఘటంబు దీని ఘటియింపం జేయుట యశక్యం బని తలంచెద నయినను· 352.

అ: పెద్దకాలంబు=చాలాకాలం; ఉగ్గడించునట్టివిగావు=చెప్పదగినవి కావు; అత్యంత దుర్ఘటంబు=మిక్కిలి శక్యం కానిది; ఘటియించుట=కలుపుట

భా: ఇంకా ఆ దుశ్శాసనుడు "వీరంతా గొడ్డుపోయిన వారు. ఇందులో పౌరుషం కల మనిషి ఎవడు? "అని అడిగాడు. నిజమే అతడన్నట్లు చాలాకాలం వీరు గొడ్డుపోయారు. వీరికి చేసిన అకృత్యాలు వారికి ఏమీ ఫలించలేదు కదా! అదీగాక ఆ సమయంలో పుట్టిన మాటలు సభలో చెప్పదగినవి కావు. ఈ సంధి చేకూర్చడం అశక్యం అని తలుస్తాను. అయినా............

సీ: పాండవేయులఁ దగం బ్రార్థించి, యందుల
కక్కట యేనైన నరుగుదెంచి
కౌరవులకు బుద్ధిగాఁ జెప్పి రాజ్యంబు
పాలు సేసిన, మృత్యుపాశములకుఁ
దప్పరే వారలు? దగవును నేర్పును
నామీఁద నిలుచుట నాకుఁ గీడె?
నన్ను మన్నింతు; రన్యాయంబు సొరని నా
మాటకుఁ దా రొడఁ బాటు లేక
తే: యుండుదురె? కేరడము లాడుచుండిరేనిఁ
గవియు పాండవ బాణాగ్ని గాదు సువ్వె
తమ్ముఁ దమ లోభ మను చిచ్చు దరికొనంగఁ
దెగినవారయి పోదు రింతియ తలంప. 353.

అ: పాండవేయులన్=పాండవులను;తగన్ ప్రార్థించి=తగినట్లు అడిగి; అందులకున్= అక్కడకు/ హస్తినకు; ఏను+ఐనన్=నేనయినా; అరుగుదెంచి=వచ్చి; కౌరవులకున్; బుద్ధిగాన్ చెప్పి=బుద్ధి వచ్చేటట్లు చెప్పి; రాజ్యంబు; పాలు-చేసినన్=భాగం ఇప్పిస్తే; వారలు=ఆ కౌరవులు; మృత్యుపాశములకున్ తప్పరే?=చావు అనే పాశంనుండి తప్పుకోరూ?; తగవును=న్యాయమూ; నేర్పును; నామీఁద నిలుచుట=నామీద ఉండటం; నాకున్; కీడె=తప్పా? ;నన్ను మన్నింతురు=నన్ను గౌరవిస్తారు.; అన్యాయంబు-చొరని=అన్యాయం లేని; నామాటకున్; తారు=వారు; (కౌరవులు) ఒడఁబాటు లేక యుండుదురె?=ఒప్పుకోకుండా ఉంటారా?; కేరడములు-ఆడుచుండిరి-ఏని=వక్రంగా తిరస్కరిస్తే; కవియు=చుట్టుముట్టే; పాండవబాణ-అగ్ని కాదు-చువ్వె=పాండవుల బాణాలనే అగ్నికాదు; తమ లోభము-అనుచిచ్చు=తమ దురాశ అనే

అగ్ని; తమ్ము=తమను; దరికొనంగన్=చుట్టుముట్టగా; తెగినవారయిపోదురు=చస్తారు; ఇంతియ తలంపన్=ఆలోచిస్తే ఇంతే జరిగేది అని తోస్తుంది.

భా: నేనయినా ఆ పాండవులను ప్రార్థించి హస్తినాపురానికి వచ్చి కౌరవులకు బుద్ధివచ్చేటట్లు చెప్పి రాజ్యభాగం ఇప్పిస్తాను. అలాచేస్తే ఆ కౌరవులు మృత్యుపాశాలకు లోనవకుండా తప్పుతారు. న్యాయమూ ,నైపుణ్యమూ నామీద ఉండటం నాకు మాత్రం తప్పా? నన్ను గౌరవిస్తారు అలా చేస్తే. అలా కాక వారొకవేళ అన్యాయం లేని నామాటకు అంగీకరింపక వక్రంగా పరిహసిస్తూ తిరస్కరిస్తే, నిజంగా పాండవ బాణాగ్ని కాదు వారిని చుట్టుముట్టేది............ వారి లోభం అనే అగ్ని చుట్టుముట్టి నశించిపోతారు. అంతే.

వ: **అని పలికి వెండియు నిట్లనియె.** 354.

అ: వెండియున్=మరియు

భా: అని చెప్పి ఇంకా ఇలా అన్నాడు.

ఆ: **రోషమయ మహాతరువు సుయోధనుఁ; డురు**
స్కంధ మందులోనఁ గర్ణుఁ; డలరుఁ
గొమ్మ సౌబలుండు; గుసుమ ఫలములు దు
శ్శాసనుండు; మూలశక్తి తండ్రి. 355.

అ: సుయోధనుడు=దుర్యోధనుడు; రోషమయ మహాతరువు=రోషంతో నిండిన మహావృక్షం; అందులోన కర్ణుడు; ఉరుస్కంధము=పెద్దమాను, చెట్టుబోదె; సౌబలుండు=శకుని; అలరున్-కొమ్మ=పూలతో కొమ్మ; కుసుమ ఫలములు=పూలూ పండ్లూ; దుశ్శాసనుండు; మూలశక్తి తండ్రి=తండ్రి అయిన ధృతరాష్ట్రుడు అసలు శక్తి.

భా: ఆ దుర్యోధనుడు రోషం మూర్తీభవించిన ఒక మహావృక్షం వంటివాడు. అందులో చెట్టుబోదె కర్ణుడు. పూలకొమ్మ శకుని; పూలూ పండ్లూ దుశ్శాసనుడు. అసలు మూలశక్తి ధృతరాష్ట్రుడు

అలం: సావయవ రూపకం

వి: దీనికి మూలం:
సుయోధనో మన్యుమయో మహాద్రుమః
స్కంధః కర్ణః , శకుని స్తస్య శాఖాః
దుశ్శాసనః పుష్పఫలే సమృద్ధే
మూలం రాజా ధృతరాష్ట్రో 2 మనీషీ

ఆ: **ధర్మజుండు ధర్మతరు; వర్జునుఁడు ఘన**
స్కంధ; మనిల సుతుఁడు శాఖ; కవలు
పుష్పఫలము; లేను భూసురులును వేద
ములుఁ దదీయమైన మూలచయము. 356.

భా: ధర్మజుండు; ధర్మతరువు=ధర్మం అనే చెట్టు; అర్జునుఁడు; ఘనస్కంధము = పెద్దబోదె; అనిల సుతుఁడు=వాయుకుమారుడు భీముడు; శాఖ=కొమ్మ; కవలు=నకుల సహదేవులు; పుష్పఫలములు=పూలూపండ్లూ; ఏను=నేనూ; భూసురులును =బ్రాహ్మణులును; వేదములున్; తదీయమైన=దానికి సంబంధించిన; మూల చయము=మూలశక్తి.

వి: ధర్మరాజు ధర్మవృక్షమే. దానికి బోదె అర్జునుడు. భీముడు కొమ్మ; నకుల సహదేవులు పుష్పాలూ ఫలాలూ; మూలశక్తి నేనూ(కృష్ణుడూ) బ్రాహ్మణులూ , వేదాలూను.

వి:

	రోషవృక్షం	ధర్మవృక్షం
	సుయోధనుడు	ధర్మరాజు
స్కంధం	కర్ణుడు	అర్జునుడు
శాఖ	శకుని	భీముడు
పుష్పఫలాలు	దుశ్శాసనుడు	నకుల సహదేవులు
మూలశక్తి	ధృతరాష్ట్రుడు	కృష్ణుడు, బ్రాహ్మణులు, వేదాలు

ఈ పద్యానికి మూలం:

యుధిష్ఠిరో ధర్మమయో మహాద్రుమః
స్కంధోఽర్జునో భీమసేనోఽస్యశాఖాః
మాద్రీ పుత్రౌ పుష్పఫలే సమృద్ధే
మూలం త్వహం బ్రహ్మచ బ్రాహ్మణాశ్చ.

ఇక్కడ బ్రహ్మ శబ్దానికి వేదాలు అర్థం.

క: ఈ రెంటియందు నరసి య
సారం బిది, గాఢసార సహితం బిది. నా
నేర వలయు; నదియును గా
కేరూపంబయ్యేనేని నీ సేమిటికిన్? 357.

అ: ఈ రెంటియందున్; అరసి=విచారించి; అసారంబిది=సారంలేనిది ఇది; గాఢసార సహితంబు-ఇది=మిక్కిలి సారవంతమయినది ఇది; నాన్‌నేరవలయు=అని చెప్పగలగాలి; అదియును గాక; ఏరూపంబు-అయ్యేనేని=ఏది ఏమయినా; ఈను-ఏమిటికిన్=అసూయ ఎందుకు? (అసూయ పడరాదు.)

భా: రోషవృక్షమూ, ధర్మవృక్షమూ ఈ రెండింటిలోనూ అసారమేదో సారవంతమేదో చెప్పగలిగి ఉండాలి. అదీగాక ఏది ఏమయినా అసూయపడరాదు.

వి: కృష్ణుడు కూడా క్రమం తప్పకుండానే చెప్పాడు. రోషమయ మహాతరువు మొదట చెప్పి అది అసారం అన్నాడు. ధర్మతరువును తరువాత చెప్పి అది గాఢసారసహితం అన్నాడు. చివరకు ఏది ఏమయినా అసూయ పనికిరాదని హితబోధ కూడా చేశాడు.

మ: ధృతరాష్ట్రుండును బుత్రులున్ వనము; గుంతీనందనుల్ సింహముల్;
మతి నూహింప నసింహ మైన వనమున్ మర్దింతు రెందున్; వనా
వృత వృత్తంబులు గాని సింహములకున్ వేగంబ చేటొందుఁ; గా
న తగం బొందుట కార్య మీయుభయము న్సంతుష్టిమై నున్కికిన్. 358.

అ: ధృతరాష్ట్రుండును-పుత్రులున్=ధృతరాష్ట్రుడూ, అతని కొడుకులూ; వనము=అరణ్యం; కుంతీనందనుల్=కుంతి కుమారులయిన పాండవులు; సింహముల్; మతిన్-ఊహింపన్=మనసులో ఆలోచిస్తే; అసింహమైన=సింహాలులేని; వనమున్=అడవిని; ఎందున్=ఎక్కడయినా; మర్దింతురు=నరికి వేస్తారు; వన+అవృత వృత్తంబులు కాని=అడవితో ఆవరింపబడని ప్రవర్తనలేని, అడవిలో తిరగని, బయటకు వచ్చిన; సింహములకున్; వేగంబ=త్వరగా; చేటు-ఒందు=కీడు కలుగుతుంది; కాన=అందుచేత; ఈ+ఉభయమున్=ఈరెండూ (వనమూ; సింహాలూ) సంతుష్టిమైన్=సంతోషంతో; ఉన్కికిన్=ఉండటానికి; తగన్ పొందుట=తగునట్లు కలిసి మెలిసి ఉండటం; కార్యము=తగినపని

భా: ధృతరాష్ట్రుడూ ;కొడుకులూ అరణ్యం (వంటివారు) ;పాండవులు సింహాల(వంటివారు) ,సింహాలు లేకపోతే అడవిని నరికి వేస్తారు. అడవిలో తిరగక బయటకు వస్తే సింహాలకూ చేటు కలుగుతుంది. అందుచేత ఈ రెండూ సంతోషంగా ఉండాలంటే కలిసిమెలిసి ఉండటమే తగినపని.

అడవి+సింహాలూ కలిసి ఉంటే పరస్పరము రక్షణ దొరుకుతుంది.

వి: చక్కని పోలిక చెప్పాడు. అలం-రూపకం. ఇందులో పాండవులను సింహాలతోనూ; తామరతంపరగా ఉన్న కౌరవులను అడవిలోని చెట్లతోనూ పోల్చడం సముచితంగా ఉంది.

సంస్కృతంలో ఇక్కడ
వనం రాజా ధృతరాష్ట్రః సపుత్రో వ్యాఘ్రా వనే సంజయ! పాండవేయాః
మా వనం చిన్ధి సవ్యాఘ్రం మా వ్యాఘ్రా నీనశన్ వ నాత్
నిర్వనో వధ్యతే వ్యాఘ్రో నిర్వ్యాఘ్రం ఛిద్యతే వనమ్
తస్మా ద్వ్యాఘ్రో వనం రక్షేత్ వనం వ్యాఘ్రం చ పాలయేత్

అని పాండవులను పెద్దపులులతో పోల్చాడు. తెలుగులో సింహాలుగా మార్చడం మరింత ఉచితంగా ఉంది.

సంస్కృతంలో మరో పోలిక కూడా చెప్పాడు. పాండవులు మహావృక్షాలు గానూ, కౌరవులు లతలుగాను పోల్చాడు.

లతా ధర్మా ధార్త రాష్ట్రాః శాలాః సంజయ! పాండవాః
నలతా వర్ధతే జాతు అనాశ్రిత్య మహాద్రుమమ్.

లతలు మహావృక్షాన్ని ఆశ్రయించుకోకుండా వృద్ధిపొందజాలవు. ఈ పోలికను తెలుగులో తిక్కన వదలి పెట్టినాడు.

క: పరిచారకులై యుండుదు;
రరి వర్గ వ్యతికరమున కగుదురు; వీరిన్
సరిఁదన కొడుకుల మెలపిన
తెరువున మెలగింప వలదె ధృతరాష్ట్రునకున్. 359.

అ: (పాండవులు) పరిచారకులై- ఉండుదురు = పరిచర్యచేస్తూ సేవకులు గా ఉంటారు; అరివర్గ వ్యతికరమునకున్=శత్రుసముదాయానికి చేసే ప్రతీకారానికి; అగుదురు = సమర్థులవుతారు; వీరిన్ = ఈ పాండవులను; సరిన్ = సరిగా; తన కొడుకులన్; మెలపిన తెరువునన్ =నడిపించిన మార్గంలో; మెలగింపన్ = నడిపించడానికి ; ధృతరాష్ట్రునకున్ ; వలదె= తగదా?

భా. ఈ పాండవులు వీరికి సేవకులుగాఉంటారు శత్రువులను ఎదిరించేందుకు మట్టు పెట్టేందుకు పనికివస్తారు; వీరిని ఆ ధృతరాష్ట్రుడు తన కొడుకులను నడిపించినట్లు నడిపిస్తే సరిపోదూ!

తన కొడుకులతో సమానంగా చూస్తే ఇక ముందయినా సరిపోతుందని సూచన.

వి : దీనికి సంస్కృతం

స్థితాః శుశ్రూషితుం పార్థాః స్థితా యోద్ధు మరిందమాః
యత్కృత్యం ధృతరాష్ట్రస్య తత్కరోతు నరాధిపః

ఇదే భావం తెలుగులో మరింత మృదువుగా చెప్పబడింది.

" అరివర్గవ్యతికరమునకగుదురు" అని రెండు అర్థాలూ స్ఫురించేలా తెలుగులో చెప్పారు- సంస్కృతంలో శుశ్రూషచేస్తారు- లేదా యుద్ధంచేస్తారు- ఏదో ఒకటి కోరుకొమ్మన్నట్లు ఉంటే తెలుగులో మరింత మృదువుగా చెప్పాడు. తెలుగులో **'అరివర్గం'** కౌరవులయినా కావచ్చు; లేదా ఇతరులయినా కావచ్చు- శుశ్రూషకు ఒప్పుకొంటే ఇతరులు - ఒప్పుకోకపోతే కౌరవులు అవుతారు

క. ఏ నీ పనికై వచ్చెదఁ
దానొప్పఁ దలంచె నొండెఁ దప్పం దలఁచెన్
దానన నెగడెద మేము
మ్మానవ నాథునకుఁ జెప్పు మా మత మెల్లన్. 360

అ: ఏను = నేను: ఈ పనికై వచ్చెదన్; తాను = ఆధృతరాష్ట్రుడు; ఒప్పన్ తలంచెన్= ఒప్పుకోదలచాడో; ఒండెన్ = లేక; తప్పన్ తలంచెన్ = తప్పదలిచాడో; ఏము = మేము; దానన= ఆ అభిప్రాయంతోనే; నెగడెదము= ప్రవర్తిస్తాము; ఆ + మాన వనాథునకున్ = ఆ ధృతరాష్ట్రునకు; మా మతము + ఎల్లన్= మా అభిప్రాయం అంతా ; చెప్పు = చెప్పుము.

భా: ఈ సంధి కార్యానికి నేనే వస్తాను - ఆ ధృతరాష్ట్రుడు అంగీకరిస్తాడో !

తిరస్కరిస్తాడో! ఆ అభిప్రాయాన్నే ఆచరిస్తాము- మా అభిప్రాయం అంతా ఆ మహారాజుకు చెప్పు-

వి : ధర్మరాజు అడగకుండానే కృష్ణుడు రాయబారానికి వెళ్లేందుకు సిద్ధపడ్డాడు - కారణం తృతీయాశ్వాసంలో 242 పద్యంలో చెప్పాడు-

వ: అనిన విని సంజయుండు ధర్మతనయుం గనుంగొని "యట్లయినను గడులెస్సగదా! దేవా నా వచ్చిన కార్యంబు సఫలం బయ్యెఁ; బనివినియెద" నని వాసుదేవునకు నట్ల విన్నవించి, భీమార్జున నకుల సహదేవ సాత్యకి ద్రుపద విరాటుల నీక్షించి, మీ యందఱచేత ననుజ్ఞాతుండన కదా పోయి వచ్చెద, నాయాడిన మాటలయం దేమియుం దగని యట్టివి లేవుగదా!" యనుటయుఁ; బాండవాగ్రజుం డతని కిట్లనియె. 361.

అ: కడులెస్స = చాలామంచిది; పని వినియెదన్= సెలవుపుచ్చుకొంటాను; ఈక్షించి= చూసి; అనుజ్ఞాతుండనకదా! = అనుమతింపబడిన వాడనేకదా!; తగని యట్టివి = అనుచితములు; పాండవ + అగ్రజుండు = ధర్మరాజు.

భా: కృష్ణుని మాటలు విని సంజయుడు ధర్మరాజును చూసి "అలాఅయితే మరీ మంచిది కదా! నేను వచ్చిన పని నెరవేరినట్లే -" వెళ్లివస్తాను; అని అట్లాగే కృష్ణునకూ చెప్పి; భీముడు, అర్జునుడు నకులుడు, సహదేవుడు, సాత్యకి, ద్రుపదుడు విరాటుడు - మొదలగువారిని చూసి "మీ అందరి చేతను కూడ అనుమతింపబడిన వాడనే కదా వెళ్లివస్తా - నేనుపలికిన పలుకుల్లో అనుచితము లేవీ లేవుకదా! " అన్నాడు. అప్పుడు ధర్మరాజు సంజయునితో ఇలా అన్నాడు.

వి: "మీ అందఱిచేత ననుజ్ఞాతుండనకదా!" ఇది నేర్పుతోడను, ఠీవితోడను కూడిన మాట- సంజయుని వ్యక్తిత్వానికిది సూచకం - రాజసభల్లో ఇటువంటి హుందామాటలు చాలా కనిపిస్తాయి. అవన్నీ తిక్కనకు బాగా అలవాటు-

**ఆ. పోయివత్తుగాక, యీ యున్న యందఱు,
వినఁగ నాడి తీవు విశదభంగి,
నొక్క మాటయైన నుచితంబుగానిది
గలదె! యిట్లనంగ వలయు నెట్లు? 362.**

అ: పోయి వత్తు(వు)కాక = వెళ్లివద్దువుగాని ; ఈ-ఉన్న- అందఱు = ఈ సభలో ఉన్న వారంతా; వినఁగన్ = వినేటట్లు; విశదభంగిన్ = స్పష్టమయిన రీతిలో; ఆడితి - ఈవు = నీవు మాట్లాడావు; ఒక్క మాట యైనన్; ఉచితంబు -కానిదికలదె; = తగనిది ఉందా? -అనుచిత-మయినది ఉందా?; ఇట్లు - అనంగ ఎట్లువలయు? = ఇలా అనవలసిన పనిలేదు - అనగా నీవీ విధంగా అడగవలసిన పనిలేదు.

భా: *వెళ్లి వద్దువుగాని మంచిదే! ఈ సభలో వారంతా వినేటట్లు స్పష్టంగా మాట్లాడావు - అందులో ఒక్క మాటకూడా అనుచిత మయినది లేదు.నీవీ విధంగా అనవలసినపని లేదు.*

క. **ఎదు రున్నరూపు పలుకఁగఁ**
దుదిఁ గటకటఁ బడవు నీవు ; దుర్ణయమును బె
ట్టిదమును బెండును నగు పలు
కొదవదు నీ నాలుకకు, నయోన్నత! యెపుడున్. 363.

అ: నయ + ఉన్నత = నీతి చేత ఉన్నతమయిన వాడా; ఎదురు = ఎదుటివాడు; ఉన్నరూపు - పలుకఁన్ = నిజం చెపితే; తుదిన్ = చివరకు కటకటన్ పడవు = కోపపడవు; నీ నాలుకకున్ ; దుర్ణయమును= దుర్నీతి కలిగినదీ; బెట్టిదమును= కఠినమూ, క్రూరమూ అయినదీ; బెండును = నిస్సారమూ; అగు పలుకు = అయినమాట; ఎప్పుడున్; ఒదవదు = రాదు;

భా: *నీతిచేత ఉన్నతుడ వయిన సంజయా! ఎదుటివాడు సత్యం ఉన్నది ఉన్నట్లు చెపితే కోపపడవు- దుర్నీతియుతమూ, కఠినమూనిస్సారమూ అయిన మాట నీనాలుకకు ఎన్నడూ రాదు- అనగా ధర్మయుక్తమూ, సరళమూ, సారవంతమూ అయిన పలుకులే పలుకుతావు అని భావం.*

క: **నీ వొండె, విదురుఁ డొండెను**
గా వలయుంగాక యిట్టి కార్యంబులకున్
రా వేఱ కలరె? తగువా;
రీ వినయము నేర్పుగలదె యితరుల కెందున్? 364.

అ: ఇట్టి కార్యంబులకున్ = ఇటువంటి నేర్పుకల పనులకు; నీవు - ఒండె = నీ వయినా లేక; విదురుడు + ఒండెను= విదురుడయినా; కావలయున్ కాక = కావాలికాని; తగువారు = తగినవారు; రావేఱు + అ, కలరె? = అక్కడినుండి రావటానికి మీరిద్దరూ కాక ఇతరులున్నారా?; ఇతరులకున్= మిగిలినవారికి ; ఎందున్ = ఎందులోఅయినా; ఈ వినయము, నేర్పు+ కలదె = నీలో ఉన్న వినయమూ, నైపుణ్యమూ ఉన్నాయా?

భా.: *నీవుకాని విదురుడు కాని పనికి వస్తారు ఇటువంటి పనులకు - మీరు తప్ప తగినవారు వచ్చేందుకు అక్కడ ఎవరున్నారు? ఉన్నా వారికి ఇంత వినయమూ ,నేర్పూ ఉన్నాయా? లేవని భావం-*

వి : సంస్కృతమూలంలో ధర్మరాజు మరో మంచిమాట అన్నాడు
త్వమేవ నః ప్రియతమోసి దూత ఇహాగచ్ఛే ద్విదురో వా ద్వితీయః
అభీక్ష్ణదృష్టోసి పురాహి నస్త్వం ధనంజయ స్యాత్మసమో సఖాసి-
-- అర్జునునకు ఆత్మసముడవయిన స్నేహితుడవు కూడా

చ. అరిగిన యప్డు పెద్దలగు నందలి విప్రుల నెల్లఁ గాంచి యా
దరమున వారి సేమ ముచితంబుగ నారసి; వెండి కా న్పుమీ
గురునిఁ బితామహుం గృపునిఁ; గూర్తురు వారలు నాకు; నా నమ
స్కరణముగాఁగ వారి కధిక ప్రియ భక్తి నమస్కరింపుమీ!. 365.

అ: అరిగిన-అప్డు = నీవు హస్తినాపురానికి వెళ్లాక; పెద్దలగు అందలి విప్రులన్ + ఎల్లన్ + కాంచి = పెద్దలయిన బ్రాహ్మణులను దర్శించి; వారిసేమము = వారి యోగక్షేమాలు; ఆదరమునన్ - ఉచితంబుగన్ ఆరసి = తగినట్లు ఆదరంగా పరిశీలించి; వెండి = తరువాత; గురునిన్ = ద్రోణునీ; పితామహున్ = తాత అయిన భీష్మునీ; కృపునిన్; కాన్పుమీ = దర్శించుము; వారలు; నాకున్ కూర్తురు= నాయందుప్రీతికలిగిఉంటారు; వారికిన్; నా నమస్కరణముగాఁగన్= నా నమస్కారంగా; అధిక ప్రియ భక్తిన్ = మిక్కిలి ప్రీతిపూర్వకమయిన భక్తితో; నమస్కరింపుమీ

భా : నీవు హస్తిపురానికి వెళ్లి అక్కడి వృద్ధులయిన విప్రుల యోగక్షేమాలు తగినట్లు ఆదరంతో తెలుసుకొని; తరువాత ద్రోణునీ, భీష్మునీ, కృపాచార్యునీ దర్శించుము. వారు నేనంటే ఇష్టపడతారు - నా మీద ప్రీతికలవారు. వారికి అధికభక్తితో నా నమస్కారంగా నీవు నమస్కరించుము.

వి: ముందుగా సంజయుని “ పెద్దలగు విప్రుల నెల్ల చూసి” అనడంలో ధర్మరాజు యొక్క బ్రాహ్మణ భక్తి స్ఫురిస్తుంది. దీన్నే చేమకూర వెంకట కవి “ దేవబ్రాహ్మణ భక్తి ప్రోవు” అని వర్ణించాడు.

సీ. మా తండ్రిఁ గనియేను బ్రీతి మ్రొక్కుట గాఁగ
దండ ప్రణామంబు దగ నొనర్పు;
దుర్వృత్తిఁ బొరయు నా దుర్యోధనుని సేమ
మడిగితినని చెప్పు; మతని తమ్ముఁ
డగుటకుఁ దగియెడు నా దుస్ససేనుని
కుశల మారయుము; దక్కను గుమార
వర్గంబు నెల్లను, వనితాజనంబుల
నుచితంపుమై సుఖమున్కి యడుగు;
ఆ. విదురు శల్యుఁ గాంచి వినయంబుదోఁపంగ
నాడు; ద్రోణ తనయు నక్కు సేర్చి
కొంటి ననుము; బాహ్లికుని సోమదత్తు భూ
రిశ్రవసునిఁ దెలఁచి ప్రియము నెఱపు. 366.

అ: మా తండ్రిన్ + కని = మా తండ్రి ధృతరాష్ట్రుని చూసి;ఏను=నేను; ప్రీతిన్ మ్రొక్కుట కాగన్ = ప్రీతితో నేను నమస్కరించినట్లుగా; దండప్రణామంబు = దండం వంటి

నమస్కారం (సాగిలబడి నమస్కరించడం); తగన్ ఒనర్పు = తగినట్లుచేయుము; దుర్వృత్తిన్ పొరయు= దుష్ప్రవర్తనపొందే (నడిచే) ఆ దుర్యోధనునిన్; సేమము = క్షేమము; అడిగితిననిచెప్పుము; అతని తమ్ముడు + అగుటకున్ తగియెడు= అతని తమ్ముడనిపించుకోదగిన; ఆదుస్ససేనుని ; కుశలము= క్షేమము; అరయుము = తెలుసుకో; తక్కను కుమారవర్గంబున్-ఎల్లను = మిగిలిన కురుకుమారుల నందరినీ; వనితాజనంబులన్= స్త్రీజనాలను; ఉచితంపుమైన్= తగినరీతిలో; సుఖము+ఉన్కి= క్షేమం; అడుగుము; విదురున్, శల్యున్; కాంచి = చూసి; వినయంబుతోపంగన్= వినయం కనపడేటట్లు; ఆడుము = మాట్లాడుము, ద్రోణతనయున్ = అశ్వత్థామను; అక్కు - చేర్చికొంటిని = కౌగిలించుకొన్నాను;అనుము; బాహ్లికుని, సోమదత్తున్; భూరిశ్రవసునిన్; తెలఁచి = స్తుతించి; నెఱపు ప్రియము =ప్రీతికలిగించుము;

భా: మా తండ్రి ధృతరాష్ట్రునిచూసి నేను నమస్కరించినట్లు సాష్టాంగంగా మ్రొక్కుము. దుర్నీతిపరుడయిన దుర్యోధనుని క్షేమం అడిగామని చెప్పు. అతని తమ్ముడు అవటానికి తగిన లక్షణాలు కల దుస్ససేనుని క్షేమం తెలుసుకో - మిగిలిన కురుకుమారులనూ స్త్రీలనూ క్షేమము అడుగుము. విదురునితో,శల్యునితో వినయంగా మాట్లాడుము. అశ్వత్థామను కౌగలించుకొన్నానని చెప్పు. బాహ్లికుని, సోమదత్తుని .భూరిశ్రవసుని స్తుతించి ప్రియంగా మాట్లాడుము.

వి: శంతనుని తమ్ముడు బాహ్లికుడు - అతని కొడుకు సోమదత్తుడు-సోమదత్తుని కొడుకు భూరిశ్రవసుడు.

సంస్కృతంలో సంజయుడు రాగానే అడిగిన కుశల ప్రశ్నపరంపర ఇది. దీన్ని తిక్కన అక్కడ సంక్షిప్తంచేసి ఇక్కడ వివరించాడు. సందర్భోచితంగా శల్యుని కూడా చేర్చాడు.

వ. మఱియు వంశవంతులు వయోవృద్ధులు నగు భూపతులను, గృతవర్మను గర్ణ , శకుని సైంధవ ప్రభృతులను, దక్కటి రాజలోకంబును, గయ్యంబునకుఁ దోడువచ్చిన సకల దేశాధీశులనుంగని, యెవ్వరి తోడ నెవ్విధంబునం బలుకం దగు బ్రణామ వినయ బాంధవ మైత్రీ వాత్యల్యంబులకు నయ్యై ప్రకారంబుల మద్వచనంబులుగాఁ బలికి యుచితంబు మెయి నుపచరింపుము. 367

అ: వంశవంతులు = వంశముకలవారు ; వయోవృద్ధులు= వయస్సు చేత పెద్దవారు; ప్రభృతులు = మొదలయిన వారు; తక్కటి రాజలోకంబును= మిగిలిన రాజుల సముదాయమును; కయ్యము = యుద్ధము; ప్రణామము= నమస్కారము; బాంధవము = చుట్టరికము; వాత్సల్యము= చిన్నవారిపై చూపుప్రేమ; అయ్యైప్రకారంబులన్ = ఆయారీతులలో; మత్+వచనంబులుగాన్ = నామాటలుగా; ఉచితంబుమెయిన్ = తగిన రీతితో; ఉపచరింపుము = సేవించుము/ గౌరవించుము.

భా: ఇంకా మా వంశంలోని జ్ఞాతులూ వయోవృద్ధులూ అయిన రాజులనూ కృతవర్మనూ, కర్ణుడు, శకుని, సైంధవుడు మొ॥వారిని ,మిగిలిన రాజులనూ, యుద్ధంలో సహాయపడటానికి వచ్చిన దేశాధిపతులనూ కలసి ఎవరితో ఏవిధంగా పలకాలో ఆవిధంగా-

కొందరికి నమస్కరించి , కొందరికిచుట్టరికంతో, స్నేహంతో, వాత్సల్యంతో నా మాటలుగా తగినట్లు సేవించుము - గౌరవించుము.

వి: కృతవర్మ దుర్యోధనుని పక్షంలో పోరాడటానికి వచ్చినవాడు. దుర్యోధనుని స్నేహితుడు-

క. **దాసీదాస జనముల కు**
దాసీనము గాక యుండఁ దడయకయే మి
త్రాసంగ మొంది శత్రుని
రాసం బొనరించి తమ్ము నరసెద ననుమీ. 368

అ : దాసీదాసజనములకున్ = దాసీ జనానికీ- సేవకులకూ; ఉదాసీనము కాకయుండన్ = ఉదాసీనంగాఉండకుండా; తడయకయె = త్వరలోనే;ఏన్=నేను మిత్రాసంగమొంది = మిత్రులను కలిసి; శత్రునిరాసంబు-ఒనరించి = శత్రువులను పారద్రోలి; తమ్మున్ + తమను; అరసెదన్ - అనుమీ = భరిస్తానని/ రక్షిస్తానని చెప్పుము.

భా: *దాసదాసీ జనుల విషయంలోఉదాసీనంగా ఉండను; త్వరలోనే మిత్రులను కలిసి శత్రువులను జయించి తమను రక్షిస్తానని చెప్పుము.*

వి : నిగృహ్య శత్రూన్ సుహృదో 2 నుగృహ్య
వాసోభి రన్నేన చ వో భరిష్యే (ఉద్యోగ - 30 - 4-)

క: **పోయిన మొగమున నచ్చటఁ**
జేయుతెఱంగెల్ల నీకుఁ జెప్పితిఁ ; బిదపన్
మాయయ్య పెద్ద కొలువున
వాయోడక యిట్లనంగ వలయుం జుమ్మీ!. 369

అ: పోయిన మొగమునన్ = వెళ్లిన ముఖంతోనే/ వెడుతూనే; అచ్చటన్; చేయు; తెఱంగు = పద్ధతి; ఎల్లన్ + అంతా; నీకున్ చెప్పితిన్; పిదపన్ = తరువాత; మా - అయ్యపెద్ద కొలువునన్ = మా తండ్రి యైన ధృతరాష్ట్రుని నిండుకొలువులో; వాయి ఓడక = మొగమోటపడక- వెనుకాడక; ఇట్లు ; అనంగ వలయున్ - చుమ్మీ = అనాలిసుమా!

భా: *వెడుతూనే అక్కడ నీవు చేయవలసిన కార్యవిధానం అంతా చెప్పాను నీకు. తర్వాత ఆ ధృతరాష్ట్రుని నిండుకొలువులో మొగ మోటపడక ఇలా చెప్పాలి సుమా!*

చి. **అనఘ! భవద్బలంబునన యాపద యించుకలేక పాండునం**
దనులు నిజాప్తబంధు సహితంబు సుఖస్థితి నున్నవారు; త
జ్జనకుని రాజ్యపీఠమున సమ్మద మొందఁగ నిల్పి శైశవం
బునన ప్రభుత్వమిచ్చి తగఁ బ్రోచితి వారల విశ్రుతంబుగన్. 370.

అ: అనఘ; = పుణ్యాత్ముఁడా! ధృతరాష్ట్రమహారాజా! భవత్-బలంబునన= నీబలం

చేతనే; పాండు నందనులు= పాండురాజుకుమారులయిన పాండవులు; ఆపద - ఇంచుకలేక = కొంచెమయినా ఆపదచెందకుండా; నిజ+ఆప్త - బంధుసహితంబు=తమ ఆప్తులతోను బంధువుల తోను; సుఖస్థితిన్ ఉన్నవారు=సుఖంగా ఉన్నారు; తత్- జనకుని రాజ్యపీఠమునన్-వారి తండ్రి యొక్క రాజ్యసింహాసనంమీద; స మ్మదము-ఒందఁగన్ నిల్పి = సంతోషించేటట్లు నియమించి; శై శవంబునన= చిన్నతంలోనే; ప్రభుత్వమిచ్చి = రాజ్యమిచ్చి ; విశ్రుతంబుగన్ = ప్రసిద్ధికెక్కేటట్లు; తగన్ వారలన్ ప్రోచితివి = తగునట్లు వారిని రక్షించావు.

భా : మహారాజా! మీ బలం (అండ)వల్లనే పాండవులు ఏ ఆపదా లేకుండా ఆప్తులతో బంధువులతో ఇప్పుడు సుఖంగా ఉన్నారు. వారి తండ్రి దైన రాజ్యసింహాసనంమీద వారిని చిన్నతనం లోనే నిలిపి రాజ్యమిచ్చి వారిని పోషించావు - రక్షించావు-.

వి: భవద్బలంబునన అనేది కూడా ఒక దెప్పిపొడుపు-నిజాప్త బంధు సహితంబు అనడంలో అభిమన్యు వివాహం స్ఫురింపజేస్తున్నాడు - కృష్ణుడు మా పక్షాన ఉన్నాడని గుర్తుచేయడం కూడా.

ఉ. ఇప్పు డుపేక్షసేసి కృపయేమియు లేక విహీన వృత్తి వా
రొప్పమిఁ బొందఁ జూచుటిది యొప్పునె? యింతట సంతసింపరా
దిప్పుడు; నంతకంతనట యెక్కుడు గోరినఁ జాలకుండదే
యొప్పదె కూడి మన్కి? మన కొప్పని వారల యుక్కు దక్కఁగన్.371.

అ: ఇప్పుడు; ఉపేక్ష+చేసి = ఉపేక్ష వహించి; విహీనవృత్తిన్ = మిక్కిలి దీనభావంతో; వారు = ఆ పాండవులు; ఒప్పమిన్ - పొందన్ = ఆపదపొందితే; చూచుట- ఇది- ఒప్పునె? = చూస్తూఉండటం తగునా?; ఇప్పుడు; ఇంతటన్ = దీనితోనే; సంతసింపరాదు; (ఎవరయినా) అంతకంతనట=ఒకదాన్ని మించి మరొకటి; ఎక్కుడు కోరినన్ = ఎక్కువకోరుతూఉంటే; చాలకుండదే = (ఎంతయినా) చాలదే!;ఒప్పని వారల = మనమంటే పడని వారియొక్క; ఉక్కు= గర్వం; తక్కఁగన్ = అణగేటట్లు; మనకు = ఉభయులకు ;కూడి మన్కి = కలిసి జీవించటం; ఒప్పదె; = తగదా?

భా: (ఇప్పటిదాకా వారిని రక్షించి) ఇపుడు వారు ఆపదల పాలయితే నిష్కరుణుడవై ఉపేక్షవహించడం తగునా;!ఇంతమాత్రానికే దీనికే ఇపుడు సంతోషించరాదు. ఎవరయినా ఎక్కువెక్కువకావాలంటే ఎంతయినా చాలదు; అదీగాక శత్రువుల గర్వం అణిగి పోయేటట్లు అందరూ కలసి జీవించడం మంచిది కాదూ!

వి: ధృతరాష్ట్రుడు ఉపేక్షవహిస్తూ లోలోపల సంతోషిస్తున్నాడని ధర్మరాజు భావం - మేము ఆపదలపాలయినందుకు ఇప్పుడే సంతోషించకు - ముందున్నది ముసుళ్ల పండుగ - అని ధర్మరాజు భావం.

ఇక్కడ తెలుగులో " అంతకంత నట యెక్కుడు కోరిన చాలకుండదే" అని ఉంది. ఇది ధర్మరాజు సంజయునితో అన్నమాట - ఇది సభలో అనవలసినదికాదు.

దీనికి మూలం సంస్కృతంలో
సర్వమప్యేతదేకస్య నాలం సంజయ! కస్యచిత్ 5-31-7 అని ఉంది.
అనగా ఆశకు అంతం ఎక్కడిది? అని భావం.

మొత్తానికి ధృతరాష్ట్రుడు ఇపుడు ఉపేక్షవహించడమనేది అనుచితమని సంజయుడు ధృతరాష్ట్రునితో చెప్పాలి-

వ. **అని తదవసరంబునం బితామహుతో నిట్లనుము.** 372.

అ : తత్ + అవసరంబునన్ = ఆ సమయంలో
పితామహుతోన్ = తాతయైన భీష్మునితో

భా : *అని అప్పుడే భీష్మునితో ఇలా చెప్పుము*

చ. **అడఁగఁగ నీక శంతనుని యన్వయముం గలిగించి తీవ;యి**
ప్పుడు దగ నీమతంబునన పొం దొడఁగూడఁగఁ జేర్చి, పౌత్రులన్
నడికి నధర్మవృత్తికిని జావునకుం దొలఁగించి మన్చినం,
బుడమి జనంబు రాజులును భూసురులున్ నినుఁబ్రస్తుతింపరే. 373

అ : అడఁగఁగనీక = నశించి పోనీయక; శంతనుని+ అన్వయమున్ = శంతనుని వంశాన్ని; కలిగించితి+ ఈవ = నీవే నిలబెట్టావు -పునరుద్ధరించావు; ఇప్పుడు ; తగన్ - తగు నట్లుగా; నీ మతంబునన = నీ యిష్టప్రకారమే; పొందు + ఒడఁగూడఁగన్ చేర్చి= పొందుకలిగేటట్లు (ఇద్దరినీ) కలిపి; పౌత్రులన్ = మనుమలను; నడికిన్ = నిందకూ; అధర్మవృత్తికిని = అధర్మప్రవర్తనకూ ; చావునకున్ తొలగించి = మరణానికీ తప్పించి; మన్చినన్ = రక్షిస్తే; పుడమిజనంబు = భూప్రజలు; రాజులును; భూసురులన్ = బ్రాహ్మణులూ; నినున్ =నిన్ను; ప్రస్తుతింపరే! = ప్రశంసింపరా?

భా : *శంతనుని వంశం అంతరించి పోకుండా పునరుద్ధరించింది నీవేకదా! ఇప్పుడు నీ యిష్టప్రకారమే ఇద్దరకూ సంధికూర్చి మనుమలను నిందకూ అధర్మ ప్రవర్తనకూ మరణానికీ తప్పించి రక్షిస్తేలోకులూ, రాజులూ, విప్రులూ అంతా నిన్ను ప్రశంసిస్తారు.*

వి: తండ్రి అయిన శంతనునికి రెండో వివాహం జరిపి వంశం పునరుద్ధరించాడు భీష్ముడు. భీష్ముడికి ఏమయినా సంధి కుదర్చాలని తపన. దీన్ని 'నీమతంబునన' అనే పదం లో ధర్మరాజు సూచించాడు.

వ. **అని పలికి వెండియు.** 374

భా: *అని చెప్పి ఇంకా (ఇలా అను)*

క. **ఇంతలు పుట్టినచోటను**
శంతను నందన! యహీన శాంతిపరుండై

కౌంతేయాగ్ర జుఁ డాలము
పొంతం బోనొల్లఁ డనుము బుధు లియ్యకొనన్. 375

అ: శంతను నందన! = శంతనుని కుమారుడవయిన భీష్ముడా!; ఇంతలు పుట్టిన చోటను = ఇన్ని తప్పుపనులు చేసిన వారిపై కూడా; కౌంతేయ+అగ్రజుఁడు=ధర్మరాజు; అహీనశాంతి పరుండై = అధికమయిన శాంతి కలవాడై; బుధులు=పండితులు; ఇయ్యకొనన్= అంగీకరించేటట్లు; ఆలము పొంతన్ = యుద్ధంవైపుకు/ సమీపానికి ; పోన్-ఒల్లడు అనుము = పోవటానికి అంగీకరింపడని చెప్పు.

భా: *భీష్ముడా! ఇన్ని తప్పులు చేసిన కౌరవులమీద కూడా ఎంతో శాంతి ప్రదర్శిస్తూ ధర్మరాజు యుద్ధం దరిదాపులకే పోవనిచ్ఛగింపడు అని చెప్పు- ఆ సభలోని పండితులంతా మెచ్చుకొనేటట్లు-*

సీ. ఆ సమయంబున నచ్చటివారెల్ల
వినునట్లుగా సుయోధనుని తోడ
బాహుబలాఢ్యుల బలవిహీనులక్రియ
వెడలంగ నడచిన వెఱ్ఱితనము,
నత్యంతచిరకాల మడవులఁ గొండల
బాధలఁ బెట్టిన పరుసఁదనము,
సభలోన నట్లు పాంచాలరాజాత్మజఁ
దలపట్టి యీడ్చిన తులువతనము;
తే. ధర్మపుత్రుండు సైరించెఁ; దథ్య మీవు
కురుకుమారుల నని మ్రింగికొనకు; మొరుల
సొమ్మునకు నాసపడఁ దగ; దిమ్ము వారి
పాలు; వారలతోఁ గూడి బ్రదుకు" మనుము. 376

అ: ఆ సమయంబునన్; అచ్చటి వారు- ఎల్లన్; వినునట్లుగా; సుయోధనునితోడ (ఇట్లు అనుము)"బాహుబల+అఢ్యులన్= భుజబలంకలవారిని; బలవిహీనులక్రియన్= బలహీనులవలె; వెడలంగన్ - అడచిన = వెడలగొట్టిన ; వెఱ్ఱితనమున్; అత్యంతచిరకాలము = చాలాకాలం; అడవులన్; కొండలన్; బాధలన్ పెట్టిన; పరుసఁదనమున్ =కఠినత్వమూ; సభలోనన్; అట్లు; పాంచాలరాజ+ఆత్మజన్ = ద్రౌపదిని; తల+పట్టి ఈడ్చిన ; తులువతనమున్ = తుంటరితనాన్నీ; ధర్మపుత్రుండు= ధర్మరాజు; సైరించెన్ = క్షమించాడు; తథ్యము = నిజం; ఈవు = నీవు; కురుకుమారులన్; అనిన్ = యుద్ధంలో; మ్రింగికొనకుము = చంపుకోకు; ఒరుల = పరులయొక్క; సొమ్మునకున్; ఆసపడన్ తగదు; వారి పాలు (వారికి)ఇమ్ము; వారలతోన్; కూడి బ్రదుకుము= కలసి జీవించుము" అనుము = అని చెప్పు.

భా: అప్పుడు ఆ సభలోవారు అందరూ వినేటట్లుగా దుర్యోధనునితో ఇలాచెప్పు "బలాఢ్యులయిన (మమ్ము) బలహీనులవలె వెడలగొట్టిన వెఱ్ఱితనమూ, ఎంతో కాలం అడవులలోనూ కొండలలోనూ బాధలుపెట్టిన కాఠిన్యమూ; సభలో ద్రౌపదిని అలా తలపట్టి యీడ్చుకొచ్చిన తుంటరితనమూ ఈ మూడూ ధర్మరాజు క్షమించాడు. నిజం; నీవు యుద్ధంలో కౌరవులందరినీ చంపుకోకు - ఇతరుల సొమ్ముకు ఆశపడరాదు- వారిపాలు వారికి ఇయ్యి - వారితో కలసి జీవించు" అని చెప్పు-

వి: 1. ఈ మాటల్లో ధర్మజుని చాతుర్యమూ, "ధర్మసూతి మెత్తనిపులి" అనేందుకు తగిన విషయమూ దొరుకుతాయి.

2. ముందు వచ్చే వచనంలో ధర్మరాజు హుందాతనం గోచరిస్తుంది.

వ. ఏము కలహం బొల్లక పొందుగోరుట తనకు మేలు; దనమనంబున దరికొను తృష్ణానలం బార్ప నొరు లడ్డంబు సొరమింజేసి యేన బుద్ధి సెప్పవలసె ;దనయొద్దం గల యోధవీరు లెయ్యెడల లేమి దెల్లం బయినను మాకుఁ జేదోడు ధర్మంబుగల; దదియునుంగాక యఖిలలోక సేవితుండైన కృష్ణుండు పెనుఁబ్రాపు; గావునఁ దమకు మమ్ము గెలువం గొలఁదిగా;దది యట్లుండె; నేను భీమసేనాదులకుం దమకుం బెద్దవాఁడనగుట, వీరును దారును మదీయ ప్రార్థనాభంగంబు సేయక నాదగు శాంతియు దాంతియుఁ జెల్లించి నన్నులజడిఁ బెట్టక పోరితం బుడిగి తమ తమ ధనంబులు గుడిచి సుఖంబుండుట మన పెద్దలకుం దక్కటి బుద్ధిమంతులకును సంతోషంబగుఁ; బెద్ద యీనోపఁడయ్యేనేనిఁ గుశస్థలంబును, వృకస్థలంబును, వాసంతియు, వారణావతంబును జాలుఁ; గాదేని మఱియు నెందేని నొక్కటి యగునట్లుగా దనతోడఁబుట్టువు లేవురకు నిలువ తావు లయి దిచ్చిన సర్వశాంతియగు; నట్లయినను నిందలి యందలి బంధుమిత్రసహాయజనంబులు గలసి నవ్వుచుం దెగడుచు నునికి మనమనంబులకుఁ బ్రియంబుసేయుఁ; గురుపాంచాల యాదవమాత్స్యులు పరస్పరప్రీతి సంపాదకత్వ సంపన్నులై బ్రదుకుట నాకుంగోర్కి; యింతయు నమ్మహాపురుషునకుం దెలియం జెప్పు"మనిన విని " దేవా! నీయానతిచ్చిన మార్గం బంతయు నడపెద, మీ తండ్రి నీకును, దమ్ములకును, వాసుదేవునకును నెట్లు ప్రియం బట్లు సేయువాఁడ కాక" యనుచుం బ్రణామంబు సేసిన సంజయునకు ధనంజయుం డిట్లనియె. 377.

అ: ఏము= మేము; ఒల్లక= ఒప్పుకోక; పొందు = స్నేహము- సంధి: దరికొను = ప్రజ్వరిల్లు- చుట్టుముట్టు; తృష్ణా + అనలము = ఆశ అనే అగ్ని ; ఒరులు = ఇతరులు ; అడ్డంబు + చొరమి = అడ్డుపడక పోవడంచేత ; లేమి = లేకపోవడం ; ఏ + ఎడలన్ = ఏ పక్కనూ ; తెల్లంబు = స్పష్టంబు; చేదోడు = సహాయం; అఖిలలోకసేవితుఁడు = అన్నిలోకాల చేతనూ సేవింపబడేవాడు.పెనుబ్రాపు = పెద్ద అండ; కొలదికాదు = శక్యంకాదు; మదీయ

ప్రార్థనా భంగంబు = నాయొక్క ప్రార్థనను త్రోసిపుచ్చుట ; అలజడిన్ పెట్టక ; వేదన కలిగింపక; పోరితంబు - ఉడిగి = యుద్ధం విడిచి ;కుడిచి=అనుభవించి; తక్కటి=మిగిలిన; పెద్ద = అధికంగా; ఈన్ - ఓపడు - అయ్యేనేని = ఇవ్వలేకపోతే ; ఠావులు = స్థానాలు; తెగడుచున్ - ఉనికి = వేళాకోళం చేస్తూ ఉండటం; పరస్పర, ప్రీతి సంపాదకత్వ, సంపన్నులై = ఒకరికొకరు ప్రియంచేకూర్చాలనే సంపదకలవారై; ప్రణామంబు = నమస్కారం.

భా: మేము యుద్ధం కోరక సంధి కోరడం తనకేమేలు. తన మనసులో ప్రజ్వరిల్లే దురాశ అనే అగ్నిని ఆర్పటానికి ఇతరులెవరూ అడ్డుపడకపోవడంచేత నేనే బుద్ధి చెప్పవలసి వచ్చింది. తన దగ్గరున్న పరాక్రమవంతులు మరెక్కడా లేరు అనేది అందరికీ తెలుసు - అయినా మాకు ధర్మం సహాయంగా ఉంది; అదీగాక కృష్ణుడు మాకు పెద్దదిక్కు; తాము మమ్మల్ని జయింపలేరు - అది అలాఉండనియ్యి - నేను భీముడు మొ॥ పాండవులకూ తమకూ (కౌరవులకూ) పెద్దవాడనవడం చేత వీరూ తామూ నా ప్రార్థనను తిరస్కరింపక నా శమమూ దమమూ చెల్లించి నన్ను బాధపెట్టక యుద్ధంవిడిచి తమ తమ సొమ్ములుఅనుభవిస్తూ సుఖంగా ఉండటం మన పెద్దలకూ మిగిలిన బుద్ధి మంతులకూ సంతోషం కలిగిస్తుంది. పెద్దగా ఇవ్వలేకపోయినా 1 కుశస్థలమూ 2 వృకస్థలమూ 3 వాసంతి 4 వారణావతమూ మరొకటి ఎక్కడయినా సరేచాలు - ఈ విధంగా తన సోదరులకు అయిదుగురికీ నిలువ నీడనిస్తే సర్వమూ శాంతిస్తుంది - అలా అయితే ఉభయ పక్షాల లోని బంధు మిత్రులూ కలిసి నవ్వుకుంటూ పరస్పరం వేళాకోళం చేసుకొంటూ ఉండటం మన మనస్సులకు ప్రీతికరంగా ఉంటుంది. కౌరవులూ, పాంచాలురూ; యాదవులూ; మాత్స్యులూఒకరి కొకరు ప్రియం చేసుకుంటూ జీవించడం నాకు ఇష్టం. ఈ విషయం అంతా ఆ మహాపురుషుడికి (దుర్యోధనుడికి) తెలియజెప్పు"; అంటే విని సంజయుడు "దేవా నీవు ఆజ్ఞాపించిన పద్ధతి అంతా నడిపిస్తా; నీకూ, తమ్ముళ్లకూ, కృష్ణునకూ ఎలా ప్రీతి కలుగుతుందో అలాగే మీ తండ్రి చేస్తాడులే" అంటూ నమస్కరించాడు. ఇంతలో అర్జునుడు సంజయునితో ఇలా అన్నాడు.

వి: 1. తాను మధ్యస్థుడ నన్నట్లు ధర్మరాజు చెప్పడం అతని ఠీవికి తగినట్లుఉంది.

2. **అమ్మహాపురుషునకు** అనేమాట చక్కని జాతీయం. పెద్దవారు గర్వితులయిన చిన్నవారి పట్ల ప్రయోగించే పదం - ఈ నాటికీ అటువంటి పదం వినిపిస్తూనే ఉంటుంది. ఇది వ్యతిరేక లక్షణ అంటారు ఆలంకారికులు.

3. నవ్వుచు తెగడుచు ఉనికి = ఒకరి నొకరు పరిహాసం - వేళాకోళం చేసుకుంటూ ఉండటం - ఇది మన జాతిలోని పరిహాసప్రియత్వాన్ని తెలుపుతుంది - తమ ఠీవికి హుందాకు తగిన వారితో వేళాకోళం చేస్తారు - బంధు మిత్రులు పదిమందికలిసినపుడు వివాహాదులలో ఇటువంటి సంభాషణలు వినిపిస్తాయి. సుఖాస్పదులయిన సరసుల సంభాషణంలో నిత్యమూ గోచరిస్తుంది ఇటువంటి వేళాకోళం - అది మనః ప్రసన్నతకు చిహ్నం కూడా -

4. సంస్కృతంలో చివరికి ధర్మరాజు **సంధికీ, యుద్ధానికీ రెండింటికీ నేను సిద్ధమే** అంటూ చక్కని శ్లోకం చెప్పాడు

అలమేవ శమాయాస్మి తథా యుద్ధాయ సంజయ!
ధర్మార్థయో రలం చాహం మృదవే దారుణాయచ

క. **బాలసఖుండవు నాకును,**
నీలెస్సఁ దనంబు, నేము నీతి విడిచి దు
శ్శీలుర మగుటయు శైశవ
లీల మొదలు గాఁగ మును దెలియదే నీకున్. 378

అ : నాకును; బాలసఖుండవు = బాల్య స్నేహితుడవు; నీలెస్సదనంబున్ = నీమంచితనంతో; ఏము = మేము; నీతి విడిచి; దుశ్శీలురము - అగుటయు = దుష్ప్రవర్తనకల వారము అవడం; శైశవలీల = చిన్నతనపు చేష్ట; మొదలుగాఁగన్; మును = పూర్వం ; నీకున్; తెలియదే?

భా : *నీవునాకు బాల్య స్నేహితుడవు - (నీమంచి తనం వల్ల) మేము నీతివిడిచి దుష్కర్మలు చేశామో లేదో శైశవ లీల దగ్గఱనుండి నీకు తెలియదా?*

వి : శైశవలీల = భీమునకు విషాన్నం పెట్టడం; భీముని త్రాళ్ళతో బంధించి గంగలో త్రోయుట- మొ॥.

మ॥ **బలమత్తాకృతియైన భీముఁడను శుంభత్కుంభి సంరంభమున్**
నిలిపెన్ నాఁ డును నంకుశంబయి; తుదిన్ నేఁడుం దదుద్రేకమున్
మలుగంజేయ నజాతశత్రుని కృపా మౌగ్ధ్యంబు చాలంగ, వా
రల కేలా నయవిక్రమోచిత విచారక్లేశముల్ సంజయా. 379.

అ : బలమత్త + ఆకృతి ఐన = బలం చేత మదించిన ఆకారం కల; భీముడు + అను; శుంభత్- కుంభి సంరంభమున్ = విజృంభించే ఏనుగు యొక్క ఉద్రేకాన్ని; అంకుశంబయి; (ధర్మరాజు) నిలిపెన్ నాఁడును = ఆనాడు సభలో ఆపివేశాడు ; తుదిన్ నేఁ డున్ = చివరికి ఇప్పుడు కూడా; తత్ - ఉద్రేకమున్ = ఆ ఉద్రేకాన్ని; మలుగన్ చేయన్ = మళ్లించడానికి/ అణచివేయడానికి; అజాతశత్రుని = ధర్మరాజు యొక్క; కృపామౌగ్ధ్యంబు = దయాపూర్వక మయిన అమాయకత్వమే; చాలంగన్ = సరిపోతూఉంటే; సంజయా!;నయ విక్రమ + ఉచిత - విచార-క్లేశముల్ = నీతికి యుద్ధానికీ తగిన ఆలోచన అనే కష్టాలు; వారలకున్ - ఏలా? = ఆ కౌరవుల కెందులకు?

భా : *బలంతో మదించిన రూపం కల భీముడనే ఏనుగుయొక్క ఉద్రేకాన్ని ధర్మరాజు అంకుశమయి ఆనాడు సభలో అణచివేశాడు. చివరకు ఇప్పుడుకూడా ఆ ఉద్రేకాన్ని అణచి వేయడానికి ధర్మరాజు యొక్క* ***దయ*** *అనే అమాయకత్వమే సరిపోతుంది. అటువంటప్పుడు సంజయా! నీతికీ పరాక్రమానికీ సంబంధించిన ఆలోచనలతో కష్టపడవలసిన అవసరం ఆ కౌరవుల కెందుకు?*

వి : చక్కని రూపకం- ఇది మూలంలో కనపడదు. అందుచేత ఇది తిక్కన గారి నిష్కర్ష అని చెప్పవచ్చును. అర్జునుని అభిప్రాయంలో ధర్మరాజు చాలా కరుణా స్వభావుడనీ, అంత కరుణ ఉండనవసరం లేదనీ, ఆ అధికమయిన, కపటమెరుగని కరుణ వల్లనే కౌరవులింకా మనగల్గుతున్నారనీ అర్జునుని అభిప్రాయం. ధృతరాష్ట్రుడు కూడ అర్జునుని అభిప్రాయానికి చాలా విలువ ఇస్తాడు. రాజసభలో సంజయుడు ధర్మరాజు చెప్పిన మాటలు చెప్పాక ప్రత్యేకంగా ధృతరాష్ట్రుడు అర్జునుడేమన్నాడు అని అడిగాడు. అపుడు సంజయుడు వివరంగా 132-146=17 పద్యాలలో చెప్పాడు. దాని సారాంశం ఇది.

భీమార్జునుల మనస్సులలో క్రోధం జ్వలిస్తూనే ఉంటుంది. కాని ధర్మరాజు చల్లారుస్తూ ఉంటాడు. అర్జునుని మీద పెట్టి విరాటపర్వం మొదట్లో 1-56 **భవదాజ్ఞాదృఢబంధ** అంటూ ఒక పద్యం చెప్పాడు. ఇపుడు భీముని మీద చెపుతున్నాడు.

ధర్మరాజుకు కరుణ ఉండదగినదే కాని అది సర్వత్ర ప్రసరించరాదని అర్జునుని అభిప్రాయం. అంత ఉద్రేకం కల భీముడు కూడా ధర్మరాజు అనుమతి లేనిదే ముందుకు పోడు. వారి అన్నదమ్ములందరిదీ ఒకటేమాట.

ఇట్లా ధర్మరాజు అంకుశంలా భీమునికి బంధం వేయడం కౌరవులకు బాగా లాభిస్తోందని అర్జునుని తపన-బాధ

విరాటపర్వంలో భీముని చేత, ఉద్యోగపర్వంలో అర్జునునిచేత రెండు మత్తేభాలు తిక్కన రచనలో శిల్పాభిరామంగా నిలిపాడు.

వ. అని పలికి ధర్మతనయాను మతంబున సంజయునకు సపరివారంబుగా సముచిత ప్రకారంబున మజ్జనభోజనంబు లొనరించి మాల్యానులేపనా ద్యుపచారంబులు సేయించి మణిభూషణచిత్రాంబరంబు లొసంగి వీడుకొల్పిన నతండును బాండవులను వాసుదేవుని వీడ్కొని చనియె నని చెప్పిన 380.

అ: ధర్మతనయ+అనుమతంబునన్ =ధర్మరాజుయొక్కఅనుమతితో; మజ్జన భోజనంబులు = స్నానము - భోజనము; మాల్య + అనులేపన+ఆది+ఉపచారంబులు= దండలు వేయుట - మైపూతపూయుట మొ॥ సేవలు; మణి భూషణ, చిత్రాంబరంబులు = మణులు పొదిగిన అలంకారాలు, చిత్రమయినవస్త్రాలు:

భా : అని చెప్పి ధర్మరాజు అనుమతితో పరివారంతో సహా సంజయునికి తగిన రీతిలో స్నానభోజనాదులు చేయించి మాల్యాదిసేవలు చేయించి మణిభూషణాలు; చిత్రాంబరాలు ఇచ్చి పంపించాడు. ఆ సంజయుడు పాండవులనూ, కృష్ణునీ వీడ్కొని వెళ్లాడు.

అని చెపితే..... జనమేజయుడు వైశంపాయనుని ఇలా అడుగుతున్నాడు ముందు పద్యంలో.

వి: ద్రుపదు పురోహితుడు హస్తినాపురానికి వెళ్లి నపుడు కౌరవులు ఇదే విధంగా పురోహితుని సత్కరించి పంపారు. అలాగే పాండవులూ చేశారు- అది ఆనాటి మర్యాద - అతిథి పైగా దూత- చాలా గౌరవిస్తారు- దూతకాబట్టి మర్యాద ఉభయ పక్షాలకూ తగిన రీవిలో ఉంటుంది.

క. విని . యత్యంతకుతూహల
మునఁ బొదలుచు " సంజయుండు మున్నెచ్చటికిం
జనియెను? నెవ్వరితో నే
మనియెను వినవలతు మునిజనాధిప ! చెపుమా! 381.

అ: విని = జనమేజయుడు అంతావిని ; అత్యంతకుతూహలమునన్ = మిక్కిలి వేడుకతో; పొదలుచున్ = ఒప్పుతూ; మునిజనాధిప! = మహర్షిశ్రేష్ఠుడవయిన వైశంపాయనా!; "సంజయుండు ; మున్ను = ముందుగా ; ఎచ్చటకిన్ చనియెను? = ఎక్కడికి వెళ్లాడు?; ఎవ్వరితోన్ ఏమి - అని యెను?; వినవలతున్ = వినగోరుతున్నాను; చెపుమా! (అని అడిగాడు)

భా : *అంతావిని జనమేజయుడు మిక్కిలి కుతూహలంతో ఇలా అన్నాడు'. "వైశంపాయనా! సంజయుడు ముందుగా ఎక్కడికి వెళ్ళాడు; ఎవరితో ఏం మాట్లాడాడు? వినాలనిపిస్తోంది వివరంగా చెప్పు "అని అడిగాడు.*

వ. అని యడిగిన . 382.

భా : *అని అడిగితే.....*

ఉ. భూరి కృపానుషంగ! మునిపుంగవ చిత్త సరోజ భృంగ! సం
సారదవ ప్రవర్ష! సురసంస్తుత దివ్యగుణ ప్రకర్ష! దో
స్సార నిరస్తదైత్య! శమశాలి మనఃస్థితనిత్య! లోకని
స్తారకశీల! నిర్వృతివిశాల! నిరంజన! పాపభంజనా! 383.

అ : భూరి కృపానుషంగ!= అధికమయిన దయతోకూడినవాడా!; ముని....భృంగ!, మునిపుంగవ = మహర్షుల యొక్క : చిత్త = మనస్సుఅనెడి; సరోజ = పద్మమునందు; భృంగ = తుమ్మెద వంటివాడా; సంసార, దవ, ప్రవర్ష = సంసారమనెడి దావాగ్నికి వర్షమైనవాడా; సుర.....ప్రకర్ష; సుర = దేవతల చేత; సంస్తుత = ప్రశంసింపబడిన; దివ్యగుణప్రకర్ష = దివ్యసుగుణములు కలవాడా! ; దోఃసార నిరస్తదైత్య = భుజబలముచేత పారద్రోలబడిన రాక్షసులు కలవాడా!; శమశాలిమనః స్థిత నిత్య = శాంతి పరుల మనస్సులలో నిత్యమూ ఉండేవాడా?; లోక నిస్తారకశీల = లోకులను తరింపజేయు స్వభావముకలవాడా!; నిర్వృతి విశాల! = ఆనందముచే విశాలమయినవాడా!;నిరంజన = ఆసక్తిరహితుడా!; పాపభంజనా! = పాపములను పోగొట్టువాడా!

భా : *హరిహరనాథా! నీవు అపారకృపామూర్తివి - మునీశ్వరుల మనఃపద్మాలలో విహరించే తుమ్మెదవు. సంసార మనే దావాగ్నికి వర్షానివి. దేవతలచే కూడ ప్రశంసింపబడే*

దివ్యగుణాలుకలవాడవు. శాంతి పరుల మనస్సులలో నిత్యమూ ఉంటావు. లోకులను తరింపచేయటమే నీ స్వభావం. ఆనందంతో నిండినవాడవు. అనాసక్తుడవూ- పాపములను పోగొట్టువాడవు.

వి: అనుప్రాస చక్కగా పాటింపబడినది.

క. శ్రుతి మౌళిరత్నమూర్తీ!
శతధృతి ముఖపద్మషండ సౌరభకీర్తీ!
రతిపతి హితాహితాక్షా!
సతతసమాచరిత భక్తజన సంరక్షా! 384

అ: శ్రుతి...మూర్తీ: శ్రుతి = వేదముయొక్క; మౌళి = శిరస్సుమీది; రత్నమూర్తీ! = రత్నమువంటివాడా!; శతధృతి = బ్రహ్మయొక్క; ముఖపద్మషండ = ముఖములనెడి పద్మముల సముదాయము నుండి వెలువడిన; సౌరభకీర్తీ = పరిమళమనెడి కీర్తి కలవాడా!; రతిపతి = మన్మథునికి ; హిత + అ హితాక్షా = హితమూ, అహితము అయిన కనులు కల వాడా; సతత= ఎల్లప్పుడును; సమాచరిత = చేయబడుచున్న ; భక్తజనసంరక్షా!= భక్తుల సంరక్షణ కలవాడా!

భా: హరిహరనాథా ! నీవు ఉపనిషత్తులకు రత్నప్రాయుడవు; బ్రహ్మనాలుగు ముఖములనుండి వెలువడిన వేదపుష్పముల పరిమళానివి. నీ కనులు మన్మథునికి హితమునూ, (హరిరూపంలో) అహితమునూ (హరరూపంలో మన్మథుని చంపి) కలిగిస్తున్నాయి. ఎల్లప్పుడూ నీవు భక్తజనులను రక్షిస్తూ ఉంటావు.

వి : శ్రుతి శిరస్సులగా ఉపనిషత్తులు - ఉపనిషత్తులు భగవంతుని గురించి ప్రతిపాదించును.

మన్మథునికి ఆ కనులు హితమునూ, అహితమునూ కలిగిస్తున్నాయి. హరిరూపము (తండ్రి యగుటచే) కుమారుని పట్ల ప్రసన్నతను ప్రసరిస్తుంది. హరరూపము మన్మథుని భస్మము చేయ జూచును- అందుచే హరిహరనాథరూపము మన్మథునికి హితమూ, అహితమూ కూడ అయినది.

మాలిని : సదయ విమలదృష్టీ ! సంశ్రితాశీః ప్రవృష్టీ!
హృదయ కమలవాసా! యిద్ధమాయా విలాసా!
విదిత నిఖిల భూతీ! విశ్వరక్షాత్తహేతీ!
సదస దుపచితాత్మా! సంభృతానందవర్మా! 385

అ : సదయవిమలదృష్టీ! = కృపాసహితమైన నిర్మల మయిన దృష్టి కలవాడా!; సంశ్రితాశీః ప్రవృష్టీ!= ఆశ్రితులకు ఆశీస్సుల వర్షమునిచ్చువాడా!; హృదయకమలవాసా= కమలమువలె నిర్మలమయిన హృదయములు నివాసముగా కలవాడా!; ఇద్ధ మాయా విలాసా= అప్రతిహతమయిన మాయా విలాసము కలవాడా!; విదితనిఖిల భూతీ!= తెలిసికొనిన

ఐశ్వర్యములు కలవాడా!; విశ్వరక్షాత్తహేతీ! = లోకరక్షణకొరకు గ్రహించిన (కత్తి) ఆయుధములు కలవాడా! ; సత్ + అసత్ + ఉపచిత+ఆత్మా = సద్రూపముతోడను, అసద్రూపముతోడను పెంపొందిన స్వరూపముకలవాడా!;సంభృత ఆనందవర్త్మా! = పరిపూర్ణమయిన ఆనంద మార్గము కలవాడా!

భా : *హరిహరనాథా ! నీవు భక్తులపై దయాపూర్ణమయిన ప్రసన్నదృష్టిని ప్రసరిస్తావు. ఆశ్రితులకు ఆశీర్వాద వర్షము కురిపిస్తావు - నిర్మలహృదయాలలో నివసిస్తావు - అయినా ఎన్నో మాయావిలాసాలు ప్రదర్శిస్తావు. అన్ని విభూతులూ నీకు తెలుసు, లోకరక్షణకోసం ఆయుధం గ్రహిస్తావు. సత్తు అసత్తు ఈ రెండింటి చేతనూ పెంపొందిన వాడవు. ఆనందమార్గంలో విహరిస్తావు*

వి : పృథివి మొదలయిన మూర్తరూపములు సత్తు. ఆకాశము మొదలయిన అమూర్త రూపములు అసత్తు.

గద్యము

ఇది శ్రీమదుభయ కవిమిత్ర కొమ్మనామాత్యపుత్ర
బుధారాధన విరాజి తిక్కన సోమయాజి
ప్రణీతం బయిన శ్రీ మహాభారతంబున
యుద్యోగ పర్వంబునందుఁ
బ్రథమాశ్వాసము.

ఆంధ్ర మహాభారతము

ఉద్యోగ పర్వము - ద్వితీయాశ్వాసము

జనహిత వ్యాఖ్య

క ॥ **శ్రీ విస్తార కరణ కరు**
ణా వేశోదార! శశ్వదమలాకారా!
భావవికార విదూర! శు
భావహ నామప్రకార హరిహరనాథా! 1

అ : శ్రీ.... శోదార!; శ్రీ విస్తారకరణ = సంపద నధికముగా చేసే; కరుణా = దయయొక్క; ఆవేశ = ఆవేశము చేత; ఉదార! = గొప్పవాడా!; శశ్వత్ - అమల+ఆకారా! = ఎల్లప్పుడూ నిర్మలమయిన రూపము కలవాడా!; భావవికార విదూర = ఆరుభావవికారములకు దూరమయినవాడా! శుభ+ఆవహ, నామప్రకార!= శుభప్రదమయిన పేరు కలవాడా! హరిహరనాథా!

భా : ఓ హరిహరనాథా! భక్తులపై నీవు చూపే కరుణావేశము వారికి అధిక మయిన ఐశ్వర్యము కలిగిస్తుంది. నీవు ఆకాశము వలె నిర్మలుడవు అందుచే నీకు జననమరణాది వికారములు లేవు. నీ నామస్మరణమే జనులకు శుభప్రదమయినది.

వి : లోకములోని వస్తువులకు ఆరువికారములు తప్పవు.

1. పుట్టుట 2 ఉండుట 3. వృద్ధిచెందుట 4. మారుట; 5. క్షీణించుట 6. నశించుట అనునవి. ఇవి భగవంతునకు లేవు. అందుచేత అతడు వికార విదూరుడు.

-: సంజయుఁడు ధర్మజుని సంధిపల్కులను ధృతరాష్ట్రునకుఁదెల్పుట :-

సం: 5-32-1

వ : **దేవా! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె. నివ్విధంబున వీడ్కొని సూతనందనుండు పవన జవంబులగు నరదంబు తురంగంబులం దఱిమి ప్రొద్దుగ్రుంకు నంతకుం గరిపురి సొచ్చి నగరి కరిగి యంతఃపురంబున నున్న ధృతరాష్ట్రునకుం దనరాక యెఱింగించి పుచ్చి యతనిం గాంచి యడుగుల కెఱఁగిన నమ్మహీవరుండును నత్యా దరంబున నెత్తి సమీపంబున నునిచినం గొలిచియుండి చేతులు మోడ్చి యిట్లనియె. 2**

అ : పవనజవంబులు = గాలివలె వేగము కలిగినవి; అరదంబు తురంగంబులన్= రథాశ్వములను; పుచ్చి = పంపించి; ఎఱఁగిన= నమస్కరిస్తే; ఆ+మహీవరుండు= ఆమహారాజు; అతి+ఆదరంబునన్ =మిక్కిలి ఆదరంతో; ఉనిచినన్ = ఉంచితే; చేతులు మోడ్చి = నమస్కరించి.

భా : దేవా! హరిహరనాథా! వైశంపాయనుడు జనమేజయునితో అన్నాడు. ఇలా

ధర్మరాజు దగ్గర వీడ్కోలు పొంది, సంజయుడు రథమెక్కి, వేగంగా సూర్యాస్తమయం సమయానికి హస్తినాపురం చేరి, అంతఃపురంలో ధృతరాష్ట్రునికి తన రాక చెప్పి పంపి, అతనిని దర్శించి, పాదాలకు నమస్కరించాడు- ఆ మహారాజు సంజయుని ఆదరంతో ఎత్తి దగ్గర కూర్చుండు మన్నాడు - సంజయు డట్లే చేసి చేతులు మోడ్చి ఇలా అన్నాడు.

వి : ఇదంతా హరిహరనాథునికి తిక్కన వినిపిస్తున్నాడు. దేవా అంటే హరిహరనాథా! అని తిక్కన సంబోధిస్తున్నాడు.

ఉ : దేవర పంపఁగాఁ జని యుధిష్ఠిరునిం గని వచ్చినాఁడ; నా
భూవిభుఁ డప్రమేయ గుణపూజ్యుఁడు మీకు నమస్కరించె; సం
భావన సేసె నా; కిచటి బంధుల నెల్లఁ దలంచె; మీ సుఖ
శ్రీ విభవంబులున్, సుతుల సేమము నన్నడిగెం బ్రసన్నుఁడై. 3

అ: దేవర = రాజుగారు (తమరు); పంపఁగాన్+చని = పంపితే వెళ్లి; యుధిష్ఠిరునింగని = ధర్మరాజును చూసి; వచ్చినాఁడన్ ; ఆ భూవిభుఁడు = ఆ మహారాజు; అ ప్రమేయగుణపూజ్యుఁడు = అధికసద్గుణాల చేత పూజింపదగ్గవాడు; మీకున్; నమస్కరించెన్; నాకున్; సంభావన+చేసె = గౌరవం చేశాడు; ఇచటి బంధులన్ ఎల్లన్ తలంచెన్; ప్రసన్నుడై = నిష్కల్మషుడై; మీ సుఖశ్రీవిభవంబులున్= మీ యొక్క సుఖసంపదల వైభవాలూ; సుతుల సేమము= కొడుకుల క్షేమమూ; నన్ను; అడిగెన్;

భా: "మీరు పంపితే వెళ్లి ధర్మరాజును చూసి వచ్చాను - అతడు చాలా సద్గుణాలు కలవాడు - పూజ్యుడు - మీకు నమస్కరించాడు. నన్ను ఎంతో గౌరవించాడు - ఇక్కడి చుట్టాలనందరినీ తలచాడు - సుముఖుడై నన్ను మీ సుఖసంపదలనూ వైభవాలనూ, కొడుకుల క్షేమాన్నీ అడిగాడు."

వి: యుధిష్ఠిరుడనే పదం ఇక్కడ సముచితంగా వాడాడు - యుద్ధమందు స్థిరమయినవాడు అని దాని అర్థం. - అనగా ధర్మరాజు యుద్ధమందే స్థిరపడ్డాడని సూచించినట్లే- అయితే ఇది వ్యాసుల వారి మాటే - తిక్కన యథాతథంగా ప్రయోగించాడు "యుధిష్ఠిరః కుశలం చాన్వపృచ్ఛత్" సం.భా-ఉద్యో - 5 -32-7

తే॥ అనుఁడు ధృతరాష్ట్రుఁ డిట్లను, నయ్యజాత
శత్రునకు సేమమే? యనుజన్ము లెల్ల
సుఖులె? బంధులు భృత్యులు సఖులు మంత్రి
వరులు సంప్రీతి మెయి నున్నవారె యచట. 4

అ : అనుడున్ = అనగానే; ధృతరాష్ట్రుఁడు+ఇట్లు+అనున్; ఆ+అజాతశత్రునకున్= ఆధర్మరాజుకు; సేమమే?; అనుజన్ములు+ఎల్లన్ = తమ్ములంతా; సుఖులె?; బంధులున్; భృత్యులున్= సేవకులూ; సఖులు= స్నేహితులూ; మంత్రివరులున్; సంప్రీతిమెయిన్= సంతుష్టితో; అచటన్; ఉన్నవారె?; ఉన్నారా?

భా : అనగానే ధృతరాష్ట్రుడిలా అన్నాడు. ఆ ధర్మరాజుకు కుశలమా?

తమ్ములంతా సుఖంగా ఉన్నారా? చుట్టాలు, సేవకులూ, స్నేహితులూ, మంత్రులూ అంతా అక్కడ సంతోషంగా ఉన్నారా?

వి : ఇందులో కూడా అజాతశత్రుడనే పదం సాభిప్రాయంగానే వాడినట్లు తోస్తుంది- సంజయుడు యుధిష్ఠిరుడన్నమాటకు ధృతరాష్ట్రుని యీ మాట సముచితంగా ఉంది. అతడికి మామీద కోపం ఎందుకుంటుంది? అన్నట్లు దాని వెనుక నున్న అంతరార్థం - అతడికి శత్రుత్వమే లేదు కదా! యుధిష్ఠిరుడెట్లా అవుతాడు? అని ధృతరాష్ట్రుని సవరణ. ఇది కూడా వ్యాసుల వారి అనుసరణమే.

వ : **అనిన సంజయుం డిట్లనియె.** 5

భా: *ఆ మాటలకు సంజయు డిలా అన్నాడు*

కll **వారెల్లను భవదీయ**
స్ఫార బలము గారణముగ సౌఖ్యంబున ను
న్నారమని పలుకుదురు; నిజ
మారయఁగా నట్లకాదె యది జననాథా! 6

అ : వారు+ఎల్లను = వారంతా; భవదీయ స్ఫారబలము= నీదయిన ఉజ్జ్వల బలమే; కారణముగన్; సౌఖ్యంబునన్; ఉన్నారము - అని; పలుకుదురు = చెప్పుకొంటున్నారు. జననాథా!= రాజా!; నిజము; ఆరయఁగాన్ = పరిశీలిస్తే; అది అట్లకాదె! = అది అంతే కదా!

భా: *పాండవులంతా మీ బలం వల్లనే సుఖంగా ఉన్నామని చెపుతున్నారు. నిజమాలోచిస్తే అంతే కదా మహారాజా!*

వి : సంజయుని కుశల ప్రశ్నలకు సమాధానంగా ధర్మరాజు "ఆరాజు మాదెసంగల కారుణ్యము కతముననుసుఖంబున నిట్లున్నారము" అని చెప్పాడు. సరిగా అదే అభిప్రాయాన్ని అందించాడు సంజయుడు - అది అందిందో లేదో అని "అది అంతే కదా!" అని కూడా సమర్థించాడు - అప్పటికి ధృతరాష్ట్రునికి ధర్మరాజు మాటలలోని అంతరార్థం కూడా అంది ఉండాలి.

క. **ధర్మజునకు భోగంబులు**
ధర్మువున ట్లింపుగావు; ధర్మంబులలో
నిర్మలబుద్ధి నహింసకుఁ
గూర్మి గడుం గలఁ డతండు కురువంశనిధీ! 7

అ : కురువంశనిధీ! ధర్మజునకున్; భోగంబులు = వైభవాలు; ధర్మువు - అట్లు=ధర్మంవలె; ఇంపు-కావు= ఇష్టంకావు; ధర్మంబులలో; నిర్మలబుద్ధిన్ = స్వచ్ఛమయిన బుద్ధితో; అతండు; అహింసకున్; కడున్ కూర్మికలఁడు = మిక్కిలి ఇష్టపడతాడు.

భా : *ధృతరాష్ట్ర మహారాజా! ఆధర్మరాజునకు ధర్మం ఇష్టమయినంతగా భోగాలు ఇష్టం కావు - అతడు ధర్మాలన్నిటిలోనూ అహింస అంటే నిర్మలబుద్ధితో బాగా ఇష్టపడతాడు.*

వి : ఇది పరోక్షంగా ధర్మరాజు వ్యక్తిత్వానికి సంజయుడిచ్చిన ప్రశంసాపత్రం - అతను సహజంగా భోగాలనూ హింసనూ కోరడు - కాని మీ వారి ప్రవర్తన వల్ల తప్పటం లేదు అనే సూచన కూడా ఇందులో లేకపోలేదు. ఈ సూచన ధృతరాష్ట్రునికి అందినదో లేదో అని మరింత వివరిస్తున్నాడు తరువాతి పద్యంలో -

ఉ. మానుషశక్తి యొల్లఁడు, సమంచిత దైవమ యూఁదియుండు; నీ
పైన యతండు పుణ్యమును బాపముఁ బెట్టినవాఁడు; నీవు నీ
సూనువశంబ కాని యొకచొప్పుఁ దలంపవు, కర్ణ సౌబలా
ధీనము కార్యనిశ్చయము, తెల్లము నీ మత మొప్ప దేమియున్. 8

అ : మానుషశక్తి- ఒల్లడు= పురుషశక్తిని అతడు ప్రధానంగా ఒప్పుకోడు; సమంచిత = పూజితమగు; దైవము+ అ= దైవశక్తినే; ఊది యుండున్=ఆశ్రయించి ఉంటాడు; పట్టుకొని ఉంటాడు; అతండు; నీపైన= నీమీదనే; పుణ్యమును; పాపమున్; పెట్టినవాడు; నీవు; నీసూను వశంబకాని= నీ కొడుకుకు వశమయిన వాడవే; కాని; ఒక చొప్పున్ తలంపవు= ఒక మార్గం ఏమీ ఆలోచింపవు; కార్యనిశ్చయము = కార్యం యొక్క నిర్ణయం; కర్ణ సౌబల+అధీనము= కర్ణుడికీ, శకునికీ అధీనమయినది; తెల్లము = స్పష్టము; నీ మతము = నీ అభిప్రాయము/ పద్ధతి; ఒప్పదు+ ఏమియున్ = ఏమీ మంచిదికాదు.

భా : ఆ ధర్మరాజు పౌరుషాన్ని నమ్మడు. దైవశక్తినే నమ్మి ఉంటాడు. పుణ్యమూ పాపమూ అతడు నీమీదనే పెట్టాడు. నీవేమో నీకొడుకుకు లోబడినవాడవే కాని స్వతంత్రంగా ఆలోచింపవు. కార్యనిర్ణయం అంతా కర్ణుడికీ, శకునికీ ఆధీనమయి ఉంది. నిజంగా నీ పద్ధతి ఏమీ మంచిది కాదు.

వి: పురుషకారము - దైవము - ఈ రెండింటిలోనూ ధర్మరాజు దైవశక్తికి ప్రాధాన్యం ఇస్తాడు.

ఆ. ఆలుబిడ్డ లేనియట్టి త్రిమ్మరియగు,
కొయ్యగాక, కుదుటఁ గూడువెట్టి
కుడుచువార లిట్టి క్రొవ్విదంబులు సేయఁ
జొచ్చు టిచ్చగించి చూతురయ్య? 9

అ : ఆలుబిడ్డ = భార్య, బిడ్డలు, లేని యట్టి; త్రిమ్మరి - అగు= తిరుగు పోతు అయిన; కొయ్య - కాక = బండవాడు తప్ప; కుదుటన్ = గృహంలో పంక్తిలో; కూడు+పెట్టి = భోజనం పెట్టుకొని; కుడుచువారలు = తినేవారు; ఇట్టి క్రొవ్విదంబులు= ఇంతటి క్రూరమైన పనులు; చేయన్ చొచ్చుట = చేయబూనుట; ఇచ్చగించి = ఇష్టపడి; చూతురు+ అయ్య= చూస్తారా?

భా : భార్యాపుత్రులు లేని దేశద్రిమ్మరి అయిన మొండివాడు తప్ప ఒక యింట్లో అన్నం తిని వర్తించేవారు ఇటువంటి క్రూరపుపనులు చేస్తూ ఉంటే సరదాగా చూస్తూ ఊరుకొంటారా?

వి : నీవు పిల్లలుకలవాడవు. నీ పిల్లలు అకృత్యాలు చేస్తూ ఉంటే చూస్తూ ఉపేక్షించవచ్చా? అని సంజయుడు ధృతరాష్ట్రుని ప్రశ్నిస్తున్నాడు. నీ ఉపేక్ష వల్లనే పుట్టిమునుగుతోంది అని సూచిస్తున్నాడు. సంజయుడు ధృతరాష్ట్రునికి మంత్రి. రాజు తప్పు దారి పట్టి ప్రవర్తిస్తూ ఉన్నాడు - అపుడు మంత్రి రాజుకు ఆ విషయం చెప్పడం మంత్రిధర్మం - రాజుకది అప్రియమయినా చెప్పాలి - ఆధర్మాన్ని సంజయుడు నిర్వర్తిస్తున్నాడు. ఈ విషయంలో సంజయుడు ఆర్జవాన్ని ప్రకటిస్తాడు.

చ. కొడుకులఁ గానరే! నృపు లకుంఠిత తేజుల నెందు, నిమ్మెయిం
జెడు తెరువైన చోఁ దగవు సెప్పక యొప్పరికించి చూతురే!
పుడమిజనంబు లెల్ల నినుఁ బ్రువ్వఁగఁ దిట్టఁగ వించు నున్కి నొ
చ్చెడు మది, యెప్పుడుం జెవులు చీములు గట్టెడుఁ గౌరవేశ్వరా! 10

అ : కౌరవ+ఈశ్వరా! = ధృతరాష్ట్రమహారాజా! నృపులు = రాజులు; ఎందున్= ఎక్కడయినా; అకుంఠితతేజులన్ = మొక్కవోని పరాక్రమం కల; కొడుకులన్; కానరే! = కనలేదా!; ఈ+మెయిన్ = ఈ విధంగా; చెడు+తెరువు+ఐనచోన్; చెడుమార్గం పట్టితే; తగవు+ చెప్పక = బుద్ధిచెప్పక; ఒప్పరికించి చూతురే!; ఉపేక్షించి చూస్తారా?; పుడమి జనంబులు+ ఎల్లన్ = భూమి మీది ప్రజలంతా; నినున్; ప్రువ్వంగన్ తిట్టఁగన్= పుచ్చి పోయేటట్లు తిడుతూ ఉంటే; వించున్+ఉన్కి = అవి వింటూ ఉండటం వల్ల; మది నొచ్చెడున్ = నామనస్సు చాలా బాధ పడుతోంది; ఎప్పుడున్; చెవులు; చీములు - కట్టెడున్ = చిల్లుపడి చీములు కారుతున్నాయి.

భా: *మహారాజా! లోకంలో ఎంతమంది రాజులు పరాక్రమ వంతులయిన కొడుకులను కన(టం) లేదు? ఎవరయినా ఈవిధంగా కొడుకులు దుర్మార్గంలో పడిపోతూ ఉంటే తండ్రులు బుద్ధి చెప్పక చూస్తూ ఊరుకొంటారా? భూజనులంతా నిన్ను పద తిడుతూ ఉంటే అవి వినలేక నా మనస్సు ఎంతో బాధపడుతోంది. ఎప్పుడూ ఆ తిట్లు వింటూ ఉంటే చెవులు చీముపట్టినట్లు బాధపెడుతున్నవి.*

చ. చలమున దుస్ససేనుడును సౌబలుఁడున్ మిముఁ బట్టి యార్చ బొ
మ్మల క్రియ నాడుచుండుదురు మానక నీవు సుయోధనుండుఁ దొ
రలసి యొకప్డు పాండుసుతు లాగ్రహవృత్తికిఁ జొచ్చిరేని, నీ
చలము బలంబునుం గులముఁ జక్కగఁ జేయరె యొక్క వ్రేల్మిడిన్. 11

అ : చలమునన్= పట్టుదలతో, అసూయతో; దుస్ససేనుఁడును; సౌబలుడున్= శకునీ; మిమ్మున్ పట్టి అర్చన్= మిమ్మల్ని పట్టి ఆడిస్తూ ఉంటే; మానక=విడువక వారికిలోబడి; నీవున్; సుయోధనుండున్; బొమ్మలక్రియన్=బొమ్మలవలె; ఆడుచుండుదురు; ఒకప్డు=ఎప్పుడో ఒకప్పుడు పాండుసుతులు=పాండవులు; అలసి; ఆగ్రహవృత్తికిన్=కోప ప్రవృత్తికి; చొచ్చిరి+ఏనిన్= పూనుకొంటే; ఒక్క వ్రేల్మిడిన్= ఒక్క చిటికె (కాలం)లో; నీచలము=నీ అసూయ; బలంబునున్; కులమున్=వంశాన్ని; చక్కగన్ చేయరె!=నశింపఁజేయరా?

భా : *పాండవులమీది ఈర్ష్యా బుద్ధితో ఆ దుశ్శాసనుడూ, శకునీ మిమ్మల్ని*

ఆడిస్తూ ఉంటే నీవూ దుర్యోధనుడూ బొమ్మల వలె ఆడుతూ ఉంటారు. ఆ పాండవులు ఎప్పుడో ఒకప్పుడు ఓపిక నశించి ఆగ్రహానికి లోనయితే క్షణకాలంలో నీ చలమూ, బలమూ, వంశమూ అన్నిటినీ నశింపజేయరూ!

క. **వినుము యుధిష్ఠిరు సైరణ**
మనవారలు వెఱపుగా సమర్థింతురు; డీ
కొనఁగం దగరే కొండం
గని యోటమి వెట్టినట్లు కౌరవనాథా! 12

అ : కౌరవనాథా! = కౌరవులకు రాజయిన ధృతరాష్ట్రమహారాజా!; వినుము; యుధిష్ఠిరు సైరణ=ధర్మరాజు యొక్క సహనం; మనవారలు; వెఱపుగాన్=భయంగా; సమర్థింతురు= చెపుతారు; తగరే=పొట్టేలు; కొండన్‌కని=పర్వతాన్ని చూసి; డీకొనఁగన్ = డీకొనటానికి; ఓటమి+పెట్టినట్లు= వెనుకాడింది - చాలలేదు అన్నట్లు-

భా : రాజా! విను. మనవారు ఆ ధర్మరాజు సహనాన్ని అసమర్థతగానూ భయంగానూ భావిస్తారు. అది ఎట్లా అంటే... గొఱ్ఱె పొట్టేలు కొండను చూసి "ఆ కొండ నా మీదకు వచ్చి నన్ను ఎదిరించలేదు" అన్నట్లు -

వి : కొండ కదలదు - అది దాని స్వభావం - దాన్ని చూసి గొఱ్ఱె పొట్టేలు "నాతో కొండ డీ కొనలేదు" అంటే చాలా హస్యాస్పదంగా ఉంటుంది. ఇప్పటి కౌరవుల పరిస్థితి అలా ఉంది. చక్కని ఉపమాలంకారం.

క: **అనుజులకు నడ్డపడి యే**
మినిఁ జేయఁగ నీమిఁ జూచి మెచ్చితి గాకీ
వును; సాదు రేఁగెనేని
న్వినుతల పొలమునన కాని నిలువదు సుమ్మీ! 13

అ : (ఆధర్మరాజు), అనుజులకున్ = తమ్ములకు; అడ్డపడి = అడ్డువచ్చి; ఏమిని చేయఁగ నీమిన్= ఏమీ చేయ నియ్యక పోవడం; చూచి; ఈవును; నీవు కూడా; మెచ్చితిగాక= మెచ్చుకొన్నావు కాని; విను= వినుము; సాదు=వర్తకుల గుంపు; రేఁగెనేనిన్= బయలుదేరితే; తలపొలముననకాని= తరువాతి మజిలీలలోనే కాని, నిలువదు సుమ్మీ= మధ్యలో ఆగదు సుమా!

భా : ఆనాడు సభలో తన తమ్ములు ఏమీ చేయకుండా ధర్మరాజు అడ్డుపడినాడు- అది చూసి నీవు మెచ్చుకొన్నావు - బాగుంది - కాని సాతు బయలుదేరిందంటే తరువాతి మజిలీదాకా ఆగదు సుమా!

వి : సాదురేగెనేనిన్ : సాధు అనుదాని పూర్వరూపము 'సాతు' సంస్కృతమున 'సార్థమ్' అనగా వ్యాపారస్థుల సముదాయము. దీనిని పూర్వులు 'బిడారు' వ్యాపారమనెడివారు. వర్తకులు తమ సరుకులను బండ్లు మొ॥వానిపై వేసుకొని పోయి ఒకచోట (అనువయిన చోట) నిలిచి అమ్ముకొనెడివారు. అట్లు కొంతకాల మమ్ముకొన్న తర్వాత మరియొక మజిలీకి పోయెడివారు. ఒక మజిలీ విడిచిన తరువాత రెండవ మజిలీ చేరువరకు ఆగెడివారు కారు. ఇక్కడ ధర్మరాజు

అడ్డుపడకపోతే అతని తమ్ములు వైరమునకు అంతమును చూసెడివారే - వారు తలచుకొంటే మధ్యలో ఆగరు. అంతుచూస్తారని భావం. (ఈ విషయము తెలుగు పరిశోధన 2 వ సంచిక నుండి గ్రహింపబడినది. రచయితకు కృతజ్ఞతలు)

చ. అనయము పుట్టె జూదమున యప్పుడ, యెంతయుఁ జిచ్చువెట్టి కా
ల్చినయది నీయుపేక్షయ; వశీకృతచిత్తుఁడు ధర్మసూతి మె
త్తనిపులి; యెల్లవారలు నధర్మము నీపయిఁ బెట్టునంతకు
న్వినఁడును గానఁడుం; బిదప నీకును నాకు మరల్పవచ్చునే! 14

అ : జూదమున యప్పుడ = జూదం సమయంలోనే; అనయము+పుట్టె= అవినీతి ఏర్పడింది; నీ - ఉపేక్షయ = నీ వూరుకోవడమే; ఎంతయున్ చిచ్చు- పెట్టి= ఎంతో నిప్పు అంటించి; కాల్చినయది=కాల్చివేసింది; ధర్మసూతి = ధర్మరాజు; వశీకృతచిత్తుఁడు= వశపఱచుకొన్న మనస్సు కలవాడు; మెత్తని పులి=పైకి మాటలో మెత్తగానే ఉంటూ చేతల్లోపులి వంటివాడు; ఎల్లవారలున్ = అందరూ; అధర్మము; నీపయిన్ = నీమీద; పెట్టునంతకున్ = పెట్టేవరకూ; వినడును కానడున్ = వినడు చూడడు (తదేక దీక్షగా చెపుతూ ఉంటాడు) పిదప = తరవాత; నీకును, నాకున్; మరల్పవచ్చునే = ఆమాట పొగొట్టశక్యమా!

భా : జూదంనాడే దుర్ణయం ఏర్పడింది. దానికి నిప్పంటించి కాల్చివేసింది నీ ఉదాసీనత. (ఊరుకోవడం చూస్తూ) ఆ ధర్మరాజు తన మనస్సు తాను స్వాధీనపరచుకో గలవాడు. మెత్తని పులి - అందరూ నీదే అధర్మం అనేవరకూ (ధృతరాష్ట్రునిదే అధర్మం అనే వరకూ) మరో మాట వినడు చూడడు; ఆ మాట ప్రజల్లో స్థిరపడిన తరువాత నీవూ, నేనూ ఏమీ చేయలేము. ఆ మాట మరల్పలేము.

వి : **మెత్తనిపులి:** మృదువుగా మాట్లాడుతూ కఠినంగా వ్యవహరించే వాడిని ఇలా అంటారు. తిక్కన ఈ పదంతో ధర్మరాజు స్వభావాన్ని అంతా సంగ్రహించారు.

చ. అనయము నొచ్చుచున్నయవి యంగము లెల్లను వేగ వచ్చుట
న్మనము వశంబుగాదు, జననాయక! ప్రొద్దును బోయె, నిప్పుడేఁ
బనివిని రేపు పుత్రులును బంధులు నాప్తులు నీవు నేర్పడన్
విన మన కార్య మంతయు సవిస్తరతం దగ విన్నవించెదన్. 15

అ : జననాయక! = రాజా!; వేగవచ్చుటన్ = వేగంగా రావడం చేత; అంగములు - ఎల్లను = అవయవాలన్నీ; అనయము నొచ్చుచున్నయవి = మిక్కిలి నొప్పులు పెడుతున్నాయి; మనము = మనస్సు కూడా; వశంబు కాదు = వశంలో లేదు; ప్రొద్దును పోయెన్ = చాలా ప్రొద్దుపోయింది; ఇప్పుడు; ఏన్= నేను; పని విని = సెలవు తీసుకొని; రేపు; పుత్రులు = నీ కుమారులూ; బంధులు = చుట్టాలూ; ఆప్తులు = మిత్రులూ; నీవున్; ఏర్పడన్ వినన్ = స్పష్టంగా వినేటట్లు; మన కార్యము+అంతయున్ = మన పని అంతా; సవిస్తరతన్ = సవిస్తారంగా; తగన్ విన్నవించెదన్ = తగినట్లు మనవి చేస్తాను.

భా : మహారాజా! వేగంగా రావడం చేత నా అవయవాలన్నీ నొప్పి పెడుతున్నాయి.

మనస్సు కూడా స్వాధీనంలో లేదు; చాలా పొద్దుపోయింది; ఇప్పుడు నేను సెలవు తీసుకొంటాను; రేపు నీవూ, నీ కొడుకులూ, బంధువులూ ఆప్తులూ అంతా స్పష్టంగా వినేటట్లు సభలో మన కార్యమంతా సవిస్తరంగా విన్నవిస్తాను.

వి : ప్రయాణం చేత బడలి పోయాను. అన్నమాట చాలా తేలికగా కన్పిస్తోంది కాని. దీని పర్యవసానంగా ఆధృతరాష్ట్రునికి రాత్రి నిదురపట్టక విదురుని పిలవడం అతడెంతో నీతి చెప్పడం తటస్థించింది.

ఆ. అనిన 'నట్లకాక' యని సంజయుని వీడు
కొలిపి, కొంత ప్రొద్దు కురువిభుండు
కార్యచింత మునిఁగి, కంచుకి నొక్కరుఁ
బిలిచి, 'వేగ విదురుఁ బిలువు' మనియె. 16

అ: అనినన్ = అనగానే; "అట్లకాక" = అట్లాగే; అని; సంజయునిన్; వీడు కొలిపి= పంపించి; కొంతప్రొద్దు = కొంతసేపు; కురువిభుండు = కురురాజయిన ధృతరాష్ట్రుడు; కార్యచింతన్ మునిఁగి= కార్యమును గురించిన ఆలోచనలో మునిగి; కంచుకిన్; ఒక్కరున్ = ఒకనిని; పిలిచి; వేగన్ = వేగంగా; విదురున్; పిలువుము; అనియె;

భా: సంజయుడలా అంటే సరే అని సంజయుని పంపించి ధృతరాష్ట్రుడు కొద్దిసేపు కార్యాలోచనలో నిమగ్నుడై తర్వాత కంచుకిని పిల్చి "త్వరగా విదురుని పిల్చుకొనిరా" అన్నాడు.

వి : రాజాంత:పురాల్లో ఉండే నమ్మిక గల వృద్ధ సేవకుని కంచుకి అంటారు.

వ: వాఁడును సత్వరంబుగాఁ జని, యతనిం దోడ్తెచ్చి కాన్పించిన, నమ్మహీవరుం డత్యాదరంబున విదురుం దనయొద్ద నునిచికొని, యతని కిట్లనియె.17

అ: కాన్పించినన్=దర్శింపజేస్తే; ఆ+మహీవరుండు=ఆ భూనాథుడు= ఆమహారాజు; అతి+ ఆదరంబునన్=మిక్కిలి ఆదరంతో; ఉనిచికొని=కూర్చుండబెట్టుకొని.

భా: ఆ కంచుకి త్వరగా వెళ్ళి విదురుని తీసుకువచ్చి ధృతరాష్ట్రుని ముందు పెట్టాడు. అతడు మిక్కిలి ఆదరంతో విదురుని తన దగ్గరగా కూర్చుండబెట్టుకొని విదురునితో ఇలా అన్నాడు.

ఆ. పాండురాజ సుతుల పాలికిఁ జని యిప్డు
సంజయుండు వచ్చి, సమ్ముఖమున
నన్నుఁ జాల దూఱి; నాకు రే పచ్చటి
పనులు సెప్పువాఁడ, ననుచుఁ జనియె. 18

అ: సంజయుండు; పాండురాజు సుతుల పాలికిన్ = పాండవుల దగ్గరకు; చని= వెళ్లి; ఇప్డువచ్చి; సమ్ముఖమ్మునన్= సమక్షంలో; నన్నున్; చాల దూఱి = చాలా నిందించి; నాకున్; రేపు; అచ్చటి పనులు; చెప్పువాడన్ = చెపుతాను; అనుచున్; చనియెన్.

భా : సంజయుడు పాండవుల దగ్గరకు వెళ్లి ఇపుడే వచ్చి సమక్షంలో నన్ను చాలా నిందించి రేపు అక్కడి విషయాలన్నీ చెపుతా నంటూ వెళ్లిపోయాడు.

వి: "గర్హయిత్వాచ మాం గతః" అన్న మూలానికి చక్కని తెలుగు సేత "సమ్ముఖమ్మున నన్ను చాల దూఱి" అనేది - ఇందులో అదనంగా 'సమ్ముఖమ్మున' అనేది ఇంకా బాగుంది. రాజును సమ్ముఖంగా నిందించడం నిజాయితీ పరులకు, దోషాన్ని పైకి చెప్పగల ధీరులకు - రాజహితులకు మాత్రమే చెల్లుతుంది ఈ కోవకు చెందిన వ్యక్తి సంజయుడన్నమాట.

క. అప్పటి నుండియు నెవ్వగ
గప్పికొనినఁ జిత్తవృత్తి గలఁగెడు, మేనున్
నిప్పుల (బొరలిన యట్లయి
చొప్పడ దించుకయు నిద్ర శుద్ధవిచారా! 19

అ: శుద్ధ విచారా! = స్పష్టమయిన/స్వచ్ఛమయిన ఆలోచన కల విదురా! అప్పటి నుండియున్; నెవ్వఁగన్ = నిండు దుఃఖం; కప్పికొనినన్ =ముసురుకొంటే; చిత్తవృత్తి = మనస్సు/ మనోగతి; కలఁగెడు= కలత చెందుతోంది; మేనున్= శరీరం కూడా; నిప్పులన్ = నిప్పులలో; పొరలినయట్లు- అయి = దొర్లినట్లు అయి; నిద్ర; ఇంచుకయున్ = కొద్దిగా అయినా; చొప్పడదు= రావటం లేదు.

భా: విదురా! అప్పటి నుండి నా మనస్సు దుఃఖంతో కలతచెందుతోంది; శరీరం అంతా నిప్పులలో దొరలినట్లుగా ఉంది. ఏ మాత్రం కంటికి నిద్ర రావటం లేదు.

వి: సర్వేంద్రియా ణ్యప్రకృతిం గతాని (5-33-12) అన్న మూలానికి "మేనున్ నిప్పుల పొరలిన యట్లయి" అని అనువాదం. జాతీయతతో కూడి ఉంది.

వ. అనిన విదురుం డిట్లనియె. 20

భా: ఆ మాటలకు విదురుడు ఇలా అన్నాడు.

క. బలవంతుఁడు పై నెత్తిన
బలహీనుఁడు, ధనము గోలుపడిన యతఁడు, ము
చ్చిల వేచువాఁడు, గామా
కులచిత్తుఁడు, నిద్రలేక కుందుదు రధిపా! 21

అ : అధిపా! = రాజా! బలవంతుడు పైనెత్తిన = బలవంతుడు దండెత్తి వస్తే; బలహీనుడున్ బలం లేనివాడూ; ధనము కోలుపడిన అతండున్ = ధనం పోగొట్టుకొన్న వాడూ; ముచ్చిలన్ వేచువాడు = దొంగతనం చేయడానికి నిరీక్షించువాడూ; కామ+ఆకుల చిత్తుఁడున్= కామం చేత వ్యాకుల మయిన మనస్సు కలవాడూ; నిద్రలేక; కుందుదురు = బాధపడతారు.

భా: రాజా! బలవంతుడు దండెత్తి వస్తే బలహీనునికి నిద్రరాదు. అలాగే ధనం పోగొట్టుకొన్నవాడూ; దొంగతనం చేయాలనుకొని ఎదురుచూసేవాడూ; కామాకుల చిత్తుడూ నిద్రలేక బాధపడతారు.

వి : అభియుక్తం బలవతా, దుర్బలం, హీనసాధనమ్,
హృతస్వం, కామినం, చోర మావిశన్తి ప్రజాగరాః 5-33-13
అని దీనికి మూలం.

క. **ఇక్కొఱగాములలోపల**
నొక్కటి నీచిత్తవృత్తి నొందెనొ? యొరు సొ
మ్మొక్కటి గుడువఁ దలంచితొ?
నిక్కము గతమేమి సెపుమ నిద్ర చెడుటకున్? 22

అ: ఈ+కొఱగాముల లోపలన్ = ఈ దోషాల్లో; ఒక్కటి; నీ చిత్తవృత్తిన్+ఒందెనొ = నీ మనసుకు వచ్చిందా? ఒరుసొమ్ము=ఇతరుల ధనం; ఎక్కటి= ఒక్కడవూ; కుడువన్ తలంచితొ?= తినివేద్దామనుకొన్నావా? నిద్రచెడుటకున్ = నిద్రరాకపోవడానికి; నిక్కము = నిజంగా; కతమేమి= కారణం ఏమిటి? చెపుమ

భా : ఈ తప్పు పనుల్లో ఏదయినా ఒకటి నీ మనసు లోనికి వచ్చిందా? లేక ఇతరుల సొమ్ము ఒక్కడవూ తినాలనుకున్నావా - నీకు నిద్ర రాకపోవటానికి కారణం ఏమిటో నిజంగా చెప్పు.

తే. **అనిన ధృతరాష్ట్రుఁ డిట్లను నతనితోడ;**
"ధర్మసుతుమాటచొ ప్పెవ్విధంబొ యెఱుఁగ
కునికిఁ జేసి చింతిల్లితి, నోపు దీవు
దెలియఁ జెప్పి నాయలమట మలుగఁజేయ." 23

అ: అనినన్; ధృతరాష్ట్రుడు; అతని తోడన్ = విదురునితో; ఇట్లు -అనున్; ధర్మసుతు= ధర్మరాజు యొక్క; మాటచొప్పు = మాటలతీరు; ఏ+విధంబొ = ఎటువంటిదో; ఎఱుఁగక+ఉన్కి= తెలియక పోవడం చేత; చింతిల్లితిన్ = విచారపడ్డాను; తెలియన్ చెప్పి = అది ఏమిటో చెప్పి; నా అలమట = ఆవేదన; మలుగన్ చేయన్= తొలగించడానికి; ఓపుదు - ఈవు = నీవు తగుదువు.

భా: అపుడు ధృతరాష్ట్రుడు విదురునితో ఇలా అన్నాడు. ధర్మరాజు మాట్లాడిన మాటల తీరు తెలియక ఆవేదన చెందాను - ఆ భావమేమో తెలియజెప్పి ఆవేదన తీర్చటానికి నీవే తగినవాడవు.

చ. **అనవుడు నిట్లనున్ విదురుఁ డక్కట! ధర్మసుతుండు బాంధవుం**
డును చెలికాఁడునుం దగుభటుండును బ్రెగ్గడయున్ గురుండుఁగాఁ
డె నృపవరేణ్య! నీకుఁ బ్రకటీకృతసత్త్వుఁడు శాంతమూర్తి స
ద్వినయ వివేకశీలముల విశ్రుతుఁ డాతఁడు గీడు వల్కునే? 24

అ : అనవుడున్ = అనగానే; విదురుఁడు; ఇట్లు+అనున్; జనవరేణ్య! = మహారాజా!; ధర్మసుతుండు= ధర్మరాజు; నీకున్, బాంధవుండును=చుట్టమూ; చెలికాఁడునున్= స్నేహితుడూ; తగుభటుండును; (నమ్మి) దగిన సేవకుడూ; ప్రెగ్గడయున్ = మంత్రీ; గురుండున్ కాడె? = గురువూ కాదా?; ప్రకటీకృత సత్త్వుఁడు = ప్రకటింపబడిన పరాక్రమం కలవాడు; శాంతమూర్తి =

శాంతము రూపుదాల్చినవాడు; సత్ -వినయ, వివేక, శీలములన్ = వినయమూ, వివేకమూ; సత్ప్రవర్తనలలో; విశ్రుతుఁడు = ప్రసిద్ధుడు; అక్కట; ఆతఁడు కీడు-పల్కునే = తప్పుమాట్లాడునా?

భా: *అపుడు విదురుడిట్లా అన్నాడు. "ధర్మరాజు నీకు బంధువూ, స్నేహితుడూ, నమ్మదగిన బంటూ; అమాత్యుడూ గురువూ కదా! రాజా! అతడు అందరికీ తెలిసిన పరాక్రమం కలవాడు. అయినా శాంతస్వరూపుడు -వినయమూ, వివేకమూ, మంచి శీలమూ- వీనిలో అతడు ప్రసిద్ధుడు - అటువంటి ధర్మరాజు తప్పుమాట్లాడుతాడా?"*

ఆ. నీవుఁ గొడుకు వారి నెఱిలేక, పఱిచితి
రదియ చాలు; నుచితమైనపాలు
పంచి యిండు; పిల్లిపట్టిన యీరువు
సేసి యున్న నేల చెల్ల నేర్చు? 25

అ: నీవున్ కొడుకున్ = నీవూ దుర్యోధనుడూ; వారిన్ = పాండవులను; నెఱిలేక = ధర్మంలేక; పఱిచితిరి=అవమాన పరచారు; అదియచాలు = అదేచాలు; ఉచితమయిన పాలు= వారికి తగిన పాలు; పంచియిండు = పంచి ఇవ్వండి; పిల్లి పట్టిన ఈరువు - చేసియున్నన్ = పిల్లి పట్టిన మాంసంగా చేస్తే; ఏల చెల్లనేర్చు? = ఎలా చెల్లుతుంది?

భా: *నీవూ నీ కొడుకు దుర్యోధనుడూ పాండవులను అన్యాయంగా అవమాన పరచి గెంటివేశారు. అదే చాలు; వారికి తగిన రాజ్యభాగం వారికి పంచి ఇవ్వండి. అంతేగాని పిల్లి పట్టిన మాంసం లా చేస్తే చెల్లుతుందా?*

వి: **పిల్లి పట్టిన ఈరువు** = పిల్లి మాంసాన్ని పట్టుకొంటే ఏమయినా సరే విడిచి పెట్టదు. అలాగే పాండవుల రాజ్యభాగాన్ని గ్రహించి నీవూ నీకొడుకూ విడిచి పెట్టలేక పోతున్నారని భావం. పిల్లి ప్రాణాన్నయినా విడుస్తుంది కాని పట్టిన మాంసపు ముద్దను విడువదు. అట్లాగే నీవూ నీ పుత్రులూ ప్రాణాలయినా విడుస్తారు కాని రాజ్యం విడిచిపెట్టరు అని సూచన.

వ. మీరు శకుని కర్ణదుశ్శాసనుల మీఁద రాజ్యభారంబు వెట్టికొని యుండుదు రిది తుదిముట్టనేర దెట్లంటేని. 26

అ: తుదిముట్టు = చివరిదాకావచ్చు

భా: *మీరు శకుని, కర్ణుడు, దుశ్శాసనుడూ - వీరి మీద రాజ్యభారం అంతా మోపి ఉంటారు. కాని అది చివరిదాకా చెల్లదు. ఎందుకంటే...*

క. తముఁ దారెఱుఁగుట, వేగప
డమి, దాలిమి, విడుపుగలుగుటయు, లేని ప్రభు
త్వము గలదె? వారి యందీ
సుమానుషము లొకఁడుఁ బట్టి చూడం గలఁడే. 27

అ: తమున్ = తమను; తారు - ఎఱుఁగుట = తాము తెలిసికోవడం; వేగపడమి = తొందరపడక పోవడం; తాలిమి= సహనం; విడువుకలుగుటయున్=త్యాగగుణ ఉండటం; లేని

ప్రభుత్వము కలదె? = ఈ లక్షణాలు లేని ప్రభుత్వం ఎక్కడయినా ఉంటుందా?; వారి యందున్= పై వారిలో; ఈ సుమానుషములు= ఈ మంచి లక్షణాలు; ఒకడున్=ఒక్కటయినా; పట్టి చూడంగలఁడే= పట్టి చూడగలడా.

భా: *తమను తాము తెలుసుకోవడం; తొందరపాటు లేక స్థిరతకలిగి ఉండటం; సహనమూ; త్యాగమూ లేని ప్రభుత్వం ఎక్కడయినా ఉంటుందా? పై చెప్పిన దుష్టచతుష్టయంలో ఈ మంచి లక్షణాలు ఎవరయినా చూడగలరా?*

వ. యుధిష్ఠిరుండు నీవు నిక్కమ తండ్రివని, తగవు నమ్మి చాల సైరించి యున్నవాఁ; డది నీవ యెఱుంగు; దనిన విని ధృతరాష్ట్రుం డిట్లనియె. 28

అ: యుధిష్ఠిరుండు = ధర్మరాజు; నిక్కమతండ్రివి - అని = సాక్షాత్తు తండ్రివని; తగవు నమ్మి= న్యాయం నమ్ముకొని; సైరించి = సహించి; నీవ = నీవే

భా: *ధర్మరాజు నీవు సాక్షాత్తు తండ్రివని భావిస్తున్నాడు; న్యాయాన్ని నమ్ముకొని చాలా (సహించి) సహనం వహించి ఉన్నాడు; అది నీవే యెఱుగుదువు అనిన విని ధృతరాష్ట్రుడు ఇలా అన్నాడు.*

తే. సంజయుని చేతఁ గార్యంబు చంద మెల్లి
యెఱిఁగి, మన కెద్ది సేయంగఁ దెఱఁగు దానిఁ
బనిచి చేయింపు; మిపుడ నామనము తల్ల
డిలుట హితభాషణంబుల డిందుపఱుపు. 29

అ: సంజయుని చేతన్; కార్యంబు చందము = పనితీరు; ఎల్లి = రేపు ; ఎఱింగి = తెలిసికొని; మనకున్; చేయంగన్ = చేయటానికి; ఎద్ది తెఱఁగు= ఏది పద్ధతో; దానిన్; పనిచి; ఆజ్ఞాపించి; చేయింపుము; ఇపుడు; నామనము = నా మనస్సు; తల్లడిలుట = తలడిల్లి పోతూ ఉండటం; హితభాషణములన్ = హితకరములయిన మాటలతో; డిందుపఱుపు = తగ్గించుము.

భా: *రేపు సంజయుని వల్ల కార్యవిధానం తెలుసుకొని మనం ఏం చెయ్యాలో దాన్ని ఆజ్ఞాపించి చేయించు. ప్రస్తుతం నా మనస్సులోని ఆందోళనను హిత వచనాలతో తగ్గించు.*

వ. నీవు ధర్మాధర్మవిదుండవు నయానయజ్ఞుండవు, నాకుం బ్రజాగరం బొనర్చుచున్న సంతాపం బుపశమించునట్లుగా భవద్వచనామృతంబు నాయుల్లంబున వెల్లిగొల్పు 'మనిన విదురుం డిట్లనియె. 30

అ : ధర్మ + అధర్మ-విదుండవు =ధర్మమూ, అధర్మమూ తెలిసిన వాడవు; నయ + అనయజ్ఞుండవు = నీతి యేదో అవినీతిఏదో తెలిసినవాడవు; ప్రజాగరంబు = నిద్రలేకపోవుట; ఉపశమించు= తగ్గు; భవత్- వచన + అమృతంబు: నీయొక్క మాటలనే అమృతం; ఉల్లంబునన్= మనస్సులో; వెల్లిగొల్పుము = పొరలింపజేయుము.

భా : *"నీవు ధర్మమూ,అధర్మమూ తెలిసినవాడవు. నీతీ, అవినీతీ ఎఱిగినవాడవు*

నాకు నిద్రపట్టక పోవడానికి కారణమయిన దుఃఖం పరితాపం తగ్గేటట్టుగా నీ హితోపదేశం అనే అమృతప్రవాహం నా మనస్సులో పొంగి పొరలించుము" అంటే విదురుడిలా అన్నాడు.

-: ధృతరాష్ట్రునకు విదురుఁడు హిత ముపదేశించుట :-
సం. 5-33-16

క. **జనులకు నొడఁబాటగు విధ**
మున నడచుచు, లోక నింద్యముల నుడుగుచు, మీఁ
దని యొకని కలిమి కులుకక,
మనుజులతోఁ బొంది పొసఁగి మనుటొప్పు నృపా! 31

అ: నృపా=రాజా; జనులకున్; ఒడఁబాటు+అగు=అంగీకారమగు: విధమునన్= పద్ధతిలో; నడచుచున్ = ప్రవర్తిస్తూ; లోకనింద్యములన్ - లోకంలో నిందింపబడే పనులను; ఉడుగుచున్= వదలుతూ; మీఁదు అని=అధికమని; ఒకని కలిమికి = ఒకని సంపదకు; ఉలుకక= అసూయపడక; మనుజులతోన్=మనుష్యులతో; పొంది పొసఁగి=కలిసిమెలిసి; మనుట= జీవించుట; ఒప్పున్ = తగును.

భా : రాజా! ప్రజలందరికీ ఇష్టమయిన రీతిలో ప్రవర్తిస్తూ లోకులచేత నిందింపదగిన పనులను విడిచిపెడుతూ; ఎదుటివాని సంపదకు అసూయ పడక మానవులందరితోనూ కలిసి మెలిసి జీవించాలి.

వి : ఇందులో రాజుకే కాకుండా సామాన్యజనులకు కూడా వర్తించేటట్లు నాలుగు నీతులు చెపుతున్నాడు.

1. **జనులకు హితమయిన మార్గంలో ప్రవర్తించాలి.** రాజేకాదు. ప్రజలుకూడా - ఇతర జనులకు హితముకలిగేటట్లు ప్రవర్తించాలి. రాజనగా నాయకుడనగా జనులలో శ్రేష్ఠుడని అర్థం. శ్రేష్ఠుడయిన వాని ప్రవర్తన మార్గదర్శకంగా అదర్శప్రాయంగా ఉండాలి. అతనిని చూసి ఇతరులు నేర్చుకొంటారు చాలా విషయాలు. అదే విషయం

"యద్య దాచరతి శ్రేష్ఠ : తత్తదే వేతరోజనః
సయ త్రుమాణం కురుతే లోక స్తదనువర్తతే భగవద్గీత-

అని భగవద్గీతలో చెప్పబడింది. అనగా రాజుప్రవర్తనలో ఏ మాత్రమూ దోషం ప్రజలకు కనపడరాదు-మానవుడు ఒక్కొక్కప్పుడు ధర్మమే ఆచరిస్తున్నా పరిసరాలప్రభావం చేత అది అధర్మంగా ప్రజలకు తోచవచ్చు - అందుకే తాడిచెట్టు క్రింద కూర్చొని పాలుత్రాగినా కల్లుత్రాగాడనే అనుకుంటారు. అని సామెత వచ్చింది. చేసేపని మంచిదయినా చెడ్డదిగా ప్రజలకు కనిపించరాదు తోచరాదు. ఈ విషయంలో కూడా శ్రేష్ఠుడు జాగ్రత్త పడాలి.

2. **లోక నింద్యముల నుడుగుట :**

లోకంలో నిందింపదగిన పనులను విడిచిపెట్టాలి. అనగా వ్యసనాలను విడిచి పెట్టాలి. ద్యూతం, వేట మొ॥ వ్యసనాల వల్ల పరిపాలనలో బిగువు సడలి ఆరాజకత్వానికి దారి తీస్తుంది. వ్యసనాలను గురించి ముందు చెప్పబడుతుంది.

3. మీదని ఒకని కలిమికి ఉలుకక :

తనకంటె ఎక్కువ సంపద కలవానిని చూసి అసూయ పడరాదు. మానవుడు ఉన్నతస్థితి పొందటానికి ఉత్సాహంతో కూడిన స్పర్ధ (పోటీ) అవసరమే. కాని అది తీవ్రమయి అసూయగా పరిణమించరాదు. ఇతరుల కలిమికి అసూయ పడరాదు. స్వార్థంతో అసూయను ప్రేరేపించే వ్యక్తులను మానవుడు ఒక కంట కనిపెట్టాలి. ఎందు చేతనంటే అసూయాపరుడికి తెగులు లేకపోయినా బాధ కలుగుతూ ఉంటుంది. చూడుడు 5-2-58 పరులధనమునకు అనే పద్యంవ్యాఖ్య. ఈ అసూయా దుర్గుణం చేతనే దుర్యోధనుడు సమూలంగా నశించిపోయాడు. అసూయ పనికి రాదని భారతం స్థూలంగా నిర్దేశిస్తోంది.

4. మనుజులతో పొంది పొసగి మనుట:

పదిమందితో కలిసి మెలసి ఉండటం. తానెంత బలవంతుడయినా నలుగురికీ దూరం కారాదు. జనులతో కలిసి మెలిసి హితంగా మృదువుగా ప్రవర్తించాలి. కలిసి మెలిసి జీవించే వారు ఎక్కువ ఆనందాన్నీ, ఆప్యాయతనూ, ఆదరణనూ పొందుతారు. మంచితనం పెరుగుతుంది. అందరూ మిత్రులవుతారు. తెలివిగల వాడు పెక్కు మిత్రులను సంపాదించుకోవాలి. ఒంటరి అయిన బలవంతునికంటె పదిమందితో కలిసి మెలిసి ఉన్న సామాన్యుడు సక్రమమైన సురక్షితమయిన జీవనం గడుపుతాడు. శారీరకంగాను, మానసికంగానూ, సంతుష్టు డవుతాడు. మానవునికి సంతుష్టిని మించిన బలంలేదు.

క. కోపము, నుబ్బును, గర్వము,
నాపోవక యునికియును, దురభిమానము, ని
ర్వ్యాపారత్వము; నను నివి
కాపురుష గుణంబు లండ్రు కౌరవ నాథా! 32

అ: కౌరవనాథా! = ధృతరాష్ట్ర మహారాజా! ; కోపమున్; ఉబ్బును= ఉబ్బిపోవడం; గర్వమున్; ఆపోవకయునికియును=తృప్తి లేకపోవడమూ; దురభిమానమున్; నిర్వ్యాపారత్వమున్= ఏపనీలేకుండా సోమరితనంతో ఉండటం; అనునివి; కా పురుషగుణంబులు= హీనమానవుని లక్షణాలు; అండ్రు = అంటారు.

భా : మహారాజా ! కోపమూ, పొంగిపోవడమూ, గర్వమూ, అసంతృప్తీ, దురభిమానమూ, సోమరితనమూ అనే ఈ ఆరు నీచపురుషుని లక్షణాలని చెపుతారు.

క: ఏలినవానిని దైవము,
నాలిని బంధులను సముచితారాధన సం
శీలతఁ బ్రీతులఁ జేయని
పాలసుఁ డాఫలము లానపడు? మనుజేంద్రా! 33

అ: ఏలిన వానిని= రాజునూ; దైవమున్= దైవాన్ని; ఆలిని= భార్యనూ; బంధులను; సముచిత+ఆరాధన సంశీలతన్= తగినట్లు గౌరవించే ప్రవర్తనతో; ప్రీతులన్= సంతుష్టులను; చేయని; పాలసుఁడు+ఆ= మూఢుడా?; ఫలములు ఆసపడు?=ఫలితాలు ఆసించేది.

భా: రాజా! రాజునూ, దైవాన్నీ భార్యనూ బంధువులనూ తగినరీతిలో గౌరవించి సంతోషింపజేయని మూఢుడు ఏ ఫలితాలు ఆసింపగలడు? ఏమీ పొందలేడని భావం.

వి: మొదటి రెండూ మానవుని బాహ్యపరిధికి సంబంధించినవి. చివరిరెండూ ఆంతరంగిక పరిధికి సంబంధించినవి. మానవుడు వీరందరినీ సంతోషపరిస్తేనే సత్ఫలితం కలుగుతుంది.

క. నెమ్మి గలవారి నొల్లరు;
తమ్మొల్లని వారి వెనుకఁ దగులుదు; రధిక
త్వ మ్మెఱిఁగి యెఱిగి తొడరుదు
రి మ్మెఱుగని యట్టివార లిభపురనాథా! 34

అ: ఇభపురనాథా! = హస్తిపురానికి రాజయిన ధృతరాష్ట్రమహారాజా!; ఇమ్ము ఎఱుఁగని అట్టివారు=ఉపాయం లేనివారు; నెమ్మి - కలవారిని =తమపై ప్రేమగలవారిని, ఒల్లరు = అంగీకరింపరు; తమ్ము = తమను; ఒల్లని వారి= ఒప్పుకోని వారియొక్క; వెనుకన్-తగులుదురు= వెంటపడుదురు/ వెంట ఆసక్తులవుతారు; అధికత్వమ్ము = ఎదుటివాని ఆధిక్యం ; ఎఱిఁగి ఎఱిఁగి = బాగా తెలిసి కూడా; తొడరుదురు = ఎదిరిస్తారు.

భా : రాజా ! తెలివీ ఉపాయమూలేనివారు తమపై అనురాగంతో వ్యవహరించే వారిని ఒప్పుకోరు - తమను ప్రేమించని వారి వెంట పడతారు. అధికులని స్పష్టంగా తెలిసికూడా ఎదిరిస్తారు.

క. ధనమును విద్యయు వంశం
బును దుర్మతులకు మదంబుఁ బొనరించును స
జ్జనులైనవారి కడఁకువ
యును వినయము నివియ తెచ్చు నుర్వీనాథా! 35

అ: ఉర్వీనాథా! = భూనాథుడవయిన ధృతరాష్ట్రా! ధనమును; విద్యయు; వంశంబును = మంచి వంశంలో పుట్టడమూ; దుర్మతులకు = దుర్జనులకు; మదంబున్=గర్వాన్ని; పొనరించును= కలిగిస్తాయి; సజ్జనులైనవారికిన్; అడకువయును = నమ్రతనూ; వినయమున్; ఇవియతెచ్చున్ = ఇవేకలిగిస్తాయి.

భా: ధనమూ, విద్యా, వంశమూ ఈ మూడూ దుర్జనులకు గర్వాన్ని కలిగిస్తాయి. సజ్జనులకు ఇవే నమ్రతనూ వినయాన్నీ కలిగిస్తాయి.

వి: దీనికి మూలంలో చక్కని చమత్కారం ఉంది.

విద్యామదో ధనమద స్తృతీయోభిజనో మదః
ఏతే మదావలిప్తానాం ఏతఏవసతాం దమాః

ఈ మూడూ దుర్మార్గులకు మదమూ; సన్మార్గులకు దమమూ కలిగిస్తాయి. అక్షరాలు తిరగబడ్డాయి (మదం-దమం)

కథా సంబంధిగా మదం దుర్యోధనుడికీ - దమం ధర్మరాజుకూ కలుగుతాయి.

తెలుగులో అడకువ చేత, దమమును, వినయము చేత శమమునూ గ్రహించాలి.

క. అరిది విలుకాని యుజ్జ్వల
శర మొక్కని నొంచుఁ, దప్పి చనినం జను;నే
ర్పరియైన వాని నీతి
స్ఫురణము పగరాజు, నతని భూమిం జెఱచున్. 36

అ: అరిది విలుకాని = అసాధారణమయిన విలుకానియొక్క; ఉజ్జ్వల శరము = తీవ్రబాణం; ఒక్కనిన్; నొంచున్=బాధిస్తుంది; తప్పిచనినన్=తప్పిపోయినా; చనున్ = తప్పిపోవచ్చు; నేర్పరి -ఐనవాని = నిపుణుడయిన వానియొక్క ; నీతి స్ఫురణము = రాజనీతి ఉపాయము; పగరాజున్ = శత్రురాజునూ, అతని భూమిన్ = అతని దేశాన్నంతనూ; చెఱచున్= నశింపజేస్తుంది.

భా: *మహాధనుష్మంతుని బాణం ఒక్కణ్ణి కొడుతుంది.తప్పిపోతే తప్పిపోనూవచ్చు-కాని నిపుణుని రాజనీతి ఉపాయం శత్రురాజునే కాకుండా అతని దేశంలోని వారందరినీ నశింపజేస్తుంది.*

వి: రాజనీతి చాతుర్యం బుద్ధికి సంబంధించినది. విలుకాని బాణం శరీర సంబంధి. అనగా శరీరసంబంధమయిన శక్తికంటె బుద్ధి సంబంధమయిన శక్తి చాలా తీవ్రమయినది. అధిక మయినది అని భావం. దీని సంస్కృతం

ఏకం హన్యా న్నవా హన్యా దిషు ర్ముక్తో ధనుష్మతః
బుద్ధి ర్బుద్ధి మతోత్సృష్టా హన్యాద్రాష్ట్రం సరాజకమ్ 5–33–42.

తే. ఒకటిఁగొని, రెంటి నిశ్చలయుక్తిఁ జేర్చి,
మూఁటి నాల్గింటఁ గడు వశ్యములుగఁ జేసి,
యేనిఁటిని గెల్చి, యాఱిఁటి నెఱిఁగి, యేడు
విడిచి వర్తించువాఁడు వివేక ధనుఁడు. 37

అవ: *ఇది సంకేతాలతో కూర్చిన పద్యం. తెలివైన వాడు ఎలా ప్రవర్తించాలో ఇందులో చెపుతున్నాడు.*

అ: ఒకటిన్ కొని = ఒకదానిని (బుద్ధిని) చేకొని, రెంటిన్ నిశ్చల యుక్తిన్ చేర్చి = కర్తవ్యాకర్తవ్యములు రెండింటిని (బుద్ధితో) నిశ్చయించుకొని. మూటిన్ = మూడింటిని (శత్రువులు, మిత్రులు, ఉదాసీనులు) వీరిని; నాల్గింటన్ కడు వశ్యములుగన్ చేసి = సామదాన,, భేధ దండములనే నాల్గు ఉపాయములతో వశపరచుకొని; ఏనిటిని గెల్చి = ఐదింటిని జయించి (పంచేంద్రియాలు) ఆఱిటినెఱిఁగి = ఆరింటిని తెలిసికొని (సంధి, విగ్రహ, యాన; ఆసన, ద్వైధీభావ, సమాశ్రయములు) ఏడు విడచి = సప్తవ్యసనాలు వదలి (స్త్రీ, జూదము, మద్యపానము; వేట, వాక్పారుష్యము, దండపారుష్యము, అర్థదూషణము); వర్తించువాడు వివేకధనుడు = (వీనిని వదలి) ప్రవర్తించేవాడు వివేకి.

భా: *ముందు బుద్ధితో కర్తవ్యమేదో అకర్తవ్యమేదో నిశ్చయించుకోవాలి. శాత్రవులనూ. మిత్రులనూ మధ్యస్థులనూ తెలిసికొని వారిని చతుర్విధములయిన*

ఉపాయాలతో వశపరచుకోవాలి. పంచేంద్రియాలను వశపరచుకోవాలి. షడ్గుణాలు తెలిసికోవాలి. సప్తవ్యసనాలూ విడిచిపెట్టాలి. అపుడే రాజు సుఖమును పొందుతాడు. రాజ్యం సుస్థిరంగా ఉంటుంది.

వి : దీనికి సంస్కృతమూలం ఇది
ఏకయా ద్వే వినిశ్చిత్య త్రీం శ్చతుర్భి ర్వశే కురు
పంచ జిత్వా విదిత్వా షట్ సప్త హిత్వా సుఖీభవ

క. **విను మధురాహారంబులు**
గొనుటయుఁ; బెక్కండ్రు నిద్రగూరినయెడ మే
ల్కని యునికియుఁ; గార్యాలో
చనముఁ; దెరువు నడుచుటయును; జన దొక్కనికిన్. 38

అ: విను; మధుర+ ఆహారంబులు = తియ్యని ఆహారపదార్థాలు; కొనుటయును= తినటమూ; పెక్కండ్రు = చాలామంది; నిద్రగూరిన యెడన్ =నిద్రపోతున్న సమయంలో; మేల్కని ఉనికియున్ = ఒక్కడూ మేల్కొని ఉండటం; తెరువునడుచుటయును = బాటవెంట వెళ్లడమూ; (ఇవినాలుగూ) ఒక్కనికిన్ చనదు = ఒక్కడుగా చేయరాదు.

భా : మధురపదార్థాలు తినడమూ; చాలామంది నిద్రపోతూఉంటే మేల్కొని ఉండటమూ; కార్యాన్ని గురించి ఆలోచించడమూ; బాట వెంట వెళ్ళడమూ ఈ నాలుగూ ఒంటరిగా చేయరాదు.

వి : దీని మూలం
ఏకః స్వాదు న భుంజీత ఏకశ్చార్థాన్న చిన్తయేత్
ఏకో న గచ్ఛే దధ్వానం నైకః సుప్తేషు జాగృయాత్

1. మధుర పదార్థాలు ఇతరులకు పెట్టి తాను తినాలి. కొంచెమయినను తగ పంచి కుడువ మేలు అని విదురుడు చెపుతాడు. 'సర్వేజనాస్సుఖినోభవన్తు'. అనే భావం ఇందులో ఇమిడిఉంది. 'వసుధైక కుటంబం' అనే ఉదాత్త భావమునకు ఇది ప్రత్యక్షరూపం.

2. చాలామంది నిద్రపోతూ ఉండగా ఒక్కడూ మేల్కొని ఉండరాదు. అది దుష్ట చింతనకు కారక మవుతుంది.

3. కార్యాలోచన ఒక్కడూ చేయరాదు.

4. బాట వెంట ఒక్కడూ పోరాదు - చోరభయంచేత - ఇది ఆనాటి సాంఘిక వ్యవస్థకు ప్రతిబింబం. ఇపుడూ పరిస్థితిలో మార్పులేదు.

క. **నడవడి యను మున్నీటిం**
గడవం బెట్టంగ నోడ కరణిం దగి తా
నొడఁగూడు నవిన, సత్యముఁ
గడచిన గుణ మింక నొండు గలదే! యరయన్. 39

అ: నడవడి అను మున్నీటిన్ = ప్రవర్తన అనే సముద్రాన్ని; కడవన్ పెట్టంగన్=

దాటించటానికి; ఓడకరణిన్=నావ వలె; తగి=ఒప్పి; తాను ఒడఁగూడున్ అనినన్= ఉపయోగ పడుతుందంటే; సత్యమున్ కడచినగుణము =సత్యాన్ని మించిన గుణము; అరయన్ ఇంకన్ ఒండుకలదే! = పరిశీలించినా మరొకటి ఉందా?

భా : ప్రవర్తన అనే సముద్రాన్ని దాటించటానికి సత్యం నావ వలె ఉపయోగిస్తుంది. అటువంటప్పుడు సత్యాన్ని మించిన సద్గుణం మరొకటి ఉందా?

వి: 1. సత్యం మానవుని ప్రవర్తనను తరింపజేస్తుంది. గౌరవమూ, సంపద మొ॥ సత్యాన్ని అనుసరించి వస్తాయి.

సత్యానుసారిణీ లక్ష్మీ ః కీర్తి స్త్యాగాను సారిణీ
అభ్యాస సారిణీ విద్యా బుద్ధిః కర్మానుసారిణీ అని ఆర్యోక్తి.

2. సత్యసంధత కల్గి పాండవులకు రాజ్యభాగం ఇమ్మని ధృతరాష్ట్రునికి సూచన- లేకపోతే - నావ లాగా ముంచి వేస్తుందని కూడా సూచన లేకపోలేదు. నీ ప్రవర్తనే నిన్ను తరింపజేసినా - ముంచివేసినా - అని భావం.

3. ఈ పద్యానికి సంస్కృత మూలం ఇది

ఏకమేవాద్వితీయం తద్యద్రాజన్నావబుధ్ద్యసే
సత్యం స్వర్గస్యసోపానం పారావారస్య నౌరివ **5-33-46.**

క. క్షమియించు వారిఁ గని చా
లమి వెట్టుదు, రైననుం దలంప ననూన
క్షమయ కడు మెఱయు తొడ,వు
త్తమ రూపము గోరువారు దాల్తురు దానిన్. 40

అ: క్షమియించు. వారిన్కని = క్షమించే వారిని చూసి; చాలమి - పెట్టుదురు = అసమర్థత అంటగడతారు; ఐననున్ = అయినా; తలంపన్ = ఆలోచిస్తే : అనూనక్షమయ = అధికమయిన సహనమే; కడుమెఱయు తొడవు = బాగా ప్రకాశించే ఆభరణం: ఉత్తమ రూపము- కోరువారు = మంచి స్వరూపం కోరుకొనేవారు; దానిన్; తాల్తురు = ధరిస్తారు.

భా: క్షమించే వారిని (సహించేవారిని) చూసి అసమర్థులని అంటారు. అయినా క్షమయే బాగా ప్రకాశించే ఆభరణం. ఉత్తమ వ్యక్తిత్వం కోరుకొనేవారు ఆ సహనాన్ని వహిస్తారు.

వి : 1"క్షమా గుణవతాం బలమ్" సహనం గుణవంతులకు బలం ఇస్తుంది.

నరస్యాభరణం రూపం రూపస్యాభరణం గుణః
గుణస్యాభరణం జ్ఞానం జ్ఞానస్యాభరణం క్షమా.

2. ఏకః క్షమావతాం దోషో ద్వితీయో నోపలభ్యతే
యదేనం క్షమయా యుక్త మశక్తం మన్యతే జనః **5-33-47**

అని దీని మూలము - క్షమాగుణమును గురించి అధిక పాఠములు ఇంకను ఈ క్రింది శ్లోకములున్నవి.

క్షమాగుణో హ్యశక్తానా శక్తానాం భూషణం క్షమా
క్షమా వశీకృతిర్లోకే క్షమయా కిం నసాధ్యతే.

శాన్తి ఖడ్గః కరే యస్య కింకరిష్యతి దుర్జనః
అతృణే పతితో వహ్నిః స్వయమే వోపశామ్యతి. అధిక పాఠము 175

క. పురుషుండు రెండు దెఱఁగుల
ధర నుత్తముఁ డనఁగఁ బరగుఁ; దా నెయ్యెడలం
బరుసములు వలుక కునికిన్,
దురితంబులు వొరయు పనులు దొఱఁగుట కతనన్. 41

అ: పురుషుండు = మానవుడు; ధరన్ = భూమిపై/ప్రపంచంలో; రెండు + తెఱఁగులన్ = రెండు విధాల : ఉత్తముఁడు ; అనగన్ పరగున్ = అనిపించుకొంటాడు; తాను: ఏ + ఎడలన్= ఎప్పుడూ ఎక్కడా; పరుసములు = కఠినపు మాటలు; పలుకక + ఉనికిన్ ; పలకక పోవడం చేతనూ; దురితంబులు + పొరయుపనులు = పాపం పొందే పనులు; తొఱఁగుటకతనన్ = విడిచి పెట్టడం వల్లనూ.

భా : మానవుడు రెండు విధాలుగా లోకంలో ఉత్తముడు అనిపించుకొంటాడు. తానెప్పుడూ ఎక్కడా పరుషంగా మాట్లాడక పోవడం చేతనూ, పాపపు పనులు చేయకపోవడం చేతనూ (ఉత్తము డని పించుకొంటాడు.)

వి : దీని మూలం ఇది.

ద్వే కర్మణీ నరః కుర్వ న్నస్మిన్ లోకే విరోచతే
అబ్రువన్ పరుషం కించి దసతో నార్థయం స్తథా!

ఇందులో మొదటి లక్షణం వాక్కుకూ, రెండవ లక్షణం చేతకూ సంబంధించినది.

ప్రథమ లక్షణం వాక్పారుష్యం పనికిరాదని. వాక్పారుష్యం విషం కంటెనూ అగ్ని కంటెనూ కూడా దారుణమయింది. "మహాదారుణమది విషము కంటె దహనము కంటెన్" అంటాడు నన్నయ (2-2-17)

పరుష వాక్కులు విడిచి మృదువుగా హితంగా ప్రియంగా మాట్లాడాలి మానవుడు. అట్లా మాట్లాడే వానికి అందరూ మిత్రులే. ఎవరితోనూ శత్రుత్వం రాదు." కఃపరః ప్రియవాదినామ్' అన్నారు 'ప్రియవాదికి శత్రువే లేడు.' సత్యం బ్రూయాత్ ప్రియం బ్రూయాత్; నబ్రూయాత్ సత్యమప్రియమ్" (సత్యమే మాట్లాడాలి; కాని సత్యమయినా అప్రియం చెప్పరాదు) అన్న సూక్తిలో ప్రియవాదిత్వం యొక్క ప్రాధాన్యం చెప్పబడుతోంది. "నోరు మంచిదయితే ఊరు మంచి దవుతుంది" అన్న సామెతకూడా ప్రియవాదిత్వం గురించే.

ఇక రెండవ లక్షణం పాపకృత్యాలు చేయకపోవడం. పాపకృత్యం చెయ్యడం అవివేకి లక్షణం. అది పశుతుల్యత. అందుకే మానవుడు ప్రతిదినమూ తన్ను తాను పరిశీలించుకోవాలి "నేను మానవకృత్యం చేస్తున్నానా? లేక పశుకృత్యం చేసి పశువుతో సమానుడ నవుతున్నానా? అని

ప్రత్యహం ప్రత్యవేక్షేత నరశ్చారిత్ర మాత్మనః
కింను మే పశుభి స్తుల్యం కిన్ను సత్పురుషై రితి॥

పాప కర్మలు చేయడానికి ప్రేరకమయ్యేది స్వార్థం. అనగా స్వార్థం ముందు విడిచిపెట్టాలని భావం.

2. ఇక్కడ ఈ లక్షణాలు పురుషులకే కాని స్త్రీలకు కాదు అని అనుకోరాదు. ఇద్దరికీ ఇవి చెల్లుతాయి. స్త్రీ పురుషసామాన్యంగా పురుషపదాన్ని వాడటం ప్రాచీనుల అలవాటు.

తే. చెల్లి యుండియు సైరణ సేయు నతఁడుఁ,
బేదవడియును నర్థికిఁ బ్రియము తోడఁ
దనకుఁ గల భంగి నిచ్చు నతండుఁ, "బుణ్య
పురుషు" లని చెప్పి రార్యులు గురువరేణ్య! 42

అ: కురువరేణ్య! = కురువంశ శ్రేష్ఠుడవయిన ధృతరాష్ట్ర మహారాజా!; చెల్లి యుండియున్ =సమర్థత ఉండి కూడా; సైరణ+చేయు+అతఁడున్= సహనం వహించే వాడూ; పేదవడియునున్=పేదతనం పొంది కూడా; అర్థికిన్=అడిగినవానికి; ప్రియముతోడన్= ప్రీతితో; తనకున్ కల భంగిన్=తనకున్న రీతిగా; ఉన్నంతలో; ఇచ్చు+అతండున్=ఇచ్చేవాడూ; దానం చేసేవాడూ; "పుణ్యపురుషులు" అని; ఆర్యులు=పెద్దలు; చెప్పిరి.

భా: సమర్థుడై యుండికూడా సహనం వహించేవాడూ, పేదవాడయిపోయి కూడా తనకున్నంతలో అడిగిన వానికి ప్రీతితో దానం చేసేవాడూ పుణ్యాత్ములని పెద్దలు చెపుతారు.

వి: దీని మూలం ఇది.

ద్వా విమౌ పురుషౌ రాజన్! స్వర్గస్యోపరి తిష్ఠతః
ప్రభుశ్చ క్షమయా యుక్తో, దరిద్రశ్చ ప్రదానవాన్.

సమర్థుడయిన వానికి సహనం దీప్తినిస్తుంది. ఎవరయినా తనకపకారం చేస్తే దానికి తగిన ప్రతీకారం చేయగలిగి ఉండటం చెల్లియుండటం- అట్లా చెల్లియుండి సహనం వహించడం పుణ్యపురుషుల లక్షణం.

భారత పరమార్థ రూపమయిన ఈ పద్యంలో అదే లక్షణం ఉంది.

ఒరు లేయవి యొనరించిన
నరవర! యప్రియము తన మనంబునకగు ఁదా
నొరుల కవి సేయకునికియె
పరాయణము పరమధర్మ పథముల కెల్లన్. శాంతి-5-220

ఇతరులు తనకుచేసిన పని తనకు అప్రియమయితే అటువంటి పని యితరులకు తాను మళ్లీ చేయకపోవడమే పరమధర్మం. ఇందులో క్షమాగుణం నిండిఉంది. అతడు చెల్లియుండి కూడా సైరణ వహిస్తాడన్నమాట. అహింసా స్వరూపం కూడా ఇందులోనే నిబిడంగా ఉంది.

రెండవ లక్షణం పేదవాడయినా అర్థికి ప్రియంతో తనకున్నంతలో ఇవ్వడం- ఇది దానగుణం- ఈ దానగుణం సహజంగా వచ్చేది. అభ్యాసంతో వచ్చేది కాదంటారు.

దాతృత్వం ప్రియవక్తృత్వం ధీరత్వ ముచితజ్ఞతా
అభ్యాసేన నలభ్యేయుః చత్వారః సహజాగుణాః

ఉన్నవారందరూ వితరణగుణం కలిగి ఉండరు- లేనివాళ్ళు కూడా వితరణ గుణం కలవా రుంటారు. దానికి కలిమిలేములు కావు ప్రధానం. ఆ స్వభావం ప్రధానం. అయితే దానం ఇచ్చేసొమ్ము న్యాయార్జితమయిన సొమ్ము అయి ఉండి ప్రతి గ్రహీత (పుచ్చుకొనేవాడు) పాత్రుడై అర్హుడై ఉండాలి. "ఇచ్చుచోట పాత్ర మెఱుగ వలయు" నని శాంతిపర్వం ఘోషిస్తోంది. పాత్రులయిన వారికి ఇవ్వకపోవడమూ తప్పే. అపాత్రులకు ఇవ్వడమూ తప్పే. "పాత్రమెరిగి దానం చెయ్యాలి. క్షేత్రమెరిగి విత్తనం చల్లాలి" అనే సామెత కూడా ఈ భావాన్నే ప్రస్ఫుటంచేస్తుంది.

ఈ దానంలో పరోపకార స్వభావం మాత్రమే కాదు. మరోమూల సూత్రం కూడా ఇమిడి ఉంది. మమకారం బంధహేతువు. నిర్మమత్వం మోక్షహేతువు. దానం చెయ్యడం అంటే మమకారం విడవడమే. నాది అనుకొనే వస్తువును ఇతరులకు ఇవ్వడం జరుగుతోంది. పైగా ఇచ్చేటప్పుడు తుభ్య మహం సంప్రదదే-నమమ (నీకు నేను ఇస్తున్నాను. ఇందులో ఇక నా సొంతం ఏమీ లేదు) అంటూ ఇస్తున్నాము. అనగా మమకారాన్ని విడిచిపెడుతున్నాం.

ఇందులో మమకార త్యాగం ఇమిడి ఉన్నట్లే చేసే తీరులో అహంకార త్యాగం ఇమిడి ఉంది. చేసే దానం శ్రద్ధతో చెయ్యాలి. ప్రీతిగా హితంగా మాట్లాడుతూ చెయ్యాలి. అందుకే "ప్రియముతోడ" తనకుగల భంగి ఇవ్వాలన్నాడు. అశ్రద్ధగా ఎన్నడూ చేయరాదు. శక్తికి లోపం లేకుండా చెయ్యాలి. అదే తనకుగల భంగి "ఇవ్వాలనడం".ఇంతకంటె ఇవ్వలేక పోతున్నాను అని సిగ్గుపడుతూ దానం చెయ్యాలి. ఈ శరీరం క్షణభంగురం. రేపటి ఉనికి అనుమానం కనుక భయపడుతూ దానం చెయ్యాలి. అనగా వాయిదా పడనీయకుండా వెంటనే చెయ్యాలి. ఏ విఘాతం కలుగుతుందో అనే భయంతో వెంటనే చెయ్యాలి. ఈ విషయమే ఉపనిషత్తులలో ఇలా శాసింపబడింది.

శ్రద్ధయా దేయమ్- అశ్రద్ధయా2 దేయమ్
శ్రియా దేయమ్ - హ్రియా దేయమ్
భియా దేయమ్ - సంవిదా దేయమ్.

ఈ భావంలో మమకార త్యాగంతో పాటు అహంకార నిరాసమూ ఉంది. (నేనెంతవాడను దానం చెయ్యడానికి అని సిగ్గుపడటంలో) అహంకారం మమకారం రెండూ అంతరిస్తేనే కాని ముక్తి సాధ్యం కాదు. అనగా ముక్తి సౌధానికి ఈ వితరణగుణం సోపాన ప్రాయ మన్నమాట.

ఇటువంటి పుణ్యపురుష లక్షణం అలవరచుకొని పాండవులను చేరదీసి సుఖంగా బ్రతికి ఉత్తము డనిపించు కొమ్మని విదురుడు వ్యంగ్యంగా ధృతరాష్ట్రునికి హితబోధ చేస్తున్నాడు.

ఆ. పాడి దప్పకుండఁ బడయు సొమ్ములకు న
పాత్రములకు నీగి, పాత్రములకుఁ
బెట్టకునికి, యనఁగ నెట్టన రెండు వి
ధములఁ గీడు తొడరు ధరణి నాథ! **43**

అ: ధరణినాథ=రాజా!; పాడి తప్పకుండన్=న్యాయం తప్పకుండా; పడయు=పొందే; సొమ్ములకున్=ధనానికి; అపాత్రములకున్-ఈగి=అనర్హులకు ఇవ్వడమూ; పాత్రులకున్+పెట్టక-ఉనికి=అర్హులకు ఇవ్వకపోవడమూ; అనఁగన్= అనేటట్లు; నెట్టనన్=పూర్తిగా; రెండు విధములన్; కీడు తొడరున్=నష్టం కలుగుతుంది.

భా: న్యాయార్జితమయిన ధనానికి రెండు విధాల కీడు కలుగుతుంది. 1. అపాత్రులకు ఇవ్వడం చేతనూ; 2. పాత్రులకు ఇవ్వకపోవడం చేతనూ.

వి: దీని మూలం ఇది.

న్యాయా గతస్య ద్రవ్యస్య బోద్ధవ్యౌ ద్వావతిక్రమౌ

అపాత్రే ప్రతి పత్తిశ్చ పాత్రేచాప్రతిపాదనమ్- 5-33-54

న్యాయంగా సంపాదించిన సొమ్ము- అనగా ధర్మపూర్వకంగా సంపాదించిన అర్థం.- పురుషార్థాలు ధర్మపూర్వకంగా సాధించాలిట. అర్థంకాని కామం కాని ధర్మపూర్వకంగా సాధించాలి. న్యాయార్జితం కాని సొమ్ము దానం చేస్తే అది "కాకుల్ని కొట్టి గ్రద్దలకు వేసినట్లే" అవుతుంది. అన్యాయార్జిత మైన విత్తనమున చేయంబూను దానం బది మూర్ఖన్యాయం బగు - దాన నేమి ఫలం లేదంటాడు ఎఱ్ఱన- ఆరణ్యపర్వంలో - అందుచేత సంపాదన న్యాయపూర్వకంగా ఉండాలి. అటువంటి సొమ్ము పాత్రులకు దానం చెయ్యాలి. అపాత్రులకు ఇవ్వకూడదు. పాత్రత అంటే ఏమిటి అనే విషయంలో భారతం ఆనుశాసనిక పర్వం ఇలా చెపుతుంది. సద్ధర్ములు, అక్రోధనులు, సత్యరతులు, దాంతులు, ధీరులు, నిజకర్మనిరతులు, విజితేంద్రియులు, సర్వభూతహితులు, అలుబ్ధులు, శుచులు, అయిన వారు పాత్రులు. అందునా శ్రుతము, ప్రజ్ఞ శీలము కల వారికివ్వడం ప్రశస్తం అంటారు. పాత్రుడు దొరికితే తప్పక దానం చెయ్యాలంటారు. అట్లా చెయ్యకపోతే కూడా దోషమే. పాత్రుడికి ఇవ్వకుండా తాను అనుభవించకుండా దాచినసొమ్ము దొంగ పాలవుతుంది. డబ్బుకు మూడేగతులు.

దానము భోగము నాశము
పూనికతో మూడుగతులు భువి ధనమునకున్
దానము భోగము నెఱుఁగని
దీనుని ధనమునకు గతి తృతీయమె పొసగున్.

అందుకే పాత్రుడికి తప్పకుండా ఇవ్వాలనడం.

ఇక అపాత్రదానం కూడా మంచిదికాదు. వ్యసనపరుడికి దానం చేస్తే దానివల్ల అతని దుర్వ్యసనాలను ప్రోత్సహించడమే అవుతుంది కాని ఆ సొమ్ము సద్వినియోగం కాదు. అదికూడా సొమ్ము వమ్ము అయినట్లే.

కథా సంబంధిగా ధృతరాష్ట్రుడు ఇపుడు రెండు తప్పులు చేస్తున్నాడు. పాత్రులయిన పాండవులకు రాజ్యం ఇవ్వలేకపోతున్నాడు. అపాత్రులకు మానలేక పోతున్నాడు. అందుకే అతని ధనానికి అంత కీడు మూడింది. అంతేకాదు ఎంతోమందిని పొట్టన పెట్టుకుంది కూడా.

ఈ స్వభావం వల్ల నీకు కూడా చేటు కలుగుతుందని విదురుని వ్యంగ్యబోధ.

తే. వెలఁది, జూదంబు, పానంబు, వేఁట, పలుకు
ప్రల్లదంబును, దండంబుఁ బరుసఁదనము,
సొమ్ము నిష్ప్రయోజనముగ వమ్ముసేత,
యనెడు సప్త వ్యసనములఁ జనదు తగుల. 44

అ: వెలఁది=స్త్రీ; జూదంబు; పానంబు=మద్యపానమూ; వేఁట; పలుకు ప్రల్లదంబును = కఠినంగా మాట్లాడటమూ; దండంబు + పరుస దనమున్ = దండించడంలో కాఠిన్యమూ; సొమ్ము = ధనం; నిష్ప్రయోజనముగన్ = నిష్కారణంగా; వమ్ము + చేఁత = నశింపజేయడం; ఖర్చుపెట్టడం ; అనెడు; సప్తవ్యసనములన్ = ఏడు వ్యసనాలను; తగులన్ + చనదు + తగులుకోరాదు - విడిచిపెట్టాలి.

భా: *పరస్త్రీ సంగమం, జూదం, త్రాగుడు, వేట, కఠినంగా మాట్లాడటం, కఠినంగా శిక్షించడం, అనవసరంగా డబ్బు ఖర్చు పెట్టడం, - అనేవి సప్త వ్యసనాలు. వీటిని మానవుడు విడిచిపెట్టాలి.*

వి: దీని మూలం ఇది

సప్తదోషా స్సదా రాజ్ఞా హాతవ్యా వ్యసనోదయాః
ప్రాయశో యై ర్వినశ్యన్తి కృతమూలాశ్చ పార్థివాః
స్త్రియోక్షా మృగయా పానం వాక్పారుష్యం చ పంచమమ్
మహచ్చ దండ పారుష్య మర్థదూషణ మేవచ.

వ్యసనం అనేది చిత్త సంయమనం లేకపోవడం వల్ల ఏర్పడుతుంది. మనస్సు మొదటి నుండీ ఒకగాడిలో పడిపోతూ ఉంటే అది మరోగాడిలో పడటం గాని, గాడి తప్పడం కాని జరగదు. అందుకే మానవునికి చిన్నతనం నుండీ సక్రమనియమాచరణం ముఖ్యం. నియమబద్ధమైన జీవితం గడిపేవాని మనస్సు సామాన్యంగా క్రమం తప్పదు తప్పితే విచ్చలవిడి అవుతుంది. అదే వ్యసనంగా పరిణమిస్తుంది.

భారతీయతకు విశిష్టతను చేకూర్చినది ఏకపత్నీవ్రతత్వం. దాన్ని మీరితే మొదటి వ్యసనంలో పడినట్లే. రెండవది కూడా (జూదం) మానసిక స్థిరత లేనందువల్ల ఏర్పడేదే. వ్యసనాలన్నిటికీ మానసిక స్థిరత లేకపోవడమే కారణం.

వెలది:

మొదటి వ్యసనం వెలది. అనగా పర స్త్రీ వ్యామోహం. మానవుని జీవ లక్షణాలు విభిన్నాలుగా ఉంటాయి. ఒక్కొక్క వ్యక్తి ప్రవృత్తి ఒక్కొక్క విధంగా ఉంటుంది. విభిన్న మనః ప్రవృత్తుల్ని క్రోడీకరించి అందులో మానవునికి శత్రువులయిన ప్రవృత్తుల్ని వింగడించి వాటిని అరిషడ్వర్గం అన్నారు. అవి కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలు. అందులో ప్రథమమూ ప్రధానమూ అయింది కామము. చివరి దయిన మాత్సర్యంతో దుర్యోధనుడు చెడిపోయాడు. మొదటిదయిన కామంతో రావణుడు చెడిపోయాడు. వీళ్ళు చెడిపోవడమే కాకుండా ఇద్దరూ తమతో ఉన్న వారి నందరినీ చంపుకున్నారు. ఒక్కని దుర్వ్యసనం అంత ప్రజావినాశానికి దారి తీసింది.

జూదంబు:

జూదం ఆడటం అనేది రెండో వ్యసనం. ఈ జూదంతో మోసపోయి రాజ్యాలనే పోగొట్టు కొన్నవారు నలుడూ, ధర్మరాజూను. ఈ వ్యసనం వల్ల మానవుడు తాత్కాలికోద్రేకాన్ని పొంది మోహపడి మోసపోతాడు. అదే జరిగింది నలునికీ ధర్మరాజుకూ. అందుకే జూదం వైపు

పోగూడదు. దాని తలపు రానీయకూడదు అంటారు. దాని తలపు కూడా మోసపోయేందుకు దారి ఏర్పరుస్తుంది.

పానంబు :

మద్యం సేవించడం, ఇది కూడా మనస్సుకు మోహమూ, అజ్ఞానమూ కలిగిస్తుంది. పూర్వం ఉన్న జ్ఞానం కూడా నశింపజేస్తుంది. శుక్రాచార్యుని కథ దీనికి తార్కాణం.

వేట :

ఇది హింసా ప్రధానమయింది. దానివల్ల యుక్తాయుక్త విచక్షణ కోల్పోతాడు మానవుడు. బుద్ధి పొరబడేందుకు కారణమవుతుంది ఈ వేట. దశరథుని వృత్తాంతం దీనికి నిదర్శకం.

పలుకుప్రల్లదంబు:

అనగా వాక్పారుష్యం. మాటలలో కాఠిన్యమూ, తీవ్రతా పనికిరావు. వాక్పారుష్యం 'మహాదారుణమది విషము కంటె దహనముకంటెన్' అంటారు నన్నయ. అందులో రాజుకు వాక్పారుష్యం అసలే పనికిరాదంటాడు. ద్రుపదుని వాక్పారుష్యం రెండు తరాలు దహించివేసింది. వాక్పారుష్యంతో ద్రుపదునికి ద్రోణునితో ఉన్న స్నేహం వైరంగా మారిపోయింది. సభలో కర్ణుని, దుశ్శాసనుని వాక్పారుష్యం అర్జునుడికి తీర్చరాని అప్పువలె హృదయ శల్యమయి బాధిస్తోంది. అంటాడు కృష్ణుడు. కృష్ణునికీ శల్యునికీ ఇంకా చాలమందికి కర్ణుని మాటలు బాధాకరము లయ్యాయి. అందుచేత వాక్పారుష్యం పదిమందితో విరోధం తెచ్చిపెడుతుందన్నమాట.

దండంబుఁబరుసదనము:

శిక్షలో పారుష్యం, కాఠిన్యం. శిక్ష తీవ్రమయి ప్రాణాలకే ముప్పుతేరాదు. శిక్ష మానసిక పరివర్తనకు అవకాశం కల్పించాలి. దోహదం చెయ్యాలి అంతేకాని దండనం పరుషంగా ఉండరాదు.

సొమ్ము నిష్ప్రయోజనముగ వమ్ముసేత:

అనవసరంగా డబ్బు ఖర్చుపెట్టడం, ధన వ్యయం సప్రయోజనమైనది కావాలి. రాజు చేసే ధనవ్యయం ప్రజలందరకూ ప్రయోజనకారి కావాలి. అంతే కాని వృథ కాకూడదు. అందుకే ఎక్కువ సంపాదించడం కాదు, సక్రమంగా ఖర్చుపెట్టడం తెలివి అనిపించుకుంటుంది. ఈ వ్యసనాలు రాజుకే కాదు, ఏ మానవునికీ తగనివి. వీనిలో చాలా విడిచిపెట్టాలి కౌరవులు అని విదురుని వ్యంగ్యహితవు.

తే. తగిన వేషంబుఁ, దనుఁ దాన పొగడుకొనమి,
నొచ్చియును గీడు పలుకమి, యిచ్చి వగవ
కునికి, దనకెంత నడవక యున్నఁ బథము
దప్పకుండుట, నడవడి కొప్పుసేయు. 45

అ: తగిన వేషంబున్ = తనకు తగిన వేషమూ; తనున్ తాన పొగడుకొనమి = తనను తానే పొగడు కొనకుండుట; నొచ్చియును = బాధపడికూడా; కీడు+పలుకమి = నిందింపక పోవడం; ఇచ్చి = దానం చేసి, తర్వాత; వగవక + ఉనికి = బాధపడకపోవడం; తనకున్+ ఎంత

నడవక - ఉన్నన్ = తనకెంత గడవక పోయినా; పథము తప్పకుండుట = నీతి మార్గం విడిచిపెట్టకపోవడమూ; (ఇవి) నడవడికిన్ = ప్రవర్తనకు; ఒప్పు + చేయున్ = మేలు కలిగించును.

భా: *తన స్థితికి తగిన వేషం ధరించడమూ; తనను తాను పొగడుకోకపోవడం; తాను బాధపడి కూడా ఆ బాధపెట్టిన వారిని నిందింపకపోవడం; ఒకరికి దానం చేసి తరువాత బాధపడకుండా ఉండటం; తనకెంత గడవక పోయినా నీతిమార్గం తప్పకపోవడం- అనేవి మానవుని ప్రవర్తనకు మేలు కలిగిస్తాయి.*

వి: దీని మూలం ఇది.

యో నోద్ధతం కురుతే జాతు వేషం నపౌరుషేణాపి వికత్థతే2 న్యాన్
న మూర్ఛితః కటుకాన్యాహ కించిత్ ప్రియం సదా తం కురుతే జనో2పి
దత్వా నపశ్చా త్కురుతే2 నుతాపం నకత్థతే సత్పురు షార్య శీలః

క. **చెలిమియు, సంభాషణమును,**
బలిమి, వివాదంబుఁ, ద్రోపుఁ, బాడియుఁ, దమయం
తల వారితోన తగు; నధి
కుల హీనులతోడ నైనఁ గొఱగా దధిపా! 46

అ: అధిపా= రాజా!; చెలిమియున్ = స్నేహమూ; సంభాషణమును; బలిమి = బలప్రయోగమూ; వివాదంబున్ = సంవాదమూ; త్రోపున్ = యుద్ధమూ; పాడియున్ = న్యాయమూ/ ధర్మమూ; తమయంతల వారితోన తగున్; అధికుల, హీనులతోడన్ ఐనన్ = గొప్పవారితోనూ తక్కువ వారితోనూ అయితే; కొఱగాదు = పనికిరాదు.

భా: *స్నేహమూ, సంభాషణమూ, బలప్రయోగమూ, సంవాదమూ, యుద్ధమూ, న్యాయమూ అనే ఆరూ తమతో సమానులయిన వారితోనే తగును. ఎక్కువ వారితోనూ తగదు. తక్కువ వారితోనూ తగదు.*

వి: స్నేహం అనేది సమాన స్వభావం కలవారికి కలుగుతుంది. అలాగే వివాహం వివాదం కూడా సమానులకే శోభిస్తాయి. "సమశీల శ్రుతయుతులకు సమధనవంతులకు, సమసుచారిత్రులకున్...తమలో సఖ్యమువివాహము నగునని (1-5-205) నన్నయ గారంటారు. అధికులకు హీనులకు చెల్లకపోవడానికి ద్రుపదద్రోణుల వృత్తాంతం ఉదాహరణం. అధికత్వం హీనత్వం అనేవి ధనం, పాండిత్యం, రాజ్యం మొ॥ వాటిని బట్టి నిర్ణయింప బడతాయి. ఈ శ్లోకానికి మూలం ఇది.

సమైర్వివాహం కురుతే నహీనైః సమైఃసఖ్యం వ్యవహారం కథాశ్చ
గుణైర్విశిష్టాంశ్చ పురో దధాతి విపశ్చిత స్తస్య నయా స్సునీతాః 5-33-98

తే. **కొంచె మైనను దగఁ బంచి కుడువ మేలు;**
పనుల యెడ దుఃఖ మోర్చి, యల్పంబు సుఖము
ననుభవించుట హితము; శత్రునకు నైన
నిచ్చుటయ లెస్స యడిగిన యెడ, నృపాల! 47

అ : నృపాల! = రాజా!; కొంచెము + ఐనను = కొద్దిగా ఉన్నా; తగన్ = తగునట్టు; పంచి=పంచుకొని; కుడువన్ మేలు=తినడం మంచిది; పనుల యెడన్=కార్యం పట్ల; దుఃఖము+ ఓర్చి = చాలా దుఃఖం సహించుకొని; అల్పంబు సుఖము = కొద్ది సుఖాన్ని ; అనుభవించుట; హితము = మంచిది. అడిగిన - ఎడన్ = అడిగినప్పుడు = శత్రునకున్ + ఐనన్ = శత్రువుకయినా; ఇచ్చుటయ లెస్స = ఇవ్వడమే మంచిది.

భా: ఉన్న వస్తువు కొద్దిగా ఉన్నా దాన్నే పంచుకొని తినడం మేలు. పనుల విషయంలో ఎక్కువ దుఃఖం ఓర్చుకొని తక్కువ సుఖం అనుభవించడం మంచిది. అడిగినపుడు శత్రువు కయినా ఇవ్వడం మంచిది.

వి: దీని మూలం ఇది

మితం భుంక్తే సంవిభజ్యాశ్రితేభ్యో మితం స్వపి త్యమితం కర్మ కృత్వా
దదా త్యమిత్రేష్వపి యాచితస్సన్ తమాత్మవంతం ప్రజహా త్యనర్థాః

తన వారందరికీ పెట్టి తాను మితంగా భుజించాలి. లఘువుగా భుజించిన వానికి ఆయువు ఎక్కువ ఉంటుంది.

పదిమందికి పెట్టడంలో ఒక విధమయిన తృప్తి ఉంటుంది. అది అనుభవైక వేద్యం. ఆ తృప్తి మరి దేని వల్లా కలగదు.

క. **తను లోకము గొనియాడఁగ**
విని యుబ్బఁడు సజ్జనుండు; వెండియుఁ గడు మే
లొనరించుఁ, గీ డొకించుక
యును దనదెసఁ దోఁపనీక యుడుపుచు వచ్చున్. 48

అ: తనున్ = తనను; లోకము; కొనియాడఁగన్ విని = ప్రశంసిస్తే విని; సజ్జనుండు; ఉబ్బడు = ఉబ్బిపోడు; వెండియున్ = పైగా/ఇంకా; కడున్ మేలు + ఒనరించున్ =చాలా మేలు కలిగిస్తాడు; కీడు = నష్టం / అనర్థం; ఒకించుకయును = ఏ మాత్రమూ; తనదెసన్ = తన పక్షాన; తోఁపనీక = కనపడనివ్వక; ఉడుపుచున్ - వచ్చున్ = తొలగిస్తూ వస్తాడు.

భా: తనను లోకులు ప్రశంసిస్తే విని సజ్జనుడు ఉబ్బిపోడు; పైగా ఎంతో మేలు చేకూరుస్తాడు. తన పక్షాన కీడు ఏ మాత్రమూ తోచనీయకుండా ప్రవర్తిస్తాడు.

వి: **న హృష్య త్యాత్మ సమ్మానే నావమానేన తప్యతే**
గాంగో హ్రద ఇవాక్షోభ్యో యస్సపండిత ఉచ్యతే.

ముఖస్తుతికి లొంగని వారుండరు సామాన్యంగా - కాని సజ్జనుడు ముఖస్తుతికి ఉబ్బిపోడు. అవమానానికి కుంగిపోడు. నిర్మలమూ నిత్యమూ అయిన గంగా నది లాగా నిండుగా నిష్కలుషంగా ఉంటాడు. చక్కని ఉపమానం - ఎందుకో తిక్కన వదలివేశారు.

వ: **ఇట్టి చందంబులు ధర్మనందనునకుం గలవని పలికి, విదురుం డది ప్రసంగంబుగాఁ బాండవులఁ బ్రశంసించి, నీవు వారలం బెనిచి మానుసులం జేసి రక్షించి, యిప్పు డుపేక్షించి, వారలు వెలినుండ నూరకుండం దగునే!, తగుపాలిచ్చి వారి రావించి**

నీ కొడుకుల తోడి వారింగా నడపుట యుచితంబు; మీరును వారును నొక్కటి యైయున్న మీదిక్కు దేవతలకుం దేఱిచూడరా" దనిన నమ్మాటలు వెడ వెడ యూఁకొని ధృతరాష్ట్రుండు విదురున కిట్లనియె. **49**

అ: చందంబులు = పద్ధతులు/ లక్షణాలు; పెనిచి =పెంచి; మానుసులన్ - చేసి= పెద్దవారిని చేసి; వెలిన్ + ఉండన్ = బయట ఉండగా; పాలు = (రాజ్య) భాగము; వెడవెడ = మెల్ల మెల్లగా; కొద్ది కొద్దిగా; ఊకొని = ఊఁ అని విని

భా: *ఇటువంటి లక్షణాలు ధర్మరాజుకు ఉన్నాయి అని చెప్పి విదురుడు అది సందర్భంగా చేసుకొని పాండవులను కొనియాడి నీవు వారిని ఉపేక్షించడమూ; దానితో వారు ఎక్కడో బయట ఉంటే నీవు మాట్లాడకపోవడమూ మంచిదికాదు. వారికి తగిన రాజ్యభాగం వారికిచ్చి ఇక్కడకు రప్పించి. నీ కొడుకులతో సమానంగా చూసుకోవడం మంచిది. మీరు వారు ఏకమై ఉంటే మీవైపు దేవతలు కూడ తేరిపారి చూడలేరు అన్నాడు. ధృతరాష్ట్ర డామాటలు ఇష్టంలేకపోయినా కొద్దిగా విన్నట్లు నటించి విదురునితో ఇలా అన్నాడు.*

వి: పూర్వపద్యంలో సజ్జన లక్షణాలు చెప్పాడు. అవన్నీ ధర్మరాజులో ఉన్నాయి. నీవు వారిని ప్రశంసిస్తూ సంజయుని పంపినంత మాత్రాన ధర్మజు డుబ్బిపోడని సూచన.

తే. హితముఁ గర్తవ్యమును నాకు నెఱుఁగు దీవ,
ధర్మసుతు చందమును విదితంబు నీకు;
నట్లు గావున నెఱిఁగింపు మఖిల కార్య
జాతమును జిత్తతాపోప శమము గాఁగ. **50**

అ: నాకున్ హితమున్ = నాకు హితమయినదీ; కర్తవ్యమున్ = చేయదగిన పనీ; ఈవ = నీవే; ఎఱుఁగుదు = ఎరుగుదువు; ధర్మసుతు చందమును = ధర్మరాజు పద్ధతీ; నీకు విదితంబు = నీకు తెలుసు; అట్లు కావునన్ = అందుచేత; చిత్తతాప + ఉపశమము కాఁగన్ = మనస్తాపం తగ్గేటట్లుగా; అఖిల కార్య జాతమును = చేయవలసిన పనులన్నీ; ఎఱిగింపుము.

భా: *నాకు హితమేదో కర్తవ్యమేదో నీకే తెలుసు. ధర్మరాజు పద్ధతీ నీకు తెలుసు. అందుచేత నా మనస్సులోని తాపం తగ్గేటట్లుగా చేయదగిన పనులన్నీ చెప్పుము.*

వి: 1. హితమూ కర్తవ్యమూ ఈ రెంటికీ నిజానికి తేడా ఉండరాదు. అయినా ధృతరాష్ట్రుని చేత రెండూ వేర్వేరుగా చెప్పించారు తిక్కనగారు. అనగా ధృతరాష్ట్రుని హితానికీ కర్తవ్యానికీ తేడా కన్పడుతుందని తిక్కన సూచన.

2. నీవు చెప్పే మాటలు నాకు మనస్తాపం పెంచరాదు - తగ్గించాలి కాని - అనడంలో ధృతరాష్ట్రుని బుద్ధి సూక్ష్మత గోచరిస్తుంది. ఇంతకు ముందు వచనంలో ధృతరాష్ట్రునికి మనస్తాపం కలిగించేటట్లు విదురుడు మాట్లాడాడని భావం.

క. అనుడు విదురుఁ డాతనికి
ట్లను; "నిమ్మెయి నన్ను నొత్తి యడిగినఁ జెప్పం

జను; నున్నరూపు సెప్పెద;
విను మవధానంబు తోడ విమల విచారా!" 51

అ: అనుడున్ = అనగానే; విదురుఁడు; ఆతనికిన్; ఇట్లు, అనున్; విమలవిచారా!= నిర్మలమయిన ఆలోచన కలవాడా!; ఈ + మెయిన్ = ఈ విధంగా; నన్నున్; ఒత్తి అడిగినన్ = గట్టిగా అడిగితే; చెప్పన్ చనున్ = చెప్పవచ్చును; ఉన్న రూపు + చెప్పెదన్ = యథార్థం చెపుతాను; అవధానంబుతోడన్ + వినుము = శ్రద్ధగా విను.

భా: *అపుడు విదురుడు ధృతరాష్ట్రునితో ఇలా అన్నాడు. నిర్మలమయిన ఊహకల మహారాజా! నన్ను నీవు ఇంతగా అడుగుతున్నావు కాబట్టి చెప్పదగును. వాస్తవం చెపుతాను. శ్రద్ధగా విను.*

వి. 1. విమల విచారా అన్న సంబోధనం సముచితంగా ఉంది. మనస్సులోని కాలుష్యం విడిచి మనస్సు నిర్మలం చేసుకొని ఆలోచించుమని విదురుని మనవి.

2. ఏ విషయమయినా అడగినిదే చెప్పరాదుట అట్లా చెపితే చులకన అవుతారు చెప్పిన వాళ్లు. ఎదుటివాడు అడిగాడు అంటే శ్రద్ధ ఏర్పడిందని భావం - అపుడే చెప్పాలి.

"నాపృష్టః కస్యచిత్ బ్రూయాత్" అని ఆర్యోక్తి.

3. అసలు దీని మూలం ఇది.

అపృష్ట స్తస్యతద్బ్రూయాత్ యస్య నేచ్ఛేత్ పరాభవమ్ 5-34-4

అన్నదానికి "నా పృష్టః కస్యచిద్బ్రూయాత్" అనేది పాఠాంతరం

ఉ: డక్కెను రాజ్య మంచు నకటా! యిటు దమ్ముని భాగ మీక, నీ
వెక్కటి మ్రింగఁజూచె; దది యె ట్లరుగున్? విను; మీను లోలతన్
గ్రక్కున నామిషంబుచవి గాలము మ్రింగిన చాడ్పు సూవె; యి
ట్లుక్కివుఁడైన నీకొడుకు నుల్లము నున్నటు లాడఁగూడునే? 52

అ : అకటా! =ఆహా!; రాజ్యము; డక్కెను + అంచు = దక్కింది కదా అనుకొని; ఇటు తమ్ముని భాగము; ఈక=ఇవ్వక; నీవు; ఎక్కటి = ఒంటరిగా ఒక్కడవూ; మ్రింగన్ చూచెదు= మ్రింగాలనుకొంటున్నావు; అది ఎట్లు అరుగున్?= అది ఎట్లా అరుగుతుంది?; విను; మీను = చేప; లోలతన్ =ఆసక్తితో/ఆశతో; గ్రక్కునన్ = ఒక్కసారిగా; ఆమిషంబు చవిన్= గాలాని కంటించిన మాంసపురుచితో; గాలము మ్రింగిన చాడ్పు చూవె= గాలమే మ్రింగినట్లు; చూడు-ఇట్లు; ఉక్కివుడు+ఐన = మూర్ఖుడూ బుద్ధిహీనుడూ అయిన; నీకొడుకు+ఉల్లము= నీ కొడుకు మనస్సు; ఉన్నటులు = ఉన్నట్లుగా; ఆడన్ కూడునే = చెప్పవచ్చునా?

భా: *ఆహా! రాజ్యం దక్కింది కదా అని తమ్ముని రాజ్యభాగం ఇవ్వకుండా నీవొక్కడవే మ్రింగివేయాలని చూస్తున్నావు. అది నీకు ఎట్లా అరుగుతుంది? దీనికొక ఉదాహరణం చెపుతావిను. చేప మాంసం మీది రుచితో గాలాన్నే మ్రింగి వేసినట్లు అవుతుంది. మోసగాడు బుద్ధిహీనుడూ అయిన నీ కొడుకు మనసులో ఉన్నదంతా నెరవెరుతుందా? అతడి మనసుకు అనుగుణంగా నీవు మాట్లాడదగునా?*

వి: ఇక్కడ ఉపమానం చక్కనిది. సందర్భోచిత మయినది.

క. **అన విని నిరుత్తరుం డయి**
మనుజేంద్రుఁడు గొంతసేపు మ్రాన్పడి, తలఁపుల్
పెనఁగొన, నిద్రాహానిం
దను వలయఁగ విదురుతోడఁ దా నిట్లనియెన్. 53

అ: అనన్ విని = విదురుడు చెప్పగా విని; మనుజ + ఇంద్రుఁడు = రాజు ధృతరాష్ట్రుడు; కొంతసేపు; మ్రాన్పడి = కొయ్యబారి; నివ్వెరబోయి; తలంపుల్ = ఊహలు; పెనగొనన్ = పెనవేసుకుపోగా; నిద్రాహానిన్ =నిద్రలేకపోవడం చేత; తనువు =శరీరం; అలయఁగన్= అలసిపోగా; తాను; విదురుతోడన్; ఇట్లు; అనియెన్.

భా: *విదురుని మాటలు విని ధృతరాష్ట్రుడు కొంతసేపు నివ్వెరబోయి ఏవేవో ఊహలు మనసులో పెనవేసుకొని పోగా, నిద్ర లేకపోవడం చేత శరీరం అలసిపోతే అపుడు విదురునితో ఇలా అంటున్నాడు.*

వి: 1. విదురుడు ఇంత కఠినంగా నిష్ఠురంగా మాట్లాడతాడని ధృతరాష్ట్రుడు ఊహించలేదు. అందుకే అతడు మ్రాన్పడినాడు.

2. అయినా ధృతరాష్ట్రుడు సంబాళించుకోగల ధైర్యమూ స్థైర్యమూ కలవాడు. కావుననే మరల విదురునితో ఇలా అనగల్గుతున్నాడు.

క. **ఇందాఁక నీదు పలుకుల**
డెందము తాపంబు గొంత డిందుపడియె; నా
కుం దగ నయానయంబుల
చందంబులు సెప్పుచుండు సౌజన్యనిధీ! 54

అ: సౌజన్యనిధీ! = సుజనత్వానికి నిలయ మయినవాడా! విదురా!; ఇందాక = ఇంతవరకూ; నీదు పలుకులన్ = నీ మాటల చేత; డెందము తాపంబు = మనస్తాపం; కొంత; డిందుపడియెన్ = తగ్గింది; నాకున్; తగన్ = తగునట్లు; నయానయంబుల చందంబులు = నీతి, అవినీతుల పద్ధతులు; చెప్పుచుండు;

భా: *సుజనమణి అయిన విదురా! ఇప్పటిదాకా నీ మాటల వల్ల నా మనస్తాపం కొంత ఉపశమించింది. నీతి, అవినీతుల యొక్క రీతులు చెపుతూ ఉండు ఇంకా.*

వి: విదురుడు నీతులు చెపుతూ మధ్యలో సందర్భవశాత్తు ధర్మజుని గూర్చి చెప్పి ధృతరాష్ట్రుని దుర్మార్గాన్ని బయట పెట్టాడు. 52వ పద్యంలో. దానికి ఏమీ చెప్పలేక ధృతరాష్ట్రుడు గ్రుక్కతిప్పుకొని మళ్లీ ఇలా అన్నాడు. నీతి విషయాలు చెప్పుకాని ఇతరమయిన దృష్టాంతాలు వద్దని సూచన.

వ: **అనిన విని విదురుం డిట్లనియె.** 55

భా: *ఆ మాటలు విని విదురుడు ఇలా అన్నాడు.*

ఆ: **తనియఁ బండకుండ మును గోసికొనఁ జవి**
చేటెకాదు విత్తుచేటుఁ గలుగుఁ;
బక్వమైనఁ గొనిన ఫల మించుఁ, జెడదు బీ
జంబుఁ; గార్యసిద్ధి చందమిట్లు. **56**

అ: తనియన్ పండకుండన్ = పూర్తిగా పండకుండా; మును = ముందుగానే, కోసికొనన్ = కోసుకొంటే; (పండు) చవిచేటెకాదు = రుచికి మాత్రమే చేటు కాదు; విత్తుచేటున్; కలుగు = విత్తనానికి కూడా చేటు కలుగుతుంది; పక్వమైనన్ కొనినన్ ఫలము = పండిన పండు కోసుకొంటే; ఇంచున్ = రుచిగానూ ఉంటుంది; చెడదు బీజంబు = విత్తనమూ చెడిపోదు; ఇట్లు; కార్య సిద్ధి చందము = కార్యం సిద్ధించే పద్ధతి ఉంటుంది.

భా: సరిగా పండకుండా పండును ముందుగానే కోసి వేస్తే రుచీ బాగా ఉండదు. విత్తనానికీ చేటు కలుగుతుంది. చక్కగా పండిన పండు కోసుకొంటే రుచికి రుచీ బాగుంటుంది. విత్తనమూ చెడిపోదు. కార్య సిద్ధి విషయం కూడా ఇలాగే ఉంటుంది.

వి: దీనికి మూలం ఇది.

వనస్పతే రపక్వాని ఫలాని ప్రచినోతి యః
సనాప్నోతి రసం తేభ్యో బీజం చాస్య వినశ్యతి **5-34-15**
యస్తు పక్వ ము పాదత్తే కాలే పరిణతం ఫలమ్
ఫలాద్రసం సలభతే బీజాచ్చైవ ఫలం పునః **5-34-16**

మానవుడు చేసే ప్రయత్నం ఫలించా లంటే కొంత సమయం అవసరం. అనగా కాలపక్వం అయితేనే ఫలం లభిస్తుంది. కాలమే ప్రయత్నాన్ని పక్వం చేసి ఫలరూపంలోకి తీసుకువస్తుంది. కాలాన్ని కూడా భారతీయులు దైవ స్వరూపంగా చెవుతారు. అందుచేత కాలంతో పరిపక్వమయితే సత్ఫలం సిద్ధిస్తుంది. దానికి ఇది ఉదాహరణం. పక్వమయి చక్కగా పండిన పండుకోసుకొంటే రుచీ బాగుంటుంది. దాని విత్తనం మళ్లీ మరో చెట్టుకు బీజోవాపం చేసేందుకూ పనికి వస్తుంది. అలాగే కాల పరిపక్వమయిన కార్యం తనకు సంతోషదాయకమే కాక ఇతరులకూ మార్గదర్శక మవుతుంది.

ఇందులో ఒక కోణంలో దురాశాస్వభావం చెప్పబడింది. రాజు దురాశాపరుడయితే విప్లవం సంభవిస్తుంది. పండని పండు వంటిదే దురాశ. పాల కోసం ఆవు పొదుగు కోసినట్లే ఉంటుంది. ఇది దురాశా స్వభావం. ఈ స్వభావం దుర్యోధనునిలోనూ, తండ్రిలోనూ ఉన్నది. దాన్ని విదురుడు వ్యంగ్యంగా సూచిస్తున్నాడు.

ప్రజల నుండి జ్ఞాతుల నుండి మహారాజు పొందవలసిన ఫలాలు క్రమక్రమంగా కాలానుగుణంగా పొందాలి. అంతే కాని ఒకేసారి లాగుకొనాలని దురాశను ప్రకటిస్తే మొదటికే మోసం వస్తుంది.రాజు ప్రజల నుండి పన్నులు వగైరాలు ఎట్లా స్వీకరించాలో ముందు పద్యంలో చెపుతున్నాడు.

తే. **మాలకరి పుష్పములు గోయు మాడ్కిఁ, దేఁటి**
పువ్వుఁదేనియఁ గొనియెడు పోల్కి, నెదురు

గందకుండఁగఁ గొనునది కార్యఫలము;
బొగ్గులకుఁ బోలె మొదలంటఁ బొడువఁ జనదు. 57

అ: మాలకరి= మాలాకారుడు/ దండలు గుచ్చే వాడు; పుష్పములు కోయుమాడ్కిన్= పూలు కోసినట్లుగా; తేఁటి = తుమ్మెద; పువ్వుఁదేనియన్ =పూలతేనెను; కొనియెడు పోల్కిన్ = ఆస్వాదించేటట్లుగా; ఎదురు = ఎదుటివాడు; కందకుండఁగన్ = బాధచెందకుండా; కార్యఫలము కొనునది =కార్య ఫలితాలను గ్రహించాలి; బొగ్గులకున్ పోలె = బొగ్గులకోసం లాగా; మొదలంటన్= మొదట్లోకి; పొడువన్చనదు = తవ్వరాదు.

భా : పూలమాలలు కట్టేవాడు పూలుకోసుకొన్నట్లుగా, తుమ్మెద పూల తేనెను ఆస్వాదించినట్లుగా మృదువుగా ఎదుటివాడు కష్టపడకుండా కార్యఫలితాన్ని గ్రహించాలి- అంతేకాని బొగ్గులకోసం త్రవ్వినట్లుగా మొదలంట పొడవరాదు. బొగ్గులకోసమయితే చెట్టును మొదట్లోకి వేళ్లతో సహా తవ్వి వేస్తారు. అట్లా కాకుండా మృదువుగా కార్యం సానుకూల పరచుకోవాలి.

వి: దీని మూలం ఇది
పుష్పం పుష్పం విచిన్వీత మూలచ్ఛేదం నకారయేత్
మాలాకార ఇవారామే నయథాంగారకారకః 5-34-18

క. **పరుల ధనమునకు, విద్యా**
పరిణతికిం, దేజమునకు, బలమునకు, మనం
బెరియఁగ నసహ్యపడు న
న్నరుఁడు దెవులు లేని వేదనం బడు నధిపా! 58

అ: అధిపా! = రాజా!; పరుల ధనమునకున్ = ఇతరుల, (ఎదుటివాని) ధనానికీ; విద్యా పరిణతికిన్ = సమగ్ర పాండిత్యానికీ; తేజమునకున్ = తేజస్సుకూ; బలమునకున్; మనంబు-ఎరియంగన్ = మనస్సు దహించుకొని పోయేటట్లుగా; అసహ్యపడు = అసహ్యించుకొనే; ఆ + నరుడు; తెవులు లేని = రోగం లేని; వేదనన్ పడున్ = బాధపడతాడు.

భా: ఎదుటి వాని డబ్బుకూ, విద్యకూ, తేజస్సుకూ బలానికీ అసహ్యించు కొనేవాడు రోగం లేని బాధపడుతూ ఉంటాడు.

వి: **య ఈర్ష్యః పరవిత్తేషు రూపే వీర్యే కులాన్వయే**
సుఖే సౌభాగ్యసత్కారే తస్య వ్యాధి రనన్తకః 5-34-40
అని దీనిమూలం

క. **ఎదిరికి హితమును బ్రియమును**
మది కింపును గాఁగ బలుకు మాటలు పెక్కై
యొదవినను లెస్స; యటుగా
కిదియది యన కూరకునికి యెంతయు నొప్పున్. 59

అ: ఎదిరికిన్ = ఎదుటివానికి; హితమును; ప్రియమును; మదికిన్ + ఇంపున్

కాఁగన్ = మనస్సుకు ఇంపు అయ్యేటట్లుగా; పలుకుమాటలు = చెప్పేమాటలు; పెక్కు + ఐ+ ఒదవినను = చాలా అయినా; లెస్స = మంచిదే; అటుగాక = అలా కాకపోతే; ఇది అది అనక; ఊరక + ఉనికి = ఊరకే ఉండటం; ఎంతయున్ + ఒప్పున్ = ఇంకా మంచిది.

భా: *ఎదుటివానికి హితమూ ప్రియమూ ఇంపూ అయ్యేటట్లు మాట్లాడాలి. అటువంటి మాటలు చాలా అయినా మంచిది. (పరిమితత్వం కోల్పోయినా సరే!) అట్లాకాక పోతే ఇది అది అనకుండా మాట్లాడక ఊరుకోవడం మరీమంచిది.*

క. **చెలిమియుఁ బగయును; దెలివియుఁ**
గలఁకయు; ధర్మంబుఁ బాపగతియును; బెంపుం
దులువ తనంబును వచ్చును
బలుకుబడిన; కాన పొసఁగఁ బలుకఁగ వలయున్. 60

అ: చెలిమియును పగయును = స్నేహమూ, వైరమూ; తెలివియున్ కలఁకయున్= స్వచ్ఛత, కళంకమూ; ధర్మంబున్ పాపగతియును = పుణ్యమూ, పాపమూ; పెంపున్ తులువ తనంబును = ఔన్నత్యమూ, నీచత; పలుకుబడిన వచ్చును = మాటను బట్టి వస్తాయి; కాన; పొసఁగన్ పలుకఁగన్ వలయున్ = అందుచేత సముచితంగా మాట్లాడాలి.

భా: *స్నేహం కాని వైరం కాని; నిర్మలత్వం కాని కళంకం కాని; పుణ్యం కాని పాపం కాని; ఔన్నత్యం కాని నీచత్వం కాని మాటను బట్టే వస్తాయి. అందుచేత తగినట్లుగా పొందికగా మాట్లాడాలి.*

క. **బెడిదముగఁ గత్తి గొడ్డటఁ**
బొడువఁ దెగిన మ్రానఁ జిగురు పొడముఁ, బలుకులం
జెడఁ దునిసిన కార్యంబు ని
గుడ నేరదు పిదప నెట్టుఁ గురువంశనిధీ! 61

అ : కురువంశనిధీ! = ధృతరాష్ట్ర మహారాజా!; బెడిదముగన్ = కఠినంగా; కత్తిన్ గొడ్డటన్ = కత్తితోనూ గొడ్డలితోనూ, పొడువన్ తెగిన మ్రానన్ = పొడవగా తెగిన చెట్టుకు; చిగురు+ పొడమున్ = మరల చిగురు తొడుగుతుంది; పలుకులన్ = మాటలతో; చెడన్ తునిసిన= చెడతెగిన; కార్యంబు = పని; పిదపన్ = తరువాత; ఎట్టున్ = ఏ విధంగానూ; నిగుడనేరదు = సానుకూల పడదు/ నేరవేరదు.

భా: *కత్తితోకాని గొడ్డలితోకాని నరుకబడిన చెట్టుకు మళ్లీ చిగురు పడుతుంది; కాని మాటలతో చెడిపోయిన పని మళ్లీ ఏ రీతిగానూ నెరవేరదు - అనుకూలింపదు.*

వి: దీని మూలం ఇది
సంరోహతి శరై ర్విద్ధం వనం పరశునా హతమ్
వాచా దురుక్తం బీభత్సం న సంరోహతి వాక్కృతమ్ 5-34-75

క. **తనువున విఱిగిన యలుఁగుల**
ననువునఁ బుచ్చంగ వచ్చు; నతి నిష్ఠురతన్

మనమున నాఁటిన మాటలు
వినుమెన్ని యుపాయములను వెడలునె? యధిపా! 62

అ: అధిపా! = రాజా!; తనువునన్ = శరీరంలో; విఱిగిన = నాటిన; అలుఁగులన్ = బాణాలను; అనువునన్ = ఉపాయంతో/వీలుగా; పుచ్చంగ వచ్చున్ = తీయవచ్చును; అతి నిష్ఠురతన్ = ఎంతో కఠినంగా; మనమునన్ నాటిన = మనస్సులో గుచ్చుకొన్న; మాటలు; ఎన్ని ఉపాయములను = ఎన్ని ఉపాయాలతోనయినా; వెడలునె= వెలికివస్తాయా? తీయగలమా? (వినుము ఇది తెలుగువారి సంభాషణ తీరును తెలియజేస్తుంది)

భా: *శరీరంలో గుచ్చుకొన్న బాణాలను ఏదో ఒక ఉపాయంతో తొలగించవచ్చు. కాని కఠినంగా నిష్ఠురంగా మనసులో గుచ్చుకొన్న మాటలు ఎన్ని ఉపాయాలతో నయినా తీయలేము.*

వి: ఈ పద్యాలు రెండూ విదురుడు కర్ణ దుశ్శాసనులను మనస్సులో పెట్టుకొని అన్నట్లు తోస్తుంది. సభలో ద్రౌపదిని గూర్చి కర్ణుడన్న మాట అర్జునుడికి వాఙ్మయమయిన శరంగా బాధిస్తోంది అంటాడు కృష్ణుడు. జూదం నాడు సభలో దుశ్శాసనాదులు పాండవుల నన్న మాటలు పాండవుల మనస్సులల్లో శల్యాలై గుచ్చుకొన్నాయి. అవి తీసి వేయడం సాధ్యం కాని పని అని విదురుడు సూచిస్తున్నాడు.

ఈ పద్యానికి మూలం ఇది
కర్ణి నాళీక నారాచాః నిర్హరన్తి శరీరతః
వాక్శల్యస్తు న నిర్హర్తుం శక్యో హృదిశయో హి సః 5-34-76

ఉ: **అక్కట! ధర్మనందనుని యాస్యమునం దొకనాఁడుఁ గీడుప**
ల్కొక్కఁడు లేదు; నీకొడుకు లొండొరు మీఱి నికృష్ట వాక్యముల్
పెక్కులు పెక్కుభంగులను బ్రేలుచు నుండఁగ నీవు దానికిన్
స్రుక్కక వించు నుండెె, దనురూపమె నీకిది? కౌరవేశ్వరా! 63

అ: అక్కట = అయ్యో!; ధర్మనందనుని - అస్యము నందు = ధర్మరాజు నోటి నుండి; ఒక్కనాఁడున్ = ఒక్క రోజున కూడా; కీడు పల్కు = కీడు మాట; ఒక్కఁడున్ లేదు = ఒక్కటీ లేదు, కౌరవేశ్వరా!= కురురాజా!; నీ కొడుకులు; ఒండొరు మీఱి = ఒకరిని మించి మరొకరు; నికృష్ట వాక్యముల్ పెక్కులు = నీ చపు మాటలు చాలా; పెక్కు భంగులను = అనేక విధాలుగా; ప్రేలుచు నుండఁగన్ = ప్రేలుతూ ఉంటే; నీవు; దానికిన్; స్రుక్కక = సంకోచింపక; వించున్ - ఉండెదు = వింటూ ఉంటావు; నీకున్; ఇది; అనురూపమె? = తగునా?

భా: *ధర్మరాజు ముఖం నుండి ఒక్కనాడు కూడా కీడు మాట ఒక్కటి కూడా వెలువడదు. నీ కొడుకులయితే ఒకరిని మించి ఇంకొకరు ఎన్నో నీచపు మాటలు ఎన్ని విధాలుగానో ప్రేలుతూ ఉంటే నీవు వాటిని వెనుకాడకుండా వింటూ ఉంటావు. కురురాజా! ఇది నీకు తగునా?*

వి: ఇందులో విదురుడు ధృతరాష్ట్రునికి ప్రత్యక్షంగా బోధచేస్తున్నాడు. వారివారి

ప్రవర్తనలను స్పష్టంగా తెలుపుతూ ధృతరాష్ట్రుని కిది తగని పని అని సూచిస్తున్నాడు. వింటూ ఊరుకోవడం ధృతరాష్ట్రుని దోషం. కారణం పుత్రవ్యామోహం- "ఎవ్వార లుపేక్ష సేసి రది వారల చేటగు గాక" అంటాడు కృష్ణుడు రాయబారంలో.

ఆ: చేటు కాలమైనఁ జెట్ట మాటలు, నెఱి
గాని తెరువు పట్టు కర్జములును,
దగిన యట్ల తోఁచుఁ; దగి యెడునవి యవి
నీతులని మనంబు నిశ్చయించు. 64

అ: చేటు కాలము+ ఐనను = పోయే కాలం వస్తే; చెట్ట మాటలు = కీడు పలుకులు; నెఱికాని తెరువు పట్టు = న్యాయం కాని మార్గం పట్టే; కర్జములును = పనులూ; తగిన యట్ల తోఁచున్ = మంచివిగా తోస్తాయి; తగియెడునవి = తగినవానిని; అవినీతులని = అవినీతికరము లయిన పలుకులుగా పనులుగా; మనంబు నిశ్చయించున్.

భా: *పోయేకాలం వస్తే నీచపు పలుకులూ; అన్యాయకార్యాలు తగినవిగా తోస్తాయి. తగిన మాటలూ పనులూ అవినీతులుగా మనస్సు నిశ్చయిస్తుంది.*

వి: "వినాశకాలే విపరీత బుద్ధిః" అంటే ఇదే. మంచివి చెడ్డవిగానూ చెడ్డవి మంచివిగానూ కనిపిస్తాయి పోగాలము దాపురించిన వారికి. వారు మిత్రవాక్యం వినరు కూడా.

వ. "నీ బుద్ధి పాండవుల తోడి విరోధంబు నెడ మరలంబడమి పాపం; బింతియ కాక యేమి సేయుదము, మనకులంబునం దేజోధైర్య ధార్మికత్వాది గుణంబుల గరిష్ఠుండయిన యుధిష్ఠిరుండు నీసిరికి వెలియై యట్లుండుట దగ వగునే! నీ పెద్దతనంబు సూచి సైరణ వాటించి యున్న వాఁ" డనిన విదురు దిక్కు మొగంబై ధృతరాష్ట్రుండు "నీ చెప్పిన నీతి వాక్యంబుల నామనంబు దని వోవ దింకను జెప్పు' మనవుడు నతండు వెండియు నిట్లనియె. 65

అ: గరిష్ఠుండు = పెద్దవాడు; సిరి = సంపద; సైరణ = సహనం; తనివోవదు = తృప్తి చెందదు; అనవుడు = అనగానే; తగవు + అగునే = న్యాయమగునా?

భా: *పాండవుల మీది విరోధం నుంచి నీ మనస్సు మళ్లక పోవడం దురదృష్టం - ఇంతే తప్ప ఏం చేస్తాం? మన వంశంలో తేజస్సులోనూ ధైర్యంలోనూ ధార్మికతలోనూ గొప్పవాడయిన ధర్మరాజు నీ సంపదకు దూరంగా అలా ఉండటం న్యాయమా? నీ పెద్దతనాన్ని చూసి అతడు సహనం వహించి ఉన్నాడు? అన్నాడు విదురుడు - అపుడు ధృతరాష్ట్రుడు విదురుని వైపు మొగం పెట్టి "నీవు చెప్పిన నీతి వాక్యాలతో నా మనస్సు తృప్తిపడలేదు- ఇంకా చెప్పు" అన్నాడు. అపుడు విదురుడు మరల ఇలా అన్నాడు.*

వి: 1. ధృతరాష్ట్రుడు గ్రుడ్డివాడు కావడం వల్ల "విదురునివైపు చూసి" అనలేదు. "విదురుని దిక్కు మొగంబై" అన్నాడు. ఇంత సూక్ష్మంగా ఉంటుంది తిక్కన దృష్టి.

2. విదురుడు ధృతరాష్ట్రుని ప్రత్యక్షంగా నిందిస్తున్నాడు. దాని నుండి

తప్పించుకోవడానికి ధృతరాష్ట్రుడు నీతి వాక్యాలు చెప్పమన్నాడు. అంటే నిందించకని వ్యంగ్యంగా మళ్లించినట్లు.

ఆ: సకల పుణ్యకర్మ చయమును నొకదెస;
వినుము, పాడి దప్పకునికి యొక్క
దిక్కు; దీని శ్రుతులు తెలిపెడు నెడఁ బాడి
కలిమి యెందుఁ బెద్దగా నుతించె. 66

అ: వినుము; నకల పుణ్యకర్మచయమునున్ = అన్ని పుణ్యకార్యాల సముదాయమూ; ఒకదెసన్ = ఒక పక్షమూ; పాడి తప్పక + ఉనికి = న్యాయం తప్పకుండా ఉండటం; ఒక్క దిక్కు = ఒక వైపు; దీనిన్ శ్రుతులు తెలిపెడు నెడన్ = ఈ విషయమై వేదాలు చెప్పేటప్పుడు; పాడి కలిమి = న్యాయంగా ఉండటమే; ఎందున్ = ఎక్కడయినా; పెద్దగా నుతించె = గొప్పదిగా కీర్తించాయి.

భా: (మానవుడు చేసిన) ఇతర పుణ్యకార్యాల సముదాయాన్ని త్రాసులో ఒక్క ప్రక్కనూ, న్యాయం తప్పకుండా ప్రవర్తించడం ఒక ప్రక్కనూ వేస్తే - వీనిలో న్యాయం తప్పక పోవడమే గొప్ప అని వేదాలు చెపుతున్నాయి.

వి: న్యాయంగా ధర్మబద్ధంగా ప్రవర్తించడాని కున్న ప్రాధాన్యం మరిదేనికీ లేదన్నమాట. అది సకల జనులకూ హితమూ విహితమూ కూడా.

తే: పాడి గలిగిన నిహలోక ఫలము లెల్లఁ
జేరుటయ కాదు, కీర్తియుఁ జెందుఁ బురుషు;
ధరణిఁ బొగడిత యెందాఁకఁ బరగు, నంత
కాలమును బుణ్యలోకంబు గల్గు నండ్రు. 67

అ: పాడి కలిగినన్=న్యాయం ఉంటే; ఇహలోక ఫలములు ఎల్లన్=ఈలోకంలో సత్ఫలితాలన్నీ; చేరుటయ కాదు=చెందటమే కాదు; పురుషున్=మానవుని; కీర్తియున్ చెందున్=కీర్తికూడా పొందుతుంది; ధరణిన్=భూమిమీద; పొగడిత=కీర్తి; ఎందాఁకన్ పరగున్=ఎంతకాలం ఉంటుందో; అంతకాలమును; పుణ్యలోకంబు కల్గున్; అండ్రు=అంటారు.

భా: న్యాయంగా ధర్మంగా ప్రవర్తిస్తే ఇహలోకంలో మంచి ఫలితాలు కలగడమేకాదు కీర్తి కూడా మానవునకు కల్గుతుంది. ఈ భూమి మీద సత్కీర్తి ఎంతకాలం ఉంటుందో అంతకాలం(మానవునికి) పుణ్యలోకాలు సంక్రమిస్తాయి అంటారు పెద్దలు.

వి: పుణ్యలోకాలు కలగడానికి కారణభూతమయినది మంచికీర్తి. అది ఎంతకాలం భూమిమీద ఉంటుందో అంతకాలం ఆ మానవుడు పుణ్యలోకాల్లో ఉంటాడు. అది క్షీణిస్తే ("క్షీణే పుణ్యే మర్త్యలోకం విశన్తి") మర్త్యలోకంలోకి ప్రవేశిస్తారు. దీని మూలం ఇది.

యావత్కీర్తి ర్మనుష్యస్య పుణ్యాలోకే ప్రగీయతే
తావత్స పురుషవ్యాఘ్ర స్వర్గలోకే మహీయతే.

వ: తొల్లి ప్రహ్లాదుండు దైత్యజాతి సంభవుం డయ్యును దన కొడుకు

విరోచనుండును, నంగిరసుండను విప్రుకొడుకు సుధన్వుండును దమతమ ప్రాణంబు లొడ్డుగా నొడ్డి యొక్క ధర్మ సందేహంబునకుఁ బన్నిదంబు సఱచి వచ్చి తన్నడిగిన "నితండు గొడు" "కితండు లాఁతి" యని తలంపక మధ్యస్థుండై సుధన్వుం గెలిపించి యతనిచేత నిజతనయుని జీవితంబు దానంబుగాఁ గొని వాని బ్రతికించెం గావున నీవును ధర్మంబు విడువక యధర్మోపేతులైన నీ కొడుకుల వలని పక్షపాతంబు విడిచి తెఱంగు సేయుము వారును నాపద లేక బ్రదుకుదురు, నీకును శోకంబు లేక తక్కు నని చెప్పి మఱియును. 68

అ: దైత్యజాతి సంభవుండు=రాక్షస జాతిలో పుట్టిన వాడు; విప్రు కొడుకు=బ్రాహ్మణుని కుమారుడు; ఒడ్డు=పందెపుసొమ్ము; పన్నిదంబు-చఱచి=పందెము వేసికొని; నిజతనయుడు= తనకుమారుడు; కొని= తీసుకొని; అధర్మ+ఉపేతులు=అధర్మంతో కూడినవారు; తెఱంగు=సంధి; తక్కును=తప్పను.

భా: పూర్వం ప్రహ్లాదుడు (రాక్షస జాతిలో పుట్టినవాడయినా) తనకొడుకయిన విరోచనుడూ, అంగిరసుడనే బ్రాహ్మణుని కుమారుడు సుధన్వుడూ ఇద్దరూ తమతమ ప్రాణాలను పందెపు సొమ్ముగా పెట్టుకొని ఒక ధర్మసందేహానికి పందెం వేసుకొని వచ్చి తనను అడిగితే ప్రహ్లాదుడు "వీడు తనకొడుకు" అని "వీడు ఇతరుడు" అని భావించకుండా మధ్యవర్తిగా సుధన్వుని గెలిపించాడు. తరువాత సుధన్వుని నుండి తన కొడుకు జీవితాన్ని దానంగా గ్రహించి కొడుకును బ్రతికించుకొన్నాడు. అందుచేత నీవు కూడా ధర్మం విడిచి పెట్టకుండా అధర్మపరులయిన నీ కొడుకుల మీద పక్షపాతం విడిచి సంధి చేసుకో- దాని వల్ల నీ కొడుకులకూ ఆపదరాదు- నీకూ దుఃఖం రాదు." అని చెప్పి ఇంకా (ఇలా అన్నాడు.)

వి: 1. ఈ కథలో ప్రహ్లాదుడు తన కొడుకు ప్రాణాలను కూడ లెక్కచేయక ధర్మమును చెప్పాడు, ఆచరించాడు. కొడుకు కోసం అనృతమాడలేదు. అలాగే నీవు కూడ (ధృతరాష్ట్రుడు) భూమికోసం, కొడుకుల కోసం అసత్యమాడకు అని విదురుడు ధృతరాష్ట్రునికి హిత ముపదేశిస్తున్నాడు.

2. ధర్మపరులయిన వారికి దైవం తోడ్పడుతుంది. ఆ తోడ్పాటు ప్రత్యక్షంగా ఉండకపోవచ్చు. దానికనుకూల మయిన బుద్ధి మనకు కలుగుతుంది. అందుచేత దైవం అనుకూలించాలంటే మానవుడు ధర్మం విడువరాదు. ఈ భావం ఈ క్రింది శ్లోకంలో ప్రతిఫలిస్తుంది.

న దేవా యష్టి మాదాయ రక్షన్తి పశుపాలవత్
యంతు రక్షితు మిచ్ఛన్తి బుద్ధ్యా సంవిభజన్తి తమ్ 5-35-33

క: పాపంబులు గర్హము లని
యేపునఁ జేయంగ నవియు నింపగు; ధర్మ
వ్యాపారంబు లకార్యము
లై పరిణతిఁ బొందెనేని నట్టుల చెల్లున్. 69

అ: పాపంబులు=పాపపు పనులు; కర్హములు+అని=చేయదగిన పనులని; ఏపునన్

చేయంగన్=అనురక్తితో అధికంగా చేస్తే; అవియున్ ఇంపగున్=అవికూడా కొంతకాలానికి ఇష్టమైనవిగా తోస్తాయి; ధర్మవ్యాపారంబులు=ధర్మకార్యాలు; అకార్యములై=చేయరానివై; పరిణతిన్ పొందెనేని=మారితే; అట్టుల చెల్లున్=అవికూడా అలాగే చెల్లుతాయి.

భా: పాపకార్యాలు సత్కార్యాలనుకొని ఉత్సాహంతో అనురక్తితో చేస్తే (కొంతకాలానికి) అవే ఇష్టమవుతాయి. అట్లాగే ధర్మకార్యాలు అకార్యాలుగా పరిణతిచెందితే అవే ఇష్టమయి చెల్లుతాయి.

వి: ఒక అసత్యాన్ని పదిసార్లు సత్యమని ప్రచారం చేస్తే అది సత్యమై చెల్లుతుంది అన్న గోబెల్ అభిప్రాయం వంటి దిది. (గోబెల్ అసత్యం సత్యమవుతుందనే చెప్పాడు. తిక్కన సత్యంకూడా అసత్య మవుతుందని కూడా చెప్పాడు) కాని ఇది నిత్యసత్యం కాదు. అందుకే ఛలంతో కూడిన సత్యం సత్యమే కాదంటాడు తరువాతి పద్యంలో.

దీని మూలం చాలా బాగుంది.

పుణ్యం ప్రజ్ఞాం వర్ధయతి క్రియమాణం పునః పునః
వృద్ధ ప్రజ్ఞః పుణ్యమేవ నిత్యమారభతే నరః 5-35-53
పాపం ప్రజ్ఞాం నాశయతి క్రియమాణం పునః పునః
నష్ట ప్రజ్ఞః పాపమేవ నిత్య మారభతే నరః 5-35-52

చ: **అది సభయే? ప్రియం బెసఁగ నార్యులు నిల్వరయేని; నార్యులే**
మదిఁ దలఁపంగ వారలు సమంచిత ధర్మము వల్కరేని; న
ట్టిదియును ధర్మువే తగ ఘటించిన నిక్కము లేదయేనిఁ; దాఁ
బదిలపు నిక్కమే యొక నెపం బిడు చొప్పగునేని భూవరా! 70

అ: భూవరా!=రాజా! ; ప్రియంబు-ఎసఁగన్=ప్రీతి కలిగేటట్లు; ఆర్యులు=పెద్దలు; నిల్వరయేని=ఉండకపోతే; అది సభయే?=అది సభ అవుతుందా? కాదు; మదిన్ తలఁపంగ=భావిస్తే; సమంచిత ధర్మము+పల్కరేని=చక్కని ధర్మం చెప్పకపోతే; వారలు ఆర్యులే?; తగన్ ఘటించిన=తగునట్లు ఆచరిస్తే; నిక్కము లేదయేని=సత్యం లేకపోతే; అట్టిదియును ధర్మువే?=అది ధర్మం అవుతుందా?; ఒక నెపంబు+ఇడు చొప్పు అగునేని=ఒక నెపంతో మిషతో కూడినదయితే; తాన్ పదిలపు నిక్కమే?=అది శుభప్రదమయిన సత్యమా? కాదని భావము.

భా: ఆర్యులు లేని సభ సభకాదు. ధర్మం పలుకకపోతే వారు ఆర్యులూ కారు. నిజంలేకపోతే అది ధర్మమే కాదు. ఆ నిజంకూడా ఒక నెపంతో కూడిన దయితే నిజమేకాదు.

వి: **న సా సభా యత్ర న సన్తి వృద్ధాః న తే వృద్ధా యే న వదన్తి ధర్మమ్**
నా సౌ ధర్మో యత్ర నసత్య మస్తి న తత్సత్యం యచ్ఛలే నానువిద్ధమ్5-35-49

కథా సంబంధిగా ఇపుడు కౌరవులు సత్యసంధులయి నిలవాలని విదురుని సూచన; ద్రౌపదీ పరాభవ ఘట్టం గుర్తుతెచ్చుకొంటే- అది అసలు సభయేనా? మీరంతా పెద్దమనుషులేనా? అని ప్రశ్నించడం కూడా ఇందులో లేకపోలేదు. ధర్మం అడిగినా కూడా చెప్పలేదు అని దెప్పి పొడవడమూ ఉంది.

ఉ: **నీతి పథంబునన్ బ్రదుక నేర్చుట యుత్తమ భంగి; శౌర్య సం**
జాతములై కరం బలరు సంపద లొందుట మధ్యవృత్తి; య
స్పీతములైన భారవహ జీవనముల్ దలపం గనిష్ఠముల్;
నీతికి బాహ్యులైన ధరణీవర! మెత్తురె? వారి నుత్తముల్. 71

అ: నీతి పథంబునన్=నీతి మార్గంలో; బ్రదుకనేర్చుట; ఉత్తమ భంగి=ఉత్తమమయిన విధానము; శౌర్య సంజాతములై=పరాక్రమంచేత కలిగి; కరంబు-అలరు=బాగా శోభిల్లే; సంపదలు; ఒందుట=పొందుట; మధ్యవృత్తి= మధ్యమవిధానం; అస్పీతములైన=కలుషములయిన; భారవహజీవనముల్=బరువుమోసే జీవితాలు; తలపన్; కనిష్ఠముల్=అధమ మార్గాలు; ధరణీవర! =రాజా! ; నీతికి బాహ్యులుఐనన్=నీతి మార్గానికి దూరమయితే; వారిన్; ఉత్తముల్; మెత్తురె?=మెచ్చుకొంటారా?

భా: *నీతి మార్గంలో జీవించగలగటం ఉత్తమ పద్ధతి. పరాక్రమించి సంపదలొంది జీవించడం మధ్యమపద్ధతి. మలినమయిన భారవాహక జీవితాలు జీవించడం అధమ పద్ధతి. మహారాజా! నీతికి దూరమయిన వారిని ఉత్తములు మెచ్చుకోరు.*

దీని మూలం ఇది

బుద్ధి శ్రేష్ఠాని కర్మాణి బాహు మధ్యాని భారత
తాని జంఘాజఘన్యాని భార ప్రత్యవరాణిచ *5-35-75*

ఆ: **కయ్యమునక యెపుడుఁ గాలు ద్రవ్వుదురు నీ**
పుత్రులెల్ల; సూతపుత్రుఁ డాది
యగు తదీయ మంత్రు లంతకు ముందర
బిరుదు; లీవు నీతి తెరువు సొరవు. 72.

అ: నీ పుత్రులుఎల్లన్; కయ్యమునక=యుద్ధానికే; ఎపుడున్; కాలు ద్రవ్వుదురు= ఉత్సాహపడుతూ ఉంటారు; సూతపుత్రుఁడు - ఆదియగు = కర్ణుడు మొదలయిన; మంత్రులు; అంతకు ముందర = అంతకుముందే; బిరుదులు = వీరులు/యోధులు; ఈవు =నీవు; నీతితెరువు= నీతి మార్గాన్ని; చొరవు = ప్రవేశించవు.

భా: *నీ కొడుకు లెల్లప్పుడూ కయ్యానికే కాలు దువ్వుతూ ఉంటారు. ఇక కర్ణుడు మొదలయిన మంత్రులంతా అంతకుముందే యోధుల మంటారు. నీవు మాత్రం నీతి మార్గం వహించవు.*

వి: **కయ్యమునకు కాలు త్రవ్వుట** - ఇది తెలుగులో ఒక జాతీయం. ఎప్పుడూ యుద్ధాన్ని కోరుకొంటూ ఉత్సాహాన్ని ప్రదర్శిస్తూ ఉండటం. ఎద్దులు మొ॥ పశువులు పోట్లాటకు ముందు కాళ్లతో భూమిని త్రవ్వుతాయి. దాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ జాతీయం ఏర్పడి ఉండవచ్చు.

క. **పాండవులు శౌర్య మొల్లరు; ర**
ఖండిత నీతి ప్రకార కార్యము మెచ్చై

యుండుదు; రెదు రేచినఁ దుది
మండుదు; రార్పంగ రాదు మఱి యెవ్వరికిన్. 73

అ: పాండవులు; శౌర్యము - ఒల్లరు = పరాక్రమాన్ని ఒప్పరు; అఖండిత = కొట్టబడని; నీతి ప్రకార కార్యము = నీతి యుక్తమయిన పనిని; మెచ్చు + ఐ - ఉండుదురు = మెచ్చుకొని ఉంటారు; ఎదురు+ ఏచినన్ = శత్రువుమీదకు వస్తే; తుదిన్ = చివరికి; మండుదురు; (అపుడు) మఱియెవ్వరికిన్; ఆర్పంగన్‌రాదు = ఆర్పరాదు (ఆ మంటను).

భా: *పాండవులు పరాక్రమాన్ని అంగీకరించరు. నీతియుక్తమయిన పనినే మెచ్చుకొంటారు. శత్రువు మాత్రం మీదకు వస్తే మండుతారు. అపుడా మంటను ఎవరూ ఆర్పలేరు.*

క. తమతండ్రి భంగి నీకును
సముచితమగు భక్తిసేసి, సజ్జననుతమా
ర్గమున నడచు వారల నీ
వమలమతిం గన్న కొడుకుల ట్లరయఁ దగున్. 74

అ: తమ తండ్రి భంగిన్ = తమ తండ్రికివలె; నీకును; సముచితమగు = తగిన; భక్తి + చేసి = భక్తిని ప్రకటించి; సజ్జననుత మార్గమునన్ = సజ్జనులచే పొగడదగిన మార్గంలో; నడచువారలన్ = ప్రవర్తించే పాండవులను; నీవు; అమలమతిన్ = నిర్మల బుద్ధితో; కన్న కొడుకులట్లు; అరయన్ తగున్ = చూడదగును.

భా: *తమ తండ్రి వలె నిన్ను భక్తితో కొలుస్తూ సజ్జనులంతా ప్రశంసించే మార్గంలో నడచే పాండవులను నీవు నిర్మల మనస్సుతో కన్నకొడుకుల వలె చూడదగును.*

వి: 1) పాండవులు సజ్జనశ్లాఘ్యమయిన రీతిలో నడుస్తున్నారు. వారు నిన్ను సాక్షాత్తు తండ్రి వలె భక్తి గౌరవములతో చూస్తున్నారు. అందుచేత వారిని కన్న కొడుకుల వలె చూడుమని విదురుని హితబోధ. వారు నిన్ను తండ్రివలె చూస్తున్నప్పుడు నీవు వారిని కన్న కొడుకుల వలె చూడాలి అని సూచన.

2) అమలమతీ! అని పాఠాంతరము.

వ: అని పలికి మఱియు నిట్లనియె. 75

భా: అని చెప్పి ఇంకా ఇలా అన్నాడు.

క. కారణము లేకయును నుప
కార పరత్వమున నొరుల కార్యంబులకున్
వారని యలజడిఁ బడియెడు
వారల చూ యేడుగడయు వారికి నధిపా! 76

అ: అధిపా! = రాజా!; కారణము లేకయును; ఉపకార పరత్వమునన్ = ఉపకార బుద్ధితో; ఒరుల కార్యంబులకున్ = ఇతరుల పనులకు; వారని అలజడిన్ = తగ్గని ఆవేదనలో; పడియెడు వారల = పడేవారే; వారికిన్; ఏడుగడయున్ = రక్షకులు; చూ! = చూడుమా!

భా: ప్రతి ఫలాపేక్ష లేకుండా కేవలము ఉపకారపరులై ఇతరుల పనులకు అలజడి పడేవారే వారికి రక్షకు లవుతారు.

వి: లోకంలో చాలామంది ప్రయోజనాన్ని అపేక్షించి ఉపకారం చేస్తారు. కాని కొంతమంది ధర్మ నిష్ఠతో ఉపకారపరు లవుతారు. నిష్కారణంగా ప్రతిఫలాపేక్ష లేకుండా ఉపకారం చేస్తారు. అటువంటి వారు ధర్మ సంస్థాపకులని భావం.

చ. ఒకరుని చేతి ప్రోపును దదున్నతి ప్రాపును గాంచి, యెల్ల వెం
టకును గొఱంత లేక పొగడం దగు సంపద నొంది, యట్టి దా
తకుఁ దుదిఁ గీడు సేసిన కృతఘ్నుని పీనుఁగునైన రోఁత పు
ట్టక కబళింపఁ గుక్కలు నొడంబడునే కురువంశ వర్ధనా! 77

అ: కురువంశవర్ధనా = కురు వంశాన్ని వృద్ధి పొందించిన రాజా!; ఒకరుని చేతి ప్రోపును = ఒకని చేతి పోషణను; తదున్నతి ప్రాపును= అతని ఔన్నత్యం అనే అండను; కాంచి= పొంది; ఎల్ల వెంటకును = అన్ని విషయాల్లోనూ; కొఱంత లేక = లోటు లేక; పొగడన్ తగు సంపదన్ ఒంది = శ్లాఘింపదగిన సిరినిపొంది; అట్టి దాతకున్; తుదిన్ = చివరికి; కీడు చేసిన; కృతఘ్నుని; పీనుఁగునైన =శవాన్ని అయినా; కుక్కలున్ =కుక్కలు కూడా; రోఁతపుట్టక = అసహ్యం కలగకుండా; కబళింపన్ = తినటానికి; ఒడంబడునే? = అంగీకరిస్తాయా?

భా: *మహారాజా! ఒకని చేతి రక్షణనూ, వాని వలన ఉన్నతి అనే అండను పొంది, అన్ని విషయాల్లోనూ ఏలోటూ లేకుండా ప్రశంసింపదగిన సంపదను పొంది; అటువంటి దాతకు చివరకు కీడుచేస్తే ఆ కృతఘ్నుని పీనుగును అసహ్యించుకోకుండా కుక్కలు కూడా తినటానికి అంగీకరింపవు.*

వి: విదురుడు పాండురాజును దృష్టిలో పెట్టుకొని ఈ మాటలు అన్నాడు.అతనివలన రాజ్యాన్ని పొంది, ఇపుడు అతని కొడుకులకే రాజ్యం లేదనడం ఎటువంటిదో వివరిస్తున్నాడు. దుర్యోధనుడు కూడా ఘోషయాత్రలో పాండవులచేతనే రక్షింపబడ్డాడు. ఇపుడా విషయం మరచి కృతఘ్ను డయిపోయాడని సూచన.

వ: కావునఁ గృతము దలంపమి గీడు, పాండురాజు నీకుం బరమభక్తుండు, పాండవులునుం దేజోలాభంబులు గాంచిన వారలు వారల నాదరింపు మని చెప్పి వెండియు నిట్లనియె. 78

అ: కృతము = చేయబడినది; తలంపమి = తలపకపోవడం;

భా: *అందుచేత (చేసిన సాయాన్ని) జరిగిన దానిని తలపక పోవడం అన్యాయం. పాండురాజు నీయందు చాలా భక్తి కలవాడు. పాండవులు కూడా తేజస్సునూ లాభమునూ పొందారు. వారిని ఆదరించు అని చెప్పి ఇంకా ఇలా అన్నాడు.*

వి: ఇతరులు ఏదయినా ఉపకారం చేస్తే దాన్ని గ్రహించటం కృతజ్ఞత. అట్లా తెలుసుకోవడం పుణ్యం. తెలుసుకోకపోవడం కీడు - నన్నయ దీన్ని చక్కగా వివరించాడు.

కృత మెఱుఁగుట పుణ్యము స
న్మతి దానికి సమము సేఁత మధ్యము, మఱిత
త్కృతమున కగ్గలముగ స
త్కృతిసేయుట యుత్తమంబు కృతబుద్ధులకున్ 1-6-244

"కృతమెఱిఁగెడు పతియె జగజ్జనుల నెల్లఁబరిపాలించును" 2-1-46 అని కూడా నన్నయ చెపుతాడు.

ఆ: బ్రదుకు, చేటు; పొగడు వడుట, దూఱొందుట;
యీఁగి, వేడుకొనుట; యిట్లు మఱియుఁ
గలుగు సౌఖ్యదుఃఖములు వచ్చు నెడపడి;
వాని కింత యేల వగవ నధిప! 79

అ: అధిప!=రాజా!; బ్రదుకు; చేటు=వినాశమూ; పొగడువడుట=స్తుతింపబడటమూ; దూఱొందుట = నిందింపబడటమూ; ఈఁగి = దానమూ; వేడుకొనుట = ప్రార్థించటమూ/ యాచించటమూ; ఇట్లు; మఱియున్ కలుగు = ఇంకా ఉండే; సౌఖ్యదుఃఖములు; ఎడపడి వచ్చున్ = పర్యాయంగా వస్తాయి; వానికిన్; ఇంత; వగవన్ ఏల?= విచారించడమెందుకు?

భా: *రాజా! బ్రదుకుగాని మరణంగాని, స్తుతికాని నిందకాని, దానం కాని యాచన కాని ఇట్లా సుఖదుఃఖాలు ఒకదాని వెంట ఒకటి వస్తూ ఉంటాయి. వాని కోసం ఇంత బాధపడవలసిన పనిలేదు.*

వి: కోరకపోయినా దుఃఖం వస్తుంది. అలాగే సుఖమూ వస్తుంది. వాటికోసం పరితపించవలసిన పనిలేదు. సంతోషించ వలసిన పనిలేదు.

క. వగ బలము దఱుఁగు, రూపఱు,
వగచిన మతి దప్పుఁ, దెవులు వచ్చును, దూఱన్
వగచి నలంగినఁ బ్రియమగుఁ
బగతురకును; వగచు టుడుగు పార్థివముఖ్యా! 80

అ: పార్థివ ముఖ్యా = రాజశ్రేష్ఠుడా!; వగన్= దుఃఖంచేత; బలము; తఱుఁగున్ = తగ్గిపోతుంది; రూపఱున్ = రూపం చెడి పోతుంది; వగచినన్ =దుఃఖిస్తే; మతి తప్పున్= మతిచెడి పోతుంది; తెవులు =రోగం; వచ్చును; దూఱన్ =ఇతరులు నిందిస్తే; వగచి=దుఃఖించి; నలంగినన్= నలిగిపోతే; పగతురకును=శత్రువులకు; ప్రియమగు= ప్రీతి కలుగుతుంది. (అందుచేత) వగచుట; ఉడుగు = విడువుము.

భా: *రాజ ముఖ్యా! దుఃఖం వల్ల బలం తరిగిపోతుంది. రూపం చెడిపోతుంది. మతి చెడిపోతుంది. రోగం వస్తుంది. ఇతరులు నిందిస్తే దుఃఖంతో నలిగిపోతే అది శత్రువులకు ప్రీతి కలిగిస్తుంది. అందుచేత దుఃఖించడం విడిచిపెట్టు.*

వి: దీనికి మూలం ఇది.

సంతాపాద్భ్రశ్యతే రూపం సంతాపా ద్భ్రశ్యతే బలమ్
సంతాపా ద్భ్రశ్యతే జ్ఞానం సంతాపా ద్వ్యాధి మృచ్ఛతి

అనవాప్యంచ శోకేన శరీరం చోపతప్యతే
అమిత్రాశ్చ ప్రహృష్యన్తి మాస్మ శోకే మనః కృథాః

వ: **అనిన విని ధృతరాష్ట్రుం డిట్లనియె.** 81

భా: *ఆ మాటలు విని ధృతరాష్ట్రు డిలా అన్నాడు.*

క. **రిత్తయుపచారముల నే**
నుత్తముఁడగు ధర్మతనయు నుడికించితి; దు
ర్వృత్తులగు మత్సుతులకును
మిత్తి యగుం బోర, వగలు మిగులక యున్నే! 82

అ: రిత్తయుపచారములన్ = శుష్కప్రియాలతో; ఏన్ = నేను; ఉత్తముఁడు - అగు; ధర్మతనయున్ = ధర్మరాజును; ఉడికించితి = కోపింపజేశాను. దుర్వృత్తులగు = దుష్ప్రవర్తనకల; మత్సుతులకును = నా కొడుకులకు; పోరన్ = యుద్ధంలో; మిత్తియగును = చావు కలుగుతుంది; వగలు = దుఃఖాలు; మిగులక యున్నే = పొంగి పొర్లకుండా ఉంటాయా?

భా: *వ్యర్థములయిన ఇచ్చకపు మాటలతో ఉత్తముడయిన ధర్మరాజును ఉడికించాను. దుర్మార్గులయిన నా కొడుకులకు యుద్ధంలో చావు సిద్ధం. అటువంటప్పుడు దుఃఖం రాకుండా ఉంటుందా?*

వి: 1. సంజయుని ధర్మరాజు దగ్గఱకు పంపాడు ధృతరాష్ట్రుడు - కాని ఇది ఇస్తానని ఏమీ చెప్పలేదు. ఎంతో ప్రియంగా మాట్లాడి సంజయుని పంపాడు. సంజయుడూ వెళ్లి ధర్మరాజు దగ్గర అట్లాగే మాట్లాడివచ్చాడు. అందుకే సంజయు రాయబారాన్ని "శుష్కప్రియాలు - శూన్యహస్తాలు" అంటారు.

2. ఇందులో ధృతరాష్ట్రుడు తనంత తానే తనతప్పును బయలు పరిచాడు.

వ: **నెవ్వగలు నివ్వటిల్ల నీక నిలుపు నట్టిది యెయ్యది దాని నెఱింగింపు మనిన విదురుం డిట్లనియె.** 83

అ: నివ్వటిల్లు = కలుగు.

భా: *దుఃఖం కలుగకుండా నిలుపగలిగిన దానిని తెలుపు మంటే విదురుడిట్లా అన్నాడు.*

తే. **నియత తపమును నింద్రియ నిగ్రహంబు**
భూరి విద్యయు శాంతికిఁ గారణములు;
వాని యన్నింటికంటె మేలైన శాంతి
కారణము లోభ ముడుగుట కౌరవేంద్ర! 84

అ : కౌరవ + ఇంద్ర = కౌరవశ్రేష్ఠుడా!; నియత తపమును = నియమ సహితమయిన నిత్య తపస్సూ; ఇంద్రియనిగ్రహంబున్=ఇంద్రియాలను నిగ్రహించుకోవడమూ;భూరి విద్యయున్= అధికమయిన అధ్యాత్మ విద్య; శాంతికిన్ కారణములు=మనశ్శాంతికి కారణాలు; వాని

అన్నిటికంటెన్; మేలు+ఐన=శ్రేష్ఠమయిన; శాంతి కారణము; లోభము+ఉడుగుట=దురాశ విడిచిపెట్టడం.

భా : రాజా! నియమ పూర్వకమయిన తపస్సు, ఇంద్రియ నిగ్రహమూ ఆధ్యాత్మికవిద్య. ఈ మూడూ మనశ్శాంతికి కారణాలు. వీటి అన్నిటిని మించిన శాంతికారణం లోభం విడిచిపెట్టడం.

వి : **నాన్యత్ర విద్యాతపసో ర్నాన్య త్రేంద్రియనిగ్రహాత్**
నాన్యత్ర లోభ సంత్యాగాత్ శాంతిం పశ్యామి తే 2నఘ 5-36-49

దీని ననుసరించి మరో చక్కని శ్లోకముంది మూలంలో. తెలుగులో తిక్కన ఎందుకో వదలిపెట్టాడు.

బుద్ధ్యా భయం ప్రణుదతి తపసా విన్దతే మహత్
గురుశుశ్రూషయా జ్ఞానం శాంతిం త్యాగేనవిన్దతి 5-36-50
ఇంకోక శ్లోకం కూడ ఇక్కడ పేర్కొనాలి
స్వధీతస్య సుయుద్ధస్య సుకృతస్యచకర్మణః
తపసశ్చ సుతప్తస్య తస్యాన్తేసుఖ మేధతే 5-36-52

వ: **అని వెండియు.** 85

భా : అని ఇంకా ఇలా అన్నాడు

క. **జ్ఞాతుల పూరితమును గో**
వ్రాతము నాక్రమము విప్రవర్గము చనవున్
నాతుల కారింపమియును
బ్రీతిం జననిచ్చు నతని పెంపొప్పు నృపా! 86

అ: నృపా! =రాజా! జ్ఞాతుల పూరితమును= జ్ఞాతుల సమృద్ధినీ, గోవ్రాతము-ఆక్రమము = గోసముదాయం యొక్క వ్యాప్తినీ, విప్రవర్గము చనవున్=బ్రాహ్మణ సముదాయం యొక్క చనవునూ; నాతుల కారింపమియును=స్త్రీలయొక్క బాధారాహిత్యమూ / బాధలేక పోవటమూ; ; ప్రీతిన్ = ప్రీతితో; చననిచ్చు-అతనిపెంపు = చెల్లనిచ్చే వాని గొప్పదనం, ఒప్పున్= సముచితంగా ఉంటుంది.

భా: 1. జ్ఞాతుల సమృద్ధినీ, 2. ఆవుల వ్యాప్తినీ, 3. విప్రులచనవునూ 4. స్త్రీలను బాధింపకపోవటమూ ఈ నాలుగూ చెల్లనిచ్చేవాని పెంపు సముచితంగా ఉంటుంది.

వి : ఈ పద్యంలో పోరితము అని ఒక పాఠమూ- నాతుల కారించుటయును అని ఒక పాఠమూ కనిపిస్తున్నాయి. పోరితము కంటె పూరితము అనేది మూలాను సారిగా ఉంది. ఇచ్చట మూలంలో దీనికి సంబంధించి రెండు శ్లోకాలు కనిపిస్తాయి. అవి ఇవి.

1. **సంపన్నం గోషు సంభావ్యం సంభావ్యం బ్రాహ్మణే తపః**
సంభావ్యం చాపలం స్త్రీషు సంభావ్యం జ్ఞాతితో భయమ్ 5-36-59
2. **బ్రాహ్మణేషుచ యే శూరా స్త్రీషు జ్ఞాతిషు గోషుచ**
వృంతాదివ ఫలంపక్వం ధృతరాష్ట్ర పతంతి తే 5-36-59

1. ఈ రెండిటిలో జ్ఞాతుల సమృద్ధి కోరదగినది అను భావమే ప్రస్ఫుట మగుచున్నది. అందుచే పూరితము అను పాఠము గ్రహింపబడినది.

2. స్త్రీల విషయమై... నాతులకు- ఆరు- ఇంచుటయును అని

ఒక పాఠము- ఈ పాఠములో స్త్రీలకు ఆరు (సంపదలు) చెల్లనివ్వాలని, స్త్రీ ధనము ఆరు విధాలనీ ఆ ఆరు విధాలనూ చెల్లనివ్వాలని చెపుతారు- కాని సంఖ్యావాచకమయిన ఆఱు శబ్దము శకట రేఫ యుక్తముకాని సాధురేఫ యుక్తము కాదు- అందుకే ఈ అర్ధము సమంజసము కాదు.

అందుచే నాతుల కారింపమియును అను పాఠము గ్రహింపబడినది. దానికి స్త్రీలను దుఃఖపెట్టకపోవడము, కలకంఠి కన్నీరొలుక కుండచూడటము చెల్లనివ్వాలని అర్థం చెప్పటం సముచితంగా కనిపించింది. ఈ అర్థం మూలానుగుణంగా కూడ కనపడింది.

క. **అలమికొని యొండొరుల ప్రో**
పులఁ బ్రాపుల నెలమి కలిమిఁ బొంది బహుజ్ఞా
తులు నెమ్మిఁగూడి తామర
కొలని క్రియన్ సిరికిఁ బట్టగుదు రుజ్జ్వలులై. 87

అ: అలమికొని=అల్లుకొని, వ్యాపించి; ఒండొరుల ప్రోపులన్= పరస్పరము పోషణలతో; ప్రాపులన్= అండదండలతో, ఎలమి కలిమిన్ పొంది=సంతోషం అనే సంపదపొంది, బహుజ్ఞాతులు=చాలామంది జ్ఞాతులు; నెమ్మిన్‌కూడి=ప్రేమతో కలిసి; ఉజ్జ్వలులై=ప్రకాశమానులై; తామరకొలనిక్రియన్= తామరపూల సరస్సువలె; సిరికిన్ పట్టు అగుదురు= సిరిసంపదలకు నిలయ మవుతారు- లక్ష్మీనిలయు లవుతారు.

భా: *ఒకరికొకరు సహకరించుకొంటూ అండదండలుగా ఉంటూ అంతటా వ్యాపించి సంతోషం పొంది జ్ఞాతులు కలిసిమెలిసిఉంటే తామరపూల చెరువులాగా సిరి నిలయంగా ఉంటారు.*

వి: సిరి అంటే లక్ష్మి- లక్ష్మీదేవి పద్మంమీద ఉంటుంది. అనగా సిరికి నిలయం పద్మం. తామరకొలను ఉజ్జ్వలంగా దేదీప్యమానంగా ఉంటుంది. పరస్పర సహకారాలతో జ్ఞాతులు ఉజ్జ్వలంగా భాసిస్తారు. దీనిమూలం ఇది.

అన్యోన్య సముపష్టంభా దన్యోన్యాపాశ్రయేణచ
జ్ఞాతయ స్సంప్రవర్ధన్తే సరసీవోత్పలాన్యుత. 5-36-63.

మూలంలో ఉత్పలం- సరస్సు. తెలుగులో అది తామరకొలనుగామారి మరింత ఔచితీ మహితమయింది. తామర తంపరగా వ్యాపిస్తారనే సామెతను కూడా ఈ ఉపమానం స్ఫురింప జేస్తోంది.

చ: **కరితురగాది ఘట్టనయు గాలియు నొంపదె యొంటి నున్న య**
త్తరువు? ననేక భూరుహవితానము గుంపయి పేర్చి బాధలం
బొరయునె? యన్న దమ్ములును బొందిన నేరి కసాధ్యు లట్లుగా
కెరవయి నిల్చినం గెలని కెల్లిదమై పఱివోదు రెంతయున్. 88

అ: ఒంటిన్ ఉన్న- ఆ తరువున్=ఒంటరిగా ఉన్న చెట్టును; కరితురగ+ఆది= ఏనుగులు గుఱ్ఱాలు మొదలయినవాని, ఘట్టనయున్=రాపిడియు; గాలియున్; నొంపదె?= బాధింపదా?; అనేక భూరుహవితానము= ఎన్నోచెట్లగుంపు; గుంపయిపేర్చి=గుంపుగా చేరి; బాధలన్ పొరయునె?=బాధలను పొందునా?; అన్నదమ్ములును; (ఈ పాండవులును, కౌరవులును)

పొందినన్=కలిసి ఉంటే; ఏరికిన్-అసాధ్యులు=ఎవరిచేతనూ సాధింపబడరు; అట్లుగాక; ఎరవు+ అయినిల్చినన్= వేరుగా నిలిస్తే; కెలనికిన్=సమీపస్థులకు; ఎల్లిదమై= చులకన అయి; ఎంతయున్ పఱివోదురు= పూర్తిగా నశించిపోతారు.

భా: ఒక్క చెట్టూ ఒంటరిగా ఉంటే ఏనుగులూ గుర్రాలు మొదలయిన వాని రాపిడి, గాలి దానిని బాధిస్తాయి. చాలా చెట్లు గుంపుగా చేరి ఉంటే ఏవీ బాధించలేవు. అలాగే అన్నదమ్ములు కలిసిమెలిసి ఉంటే ఎవరూ జయించలేరు. అట్లాకాక ఒంటరిగా ఎవరికివారే ఉంటే ప్రక్కవారికి చులకన అయి నశిస్తారు.

వి: 1) ఇంతకు ముందు సంజయు రాయబారంలో కృష్ణుడు పాండవులను సింహాలుగానూ, కౌరవులను అరణ్యంగానూ పోల్చి ఈ రెండూ కలిసి ఉండటం రెండిటికీ మేలని చెప్పాడు. ఉద్యో-1-35. ఇపుడు విదురుడు ఇద్దరినీ సమానంగా చెట్లుగా పోల్చిచెపుతున్నాడు. వారి వారి పాత్రలకు తగిన పోలికలివి.

2) విడివిడిగా ఉన్న చెట్లను గాలి పడగొడుతుంది అని సంస్కృతంలో చెపితే- తెలుగులో తిక్కన కరితురగాది ఘట్టనము అని చేర్చి వ్యాఖ్యానించారు. సంస్కృతంలో మరింత వివరంగా జ్ఞాతుల గురించి చెపుతాడు.

మహానప్యేకజో వృక్షో బలవాన్ సుప్రతిష్ఠితః
ప్రసహ్య ఏక వాతేన శాఖాస్కంధం విమర్దితుమ్ 5-36-60
అథ యే సహితా వృక్షాః సంఘశః సుప్రతిష్ఠితాః
తేహి శీఘ్రతమా న్వాతాన్సహన్తే2 న్యోన్యసంశ్రయాత్- 61
ఏవం మనుష్య మప్యేకం గుణైరపి సమన్వితమ్
శక్యం ద్విషన్తో మన్యన్తే వాయు ర్ద్రుమ మివైకజమ్ 62

వ: కావునఁ గౌరవులుం బాండవులు నొండొరులకుఁ బ్రాపై పొదలిన నెదిరికి నజయ్యు లగుదురు, పరుల యొత్తు లేని రాజ్యంబు పూజ్య మహిమం బరగు; వనవాసంబునం గుందిన కౌంతేయులం దడయక తెచ్చి యుచితపదం బిచ్చి నిలుపుట నీ కొడుకులకు నిలుపు గావించుట యగు నని చెప్పి మఱియు నిట్లను; బ్రియవాదు లెందును గల రప్రియంబగుంగా కేమి యని తథ్యంబు వలుకువారు లేరు; జూదంబునప్పు డే నడ్డపడి యప్రియంబగుటకు శంకింపక తథ్యంబు వలికితి, నది నీకు రుచియింపక రోగికిఁ బథ్యాహారంబు దలకంటగించు నట్లయ్యె,నైన నిప్పుడుం జెప్పెద వినుము, కాకంబులం గైకొని మయూరంబుల యెడ ననాదరంబు సేయుచందంబున సుయోధ నాదులం బట్టి యుధిష్ఠిర ప్రముఖుల విడిచితి, నేఁడు కార్యంబు ముట్టవచ్చినం దోఁపక మిడుంగుఱు సోఁకినట్లు దల్లడించెదవు; కులంబునకై యొకనిం దొఱంగుటయ నీతియని పెద్దలు సెప్పుదురు, దుర్ణయపరుండై సద్బుద్ధి సెప్ప వినండేని మనము దుర్యోధనుం దొఱంగిన నేమియగు? నది యట్లుండె; సంపద సహాయంబు నపేక్షించియుండు, సహాయంబు సంపద నుద్దేశించి వర్తిల్లు, నిట్లివి యొకటొకటి పొందునంగాని సిద్ధింపవు,

గావున నీ సంపద పాండవులకును వారి సహాయత్వంబు నీకునుం బ్రియంబొనరింప నొండొరుల కలయుట మేలుకాక మనలావు వెలిసేయుట లెస్సయగునే? కురువంశ నిస్తారకులగు భీష్మయుధిష్ఠిరులును, నవక్ర విక్రములగు కర్ణార్జునులును, బ్రతాపధాములగు భీమ, దుర్యోధనులును, శస్త్రాస్త్రపారగులగు నభిమన్యు లక్ష్మణ ప్రభృతి కుమారులును; శాపానుగ్రహ సమర్థులగు ద్రోణద్రుపదాది పరమాప్తులును, వారివారి బంధు మిత్ర జనంబులును, నొక్కమొగంబై నీ పనుపు సేయుచు నయ విక్రమంబు లప్రతి హతంబులై నడవం, బృథివి శాసింప భవదీయ విభవం బుజ్జ్వలంబై యొరుల కెడలేక చెల్లుచున్న నెంత యొప్పగునో! యటు విచారింపుము. పాండవులు ధీరమతులై వైర మెత్తక యూరక తొలంగి యుండి రేనియుఁ గతిపయదినంబులలోఁ జీకాకుపడి చెడుం గాక; గాంధారీ నందనుచేత వసుంధరా పరిపాలన భారంబు నిర్వహింపఁబడునే? యనిన విని ధృతరాష్ట్రుండు విదురున కిట్లనియె. 89

అ: ప్రాపు=అండ; సహాయము; ఎదిరికిన్ =శత్రువునకు; అజయ్యులు=జయింప శక్యము కానివారు; ఒత్తు=ఒత్తిడి, తడయక=ఆలసింపక; ఉచితపదంబు=తగినపదవి; ప్రియ వాదులు = ప్రియంగా మాట్లాడేవారు; తథ్యము =నిజము; తలకంటగించు = తలనొప్పి పెట్టు; కాకంబులు =కాకులు; మయూరంబులు=నెమళ్లు; మార్జాలము=పిల్లి; యుధిష్ఠిరుఁడు= ధర్మరాజు; మిడుంగుఱు = నిప్పుకణము; తల్లడిల్లు = భయపడు; తొఱంగుట = విడుచుట; దుర్ణయము= దుర్నీతి; పొందు = కలయిక; లావు = బలము; వెలిసేయుట=బహిష్కరించుట; లెస్స = మేలు; అవక్రవిక్రములు = సూటియైన పరాక్రమము కలవారు; ప్రతాపధాములు = ప్రతాపానికి నిలయమయినవారు; శస్త్ర + అస్త్ర + పారగులు = శస్త్రాలలో అస్త్రాలలో పండితులు; అప్రతి హతంబులు=కొట్టబడనివి, ఎదురులేనివి; ఒరులకు = ఇతరులకు; ఎడలేక = అవకాశము లేక; ఒప్పు + అగునో? = బాగుండునో!; కతిపయ దినంబులు = కొద్దిరోజులు; గాంధారీ నందనుఁడు= దుర్యోధనుడు; వసుంధర = భూమి.

భా : అందుచేత కౌరవులూ పాండవులూ ఒకరికొకరు సహాయంగా ఉంటే శత్రువులు జయింపలేరు. శత్రువుల ఒత్తిడి లేని రాజ్యం సుభిక్షంగా ఉంటుంది. పూజనీయ మవుతుంది. అరణ్యవాసంతో కృశించిన పాండవులను వెంటనే తీసుకొని వచ్చి తగిన పదవి ఇచ్చి నిలుపుకోవడం నీ కొడుకులను రక్షించుకోవడమే అవుతుంది. అని ఇంకా ఇలా అన్నాడు. ప్రియంగా మాట్లాడేవారు ఎక్కడయినా ఉంటారు. **అప్రియం అయితే అయిందిలే** అని అనుమానించక నిజం చెప్పేవారు లేరు. జూదం సమయంలో నేను అడ్డుపడి అప్రియం అయినా సరే అని నిజం చెప్పాను. అది నీకు ఇష్టం కాలేదు. రుచింపలేదు. రోగికి పథ్యంలాగా తలనొప్పి కలిగించింది. అయినా ఇపుడూ చెపుతాను. కాకుల్ని గ్రహించి నెమళ్లు విడిచినట్లు, పిల్లుల్ని గ్రహించి సింహాలను విడిచినట్లు దుర్యోధనాదులను పట్టుకొని ధర్మరాజాదులను విడిచిపెట్టావు. ఇపుడు కార్యం మీదికి వస్తే ఏమీ తోచక నిప్పు ముట్టుకొన్నట్లు తల్లడిల్లిపోతున్నావు. **వంశం అంతటిని రక్షించేందుకు**

ఒకనిని విడిచి పెట్టడం నీతి అని పెద్దలు చెపుతారు. దుర్నీతిపరుడై బుద్ధి చెప్పినా వినకపోతే మనం దుర్యోధనుని విడిచిపెడితే ఏమవుతుంది? అది అలా ఉంది. సంపద అనేది సహాయాన్ని బట్టి ఉంటుంది. సహాయం సంపదనుబట్టి వస్తుంది. ఇవి ఒకదానితో ఒకటి కలిస్తేనే గాని పనికిరావు. అందుచేత నీసంపద పాండవులకూ, వారి సహాయత నీకూ ప్రీతి కలిగించేటట్లు ఇద్దరూ కలిసి ఉండటం మేలు. వారిని వేరు చేయడం మంచిదికాదు. కురువంశం అంతా తరింపజేసే భీష్మధర్మరాజులూ, మహా పరాక్రమవంతులు కర్ణార్జునులూ, ప్రతాప నిలయులయిన భీమ దుర్యోధనులూ, అభిమన్యుడు లక్ష్మణుడు మొదలయిన కుమారులూ, శాపానికీ అనుగ్రహానికీ కూడా సమర్థులయిన ద్రోణ ద్రుపదాదులూ, వారివారి బంధువులూ మిత్రులూ ఒక్కటై నీ ఆజ్ఞ నిర్వర్తిస్తూ రాజనీతి పరాక్రమాలు నిరాటంకంగా నడుస్తూ ఉండగా, భూమినంతటినీ శాసిస్తూ నీవిభవం ఇతరులకు అవకాశం లేకుండా చలామణీ అవుతుంటే ఎంత బాగుంటుందో ఆలోచించు. పాండవులు ధైర్యంతో వైరం వహించక ఊరకే తప్పుకొన్నా కొద్దిరోజుల్లో రాజ్యం అస్తవ్యస్తమై చెడిపోతుంది. అంతేకాని దుర్యోధనుడు భూపరిపాలనభారం నిర్వహించలేడు అన్నాడు.

అపుడు ధృతరాష్ట్రుడు విదురునితో ఇలా అన్నాడు.

వి. 1. ప్రియవాదిత్వం :

ప్రియంగా మాట్లాడేవారు చాలమంది ఉంటారుకాని అప్రియమయినా సత్యం చెప్పేవారు అరుదు. ఇదే విషయం రామాయణంలో మారీచుడు రావణునితో అంటాడు.

సులభాః పురుషా రాజన్ సతతం ప్రియవాదినః
అప్రియస్యచ పథ్యస్య వక్తా శ్రోతాచ దుర్లభః

అప్రియమయినా సరే అని సత్యమూ హితమూ చెప్పేవారే దొరకరు - ఒకవేళ ఎవరయినా చెప్పినా వినేవాడు దొరకడు. ఈ శ్లోకమే ఇక్కడ కూడా మూలంలో కనిపిస్తుంది.

2. కులంబునకై................ నీతి - దీనిమూలం ఇది.

త్యజే త్కులార్థే పురుషం గ్రామస్యార్థే కులం త్యజేత్
గ్రామం జనపదస్యార్థే ఆత్మార్థే పృథివీం త్యజేత్ 5-37-16

3. సంపద – సహాయము : దీని మూలం సరిగా ఇది.

సహాయబంధనా హ్యర్థాః సహాయాశ్చార్థబంధనాః
అన్యోన్య బంధనావేతౌ వినాన్యోన్యం న సిధ్యతః 5-37-34

4. ఈ సందర్భంగా చెప్పబడిన శ్లోకం ఎందుకో (ఒకటి) తిక్కన విడిచిపెట్టాడు.

యస్మిన్ యథా వర్తతే యోమనుష్యః
తస్మిం స్తథా వర్తితవ్యం సధర్మః
మాయాచారో మాయయా వర్తితవ్యః
సాధ్వాచారః సాధునా ప్రత్యుదేయః 5-37-7

తే: నీవు సెప్పిన మాటలు నిర్మలములు,
నిపుణ సమ్మతములు, రాజనీతి మార్గ

బోధకంబులు నైనను బుత్రు విడువ
నోప 'ధర్మో జయతి' యని యుండువాఁడ. 90

అ: నీవు; చెప్పిన మాటలు; నిర్మలములు= స్వచ్ఛమైనవి; నిపుణ సమ్మతములు= పండితులంగీకరించినవి; రాజనీతిమార్గబోధకములున్=రాజనీతి మార్గాన్ని తెలిపేవి; ఐనను; పుత్రున్; విడువనోపన్=విడిచిపెట్టలేను; "ధర్మోజయతి"=ధర్మం జయిస్తుంది; అని; ఉండువాడన్.

భా: నీవు చెప్పిన మాటలన్నీ నిర్మలములు, పండిత సమ్మతములు, రాజనీతి మార్గాన్ని తెలిపేవి. అయినా కొడుకును విడవలేను. ధర్మం జయిస్తుందిలే అని ఊరకుంటాను.

వి: ఇందులో ధృతరాష్ట్రుని అభిప్రాయం వ్యక్తమయింది. పుత్రవ్యామోహం బయటపడింది. ఆ వ్యామోహంతోనే ఉదాసీనత వహించాడు ధృతరాష్ట్రుడు.

2. ధర్మోజయతి :- ధర్మానికీ అధర్మానికీ విరోధం వచ్చినపుడు దర్మమే చివరకు జయిస్తుంది. అందుచేత మానవుడు ధర్మాన్ని విడువరాదు. ఇక్కడ మూలాన్ని చక్కగా ఆవిష్కరించారు తిక్కన.

సర్వం త్వమాయతీయుక్తం భాషసే ప్రాజ్ఞసంమతమ్
నచోత్సహే సుతం త్యక్తుం యతో ధర్మ స్తతో జయః 5-39-7.

వ: అనిన విని విదురుం డతని కిట్లనియె. "దేవా! జ్ఞాతులు గుణహీనులైనను విడువం దగ దనిన, సకలగుణ సంపన్నులై భవత్ప్రసాదంబు గోరుచున్న కౌంతేయులన్ దిగవిడువం దగునే! యేను నీకు హితంబు గోరెడువాఁడ నని నిశ్చయించి నా బుద్ధి వినుము. వారల జీవనంబునకుఁ గొన్ని యలంతి పల్లియలైనను దుర్యోధను నొడంబఱిచి యేర్పఱిచి తెఱంగు పఱిచిన లెస్సయని చూచెద; నతని విడువ వలయునని చెప్పితినే; నీ పెనఁకువం బశ్చాత్తాపంబు పుట్టు,దాని కప్పుడు ప్రతీకారంబులేదు; కావున నెల్లభంగుల నియ్యకొని పాండవులతోడ సంధిసేయ వలయు నట్లుంగాక. 91

అ: గుణహీనులు : సద్గుణములు లేనివారు; భవత్ + ప్రసాదంబు = నీ అనుగ్రహము; కౌంతేయులు = కుంతీకుమారులు పాండవులు; జీవనంబు = జీవితము; అలంతి పల్లియలు = చిన్న పల్లెటూళ్ళు; ఒడంబఱిచి = ఒప్పించి, తెఱంగు = సంధి; లెస్స = మేలు; పెనఁకువ = యుద్ధము; ఎల్ల భంగులన్ = అన్ని విధాల ; ఇయ్యకొని = ఇష్టపడి.

భా: ధృతరాష్ట్రుని మాటలు విని విదురుడిలా అన్నాడు. రాజా! జ్ఞాతులు గుణవంతులు కాకపోయినా విడువరాదు; అంటే సకల సద్గుణ సంపన్నులై నీ అనుగ్రహాన్ని కోరుకొంటున్న పాండవులను విడిచిపెట్టవచ్చునా? నేను నీకు హితం కోరేవాడనని నిశ్చయించి నా మాటవిను. పాండవుల జీవనానికి కొన్ని చిన్నపల్లెలయినా దుర్యోధనుని ఒప్పించి ఇచ్చి సంధిచేస్తే మంచిదని నేననుకొంటాను. దుర్యోధనుని విడువవలెనని చెప్పాను కూడా నేను. లేకపోతే ఈ వచ్చే యుద్ధం వల్ల పశ్చాత్తాపం కలుగుతుంది. దాని కప్పుడు ప్రతీకారం ఏదీలేదు. అందుచేత అన్నివిధాల పాండవులతో సంధి చేసుకోవాలి. అదీగాక.

క. **తమలోని పాళ్లకుంగా**
సమరము సేసినను గాని చాఁజనదె? శరీ
రము లాధివ్యాధి జరా
సమన్వితము లగుటఁ జేటు సహజం బరయన్. 92

అ: తమలోని పాళ్లకున్-కాన్ = తమతమ రాజ్యభాగాలకోసం; సమరము - చేసిననుకాని = యుద్ధం చేస్తేనే కాని; చాన్ + చనదె? = చావకూడదా; శరీరములు; ఆధివ్యాధి జరా సమన్వితములు - అగుటన్ = అధివ్యాధులతోనూ, ముసలితనంతోనూ కూడినవవడం చేత; అరయన్ = పరిశీలింపగా; చేటు సహజంబు = వినాశం తథ్యం/సహజం.

భా: *తమ రాజ్య భాగాల కోసం దెబ్బలాడుకొంటేనేగాని చావకూడదా? అసలు పరిశీలిస్తే ఈ దేహాలు ఆధివ్యాధులతోనూ ముసలితనంతోనూ కూడినవి. అందుచేత మరణం సహజం.*

వి: **అధివ్యాధులు : ఆధి = మానసికమయిన రోగం. వ్యాధి = శారీరకమయిన రోగం. శారీరకమయిన రోగమే కాకుండా మనోవ్యధ కూడా శరీరాన్ని శిథిలపరుస్తుంది, నశింపజేస్తుంది.**

చ. **గజతురగాది సంపదలుఁ, గాంతలతోడి విహారలీలలుం,**
బ్రజ కనురాగ మొందఁ బరిపాలన సేయు క్రమంబుఁ, బోరులన్
విజయముఁబొంది పేర్చుటయు, విస్ఫురితాభరణానులేప వ
స్త్ర జనిత వైభవంబుఁ, గల రాజులుఁ బోయిర కాక నిల్చిరే! 93

అ: గజతురగాది సంపదలున్ = ఏనుగులు, గుర్రాలు మొదలయిన సంపదలూ; కాంతల తోడి విహార లీలలున్ = వనితలతో విహారాలు విలాసాలూ; ప్రజకున్ = ప్రజలకు; అనురాగమొందన్ = అనురాగం కలిగేటట్లు; పరిపాలన - చేయు; క్రమంబున్ = విధానమూ; పోరులన్ = యుద్ధాల్లో; విజయమున్ పొంది; పేర్చుటయున్ = విజృంభించటమూ; విస్ఫురిత+ ఆభరణ+అనులేప, వస్త్ర జనితవైభవంబున్ = ప్రకాశవంతమయిన అలంకారాలు, మైపూతలు, వస్త్రాలు - వీటివల్ల కలిగిన విభవమూ; కల రాజులున్; పోయిర కాక = చనిపోయారే కాని; నిల్చిరే? = శాశ్వతంగా ఉన్నారా?

భా: *ఏనుగులూ గుర్రాలూ మొదలయిన వాహన సంపదలూ, వనితా విహారాలు; ప్రజలకు హితంతో అనురాగం కలిగేటట్లు పరిపాలించే పద్ధతీ; యుద్ధాల్లో విజయాలూ; ఆభరణాలూ, వస్త్రాలూ అనులేపనాదులూకల వైభవాలూ ఉన్న రాజులు చచ్చిపోయారు కాని శాశ్వతంగా నిలవలేదు కదా!*

వి: ఈ తనువు శాశ్వతం కాదు. ఎన్ని వైభవాలు ఉన్నా శాశ్వతంకాదు. ఈ విషయంలో "కారే రాజులు రాజ్యముల్ గలుగవే గర్వోన్నతిం బొందరే! వారేరీ సిరిమూట గట్టు కొని పోవంజాలిరే' అన్న పోతన గారి ప్రసిద్ధ పద్యం గుర్తువస్తుంది.

క: **కావునఁ జెవికిం జేఁదగు**
నీ వాక్యము వినఁగఁ జాలి తేని, నిహపర
శ్రీ విభవములకుఁ గీర్తికిఁ
దావలమై వెలయు టింత తథ్యము సుమ్మీ! 94

అ: కావునన్; చెవికిన్; చేఁదు+ అగు=ఇష్టం కాని; ఈ వాక్యమున్; వినఁగన్ చాలితివేని= వినగలిగితే; ఇహపర శ్రీ విభవములకున్=ఐహిక సంపదలకూ, పరలోక సంపదలకూ; కీర్తికిన్; తావలమై=స్థానమై; వెలయుట-ఇంత= ఉండటం అంతా; తథ్యము సుమ్మీ=తప్పదు-సత్యం సుమా.

భా: *అందుచేత చెవికి ఇష్టం కాని ఈ మాట వినగలిగితే, ఇహపర సుఖాలకూ, కీర్తికీ నిలయమై వెలయడం తథ్యం.*

క. **తగ నీలో నూహింపుము;**
దిగ విడువకు ధర్మతనయు దృఢమతివై పొం
దగు చందము, గొడుకులకుం
బ్రెగడలకుం జెప్పి తీర్పు పెంపేర్పడఁగన్. 95

అ: కొడుకులకున్; ప్రెగడలకున్ = మంత్రులకూ; చెప్పి; తీర్పు పెంపు - ఏర్పడఁగన్= నిర్ణయం కలిగేటట్లు; దృఢమతివై = దృఢమయిన బుద్ధి కలిగి; పొందగు చందము = సంధి చేసుకొని కలిసి ఉండే పద్ధతి; తగన్ నీలో ఊహింపుము; ధర్మతనయున్ = ధర్మరాజును; దిగవిడువకు = విడిచిపెట్టకు!

భా: *నీకుమారులయిన దుర్యోధనాదులకూ మంత్రులకూ చెప్పి, చక్కని నిర్ణయంతో, దృఢబుద్ధి కలిగి, కలిసి ఉండే పద్ధతిని గూర్చి నీలో ఆలోచించు అంతేకాని ధర్మరాజును విడిచిపెట్టకు."*

ఆ: **అనిన నాంబికేయుఁ డను "నీదు పలుకులఁ**
గలఁక దేఱి, బుద్ధి దెలివి నొందె,
నిట్ల చేయువాఁడ, నిదియ కర్జము, ధర్మ
మును యశంబు లాభమును దలంప". 96

అ: అనినన్; ఆంబికేయుఁడు-అనున్=ధృతరాష్ట్రుడు అంటాడు; "నీదు పలుకులన్= నీ మాటల వల్ల; బుద్ధి; కలఁక దేఱి = తేరుకొని; కల్మషం విడిచి; తెలివిన్ - ఒందె = తెలివిని పొందింది; ఇట్ల చేయువాఁడన్ = ఇట్లాగే చేస్తాను; ఇది కర్జము = ఇదే తగిన పని; తలంపన్ = ఆలోచిస్తే; ధర్మమును; యశంబును = కీర్తి; లాభమును.

భా: *అపుడు ధృతరాష్ట్రుడు ఇలా అన్నాడు - "నీ మాటల వల్ల నా మనస్సు నిష్కల్మషమయి తెలివి పొందింది. ఇట్లాగే చేస్తాను. ఇదే మంచి పని, కర్తవ్యమూను. అంతేకాదు ధర్మమూ కీర్తికరమూ లాభకరమూ కూడా.*

చ: **అనుఁడు ముదంబు, నమ్మమియు నాత్మఁ బెనంగొన నన్నతోడ ని**
ట్లను, విదురుండు"పెద్ద వడి కక్కట! నీ మది కార్యవృత్తి నూ
ల్కొనియె, సుయోధనుం గని యకుంఠిత నిశ్చయమై యతండు వ్రా
లిన దెస వ్రాలకుండిన, బలే! మము బోటులకుం బ్రియంబగున్." 97

అ: అనుఁడున్=అనగానే; ముదంబు=సంతోషమూ; నమ్మమియున్=అవిశ్వాసమూ; ఆత్మన్ = మనస్సులో; పెనంగొనన్ = పెనవేసుకొనగా; విదురుండు; అన్నతోడన్; ఇట్లు అనున్; అక్కట! =ఆహా! పెద్దవడికిన్=చాలాకాలానికి; నీ మది=నీ మనస్సు; కార్యవృత్తిన్=సరియైన పనిని; నూల్కొనియెన్=చేపట్టింది; సుయోధనున్- కని =దుర్యోధనుని చూసి; అకుంఠిత నిశ్చయమై= మొక్కవోని నిశ్చయముఅయి; అతండు వ్రాలిన దెసన్=అతడు మొగ్గిన దిక్కుకే; వ్రాల కుండినన్= నీవు కూడా వాలకపోతే; బలే!=ఎంత బాగుంటుందో; మముబోటులకున్=మా వంటి వారికి; ప్రియంబు అగున్.

భా: *ఈమాటలు విన్న విదురుని మనసులో సంతోషమూ, అవిశ్వాసమూ కలిగినవి. అపుడు అన్నతో ఇలా అన్నాడు. "చాలా కాలానికి నీ మనస్సు ఒక సత్కార్యాన్ని చేపట్టింది. ఈ అభిప్రాయం దుర్యోధనుని చూసి మారిపోకుండా ఉంటే బలేగా ఉంటుంది. మా వంటి వారందరకూ ప్రీతికరంగా ఉంటుంది."*

వి: "నీ మాటలతో నా మనస్సు, నిష్కల్మష మయింది. నీ మాటలు ఆచరిస్తాను" అన్నాడు ధృతరాష్ట్రుడు. ఇది విదురునికి నమ్మశక్యంగా లేదు - ఇది ఎంతసేపు? దుర్యోధనుని చూసి కూడా ఈ నిశ్చయం నీ దగ్గర నిలవాలికదా అని అపనమ్మకం.

వ. **అని పలికి నిట్టూర్పు నిగిడించి.** 98

భా: *అని చెప్పి ఒక నిట్టూర్పు పుచ్చి.*

క. **"దైవంబ నేర్పుగా, కిటు**
వోవఁగ నే నేర్తు నేరఁ బొమ్మని పలుకం
గా వశమె నరున? కెక్కుడు
దైవము పౌరుషముకంటె ధరణీనాథా!" 99

అ: ధరణీనాథా! = రాజా! దైవంబు + అ = దైవమే; నేర్పుగాక = నేర్చును; ఇటు + పోవఁగన్ నేను నేర్తున్ = ఈ విధంగా వెళ్లటం నాకు చేతనవును; నేరన్ = చేతకాదు; పొమ్ము; అని పలుకంగాన్ =చెప్పటానికి; నరునకున్ వశమె =మానవునికి శక్యమా?; పౌరుషము కంటెన్= పురుష ప్రయత్నం కంటె; దైవము ఎక్కుడు = దైవం ఎక్కువ.

భా: *"రాజా! నేనీ మార్గంలో వెళ్లగలను. ఈ మార్గంలో వెళ్లను అని చెప్పటానికి మానవునకు సాధ్యం కాదు. ఒక్క దైవమే అట్లా చేయగలడు. అందుచేతనే పురుషకారం కంటె దైవానుగ్రహం శక్తి ఎక్కువ."*

వ. **అనిన విదురునకు వైచిత్రవీర్యుం డిట్లనియె.** 100

భా: అనిన విదురునితో ధృతరాష్ట్రుడు ఇలా అన్నాడు.

తే: ధర్మపథమును, నీతి తత్త్వంబు తెరువు
నిర్మలములగు పలుకుల నీవు నాకుఁ
దెలియఁ జెప్పితి; పరమార్థ దృష్టి యెట్టి
వాక్యములఁ గల్గుఁ జెప్పుము దాని ననఘ! 101.

అ: అనఘ! = పుణ్యాత్ముడా!; ధర్మపథమును = ధర్మ మార్గమూ; నీతి తత్త్వంబు తెరువున్ = నీతి తత్త్వం యొక్క మార్గమూ; నిర్మలములు అగు పలుకులన్ = స్పష్టమైనమాటలతో; నీవు; నాకున్ = తెలియఁ జెప్పితి; పరమార్థ దృష్టి = పరమార్థాన్ని గూర్చిన దృష్టి; ఎట్టి వాక్యములన్ కల్గున్?; వానిన్ = ఆ వాక్యాలను; చెప్పుము.

భా: ధర్మమార్గమూ నీతిమార్గమూ నిర్మలమయిన మాటలతో నాకు తెలిసేటట్లు చెప్పావు. ఇంక పరమార్థ దృష్టి కలిగించే వాక్యాలు చెప్పు.

-: సనత్సుజాతుఁడు ధృతరాష్ట్రునకు నధ్యాత్మ తత్త్వంబుఁ జెప్పుట:- సం: 5-41-2

వ: అని యడిగిన విదురుం డతని కిట్లనియె. "నాకుఁ దోఁచిన యన్నియు నానేర్చినట్లు నీకెఱింగించితి. నత్యంత గుహ్యంబులగు నర్థంబులు పురాణుం డయ్యునుం గుమారుండగు సనత్సుజాతుండు దెలుప నోపుంగాని యిటమీఁద నాకుం దెలియ" దనిన ధృతరాష్ట్రుం డమ్మునీంద్రుండు నాకెంత దవ్వు? నీవ యవియునుం జెప్పు" మనిన "నేను శూద్ర యోని జాతుండ. వేదాంత వేద్యంబు లగు నర్థంబులు నాకగోచరంబు. లమ్మహాత్ము బుద్ధి నేనెఱుంగుదు. దేవతలకుం దెలియనట్టివి యాతనికిం దెలియు నతండు. దెలుపంజాలు" ననిన ధృతరాష్ట్రుం డతి కుతూహలుండై. 102

అ: అత్యంత గుహ్యంబులు=మిక్కిలి రహస్యంబులు; పురాణుండు= ప్రాచీనుడు;దవ్వు =దూరము; శూద్రయోని జాతుండు= శూద్ర స్త్రీకి పుట్టినవాడు; వేదాంత వేద్యంబులు = వేదాంతము చేత తెలిసికొనదగినవి; అగోచరంబులు = కనిపించనివి - తెలియనివి.

భా: అని అడిగితే విదురుడిలా అన్నాడు. నాకు తెలిసిన వన్నీ నాకు చేతనయినట్లు నీకు చెప్పాను - మిక్కిలి రహస్యము లయిన విషయాలు సనత్సుజాతుడు చెప్పగలడు. నాకు తెలియదు. అంటే అపుడు ధృతరాష్ట్రుడు "అతడు నాకు చాలా దూరంలో ఉన్నవాడు అందుచేత నీవే చెప్పు." అన్నాడు. అపుడు విదురుడు "నేను శూద్రజన్మ మెత్తినవాడను, వేదాంత విషయాలు నాకు తెలియవు. ఆసనత్సుజాతుని బుద్ధి విశేషం నాకు తెలుసు. దేవతలకు తెలియనివి కూడ ఆతనికి తెలియును. అతడు తెలుపగలడు' అన్నాడు. అపుడు ధృతరాష్ట్రుడు ఎంతో కుతూహలంతో.........

వి: సనత్సుజాతుడు ప్రాచీనుడయినా బాలుడుగా ఉండేవాడు. చక్కని విరోధాభాసం.

ఆ: మనకు నిప్పు డతనిఁ గను తెఱం గెయ్యది
యగుటయును నెఱుంగ ననిన విదురుఁ
డధికభక్తిఁ దలఁచె నాత్మలో నాశ్రిత
వత్సలత్వనిధి సనత్సుజాతు. 103.

అ: మనకున్; ఇప్పుడు; అతనిన్ = ఆసనత్సుజాతుని; కను తెఱంగు = చూసే ఉపాయం; ఏ + అది - అగుటయును ఎఱుంగన్ = ఏమిటో నాకు తెలియదు; అనినన్ = అంటే; విదురుఁడు; ఆత్మలోన్ = మనస్సులో; ఆశ్రితవత్సలత్వనిధిన్ = ఆశ్రయించిన వారిపై వాత్సల్యమునకు నిధి అయిన; సనత్సుజాతున్; అధిక భక్తిన్ = మిక్కిలి భక్తితో; తలఁచె = తలచుకొన్నాడు.

భా: మన మిపుడు అసనత్సుజాతుని ఎలా చూడాలో తెలియటంలేదు. అంటే వెంటనే విదురుడు ఆశ్రితవత్సలుడయిన ఆసనత్సుజాతుని మనసులో అధికభక్తితో తలచుకొన్నాడు.

వ: అట్లు దలంచుటయును, దివ్యజ్ఞాన మాననీయుండగు నమ్మునివరేణ్యుం డాక్షణంబ పొడసూపిన, విదురుం డతనివచ్చుట యుగ్గడించుచు వినయంబున నతని నెదుర్కొని, దండ నమస్కారంబు లాచరించి యున్నతాసనం బిడి యర్ఘ్యపాద్యంబు లిచ్చిన సంభ్రమంబుగాఁ బ్రత్యుత్థానంబును బ్రణామంబునుం జేసియున్న ధృతరాష్ట్రు నతనికిం జూపి విదురుం డిట్లనియె. 104

అ: దివ్యజ్ఞాన మాననీయుండు = దివ్యమయిన జ్ఞానం కలిగి ఉండటం చేత గౌరవింపదగినవాడు; పొడసూపు=కనపడు; దండ నమస్కారంబులు=దండము వలె నేలమీదపడి నమస్కరించుటలు; ఉన్నత+ఆసనంబు=ఎత్తయిన ఆసనము; ప్రత్యుత్థానము= లేచినిలుచుట; ప్రణామము =నమస్కారము; అర్ఘ్యపాద్యంబులు = కాళ్ళుచేతులు కడుగుకొనుటకు నీళ్లు.

భా: అలా తలచుకోగానే వెంటనే ఆసనత్సుజాతుడు ప్రత్యక్షమయ్యాడు. విదురుడు అతని రాక తెలియజేస్తూ వినయంతో అతనిని ఎదుర్కొని సాష్టాంగ నమస్కారంచేసి ఉన్నతమయిన ఆసనం ఇచ్చి అర్ఘ్యపాద్యాదులతో సత్కరించాడు. వెంటనే ధృతరాష్ట్రుడు లేచి నిలిచి నమస్కారం చేశాడు. అపుడు విదురుడు సనత్సుజాతునికి ధృతరాష్ట్రుని చూపి ఇలా అన్నాడు.

క: "దేవా! దేవరకృప నీ
భూ వల్లభుఁ డమల తత్త్వబోధకమై సౌ
ఖ్యావహమగు వాక్యచయముఁ
దా వినఁగోరుటయు మిమ్ముఁ దలఁచితి భక్తిన్. 105

దేవా!; దేవరకృపన్ = మీదయతో; ఈ భూవల్లభుఁడు= ఈ మహారాజు;

అమల తత్త్వబోధకము+ఐ =నిర్మలమయిన తత్వమును తెలిపేవి; సౌఖ్య+ఆవహము+అగు=సుఖకరమూ అయిన; వాక్యచయమున్ = వాక్యాల సముదాయాన్ని; తాన్ - వినన్ కోరుటయున్ = తాను వినాలనుకొంటే; భక్తిన్ = భక్తితో; మిమ్మున్ తలఁచితి = మిమ్మల్ని తలచుకొన్నాను.

భా: *దేవా! తమ అనుగ్రహంతో ఈ మహారాజు నిర్మలతత్త్వం బోధించే సుఖకరమయిన వాక్యాలు మీ ముఖతః వినా లనుకొన్నాడు. అపుడు నేను భక్తితో మిమ్మల్ని తలచుకొన్నాను.*

వ. మీరును గారుణ్యాతిశయంబున విజయం చేసితిరి; గురుసమాశ్రితు లగు వార లెద్దాని వలన. సుఖ దుఃఖంబులు లాభాలాభంబులుఁ బ్రియ ద్వేషంబులు నాదిగాఁగల ద్వంద్వంబులం బడక బ్రదుకుదు, రట్టి పరమార్థోపదేశంబున నితనిం గృతార్థునిం గావించి రక్షింపవలయు", నని ప్రార్థించినం బార్థివుండును దదనురూపంబులగు నాలాపంబుల నారాధించినం బ్రసన్నుండై సనత్సుజాతుం డధ్యాత్మ విషయంబులగు వివిధ వాక్యంబుల సోపాన ప్రకారంబున నంతకంతకు సూక్ష్మంబులగు నర్థంబులు సమర్థించుచు నందుఁ బ్రజ్ఞాచక్షుం డెయ్యది యేర్పడ నడిగె నదియెల్ల వివరించుచు, హృదయ పుష్కర కలితంబగు పరతత్త్వంబు ప్రసాదించునట్టి గూఢోక్తులను గ్రహించుచుండ, నెట్టకేలకుఁ బ్రభాతంబగుటయు, ధృతరాష్ట్ర విదురుల నామంత్రణంబుసేసి యద్దేవముని యంతర్ధానంబు నొందె నట్టి సమయంబున. 106

అ: కారుణ్య+అతిశయము=అధికమయిన దయ; విజయం చేసితిరి = వచ్చారు; గురుసమాశ్రితులు = పెద్దలయిన గురువులను ఆశ్రయించినవారు; పరమార్థ + ఉపదేశంబునన్= పరమార్థాన్ని ఉపదేశించడం చేత; పార్థివుండు = రాజు ధృతరాష్ట్రుడు; తత్ + అనురూపంబులు= దానికి తగిన ; ఆలాపంబులన్=మాటలతో; సోపాన ప్రకారంబునన్=మెట్లెక్కినట్లు ఒకదాని తర్వాత మరొకటిగా; ప్రజ్ఞాచక్షుండు = ప్రజ్ఞయే కనులుగా కలవాడు ధృతరాష్ట్రుడు; హృదయ పుష్కర కలితంబు = మనస్సు అనే పద్మంలో ఉన్నది; గూఢ + ఉక్తులు = రహస్య సూక్తులు ; ఎట్టకేలకు= చిట్టచివరకు; ఆమంత్రణంబు + చేసి = విడిచి;

భా: *"మీరూ దయతో విచ్చేశారు. గురువుల నాశ్రయించినవారు దేని వలన సుఖదుఃఖాలు, లాభనష్టాలు, ప్రియ ద్వేషాలు మొ॥ ద్వంద్వములలో పడకుండా బ్రతికి పోతారో అటువంటి పరామార్థాన్ని ఉపదేశించి ఇతనిని కృతార్థుని చేసి రక్షించాలి" అని విదురుడు ప్రార్థించాడు. ధృతరాష్ట్రుడు దానికి తగిన మాటలతో సనత్సుజాతుని ఆరాధిస్తే అతడు ప్రసన్నుడయ్యాడు. అతడు అధ్యాత్మ విషయాలన్నీ ఒకదాని తరువాత ఒకటి చెపుతూ ధృతరాష్ట్రు డడిగిన సూక్ష్మములయిన విషయాలు వివరిస్తూ తన హృదయ పద్మంలో ఉన్న పరతత్త్వం ప్రసాదించిన రహస్యసూక్తులను అనుగ్రహిస్తూ ఉండగా ప్రభాతం అయింది. వెంటనే సనత్సుజాతుడు ధృతరాష్ట్ర విదురులను వీడ్కొని అంతర్ధానమయి పోయాడు. అపుడు,*

వి: అధ్యాత్మము = ఆత్మకు సంబంధించినది.

ద్వంద్వములు : సుఖదుఃఖాలు; లాభాలాభాలు; శీతోష్ణములు మొదలయిన వానిని ద్వంద్వము లంటారు. వీనిని విడిచిపెడితేనే పరతత్త్వం గోచరిస్తుంది. వీటిని వీడవలెనని చెప్పేది పరమార్థోపదేశం.

ప్రాతఃకాల వర్ణనము (అమూలకము)

తే: తన కులంబునఁ బుట్టిన ధార్తరాష్ట్రు
లన్న దమ్ములతో విగ్రహంబు గొనుట
కుమ్మలించి వివర్ణత నొందినట్లు
గంది యెంతయుఁ జెలు వేదెఁ జందురుండు. 107

అ: తన కులంబునన్ =తన వంశంలో; పుట్టిన; ధార్తరాష్ట్రులు=ధృతరాష్ట్ర కుమారులు; అన్నదమ్ములతో; విగ్రహంబు - కొనుటకు = విరోధ పడటానికి; ఉమ్మలించి=పరితపించి; వివర్ణతన్ ఒందినట్లు = రంగు మారినట్లు; కంది ఎంతయున్ = చాలకంది; చందురుండు = చంద్రుడు; చెలువు - ఏదెన్ = సొగసు తరిగి పోయాడు.

భా: *తన వంశంలో పుట్టిన కౌరవులు అన్నదమ్ములతో విరోధం పెట్టుకొనటానికి తపించిపోయి వివర్ణుడయినట్లు కందిపోయి చంద్రుడు సొగసు తరిగిపోయాడు.*

వి: 1. కౌరవులు పాండవులు - వీరి వంశకర్త చంద్రుడు - వీరంతా చంద్ర వంశపురాజులు.

2. చేసేది కథకు సంబంధించని ప్రాతఃకాల వర్ణనమయినా కథతో దాన్ని అతికించి చెప్పడం మహాకవి లక్షణం-వర్ణనలు కవుల రచనాశక్తికీ కల్పనా శక్తికీ ప్రతిభా పాండిత్యాలకూ ఆటపట్టులు.

3. తెల తెలవారుతున్నపుడు వెన్నెల తరిగిపోతుంది. చంద్రుడు వెలవెల బోతాడు- దాన్ని కవి ఇలా ఊహిస్తున్నాడు. దీన్ని ఉత్ప్రేక్ష అంటారు ఆలంకారికులు.

క. కుముదములుఁ దారు నొక్కటఁ
బ్రమదంబున నుండి వాని పదవి దొలగినం
దమకున్ నిలువఁగఁ దగ దను
క్రమమునఁ జనునట్లు తారకంబులు విరిసెన్. 108

అ: కుముదములున్ = కలువలూ; తారున్ = తామూ; ఒక్కటన్ = ఒకచోట; ప్రమదంబునన్ ఉండి = సంతోషంతో ఉండి; వాని పదవి తొలగినన్ = ఆకలువల పదవి పోతే; తమకున్ = తమకుకూడా; నిలువఁగన్ తగదు = నిలువరాదు; అనుక్రమమునన్ = అనే పద్ధతితో; చనునట్లు=ప్రవర్తించేటట్లు; తారకంబులు=నక్షత్రాలు; విరిసెన్= అదృశ్యమయ్యాయి.

భా: *కలువలూ తామూ ఒకచోట సంతోషంతో కులాసాగా జీవించి ఆ కలువల పదవి పోగానే తామూ నిలువరాదనే రీతిగా నక్షత్రాలు అదృశ్యమయ్యాయి.*

వి: 1. మిత్రుని సంతోషంలో మిత్రుడికి సంతోషమూ; ఆపదలో దుఃఖమూ కలుగుతాయి. మిత్రునికి లేని సంపద మిత్రుడు అనుభవించలేడు. ఆ సామెతగా కలువల వైభవంపోతే నక్షత్రాలు తరిగిపోయాయి.

2. రాత్రిపూట కలువలు వికసిస్తాయి. నక్షత్రాలు ప్రకాశిస్తాయి - తెల్లవారే సరికి కలువలు వికాసం కోల్పోతవి. అలాగే నక్షత్రాలు కన్పించవు. దీన్ని కవి ఇలా ఉత్ప్రేక్షిస్తున్నాడు.

కలువలకూ చంద్రునికీ నాయికా నాయక భావం వర్ణించడం కవి సమయం.

ఉ. ఎత్తిన వేడ్క (గంధరములెత్తి, మొగంబులు సా(చి, చూడ్కులం
జిత్తములన్ నిగిడ్చి, తమ చెందెడు నిక్కలు రోసి, యింపు ద
ళ్కొత్త(గ నొక్కచో నొకటి నొక్కటి గాంచి, యెలర్చు కొయ్యులం
జిత్తజుకేళి(దేలె విలసిల్లుచు జక్కవదోయి వేకువన్. 109

అ: ఎత్తిన వేడ్కన్ = అధికమయిన కుతూహలంతో; కంధరములు+ఎత్తి = మెడలెత్తి; మొగంబులు - సా(చి = ముఖాలు ముందుకు చాచి; చూడ్కులన్ = చూపులనూ, చిత్తములన్= మనస్సులనూ; నిగిడ్చి = వ్యాపింపజేసి; తమ చెందెడు=తాము తిరిగే; నిక్కలురోసి = ప్రదేశాలు వెదకి; ఒక్కచోన్=ఒక్కచోట; ఇంపుదళ్కొత్తగన్=ప్రీతికల్గేటట్లుగా; ఒకటిన్-ఒక్కటి కాంచి= ఒక్కదాన్ని మరొకటి చూసి; వేకువన్=తెల్లవారుజామున; జక్కవదోయి=చక్రవాకపక్షుల జంట; విలసిల్లుచున్= సంతోషిస్తూ; ఎలర్చు=విజృంభించే; కొయ్యులన్=కోరికలతో; చిత్తజుకేళిన్‌తేలెన్ = మన్మథక్రీడలలో తేలిపోయినవి.

భా: హెచ్చిన కుతూహలంతో మెడలు ఎత్తి ముఖాలుసాచి చూపులూ ముఖాలూ ముందుకు ప్రసరింపజేస్తూ తాము తిరిగే స్థానాలు వెదకి వెదకి చివరకు తెల్లవారుజామున ఒకచోట ఒకదాన్ని మరొకటి చూసి చక్రవాకముల జంట సంతోషంతో పెరిగే కోరికలతో మన్మథకేళిలో తేలిపోయాయి.

వి: చక్రవాక పక్షులు రాత్రి అంతా విరహం అనుభవిస్తాయని కవి సమయం. తెల్లవార్లూ అవి ఒకదాన్ని ఒకటి వెతుక్కుంటూ తిరిగి తెల్లవారుజామున కలుస్తాయని కవులు వర్ణిస్తారు.

అలం : స్వభావోక్తి.

మ: మును సౌరభ్యము నివ్వటిల్ల(గ మనోమోదంబునం దే(టు ల
ల్లన యోలిన్ వెడలంగ రేకులు సముల్లాసంబునన్ బింక మె
క్క నయం బెక్కుచు గద్దె పొం దెడలి వీ(కం గేసరం ల్ గడ
ల్కొన(, దోడ్తో మధువుచ్చి పేరెలమి(బొల్పుం జెందె నంభోజముల్.110

అ: మును=ముందుగా; సౌరభ్యము = సువాసన; నివ్వటిల్ల(గన్ = వ్యాపిస్తే; మనస్+ మోదంబునన్ =మనస్సులలో సంతోషంతో; తే(టులు=తుమ్మెదలు; అల్లన = మెల్లగా; ఓలిన్= వరుసగా; వెడలంగన్=బయలుదేరగా; రేకులు=పత్రాలు; సముల్లాసంబునన్= ఉత్సాహంతో; బింకమెక్కన్ =బిరుసెక్కగా; నయంబు ఎక్కుచున్=అందమెక్కుచు; కేసరంబుల్= కింజల్కాలు; గద్దె పొందు - ఎడలి = దుద్దు నుండి విడివడి; వీకన్ = ఉత్సాహంతో; కడల్కొనన్= వ్యాపించగా;

తోడ్తోన్ = వెంటనే; మధువు+ఉచ్చి=తేనె బయల్వెడలి; అంభోజముల్=పద్మాలు; పేరు-ఎలమిన్= మిక్కిలి సంతోషంతో; పొల్పున్-చెందెన్=శోభించాయి.

భా: సూర్యోదయం అవుతోంది అనగానే తెలతెలవారుతూ ఉండగానే ముందుగా పద్మాల సువాసన వ్యాపించింది. దానితో మనస్సంతోషం కలిగి తుమ్మెదలు బయలుదేరాయి మెల్లగా. అంతలో పద్మపు రేకులు ఉల్లాసంతో బిరుసెక్కి అందగించాయి. దుద్దును విడచి కేసరాలు వికసించాయి. వెంటనే తేనె పొంగి (సంతోషంతో) వికాసంతో పద్మాలు శోభిల్లాయి.

వి: ప్రాతః కాలంలో జరిగే పద్మవికాసం సహజరీతిలో వర్ణించబడింది. పద్మాలు వికసించడంలో జరిగే క్రమ పరిణామం అంతా తిక్కన చక్కని పదాలతో వర్ణించారు.

అలం : స్వభావోక్తి.

చ. వెడవెడ నిద్ర వొంది కనువిచ్చిన పాంథుల మీఁద దాడివోఁ
దడఁబడ నొండొరుం బిలుచు దర్పకు పంపు బలంబులోని య
ల్కుడు కరణిం జెలంగె శుకకోకిల భృంగ తతుల్ వనంబులం
దెడనెడఁ బల్కఁ,గూయ, సొగియింపఁగ, మ్రోయఁగఁ దద్విరావముల్.111

అ: శుక కోకిల భృంగతతుల్ = చిలుకలూ, కోకిలలూ, తుమ్మెదలూ వీని గుంపులు; వనంబులందున్; ఎడనెడన్ =అక్కడక్కడ/అప్పుడప్పుడు; పల్కన్=పలుకగా; కూయన్ = కూయగా; సొగియింపఁగా మ్రోయఁగన్=సుఖింపజేసేటట్లు మ్రోయగా;తద్విరావముల్=ఆధ్వనులు; వెడవెడ= కొద్దికొద్దిగా; నిద్ర-పొంది = నిద్రపోయి; కనువిచ్చిన = మేల్కొన్న; పాంథుల మీఁదన్ = బాటసారుల మీద; దాడివోన్=దాడిపోవటానికి; తడఁబడన్ = తడబడుతూ; ఒండొరున్ =ఒకరినొకరు; పిలుచు= పిలుచుకొనే; దర్పకు పంపు=మన్మథుడు పంపే; బలంబులోని = సైన్యంలోని; అల్కుడు- కరణిన్= అలికిడి (చప్పుడు) వలె; చెలంగెన్ = ఒప్పెను.

భా: వనాల్లో చిలుకలు పలుకుతున్నాయి. కోకిలలు కూస్తున్నాయి. తుమ్మెదలు మనోహరంగా పాడుతున్నాయి. వీటి ధ్వనులు కొద్ది కొద్దిగా నిద్రపోయి మేల్కొన్న బాటసారుల మీద దాడి వెళ్లటానికి ఒకరినొకరు పిలుచుకొంటున్న మన్మథ సైన్యంలోని చప్పుడు వలె ఉన్నాయి.

సీ: పద్మపరాగంబుఁ బరగించు నరుణోద
యంబు కాంతికిఁ జెలువంబు మిగులఁ
బరువంబు దప్పిన విరుల రాలుచుఁ దరు
చయము చుక్కలులేని చదలఁ జెనయ;
నరవిరి నెత్తావి నడరించు నున్నిద్ర
విటపీటి సౌరభ వితతి వొదల
నెలఁత చీఱిన యెఱకల నెఱిఁదీర్చు జ
క్కవలు చందోయి కేఁకట యొనర్ప.

ఆ: వెలరు వాఱు దీవియల నల్ల నల్లార్చు
సోర్ణ గండ్లయందుఁజొచ్చి సుడిసి
తిరిగి వేగుఁబోక తెమ్మెర లెలదీఁగ
కొనల వంక లొత్తు ననలఁ బ్రోచు. 112

అ: పద్మ పరాగంబున్ = పద్మాల పుప్పొడిని; పరగించు = వ్యాపింపజేసే; అరుణ+ఉదయంబు కాంతికి=అనూరుని ఉదయపు కాంతికి; చెలువంబు మిగులన్=అందం అతిశయించగా; పరువంబు తప్పిన=పరువంపోయిన; విరులన్=పూలను; రాలుచు=రాల్చే; తరుచయము = చెట్ల గుంపు; చుక్కలు లేని చదలన్ = నక్షత్రాలు లేని ఆకాశాన్ని; చెనయన్ = పోలగా; అరవిరి=సగం వికసించిన పూలయొక్క; నెత్తావిన్=పరిమళాన్ని; అడరించు=వ్యాపింపజేసే; ఉన్నిద్ర = నిద్రమేల్కొన్న; విట = విటులయొక్క; వీటి సౌరభవితతి = తాంబూలపు సువాసన పరంపర; పొదలన్ = వ్యాపింపగా; నెలఁత = భార్య యొక్క;చీఱిన ఎఱకల = పాయలు వారిన రెక్కల యొక్క; నెఱిన్ = చిక్కును; తీర్చు=తొలగించే; జక్కవలు = చక్రవాకపక్షులు; చందోయికి= స్తనముల జంటకు; ఏఁకట ఒనర్పన్ = అపేక్షచూపగా (ఇక్కడ చెందొవకు అనే పాఠం బాగుంది అనిపిస్తుంది.)సోర్ణగండ్ల యందున్ చొచ్చి = గవాక్షములలో ప్రవేశించి; సుడిసి తిరిగి = సుడితిరిగి; వేగు బోక తెమ్మెరలు = తెల్లవారుజాముగాలులు; వెలరువాఱు దీవియలన్ = వెలవెల బోయే దీపాలను; అల్లనల్లార్చు = మెల్లగా ఆర్పివేస్తున్నాయి; ఎలదీఁగకొనల = లేత తీగల చివరల యొక్క; వంకలు ఒత్తున్ = వంకరలు సరిదిద్దును; ననలన్ ప్రోచు = మొగ్గలను ఆదరించును, వికసింపజేయును.

భా: తామరపూవుల పుప్పొడిని వ్యాపింపజేసే అరుణోదయపు కాంతికి అందం వచ్చింది. చెట్లు వాడిపోయిన పూలను రాలుస్తున్నాయి. అవి చుక్కలు లేని ఆకాశంలా ఉన్నాయి. సగం వికసించిన పూల పరిమళంతో కలిసి నిద్రమేల్కాంచిన విటుల తాంబూల పరిమళం వ్యాపిస్తోంది. ప్రియురాలి చిక్కుపడిన రెక్కల చిక్కుదీస్తున్నాయి చక్రవాక పక్షులు. అవి చనుదోయి అనే అపేక్ష కలిగిస్తున్నాయి. లేదా అవి ఎఱ్ఱ కలువలపై అపేక్ష చూపుతున్నాయి.

తెల్లవారుజామున గవాక్షాల నుండి గాలులు ప్రవేశించి సుడి తిరిగి వెలవెలబోయే దీపాలను ఆర్పుతున్నాయి. లేత తీగల కొసల వంకరలు దిద్దుతున్నాయి; పూలమొగ్గలను వికసింపజేస్తున్నాయి.

ఆ: అంత నుదయశైల మను నశోక ద్రుమ
సమితియందుఁ గాంతి చారుభంగి
నెఱయ విరిసి తొలుత నెగసిన యుజ్జ్వల
స్తబక మనఁగఁ బద్మసఖుఁడు వొడిచె. 113

అ: అంతన్; ఉదయశైలము+అను = ఉదయ పర్వతం అనే; అశోక ద్రుమ సమితి యందున్= అశోక వృక్షాల సముదాయం మీద; కాంతి; చారు భంగిన్ = అందమయిన రీతిలో;

నెఱయ విరిసి=అంతటావ్యాపించి; తొలుత నెగసిన=ముందుగా వికసించిన; ఉజ్జ్వలస్తబకమనఁగన్ = ప్రకాశవంతమయిన పూలగుత్తి అనేటట్లు; పద్మసఖుఁడు + పొడిచె = సూర్యుడు ఉదయించాడు.

భా: అపుడు తూర్పు పర్వతం అనే అశోక వృక్షాల గుంపుమీద చక్కని కాంతి అంతటా వ్యాపించి, ముందుగా పుట్టిన పూలగుత్తి అనేటట్లు సూర్యుడు ఉదయించాడు.

వి: సూర్యోదయ సమయంలో తూర్పు పర్వతం ఎఱ్ఱగా కనపడుతుంది. అందుకే అశోకవృక్షాలతో పోల్చాడు.

అలం : ఉత్ప్రేక్ష

సీ: ఉర్వీధరంబుల నొప్పెడు జేవుఱుఁ
జఱుల కాంతికి నునుమెఱుఁగు వెట్టి
ధరణీజ గుల్మలతా వితానము పల్ల
వములకుఁ గట్టెఱ్ఱవన్నె యొసఁగి
యరుణాంబుజంబుల యంతర్దళంబుల
తళతళలకు జిగిదళము కొల్పి
చక్రవాక ద్వయ సంతతి యెఱకల
గొమరారు కెంజాయఁ గ్రొత్తసేసి.

ఆ: తనదు బాలబింబ మనుపమేయ ప్రభా
పటల జటిల గగన భాగమగుచు
నుల్లసిల్లి జగము లెల్లను విలసిల్లఁ
బూర్వ శిఖరిమీఁదఁ బొడిచె నినుఁడు. 114

అ: ఉర్వీధరంబులన్ = పర్వతాల మీద; ఒప్పెడు = ఉండే; జేవుఱు - చఱుల కాంతికిన్ = ఎర్రని సానువుల కాంతికి; నునుమెఱుగు + పెట్టి ; నున్నటి పదును/ మెఱుపు పెట్టి. ధరణీజ గుల్మలతా వితానము = వృక్షాల పొదరిళ్ల, తీగల సముదాయం యొక్క; పల్లవములకు= చిగురుటాకులకు; కడు+ఎఱ్ఱ వన్నె=మిక్కిలి ఎరుపు రంగు; ఒసంగి=ఇచ్చి; అరుణ+అంబు జంబుల=ఎఱ్ఱతామరల; అంతర్దళంబుల = లోపలిరేకుల; తళతళలకున్; జిగి = కాంతిని; దళముకొల్పి=ఎక్కువచేసి; చక్రవాకద్వయ=చక్రవాక పక్షుల జంటయొక్క; సంతతి = పిల్లలయొక్క ; ఎఱకలన్ = రెక్కలను; కొమరారు = ప్రకాశించే; కెంజాయన్ = ఎఱ్ఱని ఛాయతో; క్రొత్తచేసి = నూతనత్వము కలిగించి; తనదు బాలబింబము = తనలేత సూర్యబింబం; అనుపమేయ ...... భాగమగుచు; అనుపమేయ = పోల్చరాని; ప్రభాపటల = కాంతి సముదాయం చేత; జటిల = దట్టమయిన; గగన భాగము- అగుచు = ఆకాశం కలిగినదై; ఉల్లసిల్లి = విలసిల్లి; జగములెల్లను= లోకాలన్నీ; విలసిల్లన్ = ప్రకాశింపగా; ఇనుఁడు=సూర్యుడు; పూర్వశిఖరి మీదన్= తూర్పుకొండ మీద; పొడిచెన్ = ఉదయించాడు.

భా: *పర్వతాల మీది ఎర్రని కొండచరియల కాంతికి సూర్యకాంతి మెరుగు పెట్టింది. చెట్లు, లతలు, పొదరిళ్ళు- వీటి చిగురులకు మరింత ఎర్రదనం కలిగించింది.*

ఎఱ్ఱి తామరపూల లోపలి రేకుల తళతళలకు దట్టమయిన కాంతి నిచ్చింది. చక్రవాక పక్షుల పిల్లల రెక్కలకు ఎఱ్ఱని సూర్యకిరణాలు కొత్త వింత కాంతిని కలిగించాయి. లేత సూర్యబింబం ఆకాశాని కంతకూ కాంతి నిచ్చి లోకాల నన్నింటినీ వెలిగించింది. ఈ విధంగా తూర్పుకొండ మీద సూర్యుడు ఉదయించాడు.

వి: ఇక్కడ సూర్యకిరణ ప్రసారంలో ఒక క్రమం గోచరిస్తుంది. సూర్యోదయ మయినపుడు సూర్యకాంతి ముందు పర్వతాల మీద, తరువాత చెట్ల మీద ప్రసరిస్తుంది. తరువాత నేలమీదకు ప్రసరిస్తుంది.ఈ క్రమం ఈ సీసపాదాలలో గోచరిస్తుంది.

వ: ఇట్లు సూర్యోదయం బగుటయు ధృతరాష్ట్రుండు దత్కాలోచితాచారంబులు నిర్వర్తించి తగు తెఱంగున నలంకృతుండయి యాస్థాన మండపంబున కరిగి పేరోలగం బిచ్చినఁ గుంభసంభవ కృప కృతవర్మాశ్వత్థామ కర్ణాదులగు దొరలును, భీష్మవిదుర బాహ్లిక సోమదత్త భూరిశ్రవః ప్రభృతులగు బంధు జనులును, దుర్యోధన దుశ్శాసన ప్రముఖులగు కుమారులును లోనుగాఁగల సమస్త పరిజనంబులును వచ్చి బలసియుండి రయ్యవసరంబున సంజయుఁడు వచ్చి వాకిట నిలిచి పణిహారులవలనఁ దన్నెఱింగించి పుచ్చి చొచ్చి సముచిత ప్రదేశంబునఁగూర్చుండి తన మాటలు వినుటకుఁ జిడిముడి పడుచున్న కొలువుఁగలయం గనుంగొని యిట్లనియె. 115

అ: తత్-కాల+ఉచిత + ఆచారంబులు = ఆ సమయానికి తగిన పనులు; పేరు+ ఓలగంబు=నిండు సభ; కుంభసంభవుఁడు = ద్రోణుడు; లోనుగాఁగల = మొదలయిన; బలసి యుండిరి = పరివేష్టించి నిండియుండిరి; ఆ + అవసరంబునన్ = ఆ సమయంలో; పణిహారులు= కావలివారు; పుచ్చి = పంపి; చొచ్చి = ప్రవేశించి; చిడిముడిపడు = తొందరపడు.

భా: ఇలా సూర్యోదయంకాగానే ధృతరాష్ట్రుడు కాలకృత్యాలు నిర్వర్తించి తగినట్లు అలంకరించుకొని కొలువు లోనికి వచ్చి సభ తీర్చాడు. ద్రోణుడు, కృపుడు,కృతవర్మ అశ్వత్థామ, కర్ణుడు మొ॥ దొరలూ; భీష్ముడు, విదురుడు, బాహ్లికుడు, సోమదత్తుడు, భూరిశ్రవుడు మొ॥ బంధువులూ; దుర్యోధనుడు, దుశ్శాసనుడు మొ॥ కుమారులూ ఇలా అందరూ వచ్చి కూర్చున్నారు-ఆ సమయంలో సంజయుడు వచ్చి వాకిట్లో నిలిచివార్తాహరుల వలన తనను గురించి తెల్పి పంపి లోపలికి ప్రవేశించి తగిన స్థానంలో కూర్చుండి తన మాటలు వినటానికి తొందరపడుతున్న కొలువును కలయచూచి ఇలా అన్నాడు.

-: సంజయుఁడు ధృతరాష్ట్రునితోఁ బాండవుల తెఱంగు సెప్పుట:-

సం. 5-46-15 (5-58-3)

తే: పాండు రాజ తనూజుల పాలి, కర్థి,
నిమ్మహారాజు పనుపంగ నేఁగి ధర్మ
పుత్త్రుఁగాంచితి; నాతండు మైత్రి మెఱయ
గౌరవుల సేమ మెల్లఁ బేర్వేర నడిగె. 116

అ: పాండు రాజ తనూజుల పాలికిన్ = పాండవుల దగ్గరకు; అర్థిన్=ప్రేమతో; ఈ+ మహారాజు; పనుపంగన్ + ఏఁగి = పంపగా వెళ్లి; ధర్మపుత్రున్ కాంచితిన్ = ధర్మరాజును చూశాను; ఆతండు= ఆధర్మరాజు; మైత్రి మెఱయన్ = స్నేహంతో; కౌరవుల సేమము + ఎల్లన్= కౌరవులక్షేమం అంతా; పేర్వేరన్ - అడిగెన్ = పేరుపేరున అడిగాడు.

భా: ఈ ధృతరాష్ట్రుడు పంపితే పాండవుల దగ్గరకు వెళ్లాను. ధర్మరాజును చూశాను. అతడు మైత్రితో కౌరవులనందరినీ పేరుపేరున క్షేమం అడిగాడు.

వ: మఱియుం దగువారలనెల్ల నయ్యైయుచితవిధిం బ్రణామంబున వినయంబున బాంధవంబున మిత్త్రభావంబున వాత్సల్యంబునఁ బ్రసాదంబున నాదరించె; నేనును భూనాథుండు గఱపిన తెఱంగునఁ గొఱంత లేకుండ బంధుత్వంబునకు వలయు మాటలాడితిఁ, బదంపడి కార్యంబు ప్రసంగించి నా యాడిన మాటలకు నయ్యుధిష్ఠిరుండు పలికిన వచనంబు లింత యొప్పునే యని యగ్గించిన ధృతరాష్ట్రుం డవహితుండై యడుగఁ దా నయ్యుధిష్ఠిరునంకు జెప్పిన భంగులు, నతండు వానికి నెల్ల నుత్తరంబిచ్చిన తెఱంగును, నెఱింగించి ధృతరాష్ట్రునకుం బితామహునకు దుర్యోధనునకుం గ్రమంబున వారివారితో నాడుమని నియమించిన చందంబులు ధర్మనందను పలుకుల పరిపాటిం దేటపడం జెప్పి, సూతనూనుండు వెండియు నిట్లనియె. **117**

అ: ఆ + ఆ + ఉచిత విధిన్ = తగినటు వంటి ఆయా పద్ధతులతో; బాంధవము= చుట్టరికము; కఱపిన తెఱంగునన్ = చెప్పినట్లుగా; అగ్గించు = పొగడు; అవహితుండు+ఐ= సావధానుడై; భంగులు = రీతులు; చందంబులు = రీతులు; పరిపాటి = అనుపూర్వి , పద్ధతి.

భా: అంతేకాదు ఇక్కడ వారందరినీ వారివారికి తగినట్లు వినయంతో, బంధుత్వంతో, స్నేహంతో, ఆదరంతో, ప్రసన్నతతో ఆదరించాడు. నేనూ రాజు చెప్పినట్లు లోటు లేకుండా చుట్టరికానికి తగిన మాటలాడాను. తరువాత కార్యం ప్రస్తావించాను. అపుడు నా మాటలకు సమాధానంగా చెప్పిన ధర్మరాజు మాటలు ఎంతబాగున్నాయి! అని సంజయుడు ప్రశంసిస్తే ధృతరాష్ట్రుడు సావధానుడై ఎట్లా అని అడిగాడు. అపుడు తాను ఆ ధర్మరాజుకు చెప్పిన మాటలు, అతడు వాటికిచ్చిన సమాధానాలు, తెలిపి ధృతరాష్ట్రునకూ, భీష్మునకూ, దుర్యోధనునకూ వరుసగా చెప్పుమన్న తీరులు ధర్మరాజు మాటల తీరు చెప్పి సంజయుడు ఇంకా అన్నాడు.

తే: "ఏ నుపప్లావ్య పురమున కేఁగి, తొలుత
వాసుదేవార్జునులఁ గంటి; వారు నీతి
పథము దప్పని మాటలు బలిమిఁ దోఁచు
నట్లుగా నాడి; రవి వినుం డాదరించి." **118**

అ: ఏను = నేను; ఉపప్లావ్యపురమునకున్; ఏఁగి = వెళ్ళి; తొలుత = మొదట; వాసుదేవ + అర్జునులన్ = కృష్ణునీ , అర్జుననీ; కంటిని = చూశాను; వారు; నీతి పథము =

రాజనీతి మార్గం; తప్పని మాటలు = విడువని మాటలు; బలిమి - తోఁచునట్లుగా = బలము ప్రకటించేటట్లుగా; ఆడిరి = మాట్లాడారు; అవి; ఆదరించి, వినుండు.

భా: *నేను ఉపప్లావ్యపురానికి వెళ్ళి ముందరగా కృష్ణార్జునులను చూశాను. వారు రాజనీతి తప్పకుండానూ బలం ప్రకటించుతూనూ మాట్లాడారు. ఆ మాటలు ఆదరించి వినండి.*

వ: అనిన విని ధృతరాష్ట్రుండ వ్వాసుదేవు చిత్తం బెట్లుతం డేమనియె? నని యడిగిన నతనికి సంజయుం డిట్లనియె. 119

అ: ఆ + వాసుదేవుచిత్తంబు = ఆ కృష్ణుని మనస్సు

భా: *ఆ మాటలు విని ధృతర్రాష్టుడు "ఆ కృష్ణుని మనస్సు ఎలా ఉంది? అతడే మన్నాడు" అని అడిగాడు. అపుడు సంజయుడిలా అన్నాడు.*

ఉ: తానును సత్యభామయును ద్రౌపదియున్ నరుఁడున్ రహస్యగో
ష్ఠీ నిరతాత్ముఁడై సుతులుఁ జేరని చెందని యట్టిచోటఁ గాం
తానివహంబు గొల్వఁ బ్రమదస్థితి నుండియుఁ బిల్వఁ బంచె న
న్నానలినోదరుండు హృదయంబున నీదెస కూర్మి యెట్టిదో! 120

అ: తానును = కృష్ణుడూ; సత్యభామయును; ద్రౌపదియున్; నరుఁడున్ = అర్జునుడూ; రహస్యగోష్ఠీనిరత + ఆత్ముడై = రహస్య సంభాషణలలో మునిగియున్నవాడై; సుతులున్=కొడుకులు కూడా; చేరని చెందని-అట్టిచోట=రాని ప్రదేశంలో; కాంతానివహంబు కొల్వన్=స్త్రీ సముదాయం సేవిస్తూ ఉండగా; ప్రమదస్థితిన్ ఉండియున్ =ఉల్లాసంగా ఉండికూడా; నన్ను; ఆనలినోదరుండు = ఆకృష్ణుడు; పిల్వన్ పంచెన్ = పిలువుమని ఆజ్ఞాపించాడు; హృదయంబునన్ = మనస్సులో; నీదెస = నీ మీద; కూర్మి = ప్రేమ; ఎట్టిదో = ఎంతటిదో కదా!

భా: *తానూ సత్యభామా, ద్రౌపదీ అర్జునుడూ రహస్య సంభాషణల్లో కొడుకులు కూడా రాని ఏకాంత స్థలంలో స్త్రీలు కొల్వగా సంతోషంతో ఉల్లాసంగా కాలక్షేపం చేస్తూ కూడా కృష్ణుడు నన్ను లోపలికి రమ్మన్నాడు. అంటే మనసులో నీ మీద అతనికి ఎంత ప్రేమయోకదా!*

వి: సంజయుని వాక్చాతుర్యం ఇందులో గోచరిస్తుంది. ఉల్లాసంగా ఏకాంత గోష్ఠిలో ఉండి కూడా సంజయుని లోనికి పిల్చాడు కృష్ణుడు. అంటే ధృతరాష్ట్రుని మీద ఎంత అభిమానమో అంటున్నాడు సంజయుడు. ఇక్కడ సంజయుడు రాయబారి. దానికి తగినట్లు మాట్లాడుతున్నాడు. ధర్మరాజు దగ్గఱకు వెళ్లినపుడూ సంజయుడు ఇలాగే మాట్లాడాడు. చూడుడు ఉద్యోగ -1-293

వ: ఏనును దత్ప్రకారంబు పడిహారుల వలన మున్న యెఱింగిన వాఁడ నగుటంజేసి, గంచుకంబును శిరోవేష్టనంబును ధరియించి వినీత వేషుండనై పోవునప్పుడు కృష్ణార్జును లనేక మణిమయ భూషణ ప్రభాభాసితులై యొక్క సెజ్జన యున్నవారు; కృష్ణుండు పవ్వళించియుండి చాఁచిన చరణంబులు దొడలపై నిడికొని యర్జునుండు

గూర్చున్నవాఁడు; సత్యభామయుం బాంచాలియు గద్దియలపై నున్నవారు;సవినయంబుగా నేనును దండప్రణామంబు సేసిన నన్నాదరించి కృష్ణుని చేసన్న నర్జును పనుపునం గనకరత్నమయంబగు నతని పాదపీఠం బతండు వ్రేల్చిన కాళ్ళు దిగిచి కొనిన నిద్దఱు ముద్దియ లెత్తి తెచ్చి నాకుం బెట్టిన; నేనును దానిం గరతలంబున నంటుచు ధరణీ తలంబునఁ గూర్చుండి, కేలుమొగిడ్చి ఫాలతలంబున గదియించి, నీలవర్ణులు బాహుబల మదభరితులునునయి యేనుఁగు దోయియుంబోలె నున్న యమ్మాధవ ధనంజయులఁ జూచునప్పుడు, నాకు హర్షాశ్రుపులకలును దదనంతరంబ భయంబునుం బుట్టె నట్టియెడ. 121

అ: పణిహారులు = ద్వారపాలకులు; మున్న=ముందే; కంచుకంబు=పైచొక్కా; శిరోవేష్టనంబు=తలపాగ; వినీత వేషుడు = వినయ పూర్వకమయిన వేషం ధరించినవాడు; అనేక మణిమయభూషణ ప్రభాభాసితులు=మణులతో నిండిన అనేక భూషణముల కాంతులచే ప్రకాశించేవారు; ఒక్కసెజ్జన =ఒకే శయ్యమీద; చరణంబులు = పాదములు; గద్దియ =ఆసనము; పాంచాలి= ద్రౌపది; చేసన్నన్ =చేయి చాపి సంజ్ఞచేత; అర్జును పనుపు=అర్జునుని ఆజ్ఞ; తిగిచికొను= లాగికొను; కరతలము=అరచేయి; ధరణీతలము = భూమి; కేలు =చేయి; ఫాలతలము =నుదురు; బాహుబలమదభరితులు=భుజబలం అనే మదంతో కూడిన వారు; ఏనుఁగు దోయి=ఏనుగుల జంట; హర్ష+అశ్రుపులకలు=సంతోషంచేత బాష్పములూ రోమాంచమూ; తత్=అనంతరంబ= దాని తర్వాత.

భా: వారు అభ్యంతర గృహంలో ఉన్నట్లు నేనూ ద్వారపాలకులవల్ల విని, కంచుకమూ, తలపాగ మాత్రం ధరించి మిగిలిన రాజదుస్తులన్నీ తీసివేసి వినయ వేషంతో లోపలికి వెళ్లాను. అపుడు అనేక మణిమయ భూషణాలు ధరించి కృష్ణార్జునులు ఒకే శయ్యమీద ఉన్నారు. కృష్ణుడు పడుకొని చాచినకాళ్లను తన తొడలపైన పెట్టుకొని అర్జునుడు కూర్చున్నాడు. సత్యభామా, ద్రౌపదీ వేరు ఆసనాల మీద కూర్చుని ఉన్నారు. నేను వెళ్లి సవినయంగా నమస్కరించాను.కృష్ణుడు చేసైగచేశాడు. అర్జునుడు ఆజ్ఞాపించాడు రత్నమయమయిన పాదపీఠంచూపిస్తూ-అర్జునుడు తన కాళ్లు పైకి తీసుకొన్నాడు- సత్యభామా ద్రౌపదీయిద్దరూ ఆ పాదపీఠం తెచ్చినాకు వేశారు. నేను దానిని అరచేత్తో ముట్టుకొని నేలమీద కూర్చుని చేయెత్తి నమస్కరించాను. నీల వర్ణం కలిగి భుజబలంతో ప్రకాశించే ఏనుగుల జంట వలె ఉన్న ఆ కృష్ణార్జునులను చూస్తే నాకుముందు సంతోషంతో కన్నీరు వచ్చింది. ఒడలంతా గగుర్పొడిచింది తర్వాత భయం కూడా కలిగింది. అపుడు.............

వి: కృష్ణార్జునులు అభ్యంతర మందిరంలోకి పిలిచి గౌరవించి నందుకు సంతోషం కలిగింది సంజయునికి. వెనువెంటనే భయంకూడా కలిగింది. భయమెందుకో తరువాతి పద్యంలో వివరిస్తున్నాడు.

క: ఈ యిరువురుఁ బంచినపని
సేయుదురట, ధర్మజునకుఁ జేకుఱని తలం

పేయది? యతనిం దొడరుట
వేయేటికి జముని శిరము వ్రేయుట గాదే! 122

అ: ఈ - ఇరువురున్= ఈ యిద్దరూ; పంచినపని=ఆజ్ఞాపించిన పని; చేయుదురు-అట; ధర్మజునకున్; చేకుఱని=చేకూరని సిద్ధింపని; తలంపు-ఏయది?=కోరిక ఏముంటుంది?; అతనిన్=ఆ ధర్మరాజును; తొడరుట=ఎదిరించుట; వేయేటికి=వేయిమాటలెందులకు? జముని శిరమున్=యముని శిరస్సును; వ్రేయుట కాదే?=కొట్టటం కాదా!

భా: ఈ ఇద్దరూ (కృష్ణార్జునులు) ధర్మరాజు ఆజ్ఞాపించిన పని చేస్తారుట. అపుడింక ఆ ధర్మరాజుకు సిద్ధింపని కోరిక ఏమి ఉంటుంది? ఆతనిని ఎదిరించడం యముని ఎదిరించడమే కదా!

వ: అని తలంచుచుండ నమ్మహానుభావులు నన్ను సంభావించి, తారు పయోగించునట్టి యన్న పానంబులను, దమకుఁగట్టఁ దగినట్టి వస్త్రంబులను, తాము దొడుగునట్టి భూషణంబులను, నాకుఁ బ్రియం బొనర్చి గారవించిన, నేనును నాపోయిన కార్యంబు విన్నవించిన, విజయుండు బలు మొగంబుతో దానికి నుత్తరంబు పలుకం దొడంగిన వారించి వారిజోదరుం డిట్లనియె. 123

అ: సంభావించి= గౌరవించి; బలుమొగంబుతో=తీక్ష్ణమయిన ముఖంతో; పలుకన్ తొడంగినన్ = చెప్పటానికి మొదలుపెడితే; వారిజోదరుండు = కృష్ణుడు- పద్మం ఉదర మందు కలవాడు.

భా: అని అనుకొంటూ ఉండగా వారు నన్ను గౌరవించి, తాము ఉపయోగించే అన్నమూ నీరూ, తాము కట్టుకొనదగిన విలువయిన వస్త్రాలూ, తాము పెట్టుకొనదగిన అలంకారాలు, నాకు ఇచ్చి గౌరవించారు. నేను నా పోయిన పని విన్నవించాను. అపుడు అర్జునుడు తీవ్రముఖంతో దానికి సమాధానం చెప్పబోతూ ఉంటే కృష్ణుడు అర్జునుని ఆపి ఇలా అన్నాడు.

-:సంజయుండు ధృతరాష్ట్రునకుఁ గృష్ణుండు సెప్పిన మాట లెఱింగించుట :-
సం. 5-58-18

తే: వినుము సంజయ! ధృతరాష్ట్ర విభుని పెద్ద
కొలువునందుఁ దత్పుత్రులు గురుఁడు గృపుఁడు
నాపగానందనుఁడు మొదలైన సకల
జనులు వినుచుండగా నిట్టు లనుము నీవు. 124

అ: సంజయ!; వినుము=ధృతరాష్ట్ర విభుని కొలువు నందున్; తత్పుత్రులు= అతని కొడుకులూ; గురుఁడు=ద్రోణుడూ; కృపుడున్; ఆపగానందనుఁడు= భీష్ముడూ; మొదలైన సకలజనులు వినుచుండగాన్; నీవు; ఇట్టులు; అనుము.

భా: *సంజయా!* విను. ఆ ధృతరాష్ట్రుని నిండుకొలువులో అతని కొడుకులూ

ద్రోణుడూ కృపుడూ భీష్ముడూ మొదలయిన జనులంతా వినేటట్లు ఇలా అను.

ఆ: **అయ్యజాత శత్రుఁ డలుగుట నీళ్లల**
నగ్ని పుట్టి నట్టి దయ్యెఁ; మీకు
నార్ప వెరవు లేదు; నేర్పుమై నింకఁ గా
వింప వలయు పనులు వినుఁడు మీరు. 125

అ: ఆ+అజాత శత్రుఁడు= ఆ ధర్మరాజు; అలుగుట= కోపించడం; నీళ్లలన్= నీటిలో; అగ్ని; పుట్టినట్టిదయ్యెఁ= పుట్టినట్టయింది; మీకున్; ఆర్పన్= ఆ నిప్పు ఆర్పేందుకు; వెరవు లేదు= ఉపాయం లేదు; ఇంకన్= ఇకమీద; నేర్పుమైన్=నేర్పుతో; కావింపవలయు పనులు= చేయవలసిన కార్యాలు; వినుఁడు మీరు = మీరు వినండి.

భా: ఆ ధర్మరాజు కోపించడం అంటే నీటిలో నిప్పు పుట్టినట్లయింది. దాన్ని ఆర్పటానికి తగ్గ ఉపాయం లేదు. అందుచేత మీరు నేర్పుగా చేయదగిన పనులు చెపుతా వినండి.

వి: నీరు అగ్నిని ఆర్పేది. కాని ఆ నీటిలోనే అగ్ని పుడితే దాన్ని యింక ఎవరు ఆర్పగలరు? 126

వ: **అవి యెవ్వి యంటేని.**

భా: అవి ఏవి అంటే..........

సీ: **కలయట్టి వివిధార్థములు నశేషంబుగ**
దగ నొసంగుండు సత్పాత్రములకు;
జెలులఁ జుట్టముల నాశ్రితులను రావించి
సత్కరింపుఁడు సంతసం బెలర్ప;
నిచ్ఛానుగుణముల నింద్రియ సుఖముల
ననుభవింపుఁడు హృదయంబు లలర;
నాండ్రును బిడ్డల నయ్యై విధంబుల
గారవింపుఁడు ప్రియ పూరితముగ;

తే: **మఱియు నెవ్వరి చిత్త మెత్తెఱఁగు నందు**
వాటమై యుండు నది యెల్ల వలయునట్లు
సేసి విహరింపుఁ; డింకెడ సేయ కనికి
నడవుఁ డఱచేతఁ బ్రాణంబు లిడి కడంగి. 127

అ: కలయట్టి = కలిగిన; వివిధ+అర్థములు + అనేక విధములయిన సంపదలను; అశేషంబుగన్=మిగలకుండా; సత్పాత్రములకున్= తగిన- అర్హులయిన వారికి; తగన్ ఒసంగుండు= తగిన రీతిలో ఇవ్వండి. చెలులన్ = స్నేహితులనూ; చుట్టములన్; ఆశ్రితులను= ఆశ్రయించుకొని ఉన్నవారినీ; రావించి; సంతసంబు-ఎలర్పన్=సంతోషం కలిగేటట్లు;

సత్కరింపుఁడు=సన్మానించండి. ఇచ్ఛా+ అనుగుణములన్=కోరికకు తగిన; ఇంద్రియ సుఖములను=విషయసుఖాలను; హృదయంబులు+ అలర=మనసులు సంతోషించేటట్లు; అనుభవించుఁడు= అనుభవించండి; అంగ్రనను=భార్యలను; బిడ్డలను; ప్రియపూరితముగన్=ప్రీతి పూర్వకంగా; అయ్యెవిధంబులన్= ఆయారీతులతో; గారవింపుఁడు= గౌరవించండి; మఱియున్; ఎవ్వరిచిత్తము; ఏ+ తెఱఁగునందు= ఏవిషయంలో; వాటమై ఉండు=అనుకూలమై ఉంటుందో; అది ఎల్లన్= అది అంతా; వలయు నట్లు చేసి= ఇష్టం వచ్చినట్లుగా చేసికొని; విహరింపుఁడు; ఇంకన్-ఎడ-చేయక = ఇక ఆలస్యం చేయక; అఱచేతన్ ప్రాణంబులు ఇడి= అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని; కడగి= పూనుకొని(తప్పక); అనికి నడవుడు= యుద్ధానికి నడవండి.

భా: ఉన్న సంపదనంతా పూర్తిగా పాత్రులయిన వారికి దానం చెయ్యండి. స్నేహితులనూ చుట్టాలనూ ఆశ్రితులనూ సేవకులనూ రప్పించి సత్కరించండి. ఇంద్రియ సుఖాలన్నీ ఇష్టం వచ్చినట్లు మనస్సు సంతోషించేటట్లు అనుభవించండి. ఎవరికి ఏది ఇష్టమో వాటిని మీకు అనుకూలంగా చేసికొని విహరించండి. ఆలస్యం చేయక ప్రాణాలరచేతిలో పెట్టుకొని యుద్ధానికి నడవండి.

వి: ఈ పనులన్నీ చేయడం చావు మూడుతోందని చావబోయే ముందయినా మంచి పనులు చేయుమని ప్రబోధం.

వ: అని చెప్పుమింత యేమిటి కంటేని. **128**

భా: అని చెప్పు. ఇంత ఎందుకు చెపుతున్నానంటే......

ఉ: ఎందును నెవ్వరుం బడని యెంతయుఁ గష్టముపాటు వచ్చినం
గొందల మంది పాండు విభు కోడలు దవ్వులనున్న నన్ను "గో
విందుడ కావు" మంచుఁ బలవించుట యీఁగఁగ రాని యప్పుఁబో
లెందలపోయ వ్రేఁగయి చలింపక యున్నది యెప్పుడున్ మదిన్. 129.

అ: ఎందును= ఎక్కడా; ఎవ్వరున్ పడని= ఎంత నీచులయినా పొందని; ఎంతయు కష్టము పాటు వచ్చినన్= పెద్దకష్టం సంభవిస్తే; పాండు విభుకోడలు= పాండురాజు కోడలు ద్రౌపది; కొందలమంది= క్షోభించి పోయి; దవ్వులన్ ఉన్న నన్ను= ఎక్కడో దూరంగా ఉన్న నన్ను; గోవిందుడ!= కృష్ణా; కావుము=రక్షించుము; అంచున్ పలవించుట= అంటూ విలపించడం; తలపోయన్ ఎప్పుడున్ మదిన్=ఆలోచిస్తే నామనసులో ఎప్పుడూ; ఈఁగఁగరాని అప్పుఁబోలెన్=.తీర్చరాని అప్పులాగా; వ్రేఁగయి= భారమయి; చలింపక- ఉన్నది= స్థిరంగా నిలిచి ఉంది.

భా: ఎక్కడా ఎవరూ పొందని కష్టం సంభవిస్తే క్షోభించిపోయి ఆ ద్రౌపది (నిండు సభలో ఎవరూ రక్షించకపోతే) దూరంగా ఉన్న నన్ను "కృష్ణా రక్షించు" అంటూ విలపించడం తలచుకొంటే అది తీర్చరాని అప్పులాగా నా మనసులో బరువుగా నిలిచిపోతోంది ఎప్పుడూ.

వి: తీర్చలేని అప్పు ఎప్పుడూ మనసును బాధిస్తుంది. మనసులోంచి తప్పుకోదు. కాని తీర్చలేడు. మనస్సును కుతకుత ఉడికింపచేస్తుంది. మిగతా ఎన్ని దుష్టకృత్యాలు చేసినా

ఒక విధంగా సహించవచ్చుకాని, ఈ పని- ద్రౌపదీ వస్త్రాపహరణం- ప్రపంచంలో ఎవరూ మానవులుగా పుట్టినవారు సహించలేనిది. అని భావం.

తే. ఇట్టి యేఁ దేరు గడపంగ నెందు నుతికి
నెక్కు గాండీవ మేడ్తెఱ నెక్కువెట్టి
రెండు దొనలును బూని కిరీటి యనికి
వచ్చు నేఁడెల్లి యెందుఁ బోవచ్చు మీకు? 130

అ: ఇట్టి ఏన్ = ఇటువంటినేను; తేరుకడపంగన్ = రథం నడుపుతూ ఉంటే; ఎందున్ నుతికిన్ ఎక్కు = జగత్ప్రఖ్యాతి గాంచిన; గాండివము; ఏడ్తెఱన్ = శక్తి సామర్థ్యాలతో; ఎక్కు + పెట్టి = సంధించి; రెండు దొనలును పూని = అమ్ములు పొదులు రెండూ పట్టి అక్షయ తూణీరములు రెండూ; కిరీటి=అర్జునుడు; నేఁడు+ఎల్లి = ఈ రోజో రేపో; అనికి వచ్చున్= యుద్ధానికి వస్తున్నాడు; ఎందున్ - పోవచ్చు - మీకు = మీరెక్కడికి పోతారు?

భా: ఇటువంటి నేను రథం తోలుతూ ఉంటే జగత్ప్రఖ్యాతమయిన గాండీవము ఎక్కుపెట్టి అక్షయ తూణీరాలతో అర్జునుడు ఇవాళ రేపట్లో యుద్ధానికి వస్తాడు. ఇక ఎక్కడికి పారిపోగలరు మీరు?

వి: ఇట్టి అనడం పూర్వపద్యంలో చెప్పిన మనసుతో అనిభావం. నేను ఆయుధం పట్టకపోయినా నా మనసులోని భావం నా చేత పాండవులకు సహాయం చేయిస్తుందని సూచన.

వ: అని పలుకునప్పటి వారి యెత్తికోలును, నీ కొడుకు విడుపోపమియునుం దలంచి భయంబందితి; నితండు వారల నెఱుంగండు; భీష్మద్రోణుల ప్రాపును గర్ణుగర్వంబును దన్ను గెలిపించునని నచ్చి తొడరెడు; ననిన విని ధృతరాష్ట్రుం డర్జునుం డేమనియె? నని యడిగిన, నతనికి సంజయుం డిట్లనియె. 131

అ: ఎత్తికోలు = పూనిక; విడుపు - ఓపమి = (రాజ్యం) విడిచి పెట్టడానికి సహించకపోవడం; ప్రాపు = అండ; నచ్చి = నమ్మి; తొడరెడున్ = ఎదిరించును.

భా: అని చెప్పేటప్పుడు వారి పూనిక, నీ కొడుకు రాజ్యం విడవలేకపోవడం తలచుకొని నేనెంతో భయపడ్డాను; ఈ దుర్యోధనుడు వారిశక్తి ఎరుగడు; భీష్మ ద్రోణుల అండ, కర్ణుని గర్వము తనను గెలిపిస్తాయని నమ్మి ఎదిరిస్తున్నాడు." అన్నాడు సంజయుడు. అపుడు ధృతరాష్ట్రుడు "అర్జును డేమన్నాడు" అని అడిగాడు. వెంటనే అతనితో సంజయుడు ఇలా అన్నాడు.

వి: ముందు కృష్ణుని, తరువాత అర్జునుని గురించి అడగడంలో ధృతరాష్ట్రుని ప్రజ్ఞ బోధపడుతుంది. వారిద్దరూ పాండవులలో ప్రధానులనీ స్పష్టపడుతుంది.

-: సంజయుఁడు ధృతరాష్ట్రునకు అర్జునుఁడు చెప్పిన మాట లెఱింగించుట:- సం. 5-47-6

క: **"నరుఁ డలుక వొడమియును సు**
స్థిరుఁడై తన యెఱ్ఱ సెరల చెలువునఁ గెందా
మరలం దెగడెడు కన్నుల
నరుణచ్ఛవి నెఱయ నిట్టు లనియె నరేంద్రా! 132

అ: నరేంద్రా! = మహారాజా!; నరుండు = అర్జునుడు; అలుక + పొడమియును = కోపం వచ్చినా; సుస్థిరుఁడై = స్థిరత్వం కలవాడయి; తమాయించుకొని; తన=తనయొక్క; ఎఱ్ఱసెరల చెలువునన్ = ఎర్రని జీరల అందంతో; కెంపు + తామరలన్ = ఎఱ్ఱతామరపూలను; తెగడెడు = తిరస్కరించే; కన్నులన్=కన్నులలో; అరుణచ్ఛవి =ఎఱ్ఱని కాంతి; నెఱయన్=వ్యాపింపగా, ఇట్టులు+ అనియె = ఇట్లా అన్నాడు.

భా: *మహారాజా! అర్జునుడు కోపం వచ్చినా ఆపుకొని ఎఱ్ఱజీరల కనులతో కెందామరలను తిరస్కరిస్తూ ఇలా అన్నాడు.*

ఆ: **ఆ సుయోధనుండు నతనికిఁ దోడ్పడ**
నరుగుదెంచినట్టి ధరణినాథ
చయము వినుచు నుండ సంజయ! నా వచ
నములు గాఁగ నీవనంగ వలయు. 133

అ: సంజయ!; ఆ సుయోధనుండున్; అతనికిన్; తోడ్పడన్ = సహాయం చేయటానికి; అరుదెంచినట్టి = వచ్చిన; ధరణినాథచయమున్ = రాజుల సముదాయమూ; వినుచు నుండన్; నా వచనములు - కాఁగన్ = నా మాటలుగా; నీవు; అనంగ వలయున్ = చెప్పవలె.

భా: *సంజయ! ఆ దుర్యోధనుడూ అతనికి సాయపడటానికి వచ్చిన రాజులూ అంతా వినేటట్లు నామాటలుగా నీ విలా చెప్పాలి.*

ఉ: **పాండుని యగ్రనందనుఁడు పా లడుగం దగ నీఁడ యేని మా**
కొండన నేల?మే లది; సుయోధనుఁ డింతకు మున్ను పెక్కు లు
ద్దండతఁ దారు జేసిన విధంబుల కెల్ల మెఱుంగు పెట్టిన
ట్లుండెడుఁ గాక, యేనును వృకోదరుఁడుం బ్రియ మందునట్లుగన్. 134

అ: పాండునియగ్రనందనుఁడు = పాండు రాజు పెద్ద కొడుకు ధర్మరాజు; పాలు + అడుగన్ = రాజ్యభాగం అడిగితే; తగన్ = తగినట్లు; ఈఁడయేని =ఇవ్వకపోతే; మాకున్- ఒండు- అననేల?=మాకు మరో మాట అనవలసిన పనేమిటి?; మేలు+అది=మాకు అదిమేలు; సుయోధనుఁడు; ఇంతకు ముందు = పూర్వం; పెక్కులు = అనేకం; ఉద్దండతన్ = నిరంకుశంగా తారు చేసిన విధంబులకున్ ఎల్లన్ =తాము చేసిన పద్ధతులన్నిటికీ, మెఱుంగు+పెట్టినట్లు+

ఉండెడున్ కాక = మెఱుగు పెట్టినట్లు అవుతుంది; ఏనును = నేనూ; వృకోదరుఁడున్ = భీముడూ; ప్రియిమందునట్లుగన్ = సంతోషించేటట్లు.

భా: *ధర్మరాజు తన తండ్రి భాగం అడిగితే సముచితంగా దుర్యోధనుడు ఇవ్వకపోతే మేము ఏమీ అన నక్కరలేదు - అదేమాకు మేలు. వారు మాకు చేసిన పనులకు మళ్లీ మెరుగు పెట్టి నట్లుంటుంది. అంతే. దానితో నేనూ భీముడూ సంతోషిస్తాము.*

వి: 'ఏనును వృకోదరుడున్' అనే చివరి మాట చాలా విలువయినది. దీనివల్ల ముందు సంతోషించేది వీరిరువురూను. వీరి ప్రతిజ్ఞలు తీరేందుకు తగిన సన్నివేశం కల్పించినట్లవుతుంది.

క: **మా యిరువురతోఁ గయ్యము**
సేయ నతం డియ్యకొనిన, సిద్ధించెన కా
దే! యుచిత చరితుఁడగు కౌం
తేయాగ్రజు కార్య, మట్టి తెఱఁ గొప్పుఁ గదా! 135

అ: మా యిరువురితోన్=మా యిద్దరితో; కయ్యము+చేయన్=యుద్ధం చేయడానికి; అతండు=ఆ దుర్యోధనుడు; ఇయ్యకొనినన్ = అంగీకరిస్తే; ఉచిత చరితుఁడు+అగు = తగిన ప్రవర్తన కల; కౌంతేయ + అగ్రజుకార్యము =కుంతీపుత్రులలో పెద్దవాడయిన ధర్మజుని పని; సిద్ధించెన కాదే! = సిద్ధించి నట్లే కాదా!; అట్టి తెఱఁగు = అటువంటి పద్ధతి; ఒప్పున్‌కదా! = తగినది మంచిదికదా!

భా: *మా యిద్దరితో ఆ దుర్యోధనుడు యుద్ధం చేయడానికే సిద్ధపడితే ఆ ధర్మరాజు పని నెరవేరిం దన్నమాటేకదా! ఆ పద్ధతి మంచిదే కదా!*

క: **వనవాసంబున భూశ**
య్యను ధర్మజుఁ డున్నయట్టి యాయాసము వో
వునె? యంపశయ్య దుర్యో
ధనుఁడు రణక్షోణిం బడక తక్కిన యేనిన్. 136

అ: దుర్యోధనుడు ; రణక్షోణిన్ = యుద్ధభూమిలో; అంపశయ్యన్ -పడక = బాణాల శయ్య మీద పడకుండా; తక్కినయేనిన్=తప్పితే; వనవాసంబున్=అరణ్యవాసంలో; భూశయ్యను= భూమి అనేశయ్య మీద; ధర్మజుడు; ఉన్నయట్టి; ఆయాసము; పోవునె? = పోతుందా?

భా: *యుద్ధంలో ఆ దుర్యోధనుడు అంపశయ్యమీద పడుకోకపోతే అరణ్యవాసంలో ధర్మరాజు భూశయ్య మీద పడిన ఆయాసం పోతుందా? పోదు అని భావం.*

ఉ: **సూనృత మూఁది, బన్నములు సూడక, లోన నడంచినట్టి కో**
పానల మెండియున్న నిబిడాటవిపైఁ బచరించు తీవ్రదా
వానలుఁ బోలి శాత్రవచయంబు పయిం గవియించి నిల్చినం
గాని యుధిష్ఠిరున్ సరకుగాఁ గొన రా ధృతరాష్ట్రనందనుల్. 137

అ: సూనృతము + ఊఁది = సత్యాన్ని ఆశ్రయించి; బన్నములు చూడక = పడిన అవమానాలు పరిగణించక; లోనన్ = మనస్సులో; అడంచినట్టి = అణచుకొన్న; కోప + అనలము= కోపం అనే అగ్ని; ఎండియున్న=బాగా ఎండిపోయి ఉన్న; నిబిడ+అటవిపైన్=దట్టమయిన అడవి మీద; పచరించు=వ్యాపించే; తీవ్రదావ+అనలున్ పోలి=తీవ్రమయిన దావాగ్ని వలె; శాత్ర- వచయంబు పయిన్= శత్రువుల సముదాయం మీద; కవియించి నిల్చినన్ కాని = ప్రయోగించితేనే కాని; ఆ ధృతరాష్ట్ర నందనుల్ = ఆ దుర్యోధనాదులు; యుధిష్ఠిరున్ = ధర్మరాజును; సరుకుగాన్+ కొనరు = లక్ష్యపెట్టరు/లెక్కచెయ్యరు.

భా: *సత్యం మీదనే నిల్చి, పడిన అవమానాలు కూడా లెక్కచేయకుండా మనసులో అణచుకొన్న కోపాగ్నిని ఎండిన అడవి మీద వ్యాపించే దావానలం వలె శత్రుసముదాయం మీద వ్యాపింపజేస్తేనేకాని ఆ కౌరవులు ధర్మరాజును లెక్కచేయరు.*

వి: అలంకారము ఉపమానుప్రాణిత రూపకము.

మ: గద సారించుచు నంత్యకాల విచలత్కాలాకృతిన్ భీముఁ డు
న్మద మాతంగ చయంబు నుగ్గుగ లసన్నానా రథవ్రాతముల్
చదియన్, భూరిహయ వ్రజంబు పొడిగా, సంరంభతుంగాంగుఁడై
కదియం జూచి బలే! సుయోధనుఁడు భాగం బిచ్చు రాజ్యంబునన్.138

అ: గద; సారించుచున్= త్రిప్పుతూ; భీముఁడు; అంత్యకాల విచలత్-కాల+ఆకృతిన్= ప్రళయకాలంలో సంచరించే యముని వలె; ఉన్మద మాతంగచయంబు = మదించిన ఏనుగుల సముదాయం; నుగ్గుగన్ = నుగ్గు నుగ్గు అయ్యేటట్లు; లసత్ + నానారథవ్రాతముల్= విజృంభించే రథాల సముదాయాలు; చదియన్ = అణిగినలిగి పిండి అయిపోయేటట్లు ; భూరిహయ వ్రజంబు= పెద్దపెద్ద గుర్రాల సముదాయం; పొడిగాన్ = పొడిపొడి అయిపోయ్యేటట్లు; (భీముడు) సంరంభ, తుంగ+అంగుఁడై; ఉద్రేకం చేత ఎత్తుగా ఎదిగిన శరీరం కలవాడయి; కదియన్ చూచి = సమీపిస్తే చూసి; సుయోధనుఁడు; రాజ్యంబునన్= రాజ్యంలో; భాగంబు+ ఇచ్చున్= పాలు ఇస్తాడు; బలే!= బలేగా ఉంటుంది.

భా: *భీముడు గదతిప్పుతూ ప్రళయకాల యముని రూపంతో మదగజాలు నుగ్గు అయ్యేటట్లు, రథాలు నలిగిపోయేటట్లు, గుర్రాలు పొడిపొడి అయ్యేటట్లు ఉద్రేకంతో ఎదిగిన శరీరంతో యుద్ధభూమిలో కనిపిస్తే అపుడు దుర్యోధనుడు రాజ్యభాగం ఇస్తాడు.*

సీ: కోల్పులి వీఁకమై గొదగొని లేళ్లకు
నుఱుకు తెఱంగునఁ దఱియఁ జొచ్చి
పెనుగాలి జీమూత బృందంబుపై బెట్టి
దంబుగ వీఁచు చందమున నడరి
కసిమసంగిన మారి గడఁగి జీవుల మీఁద
నుగ్రతఁ గవియున ట్లురవడించి

యాఁకొన్న లయరుద్రుఁ డాగ్రహంబున జగ
 త్ప్రచయంబు ముట్టెడు భంగిఁ బొదివి,
తే: నకులుఁడును, దదనుజుఁడు, సాత్యకియు, నా సు
భద్రకొడుకును నెదిరిన బలమునెల్ల
బెదరఁ జెదర బడల్పడఁబెల్లుసావఁ
జేయఁగని కౌరవులు సంధి సేయువారు. 139

అ: కోల్పులి = పెద్దపులి; గొదగొని = ఆకలిగొని; వీఁకమైన్ = ఉత్సాహంతో; లేళ్లకు-ఉఱుకు తెఱంగునన్ = లేళ్లమీదకు ఉరికినట్లుగా; తఱియఁజొచ్చి = చుట్టుముట్టి. పెనుగాలి= ఝంఝామారుతం; జీమూత బృందంబుపైన = మేఘాల సమూహం మీద; బెట్టిదంబుగన్ = తీవ్రంగా; వీఁచుచందమునన్ =వీచేటట్లు; అదరి = విజృంభించి, కసిమసంగిన మారి = విజృభించిన మృత్యుదేవత; కడఁగి=పూని; జీవుల మీఁదన్ = ప్రాణుల మీద; ఉగ్రతన్ = భయంకరంగా; కవియునట్లు = పడినట్లు; ఉరవడించి = పరాక్రమించి; ఆఁకొన్న = ఆకలిగొన్న; లయరుద్రుఁడు = ప్రళయ కాలరుద్రుడు; ఆగ్రహంబునన్ = కోపంతో; జగత్ + ప్రచయంబున్= లోకముల సమూహాన్ని; ముట్టెడు భంగిన్ = చుట్టు ముట్టినట్టుగా; పొదివి = ఆక్రమించి; నకులుఁడును; తత్ + అనుజుఁడు = వాని తమ్ముడు సహదేవుడూ, సాత్యకియున్; ఆ సుభద్ర కొడుకును = అభిమన్యుడునూ; ఎదిరిన బలమున్ ఎల్లన్ = ఎదురయిన బలగాన్ని అంతటినీ; బెదరన్ చేయఁగని-(ఇది నాల్గింటికీ అన్వయం) బెదిరేటట్లు; చెదరన్ = చెదిరి పోయేటట్లు; బడల్పడన్ = బాధనొందేటట్లు; పెల్లు - చావన్ = ఎక్కువగా చచ్చిపోయేటట్లు; చేయన్ కని = చేస్తే చూసి; కౌరవులు; సంధి - చేయువారు = సంధి చేస్తారు.

భా: *ఆకలిగొన్న పెద్దపులి లేళ్లమీదికి ఉరికినట్లు నకులుడు బెదరగొట్టితే ఆ కౌరవులు సంధిచేస్తారు.*

ఝంఝా మారుతం మేఘాల మీద వీచినట్లుగా సహదేవుడు కౌరవులను చెల్లాచెదరు చేస్తే అపుడు కౌరవులు సంధి చేస్తారు. మృత్యుదేవత విజృంభించి ప్రాణులమీద పడ్డట్లుగా సాత్యకి విజృభించి కౌరవులను పడగొడితే అపుడు కౌరవులు సంధిచేస్తారు.

ఆకలిగొన్న ప్రళయకాల రుద్రుడు క్రోధంతో లోకాలను చుట్టిముట్టినట్లు అభిమన్యుడు చావగొడితే అపుడు కౌరవులు సంధిచేస్తారు.

ఉ: **చిత్తము లుల్లసిల్ల నల సింహకిశోరము లొక్కమై మదో**
న్మత్త గజావళిం బొదువు మాడ్కి, నరాతిబలంబు ముట్టి, యు
ద్వృత్తిఁ గడంగి, యప్రతిమ వీరులు ద్రౌపది పుత్రు లేవురున్
నెత్తురునీరఁ దేల్చిన ననిం గని మీనృపుఁ డక్కదీఱెడిన్. 140

అ: చిత్తములు + ఉల్లసిల్లన్ = మనసు ఉప్పొంగేటట్లు; అలసింహ కిశోరములు= సింహం పిల్లలు; ఒక్కమైన్ = ఒక్కుమ్మడిగా; మద +ఉన్మత్త - గజ + ఆవళిన్=మిక్కిలి మదించిన ఏనుగుల సముదాయాన్ని; పొదువు మాడ్కిన్ = చుట్టుముట్టి పైబడినట్లుగా, అప్రతిమవీరులు=

సాటిలేని పరాక్రమవంతులయిన; ద్రౌపది పుత్రులు + ఏవురున్ = ద్రౌపదికొడుకులు ఉపపాండవులయిదుగురూ; అరాతి బలంబున్ ముట్టి = శత్రుసైన్యాన్ని చుట్టుముట్టి; ఉద్వృత్తిన్-కడంగి = విజృంభించి; నెత్తురు నీరన్ = నెత్తుటి ప్రవాహంలో; తేల్చినన్ = తేల్చితే; అనిన్‌కని = అటువంటి యుద్ధాన్ని చూసి; మీ నృపుడు = మీ రాజయిన దుర్యోధనుడికి; అల్కతీఱెడున్ = కోపం తగ్గుతుంది.

భా: కొదమ సింహాలు ఒక్కుమ్మడిగా మత్తగజాలను చుట్టుముట్టి మీద కురికినట్లుగా ఉపపాండవు లయిదుగురూ శత్రుసైన్యాలను నెత్తురుటేరులో ముంచివేస్తే చూసి మీ రాజయిన దుర్యోధనుడి కోపం తీరుతుంది.

వి: 1.ఉపపాండవులు వరుసగా పాండవు లయిదుగురికీ ద్రౌపదికీ పుట్టినవారు.
1. ప్రతివింధ్యుడు 2. శ్రుతసోముడు 3. శ్రుతకీర్తి 4. శతానీకుడు 5. శ్రుతసేనుడు.
2. అలంకారము ఉపమ.

మ: చెలులుం జుట్టలు నిష్టభృత్యులు మహాజిం బ్రాణముల్ డాఁప కు
జ్జ్వలులై తో నడవన్, విరాటుఁడును బాంచాలుండు నేపారి సే
నల యుద్రేకము రౌద్రముం బెనుప, నానాహేతిఘోరంబుగాఁ
దల పడ్డం గని గాక స్రుక్కుదురె గాంధారీ సుతుల్ మాటలన్? 141

అ: చెలులున్ = స్నేహితులూ; చుట్టలున్ = బంధువులూ; ఇష్టభృత్యులు = ఇష్టమైన సేవకులూ; ప్రాణముల్ డాఁపక = ప్రాణాలు దాచుకోకుండా; మహా+ఆజిన్ = మహాయుద్ధంలో; ఉజ్జ్వలులై = విజృంభిస్తూ; తో నడవన్ = కూడా రాగా; విరాటుఁడును; పాంచాలుండున్ = ద్రుపదుడూ; ఏ పారి = చెలరేగి; సేనల యుద్రేకము; రౌద్రమున్ పెనుపన్ = రౌద్రత్వం పెంచగా; నానాహేతి ఘోరంబుగాన్ = అనేక విధాల ఆయుధాలతో భయంకరంగా; తలపడ్డన్ = తలపడితే; కనిగాక=చూసికాని; గాంధారీసుతుల్ = కౌరవులు; మాటలన్ = కేవలం మాటలతో; స్రుక్కుదురె?= వెనుదీస్తారా?/ మానుతారా?.

భా: స్నేహితులూ చుట్టాలూ సేవకులూ ప్రాణాలు దాచుకోకుండా యుద్ధంలో కూడా వస్తూ ఉంటే విరాటుడూ ద్రుపదుడూ యుద్ధంలో విజృంభించి సేనల యుద్రేకంతో తమ రౌద్రత పెరిగిపోతూ ఉంటే వివిధ ఆయుధాలతో ఘోరంగా తలపడితే చూసికాని కౌరవులు వట్టి మాటలతో వెనుదీస్తారా - యుద్ధం మానుతారా?

చ: తఱిమి శిఖండి దన్నొరులు దాఁకఁగ, నెవ్వరి దిక్కు జూడ కే
డ్తెఱఁ దనపూన్కిపై మనము ధీరత నిల్పి, రథంబు బల్విడిం
బఱపి, కురుక్షితీశుఁ డను బ్రహ్మకు వేయును నిండ, భీష్ముపై
కుఱికినఁ గాక మాకు సగ మూరక యిత్తురె? మీరు మేదినిన్. 142

అ: శిఖండి; తన్ను + ఒరులు - తాఁకఁగన్ = తనను శత్రువులు ఎదిరిస్తే; తఱిమి= వారిని తరిమివేసి; ఎవ్వరి దిక్కుచూడక = ఎవరివైపూ చూడకుండా; ఏడ్తెఱన్ = ఉత్సాహంతో; తనపూన్కిపైన = తన ప్రయత్నంమీద; మనము = మనస్సు; ధీరతన్ - నిల్పి =ధైర్యంతో నిలిపి;

రథంబున్; బల్విడిన్ = మిక్కిలి వేగంతో; పఱపి = తోలి; కురుక్షితీశుఁడు + అనుబ్రహ్మకు = కురురాజు అనే బ్రహ్మకు; వేయును నిండన్ = వేయేళ్ళు నిండిపోయేటట్లుగా; భీష్ముపైకి; ఉఱికినన్ కాక = ఉరికితేనేకాని; మీరు; మేదినిన్ = భూమిలో; మాకున్ ; ఊరక; సగము - ఇత్తురె? = సగభాగం ఇస్తారా?

భా: తన్నెదిరించిన శత్రువులను పారద్రోలి శిఖండి ఇంకెవరివైపూ చూడకుండా ఏకాగ్రతతో తన ప్రయత్నం మీదనే మనసు నిల్పి, రథం వేగంగా నడిపి కురురాజు అనే బ్రహ్మకు వెయ్యేళ్లూ నిండేటట్లుగా భీష్ముని మీదకు ఉరికితేనే తప్ప మీరు మాకు రాజ్యంలో సగభాగం ఇస్తారా ఊరకే.

శా. విద్యుద్దండము నిల్చి పొల్చిన గతిన్ విల్లందమై యుండ, న
స్మద్యోధావలి మానసంబుల రణోత్సాహంబు రెట్టింప, ధృ
ష్టద్యుమ్నుండు గడంగి, ద్రోణుఁ గడిమిన్ డాయంగ వీక్షించి కా,
కుద్యోగించుట కేల తక్కుదురు? మీ రుగ్రాహవ క్రీడకున్. 143

అ: విద్యుత్ - దండము = (విద్యుత్తుల) మెఱపుల వరుస లేక సముదాయము; నిల్చి పొల్చిన గతిన్ = నిలిచి ప్రకాశించి నట్లు; విల్లు + అందమై - ఉండన్ = విల్లు అందంగా ప్రకాశిస్తూ ఉండగా; అస్మత్ - యోధ + ఆవలి మానసంబులన్ = మాయోధుల సముదాయం యొక్క మనస్సులలో; రణ + ఉత్సాహంబు = యుద్ధం మీద ఉత్సాహం; రెట్టింపన్ = రెట్టింపు అయ్యేటట్లు; ధృష్టద్యుమ్నుండు; కడంగి = పూనుకొని; ద్రోణున్ = ద్రోణాచార్యుని; కడిమిన్ = సాహసంతో; డాయంగన్ = ఎదిరిస్తే; వీక్షించి కాక = చూసికాని; మీరు; ఉగ్ర + ఆహవ క్రీడకున్= భయంకరమయిన యుద్ధక్రీడకు; ఉద్యోగించుటకున్ = ప్రయత్నించడానికి; ఏల తక్కుదురు?= ఎందుకు మానుతారు?

భా: మెఱుపుతీగలు నిల్చి ప్రకాశిస్తున్నట్లుగా చేతిలో విల్లు ప్రకాశిస్తూ ఉండగా; మా వీరుల మనస్సులో రణోత్సాహం రెట్టింపయ్యేటట్లు ధృష్టద్యుమ్నుడు ద్రోణుని తాకితే చూసి తప్ప మీరు యుద్ధక్రీడకు ఎందుకు తగ్గుతారు?

వి: 1. భీష్ముని శిఖండీ; ద్రోణుని ధృష్టద్యుమ్నుడూ చంపుతారని ముందు నుంచీ తెలుసు - వారిద్దరూ ద్రుపదుని పుత్రులు.

2. విద్యుల్లత చంచలమయినది. కాని ధృష్టద్యుమ్నుని కోదండం ఆరిపోని విద్యుద్దండం - కనుమరుగు కానిది - అచంచలమయినది

సీ. గాండీవ గుణరవం బొండొండ చెలఁగంగ
శరపరంపర లాకసంబు గప్పఁ
బ్రతి విశిఖములు ఖండితములై రాలంగ
నెదిరి సైన్యంబుల మదగజాది
చతురంగములను జర్జరితంబులై యవ
యవ భేద మెఱుఁగని యట్లుగాఁగఁ

దునిసిన నెత్తురు నెనడును నెమ్ములు
నెఱచియుఁ గండలు నెనసి సమర
తే. తలము ఘోరంబుగాఁ గపి ధ్వజము ధవళ
హరులు శోభిల్ల నొగలపై హరి యెలర్ప
దేవదత్తంబు మ్రోయఁ దోఁతెంచునట్టి
రథముఁగని కాని కానఁడు రాజరాజు. 144

అ: గాండీవగుణరవంబు = గాండీవం యొక్క నారి ధ్వని (ధనుష్టంకారం); ఒండొండన్=వరుసగా; చెలగంగన్=వ్యాపింపగా; శరపరంపరలు=బాణముల వరుసలు; ఆకసంబు కప్పన్ = ఆకాశాన్ని కప్పివేయగా; ప్రతి విశిఖములు = మారుబాణాలు; ఖండితంబులై రాలంగన్= ఖండింపబడి పడిపోగా;ఎదిరి సైన్యంబులన్=శత్రుసైన్యాలలో; మదగజ+ఆది చతురంగములను= మదించిన ఏనుగులూ మొదలయిన వాని నాలుగు అంగాలలోనూ (గజములు; గుర్రాలు; రథాలు; భటులు) జర్జరి తంబులై = శిథిలములై; అవయవ భేదము ఎఱుఁగనియట్లు కాఁగన్= ఏ అవయవం ఏదో తెలియనట్లు; తునిసినన్ = తెగిపోతే; నెత్తురు; నెనడును = ఎముకల క్రొవ్వు; ఎమ్ములు = ఎముకలూ; ఎఱచియున్ = మాంసమూ; కండలున్; ఎనసి = కలిసిపోయి; సమరతలము = యుద్ధభూమి; ఘోరంబుగాన్ = భయంకరం అయిపోగా; కపి ధ్వజమున్ = కోతిజెండా; ధవళహరులు = తెల్లగుర్రాలు; శోభిల్లన్ = ప్రకాశింపగా; నొగలపైన్= రథం ముందు భాగాన; హరి ఎలర్పన్ = కృష్ణుడు శోభిల్లగా; దేవదత్తంబు మ్రోయన్ = శంఖం మ్రోగుతూ; తోతెంచునట్టి = వచ్చే; రథమున్ కనికాని = రథాన్ని చూస్తేనేకాని; రాజరాజు = ఆ దుర్యోధనుడు కానడు = ఇంకొకటి చూడడు.

భా: గాండీవ ధనుష్టంకారంతో శరపరంపరలు ఆకాశాన్ని కప్పివేసి, శత్రుబాణాలు ఖండించి సైన్యాలనూ చతురంగాలనూ శిథిలంచేసి, వారి అవయవాలు ఏవి ఎవరివో ఏవి ఏ అవయవాలో తెలియలేనంతగా నెత్తురూ, ఎముకలూ, మాంసమూ, కండలూ అన్నీ కలిసిపోయి యుద్ధభూమి అంతాభయంకరం అయ్యేటట్లు కపిధ్వజమూ, శ్వేత వాహనాలూ కలిగి సారథిగా కృష్ణుడు కూర్చొని దేవదత్తం (అర్జునుని శంఖం) పూరిస్తూ వచ్చే రథం చూస్తేనే కాని ఆ రాజరాజుకు కన్ను కానరాదు.

వి: తిక్కన బీభత్స రసపోషణం ఇందులో చూడవచ్చు. ఇది వీరానికి అంగంగా ఉపయోగపడింది.

శా. బాలక్రీడ మహాసుర ప్రకరమున్ భంజింపఁడే! యెప్పుడుం
త్రైలోక్యంబును భక్తియుక్తిఁ దగ నారాధింపదే! యట్టి శౌ
ర్యాలంకారు మహాత్ముఁ దా సరకు సేయం డచ్యుతున్, మ మ్మతం
డేలా కైకొను? నా సుయోధనునియం దెగ్గేది యూహింపఁగన్. 145

అ: బాలక్రీడన్ = చిన్నతనపు ఆటలలో; మహా + అసుర ప్రకరమున్ = రాక్షస సముదాయాన్ని; భంజింపఁడే! = సంహరించలేదా!; ఎప్పుడున్; త్రైలోక్యంబును = మూడు

లోకాలూ; భక్తియుక్తిన్ = భక్తితో; తగన్ ఆరాధింపదే!; అట్టి; శౌర్య + అలంకారున్ = పరాక్రమమే అలంకారంగా కల వానిని; మహాత్మున్; అచ్యుతున్ = కృష్ణుని; సరకు - చేయండు=లెక్కపెట్టడు; అతండు= ఆ దుర్యోధనుడు; మమ్ము; ఏలాకైకొను? = ఎలా లక్ష్యపెడతాడు?; ఆ సుయోధనుని యందు; ఊహింపఁగన్ =ఊహించటానికి; ఎగ్గు + ఏది? = తప్పేముంది? (ఇది వెటకారంగా అన్నమాట)

భా: చిన్నతనం లోనే రాక్షసులను సంహరించిన వాడూ, ముల్లోకాలు భక్తితో ఆరాధించేవాడూ అయిన మహాత్ముడు కృష్ణునే ఆ దుర్యోధనుడు లెక్కచెయ్యడు. అటువంటప్పుడు మమ్మ అతడు లెక్కచేస్తాడా? అయినా ఆ సుయోధనునిలో తప్పేముందిలే!

వి: అంతటి కృష్ణునే లెక్కచేయనివాడు ఏమీ లేని మమ్మల్ని లెక్కచేస్తాడా - ఇది ఆలంకారికుల పరిభాషలో కావ్యార్థాపత్తి.

వ. ఏము పితామహ గురు కృపాచార్యులకు నమస్కరించి యస్మదీయ రాజ్య భాగంబునకై తొడరి కయ్యంబు సేయువారము; కౌరవులకుం బూని యెవ్వరు మాతోఁ బెనంగినను వారి శస్త్రాస్త్రంబులు ధర్మప్రతిహతంబు లగునని తలంచెదము; పండ్రెండు వత్సరంబులు వనంబున నమ్మోయి నిడుమలంబడి జనపదంబునం బదుమూఁడగు నేఁడజ్ఞాత వాసాయాసం బట్లనుభవించి వచ్చి మా తండ్రి పాలికినై బెనంగు మమ్ము నింద్రాది సురసహాయు లయ్యును ధార్తరాష్ట్రులు గెల్చువా రైరేని ధర్మంబుకంటె నధర్మము బలవంతం బైనయది యగు; నింతియ కాని మా చేయునట్టిది గీడైనదిగా; దేము వాసుదేవుని మున్నిడికొని నడతుము గావున నీ యుద్ధంబునం జయంబు మాకు సిద్ధంబ; యెల్ల భంగులం గర్ణ సహితంబుగా గాంధారీ నందనులం దునిమి యేము భూమిగొనుట దప్పదు; గాండీవంబు దివియకయును గుడుసు వడియెడు, బాణంబులు దమయంతన తూణీరంబుల వెడలెడుఁ, దోలాడ్పు మహానాగంబునుంబోలెఁ గరవాలంబు దాన యొఱ వెడలికి నిగుడుచున్నయది, గావున మాకవశ్యంబును సంగరంబు సంభవించుఁ, బాశుపతాది దివ్యశరంబులం గురుపక్ష ప్రజాక్షయంబు సేసి శాంతిం బొందెదము; సూత నందనా! నీవు స్థిరుండవై యింతయుం దెలియం బలుక వలయు, ని మ్మాటలు విని కురువృద్ధుండు బాహ్లీకుండును శిక్షకుండగు కృపాచార్యుండును గురుపుత్రుండగు నశ్వత్థామయు సద్బుద్ధియగు విదురుఁడును ధర్మాచరణ కల్యుండగు శల్యుండును నెయ్యాది నిశ్చయించి పలికి రది యయ్యెడు; సుయోధనాదు లాయుష్మంతులగు వారకాక, యని పలికెనని చెప్పిన విని మందాకినీ నందనుం డందఱు విన దుర్యోధనున కిట్లయె. 146

అ: ఏము = మేము; ధర్మప్రతి హతంబులు = ధర్మం చేత దెబ్బ తిన్నవి; ఆ + మెయిన్ = ఆవిధంగా; ఇడుమలంబడి = కష్టాలు పడి; ఇంద్రాది సురసహాయులు = ఇంద్రుడు మొ॥ దేవతలు సహాయంగా కలవారు; ధార్తరాష్ట్రులు = కౌరవులు; గెల్చువారు + ఐరి + ఏని = గెల్చితే; మున్ను + ఇడికొని = ముందు పెట్టుకొని; ఎల్ల భంగులన్ = అన్నివిధాలా; తునిమి =

ఖండించి; తివియకయును = లాగకుండానే; గుడుసువడియెడున్ = గుండ్రంగా అయిపోతోంది; తూణీరంబులు = అమ్ములపొదులు; తోలూడ్చు = కుబుసంవిడుచు; మహానాగంబు = పాము; కరవాలంబు = కత్తి; అవశ్యంబును = తప్పక; సంగరంబు = యుద్ధం; కురు పక్ష ప్రజాక్షయంబు+ చేసి=కౌరవపక్షంలోని ప్రజలను నాశనంచేసి; పితామహుండు=తాత; కుంభసంభవుండు=ద్రోణుడు; ధర్మ + ఆచరణ + కల్యుండు = ధర్మాన్ని ఆచరించడంలో సమర్థుడు; మందాకినీ నందనుండు= గంగాదేవి కొడుకు భీష్ముడు

భా: *మేము భీష్మద్రోణ కృపులకు నమస్కారంచేసి మా రాజ్యభాగంకోసం యుద్ధం చేస్తాము. కౌరవులకోసం ఎవరు మాతో యుద్ధం చేసినా వారి శస్త్రాలూ అస్త్రాలూ అన్నీ ధర్మంచేతనే కొట్టబడతాయి అని తలుస్తాము; 12 సంవత్సరాలు ఆ విధంగా అరణ్యంలో కష్టాలు పడి ఒక సంవత్సరం అజ్ఞాతవాసం చేసి వచ్చి మా తండ్రి భాగం కోసం పెనగులాడే మమ్మల్ని కౌరవులే కనుక గెలిస్తే ధర్మం కంటె అధర్మం బలమయింది అంటారు - అంతేకాని మేం చేసేది తప్పుకాదు - మేము కృష్ణుని ముందుంచుకొని నడుస్తాం కాబట్టి జయం మాకు తప్పదు. అన్ని విధాలా కర్ణుడితో సహా కౌరవులందరినీ సంహరించి మేము రాజ్యం పొందడం తథ్యం - గాండీవం లాగకుండానే గుండ్రంగా అయిపోతోంది. బాణాలు తూణీరంలోంచి తమంత తామే బయలుపడుతున్నాయి. కుబుసం విడిచే పాములాగా ఒరలోంచి కత్తి వెలికివస్తోంది. అందుచేత మాకు తప్పక యుద్ధం సంభవిస్తుంది. పాశుపతం మొదలయిన దివ్యాస్త్రాలతో కౌరవపక్షం అంతా నశింపజేసి శాంతిస్తాము. సంజయా! నీవు స్థిరంగా ఈ మాటలన్నీ వారితో చెప్పాలి.*

ఈ మాటలు విని బాహ్లికుడూ, భీష్ముడూ, ద్రోణుడూ, కృపుడూ, అశ్వత్థామా, విదురుడూ, శల్యుడూ ఏది నిశ్చయించుతారో అదే అవుతుంది. దుర్యోధనాదు లాయుష్మంతు లగుదురు గాక అని సంజయుడు చెప్పాడు. ఆ మాటలు విని భీష్ముడు అందరూ వినేటట్లు దుర్యోధనుడితో ఇలా అన్నాడు.

వి: 1. బాహ్లికుడు భీష్ముని పినతండ్రి. శంతనుని తమ్ముడు

2. పాశుపతం - అర్జునుడు శివుని మెప్పించి సంపాదించాడు.

3. తాను ధార్మికంగా ప్రవరిస్తున్నానని ధర్మం జయిస్తుందని అర్జునుని విశ్వాసం. ధర్మ సంస్థాపనం కోసం అవతరించిన కృష్ణుడు తన పక్షాన ఉండటం చేత తనకు జయం తథ్యమని భావం.

4. ఇంతా చెప్పి చివరకు భీష్మద్రోణాదులు నిశ్చయించినదే భావించినదే జరుగుతుంది అనడంలో అర్జునుని వృద్ధసేవ గోచరిస్తుంది. వెంటనే భీష్ముడు చెప్పే విషయం కూడ జరుగబోయే దాన్ని సూచిస్తోంది. నరనారాయణులే అర్జునుడూ కృష్ణుడూను. అందుచే వారికి విజయం తథ్యమని సూచన.

సీ. నలినగర్భుఁడు పెద్దకొలువున నున్నెడ,
సురపతి ప్రముఖుల చూడ్కులెల్ల

మెఱయు తేజంబున మిఱుమిట్లుగొన నిద్ద
ఱచ్చట నొరసికొం చరుగఁజూచి
వీ రెవ్వరిమ్మెయి మీరుండ సరకుసే
యని యట్లు వోయెడు నట్టివార?
లని బృహస్పతి బ్రహ్మనడిగిన, నతని కి
ట్లనియె నా చతురాస్యుఁ డాదరమున.

తే. **దపము పెంపును బలశౌర్యదర్పములును**
గలిగి లోక హితార్థంబుగాఁ జరింతు
రే యుగంబుల నరుఁడు నారాయణుండు
ననఁ బ్రసిద్ధికి నెక్కిన మునులు సుమ్ము. 147

అ: నలిన గర్భుఁడు = బ్రహ్మ; పెద్దకొలువునన్ = నిండుసభలో; ఉన్న + ఎడన్ = ఉన్న సమయంలో; సురపతి ప్రముఖుల = ఇంద్రాదుల; చూడ్కులు - ఎల్లన్ = చూపులన్నీ; మిఱుమిట్లు కొనన్; మెఱయు తేజంబునన్ = మెరిసే కాంతితో; ఇద్దఱు; అచ్చట; ఒరసికొంచు= పక్కపక్కనే; అరుగన్ చూచి = వెళ్లడం చూసి; వీరు ఎవ్వరు?; ఈ+మెయిన్=ఈవిధంగా; మీరు+ ఉండన్ = మీరుండగా; సరకు సేయని యట్లు = లెక్కచేయనట్లు; పోయెడు నట్టివారలు' అని బృహస్పతి; బ్రహ్మన్; అడిగినన్; ఆచతురాస్యుడు = ఆ బ్రహ్మ; ఆదరమునన్; అతనికిన్ = బృహస్పతికి; ఇట్లనియె; తపము పెంపును =తపస్సు యొక్క ఆధిక్యము; బలశౌర్యదర్పములును= బలపరాక్రమాలు, గర్వమూ కలిగి; లోకహిత + అర్థంబుగాన్ = జనహితంకోసం; ఏయుగంబులన్ అన్ని యుగాల్లోనూ; చరింతురు = తిరుగుతూ ఉంటారు; నరుఁడు, నారాయణుండు; అనన్, ప్రసిద్ధికిన్ ఎక్కిన మునులు సుమ్ము =అని ప్రసిద్ధి వహించిన మహర్షులు సుమా!

భా: ఒకసారి బ్రహ్మ నిండుకొలువులో ఉండగా, ఇంద్రాది దేవతల చూపులు మిరుమిట్లు గొలిపేటంతటి తేజస్సుతో ఇద్దరు ఒకరిప్రక్కనే ఒకరు వెళ్లడం చూసి బృహస్పతి బ్రహ్మతో వీరెవరు? మీరిక్కడ ఇంత సభలో ఉండగా మిమ్మల్ని లక్ష్యపెట్టకుండా వెడతారు? అని అడిగాడు. అపుడు బ్రహ్మ ఆదరంతో ఇలా అన్నాడు. తపస్సూ బలపరాక్రమాలూ, గర్వమూ కలిగి ప్రజాహితంకోసం వీరిరువురూ అన్ని యుగాల్లోనూ సంచరిస్తారు - నరుడు నారాయణుడు అని ప్రసిద్ధికెక్కిన మహర్షులు సుమా!.

వి: సూర్యతేజస్సు మన మానవుల కళ్లకు మిఱుమిట్లు గొలుపుతుంది. ఇంద్రుడు సహస్రాక్షుడు - అతని కనులకు కూడా మిఱుమిట్లు గొలిపే తేజస్సు వారిది.

వ. **అని పలికి వెండియు.** 148

భా: అని చెప్పి ఇంకా ఇలా అన్నాడు.

క. **అనిమిష హితము దనుజనా**
శనమును జేయుదు రధర్మసంగ్రామము గ

ల్గినచోట ధర్మపరులగు
జనముల గెలిపింతు రధిక సంరంభమునన్. 149

అ: (వీరు) అనిమిషహితమున్ = దేవతలకు హితమూ; దనుజనాశనమును = రాక్షసులనాశనమూ; చేయుదుర = చేస్తారు; ధర్మసంగ్రామము = ధర్మయుద్ధం; కల్గినచోట; అధిక సంరంభమునన్ = అధిక ఉత్సాహంతో; ధర్మపరులగు జనములన్; గెలిపింతురు.

భా: *వీరు దేవతలకు హితం చేస్తారు. రాక్షసనాశం చేస్తారు - ధర్మయుద్ధం జరిగిన చోట ఎంతో పూనికతో ధర్మపరులను గెలిపిస్తారు.*

వి: పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతాం
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే
అని కృష్ణుడు గీతలో చెప్పాడు.

వ. దేవాసుర యుద్ధంబు నప్పు డింద్రుండు వోయి వీరి నారాధించి తో డడిగినం జనుదెంచి పౌలోమ కాలకేయాదులగు ననేక దైత్యదానవులం జంపి యింద్రునకు విజయంబు గావించి; రది మొదలుగా వీరల నెల్లవారలు నెఱింగియుండుదు; రిది యొక్క తేజంబ; రెండు దెఱంగులై వెలుంగుచుండు; నని చెప్పె; వినోదార్థంబు జన్మాంతరంబు నొందిన యమ్మహాత్ములు గదా యీయర్జునుండును వాసుదేవుండును; నర్జునుండు సముద్ర తీరంబున హిరణ్యపురంబు వొడిచి నివాత కవచుల నఱువదివేవుర నిర్జించి పర్జన్యునకుఁ బ్రియంబుసేసె; వాసుదేవు పరాక్రమంబు గంస నరకాసుర ప్రముఖ నిఖిల దుష్ట నిగ్రహంబునం బ్రసిద్ధంబు గాదె తెలియవిను మున్న రూపు సెప్పెద. 150

అ: తోడు = సహాయము; వినోద = అర్థంబు = వినోదంకోసం; జన్మ + అంతరంబు= మరొకజన్మ; పొడిచి = ముట్టడించి; పర్జన్యుఁడు = ఇంద్రుడు; దుష్టనిగ్రహంబు = దుర్మార్గుల సంహారము; ఉన్నరూపు = యథార్థము.

భా: *దేవదానవ యుద్ధం జరిగినపుడు ఇంద్రుడు వెళ్లి వీరిని సాయమడిగితే వచ్చి వీరు పౌలోములు కాలకేయులు మొదలయిన రాక్షసులను చంపి యింద్రునకు విజయం చేకూర్చారు. అప్పటి నుండి వీరి నందరూ తెలుసుకొన్నారు. ఇది నిజానికి ఒకటే తేజస్సు - రెండుగా మారింది. వినోదం కోసం మరోజన్మ ఎత్తిన నరనారాయణులే అర్జునుడూ కృష్ణుడూను. అర్జునుడు సముద్రతీరంలో హిరణ్యపురం ముట్టడించి నివాతకవచులను అరవై వేలమందిని జయించి యింద్రునకు ప్రీతి కలిగించాడు. అలాగే కృష్ణుని పరాక్రమం కంసుడు, నరకాసురుడు మొ॥ దుష్టుల సంహారంతో ప్రసిద్ధివహించింది కదా! వాస్తవం చెవుతా విను.*

**క. ఆ యిరువురు నొక తలయై
యాయోధనమునకు నడచు నట్టిద యేనిన్**

వేయేల మనమ కా దెదు
రై యేడ్తెఱఁ దాఁక హరున కైనను వశమే? 151

అ: ఆ - ఇరువురున్ = ఆ కృష్ణార్జును లిద్దరూ; ఒకతలయై = ఒక పక్షమయి; ఆయోధనమునకున్ = యుద్ధానికి; నడచు - అట్టిది ఏనిన్ = నడిచి రావడమే జరిగితే; వేయి+ ఏల = వేయిమాటలెందులకు?; మనమ కాదు = మనమే కాదు; ఎదురై; ఏడ్తెఱన్ = సాహసంతో; తాఁకన్ = ఎదిరించటానికి; హరునకున్ + ఐనను - వశమే = శివునికయినా శక్యమా?

భా: *ఆ కృష్ణార్జును లిరువురూ ఒకే పక్షాన ఉండి యుద్ధానికి నడిచి వస్తే మనకే కాదు ఎదిరించడానికి శివుడికి కూడా శక్యం కాదు.*

వి: అర్జునుడు అరణ్యవాసంలో శివునికూడా జయించినట్లు భీష్మునకు తెలుసు.

క. **సారధియు రథియునై యొక**
తేరం గృష్ణు లతిఘోర తేజస్సార
స్ఫారతఁ దోఁచిన నైనను
ధీరత వాటించి చూచి తెలిసెదవు బలే! 152

అ: సారథియున్ - రథియున్ - ఐ = సారథి, రథికుడూ అయి; ఒకతేరన్ = ఒకే రథం మీద; కృష్ణులు = కృష్ణుడూ అర్జునుడూ ఇద్దరూ; అతి ఘోర తేజస్ సార స్ఫారతన్ = మిక్కిలి భయంకరమయిన తేజో విశేష ప్రకాశం చేత; తోచినన్ ఐనను = కన్పడ్డపుడయినా; ధీరత - పాటించి = ధైర్యం వహించి; చూచి తెలిసెదవు = చూసి తెలుసుకుంటావు. బలే!

భా: *ఈ కృష్ణులిద్దరూ ఒకడు సారథీ, మరొకడు రథికుడూ అయి ఒకే రథం మీద తేజఃప్రకాశములతో కనపడ్డప్పుడయినా నీవు తెలుసుకుంటావులే!*

వి: 1. కృష్ణుడు అని అర్జునునికి కూడా పేరు ఉంది.

2. బలే! అనేది బాగుంది - అని సంతోష పూర్వక మయిన ఆశ్చర్యానికి సూచకమయిన అవ్యయం. ఇందులో భీష్ముని సంతృప్తి గోచరిస్తుంది. అప్పుడు యుద్ధం మానినా అతనికి సంతోషమే. ఇదీ ఒక విధంగా మంచిదే అనే భావం అందులో ఉంది.

వ. **అనుచు నా సుయోధను నుపలక్షించి శాంతనవుండు మఱియు నిట్లనియె.** 153

అ: ఉపలక్షించి = చూసి; శాంతనవుండు = భీష్ముడు.

భా: *అంటూ భీష్ముడు ఆ దుర్యోధనుని చూసి ఇంకా ఇలా అన్నాడు.*

క. **మది నామాట కొకింతయు**
బెదర; వకార్యంబు నందుఁ బ్రియము గలిగి యుం
డుదు; కౌరవులకుఁ గాలము
దుదియో కాకిట్టి గర్వితుని నే మందున్? 154

అ: నామాటకున్; మదిన్ = మనసులో; ఒక + ఇంతయు = కొద్దిగా కూడా;

బెదరవు= భయపడవు; అకార్యంబు నందు = చేయకూడని పని మీద; ప్రియము - కలిగి - ఉండుదు(వు) కౌరవులకున్; కాలము - తుదియో కాక = కాలం ఆసన్నమయిందేమో - చివరికి వచ్చిందేమో - పోయేకాలమేమో! కాక; ఇట్టి గర్వితునిన్; ఏమి + అందున్ = ఏమంటాను?

భా: నేనన్న ఈ మాటలకు ఏమీ భయపడవు. కానిపని మీదనే నీకు ప్రీతి ఎక్కువ - మరి కౌరవులకు పోయేకాలం వచ్చిందేమో లేకపోతే ఇలా ఉండదు. ఇంత గర్వితుని ఏమంటాను?

వి: భీష్ముడన్న మాటలోని అంతర్యం దుర్యోధనుడు గ్రహించలేకపోయాడే అని భీష్ముని బాధ. దానికి కారణం దుర్యోధనుని గర్వమని అతని జాలి.

తే. హితములగు నాదు వచనంబు లిపుడు వినని
వాఁడ వైతేని, నప్పుడు వారు వడిరి
వీరు వడి,రను పలుకులు విందుగాక;
శకుని కర్ణదుశ్శాసనుల్ సమ్మతింప. 155

అ: హితములు+ అగు; నాదువచనంబులు; ఇపుడు; వినని వాఁడవు+ఐతి - ఏనిన్= వినని వాడవయితే; అప్పుడు; వారు+ పడిరి = వారు పడిపోయారు; వీరు + పడిరి; అనుపలుకులు= అనే మాటలు; శకుని, కర్ణ, దుశ్శాసనుల్; సమ్మతింపన్= సంతోషించేటట్లు; విందుగాక = వింటావు.

భా: హితకరములయిన నా మాట లిపుడు వినకపోతే యుద్ధంలో వారు చచ్చారు వీరు చచ్చారు. అనే మాటలు కర్ణశకుని దుశ్శాసనులకు సంతోషంగా వింటావులే.

వి: చివరి పాదంలో భీష్ముని అక్కసు అంతా ప్రతిఫలిస్తోంది. వాళ్లమాటలు విని దుర్యోధనుడు చెడిపోతున్నాడని భీష్ముని తపన - బాధ.

వ. దుష్ట కష్ట నికృష్టాత్ములగు నిమ్ముువ్వురుఁజెప్పెడు బుద్ధులు గాని యొండు విననొల్ల, వేమి సేయవచ్చు? నని పలికినం గానీనుండు గనలి గాంగేయున కిట్లనియె.156

అ: దుష్ట,కష్ట, నికృష్టాత్ములు = దుష్టమూ, పాపయుతమూ, నీచమూ అయిన మనసుకలవారు; ఈ + మువ్వురున్ = ఈ ముగ్గురూ; ఒండు = మరొకటి; వినన్ - ఒల్లవు = వినటానికి అంగీకరింపవు; కానీనుండు = కర్ణుడు; కనలి = కోపించి; గాంగేయుఁడు = భీష్ముడు.

భా: దుష్టులూ, పాపులూ, నీచులూ అయిన ఈ కర్ణశకుని దుశ్శాసనులు చెప్పే బుద్ధులు వింటావే కాని ఇతర మేమీ వినవు. ఏం చెయ్యాలి? అని పలికితే కర్ణుడికి కోపం వచ్చి భీష్మునితో ఇలా అన్నాడు.

వి: 1. దుష్ట కష్ట నికృష్టాత్ములనడంలో భీష్ముని బాధ, కోపం వ్యక్తమవుతాయి. మూడు విశేషాలూ ముగ్గురికీ అన్వయిస్తాయి. క్రమాన్వయం లేదు.

2. ఏమి సేయవచ్చు = ఇది తెలుగులో ఒక జాతీయం వంటిది. ఏం చెయ్యాలి నాకేం దారి - ఇట్లా అంటారు. ఎన్ని చెప్పినా వినక పోయినపుడు ప్రేమపూర్వకమయిన నిర్వేదం, తపన ఇందులో గోచరిస్తాయి.

3. కానీనుడు=కన్యాపుత్రుడు అని అర్థం. అనగా కుంతి కన్యాత్వంలో పుట్టిన వాడని భావం.

ఆ. ఇట్టు లాడఁదగునె? యేనేమి సేసితిఁ;
గొలిచి కుడుచు పాడి నలవు జలముఁ
బలుకు టెందు నెగ్గె? పతికిఁ బుత్రులకును
మనుమలకు హితంబ యొనర నడతు. 157

అ: ఇట్టులు - ఆడన్ తగునె? = ఇట్లా మాట్లాడవచ్చునా? ఏను + ఏమి - చేసితిన్= నేనేం చేశాను? కొలిచి కుడుచుపాడిన్ = రాజసేవచేసి బ్రతుకుతున్న న్యాయం చేత; అలవు = ఉపాయమూ; చలము = దీక్ష; పలుకుట = చెప్పడం; ఎందున్ + ఎగ్గె = ఎక్కడయినా తప్పా?; పతికిన్ = రాజయిన ధృతరాష్ట్రునకు; పుత్రులకును; మనుమలకున్; హితంబు - అ + ఒనరన్= హితమే కలిగేటట్లు; నడతున్ = ప్రవర్తిస్తాను.

భా: ఇలా అనవచ్చునా? నేనేం చేశాను? రాజాస్థానంలో ఉండి బ్రతుకుతున్న ధర్మం చేత ఉపాయమూ కర్తవ్యమూ చెప్పడం తప్పా? రాజుకూ కొడుకులకూ మనుమలకూ హితం కలిగేటట్లు ప్రవర్తిస్తాను.

క. కాని తెఱఁగైన నింతటి
మానిసిఁగా నేల చేయు మనుజేంద్రుఁడు న?
న్నీ నెఱి దప్పిన మాటలు
నీనోరన్ వెడలఁ దగునె నిండిన సభలోన్? 158

అ: కాని తెఱఁగు+ఐనన్=(నేను చేసేది)తగని పని అయితే; నన్ను; మనుజేంద్రుఁడు= రాజు; ఇంతటి మానిసిగాన్ = ఇంతవానినిగా; ఏల చేయున్ = ఎందుకు చేస్తాడు? ఈ నెఱి తప్పిన మాటలు=మర్యాద తప్పిన ఈ మాటలు; నిండిన సభలోన్; నీ నోరన్= నీ నోటినుండి; వెడలన్ తగునె? = రా దగునా?

భా: నేను చేసేపని కాని పని అయితే మహారాజు నన్ను ఇంతటి వానిగా ఎందుకు చేస్తాడు? మర్యాద లేని యిటువంటి మాటలు నిండు సభలో నీ నోటి నుండి రావచ్చునా?

వి: దుష్టకష్టనికృష్టాత్ములనే మాట కర్ణుని బాధించింది. అది మర్యాద లేని దని కర్ణుని బాధ. అది కూడా ఎక్కడో ఏకాంతంలో నైనా కాకుండా నిండు సభలో అన్నాడని మరింత వేదన.

వ. అనిన విని భీష్ముఁడు ధృతరాష్ట్రున కిట్టనియె. 159

భా: ఆ మాటలు విని భీష్ముడు ధృతరాష్ట్రునితో ఇలా అన్నాడు.

-: భీష్ముఁడు కర్ణుని దుర్ణయంబు ధృతరాష్ట్రునితోఁ జెప్పుట:-
సం. 5-48-33

తే. ఒకట నైనను వారియం దొకరిలోని
చిదుర పాలును బోలండు, సిగ్గులేక

పాండవుల గెల్తు నే నని పలుకుచుండు;
వీని రజ్జులు దులువలు విండ్రు తగిలి. 160

అ: ఒకటన్ - ఐనన్ = ఒకదానిలో అయినా (పాండిత్యంలో; పరాక్రమంలో; రాజనీతిలో ఇట్లాదేనిలోనూ) వారి యందున్ = ఆ పాండవులలో; ఒకరిలోని; చిదురపాలును పోలండు = చిన్న భాగంకూడా సాటిరాడు; సిగ్గులేక; నేను; పాండవులన్, గెల్తున్ = గెలుస్తాను; అని పలుకుచుండున్; వీని రజ్జులు=వీని గొప్పలు; తులువలు = నీచులు; తగిలి విండ్రు = ఆసక్తితో వింటారు.

భా: ఏ ఒక్క విషయంలోనూ పాండవులలో ఏ ఒకరితోనూ చిన్న మెత్తుకూడా సాటిరాడు. పైగా సిగ్గులేకుండా పాండవులను నేను గెలుస్తా అంటూ ఉంటాడు. వీడి గొప్ప మాటలు హీనులు వింటారు. ఇంకెవరూ వినరు.

వి: ఒకటనయినను అంటే ఏవయినా చెప్పవచ్చు - శాస్త్ర పాండిత్యంలో కాని, రాజనీతిలో కాని; పరాక్రమంలో కాని; విలువిద్యలో కాని, గదా నైపుణ్యంలో కాని, మల్లయుద్ధంలో కాని ఇలా ఎన్నయినా చెప్పవచ్చు. వీటిలో వేటిలోనూ పాండవులతో ఎవరితోనూ సాటిరాడు అని భావం.

క. **మగఁటిమి వారికి వీఁ డెదు**
రుగ నమ్మి సుయోధనుఁడు విరోధము గొని స
ర్వగుణాఢ్యులు బలవంతులు
నగు పాండునృపాల సుతుల నవమానించెన్. 161

అవ: ఇందులో పాండవకౌరవులకు భేదం కలగటానికి కర్ణుడే కారణమని భీష్ముడు సూచిస్తున్నాడు.

అ: మగఁటిమిన్ = పరాక్రమంలో పౌరుషంలో; వారికి ఆ పాండవులకు; వీఁడు = ఈ కర్ణుడు; ఎదురుగన్ నమ్మి = సమానుడయి ఎదుర్కొన గలవాడని నమ్మి; సుయోధనుడు; విరోధము + కొని = పాండవులతో విరోధం పెట్టుకొని; సర్వగుణ + ఆఢ్యులు = అన్ని గుణాల చేతనూ గొప్పవారూ; బలవంతులున్; అగు; పాండు నృపాల సుతులన్=పాండు రాజుకుమారు లయిన పాండవులను; అవమానించెన్.

భా: పరాక్రమ విషయంలో పాండవులకు ఎదురుగా ఈ కర్ణుడు నిలుస్తాడని నమ్మి దుర్యోధనుడు పాండవులతో విరోధం పెట్టుకొన్నాడు. అంతేకాదు సద్గుణులూ బలవంతులూ అయిన పాండవులను వీని అండ చూసుకొనే అవమానపరిచాడు.

వి: వారిలో ఎవరితోనూ ఈ కర్ణుడు అణుమాత్రమూ పోలడు. అటువంటి వానిని నమ్మి సుయోధనుడు పాండవులతో విరోధం కొని తెచ్చుకొన్నాడని భీష్ముని భావం.

ఉ. ఒక్కఁ డొకం డనేకవిధ యుద్ధజయంబులు గొన్నవారు, వా;
రెక్కడ! నేమి సేసె నితఁ డీతనితమ్మునిఁ గూల నేసి యు
క్కెక్కిన పార్థుపైఁ గవిసెనే? పసు లాతఁడు గ్రమ్మఱింపఁగా
నక్కడ లేఁడె వీఁడు?భవదాత్మజుఁ గోల్పడె ఘోషయాత్రలోన్. 162

అ: ఒక్కఁడు - ఒకండు = ఒక్కొక్కడూ (ఎవరికి వారే వేర్వేరుగా) అనేకవిధ యుద్ధ జయంబులు = ఎన్నోరకాల యుద్ధాలలో జయాన్ని; కొన్నవారు=పొందినవారు; వారు= పాండవులు; ఇతఁడు = ఈ కర్ణుడు; ఎక్కడ; ఏమిచేసెన్? = ఎక్కడ ఏ పని నిర్వహించాడు? ఈతని తమ్ముని= తన తమ్ముని; కూలనేసి= చంపి; ఉక్కు ఎక్కిన = విజృంభించిన; పార్థుపైన్= అర్జునుని మీదకు; కవిసెనే=ఉరికాడా?ఎదిరించాడా?;అతండు=ఆ అర్జునుడు;పసులు=గోవులను; క్రమ్మఱింపఁగాన్= మళ్లించితే; వీఁడు = ఈ కర్ణుడు; అక్కడలేడె? = అక్కడలేడా. ఘోషయాత్రలోన్ = అంతకు ముందుఘోషయాత్రలో; భవత్ + ఆత్మజున్ = నీకొడుకు దుర్యోధనుని; కోల్పడెన్ = వదలివేశాడు.

భా: ఆ పాండవులు ఎవడికి వాడే ఒక్కొక్కడూ అనేక యుద్ధాల్లో జయం పొందినవారు. ఈ కర్ణుడు ఎక్కడ ఏ యుద్ధంలో ఏం చేశాడు గనుక? ఉత్తర గోగ్రహణంలో వీని తమ్ముని వీడి ఎదుటనే అర్జునుడు నరికి వేశాడు. అపుడు అర్జునునితో తలపడ గలిగాడా? అర్జునుడు గోవులను మళ్లించుకు పోతున్నపుడు వీడక్కడ లేడూ? అంతకు ముందు ఘోషయాత్రలో నీ కొడుకయిన దుర్యోధనుని విడిచి పారిపోలేదూ?

వ : ఈ దుర్జాతుండు కర్జం బెఱుంగక నీతిబాహ్యుండై వలసినట్లు ప్రేలరిమాట లాడుచుండు, నీవునుం గైకొని విను చుండుదువు, మేల కాక; యనిన భీష్మపలుకులు విని ద్రోణుం డమ్మహారాజుతో నిట్లనియె. 163

అ: దుర్జాతుండు = దుష్టజన్మఎత్తినవాడు; కర్జంబు = కార్యం; నీతి బాహ్యుండు = నీతి విడచిన వాడు; కైకొని = సమ్మతించి

భా: ఈ కర్ణుడు కర్తవ్యం తెలియక, నీతిలేక ఇష్టం వచ్చినట్లు ప్రేలుతూ ఉంటాడు. నీవూ వాటిని ఇష్టంగా వింటూ ఉంటావు. చాలా బాగుందిలే! అన్నాడు భీష్ముడు. ఆ మాటలు విని ద్రోణుడు ధృతరాష్ట్రునితో ఇలా అన్నాడు..

వి: 1. ఇచ్చట నీవు అనగా ధృతరాష్ట్రుడని అర్థం. అంటే ఆ వరుసలో ధృతరాష్ట్రుని కూడా భీష్ముడు ఒక తట్ట వరుస పెట్టాడన్నమాట.

2. మేలకాక! అనడంలో భీష్ముని ఆంతర్యం గోచరిస్తుంది. బాగుంది. అనడం అధిక్షేప పూర్వకం - వెటకారం అందులో తొంగిచూస్తోంది. నీ ముప్పునీవే కొని తెచ్చుకొంటున్నావని భావం.

ఉ. శాంతనవుండు సర్వకురు సంతతికిం గలవాఁడు గాఁడె! య
త్యంతహితంబు లీపలుకు, లాహవ మొప్పదు ధర్మసూతితోఁ
బొంతము మేలు, దేవపతి పుత్రుఁడు సంజయుతోడ నాడిన
ట్లంతకు నోపు, మీకుఁ దెలియం దగు ఖాండవదాహ మాదిగాన్.164

అ: శాంతనవుండు = భీష్ముడు; సర్వకురుసంతతికిన్ = కురు వంశంలో వారందరికీ; కలవాఁడు కాఁడె! = కావలసిన వాడు/అప్పుడు కాదా!; ఈ పలుకులు = ఈతడు చెప్పిన ఈ మాటలు; అత్యంత హితంబులు = మిక్కిలి హితములు; ధర్మసూతితోన్=ధర్మరాజుతో; ఆహవము-ఒప్పదు = యుద్ధం చేయడం తగదు; పొంతముమేలు = సంధియే మంచిది; దేవపతి పుత్రుఁడు= ఇంద్రునికొడుకయిన అర్జునుడు; సంజయుతోడన్, ఆడినట్లు + అంతకున్- ఓపున్ = చెప్పినట్లుగా అంతపనీ చేయగలడు; ఖాండవదాహము + ఆదిగాన్ = ఖాండవవనం దహించినప్పటి నుండీ మీకున్; తెలియన్ తగున్ = మీకూ తెలుస్తూనే ఉంది కదా.

భా: *భీష్ముడు కౌరవులకూ పాండవులకూ అందరికీ కావలసినవాడు. అతని మాటలు ఎంతో హితకరములు. ధర్మరాజుతో యుద్ధం పనికిరాదు. సంధియే మేలు; అర్జునుడు సంజయునితో అన్నంత పనీ చేయగలడు. మీకూ ఖాండవ దహనం నాటి నుండే తెలుస్తూనే ఉంది కదా!*

వి: ఇదే ఆశ్వాసం 132 నుండి 146 దాకా అర్జునుని సందేశం ఉంది. అదంతా ద్రోణునికి బాగా నచ్చింది. శిష్యవాత్సల్యం కూడా అందులో కొంత లేక పోలేదు.

ఆ. శరశరాసనములు ధరియింప రెట్టు లె
వ్వరును? మగతనంబు వలనుఁ గలిగి
కయ్యమున జయంబు గైకొనరే యొరు?
లర్జునుండ విజయుఁ డనఁగ నెగడె! 165

అ: ఎవ్వరును = లోకంలో ఎంతమంది; శర, శర + ఆసనములు = బాణమూ విల్లూ; ధరియింపరు + ఎట్టులు = పట్టుకొనడంలేదు?; మగతనంబున్ = పౌరుషమూ; వలనున్= వీలూ ఉపాయమూ; కలిగి; ఒరులు = ఇతరులు; కయ్యమునన్ = యుద్ధంలో; జయంబు కైకొనరే! = జయం పొందలేదూ!; (కాని) అర్జునుండ = అర్జునుడు మాత్రమే; విజయుఁడు + అనఁగన్ నెగడెన్ = విజయుడు అని ప్రసిద్ధికెక్కాడు.

భా: *లోకంలో ఎంతమంది ధనుర్బాణాలు ధరించలేదు? పౌరుషం ప్రకటించి యుద్ధంలో జయించలేదు? కాని ఒక్క అర్జునుడు మాత్రమే విజయుడని ప్రసిద్ధి పొందాడు.*

వి: 'విజయుడు' అని అర్జునుని పేరు
ఎట్టివారినైన నెదిరినఁ బోర జ
యంబుఁ గొనుట విజయుఁ డంద్రు నన్ను విరాట 4 - 141
ఎటువంటి వారినైనా జయిస్తాడు కనుక అతనికి మాత్రమే విజయుడని పేరు వచ్చింది.

క: మన వీటన కాదయ్యా
ర్జునునకు సరివింటివానిఁ జూడఁగ లోకం
బున నెందు లేమి దెల్లం;
బనుమానము లేదు; తొడర నగునే వానిన్? 166

బనుమానము లేదు; తొడర నగునే వానిన్? 166

అ: మన వీటనకాదు = మన సేనలోనే కాదు-మన ఊళ్లోనేకాదు; ఆ+ అర్జుననకున్; సరివింటివానిన్ = సమానమయిన ధానుష్కుని; చూడఁగన్; లోకంబునన్; ఎందున్= ఎక్కడ; లేమి = లేకపోవడం; తెల్లంబు = స్పష్టం ; అనుమానము లేదు = ఏమీ సందేహం లేదు; వానిన్ = ఆ అర్జునుని; తొడరన్ - అగునే = ఎదిరించగలరా?

భా: *మన ఊళ్లోనే కాదు లోకంలో ఎక్కడా కూడా అర్జునునితో సమానమయిన ధన్వి (విలుకాడు) ఎవరూ లేరనే విషయం స్పష్టం; ఇది నిస్సందేహం; వాని నసలు ఎదిరించ గలమా!*

వి: ఈ పద్యం కూడా ద్రోణుని హృదయాన్ని పట్టి యిస్తుంది. శిష్య వాత్సల్యం కూడా అందులో లేకపోలేదు.

వ: అని చెప్పి యప్పాటం బరమహితోపదేశంబు సేసిన, భీష్మద్రోణుల పలుకు లాదరింపక, వారికి సదుత్తరంబు లీక, వారల తోడం దదనురూపంబుగా సంభాషింపక, ధృతరాష్ట్రుండు వెండియుఁ బాండవుల వలని వార్తలడుగుటకు సంజయు దిక్కు మొగం బైనం, జూచి కురుపక్ష వీరులందఱుఁ బ్రాణంబుల దెస నిరాశులై యుండి; రమ్మహీపతి సంజయునితో నిట్లనియె. 167

అ: ఆ + పాటన్ = ఆవిధంగా; పరమహిత + ఉపదేశంబు = మిక్కిలి హితమును చెప్పుట; సత్ - ఉత్తరంబులు = మంచి సమాధానములు; వెండియున్ = మరల; నిరాశులు = ఆశవిడచినవారు.

భా: *అని చెప్పి ఆ విధంగా చక్కని హితం చెపితే ధృతరాష్ట్రుడు భీష్మద్రోణుల మాటలు లెక్కచేయక, వాటికి తగిన సమాధానా లివ్వక, వారితో తగినట్లు మాట్లాడక ఇంకా పాండవుల పక్షంలోని వార్త లడగటానికి సంజయుని వైపు ముఖం పెట్టాడు. అది చూసి కురుపక్షంలోని వీరులంతా ప్రాణాల మీద ఆశవిడిచి పెట్టారు. అపుడు ధృతరాష్ట్రుడు సంజయునితో ఇలా అన్నాడు.*

తే: ధర్మపుత్రున కిక్కడి తలఁపు భంగి
యెట్టు లుండు? నీ సైన్యంబు లెల్లఁగూడి
యునికి వినియెనే? యెవ్వరిఁ గొని యతండు
కౌరవుల మీఁద నెత్తిరాఁ గలుగువాఁడు? 168

అ: ధర్మపుత్రునకున్ = ధర్మరాజుకు; ఇక్కడి తలఁపు భంగి = ఇక్కడి వారిని గురించి ఊహతీరు; ఎట్టులు + ఉండు = ఎట్లా ఉంది?; ఈ సైన్యంబులు - ఎల్లన్ = ఈ సేనలన్నీ; కూడి ఉనికి = కూడి ఉండటం; వినియెనే! = విన్నాడా? ఎవ్వరిన్ కొని = ఎవరిని తీసుకొని; అతండు; కౌరవుల మీఁదన్; ఎత్తిరాన్ కలుగువాఁడు = దండెత్తి రాగలడు.

భా: *ఇక్కడి పరిస్థితి గురించి ధర్మరాజు ఏమనుకుంటున్నాడు? ఇక్కడ*

ఇన్ని సేనలు చేరి ఉండటం ధర్మరాజుకు తెలుసునా? ఎవరిని తీసుకొని ఆ ధర్మరాజు కౌరవులమీదికి దండెత్తి వస్తాడు.

వి: అంతరాంతరాల్లో ధృతరాష్ట్రుని భరోసా ఇందులో గోచరిస్తుంది. అంతేకాదు ఎదుటి పక్షంలోని విశేషాలన్నీ తెలుసుకోవడం అవసరమనే భావం కూడా గోచరిస్తుంది. కాని చివరి వాక్యంలో కొంత తెలివి తక్కువ తనం కూడా లేకపోలేదు.

వ: అనిన విని సంజయుండు వెచ్చనూర్చి, ఱిచ్చవడి, మూర్ఛవోయిన చందంబున డెందంబు మగుడం జేష్టలు దక్కియుండి కొండొక సేపునకుఁ జిత్తం బొక్కింత సేసికొని, యక్కటా! యీ భూపాలుం డింత బేల యగునే! యుధిష్ఠిరుం డెవ్వరిఁగొని యెత్తివచ్చు వాఁడని యడుగుచున్నవాఁ డింత యెఱుంగని వాఁడెంత సెప్పినను దెలియనేర్చునే! యితని భంగి యిట్టిదనినఁ గొడుకుల తెఱంగు వేఱ యెన్న నేల? యేనింక నే మనువాఁడ? నైనను నన్నడిగిన మాటకుం దగిన మాఱుమాట వలుక వలయున కాదె! యని తలంచి ధృతరాష్ట్రున కిట్లనియె. 169

అ: వెచ్చన్ - ఊర్చి = వేడి నిట్టూర్పు పుచ్చి; ఱిచ్చవడి = తెల్లబోయి; డెందంబు = మనసు; చిత్తంబు - ఒక్కింత చేసికొని = మనస్సు కొద్దిగా చిక్కబట్టుకొని; వేఱ ఎన్ననేల? = వేరుగా చెప్పడమెందుకు?; ఏను = నేను;

భా: *ధృతరాష్ట్రుని ఆ మాటలు విని సంజయుడు వేడి నిట్టూర్పు పుచ్చి; తెల్లబోయి, కొయ్యబారిపోయినట్లు అయిపోయి కొంతసేపటికి మనస్సు సంబాళించుకొని "అయ్యో! ఈ రాజు ఇంత తెలివితక్కువవా డయ్యాడేమిటి? ధర్మరాజు ఎవరిని తీసుకొని దండెత్తి వస్తా? డంటున్నాడు - ఈ మాత్రం కూడా తెలియని వాడికి ఎంత చేపితే మాత్రం తెలుస్తుందా? ఇతనే ఇలా ఉంటే ఇంకా కొడుకుల గురించి వేరే చెప్పాలా? నేనేం చెప్పాలి? అయినా నన్ను అడిగిన మాటకు తగిన సమాధానం చెప్పాలి కదా" అని అనుకొని ధృతరాష్ట్రునితో ఇలా అన్నాడు.*

చ: వినుము నరేంద్ర! పాండు పృథివీపతి యగ్రసుతుండు సంధి సే
యన మదిగోరు; మీరు తమయయ్య సగంబును భూమి యీక త
క్కిన మఱికాని ముందరొక కీడుఁ దలంపఁడు, మీబలంబు నె
ల్లను మదిఁ జీరికిం గొనఁడు, లావున నేలఁ గొనం దలంచినన్. 170

అ: నరేంద్ర! = రాజా! వినుము; పాండు పృథివీపతి - అగ్రసుతుండు = పాండురాజు యొక్క పెద్దకొడుకు ధర్మరాజు; సంధి - చేయన = సంధిచేయటానికే; మదిన్‌కోరున్ = మనసులో కోరుతున్నాడు; మీరు; తమ అయ్య సగంబును భూమి = తమ తండ్రి సగపాలు భూమి; ఈక= ఇవ్వక; తక్కిన మఱికాని = తప్పితేనేకాని; ముందర = అతడే ముందుగా; ఒక కీడున్ తలంపఁడు= ఏ కీడూ తలపడు; లావునన్ = బలంతో; నేలన్ కొనన్ తలంచినన్ = భూమి పొందాలనుకొంటే; మదిన్ = మనసులో; మీ బలంబున్ ఎల్లన్ = మీ బలగాన్ని అంతనూ;

చీరికిన్ కొనఁడు = ఏమాత్రమూ లెక్కచేయడు.

భా: *రాజా! ధర్మరాజు సంధినే కోరుతున్నాడు. తమ తండ్రి సగభాగం రాజ్యమూ మీరు ఇవ్వక పోతేనే తప్ప ముందుగా ఏ కీడూ తలపడు. అతడే బల ప్రయోగంతో రాజ్యం పొందాలనుకుంటే మీ యీ బలగాన్ని అంతనూ కించిత్తు కూడా లెక్కచేయడు.*

వ: అతం డెవ్వరిం గొని యెత్తివచ్చు వాఁడని యడిగితివి నీ యెఱుంగని వార లం దెవ్వరు గల? రవధరింపుము. 171

అ: అందు = ఆపక్షంలో; అవధరింపుము = వినుము

భా: *అతడు ఎవరిని తీసుకొని వచ్చి దండెత్తు తాడని అడిగావు. నీకు తెలియని వారు ఆ పక్షంలో ఎవరున్నారు? (ఎవ్వరూ లేరని భావం) అయినా విను.*

మ: బక విధ్వంసి, జటాసురాంతకు, హిడింబ ప్రాణ హారీణుఁ, గీ
చక నిర్మూలన కేళిలోలు, సమరోత్సాహైక శీల ప్రవ
ర్తకు, నాగాయుత సామ్యకీర్తిత బలోదగ్రుం, బ్రతివ్యూహదా
హకు, భీముంగొని వచ్చు ధర్మజుఁడు బాహాటోపముం జూపఁగన్. 172

అ: ధర్మజుఁడు; బాహాటోపమున్ = భుజబలాన్ని; చూపఁగన్ = చూపించటానికి; బక విధ్వంసిన్ = బకాసురుని చంపిన వానిని; జటాసుర + అంతకున్ =జటాసురుని చంపిన వానిని; హిడింబ ప్రాణ హారీణున్ = హిడింబాసురుని ప్రాణాలు తీసిన వానిని; కీచక నిర్మూలన కేళిలోలున్ = కీచకుని సంహరించిన క్రీడలో ఆసక్తుడయిన వానిని; సమర + ఉత్సాహ = ఏక-శీల ప్రవర్తకున్ = యుద్ధోత్సాహమే స్వభావంగా ప్రవర్తించే వానిని; నాగ + అయుత, సామ్యకీర్తిత బల + ఉదగ్రున్ =పది వేల ఏనుగులతో సమానంగా కీర్తింపబడిన బలంచేత ప్రసిద్ధుడయిన వానిని; ప్రతివ్యూహ దాహకున్ = శత్రుసైన్యమునకు అగ్నివంటి వానిని; భీమున్; కొని; వచ్చున్.

భా: *ధర్మరాజు తన బాహుబలాన్ని ప్రదర్శించేందుకు బకాసురుని సంహరించిన భీముని తీసుకు వస్తాడు. జటాసురుని సంహరించిన భీముని తీసుకువస్తాడు. హిడింబాసురుని బలిగొన్న భీముని తీసుకువస్తాడు. కీచకుని మదం అణచిన భీముని తీసుకొని వస్తాడు. యుద్ధోత్సాహమే శీలంగా కల భీముని తీసుకొని వస్తాడు. పదివేల ఏనుగుల బలంకలభీముని తీసుకొని వస్తాడు. శత్రుసైన్యానికి అగ్నిహోత్రుడయిన భీముని తీసుకు వస్తాడు.*

వి: భీమునికి వేసిన విశేషణాల్లో ఒక క్రమం లేదు. క్రమం లేకపోవడంలో కూడా ఒక విశేషం లేకపోలేదు. ఇవన్నీ ఈ పనులన్నీ సమాన ప్రాధాన్యం కలవని భావం. అన్నీ విశేష బలాన్ని అపేక్షించినవే అని భావం. చివరి విశేషణం ప్రతి వ్యూహదాహకున్ అనేది మరింత విశేషం కలిగింది. అడవిలా ఉన్న నీ కొడుకుల పాలిట అగ్నిహోత్రుడని విశేష సూచన.

ఏదయినా ఒక వ్యూహాన్ని ఛేదించటానికి ప్రవేశించటానికి ఇతరులెవరికయినా ఒక తీరూతెన్నూ ఉంటుంది. ఒక ప్రక్క నుండి ప్రవేశింపవలసి ఉంటుంది. కాని అగ్ని హోత్రునికి ఏ

ప్రక్క అయినా ఒకటే - అలాగే భీమునికీ ప్రతి వ్యూహాన్ని ఛేదించటంలో నేర్పులూ సులువులూ అక్కరలేదు. ఎక్కడినుండి అయినా ఛేదించగలడని భావం.

ధృతరాష్ట్రునికి భీముడంటే చాలా భయం. అతడే తన పుత్రులను పొట్టను పెట్టుకుంటాడని భయం. అందుకే అతడు ముందుగా భీముని గురించి తరువాతనే అర్జునుని గురించి చెపుతున్నాడు. ధృతరాష్ట్రుని హృదయం బాగా విదురునికి తరువాత సంజయునికీ తెలుసు.

వ: మఱియును 173

మ: అటమిన్నందిన యట్టివాని పొడ వెంతన్నట్లు ఫాలాక్షు నె
క్కటికయ్యంబునఁ గన్న ఫల్గును భుజాగర్వంబు లెక్కించు, టం
తటి వానింగొని ధర్మసూతి సమరోత్సాహంబుమై నెత్తి వ
చ్చుటకుం గొంకునె? వీఁపు సక్కనయి నిల్చుంగాక మీ సైన్యముల్. 174

అ: అటమిన్ను - అందిన యట్టి వాని = ఆకాశం అందుకొన్న వాని; పొడవు; ఎంత? అన్నట్లు; ఫాలాక్షున్=ఈశ్వరుని; ఎక్కటి కయ్యంబునన్=ఒంటరి యుద్ధంలో; కన్న= సంతోషపెట్టిన/ జయించిన; ఫల్గును = అర్జునుని యొక్క; భుజా గర్వంబున్=బాహుబలాన్ని; లెక్కించుట=లెక్క పెట్టడమా? అంతటి వానిన్; కొని=తీసుకొని; ధర్మసూతి = ధర్మరాజు; సమర+ ఉత్సాహంబుమైన్= యుద్ధోత్సాహంతో; ఎత్తి వచ్చుటకున్=దండెత్తి రావటానికి; కొంకునె=జంకుతాడా? మీ సైన్యముల్; వీఁపు-చక్కనయి నిల్చున్ కాక = వీపు సరిచేసుకొని నిలబడతాయి తప్ప ఇంకేమీ చేయలేవు.

భా: *ఆకాశం అందుకొన్నవాడి పొడవుఎంత? అన్నట్లుగా ఈశ్వరుని సయితం ఒంటరి యుద్ధంలో జయించిన అర్జునుని భుజబలాన్ని లెక్కించగలమా? అంత బలవంతుని తీసుకొని వచ్చి ధర్మరాజు యుద్ధోత్సాహంతో దండెత్తి రావటానికి జంకునా? మీ సైన్యాలు వీపు చక్కజేసుకొని నిలుస్తారు తప్ప ఏమీ చెయ్యలేవు. వానిని ఎదిరించలేక వెనుదిరిగి పారిపోవడం తప్ప ఏమీ చేయలేరు. (వీపుకు బాణాలు తగలడం అంటే వెన్ను చూపడం - పారిపోవడం.)*

తే. నకులు సహదేవుఁ గొని ధర్మ నందనుండు
మొనసి కౌరవబలముల ముట్టి కొనఁగఁ
దలఁచి తఱివేచి వచ్చుట ధరణినాథ!
సింగములఁ బట్టి వేఁటాడు భంగి గాదె! 175

అ : ధరణి నాథ!=రాజా! ; ధర్మనందనుండు=ధర్మరాజు;నకులున్, సహదేవున్; కొని=గ్రహించి; మొనసి=సన్నద్ధుడై; కౌరవబలములన్=కౌరవ సైన్యాలను; ముట్టికొనఁగన్ తలఁచి=చుట్టుముట్టిదలచి; తఱివేచి=సమయం (వీలు అయిన సమయం) నిరీక్షించి; వచ్చుట; సింగములన్ పట్టి=సింహాలను పట్టుకొని; వేటాడు భంగి కాదె=వేటలాడినట్లు కాదా!

భా : *నకుల సహదేవులతో ధర్మరాజు కౌరవ సైన్యాలను చుట్టుముట్టడమంటే సమయం చూసి సింహాలను పట్టుకొని యితర మృగాలను వేటాడటం వంటిది కదా!*

వి: మృగములతో వేటాడువాడు ముందుగా మృగరాజులయిన సింహాలను

వశపరచుకొని, తర్వాత ఆ సింహాల సహాయంతో ఇతర మృగాలను వేటాడతాడు. అట్లాగే నకులుని సహదేవుని గ్రహించి కౌరవబలాన్ని వశపరచుకొంటాడు ధర్మరాజు. నకుల సహదేవులు సింహాలు. కౌరవ బలాలు ఇతర సామాన్య మృగాలు అని భావం.

అలం : ఉపమ.

తే. ద్రౌపదేయులు నా సుభద్రా సుతుండు
నుక్కు తునియలు గారె! మిమ్మక్కుమార
వరులఁ గొని యోర్చువాఁడయి వచ్చు ధర్మ
పుత్త్రుఁ డిది నీకుఁ జూడంగఁ బోల దెట్లు? 176

అ: ద్రౌపదేయులున్ = ద్రౌపదీ పుత్రులయిన ఉపపాండవులూ; ఆ సుభద్రా సుతుండున్ = సుభద్ర కొడుకయిన అభిమన్యుడూ; ఉక్కు తునియలు - కారె! ఉక్కు ముక్కలు కారా? ధర్మపుత్రుఁడు=ధర్మరాజు; ఆ+కుమారవరులన్ కొని=ఆ వీరశ్రేష్ఠులను తీసుకొని, మిమ్మున్; ఓర్చువాఁడయి = జయించే వాడయి; వచ్చున్; ఇది = ఈ విషయం; ఎట్లు? నీకున్; చూడంగన్ పోలదు? = కనపడదు?

భా: ఉపపాండవులూ అభిమన్యుడూ ఉక్కుముక్కలు కారూ? వాళ్ల సాయంతో ధర్మరాజు మిమ్మల్ని జయించడానికి దండెత్తి వస్తున్నాడు. ఇది నీకెందుకు తెలియడం లేదు?

వ: అని చెప్పి వెండియు నిట్లనియె. 177

భా: అని చెప్పి ఇంకా ఇలా అన్నాడు.

క: వృష్ణి కుమారోత్తముఁ డా
కృష్ణుని తమ్ముండు సాత్యకియు, దవదహనా
త్యుష్ణ ప్రతాపదీప్తులు
కృష్ణా సోదరులుఁ దలఁపఁ గేవలులె నృపా? 178

అ: నృపా! = రాజా!; వృష్ణికుమార + ఉత్తముఁడు = వృష్ణి వంశపు రాజకుమారులలో శ్రేష్ఠుడూ; ఆ కృష్ణుని తమ్ముండు; సాత్యకియున్; దవదహన+అతి+ఉష్ణ ప్రతాపదీప్తులు=దావానలం వలె మిక్కిలి వేడిమి తాపమూ కాంతీ కలవారు; కృష్ణా సోదరులున్ = ద్రౌపది అన్నదమ్ములూ; తలఁపన్ - కేవలులె? = ఊహిస్తే సామాన్యులా?

భా: వృష్ణి వంశోత్తముడూ, కృష్ణుని తమ్ముడూ అయిన సాత్యకీ; దావానలం వలె వేడిమీ, ప్రతాపమూ, కాంతీ కల ద్రౌపదీ సోదరులు సామాన్యులా?

సీ: శౌర్యోజ్జ్వలుండు పాంచాల భూనాథుండు,
మహితవిక్రముఁడగు మత్స్యవిభుఁడు
నధికధైర్యాన్వితు లతని తమ్ము లుదగ్ర
తేజస్కులైన తదీయసుతులు

నన్నదమ్ములు ప్రతాపోన్నతు లేవురు
కేకయ పతులు నక్షీణ బాహు
శక్తియుక్తులు; జరాసంధ సూనుఁడు సహ
దేవుండు; నాజయత్సేన విభుఁడు

తే: వినుము శిశుపాల తనయులు వీర్యధనులు
ధృష్టకేతుండు వృషభుండుఁ; దీవ్రరణ వి
నోది యదుభర్త చేకితానుండు దర్ప
ఘనుఁడు శైబ్యనృపాలుండుఁ గలరు గాదె ! 179

అవ: ఇంకా పాండవుల పక్షాన సహాయపడే వారిని గురించి చెపుతున్నాడు.

అ: శౌర్య + ఉజ్జ్వలుండు=పరాక్రమంతో ప్రకాశించువాడు;పాంచాల భూనాథుండు= పాంచాల దేశపు రాజు ద్రుపదుడు; మహిత విక్రముఁడు అగు = గొప్ప పరాక్రమము కలవాడగు; మాత్స్యవిభుఁడున్ = విరాటుడునూ; అధికధైర్య+అన్వితులు=ఎక్కువ ధైర్యముతో కూడినవారు; అతని తమ్ములు=ఆవిరాటుని తమ్ములు; ఉదగ్రతేజస్కులైన = మిక్కిలి తేజస్సు కలవారయిన; తదీయసుతులున్ = అతని కొడుకులునూ; అన్నదమ్ములు; ప్రతాప + ఉన్నతులు= పరాక్రమంచేత ఉన్నతులూ; అక్షీణ బాహుశక్తియుక్తులు=తరగని భుజబలం కలవారూ; కేకయపతులు ఏవురు= కేకయరాజులు అయిదుగురూ; జరాసంధసూనుఁడు=జరాసంధుని కొడుకయిన; సహదేవుండున్; ఆ జయత్సేన విభుఁడున్; వినుము; శిశుపాల తనయులు=శిశుపాలునికొడుకులునూ; వీర్యధనులు =పరాక్రమమె ధనముగా కలవారును; ధృష్టకెతుండు; వృషభుండున్; తీవ్రరణవినోది= తీవ్రమయిన యుద్ధంతో వినోదించేవాడు; యదుభర్త=యాదవరాజయిన; చేకితానుండు; దర్పఘనుఁడు = గర్వము చేత ఘనుడయిన; శైబ్యనృపాలుండు = శైబ్యరాజును; కలరుగాదె!= ఉన్నారు కదా.

భా: ఇంకా అటుప్రక్క ద్రుపదుడూ, విరాటుడూ; అతని తమ్ములూ, కొడుకులూ, కేకయ రాజు లయిదుగురూ; సహదేవుడు, జయత్సేనుడూ; ధృష్టకేతుడు వృషభుడు, చేకితానుడు, శైబ్యుడు మొ॥ వారు ఉన్నారు కదాః.

వి:

విరాటుని తమ్ములు	: శతానీకుడు, మదిరాక్షుడు, సూర్యదత్తుడు
విరాటుని కొడుకులు	: శంఖుడు, భూమింజయుడు (ఉత్తరుడు)
కేకయ రాజులు	: వీరు అయిదుగురు - మహారథులు
సహదేవుడు	: ఇతడు జరాసంధుని కొడుకు భీముడు జరా సంధుని చంపిన తరువాత సహదేవుడు పట్టాభిక్తుడయ్యాడు.
జయత్సేనుడు	: మగధరాజు. ఒక అక్షోహిణిసేనతో వచ్చి పాండవుల కలిసినాడు.
ధృష్టకేతుడు-వృషభుడు	= వీరిరువురూ శిశుపాలుని కొడుకులు
చేకితానుడు	= యాదవరాజు
శైబ్యుడు	= శిబి దేశపు రాజు - ధర్మరాజు యొక్క మామ

క: **వీరెల్లఁ బాండురాజు కు**
మారుల పాటునకుఁ గుందు మనముల తోడన్
వారి పగ దీర్పఁ గడఁగెడు
వారల కా కందు లాఁతి వారుం గలరే! 180

అ: వీరు + ఎల్లన్ = వీరంతా; పాండురాజుకుమారుల = పాండవుల; పాటునకున్= కష్టానికి; కుందు = దుఃఖించే; మనములతోడన్ =మనస్సులతో; వారి పగన్ = ఆ పాండవులవైరాన్ని; తీర్పన్ కడఁగెడు వారల = తీర్చటానికి ప్రయత్నించేవారే; కాక = కాని; అందున్ = ఆ పక్షంలో లాఁతి వారున్ కలరే! = పరాయి వారెవ రున్నారు?

భా: *వీళ్లంతా పాండవుల ఆపదలకు వ్యధ చెందే మనస్సులతో వారి పగతీర్చేందుకు ప్రయత్నించేవారే కాని పరాయి వాళ్లెవరూ లేరు.*

వి: పరాయి వాళ్లయితే మొగమోటమితోనో, భయంతోనో యుద్ధం చేస్తారు. వారి కష్టానికి సానుభూతి చూపేవారు మనసారా యుద్ధం చేస్తారు - భక్తితో చేస్తారు. భయభక్తులలో భయం తాత్కాలికము - భక్తి శాశ్వతము - భయం నటనగా చేయిస్తుంది. భక్తి మనసారా చేయిస్తుంది. భయం పరతంత్రమయినది. భక్తి స్వతంత్రమయినది.

వ: **భీమసేన సూనుండు ఘటోత్కచుండు దండ్రికంటెను లావు బీరంబునుం గలవాఁడు. మాయాబలంబున మనబలంబు నెల్లం గలంచు. మఱియును దూర్పున నుత్తరంబునం గలుగు నరనాయకులు నానా సేనా సమన్వితు లయివచ్చి చిచ్చయిననుం బిడికిలింత మనుచున్న వా రదియునుం గాక.** 181

అ: సూనుండు = కొడుకు; లావు = బలము; బీరము = పరాక్రమము; కలంచు= కలతపఱచు; చిచ్చు = అగ్ని ; పిడికిలించు = గుప్పిటలో పట్టుకొను.

భా: *ఆ భీముని కొడుకు ఘటోత్కచుడు తండ్రి కంటె బల పరాక్రమాలు కలవాడు. మాయాబలంతో మన బలాన్నంతటినీ కలచివేస్తాడు. అదీగాక తూర్పు, ఉత్తరాన ఉన్న రాజులంతా సేనలతో వచ్చి నిప్పును కూడ గుప్పిట పట్టేందుకు సిద్ధంగా ఉన్నారు.*

వి: నిప్పును గుప్పిట్లో పట్టాలంటే సాహసమూ ధైర్యమూ కావాలి. అవి పుష్కలంగా ఉంటే నిప్పయినా చల్లారి పోవలసినదే. అనగా ఆ రాజులంతా సాహసోపేతులూ పరాక్రమ వంతులూ - అని భావం.

క: **సకల భువనములు నరచే**
తికిఁ దేరం జాలునట్టి ధీమంతుఁడు దే
వకి కొడుకు గలఁడు ధర్మజు
నికి, నాతం డెత్తిరాక నిలుచునె యధిపా! 182

అ: సకల భువనములున్ = అన్నిలోకాలూ; అఱచేతికిన్ = అరచేతిలోకి; తేరంజాలునట్టి = తీసుకురాగల; ధీమంతుఁడు =తెలివైనవాడు; దేవకి కొడుకు = కృష్ణుడు; ధర్మజునికిన్ =

ధర్మరాజునకు; కలఁడు = ఉన్నాడు; అధిపా! = రాజా; అతండు = ఆ కృష్ణుడు; ఎత్తిరాక నిలుచునె?= దండెత్తకుండా ఆగుతాడా?

భా: లోకాలన్నీ అరచేతిలోకి తీసుకురాగలిగిన బుద్ధిమంతుడు కృష్ణుడున్నాడు ధర్మరాజు పక్షాన. అతడు దండెత్తి రాకుండా ఉంటాడా?

వ: **అని చెప్పిన సూతపుత్రునకు నంబికాపుత్రుండిట్లనియె.** 183

భా: అట్లా అన్న సంజయునితో ధృతరాష్ట్రు డిలా అన్నాడు.

-: ధృతరాష్ట్రుఁడు భీమసేనాదుల పరాక్రమంబు దలంచి దుఃఖించుట :- సం. 5-50-1

క: **వారిదెస నీవుసెప్పిన**
యారథికులు ప్రబలు లగుదు రందఱు నైనన్
వారెల్లను నొకతల య
మ్మారుతి యొకతల బలప్రమాణము సూడన్. 184

అ: వారిదెసన్ = పాండవుల పక్షమున; నీవు చెప్పిన; ఆ రథికులు = ఆ వీరులు; అందఱు; ప్రబలులు అగుదురు = బలవంతులే అవుతారు; ఐనన్; వారెల్లను =వారంతా; ఒకతల= ఒకఎత్తు; బల ప్రమాణము +చూడన్ = బలములలెక్కలు చూస్తే; ఆ + మారుతి = ఆభీముడు; ఒకతల = ఒక ఎత్తు.

భా: వారి పక్షములో నీవు చెప్పిన యోధులంతా బలవంతులే అయినా బలం విషయంలో లెక్కచూస్తే వారంతా ఒక ఎత్తు, ఆ భీము డొక్కడూ ఒకయెత్తు.

వి: కౌరవ పాండవుల వైరానికి ప్రధాన కారణం భీముడు. ఆ విషయం ధృతరాష్ట్రుని మనస్సులో బలంగా నాటుకుంది. అదీగాక భీముడు వేయిఏనుగుల బలం కలవాడని ప్రసిద్ధి. కన్నులు లేక పోయినా ధృతరాష్ట్రుడు కూడా అంతటివాడే. అందుచేత ధృతరాష్ట్రుడికి భీముడు మనస్సులో మెదులుతూ ఉంటాడు.

ఉ: **భీముఁ దలంచినన్ మనము భీతిఁ గలంగుచు నుండు నాకు,రే**
లేమియు నిద్రరా, దతని నేడ్తెఱ మార్కొనఁ జాలునట్టి వాఁ
డీమొన లేఁ, డతం డలుక నెత్తిన, యా గద కాలదండ; ము
ద్దామ విలాసుఁడై కురుకదంబములో విహరింపకుండునే! 185

అ: భీమున్ + తలంచినన్ = భీముని తలచుకొంటే; నాకున్; మనము = మనస్సు; భీతిన్=భయముతో; కలంగుచునుండు =కలత చెందుతూ ఉంటుంది; రేలు=రాత్రులు; ఏమియు నిద్రరాదు = ఏ మాత్రము నిద్రరాదు; ఈ మొనన్=ఈ సేనలో; అతనిన్ = ఆ భీముని; ఏడ్తెఱన్= పరాక్రమంతో; మార్కొనఁజాలునట్టి వాఁడు =ఎదిరింప గలిగినవాడు; లేడు; అతండు = ఆభీముడు; అలుకన్ = కోపముతో; ఎత్తిన ఆ గద; కాలదండము = యముని దండముతో సమానమైనది;

ఉద్దామ విలాసుఁడై = భయంకరమయిన విలాసంతో; (అతడు) కురుకదంబములోన్ = కౌరవ సముదాయంలో; విహరింపక + ఉండునె = విహరించకుండా ఉంటాడా?

భా: ఆ భీముని తలచుకుంటే నామనస్సంతా క్షోభించిపోతూ ఉంటుంది. రాత్రులే మాత్రము నిద్రపట్టదు. (అతనిని జయించటం మాట అటుంచి) అస లతని ఎదిరించి నిలువగలవారు మనసైన్యంలో లేరు. అతడు కోపముతో ఎత్తుకొనిన ఆగద నిజంగా కాలదండమే. అటువంటి భయంకర విలాసంగల భీముడు కౌరవ సైన్యంలో విచ్చలవిడిగా విహరించకుండా ఉంటాడా?

తే. **చిఱుత నాఁడును వాఁడు నాశిక్షఁ బోఁడు,**
వీరు చివ్వకుఁ జూతురు వైరమెత్తి
వానిచేఁ బీడవడియును మాన, రదియ
కాదె యీ భేదమున కెల్లఁ గారణంబు. **186**

అ: చిఱుతనాఁడును = చిన్నప్పుడు కూడా; వాఁడు = ఆ భీముడు; నా శిక్షన్ పోఁడు= నేను చెప్పినట్లు నడిచేవాడు కాదు; వైరమెత్తి=ఆ భీమునితో వైరం పెంచుకొని; వీరు=ఈ కౌరవులు; చివ్వకున్ + చొత్తురు = యుద్ధానికి దిగుతారు; వానిచేన్ = ఆ భీముని చేత; పీడ + పడియును= బాధచెందికూడా; మానరు=అతనితో వైరం మానరు; ఈ భేదమునకున్+ఎల్లన్ = ఈవైరానికంతకూ; కారణంబు; అదియకాదె = అదేకదా.

భా: చిన్నప్పుడు కూడా భీముడు నామాట వినేవాడుకాడు. వైరం పెంచుకొని నా పుత్రులు యుద్ధానికి సిద్ధమవుతారు. ఆ భీమునిచే వీరు ఓడిపోయికూడా వాడితో వైరం మానరు. కౌరవ పాండవుల వైరానికి ఇదే కారణం కదా.

క. **సమరమున దైత్యదానవ**
సమితియు నాతని కెదుర్పఁ జాలదు, భుజయు
ద్ధమున జరాసంధుని నొక
నిమిషంబునఁ జంపె, నొరులు నిలుతురె యెదురన్. **187**

అ: సమరమునన్=యుద్ధంలో; దైత్యదానవ సమితియున్=దైత్యుల సముదాయం గాని, దానవుల సముదాయంగాని; ఆతనికిన్ = ఆ భీమునికి; ఎదుర్పన్ చాలదు=ఎదిరింపలేదు; జరాసంధుని; భుజ యుద్ధమునన్ = మల్లయుద్ధములో; ఒక నిమిషంబునన్ + చంపె = ఒక నిముషములో చంపాడు; (అటువంటి వాని యొక్క) ఎదురన్ = ఎదుట; ఒరులు = ఇతరులు; నిలుతురె = నిలబడగలరా;

భా: యుద్ధంలో ఆ భీముని రాక్షసులు కూడా ఎదిరింపలేరు. బాహుయుద్ధంలో జరాసంధుని ఒక్క నిముషంలో చంపాడు. ఇతని ముందు ఎవరు నిలబడగలరు? ఎవరూ నిలువ లేరని భావము.

వి: జరాసంధుడు మగధదేశపురాజు బృహద్రథుని కొడుకు. ధర్మరాజు

రాజసూయానికి ముందు శ్రీకృష్ణుడు భీమార్జునులను తీసికొని జరాసంధుని మీదకు వెళ్ళాడు. భీమునిచేత మల్లయుద్ధంలో జరాసంధుని చంపించాడు కృష్ణుడు (చూ. సభాపర్వము 1-208).

మ. బొమ లల్కన్ ముడివడ్డ, రౌద్రరస ముప్పొంగం, దనర్పన్ భుజా
గ్రము, "లిం దెవ్వఁడు నాకు మా" ఆనుచు శౌర్యస్ఫూర్తి శోభిల్ల,దు
ర్దమలీలం గవియంగ, భీముఁ గని, ధైర్యం బేది కౌరవ్యసై
న్యము లంతంతఁ గలంగఁ బాఱినటులై నా మోమునన్ వ్రేలెడిన్. 188

అ: అల్కన్ = కోపంతో; బొమలు ముడివడ్డ=కనుబొమలు ఏకమైపోగా; రౌద్రరసము; ఉప్పొంగన్ = విజృంభించగ, ఉబికిరాగా; భుజాగ్రములు = మూపులు, భుజములపైభాగములు; తనర్పన్ =పొంగిపోగా; ఇందున్ = ఈ సేనలో; నాకుమాఱు = నాకు ఎదురు; ఎవ్వడు, అనుచున్; శౌర్యస్ఫూర్తి శోభిల్లన్ = పరాక్రమము తోకూడిన తేజస్సు ప్రకాశింపగా; దుర్దమలీలన్ = అణచరాని విలాసంతో; కవియంగన్=చుట్టుముట్టగా; భీమున్ + కని =అటువంటి భీముని చూచి; ధైర్యంబు+ ఏది=ధైర్యము విడిచి; కౌరవ్య సైన్యములు=కౌరవులసేనలు; అంతంతన్ + కలంగన్ = అక్కడి కక్కడే కలతచెంది; అపుడే క్షోభించి; పాఱినటులై=పారిపోతున్నట్లుగా అనిపించి; నామోమునన్+ వ్రేలెడిన్ = నా మనసులో కనిపిస్తూ ఉంటుంది. (నా ముఖంలో).

భా: *భీముడు కోపంతో బొమలు ముడిపడేటట్లుగా రౌద్రరసంతో భుజాలు పైకెత్తుకొని "నా ఎదుట నిలబడ గలిగినవా డెవడురా" అంటూ అణచరాని పరాక్రమంతో మీద కురికితే ఆ దృశ్యం చూచి మన కౌరవసైన్య మంతా కలతచెంది పారిపోతున్నట్లుగా నాకెప్పుడూ మనస్సులో అనిపిస్తూ ఉంటుంది.*

వి: 1. ఇటువంటి దృశ్యాల్ని "నాకళ్ళలో కనిపిస్తున్నాయి" అని అనడం తెలుగులో అలవాటు. ఇక్కడ ధృతరాష్ట్రుడు పుట్టుగ్రుడ్డి వాడు. అతనికి కళ్ళలో అనడం అనేది సమంజసం కాదు. అందుకే తిక్కన నా మోమునన్ వ్రేలెడిన్ అన్నాడు.

2. మదించిన ఏనుగులాగ సైన్యం మీదికి దూకుతున్న భీముని వర్ణించడానికి తిక్కన మత్తేభాన్ని ఎన్నుకోవడం సముచితంగా ఉంది.

క. కరవాలము, గద మొదలగు
పరికర మేమియును లేక బాహు బలమునం
గరిగతి నడరినను వృకో
దరునకు నొకఁ డెదురు నిలిచి తలపడువాఁడే. 189

అ: కరవాలము = కత్తి; గద; మొదలగు; పరికరము = సాధనాలు, ఆయుధాలు; ఏమియును లేక=ఏమీలేకుండ; బాహుబలమునన్=కేవలము భుజబలంతో మాత్రమే; కరిగతిన్= ఏనుగువలె; అడరినను=చుట్టుముట్టితే; వృకోదరునకున్=ఆ భీమసేనునికి; ఒకడు=ఏ ఒక్కడయినా; ఎదురనిలిచి = ఎదుట నిలబడి; తలపడు వాఁడే = ఎదిరించగలడా?

భా: *కత్తీ, గద మొదలయిన ఆయుధాలేమీ లేకుండా కేవలము భుజబలంతోనే ఏనుగువలె భీముడు మీదపడితే అతడిని ఎవరయినా ఎదిరించి నిలువగలడా? నిలువలేడని భావము.*

వి: ఇందులో భీమునికి ఏనుగుతో పోలిక చెబుతున్నాడు. ఏనుగుకి తొండమే బలం. అట్లాగే ఏ ఆయుధాలు లేకపోయినా భీమునికి భుజాలే బలం. కరిగతి అని చిన్నమాటలో చక్కని ఉపమానాన్ని తిక్కన ఇమిడ్చాడు.

తే: ప్రళయ కాల సముద్రము భంగిఁ బొంగి,
కడు భయంకరుఁ డగు భీముఁ గడవ నీఁద
వశమె నా పుత్త్రులకు? విధి వశము వొంది
యెదిరిఁ దమ్మును నెఱుఁగరు మదము కతన. 190

అ: ప్రళయకాల సముద్రముభంగిన్ = ప్రళయకాలంలోని సముద్రంవలె; పొంగి= ఉప్పొంగి; కడు భయంకరుఁడగు = మిక్కిలి భయంకరుడయిన; భీమున్; కడవన్ + ఈదన్ = పూర్తిగా ఈదటానికి (జయించటానికి) నా పుత్త్రులకున్ వశమే=నా కొడుకులకు శక్యమా? (కాదు); విధివశము+ పొంది = విధివశాత్తు, విధికిలోబడి; మదముకతన =గర్వంచేత; ఎదిరిన్ + తమ్మును+ ఎఱుంగరు = శత్రువునూ, తమనూ తెలుసుకోలేకపోతున్నారు.

భా: భీముడు ప్రళయకాల సముద్రంవలె పొంగి భయంకరంగా మీద పడితే అతణ్ణి జయించటం నా పుత్రుల తరమా? నా పుత్రులు విధివశాత్తు గర్వించి శత్రువుశక్తినీ తమశక్తినీ తెలుసుకోలేకపోతున్నారు.

వి: ఇందులో ధృతరాష్ట్రుని మనః ప్రవృత్తి కొంత బోధపడుతుంది. కొడుకులు నశించిపోతున్నారనే బాధ, తపన, ధృతరాష్ట్రునిలో కనిపిస్తాయి. వీటిని మించిన పుత్ర వ్యామోహం కూడా లేకపోలేదు. "గర్వించి ఎదుటవాని శక్తిని తెలుసుకోలేకపోతున్నారు." అంటూనే "విధి వశము వొంది" అనే మాట కూడా అంటున్నాడు. అనగా పుత్రుల గర్వం విధివశాత్తు వచ్చిందని ధృతరాష్ట్రుని భావం. ఇందులో పుత్రవ్యామోహం తొంగిచూస్తోంది.

క. చిచ్చునకుఁ దోడు గరువలి
వచ్చు గతిన్, భీము దుర్నివార విహారం
బచ్చు పడఁగఁ, బ్రాపై వి
వ్వచ్చుఁడు వెస వచ్చు గాండివంబును దానున్. 191

అ: చిచ్చునకున్ + తోడు = అగ్నికితోడుగా; కరువలివచ్చుగతిన్ = గాలి వీచినట్లుగా; భీము దుర్నివార విహారంబు = భీముని యొక్క వారింపరాని విజృంభణం; అచ్చుపడఁగన్ = ఫలించేటందుకు; ప్రాపై = ఆధారమై (సహాయమై) వివ్వచ్చుఁడు = అర్జునుడు; గాండివంబును+ తానున్ = గాండివము, తాను; వెసవచ్చు = వేగంగా వస్తాడు.

భా: అగ్నికి తోడుగా గాలివచ్చినట్లు భీముని విజృంభణానికి తోడుగా అర్జునుడు గాండీవం పుచ్చుకొని వెంట వస్తాడు.

వి: అగ్నికి గాలి తోడ్పడినట్లు భీమునికి గాండీవంతో అర్జునుడు తోడ్పడతాడు. అన్న ఉపమానంలో భీముని ప్రజ్వలన స్వభావము, అర్జునుడు గాండీవంతో (శత్రువులను) తుడిచిపెట్టే స్వభావము గోచరిస్తాయి.

వ. సంజయా! వినుము నీ కున్నరూపు సెప్పెద. 192

అ: ఉన్నరూపు = యథార్థము

భా: సంజయా విను. నీకు ఉన్న విషయం చెబుతాను.

క. ఆ యర్జును మగఁటిమి కెన
యే యుగములఁ జూడ వినఁగ నెందును గలఁదే?
నీ యెదుర నాడినంతయుఁ
జేయుట కతఁ డోపు;రిత్త సెప్పెడు వాఁడే! 193

అ: ఆ + అర్జును మగఁటిమికిన్ = ఆ అర్జునుని యొక్క పౌరుషానికి; పరాక్రమానికి; ఎన = సాటి; ఏ యుగములన్ = ఏ యుగాల్లో అయినా; ఎందును = ఏ ప్రదేశంలోనయినా; చూడన్ వినగన్ కలదే=చూడ్డానికిగాని, వినడానికిగాని ఉందా; నీ + ఎదురన్=నీ ఎదుట; ఆడిన అంతయున్ = చెప్పినదంతా; చేయుటకున్; అతడు =ఆ అర్జునుడు; ఓపున్ = తగును; (అతడు) రిత్త + చెప్పెడువాడే = వ్యర్థమయిన మాటలు మాట్లాడేవాడా?

భా: *ఆ అర్జునుని పరాక్రమానికి సాటియైన పరాక్రమం ఏయుగాల్లోనయినా, ఎక్కడయినా చూశామా. విన్నామా? నీ ముందు చెప్పినదంతా చేయడానికి ఆ అర్జునుడు సమర్థుడే. అతడు ప్రగల్భాలు పలుకడు.*

వి: 1. సంజయుడు రాయబారం నుండి తిరిగి వస్తూ ఉంటే అర్జునుడు తన వచనాలుగా చెప్పమని సంజయునితో కొన్ని మాటలు చెప్పాడు.

చూ. ఉద్యోగపర్వము 2-132 146.

ఉ. ఎక్కటి గాండివంబు నుతికెక్కి వెలుంగుట, మీఁదఁగేశవుం
డక్కజమైన తేజ,మది యాసపడండు, దనంత నర్జునుం
డొక్కఁడ వైరిసేనలకు నొట్టిన మంట, ప్రతాప మూర్తు లి
ట్లొక్కెడఁ గూడె, నిన్నిటి మహోగ్రపు వేఁడిమి కోర్వ వచ్చునే! 194

అ: ఎక్కటి గాండివంబు = సాటిలేని గాండివంబు; నుతికిన్+ఎక్కివెలుంగుట = ప్రశస్తికెక్కి ప్రకాశించడమూ; మీదన్=ఆపైని; కేశవుండు=కృష్ణుడు; అక్కజమైన తేజము= అద్భుతమైన తేజస్సు ఉండటమూ; అది+ఆసపడండు=అతేజస్సును అర్జునుడు ఆశించడు; తనంతన్+ అర్జునుండు+ఒక్కఁడ = అర్జునుడొక్కడే తనంతతానుగా; వైరి సేనలకున్= శత్రుసైన్యాలకు; ఒట్టిన మంట=ప్రజ్వరిల్లే అగ్నిహోత్రుడు; ఇట్లు = ఈవిధంగా; ప్రతాప మూర్తులు=పరాక్రమం రూపుదాల్చిన వారు; ఒక్కెడన్+కూడెన్=ఒకచోట కలిశారు; ఇన్నిటి= ఇన్నింటియొక్క; మహా+ఉగ్రము+వేడిమికిన్= మహాభయంకరమయిన వేడిమికి; ఓర్వ వచ్చునే = తట్టుకోగలమా?

భా: *ఆ గాండీవము సాటిలేని తేజస్సుగలది. దాని మీద కేశవుడు మరో గొప్ప తేజస్సు. అయినా అర్జునుడు ఆ తేజస్సును ఆశించ డనుకో. ఆ అర్జునుడొక్కడే శత్రుసేనలకు ప్రజ్వరిల్లే అగ్నిహోత్రుని వంటివాడు. ప్రతాపమూర్తులన్నీ ఇట్లా ఒకచోట చేరాయి. ఇన్నిటి భయంకరమయిన వేడిమికి తాళగలమా.*

వి: 1. ప్రతాప మూర్తులు అనడంలో రెండర్థాలు స్ఫురిస్తాయి. పరాక్రమం రూపుదాల్చినారు. అని ఒకటి. బాగా తపింప చేసేవారు. తాపం కలిగించేవారు అని రెండో అర్థం. రెండర్థాలు ఈ సందర్భములో సముచితంగానే ఉన్నాయి.

2. కృష్ణుడు ఆయుధం పట్టకుండా అర్జునునికి సహాయపడుతున్నాడనే విషయం "అది యాసపడండు" అనే వాక్యం వల్ల తెలుస్తోంది. కృష్ణుని యొక్క తేజస్సును ఉపయోగించు కోవాలని అర్జునుడు ఆశపడటంలేదు అనిభావం.

క. దివిజ దనుజ సహితములగు
భువనము లన్నిట మహేంద్ర పుత్త్రుఁడు విజయో
త్సవ లీలఁ గ్రీడ సల్పుం,
దవులం బడఁ డెందు నత్యుదగ్రబలమునన్. 195

అ: మహేంద్ర పుత్త్రుఁడు = అర్జునుడు; దివిజ దనుజ సహితములగు = దేవతలు రాక్షసులతో కూడిన; భువనములు+అన్నిటన్ = లోకాలన్నిటిలోనూ; విజయ + ఉత్సవలీలన్ = విజయం పొందిన ఉత్సవపు ఉల్లాసంతో; క్రీడసల్పున్=ఆటలాడతాడు; అతి+ ఉదగ్రబలమునన్= మిక్కిలి బలంతో;ఎందున్=ఎక్కడా; తవులంబడడు=అరికట్టబడడు, నిరోధింపబడడు-చిక్కుపడడు.

భా: ఆ అర్జునుడు లోకాలన్నిటిలోనూ (దేవతలున్న లోకమయినా సరే రాక్షసులున్న లోకమయినా సరే) విజయోత్సవంలో వలె యుద్ధక్రీడ సల్పుతాడు. బలిష్ఠుడవడం చేత ఎప్పుడూ ఎక్కడా ఎవరికీ చిక్కడు, లొంగడు.

వ. అని పలికి వెండియు. 196

భా: అని చెప్పి ఇంకా ....

క : కురుసేనఁ గదా గెలుచుట
కరము భరం, బర్జునునకు గాండీవమునం
బెరిఁగిన యమ్ముల మంటల
దరికొని తెగఁగాల్చు నట్టిద యగుం జుమ్మీ! 197

అ: కురుసేనన్ కదా గెలుచుట = కురు సైన్యాన్ని కదా గెలవడం; కరము భరంబు= మిక్కిలి కష్టం; (కాని) అర్జునునకున్; గాండీవమునన్ =గాండీవం నుండి; పెరిగిన = విజృంభించిన; అమ్ముల మంటలన్ = బాణాల మంటలతో; దరికొని = అంటుకొని; తెగన్ కాల్చునట్టిది అగున్= విచ్చలవిడిగాల్చేదే అవుతుంది; చుమీ= సుమా!

భా: కౌరవ సైన్యాన్ని కదా జయించ వలసినది - చాలా కష్టం. కాని అర్జునునకు గాండీవం నుండి వెలువడిన బాణాలనే మంటలతో అంటుకొని కాల్చవలసినదే అవుతుంది సుమా!.

నిజానికికౌరవ సైన్యం జయింపరానిదే - కాని అర్జునిని గాండీవానికి లొంగని దేమీ కాదని భావం.

వ. భీమార్జునుల కొలందులు భీష్మద్రోణులెఱుంగు నంతకంటె నెవ్వ రెఱుంగుదు? రెఱింగియు మానుషంబు వాటించి సేనమొగంబున నిలుతురు, కీర్తివట్టి ప్రాణంబులు విడుతు, రింతియకాని చేయునదిలే; దదియునుం గాక పౌత్రులగుటయు శిష్యులగుటయు గాంగేయునకు గురునకు సామాన్యం బగుటంజేసి రెండు దెఱంగుల వారికి వీరొక్కరూప, మనకడనున్న తప్పునకు మన ముందట నిలువవలయు నను నింత మాత్రకుంగా వీరల కింతవలసె, నేను దైవాధీనత కతంబున బిడ్డల నొత్తి చెప్పను నియమింపనుం జాల; మొదల విదురుండేమని చాటి చెప్పెనదియంతయుం బాటిలె; జూదంబు నాఁటనుండియుఁ గురుజాతికిం జేటు మూఁడుట దోఁచుచుండు; మంద బుద్ధియు లోభోపహతుండునునయి దురభిలాషంబున దుర్యోధనుఁ డింత సేసెఁ; గాల పర్యాయంబునఁ గౌరవులకుఁ గడవరాని యవస్థ వచ్చె; సంజయా! నేనేమి సేయుదు? నెందు జొత్తు? నెద్ది దెరు? వెవ్వరు శరణంబు? వారిరువురుఁగల యంతటన పోయెనే! వినుమని మఱియు నిట్లనియె. 198

అ: కొలందులు = శక్తులు; మానుషంబు = పౌరుషం; కీర్తి + పట్టి = కీర్తి పొంది; పౌత్రులు = మనుమలు; దైవ + అధీనత, కతంబునన్ = దైవం మీద భారం వేసి ఉండటం వలన; పాటిలు = జరుగు; లోభ + ఉపహతుడు = దురాశచే కొట్టబడిన వాడు. మందబుద్ధి = తెలివితక్కువాడు; దురభిలాషంబునన్ = దురాశచేత; కడవరాని = దాటరాని.

భా: భీమార్జునుల శక్తి సామర్థ్యాలు భీష్మద్రోణుల కంటె ఎవరికి తెలుసు? - తెలిసినా ఆ భీష్మద్రోణులు మనుష్యభావంతో పౌరుషంతో సేనముందు నిలుస్తారు. కీర్తి పొంది ప్రాణాలు విడుస్తారు. ఇంతే తప్ప ఏమీ చేసేది లేదు. అదీగాక రెండు పక్షాల వారూ భీష్మునికి మనుమలు - ద్రోణునికి శిష్యులు. కాని మన దగ్గరున్న తప్పునకు మనసేన ముందు నిలుస్తారు. ఈ మాత్రానికి వీరులయిన భీష్మద్రోణులకు ఇటువంటి స్థితి వచ్చింది. నేను దైవాధీనం వల్ల పుత్రులకు గట్టిగా చెప్పలేను నియమించలేను. మొదట విదురుడు చెప్పిన దంతా జరిగింది. జూదం నుండీ కురుజాతికి చేటు మూడినట్లు తోస్తోంది. తెలివితక్కువ వాడూ దురాశాపరుడూ అయిన దుర్యోధనుడు ఇంత పని చేశాడు. కాలవశాత్తు కౌరవులకు దాటరాని దురవస్థ వచ్చింది. సంజయా! నేనేమి చేస్తాను? నాకేం దారి? ఎవరు నాకు శరణు? (ఏం చెయ్యాలో తోచటం లేదు) ఆ భీమార్జును లిద్దరితో సరిపోయిందా............ ఇంకా ఎంతమందో ఆ పక్షంలో ఉన్నారు) అని ఇంకా ఇలా అన్నాడు.

వి: 1. కాల పర్యాయంబున: దేహికి కాలవశాత్తు అనగా ఒకొక్కప్పుడు సుఖాలూ ఒకొక్కప్పుడు దుఃఖాలు ఒకదాని వెంట ఒకటి వస్తూ ఉంటాయి. అని భావం - దానికి ధీరుడు కుంగిపోరాదు.

2. కింను కుర్యాం కథం కుర్యాం క్వనుగచ్ఛామి సంజయ!
ఏతే నశ్యన్తి కురవో మన్దాః కాలవశం గతాః **5-5-59**

మూలానికి జాతీయమైన తెలుగుసేత "నాకేం దారి" అనేది.

చ. అనుజులు నట్టివార; ద్రుపదాది సుహృజ్జను లెల్ల నంతకం
టెను బలవంతు; లాహవ పటిష్ఠుఁడు రాజు యుధిష్ఠిరుండు స
ద్వినయ వివేక శీలముల విశ్రుతుఁ; డాతఁడు. బంధుభృత్యులం
దనకు వశంబు సేసికొను దానికి నేర్చుఁ బ్రభుత్వ సంపదన్. 199.

అ: అనుజులున్=తమ్ములయిన నకుల సహదేవులుకూడా; అట్టివారు+అ= అంతటి వారే; ద్రుపద + ఆది సుహృత్ + జనులు ఎల్లన్ = ద్రుపదుడు మొదలయిన మిత్రులంతా; అంతకంటెను బలవంతులు; రాజు యుధిష్ఠిరుండు = రాజయిన ధర్మరాజు; ఆహవపటిష్ఠుడు= యుద్ధంలో దృఢమయినవాడు; సత్ - వినయ వివేక శీలములన్ = చక్కని వినయము, వివేకము గల స్వభావంలో; విశ్రుతుఁడు = ప్రసిద్ధుడు; ఆతఁడు; ప్రభుత్వ సంపదన్ = ప్రాభవం అనే సంపదతో; బంధుభృత్యులన్ = చుట్టాలనూ సేవకులనూ; తనకున్, వశంబు చేసికొను దానికిన్ నేర్చున్ = వశపరచుకొనటానికి తగును.

భా: భీమార్జును లేకాదు తమ్ములు నకుల సహదేవులూ అంతటివారే. ద్రుపదాది మిత్రు లంత కంటె బలవంతులు. ఇక ధర్మరాజు యుద్ధంలో ఎంతో స్థిరంగా నిలిచేవాడు. వినయంలో వివేకంలో చాలా ప్రసిద్ధుడు. తన ప్రభుత్వంతో బంధువులను సేవకులనూ తన వశంలో ఉంచుకోగల సమర్థుడు.

ఆ: సత్యశౌచ ధర్మశాలి దయాపరుం
డట్టి ధర్మపుత్రు నాక్రమింప
మనము దలఁచు టెల్ల, మంటలో మిడుత లు
దగ్ర వృత్తి నుఱుకఁ దలఁచునట్లు. 200

అ: సత్యశౌచ ధర్మశాలి=సత్యమూ, శుచిత్వమూ,ధర్మమూ కలవాడు; దయాపరుండు = దయాస్వభావం కలవాడు; అట్టి ధర్మపుత్రున్ = అటువంటి ధర్మరాజును మనము; ఆక్రమింపన్ తలఁచుట ఎల్లన్ = ఆక్రమించుదా మనుకోవటం; మిడుతలు; ఉదగ్రవృత్తిన్=గర్వ, వేగ ప్రవర్తనతో; మంటలో; ఉఱుకన్ తలఁచునట్లు + అ = ఉరకాలి అనుకోవడమే.

భా: ఆ ధర్మరాజు సత్యమూ, శుచిత్వమూ ధర్మమూ కలవాడు. అంతేకాదు దయాశాలి - అటువంటి వానిని మనం పట్టుకోవా లనుకోవడం ఎటువంటి దంటే.. మిడుతలు మంటలో ఉరకా లనుకోవడం వంటిదే.

వి: మంటను చూసి ఏదో ఎఱ్ఱని పదార్థం - తిందామనే ఉహతో మిడతలు మంటలో తమంత తామే వచ్చి పడతాయి - కాలిపోతాయి. అలాగే ఇపుడు కౌరవులు కూడా ధర్మరాజు అనే మంటలోపడి భస్మమై పోతారని సూచన.

వ. కావునఁ బాండవుల తోడి భండనంబునం గులక్షయం బగుట దప్పదు; శాంతిఁ బొందుటయ మేలు; మనవారల కది ప్రియం బగునేనిఁ దానికిఁ దగిన యత్నంబు సేసెద, ననిన విని ధృతరాష్ట్రునకు సంజయుం డిట్లనియె. 201

అ: భండనంబునన్ = యుద్ధం వల్ల; కులక్షయంబు = వంశనాశనం.

భా: అందుచేత పాండవులతో యుద్ధం వల్ల వంశం నశించిపోవడం తప్పదు. కాబట్టి శాంతించడం మంచిది. మనవారికి (కౌరవులకు) అది ఇష్టమయితే దానికి తగిన ప్రయత్నం చేస్తాను అన్నాడు ధృతరాష్ట్రుడు. ఆ మాటలు విని సంజయుడు ధృతరాష్ట్రునితో ఇలా అన్నాడు

క: దేవర యానతి యిచ్చిన
యీ వాక్యము లెస్స; నాఁడు నీవ యుపేక్షం
బోవిడిచితి; వింకను నీ
చే వత్తురు వారు, వీరి చే టొప్పుదురే! 202

అ: దేవర = మహారాజుగారు తమరు; ఆనతి - ఇచ్చిన = ఆజ్ఞాపించిన/ చెప్పిన; ఈ వాక్యము =లెస్స=మంచిది; నాఁడున్=ఆనాడు(జూదంరోజు); ఈవ+నీవే; ఉపేక్షన్ పోన్ విడిచితివి= ఉపేక్ష వహించి- మాట్లాడక ఊరుకొని- పాండవులను అడవులకు వెళ్లటానికి విడిచిపెట్టావు. వారు = ఆ పాండవులు; ఇంకను = ఇప్పటికీ ఇప్పుడు; నీచేవత్తురు = నీ మాటవల్ల వచ్చి మీలో కలుస్తారు: (వారు పాండవులు) వీరి చేటు = కౌరవుల వినాశం; ఒప్పుదురే = అంగీకరింతురా?

భా: మీరు చెప్పిన ఈ మాట బాగుంది. అసలు ఆ జూదం రోజున నీవు ఊరుకొని వారిని అడవులకు వెళ్లనిచ్చావు. *(లేకపోతే ఇంతవరకు వచ్చేది కాదు - సరే)* ఇపుడు మళ్లీ నీ మాటతో నీలో కలుస్తారు. వారు కౌరవుల వినాశానికి ఒప్పుకోరు.

వి: దేవర ఆనతి ఇచ్చిన = ఇది ఆనాటి రాజ సంప్రదాయాన్ని సూచిస్తుంది. కాని వెంటనే నీవు అనడంలో కొంత చనవూ గోచరిస్తుంది.

వ: అది యె ట్లంటేని. 203

భా: *అది ఏవిధంగా అంటే.....*

క: వారు దెసలొత్తి కొనియు ధ
రా రాజ్యం బిచ్చిపోయిరా పోరా? తా
రారణ్య పీడఁ బడియును
రారాజుం జెఱకు ఁబాపరా మనమెఱుఁగన్. 204

అ: వారు = ఆ పాండవులు; దెసలు + ఒత్తికొనియున్ = దిగ్విజయం చేసి కూడా; ధరారాజ్యంబు = రాజ్యం అంతా; ఇచ్చిపోయిరా పోరా?=ఇచ్చి వెళ్లిపోయారా లేదా?తారు= వారు పాండవులు; ఆరణ్య పీడన్ పడియును = అరణ్యాల్లో బాధలు పడికూడా; మన మెఱుఁగన్= మనకు అందరకూ తెలిసేటట్లుగా; రారాజున్ = దుర్యోధనుని; చెఱకున్ + పాపరా? = నిర్బంధం నుండి విడిపించలేదా.

భా: *వాళ్లు పాండవులు ఇపుడు కూడా ఎందుకు వచ్చి మనలో కలుస్తారంటే వారి స్వభావం వల్ల. వారు దిగ్విజయం చేసి కూడా రాజ్యం విడిచి వెళ్లి పోయారాలేదా? వారు అడవుల్లో కష్టాలు పడికూడా దుర్యోధనుని చెర విడిపించారా లేదా?*

వి: 'చెఱకుఁబాపరా' అనే ఈ మాట అరణ్యపర్వంలో ఘోషయాత్రను తలపింప చేస్తుంది.

వ: **అట్టి యెడ నైనను.** 205

భా: *అప్పుడయినా సరే....*

క: **రావించి తగవుమై సం**
భావింపవ కాక నాఁడ పాండవు లలుకం
బోవిడువరె? మిగులుదురే
నీ వచనంబులకు? బిలిచి నిలుపుము వారిన్. 206

అ: (నీవు) రావించి = పాండవులను రప్పించి; తగవుమైన్ = న్యాయంగా సముచితంగా; సంభావింపవ కాక=గౌరవించలేదు కాని లేకపోతే; నాఁడ=ఆ రోజునే జూదంరోజునే; పాండవులు; అలుకన్ = కోపాన్ని; పోవిడువరె? = విడిచిపెట్టరూ? నీ వచనంబులకున్ = నీ మాటలకు; మిగులుదురే? = అతిక్రమిస్తారా? (ఇపుడయినా సరే) పిలిచి = పాండవులను పిలిచి; వారిన్; నిలుపుము = రాజ్యంలో నిలుపు.

భా: *నివు రప్పించి పాండవులను సముచితంగా చూస్తే ఆ జూదం నాడే పాండవులు కోపం వదలి ఉండేవారు కాదూ! నీ మాటలు జవదాటుతారా ? ఇపుడయినా సరే మించిపోయింది లేదు. వారిని పిలిచి గౌరవంతో రాజ్యపాలనలో నిలుపు. వారి భాగం వారికిచ్చి గౌరవించు.*

-: దుర్యోధనుఁడు తండ్రితో స్వపక్షవీరుల సామర్థ్యంబు సెప్పుట :-

సం: 5-54-1

వ: **అనిన విని దుర్యోధనుండు దండ్రి కిట్లనియె.** 207

భా: *సంజయుని మాటలు విని దుర్యోధనుడు తండ్రితో ఇలా అన్నాడు.*

చ॥ **అడవులఁ గొండలం బడి మహాపద రూపఱి చన్న వారి ని**
ప్పుడు కొని వచ్చి కృష్ణుఁడొక ప్రోవుగఁ గూటువ మూఁకఁ గూర్చినం
బొడుతురె పాండునందనులు భూవర! యేటికి నింత భీతి? మా
కడిమియు లావు నీవసదుగా గణుతింపకు; గెల్తు మెమ్మెయిన్. 208

అ: భూవర! = రాజా!; అడవులన్ - కొండలన్ పడి = అరణ్యాల్లో, కొండలలోపడి; మహా + ఆపదన్ = ఎంతో ఆపదతో; రూపఱి చన్నవారిన్ = రూపు చెడిపోయిన వారిని; ఇప్పుడు; కృష్ణుఁడు; కొనివచ్చి = తీసుకొని వచ్చి; ఒక ప్రోవుగన్ = ఒక గుంపుగా; కూటువమూఁకన్ కూర్చినన్= పిరికి బలాన్ని సైన్యాన్ని కూర్చితే; పాండునందనులు; పొడుతురె = సంహరిస్తారా? ఏటికిన్ ఇంత భీతి? = ఇంత భయం ఎందుకు?; మాకడిమియున్ = మా సాహసమూ పరాక్రమమూ; లావు = బలమూ; నీవు; అసదుగాన్ = చులకనగా; గణుతింపకు = చూడకు, లెక్కింపకు; ఏ + మెయిన్ = ఏ విధంగానయినా; గెల్తుము = గెలుస్తాము.

భా: రాజా! అడవుల్లో కొండల్లో పడిపోయి ఆపదలతో రూపు చెడినవారిని తీసుకువచ్చి కృష్ణుడు ఒక పిరికి మూకగా తయారుచేస్తే ఆ పాండవులు మమ్మల్ని పొడుస్తారా? రాజా! నీకెందుకింత భయం? మా బలపరాక్రమాలు నీవు తేలికగా లెక్కించకు. మేము ఏలాగయినా జయిస్తాము.

తే॥ పరశురాముని గెలిచిన బల్లిదుండు
భీష్ముఁ;డవనీశు లీతని పేరు వినినఁ
బాఱుచుండుట యెఱుఁగవే? పాండు పుత్రు
లనఁగ నెంతటివా రితం డలిగె నేని. 209

అ: భీష్ముఁడు; పరశురాముని గెలిచిన;బల్లిదుండు=శూరుడు; అవనీశులు=రాజులు; ఈతని పేరు వినినన్; పాఱుచుండుట=పరుగెత్తి పోతూ ఉండటం; ఎఱుఁగవే! ఇతండు; అలిగెనేని= కోపిస్తే; పాండు పుత్రులనఁగన్ ఎంతటివారు? = పాండవులంటే ఎంత? (గోటికి కూడ పోలరు).

భా: పరశు రాముని జయించిన శూరుడు భీష్ముడు. ఇతని పేరు వింటే చాలు రాజులంతా పరుగెత్తుతూ ఉంటారని వినలేదా? ఇతడు కోపిస్తే పాండవు లెంతటివారు? పాండవు లితని కొక లెక్కలోని వారు కారని భావము.

వి: అంబ విషయమై భీష్ముడు పరశురామునితో యుద్ధం చేశాడు.
చూడుడు ఉద్యోగ - 4వ ఆశ్వాసం

క॥ కృపుఁడును గురుఁడు నయోనిజు,
లపరిమిత భుజా బలాఢ్యు, లాహవకేళీ
నిపుణు, లజేయులు; వీరలు
కుపితాత్మకులైన మాఱుకొనునే హరుఁడున్? 210

అ॥ కృపుఁడును = కృపాచార్యుడూ; గురుఁడును =ద్రోణాచార్యులూ; అయోనిజులు= స్త్రీకి పుట్టిన వారు కారు; అపరిమిత, భుజాబల + ఆఢ్యులు = అంతులేని భుజబలంతో ప్రసిద్ధులు; ఆహవకేళీ నిపుణులు=యుద్ధం అనే ఆటలో నేర్పరులు; అజేయులు=జయింప శక్యముకాని వారు; వీరలు; కుపిత + ఆత్మకు లైనన్ = కోపిస్తే; హరుఁడున్ = శివుడయినా; మాఱుకొనునే?= ఎదుర్కొనగలడా?

భా: కృపాచార్య ద్రోణాచార్యులిరువురూ అయోనిజులు - అపరిమిత మయిన బాహుబలం కలవారు. యుద్ధతంత్రం అంతా బాగా నేర్చినవారు. జయింపశక్యం కానివారు. వీరు కోపిస్తే శివుడు కూడా వీరిని ఎదుర్కొనలేడు.

క॥ ఈశ్వర వర జనితుఁడు, హరి
దశ్వప్రతిమాన తేజుఁ, డస్త్రకళా ని
త్యైశ్వర్య ధురంధరుఁ డీ
యశ్వత్థామ గలుగ మన కని వెఱపేలా? 211

అ: ఈశ్వర వర జనితుఁడు = శివుని వరంతో పుట్టినవాడూ; హరిదశ్వ ప్రతిమాన తేజుఁడు = సూర్యునితో సమానమయిన తేజస్సు కలవాడూ; అస్త్రకళా నిత్య + ఐశ్వర్య ధురంధరుఁడు=అస్త్ర విద్య అనే నిత్యమయిన శాశ్వతమయిన సంపద వహించిన వాడూ; (అయిన) ఈ అశ్వత్థామ; కలుగన్ = ఉండగా; మనకున్; అనిన్ వెఱపు + ఏలా = యుద్ధంలో భయం ఎందుకు?

భా: ఈశ్వరుని వరం వల్ల పుట్టిన వాడూ, సూర్య సమానమయిన తేజస్వీ; అస్త్రశస్త్ర సంపద శాశ్వతంగా కలవాడూ అయిన అశ్వత్థామ ఉండగా మనకు యుద్ధంలో భయమెందుకు?

మనం యుద్ధానికి వెనుకాడవలసిన పని లేదని భావం.

ఆ: సహజ కుండలుండు, శౌర్యధుర్యుఁడు సము
దీర్ఘ బాహు బలుఁడు, గర్ణుఁ డిందుఁ
గలఁడు; వీని కెదురు గలఁడని యెన్నుమా!
ధర్మపుత్రు పాల ధరణి నాథ! 212

అ: సహజకుండలుండు= కుండలాలతో పుట్టిన వాడూ; శౌర్యధుర్యుఁడు = పరాక్రమ శాలి; సముదీర్ఘ బాహు బలుఁడు=అధికమయిన భుజబలం కలవాడూ అయిన; కర్ణుఁడు; ఇందున్=ఈ పక్షంలో; కలఁడు; ధరణినాథ! =రాజా!; ధర్మపుత్రుపాలన్=ధర్మరాజు పక్షంలో;వీనికిన్ = కర్ణునికి; ఎదురుగలఁడు అని=ఎదురుగా వీడున్నాడని ఎవరినయినా; ఎన్నుమా?= లెక్కించు?

భా: కవచ కుండలాలతో పుట్టినవాడూ, మహా పరాక్రమవంతుడూ, అధిక భుజబలుడూ అయిన కర్ణుడీ పక్షంలో ఉన్నాడు. వీనికి సమానుడు ధర్మరాజు పక్షంలో ఎవరూ లేరు - మహారాజా! - ఒక్కడున్నాడని చూపించు. లేదని భావం.

వి: కర్ణుడు కుంతికి సూర్యుని వరం వల్ల పుట్టాడు. పుడుతూనే కవచంతోనూ కుండలాలతోనూ పుట్టాడు. చూడుడు ఆదిపర్వం.

క॥ వినుము నరేశ్వర! కర్ణుని
పెనుపు; మహేంద్రుండు వచ్చి ప్రియమున శచికై
తను నర్థింపఁగ, నిచ్చెను
గొను మన లోకంబు లెఱుఁగఁ గుండల యుగమున్. 213

అ: నరేశ్వర! = రాజా; కర్ణుని పెనుపు = కర్ణుని ఘనత; వినుము; మహేంద్రుడు వచ్చి ; ప్రియమునన్; శచికిన్ = భార్య అయిన శచీదేవి కోసం; తనున్ = తనను; అర్థింపగన్ = కోరితే యాచిస్తే; లోకంబులు + ఎఱుఁగన్ = జగత్ప్ర సిద్ధంగా; కుండలయుగమున్ = కుండలాల జంటను; కొనుము + అని = తీసుకోఅని; ఇచ్చెను.

భా: రాజా! కర్ణుని గొప్పదనం చెవుతావిను. సాక్షాత్తు దేవేంద్రుడు వచ్చి తన రాణి శచీదేవి కోసం తనను యాచిస్తే ఈ కర్ణుడు జగత్ప్రఖ్యాతంగా కుండలాలు రెండూ 'ఇవిగో తీసుకో' అంటూ ఇచ్చాడు.

వి: 1. శరీరంలో భాగమయిన కుండలాలు కోసి యివ్వడమే ఘనత.

2. కొనుమని ఇవ్వడంలో చాలా తేలికగా ఏమీ బాధ పడకుండా ఇచ్చాడనిభావం.

3. దీనిని బట్టి కర్ణుని దాతృత్వం వెల్లడి అవుతోంది.

వ: వీరలా ధర్మపుత్రాదుల చేతన కా దెవ్వరి చేతనుం జెడమి దెల్లంబు; బాహ్లిక సోమదత్త భూరిశ్రవ శ్శల్య సింధురాజ గాంధార రాజ ప్రభృతి మహావీరులు వీరలకంటెను శక్తి సమగ్రులు; తక్కటి రాజ లోకంబును సహాయులై వచ్చిన వివిధ దేశాధీశులును నాతోడి సుఖ దుఃఖంబుల కియ్యకొని యగ్గలికమై నగ్గినైన నుఱుకను, సముద్రం బైన నీఁదను దెంపుసేసి పొంపిరి వోవుచున్నవారు; గావునఁ బాండవులకు మా దిక్కు దేఱి చూడనుం గొలందిగా, దనుమానింపకు, మిట్లునుం గాక మాకు నెవ్వరును లేక చుట్టంబులును జెలులును విడిచి తోడువచ్చినవారును విచ్చిపోయి భృత్యులును విరక్తులై వారిక పోటు మానుసులను, బంధు మిత్ర సహాయులును బ్రజానురాగంబునుం గలిగి నట్టిదైన నది ప్రాప్తకాలం, బింతియ కాని, యేమింక వారి యడుగు లొత్తను, బాఱి పోవనుం, జాల; మెల్ల భంగుల సమరంబు సేయుదుము; మాతలం పిట్టిద, నాతలంచి నట్లొండె వాసుదేవుండు దలంచి నట్లొండె నయ్యెడు, నెట్లైన మే, లింతవట్టును నిర్ణయం; బని పలికి మఱియు నిట్లనియె. 214

అ: చెడమి = చెడకపోవడం; తక్కటి = మిగిలిన; ఇయ్యకొని = అంగీకరించి ఇష్టపడి; అగ్గలికమైన్ = ఆధిక్యంతో; ఉఱుకను=ఉరకటానికి; తెంపు - చేసి =సాహసించి; పొంపిరి వోవు = పొంగి పోవు; కొలందికాదు = చేతకాదు శక్తిచాలదు; భృత్యులు = సేవకులు; ప్రజా + అనురాగంబు = ప్రజల యొక్క ఇష్టం అభిమతం; వారిక = వారికే; పోటుమానుసులు = యుద్ధవీరులు; ప్రాప్తకాలము=రావలసిన కాలం పొందినకాలం; ఎల్ల భంగులన్=అన్ని విధాలా; సమరంబు=యుద్ధంబు; తలంపు+ఇట్టిద = అభిప్రాయం ఇటువంటిది. నా తలంచినట్లు-ఒండె= నేను తలచినట్లు కాని; ఇంతపట్టు = ఇంతవరకు;

భా: వీరంతా ఆ ధర్మరాజు మొదలగు పాండవులచేతనే కాదు ఎవరిచేతనూ కూడా చావ రనేది స్పష్టం. బాహ్లికుడూ, సోమదత్తుడూ, భూరిశ్రవుడూ శల్యుడూ సింధురాజూ గాంధార రాజూ మొదలయిన వీరులంతా పైన చెప్పిన వారి కంటె శక్తి సామర్థ్యాలు కలవారు. మిగిలిన రాజులూ, సహాయపడవచ్చిన సకల రాజులూ నాతో సుఖదుఃఖాలు పొందటానికి అంగీకరించి అగ్నిలో దూకటానికయినా సముద్రం ఈదటానికి కయినా సాహసించి పొంగిపోతున్నారు. అందుచేత పాండవులు మావైపు కూడా తేరిపారి చూడలేరు. నీకు సందేహం అనవసరం. ఒకవేళ అట్లాకాక మా పక్షాన ఎవరూ నిలవక చుట్టాలూ స్నేహితులూ మమ్మల్ని విడిచిపోయి సహాయానికి వచ్చిన వారూ విడిపోయి, సేవకులంతా మామీద విరక్తి చెంది పాండవులకే భక్తివశులయిన వీరులూ, బంధువులూ మిత్రులూ సహాయులూ కలిగి ప్రజల అనురాగం కూడా వారికే ఉంటే (చేకూరితే) ఇక అట్లా జరగాలి కాబట్టి జరిగింది అనుకోవడమే అంతే. కాని ఇకవారి అడుగులు ఒత్తలేము - పారిపోలేము.

అన్నివిధాల యుద్ధమే చేస్తాము.మా అభిప్రాయం ఇది. నేను తలచినట్లయినా జరుగుతుంది. లేదా కృష్ణుడు అనుకొన్నట్లయినా జరుగుతుంది. ఏదయినా మంచిదే. ఇది మా నిర్ణయం. అని చెప్పి దుర్యోధనుడు ఇంకా ఇలా అన్నాడు.

తే॥ కులములోఁ దల వంపగు కూడు గుడువఁ
బంపఁజూచెద, వొకళులఁ బఱతు రట్టె?
వారు పైనెత్తి వచ్చినఁ బోరి కోప
మనిన ధృతి చేట కాక పొందగునె చెపుమ? 215

అ: కులములో=వంశంలో; తలవంపు+అగు=అవమానకరమయిన; కూడుకుడువన్ పంపన్ చూచెదవు=కూడు తినటానికి పంపుదామనుకొంటున్నావు; ఒకళులన్=ఇతరులను; పఱతురట్టె? = ఆశ్రయిస్తారా - సేవిస్తారా? వారు = పాండవులు; పై నెత్తివచ్చినన్=దండెత్తివస్తే; పోరికిన్ =యుద్ధానికి; ఓపము + అనినన్ = సమర్థులము కాము అంటే, చాలము అంటే; ధృతి చేటు+అ, కాక =ధైర్యం పోవడమే తప్ప; పొందు+అగునె?=సంధి చేకూరుతుందా?; చెపుమ=చెప్పు.

భా: కులంలో తలవంపులు తెచ్చే నీచమయిన కూడు తినటానికి పంపుదామనుకుంటావు - (రాజులై) ఇతరులను ఆశ్రయిస్తారా? ఎవరయినా? పాండవులు దండెత్తి వస్తే మనం యుద్ధానికి చాలమంటే ధైర్యం పోవడమే కనపడుతుంది-అసమర్థతే కనపడుతుంది తప్ప సంధి కుదురుతుందా? చెప్పు.

వి: ఇందులో 'వారు' అనే పదాన్ని పైకి అన్వయిస్తే పాండవులు ఒకరిని సేవిస్తారా? అని అర్థం. కిందకు అన్వయిస్తే పాండవులు దండెత్తి వస్తే అని అర్థం. ఈ 'వారు' అనే పదం రెండింటికీ పర్యాయంగా అన్వయించవచ్చు.

క॥ నీవు బతిమాలి కొడుకుల
చావునకును జేటునకును జాలక యిమ్మై
వావిడిచి యఱచినం గడు
నేవ పడరె జనులు? నిన్ను నేమన నేర్తున్? 216

అ: నీవు; బతిమాలి = దైన్యపడి; కొడుకుల చావునకును; చేటునకును చాలక = కీడునకూ తట్టుకోలేక; ఈ + మైన్ = ఈ విధంగా; వా విడిచి అఱచినన్ = నోరు విప్పి అరిస్తే; జనులు = ప్రజలు; కడున్ ఏవపడరె? = ఎంతో అసహ్యించుకోరా? నిన్నున్; ఏమననేర్తున్ = నిన్ను ఏమనగలను?

భా: నీవు దైన్యంతో శత్రువులను బతిమాలి కొడుకు, కీడుకూ నాశనానికీ తాళలేక ఇలా నోరు పెట్టుకొని శోకిస్తే (వాపోతే) ప్రజలు చాలా అసహ్యించుకొంటారు. (పెద్దవాడవు) నిన్నేమనగలను.

తే॥ భీమసేనుని నీవింత పెద్దచేసి
పెక్కు భంగులఁ జెప్పితి; "యుక్కు గలఁడు

గదకు నేర్పునం చెంతయు బెదరె దతఁడు
నన్నుఁ బోలమి యెఱుఁగవే నరవరేణ్య! 217

అ: నీవు; ఇంత గొప్పచేసి; ఉక్కుగలఁడు = బలిష్ఠుడు; గదకు నేర్పున్ = గదా యుద్ధంలో నిపుణుడూ; అంచున్ = అంటూ; భీమసేనునిన్, నీవు; ఇంత పెద్దచేసి = ఇంత గొప్పచేసి; పెక్కుభంగులన్ = ఎన్నో విధాల; చెప్పితి=చెప్పావు; ఎంతయున్ బెదరెదు = చాలా భయపడుతున్నావు; నరవరేణ్య! = రాజా!; అతఁడు = ఆ భీముడు; నన్నున్ పోలమి ఎఱుఁగవే?= నన్ను పోలడని తెలియదా? నాతో సాటిరాడని తెలియదా?

భా: *బలిష్ఠుడూ, గదా నిపుణుడూ అంటూ భీముని ఎంతో గొప్పచేసి చెప్పావు- ఎంతో బెదిరి పోతున్నావు. అతడు నాతో సరికాడని నీకు తెలియదా రాజా!.*

మ॥ గద నాతో సరి మూఁడు లోకముల నేఁగానం; జలం బెత్తి యు
న్మదుఁడా భీముఁడు నన్నునిం దొడరినన్, వజ్రప్రహారంబు బె
ట్టిదమై తాఁకినఁ గూలు పర్వతము మాడ్కిం గుంభినిం గూలవ్రే
సెద; నాకోర్కి గదా గదారణము, వచ్చెం బెద్ద కాలంబునన్. 218

అ: గదన్ = గదాయుద్ధంలో; నాతోసరి = నాతోసాటి వచ్చే వానిని; మూఁడు లోకములన్; ఏన్ = నేను; కానన్ = చూడను; చలం బెత్తి = మత్సరం వహించి; ఉన్మదుఁడు = మత్తిల్లినవాడు; ఆ భీముఁడు; నన్ను - అనిన్ తొడరినన్ = నన్ను యుద్ధంలో ఎదిరిస్తే; వజ్రప్రహారంబు = వజ్రాయుధపు దెబ్బ; బెట్టిదమై తాకినన్ = కఠినంగా ఘనంగా తగిలితే; కూలు =కూలిపోయే; పర్వతము మాడ్కిన్ = కొండవలె; కుంభినిన్ కూలవ్రేసెదన్ = నేలగూల్చు తాను; నా కోర్కికదా; గదారణము = గదాయుద్ధం నాకెంతో యిష్టం కదా; వచ్చెన్ పెద్దకాలంబునన్= చాలా కాలానికి గదాయుద్ధం వచ్చింది.

భా: *గదాయుద్ధంలో నాతో ఎవరూ మూడు లోకాల్లోనూ సాటిరారు - ఆ భీముడు నాపై మాత్సర్యంతో యుద్ధంలో నన్ను ఎదిరిస్తే ఏం చేస్తానంటే... ఘనంగా గట్టి వజ్రపు దెబ్బ తగిలితే కూలిపడే పర్వతంలాగ నేల గూలుస్తాను. గదాయుద్ధం అంటే నాకెంతో యిష్టం. ఇంతకాలానికి (చాలా కాలానికి) వచ్చింది.*

ఆ: అతఁడు వడిన, వెండి యాసేనఁ గోల్తల
సేయ నొకఁడు లేమి సిద్ధ; మింత
యెఱిఁగి వెఱచికాదె! యే నూళ్లలైనను
దమకుఁ జాలు ననియె ధర్మసుతుఁడు. 219

అ: అతఁడు - పడినన్ = భీముడు పడిపోతే, వెండి = తిరిగి; ఆసేనన్ = ఆ సైన్యంలో; కోల్తల సేయన్ = ఎదిరించి నిలవటానికి; ఒకఁడున్ లేమి సిద్ధము = ఒక్కడు కూడా లేడనేది సత్యం-ఇంత యెఱిఁగి; వెఱచికాదె!= భయపడే కదా!; ధర్మసుతుఁడు; ఏను+ఊళ్లలైనను= అయిదు ఊళ్లయినా; తమకున్ చాలును అనియె.

భా: భీముడు పడిన తరువాత ఆ సైన్యంలో తిరిగి ఎదిరించి నిలవగలవాడు ఒక్కడయినా లేడు - ఈ మాట నిజం - ఇదంతా తెలుసుకొని భయపడటం వల్లనే ధర్మరాజు అయిదూళ్లయినా తమకు చాలునన్నాడు.

వి: ధర్మరాజు మంచితనమూ సహనమూ దుర్యోధనునికి అసమర్థతగా తోచింది.

వ: అర్జునుండు గలండని తలంచితి వేని. 220

భా: అర్జును డున్నాడని అనుకొంటే..............

తే॥ కర్ణు వడసిన యాశక్తి గలుగఁ బోర
బ్రదుక వచ్చునె నరునకు? నదియుఁగాక,
యతని భీష్మాది రథికుల యతులితాప్ర
మేయ దివ్య బాణంబులు మ్రింగి కొనవె? 221

అ: కర్ణువడసిన = కర్ణుడు పొందిన; ఆ శక్తి; కలుగన్ = ఉండగా; పోరన్ = యుద్ధంలో; నరునకున్ బ్రదుక వచ్చునె? = అర్జునునికి బ్రతకడం శక్యమా?; అదియున్ కాక = అంతేకాక; భీష్మాది రథికుల = భీష్ముడు మొదలయిన రథికుల యొక్క; అతులిత = సాటిలేని; అప్రమేయ = లెక్కింపరాని; దివ్యబాణంబులు; అతనిన్ = ఆ అర్జునుని; మ్రింగికొనవె? = మింగివేయవా?

భా: ఇంద్రుని నుండి కర్ణుడు పొందిన శక్తి ఉండగా యుద్ధంలో అర్జునుడు ఎలా బ్రదుకగలడు? అదీగాక భీష్మాది వీరుల దివ్యబాణాలు అతనిని మింగి వేయవూ? మింగివేస్తాయి అని భావం.

వ: దుశ్శాసన దుష్ప్రహ దుర్ముఖ వివింశతి వికర్ణ చిత్రసేనాదులగు నీకొడుకు లొకం డొకండ జగంబు లెల్ల జయింపఁజాలుదు, రందఱు నొక్కమొగంబై త్రోచి నడచిన సవ్యసాచి యొక్కరుండ కాఁడు, పాండవుల నెల్ల నొక్కెత్తున వైచికొన నోపుదు, రట్లునుం గాక, మాకు నక్షౌహిణులు పదునొకండు, వారికి నేడక్షోహిణులు; మా సైన్యంబు సారవంతంబు, వారి బలంబు నిస్సారంబు, వారు మమ్మెవ్విధంబున జయింప నోపుదు? రీయెక్కువ దక్కువలు విచారింపక వలవని వెఱపు గట్టికొని ముక్కూరి వగచు చున్న వాఁడవు. నిన్ను వగవకుండ నుడుపం జాల, మంతియకాని తక్కెల్ల పనుల కుంజాలుదు, మని పలికి సంజయు దెసఁ గనుంగొని సుయోధనుం డిట్లనియె. 222

అ: ఒకండొకండ = ఒక్కొక్కడే; ఒక్కమొగంబై = ఏకముఖంగా; ఒక్క + ఎత్తున= ఒకే ముట్టడిలో; వైచికొనన్ = లొంగదీసుకొనటానికి; వలవని = తగని; ముక్కూరి = అజ్ఞానము పొంది; ఉడుపన్ చాలము = తగ్గించలేము - తొలగింపలేము; తక్కు + ఎల్ల = మిగిలిన అన్ని; చాలుదుము = తగుదుము సమర్థులము.

భా: దుశ్శాసనుడూ, దుష్ప్రహుడూ, దుర్ముఖుడూ, వివింశతి, వికర్ణుడూ, చిత్రసేనుడూ మొదలయిన నీ కొడుకులు ఒక్కొక్కడే లోకాలన్నీ జయింపగలరు. అందరూ కలిసి ఏకముఖంగా నడిస్తే అర్జును డొక్కడే కాదు పాండవుల నందరినీ ఒక్కసారిగా జయింపగలుగుతారు. అదీగాక మాకు 11 అక్షౌహిణుల సైన్యం ఉంది. వారికి 7 అక్షౌహిణులు మాత్రమే. మా సైన్యం సారవంతమయినది. వారి బలం నిస్సారమయినది. వారు మమ్మల్ని ఎలా జయిస్తారు? ఈ ఎక్కువ తక్కువలు ఆలోచింపక అనవసరమయిన భయం తెచ్చుకొని తెలివి తక్కువతనంతో విచారిస్తున్నావు. నిన్ను ఏడవకుండా (విచారించకుండా) ఉంచలేక పోతున్నాం తప్ప మిగతా ఏ పని అయినా చేయగలము. అని సంజయుని చూసి దుర్యోధనుడు ఇలా అన్నాడు.

వి: అక్షౌహిణి అనగా

21870	-	రథములు	
21870	-	ఏనుగులు	
65610	-	గుఱ్ఱములు	
109350	-	పదాతులు	కలిగిన సేన.

క॥ **నానా దేశంబుల బలు**
మానుసులం గూర్చికొని సమత్సర బుద్ధిం
దా నే మనియెడు నయ్యమ
సూనుం డాతని తెఱంగు సూతము చెపుమా! 223

అ: నానాదేశంబుల = అనేక దేశాలకు సంబంధించిన; బలు మానుసులన్ = వీరులను; కూర్చుకొని; ఆ + యమనందనుఁడు = ఆ ధర్మరాజు; సమత్సర బుద్ధిన్ = మా మీది అసూయాబుద్ధితో; తాను; ఏమి + అనియెడు = ఏమంటాడు?; ఆతని తెఱంగు = ఆతని పద్ధతి ఏమిటో; చూతము చెపుమా! = చూద్దాం చెప్పు.

భా: వివిధ దేశాల వీరుల్ని సమకూర్చుకొని మాత్సర్యంతో ఆ ధర్మరాజు ఏమంటాడు? అతని తీరు చెప్పు చూద్దాం.

వి: ఈ మాటల్లో దుర్యోధనుని అహంభావమూ; ధర్మరాజు అంటే చులకనతనమూ గోచరిస్తాయి. "నానాదేశంబుల బలమానుసులం గూర్చికొని" అనడంలో ఒక విధమయిన హేళన ఎత్తిపొడుపు గోచరిస్తాయి. వెటకారం కూడా కనపడుతుంది.

వ: **అనిన విని సంజయుం డిట్లనియె.** 224

భా: ఆ మాటలు విని సంజయు డిలా అన్నాడు.

-: సంజయుఁడు దుర్యోధనునకు ధర్మరాజు నిశ్చయం బెఱింగించుట:-

సం: 5 - 55 - 2

ఉ: ఆతఁడు భండనం బనిన నార్చిన మూరెడు పేర్చు; నెంతయుం
బ్రీతి వహించి తమ్ము లొకపెండ్లికిఁ బోయెడు నట్ల యున్నవా;
రాతెలి వెందునుం గలదె? యందలి నాయకు "లెప్పుడొక్కొ మా
చేతులతీఁట వుత్తు" మను చిత్తమకాని చలింప రేమియున్. 225

అ: ఆతఁడు=అధర్మరాజు; భండనంబు-అనినన్=యుద్ధం అంటే; ఆర్చినన్ మూరెడు పేర్చున్=ఇతరులు "యుద్ధం" అని కేకలేస్తే మూరెడు ఎదుగుతాడు; తమ్ములు; ఎంతయున్= మిక్కిలి; ప్రీతి వహించి; ఒక పెండ్లికి పోయెడు నట్లు=పెళ్లికి పోతున్నట్లే; ఉన్నవారు; ఆ తెలివి; ఎందునుంగలదె?=ఎక్కడయినా ఉందా; అందలి నాయకులు=అక్కడి మిగిలినరాజులు; ఎప్పడొక్కొ=ఎప్పుడా; మాచేతుల తీఁట-పుత్తుము అను=మా చేతుల దురద తీర్చుకొందుము అను; చిత్తము+అ+కాని=ఉద్దేశమే కాని; ఏమియున్ చలింపరు= ఎంతమాత్రమూ భయపడరు.

భా: ఎవరయినా 'యుద్ధం' అన్న మాట ఉచ్చరిస్తే ఎంతో సంతోషిస్తాడు ధర్మరాజు. ఇక తమ్ములంటే వారంతా ఏదో పెళ్లికి వెడుతున్నట్లు మురిసి పోతున్నారు. ఆ తెలివి ఎక్కడా చూడము. ఇక అక్కడి రాజులంతా "మాచేతుల తీట ఎపుడు తీరుతుందా? అనుకుంటున్నారే కాని ఏ మాత్రం భయపడరు.

తే॥ నరుని పాశుపతాది బాణముల పెంపు,
భీము గదసొంపు, నమ్మి యుద్దామ లీలఁ
జెలఁగి వెఱపేది యక్కడి బలము ముసురు
గవిసి యెపుడుఁ గయ్యమునకుఁ గాలు ద్రవ్వు 226

అ: నరుని = అర్జునుని యొక్క; పాశుపత + ఆది = పాశుపతము మొదలయిన; బాణముల పెంపు = అస్త్రాల గొప్పదనమూ; భీముగదసొంపు = భీముని గదా నిపుణత; నమ్మి; ఉద్దామ లీలన్ చెలఁగి = ఉజ్జ్వలమయిన విలాసంతో కూడి; వెఱపు + ఏది = భయం విడిచి; అక్కడి బలము = ఆ పాండవుల సైన్యం; ముసురు గవిసి = వ్యాపించి; ఎపుడున్ = ఎల్లప్పుడూ; కయ్యమునకున్ కాలు ద్రవ్వన్ = కయ్యానికి కాలు ద్రవ్వుతూ ఉంటుంది.

భా: అర్జునుని పాశుపతాస్త్రం మొ॥దివ్యాస్త్రాల ఘనత, భీముని గదా నైపుణ్యమూ నమ్మి ఉజ్జ్వలంగా నిర్భయంగా ఆ పాండవసైన్యం ఎప్పుడూ కయ్యానికి కాలు దూస్తూ ఉంటుంది.

వి: పశువులు (ఎద్దులు మొ॥) కయ్యానికి సిద్ధమయినపుడు కాళ్లతో నేలను గీరటం ద్రవ్వడం కనపడుతుంది. దాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ నుడికారం వచ్చి ఉంటుంది.

క॥ నావుడు నిది యౌ సంజయ!
కైవారము సేసె దీవు కౌంతేయుల; వా

రేవి రణసాధనమ్ములు
గా వెఱవక నడచువారు కౌరవులపయిన్? 227

అ: నావుడున్ = అనగానే; సంజయ!; ఇది ఔ = ఇది మంచిదే సరే!; ఈవు = నీవు; కౌంతేయులన్ = కుంతీ పుత్రులయిన పాండవులను; కైవారము చేసెదు = పొగడుతున్నావు; వారు = పాండవులు; వెఱవక = నిర్భయంగా; ఏవి రణ సాధనమ్ములుగాన్ = ఏవేవి యుద్ధ పరికరాలుగా చేసుకొని; కౌరవుల పయిన్ నడచువారు = కౌరవుల మీదికి వస్తారు?

భా: సంజయుని ఆ మాటలు విని దుర్యోధనుడు అది సరే సంజయా! నీవు పాండవులను తెగ పొగడుతున్నావు - వారు ఏ సాధనాలతో నిర్భయంగా కౌరవుల మీదికి వస్తున్నారు?

వి: 1. సంజయుడు "వెఱపేది అక్కడి బలము ముసురు గవిసి" అని చెప్పాడు. దాన్ని వెటకారంగా దుర్యోధనుడు "వెఱవక" అని రెట్టించి అంటున్నాడు.

2."ఇదియౌ" అనడంలో "ఇక చాలించు" "అదిసరేలే" అనే భావాలుస్ఫురిస్తాయి.

వ: అనిన సుయోధనునకు నూతనందనుం డర్జును దివ్యరథ శ్వేతాశ్వ కపిధ్వజ దేవదత్తంబుల మహానుభావంబులు వేఱువేఱ వర్ణించి చెప్పి, యుధిష్ఠిర భీమ నకుల సహదేవుల యరదంబులు, దురంగాది పరికరంబు లిట్టిట్టి వని యేర్పడం బలికి, విరాట ద్రుపదాదులకు వలయునుపకరణంబులు గొఱంత లేమియు నెఱింగించిన, ధృతరాష్ట్రుం డిందుఁగల బలుమానుసు లెవ్వరికి నసాధ్యులు వీరి సాధించు తెరం గూహించిరే? యని యడిగిన, సంజయుం డిట్లనియె. 228

అ: శ్వేతాశ్వములు = తెల్లనిగుర్రాలు; అరదంబులు = రథాలు; పరికరంబులు = సాధనాలు; ఉపకరణంబులు = సాధనాలు; బలుమానుసులు = వీరులు

భా: ఆ మాటలు విని సంజయుడు అర్జునుని దివ్య రథాన్ని గూర్చి, శ్వేతాశ్వములు, కపిధ్వజము, దేవదత్తము మొ॥ పరికరాలను గురించి వేర్వేరుగా వర్ణించి చెప్పి అలాగే మిగిలిన పాండవుల రథాలు, గుర్రాలు మొ॥ సాధనాలు ఇటువంటివని స్పష్టంగా చెప్పి, విరాటునికి ద్రుపదునికి కూడ పరికరాల లోటు లేదని చెప్పాడు. అపుడు ధృతరాష్ట్రుడు " ఈ పక్షంలో వీరు లెవరికీ సాధ్యులు కాదు కదా! వీరిని సాధించే విధానం ఊహించారా? అని అడిగాడు. అపుడు సంజయుడిలా అన్నాడు.

సీ॥ గంగాసుతుండు శిఖండి పా, లతనికిఁ
బ్రాపు మత్స్యేశ్వరు బలము; గుంభ
భవుఁడు ధృష్టద్యుమ్నుపా, లతనికిఁదోడు
పడు ద్రౌపదీ పుత్ర పంచకంబు;
రారాజుఁ దమ్ములు మారుతి పాలు; కు
మారులం దఱు నభిమన్యుపాలు;

శకుని సైంధవులు నశ్వత్థామ కర్ణులు
దక్కొరు చేఁబోని దండిమగలు
ఆ.వె: సవ్యసాచి పాలు; సాత్యకి పాల్కృత
వర్మ; చేకితాన వసుమ తీశు
పాలు సోమదత్తుఁ; డాలంబునకు నిట్లు
నిశ్చయించి రచట నృపవరేణ్య! 229

అ: గంగాసుతుడు = గంగాదేవి కొడుకయిన భీష్ముడు; శిఖండి పాలు = శిఖండి వంతు; అతనికిన్; మత్స్య + ఈశ్వరుబలము =మత్స్యరాజయిన విరాటుని సేన; ప్రాపు= సహాయం; కుంభభవుఁడు = ద్రోణుడు; ధృష్టద్యుమ్ను పాలు; అతనికిన్; ద్రౌపదీ పుత్ర పంచకంబు= ద్రౌపది యొక్క అయిదుగురుపుత్రులూ; తోడుపడున్ = సాయపడతారు; రారాజున్ = దుర్యోధనుడూ; తమ్ములున్ ; మారుతిపాలు =భీమునిపాలు; కుమారులందఱున్=దుర్యోధనాదుల కొడుకులంతా; అభిమన్యుపాలు; శకుని సైంధవులున్; అశ్వత్థామ కర్ణులు; తక్కొరుచేన్ పోని=ఇతరులచే పడని; దండి మగలు = మహావీరులు; (వీరంతా) సవ్యసాచి పాలు = అర్జునుని పాలు; కృతవర్మ సాత్యకి పాలు; సోమదత్తుడు; చేకితాన వసుమతీశుపాలు=చేకితానుడనే రాజు పాలు; నృపవరేణ్య!= రాజా; అచటన్; ఆలంబునకున్ = యుద్ధానికి; ఇట్లు; నిశ్చయించిరి

భా: మహారాజా! భీష్ముడు శిఖండి పాలు, అతనికి విరాటుని సేన సాయం; ద్రోణుడు ధృష్టద్యుమ్నుని పాలు అతనికి ఉపపాండవులు సాయపడతారు; రారాజు, అతని తమ్ములూ భీముని పాలు; కుమారులంతా అభిమన్యుని పాలు; శకునీ, సైంధవుడూ, అశ్వత్థామా, కర్ణుడూ వీరంతా ఇతరుల చేత జయింపబడని వీరులు - వీరంతా అర్జునుని పాలు; కృతవర్మ సాత్యకిపాలు; చేకితానుని పాలు సోమదత్తుడు ఇలా నిశ్చయించారు యుద్ధానికి అక్కడ.

వి: ఈ పద్యంలో మూడవపాదంలో "శకుని సైంధవులు నశ్వత్థామకర్ణులు" అనడం సరిగా కన్పించదు. శకునిని గురించి తరువాతి పద్యంలో చెపుతున్నాడు. అదీగాక మూలంలో అర్జునుని పాలయ్యేవారిలో శకునిమాట లేదు.

"సైంధవ కృపాశ్వత్థామ కర్ణులు" అని మరో పాఠం ఉస్మానియా ప్రతిలో క్రింద ఇచ్చారు అదే సమంజసంగా కనిపిస్తుంది.

క॥ నకులుఁడు సహదేవుండును
శకుని, నులూకాది సుతుల సారస్వతులం,
బ్రకట బలులైన కాళిం
గకులను సమయించువారు కౌరవనాథా! 230

అ: కౌరవనాథా! = ధృతరాష్ట్ర మహారాజా; నకులుఁడు సహదేవుండును; శకునిన్; ఉలూక + ఆది సుతులన్ = ఉలూకుడు మొదలయిన కొడుకులనూ; సారస్వతులన్; ప్రకటబలులు + ఐన = ప్రసిద్ధ బలంకల; కాళింగకులను; సమయించువారు = చంపగలవారు.

భా: *మహారాజా! నకుల, సహదేవులిద్దరూ శకునినీ, ఉలూకాది కుమారులనూ, సారస్వతులనూ, బలిష్ఠులయిన కాళింగకులనూ చంపగలరు.*

వి: ఉలూకుడు : శకుని కుమారుడు

క॥ **కేకయులు మనలఁ గలసిన**
కేకయుల జయించువారు; కృతపుణ్యుఁడు సు
శ్లోకుఁడు ధర్మతనూజుఁడు
లోకోత్తరు శల్యుఁ దాగెలుచు వాఁడధిపా! 231

అ: అధిపా! = రాజా!; కేకయులు; మనలన్ కలసిన కేకయులన్ జయించువారు; కృతపుణ్యుఁడు = పుణ్యాత్ముడు; సుశ్లోకుఁడు =సచ్చరిత్ర కలవాడూ; ధర్మతనూజుడు; లోకోత్తరున్= లోకంలో శ్రేష్ఠుడయిన, శల్యున్ తాను; గెలుచువాఁడు = గెలుస్తాడు.

భా: *కేకయులు మనలో కలిసిన కేకయులను జయిస్తారు. పుణ్యాత్ముడూ, సుచరిత్రుడూ అయిన ధర్మరాజు లోకోత్తరుడయిన శల్యుని గెలుస్తాడు.*

వి: కేకయులు : వీరు పదిమంది అన్నదమ్ములు.
ఇందులో 5 గురు పాండవులుపక్షానచేరారు. 5 గురు కౌరవ పక్షాన చేరారు.

వ: **అట్టి పలుకుల సమయంబున నచ్చోటఁ గొందఱు జనంబులు ధర్మనందను నుద్దేశించి.** 232

భా: *ఆ మాటలు వచ్చిన సమయంలో అక్కడ కొంతమంది ధర్మరాజును దృష్టిలో పెట్టుకొని (ఇలా అన్నారు)*

క॥ **ఇతఁడెక్కడ? మద్రమహీ**
పతి యెక్కడ? నితని కతఁడు పాటియె? యనుడుం
బ్రతి వచనంబుల శల్యుని
యతి బల శౌర్యములు వారి కొతఁడ చెప్పెన్. 233

అ: ఇతఁడు + ఎక్కడ? ఈ ధర్మరాజెక్కడ; మద్రమహీపతి - ఎక్కడ? = శల్యుడెక్కడ; ఇతనికిన్; అతఁడు; పాటియె? = సమానుడా?; అనుడున్ = అంటే; అనగానే; ప్రతి వచనంబులన్= సమాధానంలో; శల్యుని, అతి బల శౌర్యములు = శల్యుని యొక్క బలపరాక్రమాలను గూర్చి; ఆతఁడు + అ = ఆ ధర్మరాజే; వారికిన్; చెప్పెన్.

భా: *ధర్మ రాజెక్కడ? శల్యుడెక్కడ? ధర్మరాజుతో శల్యుడు సమానుడా? అంటే దాని సమాధానంగా ధర్మరాజే వారికి శల్యుని బలపరాక్రమాలు వివరించి చెప్పాడు.*

వి: ఇందులో ధర్మరాజు నిండుదనం ప్రస్ఫుటం చేస్తున్నాడు. శత్రువు యొక్క గొప్పదనాన్ని కూడా కీర్తించగల గాంభీర్యం అతనిది. ఎవరినీ కించపరచని చులకనగా మాట్లాడని ఉదాత్తత అతనిది.

వ: **ఇట్లు గాకయు నెవ్వరి మొగంబున నెవరు వడిరి వారికి వార చాలియుండు**

వారని రివ్విధంబునఁ గ్రొవ్వు మిగిలి కొఱంతలేని తెగువం దేజరిల్లు చున్నవారు; నీకు నీ కొడుకునకు నెయ్యది గర్జంబై తోఁచె నదియ చేయుం డనిన విని విచిత్రవీర్యతనయుం డిట్లనియె. 234

అ: చాలియుండు = తగియుండు/సమర్థులగు; క్రొవ్వు మిగిలి = ధైర్యం కలిగి; బలం కలిగి; కొఱంత = లోటు; తెగువన్ = సాహసంతో; కర్జంబు = కార్యము చేయవలసిన పని; విచిత్ర వీర్యతనయుండు = విచిత్ర వీర్యుని కొడుకు ధృతరాష్ట్రుడు.

భా: ఇలాగే కాకుండా ఎవరి కెవరు ఎదురయినా వారికి వారే ఎదిరింపగల జయింపగల సమర్థులయి ఉంటారు అన్నారు. ఈ విధంగా పాండవ బలం అంతా బలంతో లోటులేని సాహసంతో తేజరిల్లుతూ ఉన్నారు. నీకూ నీ కొడుకుకూ ఏది కర్తవ్యం తోస్తుందో అదే చేయండి. అంటే విని ధృత రాష్ట్రుడు ఇలా అన్నాడు.

క॥ నా కొడుకుల కెక్కడి బ్రదు?
కే కొలఁది దలంప నిప్పు డెన్నిన వీరా
నీకంబు నోర్వ వచ్చునె!
యీ కూడిన సైనికులకు నేమను వాఁడన్? 235

అ: నా కొడుకులకున్; ఎక్కడి బ్రదుకు? = బ్రదుకులేదు; ఏ కొలఁది తలంపన్ = ఏ విధంగా చూసినా; ఈ కూడిన సైనికులకున్ = మనపక్షంలో చేరిన సైనికులకు; ఇప్పుడు-ఎన్నిన వీరానీకంబున్=ఇపుడు చెప్పిన వీరుల సమూహాన్ని; ఓర్వన్-వచ్చునె? = జయింప శక్యముగునా?; ఏమనువాడన్ =ఏం చెప్పను?

భా: నా కొడుకులకు ఇక బ్రతుకులేదు- ఎన్నివిధాల ఆలోచించినా మన పక్షాన చేరిన యీ సైనికులు ఇపుడు నీవు చెప్పిన వీరులను జయింపలేరు- ఏమనాలి!

క॥ రాజు యుధిష్ఠిరుఁడై, హరి
దా జయ మొడఁగూర్ప నున్నఁ, దత్సైన్యము రా
రాజిట్లు సరకు సేయమి;
నా జన్మము దుఃఖభాజనం బగుటఁజుమీ! 236

అ: రాజు; యుధిష్ఠిరుఁడు + ఐ = ధర్మరాజై; హరి - కృష్ణుడు; తాన్; జయము + ఒడగూర్పనున్నన్ = జయం కలిగింప నుండగా; తత్ - సైన్యమున్ = వారి సైన్యాన్ని; రారాజు = దుర్యోధనుడు; ఇట్లు = ఈ విధంగా; సరకు - చేయమి = లెక్క చేయకపోవడమూ; (ఇదంతా); నా జన్మము; దుఃఖభాజనంబు = దుఃఖానికి పాత్రము; అగుటన్ చుమీ!=అవడం చేతనే సుమా!

భా: రాజు ధర్మరాజై హరి అతనికి జయం చేకూర్చడానికి సిద్ధంగా ఉండటం; పాండవసైన్యాన్ని దుర్యోధనుడు లెక్కచేయక పోవడమూ; ఇదంతా నా జన్మ దుఃఖభాజనం కావడం చేతనే సుమా!.

వి: యుధిష్ఠిరుడనే పదం సముచితంగా అన్వర్థంగా ఇక్కడ ప్రయోగింపబడింది.

యుద్ధంలో స్థిరమయిన వాడు అని ఈ పదానికి అర్థం. ధర్మరాజు యుద్ధంలో స్థిరంగా ఉన్నాడని ధృతరాష్ట్రుడు అనడం గమనార్హం.

క॥ నాకుడుప నేల వశమగు?
నీకూడిన భూపతులకు నింతియకాలం
బైకడ చన్నది సంజయ!
నీకీ వగపేల? యింక నిలుపుము పలుకుల్. 237

అ: నాకున్; ఉడుపన్ - ఏల వశమగు? = దుర్యోధనుని మాన్పించడానికి నాకెట్లా శక్యమవుతుంది? కాదు; ఈ కూడిన భూపతులకున్ = ఇచ్చట సహాయం కోసం చేరిన రాజులకు; కాలంబు = జీవితకాలం; ఇంతియ,ఐ, కడచున్నది = ముగిసింది; సంజయ!; నీకున్ - ఈ వగపు ఏల? = నీకీ విచారం ఎందుకు? ఇంకన్; పలుకుల్ నిలుపుము = మాట్లాడకు.

భా: నాకు మాత్రం యుద్ధం మాన్పడం ఎలా శక్యమవుతుంది. ఈ చేరిన రాజులకు మరణం ఆసన్నమయి వస్తోంది. సంజయా! నీకీ విచారం ఎందుకు? ఇక మాట్లాడకు.

వి: చివరకు అట్లా రాసి పెట్టి ఉంది అంటూ కర్మ సిద్ధాంతం వైపు మొగ్గుతున్నాడు.

వ: అనిన విని దుర్యోధనుండు నిజ జనకునితో నిట్లనియె. 238

అ: నిజ జనకుడు = తన తండ్రి

భా: ఆ మాటలు విని దుర్యోధనుడు తన తండ్రితో ఇలా అన్నాడు.

ఉ: ఏమును బాండు నందనులు నేకకులంబునఁ బుట్టి, యొక్కచో
నేమొకఁడైనఁజేసి గెడ నెప్ప చరించిన యట్టి వార ము
ద్దామబలంబు శౌర్యమును దర్పము వారికి గల్గి వార సం
గ్రామము నన్ జయింతు రనఁగా నొక నిశ్చయ మెట్లు గల్గెడున్? 239

అ: ఏమును = మేమూ; పాండునందనులున్ = పాండవులూ; ఏక కులంబునన్ పుట్టి = ఒకే వంశంలో పుట్టి; ఒక్కచోన్ =ఒకేచోట; ఏము = మేము; ఒకఁడైనన్ చేసి = ఏకమయి; గెడన్ = జతగా, ఎప్ప = ఎల్లప్పుడూ; చరించిన యట్టివారము = తిరిగిన వారము; (అట్టిచో) ఉద్దామ బలంబు = అణచరాని బలమూ; శౌర్యమును = పరాక్రమమూ; దర్పము = గర్వమూ; వారిక కల్గి=వారికే కలిగి; వారు+ అ = వారే; సంగ్రామమునన్ = యుద్ధంలో; జయింతురు; అనగా ఒక నిశ్చయము; ఎట్లు కల్గెడున్ = ఎలా కలుగుతుంది?

భా: మేమూ పాండవులూ ఒకే వంశంలో పుట్టాము. ఒకేచోట పెరిగాము. ఏ పనిచేసినా కలిసి జతగా చేశాము. అటువంటప్పుడు "బల పరాక్రమాలూ గర్వమూ వారికే కలుగుతాయి. వారికే యుద్ధంలో జయం సిద్ధిస్తుంది" అనే నిశ్చయం ఎలా కలుగుతుంది?

వి: యుద్ధంలో జయం పాండవులకే కలుగుతుందనే నిశ్చయంలేదు. ఎవరికయినా జయం కలగవచ్చునని దుర్యోధనుని భావం.

ఉ: వారిని వారివారి నిటు వర్ణన సేసెదు గాని, మమ్ము మా
వారిఁ దలంప? విప్పుడమి వారికిఁ బాయను, మాకు నంతయుం
జేరన మున్ సృజించె విధి; సిద్ధము, దీని నొకండు మాన్పఁగా
నేరఁ; డకారణంబ మది నెవ్వగ లేటికిఁ బట్టుకొల్పఁగన్? 240

అ: వారిని; వారివారిని; ఇటు; వర్ణన - చేసెదు కాని = వర్ణన చేస్తావు కాని; మమ్మున్; మా వారిన్; తలంపవు = లెక్కింపవు; మున్ = పూర్వమే; విధి = బ్రహ్మ; ఈ +పుడమి = ఈ భూమి; వారికిన్ పాయను=వారి నుండి తొలగటానికి; మాకున్; అంతయున్ చేరను= మాకే అంతా చెందాలనీ; సృజించె = సృష్టించాడు; రాసిపెట్టాడు; సిద్ధము = సత్యము; దీనిన్; ఒకండు= ఎవ్వడూ; మాన్పఁగా నేరడు = తప్పింపలేడు; పట్టు కొల్పఁగన్=కల్పించుకోవడానికి; అకారణంబ = నిష్కారణంగా; మదిన్ = మనస్సులో; నెవ్వగలు - ఏటికి? నిండు దుఃఖాలు ఎందుకు నిండు విచారం ఎందుకు?

భా: పాండవులనూ వారి సైన్యాన్ని వర్ణిస్తావు కాని మమ్మల్నీ మా సైన్యాలనూ లెక్కించవేం? ఈ భూమి వారికి లేకుండా విడవటానికీ, అంతా మాకే చెందటానికీ బ్రహ్మపూర్వం సృష్టించాడు. ఇది తథ్యం; దీని నెవ్వరూ తప్పింపలేరు. అనవసరంగా లేనిపోని విచారం చెందకు.

వ: అనిన విని సూతనందనునకు నంబికానందనుం డిట్లను, నాకొడు కున్మత్త ప్రలాపంబులు సేయుచున్నవాఁ, డింతియ కాని సత్య ధర్మనయ పరాక్రమ సహాయ సంపన్నులైన పాండవులఁ దనకు గెలువ వచ్చునే? తాను బ్రబలుం డయినను బెనఁకువ గీడ కాక మేలగునే? యది యట్లుండె; నొక్కటి యడిగెద సంజయా! చెప్పుము. 241

అ: సూతనందనుఁడు = సంజయుడు; అంబికానందనుడు = ధృతరాష్ట్రుడు; ఉన్మత్త ప్రలాపంబులు = పిచ్చి ప్రేలాపనలు; సత్య, ధర్మ, నయ పరాక్రమ సహాయ సంపన్నులు = సత్యము, ధర్మము, నీతి, పరాక్రమము, సహాయము అనే సంపదలు కలవారు. పెనఁకువ = యుద్ధం; కీడు + అ = చేటు.

భా: ఆ మాటలు విని సంజయునితో ధృతరాష్ట్రుడిలా అన్నాడు. నా కుమారుడు పిచ్చి మాటలు మాట్లాడుతున్నాడు. అంతేకాని సత్యమూ, ధర్మమూ, నీతి పరాక్రమమూ, సహాయమూ కల పాండవులను తాను గెలవగలడా? తాను బలవంతుడయినా యుద్ధం వల్ల చేటే కలుగుతుంది కాని మేలు కలుగుతుందా? అది అట్లా ఉంచు. ఒక్కమాట అడుగుతా సంజయా! చెప్పు.

క॥ సమరమునకుఁ బురి కొల్పుచు
మముఁ దలఁచిన నుల్లికుట్టు మాటలఁ దచ్చి
త్రము లుడికించుచుఁ బాండవ
సమితిం గడఁగించు వారచట నెవ్వరొకో! 242

అ: సమరమునకున్ = యుద్ధానికి; పురికొల్పుచున్; మమున్ తలచినన్ = మమ్మల్ని తలంచుకొన్నంతలో; ఉల్లికుట్టు మాటలన్=ఎత్తి పొడుపు, ప్రేరణ కల మాటలతో, తత్+చిత్తములు= వారి మనస్సులు; ఉడికించుచున్ = ఉడికిస్తూ; పాండవ సమితిన్ = పాండవుల సముదాయాన్ని; కడగించువారు = ప్రేరేపించువారు; అచట = ఆ పాండవ పక్షంలో; ఎవ్వరు - ఒకో = ఎవరో?

భా: *మమ్మల్ని తలచుకొన్నంతలోనే యుద్ధానికి పురికొల్పుతూ ఎత్తిపొడుపు మాటలతో వారి మనస్సులను ఉడికిస్తూ పాండవులను ప్రేరేపించే వారు అక్కడ ఎవరున్నారు?*

క॥ **నావుడు సంజయుఁ డిట్లను**
దేవా! పాండవుల యలుక ధృష్టద్యుమ్నుం
డే వెరవు మాటనైనను
నేవోసిన యగ్ని భంగి నిగుడం జేయున్. 243

అ: నావుడు = అనగానే; సంజయుఁడు; ఇట్లు - అను; దేవా!; పాండవుల అలుకన్= పాండవుల కోపాన్ని; ధృష్టద్యుమ్నుండు; ఏ వెరవు మాటన్ +ఐనను=ఏదో ఒక ఉపాయపు మాటతో; నే వోసిన యగ్ని భంగిన్ = నేయిపోసిన అగ్నిలాగా; నిగుడన్ చేయున్ = ప్రజ్వరిల్ల చేస్తాడు.

భా: *అపుడు సంజయుడిలా అన్నాడు. దేవా! అక్కడి ధృష్టద్యుమ్నుడు పాండవుల కోపాన్ని ఏదో విధంగా మాట్లాడి నేయిపోసిన అగ్నిలాగా మండింప జేస్తాడు.*

వి: అలంకారం ఉపమ.

వ: **అతండు ధర్మతనయుతో నిట్లను, "గాంగేయ కుంభసంభవాది మహా వీర క్రూర సత్త్వ బహుళంబును, గరిఘటా గిరికదంబ కలితంబును, దురంగ నికర తరంగ పరంపరా ఘోరంబునగు కౌరవసేనా సముద్రంబునకు నేనొక్క చెలియలి కట్టనై నిలిచెద", ననవుడు నయ్యుధిష్ఠిరుండు "నీవింతకుఁజాలుట యెవ్వరు నెఱుంగరే? యెట్లును సంగరంబున మమ్ముద్ధరింపు" మనియె నిట్లు గొనియాడిన, నాతండు నాదెసం గనుంగొని, "సంజయా! మీ వారల కెల్లనుం దెలియం జెప్పు "మీశ్వరాది దేవతలు సమకట్టిన సవరణ గల యర్జునుచేత నిర్జింపఁ బడిన యుత్కృష్ట జాతు లనేకులగుట యెఱుంగుదుర కాదె! మనుష్యు లతని కెంత పెద్ద? యిట్టి జెట్టి వెనుఁదన్ని చూడఁగలవాఁడు గావున మము బోంట్లెల్లఁ బోక పెనంగినం బోరు భరంబైనం బ్రాణంబులపై వచ్చు; నంతకంటెను బరమదయా పరుండైన పాండవాగ్రజు మఱువు సొచ్చి బ్రదుకుండను; మంతలంతలు దప్పులు సేసితి మని తలంక వలవ; దెంతలు సేసినను గౌంతేయ పూర్వజుండు శాంతి సుధానిధి యగుటం జేసి శరణు సొచ్చినం గాచు" నని పలికె నని విని ధృతరాష్ట్రుండు దుర్యోధనున కిట్లనియె.** 244

అ: గాంగేయ కుంభ సంభవ + ఆది మహావీర క్రూర సత్త్వబహుళంబు = భీష్ముడు, ద్రోణుడు మొదలయిన మహావీరులనే క్రూర జంతువులనేకం కలిగినది; కరిఘటా గిరి కదంబ కలితంబును = ఏనుగుల గుంపు అనే పర్వత సముదాయంతో కూడినది; తురంగ నికర తరంగ పరంపరా ఘోరంబు = గుర్రాల సముదాయం అనే కెరటాల పరంపర చేత భయంకర మయినది; కౌరవ సేనా సముద్రంబు=కౌరవ సైన్యం అనే సముద్రం; ఎట్లును=ఏవిధంగానయినా; సవరణ= యుద్ధసాధనం; జెట్టి =వీరుడు; తలంక వలవదు = భయపడవద్దు సంకోచింపవద్దు; కౌంతేయ పూర్వజుండు = కుంతీపుత్రులలో పెద్దవాడు; శాంతి సుధానిధి = శాంతి అనే అమృతానికి నిధి.

భా: *ధృష్టద్యుమ్నుడు ధర్మరాజుతో ఇలా అన్నాడు. "భీష్ముడు ద్రోణుడు మొదలయిన వీరులనే క్రూర జంతువులతో నిండినదీ, ఏనుగుల సముదాయం అనే పర్వతాలు కలిగినదీ, గుర్రాల గుంపు అనే కెరటాల పరంపర కలిగినదీ అయిన కౌరవసేనా సముద్రానికి నేను చెలియలి కట్టగా నిలుస్తాను" అంటే ధర్మరాజు "నీ వింతకు తగుదువు అని ఎవరికి తెలియదు? ఏదో విధంగా యుద్ధంలో మమ్మల్ని ఉద్ధరించు" అన్నాడు. అపుడు ధృష్టద్యుమ్నుడు నావైపు చూసి "సంజయా! మీవారందరికీ తెలియజెప్పు. ఈశ్వరాది దేవతలు ఇచ్చిన యుద్ధ పరికరాలు కల అర్జునుని చేత జయింపబడిన దేవజాతు లెంతమంది యున్నారో తెలుసుకదా! ఇక మనుష్యులెంత అతనికి? ఇట్టి వీరుడు వెనుక ఉండగా మావంటివారు రాకపోయినా యుద్ధం చాలా భారమై ప్రాణాల మీదకు వస్తుంది. అంతకంటె దయాశాలి అయిన ధర్మరాజు శరణు సొచ్చి బ్రతికి పొమ్మను. పెద్ద పెద్ద తప్పులు చేశామని భయపడవద్దు. ఎంత తప్పులు చేసినా ధర్మరాజు శాంతి పరుడు కావడం చేత అతనిని శరణు వేడితే రక్షిస్తాడు" అని అన్నాడు. ఆ మాటలు విని ధృతరాష్ట్రుడు దుర్యోధనునితో ఇలా అన్నాడు.*

క॥ **పరిజనులకు నీకును ని**
ద్ధరలోన సగంబు సాలుఁ; దక్కటి సగముం
గర ముచితంబుగఁ బాండవ
వరుఁడగు ధర్మజున కిచ్చి బ్రదుకుము నెమ్మిన్. 245

అ: పరిజనులకున్ = సేవకులకూ; నీకును; ఈ +ధరలోన=ఈ భూమిలో; సగంబు- చాలున్; తక్కటి = తక్కిన; సగమున్; కరము + ఉచితంబుగన్ = మిక్కిలి తగినట్లు; పాండవ వరుండు+అగు=పాండవులలో శ్రేష్ఠుడయిన; ధర్మజునకున్; ఇచ్చి; నెమ్మిన్ = సుఖంగా; బ్రదుకుము.

భా: *నీకూ నీ వారికీ ఈ(భూమిలో) రాజ్యంలో సగంచాలు. మిగిలిన సగమూ ధర్మరాజుకిచ్చి సుఖంగా బ్రదుకు.*

-: ధృతరాష్ట్రుడు దుర్యోధనునితో సంధిసేయుమని సెప్పుట :-
సం. 5-57-4

చ॥ పెనకువ నాకయేల మనపెద్దల కెవ్వరి కియ్యకోలుగా,
దనుచిత వృత్తి గాన గురుఁడాదిగ నాప్తులు బంధు మిత్రులున్
గొనకొని పోరికిం జొరరు; రకుంఠిత తేజుఁడు ధర్మపుత్రుఁ డా
తనిఁ దగఁ గూడి మన్కి ప్రమదంబగుఁ గౌరవజాతి కెంతయున్. 246

అ: పెనకువ = యుద్ధం; నాకు + అ + ఏల? = నాకే ఏమిటి; మన పెద్దలకు ఎవ్వరికిన్; ఇయ్యకోలుకాదు=ఇష్టంకాదు; అనుచిత వృత్తి=తగని ప్రవర్తన అది; కాన= అందుచేతనే; గురుఁడు ఆదిగన్=ద్రోణుడు మొదలయిన; ఆప్తులు=కావలసినవారు/హితులు; బంధు మిత్రులున్= చుట్టాలూస్నేహితులూ; గొనకొని=పూనుకొని; పోరికిన్ చొరరు=యుద్ధానికి ఒప్పుకోరు; ధర్మపుత్రుఁడు; అకుంఠిత తేజుఁడు =మొక్కవోని తేజస్సు కలవాడు; తగన్ ఆతనిన్ కూడి మన్కి= అతనితో కలిసి జీవించడం; కౌరవ జాతికిన్ ఎంతయున్ ప్రమదంబగున్ = కౌరవులందరికీ ఎంతో సంతోషం కలుగుతుంది.

భా: యుద్ధం నాకేకాదు మన పెద్దలెవరికీ ఇష్టం కాదు. అది తగని ప్రవర్తన. అందుచేతనే ద్రోణాదిహితులూ బంధువులూ మిత్రులూ యుద్ధం వద్దంటారు. ధర్మరాజు మహాతేజస్వి. అతనితో కలిసి జీవిస్తే కౌరవ జాతి కంతకూ సంతోషం కలుగుతుంది. శుభం కలుగుతుంది.

వ: అని వెండియు. 247

భా: అని ఇంకా...........

క॥ కర్ణుండు రేఁచి పెట్టఁగ
దుర్ణయ పరులైన శకుని దుశ్శాసను లీ
నిర్ణయమె మేలనఁగ నీ
కర్ణములకు నించు నెట్లు కార్యవచనముల్? 248

అ: కర్ణుండు; రేఁచి పెట్టఁగన్ = ప్రేరేపించి/పురికొల్పితే; దుర్ణయపరులు - ఐన = దుర్నీతివర్తనులయిన; శకుని దుశ్శాసనులు; ఈ నిర్ణయమె; మేలు అనగన్=మంచిదంటూ ఉంటే; కార్యవచనముల్ = కర్తవ్యపు పలుకులు; నీ కర్ణములకున్ = నీ చెవులకు; ఇంచున్ ఎట్లు?= ఎట్లా నచ్చుతాయి?

భా: కర్ణుడు పురికొల్పిపెడితే దుర్నీతి పరులయిన శకుని దుశ్శాసనులు ఈ నిర్ణయమే మంచిదంటూ ఉంటే కర్తవ్యమునకు సంబంధించిన ఈహిత వచనాలు నీకు ఎలా ఇష్టమవుతాయి?

వ: అనినఁ గటకటంబడి సుయోధనుం డిట్లనియె. 249

అ: కటకటంబడి = కోపపడి

భా: తండ్రి మాటలకు కోపించి దుర్యోధనుడిలా అన్నాడు.

క॥ **నీచెప్పెడి పెద్దలు ద్రో**
ణాచార్యులు మొదలుగాఁగ నని కొల్లని వా
రై చేరని వారింగొని
యే చక్కంబెట్టు వాఁడ నేఁ బాండవులన్? 250

అ: నీ చెప్పెడి పెద్దలు = నీవు చెప్పే పెద్దలు; ద్రోణాచార్యులు మొదలుగాఁగన్; అనికిన్ ఒల్లనివారై = యుద్ధానికి ఇష్టపడిని వారు కాగా; (అటువంటి) చేరని వారిన్‌కొనియె? = దగ్గరకు రాని వారిని సాయం చేసుకొనియా? ఏన్ = నేను; పాండవులన్; చక్కం బెట్టువాడన్?= జయిస్తాను?

భా: *నీవు చెప్పే ద్రోణాదులయిన పెద్దలు యుద్ధానికి ఇష్టపడరు. యుద్ధానికి సమీపానికి రాని వీరిని పెట్టుకొనా నేను పాండవులను జయించేది?*

వి: దుర్యోధనున కిష్టం లేని ద్రోణాదులకూ పాండవులకూ ఒక్క విశేషణమయినా వేయకుండా చిన్న కంద పద్యం దుర్యోధనుని చేత చెప్పించడం ఒక విధమయిన ఔచితీ శిల్పం. తన కిష్టమయిన వారిని గూర్చి శార్దూలం చెప్పడమూ అంతే.

శా: **రాధేయుండును దుస్ససేనుఁడును బోరం బ్రాపుగాఁ బాండవ**
క్రోధ జ్వాలల నార్తు; నొండొకఁడు నాకుం దోడె?; నీవింక నన్
బాధం బెట్టకు, వాఁడి సూదిమొన మోవం జాలు నంతైన నే
నీ ధాత్రీతల మీను వారలకు, నాకేలింతసేగిం బడన్? 251

అ: రాధేయుండును = కర్ణుడూ; దుస్ససేనుఁడును = దుశ్శాసనుడూ; పోరన్ = యుద్ధంలో; ప్రాపుగాన్ = సాయపడగా; పాండవక్రోధజ్వాలలన్=పాండవుల కోపం అనే మంటలను; ఆర్తున్ =ఆర్పుతాను; ఒండొకడు = మరొకడు; నాకున్‌తోడె? = నాకు సాయమా?; నీవు; ఇంకన్; నన్ = నన్ను; బాధంబెట్టకు; వాడి సూదిమొన; మోవంజాలు నంత + ఐన = మోపగల్గినంతయినా; ఈధాత్రీతలము = ఈ భూమిని, ఏను = నేను; వారలకు; ఈను = ఇవ్వను; ఇంత సేగింబడన్= ఇంత విచారపడవలసిన పని; నాకేల? = నాకెందుకు?

భా: *కర్ణుడూ దుశ్శాసనుడూ యుద్ధంలో నాకు సాయపడగా నేను పాండవుల క్రోధాగ్నిని ఆర్పుతాను. నాకు మరొకడు సాయమా? (అవసరం లేదని భావం)నీవు ఇక అనవసరంగా నన్ను బాధించకు; వాడి సూది మొన మోపినంతయినా భూమిని నేను వారి కివ్వను. నా కెందుకింక విచారం?*

వ: **అనిన గాంధారీ వల్లభుం డతని కిట్లనియె.** 252

భా: ఆ మాటలకు ధృతరాష్ట్రుడిలా అన్నాడు.

ఆ: **నీకు నంతవగవ; నీపోవు తెరువునఁ**
బోవువారు గాఁగఁ బూని యున్న
వారి కెల్ల నేను వగచెదఁ; గయ్యంబు
వలవ దుడుగు మయ్య చలము గొనక. 253

అ: నీకున్ అంత వగవన్ = నీకోసం అంత బాధపడను; నీ పోవు తెరువునన్ = నీవు వెళ్ళే మార్గంలో; పోవువారు కాఁగన్ = వెళ్లేవారుగా; పూనియున్న వారికిన్ =సిద్ధమయి ఉన్న వారికి; ఎల్లన్ =అందరికీ; ఏను వగచెదన్ = నేను బాధపడుతున్నాను; కయ్యంబు వలవదు = యుద్ధం వద్దు పనికిరాదు; చలము గొనక =పట్టుదల వహింపక; ఉడుగుము అయ్య! = (యుద్ధం) విడిచిపెట్టు.

భా: నీ కోసం నేనంతగా బాధపడను. నీ మార్గంలో, నడిచి నశించే వారికోసం నేను బాధపడుతున్నాను. యుద్ధం పనికిరానిది - వద్దు - పట్టుదల వహించక యుద్ధ ప్రయత్నం వదలిపెట్టు.

వి: 'నీ కోసం కాదు నేను బాధపడేది' అనడంలో కొంత విసుగు చిరాకు కన్పిస్తుంది ధృతరాష్ట్రునిలో. నీ వెట్లాగూ నశించిపోయె వాడివే, ఎన్ని చెప్పినా వినవు. కాకపోతే అమాయకంగా నీపక్షం వహించినవారి కోసం నా బాధ అనడం సముచితంగా ఉంది

చ॥ **ఉభయ బలంబులుం బొగడ నుగ్రత భీముఁడు విస్ఫురద్గదన్**
రభస మెలర్పఁ గుంభములు వ్రయ్యఁగ వ్రేసిన నెత్తు రొల్కఁగా
నిభముల పిండు గావి సెలయేఱుల తోడి నగంబులట్లు సం
క్షుభితములై పయిం బఱవఁ జూచి తలంచెదు నాదు వాక్యముల్.254

అ: ఉభయ బలంబులున్ = ఇరువురి సైన్యాలు; పొగడన్ = ప్రశంసించేటట్లు; ఉగ్రతన్=భయంకరంగా; రభసము + ఎలర్పన్=వేగంతో; భీముఁడు; విస్ఫురత్ - గదన్ = జ్వలించే గదతో; కుంభములు వ్రయ్యఁగన్ = కుంభస్థలాలు చీలిపోయేటట్లు; వ్రేసినన్ = కొట్టితే; నెత్తురొల్కఁగన్, ఇభముల పిండు =ఏనుగుల సముదాయం; కావి సెలయేఱుల తోడి = ఎఱ్ఱని సెలయేరులతో కూడిన; నగంబులట్లు = పర్వతాల వలె; సంక్షుభితములై పయిన్ పఱవన్ = కలత చెంది పారిపోగా; చూచి; నాదు వాక్యముల్ = నామాటలు; తలంచెదు = తలుస్తావు.

భా: ఇరుపక్షాల వారూ పొగడేటట్లు వేగంగా భయంకరంగా భీముడు కుంభస్థలాలు బ్రద్దలయ్యేటట్లు గదతో కొడితే ఏనుగులు నెత్తురులు ప్రవహిస్తూ ఎఱ్ఱటి సెలయేరులతో కూడిన పర్వతాల వలె ఉండి కలత చెంది పారిపోతే అపుడయినా నా మాటలు తలచుకొంటావు.

వి: *1.* నెత్తురులు కారుతున్న ఏనుగులు - ఎఱ్ఱని సెలయేరులు ప్రవహిస్తున్న పర్వతాల వలె పోల్చబడ్డాయి. చక్కని ఉపమాలంకారం.

2. పరాక్రమవంతుని బలాన్ని శత్రుపక్షాలు కూడా కీర్తిస్తాయి. అందుకే "ఉభయ బలంబులుం బొగడ" అన్నాడు.

3. భయంతో అయినా వింటాడని ధృతరాష్ట్రుని అభిప్రాయం.

చ॥ **ఉఱక ధనంజయుండు వివిధోగ్రశరంబుల నొక్కమాత్ర నే**
డ్తెఱ నుఱుమాడినం, బుడమిఁ ద్రెళ్లిన నీదగు సైన్య మంతయున్
నఱికినఁ బడ్డ ఘోర విపినంబు విధంబున నున్నఁ జూచి య
త్తఱి నయినం దలంచె దుచితంబగు నావచనంబుఁ బుత్రకా! 255

అ: పుత్రకా! = కుమారా!; ఉఱక = తేలికగా; ధనంజయుండు = అర్జునుడు; వివిధ+ ఉగ్రశరంబులన్ = ఎన్నో భయంకర అస్త్రాలతో; ఒక్క మాత్రన్ = ఒక్కుమ్మడిగా; ఒక్క క్షణంలో; ఏడ్తెఱన్=విజృంభణతో; ఉఱుమాడినన్ = నరికివేస్తే; పుడమిన్ = భూమిపై; త్రెళ్లిన = పడిన; నీ దగు సైన్యము అంతయున్ = నీ సేన అంతా; నఱికినన్ = నరికితే; పడ్డ = పడిపోయిన; ఘోర విపినంబు విధంబునన్ ఉన్నన్=భయంకరమయిన అడవి వలె ఉంటే; చూచి; అత్తఱిన్ అయినన్= అపుడయినా; ఉచితంబగు = తగిన; నా వచనంబున్ = నా మాటను; తలంచెదు = తలుస్తావు- తలచుకొంటావు.

భా: *కుమారా! అర్జునుడు వివిధాస్త్రాలతో ఒక్క క్షణంలో మన బలాన్నంతనూ నరికివేస్తే నేలగూలిన నీ సైన్యం అంతా నరికితే పడిపోయిన అడవిలాగా ఉంటే చూసి అపుడయినా నా మంచి మాటలు తలచుకొంటావు.*

వ: **అనిపలికి యతని వలనం బలుకు గానక మనంబు మరలం బెట్టుకొని,"కొడుకులు జయింప నోపుదురొకో" యను నాస సంజయు దిక్కు మొగంబు సేసి పాండవ కౌరవ పక్షంబులంగల వారి నడుగుచుం గొలందులు దలపోయుచు నాతని వచనంబులను దన విచారంబులను బలాబలంబులు నిశ్చయించి పాండవేయు లెక్కుడవుట యెఱుంగుచుఁ గ్రమ్మఱ నాసూతపుత్రుతో లెక్కలు వెట్టుచుం బోలించుచుఁ బెద్ద ప్రొద్దు వితర్కించి కౌంతేయుల శక్తి దేవశక్తియు గాంధారేయుల శక్తి మనుష్య శక్తియుంగాఁ దెలిసిన వాఁడై యంబికా నందనుండు నిజ నందనునితో నిట్లనియె.** 256

అ: పలుకు గానక = సమాధానం రాక; మరలం బెట్టుకొని=మరలించుకొని; కొలందులు = శక్తులు; క్రమ్మఱ = తిరిగి/మళ్ళీ; సూతపుత్రుతో = సంజయునితో; పోలించుచున్= పోల్చుకొంటూ; పెద్దప్రొద్దు=చాలసేపు; వితర్కించి=ఆలోచించి; కౌంతేయులు=కుంతీ కుమారులు; గాంధారేయులు = గాంధారిపుత్రులు; అంబికానందనుండు = అంబిక కొడుకు ధృతరాష్ట్రుడు.

భా: *అని చెప్పి దుర్యోధనుడు ఏమీ మాట్లాడక పోతే మనస్సు మరల్చుకొని ధృతరాష్ట్రుడు "ఒకవేళ తన కొడుకులు జయించగలరేమో!" అనే ఆశతో సంజయుని వైపు మొగంపెట్టి పాండవ పక్షంలోనూ కౌరవ పక్షంలోనూ ఉన్న వారిని గురించి అడుగుతూ వారివారి శక్తులు ఊహించుకొంటూ అతని మాటలతోనూ తన ఆలోచనతోనూ బలాబలాలు నిశ్చయించి పాండవులశక్తి ఎక్కువ అని తెలుసుకొని, మళ్లీ సంజయునితో లెక్కలు వేస్తూ పోల్చుకొంటూ చాలాసేపు ఆలోచించి పాండవుల శక్తి దేవశక్తి, కౌరవుల శక్తి మనుష్యశక్తి అని తెలుసుకొని ధృతరాష్ట్రుడు తన కొడుకుతో ఇలా అన్నాడు.*

క: నరుఁ డగ్నిదేవుఁ దనకును
వరదునిఁగాఁ గొలిచినాఁడు, వానికిఁగేతు
స్ఫురణం బాదిగఁ గల సం
గర పరికరమెల్ల నతఁడు గావించె దయన్. 257

అ: నరుఁడు = అర్జునుడు; తనకు వరదునిఁగాన్ = తనకు వరములిచ్చే వానిగా; అగ్నిదేవున్; కొలిచినాడు; వానికిన్; కేతు స్ఫురణంబు + ఆదిగన్ = జెండా కలగడం మొదలుగా; కల; సంగర పరికరము - ఎల్లన్ = యుద్ధ పరికరాలు అన్నీ; దయన్ = దయతో; అతఁడు = అగ్ని; కావించెన్ = కల్పించాడు - ఇచ్చాడు.

భా: అర్జునుడు తనకు వరదునిగా అగ్నిని కొలిచాడు. అతనికి జెండా మొ॥ యుద్ధ సాధనాలన్నీ దయతో అగ్నియే కల్పించాడు.

వి: అర్జునునికి రథం అగ్నిహోత్రుడిచ్చాడు. విల్లు గాండీవం - అదీ అతడే ఇచ్చాడు. ఇవి ఖాండవ దహన సమయంలో ఇచ్చాడు. కిరీటం మాత్రం ఇంద్రుడు నివాత కవచులను చంపినపుడు ఇచ్చాడు. అగ్నిహోత్రుడే ఖాండవ దహన సమయంలో అర్జునునికి అక్షయ తూణీరాలు ఇచ్చాడు.

అపుడే కృష్ణుడికి సుదర్శన చక్రమూ, కౌమోదకి అనే గద ఇచ్చాడు.

చూ ఆది 8-252, 53, 54.

వ: అదియునుం గాక ధర్మదేవతయు, వాయుదేవుండును, వాసవుండును, నాశ్వినులును వారలకుఁ బాండురాజు తోడి వారలు వారినొక కీడునం బొరయకుండ రక్షింతురు గావున భీష్మద్రోణ ప్రముఖులకుఁ బాండవులఁ బరిభవింపరామి దెల్లంబు. 258

అ: ధర్మదేవత = యముడు; వాసవుండు = ఇంద్రుడు; ఆశ్వినులు = అశ్వినీ దేవతలు. పొరయకుండ = పొందకుండా; తెల్లంబు = స్పష్టం.

భా: అదీగాక యముడూ, వాయువూ, ఇంద్రుడూ, అశ్వినీ దేవతలూ వారికి పాండురాజుతో సమానులు. పాండవులకు ఏ కీడు రాకుండా వారు రక్షిస్తారు. అందుచేత భీష్ముడు ద్రోణుడు మొదలయినవారు పాండవులను పరాభవింప లే రనేది స్పష్టం.

వి: యముని వరంతో ధర్మరాజూ, వాయువువరంతో భీముడూ, ఇంద్రవరంతో అర్జునుడూ, అశ్వినీ దేవతల వల్ల నకుల సహదేవులూ పుట్టారు.

**క॥ దేవత లేటికిఁ? బార్థుఁడు
దేవ సముఁడు గాఁడె! వాఁడు దివిజుల చేతం
బోవని దైత్యులఁ జంపఁడె!
యీవును నీవారు నతని నెఱుఁగరె చెపుమా!** 259

అ: దేవతలు - ఏటికి?=దేవత లెందుకు?; పార్థుఁడున్=అర్జునుడు కూడా; దేవ సముఁడు - కాడె! = దేవతలతో సమానుడు కాడె? ; వాఁడు = అర్జునుడు; దివిజుల చేతన్ పోవని = దేవతల చేత కూడ సాధ్యులు కాని; దైత్యులన్ = రాక్షసులను; చంపఁడె! = చంపలేదా!; ఈవును = నీవూ; నీ వారున్; అతనిన్; ఎఱుఁగరె?; చెపుమా! = చెప్పుము.

భా: *దేవత లెందుకు? అతడే దేవతలతో సమానుడు కాడా! దేవతలు కూడా చంపలేని రాక్షసులను అర్జునుడు చంపలేదా. అర్జునుని నీవెఱుగవా? నీవారెరుగరా? చెప్పు.*

వి: ఇంద్రునకు కూడ సాధ్యులు కాని నివాతకవచ కాలకేయాదులను అర్జునుడు సంహరించాడు. అరణ్య. 4. ఆ. 59 ప నుండి 87 వ. వరకు

వ: కౌరవులకు వచ్చిన యిమ్మహాభయంబునకుఁబ్రతీకారంబు శాంతిం గడచినయది లే దెన్నిభంగులఁ జూచినఁ గయ్యం బుడుగుటయ మనకుం గర్తవ్యం బై యున్నయది, యుపశమింప వయ్య దీర్ఘవైరంబు వలవ దనినఁదండ్రికిఁ గొడు కిట్లనియె. 260

అ: కడచినయది = మించినది; కయ్యంబు = కలహం; యుద్ధం; ఉడుగుటయ= విడిచిపెట్టడమే; కర్తవ్యము = చేయదగిన పని;

భా: *కౌరవులకు కలిగిన ఈ మహాభయానికి ప్రతీకారం శాంతిని మించి మరొకటిలేదు. ఎన్ని విధాల చూసినా యుద్ధం విడవటమే మనం చేయదగిన పని - నీవు ఉపశమించు -దీర్ఘవైరం పనికిరాదు" అంటే అపుడు తండ్రితో దుర్యోధనుడు ఇలా అన్నాడు.*

కII దేవత లర్జుననకుఁదో
డై వత్తురనంగ వలవ, దది యెట్లనినన్,
దేవత్వము రాగద్వే
షావేశము లేమిఁ గాదె యైనది మొదలన్. 261

అ: దేవతలు; అర్జుననకున్; తోడై; వత్తురు; అనంగవలవదు = అనవద్దు; అది ఎట్లు అనినన్; మొదలన్ = మొదట్లో; దేవత్వము; రాగద్వేష + ఆవేశము=రాగద్వేషాలు పొందడం; లేమిన్ = లేకపోవడం చేతనే; కాదె ఐనది = కదా కలిగింది.

భా: *దేవతలు అర్జుననకు సహాయంగా వస్తారని అనవద్దు. ఎందుచేతనంటే అసలా దేవత్వం అనేది రాగద్వేషాలు లేకపోవడం వల్లనే కదా సంక్రమించింది.*

వ: కావున వారొకళ్ల వారుం గా, రట్లుంగాక పక్షపాతులై పూని వత్తురయేని నది దేవత్వంబుగా, దట్టి దేవత్వంబున నర్జునుండును సురక్షితుండు గానేరఁడు; నీకు నాపనికిఁ జింత వలవ దని పలికి వెండియు నిట్లనుఁ, బెఱిగి వచ్చు కార్చిచ్చు నుడుపను, బాషాణ వర్షంబు వారింపను, మహా వాయువు నిలుపను, నీళ్లు గట్టిగా నభిమంత్రించి వానిపైఁ గరితురగాదుల నడిపింపను, నాసేన నడచు నప్పుడు వలసిన చోట జలంబు లుత్పాదింపను జాలుదు; సింహ శరభశార్దూల భూతభేతాళాది క్రూర సత్త్వ సంరంభ స్తంభన ప్రకారం బెఱుంగుదు; మిత్ర శత్రు విషయంబులైన శుభాశుభంబులు వలయు భంగి నావహింప నేర్తు; మఱియు నానావిధ సిద్ధి ప్రదంబులగు మంత్ర ధ్యానాద్య నుష్ఠానంబుల నాకుం గొఱంత లేదు; నీ చెప్పిన యగ్ని ప్రముఖ దేవతలం బ్రసన్నులగు నట్లుగా నారాధించిన వాఁడ; వారికి నాకుంబోలె మహానుభావంబు గలిగినఁ బదుమూఁడు వత్సరంబు లబ్భంగి నిడుమలం బడుదురె? వినుము చెప్పెద. 262

అ: చింత వలవదు=విచారం వద్దు; కార్చిచ్చు=అడవిలో పుట్టే దావానలం;ఉడుపను= నివారించటానికి; పాషాణ వర్షంబు = రాళ్లవాన; కరితురగాదులు = ఏనుగులు గుర్రాలు మొదల- యినవి; ఉత్పాదించు = పుట్టించు; సత్త్వము = జంతువు; స్తంభనము = నిలబెట్టు కదలకుండ జేయు; ధ్యాన + ఆది + అనుష్ఠానంబులు = ధ్యానము మొదలయిన ఆచరణములు; కొఱంత= లోటు; అగ్ని ప్రముఖులు =అగ్ని మొదలయిన వారు; ఆ+భంగిన్=అవిధంగా; ఇడుమలు=కష్టాలు;

భా: *అందుచేత దేవతలు ఒకే పక్షానికి చెందినవారు కారు. అలా కాక వారు పక్షపాతంతో వస్తే అది దేవత్వమే కాదు. అటువంటి దేవత్వం చేత అర్జునుడు రక్షింపబడలేడు. నన్నుగురించి, నా పని గురించి నీవు విచారించవద్దు అని ఇంకా ఇలా అన్నాడు. వ్యాపించే దావానలాన్ని నిలుపగలను; రాళ్ళ వానను నివారించగలను; ఝంఝూ మారుతాన్ని నిలపగలను; నీళ్లను గట్టిపడేటట్లు మంత్రించి దాని మీద ఏనుగులనూ గుర్రాలనూ నడిపించగలను. నాసేన నడచివెళ్లేటప్పుడు కావలసిన చోట నీళ్లు పుట్టించగలను. సింహాలు, శరభాలు, శార్దూలాలు; (పెద్దపులులు) భూత భేతాళాది క్రూరమృగాల సంరంభాన్ని స్తంభింపజేసే పద్ధతి ఎరుగుదును. మిత్రులకు శుభాలు, శత్రువులకు అశుభాలు కలిగించే తీరు తెలుసు; ఇంకా అనేక విధాలయిన మంత్రాల ధ్యానానుష్ఠానములలో నాకు లోటు లేదు. నీవు చెప్పిన అగ్ని మొదలయిన దేవతలను ప్రసన్నులయ్యేటట్లు ఆరాధించాను. ఆ పాండవులకు నా అంతటి శక్తి సామర్థ్యాలుంటే పదుమూడేళ్ళు ఆ విధంగా కష్టాలు పడతారా? ఇంకా విను చెపుతా.*

-: దుర్యోధనుఁడు తండ్రితోఁ దనబలపరాక్రమంబు సెప్పుట :-
సం 5-60-20

క॥ ఏ నలిగిన వారిని సుర
లైనను రక్షింప నోప; రమరు లలిగినం
బూని చెడకుండఁ గాతును
మానవులొక సరకె నాకు మనుజాధీశా! 263

అ: మనుజాధీశా! = రాజా; ఏను + అలిగినన్ = నేను కోపిస్తే; వారిని = ఎదుటివారిని; పాండవులను; సురలు - ఐనను = దేవతలయినా; రక్షింపన్ - ఓపరు = రక్షింపలేరు; అమరులు= దేవతలు; అలిగినన్ = కోపించినా; పూని = వారిని నేను గ్రహించి; చెడకుండన్; కాతును = రక్షిస్తాను; మానవులు; నాకున్, ఒకసరకె? = ఒకలెక్కా?

భా: *నేను కోపిస్తే వారిని దేవతలు కూడా రక్షించలేరు. దేవతలు కోపించినా ఎదుటివారిని నేను పూని రక్షించగలను. ఇకనాకు మానవులొక లెక్కా? (కాదని భావం)*

తే॥ గర్వమున నాడు మాటలు గాఁదలంప
వలవ దిదియెల్ల నిక్కంబు వసుమతీశ!
నన్ను నేఁజెప్పికొందునే యెన్నఁడైన
నాత్మ సంస్తుతి పౌరుషం బగునె చెపుమ! 264

అ: వసుమతీశ = రాజా!; గర్వమునన్ = గర్వంతో; ఆడు, మాటలుగాన్, తలంప వలవదు; ఇది ఎల్లన్ = ఇది అంతా; నిక్కంబు =నిజం; ఎన్నడు + ఐనన్ = ఎపుడయినా; నన్ను; నేన్; చెప్పికొందునే? = పొగడుకొందునా?; ఆత్మ సంస్తుతి = తనను తాను పొగడుకొనడం; పౌరుషంబు + అగునె? = పౌరుషమవుతుందా; చెపుమ = చెప్పు.

భా: *ఈ మాటలన్నీ గర్వంతో చెప్పే మాట లనుకోకు - నిజం -రాజా! ఎప్పుడయినా నన్ను గురించి నేను చెప్పుకొంటానా?ఆత్మస్తుతి పౌరుషం అవుతుందా చెప్పు.*

వ: ధర్మతనయాది పాండవేయులును, ద్రుపదాది పాంచాలురును, విరాటాది మాత్స్యులును, వాసుదేవాది యాదవులును, మఱియునుం గేకయ పాండ్య మాగధ చైద్యప్రముఖ నిఖిలదండనాయకులును నాబారింబడి మున్నీరు సొచ్చిన యేఱుల చందంబున నడంగిపోవుట యవధరించెదు గాక వారెల్లం దేజో ధైర్యపరాక్రమోపాయ విచార వివేకంబుల నాయెత్తు వత్తురె? పితామహద్రోణ కృపాశ్వత్థామలు శస్త్రాస్త్ర విషయంబుగా నేనేమి యెఱుంగుదు రెంతెంత నేర్తు రదియెల్ల నెఱుంగుదు నంతయు నేర్తునని పలికి యందఱు వెఱఁగుపడి యుండం దాను సంజయుతో సంగరంబు తెఱంగు నాలోచనంబుగాఁ బాండవుల దెస మాటలాడు చుండఁ గర్ణుండు ధృతరాష్ట్రుం గైకొనక ధార్తరాష్ట్రునకుం బ్రియంబుగా నిట్లనియె. 265

అ: మాత్స్యులు = మత్స్యదేశంలోనివారు; మున్నీరు = సముద్రం; చొచ్చిన = ప్రవేశించిన; ఏఱుల చందంబునన్=నదులవలె; అవధరించెదు=వింటావు; నా యెత్తు=నా సాటి; వెఱఁగుపడి=ఆశ్చర్యపడి; తాను=ఇక్కడ ధృతరాష్ట్రుడు; పాండవులదెస = పాండవుల పక్షాన

భా: ధర్మరాజు మొదలయిన పాండవులూ; ద్రుపదుడు మొ॥ పాంచాలురూ; విరాటుడు మొ మత్స్యదేశస్థులూ; కృష్ణుడు మొ॥ యాదవులూ ఇంకా కేకయులూ; పాండ్యులూ; మాగధులూ; చైద్యులూ మొ॥ దండ నాయకులంతా నా పాలబడి సముద్రంలోకి చేరిన నదుల వలె అణిగి పోవడం వింటావు. వారంతా తేజస్సులో కాని ధైర్యంలో కాని, పరాక్రమంలో కాని; ఉపాయం ఆలోచించడంలో కాని; వివేచనలో గాని నాతో సాటి వస్తారా? భీష్ముడు, ద్రోణుడు, కృపుడు, అశ్వత్థామ వీరు నల్వురూ శస్త్రాస్త్ర విషయాల్లో ఏమేమి ఎరుగుదురో ఎంతెంత నేర్తురో అది అంతా నేనెరుగుదును అంతా నేను నేర్తును అని చెప్పి అందరూ ఆశ్చర్యపడి ఉండగా; ధృతరాష్ట్రుడు సంజయునితో యుద్ధ పద్ధతి గురించి ఆలోచనలో పాండవుల పక్షాన మాటలాడుతూ ఉంటే కర్ణుడు ధృతరాష్ట్రుని లెక్కచేయక దుర్యోధనునికి ప్రియంగా ఇలా అన్నాడు.

వి: 1. కేకయులు : కేకయులు పదిమంది ఉన్నారు. వీరంతా సోదరులు: ఇందులో అయిదుగురు పాండవులతో కలిశారు. మిగిలిన వారు కౌరవులతో కలిశారు.

2. పాండ్యులు : సాగర తీరవాసులయిన యోధులతో పాండ్య దేశపురాజు ధర్మరాజుకు సహాయపడటానికి వచ్చాడు.

3. మాగధులు : మగధదేశపు రాజు. పేరు జయత్సేనుడు. ఒక అక్షోహిణిసేనతో వచ్చినవాడు.

4. చైద్యుడు : చేది దేశపు రాజు. ధృష్టకేతుడు. ఇతడు శిశుపాలుని కొడుకు. ఒక అక్షోహిణి సేనతో వచ్చి పాండవులను కలిశాడు.

క॥ గురునలుక నాకు నస్త్ర
స్ఫురణ మెడలె నండ్రు జనులు; బొంకది; పూజా
పరతమెయి నమ్మునీశ్వరు
కరుణ గొరలి మగుడఁ బడయఁగాంచితిఁ బ్రీతిన్. 266

అ: గురునలుకన్ = గురువయిన పరశురాముని కోపం చేత; నాకున్; అస్త్ర స్ఫురణము ఎడలెన్=అస్త్ర విద్య జ్ఞాపకం రాదు. అండ్రు=అంటారు; జనులు; అది బొంకు = అది అసత్యం; పూజా పరతమెయిన్ = పూజా తత్పరతతో; ఆ + మునీశ్వరు = ఆమునియొక్క; కరుణ - కొఱలి = దయపొంది; మగుడన్ = మరల; ప్రీతిన్ = ప్రీతితో; పడయన్ కాంచితిన్ = పొందగలిగాను (అస్త్రస్ఫురణాన్ని)

భా: గురువయిన పరశురాముని కోపం చేత నాకు అస్త్రములు స్ఫురించవని జనులంటారు. అది అసత్యం. పూజాతత్పరత్వం చేత ఆ మహర్షి యొక్క కృపను పొంది మళ్లీ అస్త్రస్ఫురణాన్ని పొందగలిగాను.

వి: తాను విప్రుడనని చెప్పి కర్ణుడు పరశురాముని దగ్గర విద్యాభ్యాసం చేశాడు. అది తెలిసి పరశురాముడు కర్ణుని శపించాడు. ఆ శాపం వల్ల కర్ణునికి సమయానికి అస్త్రాలు స్ఫురించవు. గుర్తురావు. శాంతి. 1 ఆ. 20వ. నుండి 27 ప. వరకు

ఉ: కావున నస్త్రశస్త్రము లఖండిత సంపద నొంది యుండు; దే
వావలి కైన నన్నుఁజెనయన్ భర; మేఁగలుగంగ నర్జునుం
డే విడిపించు మేదిని? గడింది మగంటిమి యుల్లసిల్లఁగా
నీవు బలంబు మెచ్చ నని నిల్చెద గెల్చెదఁ బాండవేయులన్. 267

అ: కావునన్; అస్త్ర శస్త్రములు; అఖండిత సంపదన్ ఒంది; యుండున్ = తరగని శక్తి కలిగి ఉంటాయి నాకు; నన్నున్; చెనయన్ = ఎదిరించటానికి; దేవ + ఆవలికిన్ = ఐనన్ = దేవతల సముదాయాని కయినా; భరము = కష్టము; ఏన్ కలుగంగన్ = నేను నిల్చి ఉండగా; అర్జునుండే మేదినిన్ విడిపించు? = అర్జునుడు భూమిని విడిపించగలడా?; కడింది మగంటిమి= అధికమయిన పౌరుషం; ఉల్లసిల్లఁగాన్ = ప్రకాశించగా; నీవున్ = నీవూ (దుర్యోధనుడూ) బలంబు మెచ్చన్= సైన్యము ప్రశంసించేటట్లు; అనిన్ నిల్చెదన్ = యుద్ధంలో నిలుస్తాను; పాండవేయులన్; గెల్చెదన్ = గెలుస్తాను.

భా: *అందుచేత అస్త్రశస్త్రాల స్ఫురణలో నాకేలోటూ లేదు. దేవతలు కూడా నన్ను ఎదిరించడం కష్టమే. నేనుండగా అర్జునుడు భూమిని విడిపించలేడు (దుర్యోధనుని నుండి) నీవూ సైన్యమూ మెచ్చుకొనేటట్లు మిక్కిలి పౌరుషంతో యుద్ధంలో నిల్చి పాండవులను గెలుస్తాను.*

శా: గాంగేయాదుల నీకడన్ నిలిచి వేడ్కం జూడఁగా, సర్వసే
నాంగాంగంబుల మీఁద గాలియును జిట్టాడంగ నీకేను వీఁ
కం గౌంతేయులఁ దాకి తత్తనువు లుగ్రస్ఫార బాణాలిఁ గూ
లం గోదండ విలాసముల్ మెఱయ లీలం బోరఁ గ్రీడించెదన్. 268

అ: గాంగేయ + అదులు = భీష్ముడు మొదలగువారు; నీకడన్; నిలిచి; వేడ్కన్ = వేడుకతో; చూడఁగాన్=చూస్తూఉండగా; సర్వసేనా+అంగంబుల మీఁదన్ = అన్ని సేనాభాగముల మీదను; గాలియును; చిట్టాడంగనీక = సోకనీకుండా; ఏను = నేను; వీఁకన్ = ఉత్సాహంతో; కాంతేయులన్ తాకి = పాండవులను చుట్టుముట్టి; తత్తనువులు = వారి శరీరాలు; ఉగ్ర స్ఫార బాణ+ఆలిన్=భయంకరమయిన కాంతి గల బాణ సముదాయంతో; కూలన్=కూలిపోయేటట్లు; కోదండ విలాసముల్ మెఱయన్ = బాణ ప్రయోగ నైపుణ్యాలు ప్రకటిత మయ్యేటట్లు; పోరన్= యుద్ధంలో; లీలన్ క్రీడించెదన్ = విలాసంతో ఆడి పోతాను.

భా: *భీష్మాదులు నీ దగ్గర వేడుకతో చూస్తూ ఉండగా, అన్ని సేనా విభాగాల మీద కూడా గాలి కూడా సోకకుండా రక్షిస్తూ; నేను ఉత్సాహంతో పాండవులను ఎదిరించి వారి శరీరాలు ఉగ్రబాణాలతో కూలిపోయేటట్లు బాణ నైపుణ్యం ప్రకటిస్తూ విలాసంగా యుద్ధంలో క్రీడిస్తాను.*

వి: "గాంగేయాదులు నీకడన్ నిలిచి వేడ్కం జూడగా" అనేమాట భీష్మునికి రోషం కలిగించింది. అసమర్థుడు ప్రేలుతున్నాడనిపించిది భీష్మునికి.

వ: **అనిన విని యినినందనునకు మందాకినీ నందనుం డిట్లనియె.** 269

అ: ఇననందనుఁడు = సూర్యుని కొడుకు కర్ణుడు; మందాకిని = గంగ

భా: *ఆ మాటలు విని కర్ణునితో భీష్ముడిలా అన్నాడు.*

క॥ **కాలుఁడు ప్రేరేపఁగ నిటు**
ప్రేలిన యంతటన నిన్నుఁ బెద్దగఁ దలఁపం
బోలునె మాకును? నుడుగుము
చాలుదు నీవెల్ల పనులు సాధింపంగన్. 270

అ: కాలుఁడు = యముడు; ప్రేరేపఁగ = ప్రేరేపిస్తే; ఇటు; ప్రేలిన యంతటన; నిన్నున్, పెద్దగన్; తలపన్ ; మాకున్; పోలునె? = తగునా?; ఉడుగుము = ఊరుకో; నీవు; ఎల్ల పనులు; సాధింపంగన్ = సాధించటానికి; చాలుదు=తగుదువు.

భా: *యమధర్మరాజు ప్రేరణ చేస్తే ఇలా ప్రేలుతున్నావు. అంతలోనే నిన్ను మేము పెద్దగా భావించవచ్చునా? ఊరుకో! నీవే అన్ని పనులూ సాధింప సమర్థుడవు. (అసమర్థుడు అని ఈసడింపు అది.)*

వి: కాలుడు ప్రేరేపించుట అనగా మృత్యువు సమీపించుట అని భావము.

ఉ॥ **కూలెడు వారె పాండవులు? ఘోరపుఁ బోర నొకండొకండ యీ**
చాలెడు వారలెల్ల మును చావఁ, గ్రమంబున సేన లన్నియుం
గూలఁగఁ, గౌరవుల్ పిదపఁ గూలుదు; రింతియ కాక నోరిచే
టేల? వృథాభిమానమున నిన్నియుఁ బ్రేలెదు సూతనందనా! 271

అ: సూతనందనా! = సారథి కొడుకయిన కర్ణా!; పాండవులు; కూలెడు వారె? = యుద్ధంలో పడిపోయేవారా?; ఘోరము + పోరన్ = భయంకరమయిన యుద్ధంలో; ఈ చాలెడు వారలు - ఎల్లన్ = ఈ సమర్థులంతా; ఒకండు +ఒకండ=ఒక్కడొక్కడే; మును చావన్ = ముందుగా చస్తే; క్రమంబునన్=వరుసగా; సేనలు; అన్నియున్; కూలగన్=కూలిపోగా; పిదప=తర్వాత;కౌరవుల్; కూలుదురు; ఇంతియ కాక=ఇంతేకాని; నోరి చేటు-ఏల?=అనవసరపు ప్రేలాపన ఎందుకు; వృథాభిమానమునన్=వ్యర్థమయిన అభిమానంతో; ఇన్నియున్; ప్రేలెదు = ప్రేలుతున్నావు.

భా: *కర్ణా! పాండవులు కూలిపోయేవారా? (ఎన్నడూ జరగదు) భయంకర యుద్ధంలో ఈ సమర్థులంతా ఒక రొకరే ముందుగా కూలిపోతే వరుసగా సేనలన్నీ పడ్డాక తర్వాత కౌరవులు పడతారు. ఇంతే జరిగేది తప్ప- అనవసరంగా నోరు పారేసుకోకు - వ్యర్థమయిన అభిమానంతో ఇన్ని ప్రేలుడులు ప్రేలుతున్నావు.*

తే॥ **దివిజపతి నీకు నిచ్చిన తీవ్రశక్తి**
చేతఁ గవ్వడి వడునని చూతువేని

వాసుదేవునిచే నది వ్రయ్యలయ్యుఁ
దునియ లయ్యును బొడియయ్యుఁదొరఁగు ధరణి. 272

అ: నీకున్; దివిజపతి = దేవేంద్రుడు; ఇచ్చిన; తీవ్రశక్తిచేతన్; కవ్వడి + పడునని = అర్జునుడు కూలిపోతాడని; చూతువు + ఏని =భావిస్తే/అనుకొంటే; అది; వాసుదేవునిచే = కృష్ణుని చేత; వ్రయ్యలయ్యు = చీలికలయి; తునియలయ్యును = ముక్కలయి; పొడియయ్యున్ = నుగ్గునుగ్గుగా అయి; ధరణిన్ తొరఁగున్ = నేల కూలుతుంది.

భా: ఇంద్రుడు నీకిచ్చిన శక్తి చేత అర్జునుడు పడిపోతాడని అనుకొంటే .... ఆ శక్తి కృష్ణుచేత చెక్కలవుతుంది - ముక్కలవుతుంది - పొడి పొడి అయి నేల గూలుతుంది.

వి: భీష్ముని కోపం ఈ మాటల్లో గోచరిస్తుంది - "వ్రయ్యలయ్యుతునియలయ్యు పొడియయ్యు ధరణి దొరగు" అనే మాటలు క్రోధతీవ్రతకు నిదర్శకాలు.

కII సర్పముఖ శరము గల దను
దర్పంబునఁ గ్రీడిఁ దొడరఁ దలఁపకు; హరిపెం
పేర్పడఁగ నదియ కా దట
తీర్పవలయువాని నెల్లఁదీర్చు నరునకై. 273

అ: సర్పముఖ శరము = నాగాస్త్రం; కలదను దర్పంబునన్ = ఉందనే గర్వంతో; క్రీడిన్=అర్జునుని; తొడరన్ తలఁపకు=ఎదిరింప తలపెట్టకు; హరి; పెంపు ఏర్పడగన్ = కృష్ణుడు ఆదరణ కనపడగా; అదియ కాదు+ఆ నాగాస్త్రమే కాదు; నరునకై (అతడు); అట తీర్పవలయు వానిన్ ఎల్లన్ = తీర్చవలసిన వాటినన్నిటిని; తీర్చున్ = నెరవేర్చును.

భా: ఆ నాగాస్త్రం ఉంది కదా అనే గర్వంతో అర్జునుని ఎదిరింప దలపకు. కృష్ణుడు తన మహిమ ప్రకటితమయ్యేటట్లు ఆ నాగాస్త్రం ఒకటే కాదు అట్లా తీర్చవలసిన వాటినన్నిటినీ అర్జునుని కోసం తీరుస్తాడు.

వ: అని పలికి ధృతరాష్ట్రునితో నిట్లనియె. 274

భా: అని చెప్పి భీష్ముడు ధృత రాష్ట్రునితో ఇలా అన్నాడు.

కII జ్ఞాతులు దమలోఁబొందినఁ
జేతో మోదమున వెలిఁగి చెలువొందుదు ర
న్నీతిం బాసిన విగతవి
భూతిం గడకొఱవులట్ల పొగయుదు రధిపా! 275

అ: అధిపా! = రాజా!; జ్ఞాతులు = అన్నదమ్ముల పిల్లలు; తమలోన్+ పొందినన్= తమలో తాము కలిసి ఉంటే; చేతస్+మోదమునన్ =మనస్సంతోషంతో; వెలిగి; చెలు వొందుదురు= ఒప్పుతారు; ఆ + నీతిన్ = ఆ నీతిని; పాసినన్ = విడిస్తే; విగత విభూతిన్ = వైభవం తప్పి; కడకొఱవులట్ల = చివరి కొఱవుల వలె; పొగయుదురు = పొగచిమ్ముతారు.

భా: రాజా! జ్ఞాతులు తమలో తాము కలిసి మెలిసి ఉంటే మనస్సంతోషంతో

వెలిగి పోతూ ఉంటారు. ఆ నీతిని విడిచిపెడితే వైభవం చెడిపోయి కడకొరవుల వలె పొగలు కక్కుతారు.

వి: 1. కట్టెలు ఒకదానితో ఒకటి కలిసి ఉంటే చక్కగా ఒక వెలుగు వెలుగుతాయి. వేటికవి విడిపోతే చివరిదాకా కాలిపోయిన కట్టెలు పొగలు కక్కుతాయి. కాని వెలుగు వెలగవు.

2. ఈ విషయం సంస్కృతంలో విదురుడు చెప్పినట్లు ఉంది. విదురుడు "పక్షులు వల నెత్తుకుపోయిన కథ" కూడా చెపుతాడు. తెలుగులో తిక్కన ఎందుకో మార్చాడు. ఈ పద్యానికి మూల శ్లోకం ఇది

ధూమాయన్తే వ్యపేతాని జ్వలన్తి సహితాని చ
ధృతరాష్ట్రోల్ముకానీవ జ్ఞాతయో భరతర్షభ 5-62-19

వ: కావునఁ దమలో విరోధం బొప్పదు. సంభాషణ సహభోజనాది సత్కారంబులను, సవినయ వర్తనంబులను, బ్రీతులైన జ్ఞాతు లిహ పరార్థ సాధకు లగుదురని చెప్పి వెండియు. 276

అ: సహభోజనము = కలిసి భోజనం చేయడం; ఇహ పరార్థ సాధకులు = ఈ లోకం పరలోకం రెండింటినీ సాధించినవారు.

భా: అందుచేత జ్ఞాతులకు తమలో విరోధం పనికిరాదు. సంభాషణం చేతను కలిసి భుజించడం మొదలయిన మర్యాదలతోనూ వినయపూర్వకమయిన ప్రవర్తనలతోనూ ప్రీతి చెందిన జ్ఞాతులు ఇహాన్ని సాధిస్తారు. పరాన్ని సాధిస్తారు. అని చెప్పి ఇంకా

వి: జ్ఞాతి వైరం వల్ల జ్ఞాతులెవరూ బాగుపడరు. ఒకరికొకరు కలిసి మెలిసి ఉంటే అందరికీ అన్నీ చేకూరుతాయి.

క॥ వినుమే నొక శైలమునకు
మును భూసురవర్గ సహితముగ నొక పనికిం
జను నెడఁ జనరాని తటం
బున నొక జున్నుండె దానిఁ బొగడిరి తద్జ్ఞుల్. 277

అ: వినుము; ఏను = నేను; మును = పూర్వం; ఒక శైలమునకున్ = ఒక పర్వతానికి; భూసుర వర్గ సహితముగన్ = బ్రాహ్మణులతో కలిసి; ఒక పనికిన్; చను - ఎడన్ = వెళ్ళేటప్పుడు; చనరాని తటంబునన్ = మానవులు వెళ్లలేని కొండచరియ మీద; ఒక జున్ను + ఉండె = ఒక తేనె పట్టు ఉంది; తద్జ్ఞుల్ = దాన్ని గురించి తెలిసినవారు; దానిన్ పొగడిరి = దాన్ని ప్రశంసించారు.

భా: విను. నేను పూర్వం ఒకసారి ఒక పనికోసం విప్రసహితంగా వెడుతున్నాను. మానవులు చొరరాని పర్వత సానువు మీద ఒక తేనెపట్టు ఉంటే దాన్ని గురించి ప్రశంసించారు కొందరు.

తే॥ "దీని తేనియఁ ద్రావిన మానవులకు
జరయు రుజయును దప్పిఁయుఁ జావుఁగలుగ"

దనఁగఁ గొందఱు బోయలు విని కడంగి
యుఱక మొఱకులై చఱిఁబడ నుఱికి రపుడు. 278

అ: దీని తేనియన్ త్రావిన మానవులకు; జరయున్ =ముసలితనమూ; రుజయును= రోగము; దప్పియున్ = దాహమూ; చావున్ =మరణమూ; కలుగదు; అనఁగన్ = అంటే; కొందఱు బోయలు విని; కడంగి = పూని; ఉఱక =ఊరకే; మొఱకులు+ఐ= మూర్ఖులై, అపుడు = అపుడే వెంటనే; చఱిన్ పడన్ ఉఱికిరి = ఆ పర్వతపు చఱియ మీదినించిపడేటట్లు పరుగెత్తారు.

భా: *"ఆ జుంటితేనెను త్రాగిన మానవులకు ముసలితనమూ, రోగమూ, దప్పిక, మరణమూ కలుగవు." అన్నారు. ఆ మాటలు కొందఱు బోయలు విని మూర్ఖులై వెంటనే దానికోసం ఆ చఱియ మీదకు పరుగెత్తారు.*

వ: ఇట్టుఱికి మృతింబొంది రట్లపోలె నవినీతులైన నీ కొడుకులు పుడమి యెల్లను వార యేలు తీపుఁజూచెదరు గాని తమ పొలిసి పోవుటం గానరు; వీరలర్జును తోడం బెనంగి మాన ప్రాణంబులు దక్కించుకొనువారె! యట్లుంగాక సమబలులైన నుం గయ్యంబునఁగదా వీరొదురు వారొదు రనవచ్చు నదియేల? నీలోనికి ధర్మనందనుం దెచ్చుకొనుటయ నీకుఁ గర్తవ్యం బనిన బాహ్లికుండు ధార్తరాష్ట్రున కిట్లనియె. 279

అ: ఉఱికి=పరుగెత్తి; అవినీతులు =నీతిలేని వారు; పుడమి ఎల్లను = భూమి అంతా; వార = వారే; ఏలు తీపు = పరిపాలించాలనే మధురమయిన ఊహ; పొలిసిపోవుట = చనిపోవుట; పెనంగి =యుద్ధంచేసి; మాన ప్రాణంబులు=గౌరవమూ ప్రాణమూ; కర్తవ్యము=చేయదగిన పని

భా: *ఇలా పరుగెత్తి చనిపోయారు. అలాగే అవినీతులయిన నీ కొడుకులు భూమి అంతా తామే పరిపాలించాలనే దురాశనే చూస్తారు కాని తాము చనిపోవడం చూడటంలేదు.వీరు అర్జునునితో పోరాడి మానమూ ప్రాణము దక్కించుకో గలవారా? అదీగాక సమాన బలులయితే కదా యుద్ధంలో వీరు నెగ్గుతారు వారు నెగ్గుతారు అని చెప్పవచ్చు. అది అంతాయెందుకు? నీలోకి ధర్మరాజును తెచ్చుకోవడమే నీకు చేయదగిన పని అన్నాడు. అపుడు బాహ్లికుడు దుర్యోధనునితో ఇలా అన్నాడు.*

క॥ కనుఁబ్రమసిన తెరువరి తన
కనపాయం బైన మార్గ మరసి తగ నెఱిం
గిన వారు సెప్పఁగా గై
కొనని కరణి దగిన వెంటకుం జొర వకటా! 280

అ: అకటా! = అయ్యో!; కనుఁబ్రమసిన = కన్ను చెదరిన/మిరుమిట్లుగొన్న; తెరువరి= బాటసారి; తనకున్; అనపాయంబు + ఐన =అపాయంలేని; మార్గము; అరసి = చూసి; తగనెరింగిన వారు = బాగా తెలిసినవారు; చెప్పగా; కైకొనని కరణిన్ = గ్రహింపని విధంగా; తగిన వెంటకున్= తగిన రీతికి/ విషయానికి; చొరవు = అంగీకరింపవు యత్నింపవు.

భా: *కనులు మిఱుమిట్లు గొల్పిన బాటసారికి (తెలిసినవారు) విజ్ఞులు అపాయం*

లేని మార్గం చూపిస్తే చూడనట్టుగా నీవు తగిన మార్గంలో వెళ్లవు - అయ్యో!.

అలం : ఉపమ

వ: **అనినవైచిత్ర వీర్యుండు దుర్యోధనున కిట్లనియె.** 281

అ: వైచిత్ర వీర్యుండు = విచిత్ర వీర్యుని కొడుకు ధృతరాష్ట్రుడు.

భా: *అపుడు ధృతరాష్ట్రుడు దుర్యోధనునితో ఇలా అన్నాడు.*

మ॥ **కొడుకా! యేనెటు లట్ల బాహ్లికుఁడు నీకుం గూర్చు; భీష్ముండు నీ**
యెడ సస్నేహుఁడు వీరిమాట వినుమేమీ ముచ్చురున్ మన్ననల్
వడయంగాఁ దగునట్టి వారము నినుం బ్రార్థించెదన్ ధర్మజున్
విడువంగాఁ దగ; దిమ్ము వారలకు నుర్విం బాలు నెమ్మిన్ దగన్. 282

అ: కొడుకా! = కుమారా!; ఏను + ఎటులు = నేనెట్లాగో; అట్ల = అట్లే; బాహ్లికుడు; నీకున్ కూర్చున్ = నీ యందు ప్రీతి కలవాడు/ ఇష్టమయిన వాడు; భీష్ముండు; నీయెడన్ = నీయందు; సస్నేహుడు = వాత్సల్యం కలవాడు; వీరి మాట వినుము; ఏము + ఈముచ్చురున్= మేమీ ముగ్గురమూ; మన్ననన్ = మర్యాదలు; గౌరవం; పడయంగాన్ = పొందటానికి; తగునట్టి వారము; నినున్; ప్రార్థించెదన్; ధర్మజున్ =ధర్మరాజును; విడువంగాన్ - తగదు; నెమ్మిన్ తగన్= తగినట్లు ప్రేమతో; వారలకున్; ఉర్విన్ = భూమిలో; పాలు ఇమ్ము = భాగం ఇయ్యి.

భా: *కుమారా! నీకు నేనెట్లో ఈ బాహ్లికుడూ అటువంటివాడే ఇతడు నీ వంటే ఇష్టపడతాడు. భీష్ముడు కూడా నీ మీద వాత్సల్యం కలవాడు. వీరి మాట విను. మేము ముగ్గురమూ నీకు గౌరవింపదగిన వారము. నిన్ను ప్రార్థిస్తాను. ధర్మరాజును విడువరాదు. పాండవులకు తగినట్లు ప్రేమతో భూమిలో పాలు ఇయ్యి.*

క॥ **అనినను వెండియు నొడఁబా**
టునకుఁ జొరని దానికిం గొడుకు తోడఁ గడుం
గినిసి ధరణీశ్వరుం డి
ట్లనుఁ గొలువున నున్నవార లందఱు వినఁగన్. 283

అ: అనినను = అన్నాకూడా; వెండియున్ = ఇంకా; ఒడంబాటునకున్ = అంగీకారానికి; చొరని దానికిన్ = రాకపోవటానికి; ధరణీశ్వరుండు = రాజు-ధృతరాష్ట్రుడు; కొడుకు తోడన్ కడున్కినిసి = కొడుకు మీద చాలా కోపించి; కొలువునన్; ఉన్న వారలు; అందఱు; వినఁగన్; ఇట్లు అనున్.

భా: *అట్లా అన్నా కూడా ఇంకా అంగీకరింపక పోవటానికి కొడుకు మీద ధృతరాష్ట్రుడు కోప్పడి కొలువులోనివారంతా వినేటట్లు ఇలా అన్నాడు.*

తే॥ **బవరములు గావె? విఱిగిన బార సాఁప**
వచ్చునే? యొక్కరుండ వివ్వచ్చుఁ డడరి

పసులఁ బెట్టించునపుడు నీ బలము విఱుగ
దయ్యెనే! నీవుఁ గర్ణుండు నచట లేరె? 284

అ: బవరములు - కావె? = యుద్ధములు జరుగవా? విఱిగినన్ = పరాజయం పొందిన తరువాత; బారసాఁప వచ్చునే! = ప్రయత్నింపవచ్చునా? వివ్వచ్చుఁడు = అర్జునుడు; ఒక్కరుండ = ఒక్కడే; అదరి = విజృంభించి; పసులన్ పెట్టించునపుడు = గోవులను మళ్లించే టప్పుడు; నీబలము=నీ సేన; విఱుగ దయ్యెనే! =పారిపోలేదా; నీవున్, కర్ణుండున్; అచటన్,లేరె?

భా: *ఇప్పటికి ఎన్నో యుద్ధాలు జరుగలేదా? జరిగాయి కదా! పారిపోయి పరాజితులయి కూడా ప్రగల్భాలు పలుకవచ్చునా? విరాటుని గోవులను అర్జును డొక్కడూ మళ్లించి తీసుకుపోతున్నపుడు నీ సేనలు పారిపోలేదా! అక్కడప్పుడు నీవూ, కర్ణుడూ ఉన్నారు కదా! (ఏమీ చేయలేక కళ్లప్పగించి చూశారు కదా)*

వ: **అని రాధేయు దిక్కు మొగంబై మఱియు నిట్లనియె. 285**

భా: *అని కర్ణుని వైపు మొహం పెట్టి ఇంకా ఇలా అన్నాడు.*

ఆ: **నాటి కొలఁది గాదు, నారాయణుఁడు నొగ**
లెక్కఁ గెలన భీముఁ డేచి నడవ
ననుజ తనుజ సహితుఁడై వచ్చు వివ్వచ్చు
మార్కొనంగ వశమె మనకుఁ గర్ణ! 286

అ: కర్ణ!; నాఁటి; కొలఁది-కాదు = స్థితికాదు; నారాయణుఁడు = కృష్ణుడు; నొగలు+ ఎక్కన్ = రథం ముందు భాగం ఎక్కగా; కెలనన్ =ప్రక్కనే; భీముఁడు; ఏచి నడవన్ = విజృంభించి రాగా; అనుజ తనుజ సహితుఁడు +ఐ=తమ్ములతో కొడుకులతో కూడిన వాడయి; వచ్చు =వచ్చే; వివ్వచ్చున్ = అర్జునుని; మనకున్; మార్కొనంగన్ వశమె? = ఎదిరింపశక్యమా?

భా: *కర్ణా! అప్పటి పరిస్థితికాదు - ఇపుడు కృష్ణుడు రథ సారథ్యం చేయగా, ప్రక్కన భీముడు విజృంభించి నడుస్తూ ఉంటే తమ్ములతో కొడుకులతో వచ్చే అర్జునుని మనకు ఎదిరింప శక్యమా? (శక్యం కాదని భావం)*

వి: ఉత్తర గోగ్రహణంలో అర్జునుడు ఒంటరిగా వచ్చాడు. కౌరవ వీరులంతా కలిసినా ఆ ఒక్కడికీ తట్టుకోలేక పలాయనం చిత్తగించారు. ఇపుడు యుద్ధంలో అర్జునుడు కృష్ణుని సాయంతో భీముని సాయంతో ఇంకా ఎంతోమంది వీరులతో వస్తాడు. అతడిని జయించడం కౌరవులకు సాధ్యం కాదని భావం.

చ॥ **బలమును దర్పమున్ మెఱయ బంటుతనంబున నీవు పాండవే**
యుల నని మార్కొనం గడఁగు టొప్పెడు తెంపగుఁ; "జచ్చి శుద్ధుఁడై
పలుకులు మాన్పు భృత్యు"ఁడను పాటి దలంచెద; విట్లు మేలె? య
చ్చలమున నీసుయోధనుని చావున కోర్చుట గాదె యెంతయున్. 287

అ: బలమును;దర్పమున్=గర్వమూ; మెఱయన్=కన్పడేటట్లు; బంటుతనంబునన్=

వీరత్వంతో; నీవు; పాండవేయులన్; అనిన్ = యుద్ధంలో; మార్కొనన్ కడఁగుట = ఎదిరించటానికి పూనుకోవడం; ఒప్పెడు తెంపు అగున్ = మంచి సాహసమే అవుతుంది; చచ్చి; శుద్ధుఁడై = స్వచ్ఛమై / నిష్కల్మషుడై; భృత్యుడు = 'సేవకుడు; పలుకులు మాన్పున్ = నిందలు పోగొట్టును' అనుపాటి = అనే న్యాయాన్ని; తలంచెదవు = భావిస్తున్నావు; ఇట్లు మేలె = ఇట్లా అనుకోవడం మంచిదా; ఆ + చలమునన్ = ఆ పట్టుదలతో; ఈ సుయోధనుని చావునకున్; ఎంతయున్ = పూర్తిగా; ఓర్చుట కాదె? = అంగీకరించటమే కదా! / ఒప్పుకోవటమే కదా!

భా: బలమూ, గర్వమూ ప్రకటింపబడేటట్లు వీరత్వంతో నీవు పాండవులను యుద్ధంలో ఎదిరించాలని కోరుకోవడం మంచి సాహసమే అవుతుంది. "సేవకుడు చచ్చి పరిశుద్ధుడై నిందలు తొలగిస్తాడు" అనే న్యాయం భావిస్తున్నావు. అది మంచిదా? ఆ పట్టుదలలో నీ దుర్యోధనుని చావును సహిస్తున్నట్లు కాదూ! అంగీకరించినట్లు కాదూ!.

వ: అనిన విని కానీనుండు సంక్షుభిత మానసుండై యిది యెల్ల నిట్లయ్యె నిట్లుంగాక తక్కిన యది యట్లుండె; నదీ సూనుండు నన్ను నిరాకరించి పలికిన పలుకుల ఫలం బనుభవించుం గాక యని యతని నుద్దేశించి యిట్లనియె. 288

అ: కానీనుండు = కన్యయొక్క పుత్రుడు కర్ణుడు; సంక్షుభిత మానసుండై = క్షోభించిన మనసు కలవాడై; నదీ సూనుండు = నది కొడుకు భీష్ముడు.

భా: ఆ మాటలు విని కర్ణుడు కలత చెంది "ఇది అంతా ఇలా అయింది. సరే! ఇట్లా కాక పోయినా అది అలా ఉండనియ్యి. భీష్ముడు నన్ను చులకన చేసి మాట్లాడిన మాటల ఫలితం అనుభవించాలి" అని అతనితో ఇలా అన్నాడు.

-: కర్ణుఁడు భీష్మునిపై రోషము చేత నస్త్ర సన్న్యాసంబు సేయుట :-
సం : 5-61-13

తే॥ నీకు నా లావుతోడ్పాటు లేకయుండ
వలయు; నీ తెగు నంతకుఁ గలన నిలువ;
నాయుధంబులు విడిచితి; నంత మీఁద
మెఱసి బల విక్రమంబులు నెఱపువాఁడ. 289

అ: నీకున్; నాలావు తోడ్పాటు = నా బలము యొక్క సహాయం; లేక యుండ వలయున్ = ఉండరాదు; నీ తెగునంతకున్ = నీవు చచ్చేవరకూ; కలనన్ నిలువన్ = యుద్ధంలో నిలువను; ఆయుధంబులు; విడిచితిన్; అంత మీఁద = ఆ తరువాత; మెఱసి = విజృంభించి; బల విక్రమంబులు = బలమూ పరాక్రమమూ; నెఱపువాఁడన్ = ప్రకటిస్తాను.

భా: నీకు నా బల సహాయం ఉండకూడదు. నీవు చచ్చేవరకూ యుద్ధానికి రాను. ఆయుధాలు విడిచి పెడుతున్నాను. నీవు పడిన తరువాతనే విజృంభించి నా బల పరాక్రమాలు ప్రకటిస్తాను. చూపిస్తాను.

వ: **అని శస్త్ర సన్న్యాసంబు చేసి కొలువున నిలువ నొల్లక దిగ్గన లేచి పోయె నట్టి యెడ శాంతనవుండు నవ్వుచు దుర్యోధనునితో నిట్లనియె.** **290**

అ: శస్త్ర సన్యాసంబు = ఆయుధములను విడచుట; నిలువన్ ఒల్లక = నిలవటానికి ఇష్టం లేక; శాంతనవుండు = భీష్ముడు (శంతనుని కుమారుడు)

భా: అని శస్త్రాలు విడిచిపెట్టి కొలువులో ఉండటం యిష్టం లేక లేచి వెళ్లిపోయాడు కర్ణుడు - అపుడు భీష్ముడు నవ్వుతూ దుర్యోధనునితో ఇలా అన్నాడు.

వి: ఇచ్చట 'నవ్వు' పరిహాసం, హేళన - వేళాకోళం సూచిస్తుంది. "గుడ్డి కన్ను తెరిస్తే ఎంత మూస్తే ఎంత?" అన్న భావం ఇందులో స్ఫురిస్తుంది.

క॥ **అంతకుఁ జాలఁడె కర్ణుం**
డింతకు మును బాసయిచ్చి యెన్నడు బొంకం
డింతటి మానిసి యలిగినఁ
గౌంతేయుల కెట్లు బ్రదుకఁగా వచ్చు ననిన్? **291**

అ: కర్ణుండు; అంతకున్ = అంతపని చేయటానికి; చాలఁడె? = తగినవాడు కాడా?; ఇంతకుమును = ఇంతకు ముందు; బాసయిచ్చి=మాట ఇచ్చి; ఎన్నఁడున్ బొంకండు = ఎప్పుడూ అసత్యమాడలేదు; ఇంతటి మానిసి = ఇంత మగవాడు; అలిగినన్ = కోపిస్తే; అనిన్ = యుద్ధంలో; కౌంతేయులకున్ = కుంతీకుమారులయిన పాండవులకు; ఎట్లు బ్రదుకగా వచ్చున్? = ఎట్లా బ్రతకడం సాధ్యం?

భా: కర్ణుడు అంత పనీ చేయగలవాడే. ఇతః పూర్వం ఎపుడూ మాటయిచ్చి తప్పని వాడు కదా! ఇంతటి మగవాడు అలిగితే ఆ పాండవులు యుద్ధంలో ఎలా బ్రతక గలరు?

వి: 1. భీష్ముని ఈ మాటలు వెటకారంగా అన్నవి - కర్ణుడు ఎంత పరాక్రమ వంతుడయినా సమయంలో నిలబడే శక్తి తక్కువ. అదృష్టం తక్కువ; ఘోష యాత్రలోనూ, ఉత్తరగో గ్రహణంలోనూ యుద్ధరంగం విడిచి పారిపోయాడు. ఇపుడు ముందునుంచీ అదేపని చేస్తున్నాడని భీష్ముని వెటకారం.

2. నకుల సహదేవులు కుంతీకుమారులు కాకపోయినా కౌంతేయులనడం కలదు. పాండవ సామాన్యంగా ఆ మాట తెలుగులోనూ సంస్కృతంలోనూ వాడారు.

క॥ **అని వెండియు నిట్లను "నా**
తని మాటల కెట్లుఁ గడఁగి ధర్మతనయుతో
నని సేయక తక్కవు నీ
వనుమానము వాయఁ జూడు మతనిని నన్నున్". **292**

అ: అని; వెండియున్=ఇంకా; ఇట్లు+అనున్; ఆతని మాటలకున్=ఆ కర్ణుని మాటలతో; ఎట్లున్=ఎట్లాగూ, ఏమయినా; కడఁగి=పూని; ధర్మతనయుతోన్; అని+ చేయక= యుద్ధం చేయక; తక్కవు = మానవు; అనుమానము + పాయన్ = సందేహం తీరేటట్లు; నీవు; అతనిని; నన్నున్; చూడుము;

భా: అని భీష్ముడింకా దుర్యోధనునితో ఇలా అన్నాడు. ఆ కర్ణుని మాటలు పట్టుకొని నీ వెట్లాగూ ధర్మరాజుతో యుద్ధం చేయక మానవు. నీ సందేహం తీరేటట్లు అతనినీ నన్నూ యుద్ధంలో చూడు. (నీకే తెలుస్తుంది)

వ: ఏను బాహ్లిక ద్రోణ ప్రముఖులు గనుంగొనుచుండఁ బ్రతివీరుల ననేక సహస్రంబుల సమయించెదఁ బిదప రాధేయురణంబునుం జూచెదవు గాక యనిన విని దుర్యోధనుండు గర్ణపక్షపాతియు నవినీతుండును నగుటంజేసి సహింపక పితామహుతో నిట్లనియె. 293

అ: ఏను = నేను; ప్రతివీరులు = శత్రువులు; సమయించెదన్ = చంపుతాను.

భా: నేను బాహ్లికుడు ద్రోణుడు మొదలయిన వారు చూస్తూ ఉండగా శత్రువులను ఎన్నోవేలమందిని చంపుతాను. తరువాత కర్ణుని యుద్ధాన్ని చూస్తావులే అన్నాడు. అది విని దుర్యోధనుడు కర్ణ పక్షపాతి అవినీతుడు కావటం వల్ల సహింప లేక భీష్మునితో ఇలా అన్నాడు.

వి: భీష్ముడు పదిరోజులు యుద్ధం చేశాడు కర్ణుడు రెండురోజుల్లోనే పడిపోయాడు.

చ॥ ఎఱిఁగి యెఱింగి యొండె, మదినేది యెఱుంగక యొండె; నెప్డు నం
దఱు వినఁ "బాండు నందనులు దర్పితులై యనిగెల్తు" రందు; ముం
దఱ నిను బాహ్లికున్ గురునిఁ దక్కటి వారిని నమ్మి యేను నే
డ్తెఱ నని సేయఁ బూనితిఁ గడింది మగంటిమి తోడు చాలదే! 294

అ: ఎఱిఁగి యెఱింగి ఒండె = బాగా తెలిసి కానీ; మదిన్ = మనసులో; ఏది యెఱుంగక యొండె = ఏమీ తెలియక కానీ; ఎప్డున్ = ఎల్లప్పుడూ; అందఱు వినన్ = అందరూ వినేటట్లు; పాండునందనులు=పాండవులు; దర్పితులై = ఉత్సాహముకలవారై; అనిన్= యుద్ధంలో; గెల్తురు + అందు(వు) = గెలుస్తారంటావు; ముందఱ నినున్ = ముందు నిన్నూ; బాహ్లికున్; గురునిన్, తక్కటి వారిని = మిగిలిన వారినీ; నమ్మి; ఏను = నేను; ఏడ్తెఱన్ = ఉత్సాహంతో; అని - చేయన్ పూనితిన్ = యుద్ధం చేయదలచాను. కడింది మగంటిమి= అధిక మయిన పౌరుషం; తోడు - చాలదే! = సహాయం చాలదా (వారిని గెలవటానికి)

భా: బాగా తెలిసో, ఏమీ తెలియకో ఎప్పుడూ నీవు "పాండవులు యుద్ధంలో గెలుస్తా" రంటూ ఉంటావు పదిమందిలోనూ. నిన్ను బాహ్లికునీ, ద్రోణునీ మిగిలిన వారినీ నమ్మి యుద్ధానికి దిగాను. అసలు వారిని జయించటానికి నా పౌరుషం ఒకటి తోడు చాలదా?!

ఉ: కర్ణుఁడు దుస్ససేనుఁడును గల్గఁగ నా కొరులేల? సద్భటా
కీర్ణవిరోధి సైన్యముల గెల్వఁగఁ జాలుదు మేము; మాకు నీ
యర్ణవ వేష్టితక్షితి యనర్గళ విక్రమ మొప్ప దక్కు; మా
నిర్ణయమెల్ల నిట్టి, దవినీతియొ నీతియొ చూడుమీ తుదిన్. 295

అ: కర్ణుఁడు; దుస్ససేనుఁడును = దుశ్శాసనుడూ; కల్గఁగన్ = ఉండగా; నాకున్; ఒరులు + ఏల?= ఇతరులెందుకు?; సద్భట + ఆకీర్ణ విరోధి సైన్యములన్ = చక్కని యోధులతో నిండిన శత్రుసేనలను; ఏమ = మేమే; గెల్వఁగన్ చాలుదుము; అనర్గళ విక్రమము - ఒప్పన్ = అడ్డులేని పరాక్రమమం ప్రకటితమయ్యేటట్లు; మాకున్, ఈ అర్ణవ వేష్టితక్షితి = సముద్రం చేత చుట్టబడిన ఈ భూమి అంతా; దక్కున్=దక్కుతుంది; మా నిర్ణయము - ఎల్లన్ - ఇట్టిది; అవినీతియె; నీతియొ; తుదిన్ చూడుమీ = చివరలో చూడు.

భా: *కర్ణుడూ దుశ్శాసనుడూ ఉండగా నాకింకా ఇతరు లెందుకు? మేమే శత్రుసైన్యాలన్నిటినీ గెల్వగలము; అడ్డులేని మా పరాక్రమం అందరికీ తెలిసేటట్లుగా ఈ సముద్ర పర్యంతమయిన భూమి అంతా మాకే దక్కుతుంది. ఇది మా నిశ్చయం; ఇది నీతి అవుతుందో అవినీతి అవుతుందో చివరికి చూడు.*

క॥ అను పలుకులకు విషాదముఁ
దనుకఁగ ధృతరాష్ట్రవిభుఁడు దననందను నే
మనియుం బలుకఁగఁ జాలక
వెనుఁబాటున నిట్లు లనియె విదురుని తోడన్. 296

అ: అను పలుకులకున్; విషాదమున్ తనుకంగన్ = విచారం పొందగా/కలుగగా; ధృతరాష్ట్ర విభుఁడు; తన నందనున్ = తన కొడుకును; ఏమి + అనియున్ = ఏమనీ; పలుకంగన్ చాలక = అనలేక; విదురుని తోడన్; వెనుఁబాటునన్ = దుఃఖంతో; ఇట్టులు; అనియెన్.

భా: *ఆ మాటలకు విషాదం కలుగగా ధృతరాష్ట్రుడు తన కొడుకును ఏమీ అనలేక సంకోచంతో దుఃఖంతో విదురునితో ఇలా అన్నాడు.*

తే॥ మృత్యుపాశోపహతుఁ డయ్యె మీఁదు లేక
సూతనందనుతోఁ గూడి నాతనూజుఁ
డకట నాశంబుఁ బొందు వాఁడయ్యె మనకు
నింకఁ జేయంగ నగు పని యెద్ది చెపుమ! 297

అ: మీఁదులేక=భవిష్యత్తు లేక; మృత్యుపాశ+ఉపహతుఁడయ్యెన్ = యమపాశంతో కొట్టబడ్డాడు; నాతనూజుఁడు = నాకొడుకు; సూతనందనుతోన్ కూడి = కర్ణునితో కలిసి; నాశంబున్ పొందు వాఁడు అయ్యెన్ = నశిస్తాడు; అకటా! = అయ్యో; మనకున్; ఇంకన్; చేయంగనగుపని= చేయగలిగిన పని; ఎద్ది - చెపుమ! = ఏమిటో చెప్పు.

భా: *నా కొడుకు మృత్యుపాశంతో చుట్టబడ్డాడు. ఇక భవిష్యత్తు లేదు. కర్ణునితో సహా నా కొడుకు నశిస్తాడు. అయ్యో! ఇపుడిక మనమేం చెయ్యాలి? చెప్పు.*

వ: అనిన విని విదురుం డతని కిట్లను; మనవారలు మున్న దుర్బలులు తమలోనం బెనంకువ లయి విరస వచనంబు లాడుచు నింతలు పుట్టించుట యిది యర్జునునకుఁ గార్య సాధనం బింతియ కాక యేమను వారము? వారలు బంధుమిత్ర

సహాయులు దొరుకు నొక్క తలంపు వారలయి యున్న వారు, వలవని యీ వెంగలి మాటలు విడిచి పాండవులం బిలువం బనిచి తగవు నడపుట దక్క మనకుఁ జేయందగు పని వేఱొండు గలుగునే యని చెప్పిన ధృతరాష్ట్రుండు సంజయు చెప్పిన కార్యవచనంబుల కొఱంత వినం గలవాఁడై యతని దిక్కు మొగంబు సేసి. 298

అ: మున్న = ముందే; పెనంకువలు = కలహాలు; వలవని = పనికిరాని; వెంగలి= తెలివి తక్కువ మాటలు; తగవు నడపుట = న్యాయం చేయడం; వేఱు + ఒండు = మరొకటి; కొఱంత = మిగిలినది.

భా: *ఆ మాటలు విని విదురుడు ధృతరాష్ట్రునితో ఇలా అన్నాడు. "మనవారు ముందే బలహీనులు; పైగా తమలో తాము కలహించుకొని విరసంగా మాట్లాడుకొని యింతవరకు తెచ్చుకోవడం అర్జునుని కార్యసాధనానికి మంచిది; అంతే తప్ప ఏమనగలము? పాండవులు బంధుమిత్రుల సాయం కలవారు. పైగా ఒకేమాట మీద ఉండేవారు. అనవసరమయిన ఈ తెలివితక్కువ మాటలు వదలి పాండవులను పిలిపించి న్యాయం చెయ్యటం తప్ప మరోపని లేదు." అన్నాడు. అపుడు ధృతరాష్ట్రుడు సంజయుడు చెప్పిన మాటల కొఱత ఇంకా వినాలని అతని వైపు మొగం పెట్టి. (ఇలా అన్నాడు.)*

క॥ **మును వరుస తోడఁ దన తలం**
చిన యన్నియు నీవు వినఁగఁ జెప్పి తగవుమై
నిను వీడుకొల్పు నెడ న
ర్జునుఁ డేమని నిశ్చయించెఁ జూతము చెపుమా! 299

అ: మును = ముందుగా; వరుసతోడన్; తన తలచిన = తాను తలచిన; అన్నియున్; నీవు; వినఁగన్ చెప్పి ; తగవుమైన్ = మర్యాదతో; నినున్; వీడుకొల్పు + ఎడన్ = పంపించేటప్పుడు; అర్జునుఁడు; ఏమని; నిశ్చయించెన్; చెపుమా చూతము = చెప్పుచూద్దాం.

భా: *ముందు క్రమంగా తా ననుకొన్న వన్నీ నీకు చెప్పి చివరలో నిన్ను గౌరవంతో వీడుకొని పంపేటప్పుడు అర్జునుడు ఏమన్నాడో చెప్పుచూద్దాం.*

క॥ **అని యడిగిన సంజయుఁ డి**
ట్లనుఁ దుది బార్థుండు నిశ్చయము సేసి సుయో
ధనుతో నిందలి పెద్దలు
వినఁగా ననుమన్న పలుకు వినుము నరేంద్రా! 300

అ: అని అడిగినన్; సంజయుఁడు; ఇట్లను; నరేంద్రా! = రాజా!; తుదిన్ = చివరగా; పార్థుండు = అర్జునుడు; నిశ్చయము - చేసి; సుయోధనుతో; ఇందలిపెద్దలు; వినఁగాన్ = వినేటట్లుగా; అనుము + అన్నపలుకు = చెప్పమన్న మాట; వినుము.

భా: *అని అడిగితే సంజయుడిలా అన్నాడు. "రాజా! నేను వచ్చేముందు అర్జునుడు నిశ్చయించి ఇక్కడి పెద్దలంతా వినేటట్లు పలుకుమన్న మాట విను చెపుతాను.*

మ॥ కురువంశోత్తముఁడైన ధర్మజుఁడు "నాకుం దండ్రిపా లీఁదగున్
ధరలో సా" మని తాన పల్క వినియున్ దర్పంబుమై నీక త
క్కిరయేనిం, జటులాస్మదీయ విశిఖాగ్ని జ్వాలలం దాహుతుల్
వరుసం బెట్టుదు ధార్త రాష్ట్రతతి నైశ్వర్యం బవార్యంబుగన్. 301

అ: కురువంశ + ఉత్తముఁడు - ఐన = కురువంశంలో శ్రేష్ఠుడయిన; ధర్మజుఁడు; "నాకున్; తండ్రిపాలు; ధరలో సాము = భూమిలో సగం; ఈన్ - తగున్ = ఇవ్వదగును; అనితానపల్కన్ = అని తానే చెప్పగా; వినియున్ = వినికూడా; దర్పంబుమైన్ =గర్వంతో; ఈక= ఇవ్వక; తక్కిరయేనిన్=మానినట్లయితే; ఐశ్వర్యంబు = పరాక్రమము; అవార్యంబుగన్ = నివారింప రానిదికాగా; చటుల+ అస్మదీయ విశిఖ + అగ్ని జ్వాల లందున్ = భయంకరమయిన నా బాణాగ్ని జ్వాలలలో; ధార్త రాష్ట్రతతిన్ =కౌరవుల సముదాయాన్ని; వరుసన్; ఆహుతుల్ పెట్టుదున్= ఆహుతులు చేస్తాను.

భా: *కురువంశ శ్రేష్ఠుడయిన ధర్మరాజు తనంతతాను "నాకు నా తండ్రి పాలయిన సగం భూమి ఇవ్వదగును" అని అంటే వినికూడా గర్వంతో ఇవ్వకపోతే పరాక్రమంతో ఆ కౌరవులందరినీ వరుసగా నా బాణాగ్ని జ్వాలలకు ఆహుతులిస్తాను.*

వి: ఇక్కడ ఐశ్వర్యంబు అనే పదం సముచితంగా ప్రయోగింపబడింది. సాధారణంగా ఐశ్వర్యం అంటే పరాక్రమం అని అర్థం చెప్పడం కద్దు. కాని ఈ పదానికి వ్యుత్పత్తి "ఈశ్వరుని భావం" అని అర్థం. ఈశ్వర స్వభావం లయం కావించడం. నశింపజేయడం అదే ఐశ్వర్యం ఇక్కడ.

వ: అని పలికి కౌఁగిలించుకొని భూషణాంబరాది కమనీయ వస్తువు లొసంగిన నేనునుం బాండవులను వాసుదేవుని సవినయంబున వీడ్కొని యింతవట్టును దేవరకు నెఱింగింప వేగంబ వచ్చితి ననిన నమ్మాటలు దుర్యోధనుం డాదరింపక పెడచెవులం బెట్టె, ధృతరాష్ట్రుండును ఱిచ్చవడి యూరకుండె నప్పు డయ్యిరువుర పాలను సంజయుం డొక్కరుండు దక్క నయ్యాస్థానంబున నున్న సమస్త జనంబులును దిగ్గన లేచి తమతమ నివాసంబులకుం బోయిరి. తదనంతరంబ. 302

అ: భూషణ + అంబర + ఆది = ఆభరణాలు వస్త్రాలు మొదలయిన; కమనీయ వస్తువులు = చక్కని పదార్థాలు; ఇంతవట్టును = ఇది అంతా/ఇంత వరకూ; దేవరకున్ = రాజు గారికి; పెడచెవులం బెట్టె = వినక నిరాదరించాడు; లెక్క చేయలేదు; ఱిచ్చవడి =నిశ్చేష్టత నొంది; కొయ్యబారిపోయి; పాలను = సమీపాన; తత్ - అనంతరంబ = ఆతరువాత;

భా: *అని పలికి కౌగలించుకొని వస్త్రాభరణాలు మొదలయిన చక్కని వస్తువులిస్తే నేను పాండవులనూ కృష్ణునీ వీడుకొని ఇదంతా తమకు తెలియజేయటానికి వేగంగా వచ్చాను. అంటే ఆ మాటలు దుర్యోధనుడు పెడచెవిని పెట్టాడు. ధృతరాష్ట్రుడు కొయ్యబారి పోయి ఉరకుండిపోయాడు. అపుడా యిద్దరి దగ్గర సంజయుడొక్కడూ తప్ప ఆ కొలువులో ఉన్న జనులంతా లేచి తమతమ ఇళ్లకు వెళ్లిపోయారు. ఆ తరువాత.*

వి: ఇప్పుడు ఆ స్థానంలో ముగ్గురే ఉన్నారు. 1. ధృతరాష్ట్రుడు 2. దుర్యోధనుడు 3. సంజయుడు.

క॥ తనుజ వశవర్తియగు న
మ్మనుజేంద్రుఁడు దనసుతుండు మర్దింపఁగ నో
పునొ యనిఁ బాండు తనూజుల
నను మతి సంజయునితోడ నాడె దురాశన్. 303

అ: తనుజ వశవర్తి - అగు = కుమారునికి వశమయి ప్రవర్తించే వాడయిన; ఆ + మనుజ + ఇంద్రుఁడు = ఆ మహారాజు; తన సుతుండు = తన కొడుకు; అనిన్ = యుద్ధంలో; పాండు తనూజులన్ = పాండవులను; మర్దింపఁగన్; ఓపునొ = సంహరింపగలడేమో; అనుమతిన్= అనే బుద్ధితో; సంజయునితోడన్; దురాశన్ = దురాశతో; ఆడెన్ = పలికాడు.

భా: కొడుకు వశంలో ప్రవర్తించే ఆ ధృతరాష్ట్రుడు "పాండవులను యుద్ధంలో తనకొడుకు గెలవగలడేమో" అనే బుద్ధితో దురాశతో సంజయునితో ఇలా అన్నాడు.

సీ॥ ఈ రెండు వీఁకుల తారతమ్యంబులు
నెఱుఁగుదు పోరైన నెవ్వ రోర్తు
రిది నిశ్చయింతమే యెందు నుపాయంబుఁ
బౌరుషంబును గలవారు గలరు
చూతము చెపుమన్న సూతనందనుఁడు న
న్నడిగెదవే నొంటి యడుగ వలదు
మీయయ్య సాత్యవతేయుఁ డీ యెడకు వేం
చేయునట్లుగ భక్తిఁ జేసి తలఁపు
తే॥ పిలువఁ బంపు గాంధారి, వారలు వినీతి
రతులు నిశ్చయవిదులు ధర్మజ్ఞచిత్తు
లుల్లమున నీ కసూయాదు లొదవెనేని
పూని మాన్పంగ నేర్తురు మానవేంద్ర! 304

అ: ఈ రెండు వీఁకుల = ఈ రెండు సేనల యొక్క; తారతమ్యంబులున్ = తేడాలు; ఎఱుంగుదు=ఎరుగుదువు; పోరు+ఐనన్=యుద్ధమే వస్తే; ఎవ్వరు - ఓర్తురు = ఎవరు జయిస్తారు?; ఇది నిశ్చయింతమే=ఈ విషయం నిశ్చయించుదామా!; ఎందున్=రెండు సేనల్లోనూ; ఉపాయంబున్; పౌరుషంబును; కలవారు; కలరు; చెపుము - చూతము =చెప్పుచూద్దాం; అన్నన్= అంటే; సూతనందనుండు = సంజయుడు; నన్నున్ అడిగెదవేని; ఒంటి అడుగవలదు = ఒంటరిగా అడగవద్దు; మీ అయ్య = మీ తండ్రి; సాత్యవతేయుఁడు = వ్యాసుడు (సత్యవతి పుత్రుడు); ఈ ఎడకున్ = ఇక్కడకు; వేంచేయు నట్లుగన్ = వచ్చేటట్లు; భక్తిన్ చేసి తలఁపు=భక్తితో తలచు కొనుము; గాంధారిన్; పిలువన్ పంపుము = పిలిపించు; వారలు = వారిద్దరూ; వినీతిరతులు; నీతియందు ఆసక్తి కలవారు; నిశ్చయవిదులు = నిశ్చయం తెలిసినవారు; ధర్మజ్ఞచిత్తులు =

ధర్మమెరిగిన మనసుకలవారు; మానవ + ఇంద్ర = రాజా! నీకున్; ఉల్లమునన్ = మనసులో; అసూయా+ఆదులు = ఈర్ష్య మొదలయినవి; ఒదవెనేని = కలిగితే; పూని = పూనుకొని; మాన్పంగ నేర్తురు = పోగొట్టగలరు.

భా: ఈ రెండు సేనలలోనూ తారతమ్యాలు నీవు ఎరుగుదువు - యుద్ధం వస్తే ఎవరు జయిస్తారు? ఇది నిశ్చయించుదామా? రెండు సేనల్లోనూ ఉపాయమూ పరాక్రమమూ కలవారున్నారు గదా! చూద్దాంచెప్పు. అంటే సంజయుడిలా అన్నాడు. రాజా! నన్నడిగితే నన్ను ఒంటరిగా అడగవద్దు; మీ తండ్రి వ్యాస మహర్షి వచ్చేటట్లుగా తలచుకో - గాంధారిని పిలిపించు; వారు నీతిపరులు; నిశ్చయ మెరిగినవారు; ధర్మమెరిగిన మనసుకలవారు; నీకు మనసులో అసూయాదులు కలిగితే వారు మాన్పగలరు అన్నాడు.

-: కృష్ణ ద్వైపాయనుఁడు ధృతరాష్ట్రుని యొద్దకు వచ్చుట :-
సం: 5-65-8

వ: అనిన విని యంబికా నందనుం డట్లకాక యని యొక కంచుకిం బిలిచి వానిం బుచ్చి గాంధారి రావించి, సద్భక్తి తాత్పర్యంబునఁ గృష్ణద్వైపాయన మహామునిం దలంచిన దివ్యబోధ మహనీయుండైన మహాత్ముండు విజయం చేయుటయు నందఱు దండ ప్రణామంబుల సేసి సమున్నతాసనంబున నునిచి యర్ఘ్యపాద్యాది విధులం బూజించి యున్న సమయంబున ధృతరాష్ట్రుండు విన్నపంబు సేయకమున్న యమ్మహాపురుషుండు ధృతరాష్ట్ర సంజయుల చిత్తవృత్తులు దానయెఱింగిన వాఁడగుటం జేసి సంజయు వలనఁ బ్రసన్న దృష్టి నవలోకించి యతని కిట్లనియె. 305

అ: అంబికా నందనుండు =అంబికకొడుకు ధృతరాష్ట్రుడు; అట్లకాక = అట్లే అగుగాక; వానిన్ + పుచ్చి =వాని పంపి; కృష్ణద్వైపాయనుడు=వ్యాసుడు; దివ్యబోధ మహనీయుండు =దివ్య జ్ఞానం చేత గొప్పవాడు; విజయం చేయుటయు = రావడమూ; దండ ప్రణామంబులు =సాష్టాంగ నమస్కారాలు; సమున్నత + ఆసనంబునన్ = ఎత్తయిన ఆసనం మీద; ఉంచి = కూర్చుండబెట్టి; అర్ఘపాద్యాదులు = చేతులకు కాళ్లకు నీళ్లు మొ॥ తాన = తానే; సంజయు వలనన్ = సంజయుని దిక్కు; ప్రసన్నదృష్టిన్ = అనుగ్రహంతో కూడిన చూపులతో; అవలోకించి = చూసి.

భా: ఆ మాటలు విని ధృతరాష్ట్రుడు అలాగే అని ఒక కంచుకిని పిలిచి వానిని పంపించి గాంధారిని రప్పించి భక్తితో వ్యాసమహర్షిని తలచుకొన్నాడు. వెంటనే దివ్యజ్ఞాన మహనీయుడూ మహాత్ముడూ అయిన వేదవ్యాసుడు వచ్చాడు. అందరూ సాష్టాంగ నమస్కారాలు చేశారు. వ్యాసమహర్షిని ఒక ఉన్నతాసనం మీద కూర్చుండబెట్టారు. అర్ఘ్యపాద్యాదులతో పూజించారు. ఆ సమయంలో ఇంకా ధృతరాష్ట్రుడు విన్నపం చేయక ముందే వ్యాసుడు ధృతరాష్ట్ర సంజయుల మనః ప్రవృత్తులు తానే ఎరిగిన వాడు కావటం వల్ల సంజయుని వైపు ప్రసన్నంగా చూసి అతనితో ఇలా అన్నాడు.

వి: 1. ధృతరాష్ట్రుడు తలచుకొంటే చాలు వ్యాస మహర్షి వస్తాడు. ఇది భారతంలో చాలా చోట్ల కనపడుతుంది.

2. దండంవలె (కర్రలాగా) నేలమీద పడి చేసే నమస్కారం దండ ప్రణామం

3. పెద్దలూ మాన్యులూ వచ్చినపుడు షోడశ ఉపచారాలతో సత్కరించాలి. దైవాన్ని కూడా అట్లాగే పూజిస్తాము. అదే షోడోశోపచార పూజా విధి అంటాము. 1. ఆవాహనము (ఆహ్వానం పిలవడం) 2. ఆసనము 3. పాద్యము 4. అర్ఘ్యము 5.ఆచమనీయము 6. స్నానము 7. వస్త్రము 8. యజ్ఞోపవీతము 9. గంధము 10. పుష్పము 11. ధూపము 12. దీపము 13. నైవేద్యము 14. తాంబూలము 15. నమస్కారము 16. ఉద్వాసనము.

క॥ నీవు సమస్తము నెఱుఁగుదు,
గావున నీకూరకుండఁగాఁ దగదు; ధరి
త్రీవల్లభుఁ డడిగిన పని
యీవిధ మని తెలియఁ బలుకు మేను వినంగన్. 306

అ: నీవు; సమస్తమున్=అంతా; ఎఱుఁగుదు(వు); కావునన్; నీకున్+ఊరకుండఁగాన్-తగదు = నీవు ఊరుకోరాదు; ధరిత్రీ వల్లభుఁడు = రాజు; అడిగిన పని; ఏను వినంగన్ = నేను వినేటట్లు; ఈ విధము + అని = ఇట్లా అని; తెలియన్ + పలుకుము = తెలియజెప్పు.

భా: *నీ కంతా తెలుసు - అందుచేత నీవు ఊరుకోకూడదు. ధృతరాష్ట్రుడు అడిగిన పని నేను వినేటట్లుగా ఇట్లా అని తెలియజెప్పు.*

వి: ఎవరయినా ఏదయినా అడిగితే అది తనకు తెలిస్తే తప్పకుండా చెప్పాలి. మౌనం వహించరాదు. చెప్పేది సత్యమే చెప్పాలి. ఈ విషయమై నన్నయ ఒక చక్కని పద్యం చెప్పాడు.

తన యెఱిఁగి నయర్థం బొరుఁ
డనఘా! యిది యెట్లు చెప్పుమని యడిగినఁ జె
ప్పని వాఁడును సత్యము చె
ప్పని వాఁడును ఘోరనరక పంకమునఁ బడున్-

వ: అనినఁ బ్రసాదంబని సంజయుండు ధృతరాష్ట్రున కిట్లనియె. 307

అ: ప్రసాదము = అనుగ్రహం

భా: *ఆ మాటలకు తమ అనుగ్రహం అని సంజయుడు ధృతరాష్ట్రునితో ఇలా అన్నాడు.*

క॥ ఆసేనకు నీసేనకు
వాసి యడిగె దీవు నన్ను; వసుదేవసుతుం
డా సేనఁ గలఁడు, తత్సము
నీ సేనం జూపుమా! నరేశ్వర! నాకున్. 308

అ: ఆ సేనకున్; ఈ సేనకున్; వాసి=తారతమ్యం/ తేడా; అడిగెదు - ఈవు నన్నున్= అడుగుతున్నావు నీవు నన్ను; వసుదేవసుతుండు = వసుదేవుని కొడుకు కృష్ణుడు; ఆ సేనన్ -

కలఁడు; నరేశ్వర = రాజా! తత్సమున్ = ఆతనితో సమానుని; ఈ సేనన్ = కౌరవ సైన్యంలో; నాకున్; చూపుమా!.

భా: పాండవసేనకూ కౌరవసేనకూ నీవు నన్ను తేడా అడుగుతున్నావు. ఆ సేనలో కృష్ణు డున్నాడు. ఆతనితో సమానుని కౌరవసేనలో చూపించు నాకు. (ఎవరూ లేరని భావం)

వ: వాసుదేవుం డెట్టివాఁ డని యడిగెదేని జెప్పెద. 309

భా: కృష్ణు డెటువంటి వాడని అడిగితే చెపుతా విను.

చ॥ జగముల నన్నిటిం దన వశంబుగఁ జేసిన వీరు భంగమున్
బగయు లలాటలోచనుఁడు వాపఁగఁ బేర్చిన యట్టి బాణునొ
క్క గడియలోన గర్వమడఁగం బఱిమార్చె; సురేంద్ర కల్పకం
బు గరము లీలఁ దెచ్చె హరి భూరి పరాక్రమ మప్రసిద్ధమే! 310

అ: జగములన్ అన్నిటిన్ = లోకాలన్నిటినీ; తన వశంబుగన్ చేసిన = తన వశం చేసుకొన్న; వీరున్ =వీరుని; భంగమున్ = అవమానాన్ని; పగయున్ = శత్రుత్వాన్ని; లలాట లోచనుఁడు=శివుడు; పాపఁగన్ = పోగొట్టగా; పేర్చిన యట్టి బాణున్ =అతిశయించిన బాణాసురుని; గర్వము+అడఁగన్=గర్వం నశించేటట్లు; ఒక్క గడియలోన; పఱి మార్చెన్ = చంపెను; సురేంద్ర కల్పకంబు = ఇంద్రుని కల్పవృక్షాన్ని; కరము లీలన్ తెచ్చెన్ = మిక్కిలి తేలికగా విలాసంగా తెచ్చాడు. హరి భూరి పరాక్రమము = కృష్ణుని అధికమైన శౌర్యం; అప్రసిద్ధమే= ప్రసిద్ధమైనదే కదా. తెలియనిదా?

భా: శివుడు స్వయంగా శత్రుత్వాన్ని తీర్చిన వీరుడు బాణాసురుడు. అతడు లోకాలన్నిటినీ తన వశం చేసుకొన్నాడు. అటువంటి బాణాసురుని ఒక్కగడియలో సంహరించాడు కృష్ణుడు. అతని పరాక్రమం ఎవరికి తెలియనిది? అందరికీ తెలిసినదే.

ఆ: అధిక దుష్కరంబులైన కార్యంబులు
క్రీడ వోలెఁ జేయుఁ గేశవుండు
విను మతండు పార్థు నెనసి యేకార్థుఁడై
యుండుఁ బూర్వభవ సఖుండు గాన. 311

అ: అధిక దుష్కరంబులు + ఐన = మిక్కిలి కష్టములయిన; కార్యంబులు = పనులు; కేశవుండు = కృష్ణుడు; క్రీడవోలెన్ చేయున్ = ఆటలాగా చేస్తాడు; వినుము; పూర్వభవ సఖుండు కాన = పూర్వజన్మలో స్నేహితుడు కాబట్టి; అతఁడు = కృష్ణుడు; పార్థున్ ఎనసి = అర్జునునితో కలిసి; ఏ కార్థుఁడై + ఉండున్ = ఒకే ప్రయోజనం అపేక్షించి ఉంటాడు.

భా: చాలా కష్టమయిన పనులను కృష్ణుడు తేలికగా ఆటలాడినట్లు చేస్తాడు. అతడు పూర్వ జన్మలోనే అర్జునునికి మిత్రుడు కావటం వల్ల ఆ అర్జునునితో కలిసి ఒకేపని మీద ప్రవర్తిస్తూ ఉంటాడు.

వి: అర్జునుని పనియే కృష్ణుని పని. ఇరువురికీ భేదంలేదు కలిసే ఉంటారు. ఇద్దరి పనీ ఒకటే. పూర్వ జన్మలో వీరిరువురూ నర నారాయణులు.

వ: అట్టి వాసుదేవుని చక్రంబు నిజమాయా బలంబునఁ బాండవుల సర్వసమర సాధనంబుల యందును సూక్ష్మరూపవ్యాపియై నిలిచి వారికి విజయం బొసంగు చుండు నని చెప్పి మఱియు నిట్లనియె. 312

అ: నిజమాయా బలంబునన్ = తన మాయాశక్తి చేత; సర్వ సమర సాధనంబుల యందును = అన్ని యుద్ధ పరికరాల్లోనూ.

భా: అటువంటి కృష్ణుని చక్రం తన మాయాబలం చేత పాండవుల యుద్ధపరికరాలన్నిటిలోనూ సూక్ష్మరూపంగా వ్యాపించి ఉండి పాండవులకు విజయం కలిగిస్తూ ఉంటుంది. అని చెప్పి ఇంకా ఇలా అన్నాడు.

వి: కృష్ణుని చక్రం పేరు సుదర్శనము. ఇది అగ్నిహోత్రుడు ఖాండవ వన దహన సమయంలో ఇచ్చాడు.

క॥ పలుమఱుఁ బాండుతనూజుల
కొలఁది వితర్కించెదవు, నిగూఢం బది యేఁ
దెలియం బలికెద; వారికి
బలమును సత్త్వంబు హరియ పార్థివముఖ్యా! 313

అ: పార్థివముఖ్యా! = రాజశ్రేష్ఠుడా! పలుమఱున్ = చాలాసార్లు; పాండు తనూజుల కొలఁది=పాండవుల శక్తిని గురించి; వితర్కించెదవు = ఆలోచిస్తున్నావు; నిగూఢంబు+ అది =అది రహస్యమయినది; ఏన్ =నేను; తెలియన్ పలికెదన్ = తెలియజెప్పుతాను; వారికిన్ = పాండవులకు; బలమును; సత్త్వంబునున్ = ప్రాణమూ; వివేచనమూ; హరియ = కృష్ణుడే.

భా: ధృతరాష్ట్ర మహారాజా! మాటిమాటికీ పాండవుల శక్తి సామర్థ్యాల గురించి ఆలోచిస్తున్నావు. అది ఒక రహస్యం. నేను చెవుతా విను. ఆ పాండవులకు బలమూ ప్రాణమూ శ్రీకృష్ణుడే.

వ: హరి మహత్త్వంబు విన్నవించెద నవధరింపుము. 314

భా: కృష్ణుని మహిమ చెపుతాను విను.

క॥ ఒకతల సమస్త జగములు
నొకఁడ జనార్దనుఁడు నిలిచి యొకతల యైనన్,
సకలము నసార, మాతం
డొకరుని సారంబ చాల నుత్కృష్టమగున్. 315

అ: ఒకతల = ఒకప్రక్క; సమస్త జగములున్ = అన్నిలోకాలూ; జనార్దనుఁడు- ఒకఁడ= కృష్ణుడొక్కడే; నిలిచి, ఒకతల యైనన్ = ఒక ప్రక్క అయినా; సకలమున్ అసారము = సమస్త లోకాలూ ఉన్న ప్రక్క లేనిది; ఆతండొకరుని సారంబ = ఆతడొక్కని శక్తియే; చాలన్

ఉత్కృష్టమగున్= చాలఎక్కువగును.

భా: అన్నిలోకాలూ ఒక్కవైపు ఉండి, కృష్ణుడొక్కడే మరోవైపు ఉన్నా అన్ని లోకాల వైపు సారం లేనిదే. ఆత డొక్కని సారమే అధికంగా ఉంటుంది. అన్ని లోకాల శక్తి కంటె అతని శక్తియే అధికం.

క॥ తలఁపునన వాసుదేవుఁడు
గలిగింపను నిలుప నడఁపఁగా నోపు జగం
బుల; మఱియునుఁ గ్రీడార్థము
పలువోకలఁ బుచ్చుచుండుఁ బౌరవనాథా! 316

అ: పౌరవనాథా! = పూరు వంశపురాజా! వాసుదేవుఁడు = కృష్ణుడు; తలఁపునన = సంకల్పం చేతనే; జగంబులన్ = లోకాలను; కలిగింపను = సృష్టించటానికి; నిలుపన్ = పోషించ టానికి; అడఁపగాన్=నశింపజేయటానికి; ఓపున్=సమర్థుడగును. మఱియును=ఇంకా; క్రీడార్థము= వినోదంకోసం, ఆటకోసం; పలుపోకలన్ = ఎన్నో నడకలతో; పుచ్చుచుండున్ = ఆడిస్తూ ఉంటాడు.

భా: ఆ కృష్ణుడు సంకల్ప మాత్రం చేతనే లోకాలను సృష్టిస్తాడు, పోషిస్తాడు, సంహరిస్తాడు. అంతేకాదు వినోదం కోసం ఎన్నో గమనాలతో ఆ లోకాలను ఆడిస్తాడు.

క॥ ఎక్కడ నడచును సత్యం,
బెక్కడ ధర్మంబు వరఁగు, నెక్కడఁ గలుగుం
జక్కటి, నిలుచుం గృష్ణుం
డక్కడ, నతఁ డున్నకడన యగు జయ మధిపా! 317

అ: అధిపా! =రాజా!; ఎక్కడ; సత్యంబు; నడచును = ఉంటుందో; ఎక్కడ; ధర్మంబు; పరగున్ = వ్యాపించి ఉంటుందో; ఎక్కడ; చక్కటి = ఆర్జవం; కలుగున్ = ఉంటుందో; అక్కడ; కృష్ణుడు; నిలుచున్ =ఉంటాడు; అతఁడు - ఉన్నకడన = ఉన్నచోటనే; జయమగున్ = విజయం కలుగుతుంది.

భా: రాజా! సత్యం ఎక్క ఉంటుందో, ధర్మం ఎక్కడ ఉంటుందో; ఆర్జవం ఎక్కడ ఉంటుందో అక్కడ కృష్ణుడు ఉంటాడు. అతడున్న చోటనే జయం లభిస్తుంది.

వి: దీనిమూలం ఇది

యత స్సత్యం యతో ధర్మో యతోహ్రీ రార్జవం యతః
తతో భవతి గోవిందో యతఃకృష్ణ స్తతో జయః

ఇదే భావం భగవద్గీతలో ఇలా ఉంది.

యత్ర యోగేశ్వరః కృష్ణో యత్రపార్థో ధనుర్ధరః
తత్ర శ్రీ ర్విజయో భూతి ర్ధ్రువా నీతి ర్మతిర్మమ 18-78

సీ॥ పురుషోత్తముం డెల్ల భువనంబులును; దాన
యఖిల భూతాత్మకుండై విహార

లీల విచేష్టించు; నీ లోకముల మాయ
దొట్టి యొక్కొక మరి పుట్టి పెరిగి
కర్మానుచరణముల్ గైకొని వర్తించు;
శిష్ట రక్షణమును దుష్టనిగ్ర
హంబును దన పను లగుటఁ, బాండవుల నె
పం బిడుకొని ధర్మబాహ్యులైన
తే॥ నీ తనూజుల నిక్కమ నిగ్రహింపఁ
దలచి నాఁ డమ్మహాత్ముండు; దథ్య; మతని
నిట్టి చందంబు వాఁడని యెఱఁగి యెవ్వ
రాశ్రయింతురు బ్రదుకుదు రట్టివారు. 318

అ: పురుషోత్తముండు = కృష్ణుడు; ఎల్ల భువనంబులును= అన్నిలోకాలూను; తాన= తానే; అఖిల భూత + ఆత్మకుండు + ఐ = అన్నిప్రాణులలోనూ ఉండి; విహార లీల విచేష్టించున్= విహరించినట్లు క్రియలు సాగిస్తాడు. ఈ లోకములన్ ; మాయదొట్టి =మాయచేత; ఒక్కొక మరి= ఒక్కొక్కసారి; పుట్టి; పెరిగి; కర్మానుచరణముల్ = కర్మానుబంధాలను; కైకొని = పొంది; వర్తించున్= ప్రవర్తిస్తాడు; శిష్ట రక్షణమును = సజ్జనులను రక్షించడమూ; దుష్టనిగ్రహంబును = దుర్జనులను శిక్షించడమూ;తన పనులు అగుటన్=తన పనులవడం వల్ల;ఆ+మహాత్ముడు; పాండవుల; నెపంబు= ఇడుకొని =పాండవుల నెపం పెట్టుకొని. ధర్మ బాహ్యులైన = అధర్మపరులయిన; నీతనూజులన్= నీ కొడుకులను; నిక్కమ = నిజంగా; నిగ్రహింపన్ తలఁచి నాడు = శిక్షింపదలచినాఁడు; తథ్యము= ఇది నిజం; అతనిన్ = ఆ కృష్ణుని; ఇట్టి చందంబువాఁడు = ఇటువంటి రీతివాడు; అని ఎఱిఁగి= అని తెలుసుకొని; ఎవ్వరు + ఆశ్రయింతురు = ఎవరు ఆశ్రయిస్తారో; అట్టివారు; బ్రదుకుదురు.

భా: అన్నిలోకాలూ ఆ పురుషోత్తముడే. తానే అన్ని ప్రాణులలోనూ ఉండి విహరిస్తూ ఉంటాడు. ఒక్కొక్కప్పుడు మాయచేత ఈ లోకాల్లో పుట్టి పెరిగి కర్మానుబంధాలు పొంది ప్రవర్తిస్తూ ఉంటాడు. సజ్జన రక్షణమూ దుర్జన శిక్షణమూ తన కర్తవ్యం కావడం వల్ల ఆ మహాత్ముడు కృష్ణుడు పాండవుల నెపం పెట్టుకొని ధర్మదూరులయిన నీ కుమారులను శిక్షింపదలచాడు. ఇది తథ్యం. ఇటువంటి వాడని అతనిని తెలుసుకొని ఎవరాశ్రయిస్తారో వారు బ్రతుకుతారు.

క॥ అనవుడు ధృతరాష్ట్రుఁడు "వి
ష్ణుని నే నెఱుఁగని విధంబును దెలియఁగ నీ
కని యున్న తెఱఁగుఁ జెప్పుమ"
యనుటయు సూతసుతుఁ డిట్టులను నాతనితోన్. 319

అ: అనవుడు = అనగానే; ధృతరాష్ట్రుఁడు; "విష్ణునిన్; నేను ఎఱుఁగని విధంబును= నేను తెలిఁ...ని రీతినీ; తెలియఁగన్ = స్పష్టంగా; నీ కనియున్న తెఱఁగున్ = నీవు చూసి ఉన్న

పద్ధతినీ; చెప్పుము; అనుటయు = అనడమూ; ఆతనితోన్ = ధృతరాష్ట్రునితో; సూతసుతుఁడు; ఇట్టులు - అనున్.

భా: అపుడు ధృతరాష్ట్రుడు "విష్ణువును నేను చూడలేని విధమూ నీవు స్పష్టంగా చూడగలిగిన విధమూ రెండూ చెప్పు" అన్నాడు. వెంటనే సంజయుడు ధృతరాష్ట్రునితో ఇలా అన్నాడు.

వ: విద్యయు నవిద్యయు ననఁగా రెండు గల; నవిద్యా దూషితుండై తమోగ్రస్తుం డైనవాఁడు విష్ణు నెఱుంగఁడు; విద్యాసంపన్నుఁ డెఱుంగు; ననిన విద్య యనునది యెట్టిది? యెద్దాన నీవా సర్వేశ్వరు నెఱింగితి? దాని; నవిద్య యెట్టిది? దానిని, జెప్పు మనుటయు నాంబికేయునకు సంజయుం డిట్లనియె "సాత్త్విక రాజస తామస వికారంబుల త్రిప్పులం బడక ధర్మం బాచరించుచు భావశుద్ధి గలిగి యుండుదు, దీననే నచ్యుతు నెఱుంగుదు; విద్య యిట్టిది; నీకునుం, దక్కొవ్వరి కైనను నతని నెఱుంగుటకు నిదియ తెరు; విట్టిది గాని విధం బవిద్య యని చెప్పిన నతండు నిజ నందనున కిట్లనియె. 320

అ: అవిద్యా దూషితుండు = అవిద్యచేత దూషింప బడినవాడు; తమోగ్రస్తుడు = తమోగుణం చేత కప్పబడినవాడు; ఏ + దానన్ = దేనిచేత; ఆంబికేయుఁడు = అంబికాపుత్రుడు ధృతరాష్ట్రుడు; త్రిప్పులు = సుడులు; దీనన్ = దీనివల్ల; తెరువు = మార్గము; నిజనందనుడు = తనకొడుకు

భా: విద్య అని అవిద్య అని రెండున్నాయి. అవిద్యలో పడి తామసగుణం కలవాడు విష్ణుని తెలుసుకోలేడు. విద్య కలవాడు తెలుసుకోగలడు అన్నాడు. అపుడు ధృతరాష్ట్రుడు విద్య ఎటువంటిది? దేనివల్ల నీవు విష్ణుని తెలుసుకొన్నావో దానినీ, అవిద్య అంటే ఏమిటి? దానినీ చెప్పు అన్నాడు. అపుడు సంజయుడిలా అన్నాడు. సత్త్వరజస్తమోగుణాల భ్రమణంలో పడకుండా ధర్మం ఆచరిస్తూ నేను భావశుద్ధి కలవాడను. అందుచేత నేను విష్ణుని ఎరుగుదును. ఇదే విద్య, నీకు అయినా మరెవ్వరికయినా అతనిని తెలుసుకోవటానికి ఇదే మార్గం. ఇది కానిదే అవిద్య. అని చెపితే ధృతరాష్ట్రుడు తన కొడుకుతో ఇలా అన్నాడు.

క॥ మన కిప్పుఁడు సంజయుఁ, డీ
తని యుపదేశంబు వట్టి ధర్మమున ముకుం
దుని నాశ్రయింప వయ్యా; య
తనిఁ జొచ్చిన బ్రదుకు దీవుఁ దమ్ములు సుతులున్. 321

అ: సంజయుడు; మనకున్-అప్పుడు; ఈతని యుపదేశంబు-పట్టి=ఇతని బోధనను సరించి;ధర్మమునన్=ధర్మంతో; ముకుందున్=కృష్ణుని; ఆశ్రయింపవయ్యా=సేవించుము;

అతనిన్+చొచ్చినన్=చేరితే; ఈవు=నీవూ; తమ్ములు; సుతులున్=కొడుకులూ;బ్రదుకుదు=బ్రతికిపోతారు.

భా: *ఈ సంజయుడు మనకు చాలా హితుడు. ఈతని మాట బట్టి ధర్మంతో గోవిందుని ఆశ్రయించుము. అతని నాశ్రయిస్తే బ్రతికి పోతావు. నీవే కాదు. నీతమ్ములూ కొడుకులూ కూడా.*

చ॥ అనిన సుయోధనుండు దమ యయ్యకు నిట్లను. "నిజ్జగంబుల
న్నిని నొక వెట్ట మ్రింగినను, నెట్టన సర్వము గాచె నేనియు,
న్వినుము, ముకుందుఁ డర్జునుని నెచ్చెలి నాఁజెవులార వించు, నిం
క నతని నొక్కబామునకుఁగా ధృతి పెంపఱ నాశ్రయింతునే. 322

అ: అనినన్ = అంటే; సుయోధనుండు; తమ - అయ్యకున్ = తమ తండ్రితో; ఇట్లను; "ఈ + జగంబులు + అన్నినిన్ = ఈ లోకాలన్నిటిని; ఒకపెట్ట = ఒక్కసారిగా; మ్రింగినను= మ్రింగినా సరే!; నెట్టన = ఒక్కుమ్మడిగా; సర్వము = అంతటినీ; కాచెనేనియున్ = రక్షించినా సరే! వినుము; ముకుందుడు = కృష్ణుడు; అర్జునుని నెచ్చెలి = అర్జునుని స్నేహితుడు; నాన్ = అనేటట్లు; చెవులార వించున్ = చెవులారావింటూ; ఇంకన్; అతనిన్; ఒక్క బామునకున్ కాన్= ఒక కష్టం కోసం; ధృతి పెంపఱన్ = ధైర్యం సడలిపోయి; ఆశ్రయింతునే! = ఆశ్రయిస్తానా?

భా: *అపుడు దుర్యోధనుడు తమ తండ్రితో ఇలా అన్నాడు ఈ లోకాలన్నిటినీ ఒక్కసారిగా అతడు మింగినా సరే, అన్నిటినీ రక్షించినా సరే; కృష్ణు డర్జునుని మిత్రుడని చెవులారా వింటూ ఒక కష్టం కోసం ధైర్యం పోగొట్టుకొని అతనిని ఆశ్రయిస్తానా? ఎన్నడూ ఆశ్రయించను.*

తే॥ అనిన గాంధారి కిట్లను జనవిభుండు
నీతనూజుండు దుర్మాని నీతిబాహ్యుఁ
డుద్ధతుం డీసు మాని నాబుద్ధి వినఁడు
వీఁడు సెడుఁగాని బ్రదుకంగ లేఁడు సుమ్ము. 323

అ: అనినన్; గాంధారికిన్; జనవిభుండు = రాజయినధృతరాష్ట్రుడు; ఇట్లు అనున్; "నీతనూజుండు = నీ కొడుకు; దుర్మాని = దురభిమానం కలవాడు; నీతి బాహ్యుఁడు = నీతికి దూరమయిన వాడు; ఉద్ధతుండు = గర్వితుడు; ఈసుమాని = ఈర్ష్య విడచి; నా బుద్ధివినఁడు= నా మాట వినడు; వీఁడు; చెడున్ కాని; బ్రదుకంగన్‌లేఁడు సుమ్ము = బ్రతకలేడు సుమా!

భా: *ఆ మాటలు విని ధృతరాష్ట్రుడు గాంధారితో ఇలా అన్నాడు - "నీ కొడుకు దురభిమాని నీతిలేని వాడు. గర్వితుడూను - అసూయవిడిచి నామాట వినడు. వీడు చెడిపోయే వాడేకాని చక్కగా బ్రతకలేడు సుమా!.*

వి: కొడుకును గూర్చి చెడ్డగా చెపుతున్నాడు కాబట్టి ధృతరాష్ట్రుడు భార్యతో "నీ తనూజుడు" అన్నాడు. అనగా నీ లక్షణాలే వచ్చాయని భావం.

ఉ॥ నావుడుఁ దల్లి యిట్టులను నందనుతో "నిదియేల? యాయువున్
శ్రీ విభవంబులన్ మము నశేష సుహృజ్జనులం దొఱంగఁగా
నీవు గడంగె; దిట్టి యవినీతులునుం గలరే? వృకోదరుం
డైవిధి సంపఁగా నొరుల కాఁగఁగ వచ్చునె యింకఁ బుత్రకా!" 324

అ: నావుడున్ = అనగానే; తల్లి = తల్లియైన గాంధారి; సందనుతోన్ = కొడుకుతో; ఇట్టులు-అను; ''ఇదియేల?=ఇది ఎందుకు నీకు?; అయువున్ =ఆయువునూ; శ్రీ విభవంబులన్= సిరిసంపదలనూ; మమున్ = మమ్మల్ని; అశేష సుహృత్‌జనులన్ = అందరు స్నేహితులనూ; తొఱంగగాన్ = విడవటానికి; నీవు కడంగెదు = నీవు పూనుకొంటున్నావు; ఇట్టి అవినీతులున్ = ఇంతటి తెలివితక్కువారు; కలరె? = ఉన్నారా? పుత్రకా! = కొడుకా!; విధి = బ్రహ్మ; వృకోదరుండై= భీముని రూపంలో; చంపఁగాన్ = చంపుతూ ఉంటే; ఒరులకున్ = ఇతరులకు; ఇంకన్; ఆఁగఁగన్ వచ్చునె? = ఆపశక్యమా!

భా: *అపుడు గాంధారి కొడుకుతో "ఇదేమిటి? ఆయువూ సిరిసందలూ మమ్మల్నీ స్నేహితులందరినీ పోగొట్టుకొనేందుకు పూనుకొంటున్నావు. ఇంత తెలివి తక్కువ వారున్నారా ఎక్కడయినా? కుమారా! భీముని రూపంలో విధి చంపుతూ ఉంటే ఇతరు లాపగలరా?*

వ: అనియె నట్టియెడం గృష్ణద్వైపాయనుండు ధృతరాష్ట్రున కిట్లనుఁ "గృష్ణుండు నీకుం గూర్చు, నీవుం బరమాప్తుండైన సంజయు నతని పాలికిం బుచ్చి, తది లెస్స కార్యం బయ్యె, వీఁడును నిమ్మహానుభావు మహనీయ ప్రభావం బున్నరూ పెఱుంగు, వీని బుద్ధి విని యద్దేవు నాశ్రయింపు, మతం డేకాగ్రచిత్తులై యారాధించిన వారికిఁ జేరువ యగుఁ, గామ క్రోధోపహతులై తమ తమ ధనంబులం దృప్తులు గాక యన్యాయంబున వర్తించు వారలకు దూరంబై యుండు; నెల్లభంగుల నాతనిం జొచ్చి బ్రదుకు మనినం బ్రసాదం బట్ల చేయుదునని విచిత్ర వీర్యనందనుండు సూతనందనునితో నవ్వాసుదేవు నామ నిర్వచనంబు నాకుఁ దేటపడం దెలిపి యతనిం బొందు నుపాయం బుపదేశింపవే యని యడిగిన. 325

అ: నీకున్ కూర్చు = నీకు హితము చేయును; పుచ్చితి = పంపావు; లెస్స = మంచి; ఉన్నరూపు = యథార్థము; కామక్రోధ + ఉపహతులు = కామం చేతనూ, కోపం చేతనూ కొట్టబడినవారు; ఉపదేశింపవే = చెప్పవే

భా: *అని చెప్పింది. అపుడు వ్యాసుడు ధృతరాష్ట్రునితో ఇలా అన్నాడు. కృష్ణుడు నీకు హితుడు. నీవు ఆప్తుడైన సంజయుని అతని దగ్గరకు పంపావు. అది మంచి పని అయింది. ఈసంజయుడు ఆ కృష్ణుని ప్రభావం బాగా ఎరుగును. వీని మాట విని ఆ కృష్ణుని ఆశ్రయించుము. అతడు ఏకాగ్ర మనస్సుతో సేవించిన వారికి దగ్గరవుతాడు. కామక్రోధాలతో తమ సంపదలతో తృప్తి పొందక అన్యాయంగా ప్రవర్తించే వారికి దూరంగా*

ఉంటాడు. అన్ని విధాలా కృష్ణుని ఆశ్రయించి బ్రతుకు అంటే "చిత్తం అలాగే చేస్తాను" అని సంజయునితో ధృతరాష్ట్రుడు వాసుదేవ నామ నిర్వచనం చెప్పి అతనిని పొందే ఉపాయం చెప్పు అని అడిగితే...........

వి: అతండేకాగ్ర ....చేరువయగు

ఈ విషయం భగవద్గీతలో కృష్ణుడు చాలా చోట్ల చెప్పాడు.

అనన్యా శ్చింతయంతో మాం యేజనాః పర్యుపాసతే
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ **9-22**

యేతు సర్వాణీ కర్మాణీ మయి సన్న్యస్య మత్పరాః
అనన్యేనైవ యోగేన మాంధ్యాయన్త ఉపాసతే
తేషామహం సముద్ధర్తా మృత్యు సంసార సాగరాత్
భవామి న చిరా త్పార్థ మయ్యావేశిత చేతసామ్ **12-6,7**

తే॥ ఎల్లయందును దా వసియించు, టెల్ల
యదియుఁ దనయందు వసియించు టండ్రు వాసు
దేవుఁడనుపేరి కర్థంబు, దెల్ల,మింత
యెఱుఁగు జనులందుఁదగ వసియించు శుభము. **326**

అ: ఎల్లయందును = అన్నిటిలోనూ; తాన్ వసియించుట = తాను ఉండటమూ;ఎల్ల యదియున్=అన్నీ; తనయందున్ =తనలో; వసియించుట=ఉండటమూ; వాసుదేవుఁడు అను పేరికి అర్థంబు; అండ్రు=అంటారు; తెల్లము = స్పష్టము; ఇంత యెఱుఁగు = ఇంతా తెలుసుకొనే; జనులందున్; శుభము తగన్ వసియించున్ = శుభం ఉంటుంది.

భా: *అన్నిటిలోనూ తాను నివసిస్తూ, అన్నిటినీ తనలో ఉంచుకొనగలవాడు వాసుదేవుడు. ఈ అర్థం తెలిసిన వారికి శుభం చేకూరుతుంది.*

వి: దీనికి సంస్కృతం ఇది

వసనా త్సర్వ భూతానాం వసుత్వాద్దేవ యోనితః
వాసుదేవ స్తతో వేద్యః **5-68-3**

సంస్కృతంలో ఈ అధ్యాయం మొదట్లో ధృతరాష్ట్రుడు సంజయుని ఇలా అడిగాడు "నామ కర్మార్థవిత్ తాత ప్రాప్నుయాం పురుషోత్తమమ్" అని "అతని నామాలకు, పనులకు అర్థం తెలిసి పురుషోత్తముని పొందుతాను". నాకు కృష్ణుని నామములకు (పేర్లకు) నిర్వచనం చెప్పు అని అడిగాడు. తెలుగులో తిక్కనగారు ఒక్క వాసుదేవ శబ్దానికే నిర్వచనం చెప్పారు. కాని సంస్కృతభారతంలో ఇంకా చాలా శబ్దాలకు చెప్పారు.

2. విష్ణు - వృషత్వా ద్విష్ణురుచ్యతే.
3. మధుసూదనః - మౌనాద్ధ్యానాచ్చ యోగాచ్చ విద్ధి భారత మాధవమ్
సర్వతత్త్వలయాచ్చైవ మధుహామధుసూదనః 4
4. కృష్ణః - కృషి ర్భూవాచకః శబ్దో ణశ్చ నిర్వృతి వాచకః
కృష్ణస్తద్భావయోగాచ్చ కృష్ణోభవతి శాశ్వతః 5

5. పుండరీకాక్షః - పుండరీకం పరంధామ నిత్యమక్షయ మక్షరమ్
తద్భావా త్పుండరీకాక్షో
6. జనార్దనః - దస్యుత్రాసాజ్జనార్దనః 6

తే॥ అతనిఁ బొందు నుపాయంబు నంతరంగ
నిగ్రహమ కాఁగ నార్యు లనుగ్రహింతు;
రోపి చిత్త వికారంబు లుడిపి యేక
బుద్ధిఁ గొలువఁ బ్రసన్నతఁ బొందు నతఁడు. 327

అ: అతనిన్ పొందు - ఉపాయంబు; అంతరంగ నిగ్రహమ కాఁగన్ = మనోనిగ్రహమే అని; ఆర్యులు = పెద్దలు; అనుగ్రహింతురు = చెపుతారు; ఓపి = తట్టుకొని; చిత్త వికారంబులు ఉడిపి = మనో వికారాలు అణచుకొని; ఏక బుద్ధిన్ = ఏకాగ్ర బుద్ధితో; కొలువన్ = సేవిస్తే; అతఁడు; ప్రసన్నతన్ పొందున్ = ప్రసన్నుడవుతాడు.

భా: *మనో నిగ్రహమే అతనిని పొందే ఉపాయం అని పెద్దలంటారు. మనో వికారాలన్నీ అణచుకొని ఏకాగ్ర బుద్ధితో కొలిస్తే గోవిందుడు ప్రసన్నుడవుతాడు.*

వ: నీవును బలుబుద్ధులుడిగి గోవిందు నాశ్రయింపు మనినం బ్రజ్ఞాచక్షుం డిట్లనియె. 328

అ: పలుబుద్ధులు = సంశయాత్మకములైన అనేక ఊహలు
ప్రజ్ఞాచక్షుండు = ప్రజ్ఞయే కనులుగా కలవాడు ధృతరాష్ట్రుడు.

భా: *నీవు కూడా చాలా ఊహలు విడిచి కృష్ణుని ఆశ్రయించు అంటే ధృతరాష్ట్రుడిలా అన్నాడు.*

క॥ నాకును నయనేంద్రియ గతి
లేకుండుట కంత వగపులే; దఖిల మనో
జ్ఞాకారుఁడైన హరి నా
లోకింపం గానమికిఁ గలుగు వగపెపుడున్. 329

అ: నాకును; నయన + ఇంద్రియ గతి = కనుచూపు; లేకుండుటకున్; అంతవగపులేదు = అంత విచారం లేదు; అఖిల మనోజ్ఞ + ఆకారుడైన = అందరికంటె సుందరుడయిన; హరిన్; ఆలోకింపన్ కానమికిన్ = చూడ లేకపోవడానికి; వగపు ఎపుడున్ = ఎపుడూ దుఃఖం; కలుగు = కలుగుతోంది.

భా: *నాకు కనుచూపు లేకపోయినందుకు నా కంత దుఃఖంలేదు. సర్వ మనోహరుడయిన కృష్ణుని చూడలేక పోయానే అని నాకు ఎపుడూ దుఃఖం కలుగుతూ ఉంటుంది.*

ఉ: ఆతనిఁ గన్నులారఁగ నహర్నిశముం గనుఁగొంచు నుండు వా
రేతప మాచరించిరో! యుపేంద్రుని నాశ్రిత వత్సలున్ విని

ర్ధూత కలంకు ధర్మనిరతుం గరుణాకరు సర్వలోక వి
ఖ్యాతుఁ బవిత్రమూర్తి శరణాగత రక్షకు నాశ్రయించెదన్. 330

అ: ఆతనిని = ఆ కృష్ణుని; కన్నులారఁగన్; అహర్నిశమున్ = పగలూరాత్రీ ఎల్లప్పుడూ; కనుగొంచున్ - ఉండువారు = చూస్తూ ఉండేవారు; ఏ తపము - ఆచరించిరో? = ఎటువంటి తపస్సు చేశారో; ఉపేంద్రునిన్; ఆశ్రిత వత్సలున్ = ఆశ్రయించిన వారిపై వాత్సల్యము కలవానిని; వినిర్ధూత కలంకున్ = కలంకమును పోగొట్టువానిని; ధర్మనిరతున్ = ధర్మము నందు ఆసక్తి కలవానిని; కరుణాకరున్ = దయకు నిలయమయిన వానిని; సర్వలోక విఖ్యాతున్ = అన్ని లోకములలో ప్రసిద్ధుడయిన వానిని; పవిత్రమూర్తిన్ = పవిత్రమయిన రూపం కలవానిని; శరణాగత రక్షకున్ = శరణు పొందిన వానిని రక్షించేవానిని; ఉపేంద్రుని; ఆశ్రయించెదన్.

భా: ఆకృష్ణుని కన్నులారా చూస్తూ ఉండే వారు ఏ తపస్సు చేశారో కదా! ఇక నేను ఆ ఉపేంద్రుని, ఆశ్రిత వత్సలుని, పాపం పోగొట్ట గలవానిని ధర్మనిరతుని దయాపరుని లోక ప్రసిద్ధుని పవిత్రరూపుని శరణాగత రక్షకుని ఆశ్రయిస్తాను.

వ: అని పలికి పరమ శాంతుండై పారాశర్యు నుద్దేశించి దేవా! యేను వాసుదేవుని శరణు సొచ్చి బ్రదుకు వాఁడ ననుచుఁ గృతాంజలి యగుటయు వ్యాసమహామునియు నాశీర్వాదంబు సేసి యంతర్హితుండయ్యెఁ; గౌరవేశ్వరుండును దుర్యోధన సంజయుల నిజనివాసంబులకుం బోవం బనిచి తానును గాంధారియు నభ్యంతర మందిరంబున కరిగి యుచిత వ్యాపారంబులం బ్రవర్తిల్లు చుండెనని చెప్పిన విని పదం పడి పుట్టిన విశేషంబు లెట్టివని యడిగిన. 331

అ: కృతాంజలి = నమస్కరించినవాడు; అంతర్హితుండయ్యె =అంతర్ధానం చెందాడు; పనిచి = పంపి; ఉచిత వ్యాపారంబులన్ = తగిన పనుల్లో; పదంపడి = తరువాత.

భా: అని చెప్పి శాంతుడై ధృతరాష్ట్రుడు వ్యాసుని ఉద్దేశించి దేవా! నేను కృష్ణుని శరణు పొంది బ్రదుకుతాను అంటూ నమస్కరించాడు. వ్యాసుడు ఆశీర్వదించి అంతర్ధానమయ్యాడు. అపుడు ధృతరాష్ట్రుడు సంజయునీ దుర్యోధనునీ తమతమ ఇళ్లకు పంపించి తానూ గాంధారీ లోపలి గృహం లోకి వెళ్లి తగిన పనుల్లో ప్రవర్తిల్లుతూ ఉన్నాడు.

అని చెపితే విని తరువాత పుట్టిన విశేషాలు ఎటువంటివి? అని అడిగితే..................

శా॥ నిత్యానిత్య వివేక వైభవ సమున్నిద్రాంతరంగ స్ఫుట
ప్రత్యక్షా! పరమేశ! విశ్వజగదారాధ్యా! మహానంత చి
త్సత్యానంద విభు స్వభావ మహితా! సంవిత్సమాధానదో
ర్గత్యవ్యాహతి సంప్రవర్తన విదగ్ధశ్రీ పదాంభోరుహా! 332

అ: నిత్యా....... ప్రత్యాక్షా! నిత్య + అనిత్య వివేక = నిత్యము, అనిత్యము అనెడి వివేకము యొక్క; వైభవ = అతిశయము చేత; సమున్నిద్ర = మేల్కొన్న; అంతరంగ = మనస్సులో; స్ఫుట = స్పష్టమైన; ప్రత్యక్షా = దర్శనము కలవాడా; పరమేశ!= పరమేశ్వరుడా!; విశ్వజగదారాధ్యా!= సర్వజగత్తుల చేతను ఆరాధింపదగినవాడా!; మహా = గొప్పదయిన; అనంత = అంతము లేని; చిత్ = చైతన్యము; సత్య; ఆనంద, విభు = సత్యము ఆనందము, విభుత్వము లతో కూడిన; స్వభావమహిత! = స్వభావముచే గొప్పవాడా? సంవి......రుహా!; సంవిత్ = జ్ఞానమును, సమాధాన= ఇవ్వడం చేత; దౌర్గత్యవ్యాహతి = పాప నాశనమును; సంప్రవర్తన = కలిగించడంలో; విదగ్ధ = సమర్థములయిన శ్రీ పదాంభోరుహా = శ్రీ పాద పద్మములు కలవాడా!

భా: *హరిహరనాథా! నీవు నిత్యానిత్యవివేకము కలవారి మనసులలో గోచరిస్తావు. సకల జగత్తులూ నిన్ను ఆరాధిస్తాయి. నీ రూపం అనంతమూ, చైతన్య సహితమూ, సత్యమూ, ఆనంద రూపమూ, సర్వవ్యాపకమూ - నీ పాదపద్మాలను కొలిచేవారికి ఉత్తమజ్ఞాన మిచ్చి పాపసంహారం చేయగల చతురుడవు.*

క॥ **వ్యాసాది మునిప్రోక్త మ**
హా సందర్భా ప్రమేయ తారూఢ గుణో
ల్లాసా! నైర్గుణ్య సము
ద్భాసి రహస్యానుభావ! భక్తాధీనా! 333

అ: వ్యాసాది.......ఉల్లాసా!; వ్యాసాది = వ్యాసుడు మొదలయిన; ముని = మహర్షుల చేత; ప్రోక్త = చెప్పబడిన; మహా సందర్భ =మహా గ్రంథములచే కూడ; అప్రమేయతా = నిర్ణయింప లేకపోవుట అనే; ఆరూఢ గుణోల్లాసా! = ఉత్తమ గుణ ప్రకాశము కలవాడా!, నైర్గుణ్య .... భావ!; నైర్గుణ్య = నిర్గుణభావం చేత; సముద్భాసి = ప్రకాశించే; రహస్య అనుభావ = నిగూఢశక్తి కలవాడ!; భక్తాధీనా = భక్తులకు అధీనమయిన వాడా!

భా: *వ్యాసాది మహర్షులు రచించిన గ్రంథ ప్రకరణములలో కూడ నీగుణ ప్రకాశము నిర్ణయింప బడలేకపోతోంది. నీ నిగూఢ శక్తి అంతా నీ నిర్గుణత్వంలోనే ఉంది. అయినా నీవు భక్త పరాధీనుడవే.*

మాలిని : **నమ దనిమిషచూడా నవ్యరత్నప్రభాసం**
గమరుచిరపదాబ్జా! గర్వదుర్వార దైత్యో
ద్యమ బహుల తమో మార్తాండ! దోఃక్రీడన ప్ర
క్రమ లలిత వికాసా! గాఢభక్తి ప్రకాశా! 334

అ: నమత్ = వంగి నమస్కరించుచున్న; అనిమిష = దేవతల యొక్క; చూడా =

శిరస్సుల యందలి; నవ్యరత్న = క్రొత్తమణుల యొక్క; ప్రభా = కాంతుల; సంగమ = కలయికచే; రుచిర = మనోహరమయిన; పదాబ్జా = పాదపద్మాలు కలవాడా!; గర్వ = గర్వముచే; దుర్వార= వారింప శక్యం కాని; దైత్య = రాక్షసుల; ఉద్యమ = ప్రయత్నమనే; బహుల తమః = కటిక చీకటికి; మార్తాండ = సూర్యుని వంటి వాడా!; దోఃక్రీడన = భుజ (పరాక్రమ) క్రీడ యొక్క; ప్రక్రమ = ప్రారంభమనే; లలిత వికాసా = సుకుమారమయిన ప్రకాశము కలవాడా!; గాఢభక్తి ప్రకాశా! = గాఢమయిన భక్తిచేతనే ప్రకాశించువాడా! (కనపడువాడా!)

భా: హరిహరనాథా! ఇంద్రాది దేవతలు నీకు పాదాభివందనము చేసేటప్పుడు వారి శిరో రత్నాల కాంతులు కలియటం చేత నీ పాద పద్మాలు అందంగా ఉంటాయి. దుర్వార గర్వాంధులైన రాక్షసుల ప్రయత్నాలనే గాఢాంధకారానికి నీవు సూర్యుడివి. నీవు దైత్యులను సంహరించి ధర్మ సంస్థాపన మొనర్తువు. నీ భుజబల ప్రదర్శనము నీకొక క్రీడ వంటిది - అది అలవోకగా చేసేపని. ఉత్తమ భక్తి పరులకు కన్పింతువు.

గద్యము

ఇది శ్రీమదుభయకవిమిత్ర కొమ్మనామాత్యపుత్ర
బుధారాధనవిరాజి తిక్కన సోమయాజి
ప్రణీతంబయిన శ్రీ మహాభారతంబున
నుద్యోగపర్వంబు నందు
ద్వితీయాశ్వాసము

శ్రీమదాంధ్ర మహాభారతము
ఉద్యోగ పర్వము - తృతీయాశ్వాసము

జనహిత వ్యాఖ్య

క. శ్రీ వాగ్విభవారోగ్య
ప్రావీణ్య ప్రాభవానుభవమహిత సౌ
ఖ్యావహ పదస్మరణ! కరు
ణావాస కటాక్షకిరణ! హరిహరనాథా! 1

అ :- శ్రీ .... స్మరణ; శ్రీ = సంపదయును; వాగ్విభవ = విద్యాతిశయమూ; ఆరోగ్య = రోగం లేకుండటమూ; ప్రావీణ్య = నేర్పు; ప్రాభవ = ప్రభుత్వమూ (అనే వాటి యొక్క); అనుభావ=అనుభవమూ; మహిత = గొప్పదయిన; సౌఖ్య = సుఖాన్ని; ఆవహ = కలిగించే; పదస్మరణ = పాదాలు స్మరించటం కలవాడా! ; కరుణా = దయకు; ఆవాస = స్థానమయిన; కటాక్ష = క్రీగంటిచూపుల యొక్క; కిరణ=కిరణాలు కలవాడా! హరిహరనాథా!

భా: *హరిహరనాథదేవా! నిరంతరం నీ పాదస్మరణ చేసేవారికి సంపద, పాండిత్యం, ఆరోగ్యం, నేర్పు, అధికారం, అనుభవమూ, సర్వసౌఖ్యాలు కలుగుతవి. నీ క్రీగంటిచూపుల కిరణాలు దయకు నిలయాలు.*

- : శ్రీ కృష్ణుని రాయబారము :-
సం. 5-70-1

వ. **దేవా! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె.** 2

భా. *హరిహరనాథదేవా! వైశంపాయన మహర్షి జనమేజయ మహారాజుతో ఇలా అంటున్నాడు.*

వి: "**శ్రీ కృష్ణుని రాయబారము**" అనే శీర్షిక గల భాగాన్ని సంస్కృత మహాభారతం **భగవద్యాన పర్వం** అంటుంది. యానం అంటే శత్రువుల మీదికి వెళ్ళటం, గమనం, ప్రయాణం, దాడివెళ్ళటం, రాజ్య తంత్రంలోని అరు గుణాలలో ఒకటి అనేవి నిఘంటువు చెప్పే అర్థాలు.

ఇక్కడ భగవద్యానం అంటే భగవంతుని ప్రయాణం అని అర్థం.

ఉద్యోగ పర్వంలో ఉన్న పది అవాంతరపర్వాలలో భగవద్యానపర్వం ఆరోది. మూలంలో 72వ అధ్యాయం నుంచి 150వ అధ్యాయం వరకు ఉన్న 79 అధ్యాయాలను ఇది వ్యాపించి ఉంది. భారతంలోని నూరు పర్వాలలో ఇది 55వది. కాగా నన్నయ భారతానుక్రమణిక ప్రకారం ఇది 53వది. ఆంధ్రమహాభారతం ఉద్యోగపర్వంలో ఇది తృతీయాశ్వాసమూ, చతుర్థాశ్వాసంలో 100 పద్యాల దాకా విస్తరించి ఉన్నది.

ఉద్యోగపర్వంలో నాలుగు దౌత్యాలు ఉన్నాయి. సంస్కృత భారతంలో అవి 1. పురోహిత యానం 2. సంజయ యానం. 3. భగవద్యానం. 4. ఉలూక దూతా గమనం అనే పేర్లతో ఉన్నాయి. తెలుగు భారతంలో వీటిని 1. ద్రుపద పురోహితుని రాయబారము 2. సంజయుని రాయబారము 3. శ్రీ కృష్ణుని రాయబారము 4. ఉలూకుని రాయబారము అని వ్యవహరించవచ్చు. కాని వీటిల్లో 3 మాత్రమే రాయబారము అనే పేరుతో ఉన్నాయి.

రాయబారము; రాయభారము సంధిచేయడము; దౌత్యము అని బ్రౌణ్యము.

రాజ భారః అనే సంస్కృత పదానికి వికృతి రాయబారము అని. నిఘంటుకారుల అభిప్రాయం. కాని కేవల సంస్కృత నిఘంటువులలో ఇది లేదు. తిక్కన ఎక్కడా రాయబారం అనేపదం వాడినట్లు కన్పించదు. కవిత్రయం వారే దీన్ని ఉపయోగించినట్లు అగపడదు. దూత అనే పదం కూడా కృష్ణుని విషయంలో ఇతరులు అన్నట్లు తిక్కన రచనలో లేదు. శ్రీనాథాదులు రాయబారం అనే పదాన్ని ఉపయోగించారు. దూత అనే పదం సంస్కృతంలో సుప్రసిద్ధమయినదే.

"అగ్నిం దూతం వృణీమహే హోతారం విశ్వవేధసమ్". మొదలయిన ఋగ్వేదమంత్రాలలో అగ్ని దూత అని చెప్పబడింది. రాజనీతి రంగంలో రాజదూతకు చాలా ప్రాధాన్యం ఉంది. రామాయణం, మహాభారతం, ధర్మశాస్త్రాలు, కౌటిల్యుడు ఉదాహరించిన అర్థశాస్త్రకారుల దృష్టిలో రాజదూతకు సమప్రాధాన్యం ఉన్నట్లు తెలుస్తుంది. కొంతమంది "అగ్ని ముఖావై దేవాః" అన్నట్లుగా కౌటిల్యుడు రాజదూత రాజుకు ముఖం అని భావించారు. రాజు తనరాష్ట్రంలో ఎలాంటి వ్యవస్థను ఎలాంటి నీతి నియమాలను నిర్ధారణ చేస్తాడో రాజదూత పరరాష్ట్రంలో ఆకార్యక్రమాలనే నిర్వహిస్తాడు. మనుస్మృతి రాజదూత యోగ్యతను ఇలా చెప్పింది.

దూతంచైవ ప్రకుర్వీత సర్వశాస్త్ర విశారదమ్
ఇంగితాకార చేష్టజ్ఞం శుచిం దక్షం కులోద్గతమ్
అనురక్తః శుచిర్దక్షః స్మృతిమాన్ దేశకాలవిత్
వపుష్మాన్ వీతభీర్వాగ్మీ దూతోరాజ్ఞః ప్రశస్యతే 7-63

దూత బహుశ్రుతుడు, ఆకార చేష్టాదుల వికారాలతో ఇతరుల హృదయాంతర్గత భావాలను తెలుసుకొనేవాడు, స్మృతిగలవాడు, అందమయినవాడు, దక్షుడు, సత్కులీనుడు, రాజభక్తుడు, దేశకాలజ్ఞుడు, పవిత్రాచరణశీలుడు, వాగ్మి, సమస్తశాస్త్రజ్ఞుడు కావాలి.

ఉద్యోగపర్వంలో విదురుడు దూత లక్షణాలు ఇలా చెప్పాడు

అస్తబ్ధ మక్లీబ మదీర్ఘసూత్రం
సానుక్రోశం శ్లక్ష్ణమహార్యమన్యైః

అరోగజాతీయ ముదారవాక్యం
దూతం నదంత్యష్ట గుణోపపన్నమ్ 37-27

అహంకారం లేనివాడు, పిరికితనం లేనివాడు, త్వరగా పనిపూర్తి చేసేవాడు, దయాళువు, శుద్ధమయిన హృదయంకలవాడు, ఇతరులు పెట్టే ప్రలోభాలకు లొంగనివాడు, ఆరోగ్యవంతుడు, ఉదారంగా మాట్లాడే వాడు - అయిన వ్యక్తి (ఎనిమిది గుణాలు కలవాడు) దూతకా దగినవాడు.

శాంతి పర్వంలో భీష్ముడు ధర్మరాజుకు దూతలక్షణాలు ఇలా చెప్పాడు.

తే: **కులము; శీలంబు, హిత వాక్యములును, నేర్పుఁ**
గార్యవాదిత్వ సద్వచో గౌరవంబుఁ
దలఁపు గలుగుట, దక్షత; యలఘు గుణము
లంద్రు దూతకు నియ్యేడు సార్వజనులు 2 ఆ. 379

అర్థశాస్త్రంలో కౌటిల్యుడు దూత మూడు రకాలు అని నిర్వచించాడు. "అమాత్య సంపదుపేతో నిసృష్టార్థ పాదగుణహీనః పరిమితార్థః అర్ధగుణహీనః శాసనహరః"

అమాత్య గుణములు కలవాడు నిసృష్టార్థుడు, అందులో నాలుగోవంతుగుణాలు తక్కువ గలవాడు పరిమితార్థుడు, మొదటివానిలో సగం గుణాలు లేనివాడు శాసనహరుడు.

నిసృష్టార్థుడు మంత్రి వంటివాడు. ఇతడు సమయానుసారంగా తనరాజు పని సిద్ధించటానికి స్వయంగా కొన్ని మాటలు చెప్పే అధికారం కలిగి ఉంటాడు.

సంధిగాని విగ్రహంగాని చేయటానికి ప్రయాణమైనవాడు నిసృష్టార్థుడు. కృష్ణుడు పాండవులకు ఉపయోగపడ్డాడు. ఈయన దీనికి ఉదాహరణ.

శ్రీ మద్రామాయణంలో హనుమంతుడు; మహాభారతంలో శ్రీకృష్ణుడు ఈ దూత లక్షణాలు కలవారు. ఈ ఇద్దరిలోనూ శ్రీకృష్ణుడు పరిపూర్ణంగా ఇందుకు ఉదాహరణ అవుతాడు.

తే: **సంజయుఁడు దన్ను వీడ్కొని చనిన; ధర్మ**
సుతుఁడు మఱునాఁడు దమ్ముల సుతుల నిష్ట
భృత్యవరులఁ గొలువునకుఁ బిలువఁ బనిచి
యెల్లవారలు వినుచుండ నిట్టు లనియె. 3

అ: సంజయుఁడు; తన్ను = తనను; వీడ్కొని = వదలి; చనినన్ = వెళ్ళగా; ధర్మసుతుఁడు = ధర్మరాజు; మఱునాఁడు; తమ్ములన్; సుతులన్ = కుమారులను; ఇష్టభృత్య-వరులన్ = ఇష్టమయిన ఉత్తమ సేవకులను; కొలువునకున్ = సభకు; పిలువన్ + పనిచి = పిలువబంపి; ఎల్లవారలున్ = అందరూ; వినుచుండన్ = వింటూ ఉండగా; ఇట్టులు; అనియెన్.

భా: *సంజయుడు తన వద్ద సెలవుతీసుకొని వెళ్ళిన తరువాత, ధర్మరాజు మర్నాడు తమ్ములను, కుమారులను, ఇష్టులయిన సేవకులను, సభాస్థలానికి పిలిపించాడు. సభలోని వారంతా వింటుండగా ఇలా అన్నాడు.*

క: "మనము జనార్దను పాలికిఁ
జని కౌరవ సభకు నతనిఁ జను మని ప్రార్థిం
చిన మేలు, బంధుహితగురు
జనములతో రణము గాక సంప్రీతియగున్" 4

అ: మనము; జనార్దను పాలికిన్ = శ్రీ కృష్ణుని వద్దకు; చని = వెళ్ళి; అతనిన్ = ఆయనను; కౌరవ సభకున్; చనుము = వెళ్ళుము; అని ప్రార్థించినన్; మేలు = మంచిది; బంధు .... జనములతోన్ = బంధు=చుట్టాలు; హిత = మేలుకోరేవారు; గురుజనములతోన్= పెద్దలు, గురువులతో; రణము = యుద్ధం; కాక = జరుగక; సంప్రీతి = సంతోషం; అగున్.

భా: "మనమందరం శ్రీ కృష్ణుని వద్దకు వెళ్ళి ఆయనను కౌరవ సభకు వెళ్ళి రావలసిందని ప్రార్థించటం మంచిది. అలా చేస్తే బంధువులు, ఆప్తులు, గురువులతో యుద్ధం జరగకుండా మనకు సంతోషం కలుగుతుంది."

వి: ధర్మరాజు ఇలా అనటానికి అంతకుముందు కృష్ణుడు సంజయు రాయబారం సందర్భంలో (ఉద్యో 1.3 ఆ. 52; 53; 60) అన్న మాటలు హేతువులు.

వ: అని పలికి; వార లందఱు బలసి చనుదేర మాధవు మందిరంబున కరిగి; యతని చేత సత్కృతుండయి సమస్త పరిజనంబులుం బరివేష్టింప, నొక్క పార్శ్వంబునం బాంచాలియు సముచిత పరివార పరివృతయై యుండ; నతండునుం దానును సుఖాసీనులై యుండి యతనితో నిట్లనియె. 5

అ: బలసి = చుట్టుకొని; (కలిసి) చనుదేరన్ = రాగా; మాధవుమందిరంబునకున్= శ్రీకృష్ణుని నివాసానికి; అరిగి = వెళ్ళి; సత్కృతుండు=గౌరవింపబడినవాడు; సమస్త పరిజనంబులు= పరిచారకులందరూ; పరివేష్టింపన్ = చుట్టుకొని యుండగా; ఒక్క పార్శ్వంబునన్ = ఒక ప్రక్కగా; పాంచాలియున్ = ద్రౌపదిగూడా; సముచిత = తగిన; పరివార = సేవకజనులతో; పరివృత = చుట్టుకొనబడినది; సుఖ + ఆసీనులు = సుఖంగా కూర్చున్నవారు.

భా: అని చెప్పి వారందరూ చుట్టుకొని కలిసి రాగా ధర్మరాజు శ్రీకృష్ణుని నివాసానికి వెళ్ళాడు. కృష్ణుడు ఆయనను గౌరవించాడు. పరిజనం అంతా చుట్టుపక్కల కూర్చున్నారు. ఒక ప్రక్కగా ద్రౌపదీదేవి తగిన పరివారంతో కూర్చుని ఉన్నది. అప్పుడు ధర్మజకృష్ణులు సుఖాసీనులై యున్నారు. ఆ సమయంలో ధర్మరాజు శ్రీకృష్ణునితో ఇలా అన్నాడు.

క. "ఆపదఁ గడవం బెట్టఁగ
నోపి శుభంబైన దాని నొడఁగూర్పను మా
కీ పుట్టువునకుఁ బాండు
క్ష్మాపాలుఁడు నిన్నుఁజూపి చనియె మహాత్మా! 6

అ: మహాత్మా=పూజ్యుడా!; ఆపదన్= కీడును; కడవన్+పెట్టఁగన్ = తొలగించటానికీ; ఓపి = శక్తి కలిగి; శుభంబు + ఐనదానిన్ = మేలు కలిగించేదానిని; ఒడగూర్పను= చేకూర్చటానికీ; మాకు; ఈ పుట్టుపునకున్ = ఈ జన్మకు; పాండుక్ష్మాపాలుఁడు=పాండురాజు (మాతండ్రి); నిన్ను; చూపిచనియెన్ = చూపించిపోయాడు.

భా: *"మహాత్మా! మమ్ములను ఆపదల నుంచి రక్షించటానికీ, సామర్థ్యంతో మాకు మేలు కలిగించటానికీ, మా తండ్రి అయిన పాండురాజు ఈ జన్మకు మాకు నిన్ను ఏడుగడగా చూపి పోయాడు.*

వి: పాండవులకు కలిగిన ఆపదలలో చాలా తీవ్రమయినది ద్రౌపదీ వస్త్రాపహరణం. ఆ సమయంలో వస్త్రాలను దానం చేసి ద్రౌపదిని కాపాడటం శ్రీకృష్ణుడు వారికి చేసిన మహోపకారం. తండ్రి తరువాత తండ్రివలె తమను ఆయన రక్షించాడని ధర్మరాజు విశ్వాసం. అందుకే "మహాత్మా' అంటున్నాడు. ధర్మరాజుకు శ్రీకృష్ణునియందు ఎంత భక్తిభావం ఉందో ఈ పద్యం వ్యక్తం చేస్తుంది. తండ్రి పిల్లలకు కలిగే ఆపదలు పోగొడతాడు. అనేకమయిన శుభాలను కలిగిస్తాడు.

ఇక్కడ మూలం -
కోహికృష్ణాస్తి నస్త్వాదృక్ సర్వనిశ్చయవిత్ సుహృత్ అధ్యా 72-78 శ్లో

తే: సమయ మిది మిత్రకార్యంబు చక్కఁ జేయ
నీకతంబున నే మవినీతుఁడైన
యాసుయోధను తోడి పోరాట దక్కి
యనుభవింతుము మాయంశ మగు ధరిత్రి. 7

అ: మిత్రకార్యంబు = మిత్రుల పనిని; చక్కన్ చేయన్=సరి చేయటానికి; ఇది సమయము = తగిన అదను; నీకతంబునన్ = నీవు కారణంగా; ఏము = మేము; అవినీతుఁడు+ ఐన=అణుకువలేని; వినయంలేని; ఆ సుయోధనుతోడి పోరాట=ఆ దుర్యోధనునితో యుద్ధం; తక్కి =మాని; మా + అంశము + అగు = మా భాగమయిన; ధరిత్రిన్= భూమిని; అనుభవింతుము.

భా: *శ్రీకృష్ణా! మిత్రులమయిన మా పనిని చక్కగా చేయటానికి ఇదే తగిన సమయం. నీవు చేసే ఈ సహాయం వల్ల మేము దుర్మార్గుడయిన ఆ దుర్యోధనునితో యుద్ధం చేయకుండానే మాభాగమయిన భూమిని అనుభవిస్తాం.*

వి: 4వ పద్యంలో తమ్ములు మొదలయిన వారితో చెప్పినదాన్నే కొంచెం మార్చి కృష్ణునితో చెపుతున్నాడు ధర్మరాజు. దుర్యోధనునితో యుద్ధం లేకపోవటం మొదటి కాంక్ష. రెండోది తమ రాజ్యభాగం తాము అనుభవించటం. ఇది బంధుకార్యం అనకుండా మిత్రకార్యం అనటం బాంధవ్యాని కంటే మైత్రి గొప్పదని చెప్పటమే.

వ: నీకు వేము ప్రద్యుమ్నాది కుమారుల తోడివారము; మమ్ము దురితంబులు వొరయకుండ నరసి రక్షింపు" మనవుడు వాసుదేవుండు "నీపంచిన యట్ల చేయంగలవాఁడ, నెయ్యది తలంపు సెప్పు" మనిన నజాతశత్రుండు "నీవు కరినగరంబున

కరిగి కౌరవులతోడం దగిన మాటలాడి తెఱంగు సేయవలయు"నని ప్రార్థించి యతని నియ్యకొలిపి యిట్లనియె. 8

అ: దురితంబులు = పాపములు; పొరయకుండన్ = చెందకుండ; అరసి = చూచి; అనవుడు = అనగా; వాసుదేవుండు = కృష్ణుండు; నీ పంచిన + అట్లు + అ = నీవు ఆజ్ఞాపించినట్లే- నీవు సెలవిచ్చినట్లే; తలంపు = అభిప్రాయము; ఆలోచన; అజాత శత్రుండు = ధర్మరాజు; కరి నగరంబునకు + హస్తినాపురానికి; అరిగి = వెళ్ళి; తెఱంగు =సంధి; ఇయ్యకొలిపి = అంగీకరింపజేసి.

భా: *శ్రీకృష్ణా! నీకు మేము ప్రద్యుమ్నుడు మొదలైన కుమారులతో సమానులం. మాకు ఎలాంటి పాపాలూ రాకుండా ఉండేటట్లు చూసి రక్షించు" ఆ ధర్మరాజు మాటలు విని కృష్ణుడు నీవు ఆజ్ఞపించినట్లే చేస్తాను. నీ ఉద్దేశ్యం చెప్పు" అని అన్నాడు. అప్పుడు ధర్మరాజు "నీవు హస్తినాపురానికి వెళ్ళి కౌరవులతో సముచితంగా మాట్లాడి సంధి చేయవలసింది" అని ప్రార్థించాడు. కృష్ణుడు అందుకు అంగీకరించగా ధర్మరాజు ఇలా అన్నాడు.*

వి: ఈ వచనంలోని మొదటి రెండు వాక్యాలూ 6వ పద్యంలోని ధర్మరాజు భావాలకు పుష్టి నిస్తున్నాయి. ఆయన వినయ విధేయతలకు ప్రోద్బలకాలు. ఈ సన్నివేశం 21 పద్యాలలో కర్తవ్యకరుణల మధ్య ధర్మజునిలో గలిగిన ఘర్షణను కవి చిత్రిస్తున్నాడు. అజాత శత్రువు సాభిప్రాయం.

సీ: "మా తండ్రి తలఁపును నాతనినందను
చందంబు నిన్న నా సంజయుండు
పలికిన పలుకులఁ దెలిసెఁ గదా నీకు;
వారి చిత్తము భంగి వాఁడెఱుంగుఁ;
బాలుపంపని యాక మేలిమాటలను మ
మ్మలుక దీర్చెదరు తా; రధికదుష్క
రంబైన యా సమయం బేము పదుమూఁడు
వత్సరంబులు సల్పి వచ్చి యుండఁ
ఆ: గులము పాడి నడపఁ దలఁపఁ డ, పతి సెడ
దలఁచెనేనిఁ గొడుకు వలచినట్టి
వాఁడు గాన యతని వక్రత మాన్పలేఁ;
డింతకంటెఁ గలదె యెడరు మాకు? 9

అ : మా తండ్రి తలఁపును = ధృతరాష్ట్రుని అభిప్రాయమూ; ఆతని నందను చందంబున్ = ఆయన కుమారుడయిన దుర్యోధనుని విధమూ; నిన్నన్; ఆ సంజయుండు; పలికిన పలుకులన్ = చెప్పిన మాటల వల్ల; నీకున్; తెలిసెన్ + కదా =తెలిసింది కదా; వాఁడు= ఆ సంజయుడు; వారి చిత్తము భంగిన్ = వారి మనస్సుల విధము - రీతి; ఎఱుంగున్; తారు =

తాము - వారు; పాలు; పంపు + అని =(రాజ్య) భాగం అని; ఈక = ఇయ్యక; మేలి మాటలన= మంచిమాటలతోనే; మమ్ము = మమ్ములను; అలుక + తీర్చెదరు = కోపం తీరుస్తారు; అధిక దుష్కరంబు + ఐన = మిక్కిలి కష్టమయిన; ఆ సమయంబు = ఆ ప్రతిజ్ఞను; ఏము = మేము; పదమూడు వత్సరంబులు = పదమూడు సంవత్సరాలు; సల్పి = చేసి; వచ్చియుండన్; పతి = రాజు - ధృతరాష్ట్రుడు; కులము పాడి + వంశధర్మాన్ని; నడపన్ + తలఁపఁడ = ఆచరించటానికి ఆలోచించడు; చెడన్+తలచెనేనిన్ = చెడిపోదలిస్తే; కొడుకు వలచినట్టివాఁడు + కాన = కుమారుని ప్రేమించే వాడు కాబట్టి; అతని వక్రతన్ = ఆ దుర్యోధనుని వంకర నడతను; మాన్పలేఁడు = పోగొట్టలేడు; మాకు; ఇంతకంటె = దీనికంటె; ఎడరు = ఆపద; కలదె = ఉన్నదా?

భా: *శ్రీ కృష్ణా! నిన్న సంజయుడు చెప్పినమాటల వల్ల మా పెదతండ్రి అయిన ధృతరాష్ట్రుని అభిప్రాయమూ ఆయన కుమారుడయిన దుర్యోధనుని ఉద్దేశ్యమూ నీకు తెలిసినవి గదా! వారి మనుస్సులలోని అభిప్రాయాలు ఆ సంజయుడికి బాగా తెలుసు. రాజ్యభాగం తగిన విధంగా ఇవ్వక వారు తియ్యని మంచి మాటలతో మా అలుక తీర్చాలని చూస్తున్నారు. మిక్కిలి దుష్కరమయన ఆ ప్రతిజ్ఞను మేము పదమూడు సంవత్సరాలు నెరవేర్చి రాగా, ఆ ధృతరాష్ట్ర మహారాజు చెడిపోదలిస్తే, నాశనం కాదలచుకుంటేనే వంశధర్మాన్ని అనుష్ఠింపదలపడు. పుత్రమోహం గలవాడు కాబట్టి ఆ దుర్యోధనుని చెడు నడతను మాన్పలేకున్నాడు. ఇంతకంటె మాకు వేరే ఆపద ఏమున్నది?*

వి: "పాలు పంపని ఈక మేలిమి మాటలను మమ్మలుక దీర్చెదరు తారు" అనే సీస పద్యపాదం సంజయుని మాటల సారాంశం దీనికి మూలం.

అప్రదానేన రాజ్యస్య శాంతి మస్మాసు మార్గతి — అధ్యా 72-8

ధర్మరాజుకు ధృతరాష్ట్రుడు పెద్ద తండ్రి. కాని పెంచిపెద్దచేశాడు. కాబట్టి ధృతరాష్ట్రుని మీద అతనికి తండ్రి మీద ఉండే ప్రేమ ఉంది. 'ఆ సమయంబు' అంటే అను ద్యూతంలో పెట్టిన 12 ఏండ్లు అరణ్యవాసం, ఒక ఏడు అజ్ఞాతవాసం.

క: **జననియు సమస్తబాంధవ**
జనములుఁ బ్రియమంద, వారి శాంతులఁగాఁ జే
యను, నెమ్మిగ నొక్కటి యై
మననుం దెఱఁ గేది యునికి మా పౌరుషమే! 10

అ: జననియున్ = మా తల్లి అయిన కుంతీదేవి; సమస్త బాంధవ జనములున్ = బంధువర్గం అంతా; ప్రియము + అందన్ = సంతోషించగా; వారిన్ = ఆ కౌరవులను; శాంతులన్+ కాన్ = శాంతించే వారినిగా; చేయను = చేయటానికే; ఒకటి+ఐ = ఏకమై; నెమ్మిగన్ = సుఖంగా; మననున్ = బ్రతకటానికీ; తెఱఁగు = ఉపాయము - మేలు; ఏది = చెడి; ఉనికి = ఉండటం; మా పౌరుషము + ఏ = మా మగతనం అవుతుందా?

భా: *మా తల్లి కుంతీదేవీ, బంధువులందరూ; సంతోషించేటట్లు చేయటానికీ; ఆ కౌరవులందరూ శాంతించటానికీ; పరస్పరం సమైక్యంతో సుఖంగా ఉండటానికీ - బ్రతకటానికీ; తగిన మార్గం కనుగొన లేకుండటం మా పౌరుష మవుతుందా?*

క: ఇచ్చటి బంధులు నీవును
నచ్చెరు వడి వినుచు నుండ నైదూళ్ళును మా
కిచ్చినను జాలు నంటిని
బొచ్చెముగా దింతవట్టు పూర్ణము సుమ్మీ! 11

అ: ఇచ్చటి బంధులున్ = ఇక్కట ఉన్న చుట్టాలూ; నీవునున్; అచ్చెరు + పడి = ఆశ్చర్యపడి; వినుచునుండన్=వింటూ ఉండగా; ఐదూళ్ళును=ఐదు ఊళ్ళైనా; మాకున్; ఇచ్చినను= ఇస్తే - ఇచ్చినా గూడా; చాలును; అంటిని = అన్నాను; ఇంతపట్టు = ఇంతవరకు - ఇదంతా; పొచ్చెము + కాదు = తక్కువ కాదు; పూర్ణము సుమ్మీ = తృప్తికరమే సుమా!

భా: ఇక్కడ ఉన్న బంధువులూ, నీవూ ఆశ్చర్యంతో వింటూ ఉండగా "మాకు అయిదూ ళ్లిచ్చినా చాలు" అన్నాను. దీంట్లో కపటంగానీ, తక్కువతనం గానీ లేదు. ఇదినాకు తృప్తికరమే సుమా!

వి: అయిదూళ్ళు మూలంలో ఇలా ఉంది. "అవిస్థలం వృకస్థలం మా కందీం వారణావతమ్ అవసానంచ గోవింద! కంచిదేవాత్ర పంచమమ్ 72 అ.15

మూలంలో ఉన్న అవిస్థలం; మాకంది తెలుగులో (1-377) మారి కుశస్థలం; వాసంతి అయ్యాయి. తనకు కాక తక్కిన పాండవులకు నాలుగు గ్రామాల పేర్లు చెప్పి తనకు ఏదైనా ఇచ్చినా లేకపోయినా ఫర్వాలేదని అన్నట్లుంది పై వాక్యం.

శా: ఆ దుర్యోధనుఁ డంతమాత్రయును జేయం జాలఁడో కాని, పెం
పేదం గ్రూరత కోర్వరాదు, సిరి నా కేలందునే - గ్రాసవా
సోదైన్యంబులు వచ్చు నాయరయు నీ చుట్టాలకుం, గావునన్
మోదం బందుట గల్గు - గౌరవులు నేముం బొంది శ్రీనొందినన్. 12

అ : ఆ దుర్యోధనుఁడు; అంతమాత్రయును=ఆ కొంచెమయినా- ఆ మాత్రమయినా; చేయన్ + చాలఁడో + కాని = చేయగలడో లేదో కాని; చేయటానికి ఇష్టపడడేమో కాని; పెంపు+ ఏదన్ = గౌరవం చెడిపోయేటట్లు; క్రూరతకు = (సర్వసంహారం అనే) క్రూర కార్యం చేయటానికి; ఓర్వరాదు = సహించ వీలుకాదు; సిరి = సంపద; నాకు + ఏల + అందునే= నాకెందుకు అను కొందునా?; (నా-కేలు-అందునే = నాచేతికి వస్తుందా?) నా + అరయు + ఈ చుట్టాలకున్ = నా అజమాయిషీలో ఉన్న ఈ బంధువులకు; గ్రాస + వాసస్ + దైన్యంబులు = తిండీ బట్టలులేక పేదరికం; వచ్చున్ = కలుగుతుంది; కావునన్ = కాబట్టి; కౌరవులున్; ఏమున్= మేమూ (పాండవులూ); పొంది = సంధి చేసుకొని; శ్రీని = రాజ్యలక్ష్మిని; ఒందినన్ = పొందితే; మోదంబు= సంతోషం; అందుట = లభించటం; కల్గున్ = కలుగుతుంది.

భా: ఆ దుర్యోధనుడు ఆ మాత్రమయినా చేయగలడో లేదో కాని మరీ గౌరవం నశించేటట్లు సర్వసంహార రూపమయిన క్రూరకర్మను సహించలేను. రాజ్యం నాకెందుకు అని అనుకునేదా? నన్నాశ్రయించుకొని ఉన్న ఈ బంధువులకు తిండీబట్టలకు లోటు కలుగుతుంది. కాబట్టి కౌరవులూ మేమూ సంధి చేసుకుని రాజ్యం పంచుకుంటే అందరికీ సంతోషం కలుగుతుంది.

ఉ: అక్కట! లాఁతులైనఁ బగఱైనను జంపన కోరనేల? యొం
డొక్క తెఱంగు లేదె? యది యొప్పదె? బంధు సుహృజ్జనంబు లా
దిక్కున నున్నవారు; గణుతింపక సంపదకై వధించి దూ
ఱెక్కుట దోషమందు టను నీ దురవస్థల కోర్వవచ్చునే!" 13

అ: అక్కట = అయ్యో; లాఁతులు + ఐనన్ = ఇతరులైనా; పగఱు+ఐననున్ = శత్రువులయినా; చంపన = చంపడమే; కోరను + ఏల = కోరటం ఎందుకు?; ఒండు + ఒక్క = ఇంకొక; తెఱంగు = మార్గము; లేదె = లేదా?; అది = ఆ పద్ధతి; ఒప్పదె = తగినది కాదా?; బంధు సుహృత్ + జనంబులు = చుట్టాలు, మిత్రుల సమూహం; ఆదిక్కునన్ = ఆ కౌరవపక్షంలో; ఉన్నవారు = ఉన్నారు; (అని) గణుతింపక = తలంచక; (వారిని) సంపదకై = రాజ్యలక్ష్మి కోసం; వధించి = చంపి; దూఱు + ఎక్కుట = నిందను పొందటం; దోషము + అందుట = పాపాన్ని పొందటం; అను= అనేటటువంటి; ఈదురవస్థలకున్ = ఈ కష్టాలకు- నీచస్థితికి; ఓర్వవచ్చునే = సహింపవీలవుతుందా?

భా: *అయ్యో! ఇతరులైనా శత్రువులైనా చంపాలి అనే అనుకోవటం ఎందుకు? అంతకంటే ఇతరమైన మార్గం ఇంకొకటి లేదా? అది మంచిదికాదా? ఆ కౌరవ పక్షంలో బంధువులు మిత్రులు ఉన్నారు, అని భావించకుండా సంపదకోసమని వారినందరినీ సంహరించి ఈలోకంలో నిందనుపొందటం; పరలోకంలో పాపం పొందటం అనే ఈ రెండు దురవస్థలను ఎలా సహించగలను?"*

వ: అని పలికి పాండవాగ్రజుండు వెండియు. 14

అ: పాండ వాగ్రజుండు = పాండవులలో మొదట పుట్టిన వాడు - ధర్మరాజు.

భా: *అని చెప్పి ధర్మరాజు మళ్ళీ ఇలా అన్నాడు.*

ఆ: "క్షత్ర ధర్మ మింత కష్ట మగునె! పర
ధర్మ మాచరింపఁ దగ దటండ్రు;
గాన శస్త్రజీవికయ తగి యున్నది;
యైన వంశనాశ మనభిమతము. 15

అ: క్షత్రధర్మము = క్షత్రియ ధర్మం; ఇంత కష్టము = ఇంతటి చెడ్డది; హానికరం; అగునె =అవుతుందా?; పరధర్మము = ఇతరుల - బ్రాహ్మణవైశ్యాదుల ధర్మము; ఆచరింపదగదు= చేయగూడదు; అట = అని; అండ్రు = అంటారు; కాన = కాబట్టి; శస్త్రజీవికయ = ఆయుధం పట్టి బ్రతకటం; తగియున్నది; ఐనన్ = అయినా; వంశనాశము = వంశం నాశనం కావటం; అనభిమతము = ఇష్టంకాదు.

భా: *క్షత్రియధర్మం ఇంత చెడ్డదా? ఇతరుల కులధర్మం అనుసరించరాదు అంటారు. కాబట్టి క్షత్రియులమైన మాకు ఆయుధంతో జీవించటమే తగి ఉన్నది. అయినా వంశం నాశనం కావటం నాకు ఇష్టంలేదు.*

దీనికి మూలం

పాపః క్షత్రియ ధర్మో2 యం వయంచ క్షత్రబంధవః

సనః స్వధర్మో ధర్మో వా వృత్తిరన్యా విగర్హితా *72-46*

వ: **అదియునుంగాక.** **16**

భా: *అదీగాక*

ఆ: **కలహ మగుడు లక్ష్మిఁ గావించుఁ బ్రాణహా**
నియును జేయు నింత నిక్కువంబు;
పలువు రొకని కోడి పాఱుట - బల్లిదు
లనద చేతఁ జెడుటయును ఘటించు. **17**

అ: కలహము = యుద్ధం; అగుడు = కావటం; లక్ష్మిన్ = రాజ్య సంపదను; కావించున్ = చేస్తుంది; ప్రాణహానియును = ప్రాణాలు పోవటాన్ని గూడా; చేయున్ = చేస్తుంది; ఇంత = ఇదంతా; నిక్కువంబు = నిజం; పలువురు = చాలామంది; ఒకనికి = ఒక్క వీరునికి;ఓడి= ఓడిపోయి; పాఱుట = పారిపోవటమూ; బల్లిదులు=సమర్థులు - వీరులు; అనదచేతన్= అశక్తుని చేత - అల్పునిచేత; చెడుటయును = వెనుకకు తగ్గటం గూడా; ఘటించున్ = కలిగిస్తుంది;

భా: *యుద్ధం జరిగితే రాజ్య సంపదా లభించవచ్చు లేకపోతే ప్రాణహానీ కలుగవచ్చు. ఇది నిజం; యుద్ధంలో చాలామంది ఒకడి చేతిలో ఓడి పారిపోవటమూ; మహావీరులు సామాన్యుడి చేతిలో పరాజితులు కావటం గూడా సంభవిస్తుంది.*

క: **జయమగు నోడుదు మను ని**
శ్చయ మొక్కఁడు లేదు. వినుము; సమరమునఁ బరా
జయము మరణంబుకంటె హృ
దయ పుటభేదనము సేయుఁ దథ్యం బనఘా ! **18**

అ: జయము; అగున్=కలుగుతుంది; ఓడుదుము; అను=అనేటటువంటి;ఒక్కఁడు= ఒకటి; నిశ్చయము = నిర్ణయం; లేదు; అనఘా = పాపరహితుడా! వినుము; సమరమునన్ = యుద్ధంలో; పరాజయము = ఓటమి; మరణంబుకంటెన్; హృదయ పుటభేదనము = గుండె బ్రద్దలు కావటం; చేయున్; తథ్యంబు = సత్యం.

భా: *యుద్ధంలో జయమే కలుగుతుంది అని కాని; ఓటమి కలుగుతుంది అని కాని ఏ ఒక్కటీ నిశ్చయింపవీలుకాదు. యుద్ధంలో పరాజయం మరణాని కంటే కూడా హృదయ భేదకం అవుతుంది. శ్రీకృష్ణా! ఇది యథార్థం.*

పరాజయశ్చ మరణా న్మన్యే నైవ విశిష్యతే. (572-54) అనేది మూలం

క: **కాన యవశ్యముఁ బెనఁకువ**
గాని యుపాయమునఁ బగఱఁ గడతేర్చి ధృతిం

బూని నడుచు నెవ్వఁడు డెం
దానం జెయి వెట్టికొని యతఁడు నిద్రించున్. 19

అ: కాన = కాబట్టి; ఎవ్వఁడు = ఎవడైతే; అవశ్యమున్ = తప్పక; పెనకువ= యుద్ధం; కాని + ఉపాయమునన్; పగరన్ = శత్రువులను; కడతేర్చి = సంహరించి; ధృతిన్ = ధైర్యాన్ని; పూని = తాల్చి; నడచున్ = ప్రవర్తించునో; అతఁడు; డెందానన్ = హృదయం మీద; చెయి; పెట్టికొని = ఉంచుకొని; నిద్రించున్ = నిద్రిస్తాడు.

తా: *కాబట్టి యుద్ధం లేకుండా ఉపాయంతో శత్రుసంహారం చేయగలవాడు హాయిగా గుండె మీద చెయ్యి వేసుకుని నిద్రిస్తాడు.*

ఆ: **పగయ కలిగె నేనిఁ బాము న్న యింటిలో**
నున్న యట్లకాక, యూఱడిల్లి
యుండు నెట్లు చిత్త మొక మాటు? గావున
వలవ దధిక దీర్ఘవైరవృత్తి. 20

అ: పగయ = విరోధమే; కలిగెనేనిన్ = కలిగితే; పాము; ఉన్న+ఇంటిలోన్; ఉన్న+ అట్ల = ఉన్నట్లే; కాక = కదా!; చిత్తము = మనస్సు; ఒకమాటున్ = ఒకసారైనా; ఎట్లు = ఎలాగా; ఊరడిల్లి + ఉండున్ = ఊరట కలిగి ఉంటుంది?; కావునన్ = కాబట్టి; అధిక దీర్ఘవైరవృత్తి = (ఎక్కువ) చాలా కాలం శత్రుత్వం కలిగి ఉండటం; వలవదు = తగదు.

భా: *శత్రుత్వమే కలిగి ఉంటే మనస్సు పామున్న ఇంట్లో ఉన్నట్లే ఆందోళనగా ఉంటుంది. కాని ఒక్కమాటైనా ధైర్యంగా ఉండదు. కాబట్టి దీర్ఘవైరం తగదు.*

వి : **జాతవైరశ్చ పురుషో దుఃఖం స్వపితి నిత్యదా**
అనివృత్తేన మనసా ససర్ప ఇవ వేశ్మని 72-60;62

చ: **పగ యడగించు టెంతయు శుభం, బది లెస్స, యడంగునే పగం**
బగ? వగగొన్న మార్కొనక పల్కక యుండగవచ్చునే; కడుం
దెగ మొదలెత్తి పోవఁ బగదీర్పఁగ వచ్చినఁ గ్రౌర్య మొందు; నే
మిగతిఁ దలంచినం బగకు మేలిమి లేమి ధ్రువంబు గేశవా! 21

అ: పగ = వైరం; అడగించుట=తగ్గించటం/ అణచుకోవటం; ఎంతయున్ = చాలా; శుభంబు = మేలైనది; అది = ఆ పద్ధతి; లెస్స = మంచిది; పగన్ = శత్రుత్వంతో; పగ; అడంగునే= తగ్గిపోతుందా?; పగగొన్నన్ = పగబడితే; మార్కొనక =ఎదిరించక; పల్కక= మాట్లాడకుండా; ఉండగవచ్చునే = ఉండటం వీలవుతుందా; కడున్ + తెగన్ = మిక్కిలి సాహసంతో; మొదలెత్తి పోవన్= సమూలంగా నశించేటట్లు; పగన్; తీర్పఁగ వచ్చినన్ = తీర్చటానికి సిద్ధమై వస్తే; క్రౌర్యము+ ఒందున్ = క్రూరత్వాన్ని పొందుతాడు; కేశవా = శ్రీకృష్ణా! ఏమిగతిన్ = ఏ విధంగా; తలంచినన్= ఆలోచించినా; పగకు; మేలిమి = మంచి; లేమి = లేకపోవటం; ధ్రువంబు = నిశ్చయము.

భా: *శ్రీకృష్ణా! పగ తగ్గించుకోవటం చాలామేలు, అదిచాలా మంచిది. పగవల్ల*

పగ తగ్గిపోతుందా? పగబడితే ఎదిరించకుండా, పరుషంగా పలకకుండా ఉండటం వీలవుతుందా? మిక్కిలి సాహసంతో సంపూర్ణంగా నాశన మయ్యేటట్లు పగతీర్చుకోవటానికి సిద్ధమైతే తీవ్రమైన క్రూరత్వం కలుగుతుంది. కాబట్టి ఏవిధంగా ఆలోచించినా శత్రుత్వంవల్ల ఎలాంటి మేలూ లేకపోవటం యథార్థం.

వి: న హి వైరాణి శామ్యంతి ధీర్ఘకాలధృతాన్యపి 72-62
న చాపి వైరం వైరేణ కేశవ వ్యుపశామ్యతి 72-63

ఉ: కావున శాంతిఁ బొందుటయ కర్జము, దానది యట్టులుండె, శ్రీ
గావలె నంచుఁ - బోరితము గామియుఁ గోరెద; మెల్ల సొమ్ములుం
బోవుటయుం గులక్షయము పుట్టుటయున్ వెలిగాఁగ, నొండుమై
నే విధినైనఁ జక్కబడు టెంతయు నొప్పుఁ జుమీ జనార్దనా! 22

అ: కావునన్ = కాబట్టి; జనార్దనా = శ్రీకృష్ణా; శాంతిన్ + పొందుటయ = శాంతిని పొందటమే; కర్జము = చేయదగింది; తాను + అది = ఆ విషయం; అట్టులు =అలాగా; ఉండెన్= ఉన్నది; శ్రీ=రాజ్యలక్ష్మి; కావలెన్=కావాలి; అంచున్=అంటూ; పోరితము = యుద్ధం; కామియున్= కాకుండా ఉండటం కూడా; కోరెదము; ఎల్లసొమ్ములున్ = సమస్తమయిన సంపదలూ; పోవుటయున్= పోవటమూ; కులక్షయము = వంశనాశము; పుట్టుయున్ = కలగటమూ; వెలి+ కాఁగన్=లేకుండా; ఒండుమైన్=మరొక విధంగా; ఏ విధిన్ + ఐనన్= ఏ రకంగానైనా; ఏ ఉపాయం చేతనైనా; చక్కఁబడుట = (సంధి) కుదరటం; ఎంతయున్ = చాలా; ఒప్పున్ + చుమీ= బాగుంటుంది సుమా!

భా: *కాబట్టి శ్రీకృష్ణా! శాంతి సాధించటమే అవశ్య కర్తవ్యం, ఆ విషయం అలా ఉంచు. మాకు రాజ్యమూ కావాలి, యుద్ధం కాకుండా ఉండాలి, అని కాంక్ష ఉన్నది. సమస్త సంపదలూ నాశనం కాకుండా వంశ నాశనం లేకుండా ఇంకొక రకమైన ఏ ఉపాయంతోనైనా నా సమస్యతీరితే ఎంత బాగుంటుంది!*

చ: మనమునఁ బక్షపాతగతి మాదెస మానుము, ధర్మనీతి వ
ర్తనములు రెండుదిక్కుల హితంబును బెంపును గల్గునట్టి చొ
ప్పున, విదురాది సజ్జనుల బుద్ధికి రా, నుచితంబుతోడి మె
ల్పునఁ, బరుసందనంబునను భూపతు లెల్ల నెఱుంగ నాడుమీ. 23

అ: మనమునన్ = మనస్సులో; మాదెసన్ = మామీద; పక్షపాతగతిన్ = పక్షపాత ప్రవర్తనను; మానుము ధర్మనీతి వర్తనములు = ధర్మము యొక్క రాజనీతి యొక్క పద్ధతులూ; రెండు దిక్కులన్ = రెండు పక్షాల యొక్క; హితంబును = మేలూ - మంచీ; పెంపును =అభివృద్ధీ; కల్గునట్టి = కలిగేటటువంటి; చొప్పునన్ = విధంగా; విదుర + ఆది సజ్జనుల = విదురుడూ మొదలయిన మంచివారి యొక్క; బుద్ధికి= మనస్సుకు; రాన్ = వచ్చేవిధంగా; ఉచితంబు తోడి మెల్పునన్= యోగ్యతతో గూడిన నేర్పుతోనూ; పరుసందనంబునన్=కాఠిన్యంతోనూ; భూపతులు+ ఎల్లన్ = రాజులు అందరూ; ఎఱుంగన్ = తెలుసుకునేటట్లుగా; ఆడుమీ = మాట్లాడు.

భా: మనస్సులో మా మీద పక్షపాతం మానుకో, ధర్మాన్నీ రాజనీతినీ అనుసరించు, రెండుపక్షాలకూ మంచి కలిగేటట్లూ, అభివృద్ధి కలిగే రీతిగానూ, విదురుడు మొదలయిన సజ్జనుల మనస్సులకు నచ్చేటట్లూ, తగినటువంటి నేర్పుతోనూ, కాఠిన్యంతోనూ అక్కడ ఉండే రాజుల కందరికీ తెలిసేటట్లు మాట్లాడు.

వి: ధర్మజుని ధర్మదృష్టి; సమవర్తిత్వమూ; సజ్జన గౌరవమూ; ఇందులో కన్పిస్తున్నాయి. పక్షపాత దృష్టి లేకుండటమూ; ధర్మనీతులను అనుసరించటమూ; ఉభయ పక్షహిత కాంక్ష; సజ్జన సంతోషమూ; ఔచిత్యమూ నేర్పూ పాటించటమూ; అవసరాన్ని బట్టి పరుషంగా గూడా మాట్లాడటమూ దూత లక్షణాలుగా కన్పిస్తాయి. కృష్ణుడు రాయబార సందర్భంలో అలాగే వ్యవహరిస్తాడు.

చ: తగవునఁ బోక, రాజు బెడిదంబులు వల్కిన యేని సైఁచి యొ
ప్పుగ నిలుమీ! గురుత్వముఁ బ్రభుత్వమునుం గల పెద్దవారి మా
ట గొనమి యాసుయోధను కడన్ నిలువన్, మన మెల్ల గారవం
బుగఁ గురువృద్ధ పల్కు దలఁపుం జన నిచ్చిన మెచ్చరే జనుల్. 24

అ: రాజు = దుర్యోధనుడు; తగవునన్ = న్యాయంగా; పోక = ప్రవర్తింపక; బెడిదంబులు = పరుష వచనాలు; పల్కిన + ఏనిన్ =మాట్లాడినా గూడా; సైఁచి = సహించి; ఒప్పుగన్ = తగిన విధంగా; నిలుమీ = నిలబడు; గురుత్వమున్ = పెద్దతనమూ - పూజ్యతా; ప్రభుత్వమునున్ = అధికారమూ; కల; పెద్దవారి మాట; కొనమి = స్వీకరించకపోవటం; ఆ సుయోధను కడన్ = ఆ దుర్యోధనుని వద్దనే; నిలువన్ = ఉండగా; మనము + ఎల్లన్ = మన మందరమూ; గారవంబుగన్ = గౌరవంతో; కురువృద్ధ పల్కున్ = కౌరవులలో పెద్ద వారి మాటనూ; తలఁపున్ = ఉద్దేశ్యమునూ; చననిచ్చినన్ = చెల్లించితే; జనుల్ = ప్రజలు; మెచ్చరే = మెచ్చుకోరా?

భా: ఆ దుర్యోధనుడు న్యాయంగా ప్రవర్తించక పరుషంగా మాట్లాడితే సహించి తొణకకుండా ఉండు. పూజ్యతా, అధికారం గల పెద్దల మాటలు స్వీకరించక త్రోసి పుచ్చటం ఆ దుర్యోధనుడు చేసినప్పుడు మనం ఆ కురువంశపు పెద్దల మాటలను గౌరవించి వారి ఉద్దేశ్యం ప్రకారం నడుచుకుంటే జనం అంతా మనలనే మెచ్చుకుంటారు గదా!

వి: ఎదుటి వారి పారుష్యాన్ని సహించటం గూడా దూత కర్తవ్యం. పెద్దల మాటను తలదాల్చడం ఉత్తమ లక్షణం. రాజుకు జనులు మెచ్చేటట్లు ప్రవర్తిచటం పరమధర్మం.

శా: సుతువాఁడై వినయంబు సేకొనక, యే చొప్పుం దగం జెప్పకా
ధృతరాష్ట్రుం డవినీతిఁ జేసినను, సంధింపంగ రాదంచు వే
గ తెగం బాఱకు; తెంపు సేయునెడ లోకం బెల్ల మెచ్చం, బ్రకా
శిత ధర్మస్థితి నొంది, మా మనము నిశ్చింతంబుగాఁ జేయుమీ. 25

అ: ఆ ధృతరాష్ట్రుండు, సుతువాఁడై = కుమారుడి మనిషై; వినయంబు + చేకొనక= వినమ్రతను గ్రహించక; ఏ చొప్పున్ = ఏ పద్ధతినీ - ఏ ధర్మాన్నీ; తగన్ = తగినట్లుగా; చెప్పక;

అవినీతిన్ + చేసినను = చెడుగా ప్రవర్తించినా; సంధిపంగన్ + రాదు = సంధిచేయటం వీలుకాదు; అంచున్ = అని; వేగ = తొందరగా; తెగన్ + పాఱకు = సాహసించకు; తెంపు = సాహసం; చేయునెడ = చేసేటప్పుడు; లోకంబు + ఎల్లన్ = ప్రజలందరూ; మెచ్చన్ = మెచ్చుకొనేటట్లు; ప్రకాశిత ధర్మస్థితిన్ = వెల్లడిచేయబడిన ధర్మం యొక్క ఉనికిని; ఒంది = పొంది; మా మనమున్= మా మనస్సును; నిశ్చింతంబుగాన్ = చింతలేని దానినిగా; చేయుమీ = చేయవలసింది.

భా: ఆ ధృతరాష్ట్రుడు కుమారుని మీది ప్రేమతో వినమ్రతను వివేకాన్ని వదిలి ఏ నిర్ణయాన్నీ చెప్పకపోతే ఇంక సంధి కుదరదని తెగతెంపులకు తొందరపడకు. తెంపు చేయబోయేటప్పుడు లోకం మెచ్చుకునేటట్లూ, ధర్మం అందరికీ స్పష్టం అయ్యేటట్లు ప్రవర్తించి మా మనస్సుకు దిగులు లేకుండా ఉండేటట్లు చేయవలసింది.

ఆ: ఇన్ని సంకటముల నిబ్భంగి నెంతయు
నొగులు చిత్తవృత్తి నొవ్వు దీర్ప
వెజ్జ వీవకావె! వేయేల యేగతి
నడపఁ దలఁచి తదియ నాకుఁ బ్రియము" 26

అ: ఇన్ని సంకటములన్ = ఇన్ని ఇరకాటాలలో; ఈ+భంగిన్=ఈ విధంగా; నొగులు= వికలమయ్యే; చిత్తవృత్తి = మనో వ్యాపారం యొక్క; నొవ్వు = బాధను; తీర్పన్= తీర్చటానికి;వెజ్జవు= వైద్యుడివి; ఈవ = నీవే; కావె = కదా!; వేయి +ఏల = చాలా మాటలు ఎందుకు?; ఏగతిన్= ఏ విధంగా; నడపన్ తలంచితి=నడపాలని అనుకున్నావో; అదియ=అదే; నాకున్; ప్రియము =ఇష్టం.

భా: కృష్ణా! ఇన్ని సంకట పరిస్థితులలో ఈ విధంగా కకావికలవుతున్న నా మనస్సులోని బాధను తీర్చటానికి నీవే తగిన వైద్యుడివి కదా! పలుమాటలు ఎందుకు? నీవు నడపాలను కున్న తీరు ఎటువంటిదయినా అదే నాకు చాలా ఇష్టం".

వి: 23వ పద్యం నుంచి ఇంతవరకూ కౌరవ సభలో కృష్ణుడు ఎలా ప్రవర్తించాలో ధర్మరాజు సూచించాడు. రాజులు దూతముఖులు కాబట్టి తమ ఉద్దేశ్యం దూతకు వివరించటం వారి కర్తవ్యం. ఇదంతా మానవ స్వభావ వ్యక్తీకరణం. ఇంత చెప్పి నీవు ఎలా చేసినా నాకు సంతోషమే అనటం కృష్ణుని యందు ధర్మరాజుకు గల మహోన్నతాభిప్రాయాన్ని సూచిస్తుంది. మహావ్యక్తిని దౌత్యానికి పంపేటప్పుడు ఇలాగే పలకాలి.

వ: అని చెప్పి తలంచికొని వెండియు నిట్లనియె. 27

అ: తలంచికొని = ఆలోచించుకొని; వెండియున్ = మళ్ళీ.

భా: అనిచెప్పి ధర్మరాజు కొంచెం ఆలోచించి మళ్ళీ ఇలా అన్నాడు.

క: "నీవు సుయోధను పాలికిఁ
బోవఁగ వల దనియు నొక్కబుద్ధి వొడమెడున్;
గోవింద! యతఁడు మంత్రులుఁ
గావరమునఁ జక్కవినరు కార్యవచనముల్. 28

అ: గోవింద = కృష్ణా!; నీవు; సుయోధను పాలికిన్ = దుర్యోధనుని వద్దకు; పోవఁగవలదు = పోవద్దు; అనియున్ = అనికూడా; ఒక్క బుద్ధి = ఒక ఆలోచన; పొడమెడున్ = కలుగుతున్నది;అతఁడు=ఆ దుర్యోధనుడూ; మంత్రులున్=ఆతని సలహాదారులూ; కావరమునన్= పొగరుతో; కార్యవచనముల్ = చేయదగిన పనికి సంబంధించిన మాటలు/ సంధి మాటలు; చక్కన్ = సరిగా; వినరు.

భా: *"కృష్ణా! నీవు ఆ దుర్యోధనుని వద్దకు పోవటం గూడా అనవసరమే అనిగూడా ఇంకో ఆలోచన కలుగుతున్నది. ఆ దుర్యోధనుడూ, ఆతనికి ఆలోచనలు చెప్పేవారూ (కర్ణాదులు) పొగరెక్కి సంధికార్య వచనాలను సరిగా వినరు.*

తే: కుటిలమతు లవినీతులు, క్రూరకర్ము
లట్టి నీచుల కడకు ని న్ననుపఁ జాల;
నీవు సంకటపడియెడు దేవపదవి
యైన నే నొల్ల, నొంటి యం దరుగు టుడుగు". 29

అ: (ఆ దుర్యోధనాదులు) కుటిలమతులు = వంకర బుద్ధికలవారూ; అవినీతులు= వినయం-అణుకువ లేనివారూ; క్రూరకర్ములు = క్రూరమయిన పనులు చేసేవారు; అట్టి నీచుల కడకు = అలాంటి నీచుల వద్దకు; నిన్ను; అనుపఁజాలన్ = పంపలేను; నీవు; సంకట పడియెడు= కష్టపడేటటువంటి; దేవపదవి + ఐనన్ = ఇంద్రపదవి అయినా సరే; నేను; ఒల్లన్= అంగీకరించను (కాబట్టి); అందు= ఆ కౌరవ సభకు; ఒంటి =ఒంటరిగా; అరుగుట=వెళ్ళటం; ఉడుగు= మానుకో.

భా: *ఆ దుర్యోధనాదులు వక్రబుద్ధులూ, అణుకువ లేనివారూ, క్రూరమయిన పనులు చేసేవారు. అటువంటి నీచుల దగ్గరకు నిన్ను పంపలేను, నీవు కష్టపడటం వల్ల లభించే ఇంద్ర పదవి అయినా నాకు అక్కరలేదు. కాబట్టి నీవు ఒంటరిగా ఆ కౌరవ సభకు వెళ్ళవద్దు."*

వి: కృష్ణుని ఒంటరిగా వెళ్ళవద్దు అనటం వల్ల తగిన విధంగా సమాయత్తమై వెళ్ళమని ధర్మరాజు సూచన.

న హి నః ప్రీణయేద్ద్రవ్యం న దేవత్వం కుతః సుఖమ్
నచ సర్వామరైశ్వర్యం తవ ద్రోహేణ మాధవ 72-84
"ఒంటి యం దరుగు టుడుగు" అనేది అమూలకమైనా ఔచిత్య పూర్ణం".

చ: అనవుడుఁ గృష్ణుఁ డిట్లనియె; "నా ధృతరాష్ట్రుఁడు నట్టివాఁడ, త
త్తనయుఁడ యేల? నీ పలుకు తథ్యము, నీతలఁ పే నెఱింగితి,
న్మనమున శంక దక్కుము, వినన్ వలతే విను - మేను నిక్క మ
ల్గిన, నచటం గలండె రణకేళికి మార్కొన నొక్కఁ డేనియున్. 30

అ: అనవుడున్ = అనగా; కృష్ణుఁడు; ఇట్లు = ఇలా; అనియెన్ = అన్నాడు; తత్ + తనయుఁడు + అ + ఏల = అతని కుమారుడే ఏమిటి?; ఆ ధృతరాష్ట్రుఁడున్ = ఆ ధృతరాష్ట్రుడు

గూడా; అట్టివాఁడ = అటువంటివాడే; నీ పలుకు = నీమాట; తథ్యము + అ = యథార్థమే; నీ తలఁపు = నీ అభిప్రాయాన్నీ; ఏన్ = నేను; ఎఱింగితిన్ = తెలుసుకొన్నాను; మనమునన్ = మనస్సులో; శంక = అనుమానం, తక్కుము = మానుకో; వినన్ + వలతు + ఏన్ = వినవలెననుకొంటే; వినుము; ఏను = నేను; నిక్కము = నిజంగా; అల్గినన్ = కోపిస్తే; మార్కొనన్= ఎదిరించటానికి; అచటన్; ఒక్కఁడు + ఏనియున్ = ఒక్కడయినా; కలండె = ఉన్నాడా?

భా: ఆ ధర్మరాజు మాటవిని కృష్ణుడిలా అన్నాడు. "ఆ దుర్యోధనుడే ఏమిటి? ఆ ధృతరాష్ట్రుడు గూడా అలాంటివాడే. నీ మాట యథార్థం. నీ అభిప్రాయం నాకు తెలిసింది. నీ మనస్సులో ఇలాంటి సందేహం అక్కరలేదు. నా పరాక్రమాన్ని గూర్చి వినాలి అనుకుంటే విను. నిజంగా నాకే కోపం వస్తే యుద్ధంలో నన్ను ఎదిరించగలవాడు ఆ కౌరవపక్షంలో ఒక్కడయినా ఉన్నాడా?

వి: "జానామ్యేతాం మహారాజ! ధృతరాష్ట్రస్య పాపతామ్". 72-83

అని మూలంలో ఉంటే తిక్కన "ఆ ధృతరాష్ట్రుడు నట్టివాఁడ" అని వ్యాసుని భావాన్ని విస్తరించాడు.

క: **పనుపుము కౌరవసభ, కేఁ**
జను టెట్లును మేల, యర్థసంసిద్ధి యగున్
మన కొకటం బాపము రా
కునికికిఁ గతమైన పలుకు లొండెను గలుగున్" **31**

అ: పనుపుము = (నన్ను) పంపించు; ఏన్ = నేను; కౌరవ సభకున్; చనుట = వెళ్ళటం; ఎట్లును = ఏవిధంగా ఆలోచించినా; మేల= మంచిదే; అర్థ సంసిద్ధి = కార్యం సిద్ధించటం; అగున్= అవుతుంది. మనకున్; ఒకటన్ = ఏ ఒక్కచోట కూడా; ఏ విధంగానూ; పాపము; రాక+ ఉనికికి = రాకుండా ఉండటానికి; కతము + ఐన = కారణాలయిన; పలుకులు= మాటలు; ఒండెను = కానీ; కలుగున్.

భా: కాబట్టి నన్ను హస్తినాపురానికి పంపించు. ఎలా ఆలోచించినా నేను కౌరవ సభకు వెళ్ళటం మంచిదే. దానివల్ల మన పని సిద్ధిస్తుంది. లేకపోతే మనకు ఏవిధంగానూ పాపం కలగకుండా ఉండే ప్రశంసా వాక్యాలయినా కలుగుతాయి. (లోకం మెచ్చుకుంటుంది)"

వి : **న జాతు గమనం పార్థ భవేత్తత్ర నిరర్థకమ్**
అర్థప్రాప్తిః కదాచిత్ స్యా దన్తతో వాప్యవాచ్యతా. **76-88**
అవాచ్యాస్తు భవిష్యామః సర్వలోక మహీక్షితామ్ **72-85**

అర్థ సంసిద్ధి; పాపం కలగక పోవటం, నిందలేకపోవటం అనే మూడూ కృష్ణుని రాయబారంలో ప్రధానోద్దేశ్యాలు, కౌరవ సభలో ఉన్న వారందరూ ఏకాభిప్రాయులుకారని కృష్ణుడు ప్రత్యక్షంగా తెలుసుకోవటం" అర్థ సంసిద్ధిలో ప్రధానం. సంధికాక పోయినా తాను కౌరవ సభకు వెళ్ళటం సప్రయోజనం అని శ్రీకృష్ణుని ఉద్దేశం.

వ: **అని పలికిన యుధిష్ఠిరుం డిట్లనియె.** 32

అ: యుధిష్ఠిరుండు = ధర్మరాజు

భా: *ఆ మాటలు విని ధర్మరాజు ఇలా అన్నాడు.*

ఆ: **"మేలుగాక, నీకు బోలినట్లయిన, నం**
దరిగి యేము వారు నర్థిఁ బొంది
యుండు నట్లు గాఁగ నొడఁబాటుఁ గావింపు;
మెల్లభంగి మనకు నిదియ లెస్స. 33

అ: మేలు = మంచిదే; కాక = అగుగాక; నీకున్; పోలిన + అట్లు + అయినన్ = యుక్తమయినది - తగినది అయితే - బాగుంటే; అందు=ఆ కౌరవసభకు; అరిగి = వెళ్లి; ఏమున్= మేమూ; వారున్; అర్థిన్ = స్నేహంతో; పొంది = ఏకమై ; ఉండునట్లు = ఉండేవిధం; కాఁగన్= అయ్యేటట్లుగా; ఒడఁబాటున్ = సంధిని; కావింపుము = చేయుము; ఎల్లభంగిన్ = అన్నివిధాలా; మనకున్; ఇదియ = ఇదే; లెస్స = మంచిది.

భా: *చాలామంచిది. నా ఉద్దేశ్యం బాగున్నదని నీకు అనిపిస్తే నీవు అక్కడికి - హస్తినాపురానికి- వెళ్ళి మేమూ, వారూ స్నేహంతో ఏకమై ఉండేటట్లు సంధి చేయవలసింది. ఇదే మనకు అన్ని విధాలా మంచిది.*

క: **మమ్మెఱుఁగు, దెదిరి నెఱుఁగుదు,**
నెమ్మి యెఱుఁగు, దర్థసిద్ధినెఱి యెఱుఁగుదు,వా
క్యమ్ముల పద్ధతి నెఱుఁగుదు
పొ మ్మెవ్వఁడ నేను నీకు బుద్ధులు సెప్పన్?" 34

అ: మమ్మున్ = మమ్ములను - పాండవులను; ఎఱుఁగుదు =ఎరుగుదువు; ఎదిరిన్= ప్రతిపక్షాన్ని - కౌరవులను; ఎఱుఁగుదు; నెమ్మి = స్నేహాన్ని; ఎఱుంగుదు; అర్థ సిద్ధి = ప్రయోజన సిద్ధిని; నెఱి = ధర్మాన్ని; ఎఱుంగుదు; వాక్యమ్ముల పద్ధతిన్ = మాట్లాడే రీతిని; ఎఱుఁగుదు; పొమ్ము = వెళ్ళిరా; నీకు; బుద్ధులు = ఉపాయాలను; చెప్పన్ = చెప్పటానికి; నేను; ఎవ్వఁడన్= ఎంతటివాడిని?

భా: *శ్రీకృష్ణా! నీకు మమ్ములను గురించి కౌరవులను గురించి బాగా తెలుసు. స్నేహము, కార్యసిద్ధి, ధర్మమూ నీకు చక్కగా తెలుసు. సంభాషణ రీతి సంపూర్ణంగా తెలుసు. కాబట్టి వెళ్ళిరా నీకు ఉపాయాలు చెప్పటానికి నేనే పాటివాడిని?"*

వి: దూత లక్షణాలను ధర్మరాజు ఇందులో చక్కగా చెప్పాడు. ఇరుపక్షాలూ బాగా తెలిసినవాడే సంధికి సరిగా ప్రయత్నించగలడు.

"పొమ్మెవ్వఁడ నేను నీకు బుద్ధులు సెప్పన్" అనే ధర్మరాజు మాట **అ మూలకమయినా అమూల్యం.** కృష్ణుని మీద ఆయనకుగల గౌరవాదర విశ్వాసాలను ఇది వ్యక్తం చేస్తున్నది.

-: శ్రీ కృష్ణుఁడు ధర్మరాజుతోఁ గౌరవుల దుర్ణయంబు చెప్పుట:-
సం 5-71-1

సీ: అనిన ముకుందుఁ డిట్లనియె, "సంజయుని మా
టలును నీవన్న పల్కులును వింటి,
నీమది ధర్మైకనిష్ఠమై నున్నది,
వైరంబు విడువరు వారు - ద్రోణ
భీష్ములు గలరని బిరుదులై యున్న వా,
రగునె రాజన్యుల కడఁగి కుడువ?
నక్లేశవృత్తి రాజ్యము చవిగొన్న వా
రేల యిత్తురు నీకుఁ బాలుసెపుమ?
తే: ధార్త రాష్ట్రులు నడికి నధర్మమునకు
నలుక రెన్నడు, విడువు దైన్యంబు; పొడువు
కయ్య, మరివర్గజయమునఁ గలుగు నిహప
రములుఁ జిరకీర్తియును బాండురాజతనయ! 35

అ: అనినన్ = అనగా; ముకుందుఁడు = శ్రీ కృష్ణుడు; ఇట్లు = ఇలాగా; అనియెన్; పాండు రాజతనయ = ధర్మరాజా!; సంజయుని మాటలును; నీవు; అన్న; పల్కులును = మాటలూ; వింటిన్; నీమది = నీ మనస్సు; ధర్మ + ఏకనిష్ఠమైన్ = ధర్మము నందే నిలిచినదై; ఉన్నది; వారు = కౌరవులు; వైరంబు =పగను; విడువరు; ద్రోణభీష్ములు; కలరు; అని; బిరుదులు + ఐ; శూరులై; ఉన్నవారు = ఉన్నారు; రాజన్యులకు = రాజులకు; అడఁగి = అణిగి ఉండి; కుడువన్+ అగునె = (భోగాలు) అనుభవించటం తగునా?; అక్లేశవృత్తిన్ = ఏ కష్టం లేని రీతిగా; రాజ్యము= రాజ్యము యొక్క; చవిగొన్నవారు = రుచి మరిగినవారు; నీకున్; పాలు =రాజ్యభాగము; ఏల+ ఇత్తురు = ఎలా ఇస్తారు; చెపుమ = చెప్పు; ధార్తరాష్ట్రులు = ధృతరాష్ట్రుని కుమారులు; నడికిన్= నిందకూ; అధర్మమునకున్ = అధర్మానికీ; ఎన్నడున్ = ఏనాడూ; అలుకరు = భయపడరు; దైన్యంబున్; విడువుము; కయ్యము = యుద్ధం; పొడువు =చేయుము; అరి వర్గజయమునన్= శత్రు సమూహాన్ని జయించటం వల్ల; ఇహపరములు = ఈ లోకంలో, పరలోకంలో సుఖాలూ; చిరకీర్తియును = శాశ్వతమయిన కీర్తి; కలుగును.

భా: ధర్మరాజు మాటలు విని శ్రీకృష్ణుడు ఇలా అన్నాడు. "ధర్మరాజా! సంజయుని మాటలూ, నీ మాటలూ విన్నాను. నీ మనస్సు కేవలం ధర్మనిష్ఠతో ఉన్నది. ఆ కౌరవులు పగ వదలరు. భీష్మద్రోణులు మా పక్షంలో ఉన్నారని శూరులవలె వారున్నారు. ఏ మాత్రం శ్రమలేకుండా రాజ్యపాలన రుచి మరిగినవాళ్ళు నీకు రాజ్యభాగం ఎలా ఇస్తారో చెప్పు. ఆ కౌరవులకు నిందలన్నా, అధర్మం అన్నా ఎప్పుడూ భయం లేదు. కాబట్టి దైన్యాన్ని వదలు;

యుద్ధం చెయ్యి; శత్రువులను జయించటం వల్ల ఇహ పర సుఖము; శాశ్వత కీర్తి లభిస్తాయి.

వి: "నీమది ధర్మైక నిష్ఠమైయున్నది ...." అనే దానికి మూలం

తవ ధర్మాశ్రితా బుద్ధిః తేషాం వైరాశ్రితా మతిః 73-2

ఈ సీసం పద్యం ఐదు శ్లోకాల సంగ్రహ స్వరూపం. కౌరవులు ఎలా రాజ్యం పటిష్ఠం చేసుకొని నిలదొక్కుకున్నారో కృష్ణుడు మూలంలో ఇలా అంటాడు.

అతిగృద్ధాః కృతస్నేహాః దీర్ఘకాలం సహోషితాః

కృతమిత్రాః కృతబలాః ధార్తరాష్ట్రాః పరంతప 73-6

ధర్మరాజా! ధృతరాష్ట్రపుత్రులు మిక్కిలి రాజ్యలోభం గలవారు. చాలాకాలం నుంచి వాళ్ళుఅనేక రాజులను మిత్రులుగా చేసుకున్నారు. వాళ్ళతో చాలాకాలం కలిసిమెలసి తిరుగుతూ స్నేహం పెంపొందించుకున్నారు. సైన్యాలను వృద్ధి చేసుకున్నారు.

దీనివల్ల దుర్యోధనాదులు పాండవుల అరణ్యవాస సమయం నుంచే రాజ్యం నిష్కంటకం చేసుకోవటానికి సర్వవిధాలా ప్రయత్నిస్తున్నా రన్నమాట! అందువల్ల వారికి; పాండవులకు అర్ధరాజ్యం తిరిగి ఇవ్వాలి అని ఏకోశానా లేదని తెలుతుంది.

మ: గురుభీష్మాదులు సూచుచుండ సభ మీకుం గీడు నాఁ డట్లు ము
ష్కరులై చేసిరి, యంత సేసియును బశ్చాత్తాపముం బొంద నో
పరు వారెన్నఁడు, నట్టిచోటఁ గృపయున్ బంధుత్వముం దక్కు, మె
వ్వరుఁ గోపింపరె యాదురాత్మకుల గర్వక్రౌర్యముల్ సూచినన్. 36

అ: నాఁడు = ఆ జూదం జరిగిన రోజున; సభన్ = సభలో; గురుభీష్మ + ఆదులు= ద్రోణుడు, భీష్ముడు మున్నగువారు; చూచుచుండన్ = చూస్తుండగా; మీకున్; అట్లు = ఆవిధంగా; ముష్కరులు + ఐ = మూర్ఖులై - కుటిలులయి; కీడు = అపకారం; చేసిరి = చేశారు; వారు = ఆకౌరవులు; అంత + చేసియును = అంతటి దుష్కార్యం చేసి కూడా; ఎన్నఁడున్ = ఏనాడూ; పశ్చాత్తాపమున్; పొందన్ = పొందేటట్లుగా; నోవరు = బాధపడరు; అట్టిచోటన్ = అటువంటిచోట- అటువంటి వారి విషయంలో; కృపయున్ = దయనూ; బంధుత్వమున్ = చుట్టరికాన్ని; తక్కుము= వదులుకో; ఆదురాత్మకుల = ఆ దుర్మార్గులయొక్క; గర్వక్రౌర్యముల్ = గర్వాన్నీ, క్రూరత్వాన్నీ; చూచినన్ = చూస్తే; ఎవ్వరున్ =ఎవరైనా; కోపింపరు + ఎ = కోపపడకుండా ఉంటారా?

భా: కౌరవ మహాసభలో ఆ జూదం జరిగినప్పుడు ద్రోణభీష్మాదులు అందరూ చూస్తుండగా కౌరవులు మూర్ఖులై మీకు చాలా కీడు చేశారు. అంతటి పాపకార్యం చేసికూడా వాళ్ళు ఏనాడూ కొంచెమైనా పశ్చాత్తాపపడి బాధపడలేదు. అటువంటి వాళ్ళ విషయంలో దయాదాక్షిణ్యాలు, చుట్టరికం మానుకోవటం మంచిది. ఆ దుర్మార్గుల గర్వాన్నీ, క్రూరత్వాన్నీ చూస్తే ఎవరికి కోపం రాకుండా ఉంటుంది?

వ: కపటపు నెత్తంబు నెపంబుగా మిమ్ము వెడల నడచు నప్పుడు దుర్యోధన దుశ్శాసన శకుని సూతనందనులు పుయిలోట దక్కి కలకల నవ్వుచుం బలికిన పలుకు లుగ్గడింపవచ్చునే? వాని విని సమస్తజనంబులు ధృతరాష్ట్రు నిందించుచు; మీరు

బలవంతుల రయి యండియు సత్యంబు వాటించి యూరక పోక సూచి యచ్చెరువాటుతో నుమ్మలించుచుండిరి; తిట్టువాట్లంబోయెడువారు దైవోపహతులై మున్న చెడి-యుండుదురు; గావున వారలం జంపనుం జెఱుపనుం జులుకన; క్రూరాత్ములగు కౌరవు లెల్లవారికి వధ్యులు గాఁదగుదురు - నీకేల యవధ్యులైరి? పాపాత్ము లగు హింసకులం బాముల నె ట్లట్ల నిర్విచారంబుగా వధియించుట కర్తవ్యంబు. 37

అ: కపటము + నెత్తంబు = మోసంతో గూడిన జూదం; వెడల నడచునప్పుడు = వెళ్లగొట్టేటప్పుడు; సూతనందనుఁడు = కర్ణుడు; పుయిలోట = జంకు - సందేహం; తక్కి = లేక; ఉగ్గడింపవచ్చునే = చెప్ప దగినవేనా?; అచ్చెరువాటుతో= ఆశ్చర్యంతో; ఉమ్మలించుచుండిరి = దుఃఖిస్తున్నారు - విచారపడుతున్నారు; తిట్టువాట్లన్=నిందలతో- తిట్టు + పాట్లన్ = తిట్లుపడటంతో; దైవ + ఉపహతులు + ఐ = దైవం చేత చెరుపబడినవారయి; మున్న + అ = ఇంతకు ముందే; జెఱుపనున్= కష్టపెట్టటమూ; చులుకన=సులభం; వధ్యులు = చంపదగినవారు; అవధ్యులు= చంపదగనివారు; ఎట్లు = ఎలాగో; అట్లు+ అ = అలాగే; నిర్విచారంబుగాన్ = ఆలోచన లేకుండా; కర్తవ్యంబు = చేయదగినది.

భా: కపటపు జూదం మిషగా మిమ్ములను రాజ్యం నుంచి వెళ్లగొట్టేటప్పుడు దుర్యోధనుడు; దుశ్శాసనుడు శకుని కర్ణుడు - వీరంతా జంకూ, గొంకు లేకుండా కలకల నవ్వుతూ అన్నమాటలు ఇప్పుడు చెప్పటానికి వీలుకానివి. ఆ మాటలు వినిన వారంతా ధృతరాష్ట్రుని నిందిస్తూ మీరు బలవంతులు అయిఉండి కూడా, ఆడిన మాట తప్పక శాంతంగా వెళ్ళిపోవటం చూసి ఆశ్చర్యంతో మిక్కిలి బాధపడ్డారు. సర్వజన నిందలను పడుతూ ఉండేవారు దైవ వంచితులై అంతకుముందే నాశనమవుతారు. అలాంటివారిని చంపటం, ధ్వంసంచేయటం సులభం. మహాక్రూరులయిన కౌరవులు అందరికీ చంపదగినవారే. అటువంటి వారు నీకు అవధ్యులు కావటం ఏమిటి? పాపాత్ములయి నిష్కారణంగా హింసించేవారిని పాములను చంపినట్లుగా ఎలాంటి ఆలోచన లేకుండా సంహరించాలి.

వి: పాండవులు అనుద్యూతంలో ఓడిపోయి అడవులకు వెళ్ళుతుంటే భీముని వెక్కిరిస్తూ దుర్యోధన దుశ్శాసనులు అపహాస్యంగా మాట్లాడినట్లు సభా పర్వంలో 77వ అధ్యాయంలో వివరంగా ఉన్నది. నన్నయ సభాపర్వంలో ఈ విషయాన్ని స్పృశించలేదు. తిక్కన అన్నట్లు, కృష్ణుడన్నట్లు ఉత్తమ వ్యక్తులు నోటితో అనలేని మాటలు అవి

పాండవులు కలలో కూడా మరిచిపోలేనిది ద్యూత సభా సన్నివేశం. దాన్ని మళ్ళీ వివరిస్తూ కృష్ణుడు పాండవులలో యుద్ధోత్సాహాన్ని హేతుబద్ధ వాక్యాలతో పెంపొదిస్తున్నాడు.

పగ కలిగితే పామున్న ఇంట్లో ఉన్నట్లు ఉంటుంది అని ధర్మరాజు అంటే (3-20); కృష్ణుడు పాములను వలె కౌరవులను చంపమని బోధిస్తున్నాడు.

క: మీా తండ్రికి భీష్మునకుం
జేతో ముద మొదవ భక్తిసేయన తగు నీ

కా తలకు నేనుఁ జని వి
ఖ్యాతంబుగ నీదు వినయ మభివర్ణింతున్. 38

అ: మీ తండ్రికిన్=మీ పెద్ద తండ్రి అయిన ధృతరాష్ట్రునికి; భీష్మునకున్; చేతస్ ముదము=మనస్సుకు సంతోషం; ఒదవన్=కలిగేటట్లుగా; భక్తి; చేయను+అ =చేయటమే; నీకు; తగున్; నేనున్=నేను గూడా; ఆతలకున్ =అవతలి పక్షం వారి దగ్గరకు; చని=వెళ్ళి; నీదు వినయము=నీ వినయము; విఖ్యాతంబుగన్=ప్రసిద్ధం అయ్యేటట్లుగా; అభివర్ణింతున్= పొగడుతాను.

భా: *మీ పెదతండ్రి ధృతరాష్ట్రునికీ; భీష్మునికీ మనస్సులు సంతోషించే రీతిగా భక్తిగా ప్రవర్తించటమే నీకు తగును. నేను ఆ కౌరవపక్షీయుల వద్దకు వెళ్ళి నీ వినయం సర్వ లోక ప్రసిద్ధం అయ్యేటట్లుగా ప్రశంసిస్తాను.*

వి: కౌరవసభలో తాను ఏం చేయదలుచుకున్నాడో కృష్ణుడు చెపుతున్నాడు. దీనివల్ల అక్కడి వారికి ధర్మరాజు స్వభావం; ప్రవృత్తి మళ్ళీ గుర్తుచేసినట్లవుతుంది.

క: **చెలులుం జుట్టలు దేశం**
బుల రాజులు వినఁగ నీదు పుణ్యచరిత్రం
బులు నీవు ధర్మమార్గము
దలఁచుటయుం దెలియఁ బలికెదం గురుసభలోన్. 39

అ: కురుసభలోన్; చెలులున్ = మిత్రులూ; చుట్టలున్ = చుట్టాలూ; దేశంబుల రాజులున్ = అనేక దేశాల రాజులూ; వినఁగన్ = వింటుండగా; నీదు పుణ్య చరిత్రంబులు = నీ యొక్క పవిత్రమయిన నడవడికలూ; నీవు; ధర్మ మార్గము; తలఁచుటయున్ = ధ్యానం చేయటమూ; తెలియన్ = అందరికీ తెలిసే విధంగా; పలికెదన్ = చెపుతాను.

భా: *ఆ కౌరవుల మహాసభలో మీ మిత్రులూ; బంధువులూ; నానా దేశాలనుంచీ వచ్చిన రాజులూ - అందరూ వింటూ ఉండగా పరమ పవిత్రాలయినా నీ ప్రవర్తనా విశేషాలనూ, నిరంతరమూ నీవు ధర్మ మార్గాన్నే అనుసరిస్తూ ఉండటమూ, స్పష్టమయ్యేటట్లుగా ప్రసంగిస్తాను.*

వి: కృష్ణుడు ధర్మరాజును ప్రశంసించటం ఆ సభలో దుర్యోధన పక్షీయులకు బాధ కలిగించినా ధర్మానురక్తులకు కనువిప్పు కలిగిస్తుంది.

వ: **దానికి దుర్యోధనుం డియ్యకొనక తెఱంగు మాలిన మాట లాడుటయుఁ, దండ్రి యతని వారింప నేరమికిఁ దో డుపేక్షకుం డగుటయుఁ జూచి, మీ తొల్లింటి పాట్లునుం దలంచి; యెల్లవారును వారిన గర్హింతు; రింతియ కాక మనకు నొండేమి వలయు; నాయోపినంతయు ఁబెక్కు భంగుల సంధియ కావింపం జూచెద, నవ్విధంబు సిద్ధించిన మేలుగాదె! యట్లుగాక తక్కిన; నచ్చోటి యుత్సాహంబు చందంబును, నందుఁ జేయగలవారి వర్తనంబులుఁ గొలందులు నెఱింగి, నీకు విజయంబగు విధంబునం జనుదెంచెద.** 40

అ: దానికి = అందుకు; ఇయ్యకొనక = అంగీకరించక; తెరంగు మాలిన మాటలు= న్యాయం తప్పిన మాటలు; ఆడుటయున్ = పలకటమూ; వారింపనేరమికిన్ = వారించలేకపోవటానికి; ఉపేక్షకుండు = ఉదాసీనుడు; తొల్లింటిపాట్లు = వెనుకటి కష్టాలు; తలంచి = గుర్తు తెచ్చుకుని; ఎల్లవారును = అందరూ; వారిని + అ = వాళ్ళనే; గర్హింతురు = నిందిస్తారు; ఇంతియ = ఇంతే; ఒండు = మరొకటి; నా + ఓపినంతయున్ = నాకు చేతనైనంతగా; పెక్కు భంగులన్ = అనేక రీతులుగా; కావింపన్ = చేయటానికే; ఆ + విధంబు = ఆ సంధి జరగటం కాక; తక్కినన్ = కాకపోతే; అచ్చోటి = ఆకౌరవ పక్షంలోని; ఉత్సాహంబు చందంబును= పూనిక యొక్కరీతి; అందున్ = ఆ పక్షంలో; చేయగలవారి వర్తనంబులన్ = శక్తివంతుల ప్రవర్తనలూ; కొలందులున్ = సామర్థ్యాలూ; చనుదెంచెదన్ = తిరిగివస్తాను.

భా. *దుర్యోధనుడు నామాటలను అంగీకరించక న్యాయ విరుద్ధాలయిన మాటలు అంటాడు. ధృతరాష్ట్రుడు ఆతనిని వారించలేక పోవటమేకాక ఉపేక్ష వహించటం చూసీ, మీరు వెనక పడిన కష్టాలు గుర్తు తెచ్చుకొని అందరూ వాళ్ళనే నిందిస్తారు. మనకు ఇంతకంటె కావలసింది ఇంకేముంది? అనేక విధాల ప్రయత్నించి నాకు చేతనయినంతగా సంధిచేయటానికే చూస్తాను. ఆ సంధి కుదరటం చాలా మంచిది కదా! అలా సంధి కాకపోతే ఆ కౌరవపక్షంలో ఉన్న యుద్ధోత్సాహ విధానమూ, వారిలో సమర్థులయినవారి ప్రవర్తనమూ, వారి శక్తి పరాక్రమాలూ బాగా తెలుసుకుని నీకు విజయం కలిగే రీతిగా తిరిగి వస్తాను.*

వి: కృష్ణుని సంధి ప్రయాణ ప్రధానోద్దేశం ఇందులో వ్యక్తమయింది.
దీనికి మూలం ఇలా ఉంది.

గర్హయిష్యామి చైవైనం పౌరజానపదేష్వపి
వృద్ధబాలా నుపాదాయ చాతుర్వర్ణ్యే సమాగతే 73-33
కురూన్ విగర్హయిష్యంతి ధృతరాష్ట్రం చ పార్థివా: 34
తస్మిన్ లోకపరిత్యక్తే కింకార్య మవశిష్యతే
హతే దుర్యోధనే రాజన్ యదన్యత్ క్రియతా మితి
యాత్వాచాహం కురూన్ సర్వాన్ యుష్మదర్థ మహాపయన్
యతిష్యే ప్రశమం కర్తుం లక్షయిష్యే చ చేష్టితమ్
కౌరవాణాం ప్రవృత్తించ గత్వా యుద్ధాధికారికామ్
నిశమ్య వినివర్తిష్యే జయాయ తవ భారత 37

తే: ఆ సుయోధను ముక్కున నావి గలుగఁ
బుడమి నీకీడు - గావునం బోర కలుగు;
నేను కయ్యపు శకునంబు లెన్నియేనిఁ
గంటి; నీవనుత్సాహివి గాఁగ వలదు; 41

అ: ఆ సుయోధనుముక్కునన్ = ఆ దుర్యోధనుని ముక్కు నందు; ఆవి = ఊపిరి; కలుగన్ = ఉండగా; నీకు; పుడమిన్ = భూమిని - రాజ్య భాగాన్ని; ఈఁడు = ఇవ్వడు; కావునన్=

కాబట్టి; పోరు + అ = యుద్ధమే; కలుగున్; నేను; కయ్యము + శకునంబులు = యుద్ధ సూచకాలమయిన శకునాలు; ఎన్ని + ఏనిన్ = చాలా వాటిని; కంటిన్ = చూశాను; నీవు; అనుత్సాహివి = ఉత్సాహం లేనివాడివి; కాఁగన్ + వలదు = కావద్దు.

భా: ఆ దుర్యోధనుని ముక్కున ఊపిరి ఉన్నంతవరకు నీకు రాజ్యభాగం ఇవ్వడు. కాబట్టి తప్పక యుద్ధమే జరుగుతుంది. నేను యుద్ధ సూచకాలయిన అనేక శకునాలు చూశాను. నీవు మాత్రం నిరుత్సాహపడవద్దు.

వి: దుర్యోధనుని స్వభావాన్ని నిర్వచించేది శ్రీకృష్ణుని మాట.

దీనికి మూలం :-

దుర్యోధనో నహ్యల మద్య దాతుం
జీవం స్తవైత న్నృపతే! కథంచిత్
యత్తే పురస్తా దభవత్ సమృద్ధం
ద్యూతే హృతం పాండవ ముఖ్య రాజ్యమ్ 73-42

కయ్యపు శకునాలు మూలంలో 73-39 శ్లోకంలో ఇలా ఉన్నాయి. పక్షులు భయంకరధ్వనులు చేస్తున్నాయి. ప్రదోషకాలంలో హస్త్యశ్వ సముదాయాలలో భయంకరాకారాలు కనిపిస్తున్నాయి. అగ్ని గూడా నానావిధాలయిన భయజనకాలయిన రంగులు తాలుస్తున్నాడు.

సర్వథా యుద్ధమేవాహ మాశంసామి పరై స్సహ 73-38

వ: చతురంగబలంబుల నాయితంబు గావించుచు; దొరలం బురికొల్పు కొనుచు; నాలస్యంబులేక సమరంబునకు సన్నాహంబు సేయు చుండవలయు" నని పలికిన విని; వృకోదరుండు దామోదరున కిట్లనియె. 42

అ: చతురంగబలంబులన్ = నాలుగు అంగాలు గల సైన్యాలను; ఆయితంబు = సిద్ధమైనదిగా; కావించుచున్ = చేస్తూ; దొరలన్ = యుద్ధవీరులను; పురికొల్పుకొనుచున్ = ప్రోత్సాహ పరుస్తూ; సమరంబునకు = యుద్ధానికి; సన్నాహంబు = ప్రయత్నం; వృకోదరుండు= భీముడు; దామోదరునకున్ = కృష్ణునితో

భా: రథాలు, ఏనుగులు, గుఱ్ఱాలు, పదాతులు అనే నాలుగు భాగాలు గల సైన్యాలను సిద్ధం చేసుకుంటూ; యుద్ధ వీరులను ప్రోత్సాహపరుస్తూ; ఏ మాత్రం ఆలస్యం లేకుండా యుద్ధానికి తగిన సన్నాహం చేయాలి". అని శ్రీకృష్ణుడు అన్నాడు. ఆ మాటలు విని భీముడు శ్రీకృష్ణునితో ఇలా అన్నాడు.

వి: రథాలు; ఏనుగులు; గుఱ్ఱాలు కాల్బలము - ఈ నాలిగింటినీ గలిగిన సైన్యం చతురంగ బలం అవుతుంది.

సంధి చేయటానికి వెళ్ళుతున్నా కృష్ణునికి ఇది కాదు అని బాగా తెలుసు. ఇలాంటి సమయంలో రాజకీయ పాండిత్యం ఉన్నవారు ఇలా చెప్పగలరు. భవిష్యత్తును ప్రత్యక్షంగా దర్శించే మహావ్యక్తి శ్రీ కృష్ణుడు అని ఈ సన్నివేశం సూచిస్తుంది.

సాంగ్రామికం తే యదుపార్థనీయం

సర్వం సమగ్రం కురు తన్నరేంద్ర! 73-41

క: **"సమరంబు గలుగు ననుచును**
మము వెఱపింపంగవలదు; మాధవ! నీవా
కుమతియగు ధార్తరాష్ట్రుఁడు
శమించు కార్యంబు నడపు సౌజన్యమునన్" 43

అ: సమరంబు = యుద్ధం; కలుగును; అనుచును = అంటూ; మమున్ = మమ్ములను; వెఱపింపంగవలదు = భయపెట్టవద్దు; మాధవ = కృష్ణా!; నీవు; ఆకుమతి+ అగు= దుష్టబుద్ధిగల వాడయిన; ధార్తరాష్ట్రుఁడు = ధృతరాష్ట్రుని కుమారుడు - దుర్యోధనుడు; శమించు కార్యంబున్ = శాంతించే పనిని; సౌజన్యమునన్ = మంచితనంతో; నడపు = నిర్వహించు.

భా: *"యుద్ధం సంభవిస్తుంది అని మమ్ములను భయపెట్టవద్దు. కృష్ణా! దుష్టబుద్ధి అయిన ఆ దుర్యోధనుడు శాంతించే విధంగా నీ మంచితనం అంతా ఉపయోగించి సంధి కార్యం నడుపు".*

వ: **అని వెండియు.** 44

భా : **అని మళ్లీ ఇలా అంటున్నాడు.**

శా: **పాపాత్ముండు మదాంధుఁ డా తులువ నీ పం పెట్లునుం జేయఁగా**
నోపం; డడ్డము సెప్ప రెవ్వరును; మానోద్రేకముం గర్వముం
గోపంబుం దనుఁ ద్రిప్ప నాప్తజనులం గుందించుటం బోయిన
ట్లే పోనిత్తురు; గాన నిన్నతఁడు జాలిం బెట్టెడుం జూడుమీ. 45

అ: పాపాత్ముండు=పాప స్వభావం గలవాడూ; మదాంధుఁడు=మదంతో కన్నుగానని వాఁడూ; ఆతులువ = ఆ మూర్ఖుడు; నీ పంపు = నీ ఆజ్ఞను; ఎట్లునున్ = ఏ విధంగానూ; చేయన్ + కాన్ = చేయటానికి; ఓపండు = ఇష్టపడడు; ఎవ్వరును = ఎవరూ కూడా; (అతని మాటకు) అడ్డము+చెప్పరు; మాన+ ఉద్రేకమున్ = అభిమానం యొక్క అతిశయమూ; గర్వమున్; కోపంబున్; తనున్ = ఆతనిని; త్రిప్పన్ = తిప్పగా - ఆడించగా; అప్తజనులన్ = నిజం చెప్పే వారిని - బంధువులను స్నేహితులను; కుందించుటన్ = బాధించటం వల్ల; పోయినట్లు + ఏ = ప్రవర్తింపదలచినట్లే -- పోదల్చుకున్నట్లే; పోనిత్తురు; కానన్ = కాబట్టి; అతఁడు = ఆదుర్యోధనుడు; నిన్ను; జాలిన్ + పెట్టెడున్=శ్రమ పెడతాడు; చూడుమీ = తెలుసుకో.

భా: *"పాపాత్ముడూ; మదంతో కన్నుగాననివాడూ; మూర్ఖుడూ అయిన దుర్యోధనుడు నీవు ఆజ్ఞాపించినట్లు ఎలాగూ చేయడు. మూర్ఖుడు కాబట్టి ఆతనికి ఎవరూ ఎదురు చెప్పరు. దురభిమానం, గర్వం, కోపం - అనే వాటికి వశుడయి న్యాయం, సత్యం చెప్పే వారికి మనః క్లేశం కలిగిస్తాడు. కాబట్టి వారంతా అతని ఇష్టం వచ్చినట్లే పోనిస్తారు. కాబట్టి నిన్నతడు చాలా శ్రమపెడతాడు. ఈ సత్యం తెలుసుకో.*

ఉ: చొచ్చిన చోన చొచ్చి తెగఁ జూచెద నంచుఁ గడంగుచుండు; న
న్మెచ్చఁడు బాహుగర్వమున నీచు సుయోధనుఁ; డట్టివానితోఁ
బొచ్చెము లేక కూడి మనఁ బోవక పోవఁగరాదు నాకు - వి
వ్వచ్చుఁడు రాచవారుఁ గురువంశము చేటున కోర్వకుండుటన్. 46

అ: నీచు = దుష్టుడయిన - అల్పుడయిన; సుయోధనుఁడు; (నేను) చొచ్చినచోన్+ అ = ప్రవేశించిన ప్రదేశంలోనే; చొచ్చి = ప్రవేశించి; తెగన్ + చూచెదను + అంచున్ = చంపటానికి ప్రయత్నంచేస్తాను అని; కడంగుచుండున్ = పూనుకొంటూ ఉంటాడు; బాహుగర్వమునన్ = భుజ బల గర్వంతో; నన్ =నన్ను; మెచ్చఁడు = లక్ష్యపెట్టడు; వివ్వచ్చుఁడు=అర్జునుడు; రాచవారు= రాజుగారయిన ధర్మరాజు; కురువంశము చేటునకున్ = కురుకులం యొక్క నాశనానికి; ఓర్వకుండుటన్ = తాళలేక పోవటం చేత; నాకు; అట్టి వాని తోన్ = అటువంటి దుర్యోధనునితో; పొచ్చెము = కపటము - తక్కువతనం; లేక; కూడి = కలిసి; మనన్ + పోవక= బతకకుండా; పోవగరాదు = తప్పించుకొని పోవటానికి వీలుకాదు.

భా: నీచుడయిన ఆ దుర్యోధనుడు "నీవు నగరంలో గాని, అరణ్యంలోగాని ఎక్కడికిపోతే అక్కడ నేను ప్రవేశించి నిన్ను చంపటానికే చూస్తాను" అని అందుకు ప్రయత్ని స్తుంటాడు. భుజబల మదంతో నన్ను లక్ష్యం చేయడు. ఈ అర్జునుడూ, రాజుగారూ కురువంశ నాశనాన్ని సహింపలేకపోవటం వల్ల అటువంటి దుర్యోధనునితో నిష్కపటంగా- ఏ న్యూనతా లేకుండా కలిసి బ్రతుకు కొనసాగించటం తప్పించుకొన వీలులేక పోయేటట్టుంది.

ఉ: పాండవ కౌరవుల్ గలిసి; పాలును నీరును బోలె నెమ్మిమై
నుండఁగ; దుష్టచేష్టల సుయోధనుఁ డింతలు సేసె; నాతఁ డొ
క్కండ కులక్షయంబునకుఁ గారణ మండ్రది దప్పు; నైన నీ
కొండననేల; యా బిరుదు నోపిన యంతయుఁ దీర్పు నేర్పునన్. 47

అ: పాండవ కౌరవుల్; పాలును; నీరును; పోలెన్ = వలె; కలిసి; నెమ్మి మైన్ = స్నేహంతో; ఉండఁగన్; సుయోధనుఁడు = దుర్యోధనుడు; దుష్టచేష్టలన్ = చెడుపనులతో; ఇంతలు+ చేసెన్ = ఇదంతా చేశాడు; కులక్షయంబునకున్ = కౌరవ వంశ నాశనానికి; అతఁడు; ఒక్కండు+ అ =ఒక్కడే; కారణము; అండ్రు = అని అంటారు; అది; తప్పుదు. ఐనన్ = అయినా; నీవు ఒండు = మరొక మాట; అనన్ + ఏల = అనటం ఎందుకు? ఆ బిరుదున్ = ఆ శూరుని; నేర్పునన్=చాకచక్యంతో; ఓపిన + అంతయున్ = చేతనైనంతగా; తీర్పు=చక్కజేయుము- సరిదిద్దు.

భా: ఒకప్పుడు పాండవులు కౌరవులు, పాలూ నీళ్లు లాగ కలిసి స్నేహంగా ఉండేవారు. తరువాత ఈ దుర్యోధనుడు చెడ్డ పనులతో ఇంత వైరం పెంచాడు. సమస్త కౌరవ వంశనాశనానికీ అతడు ఒక్కడే కారణం అని పెద్దలు అంటారు. అది తప్పేటట్టు లేదు. ఐనా నీవు ఇంకో రకంగా అనటం ఎందుకు? ఆ వీరుని నీకు చేతనయినంతగా బ్రతిమిలాడి నేర్పుతో సరి అయిన దారిలో పెట్టు.

వి: అతఁడొక్కఁడు కులక్షయంబునకుఁ గారణ మండ్రు" దుర్యోధనుడు ఒక్కడే కురువంశ నాశనానికి కారణం అంటారు.

ఈ సన్నివేశంలో కులక్షయ కారకులయిన 18మంది పేర్లను భీముడు, కృష్ణునితో చెప్పాడు (74-11 నుండి 18 వఱకు సంస్కృతంలో)

"ధర్మ విప్లవ సమయం ఏర్పడ్డప్పుడు తేజోవంతమయిన సమృద్ధమయిన అసుర వంశంలో భయంకరమయిన కలహం చెలరేగింది. అదేవిధంగా హైహయ వంశంలో ముదావర్తుడు; నీప కులంలో జనమేజయుడు; తాలజంఘుల వంశంలో బహుళుడు; కృమి కులంలో ఉద్దండుడయిన వసువు; సువీరుల వంశంలో అజబిందువు; సురాష్ట్రకులంలో రుషర్ధికుడు; బలీహ వంశంలో అర్కజుడు; చీనీయుల వంశంలో ధౌతమూలకుడు; విదేహవంశంలో హయగ్రీవుడు; మహౌజులను క్షత్రియ కులంలో పరాయువు; సుందర వంశీయులగు క్షత్రియులలో బాహువు; దీప్తాక్ష కులంలో పురూరవుడు; చేది మత్స్య వంశీయులలో సహజుడు; ప్రవీర వంశంలో వృషధ్వజుడు; చంద్ర వత్స కులంలో ధారణుడు; ముకుట వంశంలో విగాహనుడు; నంది వేగ కులంలో శముడు-వీరంతా 18 మందిరాజులు జ్ఞాతులను మిత్రులను బంధువులను సంహరించారు. పై వారిలాగే కులానికి అగ్గి అయినవాడూ; నీచుడూ; పాప పురుషుడు అయిన దుర్యోధనుడు గూడా ద్వాపర యుగాంతంలో కాలప్రేరితుడై మా కురుకుల వినాశనానికి గాను పుట్టాడు."

చ: **తన పోరిపోవునంతకు నుదగ్రతయుం గపటంబు మాననే**
ర్చునె ధృతరాష్ట్ర సూనుఁడు? యశోభరితంబగు భారతాన్వయం
బున కొక నింద వచ్చు నను బుద్ధి; దురాత్మున కేల కల్గు? నా
యన మెయిఁబోయి; హీనగతి నైన ఘటించిన నెంత యొప్పునో" 48

అ: ధృత రాష్ట్ర సూనుఁడు = దుర్యోధనుడు; తన పోరిపోవునంతకున్ = తన ప్రాణం పోయేదాకా; ఉదగ్రతయున్ = గర్వాన్నీ; కపటంబున్ = మోసాన్నీ; మాననేర్చునె = మానుకోగలడా?; యశస్ + భరితంబు + అగు = కీర్తితో నిండి ఉన్న; భారత + అన్వయంబునకు= భరత వంశానికి; ఒక; నింద; వచ్చును; అను + బుద్ధి = అనేజ్ఞానం; దురాత్మునకు = దుర్మార్గునికి; ఏల + కల్గున్ = ఎందుకు కలుగుతుంది?; ఆయన మెయిన్ + ఆ మహాశయుని రీతిగానే; (నాయన మెయిన్ = తండ్రి అయిన ధృతరాష్ట్రుని పద్ధతినే); పోయి; హీనగతిన్ + ఐనన్ = తక్కువగానైనా, ఘటించినన్ = కూర్చితే; (అది) ఎంత + ఒప్పునో = ఎంత చక్కగా ఉంటుందో!

భా: ఆ దుర్యోధనుడు తన ప్రాణం పోయినా గర్వాన్నీ, కపటాన్నీ మానుకోగలడా? కీర్తి పూర్ణమయిన భారత వంశానికి నింద కలుగుతుంది అనే జ్ఞానం దుర్మార్గునికి ఎలా ఏర్పడుతుంది? ఆయనగారి ఉద్దేశ ప్రకారం హీనాతి హీనంగానయినా సంధి చేస్తే ఎంత బాగుంటుందో!"'

వి: ఇందులో మొదటి వాక్యానికి మూలం
మ్రియేతా2 పి న భజ్యేత నైవ జహ్యాత్ స్వకం మతమ్
తాదృశేన శమః కృష్ణ మన్యే పరమ దుష్కరః 74-5

శ్లోకం రెండో పాదంలో భీముని అభిప్రాయం సూటిగా ఉంది. పద్యం నాలుగో పాదంలో అదే వెటకారం ధ్వనింపజేస్తున్నది.

వ: **అని పలికి "మాకును వారికిఁ బితామహుండగు భీష్ముండు వినుచుండ సుయోధనుతోడం గురుకులేశ్వరు నాస్థానంబున నా వచనంబులుగా నిట్లనుము. 49**

అ: పితామహుండు = తాత; కురుకుల + ఈశ్వరు = ధృతరాష్ట్రుని యొక్క; ఆ స్థానంబునన్ = సభలో.

భా: *అని పలికి "మాకూ వారికీ తాతగారయిన భీష్ముడు వింటుండగా ధృతరాష్ట్రుని సభలో నామాటలుగా ఇలా అను.*

తే: **అన్నదమ్ముల మై యుండి, యకట మనల**
నొరులు దల యెత్తిచూడ; నొండొరుల తోడఁ
బెనఁగ నేటికి? నీ నేల పెద్దవారి
బుద్ధి విని పంచి కుడుచుట పోలదొక్కొ!" 50

అ: అక్కట = అయ్యో (ఇది ఖేద సూచన); అన్నదమ్ములము + ఐ + ఉండి; మనలన్; ఒరులు = ఇతరులు; తల + ఎత్తి చూడన్; ఒండొరులతోడన్ = ఒకరితో ఒకరం; పెనఁగన్ + ఏటికిన్ = పోట్లాడుకోవటం ఎందుకు?; పెద్దవారి; బుద్ధిన్= ఆలోచన; విని; ఈ నేల = ఈ రాజ్యం; పంచి= పంచుకొని; కుడుచుట = అనుభవించటం; పోలదు + ఒక్కొ= తగదా!

భా: *అయ్యో! అన్నదమ్ములపై ఉండి పరాయి వాళ్ళు మనలను తలెత్తి చూసేటట్లుగా పరస్పరం పోట్లాడుకోవటం ఎందుకు? పెద్దవారు చెప్పినట్లు విని ఈ రాజ్యం పంచుకొని అనుభవించటం మంచిదికాదా?"*

క: **అని యెవ్విధమున నైనను**
వనజోదర! సంధి సేయ వలయుం దగ; నే
మును వారును గలయుట భూ
జనులకు నెల్లను హితంబు సౌఖ్యకరంబున్" 51

అ: అని; వనజ + ఉదర=పద్మము నాభియందు గలవాడా - శ్రీకృష్ణా!; ఏ+ విధమునను+ ఐనను=ఎలాగయినా; తగన్ = తగిన విధంగా; సంధి; చేయవలయున్ = చేయాలి; ఏమును=మేమూ;వారును=ఆ కౌరవులూ; కలయుట=కలిసి ఉండటం; భూజనులకున్+ ఎల్లను= భూమి యందలి జనులందరికీ; హితంబున్ = మేలూ; సౌఖ్య కరంబున్ = సుఖాన్ని కలిగించేదీ (అవుతుంది)

భా: *శ్రీ కృష్ణా! ఏ విధంగానయినా సముచితమయిన రీతిగా తప్పక సంధి చేయాలి. మేమూ, కౌరవులూ సమైక్యంగా ఉండటం భూమండలం మీద ఉండే జనులకు అందరికీ మేలునూ, సుఖాన్నీ కలిగిస్తుంది.*

వి: భీముడు కక్ష సాధించాలి అనే దృఢాభిప్రాయం కలవాడే. అయినా కౌరవ

పాండవుల వైరం మూలంగా అనేకులు మరణించటం ఆయన మనస్సుకు బాధ కలిగించింది. లోకక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని భీముడు పై మాటలన్నాడు. "లోకాః సమస్తాః సుఖినో భవంతు' అని కోరటం భారతీయధర్మం గదా!.

చ: **అనుటయుఁ బిన్న నవ్వు నగి; యంబుజనాభుఁడు వల్కు; " నెన్నఁడున్**
విననివి భీము పాలఁ గడు వింతలు వింటిమి మాట; లగ్గి చ
ల్ల నగుట; భూరిభూధరము లాఘవ మొందుట గాదె; యివ్విధం
బున నితఁ డిప్డు మార్దవముఁబొందుట; యింకిటఁ జెప్ప నేటికిన్." 52

అ: అనుటయున్ = అనగా; అంబుజనాభుఁడు =పద్మం నాభియందుగలవాడు - శ్రీ కృష్ణుడు; పిన్న నవ్వు =చిరునవ్వు; నగి = నవ్వి; పల్కును= అంటున్నాడు; ఎన్నఁడున్ =ఏనాడూ; భీముని పాలన్ = భీముని వద్ద; వలన - నోట; విననివి; కడువింతలు = చాలా క్రొత్తవయిన; మాటలు; వింటిమి; ఇతఁడు = ఈ భీముడు; ఇప్డు = ఇప్పుడు; ఈ + విధంబునన్= ఇలాగా; మార్దవమున్ = మెత్తదనాన్ని; పొందుట; అగ్గి = అగ్ని; చల్లన + అగుట = చల్లబడటం; భూరి భూధరము= పెద్దకొండ; లాఘవము = తేలికదనాన్ని; పొందుట; కాదె = కదా; ఇంక = ఇక; ఇటన్ = ఇక్కడ; చెప్పన్ + ఏటికిన్ = చెప్పవలసిందేముంది?

భా: భీముడు ఇలా అనగా శ్రీకృష్ణుడు చిరునవ్వుతో ఇలా అన్నాడు. "ఇంతకు ముందెప్పుడూ భీముని నోట వినని విచిత్రమయిన కొత్త మాటలు విన్నాం. ఈ సమయంలో ఈతడు ఇలాగా మెత్తబడటం అగ్ని చల్లబడినట్లూ, మహా పర్వతం తేలిక అయినట్లు ఉన్నది. ఇంక ఈ విషయంలో చెప్పవలసిందేముంది?

వి : 46వ పద్యంలో భీముడు సుయోధనునితో కలిసి ఉండవలసివచ్చే అవసరం-కారణం చెప్పాడు. అర్జునుడు ధర్మరాజు కురువంశనాశనానికి ఇష్టపడకపోవటం వల్ల తానుగూడా కౌరవుల సంధి విషయం ప్రస్తావించాడు. అజ్ఞ ఇవ్వవలసినవాడు ధర్మరాజు. దాన్ని పాటించవలసిన నలుగురిలో ముఖ్యులు తానూ, అర్జునుడూ. అలాంటి అర్జునుడు గూడా అన్నగారికి అనుకూలంగా ఉండటం వల్ల భీమునికి విధిలేక అలా అనవలసి వచ్చింది.

కృష్ణుని చిరునవ్వుకుకారణం. అంతకుముందు కౌరవుల విషయం వచ్చినప్పుడు పండ్లు పటపట కొరుకుతూ క్రోధతామ్రాక్షుడై పలికే భీముడు శాంతివచనాలు చల్లచల్లగా మాట్లాడటం చూచిన కృష్ణునికి అపూర్వం అనిపించింది. దీన్నే మూలం ఇలా అంటుంది.

ఏ తచ్ఛ్రుత్వా మహాబాహుః కేశవః ప్రహసన్నివ
అభూత పూర్వం భీమస్య మార్దవోపహితం వచః 75-1
గిరేరివ లఘుత్వం త చ్ఛీతత్వమివ పావకే
మత్వా రామానుజః శౌరి: శార్జ్గధన్వావృకోదరమ్ 75-2

వేడి ఉండటం అగ్నికీ; బరువుగా ఉండటం పర్వతానికీ సహజ ధర్మాలు. వేడి లేకపోతే అగ్నికి స్వరూప నాశనంఅయిందన్నమాట. అలాగే బరువు లేకపోతే పర్వతమూ వ్యక్తిత్వం కోల్పోతుంది. అగ్నికీ, పర్వతానికీ ఈ స్థితి అభూత పూర్వం; విపరీతం.

అలాగే భీముడు తీవ్ర స్వభావం కలవాడు; ధీరోద్ధతుడు; ఆవేశపరుడు; సూటిగా పలికేవాడు; అలాంటివాడు అందుకు భిన్నంగా మాట్లాడటం అభూతపూర్వం; విపరీతం.

"స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః "అనే భగవానుడు ఎవరైనా స్వధర్మాన్ని గానీ, కర్తవ్యాన్ని గానీ విస్మరించటం సహించడు. అంతేకాదు వారిని కర్తవ్యోన్ముఖులను చేస్తాడు.

-:శ్రీ కృష్ణుఁడు భీమసేనునిఁగౌరవులతోడి యుద్ధమునకుఁ బురికొల్పుట:- సం. 5-73-1

తే: అని సహోదరు లాజి నాయాసపడుట
కోర్వమియుఁ; గౌరవులఁ జంప నొల్లమియును
గలుగు నెయ్యంబు పెంపునఁ గరుణ నార్ద్రుఁ
డైన పవనజుఁ బురికొల్ప నాత్మఁ దలఁచి. 53

అ: అని; ఆజిన్ = యుద్ధంలో; సహోదరులు = తోబుట్టువులు; ఆయాస పడుటకు= శ్రమ పడటానికి; ఓర్వమియున్ = సహించలేకపోవటమూ; కౌరవులన్; చంపన్; ఒల్లమియును= అంగీకరించకపోవటం వలన; కలుగు=కలిగేటటువంటి; నెయ్యంబు=స్నేహం యొక్క; పెంపునన్= ఆధిక్యం చేత; కరుణన్ = దయతోనూ; ఆర్ద్రుఁడు + ఐన = మెత్తబడిన మనస్సు గలవాడయిన; పవనజున్ = వాయుదేవుని కుమారుని - భీముని; పురికొల్పన్ = ప్రోత్సహించటానికి; ఆత్మన్ = మనస్సులో; తలఁచి = అనుకొని.

భా: *యుద్ధంలో తోబుట్టువులయిన అర్జునాదులు కష్టపడటం సహించలేకా, కౌరవులను చంపటం ఇష్టం కాకపోవటం చేతా కలిగేటటువంటి స్నేహంతో మనస్సు మెత్తబడిన భీముని పురికొల్పవలెనని అనుకొని. (తరువాతి వచనంతో అన్వయం)*

వ: మురమర్దనుం డతనితో నిట్లనియె. 54

అ: మురమర్దనుండు = మురుడు అనే రాక్షసుని చంపినవాడు - కృష్ణుడు;

భా: *శ్రీ కృష్ణుడు భీమునితో ఇలా అన్నాడు.*

వి: "సంతేజయం స్తదా వాగ్భి ర్మాతరిశ్వేవ పావకమ్75-3 అని మూలం. భీముని కృష్ణుడు అగ్నిని వాయువు వలె ఉత్తేజింప జేస్తున్నాడని అంటుంది.

ఉ: "యుద్ధము మీఁది వేడ్కయు; మహోగ్ర విరోధుల నల్కఁజేయు ద
ర్పోద్ధతియున్; సుయోధనుని యున్నతి సైఁపని యేపు; రాజ్య సం
సిద్ధి నిజాగ్రజన్మునకుఁ జేయు తలంపును గల్గు నీ వసం
బద్ధము లైన వాక్యములు వల్కుట యొప్పునె కీచకాంతకా!" 55

అ: కీచక + అంతకా = కీచకులను చంపినవాడా - భీమసేనా; యుద్ధము

మీఁదివేడ్కయున్ =యుద్ధం మీద ఉన్న కుతూహలమూ; మహా + ఉగ్రవిరోధులన్ = మిక్కిలి భయంకరమయిన శత్రువులను; అల్కన్ + చేయు = కోపింప చేసేటటువంటి; దర్ప + ఉద్ధతియున్ = గర్వం యొక్క అతిశయమూ; సుయోధనుని + ఉన్నతి = దుర్యోధనుని యొక్క అభివృద్ధిని; సైపని = సహించని; ఏపున్ = విజృంభణమూ; నిజ + అగ్రజన్మునకున్ = నీ అన్నకు; రాజ్యసంసిద్ధి = రాజ్యం లభించటం; చేయు; తలంపునన్ = చేయాలనే ఉద్దేశ్యమూ; కల్గు = కలిగి ఉన్న; నీవు; అసంబద్ధములు = ప్రయోజన రహితాలయిన; అయోగ్యాలయిన; వాక్యములు; పల్కుట; ఒప్పునె = తగునా?

భా: "భీమా! ఇంతకుముందు నీకు యుద్ధోత్సాహమూ, కోపంతో చాలా తీవ్రమయిన శత్రువులను సంహరించే గర్వమూ, దుర్యోధనుని ఆధిక్యాన్ని సహించలేని విజృంభణా, మీ అన్నగారు ధర్మరాజుకు రాజ్యం చేకూర్చాలి అనే కాంక్షా ఉండేవి. ఇవన్నీ ఉన్న నీవు ఇప్పుడు ఇలాగా అసందర్భపు మాటలు పలకటం ఏమీ బాగా లేదు."

వి: భీముడు సంధికి అనుకూలంగా మాట్లాడటానికి మూడు హేతువులను 53వ పద్యంలో కవిచెప్పాడు. ప్రస్తుత పద్యంలో కృష్ణుడు భీముని యుద్ధానికి అనుకూలమైన నాలుగు విషయాలు చెప్పాడు. "కీచకాంతకా" అనే సంబోధన ద్రౌపది నవమానించిన వాళ్ళ నెవరినీ భీముడు వదలరాదు అనే భావం సూచిస్తుంది. భీముని సంధి వచనాలు కృష్ణునికే గాదు ఎవరికయినా అసంబద్ధాలుగానే కనిపిస్తాయి.

వ: అని అంత నిలువక. **56**

భా: అని అంతటితో ఆగక శ్రీకృష్ణుడు మళ్ళీ ఇలా అంటున్నాడు.

క: "వెఱపెట్టిదియో యెన్నడు
నెఱుఁగని నీయట్టివాని కెవ్వరొకో యీ
పిఱికితన మింత యలవడఁ
గఱపినవా" రనుచు శౌరి గలకల నవ్వెన్. **57**

అ: వెఱపు = భయము; ఎట్టిదియో = ఎలాంటిదో; ఎన్నడున్ = ఏ నాడునూ; ఎఱుఁగని; నీ + అట్టివానికి = నీ వంటివానికి; ఈ పిఱికితనము; ఇంత; అలవడన్: = అబ్బేటట్లుగా; కఱపినవారు = బోధించినవారు/ కలిగించినవారు; ఎవ్వరు + ఒకో = ఎవరోకదా; అనుచున్ = అంటూ; శౌరి = శూరుని వంశంలో పుట్టినవాడు - శ్రీ కృష్ణుడు; కలకల నవ్వెన్.

భా: "చిన్నప్పటినుంచీ భయం అంటే ఎలాంటిదో ఏనాడూ తెలియని నీకు ఇంత పిరికిమందు ఇంతగా పోసిన వారెవరో కదా" అని శ్రీకృష్ణుడు కలకల నవ్వాడు.

వి: భీముని మాటలలో పిరికితనం; వెరపు ఉన్నాయని కృష్ణుని వాదన. కృష్ణుడు నవ్వుతూ హాస్యంగా అన్నా ఈ మాటలు భీమునికి చురకలు అనిపించాయి.

"పాండవోద్యోగము" అనే నాటకంలో తిరుపతి వెంకట కవులు ఈ సన్నివేశాన్ని చాలా వివరంగా రచించారు.

వ: దానికి దరహసితవదనుం డగుచు భీమసేనుండు వసుదేవసూనున కిట్లనియె. 58

అ: దానికి = అందుకు; దరహసితవదనుండు = చిరునవ్వుతో గూడిన ముఖం కలవాడు; వసుదేవసూనునకున్ = వసుదేవుని కుమారునకు - శ్రీకృష్ణునికి.

భా: అ మాటలకు భీముడు చిరునవ్వుతో శ్రీకృష్ణునితో ఇలా అన్నాడు.

వి: కృష్ణుడు చిరునవ్వుతో అన్నాడు కాబట్టి భీముడు గూడా అదే రీతిలో అదే స్థాయిలో సమాధానం ఇస్తున్నాడు.

ఉ: "బంటుతనంబు మాటలకుఁ బాఱకు; పాండునృపాలు పాలు గై
కొంటయచాలు నన్న నృపకుంజరు పల్కుల కడ్డమాడరా
కుంట యెఱుంగవే? మును సుయోధను చందముఁ జూపి 'యప్పుడే
మంటి యుపేంద్ర! న' న్నని రణాగ్రమునన్ నిను మూదలించెదన్. 59

అ: బంటుతనంబు మాటలకున్ =శూరవచనాలను చెప్పటానికి; పాఱకు = పూనుకోవద్దు; పాండునృపాలు పాలు = పాండురాజు రాజ్య భాగం; కైకొంట + అ = తీసుకోవటం మాత్రమే; చాలును; అన్న = అనినటువంటి; నృపకుంజరుపల్కులకు = రాజశ్రేష్ఠుడయిన ధర్మరాజు మాటలకు; అడ్డము; ఆడరాకుంట = మాట్లాడగూడకపోవటం; మును = పూర్వం; ఎఱుంగవే = ఎరగవా? రణ + అగ్రమునన్ = మహాయుద్ధంలో; సుయోధనుచందమున్= దుర్యోధను విధమును; చూపి = (నీకు) చూపించి; ఉపేంద్ర = కృష్ణా! ; అప్పుడు = (రాయబారానికి వెళ్ళటానికి ముందు) నన్ను; ఏమి + అంటి = ఏం అన్నావు; అని నిను = నిన్ను; మూదలించెదన్= స్మరింపజేస్తాను.

భా: *'కృష్ణా! శూరవచనాలు చెప్పటానికి పూనుకొనవద్దు; 'పాండు రాజు రాజ్యభాగం తీసుకోటం మాత్రమే చాలు' అనే ధర్మరాజు గారి మాటకు మేము ఎదురు చెప్పకపోవటం నీకు పూర్వం తెలియదా? రాబోయే యుద్ధంలో, దుర్యోధనుని అధమ స్థితిని నీకు చూపించి "శ్రీకృష్ణా! అప్పుడేమన్నావు నన్ను" అని ఇప్పటి నీ మాటలు గుర్తు చేస్తాను.*

వి: గదా యుద్ధంలో భీముడు దుర్యోధనుని నేలగూల్చి ధర్మరాజు, కృష్ణుడు; పాంచాలురు అర్జునుడు; సాత్యకి; నకుల సహదేవులను చూచి ఇలా అన్నాడు.

"శంక లేక కడఁగి సభకట్లు పాంచాలి
నంటరాని దాని నొంటిచీర
తోన యున్న సాధ్వి వేనలి వట్టి యీ
డ్చించినతనిఁ జూఁడు" డంచుఁ బొదలి. శల్య 2. ఆ. 283 ప.

ఇదే శ్రీకృష్ణునికి భీముడు గుర్తు చేస్తానన్నది. లేక యుద్ధంలో పరాక్రమించి వీరవిహారం చేస్తూ నా శౌర్యాన్ని నీకు గుర్తు చేస్తాను అని కూడా చెప్పవచ్చు.

క: నా కొలఁది విచారింపక
నీ కిట్లనఁ దగునె? మిన్ను నేలయు నిమ్మెఁ
గాక తిరుగంగఁ బడినం
బో; కే ముంజేతు లొడ్డి పోవఁగఁ ద్రోతున్." 60

అ: నా కొలఁది = నా సామర్థ్యం; విచారింపక = ఆలోచించక; నీకు; ఇట్లు; అనన్= అనటం; తగునె; మిన్ను = ఆకాశం; నేలయున్ = భూమి; ఈ + మైన్ + కాక = ఇప్పుడు ఉన్నట్లు గాకుండా; తిరుగంగఁబడినన్ = తిరగబడ్డా - తలక్రిందులయినా; పోక = వెనక్కుపోక; ఏన్ = నేను; ముంజేతులు = మణికట్టు; ముందు భాగాలు - అరచేతులు; ఒడ్డి = చాచి - ప్రయోగించి; పోవఁగన్ = తొలగిపోయేటట్లుగా; త్రోతున్ = తోసేస్తాను.

భా. కృష్ణా! నా శక్తిసామర్థ్యాలను గూర్చి ఆలోచించకుండా నీవు ఇలా అనటం తగదు. భూమి ఆకాశం ఇప్పుడు ఉన్నట్లు కాకుండా తిరగబడినా సరే నేను వెనకకు తగ్గక ముంజేతులు అడ్డం పెట్టి పక్కకు నెట్టేస్తాను. సరిచేస్తాను."

వి. దీనికి మూలం ఇలా ఉంది.

యదీమే సహసా క్రుద్ధే సమేయాతాం శిలే ఇవ
అహమేతే నగృహ్ణీయాం బాహుభ్యాం సచరాచరే 76-8

కృష్ణా! భూలోక స్వర్గలోకాలు (రోదస్సులు) మిక్కిలి కోపించి రెండు రాళ్ళవలె పరస్పరం కొట్టుకోసాగితే నేను చరాచర ప్రాణులతో గూడిన ఈరెండిటినీ నా బాహువులతో ఆపివేయగలను.

ఉ. నావుడు; "నవ్వుటాల కనినం బవనాత్మజ! యింత యేటికిం
గేవలయోధవే! పరుల కిల్బిషముల్ దలపోయ కిమ్మెయిన్
జావడమైనఁ జూచి, యిది చందము గాదని యంటిఁగాక; నీ
చేవయు లావు నీవు మును చేసిన భంగులు నే నెఱుంగనే." 61

అ. నావుడు = అనగా; పవనాత్మజ = వాయు కుమారా - భీమసేనా! నవ్వుటాలకు= పరిహాసానికి; అనినన్=అనగా; ఇంత + ఏటికిన్ = ఇంత వివరణ ఎందుకు?(నీవు); కేవలయోధవే= సామాన్యమయిన వీరుడివా?; పరుల కిల్బిషముల్= శత్రువులు చేసిన అపరాధాలను; తలపోయక= స్మరింపక; ఈ + మెయిన్ = ఈ విధంగా; జావడము + ఐనన్ = పిరికితనం కాగా - జావకారి పోవడం చూచి; ఇది = ఇలా కావటం; చందము = మర్యాద - తగినవిధం; కాదు;అని; అంటిన్+ కాక = అన్నాను గాని; నీ చేవయున్ = నీ ధైర్యమూ; లావున్= బలమూ; నీవు; మును =ఇంతకు ముందు; చేసిన భంగులు = చేసిన వీరకార్యాల రీతులు; నేను ఎఱుంగనే = ఎరగనా?

భా. అని భీముడు అనగా శ్రీ కృష్ణుడిలా అన్నాడు. "భీమా! నేను నవ్వులాటగా అన్న మాటలకు ఇంత ఉలికి పడతావేమిటి? నీవేమైనా సామాన్యవీరుడివా? శత్రువులయిన కౌరవులు చేసిన ద్రోహాలను మరచిపోయి ఇలా పిరికివాడివి కావటం చూసి ఇది నీకు

తగినవాడవు కాదని అన్నాను కాని నీ ధైర్యం, బలం, నీవు ఇంతకు ముందు చేసిన వీరకార్యాలను నేను ఎరగనా?"

వి. హిడింబ బక జరాసంధాదుల వధ మొదలయినవి భీముడు చేసిన వీరకార్యాలు.

వ. అని చెప్పి మాధవుండు మఱియును. 62

అ. మాధవుండు = శ్రీ కృష్ణుడు

భా: *అని చెప్పి శ్రీకృష్ణుడు మళ్ళీ ఇలా అన్నాడు.*

ఉ. "పార్థుఁడు పోరఁ దేరు గడపం దనకున్ ననుఁ గోరి యెంతయున్
బ్రార్థన సేసె; దాని కనురాగము వొందితి నేను; గాన యు
ద్ధార్థుల మైన మాకు నిను నాసపడం దగదే? యశంబు నా
నార్థములున్ విరోధి విజయంబునఁదక్కగ నొంటఁ గల్గునే"? 63

అ: పార్థుఁడు = అర్జునుడు; పోరన్ = యుద్ధంలో; తనకున్; తేరు = రథాన్ని; కడపన్= నడపటానికి; ననున్ = నన్ను; కోరి; ఎంతయున్ = ఎంతగానో; ప్రార్థన + చేసెన్ = ప్రార్థించాడు; దానికిన్ = ఆతని ప్రార్థనకు; నేను; అనురాగము + పొందితిన్ = సంతోషించాను - ఇష్టపడ్డాను; కాన =కాబట్టి; యుద్ధ + అర్థులము+ఐన = యుద్ధాన్ని కోరేటటువంటి; మాకు; నినున్ = నిన్ను గూర్చి; ఆస పడన్ = ఆశపడటం; తగదే = తగదా!; యశంబు = కీర్తి; నానా + అర్థములున్= అనేకవిధాలయిన ప్రయోజనాలు; విరోధి విజయంబునన్ = శత్రువులను జయించటం వల్ల; తక్క = తప్ప; ఒంటన్ = ఇంకొక దానివల్ల; కల్గునే = లభిస్తాయా?

భా. *"అర్జునుడు యుద్ధంలో తనకు రథం నడపమని ఎంతగానో ప్రార్థించాడు. దానికి నేను అంగీకరించాను. కాబట్టి యుద్ధం చేయాలి అనుకునే మేము నీ సహాయం కోరటం తగదా? కీర్తి తదితర ప్రయోజనాలూ శత్రువులను జయించటం వల్ల తప్ప ఇంకొక విధంగా లభించవు గదా!"* 2

వి. అర్జునుడు కృష్ణుని (ఉద్యోగ- 2 ఆ 88 పద్యంలో) సారథ్యం చేయమని కోరాడు

వ. అనవుడు. 64

భా. *అనగా భీముడు ఇలా అన్నాడు.*

శా. "ఏమీ!; పార్థుఁడు నీవు దండిమగలై యీ వచ్చు కౌరవ్య సం
గ్రామ క్షోభము బాహుదర్పమునఁ దీర్పం, బెద్ద మిట్టెక్కి మి
మ్మే మెల్లన్ వెరగంది చూచెదముగా; కీ సారెకుంబోయిరా;
భీముం డిత్తఱి రిత్త మాటలకుఁ గోపింపండు సూ పెంపఱన్. 65

అ. ఏమీ = ఏమిటీ!; పార్థుఁడు = అర్జునుడూ; నీవు; దండిమగలై = మహావీరులై; ఈ వచ్చు=ఈ రాబోయే; కౌరవ్య సంగ్రామ క్షోభము=కౌరవులతో జరిగే యుద్ధ ఉత్తేజనాన్ని-యుద్ధపు కలతను; బాహు దర్పమునన్ = భుజబలంతో; తీర్పన్ = తీర్చగా; మిమ్ము=మిమ్ములను;

ఏము+ ఎల్లన్ = మేమందరమూ; పెద్ద మిట్టు = ఎక్కువ ఎత్తయిన ప్రదేశాన్ని; ఎక్కి; వెఱంగంది= ఆశ్చర్యపడి; చూచెదముగాక=చూస్తాంలే; ఈ సారికిన్ = ఈతడవకు; పోయిరా =(సంధికి) వెళ్ళిరా; భీముండు; ఈ+తఱిన్ = ఈ సంధికి వెళ్ళే సమయంలో; పెంపు+ అఱన్ = గౌరవం నశించేటట్లుగా; రిత్త మాటలకు = కల్లబొల్లి కబుర్లకు; కోపింపండుసూ= కోపించడు సుమా!

భా. *"ఏమిటీ! అర్జునుడూ, నీవు మహావీరులై రాబోయే కౌరవ యుద్ధ క్షోభమును భుజబలంతో తీరుస్తుంటే మేమంతా ఒక ఎత్తయిన ప్రదేశంలో కూర్చుని పరమాశ్చర్యంతో చూస్తాంలే. ఈ ఒక్కసారి సంధికి వెళ్ళిరా. ఈ సమయంలో ఈ భీముడు కల్ల కబుర్లకు తన గౌరవం ధ్వంసం అయ్యేటట్లుగా కోపింపడు సుమా."*

వి. భీముడు కోపించను అంటున్నాడు. కాని పై మాటలలో కోపాన్ని కన్పింపనీయని హేళన స్ఫురిస్తుంది. ఇలాంటి సన్నివేశాలను మూలం సూటిగా చెపుతుంది. దాన్నే తిక్కన వ్యంగ్య మర్యాదలతో రసవంతంగా కన్నులముందు ఉంచుతాడు. బావా బావమరదుల సరసం ఇందులో గోచరిస్తుంది. నేను అనటానికి బదులు "భీముడు" అనటం తన వ్యక్తిత్వానికి; ఆత్మవిశ్వాసానికి; ఔద్ధత్యానికి సూచకం.

వ. అని పలికి యివ్విధంబున గోపాలదేవు మేలంపు మెయివడి కార్య వచనంబులకుం దగం దానును దోడ్తో సరసంబాడుటయకా మఱుమాటలాడి; యంతటం దని దోవక బకమర్దనుం డతనితో నిట్లనియె. 66

అ. మేలము+మెయివడి కార్యవచనంబులకున్=పరిహాస పద్ధతి గూడిన కార్యాను కూల వాక్యాలను; తగన్ = తగినట్లుగా; తోడ్తోన్ = వెనువెంటనే; సరసంబు + ఆడుటయకా=సరస మాడటమే; కాగా; తనివోవక=తృప్తిచెందక; బకమర్దనుండు=బకాసురుని చంపినవాడు భీముడు.

భా. *అని యీ విధంగా భీముడు శ్రీకృష్ణుని పరిహాస భావంతో గూడిన కర్తవ్యాను కూలాలయిన మాటలకు తగినట్లుగా తాను గూడా వెంట వెంటనే సరస మాడినట్లుగానే సమాధానాలు చెప్పాడు. అయినా ఆ మాత్రానికే తృప్తి కలుగక భీముడు మళ్ళీ కృష్ణునితో ఇలా అంటున్నాడు.*

ఉ. "కయ్యము గల్గిన ట్లయిన; గంధగజప్రకరంబు కుంభముల్
వ్రయ్యఁ దురంగ పంక్తులు ధరం బడఁ; దేరిగముల్ బడల్పడన్
డయ్యమి కీవు వెక్కసపడన్ గదపండువు సేయఁగోరు నా
దయ్యము నెత్తికోలు దుది దాఁకుటకాదె భుజంగభంజనా!" 67

అ:- భుజంగభంజనా = కాళియ సర్పమును మర్దించిన వాడా - శ్రీ కృష్ణా!; కయ్యము= యుద్ధం; కల్గినట్లు + అయిన = సంభవిస్తే; గంధ గజ ప్రకరంబు కుంభముల్ = మదించిన ఏనుగుల సమూహాల కుంభ స్థలాలు; వ్రయ్యన్ = చీలిపోగా; తురంగ పంక్తులు = గుఱ్ఱాల వరుసలు; ధరన్ = భూమి మీద; పడన్ = పడగా; తేరిగముల్ = రథాల సమూహాలు; బడల్పడన్= నశించగా; డయ్యమికిన్ = (నేను)అలసట చెందకపోవడానికి; ఈవు=నీవు; వెక్కసపడన్=

ఆశ్చర్యపడగా; గదపండువు=గద పండుగ; చేయన్ కోరు = (నేను) చేయవలెనని అనుకొనే; ఆ దయ్యము + ఎత్తికోలు = ఆ భగవంతుని - ఆ విధి యొక్క- కోరిక; తుది + తాకుట + కాదె = నెరవేరటమే కదా - తుదిముట్టటమే కదా!!

భా. *"శ్రీకృష్ణా! యుద్ధమే జరిగేటట్లయితే అందులో మదించిన ఏనుగుల కుంభ స్థలాలు బ్రద్దలవుతాయి. గుర్రాలు వరసగా నేల కూలుతాయి. రథాలు నామరూపాలు లేకుండా పోతాయి. ఇంత యుద్ధం చేసి కూడా ఏ మాత్రం అలసట చెందని నన్ను చూసి నీవు ఆశ్చర్యపడతావు. నా గదతో చేసే పండుగను కోరే ఆ విధికోరిక ఇలా నెరవేరుతుంది".*

వి. దీనికి మూలం ఇలా ఉంది.

మయా ప్రణున్నాన్ మాతంగాన్ రథినః సాదిన స్తథా
తథా నరా నభిక్రుద్ధం నిఘ్నంతం క్షత్రియర్షభాన్ 76-16

చ. **అన విని దేవకీతనయుఁ డాతని కిట్లనుఁ; "జెప్పినంత కం**
టెను మిగులంగఁ జేయుదు; గడింది మగండవు! నిన్నుఁ దెప్పగాఁ
గొని పలుమాఱు నాపదలకున్ భయమొందక దుఃఖవార్ధు లీఁ
దిన మము నెల్ల నిక్కొఱఁత దీర్చి సుఖాత్ములఁ జేయు పావనీ! 68

అ: అనన్ = అనగా; విని; దేవకీతనయుఁడు = దేవకీదేవి కుమారుడు - శ్రీ కృష్ణుడు; ఆతనికిన్; ఇట్లు = ఇలా; అనున్ = అంటున్నాడు; పావనీ = వాయుకుమారా - భీమా; చెప్పినంత-కంటెను = చెప్పిన దాని కంటె గూడా; మిగులంగన్ = ఎక్కువగా; చేయుదు = చేస్తావు; కడింది మగండవు=గొప్పశూరుడివి; నిన్నున్; తెప్పగాన్=నావగా; కొని= చేసుకొని; ఆపదలకున్= ఆపదలకు; భయము + ఒందక = భయపడక; పలుమాఱు = చాలతడవలు; దుఃఖవార్ధులు= దుఃఖాలు అనే సముద్రాలను; ఈఁదిన; మమున్ + ఎల్లన్ = మమ్ములను అందరినీ; ఈ + కొఱఁత = ఈ లోపాన్ని - ఈ మిగులును; తీర్చి = పోగొట్టి - సరిచేసి; సుఖ + ఆత్ములన్ = సుఖస్వరూపులనుగా; చేయు = చేయుము.

భా. *ఆ మాటలు విని శ్రీకృష్ణుడు ఆ భీమునితో ఇలా అన్నాడు. "భీమా! నీవు చెప్పిన దానికంటె చాలా ఎక్కువ పరాక్రమం చూపగలవాడివి, మహావీరుడివి. మేమంతా నిన్ను తెప్పగా గ్రహించి ఆపదలకు ఏమాత్రం భయపడక దుఃఖసముద్రాలను ఈదాము. కాబట్టి ఇప్పుడు ఈలోపం గూడా సరిచేసి మాకు సుఖం కలిగించు.*

వి. భీముని ఇలా యుద్ధోన్ముఖుని చేయటం వల్ల కృష్ణుడు చేయదలుచుకున్న దేమిటో విశదమవుతుంది. పాండవపక్షంలో యుద్ధం కావాలి అనేవారు ఎంతమంది ఉన్నారో బేరీజు వేసుకోవటానికి ఈ సన్నివేశాలు చాలా వరకు ఉపయోగపడతాయి.

క. **ఇదె పోయెదఁ; గౌరవ్యులఁ**
బదనికి రాఁ బలికి సంధి వాటించెద; నా
కది యొప్పుదె! కాని తుదిం
గుదు రింతకు నీవ కావె గుణరత్ననిధీ!" 69

అ. ఇదె = ఇదుగో; పోయెదన్ =వెళ్ళుతున్నాను; కౌరవ్యులన్ = కౌరవులను; పదనికి రాన్ = అనుకూల స్థితికి వచ్చేటట్లుగా; పలికి; సంధి; పాటించెదన్ = కలిగిస్తాను - చేస్తాను; నాకు అది = ఆ సంధిచేయటం; ఒప్పదె = తగ్గదా - సముచితంకాదా; కాని; గుణరత్న నిధీ = గుణాలు అనే రత్నాలకు నిధి అయినవాడా - భీమా; తుదిన్ = చివరకు; ఇంతకున్ = దీనికి అంతటినీ; కుదురు = ఆధారము; నీవ = నీవే; కావె = కదా!

భా. ఇదిగో బయలుదేరుతున్నాను; కౌరవులతో అనుకూలస్థితికి వచ్చేటట్లుగా మాట్లాడి సంధి చేస్తాను. అలా చేయటం నా ధర్మం కదా! కాని సుగుణరత్నఖనీ! భీమా! ఈ జరగబోయేదానికి అంతటికీ నీవే చివరకు ఆధారం కావలసి ఉంది గదా!"

-: అర్జునుఁడు శ్రీకృష్ణునితోఁదన యభిప్రాయంబు సెప్పుట :-

సం. 5-76-1

వ. అనిన వాసుదేవున కర్జునుం డిట్లనియె. 70

అ. వాసుదేవునకు = శ్రీ కృష్ణునికి

భా: ఆ మాటలు అనిన శ్రీకృష్ణునితో అర్జునుడిలా అన్నాడు.

తే. "చెప్పఁగల యంతవట్టును జెప్పె నీ క
జాత శత్రుండు; వింటి వీ వాతెఱంగు
మాకు నెల్లను బలుకంగ మాట లొండు
గలవె; యైనను జెప్పెదఁ గన్నయంత. 71

అ: ఆజాత శత్రుండు = ధర్మరాజు; నీకు; చెప్పగల యంతవట్టును = చెప్పగలిగినంతవరకు; చెప్పెన్=చెప్పాడు; ఈవు=నీవు; ఆతెఱంగున్ = ఆ పద్ధతిని; వింటివి=విన్నావు;మాకున్; ఎల్లన్ = అందరికీ; పలుకంగన్ = చెప్పటానికి; ఒండు =మరియొుక విధమయిన; మాటలు; కలవె = ఉన్నవా?; ఐనను= అయినా; కన్న + అంత= (నాకు) తెలిసినంత; చెప్పెదన్ = చెపుతాను.

భా. "ధర్మరాజు నీకు చెప్పగలిగినంతవరకు చెప్పాడు. అదంతా నీవు విన్నావు. ఇంక మేమందరమూ చెప్పవలసిన మాటలు ఏమి ఉన్నవి? అయినా నాకు తెలిసినంత వరకు చెపుతాను.

వి. "అజాత శత్రుండు" అనటం వల్ల ధర్మరాజు తనకు అన్ని విధాలా కీడు చేసిన వారికి కూడా అపకారం చేయడనీ; అలాంటి వాడు చెప్పే మాటలు యుద్ధ సమ్మతాలు గావనీ తెలుస్తుంది. శత్రువులే లేనివాడికి సంధి వచనాలు తప్ప మరొక విషయం స్ఫురించదని అర్జునుని అభిప్రాయం. అన్నగారి అభిప్రాయానికి తన ఉద్దేశ్యం భిన్నమయింది. దాన్ని సూటిగా చెప్పటం పెద్దల మాట కాదనటమే. అది ధర్మంగాదు. కాబట్టి ఉపాయంగా తన అభిప్రాయాన్ని చెప్పటమే అర్జునుని ఉద్దేశం.

మ. ధృతరాష్ట్రుం డతిలోభ దూషితుఁడు ధాత్రీభాగ మీనేర్చునే!
సుతుఁడుం గష్టుఁడు; సంధి యేల యగు నంచున్ మున్న కై పెక్కిన
ట్టి తలం పచ్యుత నీకుఁ గల్గినది; గాండీవంబు దివ్యాస్త్ర సం
తతియుం బెట్టిన యట్ల యుండ; మముఁ జింతం బాపరాదో కదే. 72

అ: అచ్యుత = శ్రీకృష్ణా!; అతి లోభ దూషితుఁడు = అధికమయిన ఆశ చేత చెరుపబడినవాడు; అయిన; ధృతరాష్ట్రుండు; ధాత్రీభాగము = రాజ్యభాగం; ఈ నేర్చునే = ఇయ్యగలడా?; సుతుండున్ = ఆయన కుమారుడు - దుర్యోధనుడు గూడా; కష్టుడు = పాపాత్ముడు; సంధి; ఏల = ఎలాగా; అగున్ = అవుతుంది? అంచున్ = అని; మున్ను + అ = ముందే; కైపు + ఎక్కినట్టి తలంపు = ఉద్రేక పూరితమయిన ఆలోచన - ఒక విధమయిన ఆలోచన; నీకున్ కల్గినది; గాండీవంబున్ = గాండీవము; దివ్య + అస్త్ర సంతతియున్ = దివ్యాస్త్రాల సమూహమూ; పెట్టిన + అట్లు + అ = పెట్టినవి పెట్టినట్లే; ఉండన్ = ఉండగా; మమున్ = మమ్ములను; చింతన్ = విచారాన్నించి; పాపరాదు + ఓ + కదే = తొలగించరాదా?

భా. *శ్రీకృష్ణా! ధృతరాష్ట్రుడు దురాశతో చెడిపోయాడు. అలాంటివాడు రాజ్యభాగం ఇస్తాడా? ఆయన కుమారుడు దుర్యోధనుడు కూడా పాపాత్ముడు. సంధి ఎలా కలుగుతుంది? అని ముందే నీకు ఆవేశ పూరితమయిన ఒక దృఢాభిప్రాయం కలిగింది. నా గాండీవమూ దివ్యాస్త్ర సమూహమూ - వీటిని ఏ మాత్రం కదిలించకుండానే మా రాజ్యభాగం మాకు వచ్చేటట్లు చేసి మా దిగులు పోగొట్టరాదా?*

వి. కృష్ణుడు తనకు గలిగిన తలంపును వెనక రెండు చోట్ల చెప్పాడు.

సంజయు రాయబార సమయంలో కృష్ణుడు "ఈ సంధి కార్యం బత్యంత దుర్ఘటంబు దీని ఘటియింపం జేయుట యశక్యంబని తలంచెద".(1-352) అని అంటున్నాడు.

సంధి చేయటానికి వెళ్ళమని ధర్మరాజుకోరిన సందర్భంలో

"ఆ సుయోధను ముక్కున నావి గలుగఁ
బుడమి నీకీఁడుఁ గావునం బోర కలుగు" (3-41)

అని అన్నాడు. ఈ రెండిటినీ గుర్తు చేస్తూ అర్జునుడీ మాటలు అంటున్నాడు.

లోభం అనేదాన్ని చాణక్యనీతి సూత్రాలు ఇలా వివరించాయి.

దానం చేయటానికి తగినవాళ్ళు లభించినా దానం చేయకపోవటం లోభం. అలాగే ఎలాంటి కారణం లేకుండానే పరధనాన్ని తీసుకోవటం గూడాలోభమే. ధృతరాష్ట్రునిలో ఉన్నది ఈ రెండోది.

సంధి కాదు అని దృఢాభిప్రాయం శ్రీకృష్ణునికి కలిగింది. అయినా ఆ ఉద్దేశానికి వ్యతిరేకంగా సంధి చేయటానికి ప్రయత్నించమని కృష్ణునితో అర్జునుడు అంటున్నాడు. అచ్యుత - చ్యుతి లేనివాడా - నాశనం లేని వాడా అని సంబోధన. కృష్ణుడు పరమాత్మ కాబట్టి తలచుకుంటే సంధి చేయగలడని అర్జునుని అభిప్రాయం. దీనికి కృష్ణుడు 3-82లో సమాధానం ఇస్తాడు.

ఉ. నీ వొనరింపఁ బూనిన పనిం గమలోదర! కీడు పుట్టునే?
కావని నట్ల యుండి యవుఁ గార్యము; లట్లగుటం బ్రయత్నసం

భావన సేఁత పౌరుషము పద్ధతి; తత్ఫల సిద్ధి వొందుచో
దైవము తోడ్పడన్ వలయుఁ; దథ్యము రెండును నీవినోదముల్. 73

అ. కమల + ఉదర = పద్మము ఉదరము - బొడ్డు నందు గలవాడా - పద్మనాభా - శ్రీకృష్ణా!; నీవు; ఒనరింపన్ + పూనిన = చేయదల్చుకున్న; పనిన్ = పనిలో; కీడు = హాని; పుట్టునే = కలుగునా?; కార్యములు = (కొన్ని) పనులు; కావు; అనిన + అట్లు + అ = అన్నవిధంగా; ఉండి; అవున్ = అవుతాయి; అట్లు + అగుటన్ = అలా కావటం వల్ల - అందువలన; ప్రయత్న సంభావన = కార్యారంభానికి ఆలోచన; చేఁత = చేయటం; పౌరుషము పద్ధతి = పురుష ప్రయత్నము యొక్క పద్ధతి; తత్ ఫల సిద్ధి = ఆ పురుష ప్రయత్నం యొక్క ఫల రూపమయిన సిద్ధిని; పొందుచోన్ = పొందేటప్పుడు; దైవము; తోడ్పడన్ + వలయున్ = సహాయ పడాలి; రెండును= పురుష ప్రయత్న, దైవ సహాయాలు రెండూ; నీ వినోదముల్ = నీ విలాసాలు; ఇది; తథ్యము = యథార్థము.

భా. *శ్రీకృష్ణా! నీవు చేయదల్చుకున్న పనికి హాని కలుగుతుందా? కొన్ని పనులు కానే కావు అన్నట్లుగా ఉండి చివరకు నెరవేరుతుంటాయి. కాబట్టి కార్యారంభానికి ఆలోచన చేయటం పురుషకార పద్ధతి. మానవయత్నానికి ఫలితాన్ని పొందటానికి దైవ సహాయం అవసరం. పౌరుష దైవాలు రెండూ నీ వినోదాలే గదా!*

వి. ఏ పని కావాలన్నా మానవ ప్రయత్నమూ; దైవంతోడ్పాటూ కావాలి. ఏ పని ఎప్పుడు ఎలా నెరవేరుతుందో తెలియదు. కాబట్టి దేనికైనా మానవ ప్రయత్నం ముఖ్యం. "దైవం మానుష రూపేణ" అన్నట్లు పాండవులకు శ్రీకృష్ణుడు సర్వనిర్వాహకుడు అని అనటమే అర్జునుని అభిప్రాయం.

ఉ. వేరిమి ధర్మజుం బరిభవించిన ద్రోహులు వధ్యు లన్న నె
వ్వారికిఁ బోలదే? సుజనవత్సల! నీవిటు లంట - వారు మ
మ్మీరస మెత్తి కీడ్పఱచి యింతట సేసినదాన నీమదిం
గూరిన నొవ్వు సొంపునను గోపము పెంపునఁ గాదె యారయన్. 74

అ:- సుజన వత్సల = మంచి వారి యందు వాత్సల్యము గలవాడా - శ్రీకృష్ణా!; వేరిమిన్= వైరంతో; ధర్మజున్ = ధర్మరాజును; పరిభవించిన = అవమానించిన; ద్రోహులు; వధ్యులు = చంపదగినవారు; అన్నన్ = అనగా; ఏ + వారికిన్ = ఎవరికైనా; పోలదు + ఏ = తగి ఉండదా? నీవు; ఇటులు = ఇలాగా; అంట =అనటం; ఆరయన్ = ఆలోచింపగా; వారు = ఆ కౌరవులు; ఈరసమెత్తి = అసూయ వహించి; మమ్ము = మమ్ములను; కీడ్పరచి = బాధలు పెట్టి; ఇంతలు+ చేసినదానన్ = ఇంతటి దుష్కార్యాలు చేయటం వల్ల; నీ మదిన్ = నీ మనస్సులో; కూరిన = కలిగిన; నొవ్వు పొంపునను = బాధ యొక్క ఆధిక్యం చేతా; కోపము పెంపునన్ = కోపం యొక్క అతిశయం చేత; కాదె = కదా!

భా. కృష్ణా! వైరంతో ధర్మరాజును పరిభవించిన ద్రోహులు ఎవరికైనా చంపదగినవారే అని అనటం ఎవరికైనా సముచితమే కదా! బాగా ఆలోచిస్తే నీవు ఇలా అనటానికి వాళ్ళు

అసూయాద్వేషాలతో మమ్ములను బాధపెట్టి అవమానాలు చేయటం వల్ల నీ మనస్సులో కలిగిన బాధా కోపమూ కారణాలు గదా!

వి. "సుజనవత్సల" అనే సంబోధన పాండవులు సుజనులు అనే భావాన్ని సూచిస్తుంది. భగవంతుడు ధర్మ పక్షపాతి; సుజన పక్షపాతి అనటం లోకవిదితం. భగవంతునికి గూడా కోపం; బాధా కలిగేటంత ఘోరంగా దుర్యోధనాదుల ప్రవర్తన ఉంది.

ఉ. **ఐనను జిత్తగింపు; ద్రుపదాత్మజ నా సభ నట్లు సేసినన్;**
దానికి సైఁప లెస్స యని దైన్యముఁ బొందుట కోర్చి; యమ్మెయిం
గానన భూమికిం జనుట కారుణికోత్తమ! నీ వెఱుంగవే!
కాన సహించి పాండవులఁ గౌరవులం దగఁ గూర్పు నేర్పునన్. 75

అ. ఐనను = అయినప్పటికీ; కారుణికోత్తమ = దయ గలవారిలో శ్రేష్ఠుడా - కృష్ణా!; చిత్తగింపు = ఆలకించు; ఆ సభన్ = ఆ ద్యూత సభలో; ద్రుపద + ఆత్మజన్= ద్రౌపదిని; అట్లు= అలాగా; చేసినన్ = చేయగా; దానికిన్ = ఆ ద్రోహాన్ని; సైపన్ = సహించగా; లెస్స + అని = (నీవు) సహించి; ఆ + మెయిన్ = ఆ విధంగా; కానన భూమికిన్ = అరణ్యానికి; చనుట = వెళ్ళటం; నీవు ఎఱుంగవే = ఎరుగవా?; కాన = కాబట్టి; సహించి = ఓర్చి; పాండవులన్; కౌరవులన్; తగన్ = తగినట్టుగా; నేర్పునన్ = చాకచక్యంతో; కూర్పు = ఏకం చేయవలసింది.

భా. *అయినప్పటికీ దయామయా! నామనవి చిత్తగించు; ఆ జూదపు సభలో ద్రౌపదిని అలా అవమానించినా దానిని మేము సహించాం. నీవు ఆ సహనం మంచిదన్నావు. అలాగే మేము చాలా దీన స్థితిలో ఉన్నా నీవు ఓర్చుకున్నావు. ఆ విధంగా మేము అడవులకు వెళ్ళటం నీకు తెలుసుగదా! కాబట్టి నీవు అన్నీ సహించి నేర్పుతో పాండవకౌరవులకు తగినవిధంగా సమైక్యం కలిగించు.*

వి. కౌరవ సభలో ద్రౌపదికి జరిగిన కేశాంబరాకర్షణ రూపమయిన అవమానం నోట పలుకరానిది. అందువల్లనే అర్జునుడు "ద్రుపదాత్మజనా సభ నట్లుసేసినన్" అని అన్నాడు. ఇక్కడ మూలం గూడా ఇలాగే ఉంది.

జానాసి హి యథైతేన ద్రౌపదీ పాపబుద్ధినా
పరిక్లిష్టా సభా మధ్యే తచ్చ తస్యోపమర్షితమ్ 78-17

ఈ పద్యానికి అర్థంలో బ్రాకెట్లలోని పదాలు లేకుండా గూడా చెప్పవచ్చు. దానిభావం ఇలా ఉంటుంది.

అయిప్పటికి దయామయా! నా మనవి చిత్తగించు. ద్రౌపదిని ఆ కౌరవ సభలో అలా అవమానించినా దాన్ని సహించటం మంచిదని ఎంత దైన్యం కలిగినా ఓర్చుకొని మేము ఆ విధంగా అడవులకు వెళ్ళటం నీకు తెలుసు గదా! కాబట్టి నీవు గూడా దీన్ని అంతా సహించి పాండవులకు కౌరవులకు సంధి చేయమని ప్రార్థిస్తున్నాను.

తే. **అలవి యెఱుఁగక ధార్తరాష్ట్రులు గడంగి**
మమ్ముఁ బఱచిన పాటులు మానసమున

జవుటఁ బెట్టిన విత్తుల చంద మొంది
యంకురింపక చెడిపోయె నంబుజాక్ష! *76

అ: అంబుజ + అక్ష = పద్మముల వంటి కన్నులు గలవాడా - కృష్ణా! ధార్త రాష్ట్రులు= ధృతరాష్ట్రుని కుమారులు - కౌరవులు; అలవి = తమశక్తి; ఎఱుఁగక = తెలియక; కడంగి = పూనుకొని; మమ్మున్ = మమ్ములను; పఱచిన పాటులు = పెట్టిన కష్టాలు; మానసమునన్ = మనస్సులో; చవుటన్ = చవిటినేలలో; పెట్టిన; విత్తుల చందము = గింజల రీతిని; ఒంది = పొంది; అంకురింపక = మొలవక; చెడిపోయెన్.

భా. *కృష్ణా! ఆ కౌరవులు తమశక్తి సామర్థ్యాలను గుర్తించక విజృంభించి మమ్ములను పెట్టిన కష్టాలు నా మనస్సులో చవిటి నేలలో చల్లిన గింజల వలె మొలవకుండా చెడిపోయినవి.*

వి. దీని మూలం

సనామ సమ్య గ్వర్తేత పాండవేష్వితి మాధవ
నమే సంజాయతే బుద్ధిః బీజ ముప్త మివోషరే 78-18

వారు చేసిన అపకారాలన్నీ నేను మరిచిపోయాను అని అర్జునుని భావం. తిక్కన చెప్పాడు.

కృష్ణా! దుర్యోధనుడు పాండవుల విషయంలో సరిగా ప్రవర్తిస్తాడని నాకు తోచటం లేదు; వానితో సంధి ప్రయత్నం చవిటినేలలో వేసిన విత్తనం లాగా వ్యర్థం. అని మూలాభిప్రాయం.

వ. **అమ్మొఱకుల నెమ్మెయి నయినను.** 77

అ. ఆ + మొఱకులను = ఆ మూర్ఖులను; ఏ + మెయిని + అయినను = ఏ విధంగానయినా

భా. *ఆ మూర్ఖులను ఏవిధంగానయినా...............*

క. **ఒడఁబఱచి; మాకు వారికిఁ**
బుడమి సగముగాఁగఁ జేసి పొందిపొసఁగి యుం
డెడు నట్టి తెఱఁగు సేయుట
కడుమే; లది గౌరవము సుఖంబును జేయున్. 78

అ. ఒడఁబఱచి = అంగీకరింపజేసి-ఒప్పించి; మాకున్; వారికిన్; పుడమి=భూమి; సగము; కాఁగన్ = అయ్యేటట్లు; చేసి; పొంది = కూడి; పొసఁగి = సఖ్యం గలిగి; ఉండెడునట్టి= ఉండేటటువంటి; తెఱంగు = విధము; చేయుట; కడుమేలు = చాలామంచిది; అది = అలా చేయటం; గౌరవము; సుఖంబును; చేయున్.

భా. *వాళ్ళను అంగీకరింపజేసి మాకూ వాళ్ళకూ రాజ్యం చెరి సగం వచ్చేటట్లు చేసి మేమందరము కలిసి మెలిసి ఉండే తీరుగా సంధి చేయటం చాలా మంచిది. అది గౌరవాన్నీ, సుఖాన్నీ కలిగిస్తుంది.*

క. **నీ కిట్టిది చిత్తమునకు**
రాకున్నది యేని 'వలదు రం; డిమ్మెయి మీ
రీ కార్యము సేయుం' డని
మా కానతి యిమ్ము కంసమర్దన! తెలియన్. 79

అ. కంసమర్దన = కంసుని చంపినవాడా - కృష్ణా!; నీకు; ఇట్టిది = ఇటువంటిది - నేను చెప్పింది; చిత్తమునకు = మనస్సునకు; రాకున్నది + ఏని = రాకపోతే; నచ్చకపోతే; వలదు= వద్దు; రండు; మీరు; ఈమెయిన్ = ఇలాగా; ఈ కార్యము = ఈపని; చేయుండు = చేయండి; అని; మాకు; తెలియన్ = స్పష్టంగా; ఆనతి = ఆజ్ఞను;ఇమ్ము.

భా. *కృష్ణా! నేను చెప్పింది నీకు నచ్చకపోతే "అది వద్దు' ఇలా రండి; ఈ పని చేయండి" అని స్పష్టంగా మమ్ములను ఆజ్ఞాపించు.*

మ. **హిత మిబ్భంగిది మాకు; ధర్మము తెఱం గిట్లుండు నం చేను నీ**
మతి బోధింప వలంతినే? హితము ధర్మంబున్ విచారించి చూ
చి; తగుం బొమ్మని యేది పంచి - తది నిశ్చింతంబునం జేసి యు
న్నతిఁ బొందం గలవారమై యునికిఁ గృష్ణా! నేడుఁగా వచ్చెనే" 80

అ. కృష్ణా!; మాకు; హితము; ఈ + భంగిది = ఇటువంటిది; ధర్మము తెఱంగు = ధర్మము రీతి; ఇట్లు = ఇలాగా; ఉండును; అంచు = అని; ఏను = నేను; నీమతిన్ = నీమనస్సును; బోధింప వలంతినే = బోధించటానికి సమర్థుడనా; హితము = మేలును; ధర్మంబున్ = ధర్మాన్నీ; విచారించి= ఆలోచించి; చూచి; తగున్; పొమ్ము; అని; ఏది = దేనిని; పంచితి = ఆజ్ఞాపించుతావో; అది; నిశ్చింతంబునన్ = ఏ ఆలోచనా లేకుండా చేసి; ఉన్నతిన్ = అభివృద్ధిని; పొందన్ + కలవారము + ఐ; ఉనికిన్ = ఉండటం; నేడు + కాన్ = ఈనాడు అయ్యేటట్లుగా/ క్రొత్తగా; వచ్చెనే = వచ్చిందా?

భా. *కృష్ణా! మాకు ఇలాంటిది మంచిది. ధర్మ స్వరూపం ఇలా ఉంటుంది అని నేను నీకు మనస్సుకు ఎక్కేటట్లు చెప్పేటంతవాడినా? హితాన్నీ, ధర్మాన్నీ ఆలోచించి పరిశీలించి 'ఇది మీకు మంచిది; ఇలా ప్రవర్తించండి' అని నీవు ఏది చెప్పితే దాన్ని నిశ్చింతగా చేసి దానివల్ల అభివృద్ధి పొందటం మాకు ఈనాడు క్రొత్తగా వచ్చింది కాదుగదా!"*

వ. **అనిన విని కృష్ణుండు విజయున కిట్లనియె.** 81

భా. *ఆ మాటలు విని కృష్ణుడు అర్జునునితో ఇలా అన్నాడు.*

చ: **వెరవున లావునం గృషికి వేయు విధంబుల మే లొనర్చినం**
దొరకొనునే ఫలంబు దతితోఁ దగు వర్షము లేకయున్న? నె
ప్పరుసున లెస్స సేసినను బౌరుషముల్ ఫలియించు టెల్ల నా
దరణమునం బ్రసన్నమగు దైవము చేఁతన చూవె ఫల్గునా! 82

అ: ఫల్గునా=అర్జునా; వెరవునన్=ఉపాయంతోనూ; లావునన్=సామర్థ్యం తోనూ; కృషికిన్=సేద్యానికి; వేయివిధంబులన్= అనేకవిధాలుగా; మేలు=మంచి; ఒనర్చినన్=చేసినా; తఱితోన్=సమయంతో పాటు; తగు వర్షము=తగినంత వాన; లేకయున్నన్=లేకపోతే; ఫలంబు=పంట-ఫలితం; దొరకొనునే=లభిస్తుందా? ఏ+పరుసునన్=ఏవిధంగా; లెస్స+ చేసినను=బాగాచేసినా; పౌరుషముల్ = మానవప్రయత్నాలు; ఫలియించుట + ఎల్లన్ = సిద్ధించటం అంతా; ఆదరణమునన్=ఆదరంతో; ప్రసన్నము+అగు=అనుకూలమయిన; దైవము చేఁతన+చూవె= దైవం యొక్క సహాయం చేతనే సుమా!

భా: *అర్జునా! ఉపాయంతోనూ సామర్థ్యంతోనూ కృషికి అనేక విధాల మేలు చేసినా సమయానికి తగినవిధంగా వర్షం లేకపోతే పంటలు పండవు గదా! అలాగే ఏ విధంగా మానవప్రయత్నాలు ఎంతబాగా చేసినా ఆదరంతో దైవం- అదృష్టం- ప్రసన్నమయితేనే చక్కగా ఫలిస్తాయి సుమా!*

వి: మానవ ప్రయత్నం; దైవసహాయం- ఈరెండూ ఎలా పరస్పర సంబంధం కలిగి ఉంటాయో; అందులోనూ; దైవం ఎంత బలీయమయినదో దృష్టాంత పూర్వంగా ఇందులో నిరూపితమయినది.

అలం: దృష్టాంతము.

ఉ: కావున సంధికిం బురుషకార మొనర్చెద నోపినంతయున్;
దైవముచేఁత యెట్లగునొ దాని నెఱుంగ; సుయోధనుండు సం
భావన సేసి పాలొసఁగు పాడియ కల్గిన; బాల్యమాదిగా
నే విధి నైననుం జెఱుప నింతలు పాపము లాచరించునే. 83

అ: కావునన్=కాబట్టి; సంధికిన్; ఓపినంతయున్=చేతనయినంత; పురుష కారము=మానవప్రయత్నం; ఒనర్చెదన్=చేస్తాను; దైవము చేత=దైవం యొక్క పని-సహాయం; ఎట్లు+అగునో=ఎలా అవుతుందో; దానిన్=ఆ దైవ కార్యాన్ని; ఎఱుంగన్ = ఎరుగను; సుయోధ- నుండు = దుర్యోధనుడు; సంభావన + చేసి = గౌరవించి; పాలు =భాగాన్ని; ఒసఁగు+ పాడి+అ= ఇచ్చేటటువంటి న్యాయమే/ధర్మమే; కలిగినన్=కలిగి ఉంటే; బాల్యము+ఆదిగాన్= చిన్ననాటినుంచీ; ఏవిధిన్+ఐననున్= ఏవిధంగా నయినా; చెఱుపన్= నష్ట పెట్టటానికి-నాశనం చేయటానికి; ఇంతలు పాపములు= ఇంతింత చెడ్డపనులు; ఆచరించునే= చేస్తాడా?

భా: *కాబట్టి సంధికోసం నాకు చేతనయినంత మానవ ప్రయత్నం చేస్తాను. దైవం ఏం చేస్తుందో నాకు తెలియదు. దుర్యోధనుడు గౌరవాదరాలతో రాజ్యభాగం ఇవ్వాలి అనే ధర్మబుద్ధి కలవాడే అయితే; చిన్నప్పటినుంచీ మిమ్ములను ఎలాగయినా నాశనం చేయాలి అని ఇంత దుష్కార్యాలు చేస్తాడా?*

వి: ఈ పద్యంలో మొదటి రెండు వాక్యాలకు మూలం ఇలా ఉంది.
అహం హి త త్కరిష్యామి పరం పురుషకారతః
దైవం తు న మయా శక్యం కర్మ కర్తుం కథంచన. 78-5;6.

"నేను సంధి చేయటానికి పురుషకారంతో చేయదగినదంతా అధికాధికంగా చేస్తాను. కాని ప్రారబ్ధాన్ని ఏ విధంగా నయినా ఉపేక్షించటంగాని; మార్చటంగాని నా చేతిలో పనికాదు." అని కృష్ణుడు విధి ప్రాధాన్యాన్ని వివరిస్తున్నాడు.

యత్తు వాచా మయా శక్యం కర్మణా వాపి పాండవ
కరిష్యే తదహం పార్థ నత్వాశంసే శమం పరైః

అర్జునా! నేను వాక్కుతో ప్రయత్నంతో చేయగలిగినదంతా చేస్తాను. కాని శత్రువులతో సంధి అవుతుంది అనే విషయంలో నాకు ఆవంతైనా ఆశలేదు.

వ: **అది యెల్ల నట్లుండె; నిచ్చట విరాటు పసులం బెట్టింప నీవు వోయిన యప్పుడు భీష్ముండు దుర్యోధనుతోఁ జెప్పిన తెఱంగు.** 84

అ: పసులన్=పశువులను- గోవులను; పెట్టింపన్=మళ్లించటానికి; పోయినప్పుడు= వెళ్ళినప్పుడు; తెఱంగు = విధం.

భా: *అదంతా అలా ఉండనియ్యి. ఇక్కడ విరాటుని ఆవులను మళ్ళించటానికి నీవు వెళ్ళినపుడు భీష్ముడు దుర్యోధనునితో ఇలా అన్నాడు.*

ఉ: **"వచ్చినవాఁడు ఫల్గునుఁ డవశ్యము గెల్తు మనంగరాదు; రా**
లచ్చికినై పెనంగిన బలంబులు రెండును గెల్వ నేర్చునే;
హెచ్చగుఁ గుందగుం; దొడరు టెల్ల విధంబుల కోర్చు టట్లుగా;
కిచ్చఁ దలంచి యొక్క మెయి నిత్తఱిఁ బొందగు చేఁతయుం దగున్."
85

అ: వచ్చినవాఁడు=(పశువులను మళ్ళించటానికి)వచ్చినవాడు; ఫల్గునుఁడు= అర్జునుడు; అవశ్యము= నిశ్చయంగా- తప్పక; గెల్తుము = గెలవగలం; అనంగరాదు=అనటానికి వీలు కాదు; రాలచ్చికిన్+ఐ= రాజ్యలక్ష్మి కోసం; పెనంగిన= యుద్ధం చేసిన; బలంబులు = సైన్యాలు; రెండును = రెండూ గూడా; గెల్వ నేర్చునే = గెలవగలవా?; హెచ్చు+ అగున్= (ఒక పక్షం) మించి పోవచ్చు; కుందు+అగున్=తగ్గిపోవచ్చు- వెనుదీయవచ్చు; తొడరుట=(యుద్ధానికి) సిద్ధం కావటం; ఎల్లవిధంబులకున్= (జయాపజయాలకు) అన్ని విధాలయినవాటికీ; ఓర్చుట= సహించటమే (అవుతుంది); అట్లు+కాక= అలా (యుద్ధం) కాకుండా; ఈ+తఱిన్= ఈ సమయంలో; ఇచ్చన్= మనస్సులో- ఇష్టాన్ని; తలంచి= ఆలోచించి; ఒక్కమెయిన్= ఒక విధంగా; పొందు+ అగు=సంధి అయ్యేటటువంటి; చేతయున్=పని కూడా; తగున్= ఉచితం అవుతుంది.

భా: *"దుర్యోధనా! ఇప్పుడు విరాటుని గోగణాన్ని మళ్ళించుకొని పోవటానికి వచ్చినవాడు అర్జునుడు సుమా! కాబట్టి తప్పకుండా గెలవగలం అని అనుకోవటానికి వీలు లేదు. రాజ్యం కోసం యుద్ధం చేస్తే రెండు పక్షాలూ ఎప్పుడూ గెలవలేవు కదా! ఈ యుద్ధంలో జయమూ కలగవచ్చు. అపజయమూ కలగవచ్చు. ఇప్పుడు మనం యుద్ధానికి సిద్ధమయినాం అంటే* **గెలుపు ఓటమి-** *ఈ రెండింటిలో దేనినయినా సహించాలి. కాబట్టి అలాగ కావటం ఇష్టం లేకపోతే బాగా ఆలోచించి ఇష్టమయితే సంధికోసం ప్రయత్నించటం గూడా సముచితం అవుతుంది."*

వి: ఈ పద్యం విరాటపర్వం 4వ ఆశ్వాసంలో 234వది. విశేషాలు అక్కడ చూడవచ్చు. ఇక్కడ మూలంలో ఈ శ్లోకం ఉంది.

కథం గో గ్రహణే హ్యాక్తే నైతచ్ఛర్మ తథా హితమ్
యాచ్యమానో హి భీష్మేణ సంవత్సరగతే2 ధ్వని **అ.79-19శ్లో**

విరాటనగరంలో గోగ్రహణ సమయానికి మీ అజ్ఞాతవాస సంవత్సరం పూర్తి అయింది. అప్పుడు భీష్ముడు మార్గమధ్యంలో దుర్యోధనునితో పాండవులకు రాజ్యం ఇచ్చి సంధి చేసుకో అని చెప్పాడు. కాని ఈ క్షేమంకరమూ; హితమూ అయిన మాటనుగూడా అతడు ఏ మాత్రం ఒప్పుకోలేదు.

వ: **అనియె; దాని కతఁ డుత్తరం బిచ్చిన తెఱంగు** **86**

అ: ఉత్తరంబు=సమాధానం.

భా: *అని అనగా దానికి ఆ దుర్యోధనుడు ఇలా సమాధానం ఇచ్చాడు.*

ఆ: **"మనకుఁ బాండురాజతనయ వర్గమునకు**
నెట్లు పొందు గలుగు? నేను రాజ్య
భాగ మీను; సమరభంగిక విక్రమ
నిరతిఁ బూను టిదియ నిశ్చయంబు." **87**

అ: మనకున్; పాండురాజతనయ వర్గమునకున్=పాండురాజుకుమారుల సమూహానికీ; పొందు=సంధి-మైత్రి; ఎట్లు=ఎలాగా; కలుగున్=కలుగుతుంది? ఏను=నేను; రాజ్యభాగము; ఈను=ఇవ్వను; విక్రమనిరతిన్=పరాక్రమాసక్తితో; సమరభంగికి+అ=యుద్ధరీతికే; పూనుట=సిద్ధం కావటం; ఇదియ=(అనే) ఇదే నిశ్చయంబు=నా నిశ్చితాభిప్రాయం.

భా: *"తాతా! మనకూ, పాండవులకూ సంధి ఎలా కుదురుతుంది? నేను రాజ్యభాగం ఇయ్యను. మనం పరాక్రమంతో యుద్ధానికి సిద్ధం కావలసిందే. ఇదే నా నిశ్చయం."*

వి: ఈ పద్యం విరాటపర్వం 4వ ఆశ్వాసంలో 236వ ది.

ఉత్తర గోగ్రహణానికి పూర్వం జరిగింది ఈ సన్నివేశం. ఆనాడు పరాజయం పొందినా దుర్యోధనుడు తన అభిప్రాయం మార్చుకోలేదు. "భారత సావిత్రి" అనే శ్లోక సంగ్రహం దుర్యోధనుని గూర్చి ఇలా అంటుంది.

ద్వావిమౌ పురుషౌ మూర్ఖౌ దుర్యోధన దశాననౌ
గోగ్రహం వనభంగం చ దృష్ట్వా యుద్ధం పునః పునః **30శ్లో**

గోగ్రహణమూ; అశోక వనభంగమూ చూచికూడా మళ్ళీ మళ్ళీ యుద్ధానికి సిద్ధమైన దుర్యోధన రావణులిద్దరూ మూర్ఖులే.

వ: **అని పలికె; నది యంతయుఁ బదంపడి మనమెల్ల వింటిమ కాదె! యా మాటల ఫలం బప్పుడ కనియు నా కష్టాత్ముండు; వెండియుఁ దెలియండు.** **88**

అ: పదంపడి=తరువాత; వింటిమ కాదె= విన్నాం గదా!; కనియున్=చూచికూడా; ఆ కష్టాత్ముండు= దుర్మార్గుడు; వెండియున్=మళ్ళీ.

భా: అని అన్నాడు. ఆ విషయం అంతా తరువాత మనం అందరం విన్నాం. కదా! ఆ మాటల ఫలితాన్ని ఆతడు అప్పుడే అనుభవించాడు. అయినా అతనికి వివేకం కలగలేదు.

తే: అతని గుణ దోషముల చంద మట్ల యుండె;
నాకు ధర్మజు బుద్ధిన నడవ వలయు
నిత్తెఱం గాచరింపంగ నేఁగి యచట
నెల్ల తెఱఁగును నేర్పడ నెఱిఁగి వత్తు." 89

అ: అతని=ఆ దుర్యోధనుని; గుణ దోషముల చందము=మంచి చెడులరీతి; అట్లు+అ=అలాగే; ఉండెన్=ఉన్నది; నాకు; ధర్మజు బుద్ధిన=ధర్మరాజు ఆలోచన ప్రకారమే; నడవ వలయున్=ప్రవర్తించవలసి ఉంది. ఈ+తెఱంగున్= ఈ సంధిని= ఈపనిని; ఆచరింపంగన్=చేయటానికి; ఏఁగి= వెళ్ళి; అచటన్=అక్కడ; ఎల్లతెఱఁగున్=సమస్త వృత్తాంతాన్ని; ఏర్పడన్=స్పష్టంగా; ఎఱిఁగి= తెలుసుకొని; వత్తున్=వస్తాను.

భా: ఆ దుర్యోధనుని తీరు తెన్నులు అలాగే ఉన్నవి. నేను మాత్రం ధర్మరాజు అభిప్రాయం ప్రకారమే నడుచుకోవాలి. ఈ పనిచేయటానికి అక్కడికి వెళ్ళి ఆ కౌరవుల సమస్త వృత్తాంతాన్ని బాగా తెలుసుకొని వస్తాను."

వి: సంధికోసం తాను త్రికరణశుద్ధిగా ప్రయత్నించినా కౌరవ పక్షం దానికి అనుకూలంగా లేదని కృష్ణుని అభిప్రాయం. కాని ధర్మరాజు ఉద్దేశం సంధికావాలి అని. అందుకోసమే కృష్ణుడు హస్తినాపురానికి వెళ్ళాలనుకుంటున్నాడు. సంధి కాకపోయినా కౌరవపక్షంలో ఎవరెవరు ఏఏ అభిప్రాయాలతో ఉన్నారో తాను ప్రత్యక్షంగా తెలుసుకోవటం కృష్ణుని లక్ష్యం.

చ: అనిన ముకుందుతో నకులుఁ డల్లన యిట్లను; "నీకు ధర్మజుం
డును బవనాత్మజుండు నరుఁడుం దగఁ జెప్పుట రిత్తగాదు; మా
మనము లరణ్యవాసమున మత్స్యమహీపతి పాల నున్న య
ద్దినముల భంగి గావు; కృపఁదీవ్రతఁ గుందిన చంద మయ్యెడున్. 90

అ: అనినన్=అనగా; ముకుందుతోన్=కృష్ణునితో;నకులుఁడు; అల్లనన్=మెల్లగా; ఇట్లు; అనున్; నీకున్;ధర్మజుండును; పవన+ఆత్మజుండు=భీముడు; నరుఁడున్=అర్జునుడూ; తగన్=తగిన విధంగా; చెప్పుట; రిత్త=వ్యర్థం-అబద్ధం; కాదు. మా మనములు= మామనస్సులు; అరణ్యవాసమునన్; మత్స్యమహీపతిపాలన్=విరాటరాజు వద్ద; ఉన్న; ఆ+దినముల= ఆరోజుల యందలి; భంగిన్= రీతిని; కావు; కృపన్=దయతోటీ; తీవ్రతన్=తీవ్రత చేత; కుందినచందము= కుంగిపోయినట్లు; అయ్యెడిన్=అవుతున్నది.

భా: ఆ మాటలు విని నకులుడు కృష్ణునితో మెల్లగా ఇలా అన్నాడు. "కృష్ణా! నీకు ధర్మరాజూ, భీముడూ; అర్జునుడూ చెప్పిన మాటలు వ్యర్థం కావు. మా మనస్సులు అరణ్యవాసం, అజ్ఞాతవాసం చేసినప్పుడు ఉన్నట్లుగా లేవు. దయతోనూ; తీవ్రతతోనూ కుంగిపోయినట్లున్నాయి.

వి: పెద్దవారి ఎదుట మాట్లాడవలసి రావటంతో వినయభూషణుడైన నకులుడు మెల్లగా అంటున్నాడు. అరణ్యాజ్ఞాతవాస సమయంలో పాండవులు పరాక్రమించాలి అనే అనుకున్నారు కాని సంధి విషయం ఆలోచించలేదు. అప్పుడు తీవ్రమయిన వారి మనస్సులు అవసరమయ్యేసరికి చల్లబడ్డవే అని నకులుని బాధ.

అన్యథా బుద్ధయో హ్యాస న్నస్మాసు వనవాసిషు
అదృశ్యే ష్వన్యథా కృష్ణ! దృశ్యేషు పునరన్యథా. 80-6

కృష్ణా! వనవాసం చేసేటప్పుడు మా ఆలోచనలు ఒక రీతిగా ఉండేవి. అజ్ఞాతవాససమయంలో ఇంకో రకంగానూ; తరువాత-ఇప్పుడు-మరోరకంగానూ ఉన్నాయి.

క: **కడవఁగ నొకళ్ళు పసరము**
నడిచిన నొక్కళులుఁ బెయ్య నడువ వలయునే?
చెడు తెర వాకౌరవ్యుల
కడ నిలుచుంగాక; మనకుఁ గ్రౌర్యం బేలా? 91

అ: ఒకళ్ళు=ఒకరు; కడవఁగన్=ముందుగా- మర్యాద నతిక్రమించి; పసరమున్=ఇతరుల పశువును-ఆవును; అడిచినన్= కొడితే; ఒక్కళులున్= మరొకడు గూడా; పెయ్యన్=ఆవుదూడను; అడువ వలయునే=కొట్టాలా?/ కొట్టవలెనా?; చెడుతెరువు=దుర్మార్గము; ఆకౌరవ్యుల కడన్ = ఆ కౌరవుల దగ్గరనే; నిలుచుంగాక = ఉండుగాక; మనకున్; క్రౌర్యంబు= క్రూరత్వము; ఏలా=ఎందుకు?

భా : ఒకడు మన పశువును (ఆవును) కొడితే మనం ఆతని ఆవుదూడను కొట్టవలెనా? దుర్మార్గం అంతా ఆ కౌరవుల దగ్గరనే ఉండుగాక. అంత క్రూరత్వం మనకెందుకు?

సీ: **గో గ్రహణంబునఁ గోలె నెంతయు మెత్తఁ**
బడకుండుదురె వారు పద్మనాభ!
నీ యనుగ్రహమున నెమ్మిమైఁ గూడిన
బలము లేడక్షౌహిణులును; దొరలుఁ
బాంచాల యాదవ పాండ్యకేకయ మాత్స్య
లోకతెంపు నెఱుఁగక యున్నవారు;
భీమార్జునుల లావుపెంపును నీ సహా
యంబును గలుగుట కలుక రెట్లు?

ఆ: **గురుఁడు గృపుఁడు బాహ్లికుఁడు భీష్ముఁడును బుద్ధి**
సెప్పి వారిఁ జక్కఁ జేయ రెట్లు?
కార్య మీవు సెప్పఁగా విదురుండు వి
నంగ; నెట్లు గా దనంగ వచ్చు? 92

అ: పద్మనాభ=కృష్ణా!; వారు= ఆ కౌరవులు; గోగ్రహణంబున్+కోలెన్=ఆవులను

పట్టుకొన్నది మొదలు; ఎంతయున్=ఎక్కువగా; మెత్తఁబడకుందురె= మెత్తబడకుండా ఉంటారా? నీ+అనుగ్రహమునన్=నీదయతో; నెమ్మిమైన్=స్నేహంతో; కూడిన బలములు=ఇక్కడ చేరిన సేనలు; ఏడు+అక్షౌహిణులును; దొరలున్=నాయకులూ; పాంచాల యాదవ పాండ్య కేకయమాత్స్యులు; ఒక తెంపున్=ఏ మాత్రం తెగువను-సాహసాన్ని; ఎఱుఁగక+ఉన్నవారు; భీమార్జునుల; లావు పెంపును=బలాధిక్యమూ; నీ సహాయంబును; కలుగుటకు; ఎట్లు= ఏవిధంగానూ అలుకరు=భయపడరేం?; గురుఁడున్;కృపుఁడున్; బాహ్లికుఁడున్; భీష్ముఁడును; బుద్ధి+చెప్పి; వారిన్=ఆ కౌరవులను; చక్కన్+చేయరు+ఎట్లు=సరిచేయరెందుకని?; ఈవు=నీవు; కార్యము=చేయదగిన దానిని; చెప్పగాన్; విదురుండు; వినంగన్=వినగా; ఎట్లు=ఏవిధంగా; కాదు+అనంగవచ్చున్=తగినది కాదనగలం?

భా: కృష్ణా! ఆ కౌరవులు గోగ్రహణం జరిగినప్పటినుంచి అయినా కొంత మెత్తబడకుండా ఉంటారా? నీ దయవల్ల సమకూరిన ఏడు అక్షౌహిణీల సైన్యమూ, పాంచాలురూ, యాదవులూ, పాండ్యులూ, కేకయులూ, మత్స్య వంశీయులూ మిక్కిలి సాహసం, చొరవా చేయటం లేదు. ఆ కౌరవులు భీమార్జునుల బల పరాక్రమాలనూ, మాకున్న నీ సహాయాన్నీ ఎరిగి కూడా భయపడటం లేదా? ద్రోణుడూ, కృపాచార్యుడూ, బాహ్లికుడూ, భీష్ముడూ మొదలైన పెద్దలు వాళ్ళకు బుద్ధి చెప్పి సరిచేయరెందుకని? హస్తినాపుర సభలో కౌరవులకు కర్తవ్యాన్ని నీవు చెపుతుంటే విదురుడు వింటూ ఉంటే దాన్ని ఇతరులు ఎలా కాదనగలరు?

వ: అట్లుంగాక; నీవు దమపాలికిం బోవుట ధార్తరాష్ట్రు లాదరింపకుండ వెఱవరే? నీ పోయినప్పుడ యీ కార్యంబు చక్కనగు" ననిన; విని సహదేవుండు వాసుదేవున కిట్లనియె. 93

అ: అట్లున్+ కాక=అలా కాక; తమపాలికిన్=తమ వద్దకు; వెఱవరే=భయపడరా? చక్కనగు=నెరవేరుతుంది. వాసుదేవునకు=కృష్ణునకు.

భా: అంతేకాక నీవు తమ వద్దకు రాగా కౌరవులు గౌరవించకుండా ఉండటానికి భయపడరా? నీవు వెళ్ళిన వెంటనే ఈ రాయబారం నెరవేరుతుంది." అని నకులుడు అన్న మాటలు విని సహదేవుడు శ్రీకృష్ణునితో ఇలా అన్నాడు.

ఉ: "రక్కెస మాట లాడెదరు రాజును దమ్ములు; వానిలోన నీ
వొక్కటియైనఁ గాదనక యూఁకొనుచుండుట యంతకంటె మే;
లక్కట యిట్లు వేఁడికొన నైనను బోయెదు వో- సుయోధనుం
డెక్కడ? భూమిలోన సగమిచ్చుట యెక్కడ? దానవాంతకా! 94

అ: దానవాంతకా=రాక్షస సంహారకా- కృష్ణా!; రాజును=ధర్మరాజూ; తమ్ములు= భీమార్జున నకులులూ; రక్కెసమాటలు=(తమకు) తగని మాటలు; ఆడెదరు=పలుకు తున్నారు; నీవు; వానిలోనన్= ఆ మాటలలో; ఒక్కటి+ఐనన్=ఒక్కదాని నైనా; కాదు+అనక; ఊఁకొను చుండుట- ఊఁకొట్టటం; అంతకంటె=ధర్మరాజాదులు పలికిన దానికంటె; మేలు=మంచిది;

అక్కట=అయ్యో; ఇట్లు=ఇలా; వేడికొనన్+ఐనను=దీనంగా ప్రార్థించటానికైనా; పోయెదు=వెళ్తావా?; పో=వెళ్లు; సుయోధనుండు; సగము; ఇచ్చుట; ఎక్కడ=ఏమిటి?; భూమిలోనన్; సగము ఇచ్చుట; ఎక్కడ=ఏమిటి.

భా: "శ్రీకృష్ణా! ధర్మరాజూ ఆయన తమ్ములు- భీమార్జున నకులులూ తమకు తగని మాటలు అంటున్నారు. వాటి నన్నిటినీ నీవు కాదనకుండా ఊఁకొడుతున్నావు. ఇది మరీ బాగుంది! అయ్యో! నీవు కూడా ఇంతదీనంగా వాళ్ళను యాచించటానికి వెళ్తావా? వెళ్ళు. దుర్యోధనుడేమిటి! భూమిలో సగభాగం ఇవ్వటం ఏమిటీ! ఇది జరిగే పనేనా?

వి: మూలంలో సహదేవుని మాటలు నాలుగు అనుష్టుప్ శ్లోకాలలో ఉన్నాయి. అవి ఆధారంగా తిక్కన నాలుగు పద్యాలు సహదేవుని ఆవేశానికి ఆజ్యం పోస్తూ వ్రాశాడు. తక్కిన నలుగురు పాండవుల గొంతులోనుంచి పెగలని దాన్ని సహదేవుడు కుండ బద్దలు కొట్టినట్లు; సభ అంతా ఆవేశంతో ఊగిపోయేటట్లూ చెపుతున్నాడు.

మ: తలఁపం గూడునె యింతలేసి దొరలీ దైన్యంబు? చుట్టంబులుం
జెలులుం దిట్టరె; లాఁతిరాజులకు మెచ్చే యివ్విధం; బిట్టిదిం
గలదే? వేఁడగ ధర్మజుం డడుగఁబోగాఁ గృష్ణుఁ; డా ధార్తరా
ష్ట్రులు పాలీక చలంబునం బెనఁగ; నిట్లుం గూడు దీపయ్యెనే! 95

అ: ఇంతలేసి దొరలు= ఇంతగొప్పవారైన ఈ ప్రభువులు; ఈ దైన్యంబు=ఇంత పేదమనస్సు- ఇంత దీన స్థితిని; తలఁపన్+కూడునె=అనుకోవచ్చా; చుట్టంబులున్;చెలులున్= మిత్రులూ; తిట్టరె=నిందించరా?; ఈ+ విధంబు= ఈ దీనస్థితి; లాఁతిరాజులకు=ఇతర రాజులకు; మెచ్చు+ఏ=మెచ్చుకోదగినదా? ఇట్టిదిన్=ఇటువంటి హీనస్థితి కూడా; కలదే=ఉన్నదా? ధర్మజుండు=ధర్మరాజు; వేఁడఁగన్=ప్రార్థించగా; కృష్ణుఁడు; అడుగన్+పోగాన్=యాచించటానికి వెళ్ళగా; ఆ ధార్తరాష్ట్రులు= ఆ దుర్యోధనాదులు; పాలు= రాజ్యభాగం; ఈక= ఇవ్వక; చలంబునన్=మొండి పట్టుదలతో; పెనఁగన్=పెనుగులాడగా; ఇట్లున్+కూడు=ఇంతహీనమయిన తిండి; తీపు+అయ్యెనే= రుచికరం-ఇష్టం అయిందా?

భా: ఇంత గొప్పవారైన ఈ ప్రభువులు ఇంత దీనస్థితిని మనస్సులో నయినా అనుకోవచ్చా? చుట్టాలూ; మిత్రులూ ఇదివింటే తిట్టిపోయరా? ఇతరరాజులు ఈ పద్ధతిని మెచ్చుకుంటారా? అసలు ఈ నీచస్థితి ఉంటుందా? ధర్మరాజు ప్రార్థించేవాడా? కృష్ణుడు అడగటానికి వెళ్ళేవాడా? ఆ కౌరవులు రాజ్యభాగం ఇవ్వక మొండిగా కలహించేవారా? ఇంత నీచమయిన తిండి వీరికి ఇష్టమయిందా?

ఉ: వీరలు ధర్మమార్గము సవిస్తరతం దగనాడి రేనియు;
న్వారలు దాని కియ్యకొనినన్; విను మచ్యుత! యట్టి సంధి పెం
పారఁగ నేర్చునే? యుచితమైనది కయ్యమ; వంకమాట లే
నేరఁ; గురుప్రవీరు సభ నిశ్చయ మిట్టిద కాఁగఁ జెప్పుమీ. 96

అ: అచ్యుత=కృష్ణా!; వినుము; వీరలు= ఈధర్మరాజాదులు; ధర్మమార్గము;

సవిస్తరతన్=మిక్కిలి వివరంగా; తగన్=సముచితంగా; ఆడిరేనియున్=చెప్పినా; వారలు=కౌరవులు; దానికిన్= ఆ పాండవులు చెప్పిన దానికి; ఇయ్యకొనినన్=అంగీకరించినా; అట్టి=అటువంటి; సంధి; పెంపారఁగన్+నేర్చునే= పెంపొందుతుందా?; కయ్యము+అ=యుద్ధమే; ఉచితమైనది= తగినది; ఏన్= నేను; వంకమాటలు=వంకరమాటలు(మనస్సులో ఒకటి ఉంచుకొని పైకి ఇంకొకటి మాట్లాడటం); నేరన్=ఎరుగను; కురు ప్రవీరు సభన్=కౌరవ శ్రేష్ఠుని సభలో; నిశ్చయము= నిర్ణయము; ఇట్టిద=ఇటువంటిదే; కాఁగన్=అయినదిగా; చెప్పుమీ=చెప్పవలసినది.

భా: *కృష్ణా! సరిగా విను. ఇక్కడి వీరందరూ ధర్మమార్గాన్ని చాలా వివరంగా సముచితంగా చెప్పినా; ఆ కౌరవులు దాన్ని అంగీకరించినా అటువంటి సంధి స్థిరపడి అభివృద్ధి పొందుతుందా? ఇప్పుడు రెండు పక్షాల వారికీ ఉచితమయినది యుద్ధమే. నాకు వంకర మాటలు పలకటం చేతకాదు. ధర్మరాజు సభలో జరిగిన నిర్ణయం ఇదే అని కౌరవ సభలో నీవు స్పష్టంగా చెప్పు.*

మ: **'తుది రాజ్యమ్ము సగమ్ముగొ- మ్మడవి యందుం; బేరు వంచించియుం;**
బదుమూఁడేఁడులు నీవునుం దిరిగిరా పాలీక పోవచ్చునే!
యదిగాదేఁ దెగి బంటవై యుఱుము; మాయల్ పన్ను నేర్పింకఁజె
ల్లదు సూ నీ 'కనియా సుయోధనుని యుల్లం బుచ్చిపో నాడుమీ" 97

అ: అడవియందున్=అరణ్యంలోనూ; పేరు వంచించియున్=మారుపేర్లు పెట్టుకొనీ; పదుమూఁడు+ఏఁడులు=పదమూడు సంవత్సరాలు; తిరిగిరా=తిరిగి రావలసింది; తుదిన్=చివరకు; రాజ్యమ్ము=రాజ్యంలో; సగమ్ము=సగం; పాలు=భాగం; కొమ్ము=తీసుకో; (అని) నీవునున్=నీవే-నీవు కూడా; ఈన్=(రాజ్యభాగం) ఇవ్వకుండా; పోవచ్చునే=తప్పించుకొని పోవటానికి వీలవుతుందా?; అది కాదేన్= అది ఇష్టం కాకపోతే; తెగి=సాహసించి; బంటవు+ఐ=వీరుడివై; ఉఱుము=గర్జించు; మాయల్+పన్ను=మాయలను కల్పించే; నేర్పు=తెలివి; ఇంకన్= ఇకమీద (నీకు); చెల్లదుసూ=చెల్లదు సుమా; అని; ఆ సుయోధనుని= ఆ దుర్యోధనుని యొక్క; ఉల్లంబు=మనస్సు; ఉచ్చిపోన్= చీలిపోయేటట్లు; ఆడుమీ =మాట్లాడవలసింది.

భా: *'అరణ్యాజ్ఞాతవాసాలు పదమూడు సంవత్సరాలు చేసి తిరిగిరా; ఆ తరువాత చివరకు రాజ్యంలో సగభాగం తీసుకో" అని నీవే చెప్పి ఇప్పుడు ఆ రాజ్యభాగం ఇవ్వకుండా తప్పించుకు పోవటానికి వీలవుతుందా? ఆ పద్ధతి ఇష్టం కాకపోతే సాహసించి వీరుడిగా విజృంభించు" అని ఆ దుర్యోధనుడి మనస్సు ముక్కలు చెక్కలు అయ్యేటట్లుగా మాట్లాడు.'*

వి: సంస్కృత మహాభారతంలో వ్యాసఘట్టాలు ప్రసిద్ధాలు. తిక్కన గూడా కొన్ని పద్యాలు అలా వ్రాశాడు. వాటిల్లో ఇది ఒకటి. దీనికి కొంతమంది విజ్ఞులు ఎలా అర్థాలు చెప్పారో పరిశీలిద్దాం.

"తిక్కనగారి రచనలో రెండుమూడు ప్రౌఢరచనావిన్యాసములు గూడ గనఁబడును." అని చెప్పి శ్రీ గడియారం వేంకటశాస్త్రి గారు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారి ఉద్యోగపర్వం పీఠికలో ఈ పద్యం ఉదాహరించారు.

అ : "అడవి యందున్=అరణ్యములోను; పేరు వంచించియున్=మారుపేరులు

పెట్టు కొనియు; పదుమూడేడులు=పదమూడు సంవత్సరములు; ఉండియను క్త్వార్థక మధ్యాహారము; తుదిన్= చివరను; రాజ్యమ్ము సగమ్ము గొమ్ము= అర్ధరాజ్యమును స్వీకరింపుము (అని); నీవు-నీవు (దుర్యోధనుఁడని యర్థము); అనన్-(ధర్మరాజుతో) అనగా;(అట్లుచేసి); తిరిగిరాన్=తిరిగిరాగా; పాలీక పోవచ్చునే=భాగమీయకుండుట న్యాయమా? అది కాదేన్=అది నీ యిష్టము కాకున్న; తెగి=సాహసించి; బంటవై=వీరుడవై; అఱుము=అక్రమింపుము (గెలువుము); మాయల్ పన్ను నేర్పు=మాయలను గల్పించు తెలివి; ఇంకన్=ఇకమీద; చెల్లదుసూ=పనికి రాదు సుమా; నీకని; ఆ సుయోధనుని= ఆదుర్యోధనునియొక్క; ఉల్లంబు=డెందంబు; ఉచ్చిపోన్= డస్సిపోవునట్లుగా; ఆడుమీ=పల్కుమా.

భా: వనవాసాజ్ఞాతవాసములు రెండును బదుమూడేడులు సలిపి తుది రాజ్యమ్ము సగమ్ము గొమ్మని నీవనగా; ధర్మరాజు తిరిగిరా పాలీయకుండుట న్యాయమా? అట్లిష్టపడవేని సాహసించి వీరుడవై యుద్ధమున గెలువుము. మోసగించి సంపాదించు నేర్పింక నీకు సాగదు సుమా! యని యా సుయోధనుని యుల్లంబుచ్చి పోవునట్లు వచింపుమా యని సహదేవుడు శ్రీకృష్ణునితో జెప్పెనని తాత్పర్యము.

(చూ. ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక; సంపుటి 17; సంచిక 5; పుట253)

"శ్రీ చంద్రాభట్ట రామమూర్తిగారు "నీవనన్" అని సవరించి చెప్పిన యర్థము సముచితముగా కనిపించుచున్నది." అని "తిక్కన కావ్య శిల్పము" అనే సిద్ధాంత గ్రంథంలో డా. కేతవరపు వెంకట రామకోటి శాస్త్రి గారు భావించారు.

అ: నీవునున్ = నీవుకూడ; తుదిన్= మాకుబంచి యిచ్చిన పిమ్మట; రాజ్యమ్ము సగమ్ము = అర్ధరాజ్యమును; కొమ్ము=పుచ్చుకొనుము. అడవియందున్=అరణ్యమునందును; పేరు వంచించియున్=అజ్ఞాతమునందును; పదమూడు సంవత్సరములు; తిరిగిరాన్= తిరిగిరాగా; పాలు+ఈకన్=ఇవ్వకుండా; పోవచ్చునే=ఉండవచ్చునా?; అదికాదు+ఏన్=అది పొసఁగనిచో; తెగి= తెగించి; బంటవు + ఐ= వీరుఁడవై; అఱుము = ఎదుర్కొని నశింపుము; మాయల్+పన్ను= మోసములను పన్ను నట్టి; నేర్పు=కౌశలము; నీకున్=నీకు; చెల్లదు+సూ(సుమీ) అని=అని; ఆ సుయోధనుని = ఆ దుర్యోధనుని యొక్క; ఉల్లంబు=మనస్సు; ఉచ్చిపోన్=దూరిపోవునట్లుగా; ఆడుమీ=పల్కుము.

తా: 'తొలుత మాకు సగము రాజ్యమును పంచి యిచ్చి మిగిలిన దానిని నీవును బుచ్చుకొమ్ము. పదుమూఁడు సంవత్సరము లరణ్యముల నజ్ఞాతమున గడిపి వచ్చిన తరువాత రాజ్యభాగమీయకపోవచ్చునా? అది పొసఁగనిచోఁ దెగించి వీరుడవై యుద్ధమునకు వచ్చి మమ్మెదుర్కొనుము. మాయలు పన్ను నీ నేర్పు ఇఁక చెల్లదు సుమీ యని యా దుర్యోధనుని హృదయమున గాటముగా గుచ్చుకొని పోవునట్లు పలుకుము' అని సహదేవుడు శ్రీ కృష్ణునితో బలికినాడు.

(శ్రీ వావిలాల సోమయాజులుగారు)

భీమార్జున నకులులు ధర్మరాజు అభిప్రాయాన్ని కాదనలేకా; ఔను అనటం

ఇష్టంలేకా ఎటూగాని మాటలు మాట్లాడారు. కాని సహదేవుడు జంకు లేకుండా తనపైవాళ్ళు చెప్పలేనిదానిని సూటిగా చెప్పాడు. పాండవులలో నలుగురు ఒకే మాటమీద ఉన్నట్లు; ఒక్కడు అందుకు భిన్నంగా ఉన్నట్లు అనిపిస్తుంది. కాని తరువాత ద్రౌపది చెప్పబోయే మాటలకు సహదేవుని ఈ మాటలు ఉపోద్ఘాతంలాగా ఉన్నాయి. పాండవ పక్షంలో సంధికి అనుకూలత కంటే వ్యతిరేకతే ఉందని ఇక్కడినుంచి స్పష్టం అవుతుంది.

మ: **అనినన్ సాత్యకి ప్రీతుఁడై; "యితఁడు లెస్సై యుండఁ బల్కెం; బ్రయో**
జనముం గల్గదు; గౌరవంబుఁ జెడు; దుశ్చారిత్రకుం డా సుయో
ధను బోధింపఁగఁ బోయినన్; సరభ సోత్సాహంబు మైనున్న వీ
రని కాయంబున కెల్లనుం బ్రియము సంగ్రామంబు మే లెమ్మెయిన్." 98

అ: అనినన్ = అని అనగా; సాత్యకి; ప్రీతుఁడు+ఐ = సంతోషించి; ఇతఁడు = ఈ సహదేవుడు; లెస్స+ఐ+ఉండన్= బాగై ఉండేటట్లుగా; పల్కెన్= మాట్లాడాడు; దుశ్చారిత్రకుఁడు= చెడు నడత గల; ఆసుయోధనున్=ఆ దుర్యోధనుడిని; బోధింపఁగన్+పోయినన్=తెలియ చెప్పాలి అని వెళ్ళితే; ప్రయోజనమున్; కల్గదు; గౌరవంబున్=మర్యాదకూడా; చెడున్; సరభస+ఉత్సాహం బుమైన్ = త్వరతో గూడిన ఉత్సాహంతో; ఉన్న; వీరనికాయంబునకున్= వీరుల సమూహానికి; ఎల్లనున్= అంతటికీ; ఏ+మెయిన్= ఏవిధంగానయినా; సంగ్రామంబు=యుద్ధం; ప్రియము= ఇష్టమయినదీ; మేలు=మంచిదీ.

భా: *సహదేవుడి మాటలకు సంతోషించి సాత్యకి ఇలా అన్నాడు. "ఈతడు చాలా బాగా మాట్లాడాడు. దుశ్శీలుడయిన ఆ దుర్యోధనుడికి హితబోధ చేయబోతే ఏమీ ప్రయోజనం ఉండదు. అంతేగాదు. ఉన్న గౌరవంకూడా చెడుతుంది. ఉత్సాహం ఉరకలు వేస్తున్న ఈ వీరులందరికీ ఎలా చూసినా యుద్ధమే ఇష్టంగా మేలుగా కన్పిస్తున్నది."*

వి: సాత్యకికి ధర్మజభీమార్జున నకులుల మాటలు ఏవీ నచ్చలేదు. సహదేవుడు సాహసించి మొగమాటంలేకుండా నసుగుడు లేకుండా అన్నమాటలు ఆయనకు సంతోషం కలిగించాయి. అందువల్ల సంధి ప్రయత్నాలు నిష్ఫలం అని స్పష్టంగా చెపుతున్నాడు. యుద్ధప్రయత్నాలు తనకే కాక ఆ సభలో ఉత్సాహం ఉరకలు వేస్తున్న వీరులందరికీ ఇష్టం అని అంటున్నాడు.

వ: **అనిన విని రథికవరు లందఱు "సహదేవుఁ డింత యొప్ప నాడునే; సాత్యకి పలుకు లిట్లుండునే; తక్కటివి యెక్కడి మాటలు? పగవారి నడిగికొనం బోవుట యుచితంబఁట; కయ్యంబు కర్జంబు గాదఁట; భంగంబు నీఁగి కొనం దగదఁట" యను నిది మొదలుగా ననేకు లనేక ప్రకారంబుల వీరాలాపంబుల గొలువెల్ల నొక్క మ్రోఁతగాఁ జెలంగిన యెలుంగులు నింగి ముట్టెఁ దదనంతరంబ. 99**

అ: ఒప్పన్+ఆడునే=బాగా మాట్లాడాడు గదా; తక్కటివి=మిగిలినవారి మాటలు; పగవారిని+శత్రువులను; అడిగి కొనంబోవుట=యాచించటం; ఉచితంబు=తగినది. కయ్యంబు=

యుద్ధం; కర్జంబు=చేయదగినది; భంగంబున్=పడిన అవమానాన్ని; ఈఁగికొనన్=తీర్చుకొనుట; వీర+ఆలాపంబులన్=వీరుల మాటలతో; కొలువు+ఎల్లన్=సభ అంతా; చెలంగినన్=వ్యాపించగా; ఎలుంగులు=కంఠధ్వనులు; నింగిన్+ముట్టెన్=ఆకాశాన్ని అంటినవి.

భా: *ఆ మాటలు విన్న రథికవరులు అందఱూ ఇలా అన్నారు. "సహదేవుడు ఎంత బాగా మాట్లాడాడు! సాత్యకి మాటలు ఇంతబాగా ఉంటవా? తక్కిన వాళ్ళవి ఏం మాటలు? శత్రువులను యాచించటం మంచిదిట! యుద్ధం చేయదగింది కాదట! పడిన అవమానం తీర్చుకొనటం తగదట!" ఇలాగా అనేకులు అనేకవిధాలుగా వీరాలాపాలు పలుకుతున్నారు. ఆ ధ్వనులతో కొలువు అంతా ప్రతిధ్వనించింది. వారి కంఠధ్వనులు ఆకాశం అంటినవి.*

వి: సుదీర్ఘంగా వివరంగా మాట్లాడిన ధర్మజాదుల మాటలకంటే తక్కువగా మాట్లాడిన సహదేవ సాత్యకుల మాటలు వీరవర్గాన్ని అలరించాయి. అందువలననే వారి వీరాలాపాలు విజృంభించాయి. ఇవన్నీ ద్రౌపది చెప్పబోయేదానికి పూర్వరంగాలు.

ఏవం వదతి వాక్యంతు యుయుధానే మహామతౌ
సుభీమః సింహనాదోభూత్ యోధానాం తత్ర సర్వశః 81-8

మేధావి అయిన సాత్యకి ఇలా అన్నవెంటనే అక్కడ యోధసమూహం అంతా ఒక్కసారిగా భయంకర సింహనాదం చేసింది. అనే మూలానికి ఈ వచనం తిక్కన వివరణ.

- : ద్రౌపది కృష్ణునితోఁ దనమున్ను పడిన భంగపాట్లు సెప్పుట :-
సం. 5-80-1

తే: ధర్మనందను పలుకులు దనకు హృదయ
తాప మొనరింప; మోమున దైన్య మొంద
నున్న పాంచాలి యిట్లని యొయ్యఁ బలికెఁ
గనలి శౌరితో గద్గదకంఠి యగుచు. 100

అ: ధర్మనందను=ధర్మరాజుయొక్క; పలుకులు; తనకున్; హృదయతాపము=మనస్తాపం; ఒనరింపన్=చేయగా-కలిగించగా; మోమునన్=ముఖాన; దైన్యము=దీనత; ఒందన్=చెందగా; ఉన్న; పాంచాలి=ద్రౌపది; కనలి=కోపించి; గద్గదకంఠి=వణుకుతున్న కంఠస్వరం కలది; అగుచున్; శౌరితోన్=శ్రీకృష్ణునితో; ఇట్లు=ఇలాగా అని; ఒయ్యన్=మెల్లగా; పలికెన్.

భా: *ధర్మరాజు మాటలు తనకు మనస్తాపం కలిగించగా ముఖం చిన్నబుచ్చుకొని ద్రౌపది కోపంతో కంఠస్వరం వణకుతుండగా కృష్ణునితో ఇలా మెల్లగా అన్నది.*

వి: ద్రౌపదికి ధర్మరాజు మాటలే మనస్తాపం కలిగించాయి. భీమార్జున నకులుల మాటలు ధర్మరాజు మాటలకు ప్రతిధ్వనులు మాత్రమే. వారలా మాట్లాడటానికి కారణం ఆయన మాటలే. వీరులందరినీ నీరుగార్చినవి ఆయన మాటలు అని ఆమెకు కోపం.

మూలంలో ఇంకో విశేషం ఇలా ఉంది.

సంపూజ్య సహదేవం చ సాత్యకించ మహారథమ్. 82-2
భీమసేనం చ సంశాంతం దృష్ట్వా పరమదుర్మనాః
అశ్రు పూర్ణేక్షణా వాక్య మువాచేదం మనస్వినీ 82-3

అభిమానవతి అయిన ద్రౌపది సహదేవ సాత్యకుల మాటలను మెచ్చుకుంది. భీముడు చల్లబడటం చూచి మిక్కిలి బాధపడి కన్నీళ్ళతో ఇలా అన్నది.

ఉ: "అంతలుసేసి పోనడచి యక్కట! సంజయు చేతఁ జెప్పి పు
త్తెంతురె? యిట్టి యూఅట మదిం బ్రియమందె యుధిష్ఠిరుండు దా
నంతన యూళు లేవురకు నైదు సుయోధనుఁ డిచ్చునొక్కొ! యీ
కంత కృపావిహీనమతి నాతఁడు నొంచునె యన్నదమ్ములన్! 101

అ: అంతలు=చెప్పటానికి వీలులేనంత అవమానాలను చేసి; పోనడచి=వెళ్ళగొట్టి; అక్కట=అయ్యో; అబ్బా; సంజయుచేతన్ చెప్పి; పుత్తెంతురె=రాయబారం పంపుతారా!; యుధిష్ఠిరుండు=ధర్మరాజు; ఇట్టి=ఇటువంటి; ఉఱటన్=ఊరడింపుతో; మదిన్=మనస్సులో; ప్రియము+అందెన్=సంతోషించాడు; సుయోధనుఁడు=దుర్యోధనుడు; తానంతన=తనంతటతానే (స్వయంగా); ఏవురకున్=పాండవులు ఐదుగురికీ; ఐదు ఊళ్ళు = ఇచ్చును+ఒక్కొ= ఇస్తాడా?; ఆతఁడు=ఆ దుర్యోధనుడు; ఈక=ఇయ్యక; అంతకృపా విహీనమతిన్=అంత దయలేనిమనస్సుతో; అన్న దమ్ములన్ = సోదరులను; నొంచును+ఎ=బాధిస్తాడా?

భా: *"కృష్ణా! ఆ కౌరవులు చెప్పవీలు లేనన్ని అవమానాలు బాధలు మాకు కలిగించి అడవులకు వెళ్ళగొట్టి సంజయుడిచేత రాయబారం పంపిస్తారా? ఈ కల్లబొల్లి ఊరడింపులకే యీ ధర్మరాజు పరమానందపడ్డాడు. ఈ ఐదుగురికీ ఆ దుర్యోధనుడు ఈ మాత్రానికే తనంతట తాను ఐదూళ్ళు ఇస్తాడా? ఆ మాత్రం గూడా ఇవ్వకుండా ఆతడు ఈ తన సోదరులను అంత నిర్దయగా బాధించకపోవచ్చు.*

వి: "అంతలుచేసి"=అంతటి ఘోరకార్యాలు చేసి; ద్రౌపది అన్న ఈ మాట పాండవులకు దుర్యోధనాదులు చేసిన అపకారాలు అన్నింటినీ గుర్తుకు తెస్తుంది. అంతేకాదు; ఆమెకు జరిగిన చెప్పరాని పరాభవాన్ని గూడా ఆ మాట వ్యక్తం చేస్తుంది.

కావ్యం కాంతాసమ్మితం అంటారు. కావ్యానికి జీవితం వ్యంగ్యం అని ఆలంకారికులు. క్రోధపూర్ణ అయినా ద్రౌపది కాంతా సమ్మితంగానే వ్యంగ్యోక్తులతోనే స్వీయాభిప్రాయాలు వ్యక్తం చేస్తుంది. పై పద్యంలోని ప్రతివాక్యంలో వాచ్యాతిశాయి అయిన వ్యంగ్యం పాఠకులకు గోచరిస్తుంది.

ఇందులో మొదటి వాక్యంలో బహువచనాంతక్రియకు కర్త లేదు. క్రోధ వివశ అయిన ద్రౌపది ఆఘనకార్యాలు చేసిన వారు అందరికీ తెలుసు అని ఆ కర్తను చెప్పలేదు.

అంత నీచంగా ప్రవర్తించినవారూ; వెళ్లగొట్టినవారూ; సంజయుని చేత రాయబారం పంపినవారూ ఒక్కరే. వారే

అభిప్రాయం. రాజ్యం అపహరించి అడవులకు నెట్టినవారు ఆహా! సంజయుని చేత చెప్పి పంపారు. ఏమని? ఏమీలేదు కాబట్టి ఆమె ఆ చెప్పి పంపింది ఏమిటో చెప్పలేదు. ఆ శుష్కప్రియాలకు ఈ ధర్మరాజు గారు ఎంత పరమానంద పడిపోయారు! అయితే ఆ దుర్యోధనుడు ఈయన అనుకున్నట్లు అయిదూళ్ళయినా తనంతట తాను ఇస్తాడా? సంజయుని సందేశంలో అయిదూళ్ళ ప్రస్తావనేగాదు; రాజ్యభాగం ఇచ్చే ఏమాటాలేదు. కాబట్టి ఈ ధర్మరాజుగారు అలా ఎలా అనుకున్నారు? అని ద్రౌపది ప్రశ్న. దానిమీద చివరి వాక్యం వెక్కిరింపుతో గూడిన వ్యంగ్యం. ధర్మప్రకారం సమస్త రాజ్యానికీ అధికారి అయిన ధర్మరాజు అర్ధరాజ్యాన్నిగూడా వదులుకొని ఐదూళ్ళు అడగటం ద్రౌపదికి పట్టరాని ఆగ్రహాన్ని కలిగించింది. అందువల్లనే ఇలా అన్నది. "ఆతడు వీరికి భిక్షంలాగా ఐదూళ్ళయినా ఇవ్వకుండా అంత దయమాలి ఈ అన్నగారిని; ఈ తమ్ములను బాధిస్తాడా?" అమూలకమయినా ఈ వాక్యం ద్రౌపది అభిప్రాయాలకు పునాది.

నచాపి హ్యకరోత్ వాక్యం శ్రుత్వా కృష్ణ సుయోధనః
యుధిష్ఠిరస్య దాశార్హ శ్రీమతః సంధిమిచ్ఛతః 82-9

కృష్ణా! సంధిని కోరే శ్రీమాన్ ధర్మరాజుల వారిమాటను దుర్యోధనుడు సంజయుని వల్ల వినికూడా అలా చేయడు.

ఇందులో శ్రీమతః అనే యుధిష్ఠిర విశేషణం ద్రౌపదికి ధర్మరాజుపైన ఉన్న గౌరవానికీ సూచకం కావచ్చు. ఆయన అమాయకత్వానికి జాలిపడ్డ అభిప్రాయానికీ సూచకం కావచ్చు.

"కృష్ణా! నీవు అక్కడికి వెళ్లినప్పుడు దుర్యోధనుడు రాజ్యం ఇవ్వకుండా సంధిచేయాలి అని అంటే ఆ షరతు నీవు ఏమాత్రం ఒప్పుకోవద్దు" అని మూలంలో ద్రౌపది సూటిగా చెపుతుంది.

"ప్రియమంది" అని అసమాపకక్రియా పాఠం అన్వయానుకూలంగాదు.

చ: **తనమునుపడ్డ బన్నములఁ దమ్ములపైఁ గల కూర్మి పేర్మి నీ**
జనపతి సైఁపకున్నె? యది సక్కన! రాజ్యము పాలు లేక తీ
ఱున కొడఁబాటు గల్గిన నెఱుంగమి పెట్టరె? చాలరైరి వీ
రన రొకొ? నాన లేమి యని యాడరె లోకము వారు కేశవా! 102

అ: కేశవా=కృష్ణా!; ఈ జనపతి= ఈ ధర్మరాజు; తమ్ములపైన్=దుర్యోధనాదులగు సోదరులపైన; కల; కూర్మి పేర్మిన్=అధికమయిన ప్రేమతో; తన=తాను;మును=ఇంతకుముందు; పడ్డ=పడిన; బన్నములున్=అవమానాలను-బాధలను; సైఁపక+ఉన్నె=సహించకుండా ఉంటాడా?; అది=అలా ఓర్చుకోవటం; చక్కన=చాలా మంచిది; రాజ్యముపాలు=రాజ్యభాగం లేక; తీఱునకు= సంధికి; ఒడఁబాటు=అంగీకారం; కల్గినన్; లోకమువారు=లోకులు; ఎఱుంగమి=తెలివితక్కువ తనాన్ని; పెట్టరె=ఆరోపించరా?; వీరు= ఈ పాండవులు; చాలరు+ఐరి=(యుద్ధం చేయటానికి) సమర్థులు కారు; అని అనరు+ఒకొ=అనకుండా ఉంటారా?; నానలేమి=సిగ్గులేకపోవటం; అని; ఆడరె=నిందించరా?

భా: *కృష్ణా! ఈ ధర్మరాజు దుర్యోధనాదులయిన తమ్ములపైన ఉన్న వల్లమాలిన వాత్సల్యం వల్ల వెనక తాను వాళ్ళవలన పొందిన అవమానాలను, ఆపదలను, అన్నింటినీ*

సహిస్తాడు అది మరీ మంచిది. ఈయన రాజ్యభాగం లేకుండా సంధికి అంగీకరిస్తే లోకులంతా వీరిని తెలివి తక్కువ వారనీ; యుద్ధం చేయటానికి అసమర్థులనీ; సిగ్గులేని వారనీ నిందించకుంటారా?

వి: "తమ్ములపై గల కూర్మి పేర్మి" ఇందులోని తమ్ములు అంటే పాండవులు అని అర్థం చెప్పవచ్చు. సంధికాక యుద్ధం జరిగితే తన తమ్ములు భీమాదులు శ్రమపడతారేమో అనే భయంతో వారిమీద ఉండే ప్రేమతో ధర్మరాజు తాను పూర్వం పడ్డ కష్టాలన్నీ, అవమానాలన్నీ సహించకుండా ఉంటాడా? అది మరీ బాగుంటుంది.

కృష్ణుడు భగవద్గీతలో చెప్పినట్లు.

క్షత్రియులకు యుద్ధం అపూర్వంగా వచ్చే పండగ అని ద్రౌపది భావం.

శా: **పెంపేదం దమ కిట్టి తక్కువలు రూపింపంగ నేలా? విచా**
రింపన్ వారిక మేలు సంధి; దము వారిం జూచినం దారు సా
ధింపం జాలరొ? కాక పోరఁదగ మర్దింపం దలంపేని శం
కింపం బట్టొకొ? వారు బ్రాహ్మణులె యేకీడైన సైరింపఁగన్? 103

అ: పెంపు=అధికమయిన గౌరవం; ఏదన్=నశింపగా; తమకు=పాండవులకు; ఇట్టి తక్కువలు=ఇలాంటి హీన స్థితులు; రూపింపంగన్+ఏలా =(లోకులు) ఎందుకు ఆరోపించాలి?- ఎన్నవలసి వచ్చింది?; విచారింపన్=బాగా ఆలోచిస్తే; సంధి; వారికి+అ=ఆ కౌరవులకే; మేలు= మంచిది; తమున్=తమను =పాండవులను; వారిన్ = ఆకౌరవులను; చూచినన్ = చూస్తే; తారు= తాము-పాండవులు; సాధింపన్+చాలరో=సాధించలేరా- పగ తీర్చుకోలేరా? కాక=అలాకాక; పోరన్= యుద్ధంలో; తగన్=తగినరీతిగా; మర్దింపన్=సంహరించటానికి; తలంపు+ఏని=ఆలోచన ఐతే; శంకింపన్= సందేహించటానికి; వారు= ఆ కౌరవులు; పట్టు+ఒకొ=స్థానం-తావు అవుతారా? ఏ కీడు+ఐనన్=ఏ తప్పునయినా; - ఏ అపకారాన్ని అయినా; సైరింపఁగన్=సహించటానికి- సహించి ఊరుకోవటానికి; వారు= ఆ కౌరవులు; బ్రాహ్మణులు+ఎ= బ్రాహ్మణులా?

భా: *ఈ పాండవులు తమ గౌరవాతిశయం సర్వనాశనం అయ్యేటట్లుగా ఇలాంటి ఆరోపణలు రావటానికి ఎందుకు అవకాశం ఇవ్వాలి? బాగా ఆలోచిస్తే ఈ సంధివల్ల వాళ్ళకే లాభం. తమనూ, కౌరవులనూ పోల్చి చూస్తే తాము వాళ్ళపై పగ తీర్చుకోలేరా? అలాకాక యుద్ధంలో వాళ్ళను సంహరించదలిస్తే అందులో సందేహించవలసింది ఏముంది? ఎలాంటి ఆపద గలిగించినా సహించి పాండవులు ఊరుకోవటానికి ఆ కౌరవులు బ్రాహ్మణులు కారు కదా!*

వి: పాండవులు సంధికోసం ప్రయత్నించటం లోకదృష్టిలో న్యూనత. ఇందువల్ల వారు యుద్ధమంటే భయపడుతున్నారని లోకులు అనుకుంటారు. రాజ్యం ఏ మాత్రం ఇవ్వకుండా సంధి చేయటం కౌరవులకే మేలు. వారు ఏమాత్రం కష్టపడకుండా రాజ్యం అంతా కబళించవచ్చు. యుద్ధం చేస్తే పాండవులు గెలవలేరా? "బ్రాహ్మణో నహంతవ్యః" అని పెద్దలు అంటారు. కౌరవులు క్షత్రియులు కాబట్టి యుద్ధంలో వారిని సంహరించటం దోషం కాదు. అని ద్రౌపది అభిప్రాయం.

ఉ: **ఓట యొకింత యేనియు సుయోధను చిత్తము నందు లేదు; నీ**
మాటలఁ బోవునే దురభిమానమ యెక్కుడు పూనుఁగాక; య
చ్చోటన సంగరంబులగు చొప్పులు పుట్టిన నైనఁ బాండవుల్
పోటున కిచ్చగింతురొకొ! పోదురొ కానల నుండ నచ్యుతా! 104

అ: అచ్యుతా=కృష్ణా!; సుయోధను=దుర్యోధనుని యొక్క; చిత్తమునందు= మనస్సులో; ఓట=జంకు; భయము; ఒక+ఇంత+ఏనియు=ఏ కొంచెంగానీ; లేదు; నీ మాటలన్= నీ హితబోధలననుసరించి; పోవునే = ప్రవర్తిస్తాడా; ఎక్కుడు = ఎక్కువ; దురభిమానము + అ= దురహంకారమే; పూనున్+కాక= ఆవేశిస్తుంది గాని; ఆ+చోటన=ఆ కౌరవుల వద్దనే; సంగరంబులు= యుద్ధాలు; అగు చొప్పులు=జరిగే పద్ధతులు; పుట్టినన్+ఐనన్=ఏర్పడితే నైనా; పాండవుల్; పోటునకు=యుద్ధానికి; ఇచ్చగింతురు+ఒకొ=ఇష్టపడతారో;(లేక) కానలన్=అడవులలో; ఉండన్= నివసించటానికి; పోదురో=వెళ్తారో

భా: *కృష్ణా! ఆ దుర్యోధనుడి మనస్సులో జంకు గొంకులు లేవు. నీ మాట ప్రకారం నడుచుకుంటాడా? అతనికి సహజ సిద్ధమయిన దురభిమానమే ఇంకా విజృంభిస్తుంది. ఒకవేళ కౌరవులే సర్వసన్నద్ధులై యుద్ధానికి పిలిస్తే ఈ పాండవులు యుద్ధానికి సిద్ధపడతారో! లేక అరణ్యవాసానికి వెళ్తారో!*

వి: ఘోషయాత్ర; ఉత్తరగోగ్రహణం మొదలయిన యుద్ధాలలో ఓడిపోయినా ఆ దుర్యోధనుడికి ఆవంతయినా జంకుగొంకులు లేవు. అభిమానం మంచి లక్షణమే. కాని దురభిమానం దుష్టలక్షణం. ఉత్తమక్షత్రియ వీరుడు ఎవరైనా యుద్ధానికి పిలిస్తే వెనుదీయరాదు. ద్రౌపది కృష్ణుని సంబోధించినా ఆవేశాన్ని పొంది కర్తవ్యోన్ముఖులు కావలసింది ఇక్కడ పాండవులే!

ఉ: **ఏ నిటు లంటి నావలవ; దింకను నీవును రాజుఁ దమ్ములుం**
గా నుచితంబు చూచి; మన కార్యము; మీసుజనత్వముం జెడం
గా నొక భంగి సేయక; తగం గురువర్గముతోడి సంధి మీ
కైన తెఱంగునన్ వలచినట్టుల చేయుఁడు నేర్పు లేర్పడన్." 105

అ: ఏను=నేను; ఇటులు = ఇలాగా; అంటిన్ = అన్నాను; నావలవదు = అనవద్దు; ఇంకను = మరి; నీవును; రాజున్ = ధర్మరాజూ; తమ్ములున్ =భీమాదులయిన ఆయన తమ్ములూ; ఉచితంబు = సముచితమయినది; కాన్ = జరిగేటట్లు; చూచి = ఆలోచించి; మన కార్యమున్= మనపనీ; మీ సుజనత్వమున్=మీ మంచితనమూ; చెడన్+కాన్=చెడిపోయేటట్లుగా; ఒకభంగి= ఒక పద్ధతిని; చేయక; కురువర్గముతోడి=కౌరవుల సమూహంతో; సంధి; తగన్=అనుకూలం అయ్యేటట్లు; నేర్పులు+ఏర్పడన్=(మీమీ) నైపుణ్యాలు స్పష్టమయ్యేటట్లు; మీకు; ఐన తెఱంగునన్=ఇష్టమయిన విధంగా; వలచినట్టులు=కావలసిన విధంగా; చేయుఁడు=చేయండి.

భా: *అన్నా! నేను ఇలాగా అన్నానని అనుకోవద్దు. నీవూ; మనరాజుగారూ; ఆయన తమ్ములూ; ఏది సముచితమో బాగా ఆలోచించి మనపనీ; మీ మంచితనమూ ఏ మాత్రం చెడిపోకుండా కౌరవులతో సంధి మీకు ఇష్టం అయినట్లు మీ నైపుణ్యాన్ని అంతా ఉపయోగించి కావలసినట్లు చేసుకోండి."*

వి: "ఏనిటులంటి నా వలవదు." ఈ వాక్యానికి అంతర్గతమైన భావం వ్యంగ్య శోభితం. నేను ఇలా అంటున్నాను. కాబట్టే మీరు యుద్ధోన్ముఖులు కండి అని ద్రౌపది అభిప్రాయం. ఈ పద్యంలోని తక్కిన విషయం గూడా ద్రౌపది సంధివ్యతిరేకాన్ని వ్యక్తం చేసేవే. ప్రతీకారభావంతో మఱిగిపోతున్న ద్రౌపది సభామర్యాదను అతిక్రమించకుండా ఉండటానికే ఇలా వ్యంగ్యబాణాలకు పాండవులను గురిచేస్తున్నది.

వ: అని మఱియు నిట్లనియె 106

భా : *అని ద్రౌపది ఇంకా ఇలా అన్నది.*

ఉ: "ఆఱడిఁ బోకయున్ ఫలము నందుటయుం గని పల్కనేరమిన్;
మాఱట నోరిదాన నయి; మాటలు చిత్తమునందు నిల్ప;కేఁ
గాఱులు ప్రేలెదన్; వినుఁడు కర్జము నెగ్గనుగాన; నల్కమై
వీఱిఁడియైన మానిసికి వెండి వివేకము గల్గ నేర్చునే? 107

అ: ఆఱడిఁబోకయున్=అల్లరిపాలు కావటమూ; ఫలమును=(దాని) ఫలితాన్ని; అందుటయున్=పొందటమూ; కని=బాగా పరిశీలించి; పల్కనేరమిన్=మాట్లాడలేకపోవటం వల్లా; మాఱట నోరిదానను+అయి=చెప్పినదాన్నే మళ్ళీ చెప్పేదానినయి-బదులు చెప్పేదాన్ని అయి; మాటలు; చిత్తమునందు = మనస్సులో; నిల్పక=నిలుపుకోలేక; ఏన్=నేను; కాఱులు=పరుష వాక్యాలను; ప్రేలెదన్=వదరుతున్నాను. వినుఁడు=మీరందరూ వినండి; కర్జమున్=చేయదగిన పనినీ; ఎగ్గను=కీడునూ; కానన్=తెలుసుకోలేను; అల్కమైన్=కోపంతో; వీఱిఁడి+ఐన=అవివేకి అయిన- వెఱ్ఱిదయిన; మానిసికి=మనిషికి; వెండి=మళ్ళీ-మరి; వివేకము = యుక్తాయుక్త విచారం; కల్గనేర్చునే=కలుగుతుందా?

భా: *"కృష్ణా! నేను అల్లరిపాలు కావటం; దానికి తగిన దుష్ఫలితాలను చెందటం; ఆలోచించి మాట్లాడలేకపోవటం అనే కారణాలవల్ల చెప్పిందే మళ్ళీచెప్తూ- ఎదురు మాట్లాడుతూ; దాచుకోలేక పరుషంగా నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నాను. మీరంతా పరాకు లేకుండా వినండి. ఉచితానుచితాలు, మంచిచెడులు నాకు తెలియటంలేదు. కోపంతో పిచ్చెక్కిన మనిషికి మళ్ళీ వివేకం కలుగుతుందా?*

అలం: అర్థాంతరన్యాసం.

వి: ద్రౌపది తాను అంత ఆవేశంతో అంత తీవ్రంగా మాట్లాడటానికి కారణాలు చెపుతున్నది. పాండవులు ద్యూత పరాజితులయినప్పుడు దుశ్శాసనాదులు ఎంతో అల్లరిచేశారు ద్రౌపదిని. దానికి తగినట్లుగా అరణ్యాజ్ఞాతవాసాలలో సైంధవ కీచకాదులవల్ల ఆమె ఎన్నో అవమానాలకు గురి అయింది. అందువల్ల తనకు తగిన ఉదాత్తతను కోల్పోయాను అంటున్నది. పీడకలలాగా జరిగినదంతా గుర్తురావటం వల్ల ఆమె మనస్సు చలించిపోయింది. అందువల్ల తన మాటలను అన్యథా భావించవద్దు అంటున్నది.

చ: పరమునఁ బుట్టితిన్; భరతవంశముఁ జొచ్చితి; నందుఁ బాండుభూ
వరునకుఁ గోడలైతి; జనవంద్యులఁ బొందితి; నీతి విక్రమ

స్థిరులగు పుత్రులం బడసితిన్; సహజన్ముల ప్రాపు గాంచితిన్;
సరసిజనాభ! యిన్నిటఁ బ్రశస్తికి నెక్కినదాన నెంతయున్. 108

అ: సరసిజనాభ=పద్మమునాభియందు గలవాడా-కృష్ణా!; వరమునన్=దేవతలిచ్చిన వరం వల్ల; పుట్టితిన్=పుట్టాను; భరతవంశమున్; చొచ్చితిన్=ప్రవేశించాను; అందున్= ఆవంశంలో; పాండుభూవరునకున్=పాండురాజుకు; కోడలు+ఐతిన్; జనవంద్యులన్=లోకులకు నమస్కరింప దగినవారిని; (భర్తలనుగా) పొందితిన్= పొందాను; నీతి విక్రమ స్థిరులు= రాజనీతిలో; పరాక్రమంలో చలించనివారు; అగు పుత్రులన్=అయిన పుత్రులను; పడసితిన్=కన్నాను; సహజన్ముల ప్రాపు= సోదరుల అండదండలను; కాంచితిన్=పొందాను; ~~ఇన్నిటన్~~=పైన చెప్పిన వాటిలో అన్నింటిలో; ఎంతయున్=మిక్కిలి; ప్రశస్తికిన్=గణనకు-ప్రశంసకు; ఎక్కినదానను=అధిరోహించాను.

భా: *కృష్ణా! నేను దేవతలవరం వల్ల జన్మించాను. భరతవంశాన్ని మెట్టాను. ఆ వంశంలో పాండురాజుకు కోడలినయ్యాను. లోకవంద్యులైన వారిని భర్తలుగా పొందాను. రాజనీతిలోనూ, పరాక్రమంలోనూ సుస్థిరులయిన ఐదుగురు పుత్రులను కన్నాను. సహోదరులయిన మీ అండదండలు పొందాను. ఇన్ని రకాల ఎంతో వాసి-వన్నె లభించినవి.*

వి: దీనికి మూలం ఇలా ఉంది

కాతు సీమన్తినీ మాదృక్ పృథివ్యా మస్తి కేశవ
సుతా ద్రుపదరాజస్య వేదిమధ్యాత్ సముత్థితా;
ధృష్టద్యుమ్నస్య భగినీ తవ కృష్ణ! ప్రియా సఖీ
ఆజమీఢకులం ప్రాప్తా స్నుషా పాండో ర్మహాత్మనః
మహిషీ పాండు పుత్రాణాం పంచేంద్ర సమవర్చసామ్
సుతా మే పంచభిర్వీరైః పంచజాతా మహారథాః

అధ్యా.82-20 నుండి 23 వరకు

ఈ శ్లోకాలు ఆధారంగా తిక్కన పై పద్యాన్ని అందంగా అందించాడు. ఇందులో ద్రౌపది అభిజాత్యం, పుట్టినిల్లు, మెట్టినిల్లుల వైశిష్ట్యం; ఉత్తమగృహిణీత్వం; ఆరువాక్యాలతో కవి సూచించాడు. స్త్రీ జీవిత సాఫల్యం ఈ వాక్యాలు సూచిస్తున్నాయి. ఇవి ద్రౌపది ఆత్మవిశ్వాసానికి ప్రతీకలుగా గోచరిస్తాయి.

వ: **అట్లుంగాక.** 109
అంతేకాక.

ఉ: **నీవు సుభద్రకంటెఁ గడు నెయ్యము గారవముం దలిర్ప సం**
భావన సేయు; దిట్టి ననుఁ బంకజనాభ! యొకండు రాజసూ
యావభృథంబునందు శుచియై పెనుపొందిన వేణివట్టి, యీ
యేవురుఁ జూడఁగా సభకు నీడ్చెఁ; గులాంగన నిట్లొనర్తురే? 110

అ: పంకజనాభ=పద్మమునాభియందు గలవాడా-కృష్ణా!; నీవు; సుభద్రకంటెన్= సొంత చెల్లెలయిన సుభద్రకన్నా; కడు=ఎక్కువయిన; నెయ్యమున్=ప్రేమా-వాత్సల్యమూ; గారవమున్= ఆదరమూ; తలిర్పన్=అతిశయించగా; సంభావన+చేయుదు=గౌరవిస్తావు; ఇట్టి=

ఇటువంటి; నను=నన్ను; ఒకండు=ఒకడు-నీచుడు-అల్పుడు; రాజసూయ+అవభృథంబు నందు=రాజసూయ యాగ దీక్షకు చివర చేయబడే స్నానంలో; శుచి+ఐ=పవిత్రమై; పెనుపొందిన=మహత్త్వాన్ని పొందిన; వేణిన్ = కేశపాశాన్ని-జడను; పట్టి = పట్టుకొని; ఈ+ఏవురు = ఈ ఐదుగురు; చూడన్+కాన్= చూస్తుండగా; సభకున్=ద్యూత సభకు; ఈడ్చెన్= లాక్కుపోయాడు; కుల+అంగనన్=కులస్త్రీని; ఇట్లు=ఇలా; ఒనర్తురే=చేస్తారా?

భా: *శ్రీకృష్ణా! నీవు సొంత చెల్లెలయిన సుభద్రకంటే కూడా నన్ను వాత్సల్యంతో ఆదరంతో ప్రేమగా గౌరవిస్తావు. ఇలాంటి విశిష్ట గౌరవాన్ని పొందే నన్ను ఒక అల్పుడు రాజసూయ యాగాంతంలో చేసే స్నానం వల్ల పరమపవిత్రమైన మహత్త్వాన్ని పొందిన జడను పట్టుకొని ఈ పాండవులయిదుగురూ చూస్తుండగానే జూదమాడుతున్న సభకు ఈడ్చుకొని వెళ్ళాడు. కులకాంతను ఇంత అవమానం చేయటం ఎక్కడయినా ఉందా?*

వి: "తవ కృష్ణ! ప్రియా సఖీ" అనే 82 అధ్యాయంలోని 20వ శ్లోకపాదం ఈ పద్యంలో మొదటి వాక్యానికి మూలం. ద్రౌపది వ్యక్తిత్వానికీ, విశిష్టతకూ వెనకటి పద్యంలోని ఆరు విషయాలకంటే ప్రత్యేకత కలది. "ఇట్టినను" అనే పదద్వయం ద్రౌపది మహోన్నతమైన ఆత్మవిశ్వాసానికి ప్రతీక. "ఒకండు" అనటం ద్రౌపదికి పశుబలం చూపిన దుశ్శాసనునిపై గల అసహ్యానికి నిర్లక్ష్యానికి సూచకం. అతని నీచ ప్రవర్తనే అందుకు కారణం. "ఈ యేవురు" అని ఆమె చేయెత్తి పాండవులను చూపిస్తున్నది. "సభకు నీడ్చె" ఇది అవమానసూచకం

రాజసూయము: "ఒకరాజు దేశములోని యితరరాజులను జయించి చేసెడియాగము. ఒకరాజు తక్కిన రాజులను జయించి సర్వాంగీకృత సామ్రాజ్యమునకు గుర్తుగా సామంతరాజుల సహాయముతోఁ బట్టాభిషేక సమయమునఁజేసెడి పెద్ద యజ్ఞము." అని నిఘంటువులు. దీనిని గూర్చి సంస్కృతమహాభారతం సభాపర్వంలో ఇలా ఉంది.

సోదరులు; మంత్రులు రాజసూయ యజ్ఞాన్ని గురించి ధర్మరాజుతో ఇలా అన్నారు. "మహారాజా! రాజసూయ యజ్ఞానంతరము అభిషేకము జరిగిన తరువాత రాజు వరుణుని గుణములను పొందును. కావున ప్రతి ఒక్కరాజు గూడ ఆ యజ్ఞమువలన సమ్రాట్టు యొక్క సమస్త గుణములను పొందవలెనని అభిలషించును. మీరు సమ్రాట్టు గుణములను పొందుటకు సర్వ విధముల యోగ్యులు కావున మీ మిత్రులు మీరు రాజసూయ యాగము చేయుటకు తగిన సమయమాసన్నమైనదని తలంచుచున్నారు. సేనాదులగు క్షత్ర సంపదకు ఆ సమయ మధీనము. ఉత్తమాచారనిరతులగు బ్రాహ్మణులు సామవేద మంత్రములతో అగ్నిస్థాపనకై ఆరు అగ్నికుండములను నిర్మింతురు. ఆ యజ్ఞము సనుష్ఠించువారు దర్వీహోమము (అగ్నిహోత్రాదులు) మొదలుకొని సమస్త యజ్ఞముల ఫలము నందుదురు. యజ్ఞాంతమున జరుగు అభిషేకము వలన యజ్ఞకర్తయగు రాజు సర్వవిజేతయగు సమ్రాట్టు అనబడును."

రాజసూయమును గురించి శతపథబ్రాహ్మణములో గలదు. ఆశ్వలాయన కాత్యాయన లాట్యాయనాపస్తంబ శాంఖాయనాదులు ఈయాగవిధానమును బహువిధముల ప్రశంసించిరి.

అవభృథము: యజ్ఞముకడపట న్యూనాతిరిక్త దోషపరిహారార్థము చేయుకర్మము. యజ్ఞమునకంగమై దానికడపటఁజేయబడు స్నానము. యజ్ఞపరిసమాప్తియందు యాజకుఁడును

యజ్ఞపరికరములును స్నానముచేతనొందు శుద్ధి. దీక్షాంతస్నానము; ప్రధానయజ్ఞము సమాప్తము కాగా సామూహిక నదీస్నానము; యజ్ఞాదికమునందు న్యూనాధికదోషశాంతికై మిగిలినదిగా చేయవలసిన హోమము. స్నానము దీనికి ఒక ముఖ్యాంగము.

ఉ: ఆ సభ కేకవస్త్ర యగునట్టి ననుంగొని వచ్చి నొంచు దు
శ్శాసనుఁ జూచుచుం బతు లసంభ్రములై తగు చేష్టలేక యా
యాసలు మాని చిత్రముల యాకృతి నున్నయెడన్ ముకుంద! వి
శ్వాసముతోడ నిన్ గొలువ వచ్చె మనం బదియుం దలంపవే. 111

అ: ఆ సభకు= ఆ జూదపు సభకు; ఏకవస్త్ర= ఒకే వస్త్రం ధరించినది- రజస్వల; అగునట్టి=అయిన; ననున్=నన్ను; కొనివచ్చి=లాగుకొనివచ్చి; నొంచు=బాధిస్తున్న; దుశ్శాసనున్; చూచుచున్= చూస్తూ; పతులు=భర్తలు-పాండవులు; అసంభ్రములు+ఐ=తత్తరపాటు లేనివారయి; తగు చేష్ట=తగిన ప్రతీకారం; లేక; ఆయాసలు=పూనికలు-ప్రయత్నాలు-ఆశలు; మాని; చిత్రముల+ఆకృతిన్= బొమ్మలవలె; ఉన్నన్=ఉండగా; ముకుంద=కృష్ణా; మనంబు=మనస్సు; విశ్వాసముతోడన్=(రక్షిస్తావు అనే) నమ్మకంతో; నిన్=నిన్ను; కొలువన్+వచ్చెన్= సేవించడానికి వచ్చింది; అదియున్= ఆవిషయాన్ని గూడా; తలంపవు+ఏ= గుర్తు తెచ్చుకో.

భా: *కృష్ణా! రజస్వలనయి ఏకవస్త్రనుగా ఉన్న నన్ను ఆ జూదపుసభకు బలవంతంగా లాగుకొని వచ్చిబాధించే దుశ్శాసనుని చూస్తూ భర్తలయిన ఈ ఐదుగురూ ఎలాంటి తత్తరపాటూ లేకుండా కొయ్యబారిపోయి బొమ్మలాగా ఉన్న సమయంలో* ***ఆర్తురాలిని*** *నన్ను* ***రక్షిస్తావనే*** *విశ్వాసంతో నామనస్సు నిన్ను స్మరించింది. అది కూడా గుర్తుతెచ్చుకో.*

వి : "ఏకవస్త్ర:-స్త్రీలు ముట్టయిన మూడుదినములు ఒకే వస్త్రమును ధరింపవలెను. అనఁగా రజోదర్శనమైనది మొదలు స్నానపర్యంతము వస్త్రము మార్చరాదు. పోకముడి క్రిందకు వేయవలెను. స్నానము చేయరాదు అని ధర్మశాస్త్రము; వైద్యశాస్త్రమునే గాక సనాతనాచారమును. కావున ఏకవస్త్రపదము రజస్వలకు చెల్లినది. ఈ సమయమున ఆంధ్రస్త్రీలు వాడుపైటచెఱఁగు ఔత్తరాహులు వాడు మేలుముసుఁగు నుండదు."

ఆంధ్రమహాభారత నిఘంటువు.

చ: అరయమిఁ జేసి కోడ లన కప్పుడు దాసిగఁ జేసె; నమ్మహా
పురుషుని పాలికిం బతులు వోవఁగ వీరలతోన యేను జె
చ్చెరఁ జని కోటరంబు దగఁ జేయుదునో? యటుగాక పాడిమై
వరవుడ మోపి చేయుదునొ వారికి మాధవ! నిశ్చయింపుమా" 112

అ: (ధృతరాష్ట్రుడు) అరయమిన్+చేసి= ఆలోచనలేకపోవటం వల్ల-తెలివితక్కువ చేత; అప్పుడు= ఆ ద్యూతసమయంలో; కోడలు+అనక; దాసిగన్; చేసెన్=చేశాడు; ఆ+మహా పురుషుని పాలికిన్=ఆ మహానుభావుడి దగ్గరకు; పతులు= నాభర్తలు; పోవఁగ= వెళ్ళగా; వీరలతోన= వీరితోపాటే; ఏనున్=నేనుకూడా; చెచ్చెరన్= మిక్కిలి త్వరగా;చని=వెళ్ళి; తగన్=బాగా-తగినవిధంగా; కోటరంబు=కోడరికం;చేయుదునో=చేసేదా?; అటు+కాక=అలాకాకుండా; వారికిన్= ఆకౌరవులకు;

పాడిమైన్= ధర్మప్రకారం; ఓపి=సహించి; వరవుడము= దాస్యం; చేయుదునొ= చేసేదా?; మాధవా=కృష్ణా; నిశ్చయింపుమా=(నీవే) నిర్ణయించు.

భా: ఆ ధృతరాష్ట్రమహారాజు ముందు వెనుక ఆలోచించక పోవటం వల్ల ఆ జూదం అప్పుడు కోడలని అయినా అనుకోక నన్ను దాసీని చేశాడు. ఇకమీద ఈ నా భర్తలు ఆ మహానుభావుడి దగ్గరకు వెళ్లితే నేను గూడా వీరితోపాటు శీఘ్రంగా ఆ కౌరవ నివాసానికి చేరి అక్కడ కోడరికం చెయ్యాలా? లేక ద్యూత ధర్మాన్ని అనుసరించి దాస్యం చెయ్యాలా? కృష్ణా! నీవే నిర్ణయించు."

వి: కోడలు అత్తమామలకు కుమార్తె వంటిది. వివాహమైన తరువాత వధువును తన ఇంటికి తీసికొనిపోయి గృహప్రవేశసమయంలో వరుడు ఇలా అంటాడు.

"సమ్రాజ్ఞీశ్వశురేభవ; సమ్రాజ్ఞీశ్వశ్రు వాంభవ. ననాందరి సమ్రాజ్ఞీభవ. సమ్రాజ్ఞీ అధిదేవృషు."

అత్తమామలు; వదినె; మరదలు మొదలైన వారికందరికీ నీవు సమ్రాజ్ఞిగా ఈ ఇంటిలో ప్రవర్తించు.

దీనివల్ల అత్తింట కోడలుకు ఎంతప్రాధాన్యాన్ని గౌరవాన్ని వేదమంత్రం ఆశించిందో వ్యక్తమవుతుంది.

పాండురాజు కోడలూ, పాండవపట్టమహిషీ కావటం వల్ల ద్రౌపది రెండు విధాలా సమ్రాజ్ఞియే. అలా మహారాణిగా గౌరవింపదగిన ఆమెను దాసిగా చేయటం చాలా నీచకృత్యం. ఇందుకు కారణం 'అరయమి'- యుక్తాయుక్తజ్ఞానం లోపించటం. అందుకే ద్రౌపది ధృతరాష్ట్రుని "అమ్మహాపురుషుడు" అంటున్నది. 'ఆ పెద్దమనిషి' అని ఆమె వ్యంగ్యభావన.

ప్రీణాతీతి పతిః ప్రేమించువాడు పతి. పాతీతిపతి: రక్షించువాడు పతి. అని పతి శబ్దానికి అర్థాలు. ప్రేమించి రక్షించాల్సిన ఈ పతులు మళ్ళీ ఆ మహానుభావుడి దగ్గరికి వెళ్లితే నేనుగూడా గబగబా అక్కడికి వెళ్ళాలా?

కోడరికం చేయటం మహోన్నతస్థితి. దాస్యంచేయటం మహారాణికి అతినీచస్థితి. ఈ రెండింటిలో తన కర్తవ్యం ఏమిటో నిర్ణయించమని అంటుంది ద్రౌపది. అంటే ఈ పాండవులు ఆ ధృతరాష్ట్రునివద్దకు పుత్రులుగానే వెళ్తారా? లేక దాసులుగానా? అని ఆమె ప్రశ్న.

పాడిమైన్-కోడలిగా హస్తినాపురానికి వెళ్ళటం న్యాయం అయితే; ద్రౌపదిస్థితి ఒక రీతిగా ఉంటుంది. దాసీగా అయితే ఇంకోరీతిగా ఉంటుంది. ఆ ధర్మం- ఏది తన కర్తవ్యమో నిశ్చయించమని ద్రౌపది కృష్ణుని అడుగుతున్నది. భంగ్యంతరంగా ఆమె ధర్మరాజాదులను ప్రశ్నించటమే.

వ: అని య ట్లుగ్గడించి. 113

భా : అని ఆవిధంగా పలికి

ఉ: ద్రోవది బంధురంబయిన క్రొమ్ముడి గ్రమ్మన విడ్చి వెండ్రుకల్
దా వలచేతఁ బూని; యసితచ్ఛవిఁ బొల్పు మహాభుజంగమో
నా విలసిల్లి వ్రేలఁగ; మనంబునఁ బొంగు విషాద రోషముల్
గావఁగలేక బాష్పములు గ్రమ్మఁగ; దిగ్గన లేచి యార్తయై. 114

అ: ద్రోవది=ద్రౌపది; బంధురంబు+అయిన=ఎగుడుదిగుడుగా ఉన్న- ధృఢంగాఉన్న; క్రొత్త+ముడి=అందమయిన కేశపాశాన్ని-అంతకుముందు వేసుకున్న జుట్టుముడిని; గ్రమ్మన= శీఘ్రంగా; విడ్చి=విప్పి; అసితచ్ఛవిన్=నల్లటికాంతితో; పొల్చు=ఒప్పునట్టి; మహాభుజంగమో =పెద్ద పామేమో; నాన్=అన్నట్టుగా; విలసిల్లి=ప్రకాశించి; వ్రేలఁగన్=వ్రేలాడుతుండగా; వెండ్రుకల్= వెంట్రుకలను- జుట్టును; తాన్=తాను; వలచేతన్=కుడిచేతిలో; పూని=పట్టుకొని; మనంబునన్= మనస్సులో; పొంగు=పొంగిపోతున్న; విషాదరోషముల్=దుఃఖాన్నీ; కోపాన్నీ; కావఁగన్+ లేక=ఆపు కోలేక; బాష్పములు=కన్నీరు; క్రమ్మగన్=వ్యాపించగా; దిగ్గనన్=తటాలున; లేచి; ఆర్త+ఐ=దుఃఖ పీడితురాలై-(తరువాతి వచనంతో అన్వయం)

భా: ద్రౌపది ధృఢంగా ఉన్న-ఎగుడుదిగుడుగా ఉన్న- కేశపాశం ముడి విప్పింది. నల్లత్రాచులాగా నిగనిగలాడుతూ వ్రేలాడుతున్న ఆ కేశపాశం కుడిచేతితో పట్టుకొని; దాన్ని చూడటంవల్ల మనస్సులో పొంగిపోతున్న బాధను, కోపాన్నీ ఆపుకోలేక కన్నులలో బాష్పజలం నిండగా దిగ్గున లేచి దుఃఖంతో-

వి : గ్రమ్మున- అనే పాఠం వావిళ్ళ; ఆం.ప్ర. సా.అకాడమి; ఉస్మానియా వారి ప్రతులలో ఉన్నది. అర్థం కుదరదు. గ్రమ్మగ- అనే పాఠం నూ.ని.లోను; దీపాలవారివిమర్శలో; పూర్వవ్యాఖ్యానంలో ఉన్నది.

దీనికి మూలం ఇలా ఉంది.

ఇత్యుక్త్వా మృదు సంహారం వృజినాగ్రం సుదర్శనమ్
సునీల మసితాపాంగీ సర్వగంధాధివాసితమ్
సర్వలక్షణ సంపన్నం మహాభుజగ వర్చసమ్
కేశపక్షం వరారోహా గృహ్యావామేన పాణినా
పద్మాక్షీ పుండరీకాక్ష ముపేత్య గజగామినీ
అశ్రుపూర్ణేక్షణా కృష్ణా కృష్ణం వచన మబ్రవీత్ అధ్యా.82;33నుండి 35 శ్లో

అని పలికి సుందరాంగి; నల్లని కన్నులు గలది; కమలనయన, గజగామిని అయిన ద్రౌపది-చూడటానికి మిక్కిలి అందమయినది, వంపులు తిరిగినవి, మిక్కిలి నల్లనయినవి, కలిపి కట్టినా మృదువయినవి, అన్ని విధాలయిన సుగంధాలతో శోభించేవి; సర్వశుభలక్షణాలు కలవి, మహాసర్పంలాగా నిగనిగలాడుతున్నవి అయిన శిరోజాలను ఎడమచేతిలోకి తీసుకొని శ్రీకృష్ణుని దగ్గరకు వెళ్ళి కన్నీళ్ళు పెట్టుకొంటూ ఇలా అన్నది.

వ: **గోవిందు ముందటం బెట్టి యిట్లనియె.** **115**

భా : శ్రీకృష్ణుని ఎదుట ఆ కేశపాశం పెట్టి ద్రౌపది ఇలా అన్నది.

క: **"ఇవి దుస్ససేను వ్రేళ్ళం**
దవిలి; సగము ద్రెవ్విపోయి డక్కినయవి; కౌ
రవుల కడఁ దీఱుమాటల
యవసరమునఁ దలఁపవలయు నచ్యుత! వీనిన్. **116**

అ: అచ్యుత=కృష్ణా!; ఇవి= ఈ వెండ్రుకలు; దుస్ససేను=దుశ్శాసనుని యొక్క;

వ్రేళ్ళన్= వేళ్లలో; తవిలి=చిక్కుకొని; సగము; త్రెవ్విపోయి= తెగిపోయి; డక్కిన+అవి=మిగిలినవి; కౌరవులకడన్ = కౌరవుల దగ్గర; తీఱుమాటల = సంధిమాటల యొక్క; అవసరమునన్ =సందర్భంలో; వీనిన్=ఈ తెగిపోయి మిగిలిన వెంట్రుకలను; తలఁపవలయున్=గుర్తు చేసుకోవలసింది-స్మరించు.

భా: *"కృష్ణా! ఈ శిరోజాలు దుశ్శాసనుడి చేతి వేళ్ళలో చిక్కుకొని సగం తెగిపోయి మిగిలినవి. కౌరవ సభలో సంధిమాటల సందర్భంలో వీటిని తప్పకుండా గుర్తుచేసుకో.*

వి: దుశ్శాసన- ప్రకృతి పదం. దుస్ససేనుఁడు. వికృతి. నీచకృత్యం చేశాడు కాబట్టి అతడు మానవప్రకృతిని కోల్పోయి వికృతినందాడు ద్రౌపది మాటలలో. పదమూడు సంవత్సరాలకు పూర్వం దుశ్శాసనుడు ద్యూతసభలోకి ద్రౌపది శిరోజాలు పట్టుకొని ఈడ్చుకొనివచ్చాడు. అప్పుడు ఆ శిరోజాలు సగం తెగి మిగిలిపోయాయి.

దీనికి మూలం ఇలా ఉంది.

అయం తే పుండరీకాక్ష! దుశ్శాసనకరోద్ధృతః
స్మర్తవ్యః సర్వకార్యేషు పరేషాం సంధి మిచ్ఛతా. 82.36 శ్లో

శత్రువులతో సంధిని కోరుతున్న నీవు దుశ్శాసనుడు చేతితో పట్టి ఈడ్చిన ఈ నా కేశపాశాన్ని అన్ని పనులలోను గుర్తు తెచ్చుకో.

సీ: **ఈ వెంట్రుకలు పట్టి యీడ్చిన యాచేయి**
దొలుతగాఁ బోరిలో దుస్ససేను
తను వింతలింతలు దునియలై చెదరి రూ
పఱి యున్నఁ గని యుడు కాఱఁగాక!
యలుపాలఁ బొనుపడు నట్టి చిచ్చే యిది?
పెనుగద పట్టిన భీమసేను
బాహుబలంబును; బాటించి గాండీవ
మను నొక విల్లెప్పుడును వహించు

ఆ: **కత్తి విక్రమంబుఁ గాల్పనే? యిట్లు బ**
న్నములు వడిన ధర్మనందనుండు
నేను రాజరాజు పీనుంగుఁ గన్నారఁ
గానఁ బడయ మైతి మేనిఁ గృష్ణ! 117

అ: ఈ వెంట్రుకలు; పట్టి; ఈడ్చిన; ఆచేయి= ఆ దుశ్శాసనుడి చేతిని; పోరిలోన్=యుద్ధంలో; తొలుతగాన్=మొదటగాను; (తరువాత) దుస్ససేను= ఆ దుశ్శాసనుడి యొక్క; తనువు= శరీరం; ఇంతలు+ఇంతలు=చిన్న చిన్నవి (బొటనవ్రేలూ చూపుడువేలూ కలిపి చూపిస్తూ అనే మాట) తునియలై= ముక్కలై; చెదరి=చెల్లాచెదరై; రూపఱి+ఉన్నన్=నాశనమయి ఉంటే; కని=చూసి; ఉడుకు+అఱున్+కాక=కోపం ఉపశమిస్తుంది కాని; ఇది= సభలో జరిగిన ఈ అవమానం; అలుపాలన్= చిన్న చిన్న ప్రతీకారాలవల్ల; పొనుపడునట్టి=ఉపశమించే; చిచ్చు+

ఏ=నిప్పా?; కృష్ణ; ఇట్లు; బన్నములు+పడిన=అవమానాలు పొందిన; ధర్మనందనుండు=ధర్మరాజు; నేను= ద్రౌపది; రాజరాజు పీనుంగున్=దుర్యోధనుడి శవాన్ని; కన్నారన్= కండ్లారా; కానన్+పడయము+ఐతిమి+ఏనిన్=చూడటాన్ని పొందలేకపోతే; పెనుగద=పెద్దగదను; పట్టిన= ధరించిన; భీమసేను=భీముని యొక్క; బాహు బలంబును= భుజబలమూ; ఎప్పుడును; గాండీవము; అను; ఒక విల్లు= ఒక ధనుస్సును; పాటించి= ప్రధానంగా చేసుకొని; వహించు=మోసేటటువంటి; కవ్వి విక్రమంబు=అర్జునుడి పరాక్రమం; కాల్పనే= తగలెయ్యడానికా?

భా: కౌరవసభలో ఈ వెంట్రుకలు పట్టుకొని ఈడ్చిన ఆ దుశ్శాసనుడి చేయి యుద్ధంలో మొదటా; తరువాత అతని శరీరం ఇంతింత ముక్కలై చెల్లాచెదరై నాశనమయి పోవటం చూచిన తరువాత ఈ అవమానదుఃఖం ఉపశమిస్తుంది. కాని చిన్న చిన్న ప్రతీకారాల వల్ల ఆరిపోతుందా ఈ అవమానాగ్ని? ఇలా ఎన్నో అవమానాల పాలయిపోతే; పెద్దగదను మోసే భీముని బాహుబలమూ; గాండీవం అనే ధనుస్సును ఎప్పుడూ వహించే అర్జునుని పరాక్రమం ఎందుకూ? తగలెయ్యటానికా?

వి: దుశ్శాసనుని చేయి యుద్ధంలో తెగిన వృత్తాంతం కర్ణపర్వంలో ఇలా ఉంది.

భీముడు దుశ్శాసనుని గదతో కొట్టికిందపడవేసి ఇలా అడిగాడు. "దురాత్మా! రాజసూయ యజ్ఞంలో అవభృథ స్నానంతో పవిత్రమయిన ద్రౌపదికేశపాశాన్ని ఏ చేత్తో పట్టుకొని ద్యూతసభకు లాక్కొనివచ్చావు?" ఆ మాటవిని దుశ్శాసనుడు కౌరవసోమకులు వింటూ ఉండగా నవ్వుతూ కోపంతో ఇలా అన్నాడు. "కరికరాకారమూ; స్త్రీకుచవిమర్దకమూ; గో సహస్రప్రదాత; క్షత్రియాంతకరమూ అయిన ఇదిగో ఈ చేతితోటే ద్రౌపదికేశాలను కురుముఖ్యులు; మీరు చూస్తుండగా లాగాను." ఈమాటలు విని భీముడు కోపపరవశుడై దుశ్శాసనుని ఆ చేతిని బలంగా లాగి విరగదీసి అవతలపారేశాడు. కర్ణపర్వము. 83 అధ్యా.21 నుండి 27 శ్లో

ఈ పద్యంలో ద్రౌపదిప్రతీకార తీవ్రత; కసి స్పష్టమవుతున్నాయి. క్షత్రియజాతీయ. అభిమానవతి; పట్టమహిషి అయిన ఆమెకు ఈ ఆవేశం సహజం; సముచితం. దుశ్శాసనుని శరీరం ముక్కలుముక్కలు కావటం; దుర్యోధనుని శవాన్ని కన్నులారచూడటం ఆ మానవతికున్న బలమయిన కాంక్షలు. భీమార్జునులను ఉద్రిక్తులను చేసే ఆమె మాటలు వాస్తవాలు కావటం వలనా, ఆవీరుల ఉద్దేశాలకు అనుగుణాలు కావటం వలనా; వారు ఆమెను కోపించలేదు.

ఉ: నెట్టన యిట్టి యల్క మది నిల్పితి- రక్కెసతాల్మిఁ జిచ్చొడిం
గట్టిన యట్లు పెద్దయును గాలము; దీనికి నాఁజు టెన్నఁడుం
బుట్టదు- దుష్టనిగ్రహము పూని జగంబులఁ గాచునట్టి తోఁ
బుట్టువు; తీవ్ర తేజమునఁ బొల్చిన భర్తలుఁ గల్గ; నచ్యుతా!" 118

అ: అచ్యుతా=కృష్ణా!; నెట్టన=తప్పక-విధిలేక; చిచ్చు=అగ్నిని; ఒడిన్+కట్టిన+అట్లు= ఒడిలో కట్టుకున్నట్లుగా; పెద్దయును = చాలా ఎక్కువ; కాలము; రక్కెసతాల్మిన్=రాక్షసమయిన;-అయుక్తమయిన ఓర్పుతో; ఇట్టి=ఇలాంటి;అల్కన్=కోపాన్ని- అమర్షను; మదిన్=మనస్సులో; నిల్పితిన్=ఉంచుకున్నాను- దాచుకున్నాను- దుష్టనిగ్రహము= దుష్టులను శిక్షించటాన్ని; పూని= వహించి; జగంబులన్=లోకాలను; కాచునట్టి=రక్షించేటటువంటి; తోఁబుట్టువు= సోదరుడూ;

తీవ్రతేజమునన్= తీక్షణమయిన పరాక్రమంతో; పొల్చిన= ప్రకాశించిన; భర్తలున్= భర్తలూ; కల్గన్= ఉండగా; దీనికిన్= ఈ అమర్షకు- ఈ కోపానికి; ఎన్నడున్=ఏనాడూ; ఆఱుట= ఉపశమించుట; పుట్టదు=కలుగదు.

భా: కృష్ణా! విధిలేక నిప్పును ఒడిలోపెట్టుకున్నట్లు ఇంతకాలం ఇంతకోపాన్ని రాక్షసమయిన ఓర్పుతో మనస్సులో దాచుకున్నాను. దుష్టులను శిక్షించటానికి పూనుకొని లోకాలను రక్షించే తోడబుట్టువూ, తీవ్రపరాక్రమంతో ప్రకాశించే భర్తలూ ఉన్నా ఈ పరాభవాగ్ని ఎప్పటికీ ఆరిపోయేటట్లు లేదు."

వి: తాల్మి-ఓర్పు. అదీ రక్కసతాల్మి- అయుక్తమైన; అయోగ్యమైన ఓర్పు. అంటే ఓర్పులో పరాకాష్ఠ అన్నమాట. అగ్ని వస్త్రాన్ని దహిస్తుంది. కాబట్టి ఒళ్ళో అగ్నిని ఉంచటం అశక్యం; అసంభవం. అటువంటిదే ఇంతవరకు ద్రౌపది తన ప్రతీకారవాంఛను మనస్సులో దాచుకోవటం. అతికష్టము. అతిదుష్కరము అయిన దీనిని చాలాకాలం నిర్వహించటం మానవమాత్రులకు చేతగాని పని.

త్రయోదశ హి వర్షాణి ప్రతీక్ష్యం త్యాగతాని మే
విధాయ హృదయే మన్యుం ప్రదీప్తమివ పావకమ్ 82.40శ్లో

ప్రజ్వలిస్తున్న అగ్నివంటి ఈ ప్రచండక్రోధాన్ని హృదయంలో ఉంచుకొని దీన్ని ఆర్పటం కోసం నేను ఎదురుచూస్తుండగానే 13 సంవత్సరాలు సాగిపోయాయి. అనేది ఇందులో పూర్వార్ధానికి మూలం.

-: శ్రీకృష్ణుడు ద్రౌపది నూరార్చుట :-
సం. 5-80-43

వ: అనుచు నెలుంగు రాలుపడ నేడ్చిన యాజ్ఞసేనిం గృపాయత్తచిత్తుం డయి నారాయణుం డూరార్చి కూర్చుండ నియమించి; కన్నీరు దుడువను బెన్నెఱివేణి ముడువనుం దగువారి నియోగించి; యమ్మానినితో నిట్లనియె. 119

అ: ఎలుంగు=కంఠధ్వని; రాలుపడన్=కంపించేటట్లు-రాచుకొనేటట్లు; యాజ్ఞసేనిన్=యజ్ఞసేనుని కుమార్తెను- ద్రౌపదిని; కృపా+అయత్త చిత్తుండు=దయకు లోనయిన మనస్సు కలవాడు; నారాయణుండు=కృష్ణుడు; ఊరార్చి=ఊరడించి-ఓదార్చి; నియమించి=ఆజ్ఞాపించి; పెద్ద+నెఱి+వేణిన్= పొడుగైన అందమయిన కేశపాశాన్ని; ముడువనున్=ముడి వేయటానికీ; నియోగించి=పురమాయించి; ఆ+మానినితోన్=ఆ అభిమానవంతురాలయిన ద్రౌపదితో.

భా: అని గొంతు రాచుకునేటట్లుగా; దుఃఖించినది ద్రౌపది. అప్పుడు కృష్ణుడు దయార్ద్రమనస్సుతో నిలుచుని ఉన్న ఆమెను కూర్చోమని చెప్పాడు. ఆమె కన్నీరు తుడవటానికీ, సుదీర్ఘ సుందరమయిన జుట్టును ముడివేయటానికీ తగిన పరిజనాన్ని పురమాయించాడు. ఆ తరువాత అభిమానవతి అయిన ద్రౌపదితో ఇలా అన్నాడు.

ఉ: **"మ్రుచ్చిర నేల నేఁ గలుగ ముద్దియ! నాకు వృకోదరుండు వి**
వ్వచ్చుఁడుఁ దోడుగాఁగ, జనవంద్యుఁడు ధర్మసుతుండు పంప; నీ
మెచ్చుగ శత్రు సంక్షయము మేకొని చేసెదఁ గాక- వేఱొకం
డచ్చుపడంగ నేర్చునె? దురాత్ములు గౌరవు లుర్వి యిత్తురే? 120

అ: ముద్దియ=అమాయకురాలా!; నేన్=నేను; కలుగన్=ఉండగా; మ్రుచ్చిరన్+ఏల= దుఃఖపడటం ఎందుకు ?; నాకు; వృక + ఉదరుండు = భీముడూ; వివ్వచ్చుఁడున్ = అర్జునుడూ; తోడు+కాఁగన్=సహాయం కాగా; జనవంద్యుడు=లోకులకు నమస్కరించదగిన వాడయిన; ధర్మ సుతుండు=ధర్మరాజు; పంపన్=ఆజ్ఞాపించగా; నీమెచ్చుగన్=నీకు సంతోషంకలిగే టట్లుగా; మేకొని= పూనుకొని; శత్రు సంక్షయము=శత్రునాశనం చేసెదన్+కాక=చేస్తాను సుమా; వేఱొకండు=మరొకటి; అచ్చుపడంగనేర్చునె=ఉచితమయిఉంటుందా?; దురాత్ములు=దుష్ట స్వభావంగల; కౌరవులు; ఉర్విన్=భూమిని; రాజ్యభాగాన్ని; ఇత్తురే=ఇస్తారా?

భా: *"అమాయకురాలా! ద్రౌపదీ! నేనుండగా నీకు దుఃఖపడవలపలసిన అవసరం ఏముంది? భీమార్జునులను సహాయంగా తీసుకొని, ధర్మరాజు ఆజ్ఞను తలతదాల్చి, నేను స్వయంగా పూనుకొని, నీకు సంతోషం కలిగే విధంగా శత్రునాశం తప్పక చేస్తాను. కౌరవుల విషయంలో ఇంతకంటే ఉచితమయింది ఇంకొకటి లేదు. ఇలా కాకపోతే దుష్టబుద్ధిగల కౌరవులు రాజ్యభాగం ఇస్తారా?*

వి: ద్రౌపది దుఃఖంలో కృష్ణునికి ఒక అమాయకురాలి ఆక్రందన వినిపించింది. అందువల్లనే నేనున్నాను నీ దుఃఖం తీర్చటానికి అంటున్నాడు. ఇంకోవిశేషం నీవు మెచ్చుకునేటట్లుగా నేను భీమార్జునుల సహాయంతో శత్రునాశనం చేస్తాను అంటున్నాడు. కాని ఆయుధం ధరించను అని కృష్ణుడు దుర్యోధనాదులకు(ఉద్యోగ.1ఆ 74ప) చెప్పాడు. అందువల్ల కృష్ణుడు భీమార్జునులతో ద్రౌపదీ శత్రువులను సంహరింపజేశాడు.

మూలంలో కూడా పద్యంలో ఉన్నట్లే ఉంది.

అహం చ తత్కరిష్యామి భీమార్జునయమైస్సహ
యుధిష్ఠిరనియోగేన దైవాచ్చ విధి నిర్మితాత్ 82-46 శ్లో

ధర్మజుని ఆజ్ఞ; విధి కల్పించే అదృష్టమూ అనేవాటితో ప్రేరితులై భీమార్జుననకుల సహదేవులతో కలిసి నేను నీకిష్టమైనదే చేస్తాను. అంటే కృష్ణుడు కర్త, పాండవులు ఆ కార్యం నిర్వహించటంలో సాధనాలు అని దీనికి అభిప్రాయం.

క: **లలనా! యుడుగుము; నీయే**
డ్పుల కొలఁదియె కురునృపాల పుత్రకళత్రం
బుల యేడ్పు; లింక వానిం
గలకల నవ్వుచు వినంగఁ గాలం బయ్యెన్. 121.

అ: లలనా=అంగనా! ద్రౌపదీ!; ఉడుగుము=(దుఃఖించటం) మానుకో; కురు నృపాల=కౌరవరాజయిన ధృతరాష్ట్రుని యొక్క; పుత్ర కళత్రంబుల= కుమారుల భార్యలయొక్క; ఏడ్పులు=ఏడుపులు; నీ యేడ్పుల కొలఁదియె= నీ దుఃఖంతో సమానమయినవే; ఇంక=ఇకమీద

వానిన్= ఆ కౌరవస్త్రీ ఏడుపులను; కలకల నవ్వుచు; వినంగన్= వినటానికి; కాలంబు= సమయం; అయ్యెన్= అయింది.

భా: ద్రౌపదీ! దుఃఖించవద్దు. ధృతరాష్ట్రుడి కోడళ్ళ ఏడుపులు నీ దుఃఖంతో సమానాలవుతాయి. ఇకమీద వాటిని నీవు కలకలనవ్వుతూ వినే సమయం దగ్గర అయింది.

క: యమమహిష ఘంటికానా
దము వినఁ గౌతూహలంబు దళుకొత్తెడు చి
త్తములు గల కౌరవుల కి
ష్టము లగునే సంధికార్యశాంత వచనముల్? 122

అ: యమ..........నాదము-యమ=యమునియొక్క; మహిష=వాహనమయిన దున్నపోతు మెడలోని; ఘంటికానాదము= గంట మ్రోత; వినన్=వినటానికి; కౌతూహలంబు= (అనుభవించనిదానిని గూర్చి) కోరిక- ఉత్సాహం; తళుకొత్తెడు=మిక్కిలిగా ప్రకాశిస్తున్న- కలుగుతున్న; చిత్తములు గల=మనస్సులు గల; కౌరవులకు; సంధి....వచనముల్- సంధికార్య= సంధి చేయటానికి సంబంధించిన; శాంతి వచనముల్; ఇష్టములు; అగునే=అవుతవా?-కావు.

భా: యమధర్మరాజు వాహనమయిన దున్నపోతు మెడలో ఉన్న ఘంటా ధ్వనులు వినవలెనని ఉబలాటపడుతున్న కౌరవులకు సంధి సంబంధమయిన శాంతివచనాలు వినటానికి ఇష్టం కలుగుతుందా?

క. మొదల విధి నియతియు న
ట్టిద యందురు పెద్ద ; లది ఘటింపకపో ; దే
మదిఁ జూచి చెప్పినను ద
ప్పదు - మేరువు దిరిగెనేనిఁ బాంచాల సుతా ! 123

అ : మొదలన్ = మొదట; విధినియతియున్= దైవ నిర్ణయం గూడా; అట్టిది+ అ= అటువంటిదే - అదే; (అని) పెద్దలు; అందురు = అంటారు. అది = ఆ దైవ నిర్ణయం; ఘటింపక పోదు = కలుగజేయకుండా పోదు. ఏన్ = నేను; మదిన్ = మనస్సులో; చూచి =బాగా పరిశీలించి; చెప్పినను =చెప్పినట్లైతే; చెప్పితే; పాంచాల సుతా = ద్రుపదుని కుమార్తె - ద్రౌపదీ!; (అది)మేరువు= మేరు పర్వతం; తిరిగెనేని = తలక్రిందులైనా; తప్పదు = జరగకపోదు.

భా : అసలు దైవ నిర్ణయం గూడా అలాగే ఉందని పెద్దలంటారు. ఆ దైవం దాన్ని తప్పక సమకూరుస్తుంది. నేను మనస్సుతో బాగా పరిశీలించి చెప్పినమాట. మేరువు తలక్రిందయినా జరగక తప్పదు.

తే. పూని పలికెద వినుము; రిపుక్షయంబుఁ
జేసి; యుజ్జ్వల పుణ్యలక్ష్మీసమేతు
లైన పాండు కుమారుల యధికవిభవ
మీవు సూచెదు; తడవులే దిది నిజంబు." 124

అ: పూని=నొక్కి - గట్టిగా - ప్రతిజ్ఞ చేసి; పలికెదన్=చెపుతున్నాను; వినుము; రిపుక్షయంబున్= శత్రునాశాన్ని చేసి; ఉజ్జ్వల..... సమేతులు- ఉజ్జ్వల= ప్రకాశవంతమయిన; పుణ్యలక్ష్మీ= పుణ్యం అనే సంపదతో; సమేతులు + ఐన = కూడిన వారైన; పాండుకుమారులు= పాండవుల యొక్క; అధికవిభవము = గొప్పదయిన వైభవాన్ని; ఈవు = నీవు; చూచెదు = చూస్తావు; తడవు= ఆలస్యం; లేదు; ఇది = ఈ నా మాట; నిజంబు.

భా : *ద్రౌపదీ ! నేను నొక్కి చెపుతున్నాను; జాగ్రత్తగా విను. శత్రువులను నాశనం చేసి: ప్రకాశవంతమయిన పుణ్య సంపదతో గూడిన పాండవుల మహా వైభవాన్ని నీవే చూస్తావు. దానికి ఎంతో ఆలస్యం లేదు. ఇది నిజం."*

క : **అని యూఱడిలఁగఁ బలికిన**
విని; యంకిలి దేఱు చిత్తవృత్తి గలుగు నం
గన యేడ్పుడిగెం; దగ ఫ
ల్గునుఁ డిట్లని పలికె నపుడు గోవిందునితోన్. 125

అ : అని; ఊఱడిలఁగన్ = ఉపశమించేటట్లు; పలికినన్ = మాటాడగా; విని; అంకిలిదేఱు= క్షోభ నుంచి-కలతనుంచి; -తేరుకున్న; చిత్తవృత్తి=మనో వ్యాపారం; కలుగు; అంగన= ద్రౌపది; ఏడ్పు + ఉడిగెన్ =దుఃఖించటం మానినది; అపుడు; ఫల్గునుఁడు= అర్జునుడు; గోవిందునితోన్ = శ్రీ కృష్ణునితో; తగన్ = సముచితంగా; ఇట్లు = ఇలా; అని; పలికెన్.

భా : *అని కృష్ణుడు శాంతించేటట్లు పలికిన మాటలు విని ద్రౌపది సహజంగా కలత నించి తేరుకునే మనస్సు గలది కాబట్టి దుఃఖించటం మానినది. అప్పుడు అర్జునుడు కృష్ణునితో ఇలా అన్నాడు.*

తే : **" పాండవులు ధార్తరాష్ట్రులుఁ బుండరీక**
నేత్ర! చుట్టరికంబున నీకు నొక్క
రూప; కావున గోరి యే రూపు నందు
నుభయపక్షంబులకుఁ జేయు ముచిత హితము. 126

అ : పుండరీకనేత్ర=పద్మాలవంటి కన్నులు గలవాడా-కృష్ణా!; పాండవులు;ధార్తరాష్ట్రులు = కౌరవులు; చుట్టరికంబునన్=బాంధవ్యంలో; నీకున్; ఒక్కరూపు=ఒకటేను.; కావునన్ = కాబట్టి; కోరి = కావలెనని; ఏరూపునందున్ = ఏ విధంగానయినా; ఉభయపక్షంబులకున్ = రెండువైపులవారికీ; ఉచితహితము = తగినమేలును; చేయుము.

భా : *"కృష్ణా! బాంధవ్యం ప్రకారం నీకు పాండవులూ, కౌరవులూ సమానమే. కాబట్టి నీవు కోరి ఏ విధంగా నయినా రెండుపక్షాల వారికీ తగిన మేలు చేయగోరుతాను.*

క. **ధర్మార్థ సంగతంబుగ**
ధర్మతనయు చెప్పినట్ల తగఁ బల్కఁగ; నా
దుర్మతులు కౌరవులు స
త్కర్మమునకుఁ జొరక యున్న దైవమ యెఱుఁగున్." 127

అ : ధర్మ+అర్థసంగతంబుగన్ = ధర్మమూ, అర్థమూ అనురెండింటితోటీ కూడేటట్లూ; ధర్మతనయు చెప్పినట్లు+అ = ధర్మరాజు చెప్పినట్లుగానే; తగన్ = తగినట్లుగా; పల్కఁగన్= మాట్లాడగా; ఆ దుర్మతులు = చెడుబుద్ధిగల ఆ కౌరవులు; సత్కర్మమునకున్ = మంచిపనికి; చొరక+ఉన్నన్ = పూనుకొనకపోతే; (వాళ్ళగతి) దైవము+అ = దేవుడే; ఎఱుఁగున్.

భా : *ధర్మమూ, అర్థమూ అనేరెండూ కలిసి ఉండే విధంగానూ, ధర్మరాజు చెప్పినట్లూ, న్యాయంగా నీవు కౌరవసభలో మాట్లాడినా దుర్మార్గులైన ఆ కౌరవులు మంచిపని చేయటానికి సుముఖులు కాకపోతే; వారిభవిష్యత్తు ఇంక ఆదైవానికే తెలియాలి."*

క. **అన విని "కౌరవులకు మీ**
కును హితముఁబ్రియంబు (జేయఁ గోరియ; కుంతీ
తనయాగ్రజుపని ధృతరా
ష్ట్రుని కడకుం బోయెదను గడుం బ్రీతి మెయిన్". 128

అ : అనన్ = అనగా; విని; కౌరవులకున్; మీకును; హితమున్ = మేలునూ; ప్రియంబున్=ఇష్టాన్నీ; చేయన్+కోరి+అ=చేయాలి అనే; కుంతీ తనయ+అగ్రజు= ధర్మరాజు యొక్క; పనిన్ = పనితో-పనిమీద; కడున్ = మిక్కిలి; ప్రీతిమెయిన్ = సంతోషంతో; ధృరాష్ట్రునికడకున్= ధృతరాష్ట్రుని వద్దకు; పోయెదను.

భా : *ఆమాటలు విని కృష్ణుడు ఇలా అన్నాడు. "కౌరవులకూ, మీకూ మేలునూ, ఇష్టాన్నీ చేయాలి అనే నేను ధర్మరాజు పనిమీద సంతోషంగా ధృతరాష్ట్రుని వద్దకు వెళ్తాను.'*

క. **అని పలికిన హరి ధర్మవ**
చనముల తెఱఁగున కజాతశత్రుఁడు చిత్తం
బునఁ బొంగి "యట్ల చేయుము
మన నిశ్చయ మిదియ; దీని మఱవకు మనఘా!" 129

అ : అని; పలికినన్ = అనగా; హరి = కృష్ణునియొక్క; ధర్మవచనముల = ధర్మంతో గూడిన మాటలయొక్క; తెఱఁగునకు = రీతికి; అజాతశత్రుడు = ధర్మరాజు; చిత్తంబునన్ = మనస్సులో; పొంగి = సంతోషించి; అనఘా = పాపములేనివాడా!-కృష్ణా!; అట్లు+అ = అలాగే; చేయుము; ఇది+అ = ఇదే; మన నిశ్చయము = మన నిర్ణయము; దీనిన్ = ఈ విషయాన్ని; మఱవకుము = మరచిపోవద్దు.

భా : *ఇలా అన్నటువంటి కృష్ణుని ధర్మవచనాలరీతికి-ధర్మవచనాలలో ఉన్న సంధిసూచక భావాలకు ధర్మరాజు మనస్సులో సంతోషంతో పొంగిపోయి "కృష్ణా! అలాగేచేయి. ఇదేమన నిశ్చయం. దీన్నిమాత్రం మరవవద్దు."*

వ : **అని కార్యంబు నిశ్చయించి దినశుద్ధి నిరూపించి నారాయణుం జూచి; "నీ నక్షత్రంబు రోహిణిగదా! యెల్లి రేవతి నీకుఁ జంద్ర తారాబలంబులు గలవు; గమనంబునకు రేప కడయ మేలు; పయనంబగుట లెస్స." యని చెప్పిన; నప్పలుకుల**

కతండు సగౌరవంబుగా నియ్య కొనినం, బాండవాగ్రజుండు గొలువుం గలయం గనుంగొని యెల్ల వారును విన నది యట్ల కాక యని పలికి, తదనంతరంబ తానునుం దమ్ములుఁ బాంచాలియుఁ బరివారంబును నుచితప్రకారంబున నిజనివాసంబులకుం జనిరి; మఱునాఁ డరుణోదయంబునఁ గృష్ణుండు గాలోచిత కృత్యంబులు నిర్వర్తించి, సూర్యోపాస్తి సేసి యగ్నిసమారాధనం బాచరించి; ధరణిసురులం బ్రణామ పూర్వకంబుగాఁ బ్రయాణ దాన ప్రముఖ పూజావిశేషంబులం బ్రీతులం గావించి వారల యిచ్చు నాశీర్వాదంబులును సమంత్రాక్షత దూర్వాంకురాదులునుం గైకొని, యుచిత ప్రదేశంబున నుండి సాత్యకి రావించి. 130

అ : కార్యంబు=చేయతగినది; దినశుద్ధిన్ = మంచిరోజును; నిరూపించి = నిర్ణయించి; నీ నక్షత్రంబు=నీవుపుట్టిన నక్షత్రం; ఎల్లి = రేపు; రేవతి = రేవతి అనే నక్షత్రం; చంద్రతారాబలంబులు = చంద్రబలం; తారాబలం; గమనంబునకు = ప్రయాణానికి; రేపకడయ=ఉదయకాలమే; మేలు= మంచిది; పయనంబు=ప్రయాణం; లెస్స=మంచిది. ఆ+పలుకులకు=ఆమాటలకు; సగౌరవంబుగాన్= గౌరవంతో; ఇయ్యకొనినన్=అంగీకరించగా; పాండవ+అగ్రజుండు= పాండవులలో మొదట పుట్టినవాడు-ధర్మరాజు;కొలువున్=సభను; కలయన్+కనుంగొని = కలయ జూచి; ఎల్లవారును =అందరూ; అది=ఆపని; అట్లు+ఆ =అలాగే; కాక= కావాలి; తదనంతరంబు+ అ=వెంటనే; పాంచాలియున్=ద్రౌపది; ఉచితప్రకారంబునన్=తగిన విధంగా; అరుణో- దయంబునన్= తెల్లవారేసమయంలో; కాల+ఉచితకృత్యంబులు=అకాలంలో తగిన చేయవలసిన పనులు; నిర్వర్తించి=చేసి; సూర్య+ఉపాస్తి = సూర్యోపాసన (సంధ్యా వందనం); అగ్ని సమారాధనంబు=అగ్నిపూజ-హోమము; ధరణిసురులన్ =బ్రహ్మణులను; ప్రణామపూర్వకంబుగా= ముందునమస్కారంచేసి; ప్రయాణదాన=ప్రయాణసమయంలో దానమూ; ప్రముఖ= మొదలయిన; పూజా విశేషంబులన్= విశిష్టాలయిన పూజలతో; ప్రీతులన్= సంతోషించిన వారిని; కావించి=చేసి; సమంత్ర=మంత్రపూర్వకమయిన; అక్షత=అక్షింతలు; దూర్వా+ అంకుర+ ఆదులు= గడ్డి మొలకలు మొదలయినవి; కైకొని = గ్రహించి; ఉచితప్రదేశంబునన్= తగినచోటు; రావించి= పిలిపించి;

భా : *అని పలికి ధర్మరాజు మంచిరోజు నిర్ణయించాడు. తరువాత కృష్ణుని చూసి "నీ నక్షత్రం రోహిణిగదా! రేపు రేవతీనక్షత్రం. నీకు చంద్రబలం తారాబలం సరిపోతుంది. కాబట్టి ప్రయాణానికి ఉదయమే మంచిది. అప్పుడు వెళ్ళటమే ఉచితం." అని చెప్పాడు. కృష్ణుడు ఆ మాటలకు సగౌరవంగా తన అంగీకారం తెలిపాడు; అప్పుడు ధర్మరాజు సభనంతా కలయచూచి అందరూ వినేటట్లుగా "ఇది ఇంతే కదా! "అని అన్నాడు. తరువాత తానూ; తమ్ములూ, ద్రౌపదీ; పరివారమూ తమతమ బసలకు వెళ్ళారు. మర్నాడు అరుణోదయ సమయంలో కృష్ణుడు కాలకృత్యాదులన్నీ తీర్చుకున్నాడు. సూర్యోపాసన చేశాడు. ప్రాతఃకాలంలో చేయవలసిన హోమం చేశాడు. బ్రాహ్మణులకు ప్రయాణకాలంలో చేయవలసిన దానాలూ, ఇతరవిధాలయిన పూజలూ చేశాడు. వారి ఆశీర్వాదాలనూ,*

మంత్రాక్షలతో గూడిన గరిక మొదలయిన వాటిని తీసుకున్నాడు. తగినచోట ఉండి కృష్ణుడు సాత్యకిని పిలిపించాడు.

వి : "శుక్లేపక్షే శీతరశ్మి ర్బలీయాన్ "శుక్లపక్షంలో చంద్రుడు బలవంతుడు. అని రత్నమాలా వచనం. శ్రీకృష్ణుడు బయలు దేరింది శుక్ల పక్షం కాబట్టి చంద్రబలం ఉన్నది. రేవతి నక్షత్రం ప్రయాణానికి శుభకరం. కృష్ణుని జన్మ నక్షత్రమయిన రోహిణికి రేవతి సాధనతార. కాబట్టి తారాబలం సరిపోతుంది. సాధన తారకు చంద్రుడు అధిపతి. అందువల్ల కృష్ణునికి ప్రయాణ సమయంలో చంద్రతారాబలం అనుకూలం.

క. "మన ప్రజలోఁ గరిపురికిం
జనుదేరఁగ వలయువారి సవరణతో రం
డని యేర్పడ నియమింపు. ప
యనమై యేతెమ్ము నీవు " నని తగ మఱియున్. 131

అ : మనప్రజలోన్ = మనజనంలో- మనవారిలో; కరిపురికిన్ = హస్తినాపురానికి; చనుదేరఁగన్ = రావటానికి; వలయువారిన్ = అవసరమయినవారిని; సవరణతో = సన్నాహంతో రండు; అని; ఏర్పడన్ = స్పష్టంగా; నియమింపు = నిర్ణయించు; నీవున్ = నీవుకూడా; పయనమై= ప్రయాణమై; ఏతెమ్ము = రావలసింది. అని; తగన్ = యుక్తంగా (పలికి); మఱియున్ = ఇంకా- ఇలాఅన్నాడు.

భా : "మనవాళ్ళలో హస్తినాపురానికి రావలసిన వారిని తగిన సన్నాహంతో రావలసింది అని స్పష్టంగా నిర్ణయించు. నీవుకూడా ప్రయాణమై రావలసింది." అని చెప్పి ఇంకా ఇలా అన్నాడు.

వ. "దుర్యోధనుండు దుష్టాత్మకుండతని మన్నించు మానుసులునుం గుటిలబుద్ధులు గావునఁ జక్రగదాద్యాయుధంబులు రథంబునం బెట్టింపవలయు" నని చెప్పి పనిచి, సమయజ్ఞతం బొడసూపి నిలుచున్న దారుకుం జూచి తేరు పూన్ప నియోగించిన, నతండును మణిగణప్రభాపటల జటిలంబగు నరదంబు వన్ని, శైబ్యసుగ్రీవ మేఘపుష్ప వలాహకంబు లనం బరగు తురంగంబులం బూన్చి, గరుడధ్వజం బెత్తి తెచ్చినం, దానునుం బయనంపుఁ జందంబునఁ గట్టాయితం బై, జనంబుల చూడ్కులకుం బండువగుచుఁ బుండరీకాక్షుండు మంగలతూర్యంబులు సెలంగఁ జామరంబు లుల్లసిల్ల రథం బెక్కిన యవసరంబున, యాదవపరివారంబుతో నరుగుదెంచిన సాత్యకిం దన రథం బెక్కించుకొని యాంగికంబులైన శుభసూచంబులు గైకొనుచుఁ బూర్ణకలశ వృషభాది భద్రపదార్థంబుల నవలోకించుచుఁ బుణ్యాంగనలు సేసలొలుకఁ జిత్తంబు ప్రసన్నతం బొంద వెడలు నప్పుడు. 132

అ : దుష్ట+ఆత్మకుండు = చెడు మనస్సుగలవాడు; మన్నించు = గౌరవించే; మానసులునున్= మనుష్యులు గూడా: కుటిల బుద్ధులు = వంకరగా నడిచే బుద్ధిగలవారు;

పనిచి = నియమించి; సమయజ్ఞతన్ = సమయం తెలిసి; పొడసూపి=కనిపించి; ...యు=రథం; పూన్పన్=సిద్ధం చేయటానికి-(గుర్రాలను)కట్టటానికి; మణిగణ = మణుల సమూహం యొక్క; ప్రభాపటల = కాంతి సమూహంచేత; జటిలంబు+అగు =పెనవేసుకున్నదయిన; అరదంబు=రథం; పన్ని = సిద్ధంచేసి; గరుడధ్వజంబు =గరుత్మంతునిబొమ్మ ఉన్నజెండా; పయనము+చందంబునన్= ప్రయాణానికి తగిన విధంగా; కడు+అయితంబు+ఐ = మిక్కిలి బాగా సిద్ధమై; చూడ్కులకున్+ పండువు+అగుచు = కన్నుల పండుగ అవుతూ; పుండరీక+అక్షుఁడు = పద్మాలవంటి కన్నులు కలవాడు; మంగళతూర్యంబులు = మంగళవాద్యాలు; చెలంగన్ = మ్రోగగా; చామరంబులు= వింజామరలు; ఉల్లసిల్లన్ = ప్రకాశింపగా; అరుగుదెంచిన = వచ్చిన; ఆంగికంబులు = తన శరీరావయవాలకు సంబంధించిన; శుభసూచకంబులు = మంగళాన్నితెలిపేవాటిని (శకునాలను); కైకొనుచు = గ్రహిస్తూ; పూర్ణకలశ = పూర్ణకుంభం; వృషభ+అది = ఎద్దులు మొదలయిన; భద్ర పదార్థంబులన్ మంగళకరమయిన పదార్థాలను; అవలోకించుచు = చూస్తూ; పుణ్య+అంగనలు= ముత్తైదువలు; సేసలు = అక్షతలు; ఒలుకన్= చల్లగా; వెడలునప్పుడు = వెళ్ళేటప్పుడు.

భా : *"దుర్యోధనుడు దుర్బుద్ధి; అతని గౌరవించేవారు కూడా వక్రబుద్ధులు. కాబట్టి చక్రం గద మొదలైన ఆయుధాలను రథం మీదపెట్టించు" అని ఆజ్ఞాపించి; సమయం తెలుసుకొని ఎదురు గావచ్చి నిలుచున్న దారుకుని (సారథిని) చూచి కృష్ణుడు రథం సిద్ధం చేయమని ఆజ్ఞాపించాడు. ఆ దారుకుడు మణిగణకాంతులతో వెలుగుతున్న రథాన్ని సిద్ధంచేసి దానికి శైబ్యమూ, సుగ్రీవమూ, మేఘపుష్పమూ, వలాహకమూ అనే నాలుగు గుర్రాలను కట్టాడు. దానిపైన గరుడధ్వజాన్ని నిలబెట్టాడు. అప్పుడు ప్రయాణానికి తగిన విధంగా సిద్ధమయినాడు. మంగళవాద్యాలు మ్రోగుతుండగా వింజామరాలు ప్రకాశిస్తుండగా; కృష్ణుడు జనులకు కన్నులపండగగా రథం ఎక్కాడు. ఇంతలో యాదవ పరివారంతో సాత్యకి అక్కడికి వచ్చాడు. కృష్ణుడు అతనిని తనరథం మీద ఎక్కించు కున్నాడు. కుడికన్ను అదరటం వంటి శుభశకునాలు (అంగికాలు) కృష్ణునికి కలిగాయి. పూర్ణకుంభం, వృషభం మొదలయిన మంగళపదార్థాలు ఎదురుగా వస్తుంటే వాటిని ఆయన చూశాడు. ముత్తైదువులు శుభాక్షతలను ఆయనమీద చల్లుతున్నారు. ప్రసన్నమయిన మనస్సుతో కృష్ణుడు బయలు దేరే టప్పుడు.*

వి : 'కార్తీక మాసంలో రేవతీనక్షత్రంలో మైత్రమనే ముహూర్తం వచ్చిన తరువాత కృష్ణుడు ప్రయాణం ప్రారంభించాడు. అప్పుడు శరదృతువు అంతమై హేమంతఋతువు ఆరంభమవుతున్నది. అప్పుడు అన్ని వైపులా పచ్చనిపంటలతో పొలాలు కళకళలాడుతున్నాయి.' అని సం భారతం. 83 అధ్యా. 6;7; శ్లో.

సీ. పాండవ యాదవ పాంచాల కేకయ
పాండ్య మాత్స్యాదులు భద్రదంతి
హయరథంబుల తోడ నతికుతూహలమున
వచ్చినఁ గనుఁగొని, వారి నెల్ల

సంభావనంబుల సంభాషణంబుల
నాదరించుచుఁ దగ నల్ల నల్ల
విభవంబు మెఱయంగ విడిదల పఱ పెల్లఁ
గడచిన యత్తఱిఁగరము శుభము
ఆ. లైన శకునములకు నందఱుఁ బ్రియమంద
నరుగుచున్న యట్టి యవసరమున;
రథము రథముఁ గదియ రానిచ్చి ధర్మనం
దనుఁడు నెమ్మి నిట్టు లనియె హరికి. 133

అ : పాండవ యాదవ పాంచాల కేకయ పాండ్యమాత్స్య+ఆదులు; భద్రదంతి = భద్రజాతి యేనుగులు; హయ=గుఱ్ఱాలు; రథంబులతోడన్; అతికుతూహలమునన్ = మిక్కిలి ఆసక్తితో-సంతోషంతో; వచ్చినన్; కనుగొని =చూచి; వారిన్; ఎల్లన్ = అందరినీ; సంభావనంబులన్= గౌరవించటాలతోనూ; సంభాషణంబులన్ = మాటలాడటంతోనూ; ఆదరించుచున్; తగన్ = తగినవిధంగా; అల్లనల్లన్ = మెల్లమెల్లగా; విభవంబు = వైభవం; మెఱయంగన్ = ప్రకాశించగా-స్పష్టంకాగా; విడిదల పఱపు+ఎల్లన్ = సేనలు విడిసిన ప్రదేశాల వైశాల్యాన్ని అంతటినీ; కడచిన= దాటిన; ఆ+తఱిన్ = ఆ సమయంలో; కరము = మిక్కిలి; శుభములు+ఐన శకునములకున్; అందఱున్; ప్రియము+అందన్= సంతోషపడగా; అరుగుచున్న అట్టి+అవసరమునన్ = వెళ్ళుతున్నటువంటి సమయంలో; రథము; రథమున్; కదియరాన్ఇచ్చి = సమీపించేటట్టుగాచేసి; ధర్మనందనుఁడు = ధర్మరాజు; హరికిన్ = కృష్ణునితో; నెమ్మిన్ = ప్రీతితో-నెమ్మదిగా; ఇట్టులు+ అనియె = ఇలా అన్నాడు.

భా : *పాండవులు, యాదవులు;పాంచాలురు, కేకయులు, పాండ్యులు; మత్స్యదేశీయులు, మొదలయినవారు; భద్రజాతియేనుగులు, గుఱ్ఱాలు, రథాలతో మహోత్సాహంగా వచ్చారు. వారిని చూచి కృష్ణుడు గౌరవంతోనూ, సంభాషణలతోనూ ఆదరిస్తూ మహావైభవంతో సేనా సన్నివేశాల వైశాల్యాన్ని అంతటినీ మెల్లమెల్లగా దాటివెళ్ళుతున్నాడు. అప్పుడు చాలా మంచిశకునాలు కలిగాయి. వాటికి అందరూ సంతోషిస్తూ వెళ్ళుతున్న సమయంలో ధర్మరాజు కృష్ణుని రథానికి దగ్గరగా తనరథం పోనిచ్చి ప్రీతితో నెమ్మదిగా ఆయనతో ఇలా అన్నాడు.*

ఉ. "వచ్చె జనార్దనుం డనిన వార్తకుఁ బ్రాణము మేని కంతకున్
వచ్చిన సేఁదఁ దేఱుఁ గురువంశపవిత్రచరిత్ర గొంతి; నీ
వచ్చుటి కేఁగి పాండవుల యందఱిమాఱని చెప్పి మ్రొక్కుచున్
గ్రుచ్చియ కౌఁగలించుకొని కుందిన చిత్తము నొప్పి దీర్పుమీ. 134

అ : కురువంశ పవిత్ర చరిత్ర = కురువంశాన్నే పవిత్రం చేసే శీలంగల; గొంతి = కుంతీదేవి; జనార్దనుండు= కృష్ణుడు; వచ్చెన్ = వచ్చాడు; అనిన = అన్న; వార్తకున్= సమాచారానికి-(సమాచారాన్ని వినగానే); మేనికి+అంతకున్=శరీరానికి అంతటికీ; ప్రాణము=జీవం;

వచ్చినన్=రాగా; సేదదేఱున్ = కోలు కొంటుది; నీవు; అచ్చటికి = ఆహస్తినాపురానికి; ఏగి = వెళ్ళి; పాండవుల+ అందఱిమాఱు=పాండవులు అందరికీ బదులుగా (పాండవులూ; నేనూ అందఱము+ఆఱు= ఆరుగురం)అని; చెప్పి; మ్రొక్కుచున్=నమస్కరిస్తూ; గ్రుచ్చియు కౌఁగలించుకొని=గాఢంగా కౌగలించుకొని; కుందిన=దుఃఖించిన; చిత్తము నొప్పిన్=మనస్సులోని బాధను; తీర్పువిూ =పోగొట్టుమా.

భా : *"కృష్ణా! కురువంశాన్నే పవిత్రం చేసిన శీలంకలది మాతల్లి కుంతీదేవి. ఆమె కృష్ణుడు వచ్చాడు అనే మాటకే శరీరం అంతటికీ ప్రాణం వచ్చి నట్లుగా కోలుకుంటుంది. నీవు హస్తినాపురానికి వెళ్ళి పాండవులు అందరికీ బదులుగా నమస్కరిస్తున్నాను అని చెప్పి ఆమెకు నమస్కారం చేయవలసింది.(నాతోగూడా పాండవులారుగురి నమస్కారాలు అని ఆమెకు నమస్కరించు) ఆమెను కౌగిలించుకొని దుఃఖపూర్ణమయిన ఆమె మనస్సులో ఉన్నబాధను పోగొట్టవలసింది.*

చ. **అడవికి నేఁగునాఁడు మము నంపఁగ నెంతయు దవ్వు వచ్చిన**
ప్పుడు, దనమోము దైన్యమునఁ బొందెడు నశ్రులుఁ జూచి చూచి య
ట్లొడఁ బడి డించి పోవలసె; నుమ్మలికమ్మున గొంతి యింతకుం
బడు గయి, పాలలోఁ బడిన బల్లి విధంబున నుండ కుండునే. **135**

అ : కుంతీదేవి; అడవికిన్; ఏగునాఁడు=వెళ్ళేరోజు; మమున్ అంపఁగన్ = పంపించటానికి; ఎంతయున్=చాలా; దవ్వు=దూరం; వచ్చినప్పుడు; తనమోము=ఆమె ముఖం; దైన్యమున్ = దీనత్వంవల్ల; పొందెడున్; అశ్రులున్ = కన్నీటిని; చూచి; చూచి; అట్లు = ఆస్థితికి; ఒడఁబడి = అంగీకరించి; (ఆమెను) డించిపోవలసెన్ = విడిచిపెట్టి వెల్ళవలసి వచ్చింది. గొంతి= కుంతీదేవి; ఉమ్మలికమ్మునన్= దుఃఖంతో-కష్టంతో; పాలలోన్; పడిన; బల్లివిధంబునన్ = బల్లివలె; ఉండకుండునే.

భా : *మాతల్లి కుంతీదేవి మేము అడవికి వెళ్ళేటప్పుడు మమ్ములను పంపించటానికి చాలా దూరం వచ్చింది. అప్పుడు ఆమె ముఖంలో దుఃఖంవల్ల కనిపించే కన్నీటిని బాగా చూసి కూడా అప్పటి పరిస్థితిని బట్టి ఆమెను హస్తినాపురంలో ఉంచి వెళ్ళవలసివచ్చింది. దుఃఖభారంతో ఆమె ఇప్పటికి చాలా చిక్కిపోయి పాలల్లో పడిన బల్లివలె చాలా దీన దశలో ఉండిఉంటుంది!*

క. **లక్కయిలు గాలినది మొద**
లక్కట! మాతల్లి మాకునై నెవ్వగతోఁ
బెక్కిడుమలఁ బడుచున్నది
దిక్కెవ్వరు లేనియట్లు దీనత్వమునన్. **136**

అ : అక్కట=అయ్యో!; మాతల్లి; లక్కయిలు=లక్క ఇల్లు; కాలినదిమొదలు= కాలినప్పటి నుంచి; మాకునై = మాకోసం; నెఱ+వగతో=మిక్కిలి దుఃఖంతో; ఎవ్వరు=ఎవరూ;దిక్కు; లేని; అట్లు; దీనత్వమునన్ = దైన్యంతో; పెక్కు = చాలా; ఇడుమలన్ = కష్టాలను-బాధలను; పడుచున్నది.

భా : వారణావతంలో లాక్షాగృహదహనంనుండీ - లక్కయిల్లుకాలినప్పటినించీ- మాకోసమని మహాదుఃఖంతో దిక్కులేని దానివలె దైన్యంతో చాలా కష్టాలు పడుతున్నది.

క. ఏ ననుట గాఁగ; 'దుఃఖము
లైనవి దెగుసమయ మయ్యె' నని చెప్పుము; మీ
మేనత్త నూఱడింపుము;
దా నెప్పుడు నీవుగలవు తన కనుచుండున్." 137

అ : ఏను = నేను; అనుట+కాఁగ = అన్నట్లుగా; దుఃఖములు+ఐనవి = దుఃఖాలను కలిగించిన కష్టాలు; తెగుసమయము = పోయే-నశించే సమయమయింది; అని; చెప్పుము; మీమేనత్తను; ఊఱడింపుము = ఓదార్చు; తాను = ఆమె; ఎప్పుడున్; తనకు; నీవు; కలవు = ఉన్నావు; అనుచుండున్ = అని అంటూ ఉంటుంది.

భా : "అమ్మా! మనకు బాధాకరాలయిన కష్టాలు తొలగిపోయే సమయం వచ్చింది." అని నేను అన్నట్లుగా చెప్పు. మీ మేనత్తకు ధైర్యం కలిగించు 'శ్రీకృష్ణుడు నాకు ఉన్నాడు.' అని ఆమె ఎప్పుడూ అంటూ ఉంటుంది."

వ. అని చెప్పి వెండియు. 138

భా : అని చెప్పి ఇంకా ఇలా అన్నాడు ధర్మరాజు.

ఆ. "గురుఁడు బాహ్లికాది కురువృద్ధులును సుహృ
ద్బాంధవులు నశేష ధరణి పతులుఁ
బ్రీతిఁ బొంద; నెవ్వరికి నేది దగుఁ-బ్రణా
మాదివిధుల నడపు నాదు పలుకు. 139

అః గురుఁడు = ద్రోణాచార్యుడు; బాహ్లిక+ఆది = బాహ్లికుడుమొదలయిన; కురువృద్ధులును = కౌరవులలో పెద్దలూ; సుహృత్+బాంధవులున్ = మిత్రులూ చుట్టాలూ; అశేషధరణిపతులున్ = సమస్తరాజులూ; ప్రీతిన్ = సంతోషాన్ని; పొందన్; ప్రణామ+ఆది విధులన్= నమస్కారాలు మొదలయిన పద్ధతులలో; ఎవ్వరికి; ఏది; తగున్=తగునో; (దానిని) నాదుపలుకు= నామాటగా; నడపు = ప్రవర్తింప జేయవలసింది.

భా : "ద్రోణుడూ, బాహ్లికుడు మొదలైన కౌరవులలో పెద్దలూ, మిత్రులూ, చుట్టాలూ; సమస్తమయిన రాజులూ సంతోషించే విధంగా నమస్కారాలు మొదలయిన వాటిలో ఎవరి విషయంలో ఏదిసముచితమో దానిని నామాటగా అక్కడ నడపవలసింది.

క. పరమప్రియమున నాకై
పరిరంభణసేసి గాఢబాంధవ సాంద్రా
దరమున సంభావింపు వి
దురుతో మధ్యస్థుఁ డగు హితుం డతఁ డనఘా! 140

అ : అనఘా = పవిత్రుడా!; నాకై = నాకుమారుగా; పరమప్రియమునన్ =

మిక్కలిప్రీతితో; (విదురుని) పరిరంభణ+చేసి = ఆలింగనంచేసి; గాఢసాంద్ర+ఆదరమునన్ = దట్టమయిన ఆదరంతో; విదురుతోన్; (మాట్లాడి) సంభావింపు = గౌరవించు; అతఁడు = ఆవిదురుడు; మధ్యస్థుఁడు+అగు = మధ్యస్థుడయిన; హితుఁడు = మేలుకోరేవాడు.

భా : కృష్ణా ! నీవు నాకు మారుగా విదురుని మిక్కిలి ప్రీతితో కౌగలించుకొని దృఢమయిన బాంధవ్యం వల్ల కలిగిన ఆదరంతో ఆయనతో మాట్లాడి గౌరవించు. మాకు కౌరవులకు మధ్యస్థుడయి మేలు కోరేవా డాయన."

వ. **అనియెఁ దదనంతరంబ యర్జునుండు.** 141

భా : అని ధర్మరాజు అన్నాడు. తరువాత అర్జునుడు ఇలా అన్నాడు.

చ. **"జనులు వినంగ రాజ్యమున సాము గొనం గలవార మన్న యీ**
జనపతి కార్యనిశ్చయము సమ్మతి గైకొని చేసినన్ సుయో
ధనుఁడును దమ్ములున్ సఖులు దానికి నేమును నియ్యకొందు; మొం
డనిన సపుత్ర మిత్రముగ నద్దెస నందఱ గ్రొచ్చి పాఁతుదున్" 142

అ : రాజ్యమునన్=రాజ్యంలో: సాము = సగం; కొనంగలవారము = తీసుకుంటాము; (అని); అన్న = అనిన; ఈ జనపతి = ఈరాజుయొక్క; కార్యనిశ్చయము = కర్తవ్య నిర్ణయాన్ని-తీర్మానాన్ని; జనులు=కౌరవసభలోనివారు; వినంగన్=వినగా; సుయోధనుఁడును= దుర్యోధనుడూ; తమ్ములున్ = సోదరులూ; సఖులున్ = మిత్రులూ; సమ్మతిన్ = అంగీకారంతో; కైకొని =స్వీకరించి; చేసినన్=చేస్తే; దానికిన్=ఆ నిర్ణయానికి; ఏమును = మేము గూడా; ఇయ్యకొందుము = అంగీకరిస్తాము; ఒండు = పై నిర్ణయాని కంటె ఇతరమయినది-మరొకటి; అనినన్ = అంటే; ఆ+దెసన్ = ఆకౌరవపక్షంలో ఉన్న; అందఱన్ = అందరినీ; సపుత్రమిత్రము గన్ = కుమారులు మిత్రులతో గూడా; గ్రొచ్చి పాతుదున్ = గుంటతీసి పాతిపెడతాను; తవ్వి పాతేస్తాను.

భా : 'రాజ్యంలో అర్ధభాగం స్వీకరిస్తాం' అని ఈ ధర్మరాజు నిర్ణయాన్ని కౌరవ సభామధ్యంలో సమస్తజనులు వింటుండగా దుర్యోధనుడూ అతని తమ్ములూ; మిత్రులూ అంగీకరించి అలా చేస్తే దానికి మేము కూడా ఒప్పుకుంటాము. దీనికి భిన్నంగా మాట్లాడితే ఆ పక్షంవారిని పుత్రమిత్రులతో కలిపి గోతిలో పూడ్చిపెడతాను."

వి. "గ్రొచ్చి పాఁతుదున్" అనటంలో అర్జునుని క్రోధావేశం వ్యక్తమవుతుంది. దీనికి మూలం ఇలా ఉంది.

"కృష్ణా! మనంఇంతకు ముందు జరిపిన రహస్య సమావేశంలో ఒక నిశ్చయాభిప్రాయానికి వచ్చాము. అందులో మేము అర్ధరాజ్యం తీసుకొనే సంధి చేయాలని నిర్ణయించాము. దుర్యోధనుడు లోభం వదలి సాదరంగా అర్ధరాజ్యం ఇస్తే నాకు సంతోషం. అందువల్ల సమస్త కౌరవులకు పెద్ద గండం తప్పుతుంది. అతడు ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తే అతని పక్షంలో వచ్చే సర్వక్షత్రియులను నాశనం చేస్తాను." అధ్యా. 83. 51;52;53 శ్లో.

మ. **అనినన్ మెచ్చి వృకోదరుం "డితఁడు కార్యం బింత దెల్లంబుగాఁ**
బొనరం బల్కునె" యంచుఁ బేరెలుఁగు సొంపుం బొంద;వక్రంబు పో

ల్పున దర్పం బొలయంగ; నంగములునుం బొంగార; నుద్భృంహిత
ధ్వనియై పొల్చు మహోగ్రసింధురము చందం బొంది యొప్పెంగడున్.143

అ : అనినన్ = అని అనగా; వృకోదరుండు=భీముడు; మెచ్చి =మెచ్చుకొని; ఇతండు= ఈ అర్జునుడు; కార్యంబు = చేయవలసినపనిని; ఇంత+తెల్లంబుగాన్ = ఇంతస్పష్టంగా; పొనరన్= పొందికగా-చక్కగా; పల్కునె != మాట్లాడుతాడా; అంచున్ = అని అంటూ; పేరు+ఎలుఁగు=పెద్ద కంఠధ్వని; సొంపున్=అతిశయాన్ని-ఠీవిని; పొందన్; వక్త్రంబు పొల్పునన్=ముఖవైఖరిలో;దర్పంబు= గర్వము-ఉత్సాహము; ఒలయంగన్ = వ్యాపించగా-అతిశయించగా; అంగంబులున్= అవయవాలుగూడా; పొంగారన్ = ఉబ్బిపోగా; ఉద్బృంహిత ధ్వని+ఐ = మిక్కిలి అధికమయిన ఘీంకారధ్వని కలదై; పొల్చు = కనిపించే;మహా+ఉగ్ర = మిక్కిలిభయం కరమయిన; సింధురము చందంబు = ఏనుగు విధమును; ఒంది = పొంది; కడున్ = అధికంగా; ఒప్పెన్ = ప్రకాశించాడు.

భా : *అని అనగా భీముడు ఆ మాటలు మెచ్చుకొని అర్జునుడు కర్తవ్యాన్ని ఎంత స్పష్టంగా; పొందికగా, చక్కగా మాట్లాడాడు అని అన్నాడు. అప్పుడు ఆయన పెద్దకంఠధ్వనిలో ఠీవి స్ఫురించింది. ముఖంలో గర్వం ఉత్సాహం కనిపించాయి. సంతోషంతో ఆయన శరీరావయవాలు ఉబ్బిపోయాయి. మహోత్సాహంతో పెద్దగా ఘీంకారం చేసే భయంకరమైన మదపుటేనుగువలె ఆయన అప్పుడు వెలుగొందాడు.*

వి : సంతోషం కలిగినప్పుడు భీముడు ఎలా ఉంటాడో తిక్కన ఈ పద్యంలో వర్ణించాడు. మదపుటేనుగుతో భీముని పోలుస్తూ మహాకవి మత్తేభవృత్తంలో వర్ణించటం ఇక్కడేకాక ఇంకా చాలా చోట్ల చేశాడు.

క. **నకుల సహదేవులును దా**
నికి సంతస మంది "యిట్లు నెయ్యము కయ్యం
బొక తెఱఁగు సేసికొని తడ
యక ర" మ్మని పలికి రప్పు డచ్యుతు తోడన్. 144

అ : దానికిన్ = ఆ అర్జున భీముల మాటలకు; నకులసహదేవులును; సంతసము+అంది = సంతోషించి; ఇట్లు = ఇలా; నెయ్యము = స్నేహంగాని; కయ్యంబు = యుద్ధం; (అనేవాటిలో) ఒకతెఱఁగు = ఒకవిధం-ఒకమార్గాన్ని; చేసికొని; తడయక=ఆలస్యం చేయక; రమ్ము = రావలసింది; అని; అప్పుడు; అచ్యుతు తోడన్ = కృష్ణునితో; పలికిరి.

భా : *నకుల సహదేవులు అన్నల మాటలకు సంతోషించి; "కృష్ణా! నీవు అక్కడికి వెళ్ళి మైత్రి యుద్ధం అనే రెండింటిలో ఒకటి నిర్ణయించుకొని ఆలస్యం చేయకుండా రావలసింది" అని అప్పుడు చెప్పారు.*

-: శ్రీకృష్ణుఁడు నారదాది మహామునులం గని సంభాషించుట:- సం. 5-81-58

వ. ఇవ్విధంబునం బాండునందను లందఱును గోవిందునకు వలయు మాటలు సెప్పి యతని; గౌఁగలించుకొని యథోచిత ప్రకారంబుల వీడుకొని వలగొని మగిడిరి; తక్కినవారలు నర్హంబులగు తెఱంగుల నామంత్రితులై మరలిరి; మాధవుండును బ్రయాణ సర్వసంభార నిర్వాహకులం గలయం గనుంగొని తగిన సల్లాపంబులు సేసి కరినగరంబు పెండెరువు గైకొని దారుకుని చతురత్వంబునఁ దురంగంబుల పటుత్వంబున నత్యంత సమీచీనం బైన యానంబున మనం బలరం జనిచని యొక్కయెడ నారద జామదగ్న్య కణ్వాదులగు మహామునులం గొందఱం గని రథంబు డిగ్గి నమస్కరించి సభక్తి తాత్పర్యంబునఁ గుశలం బడిగి "మీరిక్కడకు విజయం చేయుటకుఁ గతం బేమి? సేయంగల పని యెయ్యది నా కానతిం" డనిన; నారాయణునకు నారదుం డిట్లనియె. 145

అ : ఈ విధంబునన్ = ఇలాగా; గోవిందునకు = కృష్ణునికి; వలయు = కావలసిన-తగిన; యథా+ఉచితప్రకారంబులన్ = తగిన విధాలుగా; వీడుకొని = వదలి; వలగొని = ప్రదక్షిణం చేసి; మగిడిరి = వెనుకకు తిరిగారు; అర్హంబులు+అగు = తగిన; తెఱంగులన్ = విధాలుగా; ఆ మంత్రితులు+ఐ = వీడ్కోలుపొంది; మాధవుఁడు = కృష్ణుడు; ప్రయాణ = ప్రయాణంయొక్క సర్వసంభార = సమస్తపదార్థాలను; నిర్వాహకులన్ = మోసేవారిని; కలయన్ కనుంగొని = కలయచూచి; సల్లాపంబులు+చేసి = ముచ్చటలాడి-సంభాషించి; కరినగరంబు= హస్తినాపురం యొక్క; పెద్దతెరువున్ = పెద్ద మార్గాన్ని; కైకొని = అనుసరించి; చతురత్వంబునన్= నేర్పుతోనూ; తురంగంబుల = గుర్రాలయొక్క; పటుత్వంబునన్ = సామర్థ్యంవల్లా; అత్యంత సమీచీనంబు= మిక్కిలి మంచిదయిన; యానంబునన్=వాహనంతో (రథంతో); డిగ్గి = దిగి; సభక్తితాత్పర్యంబునన్= భక్తిశ్రద్ధలతో- భక్తితో గూడిన ఆసక్తితో; విజయంచేయుటకు = వేంచేయ టానికి; కతంబు= కారణం; చేయంగలపని = (నేను) చేయవలసినపని; ఆనతిండు=ఆజ్ఞాపించండి.

భా : *ఈ విధంగా పాండవులు అందరూ కృష్ణునికి అవసరమయిన మాటలు చెప్పి ఆయనను కౌగలించుకొని తగిన విధంగా ప్రదక్షిణంచేసి వెనుకకు తిరిగారు. తక్కినవారుగూడా సముచితప్రకారంగా ఆయన దగ్గర వీడ్కోలు పొంది వెనక్కితిరిగారు. కృష్ణుడు ప్రయాణ వస్తుసామగ్రిని తీసుకొనివచ్చేవారి నందరిని కలయచూచి వారితో సల్లాపా లాడాడు. హస్తినాపురానికి పోయే సుదీర్ఘమార్గంలో దారుకుని నేర్పూ, గుర్రాల సామర్థ్యమూ, చాలా చక్కని రథమూ సమకూరటంవల్ల కృష్ణుడు సంతోషంగా ప్రయాణం చేస్తున్నాడు. మార్గమధ్యంలో నారదజామదగ్న్యకణ్వాది మహర్షులు కనిపించగానే ఆయన రథందిగి*

భక్తి తాత్పర్యాలతో వారికి నమస్కరించి కుశలప్రశ్నలు చేసి "తాము ఇక్కడికి దయచేయటానికి కారణం ఏమిటి? నేను చేయవలసిన పని ఏమైనా ఉన్నదా" అని అడిగాడు. అప్పుడు నారదుడు కృష్ణునితో ఇలా అన్నాడు.

సీ. "అనఘ! పుణ్యాత్ముఁడ వగు నిన్నుఁ గనుఁ గొనఁ
గౌరవసభ నీవు గారవమునఁ
బలికెడి పలుకుల భంగు లాకర్ణింప;
విదురభీష్మాదులు విను తెఱంగు
నుత్తరం బిచ్చు కార్యోక్తులు నెఱుఁగంగ;
వేడుక వచ్చిరి వీరలెల్ల"
నని చెప్ప విని; "లెస్సయట్ల చేయుదురు గా"
కని హరి వల్కిన నమ్మునీంద్రు
తే. లతని దీవించి "నీవు పొమ్మచటి; కేము
నరుగు దెంచెద" మని ప్రీతి ననుప నరిగి
నొక్క పుణ్యాశ్రమంబున యొద్ది యేట
విడిసి; దివస ప్రవర్తన విధుల నడిపి. 146

అ : అనఘ; పుణ్యాత్ముఁడవు+అగు; నిన్నున్; కనుఁగొనన్ = చూడటానికీ; నీవు; కౌరవసభన్; గారవమునన్ = గొప్పతనంతో-మన్ననతో; పలికెడి = చెప్పేటటువంటి; పలుకుల భంగులు = మాటల తీరులు; ఆకర్ణింపన్ = వినటానికీ; విదురభీష్మ+ఆదులు = విదురుడు భీష్ముడు మొదలయిన వారు; వినుతెఱంగు = వినేతీరూ; ఉత్తరంబు = సమాధానం; ఇచ్చు = ఇచ్చే; కార్య+ఉక్తులున్ = పనులమాటలను; ఎఱుఁగంగన్ = తెలుసుకోటానికీ; వీరలు; ఎల్లన్= అందరూ; వేడుకన్ = కోరికతో; వచ్చిరి = వచ్చారు; అని;చెప్పన్;విని; హరి = కృష్ణుడు; లెస్స = మంచిది; అట్లు+అ = అలాగే; చేయుదురు గాక; అని; పల్కినన్ = అనగా; ఆ+ముని+ఇంద్రులు= అమునిశ్రేష్ఠులు; అతనిన్ = ఆ కృష్ణుని; దీవించి=ఆశీర్వదించి; నీవు; అచటికి=ఆ హస్తినాపురానికి; పొమ్ము; ఏమును = మేముగూడా; అరుగుదెంచెదము = వస్తాము; అని; ప్రీతిన్ = ప్రేమతో; అనుపన్ = పంపగా; (కృష్ణుడు) అరిగి = వెళ్ళి; ఒక్క పుణ్య+ఆశ్రమంబున= పవిత్ర మయిన ఒక ఆశ్రమం యొక్క; ఒద్ది-ఏటన్=సమీపంలో ఉన్న నదీతీరంలో; విడిసి=దిగి-బసచేసి; దివసప్రవర్తన విధులన్ = పగలుచేయవలసిన వైదిక కార్యాలను; నడిపి = చేసి.

భా : "కృష్ణా! పుణ్యాత్ముడవయిన నిన్నుచూడటానికీ, కౌరవసభలో నీవు మన్ననతో హుందాగా పలికే మాటలు విందామనీ; విదురుడు భీష్ముడు మొదలయిన వాళ్ళు నీమాటలు వినేతీరూ, నీమాటలకు వారు కర్తవ్యాన్ని గూర్చి చెప్పేమాటలు తెలుసుకోవాలి అనే కోరికతో వీరంతా వచ్చారు." అని చెప్పగా విని కృష్ణుడు 'బాగుంది. అలాగే చేయండి' అని అన్నాడు. ఆమునులు ఆయనను దీవించి 'నీవు హస్తినాపురానికి వెళ్ళు. మేము తరువాత వస్తాము.' అని చెప్పి వెళ్ళారు. కృష్ణుడు అక్కడినుంచి ప్రయాణంచేసి ఒకనదీతీరంలో ఉన్న

పవిత్రాశ్రమం వద్ద దిగాడు. పగటిపూట చేయవలసిన వైదిక కర్మలు అన్నీ యథావిధిగా ఆయన చేశాడు.

వ. కమలనాభుండు గదలిపోయి సూర్యాస్తమయ సమయంబున గుశస్థలంబు సేరం జనునప్పు; డందలి విప్రు లెదురు వచ్చి కాంచి నిజనివాసంబులకుం బిలిచినం; బ్రసన్నవదనుం డగుచు సమ్మర్దంబు వలవదని వలికి విశాలరమణీయం బైన బహిరంగణంబునం బట కుటీరప్రకరం బెత్తించి విడిసి; తగువారును దానును వారల గృహంబుల కరిగి యభ్యాగతపూజలు గైకొని వారిని సంభావించి విడిదలకుం జని సమయసముచితవృత్తిం బ్రవర్తిల్లుచుండె నంత నక్కడ. **147**

అ : కమలనాభుండు = కమలమునాభియందుగలవాడు-కృష్ణుడు; కదలిపోయి = సాగిపోయి; సూర్య+అస్తమయ సమయంబునన్ = సూర్యుడు అస్తమించే సమయంలో; చేరన్+ చనునప్పుడు=సమీపించేటప్పుడు; విప్రులు=బ్రాహ్మణులు; కాంచి=చూచి; నిజనివాసంబులకున్= తమ ఇండ్లకు; ప్రసన్నవదనుండు = ప్రసన్నమయిన ముఖంకలవాడు; సమ్మర్దంబు= సందడి; వలవదు = వద్దు; విశాలరమణీయంబు = విశాలమయినది- మనోహరమయినది; బహిరంగ-ణంబునన్ = బహిరంగప్రదేశంలో; పటకుటీరప్రకరంబు = డేరాలసమూహం; ఎత్తించి = ఏర్పాటు చేయించి-వేయించి; విడిసి = ప్రయాణం ఆపి; దిగి;తగువారును= కావలసినవారూ; వారల గృహంబులకు = ఆబ్రాహ్మణుల ఇండ్లకు; అరిగి=వెళ్ళి; అభ్యాగతపూజలు = భోజనసమయానికి వచ్చిన వారికి చేసే పూజలు; కైకొని = స్వీకరించి; సంభావించి = గౌరవించి; విడిదలకున్ = బసకు; చని=వెళ్ళి; సమయ సముచితవృత్తిన్=ఆ సమయానికి తగిన విధంగా; ప్రవర్తిల్లుచుండెన్= ప్రవర్తిస్తున్నాడు; అక్కడ = హస్తినాపురంలో.

భా : *కృష్ణుడు అక్కడినుంచి బయలుదేరి సూర్యాస్తమయ్యేటప్పటికి కుశస్థలాన్ని చేరాడు. అప్పుడు ఆ ఊరిబ్రాహ్మణులు ఎదురువచ్చి ఆయనను దర్శించి తమ ఇండ్లకు పిలిచారు. కృష్ణుడు అందుకు ప్రసన్నుడై సందడి-ఇరుకు వద్దని విశాలమయినది అందమైనది అయిన ఒక బహిరంగ ప్రదేశంలో డేరాలు వేయించి అక్కడ బస చేశాడు. తగినవారిని కొంతమందిని తీసుకొని ఆయన వారి ఇండ్లకు వెళ్ళి అభ్యాగత పూజలు స్వీకరించాడు. తరువాత వారిని గౌరవించి తన బసకు వెళ్ళి ఆయన అక్కడ ఆసమయానికి తగిన విధంగా ప్రవర్తిస్తున్నాడు. అప్పుడు హస్తినాపురంలో- (తరువాతిపద్యంతో అన్వయం)*

తే. వార్తవిని యక్షణమ కౌరవక్షితీశ్వ
రుండు గాంగేయ గురు విదురులను బుత్రు
సంజయునిఁ గర్ణు సైంధవు శకునిఁ బిలువ
బనిచి, తా నిట్టు లనియె నందనునితోడ. **148**

అ : కౌరవక్షితీశ్వరుండు = ధృతరాష్ట్రుడు; వార్తన్ = (కృష్ణునిరాక) సమాచారాన్ని; విని; ఆ+క్షణము+అ= ఆక్షణంలోనే-వెంటనే; గాంగేయ = భీష్ముడు; గురు = ద్రోణుడు; విదురులను; పుత్రున్ = కుమారుడు-దుర్యోధనుని; సంజయునిన్; కర్ణున్; సైంధవున్; శకునిన్;

పిలువన్+పనిచి = పిలవటానికి (సేవకులను)పంపించి; నందనుని తోడన్ = కుమారునితో; తాను = ధృతరాష్ట్రుడు; ఇట్టులు = ఇలాగా; అనియెన్ = అన్నాడు.

భా. *కృష్ణుడు వస్తున్నాడనే సమాచారం విన్న వెంటనే ధృతరాష్ట్రుడు భీష్మనీ, ద్రోణునీ, విదురునీ, దుర్యోధనునీ, సంజయునీ; కర్ణుని; సైంధవునీ; శకునినీ పిలిపించాడు. తరువాత దుర్యోధనునితో ఇలా అన్నాడు.*

వ. **"కృష్ణుండు పాండవ కార్యార్థంబుగా మనయొద్దకు వచ్చు చున్నవాఁడు; నేడు కుశస్థలంబున విడిసె; రేపిందులకు వచ్చు నని వింటి; మిట్టి యాశ్చర్యంబునుం గలదే! సర్వలోకాభిగమ్యుండగు నమ్మహానుభావునకు మనమభిగమ్యుల మైతిమి! మనకింత కంటెను బెంపెయ్యది? యతం డెవ్వరివలన సంతుష్టుం డయ్యె వారికి శుభంబును; నెవ్వరి దెస ననాదరంబు సేసె వారికి నశుభంబు నగుట దప్పు; దతనికి వలయు పూజ లాచరించుటకు సంవిధానంబు సేయుము. గృహాలంకరణాది మంగళ ప్రకారంబు లనుష్ఠింప నియమింపు; మతని చిత్తంబునకు నీవిభవంబును దనమీఁది ప్రియంబునుం దోచునట్టి తెఱంగున సమస్తంబును సమకట్టుము."** 149

అ : పాండవకార్యార్థంబుగాన్=పాండవుల పని(సంధి)కోసమై; విడిసెన్ = బసచేశాడు; ఇందులకున్ = ఇక్కడికి; సర్వలోక+అభిగమ్యుండు = సమస్తజనులకు సమీపించ దగినవాఁడు; అభిగమ్యులము=సమీపించదగినవారం; పెంపు = సన్మానం-గౌరవం; ఎయ్యది = ఏముంది; ఎవ్వరివలనన్ = ఎవరియెడ; ఎవ్వరిదెస = ఎవరివైపు; వలయు = తగిన-ఇష్టమయిన; సంవిధానంబు = ఏర్పాటు; మంగళప్రకారంబులు = శుభకార్యాలు; అనుష్ఠింపన్ = చేయటానికి; నియమింపుము = ఆజ్ఞాపించు; చిత్తంబునకు = మనస్సుకు; విభవంబును = ఐశ్వర్యమూ; తనమీఁది ప్రియంబును = తనమీదిప్రేమా; తోచునట్టి తెఱంగున్ = స్ఫురించే విధంగా; సమకట్టుము = ఏర్పరుచుము.

భా : *కృష్ణుడు పాండవుల కార్యార్థిగా మనదగ్గరకు వస్తున్నాడు. ఇవ్వాళ కుశస్థలంలో బస చేశాడు; రేపు ఇక్కడికి వస్తాడని విన్నాం. ఇలాంటి ఆశ్చర్యకరవిషయాలు గూడా ఉన్నాయా! సర్వజనులకు గౌరవంతో సమీపించ దగిన ఆ మహానుభావునికి మనం సమీపించదగిన వారం ఐనాము. మనకు ఇంతకు మించిన సన్మానం ఏముంది? ఆయన ఎవరి విషయంలో సంతుష్టుడౌతాడో; వారికి శుభమూ; ఎవరివిషయంలో అనాదరంగా ఉంటాడో వారికి అమంగళమూ కలగటం తప్పదు. ఆయన కిష్టమయిన గౌరవాదులు చేయటానికి ఏర్పాట్లు చేయవలసింది. ఇండ్లను అలంకరించటం మొదలైన మంగళకార్యాలు చేయటానికి ఆజ్ఞాపించు. నీసంపదా తనమీద నీకున్న ప్రేమా ఆకృష్ణుడి మనస్సుకు నచ్చేటట్లుగా అంతా సిద్ధంచెయ్యి."*

క. **అనిన ధృతరాష్ట్రు పలుకులు**
గొనియాడిరి-సంతసిల్లి గురుఁడును భీష్మం

డును; నౌఁగా కని దుర్యో
ధనుఁడుం బరిచారిక ప్రతతిఁ బిలిపించెన్. 150

అ : అనినన్ = అనగా; సంతసిల్లి = సంతోషించి; గురుఁడును; భీష్ముండును; ధృతరాష్ట్రు పలుకులు; కొనియాడిరి = మెచ్చుకొన్నారు; దుర్యోధనుఁడున్; ఔన్+కాక+అని = సరేఅని; పరిచారక ప్రతతిన్ = సేవకుల సమూహాన్ని; పిలిపించెన్.

భా : *అని ధృతరాష్ట్రుడు అనగా ద్రోణుడు, భీష్ముడు ఆయన మాటలను సంతోషంగా మెచ్చుకొన్నారు. దుర్యోధనుడు కూడా అందుకు సరే అని అంగీకరించి సేవకసమూహాన్ని పిలిపించాడు.*

వ. **ఇట్లుచిత పరివారంబు రావించి యతండు.** 151

భా. *ఇలా తగిన పరివారాన్ని రప్పించి ఆ దుర్యోధనుడు.*

క. **"అలుకుఁడు మృగమదమున; ము**
గ్గులు వెట్టుఁడు గప్పురమునఁ; గుంకుమమున గో
డలు పూయుఁడు; మణిదామక
ములు గట్టుఁడు పెద్దకూటమున సొంపారన్. 152

అ : పెద్దకూటమునన్ = పెద్దసభా భవనంలో; (నేలను) మృగమదమునన్ = కస్తూరితో; అలుకుఁడు = అలకండి; కప్పురమునన్ = కర్పూరంతో; ముగ్గులు; పెట్టుఁడు; కుంకుమమునన్ = కుంకుమపూవుతో; గోడలు; పూయుఁడు = పూయండి. సొంపారన్ = అందంగా; మణిదామకములు = మణులుకూర్చిన దండలు; కట్టుఁడు.

భా : *"మహాసభాభవనంలో నేలను కస్తూరితో అలకండి. పచ్చకర్పూరంతో ముగ్గులు పెట్టండి. గోడల నన్నింటిని కుంకుమ పూవుతో పూయండి. మణుల దండలను కట్టండి.*

వ. **మఱియు నగరెల్లను శోభిల్ల నలంకారంబు సేయుండు.** 153

అ : నగరు = రాజభవనం; శోభిల్లన్ = ప్రకాశించేటట్లు

భా : *ఇంకా రాజభవనం, సభాభవనం, అంతఃపురం అంతా వెలుగొందే విధంగా అలంకరించండి.*

క. **పెనుపుం జతురత మెఱయఁగ**
మనయింటను దుస్ససేను మందిరమున శో
భన శిల్పము లొనరింపుఁడు;
చనుఁడు వృకస్థలమునందుఁ జప్పరము లిడన్. 154

అ : పెనుపున్ = వైభవమూ; చతురత = నేర్పూ; మెఱయఁగన్ = స్పష్టమయ్యేటట్లు; మనయింటను; దుస్ససేనుమందిరమునన్ = దుశ్శాసనుని భవనంలో; శోభనశిల్పములు = అందమయిన శిల్పాలను చిత్రలేఖనాదులను; ఒనరింపుడు = చేయండి; వృకస్థలమునందున్=

వృకస్థలం అనే నగరంలో; చప్పరములు = చలువపందిళ్ళు; ఇడన్ = వేయటానికి; చను(డు = వెళ్ళండి.

భా: *నావైభవమూ, మీనేర్పూ అందరికీ తెలిసేటట్లు మాభవనం లోను దుశ్శాసనుని సౌధంలోను చక్కని శిల్పాలను వేయించండి. వృకస్థలంలో చలువ పందిళ్ళు వేయటానికి వెళ్ళండి.*

వ. అది విడిపట్టు గా(దగియెడుప" ట్టని పలికి; "వాసుదేవుండు రేపకడయ వచ్చు నంతకుమున్న యింతయుం గావింపవలయు" నని పనిచి, పురంబున నుత్సవంబు సాటుం డని నియోగించి వివిధ గంధమహిత మాల్యంబులు సంపాదింపను, మణిభూషణ చిత్రాంబరంబులు సమకట్టను, సరసాన్నస్వాదు పానద్రవ్యంబు లొడ(గూర్పను నేర్పరులగు తజ్ఞుల నియమించె; నట్టియెడ నాంబికేయుండు విదురున కిట్లనియె. 155

అ : విడిపట్టు = విడిదిచోటు; పట్టు = ప్రదేశము; రేపకడయ = ప్రొద్దుననే; వచ్చు నంతకుమున్న = రావటానికి ముందే; పనిచి=నియోగించి -ఆజ్ఞాపించి; వివిధగంధమహిత మాల్యంబులు=అనేకవిధాలయిన సువాసనలతో గొప్పవయిన పూలమాలికలు; మణిభూషణ చిత్రాంబరంబులు=రత్నాల అలంకారాలు, నానావర్ణాలు గలవస్త్రాలు; సమకట్టను= సంగ్రహించ టానికి సమకూర్చటానికి; సరసాన్న స్వాదు పాన ద్రవ్యంబులు = చక్కని రుచిగల అన్నము; ఇంపైన పానీయాలయిన ద్రవ్యాలు; ఒడ(గూర్పను = సిద్ధపరచటానికి; తజ్ఞులన్ = వాటిని గురించి బాగా తెలిసినవారు-సమర్థులను; ఆంబికేయుండు = అంబికకుమారుడు-ధృతరాష్ట్రుడు.

భా : *అదికృష్ణుడికి విడిది గా దగినస్థానం." అని దుర్యోధనుడు "కృష్ణుడు రేపు ప్రొద్దున ఇక్కడికి రావటానికంటే ముందే ఇవి అన్నీ సిద్ధం చేయా"లని ఆజ్ఞాపించాడు. 'హస్తినాపురంలో పండగరోజుగా చాటింపు వేయించండి' అని తగిన వారిని నియోగించాడు. అనేక విధాలయిన చక్కని సువాసనలను వెదజల్లే పూలమాలికలను సంపాదించటానికీ; మణిమయాలయిన అలంకారాలను రంగురంగులవస్త్రాలను సమకూర్చటానికీ మంచి రుచిగల అన్నం; ఇంపయిన పానీయాలను సిద్ధం చేయటానికీ నేర్పరులు, సమర్థులయిన వారిని దుర్యోధనుడు నియమించాడు. అప్పుడు ధృతరాష్ట్రుడు విదురునితో ఇలా అన్నాడు.*

వి. అంతకుముందు ద్రుపద పురోహితుడు పాండవుల మొదటి దూతగా వచ్చాడు. అప్పుడు ఈ సంరంభం ఏమీలేదు. అది అతి సామాన్యంగా జరిగింది. కాని శ్రీకృష్ణుడు రావటం అలాంటిది కాదు. పాండవ పక్షానికి ప్రాణంవంటి వాడు ఆయన. జగన్మాన్యు డయిన జనార్దనుని ఆకర్షణలతో లొంగదీసుకొని పాండవపక్షాన్ని బలహీనం చెయ్యాలి అని ధృతరాష్ట్ర పక్షం వారి ఆలోచన. కొడుకుమాటలు విన్న తరువాత తండ్రికి కృష్ణుని వశం చేసుకోవటానికి మరికొన్ని ఉపాయాలు గుర్తు వచ్చాయి. వాటిని తెలివిగా విదురునికి చెవుతాడు ముందు పద్యాలలో ధృతరాష్ట్రుడు.

పాండవులవద్దకు వస్తున్న శల్యుని దుర్యోధనుడు మార్గమధ్యంలో అనేక వసతులు కల్పించి వంచించి రాబోయే యుద్ధంలో తన పక్షంలో చేరేటట్లు చేసుకున్నాడు. కృష్ణుని గూడా అలాగే ఈ సందర్భంలో లొంగదీసుకోవటానికి యత్నిస్తున్నాడు దుర్యోధనుడు.

కృష్ణుడు వస్తున్నాడని తెలిసి దుర్యోధనుడు మార్గమధ్యంలోనూ; విశేషంగా వృకస్థలంలోనూ మహావైభవోపేతమైన విడుదులు ఏర్పాటు చేశాడనీ; శ్రీకృష్ణుడు వాటి ముఖమైనా చూడకుండా ప్రయాణంసాగించాడని మూలంలో 84వ అధ్యాయంలో వివరంగా ఉంది.

-: ధృతరాష్ట్రుండు విదురునితో శ్రీకృష్ణుని రాక సెప్పి సంతోషించుట: - సం. 5-84-20

క. **"వివిధ మణిమయరథంబులు**
జవనాశ్వంబులును భద్రసామజములు ర
త్నవిభూషణములు దాసీ
నివహంబులుఁ జాలఁ గృష్ణునకు నే నిత్తున్. 156

అ : నేన్ = నేను; కృష్ణునకున్; వివిధమణిమయ రథంబులున్ = చాలారకాలయిన మణులు గల రథాలను; జవనాశ్వంబులును= మిక్కిలి వేగం గల గుఱ్ఱాలను; భద్ర సామజ-ములున్= భద్రజాతి ఏనుగులను; రత్నవిభూషణములున్ = మణులు పొదిగిన అలంకారాలను; దాసీనివహంబులున్ = సేవకు రాళ్ళ సమూహాలను; చాలన్ = చాలా; ఇత్తున్.

భా : *"విదురా! నేను శ్రీకృష్ణునికి అనేకవిధాలయిన మణిమయాలయిన రథాలను, మంచి వేగంగల గుఱ్ఱాలను, భద్రజాతికి చెందిన ఏనుగులను, రత్నాలతో గూడిన అలంకారాలను, దాసీలసమూహాలను కోకొల్లలుగా ఇస్తాను.*

క. **మనయింట సుయోధను గృహ**
మున దుశ్శాసను నికేతనమున-నెయ్యది యా
తని చూడ్కి కించు - నదియె
ల్లను గౌరవ మొప్ప నీవలయు మన కనఘా! 157

అ : అనఘా = పవిత్రుడా; మనయింటన్; సుయోధను గృహమునన్; దుశ్శాసను; నికేతనమునన్ = ఇంటిలో; అతని చూడ్కికిన్ = ఆ కృష్ణుని చూపులకు; ఎయ్యది = ఏది; ఇంచున్ = ఇష్టం ఔతుందో; మనకు అది; ఎల్లను = అంతా; గౌరవము; ఒప్పన్ = కలుగునట్లుగా ఈవలయున్ = ఇయ్యాలి;

భా : *విదురా! మన ఇంట్లోగాని; దుర్యోధనుని ఇంట్లోగాని దుశ్శాసనుని ఇంట్లోగాని ఆ కృష్ణుని చూపుకు నచ్చినది ఏదయినా సరే మనం గౌరవ పూర్వకంగా ఆతనికి సమర్పించుకోవాలి."*

వి : సామదానభేద దండములు అనే నాలుగు ఉపాయాలలో ధృతరాష్ట్రుడు ఇక్కడ కృష్ణుని వశం చేసుకోవటానికి దానం అనే ఉపాయం ఉపయోగింప జేస్తున్నాడు. అందుకే జాత్యంధుడైన ధృతరాష్ట్రుని ప్రజ్ఞాచక్షువు అంటాడు వ్యాసమహర్షి. మూలంలో 86వ అధ్యాయం ఈ లంచాన్ని చెపుతున్నది.

చ. అన విని యాతఁ డిట్లనియె; "నంబుజనాభునిఁ బ్రీతుఁ జేయుకం
టెను హితమైన కృత్య మొకటిం గలదే? యదిమేలు; పాండునం
దనులకు నైదయూళ్ళు లుచితస్థితి నిచ్చుట కోపమన్న యు
న్కిన యిటులోపు కల్మి ధరణీవర! యేమిట వచ్చెఁ జెప్పుమా? 158

అ. అనన్ విని; ఆతఁడు = ఆవిదురుడు; ఇట్లు; అనియెన్; ధరణీవర = ధృతరాష్ట్ర మహారాజా!; అంబుజనాభునిన్ =కృష్ణుని; ప్రీతున్=సంతోషించిన వానిని; చేయుకంటెను= చేయటానికంటే; హితము ఐన కృత్యము = మేలు చేసేది; ఒకటిన్ = ఇంకొకటి-ఒకటయినా కలదే=ఉన్నదా?; అది=అలాకృష్ణునికి ప్రీతికలిగించటం; మేలు = మంచిది; పాండునందనులకున్= పాండవులకు; ఐదు+అ+ఊళ్ళులున్ = ఐదే ఐదూళ్ళు; ఉచితస్థితిన్ = తగినవిధంగా; ఇచ్చుటకు= ఇయ్యటానికి; ఓపము=చాలలేము(న్యాయంగా)? ఇష్టపడము; అన్న= అనినటువంటి; ఉన్కిన= దశలోనే; ఇటులు = ఇలాగా; ఓపుకల్మి = కృష్ణుడికివ్వటానికి చాలిఉండటం-ఇష్టం కలిగిఉండటం; ఏమిటన్ = ఏవిధంగా; వచ్చెన్ = కలిగిందో చెప్పుమా.

భా ఆ ధృతరాష్ట్రుని మాటలువిని విదురుడు ఇలా అన్నాడు "మహారాజా! శ్రీ కృష్ణునికి సంతోషం కలిగించటం కంటె మేలు కలిగించేపని ఇంకొకటి ఉంటుందా? ఆ పని చాలామంచిది. పాండవులకు న్యాయంగా ఐదంటే ఐదేఊళ్ళు ఇవ్వటానికి అంగీకరించము అన్నట్టి దశలోనే ఇలాగా శ్రీకృష్ణునికి అనేక బహుమతులు ఇయ్యటానికి అంగీకరించటం ఎలా కుదిరిందో చెప్పండి?

వి. ధృతరాష్ట్రుని దురాలోచన గుర్తించి నీతివేత్త అయిన విదురుడు ఆయన మర్యాదకు భంగం కలగకుండా తాను హద్దు మీరినట్లు కాకుండా మెత్త మెత్తగా మందలిస్తున్నాడు. ధృతరాష్ట్రుడు రాజనీతి అంతా తనకే తెలిసినట్లు తెలివిగా మాట్లాడుతున్నాను అని అనుకున్నాడు. కాని విదురుడు అందుకు తగినట్లుగా హెచ్చరికను సౌమ్యంగా వ్యక్తీకరిస్తున్నాడు.

ఉ. నీతలఁ పేను గంటి; నొకనేర్పున శౌరికి లంచ మిచ్చి సం
ప్రీతుని జేసి కార్యగతి భేదము సేయఁగఁ జూచె; దింత బే
లైతి గదే! సుమేరు సదృశార్థముఁ జూచియుఁ బార్థుఁ బాయునే
యాతఁడు? క్రీడి భక్తియును నచ్యుతు పెంపును నీవెఱుంగవే? 159

అ : ఏను = నేను; నీతలఁపు = నీఆలోచన-నీహృదయం; కంటిన్ = తెలుసుకున్నాను; ఒకనేర్పునన్ = గొప్పచాకచక్యంతో; శౌరికిన్ = కృష్ణునికి; లంచము; ఇచ్చి; సంప్రీతునిన్= బాగా సంతోషించిన వానినిగా; చేసి; కార్యగతిన్ = సంధికార్యరీతిలో; భేదము= (కృష్ణపాండవులకు) వైమనస్యం; చేయఁగన్; చూచెదు = కలిగించాలని చూస్తున్నావు; ఇంతబేల= ఇంతమూఢుడివి-అమాయికుడివి; ఐతిగదే = అయినావుకదా; ఆతఁడు = ఆకృష్ణుడు; సుమేరు సదృశ+ అర్థమున్= మేరుపర్వతంతోసమానమయిన ధనాన్ని; చూచియున్ =చూసికూడా; పార్థున్= అర్జునుని; పాయునే= విడిచిపెడతాడా?; క్రీడి = అర్జునునియొక్క; భక్తియున్; అచ్యుతు= కృష్ణుని యొక్క; పెంపును = మాహాత్మ్యమూ; నీవు; ఎఱుంగవే!

భా : *రాజా! నీమనస్సులోని ఆలోచన నాకర్థమయింది. నీవు గొప్పచాకచక్యంతో కృష్ణునికి లంచం ఇచ్చి సంతోషపెట్టి సంధికార్యాన్ని చెడగొట్టాలని చూస్తున్నావు. పాండవులకు కృష్ణుడికి భేదాన్ని కలిగించా లనుకుంటున్నావు. నీవు ఇంత అమాయికుడివన్నమాట! సాక్షాత్తుగా మేరు పర్వతాన్ని ఎదుట పెట్టినా కృష్ణుడు దాన్ని చూసిగూడా అర్జునుని వదలి పెడతాడా? అర్జునునికి కృష్ణునిపైనున్న భక్తీ; భక్త రక్షణతత్పరత్వం అనే కృష్ణుని మహత్తూ నీకు తెలియదా?*

వి. "ఇంతబేలైతిగదే" అనే మాట ధృతరాష్ట్రుని పుత్రవ్యామోహాన్ని, స్వార్థాన్నీ తెలుసుకున్న విదురుని బాధను హేళనను సూచిస్తుంది.

అర్థేనతు మహాబాహుం వార్ణేయం త్వం జిహీర్షసి
అనేన చాప్యుపాయేన పాండవేభ్యో విభేత్స్యసి. 87 అధ్యా. 10 శ్లో

మహారాజా! మీరుశ్రీకృష్ణుని మీపక్షంలోకి ధనం ఇచ్చి లాక్కోవాలి అని అనుకుంటున్నారు. ఈ ఉపాయంతో కృష్ణునికి పాండవులకు మధ్య భేదం కలిగించాలని అనుకుంటున్నారు.

ధృతరాష్ట్రునివంటి మహారాజే లంచం ఇవ్వాలని యత్నిస్తుంటే స్వకార్యసాధన కాంక్షులైన ఇతరుల సంగతి చెప్పాలా?

తే. అర్జునుఁడు ప్రాణతుల్యుండు హరికి; నట్లు
గాన జలపూర్ణ మంగళ కలశమునకుఁ
బాద్యమునకును గుశల సంప్రశ్నమునకు
మిగుల నొండు జనార్దను మెచ్చు గాదు. 160

అ : అర్జునుఁడు;హరికిన్ = కృష్ణునికి; ప్రాణతుల్యుండు =ప్రాణాలతో సమానమయిన వాడు; అట్లు = అలా; కాన = కాబట్టి; జలపూర్ణ మంగళ కలశమునకున్ =నీటితో నిండిన మంగళకలశానికీ-పూర్ణకుంభానికీ; పాద్యమునకును = కాళ్ళకడుగుకొనే నీటికీ; కుశల సంప్రశ్నమునకున్ = క్షేమవిషయాలు అడగటానికీ; మిగులన్ = మించి; ఒండు = ఇతరమయినవి; జనార్దను = శ్రీ కృష్ణునికి; మెచ్చు+కాదు = ప్రీతికరం కాదు.

భా : *అర్జునుడు కృష్ణునికి ప్రాణం కాబట్టి ఆయనకు పూర్ణకలశంతో స్వాగతం ఇవ్వటం, కాళ్ళు కడుగుకోవటానికి నీళ్ళు ఇవ్వటం; కుశలప్రశ్నలు వేయటం తప్ప మరొకటి ఏదీ తృప్తికరంకాదు.*

క. మనకడకు నేమికార్యం
బునకై యాతండు వచ్చెఁ; బూనికమెయి నా
పని వంచింపక చేయుట
విను మతనికిఁ బ్రియము; దక్కు వేయును నేలా?" 161

అ : ఆతండు = ఆకృష్ణుడు; మనకడకున్ = మనదగ్గరకు; ఏమికార్యంబునకై =ఏపని కోసం; వచ్చెన్ = వచ్చాడో; ఆపని; వంచింపక = మోసంచేయక; పూనికమెయిన్ = ప్రయత్న

పూర్వకంగా; చేయుట; అతనికిన్; ప్రియము = ఇష్టం; తక్కు = ఇతరమయినవి; వేయునున్ = అనేకం; ఏలా =ఎందుకు?

భా : *ఆ కృష్ణుడు మనదగ్గరకు వచ్చిన పనిని ఎలాంటి మోసం లేకుండా ప్రయత్నపూర్వకంగా చేయటమే ఆయనకు ఇష్టమయిన పని. ఇతరమయినవి వెయ్యి (అనేకం) అయినా ఏమీ ప్రయోజనంలేదు."*

వ. అనిన విని దుర్యోధనుండు దండ్రి కిట్లనియె. 162

భా. *విదురుని మాటలు విన్న దుర్యోధనుడు ధృతరాష్ట్రునితో ఇలా అన్నాడు.*

క. "అది విదురు చెప్పినట్టిద;
తుదిఁ గృష్ణుఁడు పాండుసుతులతో వేఱగునే!
పద నెఱుఁగ కీఁగి యిచ్చిన
బెదరి రనరె? యొచ్చె మైనఁ బిమ్మట నగరే? 163

అ : అది = ఆ విషయం; విదురుచెప్పినట్టిది+అ=విదురుడు చెప్పినట్లే; తుదిన్ = చివరకయినా; కృష్ణుఁడు; పాండు సుతులతోన్= పాండవులతో; వేఱగునే = వేరవుతాడా?; పదను= తగినసమయం; ఎఱుఁగక = తెలియక; ఈఁగి = బహుమతి; ఇచ్చినన్ = ఇస్తే; బెదరిరి; అనరె = అనరా?; ఒచ్చెము = అవమానం; ఐనన్ = అయితే; పిమ్మటన్ = తరువాత; నగరె = నవ్వరా?

భా : *" ఆ విషయంలో విదురుడు చెప్పిందే సరి అయింది. సర్వనాశనం అయినా- చివరకు కూడా కృష్ణుడు పాండవులకు దూరం అవుతాడా? తగిన సమయం తెలియక ఏవయినా బహుమతులిస్తే లోకులు మమ్మలను భయపడ్డారు అని అంటారుగదా! ఏదయినా అవమానం జరిగితే తరువాత వాళ్ళే నవ్వరూ?*

ఆ : అతఁడు పూజనీయుఁ డగు నే నెఱుంగుదు;
నైన ధనము లీఁగి యనదతనము
వచ్చుఁ; బెచ్చు పెరిఁగి వైరులు గర్వింతు;
రేల పగ యడంగు నిట్టు లైన." 164

అ : అతఁడు = ఆకృష్ణుడు; పూజనీయుఁడు = పూజింపదగినవాడు; అగు = అవును; నేను; ఎఱుంగుదు =ఎరుగుదును; ఐనన్ = అయినా; ధనములు; ఈఁగి = ఇవ్వటం; అనదతనము వచ్చు = హైన్యం (దీనత) సంభవిస్తుంది; వైరులు = శత్రువులు; పెచ్చుపెరిగి = మిక్కిలి వర్ధిల్లి (విజృంభించి); గర్వింతురు; ఇట్టులు+ఐనన్=ఇలా అయితే; పగ; ఏల+అడంగు= ఎలా నశిస్తుంది?

భా : *ఆకృష్ణుడు పూజింపదగినవాడే. ఆ విషయం నాకు తెలుసు. అయినా సంపదలు కానుకలు ఈయటం వల్ల మాకు హీనత సంభవిస్తుంది. అంతేకాదు. ఇందువల్ల శత్రువులు రెచ్చిపోయి గర్విస్తారు. ఇలాంటి పనులు చేస్తే శత్రుత్వం ఎలా పోతుంది"?*

క. అనవుడు భీష్ముఁడు ధృతరా
ష్ట్రున కిట్లను " నీవునుం గొడుకు నేమే ని

చ్చిన నొకటి; యీఁగి లేకు
న్నను వేఱొక్కటి దలంచునా-కేశవుఁడున్? 165

అ : అనవుఁడు=అనగా; భీష్ముఁడు; ధృతరాష్ట్రునకున్ ; ఇట్లు; అనున్ =అంటున్నాడు; కేశవుఁడున్ = కృష్ణుడుగూడా; నీవున్; కొడుకున్= దుర్యోధనుడూ; ఏమేన్ = ఏమయినా; ఇచ్చినన్; ఒకటి; ఈఁగి = ఇవ్వటం; లేకున్నను = లేకపోతే; వేఱు+ఒక్కటి = మరొకటి; తలంచునా = అనుకుంటాడా?

భా : అమాటలు విని భీష్ముడు ధృతరాష్ట్రునితో ఇలా అంటున్నాడు. *"నీవూ నీకొడుకూ బహుమతులు ఇస్తే ఒకటీ-ఇవ్వకపోతే ఇంకొకటీ" అనుకుంటాడా? కృష్ణుడు?.*

క. విను మతఁడు సేయఁ బూనిన
పని దప్పింపంగ రాదు; పాండవులం దే
ర్పను గృష్ణుఁడు వెరవుగఁ జొ
చ్చిన మే; లా పురుషు పనుపు సేయుము పుత్రా! 166

అ : వినుము; అతఁడు = ఆకృష్ణుడు; చేయన్+పూనినపని = చేయదలచినకార్యం; తప్పింపంగరాదు = తప్పించటానికి వీలుకాదు; పాండవులన్; తేర్పను = ప్రసన్నత పొందించటానికి; కృష్ణుఁడు; వెరవు+కన్ =అనుకూలం అయ్యేటట్లు; చొచ్చినన్= ప్రయత్నిస్తే; (అది) మేలు; పుత్రా= కుమారా(ధృతరాష్ట్రా); ఆపురుషు పనుపు = ఆయన ఆజ్ఞను;చేయుము.

భా : *కుమారా! నామాటవిను. ఆకృష్ణుడు చేయదలచిన పనిని తప్పించటం మనకు చేతకాదు. కాబట్టి పాండవులను ప్రసన్నులనుగా చేయటానికి కృష్ణుడు అనుకూలం అయ్యేటట్లు ప్రయత్నం చేయటం మంచిది. ఆ మహానుభావుని ఆజ్ఞను పాటించు.*

క. నారాయణుండు ధర్మా
ర్థారూఢము గాఁగఁ బలుకు; నది నీవును నీ
వారును గైకొని యెంతయు
గారవమునఁ జేయ నెల్ల కార్యంబు నగున్." 167

అ : నారాయణుండు = కృష్ణుడు; ధర్మ+అర్థ+ఆరూఢము = ధర్మమూ; అర్థమూ కలిగినది; కాఁగన్ = అయ్యేటట్లు; పలుకున్ = మాటాడుతాడు; అది= దానిని; నీవును; నీవారును; కైకొని = స్వీకరించి; ఎంతయున్ = మిక్కిలి; గారవమునన్ = గౌరవంతో; చేయన్ = చేస్తే; ఎల్ల కార్యంబున్ = పనిఅంతా; అగున్ = అవుతుంది.

భా : *శ్రీ కృష్ణుడు ధర్మార్థాలు రెండూ సమకూడేటట్లు పలుకుతాడు. నీవూ నీవాళ్ళూ ఆయన మాటను గ్రహించి సగౌరవంగా నిర్వర్తిస్తే సమస్త (సంధి) కార్యం చక్కబడుతుంది."*

క. అనుటయు సుయోధనుఁడు భీ
ష్మున కిట్లనుఁ; "బాండురాజు సుతులకు నిమ్మే

దిని హరి సగపా లీఁదగు
ననుఁబో; యే నీను గాని యది యట్లుండెన్. 168

అ : అనుటయున్ = అనగా; సుయోధనుఁడు; భీష్మునకున్; ఇట్లు; పాలు=సగభాగం; పాండురాజసుతులకు = పాండవులకు; ఈన్+తగున్ = ఇయ్యటం న్యాయం; (అని) అనున్+పో= అంటే; (అనటం నిశ్చయం); ఏన్ = నేను; ఈనుగాని = ఇవ్వనుగాని; అది = ఆవిషయం; అట్లు+ఉండెన్ = అలా ఉండనియ్యి.

భా : *ఆ మాటలువిని భీష్మునితో దుర్యోధనుడు ఇలా అంటున్నాడు "కృష్ణుడు పాండవులకు రాజ్యంలో సగభాగం ఇవ్వటం న్యాయం అని చెప్పితే నేను ఇవ్వను గదా! ఆ విషయం అలా ఉండనియ్యి.*

వి. పాండవుల రాజ్యాన్ని అపహరించటానికి జూదం రెండుమారులూ జరిగింది. దుర్యోధనుని మనస్సులో తిరిగి పాండవులకు రాజ్యం ఇవ్వటం అనే ఉద్దేశం ఏకోశానా లేదు. ఆ అభిప్రాయాన్ని చాలా సార్లు చెప్పాడు.

విరాట పర్వంలో అర్జునుడు ఉత్తరగోగ్రహణ సందర్భంలో యుద్ధానికి రావటం చూసి భీష్ముడు "ఇత్తఱిఁబొందగు చేఁతయుందగున్."అనగా(4.234) దుర్యోధనుడు చిరునవ్వుతో ఇలా అన్నాడు.

ఆ. **"మనకుఁ బాండురాజ తనయ వర్గమునకు**
నెట్లు పొందు గలుగు? నేను రాజ్య
భాగ మీను; సమరభంగిక విక్రమ
నిరతిఁ బూను టిదియ నిశ్చయంబు." **విరాట. 4ఆ.236ప.**

ఈ అభిప్రాయాన్నే దుర్యోధనుడు ఈ పద్యంలో "ఏనీనుగాని" అనే దానిలో వ్యక్తం చేశాడు.

వ. వేఱొక కార్యంబు సేయం దలంచితి నది వినుము. పాండవులకు నేడు గడయు జనార్దనుం; డతనిం బట్టి బంధించిన ఱెక్కలు విఱిగిన పులుఁగులుం బోలె వారు నాకు విధేయు లగుదురు. పాంచాల యాదవాదులైన తదీయబంధు మిత్రులు నావశంబున వర్తిల్లుచుందురు. సమస్త దేశంబులు నేన యేలుదు. దీనికిం దగిన యుపాయసహాయంబు లనువు సేసెద. నీ వింక నేమి సెప్పెదవు చెప్పు" మనిన విని యతి ఘోరంబగు నవ్విచారంబునకు నమాత్య సహితంబుగా సంతప్త చిత్తుండై వైచిత్ర్యవీర్యుండు గొడుకున కిట్లనియె. 169

అ : ఏడుగడయున్ = రక్షకుడు/దిక్కు; జనార్దనుండు = కృష్ణుడు; పులుగులు = పక్షులు; అనువు + చేసెద= సిద్ధంచేసుకుంటాను; ఆ+విచారంబునకు = ఆ ఆలోచనకు; అమాత్యసహితంబుగా = మంత్రుల తోగూడా; సంతప్తచిత్తుఁడు = సంతాపం చెందిన మనస్సు కలవాడు; వైచిత్యవీర్యుండు = విచిత్ర వీర్యుని కుమారుడు (ధృతరాష్ట్రుడు)

భా : *ఇంకోపని చేయదలచాను. అది విను. పాండవులకు కృష్ణుడే దిక్కు. అతనిని*

పట్టుకొని కట్టేస్తే వాళ్ళు రెక్కలు విరిగిన పక్షుల్లాగా నా వశవర్తు లౌతారు. పాంచాలురు, యాదవులు మొదలయిన ఆతని బంధువులు మిత్రులు నాకు స్వాధీనులయి ఉంటారు. సమస్త దేశాలను నేనే పరిపాలిస్తాను. ఇంక నీవు ఏంచెప్పదలుచుకున్నావో చెప్పు" అని దుర్యోధను డన్నాడు. ఆ మాటలు విని మిక్కిలి భయంకరమయిన ఆ ఆలోచనకు ధృతరాష్ట్రుడు మంత్రులతో సహా చాలా సంతాపం చెంది కొడుకుతో ఇలా అన్నాడు.

వి. దుర్యోధనుని దురాలోచన; దురాశ; దుష్టబుద్ధి ఇందులో స్పష్ట మవుతున్నాయి. అంతకుముందు సభాపర్వంలో తండ్రికి మాత్రమే తనదురాలోచన చెప్పేదుర్యోధనుడు ఇప్పుడు భీష్మ విదురుల ఎదుట నిర్భయంగా తన దుస్తంత్రాన్ని చెపుతున్నాడు. కృష్ణుని పట్టిబంధించాలి అనుకోవటంవల్ల దుర్యోధనునికి కృష్ణుడు సామాన్యవ్యక్తి అని అభిప్రాయం. ఆయన మహత్తును కని, విని గూడా అలా అనుకోవటం కేవలం మూర్ఖత్వమే.

క. **"ఓహో! ఇట్లనుట జగ**
ద్ద్రోహం; బిమ్మాట మఱువు; దూతత్వంబున్
మాహాత్మ్యంబును ధర్మో
త్సాహంబును విను మబాధ్యతకుఁ గారణముల్. 170

అ : ఓహో = ఔరా (ఆశ్చర్యం); ఇట్లు+అనుట = ఇలా అనటం;జగత్+ద్రోహంబు= సమస్తలోకాలకు ద్రోహంచేయటమే. ఈ+మాట; మఱువు = మరిచిపో; విను= (నామాట) విను; దూతత్వంబున్ = దూతధర్మమూ; మాహాత్మ్యంబును = శక్తి / సామర్థ్యం/ గొప్పతనమూ; ధర్మ+ ఉత్సాహంబున్ = ధర్మవిషయంలో పట్టుదలా(అనేవి కృష్ణుని); అబాధ్యతకున్=(ఒకరిచేత) బాధింప బడకుండటానికి; కారణముల్.

భా: *ఔరా! ఇలా అనటం సమస్త లోకాలకూ ద్రోహంచేయటమే. ఇప్పుడు నీవు అన్న మాటే మరచిపో. ఆ కృష్ణుడు ఇప్పుడు దూత: మాహాత్మ్యం కలవాడు. ధర్మనిర్వహణలో మిక్కిలి ఉత్సాహం గలవాడు. ఈమూడు విశేషాలవల్ల ఆతనిని బాధించటానికి ఏ మాత్రం వీలులేదు.*

వి. కృష్ణుని బంధిస్తాను అనటం ఆయన విషయంలోనే అపచారంకాదు. సమస్త లోకాలకూ ద్రోహం అవుతుంది. ఆ మాట అనుకోవటమే తప్పు. కృష్ణుడు బంధిప దగనివాడు అనటానికి ధృతరాష్ట్రుడు ఇందులో మూడు విషయాలు చెప్పాడు. వాటిల్లో మొదటిది దూతకావటం. దూతను బంధించటం రాజనీతికి విరుద్ధం. అంతకుముందు అనేక సందర్భాలలో శ్రీ కృష్ణుని మహత్తు అందరికీ పరిచితమైనదే. ధర్మోద్ధరణకు జన్మించాడు కాబట్టి కృష్ణునకు ధర్మోత్సాహం సహజం దీనికి మూలం ఇలా ఉంది.

దూతశ్చహి హృషీకేశః సంబంధీ చ ప్రియశ్చ నః
అపాపః కౌరవేయేషు స కథం బంధ మర్హతి. 88-18

శ్రీకృష్ణుడు ఇప్పుడు దూతగా వచ్చాడు. ఆయన మనకు చుట్టమూ; ఇష్టుడూ కూడా. కౌరవులకు ఎలాంటి ఆపద కలిగించలేదు. ఇలాంటి స్థితిలో ఆయనను ఏ కారణంతో బంధిస్తావు?

క. **ఈ కారణములు గల వను**
నా కొల(దియె వాసుదేవు(? డది గాకయు(గీ
డే కురువంశంబున కతని
రాక? యతం డేమి సేసెరా పాపాత్మా!" 171

అ : వాసుదేవు(డు= కృష్ణుడు; (బంధింపదగినవాడు కాదనటానికి) ఈ కారణములు= ఫలానాహేతువులు; కలవు = ఉన్నవి; అనున్=అనేటటువంటి; ఆకొల(దియె=ఆ పరిమితి ఉందా?; అది+కాకయున్ = అంతేకాకుండా; ఆతనిరాక = అతడురావటం; కురువంశంబునకు; కీడే =ఆపదయా?; పాపాత్మా = దుష్టబుద్ధీ; అతండు = ఆకృష్ణుడు; ఏమి+చేసెరా = ఏంచేశాడురా?

భా : *శ్రీకృష్ణుడు బంధింపదగినవాడు కాదు అనటానికి గలకారణాలకు పరిమితి ఉందా? అదీగాక అతడు ఇక్కడకు రావటం కురువంశానికి ఆపద అవుతుందా? పాపాత్ముడా! ఆయనేం చేశాడురా?"*

వి. ఎన్ని విధాలుగా పరిశీలించినా కృష్ణుని బంధించడం సముచితంకాదు. ధృతరాష్ట్రుడు కొడుకును మందలించటం భయంతోనూ కావచ్చు. లేక భీష్మవిదురాదులకు తన ఆంతర్యం తెలియకుండా ఉండటానికి చేసే నటనా కావచ్చు. ధృతరాష్ట్రుడు దుర్యోధనుని యందు గల పుత్రవ్యామోహంతో కొడుకుకు వంతపాడటమే భారతంలో చాలాచోట్ల కనిపిస్తుంది.

వ. **అని యదల్చె; నప్పుడు గాంగేయుం డాంబికేయున కిట్లను; 'నీకొడుకు ప్రాణగొడ్డం బైన కార్యంబు సేయం దలంచె; దామోదరు నిట్లుసేయం జూచెనేనిం దానును దనవారును వినాశంబు బొందుదు రింతియ; యిది సేసిరి సేయరైరి యమ్మహాత్మునెడ నీయపరాధంబు విచారించిన దుష్టాత్ములు నష్టాత్ముల కాక.".యని పలికి యేనిట్టిదాని వినం జాల ననుచు మొగంబు గంటు వెట్టుకొని దిగ్గన లేచిపోయె; ధృతరాష్ట్రుండును దుర్యోధనునితో"నిటువంటి కొఱగాములు మనంబునం దలంచినప్పుడు సేయంగల వా(డవు గావున దీనం జేటువచ్చు నుడుగు మయ్య;" యని చెప్పి; యతనిం దక్కినవారం బోవం బనిచి తగిన వర్తనంబున నుండె; మఱునా(డు.** 172

అ : అదల్చెన్ = గద్దించాడు; గాంగేయు(డు = గంగాకుమారుడు (భీష్ముడు); ఆంబికేయునకు = అంబికాకుమారునికి (ధృతరాష్ట్రునితో); ప్రాణగొడ్డంబు = ప్రాణాపాయకరం. దామోదరున్ = కృష్ణుని; విచారించిన = ఆలోచించిన; దుష్ట+ఆత్ములు = దుష్టమయిన మనస్సు గలవారు; నష్ట+ఆత్ములు+అ = నాశనమయిన శరీరంగలవారే; (మరణించేవారే); మొగంబు గంటు వెట్టుకొని=(కోపంతో)ముఖం ముడుచుకొని; కొఱగాములు=చెడ్డపనులు; తలంచినప్పుడు= అనుకొన్నప్పుడు; చేటు = కీడు; ఉడుగుము = మానుకో; తగినవర్తనంబునన్ = (అప్పటికి) తగినప్రవర్తనతో.

భా : *అని ధృతరాష్ట్రుడు దుర్యోధనుని అదిలించాడు. అప్పుడు భీష్ముడు ధృతరాష్ట్రునితో ఇలా అన్నాడు. 'నీకొడుకు ప్రాణాంతమయిన పని చేయాలని అనుకున్నాడు. కృష్ణుని ఇలా చెయ్యాలని అనుకొంటే తానూ తనవారూ సర్వనాశనం అవుతారు. ఇది*

ఇంతే. వీళ్ళు ఇదిచేశారు. చేయలేదు అనటానికి వీల్లేదు. ఆ మహానుభావుని విషయంలో ఈతప్పుచేయాలని ఆలోచించిన దుష్టులు నాశనమయినట్లే. ఇలాంటి మాటలు నేను వినలేను." అని కోపంతో ముఖం ముడుచుకొని దిగ్గునలేచి పోయాడు. అప్పుడు ధృతరాష్ట్రుడు దుర్యోధనునితో "నీవు ఇటువంటి దుష్కార్యాలు మనస్సులో అనుకున్నప్పుడే చేస్తుంటావు. దీనివల్ల ఆపద ముంచుకువస్తుంది. కాబట్టి దీన్ని విరమించు నాయనా!" అనిచెప్పి దుర్యోధనునికి తక్కినవారికి అక్కడినుంచి వెళ్ళటానికి అనుమతి నిచ్చి ఆసమయానికి తగిన కార్యకలాపాలు నిర్వర్తించసాగాడు. మర్నాడు-

వి. ఈ వచనంలోని ధృతరాష్ట్రుని మాటలవల్ల దుర్యోధనుని స్వభావం వ్యక్తం అవుతుంది. దుర్యోధనుడు చెడ్డపనులు చేయాలి అని అనుకున్న వెంటనే ముందు వెనుకలు ఆలోచించకుండా చేస్తాడు అని తండ్రి చెపుతున్నాడు. మంచిపనులను అతను ఎలాచేస్తాడో చెప్పలేదు. దుర్యోధనుని ఈ దురాలోచన భీష్ముని వంటివారు వినలేనిది.

సీ. కాలోచితము లగు కరణీయములు దీర్చి,
కమలనాభుఁడు రేపకడయ కదలి;
తనుఁ గుశస్థలవాసు లనుప రా నందఱు
నాదరంబున నిల్చి యరుగు నపుడు,
గజ్జంబులును బండ్లు గంధమాల్యంబులు
ధృతరాష్ట్ర సుతుఁడు పుత్తేరఁ బ్రీతి
నెడనెడఁ గొని వచ్చి యిచ్చిన, వాని నె
ల్లను వేడ్క ననుభవించిన విధంబు
తే. సలిపి; యనుభవ మొల్లక చనఁగ నెదుర
బాహ్లిక ద్రోణ భీష్మాది బంధుమిత్ర
గణము సర్వభూపాలలోకంబు గురుకు
మారవర్గంబుఁ బుత్తెంచె మనుజవిభుఁడు. 173

అ : కమలనాభుఁడు = కమలము నాభియందు గలవాడు (కృష్ణుడు); రేపకడయ= వేకువ; జామువనే; కాల+ఉచితములు = ఆసమయానికి తగినవి; అగు; కరణీయములు = చేయదగినపనులు; తీర్చి = చేసి; కదలి = బయలుదేరి; తనున్ = తనను; కుశస్థలవాసులు = కుశస్థలం అనే చోట నివసించేవారు; అనుపరాన్ =పంపించటానికి రాగా; అందఱన్; ఆదరంబునన్; నిల్చి; అరుగునపుడు = వెళ్ళేటప్పుడు; ధృతరాష్ట్రసుతుఁడు = దుర్యోధనుడు; కజ్జంబులును = భక్ష్యాలను; పండ్లున్; గంధమాల్యంబులున్ = మంచిగంధం; పూలమాలికలు; ప్రీతిన్ = ప్రేమతో; పుత్తేరన్ = పంపించగా; ఎడనెడన్ = అక్కడక్కడ; కొనివచ్చి = తీసుకొనివచ్చి; ఇచ్చినన్; వానిన్; ఎల్లను = అన్నింటినీ; ఒల్లక; వేడ్కన్ = కోరికతో; అనుభవించిన విధంబు = భుజంచిన రీతిని; సలిపి = చేసి; అనుభవము = (యథార్థంగా) తినటం; ఒల్లక = ఇష్టపడక; చనఁగన్= వెళ్ళగా; మనుజ విభుఁడు= రాజు(ధృతరాష్ట్రుడు); బాహ్లిక ద్రోణ భీష్మ+అది; బంధుమిత్రగణమున్ =

చుట్టాలమిత్రుల సమూహాన్నీ; సర్వభూపాలలోకంబున్=సమస్తమయిన రాజులసమూహాన్నీ; కరుకుమారవర్గంబున్= కురుకుమారుల సముదాయాన్నీ; ఎదురన్ = ఎదుర్కొనటానికి; పుత్తెంచెన్

భా : శ్రీకృష్ణుడు వేగుజాముననే లేచి ప్రాతఃకాలకృత్యాలు అన్నీ నిర్వర్తించి వెంటనే బయలుదేరాడు. కుశస్థల నివాసులందరూ తనను పంపించటానికి రాగా ఆయన ఆదరపూర్వకంగా వారిని ఆగమని చెప్పి ముందుకు వెళ్ళుతున్నాడు. ఆ సమయంలో దుర్యోధనుడు పంపించిన భక్ష్యాలను, పండ్లను, గంధమాల్యాలను సేవకులు ప్రేమ పూర్వకంగా మధ్యమధ్య తెచ్చి ఇస్తున్నారు. కృష్ణుడు వాటి నన్నిటినీ ఉపయోగించినట్లుగా ప్రవర్తించాడు. వాటిని భుజించటం ఆయనకు ఇష్టంకాలేదు. ఆయన అలా ప్రయాణమయి వెళ్ళుతున్నాడు. ఇంతలో ధృతరాష్ట్రుడు శ్రీ కృష్ణుని సగౌరవంగా ఎదుర్కొనటానికి బాహ్లీకుడు ద్రోణుడు భీష్ముడు మొదలయిన బంధువులను, మిత్రులనూ, సమస్తరాజలోకాన్నీ, కురుకుమార సమూహాన్నీ పంపించాడు.

వి. దూత శత్రుపక్షంవారు ఇచ్చే భక్ష్యాదులను తినరాదు. అవి దురుద్దేశంతో ఇచ్చేవీ, విషపూరితాలూ కావచ్చు. దుర్యోధనుడు తనింటికి భోజనానికి పిలిస్తే శ్రీ కృష్ణుడు "దూతలెందుం దొలిదొలి గుడువం గొనిగట్టఁదొడగుదురె? " అని అంటాడు. ఈ విషయాన్ని ఈ ఆశ్వాసంలో 222; 224 పద్యాలలో ఆయన వ్యక్తం చేస్తాడు.

-: శ్రీకృష్ణుఁడు ధృతరాష్ట్రుని మందిరంబునకుఁ బోవుట :-
సం : 5-87-1

వ. ఇట్లు దుర్యోధనుం డొక్కరుండు దక్క నెల్లవారిఁ దూర్యాది శోభన పదార్థంబులు సమకట్టి ధృతరాష్ట్రుండు వనుప నెదుర్కొనిన వాసుదేవుండు వారల నందఱ నయ్యై తెఱంగుల సంభావించి, కృతవర్మ దమవాఁడు గావున నతనికి సవిశేష స్నేహంబు సేసి, యతండు సేరువ రా సమస్తజనంబులుం బరివేష్టింపం జని, తనరాకకు నలంకృతంబును బ్రమోదచాపల సుభగజనంబును నైన పురంబు సొచ్చి రాజమార్గంబున నరుగు నవసరంబున మౌక్తికమిళితంబులు బహుగంధ లుళితంబులు నగు నక్షతప్రకరంబులును బుష్పనికరంబులునుం జల్లుచు సంతసిల్లుచు మ్రొక్కుచుఁ జొక్కుచు నిరుగెలంకుల రమ్య హర్మ్యంబులపై నిలిచి పొలిచి కనుంగొను నంగనాజనంబులు తమలోన. 174

అ : ఒక్కరుండు = ఒకడు; తక్కన్ = తప్ప; తూర్య+ఆదిశోభనపదార్థంబులు = మంగళవాద్యాలు మొదలయిన మంగళకరాలయిన వస్తువులు; సమకట్టి = సమకూర్చి; పనుపన్= పంపగా; ఆ+ఆ+ తెఱంగులన్ = ఆయావిధాలుగా; సంభావించి = గౌరవించి; సవిశేషస్నేహంబు= విశేషంతో గూడిన మైత్రి; చేరువ=దగ్గరగా; రాన్= రాగా; పరివేష్టింపన్ = చుట్టునుండగా; అలంకృతంబును = అలంకరించబడినదీ; ప్రమోదచాపల సుభగజనంబును= సంతోషంతో

నిలుకడ లేని సుందరమయిన జనులు గలది; చొచ్చి = ప్రవేశించి; అరుగునవసరంబున = వెళ్ళేటప్పుడు; మౌక్తికమిళితంబులు = ముత్యాలతో కలిసినవి; బహుగంధలుళితంబులు = అనేక సువాసనలతో మనోహరమయిన; అక్షతప్రకరంబు = అక్షతల సమూహం; పుష్పనికరంబును = పూలసమూహం; చొక్కుచు=పరవశిస్తూ; ఇరు+కెలంకుల=(రాజమార్గానికి)రెండువయిపులా; రమ్య హర్మ్యంబులపై = అందమయిన మేడల మీద; పొలిచి = శోభిల్లి (ఉండి); అంగనా-జనంబులు = స్త్రీలసమూహాలు.

భా : ఇలా దుర్యోధనుని ఒక్కణ్ణి మినహాయించి ధృతరాష్ట్రుడు తక్కిన వారిని *మంగళవాద్యాలూ మంగళకరమయిన ఇతర పదార్థాలతో పంపగా వారు శ్రీకృష్ణుని ఎదుర్కొన్నారు. ఆయన వారి నందరిని ఆయారీతులుగా గౌరవించాడు. కృతవర్మ తమవాడు కాబట్టి అతని యందు ఎక్కువ ప్రేమాభిమానాలు కనబర్చాడు. అతడు మిక్కిలి దగ్గరగా రాగా ఇతరజనులు చుట్టు పక్కల నుండగా కృష్ణుడు ముందుకు వెళ్ళాడు. తన రాక కారణంగా అలంకరింపబడి సంతోషంతో నిలుకడ లేని సుందర జనులున్న హస్తినాపురంలో ఆయన ప్రవేశించాడు. రాజమార్గంలో వెళ్ళుతున్నాడు. అప్పుడు ఆ రాజమార్గానికి రెండువైపులా ఉన్న సుందర సౌధాలమీద నిలిచి ఉన్న నాగరిక స్త్రీలు ఆయన మీద ముత్యాలతో గలిసిన; సువాసనలతో ఇంపయిన అక్షతలనూ, పూలనూ చల్లుతూ సంతోషిస్తూ నమస్కరిస్తూ, పరవశిస్తూ తమలోతాము (ఇలాఅనుకున్నారు.)*

ధార్తరాష్ట్రా స్త మాయాంతం ప్రత్యుజ్జగ్ముః స్వలంకృతాః
దుర్యోధనాదృతే సర్వే భీష్మద్రోణ కృపాదయః

దుర్యోధనుడు తప్ప ధృతరాష్ట్రుని పుత్రులు అందరూ, భీష్మద్రోణకృపాదులు తగిన వస్త్రభూషణాదులతో అలంకృతులై హస్తినాపురమువైపు వస్తున్న శ్రీ కృష్ణునికి స్వాగతం ఇవ్వటానికి వెళ్ళారు. అని ప్రస్తుత సందర్భంలో మూలంలోఉంది.

సీ : "ప్రాణంబుతోఁ గూడ రక్కసిచన్నుల
పాలు ద్రావిన ప్రౌఢ బాలుఁ డితఁడె;
వ్రేల్మిడిఁ జాణూరు విఱిచి లోకముల మె
చ్చించిన యా జగజెట్టి యితఁడె;
దుర్వృత్తుఁడగు కంసుఁ దునిమి యాతని తండ్రిఁ
బట్టంబు గట్టిన ప్రభు వితండె;
సత్యభామకుఁ బారిజాతంబుపైఁ గల
కోర్కి దీర్చిన రసికుం డితండె;
తే : వెన్నలును గోపికాచిత్త వృత్తములును
నరసి ముచ్చిల నేర్చిన హరి యితండె;
శ్రుతి శిరోభాగములఁ దన సుభగచరణ
సరసిజామోదమును గూర్చు చతురుఁ డితఁడె" 175

అ : ప్రాణంబుతోన్ + కూడన్ = ప్రాణాలతో గూడా; రక్కసి చన్నుల పాలు =రాక్షస స్త్రీ అయిన పూతన చనుబాలు; త్రావిన =తాగిన; ప్రౌఢబాలుఁడు= సమర్థుడయిన బాలుడు;ఇతఁడె.

వ్రేల్మిడిన్ = ఒక్క క్షణంలో; చాణూరున్ = చాణూరుడనే రాక్షసుని; విఱిచి = చంపి; లోకములన్=జగత్తులను / జనులను; మెచ్చించిన=మెప్పించిన; ఆ జగజెట్టి=లోకానికి అంతకూ శూరుడు; ఇతఁడె; దుర్వృత్తుఁడు + అగు = చెడు నడవడి గల వాడయిన; కంసున్; తునిమి = చంపి; అతని తండ్రిన్ = అతని తండ్రి అయిన ఉగ్రసేనుని; పట్టంబు + కట్టిన = రాజ్యమునందు పట్టాభిషేకం చేసిన; ప్రభువు = అధికారి; ఇతండె.

సత్యభామకున్; పారిజాతంబుపైన్ = పారిజాత పుష్పం మీద; కలకోర్కి = ఉన్న కోరికను; తీర్చిన; రసికుండు = సరసుడు; ఇతండె; వెన్నలును; గోపికా చిత్త వృత్తములును = గోపికల మనస్సుల ప్రవర్తనను; అరసి = కనిపెట్టి; ముచ్చిల నేర్చిన = దొంగిలించడం తెలిసిన; హరి = దొంగ; ఇతండె.

శ్రుతి శిరోభాగములన్ = వేదాల యొక్క శిరస్సుల ప్రదేశాలయందు; తన సుభగచరణ సరసిజ + ఆమోదమును = తన సుందరమయిన పాద పద్మాల సువాసనను; కూర్చు = కలిగించు; చతురుఁడు = నేర్పరి; ఇతఁడె.

భా : సఖులారా ! శైశవంలో పూతన అనే రాక్షసి చనుబాలతో పాటు ప్రాణాలు గూడా త్రాగిన ప్రౌఢ బాలుడు ఇతడే సుమా ! ఒక్క క్షణ కాలంలో చాణూరుడు అనే రాక్షసుని సంహరించి లోకాల ప్రశంసల నందుకొన్న ఆ మహావీరుడు ఇతడే సుమా ! దుర్మార్గుడయిన కంసుని సంహరించి ఆతని తండ్రి అయిన ఉగ్రసేనుని రాజ్య పట్టాభిషిక్తుని చేసిన మహాప్రభువు ఇతడే సుమా ! సత్యభామకు దేవలోకంలో ఉండే పారిజాత పుష్పం మీద ఉన్న కోర్కెను ఆ వృక్షమే తెచ్చి పెట్టి తీర్చిన మహా సరసుడు ఇతడే సుమా ! గోపాలకుల ఇండ్లలో ఉండే వెన్నలతో పాటు గోపికల మనస్సుల ప్రవర్తనను గూడా కనిపెట్టి అపహరించిన హరి ఇతడే సుమా ! వేదాల శిరోభాగాల యందు - ఉపనిషత్తులలో అందమయిన తన పాద పద్మాల పరిమళాలను సమకూర్చే నిపుణు డితడే సుమా !"

వి : మూలంలో నాలుగైదు శ్లోకాలలో శ్రీకృష్ణ దర్శనానికి పౌరులు ఎంత ఉత్సాహం చూపించారో వర్ణితమైంది.

న చ కశ్చిత్ గృహేరాజం స్తదాసీ ద్భరతర్షభ
న స్త్రీ న వృద్ధో న శిశు ర్వాసుదేవ దిదృక్షయా 89 - 7

అప్పుడు శ్రీ కృష్ణుని దర్శించాలనే కోరికతో స్త్రీలు; బాలురు; వృద్ధులు ఎవరూ ఇండ్లలో ఉండలేకపోయారు.

భాగవతం దశమస్కంధంలో శ్రీ కృష్ణుడు బలరాముడు గోవకులతో మధురానగరంలో ప్రవేశించినప్పుడు ఆ నగర స్త్రీలు ఆయనను చూచి

"వీఁడటే ! రక్కసి విగత జీవగఁ జన్నుఁ
బాలు ద్రావిన మేటి బాలకుండు"

అని అనుకున్నట్టు పోతన వ్రాసిన సీసపద్యాన్ని తిక్కన ప్రస్తుత పద్యం గుర్తు చేస్తుంది.

ఈ సీస పద్యంలో వర్ణితమయిన శ్రీ కృష్ణలీలలు భాగవతంలో దశమస్కంధంలో వివరంగా ఉన్నాయి.

వ : **అనుచు నతికుతూహలంబున నవలోకింప; నా బాలవృద్ధంబగు పౌరలోకం బాలోకన కౌతుకంబునఁ దనరథంబు గదిసిన సందడి జడియు వేత్రహస్తుల వారించుచు నారాయణుండు సమ్మర్ద మందగమనంబునం జని, మణితోరణ సుందరంబగు రాజమందిర ద్వారంబు ప్రవేశించి, కక్ష్యాంతరంబులు గడచి యేనుంగు మొగసాలఁ జొచ్చి యరదంబు డిగ్గి యల్లన నడచునప్పు డంతకు మున్న యరిగి భీష్మద్రోణ ప్రముఖులగు తగువారలు ధృతరాష్ట్రునిం బొదువ నతండుఁ బ్రత్యుత్థానంబు సేసి, విదుర సంజయ సహితంబుగా నెదుర్కొనం జేరి.** 176

అ : అతికుతూహలంబునన్ = మిక్కిలి ఆసక్తితో; అవలోకింపన్ = చూడగా; ఆ బాల వృద్ధంబు = చిన్న పిల్లల నుండి ముసలి వారి వరకు; ఆలోకన కౌతుకంబునన్ = చూచుట యందలి తహతహతో; కదిసిన = సమీపించిన; జడియు = అడ్డగించే; వేత్రహస్తులన్= బెత్తాల వారిని; సమ్మర్దమందగమనంబునన్=జన సమూహంలో మెల్లని నడకతో; కక్ష్యా+ అంతరంబులు= రాజ సౌధాల లోపలి భాగాలు; కడచి = దాటి ; ఏనుంగు మొగసాలన్ = ఏనుగు మీది నుండి దిగవలసిన ముందరి చావడిని; చొచ్చి= ప్రవేశించి; అల్లన= మెల్లగా; అరిగి = వెళ్ళి; పొదువన్ = కలిసి రాగా; ప్రత్యుత్థానంబు = ఎదురు రావటం.

భా : అని పౌర స్త్రీలు మిక్కిలి ఆసక్తితో శ్రీ కృష్ణుని చూస్తున్నారు. పౌరులు చిన్నా పెద్దా అందరూ ఆయనను దగ్గరగా చూడాలనే తహతహతో ఆయన రథాన్ని చుట్టుముట్టారు. బెత్తాల వారు అడ్డుకొనసాగారు. కృష్ణుడు వారిని వారిస్తూ జన సమ్మర్దం వల్ల మెల్లగా వెళ్ళి మణుల తోరణాలతో అందంగా ఉన్న రాజమందిర ద్వారం ప్రవేశించాడు. అనేక రాజభవనాలు దాటి ఆయన ఏనుగుల మీది నించి దిగవలసిన ముందరి చావిడిలో ప్రవేశించి రథం దిగి మెల్లగా నడుస్తున్నాడు. అప్పుడు భీష్మ ద్రోణాదులయిన ముఖ్యులు తదితరులు అంతకు ముందే ధృతరాష్ట్రుని చుట్టుముట్టి - కలిసి వస్తున్నారు. అతడు కృష్ణునికి ఎదురు వెళ్ళాడు. అప్పుడు విదురుడు సంజయుడు ఆయన వెంట ఉన్నారు.

ఆ. అతనిఁ గౌఁగిలించి, యచటఁ గల విదు
రాది శిష్టజనుల నాదరార్ద్ర
బంధు దృష్టిఁ జూచి, పరిరంభ సంభావ
నము లొనర్చి శౌరి ప్రమద మెసఁగ. 177

అ : శౌరి = శ్రీ కృష్ణుడు; అతనిన్ = ఆ ధృతరాష్ట్రుని; కౌఁగిలించి; అచటన్ = అక్కడ; కల విదుర + ఆదిశిష్టజనులన్ = ఉన్న విదురుడు మొదలయిన సజ్జనులను; ఆదర + ఆర్ద్రబంధు దృష్టిన్ = మన్ననతో (తడిసిన) మెత్తనయిన చుట్టపు చూపుతో; చూచి; ప్రమదము = సంతోషం; ఎసఁగన్ = అతిశయించగా; పరిరంభ సంభావనములు = కౌగిలించుకొనటం ఆదరించటం; ఒనర్చి = చేసి.

భా : కృష్ణుడు ధృతరాష్ట్రుని వద్దకు వచ్చి ఆయనను కౌగిలించుకున్నాడు. విదురుడు మొదలయిన సజ్జనులను ఆదరంతో మృదువయిన బాంధవ్య భావంతో చూశాడు. వారిని కౌగలించుకోవటం ఆదరించటం అనేవి సంతోషపూర్వంగా చేశాడు.

వ : వార లందఱకును సాత్యకిని దగిన సమాచారంబులు నడపం బనిచె; నటమున్న ధృతరాష్ట్రు పనుపునం దెచ్చి పెట్టిన నచ్చోటన యున్న యున్నత కనకాసనంబున నతం డునుప నాసీనుం డయ్యె. నవ్వాసుదేవునకు విహితానుష్ఠాన పరాయణులగు నగర పురోహితులు రాజానుమతంబున నర్ఘ్య పాద్య మధుపర్కా ద్యుపచారంబు లాచరించి యతని తమ్ముని నర్ఘపీఠంబున నునిచి యర్చించిరి. నర నాథుండును దొరలును నిజోచితాసనంబుల నుండిరి. కొలువెల్లను సూర్యోదయ సమయంబునఁ గమలాకరంబు విధంబున వికసించి యుండె; నయ్యవసరంబునఁ గృష్ణుండు ధర్మనందను వచనంబులుగా నాంబికేయునకుం దగువారలకుం బ్రణామ పరిరంభణ ప్రముఖ సముచిత సంభావనంబులు పలికి సంభాషణంబులకుం జొచ్చె. 178

అ : తగిన సమాచారంబులు = అప్పటికి.సముచితమైన నమస్కారాది ఆచరణలను; నడపన్+పనిచెన్ = జరపటానికి ఆజ్ఞాపించాడు; అటమున్ను+అ = అంతకుముందే; పనుపునన్= ఆజ్ఞతో; అ+చోటన = అక్కడనే; ఉన్నతకనక+ఆసనంబునన్ = ఎత్తయిన బంగారపు పీఠంమీద; ఉనుపన్ = ఉంచగా(కూర్చోపెట్టగా); ఆసీనుండు = కూర్చున్నవాడు; ఆ+వాసుదేవునకు = ఆ శ్రీకృష్ణునికి; విహిత+అనుష్ఠానపరాయణులు = శాస్త్రంవిధించిన కర్తవ్యాలను అనుష్ఠించేవారు; అగు నగరపురోహితులు = అయిన రాజపురోహితులు; రాజ+అనుమతంబునన్ = రాజు (ధృతరాష్ట్రుని) అనుమతితో; అర్ఘ్యపాద్యమధుపర్క+ఆది+ఉపచారంబులు = చేతులకునీళ్ళు; కాళ్ళకునీళ్ళు; తేనెతో గలిసినపదార్థం(ఇవ్వటం) మొదలయిన సత్కారాలు; ఆచరించి = చేసి; ఆతనితమ్మునిన్ = ఆ కృష్ణుని తమ్ముని (సాత్యకిని); అర్ఘపీఠంబునన్ = తగిన ఆసనంమీద; అర్చించిరి = పూజించారు; నరనాథుండును = రాజు; దొరలును = ముఖ్యులూ గొప్పవారూ; నిజ+ఉచిత+ఆసనంబులన్ =తమకు తగిన పీఠాలమీద; కొలువు+ఎల్లను = సభఅంతా; కమల+ ఆకరంబువిధంబునన్ = తామరకొలనువలె; వికసించి = వికాసంపొంది; ఆ+అవసరంబునన్= ఆసమయంలో; ఆంబికేయునకున్ = అంబికా కుమారునకు (ధృతరాష్ట్రునికి); తగువారలకున్= అర్హులయినవారికి; ప్రణామపరిరంభణ ప్రముఖ సముచిత సంభావనంబులు = నమస్కారాలు; కౌగిలింతలు; మొదలయిన తగిన గౌరవాలు;

భా : అక్కడ ఉన్న వారికి తనబదులుగా సముచితాచారాలను నిర్వహించటానికి కృష్ణుడు సాత్యకిని నియోగించాడు. అంతకుముందే ధృతరాష్ట్రుని ఆజ్ఞవలన అక్కడకు తెచ్చిపెట్టిన సమున్నతమయిన బంగారు సింహాసనం ఉన్నది. ధృతరాష్ట్రుడు స్వయంగా కూర్చోపెట్టగా కృష్ణుడు దానిమీద కూర్చున్నాడు. శాస్త్రం విధించిన సత్కర్మాచరణ

తత్పురులయిన రాజపురోహితులు రాజానుమతి ననుసరించి కృష్ణునికి అర్ఘ్యపాద్యాలు మధుపర్కం అనే సత్కారాలు చేశారు. అలాగే సాత్యకిని గూడా తగిన ఆసనంమీద కూర్చోబెట్టి గౌరవించారు. ధృతరాష్ట్రుడూ; తక్కిన ప్రముఖవ్యక్తులూ తమతమకు తగిన ఆసనాలమీద కూర్చున్నారు. ఆ మహాసభ అంతా సూర్యోదయసమయంలో తామరకొలను లాగా వికాసంతో ఉన్నది. అప్పుడు కృష్ణుడు ధర్మరాజు అన్నమాటలుగా ధృతరాష్ట్రునికీ అర్హులయిన పెద్దలకూ నమస్కారాలనూ; సములయిన వారికి ఆలింగనాలను తదితర మర్యాదలను వాగ్రూపంగా తెలిపాడు. తరువాత ఆయన సంభాషణ కుపక్రమించాడు.

వి. అర్ఘ్య పాద్య మధుపర్కాద్యుపచారంబులు.

అర్ఘ్యము= పూజకొరకు; గరిక; అక్షతలు; చందనం; పూలు; నీళ్ళు మొ॥ ఇవ్వటం. **పాద్యం=** ఇంటికివచ్చిన పూజ్యులకు కాళ్ళుకడగటాని కుపయోగించే జలం. **మధుపర్కము=** విశిష్టమైన అతిథివచ్చినప్పుడు గౌరవపూర్వకంగా ఇచ్చేతేనె; పెరుగు; నెయ్యి మొదలైనవి కలిపిన పదార్థం. ఒక వ్యక్తి చేతిలో మధువును ఉంచటం అని ఆ పదానికి శాబ్దికమైన అర్థం. **విష్టరం** (25 దర్భలతో చేసిన ఆసనవిశేషం); కాళ్ళు కడగటానికి నీళ్ళు; అర్ఘజలమూ (గంధపుష్పాదులతో సుగంధితజలము); ఆచమన జలమూ; మధుమిశ్రితమూ(మధుపర్కమూ); ఒక ఆవూ వీనిని పూజింపదగిన ప్రత్యేక వ్యక్తి వచ్చినప్పుడు ఒక్కొక్క దానిని ప్రత్యేకంగా ముమ్మారు ఉచ్చరిస్తారు. ఈమధుపర్కం ఇచ్చేవిధానం ఆపస్తంబ గృహ్యసూత్రాలు మొదలైన అనేక గ్రంథాలలో విస్తారంగా ఉంది.

అథ గాం మధుపర్కంచా ప్యుదకం చ జనార్దనే
ఉపాజహ్రు ర్యథా న్యాయం ధృతరాష్ట్రపురోహితాః 89-19

అప్పుడు ధృతరాష్ట్రపురోహితులు శ్రీకృష్ణుని ఆతిధ్యసత్కారానికి గోవును; మధుపర్కాన్ని; నీటినీ తెచ్చారు.

క. **రాజునకుఁ దియ్య మెసఁగెడు**
పూజావచనముల, నెయ్యపుం బలుకులఁ బే
రోజమెయి బంధుమిత్ర స
మాజములకు; మేలములఁ గుమారులకుఁ దగన్. 179

అ : రాజునకున్ = ధృతరాష్ట్రునికి; తియ్యము+ఎసఁగెడు = ప్రీతికలిగే; పూజా వచనములన్ = గౌరవ వాక్యాలతోనూ; బంధుమిత్రసమాజములకున్ = చుట్టాల మిత్రుల సమూహాలకు; పేరు+ఓజమెయిన్ = గొప్పనేర్పుతో; నెయ్యము+పలుకులన్ = స్నేహవచనాలతో; కుమారులకున్ = రాజకుమారులకు; తగన్ = తగినట్లుగా; మేలములన్ = సరసమయిన మాటలతోనూ.

భా : కృష్ణుడు ధృతరాష్ట్రునికి సంతోషం కలిగించే పూజావాక్యాలతోనూ, బంధుమిత్రులకు స్నేహపూర్వకమయిన మాటలతోనూ; రాజకుమారులకు యువకులకు సరసవచనాలతోనూ-

వ. **ఇంపు పుట్టించుచుఁ గొండొకసేపు నిలిచి పుండరీకాక్షుండు విదురుసద**

నంబునకుం జనియెద; మఱియుఁ బోవలయు నెడలకుం బోయివచ్చెద నని పలికి యాంబికేయు ననుమతి వడసి యరుగ విదురుండు ససంభ్రమంబునం గడచి చని మంగళోపచారసహితంబుగా నెదుర్కొని భయభక్తి వినయ స్నేహా నందంబులఁ గందళితుండగుచు గోవిందునకు దేవోపచారంబుల ననేక ప్రకారంబుల నర్చన లిచ్చి కౌంతేయుల కుశలం బడిగిన నతనికి వారల వృత్తాంతంబు సమస్తంబును సవిస్తరంబుగాఁ జెప్పిన యనంతరంబు.

అ : ఇంపు పుట్టించుచున్ = ఆనందం కలిగిస్తూ; కొండొకసేపు = కొంచెంసేపు; పుండరీక+అక్షుండు = పద్మాలవంటి కన్నులు కలవాడు- కృష్ణుడు; సదనంబునకున్ = ఇంటికి; చనియెదన్ = వెళ్తాను; పోవలయు+ఎడలకున్ = వెళ్ళవలసినచోట్లకు; ససంభ్రమంబునన్ = తొట్రుపాటుతో; కడచిచని = తొలగిపోయి; మంగళ+ఉపచారసహితంబుగాన్ = శుభకరమయిన గౌరవాలతో; కందళితుండు = వికాసంపొందినవాడు; గోవిందునకున్ = కృష్ణునకు; దేవ+ఉపచారంబులన్ = దేవతలకు చేసే పూజల వంటి పూజలతో; సవిస్తరంబుగాన్ = వివరంగా; అనంతరంబ = తరువాత.

భా : *ఆనందం కలిగిస్తూ కొంతసేపు ఉండి కృష్ణుడు "విదురుని ఇంటికి వెళ్తాను. ఇంకా వెళ్ళవలసిన చోట్లకు వెళ్ళివస్తాను;" అని చెప్పి ధృతరాష్ట్రుని అనుమతి తీసుకుని బయలుదేరాడు. ఇంతలో విదురుడు చాలాత్వరగా అక్కడినించి వెళ్ళి మంగళకరమయిన పూజా విశేషాలతో కృష్ణునికి ఎదురువచ్చాడు. భయమూ, భక్తీ, వినయమూ, స్నేహమూ, ఆనందాలతో వికసించిన మనస్సుతో దేవతలకు చేయదగిన పూజలతో కృష్ణుని పూజించాడు. ఆయన కృష్ణుని పాండవుల క్షేమాన్ని గూర్చి అడిగాడు. కృష్ణుడు ఆయనకు వారివృత్తాంతం అంతా వివరంగా చెప్పాడు. తరువాత.*

క. ముదమునఁ గృష్ణుఁడు గుంతీ
సదనమునకుఁ జనియె; నపుడు సమ్మదమున న
వ్విదురుం డోగిర మొనరిం
చెద నని తన్నడుగ నట్ల చేయుం డనుచున్. 181

అ : కృష్ణుఁడు; ముదమునన్ = సంతోషంతో; కుంతీసదనమునకున్ = కుంతీదేవి నివాసానికి; చనియెన్ = వెళ్ళాడు; అపుడు; ఆ+విదురుండు; సమ్మదమునన్ = సంతోషంతో; ఓగిరము = అన్నము (ఆహారము); ఒనరించెదన్ = (సిద్ధం) చేస్తాను; అని; తన్ను=తనను కృష్ణుని); అడుగన్ = అడగ్గా; అట్లు+అ = అలాగే; చేయుండు = చెయ్యండి; అనుచున్ = అంటూ.

భా : *కృష్ణుడు సంతోషంగా కుంతీదేవి నివాసానికి వెళ్ళాడు. అప్పుడు విదురుడు ఆనందంతో నీకు భోజనం ఏర్పాట్లు చేస్తాను అని ఆయనను అడిగాడు. ఆయన అలాగే చేయండి అన్నాడు.*

వ. చని కాంచిన నద్దేవియు నతని తోడునీడయుం బోని తనకొడుకులం

దలంచి యడలు పుట్టిన నమ్మాధవు మెడ వట్టికొని యెలుంగెత్తి యేడ్చిన నతండు సంబోధించి యూరార్ప నెట్టకేలకు నుడిగి యాతనికి నాసనవిన్యాసా ద్యుపచారంబులు సేయించి తత్సమీపంబున నుచితపీఠంబునం గూర్చుండి గద్గద కంఠంబుతో నిట్లనియె. 182

అ : కాంచినన్ = చూడగా; ఆ+దేవియున్ = ఆ కుంతీదేవికూడా; అతని తోడు నీడయుం బోని = ఆకృష్ణుని వెంట ఉండే నీడలాంటి; అడలు = దుఃఖం; ఆ+మాధవుమెడ + పట్టికొని; ఎలుంగెత్తి = పెద్దకంఠస్వరంతో; సంబోధించి = పిలిచి (తెలివికి తెచ్చి); ఊరార్పన్ = ఓదార్చగా; ఎట్టకేలకున్ = చిట్టచివరకు; ఉడిగి = (దుఃఖించటం) మాని; ఆసనవిన్యాస+ అది+ ఉపచారంబులు = పీఠం(కుర్చీ)వేయించటం మొదలయిన సత్కారాలు; తత్+ సమీపంబునన్= ఆయనకు దగ్గరగా; ఉచితపీఠంబునన్ = తగిన ఆసనంమీద; గద్గదకంఠంబునన్ = డగ్గుత్తిక పడిన కంఠస్వరంతో.

భా: *కృష్ణుడు వెళ్ళి కుంతీదేవికి కన్పించాడు. ఆయనను చూచేసరికి ఆమెకు ఆయనకు తోడునీడలాగా ఉండే తనకుమారులు పాండవులు గుర్తుకొచ్చారు. అందువల్ల కలిగిన దుఃఖంతో ఆమె కృష్ణుని మెడ కౌగలించుకొని పెద్దగా ఏడ్చింది. ఆయన ఆమెను ఓదార్చాడు. అతికష్టం మీద ఆమె ఆదుఃఖం దిగమింగి ఆయనకు కుర్చీవేయించటం వంటి ఉపచారాలు చేయించింది. ఆయనకు సమీపంలో తగిన ఆసనంమీద కూర్చొని కుంతీదేవి గద్గదమయిన కంఠంతో ఇలా అన్నది.*

అవ. *19 పద్యగద్యాలలో కవి కుంతీ హృదయాన్ని ఆవిష్కరిస్తున్నాడు.*

సీ. "నీశిక్షఁ బెరుగుట నీతిమంతులుఁ బుణ్య
పరులు శూరులు గదా పాండుసుతులు;
సుఖవృత్తిఁ బెక్కండ్రు సూరెలఁ గొలువ నుం
డెడువార; లిడుమలఁ బడుచు నిర్జ
నంబైన కానలోనన యెట్లు నిలిచిరి;
ననుఁ బెట్టి నాయెద గొనుచుఁ జనిరి;
యేను వర్థింపంగ నింపారఁ గుడిచి మె
త్తని సెజ్జ నిద్రించి వినుతభద్ర
తే. గాన కరిబృంహితముల మేల్కాంచు నట్టి
వారు కందమూలంబు లాహారములుగఁ
బొదలఁ బుట్టలఁ బడియుండి పులుగు మెకము
లఱవ మేల్కను చుండిరే? యక్కటకట! 183

అ : పాండుసుతులు; నీశిక్షన్= నీబోధనలో-నీశాసనంలో; పెరుగుటన్; నీతి మంతులు= నీతికలవారు; పుణ్యపరులు = పుణ్యమునం దాసక్తి కలవారు; శూరులు; కదా!

పెక్కండ్రు = చాలమంది; సూరెలన్ = పక్కనుండి; కొలువన్ = సేవించగా; సుఖవృత్తిన్ =సుఖవర్తనంతో; ఉండెడువారలు = ఉండేవాళ్ళు; ఇడుమలన్+పడుచున్ = కష్టాలు పడుతూ; నిర్జనంబు+ఐన = జనులు లేనిదైన; కానలోనన = అడవిలోనే; ఎట్లు = ఎలా; నిలిచిరి= ఉన్నారు; ననున్ =నన్ను; పెట్టి = (ఇక్కడ) ఉంచి; నా+ఎదన్ = నామనస్సును; కొనుచున్+ చనిరి = తీసుకొని వెళ్ళిపోయారు; ఏను=నేను; వడ్డింపంగన్= వడ్డించగా; ఇంపారన్ = సంతృప్తిగా; కుడిచి= భుజించి; మెత్తనిసెజ్జన్=మెత్తనిపక్కమీద; నిద్రించి; వినుతభద్రగాన; కరిబృంహితములన్ = ప్రశస్తమయిన మంగళగానాలతోనూ; ఏనుగులఘీంకారాలతోనూ; మేల్కాంచునట్టివారు = మేలుకొనేవారు; కందమూలంబులు = దుంపలూ, (కొన్నిచెట్ల) వేళ్లూ; ఆహారములుగన్; పొదలన్; పుట్టలన్; పడియుండి; పులుఁగు మెకములు = పక్షులు, క్రూరమృగాలు; అఱవన్; మేల్కను చుండిరే= మేలుకుంటున్నారా?; అక్కట+అకట = అయ్యయ్యో!

భా : *పాండవులు నీశిక్షణలో పెరగటంవల్లనే నీతిమంతులూ, పుణ్యాత్ములూ; శూరులు అయినారు గదా! అనేకులు చుట్టుపక్కల ఉండి సేవిస్తుండగా సుఖంగా ఉండేవారు అనేకకష్టాలు పడుతూ నిర్జనారణ్యాలలో ఎలా నివసించగలిగారు? వారు అడవులకు వెడుతూ నా మనసంతా కొనిపోయారు. పూర్వం నేను స్వయంగా వడ్డించగా తృప్తిగా భుజించి మెత్తటి పక్కలమీద హాయిగా నిద్రించి మంగళగానాలతోనూ, ఏనుగుల ఘీంకారాలతోనూ మేలుకొనే పాండవులు కందమూలాలే ఆహారంగా పొదలమీదా పుట్టలమీదా పడి ఉండి పక్షులూ, క్రూరమృగాలూ అరుస్తుంటే నిద్ర లేస్తున్నారా? అయ్యయ్యో! ఎంత దైన్యంకలిగింది!*

వి. తల్లి కడుపుకోత కరుణరసంగా ఇందులో ప్రవహించింది. తనకుప్రత్యక్షంలో పాండవులు అనుభవించిన సుఖాలకంటె పరోక్షంలో పడేకష్టాలూ కడగండ్లు ఆమె హృదయక్షోభకు కారణాలు. భగవంతుని శిక్షణలో పెరిగి బుద్ధిమంతులయిన వారికా ఈ కష్టాలు? అని ఆమె ఆయననే(కృష్ణునే) నిలదీసి అడుగుతున్నది.

ఆ. తండ్రిలేని ప్రజలు దల్లినిఁబాసి పె
ద్దయును గాల మివ్విధమునఁ బడిరి
భంగపాటు; దుఃఖపాటును సంకట
పాటు గలిగె విరటు పాలఁ బిదప." 184

అ : తండ్రిలేని; ప్రజలు = సంతతి/ పిల్లలు; తల్లిని; పాసి = విడిచి; పెద్దయును+ కాలము = చాలాకాలం; ఈ+విధమునన్ = ఇలా; భంగపాటున్ = అవమానం; పడిరి; పిదపన్ = తరువాత; విరటుపాలన్ = విరాటరాజువద్ద; దుఃఖపాటును = దుఃఖపడటమూ; సంకట పాటును= కష్టపడటమూ; కలిగెన్.

భా : *తండ్రిలేని పిల్లలు తల్లికి దూరమై చాలా కాలం ఇలా అడవులలో అవమానాల పాలయ్యారు. తరువాత విరాటరాజు కొలువులో దుఃఖాలూ కష్టాలూ అనుభవించారు.*

వి : సంతానానికి తల్లి దండ్రుల అండదండలు చాలా అవసరం. తండ్రిలేకపోతే పిల్లలు దిక్కులేని వాళ్ళవుతారు. పాండురాజు మరణమే పాండవుల కష్టాలకు అవమానాలకు

నాంది. ఆయనే బ్రతికి ఉంటే భారతకథే ఉండేది కాదేమో! తండ్రి సంతతి భవిష్యత్తుకు కావలసినవాటిని సమాయత్తం చేస్తే తల్లి వారిని ప్రేమతో అన్నపానాలు సకాలంలో సరిగా సమకూరుస్తూ పోషిస్తుంటుంది.

పాండవులు ఈసమయంలో పిల్లల తండ్రులు కాని పిల్లలుకారు. పిల్లలు ఎంతపెద్ద వాళ్ళయినా తల్లిదృష్టిలో వాళ్ళు పసివాళ్ళే! తల్లి మమకారం అలాంటిది!

ఈ పద్యంలో అన్వయం ఇంకోవిధంగా కూడా చెప్పవచ్చు. తండ్రిలేనిప్రజలు ఇవ్విధమునన్ = ఇలాగా(కష్టాలు) పడిరి; పిదప; విరటుపాలన్; భంగపాటున్; కలిగెన్.

వ. **అని వెండియు.** 185

భా. అని మళ్ళీ.

ఉ. **దానదయాపరుం డయిన ధర్మతనూభవు సేమ మెట్లు? పం**
చానన విక్రముం డగు బకారికి భద్రమె? యస్త్ర శస్త్రవి
ద్యానిపుణుండు క్రీడి సుఖియా? వినయాభరణుల్ గవల్ సమా
ధాన సమేతులే? యకట! ద్రౌపది సాధ్వి; సుఖంబె దానికిన్? 186

అ : దానదయాపరుండు = దానము నందు దయయందు ప్రీతిగలవాడు; అయిన ధర్మతనూభవుసేమము=అయిన ధర్మరాజు క్షేమము; ఎట్లు=ఎలాగున్నది?; పంచానన విక్రముండు= సింహపరాక్రమము వంటి పరాక్రమం కలవాడు; అగు = అయిన; బక+అరికిన్= బకాసురుని శత్రువుకు భీమునికి; భద్రమె = శుభమా?; అస్త్ర.... నిపుణుండు; అస్త్రశస్త్రవిద్యా = బాణాలు ఖడ్గాలు ప్రయోగించే విద్యలలో; నిపుణుండు = నేర్పరి అయిన; క్రీడి = అర్జునుడు; సుఖి+ఆ = సుఖం గలవాడేనా?; వినయ+ఆ భరణుల్ = వినయమే అలంకారంగాగల; కవల్ = నకులసహదేవులు; సమాధాన సమేతులే = నెమ్మదితో గూడి ఉన్నారా?; అకట = అయ్యో; ద్రౌపది; సాధ్వి = పతివ్రత; దానికిన్ = ఆమెకు; సుఖంబె = సుఖమేనా?

భా: *నిరంతరం దానం చేయటం, దయచూపటంలో ఆసక్తుడయిన ధర్మరాజు క్షేమంగా ఉన్నాడా? సింహపరాక్రము డయిన భీమునికి శుభమేనా? అస్త్రశస్త్ర విద్యలలో ఆరితేరిన అర్జునుడు సుఖంగా ఉన్నాడా? వినయభూషణు లయిన నకుల సహదేవులు నెమ్మదిగా ఉన్నారా? ద్రౌపది మహాపతివ్రత. ఆమె సుఖంగా ఉన్నదా?*

వి. 25 శ్లోకాలలో మూలంలో ఉన్నవిషయాన్ని కవి ఈ పద్యంలో సంగ్రహించాడు.

మమకారపూర్ణ అయిన తల్లి తన సంతతిక్షేమ సమాచారాలు అడిగేతీరు ఇందులో ఉంది. ధర్మరాజాదులలో ఆతల్లికి నచ్చినగుణాలను చెవుతూ తిక్కన ఇక్కడ వారి ప్రధాన వ్యక్తిత్వాన్ని సూచిస్తున్నాడు.

చ. **కొడుకులకంటె నయ్యనుఁగుఁ గోడలి కెక్కుడు గూర్తుఁ; గోడలుం**
గొడుకులు సేయు భక్తి కట కోటి మడుంగులు భక్తి నాకు నె
ప్పుడుఁ దగఁ జేయుచుండు; నది పుణ్య చరిత్ర కులాగ్రగణ్య; క్రొ
త్తడి సకలంబుఁ జూడ సభ దైన్యముఁ బొందుట సూచి పొక్కితిన్. 187

అ : కొడుకులకంటెన్ = కుమారులకన్నా; ఆ+అనుఁగున్+కోడలికిన్ = ఆప్రియ మయిన కోడలికి; ఎక్కుడు = ఎక్కువ; కూర్తున్ = ఇష్టురాల నవుతాను; కోడలున్; నాకు;అటన్; కొడుకులు; చేయుభక్తికిన్; కోటిమడుంగులు = కోటిరెట్లు; భక్తిన్; ఎప్పుడున్; తగన్= తగినట్లు; చేయుచుండున్; పుణ్యచరిత్ర = పవిత్రమయిన శీలము గలది; కుల+అగ్ర గణ్య = (చంద్ర) వంశంలో ముందు లెక్కింప దగినది; క్రొత్తడి = పతివ్రత అయిన; అది = ఆద్రౌపది; సకలంబున్= సమస్తజనులును; చూడన్ సభన్; దైన్యమున్ = దీనత్వాన్ని; పొందుట; చూచి; పొక్కితిన్ = దుఃఖించాను.

భా : *కృష్ణా! ఆప్రియమయిన కోడలికి నాకొడుకులయిన పాండవులకంటె గూడా నేనే ఎక్కువ ఇష్టం. ఆ కోడలు ద్రౌపది నాకొడుకులు చూపించే భక్తి కంటె కోటిరెట్లు ఎక్కువగా ఎల్లప్పుడు నన్ను భక్తితో సేవిస్తుంటుంది. ఆమె పవిత్ర శీలవతి. కౌరవవంశంలో అగ్రగణ్యురాలు. అలాంటి పతివ్రత మహాసభలో అందరూ చూస్తుండగా అవమానాలపాలు కావటం చూసి దుఃఖించాను.*

వి : అత్తాకోడళ్ళ అనుబంధానికి ఆదర్శం కుంతీ ద్రౌపదుల ప్రవర్తన.

తే. నాఁడు ద్రౌపది పడిన బన్నముల సూడ
నోర్చినప్పుడ యెంతకు నోర్వఁ జెపుమ!
యంతగడచిన దుఃఖంబు లనుభవింపఁ
గలవె లోకంబు వారికిఁ గమలనాభ! 188

అ : నాఁడు; ద్రౌపది; పడినబన్నములు = పడినఅవమానాలు; చూడన్+ఓర్చిన+ అప్పుడు+అ = చూడగలిగినఅప్పుడే; ఎంతకున్; ఓర్వన్ = సహించలేను?; చెపుమ; కమలనాభ= కృష్ణా!; లోకంబువారికిన్ = లోకంలో ఉన్న వారికి; అంత = అంతగా; కడచిన = మితిమీరిన; దుఃఖంబులు; అనుభవింపన్ = అనుభవించటానికి; కలవె = ఉన్నవా?

భా : *కృష్ణా! ఆనాడు ద్రౌపది పడిన అవమానాలు చూచి సహించగలిగినప్పుడు నేను ఇంక ఎంత తీవ్రమయిన వాటినైనా ఓర్వలేనా? నీవు చెప్పు. లోకంలో ఎవరికయినా అంత మితిమీరిన దుఃఖాలు అనుభవింప వీలవుతుందా?*

వ. అట్టియెడ. 189

భా : *ఆ సమయంలో.*

క. విదురుం డొక్కఁడు దక్కఁగ
సదస్యు లెవ్వరును ధర్మసంక్షయ మిది గూ
డదు నార; యతని శీలమ
కుదు రీలోకమున కింతకుం దలఁపంగన్" 190

అ : విదురుండు ఒక్కఁడు; తక్కఁగ = తప్ప; సదస్యులు = సభ్యులు; ఎవ్వరును; ధర్మసంక్షయము = ధర్మాన్ని బాగాక్షీణింపజేసే; ఇది = ఈనీచపుపని; కూడదు = తగదు; నార= అననేఅనరు; తలఁపంగన్ = బాగా ఆలోచిస్తే; ఈలోకమునకున్+ఇంతకున్ = ఈ లోకానికి

ఇంతటికీ; అతని శీలము+అ = ఆవిదురుని ప్రవర్తనమే- నడవడియే; కుదురు = పాదు;

భా : *ఆ సభలో విదురుడు ఒక్కడు తప్ప తక్కిన సభ్యులెవ్వరూ ఈనీచపుపని ధర్మనాశకము, తగదు అని అనలేదు కదా! చక్కగా ఆలోచిస్తే ఆ విదురుని మంచి శీలమే ఈలోకానికి అంతటికి పాదు అని అనిపిస్తుంది."*

వ. అని యివ్విధంబునఁ గృష్ణుతోడఁ దనయుమ్మలికంబు లన్నియుఁ ద్రవ్వి కొని శోకంబు వెల్లిగొనఁ గొండొక దిగంబాఱెడు చిత్తంబుతో మఱియు నిట్లనియె. 191

అ : ఉమ్మలికంబులు = కష్టాలు బాధలు; వెల్లిగొనన్ = ప్రవహించగా; కొండొక = కొంచెం; దిగంబాఱెడు = దిగజారే;

భా : *అని కుంతీదేవి ఇలా కృష్ణునికి తన బాధలు అన్నీ త్రవ్విపోసినట్లు చెప్పింది. దుఃఖం వెల్లివిరియగా మనస్సు కొంచెం దిగజారుతుండగా ఆమె మళ్ళీ ఇలాఅన్నది.*

క. " ఇది యెల్లను నొకతల; యీ
పదుమూఁ డేడులును నాకు బావ కొడుకుచే
నదయ మగు కూడు గుడుచుట
యది యొకతల యయ్యెఁ; నేమి యన గలఁ దనఘా! 192

అ : అనఘా = పవిత్రుడా; ఇది = ఈ చెప్పింది; ఎల్లను = అంతా; ఒకతల = ఒకవైపు(ఒకెత్తు); ఈ పదుమూఁడు+ఏడులును; నాకున్; బావ కొడుకుచేన్ = బావగారి (ధృతరాష్ట్రుని) కొడుకు- దుర్యోధనుని ద్వారా; అదయము+అగు = దయలేనిదైన; కూడు = ఆహారం; కుడుచుట = తినటం; అది = అనేది; ఒకతల = ఒక ఎత్తు); అయ్యెన్ = అయింది. ఏమి+అనగలదు = ఏంఅనగలం?

భా : *కృష్ణా! ఇంతవరకూ నేను చెప్పిన బాధలు కష్టాలు అన్నీ ఒక ఎత్తు. ఈ పదమూడేళ్ళూ మా బావగారి కొడుకు దుర్యోధనుడు దయా దాక్షిణ్యాలు లేకుండా పెట్టిన కూడు తినటం ఒకెత్తు అయింది. నాకష్టాలను గూర్చి ఏమని చెప్పేది?*

వి. జూదం కారణంగా పాండవులూ ద్రౌపదీ అడవుల్లో విరాటనగరంలో బాధలు పడ్డారు. కుంతీదేవి హస్తినాపురంలో విదురుని ఇంటిలో ఉంది. కుంతీదేవి విషయంలో దుర్యోధనుని ప్రవర్తన చాలా నీచంగా ఉండేది. పదమూడు సంవత్సరాలు అంతఃపురంలో ఉన్నా కుంతీదేవి చాలా న్యూనమయిన జీవనం గడిపింది. కుమారులు అడవులపాలయినారని కలిగే దుఃఖంకంటే మించింది దుర్యోధనుడు (పరుషంగా, నీచంగా మాట్లాడుతూ) పెట్టే తిండి తినడం. ఆమె మానసిక వేదన మాటల కందనిది.

క. తన్నుఁ దనతమ్ములను నా
కన్న కొడుకులట్ల తలఁతుఁ గాని విభేదం
బెన్నఁడు నామది లేమికి
వెన్నుఁడ! దైవంబు సాక్షి! వినుము పలికెదన్. 193

అ : తన్నున్ = తనను (దుర్యోధనుని); తన తమ్ములను = అతనితమ్ములను; నాకన్నకొడుకులు+ అట్లు = నాకన్నకొడుకులవలెనే; తలఁతున్+కాని = అనుకుంటానుగాని; నామదిన్ = నామనస్సులో; విభేదంబు = భేదభావము ఎన్నఁడున్; లేమికి = లేకపోవటానికి; వెన్నుఁడ = కృష్ణా; దైవంబు+అ = దైవమే; సాక్షి; వినుము, పలికెదన్ = చెపుతున్నాను; వినుము.

భా : *కృష్ణా! ఆ దుర్యోధనునీ, అతని తమ్ములనూ నాకన్న కొడుకులవలెనే భావిస్తాను గాని నామనస్సులో ఏనాడూ భేదభావం లేదనటానికి ఆదైవమే సాక్షి అని నేను అంటున్నాను; విను.*

వి. కుంతి తనకు కౌరవపాండవుల విషయంలో సమానభావమే గాని భేదభావం లేదని దైవం మీద ఒట్టు పెట్టి చెపుతున్నది. పదమూడు సంవత్సరాలు దుర్యోధనుని నిర్లక్ష్యానికి చులకనకు గురిఅయి ఆమె మనస్సు వికలం అయింది. కౌరవులమీద ఆమెకు అసహ్యభావం ఏర్పడ్డది. ఈ విషయాన్నే రాబోయే పద్యాలలో ఆమె వ్యక్తీకరిస్తున్నది.

క. ఇది నిక్కం బగు నేనియుఁ
దుది నీవుం బాండవులును దురిత రహితులై
ముదమందఁ జూడఁ గనియెద;
నది దీనికి మందు సువ్వె యంబుజనాభా! 194

అ : ఇది = ఈసమానభావం; నిక్కంబు = నిజం; అగునేనియున్ = అయితే; తుదిన్= చివరకు; నీవున్; పాండవులును; దురిత రహితులు+ఐ = దోషం (పాపం) లేనివారై; ముదము+ అందన్ = సంతోషపడగా; చూడన్+కనియెదన్=చూడటాన్ని పొందుతాను (చూడగలను); అంబు జనాభా= పద్మం బొడ్డులో ఉన్నవాడా- కృష్ణా! దీనికిన్= ఈ బాధకు; అది = ఆపైది; మందు+చువ్వె= మందుసుమా!

భా : *కృష్ణా! నేను చెప్పిన ఈ అభేదభావం యథార్థం అయితే ఈ యుద్ధావ-సానంలో నీవూ, పాండవులూ నిర్దోషులై సంతోషంగా ఉండటం తప్పక చూస్తాను. అదే ఈ బాధ లన్నిటికీ సరిఐన మందు.*

వి. పై రెండు పద్యాలకు మూలం ఇలా ఉంది.
న మే విశేషో జాత్వాసీద్ ధార్త రాష్ట్రేషు పాండవైః
తేన సత్యేన కృష్ణ త్వాం హతామిత్రం శ్రియావృతమ్
అస్మాద్విముక్తం సంగ్రామాత్ పశ్యేయం పాండవైః సహ
నైవ శక్యాః పరాజేతుం సర్వం హ్యేషాం తథా విధమ్. 90 61; 62

శ్రీ కృష్ణా! నా మనస్సులో పాండవులు ధృతరాష్ట్ర పుత్రులలో ఎప్పుడూ భేద భావంలేదు. ఈ సత్యప్రభావంతో నీవు రాబోయే యుద్ధంలో శత్రువులను సంహరించి పాండవులతో గూడా సంకటవిముక్తుడవై రావటం నేను తప్పక చూస్తాను. రాజ్యలక్ష్మి మిమ్ములనే వరించింది. శత్రువులచేతిలో పరాభవం పొందని సమస్తగుణాలు పాండవులలో ఉన్నాయి.

సీ. బావ యొప్పం డను పలుకుల నే మగు;
నాతని కొడుకుఁ గీడాడ నేల;

కురువృద్ధుఁడగు బాహ్లికుని దూఱ నేటికి;
భీష్మునిపైఁ బ్రయి వెట్ట నగునె;
ఇట్టిక్రూరుల యింటి కిచ్చిన మనవారి
నందుగా; కట్లు దా ననుట మేలె?
యర్జును పుట్టిన యప్పుడు వీఁడు లో
కములెల్ల గెల్చుపొగడ్త మొగులు
తే. ముట్టు నట్టిదయగు; రణమున జయించుఁ
గౌరవుల; సోదరులుఁ దాను భూరిరాజ్య
గౌరవముఁ బొందు నని యశరీరవాణి
పలికె; నది దిట్టువడుఁ గాక వలయునేని. 195

అ : బావ = బావగారైన ధృతరాష్ట్రుడు; ఒప్పండు = ఒప్పుకోడు; అనుపలుకులన్= అనే మాటల వల్ల; ఏమి+అగున్ = ఏమవుతుంది?; ఆతనికొడుకున్ = ఆధృతరాష్ట్రుని కుమారుని దుర్యోధనుని; కీడాడన్+ఏల = నిందించటం ఎందుకు?

కురువృద్ధుఁడు = కురువంశంలో ముసలివాడు; అగుబాహ్లికున్; దూఱన్+ఏటికి = నిందించటం ఎందుకు?; భీష్మునిపైన్; ప్రయివెట్టన్+అగునె = నిందవేయవచ్చునా?; ఇట్టి క్రూరులయింటికిన్; ఇచ్చిన = (కోడలిగా) ఇచ్చిన; మనవారిన్ = మనవాళ్ళను; అందుగాక = నిందించాలి; తాను = నేను; అట్లు; అనుట; మేలె = మంచిదా?; అర్జును పుట్టిన+అప్పుడు = అర్జునుడు జన్మించినప్పుడు; అశరీరవాణి = శరీరంలేని వాక్కు- దివ్యవాణి; ఆకాశవాణి;వీఁడు = ఈ అర్జునుడు; లోకములు+ఎల్లన్ = సమస్తలోకాలను; గెల్చు = జయిస్తాడు; పొగడ్త = ఆతనికీర్తి; మొగులు = మేఘాన్ని- ఆకాశాన్ని; ముట్టినట్టిది+అ = అంటుకున్నదే; అగున్ = అవుతుంది. రణమునన్ = (రాబోయే) యుద్ధంలో; కౌరవులన్; జయించున్; సోదరులున్; తానున్; భూరి రాజ్యగౌరవమున్ = గొప్పదయిన రాజ్యం కలగటం వల్ల గౌరవాన్ని; పొందున్; అని; పలికెన్; వలయునేని = అవసరమయితే కావలసివస్తే; అది = ఆ శరీరవాణి;తిట్టు+పడుగాన్ = నింద్యమగుగాక.

బా : *మా బావగారు ధృతరాష్ట్రుడు యోగ్యుడుకాడు అనే మాటవల్ల ఏం ప్రయోజనం? ఆతని కొడుకు దుర్యోధనుని ఎందుకు నిందించాలి? కురువంశంలో చాలాపెద్దవాడయిన బాహ్లికుని అనటం ఎందుకు? భీష్ముని నిందించ దగునా? నన్ను ఇలాంటి క్రూరుల ఇంటికి కోడలిగా ఇచ్చిన మనవాళ్ళను అనాలి. అలానేను అనటం భావ్యమేనా? అర్జునుడు పుట్టినప్పుడు అశరీరవాణి ఇతడు లోకాలన్నీ గెలుస్తాడనీ, ఈతని కీర్తి ఆకాశం అంటుతుందనీ, కౌరవులతో జరగబోయే యుద్ధంలో జయిస్తాడనీ, తామూ సోదరులూ మహారాజ్యగౌరవాన్ని పొందు తారనీ చెప్పింది. ఈ సమయంలో అది అవసరమయితే నిందాపాత్రం అవుగాక.*

వి. దుఃఖపరవశ అయిన తెలుగు ఆడపడుచు మాటతీరు కుంతీ దేవి మాటలలో

గోచరిస్తుంది. పుట్టింటివారిని నిందించినట్లూ; అత్తింటివారిని ఆదరించినట్లూ ఈమె మాటలున్నాయి. కాని పుట్టింటి వారి నింద అత్తింటివారి క్రూరత్వాన్నీ, దుష్టత్వాన్నీ అధికంగా ధ్వనింపజేస్తుంది. ఆమె అక్కడ పడ్డ బాధలను సూచిస్తుంది.

అర్జునుని జన్మసందర్భంలో అశరీరవాణి పలికిన వృత్తాంతం ఆదిపర్వం 5వ ఆశ్వాసంలో నన్నయ చెప్పాడు.

వ. ధర్మంబు గలుగునే నది నిక్కం బయ్యెడు; దానికెల్లను నిర్వాహకుండవు నీవు గలవు గాదె! నీమన్నించు నెచ్చెలులకుం జెప్పెడు మాటలు గలవు విను; మయ్యుధిష్ఠిరునితో నిట్లనుము. 196

అ : నిక్కంబు = యథార్థము; నిర్వాహకుండవు = కార్యమునునిర్వహించేవాడవు; నీమన్నించు =నీవు ఆదరించే; నెఱ+చెలులకున్=ఇష్టమయిన మిత్రులకు; ఆ+యుధిష్ఠిరునితోన్= ఆధర్మరాజుతో.

భా : *ధర్మమే ఉంటే ఆ అశరీరవాణి సత్యం అవుతుంది. ఆభారం అంతా వహించేవాడివి నీవున్నావు గదా! నీఆదరాన్ని పొందే నీమిత్రులకు పాండవులకు నేను చెప్పేమాటలు కొన్ని ఉన్నాయి. విను. ఆధర్మరాజుతో ఇలా అను.*

క. వేడికొని కృపణులై కను
పోఁడిమి యదియేల? రాజపుత్రులు దమమై
వాఁడిమి దప్పిన; నిప్పులు
వేఁడిమి సెడినట్లు; జనులు విని యులుకుదురే! 197

అ : కృపణులై = దీనులై; వేఁడికొని = యాచించి; కనుపోఁడిమి = పొందేసంపద;అది; ఏల=ఎందుకు?; రాజపుత్రులు; తమమైవాఁడిమి=తమశరీరంలోని పరాక్రమము; తప్పినన్=విడిచి పెడితే; నిప్పులు; వేఁడిమి; చెడిన+అట్లు; జనులు=ప్రజలు; విని; ఉలుకుదురే= భయపడతారా?

భా : *దీనులై యాచించి సంపాదించే సంపద ఎందుకు? రాజకుమారులు బలం తేజస్సు పరాక్రమం కోల్పోవటం అగ్నికి వేడి లేకపోవటం లాంటిది. ఇది వింటే జనులు రాజంటే భయపడతారా?*

వ. భీమార్జునుల కిట్లని చెప్పుము. 198

భా : *భీమార్జునులతో నామాట లిలా చెప్పు.*

ఆ. కొడుకుఁ గాంచు రాచకూఁతు రెద్దానికి
నట్టి పనికి నుచితమైన సమయ
మొదవె; దడయ టింక నొప్పదు; జనములు
నట్లు గాని పురుష లనరు మిమ్ము. 199

అ : రాచకూఁతురు = రాజపుత్రి; ఎద్దానికిన్=దేనికోసం; కొడుకున్ కాంచున్ = కనునో; అట్టిపనికిన్; ఉచితము+ఐన సమయము = తగినకాలం; ఒదవెన్ = కలిగింది; ఇంక; తడయుట=

ఆలస్యం చేయటం; ఒప్పదు = తగదు; అట్లు+కాని = అలా పరాక్రమం చూపితేకాని; జనములు= లోకులు; మిమ్ము; పురుషులు = మగవారు; అని అనరు.

భా : *రాజపుత్రిక ఎందుకోసం సంతానాన్ని కంటుందో దానికి తగిన సమయం సమీపించింది. ఇంకమీరు ఆలస్యం చేయటం తగదు. పరాక్రమం చూపి శత్రువులను జయిస్తే గాని మిమ్ములను లోకులు మగవాళ్ళు, శూరులు అని అనరు.*

వి : పౌరుషం, పరాక్రమం, తేజస్సు కల కుమారులను రాజకుమారి కంటుంది . తానూ అందుకోసమే పరాక్రమధనులైన మిమ్ములను కన్నాను అని కుంతీదేవి అభిప్రాయం. భీమార్జునులు పౌరుషపరాక్రమాలు ప్రధానంగా గలవారు. కాబట్టి కుంతీదేవి వారికి తగిన సందేశం పంపింది.

క. **భుజబలమున జీవించుట**
నిజధర్మము; మెత్తఁబడుట నింద్యము; మాద్రీ
ప్రజలకుఁ జెప్పుము; ద్రుపదా
త్మజఁ గార్యం బడుగు మనుము తగ నందఱితోన్. 200

అ : భుజబలమునన్ = బాహుబలంతో; జీవించుట; నిజధర్మము = (క్షత్రియులకు) తమధర్మం; మెత్తబడుట; నింద్యము; అని మాద్రీప్రజలకున్ = మాద్రీకుమారులకు; నకుల సహదేవులకు; చెప్పుము; ద్రుపద+ఆత్మజన్ = ద్రౌపదిని; కార్యంబు = చేయదగినపనిని గూర్చి; తగన్ = తగినవిధంగా; అడుగుము; అని అందఱితోన్; అనుము.

భా : *'బాహుబలంతో జీవించటం క్షత్రియులకు సహజ ధర్మం. మెత్తబడటం రాజకుమారులకు నింద్యమయినది.' అని నకుల సహదేవులకు చెప్పు. ఇప్పుడు పాండవుల కర్తవ్యం ఏమిటో ద్రౌపదిని అడగమని వాళ్ళందరికీ చెప్పవలసింది.*

వి :. రెండు వాక్యాలలోనే కుంతి సూటిగా నకుల సహదేవులకు హెచ్చరిక చేసింది. పాండవులు అయిదుగురిలో ప్రతిఒక్కరూ ఈ సమయంలో తమకర్తవ్యం ఏమిటో ద్రౌపదిని అడగమంటోంది కుంతీదేవి. మహాభారతయుద్ధానికంతకూ మూలకారణం ద్రౌపది. సభలో ఆమెకు జరిగిన అవమానం సర్వనాశనానికి హేతువు. ద్రౌపది అవమానపీడిత. కాబట్టి ఆమె సలహాల ననుసరించి పాండవులు ప్రవర్తించాలని కుంతి ఉద్దేశం. ద్రౌపదిమీద కుంతీదేవికి ఎంత వాత్సల్యం ఉందో; ద్రౌపది స్వభావం, వ్యక్తిత్వం, ప్రజ్ఞలమీద ఆమెకు ఎంత నమ్మకం ఉందో ఈ మాటలవల్ల వ్యక్తమవుతుంది.

చ. **అలిగిన భీమఫల్గునుల కడ్డము లేమి నెఱుంగు దంతలం**
తలు పడి వాని నీఁగ వలదా? విను మాపనికెల్లఁ బాండుపు
త్రులె కలవారు; నీకెటులు దోఁచిన నట్టులు సేయువారు గా
కలఘువిచార! నాయలఁత యార్పుము నన్ గడతేర్పు మెమ్మెయిన్. 201

అ : అలిగిన = కోపించిన; భీమఫల్గునులకున్ = భీమార్జునులకు; అడ్డములేమిన్; ఎఱుంగుదున్; అంతలు+అంతలు = అంతంత అవమానాలు; పడి; వానిన్; ఈఁగవలదా =

తీర్చుకోవద్దా; విను; ఆ పనికిన్+ఎల్లన్ = ఆపనికంతకూ; పాండుపుత్రులె = పాండవులె; కలవారు= శక్తులు(సమర్థులు); నీకున్; ఎటులు; తోఁచినన్; అట్టులు = అలాగే; చేయువారుగాక; అలఘువిచార = గొప్పఆలోచన గల కృష్ణా !; నా+అలఁత = నాదుఃఖం; ఆర్పుము = పోగొట్టు; (తగ్గించు); నన్ = నన్ను; ఏ+మెయిన్ = ఎలాగయినా; కడతేర్పుము = రక్షించు.

భా : *కోపించిన భీమార్జునులకు ఎదురులేకపోవటం నాకు తెలుసు. వారు అంతంత అవమానాలు పడి ప్రతీకారం తీర్చుకోవద్దా? కృష్ణా! ఆపని సంపూర్ణంగా నెరవేర్చటానికి పాండవులే సర్వసమర్థులు. నీకు ఏలాచేయాలని అనిపిస్తే వారు అలాచేస్తారు. అలఘువిచారా! నాదుఃఖం పోగొట్టు. ఎలాగయినా నన్ను కడతేర్చు."*

వి. ద్రౌపది భార్యగా పాండవులకు కర్తవ్యాన్ని సూచించింది (100నుండి113 ప. వరకు) కుంతీదేవి క్షత్రియకాంతగా వీరపత్నిగా వీరమాతగా తనపుత్రులకు క్షత్రియ వీరులు ఎలా ప్రవర్తించాలో వివరించింది. తిక్కన ఇక్కడ ఆమె మాటలను ఎంతో ఉదాత్తంగా, గంభీరంగా ప్రదర్శించాడు.

వ. అనినఁ గృష్ణుఁడు గొంతి ననునయించి యిట్లనియె. 202

అ : గొంతిన్ = కుంతీదేవిని; అనునయించి = ఓదార్చి

భా : *ఆ మాటలువిని కృష్ణుడు కుంతీదేవిని ఓదార్చి ఇలా అన్నాడు.*

-: శ్రీకృష్ణుఁడు గుంతీదేవి నూఱడించుట :-
సం. 5-88-89

చ. "సుగుణవు; పుట్టినింటికిని చొచ్చిన యింటికిఁ దేజ మెక్కఁగాఁ
దగు చరితంబునన్ నడచు ధన్యవు; ధీరవు; దేవి! నీవెడ
న్వగ లడఁగింపకున్న భువనంబుల నింకిట నెవ్వ రోర్చువా
రు; గలఁక దక్కు; మీహృదయ రోగము లన్నియుఁ బుచ్చి వైచెదన్. 203

అ : దేవి! (నీవు) సుగుణవు = మంచిగుణాలు కలదానివి; పుట్టినింటికిని; చొచ్చిన యింటికిన్=మెట్టినింటికిని (అత్తవారింటికి); తేజము = కాంతి; ఎక్కఁగాన్ =వృద్ధిపొందగా; తగు చరితంబునన్=యోగ్యయిన శీలంతో; నడచు = ప్రవర్తించే; ధన్యవు =ధన్యురాలివి; ధీరవు= ధీరురాలివి; నీవు; ఎడన్=మనస్సులో; వగలు=దుఃఖాలను; అడఁగింపకున్న = అణచుకోలేకపోతే; ఇంక; ఇటన్; భువనంబులన్ = లోకాలలో; ఎవ్వరు; ఓర్చువారు = సహించ గలవారు; కలఁక= క్షోభచెందటం (విచారం); తక్కు = మానుకో; మీహృదయ రోగములు = మీమనోవ్యాధులు; అన్నియున్; పుచ్చివైచెదన్ = పోగొట్టుతాను.

భా : *" అమ్మా అత్తా! నీవు గుణవంతురాలివి. పుట్టింటికి, అత్తింటికి ప్రసిద్ధి, కీర్తి కలిగేటట్లు మంచినడవడితో ప్రవర్తించే ధన్యురాలివి. ధైర్యవంతురాలివి. నీవే మనస్సులో దుఃఖాన్ని అణచుకోలేకపోతే ఇంక ఈలోకాలలో ఎవరు ఓర్చు కోగలరు? విచారం విస్మరించు. కొద్దిరోజులలోనే మీమనోవ్యాధులన్నీ పోగొడ్తాను.*

వి. "మీ హృదయరోగము లన్నియుబుచ్చి వైచెదన్" అని కృష్ణుడు అన్నాడు. ఎలా పోగొడతాడో చెప్పలేదు. వచ్చింది సంధి చేయటానికి కాబట్టి సంధిద్వారా అని అనుకోవచ్చు. ద్రౌపది మాటలు, కుంతీదేవి కుమారులకు ఇచ్చిన సందేశం-ఈ రెండినిబట్టి చూస్తే కృష్ణుడు యుద్ధంతోనే వారి హృదయశల్యాన్ని తొలగిస్తాడని తోస్తుంది.

క. **తనయులు గోడలు సేమం**
బున నున్నా; రధికభక్తి పూర్వముగా దం
డ నమస్కారంబులు నీ
కొనరించిరి; కౌఁగిలించి రుల్లములఁ దగన్. 204

అ : తనయులు = కుమారులు (పాండవులు); కోడలు = (ద్రౌపది) సేమంబునన్= క్షేమంతో; ఉన్నారు; ఉల్లములన్ = మనస్సులలో; తగన్ = సముచితముగా; నీకు; అధికభక్తి పూర్వముగా; దండనమస్కారంబులు = సాష్టాంగ నమస్కారాలను; ఒనరించిరి = చేశారు; కౌఁగిలించిరి.

భా : *నీకొడుకులు కోడలు క్షేమంగా ఉన్నారు. వాళ్లు ఉపప్లావ్యంలో ఉన్నారు. కాబట్టి తమతమ మనస్సులలో నీకు మిక్కిలి భక్తి పూర్వకంగా సాష్టాంగనమస్కారాలు చేశారు. కౌగలించుకున్నారు.*

క. **నీకొడుకు లొండుసుఖములు**
సేకొన; రవ్వీర సుఖమ చిత్తములఁ గరం
బాకాంక్షింతు; రలంతులఁ
బోక గలుగు నెట్టు; లల్పబుద్ధులె వారల్? 205

అ : నీకొడుకులు; ఒండు = మరియొుక; సుఖములు; చేకొనరు = అనుభవించరు; చిత్తములన్ = మనస్సులలో; ఆ+వీరసుఖమ = ప్రసిద్ధమయిన పరాక్రమం వల్ల కలిగే సుఖాన్నే; కరంబు = ఎక్కువగా; ఆకాంక్షింతురు = కోరుతారు; అలంతులన్ = స్వల్పవిషయాలలో; పోక= వెళ్ళటం; ఎట్టులు = ఎలా; కలుగున్; వారల్ = ఆపాండవులు; అల్పబుద్ధులె = నీచబుద్ధిగలవారా?

భా : *నీకుమారులు ఇతరసుఖాలను పొందాలి అని అనుకోరు. వారు ఎల్లప్పుడూ వీరసుఖాన్నే మనస్సులో కోరుతుంటారు. అల్పవిషయాలలో వాళ్ళు ఆసక్తు లవుతారా? వాళ్ళేమైనా అల్పబుద్ధులా?*

క. **ఉత్సాహంబున శత్రుకు**
లోత్సాదన విధి యొనర్చి; యున్నత సామ్రా
జ్యోత్సవము పొందు పుత్రుల
నుత్సుకతం జూతుగాక; యూఱడు మింకన్." 206

అ : ఉత్సాహంబునన్ = పూనికతో; శత్రుకుల+ఉత్సాదనవిధి = శత్రు సమూహం యొక్క నాశనం అనే పని; ఒనర్చి = చేసి; ఉన్నత సామ్రాజ్య+ఉత్సవము = గొప్పదయిన

సామ్రాజ్యంవల్ల కలిగే సంతోషాన్ని; ఒందు = పొందే; పుత్రులన్ = కుమారులను; ఉత్సుకతన్ = వేడుకతో; చూతుగాక; ఇంకన్; ఊఱడుము = స్వస్థురాలివి కావలసింది- శాంతించు.

భా : *ఉత్సాహంతో శత్రువులను నాశనం చేసి మహాసామ్రాజ్యాన్ని సంపాదించి సంతోషించే కుమారులను నీవు తప్పక చూస్తావు. ఇంక శాంతించు. "*

చ. **అన విని మోము విచ్చుచు మురారికి నిట్లనుఁ గుంతి;" పాండునం**
దనులకుఁ దండ్రియున్ గురువు దైవము నారయ నీవ కావె! నీ
మనమున ధర్మమున్ హితము మంచిగఁ జూచి విధించినట్ల చే
సి నెగడువారు గాక! నినుఁ జేరిన నాపద లొంద నేర్చునే! 207

అ : అనన్; విని; కుంతి; మోము=ముఖం; విచ్చుచు = వికసింపచేస్తూ; మురారికిన్= కృష్ణునితో; ఇట్లు; అనున్ = అంటున్నది. ఆరయన్ = పరిశీలించగా; పాండునందనులకున్ తండ్రియున్; గురువున్; దైవమున్; నీవ = నీవే; కావె = కదా!; నీమనమునన్= నీమనస్సులో; ధర్మమున్; హితమున్=మేలును; మంచిగన్= చక్కగా; చూచి; విధించినట్లు+అ = నీవు నిర్ణయించినట్లే; చేసి; నెగడువారు = వృద్ధిపొందుతారు; నినున్; చేరినన్= ఆశ్రయిస్తే; ఆపదలు; ఒందనేర్చునే= పొందగలవా?

భా : *ఆమాటలువిని ముఖం వికసించగా కుంతీదేవి ఇలాఅంది. "కృష్ణా! చక్కగా ఆలోచిస్తే పాండవులకు తండ్రీ, గురువూ, దైవమూ నీవే కదా! నీవు మనస్సులో ధర్మాన్నీ, హితాన్నీ చక్కగా విచారించి నిర్ణయించినట్లే వారూ చేసి అభివృద్ధి నందుదురు గాక! నిన్ను ఆశ్రయించినవారికి ఆపదలు కలుగుతాయా?*

క. **వారలక యేల మాధవ!**
కౌరవులకు మఱియు నీజగంబుల కెల్లన్
జేరుగడ నీవ; నీపలు
కారయ వేదంబ కాదె యఖిలంబునకున్" 208

అ : మాధవ = కృష్ణా !; వారలకు+అ = ఆపాండవులకే; ఏల = ఏమిటి; కౌరవులకున్; మఱియున్ = ఇంకా; ఈజగంబులకున్ + ఎల్లన్ = ఈలోకాలన్నింటికీ; నీవు+అ=నీవే; చేరుగడ= శరణము; ఆరయన్ = పరిశీలించగా; నీపలుకు = నీమాట; అఖిలంబున్‌కున్ = సమస్తలోకానికీ; వేదంబు+అ = వేదమే; కాదె = కదా!

భా : *కృష్ణా! ఆపాండవులకే ఏమిటి! కౌరవులకూ ఇంకా చెప్పవలసివస్తే ఈ సమస్తలోకాలకూ నీవే శరణం(దిక్కు). చక్కగా ఆలోచిస్తే సమస్తజనులకూ నీపలుకే వేదంకదా"!*

వ. **అనినం బ్రసన్నవదనుం డగుచు నద్దేవి గారవించి యామంత్రణంబు సేసి తదావాసంబు వెలువడి తనరాకకు నలంకృతంబైన దుర్యోధను మందిరంబునకుఁ గృతవర్మ, సాత్యకి సమేతుండయి పోవు గోవిందునిం గని తదీయ ద్వారపాలకులు**

సంభ్రమంబునం బఱచి యతని కెఱింగించి తదనుమతంబునం బఱతెంచి యెదుర్కొని కక్ష్యాంతరంబుల సందడి నెడ గలుగ జడియుచు వినయంబునం దోడ్కొని చనిరి. యమ్మనుజవిభుండు గైలాస శిఖరాకారంబగు సౌధంబున బాహ్లీక భీష్మద్రోణ ప్రభృతులు గర్ణ శకుని సైంధవాదులును దుశ్శాసన వికర్ణ దుర్ముఖ ప్రముఖులును మఱియు ననేక దేశాధీశులునుం బరివేష్టింపఁ బేరోలగంబున సింహాసనాసీనుండై యున్నయెడకుం జను నప్పు డాసుయోధనుండు సపరివారంబుగాఁ బ్రత్యుత్థానంబు సేయం జేర నరిగి యతనికిం దగు వారలకు నాలింగ నాద్యుపచారములు దానుం దమ్ముండును నాచరించి. 209

అ : ప్రసన్నవదనుండు = అనుగ్రహంతో గూడిన ముఖం గలవాడు; గారవించి = గౌరవించి; ఆమంత్రణంబు = వీడ్కోలు; తత్+ఆవాసంబు = ఆమె నివాసం; సమేతుండు = కూడినవాడు; సంభ్రమంబునన్ = తొట్రుపాటుతో; పఱచి = పరుగెత్తి; తత్+అనుమతంబునన్= అతని అనుమతితో; పఱతెంచి= వచ్చి; కక్ష్యాంతరంబుల = సౌధాలలోపలిభాగాలలో; ఎడగలుగన్= దూరంకలిగేటట్లు; జడియుచున్ = తొలగిస్తూ; ఆ+మనుజవిభుండు = ఆరాజు; కైలాసశిఖర+ ఆకారంబు = కైలాసపర్వతశిఖరంయొక్క ఆకారం వంటి ఆకారం కలది; సౌధంబునన్ = మేడలో; ప్రభృతులు = మొదలైనవారు; ప్రముఖులు = ముఖ్యులు; పరివేష్టింపన్ = చుట్టుకొనియుండగా; పేరోగలంబునన్ = పెద్ద సభలో; ఉన్న+ఎడకున్ = ఉన్నచోటికి; ప్రత్యుత్థానంబు = లేచిఎదురు రావటం; ఆలింగన+ఆది+ఉపచారంబులు= కౌగిలించుకొనటం మొదలైన మన్ననలు.

భా : *కుంతీదేవి మాటలకు ప్రసన్నముఖుడై కృష్ణుడు ఆమెను గారవించి వెళ్లివస్తానని చెప్పి ఆమె నివాసంనుండి బయటకు వచ్చాడు. తానురావటం వల్ల అలంకృతమైన దుర్యోధనుని సౌధానికి ఆయన కృతవర్మసాత్యకులతో వెళ్ళాడు. ఆయనను చూచి దుర్యోధనుని సౌధద్వారపాలకులు త్వరగా పరుగెత్తుకొని పోయి తమరాజుకు ఆయన వస్తున్నాడని చెప్పారు. ఆయన అనుమతితో వచ్చివారు కృష్ణుని ఎదుర్కొని సౌధంలోపల ఏర్పడుతున్న సమ్మర్దాన్ని తొలగిస్తూ వినయంగా లోపలికి తీసుకుపోయారు. ఆదుర్యోధనుడు కైలాస పర్వత శిఖరం లాగా ఎత్తైన తన మేడలో బాహ్లికుడు భీష్ముడు మొదలైన పెద్దలు, కర్ణుడు శకుని సైంధవుడు మొదలగు ఆప్తులు, దుశ్శాసనుడు వికర్ణుడు దుర్ముఖుడు మొదలైన సోదరులు, ఇంకా అనేక దేశాధిపతులు పరివేష్టింపగా పెద్దసభలో సింహాసనం మీదకూర్చొని ఉన్నాడు. అక్కడికి కృష్ణుడు వస్తుంటే దుర్యోధనుడు సపరివారంగా లేచి ఎదురువచ్చాడు. దుర్యోధనుని సమీపించి ఆతనికి తక్కిన వారికి ఆలింగనం మొదలైన సముచితమైన మన్ననలు కృష్ణుడు, సాత్యకి నిర్వర్తించారు.*

క. **అతఁ డునుపఁగ; గనకమయో**
న్నతపర్యంకంబు నందు నారాయణుఁ డూ
ర్జిత మహిమ నుండి యభ్య
ర్చితుఁ డయ్యెఁ దగంగ నతనిచే సత్కృతులన్. 210

అ : అతఁడు=ఆ దుర్యోధనుడు; కనకమయ-ఉన్నతపర్యంకంబునందు=బంగారము చేత నిర్మితమయిన పెద్ద సింహాసనంపాన్పుమీద; ఉనుపఁగన్ = ఉంచగా (కూర్చుండబెట్టగా); నారాయణుఁడు=శ్రీకృష్ణుడు; ఊర్జితమహిమన్ = అధికైశ్వర్యంతో; ఉండి =కూర్చొని; అతనిచేన్= ఆదుర్యోధనునిచేత; సత్కృతులన్ = సత్కారాలతో; అభ్యర్చితుఁడు=పూజింపబడినవాడు; అయ్యెన్.

భా : *ఆదుర్యోధనుడు ఎత్తైన బంగారు సింహాసనంమీద శ్రీకృష్ణుని కూర్చో బెట్టాడు. ఆ తరువాత అతడు మహైశ్వర్యంతో వెలిగిపోతున్న కృష్ణుని అనేక విధాలయిన సత్కారాలతో పూజించాడు.*

-: శ్రీ కృష్ణుఁడు దుర్యోధనునితో సంభాషించుట :-
సం. 5-89-1

వ. సాత్యకియును నముచితప్రకారంబునం బూజితుండయ్యెఁ; దదనంతరంబు నిజాసనాసీనులయి తన మొగంబునం జూడ్కి నిలిపి యున్న దుర్యోధనాదులతో మాధవుండు మధురసంభాషణంబులు సేయుచుండె నట్టియెడ. 211

అ : నిజ+ఆసన+ఆసీనులు = తమఆసనాలమీద కూర్చున్నవారు; చూడ్కి = చూపు; మాధవుండు = కృష్ణుడు.

భా : *సాత్యకిని గూడా వారు తగినవిధంగా పూజించారు. తరువాత దుర్యోధ నాదులు తమ సింహాసనాలమీద కూర్చుని కృష్ణుని వైపే చూస్తున్నారు. అప్పుడు కృష్ణుడు వారితో తీయగా మాట్లాడుతున్నాడు.*

తే. సముచితంబుగఁ గూరల చంద ముగ్గ
డించి; కుడుపుతెఱంగు పుట్టించి పలుకు
నా సుయోధనుతోఁ గృష్ణుఁ డచటఁ దాను
గుడువ నొల్లక యునికి యేర్పడఁగఁ జెప్పె. 212

అ : కూరలచందము = కూరలతీరు; సముచితంబుగన్ = తగినవిధంగా; ఉగ్గడించి= చెప్పి; కుడుపుతెఱంగు = భోజనపదార్థంమీద ఆసక్తి- పుట్టించి = కలిగించి; పలుకు = మాట్లాడే; ఆసుయోధనుతోన్; కృష్ణుఁడు; అచటన్; తాను; కుడువన్ = భోజనంచేయటానికి; ఒల్లక+ఉనికి = ఇష్టపడకపోవటం; ఏర్పడఁగన్ = స్పష్టంగా; చెప్పెన్.

భా : *దుర్యోధనుడు తన సౌధంలో సిద్ధమవుతున్న కూరలరుచులు వివరించి ఎవరికైనా భోజనం చెయ్యాలి అని ఆసక్తి కలిగేటట్లు వర్ణించి చెపుతున్నాడు. అప్పుడు కృష్ణుడు ఆతనితో తాను అక్కడ భోజనం చేయను. అని స్పష్టంగా చెప్పాడు.*

వ. చెప్పిన విని దుర్యోధనుండు సూర్యసూనువదనం బవలోకించి యల్లన నిట్లనియె. 213

అ : సూర్యసూనువదనంబు=కర్ణునిముఖం; అవలోకించి=చూసి; అల్లనన్ = మెల్లగా.

భా : ఆమాటలు విని దుర్యోధనుడు కర్ణుని ముఖం చూసి మెల్లగా ఇలా అన్నాడు.

వి. దుర్యోధనుడు కర్ణుని సలహా తీసుకొని కృష్ణుని ఇలా అడిగాడు. అప్పుడు అతని మాటలలో మొదట మార్దవమూ, చివరకు శఠత్వము కనపడ్డాయి అని మూలం అ. 91-12 శ్లోకంలో ఉంది.

క. "హరిపలికిన విధ మెంతయు
నెరవై యున్నయది; వింటె యిమ్మాట తెఱం
గరయుదము తొలుత; నీపెను
పరి చందం బెల్ల నెఱుక పడియెడుఁ బిదపన్." 214

అ : హరి = కృష్ణుడు; పలికినవిధము = మాటాడినతీరు; ఎంతయున్ = చాలా; ఎరవు+ఐ+ఉన్న+అది = భేదంకలది(విపరీతమైనది) గా ఉంది; వింటె = విన్నావా?; తొలుతన్= మొదట; ఈ+మాటతెఱంగు= ఈ మాటలరీతి; అరయుదము = పరిశీలిద్దాం; పిదపన్ = తరువాత; ఈపెనుపరిచందంబు=ఈగొప్పవానియొక్కరీతి; ఎల్లన్ = అంతా; ఎఱుకపడియెడున్= తెలుస్తుంది.

భా : *"కృష్ణుడు మాట్లాడిన విధం అంతా భేదభావంతో విపరీతంగా ఉంది. కర్ణా! విన్నావా? మొదట ఇతని మాటతీరు పరిశీలిద్దాం. అందువల్ల ఇతని గొప్పతనం అంతా తరువాత తెలుస్తుంది."*

వ. అని పలికి యచ్యుతున కిట్లనియె. 215

భా : అని చెప్పి దుర్యోధనుడు కృష్ణునితో ఇలా అన్నాడు.

తే. "వలయు నన్నపానంబులు పలుదెఱఁగుల
నేర్చు విధముల నే మొడఁగూర్చి వేడ్క
నున్న, నీ వుపయోగింప నొల్లకునికి
బాంధవమునకు నీతికి బాహిరంబు. 216

అ : వలయు = కావలసిన; అన్నపానంబులు = వంటకాలు పానీయాలు; పలు+ తెఱఁగులన్ = అనేకవిధాల; నేర్చు విధములన్ = చేతనయిన రీతులతో; ఏము=మేము; ఒడ గూర్చి = సమకూర్చి; వేడ్కన్ = కోరికతో; ఆశతో; ఉన్నన్ = ఉండగా; నీవు; ఉపయోగింపన్= అనుభవించటానికి; ఒల్లక+ఉనికి = అంగీకరించకపోవటం; బాంధవమునకున్ = చుట్టరికానికి; నీతికిన్ = న్యాయానికి; బాహిరము = దూరమైనది.

భా : *"కృష్ణా! కావలసిన అన్నపానాలను అనేకవిధాలుగా మాకు చేతనయినట్లు మేము సిద్ధంచేసి ఆశతో ఎదురుచూస్తూ ఉంటే నీవు వీటిని స్వీకరించను అనటం చుట్టరికానికీ న్యాయానికీ దూరమైన పద్ధతి.*

క. కౌరవులకుఁ బాండవులకు
నారయ నీ వొక్కరూప; యసదృశధర్మా

చారుండవు; రాజునకుం
గూరుతు; కత మేమి యిట్లగుటకుం జెపుమా." 217

అ : ఆరయన్ = పరిశీలించగా; నీవు; కౌరవులకున్; పాండవులకున్; ఒక్కరూపు+అ= ఒకేవిధమైనవాడవు; అసదృశ = సాటిలేని; ధర్మ+ఆచారుండవు = ధర్మప్రవర్తన గలవాడవు; రాజునకున్ = ధృతరాష్ట్రునకు; కూరుతు = ఇష్టుడవు. ఇట్లు; అగుటకున్ = కావటానికి; కతము= కారణము; ఏమి; చెపుమా.

భా : *జాగ్రత్తగా పరిశీలిస్తే నీవు కౌరవులకూ పాండవులకూ ఒకటే. అంతేకాదు. ధర్మాచరణలో సాటిలేనివాడవు. ధృతరాష్ట్ర మహారాజుకు చాలా ఇష్టుడవు. అలాంటి వాడివి ఇలా అనటానికి కారణమేమిటో చెప్పు."*

క. **అనుడు; నుపేంద్రుఁడు మనుజేం**
ద్రున కిట్లను "దూత లెందుఁ దొలి ఁదొలి గుడువం
గొనఁ గట్టఁ దొడఁగుదురె? వ
చ్చిన కార్యము దీర్చి పిదపఁ జేయుదు రెల్లన్." 218

అ : అనుడున్= అనగా; ఉపేంద్రుఁడు = కృష్ణుడు; మనుజ+ఇంద్రునకున్ = రాజుతో దుర్యోధనునితో; ఇట్లు; అనున్; ఎందున్ = ఎక్కడయినా; దూతలు; తొలితొలి = మొట్ట మొదట; కుడువన్ = తినటానికి; కొనన్ = తీసుకోటానికి; కట్టన్ = (వస్త్రాలు) ధరించటానికి; తొడగుదురె= పూనుకుంటారా?; వచ్చిన కార్యము = తాము వచ్చినపని; తీర్చి = నెరవేర్చి; పిదపన్ = తరువాత; ఎల్లన్ = అన్నీ; చేయుదురు.

భా : *ఆమాటలు విని కృష్ణుడు దుర్యోధనునితో ఇలా అన్నాడు. "ఎక్కడయినా దూతలు వచ్చీరావటంతోనే మొట్టమొదట షడ్రసోపేతభోజనం చేయటానికీ, బహుమతులు స్వీకరించటానికీ, నూత్న వస్త్రాలు ధరించటానికీ పూనుకుంటారా? తాము వచ్చిన పనిని చక్కగా నిర్వర్తించి తరువాత అవన్నీ చేస్తారు."*

వ. **అనిన గాంధారీనందనుండు దేవకీ నందనున కిట్లనియె. 219**

అ: గాంధారీనందనుడు = దుర్యోధనుడు; దేవకీనందనునకు = కృష్ణునితో;

భా : *ఆమాటలు విని దుర్యోధనుడు కృష్ణునితో ఇలా అన్నాడు.*

ఆ. **"వేగపడుట మేలె; వినుము కార్యము దీఱుఁ**
దీఱకుండు; దాని తెఱఁగు దగిన
యప్పు డాడ రాదె? యిప్పుడు ముకుఁద్రాటఁ
గాలు గ్రువ్వనేల? కమలనాభ! 220

అ : కమలనాభ = కృష్ణా!; వేగపడుట= తొందరపడటం; మేలె = మంచిదా? వినుము; కార్యము=వచ్చినపని; తీఱున్= చక్కబడును; తీఱకుండున్ =చక్కబడకపోవచ్చును; దానితెఱఁగు= ఆవచ్చినపనివిషయం; తగిన+అప్పుడు = తగినసమయంలో; ఆడరాదె = మాట్లాడరాదా?; ఇప్పుడు

ముకుఁ ద్రాటన్ = (ఎద్దు) ముక్కుకు కుట్టిన తాడులో; కాలున్; గ్రువ్వన్+ఏల = కూర్చటం (దూర్చటం) ఎందుకు?

భా : "కృష్ణా! నామాట విను. తొందరపడటం మంచిదా? నీవు వచ్చిన పని కావచ్చు; కాకపోవచ్చు; ఆవిషయం వచ్చినప్పుడు దాన్ని గూర్చిమాట్లాడు. ఎద్దుకు ముక్కుకు కుట్టిన తాడులో దానికాలును దూర్చినట్లు ఇప్పుడు ఆవిషయం మాట్లాడటం ఎందుకు?

వ. నీవు వచ్చినవాఁడవు మాయింటఁ గుడిచి కూర్చుండి యెల్లపనులుం జెప్పుట యొప్పుఁగాక; కుడువ నొల్ల ననం దగునె? దీనికిం గారణంబు నా యెఱింగినయది లేదు; విచారింపక పలికి" తనిన మందరధరుండు మందస్మితంబుతో నందఱం గలయం గనుంగొని ధార్తరాష్ట్రుకరంబు గజంబు పల్లవం బల్లన తెమల్చు లీలం గేల నమర్చి; "యిట్టి మాటలు తేటపఱుప వలయునేని విను" మని యతని కిట్లనియె. 221

అ : కుడిచి = భోజనము చేసి; ఒప్పున్ = తగును; కుడవనొల్లను = భుజించటానికి ఇష్టపడను; మందరధరుండు = (మందరపర్వతమును కూర్మావతారములోధరించినవాడు) కృష్ణుడు; మందస్మితంబుతోన్ = చిరునవ్వుతో; పల్లవంబు = చివురుటాకు; అల్లన = మెల్లగా; తెమల్చులీలన్ = పట్టుకొనికదల్చునట్లు; కేలన్ = చేతితో; అమర్చి

భా : *ఇక్కడికి వచ్చిన నీవు మాయింట్లో తిని కూర్చుని అన్ని విషయాలూ చెప్పటం తగునుగాని భోజనం చేయను అనటం బాగుందా? నాకు తెలిసినంతవరకూ దీనికి తగినకారణం లేదు. కృష్ణా! నీవు ఆలోచించకుండా ఈ మాట అన్నావు."* అనగా కృష్ణుడు చిరునవ్వుతో అందరినీ ఒక్కసారి చూసి "ఏనుగు చివురుటాకును పట్టుకున్నట్లు మెల్లగా దుర్యోధనుని చేతిని తన చేతితో పట్టుకొని ఇలాంటిమాటలు వివరించి చెప్పాలా? అయితే విను."అని అతనితో ఇలా అన్నాడు.

వి. ఈవిషయం తరువాత మూలంలో ఒకవిశేషం ఉంది

నాహం కామా న్నసంరంభా న్నద్వేషా న్నార్థకారణాత్
సహేతు వాదా ల్లోభాద్వా ధర్మం జహ్యాం కథంచన. 91-24.

దుర్యోధనా! నేను కామంతోగాని, క్రోధంతోగాని, ద్వేషంతోగాని, స్వార్థంవలనగాని, హేతువాదం వల్లగాని, లోభంవలన గాని ధర్మాన్ని త్యజించను.

ధర్మసంస్థాపనకోసం అవతరించిన శ్రీకృష్ణుడు ఏ పరిస్థితిలోనూ ధర్మం త్యజించనని సముచితంగా సమర్థంగా పలికాడు. కౌరవసభలో తాను వ్యవహరింపబోయే తీరును గూడ ఇక్కడ స్పష్టంగా సూచిస్తున్నాడు శ్రీకృష్ణుడు.

చ. "ప్రియ మెసఁగం దగం బిలిచి పెట్టెడు కూడది లెస్స కూడు;ద
క్కయ నయహీనతం దమకునాపద యైనెడ నిట్టు నట్టు నే
మియు ననలేని కూ డదియు మేవడియై చను; నీవు మాదెసం
బ్రియుఁడవు గావు; మాకు ధృతిపెంపఱ నాపద లే దొకింతయున్. 222

అ : ప్రియము = ప్రేమ; ఎసఁగన్ = కలుగగా; తగన్ = తగినట్లు; పిలిచి; పెట్టెడు; కూడుఅది = ఆభోజనమే; లెస్సకూడు+తక్క = చక్కని భోజనం తప్ప; అయనయహీనతన్ = మంగళమూ, ధర్మమూ లేకపోవటంవల్లా; తమకున్; ఆపద; ఐన+ఎడన్ = కలిగినచోట; ఇట్టును+అట్టును = ఇటూ అటూ ఏమియున్; అనలేని = అనటానికివీలులేని; కూడు+అదియున్ = ఆభోజనంకూడా; మేవడి+ఐ = తగినది; చనున్ = ఐపోతుంది; మాదెసన్= మావైపునించి (మాకు); నీవు; ప్రియుఁడవు = ఇష్టుడవు; కావు; ధృతి = ధైర్యంయొక్క; పెంపఅన్= గొప్పతనం నశించేటట్లు; మాకు; ఒకింతయున్ = కొంచెంగూడా; ఆపద; లేదు.

భా : *"ప్రేమపూర్వకంగా సముచితంగా పిలిచిపెట్టేభోజనమే చక్కని భోజనమవుతుంది గాని శుభకార్యమూ, ధర్మమూ లేనిచోట, తమకు ఆపదకలిగినప్పుడూ అవును కాదు అనటానికి ఏమాత్రం వీలులేని ఆ భోజనం గూడా సముచితమే అవుతుంది. ఇప్పుడు ఇక్కడ భోజనం చేయాలంటే నీవు మావిషయంలో ఇష్టుడవుకావు; ధైర్యాన్ని కోల్పోయేటంత తీవ్రమైన ఆపద మాకు ఏమాత్రంలేదు.*

వి. దీనికి మూలం ఇలా ఉంది

సంప్రీతిభోజ్యా న్యన్నాని ఆపద్భోజ్యాని వాపునః
నచ సంప్రీయసే రాజన్ నచై వాపద్గతా వయమ్. **91-25**

ఎవరింటిలోనైనా భోజనం చేయటానికి ప్రేమగాని, ఆపదగాని కారణం అవుతుంది. రాజా! నీవు మమ్ములను సంప్రీతులను చేయటం లేదు; అలాగే మేము ఎలాంటి ఆపదలోను పడలేదు.

ఈ శ్లోకాన్నే తిక్కన చంపక మాలలో గుబాళింపజేశాడు.

వ. **అట్లుంగాక.** **223**

భా : *అంతేకాక*

క. **పగవారియింటఁ గుడిచిన**
నగు దమ కనుమాన; మమృతమైనను దారుం
బగతురకుఁ గుడువఁ బెట్టఁగఁ
దగ; దొడళుల కెప్పు డెవ్విధము వాటిలునో. **224**

అ : పగవారి యింటన్= శత్రువుల ఇంట్లో; కుడిచినన్=భుజిస్తే; తమకు =తమవారికి; అనుమానము=సందేహం; అగును; తారున్=తాముకూడా; పగతురకు=శత్రువులకు; అమృతము+ ఐనను; కుడువఁబెట్టఁగన్=భోజనంపెట్టటం; తగదు; ఒడళులకు=శరీరానికి; ఎప్పుడు ఏ+విధము= ఏతీరు; వాటిలునో = కలుగుతుందో.

భా : *శత్రువుల ఇంట్లో భోజనం చేస్తే తమకే(దూతలకే) అనుమానం కలుగుతుంది. అలాగే తామూ శత్రువులకు అమృతమయినా సరే పెట్టకూడదు. అలాచేస్తే శరీరానికి ఎప్పుడు ఏంముప్పు కలుగుతుందో!*

వ. **ఏను బగతుండనె యంటేని.** **225**

భా. *నేను శత్రువునా అంటావా?*

క. **అలుగుదు పాండవులకు; వా**
రలు నాకుం బ్రాణములు; ధరావల్లభ! యి
ట్టలముగఁ దమప్రాణములకు
నలుగు జనులు పగతు రనుట యనుమానంబే? 226

అ : పాండవులకు; అలుగుదు = కోపిస్తావు; వారలు = ఆపాండవులు; నాకున్; ప్రాణములు; ధరావల్లభ = రాజా(దుర్యోధనా); తమప్రాణములకు; ఇట్టలముగన్ = అధికంగా; అలుగుజనులు=కోపించేవారు; పగతురు=శత్రువులు. అని; అనుట; అనుమానంబే= సందేహమా?

భా : *పాండవులంటే నీకు కోపం. వాళ్ళు నాప్రాణాలు. దుర్యోధనా! తమప్రాణాలు అంటే కోపించేవారు తమకు శత్రువులు అనటంలో సందేహం ఏముంది?*

వి. దుర్యోధనుడు కాదు అనటానికి వీలు లేనట్టు హేతుబద్ధంగా కృష్ణుడు పాండవులకు తనకు గల విడదీయరాని సంబంధాన్ని స్పష్టం చేశాడు. ఇక్కడ మూలం ఇలా ఉంది.

యస్తాన్ ద్వేష్టి స మాంద్వేష్టి యస్తాననుస మామను
ఐకాత్మ్యం మాం గతం విద్ధి పాండవై ర్ధర్మచారిభిః

అధ్యా. 91. 28శ్లో.

దుర్యోధనా! పాండవులను ద్వేషించేవాడు నన్ను ద్వేషించేవా డవుతాడు. వాళ్లకు అనుకూలుడు నాకు అనుకూలుడు. ధర్మప్రవర్తనగలపాండవులతో తాదాత్మ్యం చెందిన వానినిగా నన్ను తెలుసుకో.

పై దానికంటే గూడా ఈ పద్యానికి మూలం అధిక పాఠంగా ఉంది.

పాండవాన్ ద్విషసే రాజన్ మమ ప్రాణాహి పాండవాః

రాజా!నీవు పాండవులను ద్వేషిస్తున్నావు. పాండవులు నాకు ప్రాణాలుసుమా!

ఆ. **కారణంబు లేక కౌంతేయులకు బాల్య**
మాదిగాఁగఁ గీడె యాచరింతు;
పుణ్యపరులు దోడఁబుట్టువు లార్యులు
వైర మెత్తఁ దగునె వారితోడ! 227

అ : కౌంతేయులకున్ = కుంతీకుమారులకు (పాండవులకు); బాల్యము; ఆది+ కాఁగన్=మొదలుగా; కారణంబు; లేక; కీడు+ఎ = అపకారాన్నే; ఆచరింతు = చేస్తున్నావు; పుణ్య పరులు= పవిత్రకార్యాలు చేయటంలో ఆసక్తిగలవారు ; ఆర్యులు=సాధువులు; తోడఁబుట్టువులు= తోబుట్టువులు (సోదరులు); అయిన వారితోడన్; వైరము+ఎత్తఁదగునె = శత్రుత్వం ఏర్పచుకోవచ్చునా?

భా : *దుర్యోధనా! నీవు పాండవులకు చిన్న నాటినుంచీ నిష్కారణంగా అపకారాలే చేస్తూవచ్చావు. పవిత్ర కార్యాసక్తులూ, సజ్జనులూ, నీతోడబుట్టినవారు అయిన వారితో వైరం ఏర్పరుచుకోవటం తగునా?*

వ. ఇట్లున్న మీయందఱ యన్నంబులు దుష్టాన్నంబులు; విదురుం డొక్కని యన్నంబు భోక్తవ్యం బని నిశ్చయించితి; గావున నందుఁ బోయెద" నని చెప్పి యజ్జనపతి యనుమతి సేయఁ జనునప్పుడు తోడన బాహ్లికభీష్మాది కౌరవులును గుంభసంభవ ప్రముఖులైన మాన్యులును జని మాధవుతోడ"మాయిండ్ల నెల్లను గానిక లాయితంబు సేసికొని నీవు విజయం చేయుటకు నెదురు చూచు చున్నవార" మనిపల్కి ప్రార్థించిన "నే నన్నిచోట్లకు వచ్చిన వాఁడన. యందఱ యర్చనలుం గైకొంటిన. మీరు నిలువుం' డని వారల నిలిపి విదురు గృహంబునకుం బోయిన. 228

అ : భోక్తవ్యంబు=తినదగినది-భుజింపదగినది; అ+జనపతి=అరాజు (దుర్యోధనుడు); తోడన్ = వెంటనే; వారు కుంభసంభవ ప్రముఖులు = ద్రోణుడు మొదలయిన; మాన్యులు = పూజింప దగినవారు; కానికలు=కానుకలు; అయితంబు+చేసికొని = సిద్ధంచేసుకుని; విజయంచేయుటకు= దయచేయటానికి; అర్చనలు = పూజలు.

భా : *ఇలా ఉన్న మీఅందరి అన్నాలు దుష్టమయినవి. విదురుడు ఒక్కని అన్నం మాత్రమే భుజించదగింది అని నిర్ణయించాను. కాబట్టి అక్కడికి వెడతాను" అని చెప్పి కృష్ణుడు దుర్యోధనుని అనుమతి తీసుకొని వెళ్ళుతున్నాడు. అప్పుడు బాహ్లికుడు భీష్ముడు మొదలైన కురువృద్ధులూ, ద్రోణాదులయిన పెద్దలూ వెంటవెళ్లి " మా యిండ్లలో మీకోసం బహుమతులు సిద్ధం చేసుకుని ఉన్నాము. మీరుదయచేయటం కోసం ఎదురు చూస్తున్నాము." అని ప్రార్థించారు. కృష్ణుడు 'నేను అన్నిచోట్లకూ వచ్చినట్లే. అందరి పూజలు గ్రహించినట్లే. మీరు ఉండండి.', అని వారిని నిలిపి విదురుని ఇంటికి వెళ్ళాడు.*

సీ. సంభ్రమస్నేహ నిశ్చల భక్తియుక్తిఁ బ
 విత్రమజ్జనము గావించి విదురుఁ
డెల్ల వంటకమును నేర్పడ బోనాలు
 వేర్పింప నెంతయుఁ బ్రీతి ముంద
రోజమై బ్రాహ్మణభోజనం బొనరించి
 సపరివారముగ విశాలరమ్య
పూతస్థలంబునఁ బుండరీకాక్షుండు
 దమ్ముండుఁ దాను నుత్సవమెలర్ప
తే. సరసరంజక మహనీయ సంప్రయోగ
మగు చతుర్విధ హృద్యాన్న మారగించె
లలిత సంభావనా మంజులంబు లైన
పలుకు లెడనెడ విదురున కెలమి యొసఁగ. 229

అ : విదురుఁడు; సంభ్రమ.... యుక్తిన్; సంభ్రమ= త్వరతో; స్నేహ = ప్రేమచేత; నిశ్చల= కదలికలేని; భక్తియుక్తిన్=భక్తితోకూడి; పవిత్రమజ్జనము(కృష్ణుని)పవిత్రమయిన స్నానము;

కావించి= చేయించి; ఎల్లవంటకమును = భోజనపదార్థాలు అన్నీ; ఏర్పడన్ = పంక్తులుదీర్చి; బోనాలు = అన్నాలు; పేర్పింపన్=వరుసగా పెట్టించగా; పుండరీక+అక్షుండు= కృష్ణుడు; ఎంతయున్= మిక్కిలి; ప్రీతిన్ =సంతోషంతో; ముందర= మొదట; ఓజమైన్ = క్రమంగా; బ్రాహ్మణభోజనంబు; ఒనరించి= చేయించి; తమ్ముండు = సాత్యకి; తానున్ = కృష్ణుడూ; విశాలరమ్యపూతస్థలంబునన్ = విశాల మయిన రమణీయమయిన పవిత్రమయిన ప్రదేశంలో; సపరివారముగ = పరివారంతోగూడ; ఉత్సవము=సంతోషం; ఎలర్పన్ = అతిశయించగా; లలితసంభావనామంజులంబులు+అయిన= మృదువయిన ఆదరణతో ఇంపైన; పలుకులు = మాటలు; ఎడనెడన్ = మధ్యమధ్య; విదురునకు; ఎలమి= సంతోషం; ఒసఁగన్= ఇవ్వగా; కలిగించగా; సరస అగు; సరస.... = రుచికలిగి; రంజక= ఆహ్లాదకరమయిన; మహనీయ= గొప్పదయిన; సంప్రయోగము+అగు = సాంగత్యము (పరస్పర సంబంధము)కలదయిన; చతుర్విధ= నాలుగురకాలయిన; హృద్య+అన్నము = మనోహరమయిన భోజనం; ఆరగించెన్= భుజించాడు.

భా : విదురుడు నిశ్చల భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణుని స్నానం చేయించాడు. తక్కిన ఆహారపదార్థాలతోపాటు చక్కగా అన్నం సిద్ధంచేయించాడు. అప్పుడు కృష్ణుడు ముందర బ్రాహ్మణ భోజనాలుచేయించాడు. తరువాత తమ్ముడు సాత్యకి ఇతర పరివారంతో విశాలమూ, రమణీయమూనయిన ప్రదేశంలో భోజనాలకు కూర్చున్నాడు. మంచి రుచికరాలూ మనోహరాలై పరస్పరసంబంధంకల నాలుగువిధాలయిన ఆహారాలతో గూడిన అన్నం భుజించాడు. భోజనం మధ్యలో అప్పుడప్పుడు కృష్ణుడు మృదువుగా మనోహరంగా మాట్లాడుతుంటే విదురుడు మహదానందం పొందాడు.

వి. ఆహారం నాలుగువిధాలుగా ప్రాచీనులు నిరూపించారు.భక్ష్యము; భోజ్యము; లేహ్యము; చోష్యము.

పండ్లతో కొరికి తినదగిన వాటిని భక్ష్యములు అంటారు.
నమలకుండా తినదగినది భోజ్యము
నాలుకతో నాకి తిన దగినది లేహ్యము.
చోష్యము అంటే పులుసు మొ॥చప్పరించదగినది.
పై నాలుగింటికి పానీయం అనేదాన్నికలిపితే పంచభక్ష్యాలు అంటారు.

వ. **అతండును** 72

భా : అవిదురుడు కూడా

క. **" గోవింద! సంభ్రమము సం**
భావింపుము; మాకు నిదియ పరమధనం; బెం
డేవిధమున నీకర్పన
గావింపం జాలు వాఁడు గలఁడే యెందున్." 231

అ : గోవింద=కృష్ణా!;సంభ్రమము=వేగిరపాటు(అజ్ఞానం); సంభావింపుము=క్షమించు; మాకున్; ఇది+అ = ఈసేవయే; పరమధనంబు = ప్రధానధనం; ఎందున్ = ఎక్కడనయినా;

ఒండు ఏవిధమునన్ = మరేరీతిగా నయినా; నీకు; అర్చన = పూజ; కావింపన్+ చాలువాఁడు = చేయగలవాడు. కలఁడే = ఉన్నాడా?

భా : *"కృష్ణా! నాతొందరపాటు క్షమించు. మాకు ఈ నీసేవయే పరమధనం. ఇంకోవిధంగా నీకు సేవచేయగలవాడు ఎక్కడయినా ఉన్నాడా?"*

వ. అని మఱియు నత్యంత వినయ వాక్యముల నారాధించుచుండె; నిట్లు కృతాహారుండైన హరికిఁ జందనచర్చాద్యుపచారంబు లాచరించి యవ్విదురుండు కృతార్థుండై యుండఁ గవి గాయకప్రముఖ నిఖిల విద్వజ్జనంబులు పాఠక వాంశిక వైణికాది వినోదపాత్రంబులు నప్పరమేశ్వరుం గానవచ్చి ప్రొద్దుపుచ్చి యభిమతార్థంబు వడసి చనిరి; రాత్రి యగుటయుం దగిన యభ్యంతర మందిరంబున హంసతూలికా తల్పంబున భుజంగతల్పు నునిచి యతని కడ నుచితాసనంబున నుండి. 232

అ : అత్యంత వినయవాక్యములన్ =మిక్కిలి వినయంతోగూడిన మాటలతో; ఆరాధించుచుండెన్ = సేవిస్తున్నాడు; కృతాహారుఁడు = భుజించినవాడు; చందనచర్చ+ఆది+ ఉపచారంబులు = మంచిగంధం పూయటం మొదలయినసేవలు;పాఠక వాంశిక వైణిక+ఆది= స్తోత్రపాఠకులు, వేణుగాయకులు, వీణలువాయించేవారు మొదలైన; వినోదపాత్రంబులు = కాలక్షేపం చేయటానికి తగినవారు; అభిమత+అర్థంబులు=కోరినధనాలు; అభ్యంతర మందిరంబున = లోపలిఇంటిలో; హంసతూలికాతల్పంబున = హంసయొక్కమెత్తని ఈకలతో తయారైన పాన్పుమీద; భుజంగతల్పున్ = ఆదిశేషుడు పక్కగా గలవానిని (కృష్ణుని) ఉచిత+ఆసనంబునన్ = తగిన ఆసనంమీద.

భా: *అని విదురుడు ఇంకా వినయపూర్వకమైన మాటలతో కృష్ణుని సేవిస్తున్నాడు. భోజనానంతరం కృష్ణునికి మంచిగంధం పూయటం మొదలయిన సేవలు చేసి ఆ విదురుడు కృతార్థుడయిఉన్నాడు. అప్పుడు కవులు, గాయకులు మొదలైన సమస్త విద్వాంసులూ; వందిమాగధులు వేణువు ఊదేవారు వీణలు వాయించేవారూ; మొదలయిన వినోదం కలిగించేవారు ఆయనవద్దకు వచ్చి పొద్దుపుచ్చి కావలసిన ధనాదికం తీసుకుని వెళ్ళారు. రాత్రిఅయింది. విదురుడు కృష్ణునకు అభ్యంతర మందిరంలో హంస తూలికాతల్పం సిద్ధంచేయించాడు. దానిమీద కృష్ణుడు పడుకున్నాడు. ఆతల్పానికి సమీపంలో తగిన ఆసనంమీద కూర్చొని ఏకాంతంలో ఉండి......*

ఆ. విదురుఁ డిట్టులనియె; "ఇది యొక కార్యంబు
గాఁగఁ బూని యిందు రాఁగఁ దగునె?
దుష్టబుద్ధి నీచు దుర్యోధనుండు నీ
మాట వినునె! దురభిమానఘనుఁడు. 233

అ : విదురుఁడు; ఇట్టులు అనియెన్; ఇది = ఈరాయబారం; ఒకకార్యంబు+కాఁగన్= ఒకపెద్దపనిగా; పూని = పూనుకొని; ఇందు = ఈకౌరవ సభకు; రాన్+కన్+తగునె = రాదగునా?;

దుష్టబుద్ధి = దుష్టమయిన మనస్సుకలవాడు; నీచు = నీచుడు; దురభిమానఘనుఁడు = దుష్టమయిన అభిమానంతో ఘనుడు అయిన; దుర్యోధనుండు; నీమాట వినునె.

భా : *విదురుడు ఇలా అన్నాడు. "కృష్ణా! ఈరాయబారం ఒకపెద్దపనిగా పెట్టుకుని నీవు ఇక్కడికి రాదగునా? దుష్టబుద్ధీ, నీచుడూ, దురభిమానీ అయిన దుర్యోధనుడు నీమాట వింటాడా?*

క. వచ్చిన సైన్యంబులఁ గని
పెచ్చు వెరిగినాఁడు; ద్రోణభీష్మల లావుల్
నచ్చియుఁ గర్ణుం డొక్కఁడ
యిచ్చుఁ దనకు విజయ మనియు నెంతయుఁ బొంగున్. 234

అ : వచ్చిన = సహాయంగా వచ్చిన; సైన్యంబులన్; కని = చూసి; పెచ్చు+పెరిగినాఁడు = విజృంభించాడు- చెలరేగుతున్నాడు; ద్రోణభీష్మల; లావుల్ = బలాలు; నచ్చియున్ = నమ్మికూడా; కర్ణుండు; ఒక్కఁడు+అ = ఒక్కడే; తనకున్; విజయము; ఇచ్చున్; అనియున్ = అనికూడా; ఎంతయున్ = చాలా; పొంగున్ = పొంగిపోతుంటాడు.

భా : *తనకు సహాయంగావచ్చిన సైన్యాలను చూసి విర్రవీగుతున్నాడు. ద్రోణభీష్మల బలపరాక్రమాలు నమ్మికూడా అతడు తనకు కర్ణుడు ఒక్కడే విజయం సంపాదించి పెడతాడని మిక్కిలిగా పొంగిపోతుంటాడు.*

వ. నీ విట వచ్చుట వినిన యప్పుడు ధార్తరాష్ట్ర లందఱుం గూడంబాఱి తమలో నిశ్చయించిన తెఱంగు-నీశాసనం బుల్లంఘింపం గలవారు; పాండునందనులకు నేమియు నీకుండువారు-దార యీధాత్రియంతయు బీఱువోవకుండ నేలువారు; వారింగూడిన రాజు లెల్లను దిగ్విజయంబునాడు పాండవులచేత భంగపడినవారు గావునఁ గర్ణుతో నేకార్థులమై చత్తుము గెలుతు మింతియ కాని యొండు లే దని నిశ్చయించుకొని యున్నవా; రట్లగుటంజేసి దుర్యోధనుండు గండు మిగిలి యున్నవాఁడు; సంధి గానేరదు; వారల కందఱకు నిది ప్రాప్తకాలం బైయున్నయది; యెట్లును నుడుగ నేర్చిన వారుగా; రిట్లు దమ్మెఱుంగని దుష్టాత్ముల నడుమం గూర్చుండుటయు, నవ్వేంగలివిత్తు లఱచు వీఱిడి యఱపులకు వంకలొత్తి మాఱు సెప్పుటయు నొప్పకయుండు. వెడంగు లగుటం గార్యవచనంబు లెఱుంగరు; మొఱకు లగుటం బ్రతాపభాషణంబులకు వెఱవరు; వారల తలంపులు గీడు; నీమహనీయప్రభావ బుద్ధిపౌరుషంబు లే నెఱుంగుదు; నయినను బాండవేయులపై స్నేహంబునను నీమీఁది భక్తినిం జెప్పెద; నందుఁ బోవవలవ" దనిన వాసుదేవుం డతని కిట్లనియె. 235

అ : ధార్తరాష్ట్రలు = ధృతరాష్ట్రునికుమారులు-కౌరవులు; కూడంబాఱి = కలుసుకొని; తెఱంగు = విధం; శాసనంబు = ఆజ్ఞ; ఉల్లంఘింపంగలవారు = దాటిపోతారు-అతిక్రమిస్తారు; ఈకుండువారు = ఇవ్వరు; తారు+అ = తామే; ధాత్రి = భూమి; భంగపడినవారు = అవమానించ

బద్ధవారు; ఏకార్థులము+ఐ = ఒకే ప్రయోజనం కలవారమై; ఒండు=మరొకటి; గండుమిగిలి+ ఉన్నవాఁడు=విజృంభించి ఉన్నాడు; ప్రాప్తకాలంబు = (చావుకు) యుక్తకాలంతో గూడినది; ఉడుగ నేర్చినవారు = యుద్ధం మానటానికి ఎరిగిన వారుకారు. ఆ+వెంగలివిత్తులు= మూఢా గ్రేసరులు; పీఁడి+అఱపులకు=కారుకూతలకు-వెర్రికూతలకు; వంకలొత్తి=సవరించి; మాఱు+చెప్పుటయున్= సమాధానం చెప్పటం; వెడంగులు=వెర్రివాళ్లు; కార్యవచనంబులు=సంధికార్యానికి తగిన మాటలు; మొఱకులు = మోటువారు(మూర్ఖులు); ప్రతాపభాషణంబులు = వీరాలాపాలు; వెఱవరు= భయపడరు; తలంపులు = ఆలోచనలు; కీడు = చెడ్డవి; నీమహనీయప్రభావబుద్ధి పౌరుషంబులు= నీమహిమ గొప్పతనము వివేకము పరాక్రమము.

భా : *కృష్ణా! నీవు ఇక్కడికి వస్తున్నావని విన్నప్పుడు ధృతరాష్ట్రకుమారులు అంతాకలిసి నీ ఆజ్ఞను అతిక్రమిద్దాంఅనీ పాండవులకు ఏమీ ఈయవద్దు అనీ తమలో తాము నిశ్చయించుకున్నారు. తామే ఈ భూమిని అంతను బీరుపోకుండా పరిపాలించాలి అని వారి ఉద్దేశం. ఇప్పుడు వారికి సహాయంగా వచ్చిన రాజులు అందరూ వెనక దిగ్విజయంనాడు పాండవుల చేతిలో భంగపడ్డారు. కాబట్టి వారు కర్ణునితో కలిపి చావటానికైనా, గెలవటానికైనా ఏకాభిప్రాయంతో సిద్ధంగా ఉన్నారు. అందువల్ల దుర్యోధనుడు విజృంభిస్తున్నాడు. కాబట్టి సంధికాబోదు. వారికి అందరికీ మరణకాలం దగ్గర పడింది. అందువల్ల యుద్ధం మానటంఎరగరు. ఇలా ఒళ్ళుతెలియని దుర్మార్గులమధ్య కూర్చోవటం ఆమూర్ఖాగ్రేసరులు వాగే కారుకూతలకు సర్దిచెప్పటం ఉచితంకాదు. మూర్ఖులు కాబట్టి కర్తవ్యానికి తగ్గట్లు మాట్లాడలేరు. మొరటువాళ్ళు కాబట్టి వీరాలాపాలు పలకటానికి జంకరు. వారి ఆలోచనలన్నీ చెడ్డవే. నీమహిమా, ప్రభావమూ, వివేకమూ పౌరుషమూ అన్నీ నాకు బాగాతెలుసు. అయినా పాండవులమీద ఉన్న ప్రేమ నీమీదున్న భక్తితో చెవుతున్నాను.* ***నీవు ఆకౌరవసభకు వెళ్ళవద్దు."*** *అని విదురుడు అనగా కృష్ణుడు ఇలా అన్నాడు.*

తే. "నీవివేకంబు నాప్తియు నెఱపి తీవు
తల్లిదండ్రులమాడ్కి హితంబు సెప్పి;
తేను నారాక తెఱఁ గెల్ల నేర్పరించి
చెప్ప విని; యేమి సెప్పినఁ జేయు వాఁడ. 236

అ : ఈవు = నీవు; తల్లిదండ్రులమాడ్కిన్ = తల్లిదండ్రులవలె; హితము = మంచిమాట; చెప్పితి = చెప్పావు; నీవివేకంబున్ = మంచి చెడులను నిర్ణయించేబుద్ధినీ; ఆప్తిన్= స్నేహమును; నెఱపితి = ప్రకటించావు; ఏను = నేను; నారాకతెఱఁగు = నేనువచ్చిన విధంబు; ఎల్లన్ =అంతా; ఏర్పరించి =నిరూపించి; చెప్పన్; విని; ఏమి చెప్పినన్; చేయువాఁడన్ = చేస్తాను.

భా : *"విదురా! నీవు నీవివేకాన్నీ, స్నేహాన్నీ ప్రకటించావు. తల్లి దండ్రులవలె హితం చెప్పావు. ఇంక నేను నావచ్చిన విధం అంతా వివరించి చెపుతాను. అది విని నీవు ఏమి చెయ్యమంటే అది చేస్తాను.*

-: శ్రీ కృష్ణుఁడు విదురునితో సంభాషించుట :-
సం.5-91-3

క. **ఎఱుఁగుదు నేను సుయోధను**
కొఱగామియు; నతనితోడఁ గూడి నృపులం
దఱుఁ బగ మనమున నిడికొని
యఱుముటయును; సంధి పొసఁగ దనియు; మహాత్మా! 237

అ : మహాత్మా! నేను; సుయోధను=దుర్యోధనుని యొక్క; కొఱగామియున్ = చెడ్డతనాన్నీ; నృపులు = రాజులు; అందఱున్; పగ; మనమునన్; ఇడికొని = ఉంచుకొని; అతనితోడన్; కూడి; అఱుముటయును = విజృంభించటమూ; సంధి; పొసఁగదు+అనియున్ = అనుకూలించదనీ; ఎఱుఁగుదున్.

భా. *మహాత్మా! దుర్యోధనుని దుర్మార్గమూ, చాలామంది రాజులు అంతకు ముందున్న శత్రుత్వాన్ని మనస్సులలో పెట్టుకుని అతనితో కూడి విజృంభించటమూ, సంధి కుదురదనీ నాకు తెలుసు.*

వి. ఇంతకుముందు కూడా కృష్ణుడు "ఈ సంధికార్యం బత్యంతదుర్ఘటంబు దీని ఘటియింపం జేయుట యశక్యం బని తలంచెద".(1.3.352వ.) అని అన్నాడు. అయినా తన యత్నం తాను చేస్తానని ఆసందర్భంలో(1.ఆ.353.ప) అన్నాడు. ఇక్కడ విదురునితో అదే మరో రకంగా అంటున్నాడు.

ఆ. **పుడమి యెల్ల నొడ్డగెడవయి గజవాజి**
యుతము గాఁ గడంగి యుగ్రమృత్యు
ముఖము సొరఁగఁ దివురు మూర్ఖత మాన్పుట
యధికమైన పుణ్య మనఘ చరిత! 238

అ : అనఘచరిత=పవిత్ర శీలంకలవాడా! పుడమి=భూమి; ఎల్లన్=అంతా; ఒడ్డగెడవు+అయి = తలక్రిందై; గజవాజియుతముగాన్ = ఏనుగులు గుర్రాలతో గూడి; కడంగి= ప్రయత్నించి; ఉగ్రమృత్యుముఖము = భయంకరమయిన మృత్యువునోరు; చొరగన్= ప్రవేశించటానికి; తివురు= ప్రయత్నించే; మూర్ఖత; మాన్పుట = మాన్పించటం; అధికము+ఐన; పుణ్యము.

భా : *పవిత్ర చరిత్రా! భూమి అంతా తల్లకిందై ఏనుగులూ, గుర్రాలతో గూడా ప్రయత్నపూర్వకంగా భయంకరమయిన మృత్యుముఖంలో ప్రవేశించటానికి ప్రయత్నించే మూర్ఖత్వాన్ని నివారించటం గొప్పపుణ్యం.*

వి. దీనికి మూలంలో ఇలా ఉంది.

పర్యస్తాం పృథివీం సర్వాం సాశ్వాం సరథకుంజరామ్
యో మోచయే న్మృత్యుపాశాత్ ప్రాప్నుయా ద్ధర్మ ముత్తమమ్; అధ్యా. 93శ్లో 5.

గుర్రాలు, రథాలు, ఏనుగులతో గూడి తలక్రిందులు చేయబడుతున్న సమస్త

భూమినీ, మృత్యు పాశాన్నించి రక్షించేవాడు ఉత్తమ ధర్మాన్ని పొందుతాడు.

తమ మూర్ఖప్రవర్తనతో సర్వనాశం చేయటానికి సిద్ధపడేవారికి నచ్చజెప్పి ఆదుష్కార్యాన్నించి మరల్చటం మహాపుణ్యం.

వ. మానుప వచ్చునే యంటేని. 239

భా : *నివారించవచ్చునా- నివారించ వీలవుతుందా అంటావా?*

క. దొరకొని పుణ్యముఁ బాపము
నరుఁ డర్థిం జేయుచుండ నడుమ నొకట న
వ్వెర వెడలి తప్పినను ద
త్పరిణతి ఫల మొందు నండ్రు ధర్మవిధిజ్ఞుల్. 240

అ : నరుఁడు = మానవుడు; అర్థిన్ = కోరికతో; దొరకొని = ప్రారంభించి; పుణ్యమున్; పాపమున్; చేయుచుండన్; నడుమన్ = మధ్యలో; ఒకటన్ = ఒకకారణంవల్ల; ఒక సమయంలో; ఆ+వెరవు = ఆపద్ధతి-ఆవిధం; ఎడలి = విచ్ఛిన్నమై; తప్పినను = తప్పిపోయినా; తత్ = దానియొక్క; పరిణతి = పరిణామము; పరిపక్వత; ఫలము+ఒందును = ప్రయోజనంకలది అవుతుంది; అని ధర్మవిధిజ్ఞుల్ = ధర్మశాస్త్రం తెలిసినవారు; అండ్రు = అంటారు.

భా : *మనుష్యుడు బుద్ధిపూర్వంగా ప్రారంభించి పుణ్యంగాని, పాపంగాని చేస్తుంటే మధ్యలో ఏదో ఒక కారణంవల్ల ఆపద్ధతి విచ్ఛిన్నమై తప్పిపోయినా దానిపరిణామం తప్పక ఫలితాన్ని ఇస్తుంది అని ధర్మస్వరూపం తెలిసిన వారు చెపుతారు.*

వి : దీనిమూలం స్వల్ప భేదంతో ఇలా ఉంది
ధర్మకార్యం యతన్ శక్త్యా నోచేత్ ప్రాప్నోతి మానవః
ప్రాప్తో భవతి తత్పుణ్య మత్ర మే నాస్తి సంశయః 93-6

మానవుడు తనశక్తి ననుసరించి ఏదైనా ధర్మకార్యాన్ని నిర్వర్తించటానికి ప్రయత్నించి సాఫల్యం పొందలేకపోయినప్పటికీ ఆతనికి తప్పకుండా ఫలం కలుగుతుంది. ఈ విషయంలో నాకు సందేహంలేదు.

వ. అట్లుంగాక. 241

భా : *అంతేకాక*

తే. చుట్టములలోన నొప్పమి పుట్టి నప్పు
డడ్డపడి వారితోడఁ గొట్లాడి యైన
దాని నుడుపంగఁ జొరకున్న వానిఁ గ్రూర
కర్ముఁడని చెప్పుదురు కర్మకాండవిదులు. 242

అ : చుట్టములలోనన్; ఒప్పమి = విరోధము; పుట్టినప్పుడు = కలిగినప్పుడు; అడ్డపడి; వారితోడన్; కొట్లాడి+ఐనన్ = పోట్లాడిఅయినా; దానిన్=ఆవిరోధాన్ని; ఉడుపంగన్ = పోగొట్టటానికి; చొరకున్నవానిన్=ప్రవేశించని వానిని; కర్మకాండవిదులు=కర్మల(కర్తవ్యాల) సమూహం తెలిసినవారు; క్రూరకర్ముఁడు = భయంకరమయిన పనులు చేసేవాడు; అని; చెప్పుదురు.

భా : చుట్టాలలో వైరం ఏర్పడితే వాళ్ళను అడ్డుకొని వారితో పోట్లాడిఅయినా ఆ విరోధాన్ని పోగొట్టటానికి ప్రయత్నించాలి. అలాచేయని వానిని కర్మకాండ తెలిసినవారు క్రూరకర్ముడు అని నిందిస్తారు.

వి. దీనికి మూలం ఇలా ఉంది.

జ్ఞాతీనాం హి మిథోభేదే యన్మిత్రం నాభిపద్యతే
సర్వయత్నేన మాధ్యస్థ్యం నత న్మిత్రం విదు ర్బుధాః 93-15

సోదరులు, బంధువుల మధ్యలో భేదభావం ఏర్పడినప్పుడు వారికి మిత్రుడు అన్ని విధాలా ప్రయత్నించి వారిలో సమైక్యతకు మధ్యస్థుడుగా వ్యవహరించకపోతే ఆతనిని మిత్రుడు అని పండితులు భావించరు.

వ. కావున; నీ రెండు దెఱంగులవారికి శాంతి గావింపం బ్రయత్నంబు సేసెద; ధర్మార్థ సహితంబైన తెఱంగు మాటలు మంత్రిజనసహితుండైన సుయోధనునకుం జెప్పెదఁ; దనకుం బాండునందనులకు లోకంబులకు హితంబయిన విధంబు వంచన లేకచెప్పెడు నన్ను పాండవులవాఁ డని శంకించి యతండు నామాట వినం డయ్యె నేనియు మేల కాక; యిట్లు సొచ్చి చెప్పకున్న నన్నదమ్ములు దమలోనం బోరఁ గృష్ణుండు వారింపక యుపేక్షించెఁ; దనచేతం జక్కంబడదా యని యజ్ఞులైన జను లాడుదు; రెల్ల భంగులం గార్యం బార్యు లియ్యకొనం జెప్పుదు. ధార్తరాష్ట్రులుం దమకు బ్రదుకుతెరువైన నాపలుకులు పట్టుదురు; పట్టక నీతలంచిన చందంబునం దులువలై కలగం బాఱిన వారు నాముందర నిలువం జాలుదురే" యని పలికిన విదురుం డట్లగాక యని సమ్మతించి యామంత్రణంబుసేసి నిజశయన స్థానంబునకుం జనియె ననంతరంబ.243

అ : రెండు+తెఱంగులవారికిన్ = రెండు పక్షాలవారికి; తెఱంగుమాటలు = సంధి వచనాలు; వంచన = మోసం- కపటం; మేలు+అ= మేలే; చక్కబడదా=సరికాదా; అనుకూలించదా; అజ్ఞులు = మూఢులు; కార్యంబు = చేయదగినది; ఆర్యులు = పూజ్యులు; ఇయ్యకొనన్ = సమ్మతించేటట్లు; బ్రతుకుతెరువు+ఐనన్ = జీవించేమార్గం ఉంటే; పట్టుదురు= గ్రహిస్తారు; నీతలంచినచందంబునన్ = నీవు అనుకొన్నట్లు; తులువలు = దుష్టులు; కలఁగం బాఱినన్ = చెలరేగితే; ఆమంత్రణంబు+చేసి = వీడుకొలిపి (సెలవుతీసికొని); అనంతరంబు = తరువాత.

భా : కాబట్టి ఈరెండు పక్షాలవారికి శాంతి కలిగించటానికి ప్రయత్నం చేస్తాను. ధర్మార్థాలతో కూడిన సంధిమాటలు మంత్రులతో కూడి ఉన్న దుర్యోధనునికి చెపుతాను. తనకూ, పాండవులకూ, లోకానికీ మేలుకలిగించేటట్లు కపటం లేకుండా మాట్లాడే నన్ను పాండవపక్షం వాడినని సందేహించి దుర్యోధనుడు నామాట వినకపోయినా మేలే అవుతుంది. ఇలా చొరవ తీసుకుని చెప్పకపోతే "అన్నదమ్ములు తమలోతాము కలహిస్తుంటే కృష్ణుడు వారించక ఉపేక్షించాడు. తనకు సంధి చేయటం చేతకాదా" అని మూర్ఖులు అజ్ఞానులు అంటారు. కాబట్టి అనేకవిధాల వారికర్తవ్యమేమిటో పెద్దలు ఔ ననేటట్లు వివరించి చెపుతాను. కౌరవులు కూడా తాము పదికాలాలపాటు బ్రతకటానికి ఉపయోగించే

నామాటల పరమార్థాన్ని గ్రహించగలరు. అలా గ్రహించలేక నీవు అనుకున్నట్టు దుష్టులై చెలరేగితే వాళ్ళు నాముందు నిలువగలరా?" అని శ్రీకృష్ణుడు అన్నాడు. విదురుడు అలాగే బాగుంది; అని అతని మాటలను సమ్మతించి ఆయన వద్ద సెలవు తీసుకుని తన పడకటింటికి వెళ్ళాడు. తరువాత;

వి. విదుర భీష్మాదుల ఎదుట దుర్యోధనుడు "పాండవులకు నేడుగడయు జనార్దనుండతని బట్టిబంధించిన ఱెక్కలువిఱిగిన పులుఁగులుంబోలెవారు నాకు విధేయులగుదురు" అని తన దురాలోచన చెప్పాడు. రాజరహస్యం కాబట్టి విదురుడు ఆవిషయం కృష్ణునికి సూటిగా చెప్పలేదు. అయినా కృష్ణుడు విదురుని భావం గ్రహించాడు. ఆ అభిప్రాయాన్నే "తులువలై కలగం బాఱిన వారు నాముందర నిలువం జాలుదురే" అనే వాక్యంలో ఆయన వ్యక్తంచేశాడు. అంటే శ్రీకృష్ణుడికి అంతా ముందుగానే తెలుసు కాబట్టి ఆయన ముందు జాగ్రత్తగా సాత్యకితో " దుర్యోధనుండు దుష్టాత్మకుం డతని మన్నించు మానుసులునుం గుటిల బుద్ధులు గావునఁ జక్రగదాద్యాయుధంబులు రథంబునం బెట్టింపవలయు". (3-131) అని అన్నాడు.

ఆ. అతని వచన రచన యాత్మలోఁ దలపోసి
యిట్టివాఁడు గలఁడె యెందు ననుచుఁ
బాలకడలి కడలి పాటియై యొప్పు న
ప్పాన్పు నందు శౌరి పవ్వళించె. 244

అ : అతని = ఆవిదురునియొక్క; వచనరచన = పలుకుతీరు; ఆత్మలోన్ = మనస్సులో; తలపోసి = గుర్తుచేసుకుని (ఆలోచించి); ఎందున్ = ఎక్కడయినా; ఇట్టివాఁడు = ఇలాంటివాడు; కలఁడె = ఉన్నాడా; అనుచున్ = అనుకుంటూ; శౌరి = కృష్ణుడు; పాలకడలిపాటి+ఐ = పాలసముద్రముయొక్కతరంగంతో సమానమయి; ఒప్పు; ఆ+పాన్పునందు = ఆశయ్యమీద; పవ్వళించె = పడుకున్నాడు- నిద్రించాడు.

భా : *కృష్ణుడు విదురుని మాటలలోని విశేషాలను గుర్తుచేసుకుని ఆలోచిస్తూ ఇతని వంటి వ్యక్తి ఎక్కడయినా ఉన్నాడా? అని ఆలోచిస్తూ క్షీరసముద్ర తరంగంవలె తెల్లగా చక్కగా ఉన్న పక్కమీద పడుకున్నాడు.*

వి. దీనికి మూలం ఇలా ఉంది.

ఇత్యేవముక్త్వా వచనం వృష్ణీనా మృషభ స్తదా
శయనే సుఖ సంస్పర్శే శిశ్యే యదుసుఖావహః 93-22

యాదవులకు సుఖకరుడూ వృష్ణిశ్రేష్ఠుడయిన శ్రీకృష్ణుడు ఇలా విదురునితో అని స్పర్శమాత్రం చేతనే సుఖకరమైన శయ్యపైన నిద్రించాడు.

తిక్కన చెప్పిన ఉపమానం శ్రీ కృష్ణుడు విష్ణువనే విషయాన్ని సూచిస్తుంది.

వ. ఇట్లు సుఖనిద్ర సేసి వేగుంబోకట మాగధ మంగళ గానంబుల మేలు కాంచి సమయకర్తవ్యంబులు సలిపె; నట్టియెడ; కృతవర్మయు సాత్యకియు వచ్చి పొడసూపినం బురుషోత్తముండు వారలు మొదలుగాఁ గల యిష్టజనంబులు పరివేష్టింప నుచిత ప్రదేశంబున నున్నంత. 245

అ : వేగుంబోకటన్ = ప్రభాతసమయంలో-తెల్లవారేటప్పుడు; మాగధ మంగళ గానంబులన్ =స్తోత్ర పాఠకుల శుభకరమయిన పాటలతో; సమయకర్తవ్యంబులు=ఆ సమయంలో చేయవలసిన పనులు; పొడసూపినన్ = కనపడగా; పురుష+ఉత్తముడు=(ఉత్తము డైనపురుషుడు) కృష్ణుడు; ఇష్టజనంబులు = ఇష్టులయినవారు; పరివేష్టింపన్ = చుట్టూఉండగా.

భా : *కృష్ణుడు సుఖంగా నిద్రించి ప్రభాతసమయంలో వందిమాగధుల మంగళగానాలతో మేలుకొని కాలకృత్యాలు- స్నానాదులు చేశాడు. అప్పుడు సాత్యకి కృతవర్మ వచ్చి కన్పించారు. కృష్ణుడు వారిద్దరూ తదితరులయిన ఆప్తజనులూ చుట్టూ ఉండగా తగిన ప్రదేశంలో ఉన్నాడు.*

క. ఇనతనయ శకుని దుశ్శా
సన సహితము గాఁగ నెలమిఁ జనుదెంచి సుయో
ధనుఁడు ప్రియోక్తులఁ దగువా
రును దానును వారిజోదరుం గొనియాడెన్. 246

అ : సుయోధనుఁడు; ఇనతనయ = కర్ణుడు; దుశ్శాసన; సహితము+కాఁగన్ = కూడేటట్లుగా; ఎలమిన్ = ఉత్సాహంతో; చనుదెంచి = వచ్చి; వారిజ+ఉదరున్ = పద్మము ఉదరమునందు(నాభిలో) కలవానిని-కృష్ణుని; తానును; తగువారున్ = యోగ్యులు; ప్రియ+ఉక్తులన్ = ఇంపైనమాటలతో; కొనియాడెన్ = మెచ్చుకున్నాడు(స్తుతించాడు).

భా : *దుర్యోధనుడు కర్ణశకుని దుశ్శాసనులతో కలిసి ఉత్సాహంగా వచ్చి తాను తగినవారు మరికొంతమంది మధురమయిన మాటలతో కృష్ణుని స్తుతించారు.*

వి. "దూతవాక్యము" అనే రూపకంలో శ్రీకృష్ణాగమనసమయంలో దుర్యోధనుడు ఆసనంమీద నుంచి లేవదలుచుకోలేదనీ శ్రీకృష్ణ ప్రభావంవల్ల క్రింద పడ్డాడనీ, దుర్యోధనుడే మహారాజు అని భాసుడు కల్పించాడు.

వ. అతండును మధుర సంభాషణంబులు సేయు, వార లతనికి ధృతరాష్ట్రుండు బంధుమిత్రాది సమస్త పరిజన సమన్వితుండయి పేరోలగంబున నునికి యెఱిఁగించినఁ బ్రియంబునఁ గట్టాయితంబైన తేరెక్కి భేరీ శంఖచామర ప్రముఖ భద్ర చిహ్నంబులతో వెడలి, గరుడధ్వజంబు గ్రాలఁ గృతవర్మసాత్యకు లొకరథంబునను దుర్యోధనాది దుష్టచతుష్టయం బొక్క రథంబునను బార్శ్వంబుల రాఁ, బౌరులకుఁ గన్నులపండు వగుచు, రాజమందిరద్వారంబు సేర నరుగు నప్పటి యులివునకుఁ గొలువు వారెల్ల నత్యుత్సుకులై యెదురు చూడ రథోత్తమంబు నవతరించి యరవిందనాభుండు. 247

అ : మధురసంభాషణలు = ఇంపైనసల్లాపాలు; సమన్వితుండు = కూడినవాడు; పేరోలగంబునన్ = గొప్పసభలో; ఉనికి = ఉండటం; కట్టాయితంబు+ఐన = సిద్ధము చేయబడిన; తేరు = రథం; చామరప్రముఖ = వింజామరలు మొదలయిన; భద్రచిహ్నంబులు = మంగళ కరమయిన గుర్తులు(చిహ్నాలు); క్రాలన్ = ప్రకాశించగా; పార్శ్వంబులన్ = ప్రక్కలగా; ఉలివునకు=

ధ్వనికి-సంచలనానికి; అతి+ఉత్సుకులు = మిక్కిలి ఉత్కంఠ గలవారు; రథ+ ఉత్తమంబు = శ్రేష్ఠమయిన రథాన్ని; అవతరించి = దిగి; అరవిందనాభుండు = పద్మంబొడ్డులో కలవాడు.

భా : *కృష్ణుడుకూడా వారితో తీయగా మాట్లాడాడు. ధృతరాష్ట్రుడు బంధువులు, మిత్రులు, సమస్తసేవకులతో గూడా మహాసభదీర్చి ఉన్నాడు అని వారు ఆయనకు చెప్పారు. అప్పుడు కృష్ణుడు సంతోషంతో సర్వసన్నద్ధమయిన రథం ఎక్కి భేరీశంఖచామరాదులయిన మంగళచిహ్నాలతో గరుడధ్వజం ప్రకాశించగా బయలుదేరాడు. కృతవర్మ సాత్యకులు ఒకరథం మీద, దుష్టచతుష్టయం ఇంకొక రథం మీద ఆయనకు రెండు వైపుల వస్తున్నారు. పురజనులకు కన్నులపండుగగా ఆయన వస్తూ రాజమందిరద్వారాన్ని సమీపించాడు. అక్కడ కలిగిన ధ్వనికి కొలువులోని వారంతా ఉత్కంఠతో ఎదురు చూస్తుండగా కృష్ణుడు రథం మీద నుంచి దిగాడు.*

వి. దుర్యోధన దుశ్శాసన శకుని కర్ణులను దుష్టచతుష్టయం అంటారు.

తే. ఎదురు వచ్చిన విదురుని యిచ్చు కరముఁ
దమ్ముచేయును రెండు హస్తములఁ బట్టి
నడచె ముందటఁ గదియు సందడి గడంగి
కర్ణ దుర్యోధనులు దొలగంగ జడియ. 248

అ : ఎదురువచ్చిన =ఎదురుగావచ్చిన; విదురుని=విదురునియొక్క; ఇచ్చుకరమున్= ఇచ్చేచేతినీ; తమ్ముచేయును = తమ్ముడయిన సాత్యకిచేతినీ; రెండు హస్తములన్ = రెండు చేతులతో; పట్టి = పట్టుకొని; ముందటన్ =ముందర; కదియు సందడిన్; కర్ణదుర్యోధనులు; కడంగి = పూనుకొని; తొలగంగన్ = తొలిగిపోయేటట్టు; జడియన్ = తొలగించగా; నడిచెన్.

భా : *తనకు ఎదురువచ్చిన విదురుడు అందించిన చేతినీ, తమ్ముడయిన సాత్యకిచేతినీ చెరొక చేతితో పట్టుకొని ఆయన కర్ణదుర్యోధనులు తనముందు కలిగిన జనసమ్మర్దాన్ని స్వయంగా తొలగిస్తుండగా ముందుకు నడిచాడు.*

వ. కృతవర్మాదియాదవులు లోనుగాఁ గల యభ్యంతరు లైన బలుమానుసులు పొదువుకొని పోవఁ, దనసమీపంబునఁ గౌరవులు రవి సన్నిధి తారాగ్రహంబుల చందం బగుచుండం, దేజోరాశి యగు రాజీవాక్షుండు సని తనకు బ్రత్యుత్థానంబు సేసిన కురురాజును దొరలను నభినందించుచు. 249

అ : లోనుగాన్+కల = మొదలయిన; అభ్యంతరులు = దగ్గరిబంధువులు (కావలసిన వారు); బలుమానుసులు = పెద్దమనుష్యులు; పొదువుకొని = చుట్టుకమ్ముకొని; రవిసన్నిధిన్= సూర్యుని ముందు; తారాగ్రహంబులచందంబు = నక్షత్రాలు నవగ్రహాలువలె; ప్రత్యుత్థానంబు= లేచిఎదురువచ్చుట.

భా : *కృతవర్మ మొదలయిన యాదవులు, తదితరులయిన దగ్గరిచుట్టాలూ, పెద్దలూ ఆయన చుట్టూ ఉండి వెళ్ళుతున్నారు. ఆయన ఎదుట కౌరవులు సూర్యుని ఎదుట నవగ్రహాలు నక్షత్రాలు కాంతి హీనా లయి కనపడనట్లు నిస్తేజులు అవుతుండగా*

తేజోరాశి అయిన కృష్ణుడు ముందుకు వెళ్ళాడు. తనకు ఎదురువస్తున్న ధృతరాష్ట్రుని ఇతరులను అభినందిస్తూ......

క. తన కని పెట్టిన మణిమయ
కనకోన్నత పీఠమునఁ బ్రకాశంబున ని
ల్చిన యెడఁ దోఁచిరి నారద
ముని ప్రముఖు లంతరిక్షమున నుజ్జ్వలులై. 250

అ : తనకు+అని = తనకోసంఅని; పెట్టిన = సిద్ధంచేసిన; మణిమయకనక+ ఉన్నత పీఠమునన్ = అంతటా మణులు కలబంగారంతో చేసిన పెద్ద పీఠంమీద; ప్రకాశంబునన్ = వెలుగులో అందరికీకనపడేటట్లు; నిల్చిన యెడన్= నిలిచి ఉన్నప్పుడు; నారదముని; ప్రముఖులు= ముఖ్యులు; అంతరిక్షమునన్ = ఆకాశంలో; ఉజ్వలులు+ఐ = ప్రకాశవంతులై; తోఁచిరి = కన్పించారు.

భా : *శ్రీకృష్ణుడు తనకోసం ఏర్పరిచిన మణిమయమయిన బంగారు పీఠంవద్ద నిలచి ఉన్నాడు. ఆసమయంలో నారదాది మహర్షులు ఆకాశంలో తేజస్సుతో వెలుగుతూ కన్పించారు.*

వ. ఇవ్విధంబున సన్నిహితులయిన యమ్మహామునులం గురుపితామహునకుం జూపి నారాయణుం డిట్లనియె. 251

అ : సన్నిహితులు = చేరవచ్చినవారు; కురుపితామహునకున్ = కౌరవులకు తాత అయిన భీష్మునికి; నారాయణుండు = కృష్ణుడు.

భా : *ఇలా సమీపానికి వచ్చిన ఆ మహామునులను భీష్మునికి చూపించి కృష్ణుడు ఇలా అన్నాడు.*

ఆ. " మనలఁ జూచువేడ్కఁ జను దెంచినారు మ
హాత్ములైన నారదాది మునులు;
వీరి కర్ఘ్యపాద్యవిధు లొనరించి, యా
సనము లిడగఁ బనుపు సత్వరముగ. 252

అ : మహాత్ములు+ఐన = గొప్పవారయిన; నారద+ఆదిమునులు = నారదుడు మొదలయిన మునులు; మనలన్; చూచువేడ్కన్ = చూడవలె ననే కోరికతో; చను దెంచినారు= వచ్చారు; వీరికి; సత్వరముగన్ = చాలా తొందరగా; అర్ఘ్యపాద్య+విధులు = అర్ఘ్యమూ; పాద్యమూ ఇవ్వటం అనే పనులు; ఒనరించి = చేసి; ఆసనములు; ఇడగన్ = పెట్టుటకు(వెయ్యటానికి); పనుపు = ఆజ్ఞాపించు.

భా : *"మహాత్ములయిన నారదాదులగు మహర్షులు మనలను చూడాలి అనే కోరికతో ఇక్కడికి వచ్చారు. కాబట్టి వెంటనే వీరందరినీ అర్ఘ్యపాద్యాలతో పూజించి వారికి తగిన ఆసనాలు వేయటానికి తగిన వారిని నియోగించు.*

అర్ఘ్యపాద్యములు 3-176 వచనంలో వివరించబడ్డాయి.

వ. వీరలు సముచితాసనంబుల నుండక మనకుఁ గూర్చుండుట దగవుగా" దనినం గొలువువా రెల్ల సంభ్రమాశ్చర్యంబులతో మునులవలను జూచుచుండ భీష్ముండు పరిచారకులం బనిచి కనక మణిమయాసనంబు లనేకంబులు దెప్పింప వార లరుగుదెంచిన వారలకు నమస్కరించి యాసనార్ఘ్య పాద్యాది విధులం బూజలు సేయించి కృష్ణుండు గూర్చున్న యనంతరంబ ధృతరాష్ట్రుండునుం దక్కటి వారును నుచితప్రకారంబుల నమ్మునీంద్రులకు నభివందనంబులు సేసి నిజాసనాసీనులైరి. దుశ్శాసనుండును వివింశతియు గద్దియ లిడ సాత్యకియుఁ గృతవర్మయుఁ గృష్ణుం గదిసి యిరువంకలం గూర్చుండిరి; కర్ణ దుర్యోధనులుం జేరువ నొక్క గద్దియ నుండిరి; విదురుండును మణిపీఠంబునఁ గృష్ణుని వెనుకదెసఁ దదీయోన్నత పీఠంబునఁ గరం బత్తమిల్లి యుండె; గాంధారరాజు నిజపుత్ర పరివృతుండై యొక్క దిక్కున నుచిత పీఠాసీనుండయ్యె; నట్టి సమయంబున. 253

అ : సముచిత+ఆసనంబులన్ = తగినపీఠాలమీద; తగవు = ధర్మం; కొలువువారు= సభలోనివారు; మునులవలను = మునులవైపు; పనిచి=పంపించి(పిలిచి); అరుగుదెంచిన =రాగా; అనంతరంబ = తరువాతనే; తక్కటివారును = మిగిలినవారు; అభివందనములు = నమస్కారాలు; నిజ+ఆసన+ఆసీనులు = తమపీఠాలమీద కూర్చున్నవారు; గద్దియలు = ఆసనాలు; ఇడన్ = ఉంచగా(వేయగా); కదిసి= తాకి (అనుకొని); ఇరువంకలన్ = రెండువైపులా; చేరువన్ = దగ్గరగా; తదీయ+ఉన్నతపీఠంబునన్ = ఆయన ఎత్తైన ఆసనంమీద; కరంబు = మిక్కిలి; అత్తమిల్లి = వంగి; ఒరిగి; గాంధారరాజు = గాంధారదేశానికిరాజు-శకుని; పరివృతుండై= చుట్టబడినవాడై.

భా : వీరందరూ తగిన ఆసనాలమీద కూర్చొనకుండా మనం కూర్చోటం ధర్మంకాదు. అని శ్రీకృష్ణు డన్నాడు. అప్పుడు సభలోని వారంతా సంభ్రమాశ్చర్యాలతో మునులవైపు చూస్తున్నారు. ఆసమయంలో భీష్ముడు సేవకులను పంపించి మణులు తాపటంచేసిన బంగారు ఆసనాలు చాలా తెప్పించాడు. సభలోకి వచ్చిన వారికి కృష్ణుడు నమస్కరించి కూర్చోటానికి ఆసనాలు చూపించాడు. కూర్చున్న ఆమునులను అర్ఘ్యపాద్యాదులతో పూజలు చేయించాడు. తరువాత ఆయన తన ఆసనంమీద కూర్చున్నాడు. ఆతరువాత ధృతరాష్ట్రుడు తక్కినవారు తగురీతిగా ఆమునీంద్రులకు నమస్కారాలుచేసి తమతమ ఆసనాల మీద కూర్చున్నారు. దుశ్శాసనుడు వివింశతి ఆసనాలు చూపించగా సాత్యకి, కృతవర్మ కృష్ణునికి రెండువైపులా ఆనుకొని కూర్చున్నారు. కర్ణదుర్యోధనులు ఆయనకు దగ్గరగా ఒకే ఆసనంమీదకూర్చున్నారు. విదురుడు శ్రీకృష్ణుని వెనుక ఆసనంమీద ముందుకు వంగి కూర్చున్నాడు. గాంధారరాజు శకుని తన కుమారులతో ఒక దిక్కున సముచితమయిన ఆసనంమీద కూర్చొని ఉన్నాడు. ఆసమయంలో...

వి. మహర్షులు అక్కడికి రావటంకొలువు వారి సంభ్రమాశ్చర్యాలు కలగటానికి కారణం. పెద్దలూ అతిథులూ కూర్చున్న తరువాత తక్కినవారు కూర్చోవటం భారతీయాచారం.

ఊర్ధ్వం ప్రాణా హ్యుత్క్రమంతి యూనః స్థవిర ఆగతే
ప్రత్యుత్థానాభివాదాభ్యాం పునస్తాన్ ప్రతిపద్యతే.

పెద్దలు వచ్చినప్పుడు చిన్నవారికి ప్రాణాలు పైకిపోయినంతపని అవుతుంది. కాబట్టివారికి లేచి ఎదురువెళ్లటం, నమస్కరించటం అనే పనులతో ఆ ప్రాణాలు మళ్ళీ కుదుట పడుతాయి. అని మనుస్మృతి (2-120) అంటున్నది. పెద్దలకునమస్కరించేవానికి పెద్దలను సేవించేవానికి ఆయువు, విద్య, యశస్సు, బలము అనే నాలుగు అభివృద్ధినందుతాయి. అని కూడామనుస్మృతి (2-121) లో ఉంది.

క. **అంబుద శుభగాత్రుం; బీ**
తాంబరధరుఁ; గమలదళనిభాక్షున్; హరిఁ జూ
డంబడసి లోచనము లమృ
తం బానిన మాడ్కి సమ్మదంబునఁ దేలన్. **254**

అ : అంబుదశుభగాత్రున్ = మేఘమువలె మంగళకరమయిన శరీరం గలవాడూ; పీత+అంబరధరున్ = పచ్చనిపట్టు బట్ట ధరించినవాడూ; కమలదళనిభ+అక్షున్ = పద్మపురేకులతో సమానమయిన కన్నులు గలవాడూ, అయిన; హరిన్ = శ్రీకృష్ణుని; చూడన్+పడసి = చూడటం పొంది (చూచేభాగ్యంకలిగి); లోచనములు = కన్నులు; అమృతంబు; ఆనినమాడ్కిన్ = త్రాగినట్లు; సమ్మదంబునన్ = ఆనందంలో; తేలన్ = తేలియాడగా (ఆకొలువువారు అనే తరువాతిపద్యంలోని పదంతో అన్వయం.)

భా : *మేఘశ్యాముడూ, మంగళకరమయిన శరీరం గలవాడూ, పీతాంబరం కట్టుకున్నవాడూ పద్మపత్రాలవలె విశాలమయిన నేత్రాలు గలవాడూ అయిన శ్రీకృష్ణుని చూడటం అనే భాగ్యాన్ని పొందిన తమకన్నులు అమృతం త్రాగినట్లు ఆనందంలో మునిగితేలగా.*

వి. **అతసీపుష్ప సంకాశః పీతవాసా జనార్దనః**
వ్యభ్రాజత సభామధ్యే హేమ్నీవోపహితో మణిః **94-53**

అవిసెపూవు వలె మనోహరమయిన శ్యామకాంతి గలవాడూ, పీతాంబరధారి అయిన శ్రీకృష్ణుడు సభామధ్యంలో స్వర్ణపాత్రలో ఉన్న ఇంద్రనీలమణి లాగా విరాజిల్లుతున్నాడు. అనిమూలం.

క. **ఆకొలువువారు గర మచ**
లాకృతి నొక పలుకు లేక, యందఱు వింజం
బాఁకిడిన కరణి నవశ ము
దాకారిత చిత్తవృత్తులై యుండంగన్. **255**

అ : ఆ కొలువువారు = ఆసభలోనివారు; అందఱు; కరము = మిక్కిలి; అచల+ఆకృతిన్ = కొంచెమయినా కదలని రూపాలతో; ఒకపలుకు = ఒక్కమాటకూడా; లేక;

వింజంబు = వింధ్యపర్వతం; అఁకిడినకరణిన్ = అడ్డుపడినట్లు; అవశముదాకారిత చిత్తవృత్తులు= వశంతప్పిన సంతోషాకారాన్ని పొందిన మనోవ్యాపారంగలవారు. ఐ+ఉండంగన్ = అయిఉండగా...

భా : *ఆకౌరవసభలో ఉన్నవారంతా ఏమాత్రం చలనం లేకుండా ఉన్నారు. ఏఒక్కరూ ఒక్కమాటయినా పలకటంలేదు. సూర్యగమనానికి వింధ్యపర్వతం అడ్డపడినప్పుడు సృష్టి అంతా స్తంభించిపోయినట్లు శ్రీకృష్ణ దర్శనంవల్ల కలిగిన సంతోషంచేత వారి మనస్సులు వశంతప్పినవి. వారి చిత్తవృత్తులు సంతోషాకారాన్ని పొందాయి. అలా సభఅంతా పరవశమై యున్నది.*

వి. **తతస్తూష్ణీం సర్వమాసీత్ గోవింద గత మానసమ్**
నతత్ర కశ్చిత్ కించిద్వా వ్యాజహార పుమాన్ క్వచిత్ **94-54**

ఆ సమయంలో అక్కడ అందరిమనస్సులు శ్రీకృష్ణునియందు లగ్నమై ఉన్నాయి. అందువల్ల అందరూ నిశ్శబ్దంగా ఉన్నారు ఏఒక్కరూ ఏమీ ఉలుకు పలుకు లేకుండా ఉన్నారు. అనిమూలభారతం.

-: శ్రీకృష్ణుఁడు ధృతరాష్ట్రునితో సంభాషించుట :-

సం. 5-93-1

క. **జలదస్వన గంభీరత**
నెలుఁ గొప్పఁగ దంతదీప్తు లెసఁగ ముకుందుం
డలరుచు సభ నఖిలజనం
బులు విన; ధృతరాష్ట్ర భూవిభున కిట్లనియెన్. **256**

అ : ముకుందుండు = శ్రీకృష్ణుడు; ఎలుఁగు = కంఠస్వరం; జలదస్వనగంభీరతన్= మేఘధ్వని (ఉరుము) వలె గాంభీర్యంతో; ఒప్పఁగన్ = విలసిల్లగా; దంతదీప్తులు = పలువరుసల కాంతులు; ఎసఁగన్ = వ్యాపించగా; సభన్ = కౌరవసభలోని; అఖిలజనంబులు = సమస్తజనులూ; అలరుచున్ = సంతోషిస్తూ; వినన్ = వినగా;ధృతరాష్ట్రభూవిభునకున్ = ధృతరాష్ట్ర మహారాజుతో ఇట్లు; అనియెన్.

భా : *తనకంఠస్వరం మేఘం గర్జించినట్లు గంభీరంగా ఉండగా దంతకాంతులు వ్యాపిస్తూఉండగా సభలోని జనులందరూ ఆనందంతో వింటూ ఉండగా శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రమహారాజుతో ఇలా అన్నాడు.*

వి. 1. 254;55 పద్యాలలో భువనమోహనమయిన శ్రీకృష్ణునిరూపానికి ఆకర్షితులయి ఆసభలోని వారందరూ రెప్పపాటు లేకుండా కృష్ణుని చూస్తున్నారు. అని చెప్పి దూతకు కావలసిన ఆకృతివిశేషాన్ని సూచించాడుకవి. ప్రస్తుత పద్యంలో ఆయన కంఠస్వర గాంభీర్యం సభ్యులను పరవశింపజేస్తున్నది అని సూచిస్తున్నాడు తిక్కన.

2. జలదస్వనానికి (ఉరుము) తోడు దంతదీప్తులు మేఘం నుండి వచ్చే మెరుపులుగా భాసిస్తున్నాయని సూచన.

క. **"జననాథ! నీయెఱుంగని**
పనులు గలవె? యైనఁ దగవుఁ బరమహితంబుం

దనవారికిఁ జెప్పన తగు
నని, వచ్చితి భారతాన్వయము ప్రియమొందన్. 257

అ : జననాథ = మహారాజా!; నీయెఱుంగనిపనులు = నీకుతెలియనిపనులు; కలవె= ఉన్నాయా?; ఐనన్ =అయినప్పటికీ; తనవారికిన్=బంధువులకు; తగవున్ =న్యాయమూ; ధర్మమూ; పరమహితంబున్=ఉత్తమమయిన మంచి (మాటను)ని; చెప్పన్+అ = చెప్పటమే; తగును;అని; భారత+అన్వయము = భరతవంశం; ప్రియమొందన్ = సంతోషపడునట్లు; వచ్చితి = వచ్చాను.

భా : *"ధృతరాష్ట్ర మహారాజా! నీకు తెలియని విషయాలు ఏమున్నాయి? అయినా తన చుట్టాలకు న్యాయాన్నీ; ఉపయోగపడే మంచిమాటనూ చెప్పటమే ధర్మం అనే భావంతో భరతవంశీయులు అందరూ సంతోషపడతారని నేను ఇక్కడికి వచ్చాను.*

వి. జననాథ=జనులకు-పాలితులకు దిక్కుఅయినవాడా అనటంవల్ల ధృతరాష్ట్రుని బాధ్యత సూచితం. "నీవెఱుంగని పనులు గలవె" అనటంవల్ల ధృతరాష్ట్రునికి తెలియనిది ఏమీలేదనీ, పాండవుల ప్రవర్తనా, దుర్యోధనాదులు చేసిన దుష్కార్యాలూ-సమస్తమూ ఆయనకు తెలుసుననీ సూచితం. కృష్ణుడు చెప్పే హితవచనాలు మొత్తం భరతవంశానికే మేలు కలిగించేవి. దానిద్వారా సర్వప్రజలకు మేలు కలిగిస్తాయి. "కౌరవులకూ పాండవులకూ సంధి జరగాలనీ అదికూడా సర్వవీరనాశం కలగకుండా జరగాలనీ-ఈ విషయం యాచించటానికి వచ్చాను" అని శ్రీకృష్ణుడు అన్నట్లు మూలం (95.3)లో ఉంది.

క. **క్షీరోదకగతిఁ బాండవ**
కౌరవు లొడఁగూడి మనికి కార్యం; బది నీ
వారసి నడపుము; వారన
వీరనఁ గురుముఖ్య! నీకు వేఱుం గలదే! 258

అ : పాండవకౌరవులు=పాండవులూ; కౌరవులూ; క్షీర+ఉదకగతిన్ =పాలూ, నీరువలె; ఒడఁగూడి=కలిసిమెలిసి; మనికి =జీవించుట; కార్యంబు = చేయవలసినపని; అది = ఆవిషయం; నీవు; అరసి=పరిశీలించి;నడపుము=నడిపించు కురుముఖ్య=కౌరవశ్రేష్ఠా; నీకు;వారు+అనన్=వాళ్ళు (పాండవులు)అనీ; వీరు+అనన్ = వీళ్ళు (కౌరవులు) అనీ; వేఱున్ =భేదంగూడా;కలదే= ఉందా?

భా : *పాండవులూ, కౌరవులూ పాలూనీళ్లువలె కలిసి జీవించటం అవశ్యకర్తవ్యం. నీవు ఆవిషయం అంతా బాగా పరిశీలించి వ్యవహారం నడిపించు. రాజా! నీకు వాళ్ళనీ, వీళ్లనీ(పాండవులనీ కౌరవులనీ) భేదబుద్ధి ఉందా?*

వి. క్షీరోదకగతి:- పాండవులు పాలలాంటివారు; కౌరవులు నీళ్ళలాంటివారు అని సూచితం అవుతుంది. క్షీరోదక గతి మనము. వారలునుం గలసి బ్రదుకవలదేనెమ్మిన్ ((1-263) అని ధృతరాష్ట్రుడు తనవారితో అన్నాడు. పాండవకౌరవుల్ గలసి పాలును నీరును బోలె నెమ్మిమై; నుండగ అని భీముడు (3-47) అంటాడు.

చ. **భరతకులంబు ధర్మమును బాడియు సత్యముఁ బొత్తుఁ బెంపునుం**
గరుణయుఁ గల్గియుండు ననఁగా నుతిఁ గన్నది; యందు సద్గుణో

త్తరులరు నీవు నీయనుఁగుఁదమ్ముఁడు; నీతనయుల్ యశోధురం
ధరశుభశీలు; రీసుచరిత్రక్రమ మిప్పుడు దప్ప నేటికిన్? 259

అ : భరతకులంబు = (మీ) భరతవంశం; ధర్మమును; పాడియున్ = న్యాయమూ, సత్యమున్; పొత్తున్ = స్నేహమూ; పెంపునున్ = గౌరవమూ; కల్గియుండును; అనఁగాన్; నుతిన్= పొగడ్తను; కన్నది = పొందింది; అందున్ =ఆవంశంలో; నీవున్; నీ+అనుఁగు+తమ్ముఁడున్ = నీ ప్రియమైన తమ్ముడు; సద్గుణ+ఉత్తరులరు = మంచిగుణాలు గలవారిలో శ్రేష్ఠులు; నీతనయుల్= నీకుమారులు; యశోధురంధర శుభశీలురు = కీర్తిభారాన్ని వహించగల మంచినడవడి కలవారు; ఈ సుచరిత్రక్రమము= ఈ సత్ప్రవర్తన పరంపరను; ఇప్పుడు; తప్పన్+ఏటికిన్ = తప్పట మెందుకు?

భా : *భరతవంశం ధర్మమూ, న్యాయమూ, సత్యమూ, స్నేహమూ, గౌరవమూ కలదని లోకంలో స్తుతి పాత్రమయింది. అటువంటి ఉత్తమ వంశంలో నీవూ, నీతమ్ముడు పాండురాజూ సుగుణఖనులు. నీకుమారులు మీవంశ కీర్తిభారాన్ని వహించగల చక్కని నడవడి గలవారు. ఇలా వంశపరంపరగా వచ్చే ఇంతచక్కని సత్ప్రవర్తనను ఇప్పుడు వదిలేయటం ఎందుకు?*

శా. ఈవంశంబున కెల్ల నీవ కుదు; రిం దెవ్వారి చందంబు లె
ట్లై వర్తిల్లినఁ గీడు మేలుఁ దుది నీయం దొందెడుం; గాన స
ద్భావంబారసి, లోని పొత్తు వెలివృత్తంబున్ జనస్తుత్యముల్
గావింపం దగు నీక యెవ్విధమునం గౌరవ్యవంశాగ్రణీ! 260

అ : కౌరవ్యవంశాగ్రణీ = కురువంశీయులలో శ్రేష్ఠుడా(ధృతరాష్ట్ర మహారాజా); ఈ వంశంబునకున్+ఎల్లన్ = ఈకురువంశానికంతకూ; నీవు+అ = నీవే; కుదురు= ఆధారం; ఇందు= ఈకురువంశంలో; ఎవ్వారిచందంబులు = ఎవరిప్రవర్తనలు రీతులు; ఎట్లు+ఐ = ఎలాగాఅయి; వర్తిల్లినన్ =ఉన్నా; కీడున్ = చెడూ; మేలున్ = మంచీ; తుదిన్ = చివరకు; నీయంద = నీలోనే; ఒందెడున్ = కలుగుతాయి; కాన=కాబట్టి; సద్భావంబు =మంచి(తలంపును) ఆలోచనను; ఆరసి= పరిశీలించి; లోనిపొత్తు = ఆంతరికమయిన (సంధినీ) స్నేహము; వెలివృత్తంబున్ = బాహిరమయిన నడవడీ నీకు+అ =నీకే; జనస్తుత్యముల్= లోకులమెప్పుపొందేవిగా; ఏవిధమునన్= ఎలాగయినా కావింపందగున్ = చేయదగినవి అవుతాయి.

భా : *ధృతరాష్ట్రమహారాజా! ఈకురువంశానికి అంతకూ నీవే ఆధారం. ఈవంశీయులైన కౌరవపాండవులలో ఎవరిప్రవర్తనెలా నడిచినా దాని వల్ల గలిగే మంచిచెడులు చివరకు నీకే చెందుతాయి. కాబట్టి మంచి మనస్సుతో ఇదంతా ఆలోచించి ఆరెండుపక్షాలమధ్య ఆంతరికమయిన మైత్రీ, బహిరంగమయిన వారిప్రవర్తనా ప్రజలు మెచ్చుకొనే రీతిగా ఉండేటట్లు ఎలాగయినా నీవే చేయాలి.*

వి. కౌరవగణం బాహ్యాభ్యంతరాలలో (అందరికీతెలిసేటట్లు; రహస్యంగా) దుర్వృత్తులైతే వారిని మీరేమంచిమార్గంలో నడపగలిగే వారు. అని మూలంలో (95-8) ఉంది. "కౌరవ్యవంశాగ్రణీ" అనే సంబోధన ధృతరాష్ట్రుని బాధ్యతను సూచిస్తున్నది.

చ **వినుము; సుయోధనాదు లగు వీరు సధర్ములు గాక, కార్యము**
ల్గొనక, మహార్థ సిద్ధి యెడలుం దమ కిట్లన, కన్వయంబు వ
ర్తన మిది గాదు నాక; బెడిదంపుఁదనంబున బంధుకోటికి
న్మనసులు నొవ్వఁగా; నవగుణంబులకుం బుయిలోడ రేమియున్. 261

అ : వినుము; సుయోధన+ఆదులు+అగు = దుర్యోధనుడు మొదలయినవారయిన; వీరు; సధర్ములు = ధర్మంతో గూడినవారు; కాక; కార్యముల్ = చేయదగిన పనులను; కొనక= స్వీకరించక; తమకు; మహా+అర్థ సిద్ధి= గొప్పదయిన ప్రయోజనం సిద్ధించటం; ఇట్లు=ఈవిధంగా; ఎడలున్= తొలగిపోతుంది; అనన్=అనుకోక; ఇది= ఈవిధంగాచేయటం; అన్వయంబు = వంశం (వంశీయుల)యొక్క; వర్తనము = ప్రవర్తన; కాదు; నాన్ = అను కొనక; బెడిదము+తనంబునన్= కాఠిన్యంతో; బంధుకోటికిన్ = చుట్టాలసమూహానికి; మనసులు; నొవ్వఁగాన్ = బాధపడగా; అవగుణంబులకున్ = దుర్గుణాలకు; ఏమియున్ = ఏమాత్రము; పుయిలోడరు = జంకరు-వెనుదీయరు.

భా : *ధృతరాష్ట్రమహారాజా! విను. దుర్యోధనాదులయిన వీరందరు ధర్మం వదిలేశారు. చేయదగిన పనులు చేయటంలేదు. ఈవిధంగా ప్రవర్తిస్తే తమకు సిద్ధించవలసిన వన్నీ సిద్ధించవని అనుకోటంలేదు. పవిత్రమైన కురువంశానికి తమ ఈప్రవర్తన తగదని అనుకోవటంలేదు. వీరి దుష్టమయిన కఠిన ప్రవర్తనవల్ల బంధువు లందరి మనస్సులూ బాధపడుతున్నవి. తమలో ఈ అవగుణాలు ఉన్నందుకు వారేమాత్రం జంకు గొంకు లేకుండ ఉన్నారు.*

వి. "సుయోధనాదులగు వీరు" అని ఆసభలో తనకు అనతిదూరంలో ఉన్న వారిని శ్రీకృష్ణుడు చేతిలోచూపిస్తున్నాడు.

"రాజా! దుర్యోధనాదులగు నీపుత్రులు ధర్మార్థాలను వెనుకకు నెట్టి క్రూరులుగా ప్రవర్తిస్తున్నారు. వీరు తమముఖ్య బంధువులతో అయోగ్యంగా వ్యవహరిస్తున్నారు. మనస్సులు లోభానికి వశంకాగా వీరుధర్మమర్యాదను భగ్నంచేశారు. ఈవిషయం మీకు బాగాతెలుసు." అనిమూలం. (95-10;12)

ఉ. **కౌరవపాండవుల్ తెఱఁగు గైకొని శాంతతఁ బొంది యున్కి మే-**
లారయ నాకు నీకుఁ గులమంతకు నీనృపకోటి కుర్వికిం;
బోరితమైన నింతకును బుట్టు మహాపద; గావునం ధరి
త్రీరమణాగ్రగణ్య! గణుతించి యవశ్యముఁ బొం దొనర్పవే ! 262

అ : కౌరవపాండవుల్; తెఱఁగు = సంధి; కైకొని = పాటించి; శాంతతన్ = ఉపశమనమును; పొంది; ఉన్కి= ఉండటం; ఆరయన్= పరిశీలించగా; నాకున్ నీకున్; కులము= వంశము; అంతకున్; ఈనృపకోటికిన్ = ఈరాజసమూహానికి; ఉర్వికిన్ = సమస్తభూమండలానికి; మేలు= మంచిది; పోరితము = యుద్ధము; ఐనన్ = అయితే-జరిగితే; ఇంతకును = దీనికంతటికీ (పైనచెప్పినవాటికన్నిటికీ); స్వల్పకాలంలోనే; మహా+ఆపద = గొప్పకీడు; పుట్టున్ = కలుగుతుంది.

కావునన్ = కాబట్టి; ధరత్రీరమణ+అగ్రగణ్య = రాజశ్రేష్ఠులలో మొదట లెక్కింపదగినవాడా (ధృతరాష్ట్ర మహారాజా); గణుతించి = గ్రహించి- భావించి; అవశ్యమున్ = తప్పకుండా; పొందు= సంధిని; ఒనర్పవే = చేయుము.

భా : *కౌరవులు పాండవులు సంధిచేసుకొని శాంతిపొంది ఉండటం-బాగా ఆలోచిస్తే-నాకూ, నీకూ, ఈకురువంశానికంతకూ, ఈరాజసమూహాని కంతటికీ, సమస్త భూమండలానికీ క్షేమకరం. ఒకవేళ యుద్ధమే జరిగితే పైనచెప్పినవా రందరికీ చాలా త్వరగానే మహాపద కలుగుతుంది. కాబట్టి ధృతరాష్ట్ర మహారాజా! ఇవన్నీ బాగా ఆలోచించి తప్పకుండ సంధి చెయ్యండి.*

వి. " రాజా! నీవే కావాలి అనుకుంటే సంధి అంతకష్టమైందికాదు." ఈసమయంలో ఈరెండు పక్షాలకు సంధి చేయటం మీచేతిలో, నాచేతిలో ఉంది. నీవు నీపుత్రులను హద్దులలో ఉంచు. నేను పాండవులను అదుపులోపెడతాను. "అని కృష్ణుడు ధృతరాష్ట్రునికి సూటిగా చెవుతున్నాడు మూలంలో (95-12;13).

యుద్ధం అందరికీ ఆపత్కరం అనిచెప్పటం కృష్ణుని ఉద్దేశం.

తే. నీకు వలసినఁ దీర్పంగ నేరవచ్చు
నధిప తెఱఁగు నీవశమున యదియ కాన;
నీకు వీరలఁ దేర్చుట నెఱియ కాదె!
సిద్ధ మెవ్వారిఁ దెలివొందఁ జేయనేర్తు. 263

అ : అధిప = రాజా; తెఱఁగు = సంధి; నీవశమున యదియ కాన = నీకుస్వాధీనంలో ఉన్నదే కాబట్టి; నీకు; వలసినన్ = ఇష్టమయితే; తీర్పంగ నేరవచ్చున్ = చక్కదిద్దటం చేత నగును; వీరలన్ = ఈకౌరవపాండవులను; తేర్చుట = నిష్కల్మషులను చేయటం; బాగుచేయటం; నీకు; నెఱి+అ+కాదె = ధర్మమేకదా!; ఎవ్వారిన్ = ఎవరినయినా; తెలివొందన్ = తెలివికలిగేటట్లు; చేయనేర్తు = చేయగలవు; (ఇది) సిద్ధము = నీకువశపడిఉన్నది.

భా : *రాజా! కౌరవపాండవుల సంధి నీ అధీనంలో ఉన్నదే; కాబట్టి నీ కిష్టమయితే ఇరుపక్షాలను చక్కదిద్దవచ్చును. వీరి మనస్సులు నిర్మలం చేయటం నీధర్మంకదా! నీవు తలచుకొంటే ఎవరినయినా వివేకవంతులను చేయగలవు. ఇది సిద్ధం.*

వి. ఇందులో ధృతరాష్ట్రుని ప్రశంసేకాదు; యథార్థంకూడా ఉంది. ధృతరాష్ట్రుడు మహారాజు. రాజ్యం అంతా ఆయన చేతిలోనే ఉంది. కాబట్టి ఆయన సంధి కావాలి అని దృఢంగా అనుకుంటే తప్పక జరుగుతుంది. ఈ విషయం ఆసభలోనివారికి అందరికీతెలుసు. ఆయనఆజ్ఞ కౌరవ పాండవులకు శిరోధార్యం. అంతరంతరాల్లోని ధృతరాష్ట్రుని అభిప్రాయం దుర్యోధనుని మాటలలో వ్యక్తమవుతుంటుంది.

శక్యా చేయం శమయితుం త్వం చేదిచ్ఛసి భారత. (95-12)
రాజా! నీవు కావాలి అనుకుంటే ఈ ఆపద నివారించవచ్చు.

ఉ. **అందు; వృకోదరార్జునుల నాహవరంగమునందు మీఱువా**
రెందఱొ యెన్నుమా! యిచట నీగురుభీష్ములఁ గ్రేణి సేయు వా
రెందఱొ! వారు వీరు నని నీల్గుటకంటె భవద్బలంబులై
యందఱుఁ గూడుటొప్పదె? జనాధిప! శాంతి యొనర్చు మెమ్మెయిన్.264

అ : అందు = అపాండవపక్షలోని; వృకోదరార్జునులన్ = భీమార్జునులను; ఆహవరంగమునందు = యుద్ధరంగంలో; మీఱువారు = అతిశయించ (దాటిపో) గలవారు; ఎందఱొ = ఎంతమందో; ఎన్నుమా = లెక్కవేయుము; ఇచటన్ = ఇక్కడ కౌరవపక్షంలో; ఈ గురుభీష్ములన్ = ఈ ద్రోణభీష్ములతో; క్రేణి+చేయువారు = పోలగలవారు తిరస్కరించగలవారు; ఎందఱొ = ఎంతమంది ఉన్నారు?; వారున్ = ఆపాండవులూ; వీరును = ఈకౌరవులూ; ఇట్లు = ఇలాగా; అనిన్=యుద్ధంలో; ఈల్గుటకంటెన్=మరణించటానికన్నా; అందఱున్= రెండు పక్షాల వారూ; భవత్+బలంబులై=నీబలాలై = నీకు సైన్యాలయి; కూడుట = కలవటం; ఒప్పదె= తగదా?; జన+అధిప= రాజా! ఏ+మెయిన్ = ఏవిధంగా నయినా; శాంతి; ఒనర్చుము = చేయుము.

భా : *ధృతరాష్ట్రమహారాజా! పాండవపక్షంలో ఉన్న భీమార్జునులను యుద్ధంలో మీరిపోగలవారు ఎంతమంది ఉన్నారో లెక్కవేయి. ఇక్కడ ఉన్న ద్రోణభీష్ములతో పోలగలవారు (సమానులు) ఎంతమంది ఉన్నారు? ఆ పాండవులూ, ఈ కౌరవులూ యుద్ధంలో మరణించటానికంటే నీకు బలాలయి కలిసి ఉండటం తగదా? ఏవిధంగానయినాసరే రెండు పక్షాలను శాంతింపజేయి.*

వి. మూలంలో కౌరవపక్షంలో 12మందినీ; పాండవపక్షంలో 7గురునీ చెప్పగా తిక్కన పాండవపక్షంలో ఇద్దరినీ కౌరవపక్షంలో ఇద్దరినీ చెవుతున్నాడు. విశేషం ఏమిటంటే ఈసందర్భంలో సంస్కృతాంధ్రభారతాలలో దుర్యోధనుని పేరులేకపోవటం. వారువీరు అని శ్రీకృష్ణుడు హస్తనిర్దేశం చేస్తున్నాడు.

తే. జగతిఁ గల జనపతులు నీచరణపీఠ
మర్థిఁ గొలువ, సముద్ర వేలావృతోర్వి
యెల్ల నేలుట యొప్పదే! తల్లి ప్రజల
యెడ విరోధంబు పాటించు టెంత మేలు! 265

అ : జగతిన్ = లోకంలో; కల జనపతులు = ఉన్నరాజులు; నీచరణపీఠము = నీ పాదపీఠాన్ని; అర్థితోన్=కోరికతో; కొలువన్=సేవించగా; సముద్రవేలా=సముద్రంయొక్క చెలియలి కట్టతో; ఆవృత+ఉర్వి = చుట్టబడిన భూమి; ఎల్లన్ = అంతా; ఏలుట=పరిపాలించటం; ఒప్పదే= తగదా?; తల్లి; ప్రజలయెడన్ = పిల్లలయందు; పిల్లలవిషయంలో; విరోధంబు = శత్రుత్వం; పాటించుట = కలిగి ఉండటం; ఎంతమేలు = ఏమాత్రం మంచిది?

భా : *లోకంలో ఉన్న రాజులందరూ నీ పాదపీఠాన్ని సేవించగా నాలుగు సముద్రాలమధ్య ఉన్న సమస్త భూమండలాన్నీ పరిపాలించటం నీకు సముచిత మయినదేగదా! తల్లి పిల్లలతో శత్రుత్వం పెట్టుకోవటం తగునా?*

క. **నరనాథ! నీ వుపేక్షా**
పరుఁడ వయిన! గౌరవులక పాండవులక కా;
దరయఁగ భూప్రజ కెల్లను
దురితం బొనరించినట్ల తుదిఁ గీడు సుమీ! 266

అ : నరనాథ = రాజా! నీవు; ఉపేక్షాపరుఁడవు+అయినన్ = అశ్రద్ధ (నిర్లక్ష్యం) చేసేవాడివయితే; కౌరవులకు+అ = కౌరవులకే; కాదు; పాండవులకు+అ = పాండవులకే; కాదు; అరయఁగన్ = ఆలోచిస్తే; భూప్రజకు+ఎల్లను = భూమండలంలోఉన్నజనుల కందరికీ; దురితంబు = ఆపద; ఒనరించినట్లు+అ = కలిగించినట్లే; తుదిన్ = చివరకు; కీడుసుమీ = అనర్థకంసుమా!

భా : *రాజా! ఇప్పుడు నీవు నిర్లక్ష్యంచేస్తే కౌరవులకూ, పాండవులకేకాదు; భూమిపై ఉన్న సమస్తజనులకూ ఆపద కలిగించినట్లే అవుతుంది. ఇది చివరకు గలిగే అన్ని అనర్థాలకూ మూలం అవుతుంది.*

వి. ధృతరాష్ట్రుని పుత్రాపేక్ష, సంధివిషయంలో ఉపేక్ష భయంకరమయిన ప్రజాక్షయానికి హేతువులు అవుతాయి అని శ్రీకృష్ణుని హెచ్చరిక.

క. **కౌరవ పాండవులం దె**
వ్వారలకుం జావు నొవ్వు వచ్చిన మేలు
ర్వీరమణ! చిత్తమున నె
ట్లారయుమా! నీకు దుఃఖ మగు నెట్లయినన్. 267

అ : కౌరవపాండవులందు; ఎవ్వారలకున్ = ఎవరికయినా; చావు; నొవ్వు = బాధ; వచ్చిన = సంభవిస్తే; మేలు=మంచిదా?; ఉర్వీరమణ = రాజా; చిత్తమునన్ =మనస్సులో; ఎట్లు= అన్నివిధాలా; ఆరయుమా = ఆలోచించు; ఎట్లు+అయినన్ = ఎలాగయినా (ఉభయపక్షాలలో ఎవరికి ఏకీడుకలిగినా) నీకు; దుఃఖము+అగున్ = దుఃఖం కలుగుతుంది.

భా : *కౌరవపాండవులలో ఏపక్షం వారికయినా మరణంగాని బాధగాని కలగటం మంచిదా? ఈ విషయాన్ని మనస్సులో బాగా ఆలోచించు. రెండు పక్షాలలో ఎవరికి కీడు కలిగినా నీకు దుఃఖం తప్పదు.*

ఉ. వీరును వారుఁ బండితులు; విక్రమవంతులు; బాహుగర్వదు
ర్వారులు; పూని రిత్త బవరంబున నొఱిఁడిఁ జావఁ బోవ నె
ట్లూరక యుండవచ్చుఁగడునొప్పెడు మేనులు వాఁడికైదువుల్
గూరఁగ నాటినం బుడమిఁ గూలుట కక్కట! యోర్వవచ్చునే! 268

అ : పండితులున్; విక్రమవంతులున్=పరాక్రమంకలవారూ;బాహుగర్వదుర్వారులు= భుజబలగర్వంవల్ల వారించటానికి వీలుకానివారయిన; వీరును = ఈకౌరవులూ; వారున్ = ఆపాండవులూ; పూని = పూనుకొని; రిత్తబవరంబునన్ = వ్యర్థమయిన యుద్ధంలో; ఆఱిడిన్ = నిష్ప్రయోజనంగా; చావఁబోవన్ = చావటానికి సిద్ధంకాగా. ఎట్లు = ఎలాగా; ఊరకయుండవచ్చు= ఊరుకోవచ్చు?; కడున్ = మిక్కిలి; ఒప్పెడుమేనులు = చక్కనిశరీరాలు(లలో); వాఁడికైదువుల్= పదునయిన ఆయుధాలు; కూరఁగనాటినన్ =కూరుకుపోయేటట్లు దిగబడగా; పుడమిన్ = భూమి మీద; కూలుటకు=పడిపోవటానికి; అక్కట = అయ్యో; ఓర్వవచ్చునే = సహించ వీలవుతుందా?

భా : *పండితులూ, పరాక్రమవంతులూ, భుజబలం గలవారూ అయిన ఈ కౌరవులూ; ఆపాండవులూ నట్టుదలతో; వ్యర్థమయిన యుద్ధంలో నిష్కారణంగా చావబోతుంటే ఊరికే ఎలాచూస్తూ ఉండగలం? చక్కని వీరిశరీరాలు పదునయిన ఆయుధాలు గాటంగా దిగబడి నేలగూలటం సహించగలమా?*

ఆ. ఇట్లు గాకయుండ నీరెండు దెఱఁగుల
వారిఁ గాచికొనుము వసుమతీశ!
నీదు ప్రాభవంబు నీతియు శాంతియు
నఖిలజనులుఁ బొగడునట్లు గాఁగ." 269

అ : వసుమతీశ = భూనాథా!; ఇట్లు = ఈపైనచెప్పినవిధంగా; కాకయుండన్ = జరగకుండాఉండేటట్లూ; నీదుప్రాభవంబు=నీవైభవాన్ని; నీతియున్ = రాజనీతినీ; శాంతియున్; అఖిలజనులున్ = సమస్తజనులూ; పొగడునట్లు = పొగిడేవిధం; కాఁగన్ = కాగా; ఈరెండు+ తెఱఁగులవారిన్ = ఈరెండుపక్షాలవారినీ; కాచికొనుము = రక్షించుము.

భా : *రాజా! నీ అధికారాన్నీ, నీరాజనీతిచాతుర్యాన్నీ, శాంతిప్రియత్వాన్నీ సమస్తజనులూ పొగడేవిధంగానూ పైనచెప్పినట్లు సర్వనాశనం కాకుండానూ, ఈ రెండు పక్షాలవారిని రక్షించుకో."*

వ. అని చెప్పి వెండియు. 270

భా : *అని చెప్పి శ్రీకృష్ణుడు మళ్ళీ ఇలా అంటున్నాడు.*

-: శ్రీకృష్ణుఁడు పాండవులు సెప్పినమాటలు ధృతరాష్ట్రునితోఁ జెప్పుట:- సం. 5-93.36

తే. "పాండవులు దండ్రిసచ్చిన ప్రజలు; వారి
నరసి ప్రోచితి శైశవ మాది గాఁగ
నడుమ నిష్కారణమ దిగవిడువఁ దగునె?
పార మొందంగ రక్షింపు గారవమున. 271

అ : పాండవులు; తండ్రి; చచ్చిన; ప్రజలు = బిడ్డలు; వారిన్; శైశవము = పసితనం; ఆదికాఁగన్ = మొదలుగా; అరసి = కనిపెట్టి; ప్రోచితి = రక్షించావు; నిష్కారణము+అ = కారణంలేకుండానే; నడుమన్ = మధ్యలో; దిగ విడువఁదగునె = వదిలివేయవచ్చా? (వారిని); గారవమునన్ = ప్రేమతో; పారము+ఒందంగన్ = ఆవలిదరి చేరేదాకా (తుదిదాకా;) రక్షింపు.

భా : *" పాండవులు తండ్రిలేని బిడ్డలు. వాళ్ళను చిన్నప్పటి నుంచి పెంచి పెద్ద చేశావు. నిష్కారణంగా మధ్యలో వాళ్ళను వదిలేయటం తగునా? కాబట్టి తుదిదాకా వారిని ప్రేమతో రక్షించు.*

వ. పాండుకుమారులు నీకుం బరమభక్తిం బ్రణమిల్లి యందఱు నొక్కమాటగా నీతోఁ జెప్పు మని నాకుం జెప్పిన విధంబు వినుము; "తన పంపునం బండ్రెండు వత్సరంబులు వనంబున వసియించితిమి; పదుమూఁడగు నేఁడు జనపదంబున నజ్ఞాత వాసంబునుం జలిపితిమి; మా తండ్రి సమయంబు పరిపాలించి యే మర్ధరాజ్యం బెట్లును బడయుదు మని కృతనిశ్చయులమై పడితిమి; తల్లియుఁ దండ్రియు నెల్లచుట్టంబులు నేడుగడయును మాకుఁదాన; మావలన నేరమి గల్గినం గినిసి యిట్లుగా దట్లని చక్కంబెట్టునది; తన గల పదివే లేండ్ల కుం దన్న కాని మఱి యెఱుంగ; మెట్టి వారమైనను మమ్మును దుర్యోధనాదులనుం దలంపరు; తనయందుఁ దెఱంగు గలిగిన నెవ్వరు గొఱగాకున్నను గులంబు పాడిసెడక చెల్లునని " అనిరని పలికి మఱియు నిట్లనియె.272

అ : ప్రణమిల్లి = నమస్కరించి; పంపునన్ = ఆజ్ఞతో; జనపదంబునన్ = దేశంలో (జనంఉండేచోట); చలిపితిమి = చేశాము; సమయంబు= ఒడంబడిక (ఏర్పాటు); ఏము =మేము; పడితిమి = కష్టాలు పడ్డాము; ఏడుగడయును = సమస్తమూ (శరణము); నేరమి = లోపము (తప్పు); కినిసి = కోపించి; చక్కంబెట్టునది = సరిదిద్దవలసింది సరిచేయవలసింది; తను+కల= తాను జీవించి ఉన్న; పదివేలేండ్లకున్ = పదివేల సంవత్సరాలకయినా; తన్ను అ కాని = తననే తప్ప; తలంపరు = అనుకోరు; తెఱంగు = మంచిభావం; సంధి; కొఱ+కాకున్నను= మంచివారు కాకపోయినా; వ్యర్థులయినా; కులంబుపాడి = కులధర్మం; చెల్లును = చెల్లుబడి అవుతుంది.

భా : *పాండవులందఱూ మహాభక్తిగా నీకు నమస్కరించి తమ అందరిమాటగా నీతో చెప్పమని నాకు చెప్పిన మాటలు విను. ఆయన (మాపెదతండ్రి) ఆజ్ఞానుసారం*

పన్నెండేండ్లు అరణ్యవాసం చేశాం. పదమూడో సంవత్సరం జనసమృద్ధమయిన విరాట నగరంలో అజ్ఞాతవాసం చేశాం. మాపెదతండ్రి చేసిన ఒప్పందం నెరవేర్చి మేము తప్పక అర్ధరాజ్యం పొందగలం అని గట్టి నమ్మకంతో అన్ని కష్టాలూ పడ్డాం. మాకు తల్లీ, తండ్రీ, సమస్తబంధువులూ, సర్వమూ ఆయనయే. మావల్ల ఏమైనాతప్పు జరిగిఉంటే కోప్పడి ఇలాకాదు అలా చెయ్యాలి అని మమ్ములను ఆయన సరిదిద్దవచ్చు. ఆయన జీవించి ఉన్న పదివేలేళ్ళకయినా ఆయనను తప్ప ఇతరం ఎరగం. మేమూ, దుర్యోధనాదులూ ఎలాంటి వారమయినా లోకం మమ్ములను అనుకోదు. ఆయనలో సంధిజరగాలి అనే మంచి భావం ఉంటే ఎవరు చెడ్డవాళ్ళయినా కులధర్మం చెడకుండ చెల్లుబాటవుతుంది. అని అన్నారు" అనిచెప్పి కృష్ణుడు ఇంకా ఇలా అన్నాడు.

ఉ. **"సారపు ధర్మమున్ విమల సత్యముఁ బాపముచేత బొంకుచేఁ**
బారముఁ బొందలేక చెడఁబాఱిన దైన యవస్థ; దక్షు లె
వ్వార లుపేక్ష సేసి రది వారల చేటగుఁ; గాని ధర్మని
స్తారక మయ్యు సత్యశుభదాయక మయ్యును దైవ ముండెడున్." 273

అ : పాపముచేత; సారము+ధర్మమున్ = శ్రేష్ఠమయిన ధర్మమూ; బొంకుచేన్ = అసత్యంచేత; విమలసత్యమున్ = నిర్మలమయిన సత్యమూ; పారమున్ = అవతలిఒడ్డును-తనలక్ష్యాన్ని; పొందలేక = చేరలేక (గట్టెక్కలేక) చెడఁబాఱినది+ఐన = బాగా చెడిపోయినదయిన; అవస్థన్ = స్థితిలో; దక్షులు = సమర్థులయిన; ఎవ్వారలు = ఎవరైతే; ఉపేక్ష+చేసిరి = ఉపేక్షించారో అది =ఆస్థితి; వారలచేటు = వారి వల్ల గలిగిన కీడు (వారికి కలిగిన కీడు); అగున్ = అవుతుంది; కాని; దైవము; ధర్మనిస్తారకము = ధర్మాన్ని ఉద్ధరించేది; అయ్యున్ = అవుతూ; సత్య శుభదాయకము = సత్యానికి శుభాన్ని కలిగించేది; అయ్యును = అవుతూ; ఉండెడిన్ = ఉంటుంది.

భా : *పాపంచేత ఉత్తమ ధర్మమూ, అసత్యంచేత నిర్మలమయిన సత్యమూ గట్టెక్కలేక చెడిపోయిన దుఃస్థితిలో ఉన్నప్పుడు సమర్థులయినవారు దానిని ఉపేక్షిస్తే అది వారితప్పు అవుతుంది. (అదివారికి కీడు కలిగిస్తుంది). కాని దైవం ధర్మాన్ని తప్పక గట్టెక్కిస్తుంది. సత్యానికి శుభంకలిగిస్తూ రక్షిస్తూ ఉంటుంది."*

వి. దీనికిమూలం ఉద్యో. 95 అధ్యా 48
యత్ర ధర్మో హ్యధర్మేణ సత్యం యత్రానృతేన చ
హన్యతే ప్రేక్షమాణానాం హతా స్తత్ర సభాసదః

అధర్మం ధర్మాన్ని అసత్యం సత్యాన్ని గొంతునులిమి చంపుతున్నప్పుడు చూస్తూ ఊరుకునే సభ్యులు సర్వనాశనం అవుతారు.

విద్ధో ధర్మో హ్యధర్మేణ సభాం యత్ర ప్రపద్యతే
నచాస్య శల్యం కృంతంతి విద్ధాస్తత్ర సభాసదః
ధర్మ ఏతా నారుజతి యథా నద్యనుకూలజాన్. 96-50

అధర్మవిద్ధ మయిన ధర్మం ప్రవేశించే సభలోని సభ్యులు అధర్మమనే ముల్లును

విరిచి తీసి పారవేయకపోతే అముల్లు వారికే గుచ్చుకుంటుంది. (ఆ అధర్మదోషం వారికే తగులు తుంది) నది తన ఒడ్డున పుట్టి పెరిగే చెట్లను కూకటివేళ్ళతో పెల్లగించి కూల్చివేసినట్లు అధర్మ విద్ధమయిన ధర్మంకూడా ఆసభలోనివారిని నాశనం చేస్తుంది. అని మూలంలో శ్రీకృష్ణుని హెచ్చరిక.

యే ధర్మ మనుపశ్యంత స్తూష్ణీం ధ్యాయన్త ఆసతే
తే సత్యమాహు ర్ధర్మంచ న్యాయ్యంచ భరతర్షభ. 96-51

భరతశ్రేష్ఠా! నిరంతరం ధర్మంమీదనే దృష్టి ఉంచి దాన్నే ధ్యానిస్తూ తూష్ణీంభావం వహించే పాండవులు తమరాజ్యం తమకిమ్మని అడుగుతున్నారు. అది సత్యం, ధర్మయుక్తమూ న్యాయ సమ్మతమూ అయింది.

వ. అని ఈసభ్యులకుం జెప్పు మనిరి; నీవును సభాసదులైన రాజులు నేమనియెద రనుం; డేను ధర్మంబు నీతియుఁ జుట్టఱికంబును మున్నిడుకొని మనోవాక్ప్రకారంబు లేకరూపం బైన సత్యంబ కాఁ జెప్పితి; నితెఱంగు మీకు మేలు; క్రోధమాన మత్సరంబులు విడిచి యిట్లు సేయుండు. 274

అ : సభాసదులు=సభలో ఉండేధర్మజ్ఞులు; అనియెదరు=అంటారు; మున్నిడుకొని= ముందుంచుకొని; మనోవాక్ ప్రకారంబులు = మనస్సు; మాటల రీతులు; ఏకరూపంబు+ఐన= ఒకటేఅయిన; ఏ+తెఱంగు=ఏవిధం; క్రోధమానమత్సరంబులు = కోపం; అభిమానం; అసూయలు.

భా : *అని ఈసభలో ఉన్నవారికి పాండవులు చెప్పమన్నారు. నీవూ, సభలో ఉన్న ధర్మం బాగా తెలిసిన రాజులూ ఏమి చెపుతారో చెప్పండి. నేను ధర్మాన్నీ, రాజనీతినీ, మీ(నా)చుట్టరికాన్నీ దృష్టిలో పెట్టుకొని మనస్సూ మాటలూ ఒక్కటిగా సత్యాన్నే చెప్పాను. వీటిల్లో ఏది మీకు మంచిదని మీ అభిప్రాయం? కోపం, దురభిమానం, అసూయలను వదలి మీరు నేను చెప్పినట్లు చేయండి.*

వి. కృష్ణుడు మొదట ధర్మాన్నీ, తరువాత రాజనీతినీ, చివరకు చుట్టరికాన్నీ దృష్టిలో పెట్టుకున్నాడు. ధర్మంముందు తదితరాలు అన్నీ ద్వితీయ స్థానాన్నే వహిస్తాయి. మనస్సులో అనుకున్న దే మాటలో చెప్పటం సత్యలక్షణం.

ఆ. పాండవులకుఁ దగిన పాలు మేదినిఁ బంచి
యిచ్చుకంటెఁ గార్యమెద్ది గలదు?
ధర్మ మెద్ది? సముచితంబగు విధ మెద్ది?
శక్య మెద్ది? చెపుఁడ వాక్యవిదులు." 275

అ : పాండవులకున్; మేదినిన్ = భూమిలో; తగినపాలు = యోగ్యమయినభాగం; పంచి+ఇచ్చుకంటెన్ = పంచి ఇవ్వటానికంటే; కార్యము = చేయదగినపని; ఎద్ది = ఏది; కలదు= ఉన్నది? ధర్మము= (దీనినిమించిన) ధర్మం; ఎద్ది = ఏది? సముచితంబు+అగు = బాగా యోగ్య మయిన; విధము = రీతి; ఎద్ది = ఏది; శక్యము = చేయవీలైనది; ఎద్ది = ఏది; వాక్యవిదులు= ధర్మవాక్యములను బాగాతెలిసినవారు; చెపుఁడ = చెప్పండి.

భా : *పాండవులకు తగినంత రాజ్యభాగాన్ని పంచి ఇవ్వటానికంటే మించి*

చేయదగిన మంచిపని ఏముంది? దాన్ని మించిన ధర్మంఏముంది? అంతకుమించి సముచితమైనది ఏముంది? చేయగలిగింది ఏముంది? ధర్మవాక్యాలను, రాజనీతి వాక్యాలను బాగాతెలిసిన వారు చెప్పండి."

వి. శ్రీ కృష్ణుడు తాను మనో వాక్ప్రకారాలు ఏకరూపంగా చెప్పేసత్యం ఈ పద్యంలోని ప్రశ్న రూపమయిన సమాధానమే. అంటే దీన్ని ఇలా చెప్పుకోవచ్చు. ధృతరాష్ట్రుడు ముఖ్యంగా చేయదగినపని పాండవులకు రాజ్యం పంచి ఇవ్వటమే. దానిని మించిన ధర్మం ఇంకొకటిలేదు. సముచితమైనదీ ఇంకొకటి లేదు. ధృతరాష్ట్రుడు చేయగలిగిందీ మరొకటిలేదు. ఎన్నివిధాలచూచినా ఇదే ప్రస్తుతకర్తవ్యం.

వాక్యవిదులు :- ధర్మశాస్త్రాన్నీ, రాజనీతినీ తెలిసినవారు. అట్టివారు ఆసభలో ఉన్నారు. వారుమాత్రమే శ్రీకృష్ణుని మాటలకు సరైన సమాధానం చెప్పగలవారు. అంతేకాని వృథాభిమాన దుర్మదులు నిష్పక్షపాతమైన రీతిగా సమాధానం చెప్పలేరు.

క. అని పలికి; "మహారాజా!
విను" మని ధృతరాష్ట్రుతోడ వెండియుఁ దా ని
ట్లని చెప్పె వాసుదేవుఁడు
తనమది నఱలేక కార్యదశ దెలియంగన్. 276

అ : అని; పలికి; వాసుదేవుఁడు = శ్రీకృష్ణుడు; తనమదిన్ = తనమనస్సులో; అఱ= (వంచన) అనుమానం; లేక; కార్యదశ = చేయదగినపనియొక్కస్థితి; తెలియంగన్ = తెలిసేటట్లుగా; వెండియున్ = మళ్ళీ; ధృతరాష్ట్రుతోన్ = ధృతరాష్ట్రమహారాజుతో; మహారాజా; వినుము. అని; తాను = స్వయంగా; ఇట్లు; అని; చెప్పెన్.

భా : *అని పలికి కృష్ణుడు కర్తవ్యం వారికి తెలిసేటట్లుగా, ఎలాంటి సంకోచం లేకుండా మళ్లీ ధృతరాష్ట్రమహారాజుతో "మహారాజా! విను." అని ఇలా చెప్పాడు.*

ఆ. " వారి తండ్రిపాలు వారికి నిచ్చి; నీ
పాలు నీవుఁ బుత్రపౌత్ర చయము
ననుభవించి సుఖులరై యుండుఁ; డిది బంధు
మిత్ర సుజన కోటి మెచ్చు తెఱఁగు. 277

అ : వారికిన్ = ఆపాండవులకు; వారితండ్రిపాలు = వాళ్ళతండ్రిభాగం; ఇచ్చి; నీపాలు= నీరాజ్యభాగం; నీవున్; పుత్ర పౌత్రచయమున్ = నీకుమారుల, మనుమల సమూహం; అనుభవించి; సుఖులరు = సుఖం గలవారు; ఐ+ఉండుఁడు = అయి ఉండండి; ఇది బంధు.... కోటి; బంధు = చుట్టాల; మిత్ర = మిత్రుల; సుజన = మంచి వారి యొక్క; కోటి = సమూహం; మెచ్చు తెఱఁగు = మెచ్చుకొనేపద్ధతి.

భా : *"పాండురాజు రాజ్యభాగం వారికిచ్చి నీపాలు నీవూ నీపుత్ర పౌత్రులూ అనుభవిస్తూ సుఖించండి. ఇది బంధువులూ, మిత్రులూ, సజ్జనులూ మెచ్చుకొనే పద్ధతి.*

వి. పాండవులడిగినా శ్రీకృష్ణుడు చెప్పినా భీష్మాదులు సలహాఇచ్చినా ఈపద్యంలోని

అభిప్రాయమే. బంధువులు అంటే భీష్మబాహ్లికాదులు; మిత్రులు అంటే కౌరవులకు పాండవులకు మేలుకోరేవారు. సుజనులు ఆసభలో ఉన్న పరశురామాదిమహానుభావులు. ఏవ్యక్తిఅయినా పదిమంది అభిప్రాయాలను అనుసరించి ప్రవర్తించటమే శ్రేయోదాయకం.

క. **ఎఱుఁగవె యజాతశత్రుని**
నెఱియును ధర్మంబు సత్యనిష్ఠయు? మిము నె
త్తెఱఁగున ననువర్తించెనొ
యెఱుఁగవె? తగు చేవ గలుగు టెఱుఁగవె యధిపా! 278

అ : అధిపా = రాజా; అజాతశత్రుని = ధర్మరాజుయొక్క; నెఱియును = ఆచారమూ (న్యాయమూ); ధర్మంబున్; సత్యనిష్ఠయున్ = సత్యాన్నిపాటించటంలో పట్టుదలా; ఎఱుఁగవె= ఎరుగవా?; మిమున్ = మిమ్ములను; ఏ+తెఱఁగునన్ = ఏవిధంగా; అనువర్తించెనొ = అనుసరించి ప్రవర్తించాడో; ఎఱుఁగవె =ఎరుగవా?; తగుచేవ =యుద్ధంచేయటానికి తగిన సామర్థ్యం; కలుగుట= కలిగిఉండటం; ఎఱుఁగవె= ఎరగవా?

భా : *ధృతరాష్ట్రమహారాజా! ధర్మరాజు న్యాయప్రవర్తనా, ధర్మమూ, సత్యనిష్ఠ నీకు తెలియవా? పూర్వం మిమ్ములను ఎలా అనుసరించి నడుచుకున్నాడో నీకు తెలియదా? అవసరమయితే యుద్ధానికి తగిన సామర్థ్యం ఆయనకు ఉన్నదని నీకు తెలియదా?*

వ. **అదియెల్ల నీవెఱుంగు దైనను దెలియఁ జెప్పెద విను; మింద్ర ప్రస్థపురంబున నుండి పాండవాగ్రజుండు నీకుం బెంపునుం బేరునుం జేయంగోరి.** 279

అ : అది+ఎల్లన్ = అది అంతా; పాండవ+అగ్రజుండు = ధర్మరాజు ; పెంపునున్ = అభివృద్ధినీ; పేరునున్ = కీర్తినీ.

భా : *ఆ విషయాలన్నీ నీకు తెలుసు. అయినా ఈసభలోని వారందరికీ గూడా తెలిసేటట్లు వివరించి చెపుతాను; విను. ధర్మరాజు ఇంద్రప్రస్థపురంలో ఉండి నీసంపదను అభివృద్ధి చేయదలచి నీకు కీర్తి కలిగించదలచి.*

వి. ధృతరాష్ట్రుడు అర్ధరాజ్యం ఇచ్చి ధర్మరాజును ఖాండవప్రస్థానికి పంపించాడు. అరణ్యప్రాయంగా ఉన్న ఆప్రదేశాన్ని ధర్మరాజు ఇంద్రప్రస్థం అనే పేరుతో అభివృద్ధి పరిచాడు. అలా దూరంలో ఉన్నా ధర్మరాజు ధృతరాష్ట్రుని కీర్తి ప్రతిష్ఠలు పెంచటానికే యత్నించాడు.

చ. **మద మడఁగించి, భూపతి సమాజము నెల్లను నిన్నుఁ గొల్వఁ జే**
యుదు నని పూని, దిగ్విజయ మున్నతిఁ జేసి, మహావిభూతితో
మదిమది నుండ, నీసుతుఁడు మంత్రులు సౌబలు జూదమార్చి సం
పద గొని యంతఁ బోవక సభన్ ద్రుపదాత్మజ భంగపెట్టరే? 280

అ : మదము; అడఁగించి = అణిచి; భూపతిసమాజమును = రాజులసమూహాన్ని; ఎల్లను = అంతటినీ; నిన్నున్ = నిన్ను (ధృతరాష్ట్రుని); కొల్వన్ = సేవించేటట్లు; చేయుదును = చేస్తాను; అని; పూని = ప్రతిజ్ఞచేసి (పట్టుబట్టి); దిగ్విజయమున్ = దిక్కులు జయించటాన్ని; ఉన్నతిన్=గొప్పగా; చేసి; మహావిభూతితోన్ = గొప్పసంపదతో; మదిమదిన్= నెమ్మదిగా- నిశ్చింతగా;

ఉండన్ = ఉండగా; నీసుతుఁడు = నీకుమారుడు (దుర్యోధనుడు); మంత్రులు; సౌబలున్ =శకునిని; జూదము; ఆర్చి= ఆడించి; సంపద = ఐశ్వర్యం; కొని = తీసుకుని; అంతన్ =అంతటితో; పోవక=ఆగక; సభన్ = సభలో; ద్రుపద+ఆత్మజన్ = ద్రౌపదిని; భంగపెట్టరే = అవమానపరచలేదా?

భా : *మదం అణిచి సమస్తరాజసమూహమూ నిన్ను సేవించేటట్లు చేస్తానని ధర్మరాజు ప్రతిజ్ఞచేసి దిగ్విజయం చేసి మహత్తరమయిన సంపదతో ప్రశాంతంగా బ్రతుకుతుంటే నీకొడుకు దుర్యోధనుడూ, ఆతని సలహాదారులూ శకుని చేత జూదం ఆడించి ఆయన సంపద సమస్తం అపహరించారు. అంతటితో ఆగక మహాసభామధ్యంలో ద్రౌపదీదేవిని అవమానపరిచారు గదా?*

వి. రాజసూయయాగం చేయటానికి ముందు ధర్మరాజు కృష్ణభీమార్జునులతో జరాసంధుని హతమార్చటం, భీమార్జున నకుల సహదేవులు నాలుగు దిక్కులను జయించి మహత్తర సంపదలతో తిరిగి రావటం ఈ పద్యంలోని "మదమడగించి" అనే పాదద్వయం సూచిస్తున్నది.

ద్రుపదాత్మజను భంగపెట్టటం ద్యూత సభలో ఆమె కేశాంబరాకర్షణాదులగు దుష్టచేష్టలు.

ఉ. దానికి నీ వొడంబడితి; ధర్మజుఁ డంతయుఁ జూచి, సత్యముం
బూని వృకోదరార్జునులు భుగ్నులుగాఁ, బెడచేతఁ గన్ను నీ
రూనఁగ నొత్తుకొంచుఁ జని, యుగ్ర వనంబున దుఃఖమగ్నుఁడై
దీనత నుండి పూన్కి దగఁ దీర్చియుఁ గూడి మనంగఁ గోరెడిన్. 281

అ : దానికిన్ = ఆపనికి (దుర్యోధనాదులు చేసిన దానికి); నీవు; ఒడంబడితి = అంగీకరించావు; ధర్మజుఁడు; అంతయున్ =అంతా; చూచి; సత్యమున్; పూని=వహించి; వృకోదర+ అర్జునులు = భీమార్జునులు; భుగ్నులుగాన్ = వంగినవారు-భగ్నమయినవారు- చిన్నబోయినవారు కాగా; కన్నునీరు = కన్నీరు; ఊనఁగన్ = కారగా; పెడచేతన్ = వెనుకకుతిప్పిన చేతితో; ఒత్తుకొంచున్=తుడుచుకొంటూ; చని= వెళ్ళి; ఉగ్రవనంబునన్=భయంకరారణ్యంలో; దుఃఖమగ్నుఁడై= దుఃఖంలో మునిగిన వాడై; దీనతన్ = దైన్యంతో; ఉండి; పూన్కి = ప్రతిజ్ఞను; తగన్ = తగిన విధంగా; తీర్చియున్ = తీర్చికూడా; కూడిమనంగన్ = కలిసిబ్రతకటాన్నే; కోరెడిన్= కోరుతున్నాడు.

భా : *రాజా! జూదం మొదలయిన వీరి దుష్కృత్యాలన్నీ నీవు అంగీకరించావు. ధర్మరాజు ఇదంతా చూచి సత్యాన్ని అవలంబించాడు. భీమార్జునులు అవమానభారంతో కుంగి పోగా, ఆయన కన్నీటిని పెడచేత్తో తుడుచుకుంటూ బయలు దేరి భయంకరారణ్యం లో అనేక దుఃఖాలు అనుభవిస్తూ అరణ్యావాసం చేశాడు. అన్నమాట ప్రకారం ప్రతిజ్ఞ తీర్చుకున్నాడు. ఇంత చేసినా ఆ ధర్మరాజు మీఅందరితో కలిసిమెలిసి ఉండాలనే కోరుతున్నాడు.*

వి. "దానికి నీవొడంబడితి" ధృతరాష్ట్రునికి కన్న పుత్రులు దుర్యోధనాదులు కాగా ధర్మజాదులు పెంచిన పుత్రులు. తండ్రిలేని వారికి భీష్మవిదురాదుల సలహా ననుసరించి ఇష్టం

లేకపోయినా ధృతరాష్ట్రుడు అర్ధరాజ్యం ఇచ్చాడు. అలాంటివాడు దుర్యోధనాదుల దుష్కృత్యాలను ఖండించలేదు. అనటంవల్ల ధృతరాష్ట్రుని దుర్బుద్ధి వ్యక్తమవుతుంది. పెద్దవాడు అయనే ఏమీమాట్లాడకపోతే ధర్మరాజు ఏంచేస్తాడు? సమర్థుడయినా ధర్మరాజు సత్యవాక్పరిపాలన కోసం అడవికివెళ్ళాడు. ఆసన్నివేశాన్ని కృష్ణుడు కరుణాజనకంగా చెపుతున్నాడు.

కూడి మనంగఁగోరెడిన్. దుర్యోధనాదులతో కలిసి ఉండాలని ధర్మరాజు అనుకోవటం ఆయన ఔన్నత్యాన్ని, బంధుప్రీతిని, ధర్మతత్పరత్వాన్ని సూచిస్తుంది.

క. **తనుఁ దాన పోలుఁగా; కే**
మనవచ్చు నజాతశత్రు నతిశాంతతయున్
వినయము సత్యము మున్నే
జనపతులకుఁ గలవు? సెపుము సౌజన్యనిధీ! 282

అ : (ఆధర్మరాజు) తనున్ = తనను; తాన = తానే; పోలుగాక = సమాను డవుతాడు; ఏమి+అనవచ్చున్ = ((ఆయననుగూర్చి) ఏమని;- ఎంతని చెప్ప వీలవుతుంది; అజాతశత్రు = (శత్రువులు పుట్టనివాడు) ధర్మరాజు యొక్క; అతిశాంతతయున్ = గొప్పశాంతగుణమూ; వినయము; సత్యము; మున్ను = పూర్వం; ఏజనపతులకున్ = ఏరాజులకు; కలవు= ఉన్నవి? సౌజన్యనిధీ = మంచితనానికి స్థానమయినవాడా; (ధృతరాష్ట్రమహారాజా); చెపుమ = చెప్పు

భా : *సజ్జన శ్రేష్ఠా! ఆధర్మరాజు తనకు తానే సాటి! అజాతశత్రు వయిన ఆయనను గూర్చి ఏమని ఎంతని చెప్ప వీలవుతుంది? శాంతస్వభావం, వినయం, సత్యాసక్తి ఆయన కున్నట్లుగా మీ వెనుకటితరాల రాజులలో నయినా ఉన్నాయా? ఉంటే చెప్పు.*

వి. సౌజన్యనిధీ!- ఇది వ్యంగ్యపూర్వకమయిన సంబోధన. దుర్యోధనుని దుష్కృత్యాలు కాదు అని అననివాడు పాండవుల దీనదశకు చలించని మనస్సు గలవాడు ధృతరాష్ట్రుడు. అందువల్ల "నీమంచితనం మండినట్లే ఉంది." అనే వెక్కిరింపును ఇది సూచిస్తుంది.

సామర్థ్యం ఉన్నా శాంతంగా ఉండటం ధర్మరాజు విశిష్టత. దీన్నే కృష్ణుడు హద్దులను మించిన శాంతం అంటున్నాడు. ఇంతశాంతం, వినయం, సత్యనిష్ఠ ఒక్క ధర్మరాజులోనే కనిపిస్తాయి. అంతేకాదు. ఆయన పడిన కష్టాలు అనుభవించిన అవమానాలు చరిత్రలోనే ఎవరూ అనుభవించ లేదు అని అనవచ్చు.

క. **ఏ నిం తాడితి నీసం**
తానం బిరుదెఱఁగునకు హితము గోరి, భవ
త్సూనుని మతి యతిలోభము
మానిచి, పాండవులఁ దెమ్ము మనుజాధీశా! 283

అ : ఏను = నేను; నీసంతానంబు = నీకుమారులలో; ఇరుతెఱఁగునకున్ = రెండు పక్షాలకూ; హితము = మేలు; కోరిఇంత = ఇదంతా; ఆడితి = చెప్పాను. మనుజ+అధీశా= రాజా!; భవత్+సూనుని = నీకుమారుని యొక్క; మతి = బుద్ధిలో ఉన్న; అతిలోభము = దురాశను- అత్యాశను; మానిచి = పోగొట్టి; పాండవులన్; తెమ్ము = తెచ్చుకో.

భా : *రాజా! నీకుమారులయిన కురుపాండవుల రెండు పక్షాల మేలు కోరి నేను ఇదంతా చెప్పాను. కాబట్టి నీకుమారుడయిన దుర్యోధనుని మనస్సులో ఉన్న దురాశను పోగొట్టి పాండవులను దగ్గరకు తీసుకో*

ఉ. వారలు శాంతశూరులు; భవచ్చరణంబులు గొల్వఁ బూని యు
న్నా; రటు గాక మీ కది మనంబున కప్రియమేని యింతకుం
బోరికి వచ్చు చుండుదురు భూవర! రెండు దెఱంగులందు నీ
కారయఁ బథ్య మేదియగు నవ్విధ మేర్పడ నిశ్చయింపుమా!" 284

అ : వారలు = ఆపాండవులు; శాంతశూరులు = శాంతి, శౌర్యం కలవారు; భవత్+ చరణంబులు = నీపాదాలను; కొల్వన్+పూని+ఉన్నారు = సేవించటానికి సిద్ధంగా ఉన్నారు; అటు+కాక= అలాకాక; అది= వారిఅభిప్రాయం- ఆ ఒద్దిక; మీకు మనంబునకు = మీమనస్సుకు; అప్రియము+ఏని = ఇష్టంకాకపోతే; భూవర! = రాజా; ఇంతకున్ = ఈపాటికీ; పోరికి = యుద్ధానికి; వచ్చుచుండుదురు = వస్తూఉంటారు; రెండు+తెఱంగులందున్ = పైరెండు విధాలలో(పక్షాలలో); ఆరయన్ = పరిశీలించగా; నీకు; పథ్యము = మేలయినది; ఏది; అగున్= అవుతుందో; ఆవిధము= ఆరీతిని; ఏర్పడన్ = స్పష్టంగా; నిశ్చయింపుమా = నిర్ణయించు.

భా : *ఆ పాండవులు శాంతమూ, శౌర్యమూ కలవారు. వారు నీపాదసేవ చేయాలనే పూనికతో ఉన్నారు. అలాకాక మీ మనస్సులకు అది నచ్చకపోతే ఇప్పటికేవారు యుద్ధానికి వస్తూఉంటారు. రాజా! ఈరెండు పద్ధతులలో నీకు చాలా మంచిది ఏది అవుతుందో బాగా ఆలోచించి దాన్ని నిశ్చయించు."*

వి. శాంతశూరులు అనే దానితో తిక్కన పాండవుల స్వభావాన్ని సమగ్ర సంగ్రహ సుందరంగా చెప్పాడు.

స్థితాః శుశ్రూషితుం పార్థాః స్థితా యోద్ధు మరిందమాః
యత్తే పథ్యతమం రాజం స్తస్మిం స్తిష్ఠ పరంతప! 96-62

రాజా! శత్రువులను అణచగల పాండవులు మిమ్ములను సేవించటానికీ, యుద్ధం చేయటానికీ కూడా సిద్ధంగా ఉన్నారు. ఈరెండింటిలో మీకు ఏది సముచితం అనిపిస్తే దాన్ని అనుసరించండి." అని కృష్ణుడు తను చెప్పదలచింది ముగించాడు.

చ. అనవుడు; రోమహర్షణము లంగములం బొడమన్ సదస్యు లె
ల్లను బ్రియమంది, నెమ్మనములం "బురుషోత్తముఁ డింత యొప్పఁ బ
ల్కనె? మఱుమాటలాడ నయకోవిదుఁ డెవ్వఁడు? ధీరుఁ డెవ్వఁ డిం
దనువరి యెవ్వఁ" డంచు, నచలాకృతులై నెఱి నూరకుండఁగన్. 285

అ : అనవుడు = అనగా;అంగములన్ = శరీరాలయందు; రోమహర్షణములు = గగుర్పాటులు; పొడమన్ = కలుగగా; సదస్యులు = సభ్యులు; ఎల్లను = అందరూ; ప్రియమంది= సంతోషించి; పురుష+ఉత్తముఁడు = శ్రీకృష్ణుడు; ఇంత; ఒప్పన్+పల్కనె = సముచితంగా- చక్కగా మాట్లాడుతాడా?; ఇందు=సభలో మఱుమాటలాడన్=మరోమాట మాట్లాడటానికి;

నయకోవిదుఁడు = రాజనీతిలోపండితుడు; ఎవ్వరు=ఎవరు; ధీరుఁడు= ధైర్యవంతుడు; ఎవ్వఁడు!; అనువరి = నేర్పరి; ఎవ్వఁడు; అంచున్ = అంటూ; అచల+ఆకృతులై = కదలికలేని ఆకారాలు కలవారై; నెఱిన్ = పూర్తిగా; ఊరకుండఁగన్

భా : *కృష్ణు డన్నది విని సభ్యులు అందరూ శరీరాలు గగుర్పాటుతో నిండిపోగా తమ మనస్సులో "కృష్ణుడు ఎంత చక్కగా సముచితంగా మాట్లాడాడు! ఈయన మాటలకు సమాధానంగా ఈసభలో మాట లాడటానికి తగినంత రాజనీతి తెలిసినవాడెవడు? ధీరుడెవడు? మంచి మాటనేర్పు కలవాడెవరు?" అని కదలిక లేక పూర్తిగా నిశ్శబ్దంగా ఉండి పోయారు.*

వి : శ్రీకృష్ణుని ఆకారమూ, దానికితగినప్రజ్ఞా; దానికితగిన రాజనీతి పాండిత్యమూ దానికి తగిన మాటనేర్పూ, దానికితగిన గంభీర కంఠస్వరమూ ఆసభలోని వారి మనస్సులను చూరగొన్నాయి. అందువల్ల కలిగిన ఆనందంతో, ఆశ్చర్యంతో వారు పరవశించారు.

శ్రీ కృష్ణుని మాటలు కాదు అని ఖండించాలి అని అనుకునేవానికి రాజనీతి బాగా తెలిసిఉండాలి. ధైర్యం ఉండాలి. వాక్చాతుర్యం ఉండాలి. అంటే ఈమూడింటి త్రిపుటి శ్రీకృష్ణుని వాగ్జాలం.

వ. జామదగ్న్యమహాముని సుయోధనునితో నిట్లనియె. 286

అ : జామదగ్న్యమహాముని = జమదగ్నికుమారుడు-పరశురాముడు.

భా : *పరశురాముడు దుర్యోధనునితో ఇలా అన్నాడు.*

వి. శ్రీకృష్ణుడు 26 గద్యపద్యాలలో తనుచెప్పదలచినది చెప్పవలసినది వివరించాడు. ఇందులో మూడు పాండవులు ధృతరాష్ట్రునితో చెప్పమన్నవి. తక్కినవి కృష్ణుని సొంతం. ఆయన మాటలు సమగ్రసుందరాలు. ఆయనపై విషయాలు అన్నీ ధృతరాష్ట్రుని సంబోధించి చెప్పాడు. కాని పరశురాముడు దుర్యోధనుని ఉద్దేశించి చెపుతున్నాడు. శ్రీకృష్ణుడు చెప్పినదానికి ధృతరాష్ట్రుడు కాని తదితరులుగాని సమాధానం చెప్పకముందే జామదగ్న్యముని దుర్యోధనునితో చెపుతున్నాడు.

96వ అధ్యాయంలో 52 శ్లోకాలలో ఉన్న విషయాన్ని తిక్కన సంగ్రహించి తరువాత వచ్చే ఒక్క సీస పద్యంలో చెప్పాడు.

సీ. "వినుము దంభోద్భవుం డనురాజు దనకెదు
రెవ్వరు లేరంచుఁ గ్రొవ్వి, నరుఁడు
నారాయణుం డను వారలు గంధమా
దన మను నగమునఁ దపము సేయ
వారిపైఁ జని, యావహమునకుఁ బిలిచిన;
నమ్మునీంద్రులు వలదని యనేక
విధములఁ జెప్పంగ వెండియుఁ బోకున్నఁ ;
గుశముష్టి నుజ్జ్వల విశిఖ వృష్టి

ఆ. గురిసి, నరుఁడు సేనఁ గూల్చి యాతని భంగ
పెట్టి పట్టి విడిచె; నట్టి యమ్మ
హాత్ము లిపుడు పార్థుఁ డనఁ గృష్ణుఁ డనఁగ, లీ
లార్థ కలిత జన్ము లైరి సూవె. 287

అ : వినుము; దంభోద్భవుండు; అనురాజు; తనకు; ఎదురు = సమానులు; ఎవ్వరు= ఎవరూ; లేరు; అంచున్ = అని; క్రొవ్వి = మదించి; నరుఁడు; నారాయణుండు; అనువారలు = అనేవారు; గంధమాదనము; అనునగమునన్ = అనేపర్వతం మీద; తపము; చేయన్; వారిపైన్ = వారిమీదికి; చని= వెళ్ళి; ఆహవమునకున్ =యుద్ధానికి; పిలిచినన్=పిలవగా; ఆ+ మునీంద్రులు= ఆమునిశ్రేష్ఠులు; వలదు = వద్దు; అని; అనేకవిధములన్; చెప్పంగన్ = చెప్పగా; వెండియున్ = అప్పుడూ; పోకున్నన్ = వెనుకకు తిరిగి పోకపోతే; కుశముష్టిన్ = దర్భపిడికిలితో; ఉజ్జ్వల విశిఖ వృష్టిన్ = ప్రకాశవంతమయిన బాణవర్షాన్ని; కురిసి = కురిపించి; నరుఁడు; సేనన్; కూల్చి= చంపి; ఆతనిన్=ఆదంభోద్భవుని; భంగపెట్టి = పరాభవించి; పట్టివిడిచెన్ = బంధించి విడిచిపెట్టాడు; అట్టి = అటువంటి; మహాత్ములు = మహానుభావులు; ఇపుడు = ఇప్పుడు; పార్థుఁడు+అనన్ = అర్జునుడనగా; కృష్ణుఁడు+అనఁగన్; లీలార్థకలితజన్ములు= లీలకోసం గ్రహింపబడినజన్మ గలవారు; ఐరి+చూవె = అయినారు సుమా.

భా : *"దుర్యోధనా! శ్రద్ధగావిను; పూర్వకాలంలో దంభోద్భవుడు అనే రాజు తనను ఎదిరించగలవారు ఎవ్వరూ లేరు అని మదమత్తు డయినాడు. ఆసమయంలో నరుడు, నారాయణుడు అనే మహర్షులు గంధమాదనం అనే పర్వతం మీద తపస్సు చేస్తున్నారు. ఈరాజు వారిమీదికి దండెత్తిపోయి వారిని యుద్ధానికి పిలిచాడు. ఆమునిశ్రేష్ఠులు అది తగదని అనేక విధాల చెప్పారు. కాని అతడు వెనుదిరిగి పోలేదు. అప్పుడు నరుడు దర్భపిడికిలితో తేజోవంతమయిన బాణవర్షం కురిపించి ఆతని సైన్యాన్ని నేల గూల్చాడు. ఆరాజును పరాభవించి పట్టి విడిచాడు. ఆమహాత్ములయిన నరనారాయణులే ఇప్పుడు అర్జునుడు, కృష్ణుడు అనే పేరులతో లీలార్థం జన్మించారు సుమా!*

వ. కావున నీ వాదంభోద్భవు చందంబున నుద్ధతి పాటించుటయు, నరనారాయణులతోడఁ దొడరుటయు మీఁద మేలయి యుండదు; పాండవుల తోడి పొందు మే" లనిన యనంతరంబ కణ్వుండు దుర్యోధనున కిట్లనియె. 288

అ : చందంబునన్ = విధంగా; ఉద్ధతి = గర్వం (అభిమానం); పాటించుటయున్= పొందటమూ; తొడరుటయున్ = ఎదిరించటమూ; మీఁద = ముందు(భవిష్యత్కాలములో); పొందు = మైత్రి (సంధి); అనంతరంబ = వెంటనే.

భా : *కాబట్టి నీవు ఆదంభోద్భవునివలె గర్వించటమూ, నరనారాయణులతో వైరం పెట్టుకోవటమూ భవిష్యత్తులో మంచిదికాదు. పాండవులతో కలిసి ఉండటమే నీకు మంచిది." అని అన్నాడు. తరువాత కణ్వమహర్షి దుర్యోధనునితో ఇలా అన్నాడు.*

-: కణ్వుండు దుర్యోధనునితో గరుత్మంతుని వృత్తాంతంబు సెప్పుట:-
సం. 5-95-1

క. "అది వోలుఁ; దన్ను నెదిరిని
మది నెఱుఁగక నిగ్రహించి మద మెత్తుట యొ
ప్పు; దహంకారం బొనరిం
పదె పౌరుషహానిఁ దొల్లి పక్షీంద్రునకున్? 289

అ : అది = ఆ జామదగ్న్యమహాముని చెప్పింది; పోలున్ =తగినది; తన్నున్; ఎదిరిని= ప్రతిపక్షుని; మదిన్=మనస్సులో; ఎఱుఁగన్=తెలుసుకోలేక; నిగ్రహించి=తిరస్కరించి; మదమెత్తుట= మదించటం (అహంకరించటం); ఒప్పదు =తగదు; తొల్లి=పూర్వం; పక్షీంద్రునకున్= పక్షిరాజయిన గరుత్మంతునికి; అహంకారంబు; పౌరుషహానిన్ = పరాక్రమ (పౌరుష) నాశనాన్ని; ఒనరింపదె = చేయదా?

భా : *జామదగ్న్య మహాముని చెప్పింది మిక్కిలి సముచితమయినది. తనసామర్థ్యం, శత్రువు శక్తి సరిగా తెలుసుకోలేక వైరం పెట్టుకొని తిరస్కరించి మదించటం ఏమాత్రమూ తగదు. పూర్వం గరుత్మంతునికి ఈఅహంకారమే పౌరుషనాశనం కలిగించింది.*

వ. **అది యెట్లనిన.** 290

భా. *అది ఎలా గంటే......*

వి: తిక్కన 14 గద్యపద్యాలలో చెప్పిన గరుత్మంతుని వృత్తాంతం మూలంలో మాతలి ఉపాఖ్యానం అనే పేరుతో 9 అధ్యాయాలలో 211 అనుష్టుప్పులలో విస్తారంగా ఉంది.

సీ. **అమరేంద్ర రథసూతుఁ డైన మాతలి దన**
సుత గుణకేశికిఁ బతిఁ దగంగ
నారసి, యార్యకుం డను భుజంగాధిపు
మనుమనిఁ జికురుని తనయు సుముఖు
నర్థిమైఁ గోరిన, నార్యకుం డుమ్మలి
కంబుతో నిట్లను; "గరుడుఁ డితని
తండ్రి వధించి, యెంతయు నల్కమై వీని
నింకిట నెల సమయించువాఁడు

ఆ. **గాఁగఁబూని పోయెఁ; గావున నే మియ్య**
కొనఁగ నేర మనిన, విని బలారి
నడిగి పడసి యిత్తు నాయువు రండని,
వారిఁ గొనుచు నరిగె సారథియును. 291

అ : అమర+ఇంద్ర = దేవాధిపుడయిన ఇంద్రుని యొక్క; రథసూతుఁడైన = రథాన్ని

తోలేవా డయిన మాతలి; తనసుత = తనకుమార్తె అయిన; గుణకేశికిన్; పతిన్ = భర్తను; తగంగన్=తగినట్లుగా; అరసి = వెదికి; ఆర్యకుండు; అను; భుజంగ+అధిపు = సర్పరాజు యొక్క; మనుమనిన్; చికురుని తనయున్ = చికురుడు అనేవాని కుమారుని; సుముఖున్; అర్థిమైన్ = ఆసక్తితో; కోరినన్; ఆర్యకుండు; ఉమ్మలికంబుతోన్ =బాధతో ఇట్లు; అనున్=అన్నాడు; గరుడుఁడు; ఇతని తండ్రిన్; వధించి = చంపి; ఎంతయున్ = మిక్కిలి; అల్కమైన్ = కోపంతో; వీనిన్ = ఈసుముఖుని; ఇంక = ఇకమీద; ఇటన్ = ఇక్కడ; నెల = నెలరోజులకు; సమయించువాఁడు= చంపేవాడు; కాఁగన్ = అయ్యేటట్లు; పూని = పూనుకొని (నిశ్చయించి); పోయెన్ = వెళ్ళాడు; కావునన్ = కాబట్టి; ఏము = మేము; ఇయ్యకొనఁగ నేరము = అంగీకరించలేము; అనినన్ = అనగా; విని; బల+అరిన్ = బలుడు అనే రాక్షసుడు శత్రువు గాగలవానిని (ఇంద్రుని); ఆయువు అడిగి; పడసి = పొంది; ఇత్తు =ఇస్తాను; రండు =రండి; అని సారథియును=మాతలిగూడా; వారిన్ =అర్యకాదులను; కొనుచు+అరిగెన్=వెంటతీసుకొని వెళ్ళాడు.

భా : *ఇంద్రుని రథసారథి అయిన మాతలి తనకుమార్తె అయిన గుణకేశి అనే ఆమెకు తగిన భర్త కోసం వెతికాడు. ఆర్యకుడు అనే సర్పరాజుకు మనుమడూ, చికురుని కుమారుడూ అయిన సుముఖుడు అనే వానిని ఆతడు కోరాడు. అప్పుడు ఆర్యకుడు బాధతో ఇలా అన్నాడు. గరుత్మంతుడు ఇతని తండ్రిని చంపాడు. మిక్కిలి కోపంతో ఒకనెలలో ఇతనిని గూడా చంపుతాను అని ప్రతిజ్ఞచేసి వెళ్ళాడు. కాబట్టి ఈవివాహానికి మేము అంగీకరించం అన్నాడు. అది విని మాతలి ఇంద్రుని అడిగి సంపాదించి ఈతనికి ఆయువును ఇస్తాను నాతో రండి. అని వారిని వెంటతీసుకొని వెళ్ళాడు.*

వ. వారల భాగ్యంబున నప్పు డింద్రుండును నుపేంద్రుండును నొక్కచో నుండం గని మాతలి యక్కార్యంబు విన్నవించినం గరుణించి, జిష్ణుండు విష్ణునకుం జెప్పి చేయించువాఁడై వైనతేయు దెసకుం దాన చాలి సుముఖుం జిరాయురుపేతుం జేసిన. 292

అ : భాగ్యంబునన్ = అదృష్టంవల్ల; ఉపేంద్రుండును=విష్ణువూ; ఒక్కచోన్= ఒకేచోట; ఆ+కార్యంబు = ఆపని; జిష్ణుండు = ఇంద్రుడు; వైనతేయుదెసకున్ = గరుత్మంతుని విషయంలో; తాన = తానే; చాలి = సమర్థుడై; చిరాయున్+ ఉపేతున్ = దీర్ఘాయుష్యంతో కూడినవానినిగా;

భా : *వారి అదృష్ట విశేషంవల్ల అప్పుడు ఇంద్రుడూ, విష్ణువూ ఒకేచోట ఉన్నారు. వారిని చూచి మాతలి తనపని మనవిచేశాడు. అదివిని దయతలచి ఇంద్రుడు విష్ణువుకు చెప్పి చేయిద్దామనుకున్నాడు. గరుత్మంతుని విషయంలో తాను సర్వసమర్థుడు కాబట్టి సుముఖుని దీర్ఘాయుష్మంతునిగా చేశాడు.*

క. మాతలి పాణిగ్రహణం
బాతనిఁ జేయించి యున్న, నంతయు విని తా
నేతెంచి గరుడుఁ డతికో
పాతురుఁడై రేఁగి పెలుచ నమరాధిపుతోన్. 293

అ : మాతలి; ఆతనిన్ = ఆసుముఖునితో; పాణిగ్రహణంబు = వివాహం; చేయించి; ఉన్నన్ = ఉండగా; గరుడుఁడు; అంతయున్; విని; తాను = స్వయంగా; ఏతెంచి = వచ్చి; అతికోప+ఆతురుఁడై = మిక్కిలి కోపంతో వేగిరపడేవాడై; రేఁగి = ఉద్రేకించి; అమర+అధిపుతోన్= ఇంద్రునితో; పెలుచన్ = కర్కశంగా (గట్టిగా).

భా : *సుముఖునితో తనకుమార్తె గుణకేశికి వివాహం చేయించాడు మాతలి. ఈ వృత్తాంతం అంతా విని గరుత్మంతుడు కోపావేశంతో ఉద్దేకించి ఇంద్రునితో కర్కశంగా.*

వ. **వాసుదేవు సన్నిధి నిట్లనియె.** **294**

భా. *విష్ణుదేవుని ఎదుట ఇలా అన్నాడు.*

క. **“విను నీవదితి సుతుండవు**
వినతకొడుక నేను; విఱ్ఱవీఁగెడు మనకున్
జనకుఁడు కశ్యపుఁ డొక్కఁడ;
దనుజుల శోధించి చంపుదమ యిరువురమున్. **295**

అ : విను; నీవు; అదితిసుతుండవు = అదితికుమారుడవు; ఏను; వినతకొడుకన్ = వినతకుమారుడను; విఱ్ఱవీఁగెడు = గర్వించి ఉన్న; మనకున్; కశ్యఁపుడు; ఒక్కఁడ; జనకుఁడు= తండ్రి; ఇరువురమున్ = ఇద్దరమూ; దనుజులన్ = రాక్షసులను; శోధించి = వెతికి; చంపుదమ= చంపుదాం.

భా : *“నామాట విను; నీవు అదితి కుమారుడవు; నేను వినత పుత్రుడను. మిక్కిలి గర్వించే మనకు కశ్యపుడు ఒక్కడే తండ్రి. కాబట్టి మన మిద్దరం రాక్షసులను వెతికి వెతికి చంపుతాంకదా!*

క. **ఏమిట నీకేఁ దక్కువ;**
నామేరకు నడ్డపడితి? నావుడు నింద్రుం
“డీ మహనీయమహిమకును
ధామము విష్ణుండు గాక తక్కొరుఁ డగునే?” **296**

అ : ఏన్ = నేను; ఏమిటన్ = ఏవిషయంలో; నీకు; తక్కువ; నామేరకున్ = నాఏర్పాటుకు; అడ్డపడితి = అడ్డుపడ్డావు; నావుడు = అనగా; ఇంద్రుడు; ఈమహనీయ మహిమకును=ఈగొప్పదయిన మహిమకుగూడా; ధామము = స్థానము; విష్ణుండు; కాకతక్క= కాకుండా; ఒరుఁడు = ఇతరుడు; అగునే = అవుతాడా?

భా : *ఏవిషయంలో నేను నీకంటె తక్కువ అని నీవు నేను ఏర్పాటు చేసుకున్నపనికి అడ్డుపడ్డావు?” అని అనగా; ఇంద్రుడు “ఈమహత్తరమయిన మహిమకు గూడా విష్ణువుగాక మరొకడు స్థానం అవుతాడా?”*

వ. **అనిన (విని) గటకటంబడి గరుత్మంతుం డిట్లనియె.** **297**

అ : కటకటంబడి = కోపించి

భా : *ఆమాటలువిని గరుత్మంతుడు కోపంతో ఇలా అన్నాడు.*

ఉ. **"తమ్ముఁడ! నీవు నాకొలఁది తథ్య మెఱుంగక; నాకు నీచభా**
వమ్మగు భంగిఁ జేసితివి; వాసవ! యియ్యదితిప్రసూత వం
శ మ్మఖిలమ్ము దాల్తు నొక సన్నపు టీఁకన యిట్టి నన్ను నీ
విమ్మెయిఁ దూలపుత్తె" యని యీక్షణరోచులఁ గెంపెలర్పఁగన్. 298

అ : తమ్ముఁడ; నీవు; నాకొలఁదితథ్యము = నాసామర్థ్యం యథార్థంగా; ఎఱుంగక= తెలియక; నాకు; నీచభావమ్ము = హీనస్థితి; అగుభంగిన్ = అయ్యే టట్లుగా; చేసితివి; వాసవ = ఇంద్రా; ఈ+అదితిప్రసూతవంశమ్ము = ఈ అదితిగన్న సంతానం(వంశం); అఖిలమ్ము = సమస్తమూ; ఒకసన్నము+ఈఁకన = ఒకచిన్న ఈకతోనే; తాల్తున్ = ధరిస్తాను; ఇట్టి = ఇటువంటి; నన్ను; ఈ+మెయిన్ = ఈవిధంగా; తూలపుత్తె = అవమానిస్తావా; అని; ఈక్షణరోచులన్ = కన్నులకాంతులలో; కెంపు = ఎర్రదనం; ఎలర్పఁగన్ = అతిశయించగా.

భా : *"తమ్ముడా! నీవు నాసామర్థ్యాన్ని వాస్తవంగా తెలియక నాకు తక్కువతనం కలిగేటట్టుగా చేశావు. ఇంద్రా! ఈ అదితికన్న సమస్తసంతతిని నారెక్కలలోని ఒకచిన్న ఈకతోనే ధరించగలను. ఇలాంటి నన్ను ఈవిధంగా అవమానిస్తావా?" అని కోపంతో కన్నుల కాంతులు ఎర్రబడగా.....*

వ. **ఉన్నం గనుంగొని కోపించి వాసుదేవుండు వెడనవ్వు నవ్వుచు. 299**

అ : వెడనవ్వు = చిన్ననవ్వు.

భా : *ఉన్న గరుత్మంతుని చూచి విష్ణువు కోపించి చిరునవ్వుతో.*

క. **"నీవేటి మోపు కాఁడవు?**
నావెరవున నిన్ను నడిపినను గర్వంబే
లా వెడఁగ" యంచుఁ దన ముం
జే వీఁపున నిడ సురేంద్రజిత్తు వికలుఁడై. 300

అ : ఏటిమోపుకాఁడవు = ఏపాటిబరువు మోసేవాడివి; వెడఁగ = వెర్రివాడా; నావెరవునన్ = నాఅధీనంలో (నానేర్పుతో); నిన్ను; నడపినను = నడిపించినా; గర్వంబు; ఏలా= ఎందుకు; అంచున్ = అంటూ; తనముంజే = తనముంజేతిని; వీఁపునన్ = వీపుమీద; ఇడన్= ఉంచగా; సురేంద్రజిత్తు=ఇంద్రుని జయించిన వాడు(గరుత్మంతుడు);వికలుఁడై=కలవరపడినవాడై;

భా : *"తెలివితక్కువవాడా! నీవు ఏమాత్రం బరువు మోయ గలవు? నా అధీనంలో ఉంచుకొని నిన్ను ఎంతో నేర్పుతో నడుపుతుంటే ఇంత గర్వం ఎందుకు"? అని విష్ణువు తనముంజేతిని ఆగరుత్మంతుని వీపుమీద పెట్టాడు. ఆబరువుకు ఆతడు కలవరపడి.*

క. **ఎఱకలు విచ్చుచుఁ దుండము**
దెఱచుచు; వ్రేఁ గడరి సొగసి త్రెళ్ళి వివశుఁడై

యఱచిన, నోడకు మని హరి
నెఱీ సక్కఁగఁ ద్రోచి యెత్తె నెగయంగఁ గృపన్. **301**

అ : ఎఱకలు = రెక్కలు; విచ్చుచున్ = విప్పుతూ (చాచుతూ); తుండము = నోరు (ముక్కు); తెఱచుచున్ = తెరుస్తూ; వ్రేఁగు = బరువు; అడరి = అతిశయించి (ఎక్కువై); సొగసి= మూర్ఛపోయి; తెళ్ళి = (నేలమీద)పడి; వివశుఁడై = పరవశుడయి; అఱచినన్= అరవగా; హరి= విష్ణువు; ఓడకుము = భయపడకు; అని; నెఱీ = రెక్కను; చక్కఁగన్ = సరిగా; త్రోచి = సర్ది; కృపన్ = దయతో; నెగయంగన్ = పయికిలేచేటట్లు; ఎత్తెన్.

భా : *రెక్కలు చాచుతూ, ముక్కు తెరుస్తూ (విష్ణువుచేతి) బరువు ఎక్కువ కావటంవల్ల మూర్ఛపోయి నేలమీదపడి పరవశుడయి అరవసాగాడు. అప్పుడు విష్ణువు దయతో భయపడకు అని ఆగరుడుని రెక్కలు సరిచేసి పయికి లేవనెత్తాడు.*

వ. ఇవ్విధంబునం గేశవుండు గరుణించి గరుడుని ననునయించి యింక నవుదానికి నుద్ధతి మాని బుద్ధిగలిగి యుండు.మని వీడ్కొలిపి పుచ్చినం బోయెం; గావున గర్వంబు గొఱగా; దింతయు నీమహానుభావుం డెఱుంగు"నని నారదుం జూపి "యితండు మాతలి కన్యా కార్యంబునకుఁ దోడై నడచె నడుగు; మదియ కాదు సర్వేశ్వరుండగు మాధవు మాహాత్మ్యం బీతనికిం గరతలామలకం బయియుండుఁ; బ్రభవిష్ణుం డగు నాదివిష్ణుఁడు గదా యీకృష్ణుం; డీతని సహాయత్వంబున గల కౌంతేయుల తోడం గూడి మనికి కార్యం" బనిన నారదుండు ధార్తరాష్ట్రు నాలోకించి.302

అ : ఈవిధంబునన్ = ఇలాగా; కేశవుండు = విష్ణువు; అనునయించి = ఓదార్చి; అవుదానికి = జరుగబోయేదానికి; ఉద్ధతిమాని = పొగరువిడిచి; వీడ్కొలిపి = పోవటానికి అనుజ్ఞ (సెలవు) ఇచ్చి; పుచ్చినన్ = పంపగా; కొఱగాదు = ప్రయోజనకారికాదు; తోడై = సహాయమయి; కరతల+ఆమలకంబు=అరచేతిలో ఉన్న ఉసిరిపండు; ప్రభవిష్ణుండు= ప్రభావశీలుడు (గొప్పవాడు) సహాయత్వంబు= తోడ్పాటు (సహాయం); కౌంతేయులతోడన్ = కుంతీకుమారులతో; కూడిమనికి= కలిసి బ్రతకటం; కార్యంబు = చేయదగినది. ధార్తరాష్ట్రున్ = దుర్యోధనుని; ఆలోకించి = చూసి.

భా : *ఇలా విష్ణువు గరుత్మంతుని ఓదార్చి 'ఇంకముందు జరగబోయే పనులలో పొగరు వదలి బుద్ధిగా ఉండు' అని సెలవిచ్చి పంపించాడు. కాబట్టి గర్వంవల్ల ఏమీ ప్రయోజనంలేదు. ఇదంతా ఈమహానుభావునికి తెలుసు అని నారదుని చూపి కణ్వుడు "ఈయన మాతలి కుమార్తె పెండ్లి విషయంలో సహాయపడ్డాడు. అంతేకాదు కృష్ణుడు మహాత్ముడైన ఆమహావిష్ణువే గదా! ఈయన సహాయంగల పాండవులతో కలిసి బతకటం నీకు కర్తవ్యం "అని అన్నాడు. అప్పుడు నారదుడు దుర్యోధనుని చూచి....*

క. "బలవంతుల బలములు న
గ్గల మగుబల మెదురఁ గలుగఁగాఁ గీడ్పడు;నే
కొలఁదుల వారికి గర్వము
నిలుచునె? నయమార్గవృత్తి నిలిచిన భంగిన్." **303**

అ : బలవంతుల బలములు; అగ్గలము+అగు = అధికమయిన; బలము; ఎదురన్= ఎదుర; కలుగఁగాన్ = ఉండగా; కీడ్పడున్ = హానిని పొందుతుంది. ఏకొలఁదుల వారికిన్ = ఎంతగొప్పవారికయినా; నయమార్గవృత్తి = నీతిమార్గంలో ప్రవర్తించటం; నిలిచిన భంగిన్ = నిలబడ్డట్లు; గర్వము; నిలుచునె = నిలబడుతుందా?

భా : *ఎంత బలవంతుల శక్తిసామర్థ్యాలయినా సరే తమకంటే అధికమయిన బలం ఎదురుగా వచ్చి ఉంటే దెబ్బతింటుంది. ఎంతగొప్పవారికయినా నీతిమార్గప్రవర్తన నిలబడినట్లుగా, గర్వప్రవర్తన నిలువగలదా?"*

వ. అని పలికి వెండియు నిట్లనియె. 304

భా : అని చెప్పి మళ్ళీ ఇలా అన్నాడు.

ఆ. 'ఇదియ కాని చేయ నెద్దియే' ననుచుని
ర్బంధవృత్తిఁ దలఁపు పట్టికొనిన;
నట్టివాని కెందు నలజడి వాటిల్లు;
గాలవుండు గుఱియ కాఁడె మనకు. 305

అ : ఏను = నేను; ఇది+అ+కాని=ఇదేకాని; ఎద్ది = ఏదైనామరొకటి చేయను అనుచు; నిర్బంధవృత్తిన్ = పట్టుదలను; తలఁపు = అభిప్రాయం(మనస్సు); పట్టికొనినన్ = అనుసరిస్తే; అట్టివానికిన్ = అలాంటివానికి; ఎందున్ = ఎక్కడయినా; అలజడి వాటిల్లున్ = ఆపద(కష్టం) కలుగుతుంది. మనకు; గాలవుండు; గుఱి+అ+కాఁడె = నిదర్శనం అవుతాడుగదా!

భా : ***నేననుకొన్న ఇది తప్ప మరొకటి చేయను*** *అనే మొండిపట్టుదలతో దృఢాభిప్రాయం ఏర్పరుచున్నవారికి ఎక్కడయినా తప్పక ఆపద కలుగుతుంది. దీనికి మనకు నిదర్శనం గాలవుడేకదా!*

వి. నారదుడు చెప్పిన గాలవుని వృత్తాంతాన్ని తిక్కన 21 గద్యపద్యాలలో రచించాడు. ఇది మూలంలో 18 అధ్యాయాలలో దాదాపు నాలుగువందల శ్లోకాలతో విస్తరించి ఉంది.

వ. వినుము; విశ్వామిత్రుపాల విద్యాభ్యాసంబు సేసి గాలవుండను ముని కుమారుండు 'గురుదక్షిణ యేమి సమర్పింతు'నని యడిగిన; నతం 'డేమియు నేల' యని యుడిపిన నుడగక, యెన్ని సెప్పిన నన్నింటికి నన్ని సెప్పి నిర్బంధించినఁ గటకటంబడి యత్తపోధనవర్యుం 'డట్లేని శుద్ధ ధవళ వర్ణంబులై యొక్క కర్ణంబు నీలంబైన యుత్తమాశ్వంబు లెనమన్నూరు దెచ్చియి'మ్మని పలికినం; బోయి....... 306

అ. విశ్వామిత్రుపాల = విశ్వామిత్రుని వద్ద; ఉడిపినన్=మాన్పగా; ఉడుగక= మానుకోక; నిర్బంధించినన్=బలవంతపెట్టగా; కటకటంబడి=కోపించి; ఆ+తపోధనవర్యుండు=ఆ తపస్సే ధనంగా గలవారిలో శ్రేష్ఠుడు;; ఎనమన్నూఱు=ఎనిమిది వందలు.

భా. *ఆ వృత్తాంతం చెపుతాను విను. గాలవుడు అనే ముని కుమారుడు విశ్వామిత్రుని వద్ద విద్యాభ్యాసం చేశాడు. తరువాత ఆతడు 'గురుదక్షిణగా ఏమి*

సమర్పించుకోమంటారు?' అని అడిగాడు. ఆ గురువు 'ఏమీ అక్కర లేదు.' అని ఎన్నో విధాలుగా ఆతనిని ఆ ప్రయత్నం నుండి విరమింపజేయటానికి ప్రయత్నించాడు. ఆ శిష్యుడు అన్నింటికీ అన్నీ చెప్పి బలవంతం చేశాడు. దాంతో కోపం వచ్చిన ఆ గురువు "అలాగయితే స్వచ్ఛమయిన తెలుపు రంగు గలిగి ఒక చెవి మాత్రం నీలవర్ణంగల ఉత్తమాశ్వాలను ఎనిమిది వందలు తెచ్చి ఇయ్యి" అని అన్నాడు. అప్పుడు గాలవుడు బయలుదేరి....

తే. గాలవుం డవ్విధముఘోటకముల నెందుఁ
బడయ లేక చింతాభర భ్రాంతుఁ డగుచు,
వెడలి యాహార నిద్రలు విడిచి, తా మ
హాపథముఁ బోదుఁగా కని యరిగి యరిగి. 307

అ : గాలవుండు ఆ+విధముఘోటకములన్=అలాంటిగుర్రాలను; ఎందున్=ఎక్కడా; పడయలేక = సంపాదించలేక; చింతాభరభ్రాంతుఁడు = విచారభారంతో భ్రాంతిని పొందినవాడు; అగుచున్= అవుతూ; వెడలి = బయలుదేరి; ఆహారనిద్రలు; విడిచి; తాన్ = తాను; మహాపథమున్+ పోదున్+కాక =మహాప్రస్థానాన్ని ప్రవేశింతును గాక (మరణిస్తాను) అని; అరిగి+అరిగి=వెళ్ళి వెళ్ళి.

భా : *గాలవుడు అలాంటి గుర్రాలను ఎక్కడా సంపాదించలేక అధికంగా విచారపడుతూ బయలు దేరి నిద్రాహారాలు వదలి నేనింక మహాప్రస్థానం చేస్తాను (మరణిస్తాను) అని చాలాదూరం వెళ్ళాడు.*

వ. ఒక్కచో గరుడునిం గని; బాలసఖుండు గావున నతనికిం దన వృత్తాంతంబు సెప్పిన; నతండు గరుణాభరితుండై. 308

అ : బాలసఖుండు = చిన్ననాటిస్నేహితుడు; కరుణాభరితుండు = దయతో నిండిన(కూడిన)వాడు.

భా : *ఒకచోట గరుత్మంతుని చూశాడు. ఆతడు తనకు చిన్ననాటి స్నేహితుడు కాబట్టి గాలవుడు తన వృత్తాంతం వివరంగా చెప్పాడు. అదివిని గరుత్మంతుడు దయాపూర్ణుడయినాడు.*

క. "దేవతలు గాని యిట్టివి
గావింపం జాల; రీ సకలదిక్కులలో
దేవేంద్రు దిక్కు బహుదివి
జావాసం బందుఁ బోద" మని మునిపుత్రున్. 309

అ : ఇట్టివి = ఇటువంటివి; దేవతలు; కాని; కావింపన్+చాలరు = చేయలేరు; ఈ సకల దిక్కులలోన్ = ఈసమస్త దిక్కులలో; దేవేంద్రుదిక్కు = తూర్పుదిక్కు; బహుదివిజ+ ఆవాసంబు = అనేకులయిన దేవతలకు నివాసస్థానం; అందున్ = అక్కడికి; పోదము= వెళ్దాం;అని; ముని పుత్రున్ = మునికుమారుని(గాలవుని)

భా : "దేవతలు గాని ఇలాంటి పనులు చేయలేరు. అన్ని దిక్కుల కంటే తూర్పు దిక్కు దేవతలకు చాలమందికి నివాసం. కాబట్టి మనం అక్కడికి పోదాం." అని గాలవుని.

క. **అఱకడ నిడి; ప్రాఙ్ముఖుఁడై**
పఱచి; జలధిలోనఁ జదలఁ బాఱెడు నెడఁ జె
య్వఱి దప్పి నిలువఁ జాలక
యొఱగిన గాలవుని డించె నొక గిరి మీఁదన్. 310

అ : అఱకడన్ = మూపుమీద(బుజాన); ఇడి = ఉంచుకొని; ప్రాఙ్ముఖుఁడు+ఐ = తూర్పుముఖం గలవాడై; పఱచి = (ఆకాశంలోకి) ఎగిరివెళ్ళి; జలధిలోనన్ = సముద్రంలోనూ; చదలన్ = ఆకాశంలోనూ; పాఱెడునెడన్ = వెళ్ళేటప్పుడు; చెయ్వు+అఱి = చేష్టనశించి- చేష్టలుడిగి; దప్పిన్ = దప్పికతో; నిలువన్+చాలక = నిలువలేక; ఒఱగినన్ = పక్కకుఒరిగిపోగా; గాలవునిన్; ఒక గిరిమీఁదన్ = ఒకకొండమీద; డించెన్ = దించాడు.

భా : *గరుత్మంతుడు తన వీపు మీద పెట్టుకొని తూర్పుదిక్కుగా ఎగిరి సముద్రంలో ఆకాశంలో వేగంగా వెళ్ళసాగాడు. అప్పుడు గాలవుడు చేష్టలు దక్కి, దప్పికతో నిలువలేక పక్కకు ఒరిగిపో సాగాడు. ఆసమయంలో గరుత్మంతు డాతనిని ఒక కొండమీద దించాడు.*

వ. **ఇట్లు డించి డప్పి దేర్చి యందు గశ్యపనందనుండు శాండిలి యను నొక్క తపస్వి శాపంబునఁ బక్షంబులు డుల్లి, యనుగ్రహంబునం గ్రమ్మఱ వచ్చిన విషాదమోదంబు లనుభవించి, యట సనుట సాలించి, మగుడ మహీతలంబునకు మునికుమారుం దెచ్చి యయాతి తన నెచ్చెలి. యని ప్రతిష్ఠానపురనాథుండగు నతని కడకు నాతనిం దోడ్కొని చని, యగ్గాలవు తెఱం గెఱింగించిన, నతండు.** 311

అ : డించి = దించి; డప్పి = దప్పిక; తేర్చి = తొలగించి- తీర్చి; కశ్యపనందనుండు= కశ్యపునికుమారుడు గరుత్మంతుడు; పక్షంబులు = రెక్కలు; డుల్లి = రాలి; క్రమ్మఱ = మళ్ళీ; విషాదమోదంబులు = దుఃఖము, సంతోషమూ; అట = అటువైపు; చనుట = వెళ్ళటం; చాలించి= మానుకొని; మగుడ = మళ్ళీ వెనక్కుతిరిగి; మునికుమారున్ = గాలవుని; నెచ్చెలి = మిత్రుడు; తోడ్కొనిచని = తీసుకొని వెళ్ళి; ఆ+గాలవుతెఱంగు = ఆగాలవుని వృత్తాంతం

భా : *ఇలా దించి ఆతని దప్పిక తీర్చాడు గరుత్మంతుడు. శాండిలి అనే మునిశాపంవల్ల ఆతని రెక్కలు రాలిపోయాయి. ఆముని అనుగ్రహంవల్ల మళ్ళీ రెక్కలు వచ్చాయి గరుత్మంతునికి. ఈరెంటివల్లా దుఃఖమూ, సంతోషమూ కలిగాయి. అందువల్ల అటుపోవటం మానుకొని ఆయన వెనక్కు తిరిగి గాలవుని భూమండలానికి తీసుకొని వచ్చాడు. ప్రతిష్ఠానపురాధిపతి అయిన యయాతి మహారాజు తనకు ఆప్తమిత్రుడని చెప్పి ఆతనిని అక్కడికి తీసుకొని పోయి ఆతని వృత్తాంతం గరుత్మంతుడు వివరించాడు. అప్పుడు యయాతి....*

వి. గరుడుని రెక్కలు పోయి మళ్ళా వచ్చిన వృత్తాంతం మూలంలో 113వ అధ్యాయంలో ఉంది. శాండిలీం బ్రాహ్మణీం తత్సదదృశాతే తపో2న్వితామ్ అని మూలములో 113-1. శాండిలి తాపసస్త్రీ అని ఉంది.

క. తనకట్టి గుఱ్ఱములు లే
కునికిని మాధవి యనంగ నొప్పెడు పుత్రిన్
ముని కొసఁగె "దీనికై యే
మనుజేశుఁడు నీఁడె హయ సమాజము"ననుచున్. 312

అ : (యయాతి) తనకు; అట్టి గుఱ్ఱములు; లేకునికిని = లేకపోవటంవల్ల; దీనికై = ఈమెకుబదులు; ఏమనుజ+ఈశుఁడు = ఏరాజయినా; హయసమాజమున్ = గుఱ్ఱాల సమూహాన్ని; ఈఁడె = ఇయ్యడా; అనుచున్ = అంటూ; మాధవి; అనంగన్; ఒప్పెడు పుత్రిన్ = అందమయిన కుమార్తెను; మునికి = గాలవునికి; ఒసఁగెన్ = ఇచ్చాడు.

భా : *ఆ యయాతి తన దగ్గర అలాంటి గుఱ్ఱాలు లేకపోవటంవల్ల 'ఈపిల్లకు బదులుగా ఏరాజయినా ఆ గుఱ్ఱాలను ఈయక పోతాడా' అని అంటూ ఆ గాలవునికి మాధవి అనే తన కుమార్తెను ఇచ్చాడు.*

వ. ఇ ట్లొసంగినం దోడ్కొ ని. 313

భా : ఇలా ఇస్తే తీసుకొని.

తే. 'ఇట్టి హయములు గలరాజు లెవ్వరొక్కొ'
యనుచుఁ దిరిగి యయోధ్యకుఁ జని తదీయ
నాథు నిక్ష్వాకుఁగనిన న న్నరవరుండు
దనకు నిన్నూఱకాని లేవనియె హరులు. 314

అ : ఇట్టిహయములు = ఇలాంటి గుఱ్ఱాలు; కలరాజులు; ఎవ్వరు+ఒక్కొ = ఎవరోకదా; అనుచున్ = అంటూ; తిరిగి; అయోధ్యకున్ చని = వెళ్ళి; తదీయనాథున్ = ఆనగరానికి రాజును; ఇక్ష్వాకున్; కనినన్=దర్శించగా; ఆ+నరవరుండు = ఆరాజు; తనకు; హరులు = గుఱ్ఱాలు; ఇన్నూఱు+అ = రెండువందలే; కాని లేవు= (అంతకంటే ఎక్కువ) లేవు; అనియెన్ = అన్నాడు.

భా : *గాలవుడు ఇలాంటి గుఱ్ఱాలు గలరాజు ఎవరా? అని దేశం అంతా తిరిగి అయోధ్యానగరానికి వెళ్ళాడు. ఆనగరాధిపతి అయిన ఇక్ష్వాకు మహారాజును దర్శించాడు. ఆరాజు తన దగ్గర అలాంటి గుఱ్ఱాలు రెండువందలుపైన లేవు అని అన్నాడు.*

క. అన విని మాధవి ఋషి కి
ట్లను; నొక్క మహానుభావు నతుల వరమునం
దనయవతి నయ్యు నేఁ గ
న్యన యగుదుం గాన నిమ్ము న న్నీతనికిన్. 315

అ : అనన్=అనగా; విని; మాధవి; ఋషికి = గాలవునితో; ఇట్లు అనున్ =అంటున్నది; ఒక్కమహానుభావు = ఒక మహాత్ముని యొక్క; అతులవరమునన్ = సాటిలేని వరంవల్ల;

తనయవతిని = సంతానవతిని; అయ్యున్ = అయినా; నేన్ = నేను; కన్యన = కన్యనే; అగుదున్= అవుతాను; కానన్ = కాబట్టి; నన్ను; ఈతనికిన్ = ఈరాజుకు; ఇమ్ము = ఇయ్యి.

భా : *ఆమాటలు విని మాధవి గాలవునితో ఇలా గన్నది "ఒకమహానుభావుని వరంవల్ల సంతానవతి నయినా నేను మళ్ళీ కన్యనే అవుతాను. కాబట్టి నన్ను ఈ ఇక్ష్వాకురాజుకు ఇయ్యి.*

వ. ఒక్క సమయంబు సేసికొని యిచ్చి గుఱ్ఱంబులు వచ్చినయవి యెల్ల రాఁ బుచ్చికొ"మ్మనిన గాలవుండు నవ్విధంబునకు సమ్మతించె; నపత్యార్థియై యిక్ష్వాకుండును నయ్యుంకువునకు భార్యయగుట పుత్ర జన్మావధిగా నొడివి యశ్వంబుల నొసంగి కన్యకం బరిగ్రహించి దానియందు వసుమనస్సుం డను కొడుకుం బడసి, గాలవునకు నమ్మగువను మగుడ సమర్పించిన జూచి "యబ్భంగి గల చోట్ల నెల్ల నరసి తురంగంబులం గావించికొ"మ్మని యతనికిం జెప్పి సుపర్ణుండు సనియె; మఱియు మహీతలంబునం గ్రుమ్మరి యమ్ముని కుమారుండు గందువ లెఱింగి పోవంబోవ. 316

అ : సమయంబు = ఏర్పాటు (నిర్ణయం); రాన్+పుచ్చికొమ్ము = రాబట్టుకో; అపత్యార్థి= సంతానం కోరేవాడు; ఆ+ఉంకువునకు = ఆ ఓలికి; కన్యార్థము ఇచ్చుధనానికి - కట్నానికి; పుత్రజన్మ+అవధిగా = పుత్రుఁడు కలగటమే హద్దుగా; నొడివి = చెప్పి; ఆ+మగువను= ఆస్త్రీని; మగుడన్ = తిరిగి; ఆ+భంగి = ఆరీతి; అరసి = వెదికి; తురంగంబులన్ = గుఱ్రాలను; కావించుకొమ్ము = సంపాదించుకో; సుపర్ణుండు = గరుత్మంతుడు; చనియెన్= వెళ్ళాడు; మహీతలంబునన్ = భూమిమీద; క్రుమ్మరి = తిరిగి; కందువలు = సంకేతస్థానాలు.

భా : *ఒక ఏర్పాటు చేసుకొని నన్ను భార్యగా ఇచ్చి గుఱ్రాలు వచ్చినన్ని రాబట్టుకో.' అని అన్నది. గాలవుడు అందుకు అంగీకరించాడు. సంతానం కోరే ఇక్ష్వాకువు ఈమె ఈకట్నంతో నాకు భార్యకావటం సంతానం కలిగేటంతవరకే అని చెప్పి ఆమాధవీ కన్యను పరిగ్రహించాడు. ఆమెవల్ల వసుమనస్సుడు అనే కొడుకును కన్నాడు. తరువాత గాలవునకు ఆమెను తిరిగిఇచ్చాడు. ఇది చూచి గరుత్మంతుడు అలాంటివి దొరికేచోట్లు వెతికి గుఱ్రాలు సంపాదించుకో అని చెప్పి వెళ్ళాడు. తరువాత ఆగాలవుడు భూమండలం అంతా గాలిస్తూ ఆయా సంకేతస్థలాలు తెలుసుకుంటూ పోతుండగా.*

క. ఆ సమయంబునను దివో
దాసుఁడు నౌశీనరుండుఁ దరుణికి నిన్నూ
ఱేసి హయంబుల నిచ్చి, మ
హాసత్త్వుల సుతులఁ బడసి రధికప్రీతిన్. 317

అ : ఆ సమయంబునను=ఆకాలంలో; దివోదాసుండున్; ఔశీనరుండున్;తరుణికిన్= స్త్రీకి (మాధవికోసం); ఇన్నూఱేసి=రెండువందలేసి; హయంబులన్=గుఱ్రాలను; ఇచ్చి; మహాసత్త్వులన్ = గొప్పబలంగల; సుతులన్ = కుమారులను; అధికప్రీతిన్ = మహానందంతోడ; పడసిరి = పొందారు.

భా : *ఆ కాలంలో దివోదాసు, ఔశీనరుడు అనే ఇద్దరు రాజులూ మాధవీ కన్యకు చెరి రెండు వందల గుఱ్ఱాల నిచ్చి మహాబలవంతు లయిన కుమారులను కన్నారు.*

వ. ఇట్లు క్రమంబునఁ గాశీశ్వరునకుఁ బ్రతర్దనుని, భోజపురనాథునకు శిబిం గనిన యక్కన్యకఁ గొని, వెండియు వసుంధరం దిరుగుచుండ, గరుత్మంతుండు గ్రమ్మఱి వచ్చి యమ్మునితో; "నీవింక జాలిం బడవలవ; దొక్క కారణంబున నీరాజులు మువ్వురకు నివ్వాజులు గలిగె; నింతియ కాని యొండెడ నీచందంబున మొత్తంబులై దొరకనేర; వియ్యాఱు నూఱు గుఱ్ఱంబులను గురువునకు సమర్పింపు మొక్కటి సెప్పెద విను" మని యిట్లనియె. 318

అ : వెండియున్ = మళ్ళీ; వసుంధరన్ = భూమియందు; క్రమ్మఱివచ్చి = తిరిగివచ్చి; జాలింబడవలవదు = శ్రమపడవద్దు; మువ్వురకు = ముగ్గురికి; ఈ+వాజులు = ఈగుఱ్ఱాలు; ఒండు+ఎడన్ = ఇంకొకచోట; ఈచందంబున =ఈవిధంగా; మొత్తంబులు+ఐ = గుంపులై (మొత్తంగా); ఈ+ఆఱునూఱు = ఆరువందలు.

భా : *ఇలాగా కాశీరాజుకు ఆకన్యవల్ల ప్రతర్దనుడు, భోజపురప్రభు వయిన ఔశీనరునికి శిబి అనే కుమారులు కలిగారు. తరువాత గాలవుడు ఆకన్యను తీసుకొని మళ్ళీ భూమండలం అంతా తిరగసాగాడు. అప్పుడు గరుత్మంతుడు మళ్ళీ తిరిగివచ్చి ఆమునితో "నీవు ఇంక శ్రమపడవద్దు. ఒక కారణంవల్ల ఈ రాజులు ముగ్గురికి ఈ గుఱ్ఱాలు లభించాయి. ఇంతేకాని ఇంకొక చోట ఇలాంటివి మొత్తంగా దొరకవు ఈ ఆరువందల గుఱ్ఱాలను నీగురువుకు సమర్పించుకో! ఒకమాట చెవుతాను; విను." అని ఇలా అన్నాడు.*

వి : ఆ రాజులకు ఆ గుఱ్ఱాలు వచ్చిన కారణంమూలంలో 119 అధ్యాయంలో ఇలా ఉంది. "పూర్వం గాధిరాజకుమార్తె సత్యవతిని తనకిమ్మని ఋచీకమహర్షి అడిగాడు. ఆరాజు "మునీ! ఒక చెవి శ్యామ వర్ణంగల వెయ్యి గుఱ్ఱాలు నాకిచ్చి నాకన్యను వివాహం చేసుకో" అన్నాడు. ఆముని అందుకంగీకరించి వరుణుని వద్దకు వెళ్ళి అశ్వతీర్థంలో ఆ గుఱ్ఱాలను సంపాదించి రాజు కిచ్చి ఆమెను వివాహం చేసుకున్నాడు. ఆరాజు పుండరీకం అనే యాగంలో వాటిని దక్షిణగా బ్రాహ్మణులకు ఇచ్చాడు. తరువాత రాజులు వారివద్దనుంచి తలా రెండు వందలు గుఱ్ఱాలు కొన్నారు. మార్గమధ్యంలో ఒకచోట నదిదాటవలసి వచ్చింది. అప్పుడు ఆ వేయ్యి గుఱ్ఱాలలో నాలుగు వందలు వితస్తా (జీలం) నదిలో ప్రవాహానికి కొట్టుకు పోయినాయి.' అని గరుత్మంతుడు గాలవునికి ఆకారణాన్ని వివరించాడు.

క. "ఈమువ్వురి తెఱఁగునఁ దగ
నామునియుం గొడుకుఁ బడయు నట్లుగ నిమ్మో
కోమలిని గొఱంతకు వి
శ్వామిత్రున కెట్టులైన సంప్రార్థనతోన్." 319

అ : ఈ మువ్వురి తెఱఁగునన్ = ఈముగ్గురు రాజులవలెనే; ఆమునియున్ = ఆ (విశ్వామిత్ర) మహర్షిగూడా; కొడుకున్; పడయునట్లుగన్ = పొందేవిధంగా; కొఱంతకున్ =

మిగిలినవాటికిబదులు; సంప్రార్థనతోన్ = అధికంగా ప్రార్థించటంతో; ఎట్టులు+ఐనన్ = ఎలా గయినా; ఈ కోమలిని = ఈస్త్రీని(మాధవిని); విశ్వామిత్రునకు; ఇమ్ము = ఇయ్యి.

భా : *"ఈముగ్గురు రాజుల వలెనే ఆముని గూడా కొడుకును పొందేటట్లు ఆ మిగిలిన రెండువందల గుర్రాలకుబదులు విశ్వామిత్రుని ఎలాగయినా ప్రార్థించి ఈమాధవిని ఆయనకు ఇవ్వు."*

వ. అని తానునుఁ దోడు సని యత్తపస్వి పాలికిం బోయి యత్తెఱం గెఱింగించి గాలవుం గానిపించి 'యీతండు బాలుండు; నీవు దయాళుండ; వితనిం గృతార్థుం జేయవలయు' నని ప్రార్థించి పక్షిరా జక్కార్యంబు చక్కం జేసి పోయిన. 320

అ : చని = వెళ్ళి ; ఆ+తపస్విపాలికిన్ = ఆమునిదగ్గరకు; ఆ+తెఱంగు = ఆవృత్తాంతం; కానిపించి = చూపి; కృతార్థుఁన్ = ధన్యుని; పక్షిరాజు = గరుత్మంతుడు; ఆ+ కార్యంబు = ఆపని; చక్కన్+చేసి = సరిదిద్ది.

భా : *అని గరుత్మంతుడు తానుగూడా గాలవునితో పాటు విశ్వామిత్రుని వద్దకు వెళ్ళి ఆవిషయం చెప్పి అతనిని చూపి "ఇతడు బాలుడు; నీవు దయగలవాడవు. ఇతనిని ధన్యుని చేయవలసింది" అని ప్రార్థించి ఆపని సరిచేసి వెళ్ళాడు.*

క. మునివరుఁ డష్టకుఁ డనియెడు
తనయుఁ బడసి, శిష్యునకు సుదతి నొప్పించెన్
వనితయుఁ దపంబు సేయం
జనియెను గాలవున కిట్టి చరితము గలిగెన్. 321

అ : మునివరుఁడు = మునిశ్రేష్ఠుడయిన విశ్వామిత్రుడు; అష్టకుఁడు; అనియెడు= అనే; తనయున్ = కుమారుని; పడిసి = కని; పొంది; సుదతిన్ = మాధవిని; శిష్యునకున్; ఒప్పించెన్ = ఒప్పగించాడు; వనితయున్ = మాధవికూడా; తపంబు; చేయన్; చనియెను; గాలవునకు ఇట్టిచరితము = ఇలాంటి ప్రవర్తన; కలిగెన్.

భా : *విశ్వామిత్రుడు అష్టకుడు అనేకుమారుని కని ఆమాధవిని శిష్యునికి అప్పగించాడు. ఆమె అప్పుడు తపస్సు చేయటానికి వెళ్ళింది ఇదీ గాలవుని చరిత్ర.*

వ. కావున నెట్టివారికి నిర్బంధము దగదు; దుర్మానంబు దుర్దశ నాపాదించు; నయ్యయాతి దుర్మానంబునం గాదె పుణ్యలోక పరిభ్రష్టుండై మాధవీ పుత్రులగు నన్నలువురు దౌహిత్రుల కతంబున నూర్ధ్వగతిం గనియె; నట్లగుటం జేసి. 322

అ : నిర్బంధము = బలవంతం; ఆపాదించున్ = కలిగిస్తుంది; దుర్మానంబునన్ = దుష్టమయిన అభిమానంవల్ల; దౌహిత్రులు = మనుమలు (కూతురుకొడుకులు); ఊర్ధ్వగతిన్ = ఉత్తమలోక ప్రాప్తిని.

భా : *కాబట్టి ఎలాంటి వారికయినా నిర్బంధం చేయటం తగదు. దురహంకారం దుర్దశను కలిగిస్తుంది. యయాతి మహారాజు దురహంకారంవల్లనే పుణ్యలోకంనుంచి*

పతితుడయినాడు. తరువాత మాధవీ పుత్రులయిన ఆ నలుగురు దౌహిత్రుల వల్ల ఉత్తమలోకాలను పొందాడు. అందువల్ల.

వి. యయాతి స్వర్గ గమనము, పతనమూ, మళ్ళీ స్వర్గగమనమూ; మూలంలో 3 అధ్యాయాలలో విశదంగా ఉంది. 80శ్లోకాలలో ఉన్న విషయాన్ని తిక్కన ఒక్క వాక్యంలో సంగ్రహించాడు. మూలంలో ఈవృత్తాంతం ఇలా ఉంది.

యయాతి తన పూర్వపురాజుల సదాచారాలు అనుష్ఠిస్తూ అనేక వేలసంవత్సరాలు జీవించి మరణించాడు. పూరువు, యదువు అనే కుమారుల ద్వారా తనవంశాన్ని ప్రతిష్ఠించి ఆ రాజు ఇహలోక పరలోకాలలో ప్రతిష్ఠితుడయినాడు. ఆయన స్వర్గాన్ని అధిరోహించిన తరువాత వేలసంవత్సరాలు గడచిపోయాయి. అక్కడి తనవైభవాన్ని చూచి ఆయనే ఆశ్చర్యపడ్డాడు. మోహావిష్టుడయిన ఆరాజు మహానుభావులయిన రాజర్షులు తన ప్రక్కన ఉండగానే దేవతలను, మనుష్యులను, మహర్షులను అవహేళనం చేయసాగాడు. ఆతనివాలకం చూచి వారంతా అసహ్యించుకున్నారు. అహంకారంవల్లా, అక్కడి వారి నిర్లక్ష్యం వల్లా, పెద్దలను నిర్లక్ష్యం చేయటంవల్లా యయాతి స్వర్గచ్యుతు డయినాడు.

ప్రతర్దనుడు, వసుమనుడు, శిబి, అష్టకుడు అనే నలుగురు రాజులు వాజపేయ యజ్ఞం చేస్తున్నారు. పుణ్యక్షయం వల్ల యయాతి వారి మధ్యలో పడ్డాడు. వారు అడుగగా యయాతి సజ్జనుల మధ్య పడాలని కోరుకున్నాననీ, అది మీమధ్య పడటం వల్ల సిద్ధించిందనీ చెప్పాడు. వారు యజ్ఞఫలాన్ని ఇస్తాము అంటే ఆయన నిరాకరించాడు. ఇంతలో మాధవి అక్కడికి వచ్చింది. మాధవివల్ల ఆయన ఆరాజులు తన దౌహిత్రులని తెలుసుకున్నాడు.

మాధవి తనపుణ్యఫలం సగంఇవ్వటం వల్లా, అక్కడికి వచ్చిన గాలవుడు తనతపః ఫలం ఎనిమిదో వంతు ఇవ్వటం వల్లా, ఆరాజులు ఈయన తమతాత అని గుర్తించటంవల్లా యయాతి భూస్పర్శ లేకుండా పైకి లేచాడు. అనంతరం అనలుగురు దౌహిత్రులు తమ పుణ్య ఫలాన్ని ఈయగా ఆరాజు స్వర్గాన్ని చేరాడు. దేవతలు ఆయనకు స్వాగతం చెప్పారు.

తరువాత యయాతి తనపతనానికి కారణం అడుగగా బ్రహ్మ ఇలా అన్నాడు. "రాజా! నీ అహంకారంవల్లనే నీవు సంపాదించిన పుణ్యం అంతా నశించింది. ఈపుణ్యలోకం అభిమానమూ, బలమూ, హింసా, మోసమూ, కపటమూ అనేవాటివల్ల సుస్థిరం కాదు.' ఈయ యాతి వృత్తాంతం మూలంలో ఆది. 87 నుండి 93 అధ్యా. వరకు; ఉద్యో. 114 నుండి 123 వరకు ఉంది.

క. నిర్బంధము దుర్మానము
దుర్బుద్ధికిఁ గాక తగునె దుర్యోధన! నీ
మార్బలమె పాండవులకున్
దౌర్బల్యము వాపు; శుభము దలఁకొను సంధిన్. 323

అ : దుర్యోధన; నిర్బంధము = మొండి పట్టుదలా; దుర్మానమున్ = దుష్టమయిన అభిమానమూ; దుర్బుద్ధికిన్ = దుష్టమయిన బుద్ధిగలవానికి- దుష్టునికి కాక; తగునె= (ఇతరులకు); తగునా; నీమార్బలమె=ప్రతికూలతా బలమే; పాండవులకున్; దౌర్బల్యము= బలహీనతను; పాపున్ = పోగొట్టును. సంధిన్ = సంధివలన; శుభము; తలఁకొనున్ = కలుగుతుంది.

భా : *దుర్యోధనా! మొండి పట్టుదలా, దురహంకారమూ దుర్బుద్ధి కలవానికి తప్ప తదితరులకు తగవు. నీ ప్రతికూలతాబలమే పాండవుల దౌర్బల్యాన్ని పోగొట్టుతుంది. సంధివల్ల శుభం కలుగుతుంది.*

వ. కృష్ణునిమాట విని నీ వి క్కౌరవాన్వ యంబు రక్షింపు" మనియె; నివ్విధంబున నమ్మువ్వురు మునీంద్రులు సెప్పిన హితోపదేశంబుల దెస ననాదరంబు సేసి గాంధారేయుండు రాధేయుం గనుంగొని చే యప్పళించి నవ్వి వీరలింత వెఱ్ఱు లగుదురే యని పలికి వారల నవలోకించి. 324

అ : ఈ+కౌరవాన్వయంబు = ఈకౌరవవంశం; గాంధారేయుండు = దుర్యోధనుడు; రాధేయున్=కర్ణుని; అప్పళించి = చరిచి; తట్టి; అవలోకించి = చూసి.

భా : *కృష్ణుని మాటలు విని నీవు ఈ కౌరవవంశాన్ని రక్షించు;" అని నారదమహాముని చెప్పాడు. ఇలా జామదగ్న్యుడు, కణ్వుడు, నారదుడు అనే ముగ్గురు మునులు చేసిన హితోపదేశం నిరాదరించి దుర్యోధనుడు కర్ణుని చూచి అతని భుజంతట్టి చప్పట్లు కొడుతూ నవ్వి "వీళ్ళు ఎంతవెర్రివాళ్ళు!" అని వారిని చూచి ఇలా అన్నాడు.*

వి. ఈ దుర్యోధనుని ప్రవర్తన వృత్తాంతం మూలంలో కణ్వుని మాటలు విన్న తరువాత జరిగినట్లు ఉన్నది. తిక్కన ముగ్గురు మునులు చెప్పిన తరువాత జరిగినట్లు రచించటం సముచితంగా ఉంది. మూలంలో 105 అధ్యాయం 38;39 శ్లోకాలలో ఉంది.

-: దుర్యోధనుఁడు నారదాదిమునుల మాటల నిరాకరించుట:-

సం. 5-122-1.

క. "మునులార! నన్ను విధియే
మని మును పుట్టించె నట్టు లయ్యెడు గా కీ
వినఁ జవిగాని పలుకులకుఁ
బని గలదే; యుడుగుఁ డింక బహుభాషణముల్." 325

అ : మునులార; నన్ను; విధి = సృష్టికర్త; మును = పూర్వం; ఏమి+అని = ఏమిఅనుకొని- ఎందుకోసం; పుట్టించెన్; అట్టులు = అలాగే; అయ్యెడున్+కాక = కావాలికాని; ఈవినన్; చవిగాని = రుచించని; పలుకులన్ = మాటలవల్ల; పని = ప్రయోజనం- కార్యం; కలదే=ఉన్నదా? ఇంక; బహుభాషణముల్ = అనేకాలయిన మాటలు; ఉడుగుఁడు= మానుకోండి.

భా : *"మునులారా! పూర్వం సృష్టికర్త నన్ను ఏ ఉద్దేశంతో సృష్టించాడో అది అలాగే జరుగుతుంది. అంతేగాని వినటానికి ఏమాత్రం ఇంపుగా లేని ఈ మీమాటలవల్ల ఏం ప్రయోజనం? ఇంక మీహితోపదేశ వచనాలు మానండి!"*

వి. యథైవేశ్వరసృష్టోఽస్మి యద్భావి యాచ మే మతిః
తథా మహర్షే వర్తామి కింప్రలాపః కరిష్యతి అధ్యా.105. శ్లో. 40

వ. అనిన విని ధృతరాష్ట్రుం డమ్మహామునులతో నిట్లనియె. 326

భా : *ఆదుర్యోధనుని మాటలు విని ధృతరాష్ట్రుడు ఆ మునులతో ఇలా అన్నాడు.*

తే. "మీరు సెప్పిన బుద్ధులు గారవమునఁ
జేయఁ గాంచినఁ బుణ్యంబు సేయ నెట్లు
నా ముఖంబునఁ గార్యంబు నడవ; దేమి
సేయువాఁడ నొండెద్దియుఁ జెప్ప లేదు." 327

అ : మీరు; చెప్పిన; బుద్ధులు = హితవచనాలు; సలహాలు; గారవమునన్ = మన్ననతో; గౌరవంతో; చేయగాంచినన్=చేసి నట్లయితే; పుణ్యంబు; చేయనెట్లు = చేసినవాడనేకదా! ఏమి కార్యంబు=ఏ పనీ; నాముఖంబునన్=నాద్వారా; నడవదు = జరగదు; ఏమి+చేయువాఁడన్= ఏం చేసేది; ఒండు+ఎద్దియున్ = మరొకటి ఏదీ; చెప్పన్ = చెప్పటానికి; లేదు.

భా : *"మహర్షులారా! మీరు చెప్పిన హితవచనాలు మన్ననతో నాకుమారులు చేస్తే నేను పుణ్యాత్ముడనుగానా? నావల్ల ఏపనీకాదు. నేను ఏం చేసేది? ఇంత కంటే నేను చెప్పవలసింది ఇంక ఏమిలేదు."*

క. అని యతఁడు శౌరితో ని
ట్లను "నిహముం బరముఁ గలుగు నట్టివిధము నీ
వనఘా! చెప్పితి; నాకుం
జన వేదియు లేదు దీని సమ్మతి నడపన్. 328

అ : అని; అతఁడు=ఆధృతరాష్ట్రుడు; శౌరితోన్=కృష్ణునితో; ఇట్లు; అనున్; అనఘా= పుణ్యాత్ముడా; నీవు; ఇహమున్ = ఈలోకమూ; పరమున్ = పరలోకమూ కలుగునట్లు; చెప్పితి= చెప్పావు. దీనిన్= నీవు చెప్పిన దానిని; సమ్మతిన్ = అంగీకారంతో- మంచిమనస్సుతో; నడపన్ = ప్రవర్తింపజేయటానికి; నడిపించటానికి; నాకున్ = నాకుగూడా; చనవు = చొరవ; ఏదియున్ = ఏమీ;లేదు.

భా : *అని ధృతరాష్ట్రుడు కృష్ణునితో ఇలా అన్నాడు. "అనఘా! నీవు ఇహమూ, పరమూ మాకు కలిగే విధంగా హితం చెప్పావు. దీనిని పరిపూర్ణాంగీకారంతో అమలు చేయటానికి నాకుగూడా ఏమాత్రమూ చొరవలేదు.*

ఆ. మందబుద్ధి నాదు నందనుఁ; డీవు పో
రాని చుట్టమవు; మహానుభావుఁ
డవు; దయార్ద్ర చిత్తుఁడవు; వీనిఁ దేర్పవే
యనునయించి యెట్టు లైనఁ గృష్ణ!" 329

అ : కృష్ణ!; నాదునందనుఁడు= నాకుమారుడు (దుర్యోధనుడు); మందబుద్ధి; ఈవు= నీవు ; పోరానిచుట్టమవు; మహానుభావుఁడవు; దయా-ఆర్ద్ర చిత్తుఁడవు = అప్పుడవైన కరుణతో తడిసిన(నిండిన) మనస్సు కలవాడవు; ఎట్టులైనన్= ఎలాగయినా దీనిన్=ఈదుర్యోధనుని; అనునయించి= మంచిమాట లాడి; తేర్పవే = సరిచేయుము; బాగుచేయుము.

భా : *కృష్ణా! నాకుమారుడు ఈదుర్యోధనుడు మందబుద్ధి. నీవు ఆప్తుడవైన చుట్టానివీ, మహానుభావుడివీ, కరుణాపూర్ణ మనస్సు గలవాడివీ కాబట్టి ఎలా గయినా వీనిని మంచి మాటలు చెప్పి సరిచేయగోరుతున్నాను."*

వి : దూతగా వచ్చాడు కాబట్టి కృష్ణుడు ఇంతకుముందు తాను చెప్పవలసినది అంతా ధృతరాష్ట్రుని కేంద్రంగా చేసుకొని చెప్పాడు. ఇప్పుడు ధృతరాష్ట్రుని కోరిక ననుసరించి ఆయన దుర్యోధనునితో చెపుతున్నాడు.

క. అనిన ముకుందుఁడు దుర్యో
ధనుతో నిట్లనియె. "విమలతర వంశమునన్
జనియించి; తెల్లగుణముల
ననూనుఁడవు; నీకు నీ దురాగ్రహమేలా? 330

అ : అనినన్ = అనగా; ముకుందుఁడు = కృష్ణుడు; దుర్యోధనుతోన్; ఇట్లు; అనియెన్; విమలతరవంశమునన్ = మిక్కిలి నిష్కళంకమయిన కులంలో; జనియించితి = పుట్టావు; ఎల్లగుణములన్ = అన్నిగుణాలతోనూ; అనూనుఁడవు = తక్కువ కాని వాడివి; నీకున్; ఈదురాగ్రహము = దుష్టమయిన(మొండి) పట్టుదల; ఏలా = ఎందుకు?

భా : *ధృతరాష్ట్రుని మాటలు విని కృష్ణుడు దుర్యోధనునితో ఇలా అన్నాడు.' "దుర్యోధనా! నీవు పరమపావనమూ, నిష్కళంకమూనయిన వంశంలో జన్మించావు. అన్ని గుణాలూ నీలో సంపూర్ణంగా ఉన్నాయి. ఇలాంటి నీకు ఈమొండిపట్టుదల ఎందుకు?*

చ. తులువలు గాక యిట్టిదొర దుర్ణయవృత్తికిఁ; జొచ్చునయ్య? పు
త్రులు ననుజన్ములుం జెలులు దుష్టపథంబునఁ బోవకుండ, జు
ట్టలుఁ దగువారుఁ దండ్రియు నొడంబడఁ జేయుము కార్య;మల్పబు
ద్ధుల వెడమాట లూఁకొనకు; దోసము సేగియు వచ్చు నమ్మెయిన్. 331

అ : దుర్ణయవృత్తికిన్ = అవినీతి ప్రవర్తనకు; తులువలు+కాక = తుంటరి వాళ్ళుకాక; ఇట్టిదొర = ఇటువంటిరాజు; చొచ్చునయ్య = సమ్మతిస్తాడా(సాహసిస్తాడా)?; పుత్రులు; అనుజన్ములున్ = తమ్ములూ; చెలులున్ = స్నేహితులూ; దుష్ట పథంబునన్ = చెడుత్రోవలో; పోవకుండన్ = వెళ్ళకుండా; చుట్టలున్ = చుట్టాలూ; తగువారలున్ = తగినవారూ (యోగ్యులూ); తండ్రియున్; ఒడంబడన్ = అంగీకరించేటట్లు; కార్యమున్ = పనిని; చేయుము; అల్పబుద్ధుల= నీచమతుల; వెడమాటలు=వ్యర్థమయినబోధలు; ఊఁకొనకుము= వినకుము(ఊఁకొట్టకు); ఆ+ మెయిన్ = ఆవిధంగా ప్రవర్తిస్తే(దానివల్ల); దోసము=పాపమూ; సేగియున్ =ఆపదగూడా; వచ్చున్.

భా : *తుంటరివాళ్ళుకాక నీలాంటిరాజు అవినీతిగా ప్రవర్తించటానికి ఒప్పుకుంటాడా? నీకుమారులూ, సోదరులూ, మిత్రులూ, అపమార్గంలో పోకుండా చుట్టాలూ, తగినవారూ నీతండ్రీ ఒప్పుకొనే విధంగా ఏపని నయినా చెయ్యి. నీచబుద్ధులు చెప్పే నిరుపయోగమయిన మాటలు ఊఁకొట్టకు. అలా చేస్తే పాపమూ; ఆపదా కలుగుతాయి.*

క. పాండిత్య శౌర్య నిత్యులు
పాండుసుతులు; వారిఁగూడి బ్రదుకుట-ధృతరా
ష్ట్రుండును బాహ్లికుఁడును భీ
ష్మండు గురుఁడుఁ గోరు తెఱఁగు సూవె నరేంద్రా! 332

అ : నరేంద్రా = రాజా!; పాండు సుతులు = పాండురాజకుమారులు (పాండవులు); పాండిత్య శౌర్య నిత్యులు = వివేకంచేతా, పరాక్రమంచేతా ఎప్పుడూ ఒకేలా ఉండేవారు; వారిన్+ కూడిబ్రదుకుట = వాళ్ళతోకలిసి బతకటం; ధృతరాష్ట్రుండును; బాహ్లికుఁడును; భీష్ముండున్; గురుఁడున్ = ద్రోణుడూ; కోరు; తెఱఁగు+చూవె = రీతిసుమా!

భా : దుర్యోధనా!పాండవులు పాండిత్య పరాక్రమాలు నిత్యమూ కలవారు. వాళ్ళతో కలిసి జీవించటమే ఈ నీ తండ్రి ధృతరాష్ట్రుడూ, తాతలయిన బాహ్లిక భీష్ములూ, గురువయిన ద్రోణుడూ ఎప్పుడూ కోరుతుంటారు సుమా!

ఆ. విను మసత్య లోభమున సిరి యగునె? యాఁ
కొని ముసిండిఁ దినిన (గ్రొవ్వులావుఁ
గలుగు నయ్య? శకుని కర్ణ దుశ్శాసన
మంత్రితంబు గార్యతంత్ర మగునె? 333

అ : వినుము; అసత్యలోభమునన్ = యథార్థంకాని(సజ్జనులకు కలుగని) అధికాశ (దురాశ) వల్ల; సిరి = సంపద; అగునె = కలుగుతుందా?; ఆఁకొని = ఆకలిగొని; ముసిండిన్ = విషముష్టి కాయను; తినినన్ =తింటే; క్రొవ్వున్; లావున్ = బలమూ; కలుగునయ్య = కలుగుతవా?; శకుని కర్ణ దుశ్శాసన మంత్రితంబు = శకునీ కర్ణుడూ దుశ్శాసనులతో ఆలోచించింది; కార్య తంత్రము = రాజనీతిప్రకారం చేయదగినపని; అగునె = అవుతుందా?

భా : దుర్యోధనా! విను యథార్థంకాని దురాశవల్ల ఎవరికయినా సంపద కలుగుతుందా! విషముష్టిపండు తింటే కొవ్వూ, బలమూ కలుగుతాయా? శకునితో, కర్ణునితో, దుశ్శాసనునితో మంత్రాంగం చేయటం రాజనీతిప్రకారం కార్యతంత్రం అవుతుందా?

వి. దీనికి మూలం ఇలా ఉంది.

శ్రుత్వా యః సుహృదాం శాస్త్రం మర్త్యోన ప్రతిపద్యతే
విపాకాంతే దహత్యేనం కింపాక మివ భక్షితమ్. అధ్యా124. శ్లో 22.

మిత్రుల నుండి శాస్త్ర సమ్మతమయిన హితోపదేశాన్ని వినికూడా గ్రహించనివాడు ఆరగించిన తరువాత అరిగి దాహాన్ని కలిగించే ఇంద్రాయణ (కింపాక)(ముసిడి)ఫలం వలె పరిణా-మాంతంలో దుఃఖ దగ్ధుడవుతాడు. మూర్ఖుడు, అవివేకి అని గూడా కింపాక అనే పదానికి అర్థాలున్నాయి

శా. తోడం బుట్టిన భీమపార్థుల మహాదోర్దర్పముల్ లాఁతులై,
తో డంచుం బెఱవారి దుర్బలుల నెందుం జొచ్చి దైన్యంబునం

గూడం బెట్టెదు; నీవ పాండుసుతులం గుందింపఁగా సత్యముం
బాడిం దప్ప రొకప్పుడుం గినియ; రాబంధుత్వ మే లొల్లవో! 334

అ : తోడంబుట్టిన= సోదరులయిన; భీమపార్థుల=భీమార్జునుల; మహాదోర్దర్పముల్= గొప్పవయిన భుజబలగర్వాలు; లాఁతులై= పరాయివయి; ఎందున్+చొచ్చి= ఎక్కడెక్కడికోవెళ్ళి (వెతికి); పెఱవారిన్=ఇతరులను; దుర్బలులన్ = బలహీనులను; తోడు+ అంచున్ = సహాయమని; దైన్యంబునన్=దీనతతో; కూడంబెట్టెదు=పోగుచేసుకుంటున్నావు; నీవు+అ=నీవే; పాండుసుతులన్= పాండవులను; కుందింపఁగాన్=బాధపెట్టగా; (వారు) సత్యమున్ = సత్యాన్నీ; పాడిన్ = న్యాయాన్నీ; తప్పరు; ఒకప్పుడున్ = ఒక్కసారయినా; కినియరు= కోపించరు; ఆబంధుత్వము = ఆచుట్టరికాన్ని; ఏల = ఎందుకు; ఒల్లవో = అంగీకరించవో?

భా : తోబుట్టువులయిన భీమార్జునుల బాహుబలాలు నీకు పరాయి వయినాయి. ఎక్కడెక్కడో వెతికి వెతికి బలహీనులయిన పరాయివారిని సహాయం అనుకొని చాలా దీనస్థితిలో పోగుచేసుకుంటున్నావు. నీవు ఎన్నో సార్లు పాండవులను ఎన్నోరకాల బాధపెట్టినా వారు ఏనాడూ సత్యధర్మాలను వదలలేదు, నిన్ను కోపించలేదు. అలాంటివారి బాంధవ్యాన్ని ఎందుకు కాదంటున్నావు?

వి. సత్య ధర్మాలను వదలకపోవటం పాండవుల వైశిష్ట్యం. అలాంటివారే లోకుల ఆదరాభిమానాలను సంపాదించగలరు. తనవారిని పరాయి వాళ్ళుఅని అనుకోవటం పరాయి వాళ్ళను తనవాళ్లు అనుకోవటం అవివేకం; మూర్ఖత.

దుర్యోధనునికి హితం చెప్పటమే కాకుండా కృష్ణుడు ఆసభలోని వారికి పాండవుల మంచితనాన్ని; దుర్యోధనుని దుష్టత్వాన్నీ తెలుపుతున్నాడు.

ఉ. వారును మీరుఁ బొంది, జనవల్లభు లెల్లను భృత్యభావనం
జేర, సమస్తవస్తువులుఁ జేకుఱఁగా బ్రదు కొప్పుఁ గాక; నీ
కీరస మెత్తికోల్ గఱపి, యిప్పుడు కార్యము దప్పఁ జూచు నీ
వారలు - ముట్టవచ్చిన నవశ్యము నంతకుఁ జాలరుం జుమీ! 335

అ : జనవల్లభులు+ఎల్లను= రాజులందరూ; భృత్యభావనన్= సేవకభావంతో; చేరన్= దగ్గరకు రాగా; సమస్త వస్తువులున్; చేకుఱఁగాన్ = సమకూడగా; వారును = ఆపాండవులూ; మీరున్ = కౌరవులూ; పొంది = ఏకమై (కలిసి); బ్రదుకు= బ్రతకటం; ఒప్పున్+కాక = ఉచితమయి ఉంటుందిగాని; నీకు; ఈరసము+ఎత్తికోల్ = అసూయపడటం; కఱపి = బోధించి (నూరిపోసి); ఇప్పుడు; కార్యము = చేయదగినది (సంధి); తప్పఁజూచు = చెడిపోవాలనుకొనే; నీవారలు = నీవాళ్ళు; అవశ్యమున్ = తప్పక; ముట్టవచ్చినన్ = (యుద్ధంలో) ఎదిరించవలసివస్తే; అంతకున్= ఆసమయానికి (దానికి); చాలరున్+సుమీ = సరిపోలేరుసుమా?

భా : పాండవులూ, మీరూ కలిసిఉండగా, సమస్తరాజులూ సేవాభావంతో మీదగ్గరకు రాగా, సమస్తసంపదలూ సమృద్ధిగా లభించగా జీవించటం సముచితం. అంతేకాని నీకు అసూయాద్వేషాలు కలిగించి దుర్బోధలు చేసి ఇప్పుడు సంధికార్యాన్ని చెడగొట్టాలని చూసే నీవాళ్ళు అనివార్యంగా యుద్ధంవస్తే ఆసమయానికి ఎదుర్కోవటానికి సమర్థులు గారు సుమా!

ఆ. వీర కారు - పాండవేయులఁ బోర మా
ర్కొన సురాసురులకుఁ గొలఁది గాదు;
గాన వారితోడి కయ్యంబునకు నిర్ణ
యింప వలదు; సంధి పెంపుఁ జేయు. 336

అ : పాండవేయులన్=పాండవులను; పోరన్=యుద్ధంలో; ఎదుర్కొనన్ = ఎదిరించటానికి; వీర = ఈకౌరవులే; కాదు; సురాసురులకున్ = దేవదానవులకుగూడా; కొలఁది= శక్యం (సాధ్యం); కాదు; కాన=కాబట్టి; వారితోడి=ఆపాండవులతో; కయ్యంబునకు=యుద్ధానికి; నిర్ణయింప వలదు = నిశ్చయంచేయవద్దు; సంధి; పెంపుఁజేయున్ = అభివృద్ధి (గౌరవం) కలిగిస్తుంది.

భా : *పాండవులను యుద్ధంలో ఎదిరించటానికి ఈ కౌరవులకేకాదు, దేవదానవులకు గూడా శక్యం గాదు. కాబట్టి వారితో యుద్ధం చేద్దాం అని నిర్ణయం తీసుకోవద్దు. వారితో సంధి అభివృద్ధిని గౌరవాన్ని కలిగిస్తుంది.*

క. ఈ యున్నరాజు లందఱు
వాయుసుతున కొక్క యెత్తు; వాఁ డలిగిన శూ
లాయుధుఁడు వడఁకు; నా కౌం
తేయులతోఁ బెనఁగు టుడుగు ధీరవిచారా! 337

అ : ఈ+ఉన్నరాజులు = ఈసభలో ఉన్నరాజులు; అందఱు; వాయుసుతునకు = భీమునికి; ఒక్కయెత్తు = సమానము (ఒకసారికి చంపటానికి సరిపోతారు); వాఁడు = ఆభీముడు; అలిగినన్ = కోపిస్తే; శూలాయుధుఁడు = శివుడు గూడా; వడఁకున్ = వణికి పోతాడు; ధీరవిచారా= గంభీరమయిన (మూర్ఖమయిన) ఆలోచనగలవాడా; ఆకాంతేయులతోన్ = ఆపాండవులతో; పెనఁగుట = యుద్ధం చేయటం; ఉడుగు = మానుకో.

భా : *ఈ సభలో ఉన్నరాజులందరూ భీమునికి ఒక్కసారి చంపడానికి సరిపోతారు. అతనికి కోపంవస్తే శివుడే భయంతో వణికి పోతాడు. కాబట్టి ధీరవిచారా! పాండవులతో యుద్ధం చేయాలను కోవటం మానుకో!*

వి. దీనికి మూలం ఇలా ఉంది.
నహీమే సర్వరాజానః పర్యాప్తా స్సహితా స్త్వయా
క్రుద్ధస్య భీమసేనస్య ప్రేక్షితుం ముఖ మాహవే. అధ్యా124 శ్లో 47.

నీతో గూడా ఈరాజలోకం అంతా యుద్ధంలో కోపించిన భీముని ముఖం వైపుకూడా కన్నులు ఎత్తిచూడలేరు.

మూలం ఒక విధంగా తీవ్రతను సూచిస్తే తిక్కన రచన ఇంకోవిధమైన వైశిష్ట్యాన్ని వ్యక్తంచేస్తుంది.

క. ఒక కార్యము సెప్పెద మీ
సకల బలమునందు సవ్యసాచి కెదురుగా

నొకరుఁడు గలిగినఁ గయ్యము
నకుఁ బూనుఁడు రిత్త బహుజనక్షయ మేలా? 338

అ : ఒకకార్యము = ఒక చేయదగినపని;చెప్పెద = చెపుతాను; మీ సకల బలము నందు = మీకున్న సమస్త బలగంలోనూ; సవ్యసాచికి = అర్జునునికి; ఎదురుగాన్; ఒకరుఁడు = ఒక్కడు; కలిగినన్ = ఉంటే; కయ్యమునకున్ = యుద్ధానికి; పూనుఁడు = పూనుకోండి!; రిత్త = వ్యర్థంగా; బహుజనక్షయము = అనేకమానవుల నాశం; ఏలా = ఎందుకు?

భా : ఒకపని చెవుతా విను. మీవద్ద ఉన్న బలగం అంతటిలోనూ అర్జునుని ఎదిరించగలవాడు ఒక్కడైనా ఉంటే యుద్ధానికి సిద్ధంకండి. వృథాగా అనేక జనులను నాశనం చేయటం ఎందుకు?

క. **పెక్కండ్రు గోవులం గొని**
యుక్కు మిగిలి నడవ, వెనుక నుద్దవిడిం దా
నొక్కఁడ నరుఁ డేతెంచినఁ
జిక్కె సమస్తంబు; నది ప్రసిద్ధమ కాదే? 339

అ : (మీరు) పెక్కండ్రు చాలమంది; గోవులన్ = ఆవులను; కొని = పట్టుకొని (అపహరించి); ఉక్కుమిగిలి = పొగరెక్కి- అతిశయించి; నడవన్; వెనుకన్; ఉద్దవిడిన = వేగంగా; నరుడు = అర్జునుడు; తాన్ = తానుఒక్కఁడు; ఏతెంచినన్ = రాగా; సమస్తంబున్ = (సైన్యం) అంతా; చిక్కెన్ = (అతనికి) దొరికిపోయింది; అది = ఆవృత్తాంతం; ప్రసిద్ధము+అ = అందరికీ తెలిసిందే; కాదే = కాదా?

భా : ఉత్తర గోగ్రహణ సమయంలో మీరంతా గోవులను అపహరించి అహంకారంతో వెళ్ళుతుండగా అర్జునుడు తాను ఒక్కడే రాగా మీరూ, మీ సైన్యం అంతా ఆతని చేతిలో చిక్కింది. ఆ వృత్తాంతం జగత్ప్రసిద్ధంగదా!

క. **తోడు దొనలేని యప్పటి**
క్రీడి కొలఁది యట్టి; దధిప! కినియక విను మేఁ
దోడై రా నెదురుట గడుఁ
గీడు; వలవ దుడుగ వయ్య; గెలు పరిది సుమీ! 340

అ : తోడు దొన = ఎటువంటి సహాయమూ; లేని; అప్పటి = ఆనాటి; క్రీడికొలఁది= అర్జునుని శక్తి; అట్టిది = అలాంటిది!- అంతటిది!; అధిప = రాజా! కినియక = కోపించక; వినుము; ఏన్ = నేను; తోడై = సహాయమయి; రాన్ = రాగా; ఎదురుట = ఎదుర్కొనటం; కడున్ = మిక్కిలి; కీడు = ఆపద; వలవదు = (ఆపని) వద్దు; ఉడుగవయ్య = మానుకోవయ్యా!; గెలుపు; అరిది సుమీ = దుర్లభం సుమా!

భా : ఎటువంటి సహాయమూలేక ఒంటరిగా వచ్చిన అర్జునుని శక్తి సామర్థ్యాలు అంతటివి! దుర్యోధనా! కోపం తెచ్చుకోక విను. నేను ఆ అర్జునునికి సహాయమై రాగా

ఎదిరించటం మిక్కిలి ఆపత్కరం. అలాంటి సాహసం చేయకు. ఊరుకోవయ్యా! ఆ సమయంలో విజయం దుర్లభం సుమా!

వి. మద్ద్వితీయం పునః పార్థం కః ప్రార్థయితు మిచ్ఛతి
యుద్ధే ప్రతీప మాయాంత మపి సాక్షాత్పురందరః అధ్యా124 శ్లో 56
అనేది పై పద్యానికి ఆధారం.

తే. అనుజతనుజులఁ జెలులు వియ్యములు నడుగు
మాలి పోదురు నీకుఁగా మనుజనాథ!
దొరకుఁ గులనాశనుం డను దూఱు మేలె?
పాండవులతోడ నొడఁగూడి బ్రదుక వయ్య! 341

అ : అనుజులున్= తమ్ములూ; చెలులున్ = మిత్రులూ;వియ్యములున్ =చుట్టాలూ; మనుజనాథ =రాజా; నీకుఁగాక=నీవుకారణంగా; అడుగు కూలిపోదురు = మొదలంట సర్వనాశనం అయిపోతారు; దొరకున్ = రాజుకు; కులనాశనుండు = కులం అంతా నాశం చేసినవాడు; అను దూఱు = అనే నింద; మేలె = మంచిదా?; పాండవులతోడన్ ; ఒడఁగూడి= కలిసి మెలిసి ఉండి; బ్రదుకవయ్య = జీవించవయ్యా!

భా : దుర్యోధనా! నీకోసమని తమ్ముళ్ళూ, స్నేహితులూ, చుట్టాలూ సర్వనాశనం అయిపోతారు. రాజయినవానికి కులనాశకుడు అనే నింద రావటం మంచిదా? పాండవులతో కలిసి మెలిసి బ్రతుకవయ్యా!

ఉ. రాజ్యము భారమెల్ల ధృతరాష్ట్రుని యంద వెలుంగు చుండఁ ద
త్పూజ్యకుమారపట్టమున (బొల్చి చరింపఁగ నీవు పాండవుల్
సజ్యతఁ దండ్రి చిత్తము ప్రసన్నతఁ బొందఁగ గొల్చి యున్కి సా
మ్రాజ్యముగాఁ దలంతు; రనురక్తమతిం దమకుం ధరాధిపా! 342

అ : ధరాధిపా=రాజా!; రాజ్యము భారము+ఎల్లన్=రాజ్యభారం అంతా; ధృరాష్ట్రుని యంద = ధృతరాష్ట్రుని యందే; వెలుంగుచుండన్ = నిలిచిఉండగా; నీవు; తత్ పూజ్యకుమార పట్టమునన్= అ పూజింపదగిన యౌవరాజ్యపట్టంతో; పొల్చి = ఒప్పి (స్థిరపడి); చరింపఁగన్ = ప్రవర్తించగా; పాండవుల్; తండ్రిచిత్తము = తండ్రి అయిన ధృతరాష్ట్రునిమనస్సు; ప్రసన్నతన్; పొందఁగన్=పొందేటట్లు; సజ్యతన్ = ధనుస్సులు ఎక్కుపెట్టటంతో; అనురక్తమతిన్= అనురాగంతో గూడిన మనస్సుతో; కొల్చియున్కి=సేవిస్తూ ఉండటం; తమకున్; సామ్రాజ్యముగాన్; తలంతురు= భావిస్తారు.

భా : రాజా! రాజ్యభారం అంతా ధృతరాష్ట్రమహారాజే నిర్వహిస్తూ ఉండగా, నీవు యువరాజ పదవిలో కొనసాగుతూ ఉండగా, పాండవులు తండ్రి(ధృతరాష్ట్రుని)మనస్సు తృప్తి పొందేటట్లు ప్రేమాభిమానాలతో ధనుస్సులు ఎక్కుపెట్టుకొని రాజ్యం రక్షిస్తూ, సేవిస్తూ ఉండటమే తమకు సామ్రాజ్యంగా భావిస్తుంటారు.

వి. **త్వామేవ స్థాపయిష్యంతి యౌవరాజ్యే మహారథాః**
మహారాజ్యేపి పితరం ధృతరాష్ట్రం జనేశ్వరమ్. అధ్యాయం 124. శ్లో. 60

మహారథు లయిన పాండవులు నిన్నే యువరాజ పదవిలో స్థాపిస్తారు. మీతండ్రి ధృతరాష్ట్రుని మహారాజ పదవిలో నిలుపుతారు. ప్రస్తుత పద్యం మూలానికి మెరుగులు దిద్దుతూ సాగింది.

క. **కౌరవనాయక ! పాండుకు**
మారులు నీతోడిపొత్తు మనియెద మనఁగా
శ్రీ రా మోఁకా లొడ్డిన
వారి విధమ కాదె! నీవు వలదను టెల్లన్." 343

అ : కౌరవనాయక = కౌరవులకు నాయకుడా (దుర్యోధనా); పాండుకుమారులు = పాండవులు; నీతోడిపొత్తు = నీతోటిమైత్రితో; మనియెదము = జీవిస్తాము; అనగా; నీవు; వలదు;= వద్దు; అనుట; ఎల్లన్ = అంతా; శ్రీ = లక్ష్మీదేవి (సంపద); రాన్ = రాగా; మోఁకాలు; ఒడ్డినవారి= అడ్డపెట్టినవారి; విధము+అ = విధమే; కాదె = కదా!

భా : *దుర్యోధనా! పాండవులు నీతో కలిసి బ్రతుకుతాం అని అంటూ ఉంటే; నీవు వద్దనటం "సిరి రా మోకా లొడ్డిన" వారిలాగే ఉంది."*

వి. **మా తాత! శ్రియ మాయాంతీ మావమంస్థాః సముద్యతామ్**
అర్ధం ప్రదాయ పార్థేభ్యో మహతీం శ్రియ మాప్నుహి.

నీ ఇంటికి రావటానికి సిద్ధంగా ఉన్న రాజ్యలక్ష్మి నవమానించకు. పాండవులకు అర్ధరాజ్యం ఇచ్చి విశాల సంపదను అనుభవించు. అని 124 అధ్యా 61 శ్లో.

-: భీష్మ ద్రోణులు దుర్యోధనునకు హితంబు సెప్పుట :-
సం. 5-123-1.

చ. **అన విని భీష్ముఁ డిట్లనియె నాధృతరాష్ట్ర తనూజు తోడ; "నీ**
జనకుని మాట పట్టుము; ప్రసన్న మతిన్ మనవంశ మెల్లఁ బా
వనముగ నిందు వచ్చి బుధవత్సలుఁ డీహరి యిట్లు సెప్పఁగా
వినమిఁ గడుం జెడుందెరువు: వీరల పం పొనరింపు పెంపుగన్. 344

అ : అనన్; విని; భీష్ముఁడు; ఆధృతరాష్ట్ర తనూజు తోడన్ = ఆదుర్యోధనునితో; ఇట్లు; అనియెన్; నీజనకుని = నీతండ్రి యొక్క; మాట పట్టుము = అభిప్రాయాన్ని అవలంబించు; మనవంశము; ఎల్లన్ = అంతా; పావనముగన్ = పవిత్రమయ్యేటట్లు; బుధవత్సలుఁడు = పండితులయందు ప్రేమగల; ఈ హరి = ఈకృష్ణుడు; ఇందు = ఇక్కడికి; వచ్చి; ప్రసన్నమతిన్= ప్రసన్న మయిన మనస్సుతో; ఇట్లు = ఇలాగా; చెప్పఁగాన్; వినమి = వినక పోవటం; కడున్ = మిక్కిలి; చెడున్+తెరువు = చెడ్డదయినమార్గం; వీరలపంపు = ఇంతకుముందు వీరందరి ఆదేశాన్ని; పెంపుగన్ = గౌరవ పూర్వకంగా; ఒనరింపు = చేయుము.

భా : అని కృష్ణుడు చెప్పగా విని భీష్ముడు దుర్యోధనునితో ఇలా అన్నాడు. "మీతండ్రి అభిప్రాయాన్ని అనుసరించు. మనవంశం అంతా పవిత్రం అయ్యేటట్లు బుధవత్సలు డయిన ఈ శ్రీకృష్ణుడు ఇక్కడికి వచ్చి ప్రసన్న మయిన మనస్సుతో ఇంత విశదంగా హితం చెపితే వినకపోవటం చాలా చెడిపోయే రీతి; కాబట్టి ఇంతకు ముందు హితబోధ చేసిన వీరందరి ఆజ్ఞను గౌరవపూర్వకంగా తలదాల్చి అనుసరించు.

క. మానక ధృతరాష్ట్రుఁడు ప్రా
ణానం గలుగంగ, బంధు నాశము రాజ్య
శ్రీ నాశము, నుద్దామ య
శోనాశముఁ జేయ నేల చూచెదు చెపుమా? 345

అ : ధృతరాష్ట్రుఁడు; ప్రాణానం గలుగంగ = ప్రాణంతో (జీవించి) ఉండగా; మానక= విడువక; బంధు నాశమున్; రాజ్యశ్రీనాశమున్ =రాజ్యసంపద నాశనం కావటాన్ని; ఉద్దామ యశో నాశమున్=అధికమయిన కీర్తి నాశనాన్ని; చేయన్; ఏల; చూచెదు =చూస్తావు; చెపుమా= చెప్పు.

భా : ధృతరాష్ట్రుడు బ్రతికి ఉండగానే సమస్త బంధు నాశనాన్ని రాజ్యధ్వంసమూ; విశాలమయిన కీర్తి నాశనాన్ని పట్టు విడువక చెయ్యాలని ఎందుకు చూస్తున్నావు? చెప్పు.

వ. కృష్ణార్జునులతోడి విరోధం బీ బంధులోకంబునక కాదు; లోకంబున నెవ్వరికినిం జూడం బోలదు; లోకంబులు రెంటికిని హానిం జేయక, కూడి బ్రదుకుట మే' లనినఁ; దదనంతరంబ ద్రోణాచార్యుండు దుర్యోధనున కిట్లనియె. 346

అ : బంధులోకంబునక = చుట్టాలసమూహానికే; చూడన్ = పరిశీలించగా; పోలదు= తగదు; కూడి బ్రదుకుట = కలిసి జీవించటం; తదనంతరంబ = వెంటనే.

భా : కృష్ణార్జునులతో విరోధం ఈ బంధు వర్గానికే కాదు; బాగా ఆలోచిస్తే లోకంలో ఎవరికీ తగింది కాదు. ఇహలోకానికీ పరలోకానికీ కీడు చేయకుండా కలిసిమెలిసి జీవించటం మంచిది." అని అన్నాడు. వెంటనే ద్రోణాచార్యుడు దుర్యోధనునితో ఇలా అన్నాడు.

వి. కృష్ణ భీష్ముల మాటలు విన్న తరువాత దుర్యోధనుని ముఖం ఎలా ఉందో మూలంలో ఇలా ఉంది.

అథ ద్రోణో బ్రవీత్తత్ర దుర్యోధనమిదం వచః
అమర్షవశ మాపన్నం నిఃశ్వసంతం పునః పునః **అధ్యా 125. శ్లో 9.**

అప్పుడు దుర్యోధనుడు రోష పరవశుడై దీర్ఘనిశ్వాసాలు మాటిమాటికి విడుస్తున్నాడు. అలాంటి దుర్యోధనునితో ద్రోణుడు ఇలా అన్నాడు.

ఈ వర్ణనవల్ల దుర్యోధనుని స్వభావం వ్యక్త మవుతుంది. కృష్ణుడు చెప్పిన హేతు బద్ధములయిన మంచి మాటలు ఏవీ ఆతని తలకెక్కలేదు అంతేకాదు. తాతగారయిన భీష్మునిమాటలూ నిష్ప్రయోజనా లయ్యాయి. అయినా ఆశతో ద్రోణుడు చెప్పసాగాడు.

తే. "పితృపితామహ గురులమై ప్రీతిఁ గోరు
చున్నయట్టి పరమ హితోపదేశ
వాక్యములు విని దుర్జన వచన రచనఁ
గొనక బంధులతో నొడఁగూడి మనుము. 347

అ : పితృపితామహ గురులమై = తండ్రి తాత గురువులమయి; ప్రీతిన్ = సంతోషం (స్నేహం); కోరుచున్న+అట్టి= కోరుతున్నటువంటి; పరమహితోపదేశవాక్యములు = ఉత్తమమయిన మేలును తెలియజెప్పే మాటలు; విని; దుర్జన వచన రచనన్ = దుర్జనుల మాటల కూర్పును; కొనక=స్వీకరించక; బంధులతోడన్= చుట్టాలతో; ఒడఁగూడి = కలిసిమెలసి; మనుము = జీవించు.

భా : "మీ తండ్రి ధృతరాష్ట్రుడు; తాత భీష్ముడూ; గురువునైన నేనూ ప్రేమపూర్వంగా నీసంతోషాన్ని కోరేవాళ్ళం. అలాంటి ఉత్తమహితోపదేశం చేసే మామాటలను విను. దుర్మార్గుల తీయని మాటలు పాటించకు. చుట్టాలు అందరితో కలిసి మెలిసి జీవించు.

వి. స్వార్థానికి ఆస్కారం ఏమాత్రమూ లేనివారు పెద్దవాళ్ళు తండ్రి, తాత, గురువు. తండ్రి తన సంతానం క్షేమంగా ఉండాలని ఎల్లప్పుడూ కోరుకుంటాడు. తాత తనవంశం ఉత్తరోత్త రాభివృద్ధితో కలకాలం ఉండాలని కోరుకుంటాడు. గురువుకు రెండు వంశాలు ఉంటాయి.వాటిల్లో ఒకటి అందరితో సమాన మయినది పుత్రపౌత్రాది రూపమయిన వంశం. ఇంకొకటి విద్యావంశం. గురువు కీర్తి ప్రతిష్ఠలకు, విద్యావ్యాప్తికి ఆధారమైనది విద్యావంశం. దీనితో గురువు చిరంజీవి అవుతాడు. గురువుకు సంతతికంటే విద్యాసంతతి విశాలమయినదీ విశిష్ట మయినది. ఇహపరాలకు అది మూలకందం.

ఉ. వెన్నుఁడు ప్రీతిఁ జెప్పిన సవిస్తరవాక్ప్రచయంబు త్రోవఁ బో
వన్న! కుమార! యట్లయిన నాయువు శ్రీయును నీకుఁ గల్గు; మా
కన్నులు సల్లగా నకట గన్గొనుచుండుదు మేము; నట్లు గా
కున్నను నీవ నేర్తు-నిను నొండన నేరము నిండు కొల్వునన్." 348

అ : వెన్నుండు = శ్రీకృష్ణుడు; ప్రీతిన్ = స్నేహంతో; చెప్పిన; సవిస్తర... త్రోవ; సవిస్తం= సవివరమయిన; వాక్ప్రచయంబు = మాటలసమూహం యొక్క; త్రోవన్ = దోవలో; పోవన్న = వెళ్ళవయ్యా!; కుమార = వత్సా! అట్లు+అయిన = అలాగయితే; నీకున్ ఆయువు; శ్రీయును = సంపదా; కల్గున్; అకటా = ఆహా; ఏము = మేము; మా కన్నులు; చల్లగాన్; కన్గొనుచుండుదుము= చూస్తుంటాము; అట్లు=అలాగా; కాకున్నను = కాకపోతే; నీవు+అ = నీవే; నేర్తు = తెలుసుకుంటావు; నిండుకొల్వునన్=నిండు సభలో; నినున్= నిన్ను; ఒండు = మరొకమాట; అననేరము = అనలేము.

భా : నాయనా! దుర్యోధనా! శ్రీకృష్ణుడు ప్రేమతో స్నేహపూర్వకంగా వివరంగా చెప్పిన హితవచనాల ననుసరించి నడుచుకో! వత్సా! అలా చేస్తే నీకు దీర్ఘాయువూ, సర్వసంపదలూ లభిస్తాయి. ఆహా! అలా ఉన్న నిన్ను మేము మాకన్నులు చల్లగా చూస్తుంటాం. అలా చేయక పోతే ఏం జరుగుతుందో నీకే తెలుస్తుంది. ఈనిండుసభలో నిన్ను ఇంతకంటే ఎక్కువమాట అనలేం."

వి. ద్రోణుని మాటలలో ఆవేదన, ఆప్యాయత, బ్రతిమలాడటం మొదలయిన లక్షణాలు ఈపద్యంలో గోచరిస్తాయి. మంచిమాటలను సౌమ్యం అనే విషయం ఈసన్నివేశం సూచిస్తుంది.

" నినునొండన నేరము నిండు కొల్వునన్ " అనటం వల్ల దురభిమానపూరితుడైన దుర్యోధనునికి బ్రతిమిలాడి చెప్పితే మేలు కలుగుతుందేమో అని ద్రోణుని ఆశ. దుర్యోధనుడు యువరాజు పేరుతో మహారాజులాగా వ్యవహరిస్తున్నాడు. కర్ణుని అంగరాజ్య పట్టాభిషేకం నాటి నుంచీ క్రమంగా దుర్యోధనుడు అనుకున్న ప్రతిపనీ పట్టుదలతో నెరవేర్చుకుంటున్నాడని అందరికీతెలుసు. తాను గురువయినా ద్రోణుడు రాజసభలో విశిష్ట సభ్యుడు, సలహాలు చెప్పేవాడే కాని యువరాజును శాసించే అవకాశం లేనివాడు అనే విషయాన్ని గూడా పై వాక్యం సూచిస్తుంది.

ఈ పద్యంలో ద్రోణుడు "శిష్యవాత్సల్యంబు చెలువు దాల్చిన మూర్తి"గా కనిపిస్తాడు. దుర్యోధనుఁడు యుద్ధానికి పూనుకొనకపోతే ఆయన శిష్య సంతతి అంతా తామర-తంపరగా వర్ధిల్లుతుంది. వారి అభివృద్ధిని 'మా కన్నులు చల్లగా కనుగొను చుందుము' అంటాడు ఆయన. శిష్యుల సర్వతోముఖాభివృద్ధికంటే ఉత్తమ గురువుకు కావలసింది ఏమి ఉంటుంది?

అలా సంధికి అంగీకరించకపోతే ఏమవుతుందో ఆగురువు నోటితో చెప్పలేక పోయాడు. అందువల్లనే "అట్లుగాకున్నను నీవనేర్తు"అని చెప్పకుండా నీ అనుభవమే నీకు గురువు అవుతుంది అని అన్నాడు.

ద్రోణుని మాటల తరువాత విదురుడు కొంత తీవ్రంగా హెచ్చరికగా కొన్ని మాటలు చెప్పినట్లు మూలంలో అధ్యా 125 శ్లో 19,20,21 లలో ఇలా ఉంది.

"దుర్యోధనా! నీవిషయంలో నేను బాధపడటం లేదు. ముసలివాళ్ళు, నీతల్లి దండ్రులూ అయిన ఈ గాంధారీ ధృతరాష్ట్రుల భవిష్యత్తును ఊహించి బాధ పడుతున్నాను. దుష్టాత్ముడవైన నీవేదిక్కు అని నమ్ముకున్న వీరు మిత్రులూ, అమాత్యులూ నశించగా రెక్కలు తెగిన పక్షులులాగా దిక్కులేని వారై తిరుగుతారు. కులనాశకుడూ; పాపాత్ముడూ; దుర్మార్గుడవూ అయిన నిన్ను కన్నందుకు ఫలితంగా వీరు బిచ్చగాళ్ళయి ఈ భూమండలం అంతా తిరుగుతారు.'

ఈ విదురుని భవిష్యద్వాణిని దుర్యోధనాదులు గుర్తించలేక పోవటం విధివైపరీత్యం.

చ. అనవుడు నాంబికేయుఁడు నిజాత్మజు దిక్కు మొగంబు చేసి యి
ట్లను; "హరి నాశ్రయించి భవదగ్రజుఁ బుణ్యు నజాతశత్రునిం
గను మట వోయి; దీన మన కార్యము లన్నియు సిద్ధిఁ బొందు; నీ
తని పలు కాదరింపమిఁ బదంపడి పాటిలు నెల్ల చేటులున్." 349

అ : అనవుడున్ = అనగా; ఆంబికేయుఁడు = ధృతరాష్ట్రుడు; నిజ+ఆత్మజు దిక్కు= తనకుమారుని వైపు; మొగంబుచేసి = ముఖం తిప్పి; ఇట్లు; అనున్; హరిన్ = కృష్ణుని; ఆశ్రయించి; అటు = అక్కడికి (ఉపప్లావ్యానికి); పోయి; భవత్ + అగ్రజున్ = నీఅన్నఅయినవాడూ; పుణ్యున్= పుణ్యాత్ముడయిన; అజాతశత్రునిన్ = ధర్మరాజును; కనుము = చూడు; దీనన్ = ఇలా చేయటం వల్ల; మనకార్యములు+అన్నియున్ = మనపనులన్నీ; సిద్ధిన్+పొందున్ = సిద్ధిస్తాయి. ఈతని పలుకు=ఈకృష్ణుని మాట; ఆదరింపమిన్=ఆదరించకపోతే; పదంపడి = తరువాత; ఎల్లచేటులున్= సమస్తమయిన ఆపదలూ; పాటిలున్ = కలుగుతాయి.

భా : *అనగా ధృతరాష్ట్రుడు దుర్యోధనుని వైపు ముఖం తిప్పి ఇలా అన్నాడు. "దుర్యోధనా! నీవు శ్రీకృష్ణుని ఆశ్రయించు. మీ అన్నా, పుణ్యాత్ముడయిన ధర్మరాజును ఆ ఉపప్లావ్యనగరానికి వెళ్ళి దర్శించు. ఇలా చేయటంవల్ల మన పనులన్నీ నెరవేరుతాయి. ఈ కృష్ణుని మాట ప్రకారం నడుచు కోకపోతే తరువాత చాలా అనర్థాలు కలుగుతాయి."*

వి. సుసంహతః కేశవేన తాత గచ్ఛ యుధిష్ఠిరమ్
చర స్వస్త్యయనం కృత్స్నం భరతానా మనామయమ్.

నాయనా! కృష్ణునితో కలిసి నీవు ధర్మరాజు దగ్గరకు వెళ్ళు. సర్వశుభాలను పొందు. అందువల్ల భరతవంశీయులకు ఎలాంటి ఆపదా కలుగదు.

వ. అనియె నట్టియెడ గురుభీష్ము లొత్తి చెప్పం దలంచి గాంధారేయున కిట్లనిరి. 350

భా : *అని అన్నాడు. అప్పుడు ద్రోణుడు భీష్ముడు తమ ఉద్దేశం గట్టిగా నొక్కిచెపుదామని దుర్యోధనునితో ఇలా అన్నారు.*

క. "ఈ కృష్ణుని సారథ్యము
నాకృష్ణుని గాండివంబు నై తోఁపక ము;
న్నీ కొలఁదిఁ జక్కఁబడి నీ
వీ కురువంశంబు గావు మిభపురనాథా!" 351

అ : ఇభపురనాథా=హస్తినాపురరాజా దుర్యోధనా; ఈకృష్ణుని సారథ్యమున్; ఆ కృష్ణుని= అర్జునుని; గాండివంబును; ఐ = అయి (రెండూకలిసి); తోఁపకమున్న = కనిపించక ముందే; ఈ కొలఁదిన్ = ఈమాత్రంతో (ఈపరిమితితో); చక్కఁబడి=తృప్తిపడి; నీవు; ఈకురువంశంబు; కావుము= రక్షించు.

భా : *"దుర్యోధనా! ఈకృష్ణుని సారథ్యమూ, ఆకృష్ణుని (అర్జునుని) గాండీవమూ కలిసి యుద్ధరంగంలో కన్పించకముందే ఇంక ఈమాత్రంతో తృప్తిపడి ఈకురువంశాన్ని రక్షించు.'*

వి. ఇక్కడ మూలంలో "యావన్న" అనేదానితో ప్రారంభం అయ్యే ఎనిమిది శ్లోకాలు దుర్యోధనుని హెచ్చరించేవిగా ఉన్నాయి. ఇవి పరుషంగా ఉన్నా హితకరాలుగా ఉన్నాయి.

వ. అని పలికి మఱియు 352

భా : *అని చెప్పి ఇంకా ఇలా అంటున్నారు.*

సీ. "ధర్మపుత్రుని పదద్వయమున కతిభక్తి
నెఱఁగిన నతఁడు నిన్నెత్తి గ్రుచ్చి
నిడుఁగేలఁ బెద్దయుఁ దడవుగాఁ గౌఁగిలిం
పఁగ; భీముఁడును నీవుఁ బరమహర్ష
మునఁ జారుతరవక్షములు సంగతములుగాఁ

బరిరంభణం బొనర్పంగ; నరుఁడుఁ
గవలును మ్రొక్కినఁ గర మర్థిఁ దిగిచి నీ
వాలింగనంబు సేయంగ; నిట్లు

తే. వారు మీరును దగ బాంధవమునఁ బొదలి;
యింపు దళుకొత్తఁ దామరతంప రైన
జెలులుఁ జుట్టలుఁ గలిసి పేరెలమిఁ బొంది
యుల్లసిల్లంగఁ గుల మెంత యొప్పు నొక్కొ! 353

అ : (నీవు) ధర్మపుత్రుని = ధర్మరాజుయొక్క; పదద్వయమునకు = రెండు పాదాలకు; అతిభక్తిన్ = మిక్కిలిభక్తితో; ఎఱఁగినన్ = నమస్కరిస్తే; అతఁడు = ఆ ధర్మరాజు; నిన్ను; ఎత్తి = లేవదీసి; గ్రుచ్చి = ప్రేమతో గట్టిగాపట్టుకొని; నిడుఁగేలన్ = పొడుగైన చేతులతో; పెద్దయున్+తడవుగాన్ = చాలాసేపు అయ్యేటట్లు; కౌఁగిలింపఁగన్; భీముఁడును; నీవున్; పరమ హర్షమునన్ = మిక్కిలి సంతోషంతో; చారుతర వక్షములు = సుందరమయిన వక్షః స్థలాలు; పంగతములుగాన్ = బాగా కలిసేటట్లుగా; పరిరంభణంబు = కౌగిలించుకోవటం; ఒనర్పంగన్= చేయగానూ; కవలును=నకుల సహదేవులూ; మ్రొక్కినన్ = (నీకు)నమస్కరిస్తే; కరము = మిక్కిలి; అర్థిన్ = ప్రేమతో; తిగిచి= పైకిలాగి; నీవు ఆలింగనంబు; చేయన్=చేయగా; వారు= ఆపాండవులూ; మీరును = కౌరవులూ; తగన్ = సముచితమయిన; బాంధవమునన్ = చుట్టరికంతో; పొదలి = వర్ధిల్లి; ఇంపు=సంతోషం; తలుకొత్తన్ = కలుగగా; తామరతంపర+ఐన= మిక్కిలి అభివృద్ధి పొందితే; చెలులున్ = మిత్రులూ; చుట్టలున్ = బంధువులూ; కలిసి; పేరెలమిన్ = ఎక్కువప్రేమతో; ఉల్లసిల్లంగన్ = సంతోషించగా; కులము = కౌరవవంశం; ఎంత = ఎంతగా; ఒప్పును+ఒక్కొ = రాణిస్తుందోగదా!

భా : "నీవు భక్తి పూర్వంగా ధర్మరాజు కాళ్ళకు నమస్కరిస్తే ఆతడు నిన్ను లేవదీసి రెండు చేతులతో గట్టిగా దగ్గరకు లాక్కొని చాలాసేపు గాఢంగా కౌగిలించుకొనగా; భీముడూ నీవూ మహదానందంతో పరస్పరం వక్షః స్థలాలు బాగా కలిసేటట్లు కౌగిలించుకోగా; అర్జునుడూ నకుల సహదేవులూ నీకు నమస్కరిస్తే నీవు వారిని మమకారంతో లేవదీసి ఆలింగనం చేసుకోగా ఈ విధంగా వాళ్ళూ మీరూ బాంధవ్యంతో వర్ధిల్లి సంతోషంతో తామరతంపరగా అభివృద్ధిపొందితే అప్పుడు మిత్రులు బంధువులు కలిసి ప్రేమాదరాలతో ఉంటే ఈ కురువంశం ఎంతగా రాణిస్తుందోగదా!

వి. కౌరవపక్షంలో ఉన్నవారిలో అన్ని విధాలా ముఖ్యులు భీష్మ ద్రోణులు. వారు ఉభయ పక్షాల శాంతికోసం ఎంత తహతహలాడుతున్నారో ఈ సన్నివేశం సూచిస్తున్నది. ఆ ఇద్దరూ ఏక కంఠంగా సంధి ఆవశ్యకతను పలుమారులు నిరూపించారు. కౌరవుల ఈ మహాసభలో వారిరువురూ మరొకమారు ముక్త కంఠంగా రెండు పక్షాలు ఒక టైతే ఉండేవిశేషాలను వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత పద్యంలో వారి ఆశలు, ఆకాంక్షలు, ఊహలు ఆసభలోని వారికే గాక పాఠకులకు గూడా ఇంపుగా ఉంటాయి. కాని విధి వీటి నన్నిటిని పగటికలలు చేస్తుంది.

ఈ ఇరువురి ఈ కోరిక మూలంలో ఏడుశ్లోకాలలో విస్తరించి ఉంది.

క. సమరమునకు వచ్చిన భూ
రమణు లుభయకటకములను బ్రమదం బెసఁగం
దమ తమ పురములకుం బో
వ మహీజను లెట్టి యుత్సవముఁ బొందుదురో!" 354

అ : సమరమునకు = యుద్ధానికి వచ్చిన; భూరమణులు = రాజులు; ఉభయ కటకములను = రెండు సేనా పక్షాలలోనూ; ప్రమదంబు = సంతోషం; ఎసఁగన్ = వ్యాపించగా; తమతమ; పురములకున్ = పట్టణాలకు; పోవన్ = వెళ్లగా; మహీజనులు = భూమండలం మీదిజనులు; ఎట్టి+ఉత్సవమున్ = ఎలాంటి సంతోషాన్ని; పొందుదురో!

భా : *యుద్ధానికని వచ్చిన రాజులు ఇరు పక్షాల సేనలకూ సంతోషం కలిగేటట్లు తమతమ నగరాలకు వెళ్ళితే సమస్త భూ ప్రజలూ ఎంత సంతోష పడతారో గదా!"*

వి. యుద్ధం హింసా ప్రధానమయినది. సామాన్యప్రజలు ఎవ్వరూ ఎప్పుడూ యుద్ధాన్ని కోరరు. మహావీరులైన భీష్మద్రోణులు వృథాగా జరిగే హింసకు వ్యతిరేకంగా మాట్లాడుతూ వారి శాంతిప్రియతను మరొకసారి వ్యక్తీకరించారు.

వ. అని వెండియు ననేక విధంబులం జెప్పి "యీ రెండు దెఱంగుల వారును బంచి కుడిచి సుఖంబున్న నఖిలభూ ప్రజలకును బ్రమోదం బగుం గావున నట్లు సేసి యందఱ చేత దీవనలు వడయ వయ్యనీ" వనిన విని దుర్యోధనుం డప్పుండరీకాక్షు వీక్షించి యిట్లనియె. 355

అ : తెఱంగులవారును = పక్షాలవారూ; పంచి = పంచుకొని ; కుడిచి = అనుభవించి; ప్రమోదంబు = సంతోషం; ఆ+పుండరీకాక్షున్ = ఆకృష్ణుని; వీక్షించి = చూచి

భా : *అని భీష్మద్రోణులు ఇంకా అనేకవిధాలుగా చెప్పారు. "ఈరెండు పక్షాలవారూ రాజ్యం పంచుకొని అనుభవిస్తూ సుఖంగా ఉంటే సమస్తభూమండలప్రజలకూ సంతోషం కలుగుతుంది. కాబట్టి దుర్యోధనా! అలా చేసి అందరి ఆశీర్వాదాలూ పొందవయ్యా!" అని అన్నారు. వారు చెప్పింది అంతా విని దుర్యోధనుడు కృష్ణుని చూచి ఇలా అన్నాడు.*

క. "గురుఁడును బితామహుఁడు నీ
నరనాథుఁడు నెల్లప్రొద్దు నను దూఱుదు; రీ
ప్పరుసున నీవును దామో
దర! దూఱెదు; గాని తగవుఁ దలఁపవు కంటే! 356

అ : దామోదర = కృష్ణా!; గురుఁడును = ద్రోణుడూ; పితామహుఁడున్= తాతగారు భీష్ముడూ; ఈనరనాథుఁడును=ఈ రాజుగారూ; ననున్ = నన్ను; ఎల్లప్రొద్దున్ = ఎల్లప్పుడూ; దూరుదురు = నిందిస్తూ ఉంటారు; ఈ+పరుసునన్ = ఈ రీతిగా; నీవును; దూఱెదుగాని = నిందిస్తావుగాని; తగవు = న్యాయం; తలఁపవు = ఆలోచించవు; కంటే = చూశావా!

భా : *"కృష్ణా! ఈద్రోణాచార్యులవారూ, భీష్మపితామహుడూ, నాతండ్రి అయిన*

ఈ మహారాజూ ఎప్పుడూ నన్ను నిందిస్తుంటారు. ఇప్పుడు నీవుగూడా వాళ్ళవలెనే నిందిస్తున్నావు గాని న్యాయం ఆలోచించటం లేదు చూశావా!

వి. హితాన్ని చెప్పటం, తప్పులను ఎత్తి చూపటం, వాటిని సరి దిద్దుకో అని చెప్పటం మొదలయినవి భీష్మాదులు చేసినవి. అవి అన్నీ దుర్యోధనుని దృష్టిలో నిందించటం అన్నమాట.

క. **'వనితం బఱచి; రరణ్యం**
బున నిడుమలఁ బడితి' మనుచుఁ బోటరులై చం
పను జెఱుపఁ దలఁచి మాదెసఁ
గనలుదు రప్పాండుసుతు లకారణమ కడున్. 357

అ : వనితన్ = స్త్రీని (ద్రౌపదిని); పఱచిరి = అవమానించారు; అరణ్యంబునన్; ఇడుమలన్= కష్టాలను; పడితిమి; అనుచున్; ఆ+పాండు సుతులు = ఆపాండవులు; అకారణమ= నిష్కారణంగానే; కడున్ = మిక్కిలి; పోటరులై= శూరులై; చంపను = చంపటానికి; చెఱుపన్ = అవమానించటానికి; తలఁచి = ఆలోచించి; మాదెసన్ = మావిషయంలో; కనలుదురు= కోపిస్తారు.

భా : వారిభార్యను మేము అవమానించామనీ, తాము అడవిలో నానా కష్టాలూ పడ్డారనీ, ఆపాండవులు మహావీరులై నిష్కారణంగా మమ్ములను చంపాలనీ, కష్టపెట్టాలనీ అనుకొని మామీద ఎప్పుడూ కోపంతో ఉంటారు.

మ. **అరయం దప్పొక యింత నావలన లేఁ; దా ధర్మపుత్రుండు జూ**
దరివెంటం దమకించి సౌబలుని చేతన్ భూమి గోల్పోయి ము
ష్కరుఁడై వెండియు నొడ్డఁగా నతఁడు నక్షప్రౌఢిమై గెల్చెఁ;నే
తెరు వైనం దనయిచ్చతోఁ బడియె నింతే కాక యేఁ బూఁటయే? 358

అ : అరయన్ = సరిగా పరిశీలిస్తే; నావలనన్ =నావల్ల; తప్పు; ఒక యింత= కొంచె-మయినా; లేదు; ఆధర్మపుత్రుండు=ఆధర్మరాజు; జూదరివెంటన్=జూదరుల మార్గంలో; తమకించి= ప్రయత్నించి (తొందరపడి); సౌబలునిచేతన్ = శకునిచేతిలో; భూమి = రాజ్యం; కోల్పోయి= పోగొట్టుకొని; ముష్కరుఁడై = మూర్ఖుడై; వెండియున్ = మళ్ళీ; ఒడ్డఁగాన్ = పందెం కాయగా; అతఁడు= ఆశకుని; అక్షప్రౌఢిమైన్ =పాచికలాటలో గల ప్రావీణ్యంతో; గెల్చెన్= గెలిచాడు; ఏతెరవు+ఐనన్ =(పైవాటిలో) ఏపద్ధతి అయినా; తన+ఇచ్చతోన్ = తన ఇష్టంతోటే; పడియెన్ = పొందాడు; ఇంతేకాని; ఏన్ = నేను; పూఁటయే = (దీనికంతకూ); బాధ్యుడనా?

భా : బాగా అలోచిస్తే నావల్ల ఎలాంటి తప్పులేదు. ఆ ధర్మరాజు జూదరుల మార్గంలో (జూదంలో) మహోత్సాహంతో ప్రవేశించాడు. అందులో శకుని చేతిలో ఓడి రాజ్యం పోగొట్టుకున్నాడు. అయినా మూర్ఖుడై మళ్ళీ పందెం పెట్టాడు. శకుని జూదంలో తనకున్న నేర్పుతో గెల్చాడు. పైవాటిల్లో ఏదైనా ఆ ధర్మరాజు ఇష్టానుసారమే జరిగింది. ఇంతేకాని దీని కంతటికీ నేను బాధ్యుడ నెలా అవుతాను?

వి. ఏఁ బూటయే దీనికంతకూ నేను బాధ్యుడనా?అని ప్రశ్నిస్తున్నాడు దుర్యోధనుడు.

కాని ద్యూతంలో జరిగిన వాటిని జాగ్రత్తగా పరిశీలిస్తే దుర్యోధనుడే దీని కంతకూ కారణం అని తెలుస్తుంది.

తే. **మాత్స్య పాంచాల పాండ్యాది మనుజపతులఁ**
గూర్చికొని తార కయ్యంబు గోరి యెత్తి
విడిసి; రింతియ కాక; యివ్విధము నుగ్ర
కర్మమున కేము దొడఁగుట గలదె చెపుమ! 359

అ : తార = ఆపాండవులే; కయ్యంబు = యుద్ధం; కోరి; మాత్స్య.... పతులన్; మాత్స్య= మత్స్యదేశపురాజు (విరటుడు); పాంచాల=ద్రుపదుడు; పాండ్య= పాండ్యుడు; ఆది మనుజపతులన్ = మొదలయిన రాజులను; కూర్చికొని = సమకూర్చుకొని; ఎత్తి = పూనుకొని; విడిసిరి = దండెత్తారు; ఇంతియకాక= ఇంతేగాని; ఈవిధము = ఇలాంటి; ఉగ్రకర్మమునకు = భయంకరకార్యానికి; ఏము = మేము; తొడఁగుట=మొదలు పెట్టటం (ప్రయత్నించటం); కలదె = ఉందా?; చెపుమ= నీవే చెప్పు.

భా : *ఆపాండవులే యుద్ధం చేయాలనే కోరికతో విరాటుడు ద్రుపదుడు పాండ్యుడు మొదలయిన రాజుల నందరినీ సమకూర్చుకొని కావాలని దండెత్తిరావటానికి సిద్ధంగా ఉన్నారు. ఇంతేకాని మేము ఇలాంటి దుష్కృత్యాలకు చెడ్డపనులు చేయటానికి పూనుకుంటామా? నీవేచెప్పు.*

వి. "సమరమునకుఁ దగు నుద్యో
గమునఁ బ్రవర్తిల్లి రెలమిఁ గౌంతేయులు" 1.49ప.

"అట దుర్యోధనుండు వీరలచందంబు విని తానును దనబంధు మిత్ర గణంబైన రాజలోకంబు రావించిన;"1.ఆ.50ప

అని ఉద్యోగ పర్వాదిలో మొదట పాండవులు యుద్ధానికి సన్నద్ధులయినారనీ తరువాత దుర్యోధనాదులు సిద్ధమయినారనీ తెలుస్తుంది.

మూలంలోగూడా అధ్యా 5. శ్లో. 12; 15 వల్ల పై విషయం సూచిత మయిఉంది.

క. **ఉక్కఱి సురపతి కైనను**
మ్రొక్కము; నృపధర్మ మూఁది మొనతలఁ బడినన్
మిక్కిలి పేరును నిట దివి
నక్కజముగఁ బెంపుఁ బడయ నగుట నుపేంద్రా! 360

అ : నృపధర్మము = రాజధర్మం; ఊఁది = పూని(ఆశ్రయించి); మొనతలన్ = సేనముందుభాగంలో (యుద్ధంలో); పడినన్ = మరణిస్తే; ఇటన్ = ఈభూలోకంలో; మిక్కిలి పేరును= గొప్పకీర్తి; దివిన్ =స్వర్గాన్ని; అక్కజముగన్=ఆశ్చర్యకరంగా; అధికంగా; పడయనగుటన్= పొందవీలు(కాబట్టి) కావటంవల్ల; ఉక్కు+అఱి = గర్వంచెడి; సురపతికైనను= దేవతలకు ప్రభువయిన ఇంద్రునికయినా; మ్రొక్కము = నమస్కరించం.

భా : *కృష్ణా! రాజధర్మాన్ని అనుసరించి యుద్ధరంగంలో సేనాగ్రంలో ఉండి నేల*

గూలితే ఈలోకంలో కీర్తిప్రతిష్ఠలు కలుగుతాయి. పైగా అధికంగా వీరస్వర్గం లభిస్తుంది. కాబట్టి గర్వరహితులమయి సాక్షాత్తు ఆ ఇంద్రునికైనా సరే నమస్కరించం(తలవంచం).

వి. "ధర్మపుత్రుని పదద్వయమున కతిభక్తి నెఱఁగిన" అనే భీష్మద్రోణుల హితబోధ(353ప.) కు ప్రస్తుతపద్యం సమాధానం కావచ్చు.

"ఉక్కఱి నర పతికైనను మ్రొక్కము" అని ఆంధ్రమహాభారతనిఘంటువులో గలదు..

మూలంలో ఇలా ఉంది

నచాపి వయ ముగ్రేణ కర్మణా వచనేనవా
ప్రభ్రష్టాః ప్రణమామేహ భయాదపి శతక్రతుమ్ **అధ్యా 127. శ్లో 12**

మేము ఎవరిభయంకర కార్యాలవల్లగాని, భయానకవచనాలవల్లగాని భయపడి క్షత్రియ ధర్మచ్యుతులమై ఇంద్రుని ఎదుటగూడా తలవంచము.

చ. చిఱుతఁ దనంబునం దగవు చిత్తమునం దలపోయలేక ముం
దఱ యటువోవ నిచ్చితిఁ; బితామహుఁడున్ జనకుండు నింకఁ గ్ర
చ్చఱ నిలఁ బంచి చక్కసగ మక్కడ నెవ్వరికేని మద్బలం
బెఱుఁగక యీఁదలంచినను; నే నది యేటికి సమ్మతించెదన్? 361

అ : చిఱుతఁదనంబునన్ = చిన్నతనంలో; తగవు = న్యాయం (ధర్మ); చిత్తమునన్= మనస్సులో; తలపోయలేక = వివేచించలేక; ముందఱ = ఇంతకుముందు; అటు = ఆప్రకారంగా; పోవనిచ్చితిన్ = పోనిచ్చాను; పితామహుఁడున్ = తాతగారు భీష్ముడూ; జనకుండున్ = తండ్రీ; ఇంకన్ = ఇకమీద; మద్బలంబు = నాబలం; ఎఱుఁగక = తెలియక; క్రచ్చఱన్ = త్వరగా; అనాలోచితంగా; ఇలన్ = భూమిని; చక్కసగము = సరిగా సగం; అక్కడన్ = ఆ పక్షంలో; ఎవ్వరికేని= ఎవరికయినా; ఈన్ + తలంచిననున్ = ఇయ్యాలి అని అనుకొన్నా; ఏను = నేను; అది = ఆవిధానాన్ని; ఏటికి సమ్మతించెదన్ = ఎందుకు ఒప్పుకుంటాను?

భా : చిన్నతనంలో ధర్మంన్యాయం సరిగా తెలుసుకోలేక పూర్వం (ధర్మరాజు రాజ్యం పొందటాన్ని)అలా జరగనిచ్చాము. ఇంక ఇప్పుడు నాబలపరాక్రమాలు తెలియక మాతాత, తండ్రి అనాలోచితంగా తొందరపడి అర్ధరాజ్యం ఎవరికయినా ఇవ్వాలని అనుకొన్నా నేను దానికి ఎందుకు అంగీకరిస్తాను.?

వి. దీనికి మూలంలో ఇలా ఉంది.

యావచ్చ రాజా ధ్రియతే ధృతరాష్ట్రో జనార్దన
న్యస్తశస్త్రా వయం తే వా ప్యుపజీవామ మాధవ. అధ్యా 127. శ్లో. 23

కృష్ణా! ధృతరాష్ట్ర మహారాజు జీవించి ఉన్నంతవరకు మేమూ, పాండవులు శస్త్రధారణచేయకుండా శాంతిపూర్వకంగా జీవించాలి.

"మానక ధృతరాష్ట్రుఁడు ప్రాణానంగలుగంగ" (345) అనేదానికి ఇది దుర్యోధనుని సమాధానం.

చిన్నప్పుడు వీరంతా రాజ్యం పంచి నాకు ద్రోహంచేశారు. ఇప్పుడు అలా జరుగనివ్వను. అని దుర్యోధనుని నిర్ణయం.

తే. తొంటి చవి గని, యిప్పుడుఁ దోఁచి పాండు
సుతులు రాజ్యంబు సేయంగఁ జూచినారు;
నాకు నీఁదీఱునే? యింక నాఁటి చూఱ
లెక్కడివి? ద్రోణభీష్ము లీ దిక్కు సుమ్ము. 362

అ : పాండుసుతులు = పాండవులు; తొంటిచవి = వెనకటిరుచి; కని = చూసి; ఇప్పుడున్; తోఁచి = కనపడి(బయటపడి); రాజ్యంబుచేయంగన్+చూచినారు = రాజ్యం చేయాలని చూశారు; నాకున్; ఈన్+తీఱునే = ఇవ్వటానికి వీలుపడుతుందా?; ఇంకన్ = ఇంకా; నాఁటిచూఱలు = ఆనాటిదోపిడీలు; ఎక్కడివి =ఎక్కడున్నాయి?; ద్రోణభీష్ములు; ఈదిక్కుసుమ్ము= ఈపక్షంలో ఉన్నారు సుమా!

భా : ఈపాండవులు వెనక రుచిమరిగిన వారు కాబట్టి అది గుర్తువచ్చి అజ్ఞాత వాసంలోనుంచి బయటపడి రాజ్యంచేయాలని చూశారు. కాని రాజ్యం ఇవ్వటానికి నాకు వీలుపడుతుందా? ఇంకా ఆనాటి దోపిడీలు (కొల్లగొట్టడాలు) ఎక్కడ ఉన్నాయి? మహావీరులయిన ద్రోణభీష్ములు మా పక్షంలో ఉన్నారుసుమా!

వి. పాండవులు అర్ధరాజ్యం దోపిడీగా తీసుకున్నప్పుడు ద్రోణభీష్ములు ఎటువైపు ఉన్నారో దుర్యోధనునికి అర్థంకాలేదు. అందువల్ల అప్పుడు ఊరుకున్నాడు. కాని పాండవులు అరణ్యాజ్ఞాతవాసాలు చేశాక భీష్మద్రోణులు తనవైపు ఉన్నారని నిర్ణయం చేసుకుని రాజ్యభాగం ఇవ్వను అని తెగేసి చెపుతున్నాడు.

ఉ. ఏమును వారుఁ బంచికొని యేలుట గల్గదు; పల్కకుండు మిం
కేమియు! వాఁడిసూదిమొన యించుక మోపిన యంతమాత్రయున్
భూమి యొనర్చి పాండునృపపుత్రుల కిత్తునె? యెవ్వరైన సం
గ్రామమునం జయింబుగొని రాజ్యము సేయుట నిశ్చయించితిన్."363

అ : ఏమును=మేమూ; వారున్=ఆపాండవులూ; పంచికొని=రాజ్యం భాగం పంచుకొని; ఏలుట = పాలించటం; కల్గదు = సంభవించదు; ఇంక; ఏమియున్ = ఏమీ; పల్కకుండుము = మాట్లాడకు; వాఁడి =పదునయిన; సూదిమొన; ఇంచుక = కొద్దిగా; మోపిన+ అంతమాత్రయున్= ఆనించినంతమాత్రమయినా; భూమి; ఒనర్చి=పంచి; పాండునృపపుత్రులకు= పాండవులకు; ఇత్తునె=ఇస్తానా?; ఎవ్వరైనన్=(మారెండుపక్షాలలో) ఎవరయినా; సంగ్రామమునన్= యుద్ధంలో; జయంబు+కొని = జయాన్ని పొంది; రాజ్యము; చేయుట; నిశ్చయించితిన్.

భా : మేమూ, పాండవులు రాజ్యం పంచుకొని పరిపాలించటం అసంభవం. ఆవిషయంలో ఇంకేమీ మాట్లాడకు. పదునయిన సూదిమొన ఆనించితే వచ్చేటంత మాత్రమయినా భూమిని పంచి పాండవులకు ఇస్తానా? వాళ్ళయినా మేమయినా యుద్ధంలో జయించి రాజ్యం చేయాలి అని నిశ్చయించాను."

వి. దుర్యోధనుని రాజసానికీ, అహంకారానికీ, మూర్ఖత్వానికీ, పాండవద్వేషానికీ ఈపద్యం ముఖ్యోదాహరణం.

ధ్రియమాణే మహాబాహౌ మయి సంప్రతి కేశవ
యావద్ధి తీక్ష్ణయా సూచ్యా విధ్యే దగ్రేణ కేశవ
తావ ద ప్యపరిత్యాజ్యం భూమేర్నః పాండవాన్ప్రతి. అధ్యా. 127.శ్లో. 25

కేశవా! ఇప్పుడు నేను బ్రతికి ఉండగా పాండవులకు వాడిసూదిమొనతో ఛేదించదగిన భూభాగంగూడా ఇవ్వటానికివీలుగాదు.

తే. అనిన విని కిన్కఁ బూనిన యలఁతినగవు
చెలువు మొగమున కొక క్రొత్త పొలు పొనర్పఁ
బుండరీకాక్షుఁ డగు టెల్లఁ బోయి యప్పు
డరుణ కమలాక్షుఁ డగుచు మురాంతకుండు. 364

అ : అనిన; విని; కిన్కన్+పూనిన = కోపంధరించిన; అలఁతినగవుచెలువు = చిన్ననవ్వుయొక్క సౌందర్యం; మొగమునకు= ముఖానికి; ఒకక్రొత్త; పొలుపు =అందాన్ని; ఒనర్పన్= తెచ్చిపెట్టగా- కలిగించగా; పుండరీకాక్షుఁడు = తెల్లతామరపూలవంటి కన్నులు కలవాడు; అగుట= కావటం; ఎల్లన్ = అంతా; పోయి అప్పుడు; మురాంతకుండు = మురాసురుని చంపిన-కృష్ణుడు; అరుణకమల+అక్షుఁడు = ఎఱ్ఱతామరపూలవంటి కన్నులు కలవాడు; అగుచు= అవుతూ.

భా. *ఆమాటలు విని కోపంవల్ల కలిగిన చిన్న నవ్వు అందం కృష్ణుని మొగానికి ఒక కొత్త విలాసాన్ని తెచ్చి పెట్టింది. అప్పుడు తెల్లదామరపూలవంటి కన్నులు గల కృష్ణుడు ఎఱ్ఱదామర పూలవంటి కన్నులు కలవాడు అవుతూ.....*

వి. కోపోద్రేకం వల్ల కన్నులు ఎఱ్ఱబడుతవి అంటారు. ఇంతవరకు శ్రీకృష్ణుడు ప్రసన్నుడుగా ఉన్నాడు. అందువల్ల ఆయనకన్నులు తెల్లగా ఉన్నాయి. కాని కౌరవ మహాసభలో జంకుగొంకులు లేకుండా ఎటువంటి సంకోచంగూడా లేకుండా దుర్యోధనుడు తన తప్పు ఏమీ లేదనీ; ధర్మరాజుదే అంతా తప్పనీ; పాండవులు నిష్కారణంగా తనపైన కక్ష కట్టారనీ చెప్పే సరికి కృష్ణునికి వల్లమాలినంత కోపం వచ్చింది. అందువలననే కన్నులలో ఉన్న తెల్లదనం అంతా పోయి ఎఱ్ఱదనం వచ్చింది. నవ్వులోగూడా కోపం వ్యక్తమయింది.

తిక్కన పాఠకుల మనోనేత్రాలకు తానువర్ణించే పాత్రలను ఎదుట నిలుపుతాడు. ఈ లక్షణం ఆయన మహాకవి అనటానికి ఒకప్రబల ప్రమాణం. ఈ పద్యంలో రెండు విషయాలను చెప్పి కవి కృష్ణుని పాఠకుల కన్నుల ఎదుట నిలిపాడు. కోపంతో గూడిన చిన్న నవ్వు ఆ కృష్ణుని ముఖానికి క్రొత్త అందాన్ని చేకూర్చిందిట. కోపం వచ్చినా కృష్ణునిముఖం అందం చిందుతూ ఉంది. రంగస్థలంలో మహానటులు మాత్రమే ఈ భావాన్ని ముఖంలో అందంగా చూపగలరు. అదిచూచి ప్రేక్షకులు పరవశిస్తారు.

రెండోది పుండరీకాక్షుడు అరుణ కమలాక్షుడు కావటం. ఇది ఎంతటి మహానటుని ముఖంలో గూడా కనిపించదు. చర్మచక్షువులకు గోచరం కానిది ఈ విషయం కాబట్టి భావుకుడైన పాఠకుడు మనో నేత్రంతో కవి అందించిన దానిని దర్శించి పరవశుడవుతాడు.

-: శ్రీకృష్ణుఁడు దుర్యోధనునితో మున్నతండు సేసిన దుర్ణయంబు సెప్పుట :-
సం.5-126-1

క. మొనతలఁ బడియెదు; నీచె
ప్పిన యట్టుల తడవు లేదు; బిరుదులరై నీ
వును వీరు నిలువుఁ; డిదె భం
డన మెల్లియ వచ్చె; నూఱటలు గనుఁ డింకన్. 365

అ : నీచెప్పినయట్టుల = నీవుచెప్పినట్లే; మొనతలన్ = (యుద్ధంలో) సేనముందు భాగంలో; పడియెదు = పడతావు (మరణిస్తావు;)(అందుకు) తడవు = ఆలస్యం; లేదు; నీవును; వీరున్; బిరుదులరై = శూరులై; నిలువుఁడు = నిలవండి; ఇదె = ఇదిగో; భండనము = యుద్ధం; ఎల్లియ = రేపే; వచ్చెన్ = వచ్చింది; ఇంకన్; ఊఱటలు = ఓదార్పులు ఉపశాంతులు; కనుఁడు= పొందండి.

భా : *"దుర్యోధనా! నీవు చెప్పినట్లే యుద్ధంలో సేనాగ్రంలో నేల గూలుతావు. ఇంక ఆలస్యం లేదు. నీవూ, వీళ్లూ వీరులై నిలవండి. ఇదిగో యుద్ధం రేపే వస్తుంది. ఇక ఊరుకోండి. శాంతించండి.*

వి : దుర్యోధనుడు "..................నృపధర్మమూఁది మొనతలఁబడినన్
మిక్కలి పేరును నిట దివి
నక్కజముగఁబెంపుఁబడయనగుట" (360)
అని చెప్పాడు. దానినే కృష్ణుడు భంగ్యంతరంగా చెవుతున్నాడు.

సీ. అరయంగఁ దప్పు లే దంటి నీవలనఁ; గీ
డొకనాఁడు సేసియు నొక్కనాఁడు
సేయవు? నీజనించిన యది యాదిగా
నుడుగక పాండవేయులకుఁ జాల
నెగ్గు సేసితి; విషమిడి పెనుఁబాముల
గఱపించి నీరిలోఁ గట్టి త్రోచి
లక్కయిల్ గాలిచి పెక్కుభంగులఁ జంపఁ
దలఁచినఁ జావక ధర్మరక్షఁ
ఆ. జేసి నెగడి రాచసిరి నొంది యున్నఁ జూ
పోప కీవు తీవ్ర పాపబుద్ధిఁ
గనలి జూద మొకటి కల్పించి కపటంబు
సేయ దాన నెల్ల చేటుఁ బుట్టె! 366

అ : అరయంగన్ = పరిశీలించగా; నీవలనన్; తప్పు;లేదు అంటి = అన్నావు; కీడు=

అపకారము; ఒకనాఁడు; చేసియున్; ఒక్కనాఁడు; చేయవు = చేయలేదు?; నీజనించినయది = నీవుపుట్టినది; ఆదిగాన్ = మొదలుగా; ఉడుగక = మానక; పాండవేయులకున్ = పాండవులకు; పెనుఁబాములన్ = పెద్దపాములతో; కఱపించి = కరిపించీ; కట్టి =(త్రాళ్ళతో) బంధించీ; నీరిలో; త్రోచి = త్రోసీ; లక్కయిల్ = లక్కయిల్లు; కాలిచి = కాల్చీ; చాల; ఎగ్గు = కీడు;చేసితి = చేశావు; (ఇంకా) పెక్కుభంగులన్ = అనేవిధాలుగా; చంపన్; తలఁచినన్; (పాండవులు) చావక; ధర్మరక్షన్ చేసి = ధర్మదేవత రక్షించటంవల్ల; నెగడి = కీర్తినంది; రాచసిరిన్ = రాజ్యలక్షిని; ఒంది+ఉన్నన్= పొంది ఉండగా; నీవు; చూపోపక = ఓర్చుకోలేక; తీవ్రపాపబుద్ధిన్ = తీవ్రమయిన దురాలోచనతో; కనలి = కోపించి; జూదము; ఒకటి; కల్పించి; కపటంబు చేయన్ = కుట చేయగా; దానన్ = ఆజూదంవల్ల; ఎల్లచేటు = సమస్తమయిన కీడూ; పుట్టెన్ = కలిగింది.

భా : *బాగా ఆలోచిస్తే నీవల్ల ఏతప్పూ లేదన్నావు. నీవు పాండవులకు కీడు ఒకనాడు చేసీ ఇంకొకనాడు చేయకుండా ఉన్నావా? నీవు పుట్టింది మొదలు విడవకుండా పాండవులకు చాలా ఆపదలు కలిగించావు. విషం పెట్టించావు; పెద్ద పాములతో కరిపించావు. తాళ్ళతో కట్టి నీళ్ళలో త్రోయించావు. లక్క ఇల్లు కాల్పించావు. ఇంకా అనేక విధాలుగా వారిని చంపజూశావు. అయినా వారు ధర్మదేవత రక్షించటంచేత మరణించక అభివృద్ధిపొంది రాజ్యం సంపాదించుకొని ప్రశాంతంగా ఉన్నారు. వారి ఉన్నతిని చూచి సహించలేక నీవు తీవ్రమైన దుర్బుద్ధితో సంతాపం చెంది, క్రోధంతో జూదం ఒకటి కల్పించి కుట చేశావు. దానివల్లనే అనేకదుష్పరిణామాలు ఏర్పడ్డాయి.*

వి. ఇంతకుముందు దుర్యోధనుడు, అరయం దప్పొకయింత నావలనలేదు."(358) అని అన్నాడు. అందుకు కృష్ణుడు దుర్యోధనుడు చేసిన తప్పులు ఆసభలో చెవుతున్నాడు. వాటిల్లో నాలుగు ముఖ్యమయినవి.

1. భీమునికి విషాన్నంపెట్టటం ఆది.5.ఆ.178;179.
2. భీముని పాముల చేత కరిపించటం. ఆది.5.ఆ.175 నుండి 177
3. భీముని త్రాళ్ళతో గట్టి గంగలోకి నెట్టటం. ఆది.5.ఆ.170 నుండి 173
4. లాక్షాగృహదహనం. ఆది.6.ఆ. 158నుండి 168 వరకు.

దుర్యోధనునికి ప్రధానశత్రువు భీముడు కావటం వల్ల పాండవపక్షాన్ని బలహీనం చెయ్యాలి అంటే భీముని చంపటమే ముఖ్యం అని అతని ఉద్దేశం. అందువల్లనే దుర్యోధనుని దుష్కార్యాలలో అవి ఎక్కువ.

తే. అన్నదమ్ముల నెత్తంబు లాడి, సతుల
తలలు వట్టి సభాస్థలంబులకు నీడ్చి
చీర లొలిపింతురే? యిట్టి వారి నెందుఁ
దడవుమా నీ వొకండవు దక్క నధిప ! 367

అ : అన్నదమ్ములన్=(ఎవరయినా) అన్నదమ్ములతో; నెత్తంబులు = జూదాలు; ఆడి; సతుల తలలు= (వారి) భార్యల తలలను (జుట్టును); పట్టి; సభాస్థలంబులకున్; ఈడ్చి; చీరలు+ ఒలిపింతురే = వస్త్రాపహరణం చేస్తారా?; అధిప = రాజా!; నీవు; ఒకండవు =ఒక్కడివి; తక్క =

తప్పు; ఇట్టివారిని = ఇలాంటివారిని; ఎందున్ = ఎక్కడయినా; తడవుమా = (ఉన్నారేమో) వెల్లడించు; ప్రకటించు.

భా : *దుర్యోధనా ! ఎవరయినా అన్నదమ్ములతో జూదాలాడి వారి భార్యలను జుట్టు పట్టుకొని సభాస్థలాలకు లాక్కొని వచ్చి వస్త్రాపహరణం చేస్తారా? నీవు ఒక్కడివి తప్ప ఎక్కడయినా ఇలాంటివారు ఉన్నారేమో చెప్పు; చూద్దాం!*

వి. భారతీయ వాఙ్మయంలోనే కాదు. బహుశః ప్రపంచసాహిత్యంలోనే సోదరపత్నిని మహాసభామధ్యంలో వివస్త్రను చేయటానికి ప్రయత్నించటం అనే నీచకార్యం జరిగినట్లు తెలియరాదు. దుర్మార్గులయిన రావణాదులు గూడా ఇలాంటి క్షుద్రకార్యం చేయలేదు. దుర్యోధన, దుశ్శాసనాదులకే ఆదుష్కీర్తి దక్కింది.

ఉ. అప్పుడు నీవుఁ గర్ణుఁడును నాడిన మాటలు గొల్వులోపలం
జెప్పెడు నట్టివే? కులము శీలము గల్గిన పుణ్యకాంత క
ట్లొప్పమి చేయు టెల్లఁ గని, యున్న జనంబులు వించు నుండగాఁ
దప్పొక యింత లే దనువిధం బది నీక చనున్ సుయోధనా! 368

అ : అప్పుడు; నీవున్; కర్ణుఁడున్; ఆడినమాటలు=పలికినపలుకులు; కొల్వులోపలన్ = నిండుకొలువులో; చెప్పెడు నట్టివే = చెప్పదగినవేనా?; కులము; శీలము; కల్గిన; పుణ్యకాంతకు = పవిత్రురాలయిన స్త్రీకి; అట్లు = అలా; ఒప్పమి = పరాభవం; చేయుట= చేయటం; ఎల్లన్ = అంతా; కని = చూసి; ఉన్నజనంబులు = (ఆసభలో) ఉన్నజనులు; (కనియున్నజనంబులు = అనాడు ఆదృశ్యంచూసి; ఈనాడు సభలో ఉన్నజనులు); వించు నుండఁగాన్= వింటూ (కూర్చొని) ఉండగా; (నావలన) తప్పు; ఒక+ఇంత = ఏమాత్రమూ; లేదు; అనువిధంబు= అనేమాటతీరు; అది; సుయోధనా; నీకు+అ = నీకే; చనున్ = తగును; చెల్లుతుంది.

భా : *అప్పుడు ఆ సభలో నీవూ, కర్ణుడూ అన్నమాటలు ఇలాంటి సభలో చెప్ప దగినవేనా? ఉత్తమకులంలో పుట్టి ఉత్తమశీలం గల పవిత్ర స్త్రీ (ద్రౌపది) ని అలా పరాభవించటం అంతా అప్పుడు కన్నులార చూచి ఇప్పుడు ఈసభలో ఉన్నవారు అందరూ వింటూ ఉండగా నావల్ల ఏతప్పూ లేదనటం; దుర్యోధనా! నీకేచెల్లును.*

వి. ద్యూతసభలో దుర్యోధనుడు ద్రౌపది దాసీజనంతో కలిసి తన ఇల్లు ఊడవాలి అని అనటం; ఆమెను సభలోకి లాక్కొని రమ్మని దుశ్శాసనునికి చెప్పటం; వస్త్రాపహరణం చెయ్యమని తమ్ముని ప్రోత్సహించటం మొదలయినవి దుర్యోధనుడు ఆడినమాటలు. ద్రౌపది అధర్మ విజిత అని నిర్ణయించిన వికర్ణుని మాటలు సత్యదూరాలు అనటం; ద్రౌపదిని బంధకి (వేశ్య) అని అనటం మొదలయినవి కర్ణుడు ఆనాడు నిండు కొలువులో ఆడినమాటలు.

ద్రౌపదీ పరాభవం జరిగేటప్పుడు ద్యూతసభలో ఉన్న వారందరూ శ్రీకృష్ణుని రాయబారం సభలో గూడా ఉన్నారు.

తే. "ఎత్తి విడిసిన వార" ని యెల్లతప్పుఁ
బాండవుల మీఁదఁ బెట్టిన బ్రదుకు గలదె?

ద్రోణభీష్ములుఁ దండ్రియుఁ దోడుతోడఁ
జెప్పు తగుమాట లేమియుఁ జెవులు సొరవు. 369

అ : ఎత్తివిడిసినవారు = సైన్యాలతో దండెత్తివస్తున్నారు; అని; ఎల్లతప్పున్ = తప్పంతా; పాండవుల మీదఁన్; పెట్టినన్=పెడితే; బ్రతుకు; కలదే=ఉంటుందా?; ద్రోణభీష్ములు; తండ్రియున్ = ధృతరాష్ట్రుడూ; తోడు తోడన్= వెంటవెంట; వరుసగా; చెప్పు= చెప్పేటటువంటి; తగుమాటలు =యోగ్యమయిన మాటలు; ఏమియున్ =ఏవీ; చెవులు=చెవులలో; చొరవు = ప్రవేశించవు.

భా : *సైన్యాలతో దండెత్తుతున్నా రని పాండవుల మీద తప్పంతా పెట్టి బ్రతికిపోయా ననుకుంటున్నావా? ద్రోణుడూ, భీష్ముడూ, నీ తండ్రి ధృతరాష్ట్రుడూ ఆయా సమయాలలో చెప్పిన సముచితా లయిన మంచిమాటలు నీ చెవులతో ఎప్పుడయినా విన్నావా?*

క. **శాంతిం బొందుట నీకుం**
గుంతీపుత్రులకు మే లగున్; దానిక యే
నింతయు నాడెద నది నీ
కెంతయు రుచియింప కునికి యెఱిఁగి యెఱిఁగియున్" 370

అ : శాంతిన్+పొందుట=శాంతించటం; (ఓర్పువహించటం); నీకున్; కుంతీ పుత్రులకున్ = పాండవులకూ; మేలు; అగున్; అది = ఆ శాంతించటం; నీకు; ఎంతయున్= ఏ మాత్రమూ; రుచియింపకునికి = రుచించకపోవటం; ఎఱిఁగి+ ఎఱిఁగియున్ = బాగా తెలిసికూడా; దానికి+అ =ఆశాంతి కల్పించటానికే; ఏను=నేను; ఇంతయున్=ఇదంతా; ఆడెదన్ = చెవుతున్నాను.

భా : *శాంతించటం నీకూ పాండవులకూ చాలా మంచిది. అది నీకు ఏమాత్రమూ ఇష్టంలేదని బాగా తెలిసికూడా దాని కోసమే నేను ఇదంతా చెపుతున్నాను."*

వ. అని యిట్లు నారాయణుండు నానా ప్రకారంబులం జెప్పుటకుఁ గటకటం బడియెడు దుర్యోధనునకు దుశ్శాసనుం డిట్లనియె. 371

అ : కటకటంబడియెడు = బాధపడుతున్న; కోపిస్తున్న.

భా : *అని ఇలాగా కృష్ణుడు అనేక విధాలుగా చెప్పాడు. ఆమాటలు విని కోపిస్తున్న బాధపడుతున్న దుర్యోధనునితో దుశ్శాసనుడు ఇలా అన్నాడు.*

మ. **"జనకుండున్ గురు భీష్ములుం దగిన కర్జం బాప్తులై నీకుఁ బ్రీ**
తి నెఱింగించు తెఱంగు గాదు; తమబుద్ధిం బోయి సంధాన మి
ట్లొనరం జేయక యున్నఁ గృష్ణునకు నిన్నొప్పించు వా; రింతవ
ట్టు నిజం; బిచ్చట నింక నీయునికి నెట్లుం గీడు వుట్టుం జుమీ!" 372

అ : జనకుండున్=తండ్రీ; గురు భీష్ములున్= ద్రోణభీష్ములూ; నీకు ఆప్తులై = మేలు కోరినవారై; తగినకర్జంబు = తగినపనిని; ప్రీతిన్ = ప్రేమతో; ఎఱింగించు తెఱంగు = తెలిపేవిధం; కాదు; తమబుద్ధిన్ = తమ ఆలోచనతో; పోయి = ప్రవర్తించి; ఇట్లు; సంధానము= కూర్చుట

(సంధి); ఒనరన్= అనుకూలపడేటట్లు; చేయకయున్నన్ = చేయకుండాఉంటే; నిన్ను; కృష్ణునకు ఒప్పించువారు = ఇస్తారు (అప్పగిస్తారు); ఇంతవట్టు = ఇదంతా; నిజంబు; ఇచ్చటన్; ఇంక; నీ+ఉనికిన్ = నీవు ఉండటంవల్ల; ఎట్లున్ = ఎలాగూ; కీడు = ఆపద; పుట్టున్+చుమీ= కలుగుతుంది సుమా!

భా : "అన్నా! నాన్నగారూ, ద్రోణభీష్ములూ ఆప్తులై ప్రేమతో నీకు కర్తవ్యాన్ని బోధించే రీతి ఇప్పుడు లేదు. తమ ఆలోచనప్రకారం నడచుకొని అనుకూలంగా సంధి చేయకుంటే నిన్ను వీరంతా కృష్ణునికి అప్పగిస్తారు! ఇదంతా యథార్థం. ఇంక ఇక్కడ ఉంటే తప్పక నీకు ఆపద కలుగుతుంది సుమా!"

వి. దుష్టచతుష్టయంలో ఒకడు దుశ్శాసనుడు. కాబట్టి తనకు ఆసమయానికి తోచిన సలహాను అన్నకు చెపుతున్నాడు. అంతకుముందు దుర్యోధనాదుల పథకంలో శ్రీకృష్ణుని బంధంచటం ఒకటి. ఆతడు అందుకు సిద్ధమయ్యేలోపలనే ఈపథకం ముందుగా తెలిసిన భీష్మాదులు దుర్యోధనుని బంధిస్తారేమొ అని దుశ్శాసనుని భయం. దుర్యోధనాదులకు భీష్మాదులమీద ఎంత అవిశ్వాసం ఉందో ఈ మాటలు సూచిస్తాయి.

ఆ. అనిన బాహ్లికాదు లగు కురువృద్ధుల
నాత్మజనకుఁ గృష్ణు నాదరింప
కతఁడు రాజసమున నప్పుడు దిగ్గన
లేచిపోయె; సంచలించెఁ గొలువు. 373

అ : అనినన్ = అనగా; బాహ్లిక+ఆదులు+అగు = బాహ్లికుడుమొదలయిన; కురువృద్ధులన్; ఆత్మజనకున్ = తనతండ్రినీ; కృష్ణున్; ఆదరింపక = గౌరవించక; అతఁడు = ఆదుర్యోధనుడు; అప్పుడు; రాజసమునన్; దిగ్గనన్; లేచిపోయెన్; కొలువు = సభ; సంచలించెన్.

భా : అని దుశ్శాసనుడు అనేసరికి దుర్యోధనుడు బాహ్లికుడుమొదలయిన కురువృద్ధులనూ, తనతండ్రినీ కృష్ణునీకూడా గౌరవించకుండా నిర్లక్ష్యం చేసి అప్పుడు రాజసంతో దిగ్గున లేచి పోయాడు. అందువల్ల సభమొత్తం సంచలించిపోయింది.

వి. 'ఉపస్థిత వినాశః; పథ్యవాక్యం నశృణోతి' 'వినాశం దగ్గర పడినవాడు హితవాక్యాన్ని వినడు.' అని చాణక్య నీతి సూత్రాలు దుర్యోధనుని రీతిని సూచిస్తున్నాయి.

తే. అతని వెనుకన కర్ణుండు ననుజగణము
శకునియును వారి పొందైన జనపతులును
బోయి; రమ్మెయిఁ జని యొక్క ప్రోవు గట్టి
వేఱ యంతంత యుండిరి గోఱడమున. 374

అ : అతనివెనుకన=ఆదుర్యోధనుని వెంబడే; కర్ణుండున్; అనుజగణమున్ =తమ్ముల సమూహమూ; శకునియును; వారిపొందైన = వారి మిత్రులయిన; జనపతులును = రాజులూ; పోయిరి; ఆ+మెయిన్ = అలాగా; చని = వెళ్ళి; వేఱు+అ = వేరుగా; ఒక్కప్రోవుగట్టి= ఒకగుంపు గూడి; కోఱడమునన్ = తిరస్కారంతో; అంతంత=దూరంగా; ఉండిరి.

భా : ఆదుర్యోధనుని వెంట కర్ణుడూ, తమ్ములూ, శకునీ, వారి స్నేహితులైన రాజులూ వెళ్ళారు. ఆవిధంగా వెళ్ళి వారంతా కొంతదూరంలో గుంపుగూడి తిరస్కారభావంతో వేరుగా ఉన్నారు.

వ. ఇట్లున్నం గనుంగొని గాంగేయుండు. 375

భా : ఇలా ఉండగా చూసి భీష్ముడు అన్నాడు

చ. "ఇతఁ డిది యేల క్రొవ్వి ధరణీశుఁడ నంచు వృథాభిమానియై
మతి సెడి, లోభమోహమదమత్సరముల్ దనుఁ ద్రిప్ప, ని ట్లసం
గతమునఁ బోయె; వీని వెనుకం జని రేమి దలంచియో మహీ
పతులును; వీరు గొంద అతిభారపు మానుసు లేమిసేయుదున్". 376

అ : ఇతఁడు = ఈదుర్యోధనుడు; ఇది+ఏల = ఇదేమిటి?; క్రొవ్వి =గర్వించి; వృథా+ అభిమానియై = వ్యర్థమయిన అభిమానం గలవాడయి మతి; చెడి; లోభమోహమదమత్సరముల్= అత్యాశా, అజ్ఞానమూ, మదమూ, అసూయా; తనున్ = తనను; త్రిప్పన్ = తిప్పగా; ఇట్లు = ఇలాగా; అసంగతమునన్ = అనుచితంగా; పోయెన్ = వెళ్ళాడు!; మహీపతులును = రాజులు కూడా; ఏమి తలంచియో = ఏమి అనుకొనియో; వీని వెనుకన్ = ఈదుర్యోధనుని వెంట; చనిరి= వెళ్ళారు; వీరు = వీళ్లు; కొందఱ = కొంతమంది; అతిభారపుమానుసులు = మిక్కిలిభూభారం కలిగించేమనుష్యులు (దుర్మార్గులు); ఏమి+చేయుదున్ = ఏంచేసేది?

భా : "ఇదేమిటి? ఈదుర్యోధనుడు గర్వించి రాజును అనే దురహంకారంతో మతిచెడి లోభ మోహమదమాత్సర్యాలు తనను ఆడిస్తుంటే ఇలా అనుచితంగా వెళ్ళాడేమిటి? తక్కినరాజులంతా ఏమనుకున్నారో ఏమో వీడి వెంట వెళ్లా రేమిటి? వీళ్ళల్లో కొందరు భూభారం కలిగించే మనుష్యులు; నేనేమి చేసేది?

వి. లోభము - దానార్హేషు స్వధనాప్రదానం, అకారణంవా పరధన గ్రహణం లోభః
దానానికి తగిన వారికి తన ధనాన్ని ఇవ్వకపోవటమూ
కారణం లేకుండా ఇతరులధనాన్ని గ్రహించటమూ లోభం.
మదము - కులబలైశ్వర్య రూపవిద్యాదిభి: ఆత్మాహంకార
కరణం పరప్రధర్ష నిబంధనం వా మదః
కులమూ, బలమూ, ఐశ్వర్యమూ, సౌందర్యమూ, విద్య
మున్నగువానితో తాను గొప్ప వాడినని అహంకరించటం గాని; ఇతరులను అవమానాలపాలు చేయటం గాని మదం.

తే. అని జనార్దనుఁ గనుఁగొని; "యకట!కాల
పక్వ మయ్యె నీ నరపతిప్రతతి యెల్ల"
ననుడుఁ; దగు వారి దెసఁ గలయంగఁ జూచి
తగవు మెయి నిట్టు లనియె న న్నగధరుండు. 377

అ : అని; జనార్దనున్ = కృష్ణుని; కనుఁగొని = చూచి; (భీష్ముడు) అకట = అయ్యో!;

ఈనరపతి ప్రతతి+ ఎల్లన్ = ఈరాజసమూహం; అంతా; కాలపక్వము = కాలము చేతనే పరిపక్వము పొందినది (మృత్యువు సమీపించినది); అయ్యెన్ = అయింది; అనుడున్ = అనగా; ఆ+నగధరుండు = ఆకృష్ణుడు; తగువారిదెసన్ = తగిన వారివైపు; కలయంగన్ = బాగా; చూచి; తగవుమెయిన్ = న్యాయంగా; ఇట్టులు = ఇలా; అనియెన్ = అన్నాడు.

భా: అని; భీష్ముడు కృష్ణుని చూసి "అయ్యో! ఈ రాజులందరికీ మృత్యువు సమీపించినది." అని అన్నాడు. అప్పుడు కృష్ణుడు ఆసభలో తగినవారి వైపు బాగా చూసి ధర్మానుసారం ఇలా అన్నాడు.

వి. దీనికి మూలం ఇలా ఉంది.

కాల పక్వ మిదం మన్యే సర్వక్షత్రం జనార్దన
సర్వే హ్యనుసృతా మోహాత్ పార్థివాః సహమంత్రిభిః **అధ్యా. 128 శ్లో 32**

కృష్ణా! ఈక్షత్రియ గణం అంతా కాలం వల్ల పండిన పంటవలె మృత్యుముఖంలో ప్రవేశిస్తున్నదని అనుకుంటాను. అందువల్లనే వీరంతా మోహవశులై తమమంత్రులతో గూడా దుర్యోధనుని అనుసరిస్తున్నారు.

శా : ఈ దుర్యోధనుఁ డింత గర్వి యగునే! యీయున్న వారెల్ల నా
చే దైన్యంబునఁ బొందు టొప్ప దని చర్చింపండ; యీభంగికిన్
లేదే యొండు దెఱంగు? సత్కులముఁ బాలింపంగ వర్జింప రా
దే దుష్టాత్మకు నీచు నొక్కరునిఁ ? బోదే భేద మీజాతికిన్? 378

అ : ఈదుర్యోధనుఁడున్ ఇంతగర్వి=ఇంతగర్వంగలవాడు; అగునే= అయినాడా?; ఈ+ ఉన్నవారు+ఎల్లన్ = ఇక్కడ ఉన్నవీరందరూ; నాచేన్; దైన్యంబునన్ = దీనతలో; పొందుట= చిక్కుకోవటం; ఒప్పదు=తగదు; అని; చర్చింపండ= చర్చించనే చర్చించడు; ఈభంగికిన్ = ఈరీతికి; ఒండు తెఱంగు= మరొకత్రోవ; లేదే= లేదా?; సత్కులమున్ = మంచివంశాన్ని; పాలింపంగన్ = రక్షించటానికి; దుష్టాత్మకున్= దుష్టబుద్ధిగలవాడూ; నీచున్ = నీచుడయిన; ఒక్కరునిన్ = ఒక్కనిని; వర్జింపంగరాదే = వదిలేయగూడదా?; (అందువలన) ఈజాతికిన్ = ఈభరతవంశానికి; భేదము; పోదే = పోదా?

భా : ఈ దుర్యోధనుడు ఇంత మదాంధుడయినాడా? ఇక్కడ ఉన్నవాళ్ళంతా నాచేత దైన్యంలో చిక్కుకుంటారే. అది తగదు అని అయినా ఆలోచించడా? ఈ స్థితికి - ఇంకో పరిష్కారం లేదా? మంచివంశాన్ని రక్షించటానికి దుష్టబుద్ధీ, నీచుడూ అయిన ఒక్కనిని వదిలేయ గూడదా? ఈ భారతజాతికి అందువల్ల భేదభావం పోతుంది కదా!

వి. దుర్యోధనుని పరిత్యజించమని చెప్పటం. దుర్యోధనుడు జనించినపుడు విదురుడు మొ. వారు (ఆదిపర్వం); జూదం జరుగుతున్నపుడు విదురుడూ (సభాపర్వం); విదురుడు ధృతరాష్ట్రునికి నీతిని బోధిస్తూ (ఉద్యోగపర్వం) దుర్యోధనునిని పరిత్యజించమని చెప్పినా ధృతరాష్ట్రుడు పుత్రవ్యామోహంతో వినలేదు.

ఉ. కంసుఁడు నిట్ల తండ్రి మది గందెడు చంద మొనర్చి ధర్మవి
ధ్వంసము సేసినం, గులము వారలు నా కెఱిఁగింప, నేను దు

ర్మాంసము గోయు వైద్యుని క్రమంబున నాతనిఁ ద్రుంచి; యన్వయో
త్తంసముఁ జేయనే జనకు? దద్విధ మొప్పదె మీరుఁ జేసినన్? 379

అ : కంసుఁడును; ఇట్ల = ఇలాగే; తండ్రిమది = తండ్రిమనస్సు; కందెడుచందము= నొచ్చుకునేవిధం; ఒనర్చి = చేసి; ధర్మ విధ్వంసము = ధర్మనాశం; చేసినన్ = చేయగా; కులమువారలు = ఆవంశంలోనివారు; నాకు; ఎఱిఁగింపన్ = తెలుపగా; నేను; దుర్మాంసము= (చెడిపోయిన మాంసమును) దుర్మాంసాన్ని; కోయు;వైద్యునిక్రమంబునన్ = వైద్యుని విధంగా; ఆతనిన్ = ఆకంసుని; త్రుంచి = చంపి; జనకున్ = (అతని) తండ్రిని; అన్వయ+ఉత్తంసమున్= మాకులానికి శిరోభూషణంగా (రాజుగా); చేయనే = చేయలేదా?; మీరు; తత్+విధము = ఆపద్ధతి; చేసినన్ = చేస్తే; (అది) ఒప్పదె = తగదా?

భా : *కంసుడుకూడా పూర్వం ఇలాగే తండ్రి మనస్సు బాధపడేటట్లుగా దుష్కార్యాలు చేసి ధర్మధ్వంసం చేశాడు. అప్పుడు మావంశీయులు ఆవిషయం నాకు చెప్పారు. నేను దుర్మాంసం కోసే వైద్యునివలె ఆతనిని సంహరించి ఆతని తండ్రిని మహారాజును చేశాను; మీరుగూడా అలాగే చేయవచ్చుగదా!*

వి. ఈకంసవధ విషయం ద్యూత సమయంలో ధృతరాష్ట్రునితో విదురుడు రహస్యంగా చెప్పినట్లు సభా. 2 ఆ. 179వచనంలో ఇలా ఉంది.

ఒక్కనికారణంబునఁగులంబున కెగ్గగునేని వాని దూషించి కులంబు రక్షించుట ధర్మంబని శుక్రుండు చెప్పెఁగులరక్షణార్థం బంధక యాదవవృష్ణి వీరులు కృష్ణునియోగించి కులదూషకుండైన కంసుని వధింపించిరి గావున."

శ్రీకృష్ణుడు కంసుని తాను వధించిన విషయాన్ని చెపుతూ ఇంకోటి కూడా చెప్పినట్లు మూలంలో ఉంది.

"రాజా! ఈవిషయంలో ఇంకో ఉదాహరణ ఉంది. ఒకప్పుడు బ్రహ్మ దేవుడు చెప్పిన దాన్ని చెపుతున్నాను. దేవతలు, అసురులు సేనలు కూర్చుకొని యుద్ధానికి సిద్ధంగా ఉన్నారు. అందరూ ఆయుధాలు ఎత్తి పట్టుకొని ఉన్నారు. సమస్త ప్రపంచమూ రెండు భాగాలయి వినాశగర్తంలో పడటాన్ని కోరుతోంది. అప్పుడు బ్రహ్మదేవుడు ఇలా అన్నాడు. " ఈ యుద్ధంలో దానవదైత్యాసురులు అందరూ తప్పక ఓడిపోతారు. దేవతలు జయిస్తారు. దేవాసుర మనుష్యగంధర్వనాగరాక్షసులు ఈయుద్ధంలో క్రోధపూర్ణులై పరస్పరం చంపుకుంటారు." ఈ భావిపరిణామాన్ని గుర్తించి ధర్మదేవతతో ఇలా అన్నాడు. "నీవు ఈదైత్య దానవులను బంధించి వరుణదేవునికి అప్పగించు." అప్పటినుంచి జలాధిపతి వరుణుడు వారిని ధర్మపాశ, వరుణ పాశాలతో బంధించి ఆదానవులను సముద్రంలోపలనే ఉంచుతాడు. కాబట్టి భరతవంశీయులారా! మీరందరూ దుర్యోధన దుశ్శాసన శకుని కర్ణులను బంధించి పాండవులకు అప్పగించండి. కులక్షేమంకోసం ఒకవ్యక్తినీ, ఒక గ్రామంమేలుకోసం ఒక కులాన్నీ, జనపదక్షేమంకోసం ఒక గ్రామాన్నీ, తనక్షేమంకోసం సమస్తభూమండలాన్నీ త్యజించాలి."

ఆ. అంతతోడన నెల్లయాపదలు తీఱు;
వంశ మధికగౌరవము నొందుఁ;

గూడి మనుట గలుగుఁ గురుపాండవులకు; ని
త్తెఱఁగు సూడ మీకు నుఱవ కాదె?" 380

అ : అంతతోడన = దాంతోటే (వెంటనే); ఎల్ల+ఆపదలు = ఆపదలన్నీ; తీఱు = తీరిపోతాయి, (తొలగిపోతాయి); వంశము = కురువంశం; అధికగౌరవమును; ఒందున్= పొందుతుంది; కురుపాండవులకున్ = కౌరవపాండవులకు; కూడి మనుట = కలిసిబ్రతకటం కలుగున్ =సంభవిస్తుంది; ఈ+తెఱఁగు = ఈవిధం; చూడన్ = పరిశీలించగా; మీకున్; ఉఱవకాదె= ఉచితంకాదా?

భా : దాంతో వెంటనే అన్ని ఆపదలు తొలగిపోతాయి. మీవంశం గొప్ప గౌరవాన్ని పొందుతుంది. కౌరవులూ, పాండవులూ కలిసి బ్రతకటం కూడా వీలు అవుతుంది. బాగా ఆలోచిస్తే ఈరీతి మీకు తగదా?"

వ. అనిన విని ధృతరాష్ట్రుం డదరిపడి విదురున కిట్లనియె. 381

భా : ఆ కృష్ణుని మాటలు విని అదరిపడి ధృతరాష్ట్రుడు విదురునితో ఇలా అన్నాడు.

ఆ. "బుద్ధిమంతురాలు పొందుగఁ బలుకంగ
నేర్చు; వచ్చి కొడుకుఁ దేర్చి పోవుఁ
గాన వేగ నీవు గాంధారిఁ దోడితె"
మ్మనుడు, నరిగి యతఁడు నట్లు చేసె. 382

అ : (గాంధారి) బుద్ధిమంతురాలు = గొప్పతెలివితేటలుగలది; పొందుగన్ = ఆనుకూల్యంతో; పలుకంగనేర్చున్=మాట్లాడటం ఎఱిగినది; కాబట్టి వచ్చి; కొడుకున్; తేర్చి పోవున్= బాగుచేసి (ఊరడించి) పోతుంది. కానన్ = కాబట్టి; నీవు; వేగన్ = త్వరగా; గాంధారిన్; తోడితెమ్ము= తీసుకునిరా; అనుడున్= అని (ధృతరాష్ట్రుడు) అనగా; అతఁడు = ఆవిదురుడు; అట్ల = అలాగే; చేసెన్ = చేశాడు.

భా : "గాంధారి మంచి బుద్ధిమంతురాలు. చక్కగా అనుకూలంగా మాట్లాడగలది. ఇక్కడికి వచ్చి కొడుకు దుర్యోధనుని బాగుచేసిపోతుంది. కాబట్టి నీవు వేగంగా ఆమెను తీసుకురా" అని ధృతరాష్ట్రు డనగా విదురుడు వెళ్లి ఆమెను వెంటబెట్టుకొచ్చాడు.

వ. అద్దేవియు.

భా: ఆగాంధారీ దేవి కూడా

క. చనుదెంచి యుచితపీఠం
బున నున్నం గురువిభుండు పొలఁతుకతో ని
ట్లను; "నీతనూభవుఁడు దు
ర్వినయంబునఁ జనియె; నిట్టి వెంగలి గలఁడే! 384

అ : చనుదెంచి = వచ్చి; ఉచితపీఠంబునన్=తగిన ఆసనంమీద; ఉన్నన్ =కూర్చుండి ఉండగా; కురువిభుండు =దుర్యోధనుడు; పొలఁతుకతోన్ =స్త్రీ (గాంధారి)తో; ఇట్లు=ఇలా; అనున్=అంటున్నాడు; నీ తనూభవుఁడు= నీ కుమారుడు; దుర్వినయంబునన్=వినయం లేకుండా (అవినయంతో; చనియెన్ =వెళ్ళాడు; ఇట్టి= ఇలాంటి; వెంగలి =మూర్ఖుడు; కలఁడే = ఉన్నాడా?

భా : వచ్చి సభలో తనకు తగిన సింహాసనం మీద కూర్చున్నది. అప్పుడు ధృతరాష్ట్రుడు ఆమెతో ఇలా అన్నాడు. "నీకొడుకు అవినయంతో సభాభవనం వదిలి వెళ్ళాడు. ఇలాంటి మూఢు డున్నాడా?

క. నీవైనఁ జెప్పి శాంతుం
గావింపఁగ నోపుదేనిఁ గౌరవకుల మీ
గోవిందు శాసనము సం
భావింపం గాంచి చెడక బ్రదుకుం జుమ్మీ." 385

అ : నీవైనన్ = నీవైనా; చెప్పి; శాంతున్ = కోపం లేనివానిని; కావింపఁగన్ = చేయగా; ఓపుదేనిన్ = చాలినదానివయితే; కౌరవకులము; ఈగోవిందుశాసనము = ఈకృష్ణునిఆజ్ఞను; సంభావింపన్ = గౌరవించటాన్ని; కాంచి = పొంది; చెడక = చెడిపోక; బ్రతుకుంజుమ్మీ = బ్రతుకుతుందిసుమా!

భా : నీవైనా దుర్యోధనునికి మంచి చెప్పి శాంతింపజేయ గలిగితే కౌరవవంశం అంతా ఈకృష్ణుని ఆజ్ఞను పాటించి చెడిపోక సుఖంగా బ్రతుకుతుంది సుమా!"

తే. అనుడు. "నీపుత్త్రుఁ డవినీతుఁ డగుట యెఱిఁగి
యెఱిఁగి వాని వశంబున నేలపోయె?
దీవు పాండవులకు నేమి యిచ్చితేని;
నడ్డపడ నెవ్వరికి వచ్చు నధిప చెపుమ" 386

అ : అనుడు = అనగా; అధిప = రాజా!; నీపుత్త్రుఁడు = నీకొడుకు; అవినీతుఁడు = నీతిమాలినవాడు; అగుట= కావటం; ఎఱిఁగి+ఎఱిఁగి = బాగాతెలిసి; వాని వశంబునన్ = వాడికి వశమయి; ఏలపోయెదు = ఎందుకు వెళ్తావు?; ఈవు = నీవు; పాండవులకున్; ఏమి+ఇచ్చితేనిన్= ఏమి ఇచ్చినా; ఎవ్వరికిన్ = ఎవరికి; అడ్డపడవచ్చున్ =అడ్డపడవీలవుతుంది?; చెపుమ = చెప్పండి.

భా : అనగా గాంధారి ఇలా అంది "రాజా! నీకొడుకు నీతిమాలిన వాడని మీకు బాగా తెలుసు. అయినా వాడి ఇష్టానుసారంగా ఎందుకు ప్రవర్తిస్తారు? మీరు పాండవులకు మీఇష్టంవచ్చినట్లు ఏమి ఇచ్చినా ఎవరు అడ్డపడగలరు? చెప్పండి!"

వి . గాంధారి ఈమాట అనటంవల్ల ధృతరాష్ట్రుని పుత్రవ్యామోహం,; దాని ఫలితం వ్యక్తమవుతాయి. ఇదీ ఇంక కొన్ని సన్నివేశాలవల్ల ధృతరాష్ట్రునికన్నా గాంధారి దూరదృష్టికలది అని తెలుస్తుంది.

ఈ సన్నివేశం మూలంలో ఇలా ఉంది. (అధ్యా129. శ్లో. 11;12;13)
"మహారాజా! పెద్దకుమారు డంటే అతిప్రేమ ఉండటం వల్లనే ఇప్పుడు ఈ

స్థితి కలిగింది. ఇందుకు నింద్యులు మీరే. వీడి దురాలోచనలు అన్నీ తెలిసికూడా మీరు వీడిబుద్ధినే అనుసరిస్తుంటారు. ఈ దుర్యోధనుని కామక్రోధాలు వశం చేసుకున్నాయి. వీడు లోభంలో మునిగిపోయాడు. కాబట్టి వీడిని ఇవ్వాళ బలవంతంగా మళ్ళించటం అసంభవం. దుష్టసహాయం కలవాడూ మూఢుడు అజ్ఞాని లోభి దురాత్ముడు అయిన పుత్రుడికి రాజ్యం కట్టబెట్టిన దానికి ఫలితం ఇప్పుడు మీరు స్వయంగా అనుభవిస్తున్నారు."

క. **అని గాంధారి పతియుఁ దా**
నును విదురుం బనిచె నందనుం బిలువ; నతం
డును మొగము జేవుఱింపఁగఁ
జను దెంచెను సభకు విదుర సంప్రార్థితుఁడై. 387

అ : అని; గాంధారి; పతియున్ = ప్రభువయినధృతరాష్ట్రుడు; తానును = తానూ(స్వయంగా); నందనున్ = కుమారుని (దుర్యోధనుని); పిలువన్ = పిలవటానికి; విదురున్; పనిచెన్ =పంపాడు అతండును =ఆదుర్యోధనుడూ; విదురసంప్రార్థితుఁడై=విదురుని చేత బాగా ప్రార్థింపబడినవాడై; మొగము =ముఖం; జేవుఱింపఁగన్ =ఎర్రబడగా; సభకు; చనుదెంచెను= వచ్చాడు.

భా : *అని గాంధారీ, ధృతరాష్ట్రుడూ స్వయంగా దుర్యోధనుని పిలవటానికి విదురుని పంపారు. విదురుడు వెళ్ళిబ్రతిమలాడితే ఆదుర్యోధనుడు కోపంతో ఎర్రనయిన ముఖంతో సభకు వచ్చాడు.*

వ. **మున్ను దనతోడం జనినవార లందఱు నచ్చోటన నిలువ, నిట్లు వచ్చి సుయోధనుండు నిజాసనాసీనుండై యున్నఁ జూచి, తల్లి చిత్తంబున గర్హించుచు నతనికి ధర్మంబును నీతియును జుట్టఱికంబును బ్రదుకుఁదెరువును నిజశక్తియు సహాయంబు గొలఁదియుఁ గులజన చిత్త ప్రకారంబును బాండుపుత్రుల బల పరాక్రమంబులుఁ దెలియు నట్లుగాఁ దెఱంగుపడఁజెప్పి, బుజ్జగించియుం గినిసియు ననేక విధంబుల నాడిన, నమ్మాటలదెస ననాదరంబు సేసి, యుద్ధతిం గ్రమ్మఱం జని యతండు కర్ణాదులం గలసి, వారునుం దానును దుర్మంత్రంబునకుం జొచ్చి.** 388

అ : మున్ను = అంతకుముందు;ఆ+చోటన = అక్కడనే; గర్హించుచున్ = అసహ్యించుకొంటూ; కొలఁదియున్ = పరిమాణమూ; తెఱంగుపడన్ = సంధిఅయ్యేటట్లుగా; కినిసియున్ = కోపించీ; ఆడినన్ = మాట్లాడగా; ఉద్ధతిన్ = గర్వంతో; క్రమ్మఱన్ = మళ్ళా; దుర్మంత్రంబునకున్ = దురాలోచనకు.

భా : *అంతకుముందు తనతో పాటు వెళ్ళిన వాళ్ళు అందరూ ఆసభకు దూరంగా అక్కడే ఉండగా దుర్యోధనుడు వచ్చి సభలో తన ఆసనం మీద కూర్చున్నాడు.తల్లి గాంధారి అతనిని చూచి మనస్సులో అసహ్యించుకొంటూనే ధర్మమూ, నీతీ, చుట్టరికమూ, బ్రతుకుతెరువూ ఆతనిశక్తి సామర్థ్యాలూ అతనికి గల సహాయపరిమాణమూ, కులంపెద్దల ఉద్దేశాలూ, పాండవుల బలపరాక్రమాలూ బాగా స్పష్టంగా చెప్పింది. ఆమె బుజ్జగించీ*

కోపించీ, అనేకవిధాలుగా వివరించి చెప్పింది. దుర్యోధనుడు ఆమె మాటలు లెక్కచేయక గర్వంతో అక్కడి నుంచి వెళ్ళి కర్ణాదులతో కలశాడు.వాళ్ళూ, తానూ కలిసి దురాలోచన చేయసాగారు.

వి. తల్లి అయినా గాంధారికి దుర్యోధనుని ప్రవర్తన అంటే అసహ్యం కాని ధృతరాష్ట్రునికా స్వభావం లేదు. ఆతడు పుత్రమోహాంధుడు. అందువల్ల అంతరాంతరాల్లో కుమారునిమాట అతనికి చాలాఇష్టం.

తిక్కన ఈవచనంలో సంగ్రహించిన విషయం మూలంలో 37 శ్లోకాలలో ఉంది. అధ్యా 129. శ్లో 18 నుండి 54 వరకు)

అపమార్గంపట్టిన ఆత్మజుడు మళ్ళీ సభలోకి రావటంచూసి గాంధారి ఆతనిని నిందిస్తూ శాంతిని కాంక్షిస్తూ ఇలా అన్నది. "కుమారా! దుర్యోధనా! నామాటవిను. ఇది బంధుమిత్రులతో గూడిననీకు మేలు కలిగిస్తుంది. నీ తండ్రి, తాత, ద్రోణుడు, కృపుడు, విదురుడు నీహితంకోరి చెప్పేమాటలు విను. నీవు శాంతించటమే మా అందరిని పూజించటం. ఎవడయినా తాను కోరినంత మాత్రాన రాజ్యాన్ని సంపాదించటం, రక్షించటం, అనుభవించటం చేయలేడు. ఇంద్రియాలను జయించలేనివాడు కలకాలం రాజ్యాన్ని అనుభవించలేడు. మనస్సును జయించిన మేధావి మాత్రమే రాజ్యాన్ని రక్షించుకోగలడు. కామక్రోధాలు మానవుని అర్థానికి దూరం చేస్తాయి. వాటిని జయించిన రాజే భూమి మీద విజయం సాధిస్తాడు. దురాత్ములు రాజ్యం అనే అభీష్ట స్థానాన్ని రక్షించలేరు. గొప్పవాడు కాదలచినవాడు ఇంద్రియాలను అర్థ ధర్మాలలో నియంత్రిస్తాడు. కట్టెలు వేస్తే అగ్ని ప్రజ్వరిల్లినట్లు ఇంద్రియ జయంవల్ల బుద్ధి వెలుగొందుతుంది. లొంగనిగుర్రాలు సారథిని నేలగూల్చినట్లు వశంగాని ఇంద్రియాలు మనుష్యుని నాశనం చేయగలవు. మనస్సును జయించకుండా మంత్రులను వశంచేసుకోవాలి అని అనుకునేవాడు మంత్రులను లోగొనగుండా శత్రువులను జయించగోరేవాడూ వివశుడై రాజ్యానికీ జీవితానికి దూరం అవుతారు. మొదట మనస్సునే శత్రువునుగా భావించి జయించాలి. తరువాత తక్కిన వారిని జయించవచ్చు. ఇలాంటి వానిని లక్ష్మి సేవిస్తుంది.

మానవుని జ్ఞానాన్ని నష్టపరిచే కామక్రోధాలు చిన్నరంధ్రాలు గల వలలో ఉన్న చేపలులాగా శరీరంలోనే ఉన్నాయి. కామ, క్రోధ, లోభ, దంభ, దర్పాలను జయించగలిగినవాడు రాజు కాగలడు. భీష్మాదులు చెప్పినట్లుగా కృష్ణార్జునులు అజేయులు. కాబట్టి కృష్ణుని శరణుపొందు. ఆయన ప్రసన్నుడయితే ఉభయపక్షాలు సుఖపడతాయి. యుద్ధంవల్ల మేలులేదు. ధర్మార్థాలు సుఖము ఉండవు. కాబట్టి యుద్ధం కోరకు. రెండుపక్షాలలో విరోధం కలుగుతుందనే భయంతోనే నీతండ్రి, భీష్మబాహ్లికులు పాండవులకు అర్ధరాజ్యం ఇచ్చారు. అందువల్ల పాండవులు నిష్కంటకం చేసిన రాజ్యం ఇప్పుడు నీవు అనుభవిస్తున్నావు. నీవాళ్ళతో నీవు జీవించటానికి అర్ధరాజ్యం చాలు. భీష్మ ద్రోణాదులకు ఈరాజ్యం నీవు పాలించినా, పాండవులు పాలించినా ఒకటే. ఉభయులందు వారికి ప్రేమా సమానమే. కాని పాండవులవైపు ధర్మం అధికంగా ఉంది. భీష్మాదులు ఈరాజ్యంలో ఉండటంవల్ల నీకోసంప్రాణాలుఅర్పిస్తారు. అయినా ధర్మజుని వక్రదృష్టితో ఎప్పుడూ చూడరు..

-: దుర్యోధనాదులు శ్రీకృష్ణునిం బట్టికొని చెఱం బెట్టఁ దలంచుట :-
సం. 5-128-1

క. "హరితలఁ పొప్పదు; భీష్ముని
గురునిం గూర్చుకొని, మనలఁ గ్రొవ్వఱఁ బట్టం
గర ముత్సహించు చున్నాఁ
డరయ నతని వచన రచన నంతయుఁ దెలిసెన్. 389

అ : హరితలఁపు=కృష్ణుని ఆలోచన (కోరిక; అభిప్రాయం); ఒప్పదు= తగదు; (అతడు) భీష్మునిన్; గురునిన్ = ద్రోణునీ; కూర్చుకొని; మనలన్; క్రొవ్వఱన్ = మదం అణిగేటట్లు; పట్టన్= పట్టుకోటానికి; కరము = ఎక్కువగా; ఉత్సహించుచున్నాఁడు = ప్రయత్నిస్తున్నాడు. అరయన్ = పరిశీలిస్తే; అతని వచనరచనన్ = ఆతని మాటల కూర్పు వలన; అంతయున్=ఇదంతా; తెలిసెన్.

భా : "కృష్ణుని ఆలోచన సముచితంకాదు. భీష్మునీ, ద్రోణునీ తనతో కలుపుకొని మనలను అందరినీ పట్టి బంధించాలని ప్రయత్నిస్తున్నాడు. బాగా పరిశీలిస్తే ఇదంతా ఆతని మాటల తీరువల్ల తెలిసింది.

క. మును దాఁ గంసుని బరిమా
ర్చిన చందము వారికెల్లఁ జెప్పెడుఁ; దనకున్
మును మనము గడఁగి వెసఁ బ
ట్టినఁ గార్యం బగుఁ జలంబు డింపకుఁ డింకన్. 390

అ : తాన్ = తాను (ఆకృష్ణుడు); మును = ఇంతకుముందు; కంసునిన్; పరిమార్చిన చందము =చంపిన రీతి; ఎల్లన్ = అంతా; వారికిన్ =ఆభీష్మద్రోణాదులకు; చెప్పెడున్= చెపుతున్నాడు; మనము; తనకున్=ఆకృష్ణునికంటే; మును = ముందు; కడఁగి=పూనుకొని వెసన్= తొందరగా; పట్టినన్ = పట్టుకొంటే; కార్యంబు = చేయదగింది; అగున్ = అవుతుంది; ఇంకన్; చలంబు = పట్టుదల; డింపకుఁడు = వదలకండి.

భా : ఈ కృష్ణుడు తాను ఇంతకు ముందు కంసుని చంపిన వృత్తాంతం అంతా వాళ్ళకు చెపుతున్నాడు. కాబట్టి మనం ఆతనికంటే ముందు అందరమూ పూనుకొని పట్టి బంధిస్తే పని అయిపోతుంది. అందువల్ల మీరు పట్టుదల వదలకుండా సిద్ధంగా ఉండండి!

తే. పట్టి యీతనిఁ జెఱఁ బెట్టి పాండవులకు
దిగులు పుట్టింత; మంతటఁ దెగక యెత్తి
వచ్చిరేనియు నిర్జింపవచ్చుఁ; గోఱ
లెల్లఁ బుచ్చిన నురగంబు లేమి సేయు?" 391

అ : పట్టి = పట్టుకొని (బంధించి); ఈతనిన్ =ఈకృష్ణుని; చెరఁబెట్టి = చెరలో పెట్టి; పాండవులకు; దిగులు; పుట్టింతము = కలిగిచుదాం; అంతటన్ = అంతటితో; తెగక =

విరమించుకోక; ఎత్తివచ్చిరేనియున్ = దండెత్తి వచ్చినా; నిర్జింపవచ్చున్ = ఓడించవచ్చు; కోఱలు; ఎల్లన్=అన్నీ; పుచ్చినన్ = పీకివేస్తే; ఉరగంబులు = పాములు; ఏమి+చేయున్ = ఏంచేయగలవు?

భా : ఈ కృష్ణుని పట్టుకొని చెరసాలలో పడేసి పాండవులకు దిగులు పుట్టిద్దాం. అంతటితో ఊరుకోక వాళ్ళు దండెత్తి వచ్చినా మనం వాళ్ళను ఓడించవచ్చు. కోరలు పీకిపారేస్తే పాములు ఏంచేస్తాయి?"

వ. అని విచారించె; నట్లు దుష్కార్యాలోచనంబుసేసి, దుర్యోధన దుశ్శాసన శకుని కర్ణులగు దుష్టచతుష్టయంబు మొదలుగాఁగల యవినీతులు దైతేయమర్దను మర్దింప నిశ్చయించి రయ్యవసరంబున. 392

అ : విచారించెన్ = ఆలోచించాడు; దుష్కార్య+ఆలోచనంబు = చెడ్డపని చెయ్యాలనే ఆలోచన; అవినీతులు = దుష్టులు; దైతేయమర్దనున్ = రాక్షసులను చంపిన వానిని (కృష్ణుని); మర్దింపన్ = నలగగొట్టాలని; ఆ+అవసరంబున్ = ఆసమయంలో.

భా : అని ఆలోచించాడు. అలా దుష్కార్యంచేయాలని ఆలోచించి దుర్యోధనుడు, దుశ్శాసనుడు, శకుని కర్ణుడు అనే దుష్టచతుష్టయం మొదలయిన అవినీతులు కృష్ణుని మర్దించాలని నిశ్చయించారు. అప్పుడు.

చ. అడఁకువ లేమి, నల్కి యురియాడుట; నొండొరుఁ గూడకుండుటన్;
బుడిబుడి మాటలాడుటకు, బోవుచు వచ్చుచుఁ గ్రందు గమ్మఱం
బడుటను దెల్లమై, మును పన్నుగఁ దాఁ బరికించి యున్కి, న
ప్పుడు హరిఁ బట్టు సంకులము పుట్టుట సాత్యకి నిశ్చయించుచున్.393

అ : అడఁకువ = అణకువ; లేమిన్ = లేకపోవటమూ; అల్కి = భయపడి; ఉరియాడుటన్ = తొట్రు పడటమూ; ఒండొరున్ =పరస్పరం; కూడ కుండుటన్ = కలిసి ఉండకపోవటమూ; బుడిబుడిమాలాడుటను = మెల్లమెల్లగా మాట్లాడుకోవటమూ (గుసగుస లాడటమూ); పోవుచు వచ్చుచున్= వెళ్ళుతూ వస్తూ; క్రందు = సందడితో; క్రమ్మఱన్ + పడుటను= మళ్ళటమూ; తెల్లమైనన్ = స్పష్టంకాగా; మును = అంతకుముందు; పన్నుగన్ = ఒప్పుగా(చక్కగా); తాన్; పరికించియున్కిన్ = చూచిఉండటంవల్ల; అప్పుడు; హరిన్ = కృష్ణుని; పట్టుసంకులము= పట్టుకొనే సందడి; పుట్టుట = కలగటం; సాత్యకి; నిశ్చయించుచున్.

భా : ఆదుర్యోధనాదులలో అణకువలేకపోవటమూ, భయంతో తొట్రు-పడటమూ, పరస్పరం కలిసి ఉండకపోవటమూ, గుసగుసలాడటమూ, రాక పోకల వల్ల గలిగే సందడితో మళ్ళటమూ స్పష్టం అయినాయి. సాత్యకి ఇదంతా ముందు నుంచే చూచిఉన్నాడు. అందువల్ల కృష్ణుని పట్టుకోవటం కోసం కలకలం పుట్టటం అతడు నిర్ణయించాడు.

తే. బఱటి కొని పోయి కృతవర్మఁ బన్నఁ బనిచి
"నీవు బలమును వాకిట నిలుపు; మేను

లోపలికి నెల్లఁ జాలుదుఁ బాపబుద్ధు
లన్నదెసఁ దప్పి" రని నిర్భయమునఁ జెప్పె. 394

అ : బఱిటి = (సంజ్ఞసైగగా) గోకి; కృతవర్మన్; కొనిపోయి = బయటికి తీసుకొనిపోయి; పన్నన్=సైన్యాన్ని సిద్ధంచేయటానికి; పనిచి = అజ్ఞాపించి; నీవు; బలమును = సైన్యాన్ని; వాకిటన్= సభాద్వారం వద్ద; నిలుపుము; ఏను = నేను; లోపలికిన్ + ఎల్లన్ = లోపలివారికందరికి; చాలుదున్=(ఎదిరించటానికి) సరిపోతాను; పాపబుద్ధులు=దుర్బుద్ధిగలవీరు; అన్నదెసన్ = తన అన్నఅయిన కృష్ణుని విషయంలో; తప్పిరి = ప్రతికూలమయినారు; అని; నిర్భయముగన్ = నిర్భయంగా; చెప్పెన్.

భా : సాత్యకి కృతవర్మను సైగగా గోకి బయటకు తీసుకొనిపోయి సైన్యాన్ని సిద్ధం చేయమని చెప్పి "నీవు సైన్యాన్ని వాకిలి దగ్గర సిద్ధం చేసి ఉంచు. నేను లోపలివారిని ఎదుర్కొనటానికి చాలు. ఈ దుర్మార్గులు అన్న కృష్ణునికి వ్యతిరేకులయినారు." అని నిర్భయంగా చెప్పాడు.

వ. ఇట్లు పరమాప్తుం డగు హార్దిక్యు నట వుచ్చి సాత్యకి సత్వరంబుగాఁ జనుదెంచి జనార్దనునకు నత్తెఱం గెల్ల నెఱింగించి తదనుమతిం గౌరవేశ్వర బాహ్లిక గురుభీష్మ విదురులతో నిట్లనియె. 395

అ : పరమ+ఆప్తుండు = మిక్కిలి కావలసినవాడు; హార్దిక్యున్ = కృతవర్మను; పుచ్చి= పంపి; ఆ+తెఱంగు+ఎల్లన్ = ఆవిధం అంతా; తత్ + అనుమతిన్ = ఆయన అనుమతితో.

భా : ఇలా సాత్యకి మిక్కిలి ఆప్తుడయిన కృతవర్మను సభాద్వారంవైపు పంపాడు. తాను చాలా వేగంగా వచ్చి శ్రీకృష్ణునికి ఆవిషయం అంతా తెలిపాడు. ఆయన అనుమతితో ధృతరాష్ట్రుడు బాహ్లికుడు ద్రోణుడు భీష్ముడు విదురుడు వీరందరితో ఇలా అన్నాడు.

మ. "అదె కౌరవ్యు లశక్తదుర్జనత సేయం బూని పైఁబాఱఁ జూ
చెద; రమ్మె దమచేతఁ దీఱునె? జయశ్రీకాంతు దైత్యాంతకుం
బొదువం దారు దలంచు టెల్ల ననలంబుం జీర బంధింపఁగా
మది నూహించిన యట్ల కాక; తమ దుర్మంత్రంబులం బోవునే?" 396

అ : అదె = అదిగో; కౌరవ్యులు = కౌరవులు; అశక్తదుర్జనత=శక్తిరహితమయిన దుష్టత-అశక్తదుర్జనత్వం; చేయన్+పూని=చేయటానికి పూనుకొని; పైన్=మీదికి; పాఱన్+ జూచెదరు= దూకటానికి చూస్తారు; అమ్మె= ఆవిధం; తమచేతన్ = తమకు; తీఱునె= వీలవుతుందా?; జయశ్రీ కాంతున్=జయలక్ష్మికి భర్త అయిన; దైత్యాంతకున్= రాక్షసులను సంహరించిన కృష్ణుని; పొదువన్= కప్పగా; (చుట్టుముట్టు) పట్టుకోటానికి; తారు = తాము; తలంచుట+ఎల్లన్ = ఆలోచించటం అంతా; అనలంబున్ = అగ్నిని; చీరన్ = వస్త్రంలో; బంధింపగాన్ = బంధించటానికి; మదిన్ = మనస్సులో; ఊహించిన యట్లకాక = ఊహించినట్లే అవుతుందిగాని; తమదుర్మంత్రంబులన్ = తమదుష్టమయిన మంత్రాలోచనలతో; పోవునే = నెరవేరుతుందా?

భా : "అదుగో! కౌరవులు అసమర్థ దుర్జనత్వం చూపటానికి పూనుకొని కృష్ణుని

మీదికి దూకాలి అనిచూస్తున్నారు. ఆపని వాళ్ళకు చేతనవుతుందా? జయలక్ష్మీ వల్లభుడయిన శ్రీ కృష్ణుని వాళ్ళు పట్టుకోవాలి అని అనుకోటం నిప్పును వస్త్రంలో బంధించాలని మనస్సులో అనుకోవటం వంటిదే! అంతేకాని దురాలోచనలతో అది నెరవేరుతుందా?"

వ. అనిన విదురుం డదరిపడి వైచిత్ర్యవీర్యున కిట్లనియె. 397

భా : ఆ మాటలు విని విదురుడు అదిరిపడి ధృతరాష్ట్రునితో ఇలా అన్నాడు.

ఉ. "భూవర! నీతనూభవులు పుణ్యు నగణ్య పరాక్రమున్ హరిం
గేవల మర్త్యుఁగాఁ దలఁచి కిట్టినఁ బట్టినఁ దారు మంటపై
వావిరిఁ గ్రమ్ము నాశలభ వర్గము చాడ్పున గ్రమంది పోరె? కా
లావధి యయ్యెఁ గావలయు నక్కట! వారికి వారివారికిన్." 398

అ : భూవర= రాజా!; నీతనూభవులు =నీకొడుకులు;పుణ్యున్= పుణ్యాత్మునీ; అగణ్య పరాక్రమున్=లెక్కించటానికి వీలుకానంత పరాక్రమంకల; హరిన్ = కృష్ణుని; కేవలమర్త్యున్+కాన్= కేవలం మానవమాత్రునిగా; తలఁచి = భావించి; కిట్టినన్ = సమీపించినా (ఎదిరించినా); పట్టినన్= పట్టుకొన్నా; తారు = తాము; మంటపైకి = మంటమీద; వావిరిన్ = (అధికంగా) ఆధిక్యంతో; క్రమ్ము = కమ్ముకొనే; ఆశలభవర్గము చాడ్పునన్ = మిడతల గుంపువలె; గ్రమందిపోరె = నాశన మయిపోరూ!; అక్కట = అయ్యో!; వారికిన్= ఆకౌరవులకూ; వారివారికిన్= వాళ్ళ వాళ్ళకూ (వాళ్ళ ఆప్తులకూ); కాల+అవధి = గడువు(యముడు) పెట్టినకాలపుమితి; అయ్యెన్+కావలయున్ = అయింది కాబోలు

భా : "రాజా! నీకొడుకులు పుణ్యాత్ముడూ, అనంత పరాక్రమం కలవాడూ అయిన శ్రీకృష్ణుని కేవలం సామాన్యమనుష్యు డనుకొని ఎదిరించినా బంధించినా మంట మీద ఆధిక్యంతో కమ్ముకొనే మిడతల గుంపు వలె నాశనమయిపోరూ? అయ్యో! ఆ కౌరవులకూ, వారి అనుయాయులకూ జీవిత కాలావధి తీరి పోయిందేమో!

వి. విదురుని మాటలలో మరికొన్ని విశేషాలు మూలంలో (5-131-41 నుండి 53 వరకు) ఇలా ఉన్నాయి. 404వ పద్యం ఈ విషయానికి సంగ్రహ రూపం.

"దుర్యోధనా! నామాటవిను; సౌంభద్వారంలో ద్వివిదుడనే వానరరాజు ఉండే వాడు. అతడొకమారు పెద్దరాళ్ళ వాన కురిపించి శ్రీ కృష్ణుని కప్పివేశాడు. అతడు నానావిధ పరాక్రమాలు చూపి శ్రీ కృష్ణుని బంధించాలి. అనుకున్నాడు కాని అది అతనికి చేతకాలేదు. అలాంటి కృష్ణుని నీవు బలంతో బంధించాలని అనుకుంటున్నావు. అలాగే ప్రాగ్జ్యోతిషంలో నరకుడు దానవులతో గూడి ఈయనను బంధింపజూచాడు. కాని అతడూ విఫలుడయ్యాడు. అనేక యుగాల ఆయుస్సుగల ఆనరకుని యుద్ధంలో నేలగూల్చి కృష్ణుడు ఆతని ఇంటగల వేలకొలది రాజ కన్యలను ఉద్ధరించి పెళ్ళాడాడు. నిమోచనంలో ఆరువేల మంది రాక్షసులను భగవానుడు పాశాలతో బంధించాడు. అంతమంది అసురులూ ఆయనను బంధించలేకపోయారు. ఈయన బాల్యంలో పూతనను సంహరించాడు. గోరక్షణకు గోవర్ధన పర్వతం ఎత్తాడు. అరిష్టుడు, ధేనుకుడు, చాణూరుడు, కంసుడు అనేవారిని సంహరించాడు. జరాసంధ దంతవక్త్ర శిశుపాలబాణులను,

అనేక రాజులను మట్టికరిపించాడు. వరుణుని, అగ్నిని జయించాడు. పారిజాతాపహరణ సమయం లో సాక్షాత్తు ఇంద్రునే ఓడించాడు. జగత్తు ఏకార్ణవంగా ఉన్నప్పుడు మధుకైటభులను సంహరించాడు. మరొక అవతారం ఎత్తి హయగ్రీవుడు అనే రాక్షసుని సంహరించాడు. ఈయన సర్వకర్త. ఈయనకు కర్త మరొకడులేడు. ఈయన సంకల్పించినవి అన్నీ నెరవేరుస్తాడు ఇలాంటి కృష్ణుని మహత్తు నీకు తెలియదు."

వ. అనుటయు గోవిందుం డందఱు విన నంబికానందనున కిట్లనియె.399

భా : *ఆమాటలు విని కృష్ణుడు ధృతరాష్ట్రునితో ఇలా అన్నాడు.*

ఉ. "రోషము నాపయిం గలిగి క్రూరతఁ గౌరవు లింత సేఁత సం
తోషమ; నీవు ప్రాభవముతోఁ దగ నాకు ననుజ్ఞ యిమ్ము;ని
ర్దోషత నేను నోపుగతి దోర్బల దుర్జయు లైనవారి వి
ద్వేషముఁ జక్కఁబెట్టి; జగతీవర! యింతకుఁ బోయివచ్చెదన్" 400

అ : జగతీవర! = రాజా!; నాపయిన్ = నామీద; రోషము = కోపం; కలిగి; కౌరవులు; క్రూరతన్= క్రూరత్వంతో; ఇంత = ఇదంతా; చేఁత= చేయటం; సంతోషము = సంతోషమే; నీవు; ప్రాభవముతోన్ = ప్రభుత్వంతో (అధికారంతో); తగన్ = తగినట్లుగా (సముచితంగా); నాకున్ అనుజ్ఞ; ఇమ్ము; దోర్బల దుర్జయులు+ఐన= భుజబలంతో జయించటానికి వీలుకాని వారియొక్క; విద్వేషమున్ = విరోధాన్ని; నిర్దోషతన్ = తప్పులేకుండా; నేనున్ = నేనూ; ఓపుగతిన్ = ఓపినంతగా -చేతనయినంతగా; చక్కఁబెట్టి = అణిచి (సవరించి); ఇంతకున్ =స్వల్పకాలంలో (ఇంక కొద్దిసేపటికి); పోయివచ్చెదన్ = వెళ్ళివస్తాను.

భా : *"రాజా! నామీద కోపంవచ్చి కౌరవులు క్రూరతతో ఇదంతా చేయటం నాకు చాలా సంతోషం! నీవు అధికారప్రాభవంతో నాకు అనుమతి నివ్వు. నేను ఎలాంటి తప్పులేకుండా భుజబలంతో దుర్జయులయిన వాళ్ళ విద్వేషాన్ని నాచేతనయినంతగా సరిదిద్ది ఇంకకొద్ది సేపట్లో వెళ్ళివస్తాను."*

క. అనుడు; ససంభ్రమముగ న
జ్జనపతి దుశ్శాసనాది సకల పరిజనం
బును నాదుర్జనునిం దో
డ్కొని రమ్మని విదురుఁ బనుచుడుం జని యతఁడున్. 401

అ : అనగా; ఆ+జనపతి = ఆధృతరాష్ట్రమహారాజు; ససంభ్రమముగన్ = తత్తరపాటు (భయం)తో; దుశ్శాసన+ఆదిసకలపరిజనంబును = దుశ్శాసనుడు మొదలయిన సమస్త పరివారాన్నీ; ఆ దుర్జనునిన్ = ఆదుర్మార్గుని (దుర్యోధనుని); తోడ్కొని రమ్ము+ అని = తీసుకొనిరా; విదురున్; పనుచుడున్ = పంపగా; అతఁడున్ = ఆ విదురుడు; చని = వెళ్ళి

భా : *అనేటప్పటికి ఆధృతరాష్ట్రుడు తత్తర పాటుతో విదురుని పిలిచి దుశ్శాసనుడు మొదలయిన సమస్త పరిజనులనూ, ఆదుర్జనుడయిన దుర్యోధనునీ వెంట బెట్టుకొని తీసుకురా అని పంపాడు. ఆవిదురుడు వెళ్ళి-*

వ. సపరివారంబుగా దుర్యోధనుం దోడ్తెచ్చినం జూచి యతనికి ధృతరాష్ట్రుం డిట్లనియె. **402**

అ : సపరివారముగాన్ = బంధుమిత్రులతో గూడా; తోడ్తెచ్చినన్ = వెంటబెట్టుకొని తీసుకొనిరాగా..

భా : దుర్యోధనుని బంధు మిత్రులందరితో వెంటబెట్టుకొని తీసుకొని వచ్చాడు. అతనివైపు తలతిప్పి ధృతరాష్ట్రుడు ఇలా అన్నాడు.

చ. "అలవి యెఱుంగ కిట్లు దనుజారికిఁ గీ డొనరింప, నీవు నీ
తులువలు నుత్సహించితిరి; దుర్మతులార! సమీరు మీకుఁ జే
నలవడిఁ బట్ట వచ్చునె? మహాద్రిఁ గదల్పఁగఁ బోలునే! దవా
నలుఁ జమరంగ శక్యమె? వినాశముఁ బొందెద; రేమిసేయుదున్!"403

అ : అలవి = శక్తి (సామర్థ్యం); ఎఱుంగక = తెలియక; దనుజ+అరికిన్ = రాక్షసులశత్రు వయిన కృష్ణునికి; ఇట్లు = ఇలా; కీడు = అపకారం; ఒనరింపన్ = చేయటానికి; నీవున్ = నీవూ; ఈతులువలున్ = ఈదుష్టులూ; ఉత్సహించితిరి = ప్రయత్నించారు; దుర్మతులార= దుష్టబుద్ధులారా; మీకున్; సమీరున్ = గాలిని; చేన్ = చేతితో; అలవడన్ = స్వాధీనమయ్యేటట్లు (నాటంగా); పట్టవచ్చునె = పట్టుకోవటంవీలు అవుతుందా?; మహాద్రిన్ = పెద్దకొండను; కదల్పన్+పోలునె= కదలించటంశక్యమా?; దవానలున్ = అగ్నిని; చమరంగన్+శక్యమె = అరచేతితోరాచటం సాధ్యమేనా?; వినాశమున్; పొందెదరు; (నేను) ఏమి+చేయుదున్ = ఏంచేసేది?

భా : "దుర్యోధనా! నీవూ; ఈదుష్టులూ మీశక్తి సామర్థ్యాలు మీకు తెలియక ఇలా కృష్ణునికి అపకారం చేయాలని ప్రయత్నిస్తున్నారు. దుష్టబుద్ధులారా! గాలిని పిడికిలిలో బిగించగలరా? మహాపర్వతాన్ని కదిలించటం మీతరమా? అరచేతితో అగ్నిని రుద్ది చల్లార్చటం సాధ్యమేనా? మీరు సర్వనాశనం అవుతారు సుమా! ఇప్పుడు నేను ఏంచేసేది?'

ఆ. అనిన; విదురుఁ డిట్టులను సుయోధనుతోడ;
"బాలకేళిఁ దొడఁగి లీలఁ గృష్ణుఁ
డెచట నెచట నెవ్వ రెవ్వరి నేమేమి
సేసె వినవె? యేల చెడియె దిట్లు?" **404**

అ : అనినన్ = అనగా; విదురుఁడు; సుయోధనుతోడన్; ఇట్టులు = ఇలా; అనున్= అన్నాడు; కృష్ణుఁడు; బాలకేళిన్ = బాలక్రీడను; తొడఁగి = ప్రారంభించి; లీలన్ = విలాసంగా; ఎచటనెచటన్ = ఎక్కడెక్కడ; ఎవ్వరెవ్వరిన్ = ఎవరెవరిని; ఏమి+ఏమి = ఏమేమి; చేసెన్ = చేశాడో; వినవె = వినలేదా?; ఇట్లు = ఇలాగా; ఏలచెడియెదు = ఎందుకు చెడిపోతావు?

భా : అని ధృతరాష్ట్రు డనగా విదురుడు దుర్యోధనునితో ఇలా అన్నాడు. కృష్ణుడు చిన్నప్పుడు బాలక్రీడలు ప్రారంభించి అలవోకగా ఎక్కడెక్కడ ఎవరెవరిని ఏమేమి చేశాడో వినలేదా? ఎందుకు ఇలా చెడిపోతావు?"

వ. అనియె; నట్టియెడఁ గట్టెదుర నున్న యక్కురుపతి కుమారుం జక్కఁజూచి; యే నొక్కరుండన యని తలంచియె దుర్మదంబునం బొదివిపట్టి నుత్సాహంబు సేసి' తనుచు దరహాసంబు సేయు వాసుదేవుని ఫాలప్రదేశంబున బ్రహ్మయు, వక్షంబున విరూపాక్షుండును, వదనంబున వహ్నియుఁ, బార్శ్వంబుల నింద్రయమ వరుణకుబేరులు నాదిత్య మరు ద్విశ్వేదేవాశ్వినులు నుద్భవించిరి. హలగాండీవమండితబాహులగు బలదేవార్జునులు సవ్య దక్షిణ భుజంబులను, నిజాయుధహస్తు లగు యుధిష్ఠిరభీమ నకుల సహదేవులు వీఁపునను, వివిధ ప్రహరణ పాణులగు యదువృష్ణి భోజాంధకవీరు లూరులను బ్రభవించిరి. జనిత నానాహస్త విన్యస్తంబులయి శంఖచక్ర గదా ఖడ్గశక్తి శార్ఙ్గప్రముఖ నిఖిల సాధనంబులు వెలింగె. నేత్ర శ్రోత్ర నాసా వివరంబుల సధూమధూమకేతు జ్వాలా జాలంబులు నిగిడె. రోమకూప కలాపంబులం దరణి కిరణ నిభప్రభలు వెడలె. నిట్లు దుర్నిరీక్ష్యంబగు నత్తేజోరూపంబుఁ గనుం గొనంగొలఁది గాక సకలజనంబులు నయనంబులు మొగిడ్చి యద్భుత భయానకరసంబుల జొత్తిల్లు చిత్తంబుల తోడం గదలకుండ నప్పుండరీకాక్షుండు నారదాది మహామునుల వలనను భీష్మవిదుర ద్రోణ సంజయుల యందును గరుణాతరంగితం బగు కటాక్షవీక్షణం బొలయ వారలకు దివ్యదృష్టి యొసంగిన నాపుణ్యపురుషులు సాంద్రానందంబునం దేలుచుండి; రయ్యవసరంబున.

405

అ : కడు+ఎదురన్ = ఎట్టఎదుట; ఆ+కురుపతికుమారున్ = ఆధృతరాష్ట్రకుమారుని (దుర్యోధనుని); చక్కన్+చూచి = సూటిగా చూసి; ఒక్కరుండన = ఒక్కడినే; ఉత్సాహంబు+చేసితి= ప్రయత్నంచేశావు; దరహాసంబు=చిరునవ్వు; ఫాలప్రదేశంబునన్=నుదుటియందు; విరూపాక్షుండును=శివుడూ; వహ్నియున్ = అగ్నీ; పార్శ్వంబులన్ = ప్రక్కలయందు; ఉద్భవించిరి= పుట్టారు; హలగాండీవ మండిత బాహులు = నాగ గాండీవధనుస్సులతో అలంకరింపబడిన చేతులు గలవారు; సవ్య దక్షిణ భుజంబులును = ఎడమ కుడి బుజాలు; నిజ+ఆయుధహస్తులు= తమ ఆయుధాలు చేతులలో కలవారు; వివిధ ప్రహరణ పాణులు=అనేకవిధాలయిన ఆయుధాలు హస్తములందు కలవారు; ఊరులను=తొడలనుండి; ప్రభవించిరి= పుట్టారు; జనితనానాహస్త విన్యస్తంబులు =పుట్టిన అనేక హస్తాలయందు ఉంచ బడినవి; నేత్రశ్రోత్ర నాసా వివరంబులన్= కన్నులు, చెవులు, ముక్కు రంధ్రాలనుండి; సధూమ.... జాలంబులు; సధూమ= పొగతోగూడిన; ధూమకేతు = తోకచుక్కయొక్క; జ్వాలా జాలంబులు = మంటల సమూహాలు; నిగిడెన్ = వెలువడినాయి (వ్యాపించాయి); రోమకూపకలాపంబులన్ = రోమకూపాల సమూహాలనించి; తరణికిరణప్రభలు=సూర్యకిరణాల కాంతుల వంటి కాంతులు; దుర్నిరీక్ష్యంబు= తేరిపారజూడరానిది; ఆ+తేజోరూపంబున్ = ఆకాంతిగల ఆకారాన్ని; కనుంగొనన్+కొలఁది+కాక= చూడటానికి అలవికాక; మొగిడ్చి =మూసి; అద్భుతభయానకరసంబులన్ =ఆశ్చర్యము, భయమూ అనే రసాలతో; జొత్తిల్లు=తడిసిన: ఆ+పుండరీకాక్షుండు=పద్మాలవంటి కన్నులు గలవాడు(కృష్ణుడు);

కరుణాతరంగితంబు = దయతో పొంగి పొరలునది; కటాక్షవీక్షణంబు = క్రీగంటిచూపు; ఒలయన్= ప్రసరించగా; సాంద్ర+ఆనందంబునన్ = దట్టమయిన ఆనందంతో; ఆ+అవసరంబునన్ = ఆ సమయంలో.

భా : *అని అన్నాడు, అప్పుడు కృష్ణుడు తనకు ఎట్టఎదుట ఉన్న దుర్యోధనుని ముఖంలోకి సూటిగా చూసి 'నేను ఒంటరివాడిని అని అనుకొని దురహంకారంతో పట్టి బంధించాలని ప్రయత్నం చేశావుకదూ!' అని చిరునవ్వు నవ్వాడు. అప్పుడు ఆశ్రీకృష్ణుని నుదుట బ్రహ్మదేవుడూ, వక్షఃస్థలంలో పరమేశ్వరుడూ, ముఖంలో అగ్నిదేవుడూ, ప్రక్కలలో ఇంద్రుడూ, యముడూ, వరుణుడూ, కుబేరుడూ, ఆదిత్యులూ, మరుత్తులూ, విశ్వేదేవులూ,ఆశ్వినులూ కలిగారు. నాగలిధరించిన బలరాముడు ఆయనకు ఎడమబుజమూ, గాండీవం ధరించిన అర్జునుడు కుడిబుజమూ అయినారు. తమతమ ఆయుధాలు ధరించిన ధర్మజ భీమ నకుల సహదేవులు ఆయన వీపునుండీ; నానావిధాలయిన ఆయుధాలు చేతులలో ఉన్న యాదవులు, వృష్ణులు, భోజులు, అంధకవీరులు ఆయన తొడలనుండి ఆవిర్భవించారు. అప్పటికప్పుడు కలిగిన ఆయన అనేక హస్తాలలో ఉన్న శంఖమూ, చక్రమూ, గదా, ఖడ్గమూ, శక్తీ ధనుస్సు మొదలయిన సమస్తసాధనాలూ వెలిగిపోతున్నాయి. కన్నులూ, చెవులూ, ముక్కుపుటాలనుండి పొగతోగూడిన తోకచుక్కల జ్వాలలు వెలువడ్డాయి. ఆయన రోమకూపాలనుంచి సూర్య కిరణాలతో సమానమయిన కాంతులు బయలుదేరాయి. ఇలాగా తేరిపారజూడ వీలుగాని ఆతేజోరూపం చూడలేక సభలో ఉన్న జనులు అందరూ కన్నులు మూసుకొని ఉన్నారు. అప్పుడు వారి మనస్సులు ఆశ్చర్యభయరసాలలో ఆర్ద్రమయిపోయాయి. అందువల్ల నిశ్చలంగా ఉన్నారు. అప్పుడు శ్రీకృష్ణుడు నారదాది మహామునులనూ, భీష్మవిదుర ద్రోణసంజయులనూ దయార్ద్రమయిన క్రీగంటితో చూసి వారికి దివ్యదృష్టి నిచ్చాడు. ఆపుణ్యాత్ములు ఆదివ్యదర్శనానందంలో మునిగి తేలుతున్నారు. ఆసమయంలో....*

వి. ఈ విశ్వరూపప్రదర్శనం మూలంలో పదిశ్లోకాలలో ఉంది. తిక్కన చెప్పిన దానికి మూలానికి కొంచెం తేడా ఉంది.

మహాభారతంలో శ్రీకృష్ణుని విశ్వరూపప్రదర్శనం మూడుసన్నివేశాలలో ఉంది. వాటిల్లో ఇదిమొదటిది. రెండవది మహాభారతయుద్ధారంభంలో భగవద్గీతలో అర్జునునకు భగవంతుడు దర్శింపజేసింది భీష్మపర్వంలో ఉంది. మూడవది మహాభారత యుద్ధంతరువాత శ్రీకృష్ణుడు ఉదంకమహర్షికి చూపించింది అశ్వమేధపర్వంలో ఉంది.

తే. **దేవదుందుభివ్రాతంబు దివిరెఁ. గల్ప**
వృక్షపుష్ప ధారామయ వృష్టి గురిసె.
సిద్ధ సాధ్య విద్యాధర శ్రేణి భక్తి
నిచ్చు జయజయ శబ్దంబు లెసఁగెఁ జదల. **406**

అ : దేవ దుందుభివ్రాతంబు; దేవతల భేరుల సమూహం; తివిరెన్ = మ్రోగింది. కల్ప..... వృష్టి; కల్పవృక్ష = కల్పవృక్షాల యొక్క; పుష్ప = పూల; ధారామయ = ధారారూపమయిన;

వృష్టి = వర్షం; కురిసెన్; సిద్ధసాధ్యవిద్యాధరశ్రేణి = సిద్ధులుసాధ్యులు విద్యాధరుల యొక్క సమూహం; భక్తిన్ = భక్తితో; ఇచ్చు = చేసే; జయజయశబ్దంబులు = జయజయ అనే మాటలు; ఎసఁగెన్ = వ్యాపించాయి.

భా : ఆకాశంలో దేవదుందుభులు మ్రోగాయి. కల్పవృక్షాల పూలు వర్షంగా కురిశాయి. సిద్ధులు సాధ్యులు విద్యాధరుల సమూహం భక్తితో చేసే జయజయధ్వానాలు అంతటా వ్యాపించాయి.

వ. అప్పుడు ధృతరాష్ట్రుం డమ్మహాసంకులంబు విష్ణుని దివ్యవిజృంభణంబు గావలయు నని యూహించి. 407

అ : ఆ+మహాసంకులంబు = ఆగొప్పధ్వని; విష్ణుని దివ్య విజృంభణంబు=విష్ణుదేవుని దివ్యమైన వ్యాప్తి.

భా : అప్పుడు ధృతరాష్ట్రుడు ఆమహాధ్వని కలకలం శ్రీకృష్ణుని విశ్వరూప వ్యాప్తి అయి ఉంటుంది అని ఊహించాడు.

క. "కరుణింపుము సంశ్రితభయ
హరణధురీణా! సహింపు మజ్ఞానంబున్;
శరణంబు వేడెద భవ
చ్చరణంబులు గనుఁగొనం బ్రసాదింపఁగదే!" 408

అ : సంశ్రిత..... ధురీణా; సంశ్రిత = ఆశ్రయించినవారి యొక్క; భయ = భయాన్ని; హరణ = పోగొట్టటంలో; ధురీణా = అగ్రేసరుడా(శ్రేష్ఠుడా); కరుణింపుము = దయచూపించు; అజ్ఞానంబున్ = అజ్ఞానాన్ని; సహింపుము; శరణంబు వేడెదన్ = శరణు కోరుతున్నాను; భవత్+చరణంబులు = మీపాదాలను; కనుఁగొనన్ = చూచేటట్టుగా; ప్రసాదింపగదే = అనుగ్రహించవలసింది.

భా : "ఆశ్రయించిన వారి భయం పోగొట్టటంలో సమర్థుడవయిన కృష్ణా! దయచూడు. నాఆజ్ఞానాన్ని సహించు. నిన్ను శరణు గోరుతున్నాను. నీపాదదర్శనం చేసేటట్లు అనుగ్రహించు."

చ. అనుడు; దయార్ద్రచిత్తుఁ డగు నప్పరమేశ్వరుఁ డిచ్చె దృష్టి య
జ్జనపతి, కద్భుతం బడర సమ్మదపూరము గ్రమ్మ నాతఁడుం
గనుఁగొని భక్తి మ్రొక్కి "నినుఁ గంటిఁ గృతార్థుఁడ నైతి, నింక నొ
ల్ల నొరులఁ జూడ, లోచనములం బురుషోత్తమ! సంహరింపవే." 409

అ : అనుడున్ = అనగా; దయా+ఆర్ద్రచిత్తుఁడు = కరుణతోతడిసిన (మృదువయిన) మనస్సుగలవాడు; అగు = అయిన; ఆ+పరమేశ్వరుఁడు = ఆపరమాత్మ; ఆ+జనపతికి = ఆ ధృతరాష్ట్ర మహారాజుకు; దృష్టి = చూపు; ఇచ్చెన్; ఆతఁడున్ = ఆధృతరాష్ట్రుడు; అద్భుతంబు= ఆశ్చర్యం; అడరన్ = కలుగగా; సమ్మదపూరము = ఆనందప్రవాహము; క్రమ్మన్ = వ్యాపించగా;

కనుఁగొని = చూచి; భక్తిన్ = భక్తితో; మ్రొక్కి =నమస్కరించి; పురుషోత్తమ = పురుషశ్రేష్ఠా; నినున్; కంటిన్ = చూశాను; కృతార్థుఁడన్; ఐతిన్ = అయినాను; ఇంకన్; ఒరులన్ = ఇతరులను; చూడన్+ఒల్లన్ = చూడటానికి ఇష్టపడను; లోచనములన్ = (నాకనుగ్రహించిన) కన్నులను; సంహరింపవే = ఉపసంహరించు.

భా : *ఆప్రార్థన విని దయాళు వయిన ఆపరమేశ్వరుడు ఆధృతరాష్ట్రునికి దృష్టిని ప్రసాదించాడు. అప్పుడారాజు ఆశ్చర్యంతో ఆనందరస ప్రవాహంలో మునిగి తేలుతూ ఆవిశ్వరూపాన్ని సందర్శించి భక్తితో నమస్కరించి "పురుషోత్తమా! నీ దివ్యదర్శనం చేసి కృతార్థుడనయ్యాను ఈ కన్నులతో ఇతరులను చూడాలనే కోరిక లేదు. కాబట్టి నీవిచ్చిన ఈదృష్టిని ఉపసంహరించు."*

వి. పుత్రవ్యామోహం మితిమీరి ఉన్నా ధృతరాష్ట్రుడు కన్నులు వచ్చిన తరువాత తన పుత్రశతంలో ఒక్కరిని గూడా తుదకు దుర్యోధనుని గూడా చూడాలని అనుకోకపోవటం ఆశ్చర్యం కలిగిస్తుంది. భగవానుని దివ్యరూప సందర్శనం చేసే భాగ్యం ధృతరాష్ట్రునికి ఒక్కడికే కలగటం, ఆయన కుమారులకు ఎవ్వరికీ లేకపోవటం, తుదకు ద్యూతసభలో ధర్మం చెప్పిన వికర్ణునికి గూడా లేకపోవటం ఇంకొక విచిత్రం. భగవంతుడు వీరికి ఎవ్వరికీ దివ్యదృష్టిని ప్రసాదించలేదన్నమాట!

క. అనిన పలుకులకు నచ్చటి
జనులెల్ల నృపాలు సితవిశాలాక్షుఁ గనుం
గొనుచుండి రపుడు దమనె
మ్మనమ్ము లాశ్చర్యరస నిమగ్నంబులు గాన్. 410

అ : అనినపలుకులకున్ = అనేమాటలకు; అచ్చటిజనులు+ఎల్లన్ = అక్కడ ఉన్న జనులు అంతా; అపుడు; తమనెమ్మనమ్ములు=తమనిండు మనస్సులు; ఆశ్చర్యరస నిమగ్నంబులు = ఆశ్చర్య రసంలోమునిగినవి; కాన్ = కాగా; సితవిశాల+అక్షున్ = తెల్లని విశాలమయిన కన్నులుగల; నృపాలున్ = రాజును (ధృతరాష్ట్రుని); కనుంగొను చుండిరి = చూస్తూ ఉన్నారు.

భా : *ఆమాటలు విన్న ఆసభలో ఉన్న జనులందరూ ఆశ్చర్య మగ్నాలయిన మనస్సులతో అప్పుడు తెల్లని విశాలమయిన కన్నులతో చక్కగా ఉన్న ధృతరాష్ట్రుని చూస్తూ ఉన్నారు.*

వ. తదనంతరంబ దామోదరుండు ధృతరాష్ట్రు నభిమతం బొడఁగూడ నతనికన్ను లెప్పటియట్ల కావించి నిజవిశ్వరూప ప్రపంచంబు నుపసంహరించి మునీంద్రుల నామంత్రణంబు సేయ నమ్మహాత్ము లంతర్ధానంబు సేసిరి. దానును సముత్థానంబు సేసి యంతకుమున్న సన్నిహితులై యున్న కృతవర్మకరంబును సాత్యకి హస్తంబును నవలంబించి యూరక వెడలె; నని చెప్పిన. 411

అ : తదనంతరంబ = వెంటనే; దామోదరుండు = కృష్ణుడు; అభిమతంబు = కోరిక; ఒడఁగూడన్ = కలుగగా; ఆమంత్రణంబు = ప్రయాణాదులలో బంధువులు మున్నగువారి

అనుజ్ఞపొందుట; వీడ్కోలు; అంతర్ధానంబు+ చేసిరి = కనపడకుండా (అదృశ్యం అయి) పోయారు. సముత్థానంబు = కూర్చున్నచోటునుంచిలేవటం; సన్నిహితులు = చాలా దగ్గరగా ఉన్నవారు.

భా : *వెంటనే శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రుని కోరిక ప్రకారం ఆతని కన్నులు ఎప్పటిలాగా (కనపడనివిగా)చేశాడు. తనవిశాల విశ్వరూప ప్రపంచాన్ని ఉపసంహరించాడు. అక్కడ ఉన్న మునిశ్రేష్ఠుల వద్ద సెలవు తీసుకున్నాడు. ఆమహాత్ములు అంతర్ధానమయినారు. అప్పుడు కృష్ణుడు తనసింహాసనంమీద నుంచిలేచాడు. అంతకుముందే తనప్రక్కన ఉన్న సాత్యకి కృతవర్మల చేతులు తన చేతులతో పట్టుకొని మామూలుగా బయలుదేరాడు. అని వైశంపాయనుడు చెప్పాడు.*

ఆ : "ఇవ్విధమునఁ గృష్ణుఁడేఁగిన పిదపటి
కథ వినంగ నాకుఁ గౌతుకంబు
మనము నిండి గడలుకొనుచున్నయది; వివ
రించి చెప్పు మునివరేణ్య!" యనుడు. 412

అ : ఈవిధమునన్ = ఈవిధంగా; కృష్ణుఁడు; ఏఁగినపిదపటికథ = వెళ్ళినతరువాత కథ; వినంగన్= వినటానికి; నాకున్; కౌతుకంబు = కోరిక; మనము; నిండి కడలు కొనుచున్నయది= ఉప్పొంగుతున్నది; మునివరేణ్యా=మునిశ్రేష్ఠా(దాని)వివరించి; చెప్పు =చెప్పుము; అనుడున్=అనగా;

భా : *" ఈవిధంగా కృష్ణుడు కౌరవసభనుండి వెళ్ళిన తరువాత జరిగిన వృత్తాంతం వినాలి అనే కోరిక నామనస్సునంతా వ్యాపించి ఉప్పొంగుతున్నది. అదంతా మునివరేణ్యా! నాకు వివరించి చెప్పవలసింది." అని జనమేజయుడు అడిగాడు.*

ఉ. భక్తమనః ప్రమోదకర పాదసరోజ వికాస! చేతనా
శక్తి మయ ప్రభావ! ముని సంస్తుత! సాత్యవతేయ భారతీ
ప్రోక్త! నిగూఢ సంప్రకట భూమ సమాశ్రయ!వత్సలత్వసు
వ్యక్త కృపాభిరామ! గుణవర్జన! నిష్కల! నిత్యపుష్కలా! 413

అ : భక్త......... వికాస; భక్త =భక్తుల యొక్క; మనస్ =మనస్సులకు; ప్రమోదకర =సంతోషం కలిగించే; పాద = పాదాలనే; పద్మ =కమలాలయొక్క; వికాస = వికాసం కలవాడా; చేతనాశక్తిమయ ప్రభావ = చైతన్యంతో గూడిన శక్తిరూపమయిన సామర్థ్యం కలవాడా; ముని సంస్తుత = జ్ఞానులచేత (స్వాత్మరూపంగా)స్తుతించబడేవాడా; సాత్యవతేయ =సత్యవతి కుమారుడయిన వ్యాసమహర్షి యొక్క; భారతీప్రోక్త =వాఙ్మయంచేత బాగా తెలియజెప్పబడినవాడా; నిగూఢ... సమాశ్రయ; నిగూఢ = అవ్యక్తకారణరూపమయిన దానినీ; సంప్రకట =వ్యక్తకార్యరూప మయిన దానినీ; భూమ=బృహద్రూపమును; సమాశ్రయ =ఆశ్రయించినవాడా!; వత్స...... అభిరామ; వత్సలత్వ=వాత్సల్యంచేత; సువ్యక్త=బాగాస్పష్టమయిన; కృపా=దయచేత; అభిరామ=మనో హరుడ వయినవాడా; గుణవర్జన=గుణాలు లేనివాడా! నిష్కల= అంశములు (కళలు)లేనివాడా; నిత్య పుష్కలా = ఎల్లప్పుడూ వృద్ధితో ఉండేవాడా.

భా : *దేవా! హరిహరనాథా! నీపాదపద్మవికాసం భక్తుల మనస్సులకు ఆనందం*

కలిగిస్తుంది. నీవు చైతన్యంతో గూడిన శక్తి కలవాడవు. అందువల్ల జ్ఞానులు నిన్ను నిరంతరం స్తుతిస్తూ ఉంటారు. నీప్రభావ విశేషాలను వ్యాసమహర్షి రచించిన సమస్త వాఙ్మయమూ తెలియజేస్తుంది. వ్యక్తస్వరూపమూ, అవ్యక్త రూపమూ, బృహద్రూపమయిన సమస్తానికీ నీవే ఆశ్రయం. నీవాత్సల్యంచేత నీదయా సౌందర్యం వ్యక్తమవుతుంది. నీవు సత్త్వరజస్తమోగుణాలు లేనివాడవు. పూర్ణరూపుడవు. కాబట్టి నీలో అంశలులేవు. నీవు నిరంతరం వృద్ధితో ఉంటావు.

క. అవ్యయ నిర్మల విభవా!
దివ్య ప్రభవా! సుఖైక దీప్తానుభవా!
నవ్యత్వ నిత్య! యతిసం
సేవ్య సుసాంగత్య! లోకజీవనకృత్యా! 414

అ : అవ్యయ = ఎన్నడూనశించని; నిర్మల = ప్రకృతిలో ఉండే మాలిన్యం లేని; విభవా = మోక్షస్వరూపుడా; దివ్యప్రభవా= అప్రాకృతమయిన జన్మకలవాడా; సుఖ+ఏక = కేవలము సుఖరూపంతో; దీప్త = ప్రకాశించే; అనుభవా = అనుభూతి కలవాడా; నవ్యత్వ నిత్య= క్రొత్తదనంతో నిత్యుడవయిన వాడా (నిత్యనూతనుడా); యతి... సాంగత్య; యతి = పరమహంస పరివ్రాజకులచేత; సంసేవ్య=సేవింపదగిన; సుసాంగత్య=మంచిసాంగత్యం (అభేదభావం) కలవాడా;లోకజీవనకృత్యా= ప్రపంచాన్ని పోషించటమే ప్రధానమయిన పనిగా కలవాడా!

భా : *హరిహరనాథా! నీవు నాశనంగానీ ఎలాంటి ప్రాకృతిక దోషంగానీ లేని మోక్షస్వరూపుడవు. ప్రకృతి కతీతమయిన జన్మకలవాడవు. కేవలమూ ఆనందరూపంతో వెలుగొందుతుంటావు. నిత్యనూతనుడుగా ఉంటావు. యతీశ్వరులు కూడా సేవించదగిన అభేదరూపుడవు. సమస్త ప్రపంచాన్ని పోషించటమే నీ ప్రధానకార్యం.*

మాలిని. రవి శశిమయనేత్రా! ప్రస్ఫురత్కాంతిహృద్యా!
నవజరఠ వికార న్యాస లీలానవద్యా!
వివృత నిగమ శాఖా విశ్రుతాగ్రైకవేద్యా!
వివిధ నియత చర్యా విత్తచిత్తప్రసాద్యా! 415

అ : రవిశశిమయనేత్రా = సూర్యచంద్రమయమయిన కన్నులు కలవాడా; ప్ర....హృద్యా; ప్రస్ఫురత్ = మిక్కిలిగా ప్రకాశిస్తున్న; కాంతి = తేజస్సుచేత; హృద్యా = మనోహరమయినవాడా; నవ .....అనవద్యా; నవ = క్రొత్తదనమూ(తారుణ్యమూ); జరఠ = ముసలితనమూ అనే; వికార= భావవికారాలను (మార్పులను); న్యాస = ఆరోపించటం(ఉంచటం) అనే; లీలా= విలాసంచేత; అనవద్యా = (పవిత్రుడా) నిర్దుష్టమయినవాడా; వివృత...... వేద్యా; వివృత = వ్యాఖ్యానించబడిన; నిగమశాఖా=వేదశాఖలలో; విశ్రుత = ప్రసిద్ధమయిన; అగ్ర = తుదిభాగాలచేత (ఉపనిషత్తులచేత); ఏకవేద్యా = ప్రధానంగా తెలియదగిన వాడా; వివిధ.....ప్రసాద్యా; వివిధ = అనేకవిధాలయిన; నియతచర్యా = నియమితప్రవృత్తులచేత; విత్త= తెలియబడిన; చిత్త = మనస్సు చేత మాత్రమే; ప్రసాద్యా = ప్రసన్నునిగా చేయదగినవాడా!

భా: హరిహరనాథదేవా! సూర్య చంద్రులు నీకన్నులు. మహత్తరమయిన తేజస్సు చేత నీవు మనోహరమయినవాడవు. క్రొత్తదనమూ, ముసలితనమూ మొదలయిన షడ్భావ వికారాలు నీకు లేకపోయినా కల్పించు కొంటావు. సమస్త వేదాల చివరలయిన ఉపనిషత్తుల చేతమాత్రమే తెలియదగినవాడవు. నానావిధాలయిన యమ నియమాదులచేత నిశ్చలమయిన మనస్సుతో మాత్రమేనిన్ను ప్రసన్నుని చేసుకొన వీలవుతుంది.

వి. అగ్ని ర్మూర్ధా చక్షుషీ చంద్ర సూర్యౌ దిశశ్శ్రోత్రే వాగ్వివృతాశ్చ వేదాః

"ఆవిరాట్పురుషునికి ద్యులోకము, మూర్ధము; చంద్ర సూర్యులు కన్నులు, దిక్కులు, చెవులు, వ్యక్తములయిన వాక్కులు వేదాలు" అనిముండకోపనిషత్తులోని ద్వితీయముండకములో ప్రథమఖండములోని 4వ మంత్రం చెపుతున్నది. దీనినే తిక్కన విరాటపర్వారంభంలో తనకు ప్రత్యక్షమయిన హరిహరనాథుడు తనయందు కరుణాళుడు కావటంవల్ల ఆయన కుడికన్నుగూడా చంద్రుడే అయినాడు. అని 1.ఆ.14ప.లో **"అనుకంపాతిశయమునఁ, దన దక్షిణనేత్రమును సుధారోచియకా** అని వర్ణిస్తాడు.

గద్యము

ఇది శ్రీమదుభయకవిమిత్ర కొమ్మనామాత్యపుత్ర
బుధారాధనవిరాజి తిక్కనసోమయాజి
ప్రణీతంబయిన శ్రీమహాభారతంబున
నుద్యోగపర్వంబునందుఁ
తృతీయాశ్వాసము

శ్రీమదాంధ్ర మహాభారతము
ఉద్యోగ పర్వము - చతుర్థాశ్వాసము

జనహిత వ్యాఖ్య

క: శ్రీ మత్తులసీ పల్లవ
దామచ్ఛవి లబ్ధమరకత ప్రతిమత్వో
ద్దామ ప్రభాస్థిమాలా
శ్యామాయిత విపుల వక్ష! హరిహరనాథా! 1

అ: శ్రీమత్.......... విపులవక్ష; శ్రీమత్=శుభకరములైన; తులసీ పల్లవ=తులసి దళముల యొక్క; దామ=మాలయొక్క; ఛవి=కాంతి వలన; లబ్ధ=పొందిన; మరకత= మరకతముల యొక్క; ప్రతిమత్వ=పోలికచేత; ఉద్దామ=గొప్పదైన; ప్రభా=కాంతిగల; అస్థిమాలా=ఎముకలమాల చేత; శ్యామాయిత=నల్లనైన; విపుల=విశాలమైన; వక్ష=వక్షఃస్థలము కలవాడా!-హరిహరనాథా!

భా: తులసి దళాల మాల కంఠంలో ఉన్నది. దాని కాంతి వలన మెడలోని ఎముకలదండ మరకతముల వలె ప్రకాశాన్ని పొందింది. అటువంటి ఎముకల దండ కాంతి చేత నల్లనైన వక్షఃస్థలంతో హరిహరనాథుడు ప్రకాశిస్తున్నాడు.

వి: తిక్కన హరిహరాద్వైతం ప్రతిస్తోత్రపద్యంలోనూ కనిపిస్తుంది. హరి తులసి మాల ధరించెడివాడు. హరుడు ఎముకల దండ వేసుకొనేవాడు. ఆ రెండింటినీ హరి హర నాథుడు ధరించినాడు. తులసి దళాల కాంతి ఎముకలను మరకతాలుగా భాసింపచేస్తోంది. అందువల్లనే హరిహరనాథుని వక్షఃస్థలం శ్యామల వర్ణంతో ప్రకాశిస్తోంది.

-: కృష్ణుండు కుంతి యింటికింజని యా యమతో మాటలాడుట:-

సం : 5-129-20

వ: దేవా! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియెఁ, గృష్ణుం డత్తెఱంగున వెడలిన విస్మితయై గాంధారి యభ్యంతర మందిరంబున కరుగం గౌరవులెల్లను బంధుమిత్ర సహాయ సహితంబుగాఁ దనతోడన వెడల మొగంబు గంటు వెట్టికొని కక్ష్యాంతరంబులు గడచినప్పుడు దారుకుండు తేరి నొగల పైనుండి పాడనూపి, కేలుమొగిడ్చి, ఫాలభాగంబునం గదియించినం, దత్ప్రదేశంబున నిలిచి, వారల దెస మరలి చూచి, మీరింక నిలువుం డని పలికిన నాంబికేయుండు, పుండరీకాక్షుం జేరి నిజతనూజుల నుపలక్షించి. 2.

అ: దేవా=ఓ హరిహరనాథా!; విస్మితయై=ఆశ్చర్యముపొందినదై; అభ్యంతర మందిరంబునకున్=లోపలి మందిరమునకు (అంతఃపురమునకు); గంటువెట్టికొని= చిన్నబుచ్చుకొని (ముడుచుకొని); కక్ష్యా అంతరములు=ఇంటిలోపలి భాగములు; దారుకుండు= కృష్ణుని రథసారథి; తేరి నొగలిపైన్ = రథంయొక్క కాడికట్టు మీద; పొడ+చూపి = కనిపించి: కేలుమొగిడ్చి = చేతులు జోడించి; ఫాలభాగంబునన్+కదియించినన్= నొసలిపై చేర్చగా: ఉపలక్షించి=చూచి;

భా: *దేవా! హరిహరనాథా! వైశంపాయనుడు జనమేజయునితో ఇలా అన్నాడు. కృష్ణుడలా వెళ్ళిపోగా గాంధారి ఆశ్చర్యంతో అంతఃపురం చేరింది. దుర్యోధనుడు మొదలైన కౌరవులంతా బంధుమిత్రులతో కూడి తనతోరాగా శ్రీకృష్ణుడు ముఖం చిన్నబుచ్చుకొని ఇంటిలోపలిభాగాలన్నీ దాటి వచ్చాడు. రథం నొగలిపైనుండి తనకు నమస్కరించిన దారుకుని చూచాడు. అక్కడ ఆగి మీరిక మరలండని కౌరవులతో పలుకగా ధృతరాష్ట్రుడు శ్రీకృష్ణుని సమీపించి నిలిచి, తనకుమారులను చూచి ఇలా అన్నాడు.*

వి: దుర్యోధనాదులు తనను చెరబట్టదలచటమూ, అశక్తదుర్జనులైన వారి దుస్సాహసమూ శ్రీకృష్ణుడికి ఖేదాన్ని కల్గించాయి. ఆ కారణంగా వారిని చూడటానికి కూడా ఇష్టపడక ముఖం దించుకున్నాడు.

వైశంపాయనుడు జనమేజయుడికి చెప్తున్నాడు భారతం. కృష్ణుడు కౌరవసభ వీడిన తర్వాత జరిగిన కథను చెప్పుమన్న జనమేజయునితో వైశంపాయను డన్నాడని తన భారత కృతిభర్తయైన హరిహరనాథునితో తిక్కన ఈ ఆశ్వాసం ఆరంభించి చెపుతున్నాడు.

ఉ: వీరును బాండుపుత్రులును వేరము దక్కి పొసంగి మన్కికై
పోరిత మాడి యే నటులు బుద్ధులు సెప్పిన భంగియుం గులా
చారము నిర్వహింపఁ బలుచందములం దగ దుఃఖపాటు నీ
కౌరవ జాతికిం దెలిసెఁ గాదె గదాధర! నీదుసన్నిధిన్. 3

అ: వీరునున్=దుర్యోధనాదులు; పాండుపుత్రులునున్=పాండవులునూ; వేరము=విరోధము; తక్కి=విడిచి; పొసంగి=సఖ్యపడి; మన్కికిన్+ఐ=జీవించడానికై; ఏన్=నేను; పోరితము+ఆడి=పోట్లాడి; అటులు=ఆవిధంగా; బుద్ధులు+చెప్పిన+భంగియున్=వివేకం మప్పిన తీరునూ; కుల+ఆచారమున్=వంశమర్యాదను; నిర్వహింపన్=నిలబెట్టుటకు; పలుచందములన్= అనేకవిధాలుగా; తగన్+దుఃఖపాటులున్=తగురీతి బాధపడుటను; గదాధర=ఓ కృష్ణ!; నీదు సన్నిధిన్= నీయెదుట; ఈ కౌరవజాతికిన్=కురువంశీయులైన వీరందరికీ; తెలిసెన్+కాదె=వెల్లడైనది కదా!

భా: *కౌరవులూ, పాండవులూ తమ మధ్యనున్న విద్వేషాలను మరచిపోయి సఖ్యపడి జీవించాలని నేను నా కుమారులతో మరీ మరీ చెప్పి బుద్ధి గరపటమూ, వంశమర్యాదను నిలబెట్టడానికి నీ సమక్షంలో నేను పడ్డపాట్లూ, కృష్ణా! ఈ కౌరవు లందరికీ తెలిశాయి గదా!*

వి: **నీ సన్నిధిలో ఈ కౌరవజాతికంతటికీ తెలిసింది** అని అనటంలో నిజాయితీ ఉండటం కన్న, నిజాయితీగా ఉన్నట్లు కనిపించాలన్న తాపత్రయమే ఎక్కువగా కనిపిస్తోంది. రాజులకు, అధికారులకూ అది చాలా అవసరం. వారి ఆంతరస్థితి కన్న బాహిరమైన వారి ప్రవర్తనను ప్రధానంగా పరిశీలిస్తారు ప్రజలు.

కౌరవ పాండవులు కలిసి మనటానికి, పాండవులకు వారి రాజ్యభాగ మివ్వటమే ధృతరాష్ట్రుడు చేయవలసిన పని. ఆపని చేయక ప్రియ వాక్యాలు పలికినంత మాత్రాన పాండవులు శాంతిస్తారా? తాను రాజై ఉండి తెగించి రాజ్యభాగ మివ్వక **కుమారునకు బుద్ధులు చెప్పానని** అంటే వివాద పరిష్కారానికి ఎంతవరకు కృషి చేసినట్లు? 'కృష్ణా నీముందే నేనెంత శ్రమించానో చూచావు గదా' అని అంటున్నాడు పైపెచ్చు. అరణ్య, అజ్ఞాతవాసాలు పూర్తిచేసికొని పాండవులు పంపిన ద్రుపద పురోహితుడు వచ్చి **తగవుమై కొంత భూమి యిచ్చి కూడి మనుడు** అని అంటే అందుకనుకూలంగా ఏమీ పలుకక రాయబారిని సత్కరించి మరలా సంజయుణ్ణి వారి వద్దకు పంపాడు. తిరిగివచ్చిన సంజయుని మాటలూ పెడచెవిని పెట్టాడు **లోకులు నిన్ను నిందిస్తుంటే వినలేక పోతున్నామని"** సంజయు డన్నా వినలేదు. విదురుడు, భీష్మద్రోణాదులు ఎంత చెప్పినా "దైవాధీనతకతంబున బిడ్డల నొత్తి చెప్పను నియమింపజాలనని, శాంతిబొందుట మేలు మన వారల కది ప్రియంబగునేని దానికి తగిన యత్నంబు సేసెద " నని అన్నాడే కాని దుర్యోధనుని కాదని యిచ్చే ప్రయత్నమేమీ చేయలేదు. కాబట్టి ధృతరాష్ట్రుని మాటలో నిజాయితీ పాలు తక్కువని నిర్ణయింపవలసి వస్తోంది.

4.

వ: **అని వెండియు.**

అ: వెండియున్=మరియూ,

భా: *ధృతరాష్ట్రు డలా పలికి మరలా (ఇలా అంటున్నాడు)*

తే: **నీకు శుద్ధుండ నగుటయ నిఖిల బంధు**
మిత్ర గురుజనకోటికి ధాత్రి కెల్ల
నంబుజాక్ష! నిర్దోషుండ నగుట; గాన
నా తెఱంగు నీ వెఱుఁగుట నాకుఁ జాలు. 5

అ: అంబుజ+అక్ష= (పద్మములవంటి కన్నులు గల) ఓ కృష్ణా; నీకున్=నీకు; శుద్ధుండన్+అగుట+అ=నిర్మలుడనగుటయే; నిఖిల........కోటికిన్; నిఖిల=సమస్తములైన; బంధు=బంధుజనుల యొక్క; మిత్ర=స్నేహితులయొక్కయు; గురుజన=ఆచార్యులయొక్కయు: కోటికిన్=సమూహానికీ; ధాత్రికిన్+ఎల్లన్=భూమండలాని కంతటికీ; నిర్దోషుండన్+అగుట= నిరపరాధినగుట; కాన=కనుక; నా తెఱంగున్=నా పద్ధతిని: నీవు; ఎఱుంగుట=తెలుసుకొనుట: నాకున్+చాలు=నాకు సరిపోవును.

భా: ఓ కృష్ణా! నీ దృష్టిలో నేను నిర్దోషినైతే, సకల భూమండలానికీ, సర్వబంధుమిత్ర గురుజనానికీ నిరపరాధినయినట్లే. కనుక నా సంగతి నీకు తెలిస్తే అది నాకు చాలు.

వి: ఇది ధృతరాష్ట్రుని గంభీరచిత్తవృత్తిని వెల్లడించే పద్యం. శ్రీకృష్ణుడు దివ్యదృష్టి నిచ్చి, తన విశ్వరూపాన్ని ధృతరాష్ట్రునికి చూపాడు. కనుక అతనికి సర్వాత్మకుడైన ఆ కృష్ణుని దృష్టిలో నిర్దోషి అనిపించుకోవడం కన్నా కావలసిన దేముంది.

ఆయన నిరపరాధి అంటే అందరకూ ఆ వ్యక్తి నిరపరాధి అవుతాడు. కాకపోయినా బాధలేదు. ఇదొక అంశం.

శ్రీకృష్ణుడు పాండవుల రాయబారిగా వచ్చాడు. ధృతరాష్ట్రుని నిర్దోషిగా భావిస్తే ఆ సంగతి పాండవులకు చెప్తాడు. వారందరికీ తాను నిర్దోషి అవుతాడు. ఇక మిగిలిన వారికి తాను నిర్దోషి అయినట్లే. ఇది మరొక అంశం.

వ : అనిన విని యచ్యుతుండు బాహ్లిక భీష్మద్రోణ కృప ప్రముఖ నిఖిల విశిష్టజనంబుల నాలోకించి. 6

అ: అచ్యుతుండు=శ్రీకృష్ణుడు; ప్రముఖ=మొదలైన; నిఖిల విశిష్టజనంబులన్= సమస్తమైన మహాత్ములను; ఆలోకించి=చూచి.

భా: *ధృతరాష్ట్రు డట్లు పలుకగా శ్రీకృష్ణుడు బాహ్లికుడు, భీష్ముడు, ద్రోణుడు, కృపుడు మొదలైన మహనీయులందరినీ చూచి (తర్వాతి పద్యంతో అన్వయం)*

వి: బాహ్లికుడు ప్రతీపుని కుమారుడు. శంతనుని సోదరుడు. కురువృద్ధుడు.

తే: "ఇప్పు డీ సభఁ బుట్టిన యింత వట్టు
మీకుఁ దెల్లంబు గాదె యీ మేదినీ వి
భుండు దా నేమిటికిని ముఖ్యుండఁ గాను
దప్పు తనదెస లేదని చెప్పి విడిచె. 7.

అ: ఇప్పుడు; ఈ సభన్=ఈ కౌరవ సభలో; పుట్టిన=సంభవించిన; ఇంతవట్టు= ఇదంతా; మీకున్=మీకందరికినీ, తెల్లంబు+గాదె=స్పష్టమే కదా!; ఈ మేదినీ విభుండు=ఈ ధృతరాష్ట్ర మహారాజు; తాను=తాను; ఏమిటికిని=దేనికినీ; ముఖ్యుండను+కాను=ప్రధానమైనవాడను కాను; తప్పు=దోషము; తనదెసన్=తనయెడ; లేదు+అని; చెప్పి విడిచెన్=(అని) ఊరకున్నాడు.

భా: *ఇప్పుడీ సభలో జరిగినదంతా మీరందరూ ఎరిగినదే! మహారాజైన ఈ ధృతరాష్ట్రుడు ఏ విషయంలోనూ తనకు పెత్తనం లేదని తనయెడ ఏ దోషమూ లేదని పలికి ఊరకున్నాడు.*

వి: 'తానేమిటికిని ముఖ్యుండనుగాను తప్పు తన దెస లేదు' అన్న ధృతరాష్ట్రుని **ఈ మేదినీ విభుండు** అని కృష్ణుడు పిలవటం అభిప్రాయ గర్భితంగా అనటమే.

రాజ్యం తనదై తనకు పెత్తనం లేదనీ, జరిగే అన్యాయాలతో తనకు సంబంధమూ, ప్రమేయమూ లేదనీ పలికి ఊరకున్నంత మాత్రాన రాజు దోషముక్తుడు కాలేదని కృష్ణుని యభిప్రాయం. అదే **'చెప్పి విడిచె'** అన్న మాటల్లో ధ్వనింపజేశాడు.

సభఁబుట్టిన యింతవట్టు' అన్నది దుష్టచతుష్టయం శ్రీకృష్ణునికి బంధించటానికి చేసిన దుష్ప్రయత్నాన్ని సూచిస్తుంది. అలానే కృష్ణుడంతటివాడు కురుపాండవ సఖ్యమును కోరి

రాయబారిగా వస్తే నిరాదరణచేసి దుర్యోధనుడు సభవీడి వెళ్లిపోవటం మొదలైన అంశాలు కూడా ' ఇంత వట్టు' తోనే స్ఫురిస్తాయి.

వ: **కావున నాకు నియ్యేడం దడయం బనిలేదు; పోయి వచ్చెద, ధర్మపుత్రునకు నింత వృత్తాంతం బెఱింగింపవలయు" నని పలికి, వారల నామంత్రణంబు సేసినవాఁడై, రథారోహణంబు సేసి, ధృతరాష్ట్రుండును నచటి జనంబులును వెనుకం జనఁ జని కుంతీగృహ ద్వారంబున నరదంబు డిగ్గి...** 8

అ: తడయన్+పనిలేదు=మసలనవసరంలేదు; ఆమంత్రణంబు+చేసినవాఁడు+ ఐ= వీడ్కొల్పినవాడై; రథ+ఆరోహణంబు=రథంబునెక్కుట; అరదంబు డిగ్గి= రథమునుండి దిగి (తరువాతి పద్యంతో అన్వయం)

భా: *కనుక ఈ కౌరవ సభలో నాకిక ఆలసింపవలసిన పనిలేదు. వెళ్లి వస్తాను. ఈ జరిగినదంతా ధర్మజునకు చెప్పాలి." అని వారందరినీ వీడ్కొని రథమెక్కి ధృతరాష్ట్రుడూ, అక్కడున్న వారూ తన వెనుక రాగా పోయి కుంతీదేవి ఇంటిముందు రథం దిగాడు.*

వి: **ఇయ్యెడన్** (ఈ తావున) అన్న పదం ధ్వనిగర్భితం. ఆశించిన కార్యం విఫలమైనచోటు అనీ, కయ్యాన్నే కానీ మైత్రీబంధాన్ని ఆదరించలేనిచోటు అని ఇంకా కృష్ణునకు ప్రతికూలములైన సుయోధనాదుల ప్రవర్తనలన్నీ ఆ పదంద్వారా స్ఫురిస్తాయి.

కం: **వారందఱుఁ దన తోడన**
గారవమున నరుగుదేరఁగాఁ జొచ్చి మహో
దారుఁడు గుంతీ చరణాం
భోరుహముల కెఱఁగి వినయభూషణుఁ డగుచున్. 9

అ: వారు+అందఱు=ఆ ధృతరాష్ట్రాదులంతా; తన తోడన=తన వెంటనే; అరుగుదేరఁ గాన్= రాగా; చొచ్చి=(కుంతీ గృహాన్ని) ప్రవేశించి; మహా+ఉదారుఁడు=ఉత్తముడైన కృష్ణుడు; కుంతీ చరణ+అంభోరుహములకున్=కుంతీదేవి పాదపద్మాలకు; వినయభూషణుఁడు+ అగుచున్ = వినయమే అలంకారముగా కలవాడై, అనగా-వినయంతో; ఎఱఁగి=మ్రొక్కి (తర్వాతి పద్యంతో అన్వయం)

భా: *ధృతరాష్ట్రాదులంతా సగౌరవంగా తనవెంటరాగా శ్రీకృష్ణుడు కుంతీదేవి ఇంటికి వెళ్లి ఆమె పాదపద్మాలకు నమస్కరించి సవినయంగా ఆమెతో ఇలా అంటున్నాడు.*

వి: కృష్ణుడు కుంతీదేవికి పాదాభివందనం చేయటం లోకానుశాసనం కొఱకు. తనవెంటనున్న పిన్నపెద్దల అంతరా లెరుగని కౌరవులకు కనువిప్పుకోసం.

నమే పార్థాస్తి కర్తవ్యం త్రిషు లోకేషు కించన
నానవాప్త మవాప్తవ్యం వర్త ఏవ హి కర్మణి॥ అని గీతలో ఈ విషయాన్ని స్పష్టంచేశాడు కూడా.

కం: కౌరవ సభఁ దా నాడిన
గౌరవ వాక్యములు గార్యఖడ్గక్రమవా
క్పూరములు సుయోధను దు
ప్ప్రారంభము నల్ప వచన పద్ధతిఁ జెప్పెన్. 10

అ: కౌరవసభన్=కౌరవసభలో; తాన్=(శ్రీకృష్ణుడు) తాను; ఆడిన= పలికిన; గౌరవ వాక్యములు= మన్ననతోకూడిన మాటలు; కార్యఖడ్గక్రమ వాక్పూరములున్= కార్యవాద, ఖడ్గవాదముల కనువైన మాటలును; సుయోధను+దుస్+ప్రారంభమున్=దుర్యోధనునియొక్క దుష్కార్యాచరణము; అల్పవచన పద్ధతిన్=నీచమైన వాగ్ధోరణిని/క్లుప్తంగా; చెప్పెన్.

భా: కౌరవసభలో తానెంతో గౌరవంగా పలకటం, కార్యఖడ్గవాదాల కనువైన మాట లనటం ,దుర్యోధనుని అవినీతి చర్య , సంగ్రహంగా కుంతీదేవికి చెప్పాడు.

వి: సంధి పొసగేవిధంగా మాటాడి విఫలమైన తర్వాతనే తెగ తెంపులయ్యేలా తాను మాట్లాడినట్లు కృష్ణుడు చెప్తున్నాడు. సామదానభేదోపాయాల తర్వాత కదా దండోపాయాన్ని ఆశ్రయించటం.

అదీగాక దుర్యోధనుడు తనను బంధింపబూనటం, కలిసి రానివిధంగా మాటాడటంకూడా కృష్ణుడు కుంతికి చెప్పాడు. ఇది కుంతి తన ప్రయత్నాన్ని అభినందించటానికీ, జరిగిన దానికీ జరగబోయేదానికీ కూడా ఆమె ఆమోదాన్ని పొందటానికీ ఉపకరిస్తుంది.

వ: ఇట్లు ధృతరాష్ట్రు కొలువునం బుట్టిన విశేషంబులు పాండురాజ మహిషి కెఱింగించి, మాధవుండు; మఱియును.................. 11

అ: కొలువు=సభ; మహిషి=పట్టపుదేవి;

భా: ఈ విధంగా ధృతరాష్ట్రుని కొలువుకూటంలో సంభవించిన విశేషాలన్నీ పాండురాజు పట్టపుదేవి కుంతికి తెలిపి ఆపైన శ్రీకృష్ణుడు (ఇంకా ఇలా అంటున్నాడు)

తేగీ: కురుకుమారులు దమయంతఁ గుడిచి క్రొవ్వి
మీఁదెఱుంగరు మాకేమి మేల కాక
నాలుకలు గ్రోయు నర్జునానలము దగిన
యెర గొనం గని సంతృప్తి యెసక మెసఁగు. 12

అ: కురుకుమారులు=దుర్యోధనాదులు; తమ+అంతన్=యథేచ్ఛగా; కుడిచి= భుజించి; క్రొవ్వి=మదించి; మీఁదు+ఎఱుంగరు=తర్వాతి సంగతి నెఱుగరు; మాకున్+ఏమి= మాకేమి (పాండవులకు); మేలు+అ కాక=మేలే కలుగుతుంది; నాలుకలు+క్రోయు= నాలుకలను చాచు; అర్జున+అనలము=అర్జునుడనే అగ్ని; తగిన+ఎరన్=ఉచితమైన ఆహారాన్ని (దుర్యోధన, దుశ్శాసనాదులను) కొనన్+కని=గ్రహింపగా చూచి;సంతృప్తి; ఎసకము+ఎసఁగు= అతిశయించును.

భా: కౌరవులు యథేచ్ఛగా రాజభోగా లనుభవించి, మదించి, రాబోవు ఫలితాలను, మంచి చెడ్డలను తెలుసుకొనజాలకున్నారు. మా కేమి? మేలే కలుగుతుంది. అర్జునాగ్ని నాలుకలు చాచుతూ తనకు తగ్గ ఆహారాన్ని గ్రహింపగా చూచిన మాకు తృప్తి కలుగుతుంది.

వి: మాకేమి మేలకాక అని కృష్ణుడు పాండవులలో ఒకడుగా పలుకుతున్నాడు. **వారలు నాకుంబ్రాణములు** అని పాండవులు తన పంచప్రాణాలని దుర్యోధనాదులముందే శ్రీకృష్ణుడు అని ఉన్నాడు. "యతః కృష్ణ స్తతో జయః" అన్న రీతిగా కృష్ణుడున్న పక్షానికి మేలేకానీ కీడు కలుగుతుందా? పూర్తిగా కబళిస్తే తప్ప అగ్నిహోత్రుడు శమించడు. అలానే అర్జునాగ్ని కౌరవులను సమూలంగా నశింపజేస్తుందని సూచన.

పరిమితి అంటూ లేకుండా కొనసాగే భోగానుభవం తప్పక చేటును కల్గిస్తుందని ధ్వని.

వ : " పాండుకుమారుల పాలికిం బోయి వచ్చెద, వారికిం దగిన బుద్ధు లానతి మ్మనిన, నద్దేవి విక్రమోపజీవులైన ముచుకుందుండును, సృంజయుండును నను తొంటి నరపతుల చరిత్రంబులు సెప్పి యుధిష్ఠిరుండు వీరిని వినండొ కాక యని పలికి యెల్లవారును వినుచుండ వెండియు నిట్లనియె. 13

అ : విక్రమ + ఉపజీవులు = పరాక్రమంచే బ్రతుకువారు.

భా: "నేనిప్పుడు పాండవుల చెంతకు పోతున్నాను. వారికి నీ మాటలుగా చెప్పవలసినవి చెప్పు" అని శ్రీ కృష్ణు డనగా పరాక్రమవంతులై జీవించిన ముచుకుంద, సృంజయుల వృత్తాంతం చెప్పి ధర్మరాజు వారిని గుఱించి వినలేదేమో అని, అందరూ వింటూండగా మరలా ఇలా అంటోంది.

వి : ముచుకుందుడనే రాజర్షి మీద గౌరవంతో కుబేరుడాతనిని ఈ భూమండలం స్వీకరించవలసినదిగా కోరాడు. దానిని నిరాకరిస్తే రాజులు బాహుబలంచేత సంపాదించిన దానినే అనుభవిస్తారని పలికి కుబేరుణ్ణే ఆశ్చర్యపరచాడు **ముచుకుందుడు.**

విమల ఉత్తమ రాజవంశంలో జన్మించిన మహిళామణి. ఆమె కుమారుడు సృంజయుడు. అతడు సింధుదేశాధీశునితో యుద్ధంలో ఓడిపోయి దీనవదనంతో తిరిగి వచ్చి నిద్రిస్తుండగా లేపి అతనికి పరాక్రమ వృత్తితో జీవించుటయే క్షత్రియులకు తగినదని తల్లి చెప్తుంది. అతని దుర్బలత ఆ తల్లి ప్రబోధంతో ఉత్తేజాన్ని పొందగ విజయమో వీర స్వర్గమో అని వెళ్ళి విజయం సాధిస్తాడు.

ఉ : రాజుల కెందు నారయ (బరాక్రమ జీవన వృత్తి దక్క నొం
డోజ నిషిద్ధ మండ్రు మును; లుత్తమ సత్త్వులు వంశధర్మముల్
పూజిత భంగిఁ జేయుదురు; బుద్ధి విహీనులు వానిఁ దక్కి ని
స్తేజపుఁ గూటి కియ్యకొని దీనత బొందుదు రంబుజోదరా ! 14

అ: అంబుజ +ఉదర = పద్మము నాభియందు గలవాడా! (కృష్ణా); రాజులకున్+ ఎందున్=క్షత్రియుల కే పరిస్థితిలోనైనా; ఆరయన్=చూడగా; పరాక్రమ - జీవన - వృత్తి + తక్కన్= వీరులై (శౌర్యంతో) జీవించు నడవడి తప్ప ; ఒండు+ ఓజ = మరొకరీతి ; మునులు; నిషిద్ధము+ అండ్రు = తగదని పల్కుదురు ; ఉత్తమ సత్త్వులు = ఉదాత్త స్వభావం గలవారు; వంశధర్మముల్+ తమ తమ కులాచారాలు; పూజిత భంగిన్ = అందరూ మెచ్చుకునే విధంగా; చేయుదురు; బుద్ధి విహీనులు= అవివేకులు; వానిన్ + తక్కి=ఆ కుల ధర్మాలనువీడి; నిస్తేజము+ కూటికిన్=ఇతరుల పెట్టుపోతలకు; ఇయ్యకొని=అంగీకరించి; దీనతన్+పొందుదురు= నైచ్యాన్ని అనుభవించుదురు.

భా: మునులు క్షత్రియులకు శౌర్యంతో జీవించటాన్నే విధించారు. ఇతరమార్గాలను నిషేధించారు. ఉదాత్త ప్రకృతులైన వీరు అందరూ మెచ్చుకునేలా తమ తమ వంశాచారాలను పాటిస్తారు. అవివేకులు భిక్షాన్నానికి సిద్ధపడి దైన్యాన్ని అనుభవిస్తారు.

వి : ఈ పద్యంలో కుంతి స్వధర్మంవిడిచి కౌరవానుగ్రహంకోసం ప్రాకులాడవద్దనీ, పరాక్రమించి రాజ్యభోగా లనుభవించుమనీ అది కీర్తిప్రదమూ, మునిజనాభిమతమూ అని సూచించింది.

శ్రీ కృష్ణుడు రాయబారానికి వెళ్ళేందుకు కుంతిని కలిసినపుడు ఏ అభిప్రాయాలు ప్రకటించిందో అదే అభిప్రాయాలను మరింత ఆవేశంతో వెల్లడించింది. తన భావనగా కాక క్షత్రియ కాంతా సాధారణభావంగా గతంలో ఆమె తన అభిప్రాయ మిలా చెప్పిందిగదా !

కొడుకుఁగాంచు రాచ కూతు రెద్దానికి
నట్టి పనికి నుచితమైన సమయ
మొదవె దడయు టింక నొప్పదు జనములు
నట్లు గాని పురుషు లనరు మిమ్ము. 3-199

కం॰ నీ వియ్యంబులు సంధియ
గావింపం బడిరి వీరిఁ గలయుట కష్టం
బావెరవు దప్పుటయ మే
లై వచ్చెం బొమ్ము విడువు మనుమానంబున్. 15

అ: నీవియ్యంబులు = నీ బంధువులు; సంధి+ అ = సంధియే; కావింపంబడిరి = చేయదలచిరి; వీరిన్+కలయుట = ఈ కౌరవులను చేరుట ; కష్టంబు; ఆ +వెరవు = ఆ విధానం ; తప్పుట +అ = తొలగుటే ; మేలు +ఐ + వచ్చెన్ + పొమ్ము = మంచిదైనది సుమా ; అనుమానంబున్ + శంకను ; విడువుము.

భా: నీ బంధువులైన పాండవులు సంధికుదుర్చుకోవాలని ఆశించారు. కౌరవులతో పొత్తు కష్టమూలమైనది. వారితో మైత్రి కుదరక పోవటమే మంచిది. ఈ విషయంలో ఇంక అనుమానం వలదు.

వి: కృష్ణుడు కౌరవులతో ఏదో ఒక విధంగా సంధి కుదిర్చినా అది కొనసాగదు. కౌరవుల ప్రవృత్తి అటువంటిది. సంధి కుదరటం కన్నా కుదరక పోవటమే మేలని కుంతి అంటోంది. ఈ సంధి పొసగక పోవటం వల్ల రెండు సత్ఫలితా లున్నాయి.

1. చిన్ననాటినుండి పాండవులను పెట్టిన హింసలకు తగిన ప్రాయశ్చిత్తం కౌరవులకు జరుగుతుంది.

2. పాండవులు అనుభవించబోయే అధికారాలు, సంపదలూ, తమ పరాక్రమంతో సాధించుకొన్నవే అయి వారికి ఉత్తమ క్షత్రియత్వాన్ని కల్గిస్తాయి.

మ. నిజవంశోచిత వీర వృత్తమున కున్మేషంబుగా నాకపి
ధ్వజుఁ డుత్సాహము సేయకున్న నకటా ! దైన్యంబు వాటిల్లదే
భుజదర్పోద్ధతుఁడైన భీమునకు నీ పొందొప్పునే! నీవు స
ర్వజగన్మాన్యుఁడ విందు రా (దగునె? దైవం బిట్లు దప్పించునే! 16

అ . అకటా = అయ్యో! ; నిజ .... వృత్తమునకున్ ; నిజ=తమయొక్క. వంశ= (కురు) వంశమునకు, ఉచిత =తగిన, వీర= పరాక్రమముతో కూడిన, వృత్తమునకున్= నడవడికి; ఉన్మేషంబుగాన్=వికాసం కలుగునట్లుగా ; ఆ కపిధ్వజుఁడు = ఆ అర్జునుడు; ఉత్సాహము + చేయకున్నన్ = ప్రయత్నపరుడు కాకపోతే ; దైన్యంబు = హీనస్థితి; పాటిల్లదు+ఏ=కలుగదా; భుజ-దర్ప+ఉద్ధతుడు +ఐన = బాహుబలంతో మదించిన ; భీమునకున్= భీమసేనునకు; ఈ పొందు = ఈ సంధి ; ఒప్పునే = అంగీకారమగునా ? సర్వజగన్మాన్యుఁడవు= సమస్తలోకపూజ్యుడవైన ; నీవు ; ఇందున్+ ఈ కౌరవుల మధ్యకు; రాన్ + తగునె = రాజెల్లునా; దైవంబు = విధి ; ఇట్లు తప్పించునే = (రాయబార) కార్య భంగము చేయునా ?

భా: *అర్జునుడు కురుకులానికి తగిన పరాక్రమం ప్రవర్తన కనురూపంగా ఉత్సాహాన్ని చూపించకపోతే అది హీనతను కలిగిస్తుంది. మహాబలశాలి నని సంభావించుకొనే భీముడికి ఈ సంధి తగినది కాదు. సర్వజగద్వంద్యుడవైన నీవు ఈ దుర్మార్గుల మధ్యకు రావలసిన అవసరం లేదు.ఆ దైవం కూడా రాయబారాన్ని తప్పించ నవసరం లేదు.*

వి. ఈ పద్యంలో కూడా కుంతి భీమార్జునులను యుద్ధోన్ముఖులు కమ్మనే చెపుతోంది. అచ్చమైన రాచబిడ్డ ఆమె.

కృష్ణుడు రాయబారానికి వెళ్ళటాన్ని ధర్మరాజు, విదురాదులు కూడా ఈ రీతిగానే సంభావించారు. అయితే శ్రీకృష్ణుని వంటి వారిని గౌరవా గౌరవా లంటవు.

వ. అని యంత నిలువక గొంతి యిట్లనియె. 17

భా. *అలా కుంతి కృష్ణునితో పలికి అంతటితో ఆగక ఇంకా ఇలా అంటోంది.*

కం ॥ మఱచిరె కొలువున ద్రౌపదిఁ
బఱచిన బన్నంబు ధర్మపథము దొఱంగన్
వెఱచుట కప్పటి కది దగుఁ
జెఱచినచో వెదకవలదె చిరతర కీర్తిన్. 18

అ: కొలువునన్ = కురుసభలో; ద్రౌపదిన్ ; పఱచిన = పెట్టినట్టి; బన్నంబున్ = అవమానమును ; మఱచిరె (ధర్మరాజాదులు విస్మరించారా?) ; ధర్మపథము = ధర్మమార్గము; తొఱంగన్ =విడిచిపెట్టుటకు ; వెఱచుటకున్ = భయపడుటకు ; అప్పటికిన్ = ఆ సమయమునకు; అది+తగున్ = అది తగినదే ; చెఱచిన చోన్ = పాడు చేసినచో; చిరతర కీర్తిన్= శాశ్వతమైన యశస్సును ; వెదకవలదె = అన్వేషింపవలదా ?

భా: *ఆనాడు కురుసభలో ద్రౌపదిని అవమానించిన విషయం మరచిపోయారా? ధర్మమార్గాన్ని విడువకూడదు కాబట్టి ఆ సహనం ఆనాడు తగినదే ! పూర్వగౌరవాన్ని తిరిగి పొందే ప్రయత్నం చేయవలదా ?*

వి: ఒకనాడు అన్నమాటకు కట్టుబడి భంగపడ్డారు. ఈనాడు రణాసక్తి ధర్మమార్గమే అవుతుంది. అది ధర్మరాజ మార్గంకూడా కావాలని కుంతి అభీష్టం.

-:శ్రీకృష్ణుడు కర్ణుని తన రథం బెక్కించుకొని కొన్ని రహస్యోక్తులు పలుకుట:-
సం : 5-138-1

వ. అని పలికి, పుండరీకాక్షుం గౌగిలించుకొని; యచ్యుతుండు మ్రొక్కిన దీవించి " యేను సుఖం బున్నదానని పాండవులకుం జెప్పుము. చేతులలావునం గనిన జీవనంబున బ్రతుకుం డనుము. పోయిరమ్మని వీడు కొల్పిన సింహగమన సుందరంబుగా వెడలి తన తోడన (గదలివచ్చిన ధృతరాష్ట్రాదుల నిలువం బనిచి రథారోహణంబుసేసి గోవిందుండు కర్ణుదెసం గనుంగొని" నన్ననిచి వత్తుగాని రమ్మ" ని కరంబు సాఁచి చెయ్యి వట్టి తన యరదం బెక్కించుకొని, సాత్యకి వేసరి నెక్కి కెలనం జనుదేరం గదలిచని, యనుపవచ్చిన కృతవర్మ నుచిత ప్రకారంబున సస్నేహంబుగా నిలిపి యరుగు నవసరంబునఁ బౌరలోకంబు. 19

అ. పుండరీకాక్షున్= పద్మముల వంటి కన్నులు గల(శ్రీకృష్ణుని);అచ్యుతుండు+ శ్రీకృష్ణుడు; లావు=బలము; కనిన=పొందినట్టి ; జీవనంబునన్=బ్రతుకు తెరువుతో; వీడు కొల్పినన్=సాగనంపగా; ఆరోహణంబు+చేసినన్ = ఎక్కగా; అనిచి వత్తువుగాని = సాగనంపి వచ్చెదవు కాని; వేసరి = కంచరగాడిద ; కెలనన్ = ప్రక్క; పౌరలోకంబు= పురజనులు-

భా : అని పలికి కుంతి శ్రీకృష్ణుని కౌగిలించుకొని, అయన నమస్కరించగా దీవించి "నేనుసుఖంగా ఉన్నానని పాండవులకు చెప్పు, బాహుబలంచే లభించిన జీవికతో బ్రతుకుండని చెప్పు, వెళ్ళిరా" అని సాగనంపింది. శ్రీ కృష్ణుడు సింహగమనంతో తన వెంటవస్తున్న ధృతరాష్ట్రాదులను ఆగిపొండని చెప్పి, రథమెక్కి కర్ణుని చూచి, నన్ను పంపించి వద్దువు కానిరా అని చేయి చాపి, అతని చేయి పట్టుకొని రథమెక్కించుకొని, సాత్యకి కంచర గాడిదపై నెక్కి తన వెంట వస్తుండగా కదలి, తన్ను సాగనంప వచ్చిన కృతవర్మను ప్రేమాదరాలతో నిలిపి ముందుకు పోతుండగా పురజనమంతా (చూచి ఇలా అనుకోసాగారు)

ఉ. అక్కట వాసుదేవు పనుపాదరణంబున (జేయరైరి,వీ
రెక్కడి బుద్ధిమంతు లని నిందును నందును లోకమెల్లఁ బే
రుక్కున మ్రగ్గుటం దలప నొల్ల కపాయము సేసిరట్టె, యీ
యుక్కివు లెందునుం గలరె యొప్పరుపో ధృతరాష్ట్రనందనుల్. 20

అ. అక్కట = అయ్యో ; వాసుదేవుని - పనుపు = శ్రీ కృష్ణుని ఆదేశం ; అదరణంబునన్ = గౌరవభావంతో ; చేయరు + ఐరి= చేయలేకపోయిరి ; వీరు = ఈ కౌరవులు; ఎక్కడి-బుద్ధిమంతులు= ఏమి బుద్ధిమంతులు ; అనిన్ = యుద్ధమున; ఇందునున్ + అందునన్= ఇరుపక్షములయందును; లోకము + ఎల్లన్ = రాజలోకమంతా ; పేరు + ఉక్కునన్= అధికమైన గర్వంచేత ; మ్రగ్గుటన్ = చావటాన్ని; తలఁపన్ - ఒల్లక = తలపోయ నిష్టపడక ; అపాయము+ చేసిరి+అట్టె=(శ్రీకృష్ణునికి) కీడు చేసినారు; ఈ + ఉక్కివులు = ఇటువంటి మూర్ఖులు; ఎందునున్+ కలరె = మరెక్కడనైనా నుంటారా ?; ధృతరాష్ట్రనందనుల్ = ధార్తరాష్ట్రులు (సుయోధనాదులు); ఒప్పరు +పో = (యుద్ధంవల్ల అనర్థం జరుగుతుందన్న వాదాన్ని) అంగీకరించరు సుమా !

భా: శ్రీకృష్ణుని ఆదేశాన్ని ఈ కౌరవులు ఆదరంతో పాటించలేక పోయారు. గర్వాతిరేకంతో యుద్ధరంగానికి పోయి యిరు వంకలవారూ, రాజలోకమంతా హతమవటం గ్రహించక శ్రీ కృష్ణునకు కీడు తలపెట్టినారట. ఇంతటి మూర్ఖులు మరెక్కడైనా ఉంటారా? దుర్యోధనాదులు ఏం చెప్పినా వినరుసుమా !

వి. " అక్కట ! యీ యుక్కివు లెందునుం గలరె యొప్పరువో " అన్న మాటలు నిర్మత్సరులైన పౌర జనుల భావాన్ని వెల్లడిస్తాయి.

"యుద్ధాల వల్ల జరిగే కష్ట నష్టాల నెరుగకున్నారు. శ్రీకృష్ణుని మాటలను లక్ష్యపెట్టారు కాదు. అపాయం చేయజూచారు' అన్నవి వీరి అభిప్రాయానికి బలం చేకూర్చుతాయి.

పౌర జనుల సంభ్రమాశ్చర్యాలతో కూడిన ఊహాపోహలకు తగినట్లు అలతి అలతి తెలుగు పదాల కూర్పుతో పద్యాన్ని నడిపించారు తిక్కన.

వ: అని మఱియు ననేకు లనేక ప్రకారంబులం బలుకుచు నిరుగెలంకులం జనుచుండ (బుండరీకాక్షుండు పురంబు నిర్గమించె; నట ధృతరాష్ట్రుండును మగిడి కొలువుకూటంబునకు వచ్చి, యెప్పటి వారలు పరివేష్టింపనుండి, కృష్ణుని వలని మాటలాడుచున్న సమయంబున సుయోధనుతో భీష్మద్రోణు లిట్లనిరి. 21

అ: ఇరు(గెలంకులన్=రెండుప్రక్కలా; మగిడి=మరల ; పరివేష్టింపన్ = చుట్టు వారుకొని యుండగా ; కృష్ణుని వలనిమాటలు = శ్రీ కృష్ణుని గూర్చిన మాటలు ; కొలువుకూటము= సభాభవనము ; ప్రకారము = తీరు.

భా: అని యింకా అనేకు లనేక విధాలుగా అంటూ శ్రీ కృష్ణునికి ఇరువైపులా వస్తుండగా కృష్ణుడు హస్తినాపురందాటి వెళ్ళిపోయాడు. అక్కడ ధృతరాష్ట్రుడు సభాభవనానికి తిరిగివచ్చి మంత్రి సామంతాదులు తమ చుట్టూ చేరి ఉండి శ్రీకృష్ణుని గూర్చి మాటాడసాగారు. ఆ సమయంలో భీష్మద్రోణులు దుర్యోధనునితో ఇలా అంటున్నారు.

చ. పలుకునె యిట్లు గొంతి; విని బమ్మెరపోయితి మింత బెట్టిదం
బు లగునె మాట; లయ్యమయు(బుణ్యు(డు (గృష్ణు(డు గార్యవాదముల్
పలికెడు వార లిట్లు దెగ(బాఱిరి; ధర్మజ వారిరాశికిం
జెలియలికట్ట వాసె; మనచే నగు కర్జము చంద మెట్టిదో! 22

అ. గొంతి = కుంతి ; ఇట్లు = ఈ విధంగా ; పలుకునె = పలుకుతుందా?; విని = ఆమె మాటలు విని; బమ్మెరపోయితిమి= దిగ్భ్రమ చెందాము; మాటలు=ఆమె పలుకులు;ఇంత= ఇంతగా ; బెట్టిదంబులు +అగునె = నిష్ఠురాలుగా ఉంటాయా; ఆ + అమయున్ = ఆ కుంతీదేవి; పుణ్యు(డున్=పుణ్యాత్ముడైన ; కృష్ణు(డున్ ; కార్యవాదముల్ = శాంతివచనాలను; పలికెడు+ వారలు=పలుకునట్టి వారలు; ఇట్లు = ఈ విధంగా ; తెగన్ +పాఱిరి = ఉద్రేకించి పలికారు; ధర్మజ-వారి రాశికిన్=ధర్మరాజను సముద్రానికి; చెలియలికట్ట ; పాసెన్ = తొలగి పోయినది; మనచేన్+అగు = మనవల్ల కాబోయే ; కర్జము - చందము = కార్యపద్ధతి ; ఎట్టిదో= ఎటువంటిదో!

భా: *కుంతి ఇంత మాట లంటుందా ? ఆమె మాటలు విని దిగ్భ్రాంతి పొందాము. ఇంత నిష్ఠురాలు కూడా ఉంటాయా ? కార్యవాదులుగా మాటాడే కుంతీకృష్ణులు ఈ విధంగా ఉద్రిక్తులై మాటాడుతారా ?ధర్మజసముద్రానికి చెలియలికట్ట తొలగిపోయింది. ఇక మనం చేయగలిగిన పనేమిటో !*

వి: కుంతీకృష్ణుల మాటలధోరణిలో, చేతల తీరులోని విచిత్రమైన మార్పు అందరినీ విభ్రాంతులను చేస్తోంది. మానవ ప్రవర్తనలో ఏదైనా తీవ్ర పరిణామం వస్తే చూచే వాళ్ళ కిలాగే అనిపిస్తుంది.

ధర్మసేతువు దాటని గంభీర సముద్రతుల్యుడు ధర్మరాజు. ధర్మానికో, కాలానికో, కట్టుబడి సముద్రం చెలియలి కట్టలోపలనే ఉంటుంది. అలాకాక కట్ట దాటడ మంటే సర్వ జగత్ప్రళయమే. అట్లే రాయబారం విఫలం కావటంతో పరమశాంతమూర్తి అయిన ధర్మరాజు కూడా యుద్ధానికి సిద్ధమవుతున్నాడు. పర్యవసానం ఎలా ఉంటుందో ఏమిటో అని కింకర్తవ్యతావిమూఢు లవుతున్నారు ద్రోణభీష్ములు.

ధర్మరాజును సముద్రంతో పోల్చటంతో అతని గాంభీర్యంతోపాటు అంతర్గతంగా రగులుతున్న బడబాగ్నివంటి బాధలు కూడాధ్వనిస్తాయి.

వ. అని పలికి వెండియు. 23

అ. వెండియు = మరల

భా. *అలా భీష్మద్రోణు లని ఇంకా ఇలా అంటున్నారు.*

శా. మాకుం జూడఁగఁ బోలు కార్య మిది ధర్మప్రీతి నీ వేఁ గి సు
శ్లోకుండైన యుధిష్ఠిరుం గని జనస్తుత్యంబుగా శాంతిమై
నీ కౌరవ్యుల నెల్లఁ గాఁచి కొనవే యే పొప్పు దెందుం దుదిన్
శోకం బొందక వేగమై గదలి కృష్ణుంగూడఁ బోవే నృపా ! 24

అ. నృపా=రాజా; ధర్మప్రీతిన్=ధర్మమం దభిమానంతో; నీవు; ఏఁగి=వెళ్ళి; సుశ్లోకుండు+ ఐన = మంచికీర్తిగలవాడైన; యుధిష్ఠిరున్ = ధర్మరాజును ; కని = చూచి, జనస్తుత్యంబుగాన్ = లోకులు ప్రశంసించునట్లు; శాంతిమైన్ = శాంతితో ; ఈ కౌరవ్యులన్ + ఎల్లన్ = ఈ ధార్తరాష్ట్రులందరినీ ; కాచికొనవు + ఏ = రక్షింపవా ? ; ఎందున్ = ఏ దశలోనూ; ఏపు= అతిశయము; ఒప్పదు= తగదు; తుదిన్ = అంతమందు; శోకంబు + ఒందక = దుఃఖింపక; వేగమై = శీఘ్రంగా; కదలి = బయలుదేరి ; కృష్ణున్ ; కూడన్ + పోవు +ఏ = కలియబోవా; ఇది; మాకున్ + చూడన్ = మాకుజూడగా; పోలు - కార్యము = తగిన పనిగా కనిపిస్తోంది.

భా. *మాకు ఇది తగిన పనిగా అనిపిస్తోంది. ధర్మప్రీతి చేత నీవు పోయి, యశస్వి అయిన యుధిష్ఠిరుని కలసి, లోకులంతా మెచ్చుకునేలా శాంతితో కురుపాండవు లందరినీ రక్షించు. అహంభావ మెక్కడా పనికి రాదు. చివరకు దుఃఖించక మా మాటలాలించి త్వరగా వెళ్ళి శ్రీకృష్ణుని కలుసుకో.*

వి. ప్రజారక్షణ సంక్షేమం కోసం ఇక్కడ భీష్మద్రోణులు రెండు విషయాలు ప్రతిపాదించారు. శాంతిసాధనకై ధర్మరాజును కలిసి మాటాడటం - శోక నివృత్తికై శ్రీకృష్ణుని కలసి మాటాడటం.

వ. అనిన విని దుర్యోధనుండు మొగంబు రాజుచుండ నూరకుండె; గాంగేయుండును గురుండును దిగ్గన లేచి యతని నవలోకించి. 25

అ. రాజు = ప్రజ్వరిల్లు;

భా: భీష్మద్రోణులు పలికిన ఆ మాటలు విన్న దుర్యోధనుని ముఖం కోపాగ్నితో మండుచుండగా వారి మాటలు విన నొల్లక ఊరుకున్నాడు. అప్పుడు భీష్మద్రోణులు తటాలున లేచి దుర్యోధనుని చూచి ఇలా అంటున్నారు.

వి. ముఖం రాజటం, మౌనం వహించటం భీష్మాదుల అభిప్రాయాన్ని తా నంగీకరించకపోవటాన్ని సూచించే అనుభావాలు.

సహజంగానే సుయోధనుడు భీష్మద్రోణుల వచనాలను తన అవసరమైనపుడు తప్ప మరెప్పుడూ పట్టించుకోడు. అటువంటి పరిస్థితిలో భీష్మద్రోణులు ఇప్పుడు ధర్మరాజును, శ్రీ కృష్ణుని ఆశ్రయించుమని సలహా ఇవ్వటం అసలు పట్టించుకునే ప్రశ్నేలేదు.

కం. కురున్నృప విను ! సంసారము
దరి ద్రొక్కిన వార మింకఁ దలఁకెదమే ! సం
గరమునకు; నేము నీకై
పొరలితి; మెట్లైన నగును బోయెద మనుచున్. 26

అ. కురున్నృప = దుర్యోధన మహారాజా !; విను ; సంసారము -దరి + త్రొక్కిన వారము = జీవితం యొక్క అంతమును మెట్టిన వారము ; మేము ; ఇంకన్ = ఇకపై (ఈ ధరలో); సంగరమునకున్= యుద్ధానికి ; తలఁ కెదము + ఏ = జంకుతామా ? ; నీకున్ + ఐ= నీ కొఱకై ; పొరలితిమి = ప్రవర్తించాము ; ఎట్లు +ఐనన్ + ఏ విధంగానైనా ; అగును = అగుగాక ; పోయెదము + అనుచున్ = పోతామంటూ (తర్వాతి పద్యంతో అన్వయం)

భా : దుర్యోధనా! మేము జీవితపు చరమ దశలో అడుగు పెట్టిన వారము మాకిక యుద్ధాలకు జంక నవసరం లేదు. ఇంత వరకు నీ కోసమే ఎట్లైనా ప్రవర్తించాము. ఇక పోయి వచ్చెదము. (అంటున్నారు భీష్మద్రోణులు)

వి. కాలం చెల్లినవాళ్ళు భీష్మద్రోణులు. వారు యుద్ధానికి వెళ్ళినా ఇంటి దగ్గరే ఉన్నా చావు తప్పదు. పదికాలాలపాటు సుఖశాంతులతో జీవించవలసిన వారు దుర్యోధనాదులు. కనుక యుద్ధనివారణ యత్నం సుయోధనాదులకే లాభకారి. కానీ అతడు వినడు. అందుకోసం మేము నీ వాళ్ళం కనుక జీవితమరణాలతో గాని, జయాపజయాలతో గానీ నిమిత్తం లేకుండా గతంలో వలె ఇప్పుడు కూడా నీ కోసం పోరాడుతామని భీష్మద్రోణులు వినుగుతో అంటున్నారు.

కం. అరిగిరి రాజును సభ్యం
తరమునకుఁ జనియె రాజతనయుండు బహిః
పరివారము ఁబొమ్మని మిత
పరిజనుఁడై యేగె నాత్మభవనంబునకున్. 27

అ. అరిగిరి = (భీష్మద్రోణులు అలా) వెళ్ళిపోయారు ; రాజును ధృతరాష్ట్ర

మహారాజుకూడా ; అభ్యంతరమునకున్ = లోపలి మందిరంలోనికి ; చనియెన్ = వెళ్ళాడు; రాజతనయుండు = దుర్యోధనుడు ; బహిఃపరివారమున్ = బయటి పరిజనాన్ని ; పొమ్ము + అని = పొండని పంపివేసి ; మిత పరిజనుఁడు + ఐ= పరిమితమైన సేవక జనంతోకూడి ; ఆత్మ-భవనంబునకున్ + తన మందిరానికి; ఏగెన్ = వెళ్ళెను.

భా. అలా పలికి భీష్మద్రోణులు వెళ్ళిపోయారు. ధృతరాష్ట్రమహారాజు అభ్యంతరమందిరానికి వెళ్ళాడు.. దుర్యోధనుడు బయటి పరిజనులను వదలి మిత పరిజనులతో కలిసి తన భవనానికి వెళ్ళి పోయాడు.

తే॥ అంత నక్కడ నచ్యుతుఁ డరిగి యరిగి
యధిక సంప్రీతి దలకొన నర్కతనయు
నాననంబు వీక్షించి యిట్లనియె నెమ్మి
నన్యు లెవ్వరు వినకుండ నతని తోడ. 28

అ. అంతన్ = అప్పుడు ; అక్కడన్ = శ్రీకృష్ణుని నిర్గమన మార్గ మధ్యంలో ; అచ్యుతుండు = శ్రీ కృష్ణుడు; అరిగి + అరిగి = చాలా దూరం వెళ్ళి ; అధికసంప్రీతి = అధికమైన సంతోషము ; తలకొనన్ = కలుగగా; అర్కతనయు + అననంబును = కర్ణుని ముఖాన్ని; వీక్షించి = చూచి; అన్యులు = ఇతరులు ; ఎవ్వరున్ = ఎవరూ ; వినకుండన్ = వినకుండా ; అతనితోడన్ = ఆ కర్ణునితో ; నెమ్మిన్ + ఇట్లు + అనియెన్ = ప్రేమతో ఇలా అన్నాడు.

భా. అక్కడ శ్రీకృష్ణుడు పోయి ప్రేమతో కర్ణుని ముఖంలోకి చూచి ఇతరు లెవ్వరూ వినకుండా ఇలా అన్నాడు.

వి : రాయబారానికి పంపుతూ ధర్మరాజు 'పాండవులు ధార్తరాష్ట్రులు పుండరీకనేత్ర చుట్టరికంబున నీకు నొక్కరూప' (పాండవులు కౌరవులు బాంధవ్యమును పురస్కరించుకొని నీకు ఒక్కటే) అన్నాడు. అలానే శ్రీకృష్ణుడు కూడా-

"కౌరవులకు పాండవులకు అరయ నే నొక్కరూప, వారును వీరును దమతమ నేరుపుమెయి ధరణియేలి నెగడగ చూతున్"

కౌరవపాండవు లుభయులూ నాకు బంధుత్వంచేత సములే. కనుక వాళ్ళు తమ తమ రాజ్య భాగాన్ని పాలించి ఖ్యాతి నందేలా చేస్తాను అని యన్నాడు .

కనుక కర్ణుడన్నా, దుర్యోధనుడన్నా కృష్ణునకు ద్వేషంలేదు. పోతే వాళ్ళ అకృత్యాలను మాత్రం తీవ్రంగా నిరసిస్తాడు కృష్ణుడు. ఉదాత్త ప్రక్రియ లెప్పుడూ వ్యక్తిగత లోపాలను నిరసిస్తారు గాని వ్యక్తులను కాదు.

సీ. నీవు వృద్ధ జనోపసేవివి ధర్మసం
వేదివి తెలియంగ వినుము! సిద్ధ
మంత్రబలంబున మార్తాండు వరమునఁ
గన్నియ తఱి గొంతి గన్నవాఁడ

వగుటఁ బాండునృపాలు నగ్రసుతుండవు
ధర్మమార్గం బిది ధర్మతనయుఁ
డాదిగాఁ గల తమ్ములందఱు నాచేత
నెఱిఁగి నీయడుగుల కెఱఁగి సకల

ఆ.వె. పుత్రమిత్ర బంధుభూరిసేనాసమ
న్వితము గాఁగఁ గొలిచి నిన్ను రాజ్య
భారవహనమునకుఁ బట్టంబు గట్ట ను
జ్జ్వలుఁడ వగుదు రమ్ము వారి కడకు. 29

అ. నీవు = (ఓ కర్ణా!) నువ్వు ; వృద్ధ జన + ఉపసేవివి = పెద్దలను సేవించువాడవు; ధర్మసంవేదివి = ధర్మమును బాగుగా తెలిసిన వాడివి ; తెలియంగన్ + వినుము = స్పష్టంగా విను; సిద్ధ మంత్రబలమునన్ = సిద్ధించిన మంత్రశక్తిచేత ; మార్తాండువరమునన్ = సూర్యుని వరము వలన ; కన్నియ తఱిన్ = కన్నియగానున్నవేళ ; గొంతి ; కన్నవాఁడవు + అగుటన్ = కనిన వాడవగుటచేత ; పాండునృపాలు + అగ్రసుతుండవు = పాండురాజు పెద్దకుమారుడవు ; ఇది ; ధర్మమార్గము = ధర్మపద్ధతి ; ధర్మతనయుడు + ఆదిగాన్ +కల = ధర్మరాజు మొదలైన ; తమ్ములు + అందరు ; నా చేతన్ = నా ద్వారా ; ఎఱిగి = తెలిసికొని ; నీ + అడుగులకున్ = నీ పాదాలకు; ఎఱఁగి = నమస్కరించి; సకల .... కాఁగన్ ; సకల= సమస్తములైన , పుత్ర-మిత్ర బంధు=పుత్రులూ, మిత్రులూ, బంధువులూ; భూరి = ఎక్కువైన ; సేనా = సైన్యముతో; సమన్వితము+కాఁగన్=కూడి యుండగా; కొలిచి=సేవించి; నిన్నున్ ; రాజ్యభార వహనమ్మునకున్= రాజ్యాధిపత్యానికి ; పట్టంబు +కట్టన్ = అధికారిగా చేయగా ; ఉజ్జ్వలుండవు = తేజోవంతుడవు; అగుదు = కాగలవు ; వారికడకున్ రమ్ము.

భా. నీవు పెద్దలను సేవించెడివాడవు, ధర్మజ్ఞుడవు. కావున చక్కగా విను ! సిద్ధించిన ఒక మంత్రబలం వలన కుంతి కన్యగా ఉన్నప్పుడే సూర్యానుగ్రహంతో పొందిన కుమారుడివి నువ్వు . కనుక పాండురాజు పెద్దకుమారుడవు. ఇదిధర్మసమ్మతం. ధర్మరాజు మొదలుగా నీ సోదరులంతా ఈ సంగతిని నా ద్వారా తెలిసికొని నీకు పాదాభివందనం చేస్తారు. సకల బంధుమిత్రసేనాసహితంగా నిన్ను సేవిస్తారు. నీకు రాజ్యాధిపత్య మప్పగిస్తారు. మహావైభవంతో రాజిల్లుదువుగాని వారి దగ్గరకు వెళదాం రా !

వ. "ఏను నిన్ను సామ్రాజ్యంబునకు నభిషిక్తుం జేయుదు ; నీవు తొలుత వెడలునప్పటి మహోత్సవంబునకు యువరాజై యుధిష్ఠిరుండు నీ రథంబున నుండి నీకు ధవళ చామరంబులు వైచు; వాయుపుత్రుండు సిత ఛత్రంబు పట్టు ; సవ్యసాచి సారథ్యంబు సేయు; మఱియుఁ బాంచాల, యాదవ పాండ్య, మాత్స్యులు లోనుగాఁగల రాజలోకంబు తోడఁ గవలు నభిమన్యు ప్రభృతి కుమారులు, బెరయ నే మెల్లం బలసి పరివేష్టించి వత్తు; మిట్టి మహేంద్ర విభవంబున మహనీయుండ వగుచు మహాచక్రం బేలు" మని మఱియును. 30

అ. ధవళ -చామరంబులు = (తెల్లని) వింజామరలు; సితచ్ఛత్రంబు = తెల్ల గొడుగు ; సవ్యసాచి = అర్జునుడు; ప్రభృతి= మొదలైన; పెరయన్ = కూడగా ; బలసి = పూని; మహీచక్రంబు = భూమండలము -

భా. *నేను నిన్ను కురుసామ్రాజ్యానికి అభిషిక్తుణ్ణి చేస్తాను. రాజుహోదాతో నువ్వు మొదటిసారి ఊరేగునపుడు యువరాజైన ధర్మరాజు నీ రథంపై ఉండి వింజామర వీస్తాడు. భీమసేనుడు వెల్లగొడుగు పట్టుకుంటాడు. అర్జునుడు సారథ్యం వహిస్తాడు. పాంచాల, యాదవ, పాండ్య, మాత్స్య రాజులు మొదలుగా రాజసమూహంతోపాటు నకులసహదేవులు, అభిమన్యుడు మొదలైన కుమారులతో కలసి, మేమంతా నీ వెంట రాగలము. దేవేంద్ర వైభవంతో ఈ భూమండలాన్ని పాలించు అని (కృష్ణుడు ఇంకా ఇలా అంటున్నాడు).*

క: **పాంచాలరాజ పుత్రియు**
నంచితముగ నిన్నుఁ బొందు నాఱవ వరుసన్
సంచిత పుణ్యుఁడ వీవొక
యించుకయును వేఱుసేయ కేతె మ్మెలమిన్. 31

అ : పాంచాల రాజపుత్రియున్ = ద్రౌపదికూడా ; అంచితముగన్ = ఒప్పునట్లు ; ఆరవవరుసన్ = ఆరవ క్రమంలో ; నిన్నున్ + పొందును = నిన్ను భార్యగా స్వీకరించును ; నీవు; సంచిత పుణ్యుఁడవు = మహాపుణ్య సంపన్నుడవు ; ఒక + ఇంచుకయును = ఏ కొంచెం కూడా; వేఱు + చేయక = అరమరికలేక ; ఎలమిన్ = ప్రీతితో ; ఏతెమ్ము = రమ్ము .

భా: *పాంచాల రాజకన్య అయిన ద్రౌపది నిన్ను ఆరవ వానిగా పొందుతుంది. నీవు పుణ్యాత్ముడవు. ఏమాత్రం సందేహం లేకుండా ఆనందంగా రా !*

వి : "షష్ఠే చ త్వాం తథా కాలే ద్రౌపద్యుపగమిష్యతి" అన్నవ్యాస పాదాన్ని విమర్శకు లనేక విధాలుగా వ్యాఖ్యానించారు. తిక్కన స్వీకరించిన ఈ అర్థం చాలా మందికి అనుచిత మనిపించింది. శ్రీకృష్ణు డంతటి వాడు ద్రౌపదికి కర్ణుడు ఆరవ భర్తకాగల డనటం తగదని వారి భావన. అందుకే ఈ శ్లోక పాదం ప్రక్షిప్తమని కొందరు భావిస్తున్నారు. మరి కొందరు 'షష్ఠేకాలే' అన్న పదాన్ని నియత సమయానికి జరిగే సేవాకార్యక్రమాల్లో భాగంగా స్వీకరించి వ్యాఖ్యానించారు.

మరికొంత మంది ఇలా సమర్థిస్తారు. శ్రీకృష్ణుడు కర్ణుని ప్రలోభపెట్టి పాండవ పక్షమునకు త్రిప్పవలెనని యోచిస్తున్నాడు. అందులో ఎంత తీవ్రమయిన ప్రలోభమునకు కూడ కర్ణుడు లొంగలేదని చెప్పటం వ్యాసులవారి, తిక్కనగారి తాత్పర్యం. ప్రలోభపరాకాష్ఠ ద్రౌపది. అయినా శ్రీకృష్ణుడు సుభద్ర కంటె ప్రేమతోచూచుకొనేవాడు గదా ద్రౌపదిని తానీమాట అనవచ్చునా? అని కొందరు ప్రశ్నిస్తారు. నిజమే కృష్ణుడు ఆ దృష్టితో మాత్రమే అయితే అనరాదు. అంతకు మించిన ఉదాత్త దృష్టి కృష్ణునికి కలదు. ఈ కార్యము కుదరదని యుద్ధము తప్పదని కృష్ణునకు ముందే తెలియును. అందుచే కేవల వాగ్రూపమయి క్రియారూపమునొందని ప్రలోభము దోషము కాదని కృష్ణుడు తలచియే యిట్లు చెప్పి యుండునని మరికొందరి సమర్థన. దీనితో కర్ణుని పాత్ర చిత్రణమునకు కూడ వన్నెచేకూరినది. కృష్ణుడు సర్వజ్ఞుడు కనుక అట్లనుట ఆతనికే తగును. మిగిలిన వారట్లనుట దోషమగునుకాని, అతనికా దోషము లేదు అని సమర్థన.

వ : ఇట్లైనఁ గుంతికి సమస్త బంధుమిత్రులకుఁ బ్రియం బగు ననిన ; విని; రహస్యంబుగా రాధేయుండు మాధవున కిట్లనియె. 32

భా : 'ఇలా జరిగితే కుంతిదేవికి, సర్వ బంధుకోటికి ఆనందం చేకూరుతుంది.' అన్నాడు కృష్ణుడు. ఆ మాటలు విని కర్ణుడు శ్రీకృష్ణునితో రహస్యంగా ఇలా అంటున్నాడు.

-: కర్ణుఁడు శ్రీకృష్ణునకుఁ దగిన యుత్తరంబు లిచ్చుట : -
(సం. 5 - 139-1)

చ : వెడ వెడ యేనుఁ దొల్లి యిది వింటి; ననుం గని కుంతి నిర్దయన్
జెడ నది వైచిపోయె; గ్రుపఁ జేకొని సూతుఁడు దెచ్చి తాను మున్
కొడుకులఁ గానకున్కిఁ బ్రియకుం దగ నిచ్చినఁ జేపెఁ జన్ను ల
పడఁతియు, నప్పుడాదిగ శుభస్థితిఁ బెంచెఁ బ్రయత్న శీలయై. 33

అ : వెడవెడన్ = కొంచెం కొంచెం; ఏనున్ = నేను కూడా; తొల్లి = ఇంతకుముందు; ఇది = ఈ విషయం; వింటిన్; ననున్; కని; కుంతి; నిర్దయన్ = దయమాలి; చెడన్ = దురవస్థ నందగా; నదిన్ + వైచి పోయెన్ = నదిలో పడవేసి పోయింది; కృపన్ = దయతో; చేకొని = తీసికొని; తెచ్చి; సూతుఁడు; తాను; మున్ = అంతవరకు; కొడకులన్ = కుమారులను; కానక + ఉన్నన్ = పొందకుండుటచే ; ప్రియకున్ = భార్యకు ; తగన్ + ఇచ్చినన్ = ప్రేమతో అందివ్వగా; ఆపడఁతియున్ = రాధకూడా; చన్నులు+చేఁపెన్=పాలను స్రవించినది; అప్పుడు+ ఆదిగ= అది మొదలు; ప్రయత్న శీలియై= జాగరూకురాలై; శుభస్థితిన్ = సన్మార్గమున; పెంచెన్ = పెంచినది.

భా: నేను ఈ విషయం ఇంతకు ముందే కొంత విని యున్నాను. నన్ను గని కుంతి జాలిలేక నదిలో విడిచి పోయింది. దయామయుడైన సూతుడు నన్ను దెచ్చి తనకు పుత్రులు లేనందున ప్రేమతో భార్యకిచ్చాడు. ఆమె పాలను స్రవించి, అప్పటి నుండి ఎంతో జాగ్రత్తగా నన్ను మంచి మార్గంలో పెంచింది.

క: మూత్ర పురీషాదులు దమ
గాత్రములం దింక, వారు గారవ మెసఁగం
బుత్రుం డని సంవర్ధిత
గాత్రునిఁగాఁ జేసి రింత కాలముఁ గూర్మిన్. 34

అ: మూత్ర పురీష + ఆదులు = మలమూత్రములు మొదలైనవి ; తమ గాత్రములందున్ = తమ తమ శరీరాలయందు; ఇంకన్ = ఇంకిపోగా; వారు = ఆ సూత దంపతులు; గారవము + ఎసఁగన్ = ప్రేమాతిశయంతో; పుత్రుండు + అని; కూర్మిన్ = ప్రేమతో; ఇంతకాలమున్ = ఇప్పటి వరకు; సంవర్ధిత గాత్రునిన్ + కాన్ = పెద్ద వానినిగా; చేసిరి.

భా: నా మలమూత్రాలు తమ శరీరాలపై ఇంకగా అనురాగంతో రాధాసూతులిద్దరూ పుత్రునిగా నన్నింతకాలము ప్రేమతో పెంచి పెద్దచేశారు.

వి: "ధన్యా స్తదంగరజసా మలినీభవన్తి" అని కాళిదాసంటాడు. పిల్లల మల మూత్రాదులతో శరీరం మలినమైన తల్లిదండ్రులు ధన్యులట. భారతీయ కౌటుంబిక జీవనంలో తల్లికీ, పిల్లలకూ మధ్యనున్న అతిసహజమైన ప్రేమాభిమానాలను ఈ అంశం స్ఫుటం చేస్తుంది.

క: నేఁ డింక నెఱిఁగి యొరువుల
వాఁడఁ గదా యనుచు నేను వారి (దొఱఁగినన్
బోఁడిమి సెడదే మదిఁ గడు
వాఁడి గలదె నాకు నకట వారిజనాభా ! 35

అ: వారి-జ-నాభా = (పద్మనాభా) కృష్ణా; నేఁడు = ఈనాఁడు; ఇంకన్ + ఎఱిఁగి= ఇంక తెలుసుకొని; ఒరువుల వాఁడు+అ+ కదా = ఇతరుల బిడ్డను కదా; అనుచున్; ఏను= నేను; వారిన్; తొఱఁగినన్= విడిచినచో; పోఁడిమి + చెడదు + ఏ = అమర్యాద కాదా?; అకటా= అయ్యో ! ; నాకున్; మదిన్ =మనస్సున; కడు + వాఁడి=మిక్కిలి శౌర్యము; కలదు+ఎ= ఉండునా!

భా: ఈనాడు నేనీ విషయం తెలుసుకొని, నేను పరులబిడ్డ నని భావించి ఇంతవరకు పెంచి పెద్దచేసిన తల్లిదండ్రులను వదలివేస్తే అమర్యాద కదా ! కృష్ణా! నా మనస్సులో అంత కఱకుదనం లేదయ్యా !

వ: వృద్ధోపసేవనంబును, ధర్మసంవేదనంబునుం గలవాఁడ వని నన్ను నీవ చెప్పితివి; రాధయు నధిరథుండును నాకు జాత కర్మాది సమస్త సంస్కారంబులు నిజకులోచితంబుగా నాచరించి రట్టి తల్లిదండ్రులకు బుత్ర కృత్యంబులు నిర్వహింపక వారలం బాసి యేను వచ్చుట ధర్మంబగునే యని పలికి వెండియు. 36

అ: ధర్మ సంవేదనంబు = ధర్మజ్ఞానము ; జాతకర్మ + ఆది సమస్త సంస్కారంబులు= పుట్టిన మానవునకు భారతదేశములో కులోచితరీతిలో జరుపు పదహారు కర్మలు ; జాతకర్మము= బిడ్డపుట్టిన తర్వాత తండ్రి చేయు తొలి సంస్కారము.

భా : కృష్ణా ! పెద్దలను సేవించే వాడిననీ, ధర్మమెరింగిన వాడిననీ నువ్వే నన్ను అంటున్నావు. రాధయు, అధిరథుడు నాకు తమదైన సూతకులానికి తగినట్లుగా జాతకర్మాది సంస్కారములు చేసినారు. అట్టి తల్లిదండ్రులకు పుత్ర కృత్యం చేయక వారి నెడబాసి రావటం ధర్మంకాదు గదా !

వి: పుట్టిన ప్రతివ్యక్తి జాతకర్మాది సంస్కారముల పొంది నప్పుడే మానవు డవుతాడని మన విశ్వాసం. తమ తమ కులాలకు తగినట్లు ఆ సంస్కారా లుంటాయి. సూతకులానుగుణంగా తనకు ఆ సంస్కారాలు జరిపించిన రాధా అధిరథుల విషయంలో తన బాధ్యతను (పుత్రుడుగా) తాను నిర్వర్తించ కుండా వీడి రావటం అనుచితం, అధర్మం అని కర్ణుని భావం.

జీవతో వాక్యకరణాత్ ప్రత్యబ్దం భూరి భోజనాత్
గయాయాం పిండదానాచ్చ తస్మాత్పుత్రస్య పుత్రతా

అని పుత్రునికి పుత్రత్వాన్ని సాధించి పెట్టే సూత్రం చెప్పారు పెద్దలు. జీవించి ఉండగా వారిని సేవింపక,పోయిన తర్వాత ఆబ్దికాదులు నిర్వహింపక, గయలో పిండప్రదానం చేయక పుత్రునకు పుత్రుడనిపించుకొనే యోగ్యత లేదట.

క: **సోదరులుఁబ్రియులు ననుజులు**
నాదెసఁ బెక్కంఁడ్రు వారి నందఱ విడువం
గాదని యూహింపక దా
మోదర ! నన్నిట్లు పిలుచు టుచితమె చెపుమా ! 37

అ: దామోదర= కృష్ణా !; సోదరులున్= తోడబుట్టిన వారు; ప్రియులున్ = ఇష్టులు; అనుజులున్ + తమ్ములు; ఆదెసన్ + అవైపునకూడా ; పెక్కంఁడ్రు = చాలా మంది (కలరు) ; వారిన్ + అందఱన్ = వాళ్ళనంతా ; విడువన్ + కాదని = విడిచిపెట్ట తగదని ; ఊహింపక= తలపక ; నన్నున్ + ఇట్లు = నన్నీవిధంగా ; పిలుచుట = పాండవ పక్షానికి రమ్మని ఆహ్వానించుట; ఉచితము + ఎ = తగినదా!; చెపుము + అ = చెప్పుము.

భా: *కృష్ణా ! ఆ వంక నాకెందరో సోదరులు, ఆప్తులు, అనుజులు ఉన్నారు. వారిని విడిచిపెట్టుట భావ్యం కాదని భావించక నన్ను పాండవపక్షానికి రమ్మని ఇలా పిలవటం తగినపనేనా? నువ్వే చెప్పు.*

వి : స్వామిభక్తి మాత్రమేగాక తనకెంతో అనుబంధం అటువైపున్నదని కర్ణుని నిర్ణయం. కర్ణునికి తండ్రి సూతకన్యల నిచ్చి వివాహం జరిపించాడు. వారి ద్వారా అతనికి పుత్రులు, పౌత్రులు కలిగారు. మూలంలో వ్యాసుడు ఆ విషయాలు స్పష్టంగా వ్రాశాడు.

"తాసు మే హృదయం కృష్ణ సంజాతం కామబంధనమ్
న పృథివ్యా సకలయా న సువర్ణస్య రాశిభి :
హర్షాద్భయాద్వా గోవింద! మిథ్యా కర్తుం తదుత్సహే"
"ధృతరాష్ట్రకులే కృష్ణ దుర్యోధనసమాశ్రయాత్,
మయా త్రయోదశసమా భుక్తం రాజ్య మకంటకమ్'

వ : **అదియునుంగాక.** 38

ఉ: **సూతసుతుండు వీఁడనక, సూనుల తమ్ముల కంటె నాకు సం**
ప్రీతి యొనర్చి, తేజమునుఁ బెంపును నాటికి నాటి కగ్గలం
బై తనరార, నన్నుఁ దనయంతటి మానిసిఁ జేసి యుండ నే
నే తగవూది యా కురుకులేశ్వరుఁ బాయుదు? ముట్టవచ్చినన్. 39

అ: వీఁడు = ఈ కర్ణుడు; సూతసుతుండు + అనక = సూతపుత్రుడని చూడక; సూనుల తమ్ములకంటెన్ = తన కుమారుల కన్నా, తమ్ములకన్నా; నాకున్; సంప్రీతిన్ = సంతోషమును; ఒనర్చి = చేసి ; తేజమును = పరాక్రమమును ; పెంపును = ప్రాశస్త్యాన్ని ; నాటికిన్+ నాటికిన్ = దినదినానికీ; అగ్గలంబు + ఐ= అధికమై ; తనరారన్ = ఒప్పగా ; నన్నున్; తన+అంతటి- మానిసిన్ + చేసియుండన్ = తనంతవానిని చేయగా; నేను ; ఏతగవు + ఊది= ఏ న్యాయాన్ని ఆశ్రయించి; ముట్ట వచ్చినన్ = యుద్ధం చుట్టుముట్టిరాగా; ఆ - కురుకుల + ఈశ్వరున్ = ఆ సుయోధనుని ; పాయుదున్? = విడిచిపెట్టెదను?

భా: వీడు సూతపుత్రు డన్న భావం లేకుండా తన కుమారులతో, సోదరులతో సమానంగా నన్నాదరించి, నా పరాక్రమ ప్రాభవాలు ఆనాటికానాటికీ పెంపొందేటట్లు నన్ను తనంత వానినిగా జేసిన కురుసార్వభౌముని ఒక వంక యుద్ధం ముంచుకు వస్తుంటే ఎలా వదలిరాగలను. ఇది ఎలా న్యాయ మవుతుంది?

వి: రాజు అతడు. తాను సూతుడు. ఇరువురి మధ్యా ఎంతో అంతరమున్న రోజుల్లో పుత్ర నిర్విశేషంగా ఆదరించాడు. అంగరాజ్యమిచ్చి తనంతటివాణ్ణిగా జేశాడు. దుర్యోధనుని ఈ ఆదరణ ముందు కృష్ణవచనాలు ఎంత సత్యమైనా, ప్రియమైనా కర్ణుడు గౌరవించలేకపోతున్నాడు.

కం : నను నయ్యర్జుసునకు నెదు
రని పెద్దయు నమ్మి యుండు నక్కట దుర్యో
ధనుఁ డా నమ్మిగ వమ్ముగ ఁ
జనునే పాండవులఁ గలయఁ జన నా కనఘా ! 40

అ: అనఘా ! = మహాత్మా ; ననున్ ; ఆ + అర్జునునకున్ = ఆ అర్జునునికి ; ఎదురు+ అని = ప్రతియని ; దుర్యోధనుండు ; అక్కట ; పెద్దయున్ = ఎక్కువగా ; నమ్మి + ఉండున్ = నమ్ముచుండును ; ఆ నమ్మిగ = ఆ విశ్వాసము ; వమ్ముగన్ = వ్యర్థమగునట్లుగా; నాకున్ ; పాండవులన్ ; కలయన్ + చనన్ = చేరబోవుట, చనునే = తగునా ?

భా: కృష్ణా ! అర్జునునకు నన్ను ప్రత్యర్థిగా తలచి ఎంతో విశ్వాసంతో ఉన్న సుయోధనుని విశ్వాసం వ్యర్థమయ్యేట్లు నేనిప్పుడు పాండవులతో చేయికలపటం భావ్య మవుతుందా ?

వి: కర్ణునిలోని ఈ కృతజ్ఞతాభావం అతన్ని ఎంతఉన్నతుని చేసిందో అంత అధఃపతనానికి దారి తీసింది. మంచి చెడ్డ లాలోచింపని అంధకృతజ్ఞత కర్ణుడు పాండవులకు దూరమయ్యేలా చేసింది. దుర్యోధన వినాశానికి కారణమైంది. పాండవులతో కలిసినా, లేక కలిపి తాను కురు పాండవ మైత్రికి దోహదం చేసినా అంతా శుభాస్పదమయి ఉండేది. కానీ కర్ణుడలా భావించడు. జరిగిన వినాశంలో కర్ణుని కర్తృత్వమెంత అని ఆలోచించి సూటిగా సమాధానమివ్వటం కష్టమే అయినా ఒక గుణం కారణంగా ఎంతో అనభీష్టఫలం కూడా సంభవించిన దన్నది సుస్పష్టం.

ఆ.వె. ఏను నర్జునుండు నెక్కటెక్కటి ఁదల
పడక యున్న నగరె ! పుడమి జనము
లందు నాదువచ్చు టతనికి నపకీర్తి
యనిన నాకు వేఱె యడుగ నేల? 41

అ: ఏనున్ = నేను; అర్జునుండున్ ; ఎక్కటిన్ + ఎక్కటిన్ = ఒకరితో నొకరు; తలపడక+ ఉన్నన్ = యుద్ధమున డీకొనకపోయినచో ; పుడమి - జనములు = భూ ప్రజలు ; నగరె = నవ్వరా; అందున్ = ఆ పాండవపక్షానికి; నాదు వచ్చుట = నేనురావటం ; అతనికిన్= ఆ అర్జుననకు ; అపకీర్తి = అపఖ్యాతి; అనినన్; నాకున్ ; వేఱె = వేరుగా ; అడుగన్ + ఏల = అడగాలా?

భా: నేనూ, అర్జునుడూ ఒకరితో ఒకరు తలపడకపోతే ప్రజలు నవ్వుతారు. నేను పాండవపక్షంలోకి రావటం అర్జునుడికే అపకీర్తి. నా విషయ మింక చెప్పవలసిన దేమిటి?

వి: ఏ కారణంతో వారిద్దరూ కలిసినా లోకం వారి బలహీనతగానే భావిస్తుంది. అపఖ్యాతి పాలుచేస్తుంది. తనకే కాక అర్జునుడికీ అది మంచిదికాదు. కనుక తాను పాండవుల పక్షం చేరలేనని కర్ణుని వాదం.

కర్ణార్జునులు తెలియక తలపడుదా మనుకొని ఏకోదరులని తెలిసి యుద్ధాన్ని విరమిస్తే ప్రజలు అవహేళన చేస్తారా ? ఆనందిస్తారా ? లోకులు నవ్వుతారని సోదరులు కలహించాలా ?

సాధారణ పరిస్థితులలో కర్ణుని ఈ మాటలు ఒప్పుతాయని, కర్ణార్జునులు ఏకోదరులని చెప్పిన తర్వాత కూడా కర్ణుడిలా పలకటం అనాలోచితం అని అనిపించవచ్చు. కానీ అంత వరకు కౌరవ పాండవ కలహంలో వారు బంధువులా ? కాదా ? అన్నది అప్రధానాంశం. పరస్పర చేష్టలు, పరస్పర ద్వేషాసూయలకు హేతువులయ్యాయి. ఏకోదరత్వశ్రవణ మాత్రంచేత ఆ భావా లంత త్వరగా నశించవు.

క: హిత ముపదేశించితి వీ,
వతినిర్మల బుద్ధి వగుట, నైనను నిది నా
మతి సొరదు, రహస్యము ర
క్షితముగఁ బాటింపు మయ్య చిత్తములోనన్. 42

అ: ఈవు = నీవు ; అతి నిర్మల బుద్ధివి + అగుటన్ = మిక్కిలి నిర్మలమైన బుద్ధికల వాడవగుటచేత; హితము = శ్రేయస్సును; ఉపదేశించితివి =బోధించావు; అయినను; ఇది= ఈ హితము; నా మతి+చొరదు=నా మనస్సు కెక్కదు; అయ్య; రహస్యమున్=ఈ నా జన్మరహస్యాన్ని; చిత్తములోనన్ = మనస్సులో ; రక్షితముగన్ = భద్రముగా ; పాటింపుము = ఉంచుము.

భా : నీవు నిర్మలాంతః కరణుడవు. కాబట్టి నా మేలు కోరి పలికినావు. అయినా ఈ మార్గం నా మనస్సు కెక్కదు. ఈ రహస్యాన్ని నీ హృదయంలోనే భద్రంగా దాచి ఉంచు.

వి: కృష్ణుడు తన హితాన్ని కోరుతున్నాడని తెలిసి కూడా ఆ మాటలు కర్ణుని మనస్సున కెక్కకపోవటం దురదృష్టం. జన్మ రహస్యాన్ని వెల్లడించవద్దనటం పాండవ హితాన్ని కోరటమే. తనను పెంచిన దుర్యోధనుని పక్షాన ఫలాపేక్షా రహితంగా పోరాడటమే తన కర్తవ్యంగా భావించాడు కర్ణుడు.

వ: అది యేమిటి కంటేని. 43

భా: రహస్యాన్ని ఇతరులకు చెప్పకుండా నీ హృదయంలోనే భద్రపరచు తున్నది ఎందు కంటావేమో !

తే. : ధర్మ తనయుండు దాను నా తమ్ముఁ డగుట
యెఱిఁగె నేనియు సామ్రాజ్య మేలపూను
నట్టి ధార్మికుఁడాధిపత్యంబు ఁ జేయ
వలవదే ! శాశ్వతంబుగ వసుధ కెల్ల. 44

అ: ధర్మతనయుండు = ధర్మరాజు ; నా తమ్ముఁడు + అగుట = నా సోదరుడని ; ఎఱిఁగెన్ + ఏనియున్ = తెలిసి కొన్నచో ; సామ్రాజ్యము = రాజ్యాధిపత్యమును ; ఏలపూనున్= ఎట్లు వహిస్తాడు ; అట్టి, ధార్మికుఁడు = ధర్మ స్వరూపుడు ; వసుధకున్ ఎల్లన్ = భూ మండలానికంతటికీ; అధిపత్యంబున్ = దొరతనమును ; శాశ్వతంబుగన్ = కలకాలము ; చేయన్ + వలవదె = చేయవలదా?

భా : ధర్మరాజు కాతడు నా తమ్ముడని తెలిస్తే సామ్రాజ్యాధిపత్యాన్ని అంగీకరించడు. అటువంటి ధర్మమూర్తి కలకాలము ఈ భూమికి పరిపాలకుడు కావద్దా?

లి: ధర్మజుడే రాజు కావా లంటున్నాడు కర్ణుడు. ధర్మజుని ధర్మనిష్ఠయే అందుకు కారణం. ధర్మానికే పట్టం కట్టాలన్నది అతని ఆశయం. అందుకు తాను అతని అన్నని తెలియకూడదని అంటున్నాడు. ఇక్కడ వ్యక్తమయ్యే కర్ణుని సంస్కారవిశేషాన్ని అభినందించక తప్పదు. అలాగే ధర్మాత్ముడు కనుక ధర్మరాజే శాశ్వతంగా రాజు కావాలి అంటూకూడా, అధర్మపరుడైన దుర్యోధనుని తృప్తికైతాను అర్జునునితో తలపడతా ననటం కర్ణుని మైత్రీ ధర్మాన్నీ వ్యక్తం చేస్తుంది.

క: అనుజులు ఋత్విజులుగ నీ
పని యిటుసేయు మని నీ వుపద్రష్టవుగా
విను కురుకుమార పశువిశ
సనమున రణ యజ్ఞ మతఁడు సమ్మతిఁ జేయున్. 45

అ: అనుజులు = సోదరులు (తమ్ములు) ; ఋత్విజులుగన్ = ఋతిక్కులుగా, ఈపని = ఈ కార్యము ; ఇట్లు + చేయుము + అని = ఇట్లా చెయ్యమని ; నీవు ; ఉపద్రష్టవుగాన్ (యజ్ఞాలలో గుణదోషాలను కనిపెట్టి పరామర్శించే ఒక ఋత్విక్కు) ; విను ; కురుకుమార పశువిశసనమున = కౌరవు లనే యజ్ఞపశువులను చంపటంచేత ; రణయజ్ఞమున్ = యుద్ధమనే యాగాన్ని ; అతడు = ధర్మరాజు ; సమ్మతిన్ + చేయున్ = సంతోషంతో చేయుగాక.

భా: కృష్ణా ! సోదరులంతా ఋత్విక్కులుగా, నీ వుపద్రష్టవుగా ఏ పని ఎలా చేయాలో నిర్దేశిస్తూండగా ధర్మజుడు కౌరవులనే పశువులను సంహరించి రణయజ్ఞం చేయనీ!

వి: రణాన్ని యజ్ఞంగా వీరపురుషులు భావిస్తారు. యజ్ఞ పశువు ముక్తి నందుతుందని శ్రుతి. వీరమరణాన్ని పొందిన వారు స్వర్గాన్ని పొందుతారు.

శ్రీ కృష్ణుడి భేదనీతి కర్ణునిపై ఎంత ప్రభావాన్ని చూపించిందో ఈ మాటల ద్వారా తెలుస్తోంది. యథార్థానికి కర్ణుడు పాండవుల వైపు రావడమే శ్రీకృష్ణుని లక్ష్యంకాదు. కర్ణుని

మరణానంతరము ధర్మరాజు కృష్ణునితో నీదయవల్ల ఈ రాత్రి సుఖంగా నిద్రపోతాం అంటాడు. అంతటి వాడు కాబట్టి కర్ణుడు, భేద నీతి నుపయోగించి అతని పరాక్రమాన్ని కొల్లగొట్టడమే కృష్ణుడు లక్ష్యంగా పెట్టుకున్నాడు. దాన్ని సాధించాడు కూడా.

వ : దానం బుణ్యభూమి యగు కురుక్షేత్రంబున మముబోం ట్లెల్లను సద్గతి వడయుదురు గాక యనిన విని వసుదేవ నందనుండు సూత నందనున కిట్లనియె. 46

అ : దానన్ = దానిచే ; సద్గతి = ఉత్తమగతి.

భా: ఆ రణ యజ్ఞంచేత పవిత్రమైన ఈ కురు క్షేత్రంలో మా వంటి వారందరు ఉత్తమగతిని పొందుతారు. అనగా విన్న కృష్ణుడు కర్ణునితో ఇలా అన్నాడు.

మ : దయ నాయాడిన మాట గై కొనవు సంతాపంబుఁ దెచ్చున్ జుమీ
స్మయ మెట్లుం దుది నీకు నర్జునునితో మాత్సర్యమైనం బరా
జయ మొండెన్ మృతి యొండెఁ గాక గెలువన్ శక్యంబె పెక్కండ్ర కిం
తియ కాలంబగునట్టె నీ మనము శాంతిం బొందఁగా నేర్చునే. 47

అ : దయన్ = దయతో ; నా + ఆడిన మాట = నేను పల్కిన మాట ;కైకొనవు = స్వీకరింపవు ; స్మయము = గర్వము; ఎట్లున్; తుదిన్ = చివరలో; సంతాపంబున్ = పరితాపమునే; తెచ్చున్+చుమీ = కల్గించును సుమా !; నీకున్; అర్జుననితోన్; మాత్సర్యము + ఐనన్ = అసూయ ఉంటే ; పరాజయము + ఒండెన్ = ఓటమికాని ; మృతి + ఒండెన్ = మరణము కాని ; కాక = కలుగుగాక ; గెలువన్ శక్యంబె = గెలుచుట శక్యమా ; పెక్కండ్రకున్ =చాలమందికి; ఇంతియ + కాలంబు + అగును + అట్టె = ఇంతే ఆయువు అగునట ; నీ మనము ; శాంతిన్; పొందగాన్ + నేర్చునే = పొందగలదా !

భా : నేను దయతో పల్కిన మాటలను నీవు గ్రహించుటలేదు. అహంకారం చివరికి పరితాపం తేక మానదు సుమా ! అర్జునునిపై నీవు అసూయపడితే ఓటమికాని మరణం కాని కల్గుతుందే తప్ప అతనిని జయించడం నీకసాధ్యం. మరెందరికో కాలం చెల్లుతుంది. నీమనస్సుకు దానివల్ల శాంతి లభిస్తుందా.

క : గాండీవము కవదొనలు న
ఖండిత దివ్యాస్త్రములు నొగలపై నేనుం
జండ భుజ బలమై యు
ద్దండత నరుఁ డడర నెదురఁ దరమే నీకున్ ? 48

అ : గాండీవము = గాండీవము అను ధనువు ; కవదొనలును = జోడు అమ్ముల పొదులును ; అఖండిత + దివ్య + అస్త్రములు = మొక్కవోని దివ్యమైన అస్త్ర సంపదయూ ; నొగలపైన్ = కాడికట్టునందు ; నేనున్ = నేనును ; చండ + భుజబలము + ఐ = తీవ్రమైన బాహుబలముకల్గి ; ఉద్దండతన్ = ప్రచండముగా ; నరుఁడు = అర్జునుడు ; అడరన్ = అతిశయింపగా ; నీకున్ (ఓకర్ణా)నీకు ; ఎదురన్ + తరమే = ఎదుర్కొన శక్యమగునా.

భా : సారథినై నేను, గాండీవమను ధనుస్సు, జోడమ్ముల పొదులు, తిరుగులేని దివ్యాస్త్రములు కలిగి తీవ్రభుజ బలోపేతుడై అర్జునుడు నుండగా నీకెదుర్కొన శక్యమగునా!

వ : **ఎల్లభంగులం బాండవుల గెల్తు రది యట్లుండె; నీవు పొ మ్మిప్పుడ పోయి సుయోధనునకు గురు భీష్ములకును మీకుం దోడు వచ్చిన రాజుల కందఱకుం జెప్పు మిమ్మాసంబు సౌమ్యంబై సమ శీతోష్ణంబై పుష్పఫలోపేతంబును సమగ్ర ధాన్యంబును సులభయవసేంధనంబును నగుచు నొప్పియున్నయది యేడెనిమిది దివసంబులకు నమావాస్య వచ్చు నది పుణ్య దినంబు; నాఁడు భండనంబు గావలయు ననినఁ గానీనుండు గమలనాభున కిట్లనియె.** 49

అ : సౌమ్యంబు+ఐ=అనుకూలమై; ఉపేతంబున్=కూడినదియును; సులభ యవస+ ఇంధనంబును = తేలికగా దొరకు పచ్చికయు, కట్టెలును కలది; భండనంబు=యుద్ధము కానీనుండు = కర్ణుడు.

భా : ఏ విధంగానైనా పాండవులే గెలుస్తారు. అది అలా ఉంచు. నీవు వెళ్లు. ఇప్పుడేపోయి 'ఈ మాసం అనుకూలమైనది. సమశీతోష్ణస్థితి కలది. ఆహారధాన్యాలు సమృద్ధిగా లభించేది. సులభంగా పచ్చిక, కట్టెలు దొరికేది. ఏడెనిమిది నాళ్ళలో అమావాస్య వస్తుంది. అది పుణ్యదినం. ఆనాడు యుద్ధారంభం కావాలి" అని దుర్యోధనునకూ, ద్రోణభీష్ములకూ, మీకు తోడుపడు రాజుల కందరికీ చెప్పు. అనగా కర్ణుడు కృష్ణునితో ఇలా అన్నాడు.

వి. అనువైన వాతావరణమూ, తిథి చూసుకొని దండయాత్రకు బయలుదేరే వారని మన కిక్కడ సూచించాడు. ! ఇతరానికి పనికిరాని అమావాస్య యుద్ధానికి పనికివస్తుం దన్నమాట.

సప్తమాచ్చాపి దివసా దమావాస్యా భవిష్యతి
సంగ్రామో యుజ్యతాం తస్యాం తామాహుః శక్రదేవతామ్
శక్రదేవతాకమైన అమావాస్య సంగ్రామానికి మంచిదని కృష్ణుడు సూచించాడు.

క : **కలవు నిమిత్త స్వప్నం**
బులు; కౌరవ పాండవులకుఁ బోటగు దానన్
గెలు పయ్యుధిష్ఠిరునకును
గల దెఱుఁగుదు నీవు సెప్పఁగా నేమిటికిన్? 50

అ : నిమిత్త స్వప్నంబులు = శకునములూ, కలలూ ; కలవు = వచ్చుచున్నవి ; కౌరవ పాండవులకున్ ; పోటు + అగున్ = యుద్ధమవుతుంది ; దానన్ = ఆయుద్ధంలో ; ఆ యుధిష్ఠిరునకును ; గెలుపు = విజయం ; కలదు = లభిస్తుంది ; ఎఱుంగుదున్ = నేనీ విషయమెఱుగుదును ; నీవు + చెప్పఁగాన్ = నీవుచెప్పుట ; ఏమిటికిన్ = ఎందులకు ?

భా : శకునాలూ, స్వప్నాలూ కనిపిస్తున్నాయి. కురుపాండవులకు యుద్ధం జరుగుతుంది. దానిలో విజయం ధర్మరాజుకే లభిస్తుంది. ఈ విషయాన్ని నీవు చెప్పవలసిన అవసరం లేదు. నాకు తెలుసు.

వి : కురు పాండవులకు సంగరం తప్పదనీ, యుధిష్ఠిరుడు జయిస్తాడనీ కర్ణుడు అనుకొంటూనే ఉన్నాడట. కారణం శకునాలూ, స్వప్నాలూ. స్వప్న నిమిత్తాలపై విశ్వాసం అనాదిగా అనేక ప్రపంచదేశ ప్రజలలో ఉన్నదే.

వ : అట్లుగాన కదా యే నందు రానని పలికి మఱియును. 51

భా : *అందువలననే కదా నేను పాండవ పక్షానికి రావటం లేదు అని మరలా ఇలా అన్నాడు.*

వి : కర్ణుడు కౌరవ పక్షంలో ఉంటేనే తాను భావించినట్లు తనతో సమానుడైన అర్జునునిపై విజయమో, వీరమరణమో సంభవిస్తుంది కాబట్టి కర్ణుడు కౌరవపక్షంలోనే ఉండాలి.

క : దీనికి మూలము శకునియు
నేనును దుశ్శాసనుండు నింతియ కుంతీ
సూనుల వారలు గలసిన
రానేరఁగ వచ్చు నాకు రాజీవాక్షా! 52

అ : దీనికిన్ = ఈ కురుపాండవ కలహానికి ; మూలము = కారణము ; శకునియున్ ; నేనును ; దుశ్శాసనుండును ; ఇంతియ = ఇంతే ; వారలు ; కుంతీసూనులన్ = కుంతీపుత్రులను; కలసినన్; నాకున్ ; రానేరగన్ + వచ్చున్ = వచ్చుటకు వీలగును.

భా : *ఈ కురుపాండవ కలహాని కంతటికి నేను, శకుని, దుశ్శాసనుడే కారణం. ఒకవేళ శకుని, దుశ్శాసనుడు పాండవపక్షానికి మారితే నేను పాండవులతో కలిసేందుకు వీలవుతుంది.*

వి : పరస్పర సహకారంతో అకృత్యాలు చేసి విషయవలయాల్లో చిక్కుకున్నవారు విడిగా ఏ ఒక్కరు వాటినుండి బయటపడలేరు. సహజంగా జీవించడమో మరణించడమో, సన్మార్గమో అసన్మార్గమో వారు కలిసే నిర్ణయించుకొని కొనసాగవలసి ఉంటుంది.

వ : "ఈ సమర సముద్రంబు గడవనీఁది నిన్నుం గనియెదఁ గాదేని నూర్ధ్వలోకంబునం గాంచెద; నీవింక నేమియుం బలుకకుము; పని వినియెద నని కౌగిలించుకొనిన "నట్లకాక పో" మ్మని విష్ణుండు వీడుకొలుప రాధేయుండు రథావతరణంబు సేసి; గనక రత్న మయంబగు తన యరదంబెక్కి కరిపురంబున కరిగె; నచ్యుతుండును సాత్యకిం దన రథం బెక్కించుకొని దారుకుంజూచి "పదపద ! పోనిమ్ము పోని మ్మని పలికి లలితాటోప కలితుండగుచుఁ జనియె; నట్టియెడ విదురుండు విషాదంబుతోఁ బాండురాజమహిషి పాలికిం జని యిట్లనియె. 53

అ : కడవన్ + ఈది = దరిచేరగా నీదులాడి ; పని వినియెదను = సెలవు తీసికొని వెళ్ళెదను; లలిత+ ఆటోప -కలితుండు = మృదువైన కోపముతోకూడినవాడు; పాలికిన్ = చెంతకు

భా : *ఈ రణ సముద్రం దరిజేర నీది నీ సందర్శనం చేస్తాను. లేదా ఊర్ధ్వలోకాలలో అయినా నిన్ను చూస్తాను. నీ వింక ఏమీ అనవద్దు. సెలవు తీసికొని*

వెళుతున్నానని కర్ణుడు కృష్ణుని కౌగిలించుకొన్నాడు. కృష్ణుడు 'సరే అట్లే కానిమ్మ'ని సాగనంపగా, కృష్ణ రథం నుండి దిగి తన బంగారు రథమెక్కి కర్ణుడు హస్తినాపురానికి వెళ్లిపోయాడు. శ్రీకృష్ణుడు సాత్యకిని తన రథముపై నెక్కించుకొని దారుకుని చూచి 'పద పద పోని'మ్మని మృదు కోపంతో వెళ్ళాడు. విదురుడు కుంతి దగ్గరకు పోయి దుఃఖంతో ఇలా అన్నాడు.

ఉ : అక్కట! కౌరవాన్వయ మహార్ణవ మింకెడునట్లు పుట్టె నిం
దొక్కరుఁడైనఁ గేశవు హితోక్తికి మేకొనఁ డయ్యె నర్జునుం
డెక్కటి దాన చాలుఁ దము నిందఱ దీవ్రశరాగ్నిఁ గాల్పఁ బెం
పెక్కిన పాండునందనుల యేడ్తెఱఁ దొల్లియుఁ దా రెఱుంగరే! 54

అ : అక్కట = అయ్యో ; కౌరవ + అన్వయ, మహా+అర్ణవము = కురువంశ మనెడి మహాసముద్రము ; ఇంకెడు + అట్లు = ఇంకిపోవు పరిస్థితి; పుట్టెన్ = ఏర్పడినది ; ఇందున్= ఈ కౌరవులలో; ఒక్కరుఁడు + ఐనన్ = ఒక్కడు కూడా; కేశవు - హిత + ఉక్తికిన్= శ్రీకృష్ణుని మంచి మాటకు; మేకొనడు + అయ్యెన్ = అంగీకరింపకున్నాడు; అర్జునుండు; ఎక్కటి= ఒక్కడే; తాను + అ = తనే; తమున్ + ఇందఱన్ =తామందరినీ; తీవ్రశర + అగ్నిన్= దారుణ బాణాగ్నిచే; కాల్పన్ = కాల్చుటకు; చాలున్ ; పెంపు + ఎక్కిన = అతిశయించిన ; పాండు నందనుల + ఏడ్తెఱన్ = పాండవుల సామర్థ్యాన్ని (పరాక్రమాన్ని); తొల్లియున్ = ఇంతకుముందు కూడా ; తారు = ఆ కౌరవులు ; ఎఱుంగరే = తెలియరా !

భా : *అయ్యో! ఈ కురుకులాంబుధి ఇంకిపోయే దశ ఏర్పడినది. వీరిలో ఒక్కడూ ఆ శ్రీకృష్ణుని హితవచనాలను ఆలకించుటలేదు. అంగీకరించుట లేదు. అర్జునుడొక్కడే కౌరవులందరినీ తన తీవ్రబాణాగ్నిచే దహించివేయగలడు. పాండవ పరాక్రమం ఈ కౌరవు లంతకు ముందు మాత్ర మెఱుగరా?*

తే.గీ. : అన్ని పడియును బంధుక్షయంబు సేయ
నొల్ల కెల్ల విధంబుల నుపశమంబ
కోరి రప్పాండవేయులు వారి కిట్టి
దొసఁగు వచ్చునె! తులువలతోడఁ బుట్టి. 55

అ : అన్ని + పడియును = అన్ని కష్టము లనుభవించి కూడా ; బంధుక్షయంబు = బంధువినాశనము ; చేయన్ + ఒల్లక = చేయనిష్టపడక ; ఎల్ల విధంబులన్ = సర్వప్రకారాలతోను; ఉపశమంబు + అ = శాంతినే ; ఆ+పాండవేయులు = ఆ పాండు పుత్రులు ; కోరిరి =ఆశించారు; తులువలతోడన్ = నీచులైన కౌరవులతో ; పుట్టి ; వారికిన్ = ఆ పాండవులకు ; ఇట్టి ; దొసఁగు -వచ్చునె = కష్టము కలుగుతుందా ?

భా : *కౌరవుల వల్ల అన్ని కష్టాలు పడి కూడా బంధు భావనతో వారిని సంహరించట మిష్టం లేక సర్వవిధాలా శాంతినే పాండవు లాశించారు. నీచులైన ఆ దుర్యోధనాదుల వల్ల పాండవుల కిట్టి కష్టం వస్తుందా ?*

వ : **అని వెండియు నివ్విధంబు మాటలఁ బాండవులకుఁ గయ్యంపుటలజడి యైన వగపు దోఁప నాడుచుం గొండొక ప్రొద్దు నిలిచి నిజనివాసంబునకుం బోయిన యనంతరంబ కుంతి యిట్లని వితర్కించె.** 56

అ : కయ్యము + అలజడి = యుద్ధము వలన కలుగు శ్రమ ; వగపు = దుఃఖమును; కొండొక ప్రొద్దు = కొంతసేపు ; వితర్కించెన్ = బాగుగా ఆలోచించెను.

భా : *అలా అని పాండవులకు యుద్ధ ప్రమాదం వచ్చినందుకు తన బాధను వ్యక్తపరచి కొంతసేపుండి విదురుడు తన మందిరానికి వెళ్ళిపోయాడు. ఆ తరువాత కుంతి ఇలా ఆలోచించసాగింది.*

మ : **తమ వారిన్ సిరికై వధించు టిది సద్ధర్మంబె? యక్లేశ కృ**
త్యమె తాఁ గయ్యము? ద్రోణ భీష్మ కృప కర్ణాటోపముల్ మాన్పుట
ల్పములం దీఱునె! యందు నర్కజుని యుల్లం బెప్పుడుం గ్రోధదీ
ప్తము భీమాదుల మీఁదఁ; దక్కొరుల కుత్సాహంబు లే దాజికిన్. 57

అ : తమవారిన్ = తమ బంధువులను ; సిరికై = రాజ్యలక్ష్మికై ; వధించుట = చంపుట ; ఇది ; సత్ + ధర్మంబు + ఎ = క్షత్రియులకు ఉత్తమ ధర్మమగునా ?; కయ్యము + తాన్ = యుద్ధమది ; అక్లేశకృత్యము + ఎ = తేలికైనపనియా ; ద్రోణ, భీష్మ, కృప, కర్ణ + ఆటోపముల్ = ద్రోణ, భీష్మ, కృప, కర్ణుల గర్వమును ; మాన్పుట = పోగొట్టుట ; అల్పములన్+ తీఱునె = తేలికగా సాధ్యపడుతుందా ?; అందును = విశేషించి ; అర్కజుని + ఉల్లంబు = కర్ణుని మనస్సు ; ఎప్పుడున్ = ఎల్లవేళలా , భీమ + ఆదుల మీఁదన్ = భీముడు మొదలగు వారిపై; క్రోధ దీప్తము = కోపముచే ప్రజ్వరిల్లును ; తక్కు + ఒరులకున్ = ఇతరులెవ్వరికీ ; ఆజికిన్= యుద్ధానికి ; ఉత్సాహంబు లేదు = ఉద్యమించే దృష్టిలేదు.

భా : *తమ బంధువులను రాజ్యసంపదకోసం సంహరించటం ఉత్తమ కృత్యం కాగలదా ? యుద్ధమంత సులువైన పనా? ద్రోణ-భీష్మాదుల సంరంభాన్ని అణచివేయటం అంత తేలికగా సాధ్యపడేదా ? కర్ణుడు సదా భీమాదులపై కోపంతో మండిపడుతుంటాడు. అతనికి తప్ప ఇతరు లెవ్వరికీ యుద్ధంపై ఆసక్తి లేదు.*

వి : ఇంతకు ముందే శ్రీకృష్ణునితోఅత్యంతమూ పౌరుషభావంతో క్షత్రియత్వప్రరోచన చేస్తూ మాటలాడిన కుంతి అనతికాలంలోనే మరో విధంగా ఆలోచిస్తోంది. ఆవేశం అణగారిన తర్వాత ప్రసన్నచిత్తంతో చేస్తున్న ఆలోచన ఇది. ఇంత అనర్థానికి మూలకారణంగా కర్ణునిమాత్రమే కుంతి గుర్తించింది.

వ : **అని యిత్తెఱంగునఁ బెక్కులు చింతించి తలంచుకొని "కర్ణునకుం బుట్టువు దెలిపి సహోదర స్నేహం బావహించెద నట్టైన నాహవంబు వలని కడంక యుడుగ కుండునే " యని విచారించి, యతని పాలికిం బోవ నిశ్చయించి, యుచిత ప్రకారంబున వెడలి యతం డనుష్ఠానార్థంబు భాగీరథికిం జనుట విని, తత్ప్రదేశంబున**

కరిగి, యతనికి జపకాలంబై యునికిం జూచి, వెనుకవలనఁ గూర్చుండఁ గొండొక సేపునకు జపంబు దీఱ గలయం గనుం గొని, యమ్మహాదేవిం గాంచి, కానీనుండు సంభ్రమ వినయంబులతోడం జేరి, సూతగోత్రంబును రాధేయ నామంబునుం జెప్పి యభివాదనంబుసేసి 'నీవు విజయం చేసిన కార్యంబేమి? నాకుం జేయంగల పని యెయ్యది, యాన తి'మ్మనినఁ గుంతి యేకాంతంబుగా నిట్లనియె. 58

అ : ఆవహించెదన్ =కలిగించగలను ; ఆహవంబు = యుద్ధము ; కడంక = పూనిక;

భా : అని యీ విధంగా అనేక మాలోచించింది కుంతి. కర్ణునకు అతని జన్మ వృత్తాంతం చెప్పి సోదరులైన పాండవులపై ప్రేమ గలిగేలా చేయాలి. అట్లు చేయటం వలన యుద్ధ ప్రయత్నం (కర్ణుడు) విరమించుకోకపోడని అతని దగ్గరకు తగురీతి వెళ్ళింది కుంతి. అప్పుడు కర్ణుడు గంగానదికి సంధ్యావార్చుటకై వెళ్ళియున్నాడు. కుంతి గంగానది వద్దకు వెళ్ళింది. అక్కడ కర్ణుడు జపం చేసుకుంటున్నాడు. కుంతి అక్కడే కూచునుంది. కొంతసేపటికి కర్ణుడు జపం పూర్తి చేసుకొని నలుమూలలా చూచి, అక్కడున్న కుంతీదేవిని గమనించి, వినయంగా దగ్గరకు వచ్చాడు. గోత్ర నామాలు చెప్పి నమస్కరించి ఆమె ఏ పనిమీద వచ్చినదో, తా నే సహాయం ఆమెకు చేయాలో చెప్పవలసినదిగా కూడా కోరాడు. అప్పుడు కుంతి రహస్యంగా కర్ణునితో ఇలా పలుకసాగింది.

వి : గోత్ర నామాలు చెప్పి నమస్కరించటం ఈనాటికీ కొన్ని వర్గాలలో సంప్రదాయంగా వస్తోంది. ఆధునికనాగరికతలో వ్యక్తి తనను తాను క్రొత్తవారికి పరిచయం చేసుకుంటాడు. ఆ సమయాన తన పేరో, తండ్రిపేరో చెప్తాడు గదా ! అదే గోత్రనామాలు చెప్పి నమస్కరించటం. రాధేయుడనని కర్ణుడు చెప్పుకోవటం వల్ల బిడ్డను తల్లి సంపదగా భావించటం అప్పుడు కూడా ఉందనిపిస్తోంది.

-: కుంతీదేవి గర్ణునకు నతండు దనపుత్రుం డగుట దెలుపుట:-
(సం 5 - 143 - 1)

సీ : వినుము సూతాన్వయంబున నీవు పుట్టుట
 బొం; కేను మా కుంతిభోజు నింట
గన్నియనాఁడు భాస్కరుని రావించితి
 వరమంత్రబలమున; వచ్చి యతఁడు
సంప్రీతి నొసగంగ జన్మించినాఁడవు
 నాకుఁ; గావునఁ బాండునందనుండ
వగుదు ధర్మస్థితి; నట్టినీ వితరులఁ
 గొలువ నేటికిఁ గురుకులవరేణ్య!
తే : ధర్మ తనయాదులైన నీ తమ్ములకును
ధార్తరాష్ట్రులకును నీవ తగు విభుండ

వేలు మీలోక మెల్ల నీ కేల రాధ
కొడు కితం డను తక్కువ? కొడుకు(గుఱ్ఱ! 59

అ : వినుము; నీవు; సూత + అన్వయంబునన్ = సూతవంశములో; పుట్టుట; బొంకు = అసత్యము; ఏను = నేను ; మా కుంతి భోజుని + ఇంటన్ = మా తండ్రియైన కుంతి భోజుని ఇంటిలో ; కన్నియనా(డు = కన్యగా ఉన్నప్పుడు ; వర - మంత్ర - బలమునన్ = గొప్పదైన మంత్రశక్తితో ; భాస్కరుని = సూర్యుని; రావించితిన్ = రప్పించితిని ; అత(డు ; వచ్చి; సంప్రీతిన్+ ఒసగంగన్ = సంతోషము కలిగించగా; నాకున్ ;జన్మించినాడవు; కావునన్ ; ధర్మస్థితిన్= ధర్మనియమానుసారం ; పాండునందనుండవు + అగుదువు ; అట్టినీవు; ఇతరులన్; కొలువన్ + ఏటికిన్ = సేవింపనేల; కురుకులవరేణ్య = కురువంశశ్రేష్ఠ!; ధర్మతనయ + ఆదులైన= ధర్మజాదులయిన; నీ తమ్ములకును; ధార్తరాష్ట్రులకును= దుర్యోధనాదులకూ; నీవు + అ =నీవే; తగు = తగినట్టి; విభుండవు = పాలకుడవు; ఈలోకము + ఎల్లన్ = ఈ లోకమంతా; ఏలుము= పాలించు; కొడుకు(గుఱ్ఱ = నా ముద్దుల కొడుకా; ఇత(డు; రాధ కొడుకు = రాధేయుడను; తక్కువ = కొంచెపుతనం ; నీకున్ + ఏల = నీకెందులకు ?

భా : *నాయనా! నీవు సూతకులంలో పుట్టా వన్నమాట సత్యంకాదు. కుంతిభోజుని యింటిలో నా చిన్నతనాన మంత్రశక్తిచే సూర్యోపాసనచేసి అతని రప్పించాను . అతడు నన్ను సంతోషపెట్టగా నీవు కలిగావు. కనుక నీవు పాండురాజు కొడుకువే అవుతావు. ఇది ధర్మసమ్మతం. అట్టి నీవు ఇతరుల సేవింప నవసరంలేదు! ధర్మరాజు మొదలైన నీ తమ్ములకు, దుర్యోధనాది ధార్తరాష్ట్రులకును నీవే నాయకుడవు.ఈ లోకాన్నంతా పరిపాలించు. రాధాపుత్రుడనే చిన్నతనం నీ కెందుకు?*

వి : సూర్యానుగ్రహంతో కుంతికి జన్మించిన కర్ణుడు పాండునందనుడు కావటం ఆనాటి ధర్మస్థితి.

"అట్టి నీ వితరుల కొలువ నేటికి ? రాధకొడు కితం డను తక్కువ నీకేల" అన్న కుంతి మాటలు కర్ణునకే కాదు పాఠకులకు కూడా ఇంపుగా ఉండవు. సూత దంపతులు దయతలచకపోతే కర్ణుని కథయే లేదు. దుర్యోధను డాశ్రయ మివ్వకపోతే కర్ణున కింత ప్రాధాన్య మెక్కడిది ? కుంతీదేవికి కన్యకాస్థితిలో జన్మించటం కర్ణునకు తక్కువదనం కావచ్చుకానీ రాధేయు డనిపించుకోవటం తక్కువ కాదే !

ఇతరు లందరికన్న ఈ కౌరవపాండవ సమరం సంభవిస్తే ఎక్కువ నష్టపోయేది కుంతి. ఇరువైపులా తన రక్తం పంచుకొని పుట్టినవా రున్నారు. అర్జునాదుల పరాక్రమంపై ఎంత విశ్వాస మున్నదో, కర్ణుని శౌర్యమంటే అంతభయమూ ఉంది కుంతికి. ఏ శక్తి విజృంభించినా తెగేది తన ప్రేగే. అందుకే తన వారి నందరినీ ఒకటి చేయాలన్న తలపుతో అన్ని రకాల నిర్ణయాలకూ వెనుకాడలేదు. ప్రధానంగా అంతవరకు సమాజానికి భయపడి కర్ణుని జన్మరహస్యం దాచిన కుంతి ఈనాడు దాన్ని బయట పెట్టడానికి సంశయించలేదు. పుత్రప్రేమ ఆమెలో అంత సాహసాన్ని కల్గించింది.

అయితే ఆమె మాటాడుతున్న తీరు మాత్రం ఆమెపై కలుగుతున్న జాలిలో,

సానుభూతిలో కొంత భాగాన్ని తగ్గించటం మాత్రం వాస్తవం, అయోమయ పరిస్థితిలో ఆ పాత్ర అలా మాటాడుతున్నదని భావిస్తే తప్పు.

క : అని పలికిన యవసరమున
నిన బింబములోన నుండి యిది నిజ మిబ్భం
గిన నెగడ వన్న మేలగు
నను వాక్యము వెడలెఁ గర్ణుఁ డాకర్ణింపన్. 60

అ : అని ; పలికిన ; యవసరమునన్ = సమయములో; ఇనబింబిములో నుండి= సూర్య బింబములోన నుండి ; ఇది = కుంతి చెప్పిన జన్మరహస్యం ; నిజము ; ఈ + భంగిన్ = ఈ విధముగా ; నెగడవు + అన్న = నడుచుకొనవా నాయనా ? ; మేలు + అగున్= శ్రేయము కలుగును ; అను వాక్యము ; కర్ణుఁడు ; ఆకర్ణింపన్ = వినుచుండగా ; వెడలెన్ = వ్యక్తమయ్యెను.

భా : కుంతి అలా పలికిన సమయములో సూర్యబింబంనుండి "ఈ కుంతి చెప్పిన మాటలు యథార్థాలు; ఆ విధంగా ప్రవర్తించు నాయనా! నీకు మేలు కలుగుతుంది" అన్న మాటలు వెలువడి కర్ణుని చెవిని బడ్డాయి.

తే : దాని వినియును నపుడు రాధాసుతుండు
దిరుగఁ బడని మనంబుతో ధీరవృత్తిఁ
దల్లి కిట్లను "నీమాట తథ్య మగున
యైన నొక్కటి సెప్పెద నవధరింపు' 61

అ : దానిన్=ఆ సూర్యవచనాన్ని ; వినియునున్=వినికూడా; రాధాసుతుండు=కర్ణుడు; అపుడు ; తిరుగన్ + పడని = మారనట్టి; మనంబుతో = మనస్సుతో; ధీరవృత్తిన్ = ధైర్యంగా ; తల్లికిన్ = జననికి; ఇట్లు ; అనున్ = పలుకుతున్నాడు ; నీ మాట = నీ పలుకు ; తథ్యము + అగును + అ = యథార్థమే; ఐనన్; ఒక్కటి = ఒకమాట ; చెప్పెదన్ ; అవధరింపుము = ఆలకించుము.

భా : సూర్యవచనాలు వినికూడా మనసు మళ్ళని కర్ణుడు తల్లిని చూచి ధైర్యంతో ఇలా అన్నాడు. "అమ్మా ! నీవు చెప్పినది సత్యమే కానీ ఒక్కమాట చెపుతాను విను"!

వి : కర్ణుని ధర్మ సంకటంలో పడవేసింది కుంతి. కుంతి మాటలను సూర్యుడు ధ్రువీకరించాడు. తల్లి మాటలు వినకుండటమా? స్వామి భక్తిని విస్మరించటమా ? ఇలాంటి పరిస్థితులలోనే మానవుల గాంభీర్యం వెల్లడయ్యేది . కర్ణుడు స్థిరచిత్తతను కోలుపోవలేదు.

కం : క్షత్రియ సంస్కారమునకుఁ
బాత్రముగా నీవు నన్నుఁ బాటింప విహా
ముత్ర ఫలములకు నీకుఁ
బుత్రుఁడ నని వచ్చు టింకఁ బోలునె చెపుమా! 62

అ : క్షత్రియ + సంస్కారమునకున్ = క్షత్రియులకు తగిన సంస్కారములకు ; పాత్రముగాన్= అర్హునిగా ; నీవు ; నన్నున్ పాటింపవు = చేయవు ; ఇహ + అముత్రఫలములకున్=

ఇహపరలోక సంబంధమైన సుఖములు కల్గించుటకు; నీకున్; ఏన్= నేను; పుత్రుడను + అని; ఇంకన్ + వచ్చుట = ఇక వచ్చుట; బోలును + ఎ = తగునా ; చెపుము + అ = చెప్పుము.

భా : క్షత్రియులకు తగిన సంస్కారాలకు ఆనాడు నన్ను అనర్హుణ్ణిగా చేశావు. ఇప్పుడు ఇహ పర లోక సుఖ సంపాదన కోసం కొడుకు నని నేను నీ వెంట రావటం భావ్యమా? చెప్పు.

వి : కుంతి పెద్ద కొడుకుగా ఆమె ఇహపరాలు చూచే యోగానికి తానిక నోచుకోలేదు. కుంతి చేజేతులా ఆభాగ్యాన్ని దూరం చేసుకొంది. తానిక క్షత్రియుడు కాలేడు. సూత కులోత్పన్నునివలె సంస్కృతుడైన తన కామె తల్లీ కాలేదు. ఆమె కొడుకు తా ననేది లోకం విశ్వసించని సత్యమే. వారి మధ్యగల మమతానుబంధ మంతా మనస్సులను వేధించేదే గాని ఉభయుల జీవితాలను సుఖాంతం చేసేది కాకపోయింది. కనుక తానీ దశలో రావడం పొసగ దని కర్ణు డంటున్నాడు.

లోకబాంధవుడైన సూర్యానుగ్రహం వలన కుంతికి జన్మించిన వాడు కర్ణుడు. ధర్మజాదులవలెనే ఈతడునూ కౌంతేయుడే. కన్యాత్వమున కల్గుటచే కర్ణుడు తాను పాండవేయుడ నని చెప్పుకొనుట కధికారి. కాకపోయాడు. సాహసము చేసి కుంతి కర్ణున కేనాడో అతని జన్మరహస్యము చెప్పవలసియుండగా నట్లు చేయలేకపోయింది. పుట్టిన కర్ణుని చంపివేస్తే కర్ణుని జీవిత మట్టిది కాకయుండేది. కానీ ఆమె యట్లును చేయలేదు. గంగలో విడిచిన అతడు సూతునకు లభించాడు. సూర్యసుతుడు, కౌంతేయుడు, పాండవేయుడు ఐన కర్ణుని జీవితము విధిచేసిన వికటాట్టహాసమైంది. సూత పుత్రుడు, రాధేయుడైనాడు. పుత్రులు, పౌత్రులు కలిగి యుద్ధము ముంచుకొని వచ్చిన ఆ తరుణంలో తల్లి వచ్చి కోరిందనీ, తన కొడుకని చెప్పిందనీ ఆమె ఇహలోక సుఖాలకు, పారలౌకిక కృత్యాలను జరపడానికి రావడం లోకుల దృష్టిలోను, శాస్త్ర దృష్టిచేతను పోలదని తన మనస్సందు కంగీకరించదని అంటున్నాడు కర్ణుడు.

వ : సూర్యానుగ్రహంబునం జేసి నింద్యంబుగాక తక్కెనేనియు నా జన్మంబు పరమ రహస్యంబునై యున్నయది; దీనిఁ బ్రకాశంబు సేయుట మన కెంత మే లట్లుంగాక.
63

అ : అనుగ్రహంబు = దయ; నింద్యంబు = నిందింపతగినది; ప్రకాశంబు + చేయుట = వెల్లడించుట.

భా : సూర్యానుగ్రహంచే నీవు కన్యగా నున్నపుడు నన్ను పుత్రునిగా పొందడం తప్పుకాకపోవచ్చు. కాని నా జన్మ వృత్తాంతాన్ని నీవు అతి రహస్యంగా దాచి ఉంచావు. ఇంతకాలం తర్వాత దాన్ని వెల్లడించడం మన కేమంత మేలనిపించదు. అదీగాక.

వి : సూర్యానుగ్రహం వల్ల కుంతికే కర్ణుడు పుట్టినా దాన్ని మాటు చేసిన కారణంగా లోకం దృష్టిలో కర్ణుడు సూతపుత్రుడే. మరి దుష్యంతుడు శకుంతలను వివాహం చేసుకొని కూడా ఆమెను తిరస్కరించడం పదిమందికీ ఆ విషయం తెలియక పోవడం చేతనే కదా.

కుంతి తనకు పుత్రుడు కలిగిన విషయాన్ని దాచి కన్యాత్వాన్ని రక్షించుకొని కర్ణుని జన్మకు,

జీవితానికి గ్రహణం పట్టించింది. కర్ణుని క్షత్రియకులోత్పత్తికి కుంతి ధర్మమా అని కాలదోషం పట్టింది. కనుక దానిని ఇప్పుడు వెల్లడిస్తే ఉభయులకు గౌరవ ప్రదం కాదు అని కర్ణుని అభిప్రాయం.

కనుక సత్యాలైనా సకాలంలో వెలుగు చూచినపుడే సత్ఫలితాలనిస్తాయి గాని కాలం కప్పితే అనర్థాలకు కూడా కారణం కావచ్చు.

ఆ : విజయు విక్రమంబు విఖ్యాతమై యుండ
నేను గుంతికొడుక భానుజుండ
ననుచు నతనిఁ గూడ నరిగిన నతనికి
వెఱచి పోయె ననరె వేయు నేల? 64

అ : విజయు + విక్రమంబు = అర్జునుని పరాక్రమము ; విఖ్యాతము + ఐ = ప్రసిద్ధిని పొంది ; ఉండన్; ఏను = నేను ; కుంతి + కొడుకు + అ = కుంతీ దేవి పుత్రుడనే ; భానుజుండు + అ = సూర్యానుగ్రహంవల్ల కలిగిన వాడనే ; అనుచున్ = అనుచూ; అతనిన్ = ఆ అర్జునుని ; కూడన్ + అరిగినన్ = చేరబోయినచో ; వేయున్ + ఏల = వేయిమాటలెందుకు; అతనికిన్ + వెఱచి = అర్జునునికి భయపడి ; పోయెను + అనరె = వెళ్ళాడు అనకుందురా .

భా : అర్జునుని పరాక్రమం జగద్విఖ్యాతమై యుండగా నేను కౌంతేయుణ్ణి, భానుజుణ్ణి అంటూ అతని వెంటపోతే అర్జునుడికి జడిసి వెళ్ళాడని లోకు లనకుండా ఉంటారా?

వి : ఆనాడు కుంతి కర్ణుని తన కుమారునిగా అంగీకరించడానికి, ఈనాడు కర్ణుడు కుంతిని తన తల్లిగా అంగీకరించడానికి కూడా లోకాపవాదమే కారణమౌతుంది. ఇది లోకం దోషమా ? లేక భయపడే వారి మనస్సుల దోషమా ? తేల్చలేము. కానీ నాటి నుండి నేటివరకు మంచికి, చెడుకు కూడా ఈ లోకాపవాద మన్నది తిరుగులేని ఆయుధంగా ఉపయోగపడుతోంది. భవిష్యత్తులో కూడా ఇంతకంటే తేడా ఉండకపోవచ్చు.

క : కడిఁది పగఱ నేఁ దెప్పగఁ
గడవంగా నీఁదఁ దలఁచు కౌరవనాథుం
జెడుఁ గాక యంచు నిత్తఱి
విడువఁ దగునె? యతని వలన వెలసినవాఁడన్. 65

అ : కడిఁది + పగఱన్ = సమర్థులైన శత్రువులను ; ఏన్ = నేను ; తెప్పగన్ = నావగా ; కడవంగాన్ + ఈదన్ = దరిచేరనీదగా ; తలఁచు = తలంచెడు ; కౌరవనాథున్ = దుర్యోధన సార్వభౌముని ; అతని వలనన్ + వెలసినవాడన్ = దుర్యోధనుని మూలంగా ప్రసిద్ధిగన్న వాడనైన నేనే ; చెడున్ + కాక + అంచున్ = చెడితేచెడనీ అని ; ఈ + తఱిన్ = ఈ సమయంలో; విడువన్ + తగునె = విడిచిపెట్టడం భావ్యమా ?

భా : అరివీర సముద్రాన్ని నేను నావగా క్షేమంగా తరించాలని తలంచే దుర్యోధన మహారాజును అతని వల్లనే ప్రసిద్ధి పొందిన నేను ఈ అత్యవసర పరిస్థితిలో విడిచిపెట్టి రావడం భావ్యంగా ఉంటుందా ?

వి : రాజానుచరులలో స్వామిభక్తి ఒక ఉత్తమ గుణంగా చెప్పబడుతుంది. సూతపుత్రుడైన తనను అంగరాజుగా అందల మెక్కించిన సుయోధన మహారాజునెడ కర్ణునికి కృతజ్ఞత, ప్రభుభక్తి పుష్కలంగా ఉండడం సమంజసమే. కర్ణుని విషయంలో అది మరీ ఎక్కువగా ఉంటుంది. కారణం అతని వ్యక్తిత్వం సరిగ్గా దెబ్బతినే సమయంలో ఆదుకొని ఆ వ్యక్తిత్వాన్ని నిలిపినవాడు సుయోధనుడు. అందుకే కర్ణుని కచంచల భక్తి. నడమంత్రపు సిరివచ్చినా కర్ణుని వ్యక్తిత్వం చెడకపోవడం విశేషం.

కర్ణుడు కూడా పాండవుల పక్షంలోచేరి ఉంటే యుద్ధమే ఉండేది కాదని, కౌరవపాండవ సఖ్యం కుదిరి ఉండేదని, కర్ణుడే వినాశానికి కారణమని కొంద రంటారు. కాని అది ఆశ కనుగుణమైన పశ్చాత్కాలీనమైన ఊహ. దాని సంభావ్యత సంశయాస్పదమే అవుతుంది. కర్ణుడు పాండవ పక్షంలోచేరి ఉంటే సుయోధనుడు ఇంతకన్నా తీవ్రంగా ప్రతిస్పందించ డన్న దాఖలా ఏదీలేదు.

క : **కౌరవులచేత (గుడిచిన**
వారికి నిది సమయ మెట్టివారును సంగ్రా
మారంభమున(బాయుదు
రే? రాజులు మనల(దిట్టరే యట్టయినన్? 66

అ : కౌరవులచేతన్ = కౌరవుల వల్ల ; కుడిచినవారికిన్ = పోషింపబడిన వారికి ; ఇది సమయము= వారిని అంటిపెట్టుకొని ఉండవలసిన కాలమిది; సంగ్రామ + ఆరంభమునన్= యుద్ధం ప్రారంభమవుతుండగా ; పాయుదురే = చక్రవర్తిని విడిచిపెడతారా ; రాజులు = రాజలోకము; అట్లు + అయినన్ = ఆ విధంగా చేసినచో; మనలన్ = మనలను ; తిట్టరా + ఏ= దూషింపకుండా ఉంటారా.

భా : కౌరవుల ఉప్పుతిన్న ఎవ్వరికైనా తమ ప్రాణాలు సమర్పించవలసిన కాల మాసన్నమైంది. ఎవ్వరైనా యుద్ధం ప్రారంభ మవుతోం దనగా తాము కొలిచిన రాజును విడిచిపెడతారా ? అలా చేస్తే మనలను లోకులు దూషింపకుండా ఉంటారా ?

వి : రాజులు సైనికులను పోషించేది యుద్ధం వచ్చినపుడు రాజుకు సాయపడడానికి. సమయం వచ్చినపుడు తన్ను పోషించిన రాజును విడిచిపెట్టడం అన్యాయం,ద్రోహం ప్రజాదూషణకు,అపఖ్యాతికి కారణం. సందేహంలేదు.

దుర్యోధనుని విడిచిపెడితే కలిగే అపనిందలకు జడిసే కర్ణుడు లోకమంతా తన్ను నిందిస్తుం దంటున్నాడు. గతంలో దుర్యోధనుని చెంత చేరి జరిపిన అక్రమాలు ఘాతుకచర్యల విషయం కూడా అలా యోచించి ఉంటే బాగుండేది.

కర్ణుడు గతంలో లోక మేమంటుంది? అన్న ఆలోచన లేకుండా సుయోధనునితో కలసి పాండవులపై ధ్వజమెత్తాడు. అవి అకృత్యాలైనా సరే. ఇప్పుడు ధర్మబద్ధంగా తన తల్లివైపు చేరడం లోకాపవాదానికి కారణ మౌతుందేమో నని ఆలోచిస్తున్నాడు. ఆ అకృత్యాలలో కూడా ప్రభుహితమే దాగి ఉండడం, ఇది సత్కృత్యమైనా స్వార్థంతో ముడిపడి ఉండడం దాని ప్రధాన కారణం.

వ : ఏ నవశ్యంబును దుర్యోధనునకై నీ కొడుకుల తోడం బెనంగుదు. 67

అ : అవశ్యంబు = తప్పక ; పెనంగుదు = పోరాడుదును.

భా : దుర్యోధనునికోసం నేను నీ కుమారులతో తప్పక తలపడతాను.

ఉ : నీ పలు కెంత పోలినను నిర్ణయ మిట్టిదకాని యొండు లే
దీపనిమీఁది భారమున నీవిట వచ్చితి గాన పాండవుల్
చేపడిరేనిఁ జంప, నఱసేయక చెప్పెద, సవ్యసాచి పైఁ
గోపము పెద్ద, వాఁడు సమకూరిన బిట్టఱఁ జంపుదుం జుమీ! 68

అ : నీ పలుకు = నీమాట ; ఎంత + పోలినను = ఎంత సముచితమైనా ; నిర్ణయము= నా నిశ్చయము ; ఇట్టిది + అ + కాని = ఇట్టిదేకాని; ఒండు = వేరొకటి ; లేదు = లేదు ; ఈ పని మీది + భారమున = ఈపని బాధ్యతతోనే ; నీవు ; ఇటన్ + వచ్చితివి = ఇక్కడకు వచ్చావు ; కాన = కనుక ; పాండవులు ; చేపడిరి + ఏనిన్ = చేజిక్కినా ; చంపను ; అఱ + చేయక = నిన్ను వంచించకుండా ; చెప్పెదన్ = చెపుతున్నాను. సవ్యసాచిపైన = అర్జునుని మీద ; కోపము + పెద్ద = నాకు కోపము హెచ్చు; వాఁడు ; సమాకూరినన్ = చిక్కినచో ; బిట్టు + అఱన్ = శీఘ్రముగా గర్వము నశించునట్లు ; చంపుదున్ + చుమీ = సంహరిస్తాను సుమా !

భా : నీవు చెప్పింది ఎంత యుక్తమైనా నా నిశ్చయం మాత్రం మారదు. నువ్వు ఈ పని మీద వచ్చావు కనుక పాండవులు నా చేజిక్కినా నేను వాళ్ళను చంప నని కపటం లేకుండా చెపుతున్నాను. అర్జునుడి మీద నాకు కోపం హెచ్చు. అతడు చిక్కితే మాత్రం చంపుతాను.

వి : పోలినను వినక పోవడమే మూర్ఖత. కుంతీ వచనాలు వినడం వల్ల కర్ణుడికి కాని అతని ఆశ్రయదాతకు కాని కలిగే హాని ఏ మాత్రమూఉండదు. అర్ధరాజ్యం నిరాపదంగా సిద్ధిస్తుంది. కౌరవులు, వారి ఆశ్రితులు చావక బ్రతుకుతారు. లోకులు అభినందిస్తారు. ఆనందిస్తారు.కర్ణుడు 'చిక్కితే సవ్యసాచినే తప్పక చంపుతాను. ధర్మరాజాదులను విడిచిపెడతాను.' అని పల్కడంకూడా అతని ప్రభుభక్తికి తగ్గమాటకాదు. పైగా భీమాదులు తక్కువవారా. దుర్యోధనుడికి పరాజయం భీమాదులవల్ల కలుగకూడదా? అర్జునుని మాత్రం సంహరించగలడని నిశ్చయమేమిటి ? దుర్యోధనునికి కావలసింది సామ్రాజ్యము, పాండవులపై విజయమేకాని అర్జున సంహారం మాత్రం కాదు కదా. అదీకాక అర్జునుడు తన సోదరుడని తెలిసికూడా అతనిపై తనకు కోపం హెచ్చు. దొరికితే తప్పక వధిస్తానని చెప్పడంలో విజ్ఞత ఏమిటి ? అయితే కర్ణుడు గొప్పదాత. అతడా దాన గుణాన్ని ప్రాణాధికంగా ప్రేమిస్తాడు. దానిని జీవితాంతము వరకు నిలిపికొన్నాడు. అటువంటి వారు తన కన్న తల్లి అర్థిస్తే కాదంటాడా ? ఆమె ఆనందానికి ఈ వాగ్దానం చేశాడు. దుర్యోధనుడు తన్ను చేరదీసింది అర్జునుడికి ప్రతిద్వంద్విగానే. అందువల్ల తనకూ, తన ప్రభువుకూ ద్వేష్యుడైన అర్జునుణ్ణి సంహరిస్తాడు. లేకపోతే అర్జునుని చేతిలో అసువులు వీడుతాడు.

ఆ : సవ్యసాచి చేత (జచ్చుటయును గీర్తి
కరమ; యత(డు లోనుగా(గ నేవు
రేను లోనుగా(గ నేవురు గాని నీ
కొడుకు లార్వు రనుట విడువు మింక. 69

అ : సవ్యసాచిచేతన్ = అర్జునుని చేతిలో; చచ్చుటయును = మరణించుటకూడ ; కీర్తికరము + అ= యశస్సునే కలిగిస్తుంది; అత(డు -లోను + కా(గన్= అతడు మిగిలిన (అతడు మొదలుగా) (నీ కొడుకులు) ఏవుర ; ఏను - లోను + కాగన్= నేను మిగులగా ; ఏవురు = ఐదుగురు; కాని = అంతియ కాని ; నీ కొడుకులు; అర్వురు + అనుట = ఆరుగు రన్నమాట; ఇంకన్ + విడువుము = ఇక విడిచిపెట్టుము.

భా : అర్జునుని చేతిలో చావటం కూడా కీర్తిప్రదమే. అతనితో కలిపికొని నీ కొడుకులు అయిదుగురు. లేదా నాతోకలిపి కొని ఐదుగురు. అంతే కానీ నీ కుమారులు ఆర్గు రను మాటను ఇక మరచిపో.

వి : మహావీరుడు సాటివారిని సంహరించాలనీ లేదా అతని చేతిలో తాను మరణించాలని అభిలషిస్తాడు. భీమాదులను విడిచి అర్జునునిపైనే పగబూనటం అటువంటిదే. కర్ణుడు తల్లికీ, సోదరులైన అర్జునాదులకు చిన్ననాటి నుండి దూరంగా ఉన్న కారణంగా ఆనోటా, ఆనోటా తాను విన్నా, కుంతీ కృష్ణులు చెప్పినా అతనిలో మమతానురాగాలు పూర్తిగా నెలకొన్నాయికావు. పైగా దుర్యోధనాదుల దుస్సాహచర్య ప్రభావం.

చ : అనుటయు నప్డు గుంతి హృదయంబున శోకము నివ్వటిల్ల ని
ట్లను "నిది దైవసంఘటన మక్కట యెట్లును దప్పనేర్చునే
యనుపమ సత్యవిస్ఫురణ నాడిన మాట మఱాకు మన్న నీ
యనుజుల నల్వురం గడపు మర్జును(జే(తకు సమ్మతించితిన్. 70

అ : అనుటయున్ = కర్ణుడట్లు పలుకగా ; అప్డు; గొంతి = కుంతి ; హృదయంబునన్ ; శోకము = దుఃఖము ;నివ్వటిల్లన్ = అతిశయించగా ; ఇట్లు + అనున్ ; అక్కట ; ఇది ; దైవ సంఘటనము = దైవ యోగము ; ఎట్లును = ఏ రీతిగానైనా; తప్ప నేర్చునే = తప్పించుటకు సాధ్యమవుతుందా; అనుపమ। సత్య - విస్ఫురణన్ = సాటిలేని సత్యవాక్య ప్రకటన చేత ; ఆడినమాట = పలికిన పలుకు ; మఱాకుము+అన్న = మరువకు నాయనా! ; నీ + అనుజులన్= నీ సోదరులను ; నల్వురన్ = నలుగురినీ; కడపుము = విడువుము ; అర్జునున్ + చే(తకున్ = అర్జునునితోతలపడుటకు ; సమ్మతించితిన్ = అంగీకరించాను.

భా : అనగా కుంతి వ్యాకుల చిత్తంతో ఇలా అన్నది " ఇది దైవ నిర్ణయం ఎలాగైనా తప్పదు. సత్యనిష్ఠతో నీవన్న మాటను మాత్రం మరువకు. నీ తమ్ములు నలుగురినీ రక్షించు. అర్జునుని సంహరించే ప్రయత్నాన్ని సమ్మతిస్తున్నాను."

వి : ఈ పద్యంలో కర్ణుడు అర్జునుడు ఎదురుపడితే మాత్రం సంహరిస్తానన్నాడు. అందుకు అంగీకరిస్తూ కుంతి సంహారానికి అనకుండా చే(తకు (పనికి) అని మాత్రమే అంది. మాతృవాత్సల్య స్వరూపం తెలిసిన తిక్కన కుంతి పాత్ర పరంగా ప్రయోగించిన పదమిది.

ఆ : అనుచుఁ గౌఁగిలింప నర్కజుం డట్లకా
కని ప్రియంబు మెఱయ వినతుఁడైన
నరిగె సదనమునకు నద్దేవి; యతఁడును
జనియె నిజ నివాసమునకుఁ బ్రీతి. 71

అ : అనుచున్ = అనిపలుకుతూ; కౌఁగిలింపన్ = కవుగిలింపగా; అర్కజుండు = కర్ణుడు ; అట్లు + అ + కాక + అని = అలాగే అగునని; ప్రియంబు = ప్రేమ ; మెఱయన్ = బయటపడునట్లుగా; వినతుడు + ఐనన్ = నమస్కరింపగా ; ఆ + దేవి = ఆకుంతీదేవి ; సదనమునకున్ = మందిరానికి; అరిగెన్ = వెళ్ళింది ; అతఁడును = ఆ కర్ణుడు కూడా ; నిజ నివాసమునకున్ = తన మందిరానికి ; ప్రీతిన్ = ఆనందముగా ; చనియెన్ =వెళ్ళాడు.

భా : అని యంటూ కర్ణుని కౌగిలించు కొనగా అతడు అలాగే అని ప్రేమతో నమస్కరించాడు. కుంతి తన భవనానికి వెళ్లిపోయింది. కర్ణుడుకూడా ఆనందంతో తన మందిరానికి వెళ్ళిపోయాడు.

వి : తన రాజుకు ప్రియంగా అర్జునుని సంహరిస్తాడు. తన తల్లికి ప్రియంగా ధర్మరాజును విడిచిపెడతాడు. ఆ ఉభయులకూ ప్రీతి తనకు ప్రియం. అందుకనే కర్ణుడు ఆనందంతో ఇంటికి వెళ్ళాడు.

వ : అక్కడ వాసుదేవుం డుచితప్రయాణంబుల నుపప్లావ్యంబునకుం జని, ధర్మతనయు చేతం బూజితుండయి, భీమసేనాదులు విరాట ద్రుపదముఖ్యులగు తగువారలుఁ దన్నుం గాంచిన వారినెల్ల నభినందించి కొలువున నుండి యుధిష్ఠిరుతో నిట్లనియె. 72

అ : ముఖ్యులు = మొదలైనవారు ;

భా: ఇక అక్కడ శ్రీకృష్ణుడు హస్తినా పురము నుండి తగు విధంగా ప్రయాణించి, ఉపప్లావ్యంబునకు వెళ్ళాడు. ధర్మరాజాదులు కృష్ణుని పూజించారు. భీమసేనుడు, ద్రుపదుడు, విరాటరాజు మొదలైన పెద్దలంతా శ్రీకృష్ణుని చూడవచ్చారు. వారినందరినీ అభినందించి కొలువులో ధర్మరాజుతో ఇలా అంటున్నాడు కృష్ణుడు.

తే : ధార్తరాష్ట్రు లున్మత్తులు దగిన పలుకు
లేల విని సంధిసేయుట కిచ్చగింతు?
రెదిరిఁ దమ్మును నెఱిఁగిర యేని వార
లంత లంతలు సేయుదు రయ్య? నాఁడు. 73

అ. ధార్తరాష్ట్రులు = ధృతరాష్ట్రుని కుమారులగు దుర్యోధనాదులు; ఉన్మత్తులు = పిచ్చివారు; తగిన - పలుకులు=మంచి మాటలు; ఏలన్=ఎందులకు; విని, సంధి+ చేయుటకున్= (మీతో) సంధిచేసుకొనుటకు ; ఇచ్చగింతురు = అంగీకరిస్తారు; ఎదిరిన్ = శత్రువును; తమ్మునున్= తమను; ఎరిఁగిరి + అ + ఏని = తెలుసుకొన్నవారయితే; వారు= ఆ సుయోధనాదులు; నాఁడు= ఆ రోజు ; అంతలు + అంతలు = అంతంతపనులు ; చేయుదురు+ అయ్య = చేస్తారటయ్య!

భా : దుర్యోధనాదులు పిచ్చివారు. మంచి మాటలు విని వారు రాజీ కెందుకు వస్తారు. తమ శక్తినీ, పరుల శక్తినీ గుర్తించినట్లయితే ఆనాడు వారు అంతంత పనులు చేసి యుండెడివారా ?

వ : అని యెల్లవారును విన(దన పోయి వచ్చిన కార్యంబు తెఱం గెఱింగించి పథిశ్రమంబు వుచ్చువా(డయి పుండరీకాక్షుండు నిజమందిరంబున కరిగె; నాటిరాత్రి ధర్మనందనుం డనుజ సహితంబుగా నుచిత ప్రదేశంబున నుండి, గోవిందుని రావించి, నీవు సుయోధనునితో(బలికిన చందం బెయ్యది, యతండేమి విధంబున నుత్తరం బిచ్చె నని యడిగిన నచ్యుతు(డిట్లనియె. 74

అ : తెఱంగు = పద్ధతి; పథిశ్రమంబు = మార్గాయాసము ; పుచ్చువా(డు = పోగొట్టుకొనువాడు;

భా : అని యందరు వింటుండగా తాను వెళ్ళి వచ్చిన పని తీరు తెలిపి మార్గాయాసాన్ని పోగొట్టుకొనటానికి తన బసకు వెళ్ళాడు. ఆ రాత్రి ధర్మరాజు సోదరులతో కూడి ఉండి శ్రీ కృష్ణుని రప్పించి " నీవు దుర్యోధనునితో పలికిన తీరెట్టిది? అతడే విధంగా బదులు పలికినా" డని ప్రశ్నింపగా కృష్ణుడిలా అన్నాడు.

-: శ్రీ కృష్ణు(డు ధర్మరాజునకు (గౌరవసభం బుట్టిన విశేషంబులు తెలుపుట:-

(సం - 5-145 -1)

క. కయ్యము గాని తెఱంగున
నెయ్యం బగునట్లుగా(గ నెఱి(బలికితి నే
నెయ్యది సుఖంబు పథ్యం
బెయ్యది యరయంగ దథ్య మెయ్యది దానిన్. 75

అ: కయ్యము = యుద్ధము ; కాని తెఱంగునన్ = కాని రీతిగా; నెయ్యంబు = మైత్రి; అగునట్లు+కా(గన్= అయ్యే రీతిగా ; నేను ; ఏ + అది = ఏది ; సుఖంబు = సుఖమును కల్గించునో ; ఏ +అది = ఏది; పథ్యంబు = హితకరమో ; అరయంగన్ = ఆలోచింపగా ; ఏది; తథ్యము = వాస్తవమో ; దానిన్ ; నెఱిన్ + పలికితి = రమణీయంగా పలికాను.

భా: యుద్ధంలేని విధంగానూ, పరస్పరమైత్రి నెలకొనే విధంగానూ, సుఖసంపాదకమూ, హితకరమూ, సత్యమూ అయిన మాటను తగిన రీతిగా భాషించాను.

వి : ధర్మరాజు హృదయమెరిగిన వాడు కృష్ణుడు. రాయబారి లక్షణాలు రాజ-హృదయాన్ని ప్రతిబింబించాలిగదా! కనుక తదనుగుణంగా సత్యమును, ప్రేమయును, శ్రేయస్సునూ కల్గించే మాటనే పలికాడు కృష్ణుడు.

తే। బహు విధంబుల(బలుకు నా పలుకు లెల్ల(
జీ(దకన్నిడి తన పెడచెవుల(బెట్టి

యీఱతాఱలు మఱుమాట లిచ్చి యపహ
సించె దుర్యోధనుడు వేయు చెప్పనేల? 76

అ : బహువిధములన్ = అనేకరీతులుగా; పలుకు = పలుకునట్టి ; నా పలుకులు+ ఎల్లన్ =నా మాటలన్నింటినీ; చీద కన్ను + ఇడి = చింద పక్షిలా చూచి; తన పెడచెవులన్ + పెట్టి = శ్రద్ధతో వినక ; ఈఱతాఱలు - మఱుమాటలు + ఇచ్చి= వంకరమాటలు సమాధానంగా చెప్పి; వేయి + చెప్పన్ + ఏల = వేయిమాటలెందుకు; దుర్యోధనుడు; అపహసించెన్ = అవహేళన చేశాడు.

భా : *నేనెన్ని విధాలుగా చెపుతున్నా చీదకన్నువేసి, పెడచెవుల బెట్టి, అస్తవ్యస్తంగా మాటాడుతూ, ప్రతివచనాలు ఇచ్చాడు. ఇన్నిమాటలెందుకు ? ఆ దుర్యోధనుడు నన్ను అవహేళన చేశాడు.*

వి : పెద్దలు గౌరవార్హులు ప్రసంగిస్తున్నపుడు ఇతరులు ఏ రీతిగా ఆలకించాలో సూచిస్తున్నాడు తిక్కన ఇక్కడ. దృష్టి , వినుకలి- రెండూ ఏకాగ్రాలు కావాలి. ప్రతివచనాలు స్పష్టంగా, సూటిగా, మర్యాద నతిక్రమించకుండా ఉండాలి. మాటలూ, అభిప్రాయాలూ నచ్చకపోయినా అవహేళన చేసే ప్రయత్నం చేయకూడదు.

క : **అనిన విని ధర్మజుం డి**
ట్లను " నప్పుడు దండ్రి యుచిత మాడఁడె భీష్మం
డును గురుఁడు విదురుఁడుం ద
క్కిన పెద్దలుఁ బలుకరే తగిన చందమునన్ " 77

అ : అనినన్ = (కృష్ణుడట్లు) పలుకగా ; విని ; ధర్మజుండు ; ఇట్లు + అనున్; అప్పుడు = ఆ సమయంలో; తండ్రి = సుయోధనుని తండ్రి; ఉచితము + ఆడఁడు + ఏ = తగిన మాటలు పలుకడా ? ; భీష్ముండును ; గురుఁడు= ద్రోణుడును ; విదురుఁడు ; తక్కిన= మిగిలినట్టి ; పెద్దలు ; తగిన చందమునన్ = సముచితమైన రీతిలో; పలుకరే = పలుకరా !

భా : *కృష్ణుడలా అనగానే ధర్మరాజు ఇలా అంటున్నాడు. "దుర్యోధనుడి ప్రవర్తన అలా ఉంటే తండ్రి అయినా తగిన రీతిగా మాటాడలేదా ? భీష్మద్రోణ విదురులైనా సముచిత గతితో పలుకలేదా ?"*

వి : పిల్లలు తెలిసి చేసినా తెలియక చేసినా బుద్ధి చెప్పని పెద్దలనే లోకం నిందిస్తుంది. దుర్యోధనుడట్లు ప్రవర్తించగా ధృతరాష్ట్రాదు లేమి చేశారని ధర్మజు డడగటంలోని ఆశయమిదే.

క : **నావుడు హరి యిట్లను "స**
ద్భావమున విచిత్ర వీర్యతనయుఁడు దగనా
నా విధముల (జెప్పిన సం
భావన వినఁ డతఁడు వలుకుఁ బ్రతికూలంబుల్. 78

అ : నావుడున్ = (ధర్మరాజు) అట్లనగానే ; హరి = కృష్ణుడు ; ఇట్లు + అనున్; సద్భావంబునన్ = మంచి మనస్సుతో ; విచిత్ర వీర్యతనయుఁడు = ధృతరాష్ట్రుడు; తగన్ =

తగునట్లు; నానా.విధములన్ = అనేక విధాలుగా ; చెప్పినన్ = పలికిననూ; సంభావనన్ = గౌరవబుద్ధితో ; అతఁడు ; వినఁడు; ప్రతికూలంబున్ = వ్యతిరేకవచనాలనే ; పలుకున్ ;

భా : ధర్మరాజట్లు పలుకగా కృష్ణుడిలా అన్నాడు " మంచి మనస్సుతో ధృతరాష్ట్రుడు ఎన్నో విధాలుగా చెప్పినా దుర్యోధనుడు మన్నించడు. ప్రతికూల వచనాలనే పలుకుతాడు.

సీ : శంతను పుణ్యవంశం బంకురించిన
చందంబు నంబికానందనుండు
జాత్యంధుఁడై యుండ సామ్రాజ్య మంతయుఁ
బాలించి పాండు నృపాలుఁ డతనిఁ
గొలిచి యుండుటయును గురుకులంబున కెల్లఁ
దేజంబుగా మీరు దిగ్విజయము
సేసి కావించిన సిరి వారు వంచనఁ
గొనుటయు సత్య మకుంఠితముగ
తే : నీవు సమయంబు నడపిన నెఱియుఁ దండ్రి
పాలు మీకు నీఁ దగుటయుఁ బాడి లేమి
నరయఁ జెడుదురు కౌరవు లనియుఁ బెద్ద
లెల్లఁ జెప్పిరి మొగమోట యింత లేక. 79

అ : శంతను -పుణ్యవంశంబు = శంతనుమహారాజుయొక్క పవిత్ర వంశము ; అంకురించిన చందంబు = మొలకెత్తిన తీరూ; అంబికానందనుండు = ధృతరాష్ట్రుడు; జాతి + అంధుఁడై= పుట్టు గ్రుడ్డియై; ఉండన్ = ఉండగా; పాండు నృపాలుఁడు; సామ్రాజ్యము + అంతయున్ = రాజ్యాన్నంతటినీ ; పాలించి= రక్షించి ; అతనిన్ ; కొలిచి + ఉండుటయును = సేవిస్తూ ఉండటమూ ; కురుకులమునకున్ + ఎల్లన్ = కురువంశానికి అంతటికీ; తేజంబుగాన్ = శక్తిగా ; మీరు ; దిగ్విజయంబు +చేసి = దిక్కులను జయించి; కావించిన సిరిన్ = సంపాదించిన సంపదను ; వారు ; వంచనన్ = మోసంతో ; కొనుటయున్ = అపహరించటమూ ; సత్యము = సత్యవర్తనము ; అకుంఠితముగన్ = మొక్కపోకుండా ; నీవు ; సమయంబున్ = (అరణ్య - అజ్ఞాత వాస) నియమాన్ని ; నడపిన నెఱియున్ = నిర్వహించిన పద్ధతినీ ; తండ్రిపాలు = మీ తండ్రియొక్క రాజ్యభాగము; మీకున్ ; ఈన్ +తగుటయున్ = మీ కివ్వనర్హమగుటా ; పాడిలేమిన్= న్యాయము లేక ; అరయన్ = చూడగా; కౌరవులు = సుయోధనాదులు ; చెడుదురు; అనియున్; పెద్దలు; ఎల్లన్; మొగమాట =మనస్సంకోచము; ఇంతలేక = కొంచెము కూడా లేకుండా; చెప్పిరి.

భా : శంతను వంశోద్భవమునూ; ధృతరాష్ట్రుడు పుట్టుగ్రుడ్డియై యుండగా పాండురాజే సామ్రాజ్యాన్ని రక్షిస్తూ ధృతరాష్ట్రుని సేవిస్తూ ఉండటమూ ; కురువంశ శక్తిగా మీరు విజృంభించి, దిగ్విజయం చేసి, రాజుల నందరనూ జయించి, అనంతసంపదలను

కొనిరావటమూ ; దాన్ని కౌరవులు వంచనా మార్గంతో అపహరించటమూ; సత్యనిష్ఠతో నీవు అరణ్యాజ్ఞాతవాసనియమాలను పాటించటమూ; మీ తండ్రి రాజ్యభాగం మీ కిచ్చుటలోని ఔచిత్యాన్ని; న్యాయహీనులై దుర్యోధనాదులు నశించిపోగల వైనాన్ని అక్కడున్న పెద్ద లంతా ఏ మొహమాటం లేకుండా చెప్పారు.

క : **అలయక యందఱుఁ జెప్పం**
గల యంతయుఁ జెప్పి రతఁడు గటకటఁబడి య
క్కొలువు వెడలి పోయెం ద
మ్ములుఁ గర్ణుండు రాజలోకముం దో నరుగన్. 80

అ : అలయక = విసుగుజెందక ; అందఱున్ ; చెప్పన్ + కల + అంతయున్ = తాము చెప్పిగలిగినదంతా ; చెప్పిరి; అతఁడు= సుయోధనుడు; కటకటన్ + పడి = కోపపడి ; తమ్ములున్= దుశ్శాసనాదులును ; కర్ణుడున్ ; రాజలోకమున్ = రాజసమూహమూ; తోన్ + అరుగన్ = కూడా వెళ్ళగా ; ఆ + కొలువున్ = ఆ సభను ; వెడలిపోయెన్ = విడిచిపోయెను.

భా: *విసువు జెందక ప్రతి వ్యక్తియు తాను చెప్పగలిగిన దంతా చెప్పాడు. ఆ దుర్యోధనుడు కోపించి తన సోదరులూ, కర్ణుడూ, ఇతర రాజ బృందమూ వెంటరాగా కొలువు వీడి వెళ్ళిపోయాడు.*

వి : "అలయక, అందరు, చెప్పంగల యంతయు" అన్న పదాలు మూడు కురుసభలో కృష్ణాదులు దుర్యోధనుడికి ఎంతగా హితవు చెప్పారో ప్రకటిస్తాయి. అలా హితవు చెప్పిన పెద్దలపై 'కట కట ఁబడుట' అతని అవివేకాన్ని సూచిస్తుంది. అందరు పెద్దలుండగా కొలువు వెడలి పోవట మతని అహంభావాన్ని, నియంత్రణ లేకపోవటాన్ని తెలుపుతుంది.

వ : **ఇట్లు గొడుకు ముష్కరుండై యరిగిన ధృతరాష్ట్రుండు గాంధారి రావించి.** 81

అ : ముష్కరుఁడు = దుష్టుడు ; రావించి = పిలిపించి

భా : *ఈ విధంగా దుర్మార్గుడైన కుమారుడు సభాభవనాన్ని విడిచి వెళ్ళగా ధృతరాష్ట్రుడు గాంధారిని పిలిపించాడు.*

క : **తగు విదురుఁ బంచి యాతని**
మగుడఁగ బిలిపించె నాయమయుఁ దనయునకున్
వగయును గూర్మియు వెరవును
మిగిలిన వచనముల సంధి మెయికొనఁ జెప్పెన్. 82

అ : తగన్ = ఒప్పునట్లు ; విదురున్ ; పంచి = పంపి; ఆతనిన్ = ఆసుయోధనుని; మగుడఁగన్= మరలా; పిలిపించెన్ ; ఆ యమయున్ = ఆ గాంధారి కూడా ; తనయునకున్ = కుమారునకు; వగయును = ఆలోచన; కూర్మియున్ = ప్రేమ; వెరవును = ఉపాయమును; మిగిలిన = అతిశయించినట్టి; వచనములన్ = మాటలతో; సంధిన్; మెయికొనన్ = అంగీకరించటానికి; చెప్పెన్.

భా : విదురుని పంపి దుర్యోధనుని తిరిగి రమ్మని పిలిపించాడు.

గాంధారి తన కుమారుని సంధికి అంగీకరించమని ఆలోచనను సూచిస్తూ, ప్రేమతో బుజ్జగిస్తూ నేర్పుగా చెప్పింది.

వి : మనసుకు నచ్చే విధంగా చెప్పింది. శ్రేయస్సు కలుగుతుంది మాటలాలింపుము అని చెప్పింది. పాండవులతో విరోధం వినాశానికి కారణం. ఈ ప్రమాదాన్ని గుర్తుంచుకొన్నావు గదా అని తన బాధనూ, దుఃఖాన్ని వ్యక్తం చేస్తూ చెప్పింది గాంధారి.

వ : ఎవ్వరెంత సెప్పినను గైకొనక కడంగి దుర్యోధనుండు దనకుం గల వారల నెల్లను గురుక్షేత్రంబునకు నడవుం డని చెప్పం బనిచె; భీష్ముని సేనా ముఖంబు చేసికొని యెత్తి విడియం గల వాఁ డిది ధార్తరాష్ట్రుల నిశ్చయం బేనును నా యోపినంత సామవాదంబు లాడితి; నారదాది మహామునులను సుయోధనునకు బుద్ధులు సెప్పునట్లు సేసితి; నేమి సెప్పినను నెంతటం బోకున్నం గినుక దెచ్చికొని జంకించియు భంగించియు ధిక్కరించియుఁ దృణీకరించియుం జూచితిఁ; గార్యంబు భగ్నం బగుట కొల్లక వెండియు శాంతవచనంబులు పలికితి; నతం డశక్త దుర్జనత సేయం జూచిన నమానుషంబులగు వానిం గొన్ని వెడమాయలం బన్ని పెక్కుపోకలం బోయితి; నెన్ని భంగుల సంధియ కావలయునని పొరలం గల యంతయుం బొరలితి; నప్పాపాత్ముం డెట్లునుం జక్కంబడక దన చలంబుతోన పొట్టుపొరలయ్యుఁ గయ్యంబు వొడుచుం గాని యవశ్యంబును రాజ్యంబు పా లిచ్చువాఁడు గాఁడు; కౌరవుల యెడ దండంబు దక్క నొం డుపాయంబు లేదు; మీకుం బోలిన తెఱంగు సేయుం డనిన ధర్మతనయుండు దమ్ములం గనుంగొని యిట్లనియె. 83

అ. కైకొనక = లక్ష్యపెట్టక ; సేనాముఖంబు + చేసికొని = సేనయొక్క ముందుభాగమున ఉంచుకొని ; ఎత్తివిడియంగలవాడు = దండెత్తిరాగలడు; ఓపిన + అంత = వీలైనంత ; సామవాదంబులు = హితవచనములు ; ఆడితిన్ = పలికితిని; జంకించు = బెదిరించు; భంగించు = మందలించు ; ధిక్కరించు = తిరస్కరించు; తృణీకరించు = అలక్ష్యము చేయు ; భగ్నంబు + అగుటకున్ + ఒల్లక = విఫలమగుట కిష్టపడక ; అమానుషంబులు = దివ్యములు; వెడమాయలు= స్వల్పమైన మాయలు ; పోలు = ప్రవర్తించు ; చలంబు = పట్టుదల ; పొట్టుపొరలు + అయ్యున్ = పీడించబడినను ; కయ్యంబు + పొడుచున్ + కాని = యుద్ధము చేయునుకాని.

భా : ఎవరెంతగా చెప్పినా లక్ష్యపెట్టక దుర్యోధనుడు తన వారి నందరినీ కురుక్షేత్రానికి నడవం డని నియోగించాడు. భీష్ముని సైన్యాధిపతిని చేసి దండెత్తి వస్తాడు. ఇది ధార్తరాష్ట్రుల నిశ్చయం. నేను కూడా సాధ్యమైనంత వరకు శాంత వచనాలు పలికాను. నారదాది మహామునులచేత బుద్ధులు చెప్పించాను. ఏమి చెప్పినా దేనిచేతనూ విరమించకపోగా కోపం తెచ్చుకొని బెదిరించి, మందలించి, తిరస్కరించి, లక్ష్యపెట్టక నిలిచాడు. కార్యభంగానికి ఇష్టపడక మరలా శాంత వచనాలు పలికాను. ఆ దుర్యోధనుడు

అశక్తుడై దౌర్జన్యం చేయబోగా మానవాతీతాలైన కొన్ని మాయలు చేసి రకరకాల పోకడలు పోయాను. ఎన్ని విధాలైనా సంధికావాలని చేయగలిగిన దంతా చేశాను. దురాత్ముడైన దుర్యోధనుడు ఏ విధంగానూ చక్కబడక పట్టుదలతో ఎంత బాధపడినా యుద్ధానికే సిద్ధపడతాడు కానీ నిశ్చయంగా రాజ్యభాగ మివ్వడు. కౌరవుల విషయంలో దండమే కాని వేరు ఉపాయం పనికి రాదు. మీకు ఇష్టమైన విధంగా ఆచరించండి," అనగా ధర్మరాజు తమ్ముల చూచి ఇలా అన్నాడు.

వి. శ్రీ కృష్ణుడు చిత్తశుద్ధితో చేసిన సంధిప్రయత్నం దీనిలో చక్కగా వివరింపబడింది. అశక్త దుర్జనత్వ మన్నది చాలా ప్రమాదకరమైన లక్షణం. దానికి మనస్సు ఆశ్రయమైతే పరవినాశ ప్రయత్నాలు విరివిగా జరుగుతాయి. అయితే ఫలితాలు ఆత్మ వినాశనం వైపుకు కూడా దారితీస్తాయి. సుయోధనునిలో చిన్ననాటినుండి కనిపించి, పాండవులపై కత్తి కట్టడానికి కారణమైనదీ లక్షణమే. ఇది కడకు సుయోధనునితో పాటు కురువంశానికి కూడా చేటు తెచ్చింది.

క. కురుసభఁ బుట్టిన చందము
హరియంతయుఁ జెప్పె నింక ననుమానము లే
దరిమర్దనమున కయ్యెడు
వెరవుం జేవయును మెఱయ వెడలుఁడు గడఁకన్. 84

అ : కురుసభన్ = కౌరవ సభలో ; పుట్టిన - చందమున్ = సంభవించినతీరు ; అంతయున్ = పూర్తిగా ; హరి = కృష్ణుడు ; చెప్పెన్ ; ఇంకన్ = ఇకపై; అనుమానము = సందేహము; లేదు; అరిమర్దనమునకున్ =శత్రుసంహారమునకు ; అయ్యెడు = కానైన; వెరవున్= ఉపాయమును ; చేవయును = బలమును ; మెఱయన్ = వెల్లడగునట్లు ; కడఁకన్ = పూనికతో వెడలుఁడు = బయలుదేరండి.

భా : కౌరవ సభలో ఏర్పడిన పరిస్థితిని శ్రీ కృష్ణుడు పూర్తిగా చెప్పాడు. ఇక సందేహింపవలసినది లేదు. శత్రుసంహారానికి తగిన నేర్పూ, శక్తీ వెల్లడయ్యేలా యుద్ధ ప్రయత్నాలకై బయలుదేరాలి.

లి : శత్రు జయానికి కేవలం దేహబలం చాలు. కానీ దుష్ట చతుష్టయ సంహారానికి దేహబలంతో పాటు బుద్ధిబలంకూడా అవసరం. కనుకనే దేహబలమూ, చేవ, బుద్ధిబలము, వెరవూ ; కలిగి కదలండని ధర్మరాజు వక్కాణ.

వ : అని పలికి యజాత శత్రుండు కరుణాయత్తచిత్తుఁడై యచ్యుతు నాలోకించి 85

భా : అని సోదరులతో పలికి ధర్మరాజు దయతో కూడిన మనస్సు కలవాడై శ్రీకృష్ణుని చూచి (తర్వాతి పద్యంతో అన్వయం)

వి : యుద్ధానికి సిద్ధంకండి అన్నాసరే కానీ ధర్మరాజుకు మరల దయకలిగింది. ఆయన అజాత శత్రుడు కావటమే కారణం. అంత విపద్దశ ననుభవించి కూడా లోకాన్ని సమస్థితితో చూడగలిగిన మహోదారుడు ధర్మరాజు.

క : కురువంశము ద్రుంచుటకుం
జొరఁ జాలక నామనంబు సుడివడియెడు నే
వెరవును దొరకొనదు గదే
సరసీరుహ నాభ! పొందు సంపాదింపన్. 86

అ : సరసీరుహనాభ = కృష్ణా !; కురువంశము = కౌరవవంశమును ; త్రుంచుటకున్ = నశింపజేయటానికి; చొరన్ + చాలక = అంగీకరింపలేక, నా మనంబు= నా మనస్సు; సుడివడియెడున్ = కలత పడుతోంది ; పొందు = మైత్రి ; సంపాదింపన్ = సాధించడానికి ; ఏ వెరవును = ఏ ఉపాయమూ; దొరకొనదు + కదే = తోచకున్నదిగదా !

భా : ఓ కృష్ణా ! కురువంశ మంత మొందించటానికి అంగీకరింపక నా మనస్సు మథనపడుతోంది. మైత్రిని సాధించే మరే దారీ కనిపించటం లేదు.

వి : యుద్ధానికి యుధిష్ఠిరున కభ్యంతరం లేదు. అయితే కురువంశం తన మూలంగా అంతరించటం మాత్రం అతనికి అంగీకారంకాదు. అలా అని మరోదారి కనిపించక యుధిష్ఠిరుని హృదయం మథనపడుతోంది. అందుకే యుద్ధానికి కదలమన్నవాడే మరల కృష్ణునితో సంధిని గురించి వాపోతున్నాడు. జ్ఞానస్వరూపుడైన శ్రీకృష్ణుడు వంశనాశం కలుగకుండా ఏ దారైనా చూపకపోతాడా అని యావ.

వ : " నా మనంబును దమ్ముల తలంపును నీ వెఱుంగుదు ధార్తరాష్ట్రుల చందంబును, భీష్మద్రోణ విదురాదుల చిత్తంబును నెఱింగి వచ్చితి, మాకు ధర్మచ్యుతి లేకుండునట్టి కార్యంబు నిశ్చయింపు" మనిన నారాయణుం డిట్లనియె. 87

అ : తలంపు = అభిప్రాయము ; ధర్మచ్యుతి = ధర్మహాని ;

భా : ఓ కృష్ణా ! నా మనస్సు నీకు తెలుసు. నా తమ్ముల మనస్సు కూడా నీకు తెలుసు. దుర్యోధనాదుల తీరు, భీష్మద్రోణ విదురాదుల మనోభావాలు పరిశీలించి వచ్చావు. ధర్మహాని కలుగని రీతిగా కార్యగతి నిశ్చయించి చెప్పు మనగా కృష్ణుడు ధర్మరాజుతో ఇలా అంటున్నాడు.

వి : ధర్మజుని ధర్మనిష్ఠ జగద్విఖ్యాతమైనది. ధర్మానుగుణంగా నడవాలి కాబట్టి దుర్యోధనాదులతో యుద్ధం చేయటం వల్ల ధర్మహాని కలుగదని కృష్ణుడంటే యుద్ధసన్నద్ధుడు కావాలని ధర్మజుని అభిప్రాయం. ధర్మసందేహానికి కృష్ణుని సమాధాన మిమ్మని కోరాడు ధర్మరాజు.

ఉ : యుద్ధమ కాక కార్యమును నొండొకఁ డెద్దియుఁ గల్గ నేర్చునే
బుద్ధులు సెప్పు వాక్యముల పోల వినం డన నేల యట్టిచో
బద్ధుని జేయఁ జూచె ననుఁ బట్టి సుయోధనుఁ డింక నయ్యసం
బద్ధునితోడి సంధికి నుపాయము నామతిఁ దోఁప దెమ్మెయిన్. 88

అ : యుద్ధము + అ+కాక = యుద్ధమేతప్ప ; కార్యమును = చేయతగ్గపనికూడా; ఒండు + ఒకడు = మరొకటి ; ఎద్దియున్ = ఏదియు ; కల్గన్ + నేర్చునే = ఉంటుందా; బుద్ధులు + చెప్పు= హితవు చేకూర్చునట్టి; వాక్యములు + అ= మాటలనే ; పోలన్ +వినండు +

అనన్ + ఏల = చక్కగా వినడనుట ఎందుకు ; అట్టిచోన్ = ఆ సమయమున ; ననున్ + పట్టి= నన్నుపట్టి; సుయోధనుఁడు; బద్ధునిన్= నిర్బంధితునిగా; చేయన్+చూచెన్ = చేయప్రయత్నించాడు; ఆ + అసంబద్ధునితోడి = ఆ అయోగ్యునితో ; సంధికిన్ ; ఉపాయము; ఏ + మెయిన్ = ఏ విధంగానూ; నా మతిన్ ; తోఁపదు = కనిపించదు.

భా : *యుద్ధమే మనం చేయతగ్గపని. ఆ దుర్యోధనుడు హితవచనాలు వినకపోవటమే కాక నన్ను బంధించాలని ప్రయత్నించాడు. ఈ పరిస్థితిలో అవ్యవస్థుడైన ఆ దుర్యోధనునితో సంధికి ఉపాయమేదీ నా మనస్సుకు తోచడం లేదు.*

వి : శ్రీ కృష్ణుని బంధింపదలచిన ఆ దుర్యోధనుని అసంబద్ధు డనటం సముచితం. కౌరవులతో సంధి కుదిరితే బాగుండునని తలిచే ధర్మజుని ఆశయానికి "బద్ధునిఁ జేయఁ జూచ్చెనను" అన్న కృష్ణుని మాటలు స్వస్తి చెపుతాయి. " నీవు సంకటపడియెడు దేవపదవినైన నే నొల్లనని " ధర్మజుడు ఇంతకుముందే కృష్ణునితో అని ఉన్నాడు.

వ : అని చెప్పి విదురుం డేకాంతంబున నాడిన మాటలును, భీష్మద్రోణ బాహ్లికాదులగు పెద్దలకు ధార్తరాష్ట్రుల దెసం బుట్టిన మనః క్షోభంబును గుంతి కౌరవులు వినం బలికిన పలుకులం బ్రకటించి ధర్మపుత్రునిపై బాపంబు లేకునికిఁ దెలిపి " సమరం బవశ్య కర్తవ్యంబుగా నిశ్చయించె; నట్టి యెడఁ దమ్ము లన్న మొగంబునం జూడ్కి నిలిపి యూరకుండి; రతండు వారలం గలయ (గనుంగొని యిట్లనియె. 89.

అ : ఏకాంతంబునన్ = రహస్యస్థలమున; మనః +క్షోభంబు = మనోవ్యథ; పాపంబు = దోషము ;

భా : *అని పలికి కృష్ణుడు విదురుడు రహస్యంగా తనతో అన్న మాటలూ; భీష్మ ద్రోణ బాహ్లికాదులైన పెద్దవారికి దుర్యోధనుని వలన కలిగిన మనోవ్యథ; కుంతీదేవి కౌరవులు వింటుండగా అన్నమాటలూ వెల్లడించి; ధర్మరాజుపై ఏ దోషమూ లేదన్న విషయం చెప్పి యుద్ధం చేయక తప్పదని శ్రీకృష్ణుడు నిశ్చయించాడు. అప్పుడు భీమాదులు ధర్మరాజువైపు చూస్తూ ఊరుకున్నారు. ధర్మజుడు తన సోదరులను చూచి ఇలా అన్నాడు*

ఉ: కౌరవకోటిచేత మన కష్టపుఁబాటుఁ దలంపు వచ్చినం
గ్రూరవిచేష్టితంబునకుఁ గొంతి యొడంబడి బంధువర్గమున్
ఘోరముగా వధించుటకుఁ గోల్కొనకున్నది బుద్ధి మీరు ని
ర్ధారణ సేయుఁడాహితము ధర్మమునయ్యెడు వృత్తమెట్టిదో! 90

అ : కౌరవకోటి చేతన్ = దుర్యోధనాదుల వలన; మన-కష్టము + పాటు = మనం కష్టపడటం; తలంపు వచ్చినన్ = తపుకు రాగా; గొంతి; క్రూర-విచేష్టితంబునకున్ = ఈ దారుణమైన చర్యకు (యుద్ధానికి); ఒడంబడెన్ = అంగీకరించింది; బంధువర్గమున్ = బంధు సమూహాన్నీ; ఘోరముగా = దారుణముగా; వధించుటకున్ = సంహరించటానికి; బుద్ధి = (నా) చిత్తము; కోల్కొనక + ఉన్నది = ఉత్సాహ పడకున్నది; హితమున్ =మేలును; ధర్మమున్ = ధర్మమును; అయ్యెడు = అగునట్టి; వృత్తము + ఎట్టిదో = నడవడి ఎటువంటిదో దానిని; మీరు; నిర్ధారణ + చేయుఁడు + అ = నిశ్చయించండి.

భా : కౌరవుల వలన మనం పడ్డ కష్టాలు తలచుకొని కుంతీదేవి ఈ దారుణానికి అంగీకరించింది. బంధువులను యుద్ధం పేరుతో సంహరించటానికి నా మనస్సుకు నచ్చకున్నది. కనుక మనకు శ్రేయోదాయకమూ, ధర్మసమ్మతమూ అయిన కర్తవ్యాన్ని మీరే నిశ్చయించి చెప్పండి.

వి : ఆవేశ పరాభవాల మధ్య నలిగిపోతూ కాపట్యానికి లోనైన ధర్మజుడు సోదరుల అభిప్రాయాలను స్వీకరించకుండా వారు సూచించిన వాటిని గురించి ఆలోచించకుండా నిర్ణయాలు తీసుకోవలసి వచ్చింది. ప్రస్తుతం సంభవింపబోయే ఈ మలుపులు ప్రశాంతంగా ఆలోచించవలసిన అవసరముంది. అందుకు తగిన అవకాశం కూడా ఉంది. అంతే గాక జూదమాడింది ధర్మరాజైనా ఫలితాల ననుభవించింది సోదరులందరూ, ద్రౌపదితో సహా. అయితే యుద్ధ విషయంలో ప్రధాన పాత్రధారులు భీమార్జునులు. ఇతరులు ఎందరో సహకరించేవారు. ఫలితాన్ని అనుభవించబోయేది మాత్రం విజయం సిద్ధిస్తే రాజుగా ధర్మరాజుమాత్రమే.

వ : అనిన విని యర్జునుం డతని కిట్లనియె. **91**

భా : అనగా విన్న అర్జునుడు ధర్మరాజుతో ఇలా అన్నాడు.

చ. హితమును ధర్మముం దగవు నిట్టిది నామనమేమి నేర్తు? మ
చ్యుతుఁడు సమస్తధర్మపరిశోధకుఁ డా విదురుండుఁ బాండుభూ
పతిసతియుం దగంబలుకు పల్కుల సందియ మెల్లఁ బాసె ని
ట్లితఁడు రణంబు సేయుఁ డన నింక విచారము లెల్ల నేటికిన్. **92**

అ : హితమును= మేలునూ ; ధర్మమున్ = ధర్మమునూ; తగవున్ = న్యాయమునూ; ఇట్టి +అది+నాన్ = ఇటువంటిదని చెప్పడానికి; మనము; ఏమి నేర్తుము = ఎంత తెలిసిన వారము; సమస్త.... శోధకుడు; సమస్త = సమస్తములైన; ధర్మ = ధర్మాధర్మములను, పరిశోధకుఁడు= బాగుగా ఎఱిగిన వాడైన; అచ్యుతుఁడు = కృష్ణుడు; ఆ విదురుండును; పాండుభూపతి సతియున్+ పాండురాజుభార్యయైన కుంతియును ; తగన్ = ఒప్పుగా; పలుకు - పలుకులన్ = అన్నమాటలచేత, సంధియు + ఎల్లన్ = సందేహమంతా ; పాసెన్ = తొలగినది; ఇతఁడు = ఈ కృష్ణుడు; ఇట్లు = ఇలా; రణంబు + చేయుఁడు = యుద్ధం చేయండి; అనన్ = అనగా ; ఇంకన్ ; విచారములు + ఎల్లన్ ఈ ఆలోచనలన్నీ; ఏటికిన్ = ఎందులకు ?

భా : ఇది శ్రేయస్సంపాదకము, ఇది ధర్మము, ఇది న్యాయము అని చెప్పగా మన మెంతవారము? సర్వధర్మవేత్తయైన వాసుదేవుడూ, విదురుడూ, కుంతీదేవి చక్కగా పలికిన పలుకుల వల్ల మన సందేహాలన్నీ తొలగిపోయాయి. శ్రీకృష్ణుడు యుద్ధం చేయండని చెప్తుంటే ఇక మనకీ ఆలోచన లన్నీ ఎందుకు.?

వి : ఏదైనా ధర్మసంకటం వస్తే అసలే వ్యగ్రమైన మనస్సు అంత సూక్ష్మంగా పరిశీలించలేదు. కాబట్టి ఎవరికి వారు నిర్ణయించుకోవటం కష్టసాధ్యమవుతుంది. తద్విషయ వేత్తలై నిశ్చలంగా ఆలోచించగలవారు ఆ సమయంలో కర్తవ్య నిర్ణయం చేయగలుగుతారు. ఆ నిర్ణయాలు రుచించినా, రుచించకపోయినా అనుసరించటం వివేకవంతుల లక్షణం. విదురుని వంటి నీతివేత్త, కుంతివంటి మాత, శ్రీకృష్ణునివంటి ధర్మకాంక్షీ యుద్ధమే కర్తవ్యమని నిర్ణయించిన

తర్వాత ఇక దానిపై విచారణ అనవసరమేగదా!

ఆ : 'అనిన నట్లకాక యఖిల ధర్మజ్ఞాన
ఘనుఁడు మనకు నేడు గడయుఁ దాన
శౌరి నిశ్చయింప సంశయం బేటికి
సంఘటింపుఁ డుగ్ర సమర విధము. 93

అ : అనినన్ = అర్జునుడట్లు పలుకగా; అట్లు + అ కాక = అలాగే కానివ్వండి; అఖిల-ధర్మ-జ్ఞాన- ఘనుఁడు= అన్ని ధర్మముల జ్ఞానంచేత మహితుడూ; మనకున్ ; ఏడుఁగడయున్= రక్షకుడూ అయిన; శౌరి=శ్రీ కృష్ణుడు; తాను+అ= తానే; నిశ్చయింపన్=నిర్ణయించగా; సంశయంబు + ఏటికిన్ = సందేహమెందులకు; ఉగ్రసమర విధమున్ = భయంకరమైన యుద్ధమును; సంఘటింపుఁడు = పొందుపరచండి.

భా : అర్జును డన్న ఆ మాటలు విని సరే అలాగే కానీ. సర్వధర్మ పరిజ్ఞానం కలవాడూ, మనకు దిక్కయినవాడు అయిన కృష్ణుడే అలా నిశ్చయిస్తే మనకిక సందేహ మెందుకు? యుద్ధానికే సిద్ధం కండి.

వి : యుద్ధం చేయటం ధర్మమా ? అధర్మమా ? - యుద్ధరంగంలో భీష్మాదులను నిర్వహింపగలమా ? అన్నవి ధర్మరాజున కున్న సందేహాలు. ఆ రెండింటికీ సమాధానం దొరికిం దతనికి. ధర్మాధర్మవివేకం గల కృష్ణుడే యుద్ధాన్ని నిర్ణయించాడు. పాండవులకు అతడే ఏడుగడ - రక్షకుడు కూడా. కాబట్టి భీష్మాదుల వలన పరాజయం సంభవించే అవకాశం కూడాలేదు. అవకాశమే ఉంటే కృష్ణుడు యుద్ధ నిర్ణయం చేయడు. అట్లు కాక యుద్ధం జరగటం, ధర్మరాజు పరాజయం పొందటమే ధర్మబద్ధమని కృష్ణుడు భావిస్తే అంత కన్న ధర్మవేత్త లేడు కాబట్టి అప్పుడైనా ఆ నిర్ణయానికి తలవంచక తప్పదు.

వ : అని యుధిష్ఠిరుండు దమ్ములతో నెట్టకేలకుం దెగువ సెప్పె. 94

అ : ఎట్టకేలకున్ = చిట్టచివరకు ; తెగువ = నిశ్చయము.

భా : అని ధర్మరాజు తుట్టతుదకు తన నిశ్చయాన్ని తమ్ములకు చెప్పాడు.

వి : **ఎట్టకేలకున్** = ప్రజోపద్రవం జరిగే కార్యం ఎంత ధర్మబద్ధమైనా ఎంతో తర్జన భర్జన చేసి కానీ నిర్ణయించలేని కారుణ్యమూర్తి ధర్మజుడు.

క : బాహాగర్వము వివిధ
వ్యూహ విధిజ్ఞతయుఁ గలిగి యొకరుం డే డ
క్షోహిణులు నడిపి భీష్మో
త్సాహంబున కోర్చు చాపధరుఁ డెవ్వఁ డొకో! 95

అ : బాహాగర్వము = భుజబలాతిశయమూ; వివిధ -వ్యూహవిధి జ్ఞతయున్ = పలురకములైన సేనారచనావిధానముల జ్ఞానమును ; కలిగి ; ఒకరుండ = ఒక్కడే ; ఏడు +అక్షోహిణులు = ఏడు అక్షోహిణులసేనను ; నడిపి ; భీష్మ +ఉత్సాహంబునకున్ = భీష్ముని వీరత్వానికి ; ఓర్చు = చాలెడి; చాపధరుడు = విలుకాడు ; ఎవ్వఁడు + ఒకో = ఎవ్వరోకదా !

భా : విశేష బాహుబలం, విభిన్నవ్యూహరచనాపరిజ్ఞానం కలిగి ఒక్కడే ఏడక్షోహిణుల సేనా నాయకత్వాన్ని నెరపగలిగి భీష్ముని రణోత్సాహానికి ఎదురు నిలువగల విలుకాడు మనలో ఎవ డున్నాడు ?

వి : యుద్ధం నిశ్చయించి సైన్యాధిపతికై అన్వేషణా, అలోచనా సాగిస్తున్నాడు ధర్మరాజు. భీష్మోత్సాహాన్ని నిలువరించాలంటే అంతటివారే కావాలి. సర్వవ్యూహాలను గూర్చి తెలిసి యుండాలి. సేననంతటినీ ఒక్కత్రాటిపై నడపగలిగిన సమర్థుడు కావాలి. లోకజ్ఞుడైన ధర్మరాజుకు కూడా అటువంటివా డెవ్వడో అన్న శంక కలగదగింది.

సమస్త నీతిశాస్త్రజ్ఞః వాహనే పూజితశ్రమ :
శౌర్యవీర్యగుణోపేత ః సేనాధ్యక్షో విధీయతే ॥ అన్నది సేనాపతి లక్షణం.

వ : "అట్టి వానికి వాహినీ నాయకత్వం బిచ్చి యభిషేకంబు సేయవలయు. 96

అ : వాహినీ నాయకత్వంబు = సేనాధిపత్యంబు; అభిషేకంబు + చేయు = పట్టాభిషేకముచేయు(సేనాధిపతిగా బాధ్యతను అప్పగించు)

భా : అట్టి వ్యక్తికి సేనాధిపత్యమిచ్చి పట్టాభిషిక్తుని చేయాలి -

తే ॥ అనిన సహదేవుఁ డిట్లను "నధిప ! పుత్ర
పౌత్రసోదరవంతుఁడు బాహువీర్య
ఘనుఁడు మన కాశ్రయం బయి మనిచె మత్స్య
దేశపతి గాఁడె సేనాపతిత్వమునకు"? 97

అ : అనినన్ ; సహదేవుఁడు; ఇట్లు ; అనును ; అధిప= రాజా ! ; పుత్ర -పౌత్ర -సోదరవంతుడు = కొడుకులూ, మనుమలూ, తోబుట్టువులూ కలవాడూ; బాహు-వీర్య-ఘనుఁడున్ = భుజబలంచే గొప్పవాడు అయిన : మత్స్యదేశపతి = మత్స్యరాజు విరటుడు ; మనకున్ = ఆశ్రయంబు +అయి = రక్షకుడై ; మనిచెన్ = కాపాడెను ; సేనాపతిత్వమునకున్ = సేనాధిపతిత్వమును ; కాఁడే = (అతడు) యోగ్యుడు కాడా ?

భా : అనగా సహదేవుడిలా అన్నాడు "రాజా! పుత్రపౌత్ర సోదర సహితుడూ, భుజబలోపేతుడూ ; మనకు ఆశ్రయదాత అయిన మత్స్య దేశాధిపతి విరటుడు సేనాపతిత్వమునకు తగినవాడు కాడా ?"

వి : సహదేవుని మాటలు కృతజ్ఞతను సూచించేవిగా కనిపిస్తున్నాయే తప్ప సామర్థ్యాన్ని సరిగా అంచనా వేసిన ట్లనిపించదు.

వ : అనవుడు నకులుండు. 98

అ : అనవుడు = అనిన వెంటనే

భా : (సహదేవుని ఆ మాటలు విని) నకులుడు (ఇలా అంటున్నాడు)

చ : బలఁగముఁ బెంపుఁ దేజమును బాహుబలంబును నగ్గలంబుఁ; బె
క్కు లెఱుఁగుఁ గార్యఖడ్గములకుం దగు త్రోవలు; ద్రోణునందు భీ

ష్మల దెసఁ గోపముం గలఁ డమోఘ పరాక్రమశాలి నీ బలం
బుల కధినాథుఁగా ద్రుపద భూపతి పట్టముఁ గట్టు టొప్పగున్. 99

అ : బలఁగము + పెంపున్ = సేనల ఆధిక్యము ; తేజమును = పరాక్రమమునూ; బాహుబలంబునున్ = భుజబలమునూ; అగ్గలంబు = ఎక్కువ ; కార్య -ఖడ్గములకున్ = కార్యసాధనకూ, రణవిద్యకూ; తగుత్రోవలు = తగిన దారులు; పెక్కులు + ఎఱుఁగున్ = అనేక మెరుగును ; ద్రోణుని + అందు = ద్రోణాచార్యుల యందు , భీష్ముల దెసన్ = భీష్మాచార్యుల యెడను ; కోపమున్ + కలఁడు = కోపించినవాడు ; అమోఘపరాక్రమశాలి = మొక్కవోని శౌర్యము కలవాడు, అయిన ; ద్రుపదభూపతిన్ = ద్రుపదమహారాజును ; ఈ బలంబులకున్ - ఈ సేనలకు; అధినాథుఁగాన్ = అధిపతిగా ; పట్టము +కట్టుట + ఒప్పు + అగున్ = పట్టాభిషిక్తుని చేయుట తగును.

భా : సేనాసమృద్ధి, పరాక్రమమూ, భుజబలమూ మిక్కిలిగా కలవాడూ; కార్యవాద, ఖడ్గవాదములు బాగుగా తెలిసినవాడూ ; ద్రోణ, భీష్ములయెడ కోపంగలవాడూ; అమోఘ పరాక్రమ శాలి అయిన ద్రుపద మహారాజును సేనాధిపతిగా జేయుట తగినది.

వి : " ద్రోణులందు, భీష్ములదెసం గోపముం గలఁడు" సేనాధిపతిగా ఎన్నుకునే టప్పుడు సేన కలిగిఉండటం, బలపరాక్రమాలతోపాటు శత్రుపక్షంలో బలమైన వీరులతో ఆ వ్యక్తికి వ్యక్తిగతంగా విరోధం కలిగిఉండటం కూడా ఒక అనుకూల గుణంగా భావించి ద్రుపదుని నకులుడు సూచించాడు. ఇది రాజనీతి పరిజ్ఞానానికి నిదర్శనం.

ఉస్మానియా విశ్వవిద్యాలయం వారి సంశోధిత ముద్రణలో పద్యం చివర .... గట్టు 'టెట్లొకో' అన్న పాఠం ఉంది. కానీ అర్థావగతిలో ఆ పాఠం అంత సముచితంగా కనిపించటం లేదు. కాబట్టి .... ' గట్టుటొప్పగున్' అన్న పాఠాన్ని స్వీకరించటం జరిగింది.

వ : అనుటయుం దదనంతరంబ ధనంజయుండు. 100

అ : తత్ + అనంతరంబు + అ = నకులుని మాటలు ముగిసిన పిమ్మట; ధనంజయుండు = అర్జునుడు.

భా : నకులు డట్లు పలుకగా - ఆపై అర్జునుడు (ఇలా అంటున్నాడు)

-: ధృష్టద్యుమ్నాదులకు సేనానాయకత్వంబు నిర్ణయించుట :-
(సం - 5 - 149-18)

సీ ॥ అగ్నికుండమున ద్రోణాచార్యునకు నాశ
మొనరించు దానికై యుద్భవించె ;
రథరథ్యులును ధనుర్బాణంబులును దను
త్రాణ ఖడ్గములు నుద్దామలీలఁ
దన తోన జన్మించె దహన శిఖామూర్తి

భుజవీర్య విక్రమ స్ఫూర్తిశాలి
సైన్యనాథుండు ధృష్టద్యుమ్నుఁ డగు నని
తలఁచెద నాతఁడు దక్క నొరులు

తే : భీష్ము తాఁ కోర్వ రుగ్రంపు బిరుదు ధైర్య
ధనఘనుండు శిఖండి భీష్మునకు మృత్యు
వై జనించినవాఁడు మహాబలుండు
దండనాయకుఁ జేయ నతండు దగును. 101

అ : ద్రోణ + ఆచార్యునకున్ = ద్రోణాచార్యుని ; నాశము + ఒనరించు దానికై = సంహరించటానికి ; అగ్నికుండమునన్ = హోమకుండములో ; ఉద్భవించెన్ = పుట్టెను; రథరథ్యులును = రథమూ, గుఱ్ఱములూ, ధను ః + బాణంబులును = విల్లు, బాణములూ; తనుత్రాణ - ఖడ్గములు= కవచమూ, ఖడ్గమూ; ఉద్దామలీలన్ = భయంకరముగా; తనతోనన్ + జన్మించెన్ = తనతోబాటు పుట్టాయి; దహనశిఖామూర్తి = అగ్నిజ్వాలవంటి ఆకృతికల వాడునూ; భుజ...... శాలి ; భుజ = బాహుబలముయొక్క, వీర్య = పరాక్రమముయొక్క , విక్రమ = అభివ్యక్తిచే ; స్ఫూర్తిశాలి = ఒప్పువాడునూ అయిన; ధృష్టద్యుమ్నుండు; సైన్యనాథుండు = సేనాపతి; అగున్ + అని = కాగలవాడని ; తలఁచెదన్ = భావిస్తాను ; అతఁడు + తక్కన్ =అతడు తప్ప; ఒరులు = ఇతరులు; భీష్ము +తాఁకు = భీష్ముని తలపాటును; ఓర్వరు = సహింపజాలరు ; ఉగ్రము + బిరుదు =గొప్ప వీరుడు; ధైర్యధన = ధైర్యసంపదచేతనూ, ఘనుఁడు= గొప్పవాడు; భీష్మునకున్; మృత్యువు +ఐ= మృత్యురూపమై ; జనించినవాడును ; మహాబలుండున్= గొప్పబలవంతుడునైన వాడు; శిఖండి ; అతండు = ఆ శిఖండి ; దండనాయకున్ + చేయన్ = దండనాథునిగా చేయుటకు ; తగును.

భా : ద్రోణునకు మృత్యురూపమై అగ్నికుండంనుండి పుట్టినవాడూ, రథాశ్వముల తోనూ, ధనుర్బాణాలతోనూ, కవచ ఖడ్గాలతోనూ పుట్టినవాడూ, అగ్నిసమాన తేజశ్శాలీ బాహుబలపరాక్రమాభిరాముడైన ధృష్టద్యుమ్నుడు సేనాధిపత్యానికి తగినవాడు. అతడు తప్ప మరెవ్వరూ భీష్ముని ఎదిరింపజాలరు. అట్లే మహాశూరుడూ, ధైర్యధనుడూ, బలశాలీ అయిన శిఖండి భీష్మునికి మృత్యువై జనించాడు. అతడిని దండనాథునిగా చేయటం తగినపని.

వి : అర్జునుడి ఆలోచన విశిష్టంగా కనిపిస్తోంది నకుల సహదేవుల ఆలోచనలకన్న. దైవశక్తి, పురుషకారమూ- రెండూ సమానంగా మేళవించిఉన్న ధృష్టద్యుమ్న, శిఖండులను ఎన్నుకోవటం అర్జునుని వివేకానికి గుర్తు. అందుకోసమే పుట్టినవారు తమ పక్షంలో ఉండగా వారినికాదని కారణాంతరాలవలన ఇతరుల పేర్లు సూచించటం నకులసహదేవులలోని అపరిణతిని తెలుపుతుంది.

వ : అనవుడు ధర్మనందనుండు గోవిందుం జూపి యితండు సకల చరాచర తారతమ్యసంవేది, విశేషించి మనకు నితని మాటయ విజయ మూలంబు, గావున నిమ్మహాత్ముండు నిరూపించినవాఁడు వరూథినీ ముఖ్యుండు". 102

అ. సకల చర + అచర - తారతమ్య - సంవేది = సమస్త చరాచర సృష్టియొక్క తరతమ భేదం తెలిసిన వాడు ;విజయమూలంబు = గెలుపునకు ఆధారం ; వరూథిని = సేన; నిరూపించిన వాఁడు = ఎంపిక చేసినవాడు

భా : అనగానే ధర్మరాజు కృష్ణుని చూపించి "ఇతడు ఈ సృష్టిలోని చరాచరము లందలి తారతమ్యం బాగా తెలిసినవాడు. విశేషించి ఇతని మాటే మన విజయానికి ఆధారం. కనుక ఇతడు నిర్ణయించినవాడే సేనాధిపతి అవుతాడు" అన్నాడు.

వి : ధర్మరాజు భారాన్ని మొత్తాన్ని కృష్ణుని మీదనే మోపటానికి వెనుకాడటంలేదు.

క : అనుటయు దామోదరుఁ డి
ట్లను ధృష్టద్యుమ్నుఁ డర్హుఁ డగు నభిషేకం
బొనరింపుము పేరోలగ
మున నక్షోహిణుల కెల్ల ముఖ్యుఁడు గాఁగన్. 103

అ. అనుటయున్ = అనగా ; దామ + ఉదరుడు = శ్రీ కృష్ణుడు; ఇట్లు + అనున్= ఇలా పల్కును; ధృష్టద్యుమ్నుఁడు ; అర్హుఁడు+అగున్ = తగ్గవాడేను ; పేరు + ఓలగమునన్ = మహాసభలో; అక్షోహిణులకున్ + ఎల్లన్ = అన్ని అక్షోహిణులకూ ; ముఖ్యుఁడు + కాఁగన్ = అధిపతిగా; అభిషేకంబు + ఒనరింపుము = పట్టాభిషేక మొనర్చుము.

భా : అనగా శ్రీ కృష్ణుడు "ఈ ధృష్టద్యుమ్నుడు సేనాధిపత్యానికి తగ్గవాడు. ఏడక్షోహిణుల సేనకూ ఈతనిని ఈ సభలో సర్వసైన్యాధిపతిగా అభిషిక్తుణ్ణి చెయ్యి" అన్నాడు.

వి. ద్రుపదుడు ద్రోణుని సంహరింపజాలు కుమారునికై పుత్రేష్టి చేయగా హోమగుండం నుండి ధృష్టద్యుమ్నుడు పుట్టాడు. మహాపరాక్రమశాలి. వ్యూహరచనావేది. కురుపాండవ యుద్ధంలో ఈతడెందరినో సంహరించాడు. కాని ద్రోణుని మాత్రం వధించలేదు.మృతు డయిన ద్రోణుని శిరస్సును మాత్రం ఖండించాడు. పాండవ శిబిరంలో నిదురించిన ఈతనిని అశ్వత్థామ చంపాడు.

క. సుర గంధర్వ ఖచర కిం
పురుషాది సమస్తదివ్యభూతంబుల బం
ధుర భూరి వ్యూహంబుల
విరచనముల నెఱుఁగు నతఁడు వీరోత్తముఁడున్. 104

అ. అతఁడు = ఆధృష్టద్యుమ్నుడు ; సుర .... విరచనములన్ - సుర = సురలు; గంధర్వ = గంధర్వులు ; ఖచర = ఖేచరులు ; కింపురుష = కింపురుషులు ; ఆది = మొదలైన; సమస్త = సమస్తమైన; దివ్యభూతంబుల = దేవతా విశేషులయొక్క; బంధుర = రమ్యమైన; భూరి = సమధికమైన; వ్యూహంబుల = సేనలయొక్క; విరచనములన్ = పన్నుగడలను; ఎఱుఁగున్; వీర +ఉత్తముడున్ = మహావీరుడుకూడా.

భా : ధృష్టద్యుమ్నుడు సురలు, గంధర్వులు, ఖేచరులు, కింపురుషులు మొదలైన సర్వదేవతా కోటి సేనారచనా విశేషాలను ఎఱిగినవాడు, మహావీరుడు.

క. **నీ యొద్ది రాజు లందరు**
ధీయుక్తులు విక్రమ ప్రదీప్తుల యైనన్
వేయేటికి ధృష్టద్యు
మ్నాయత్తము సేయు సైన్య మంతయు నధిపా! 105

అ. అధిపా = రాజా! ; నీ + ఒద్ది + రాజులు + అందరున్ = నీ దగ్గరున్న రాజులంతా: ధీయుక్తులున్ = బుద్ధిమంతులూ; విక్రమ + ప్రదీప్తులు + అ= పరాక్రమోప శోభితులే ; ఐనన్ = ఐనప్పటికిని; వేయి + ఏటికిన్ = వేయిమాటలేల ; సైన్యము + అంతయున్ = సైన్యమంతటినీ; ధృష్టద్యుమ్న + ఆయత్తము = ధృష్టద్యుమ్నుని అధీనము ; చేయు = చేయుము.

భా : ధర్మరాజా ! నీ దగ్గరున్న రాజులంతా పరాక్రమవంతులే బుద్ధి మంతులే. ఐనా నీ సేననంతనూ ధృష్టద్యుమ్నుని అధీనము చెయ్యి.

వి. ఎవరికి వారు సమర్థులైనా సర్వసైన్యాధిపతి అంటూ లేకుండా రణరంగంలో విజయాన్ని చేబట్టలేరు. అందరినీ ఒక త్రాటిపై నడిపే నాథు డుండాలి. అనుశాసనాన్ని సాధించడం కోసం ఈ ఎన్నిక.

వ. **అనిన విని యుధిష్ఠిరుం డక్షోహిణులకుం ప్రత్యేక నాయకులను నీవ నిర్దేశింపు మనుటయు నతండు.** 106

భా : అనగా విన్న ధర్మరాజు విడివిడిగా ప్రతి అక్షోహిణికి ఒక్కొక్క నాయకుని నీవే నిర్దేశించవలసింది అన్నాడు. అపుడు కృష్ణుడు

వి. అక్షోహిణి - 21870 రథములు 21870 ఏనుగులు
65610 అశ్వములు
109350 పదాతులు

తే. **సేన దమకును గలవారు లేనివారు**
ననక తగువారిఁ జెప్పెద నఖిలసమర
పండితుల నేరి వారి నీబలము లేఁడు
నడపఁ జాలించి యభిషేచనం బొనర్పు. 107

అ. సేన = సైన్యము ; తనకును = తమకు; కలవారు = ఉన్నవారు; లేనివారు = లేనట్టివారు; అనక ; సమర + పండితులన్ =యుద్ధవిద్యావిశారదులను ; ఏరి = ఎన్ని; తగువారిన్= సేనాధిపత్యమునకు యోగ్యులైన వారిని ; చెప్పెదన్ = చెపుతాను; వారిన్ = వారిని; నీబలములు+ ఏడున్= నీ సైన్యం ఏడు అక్షోహిణులను ; నడపన్ = నడిపించడానికి ; చాలించి = సమర్థులనుగా నెంచి నియోగించి ; అభిషేచనంబు + ఒనర్పు = పట్టాభిషిక్తులను చేయుము.

భా : తనకంటూ సేన కలవారు, సేన లేనివారు అనికాక తగిన రణవిద్యా విశారదుల నీకు చెపుతాను. వారిని నీ అక్షోహిణులకు (సైన్యానికి) అధిపతులనుగా (జేసి అభిషేకించు.

వి. సేనఉండడం లేకపోవడం కాక యుద్ధ విద్యాకౌశలం సైన్యాధిపత్యానికి ముఖ్యమని కృష్ణుడు చెపుతున్నాడు.

వ. అనిన నట్ల చేయుదు వా రెవ్వరెవ్వరు నిరూపింపు మని యడిగిన గుంతీనందనునకు దేవకీనందనుం డిట్లనియె. 108

భా : *అనగా 'అట్లానే చేస్తాను ఇంతకూ వాళ్ళెవ్వరో నిర్దేశించు' అని అడగ్గా ధర్మరాజుకు కృష్ణు డిలా అన్నాడు.*

సీ. పటుపరాక్రమనిధి పాంచాలపతియు న
మానుష తేజుండు మత్స్య విభుఁడు;
శత్రుభీకరమూర్తి సాత్యకియును జరా
సంధాగ్రతనయుండు శౌర్యఘనుఁడు ;
సహదేవుఁడును ధైర్యశాలి యాదవశిరో
మణి చేకితానుండు మహితవిభవ
ఖని యగు శిశుపాల తనయుండు దోర్దర్ప
ధుర్యుండు ధృష్టకేతుండు సమర
తే. లంపటుండు శిఖండియు లావు వెరవుఁ
గలరు నీ యెడ ననురక్తి గలరు సాలఁ
బెంపు గల రుక్కు ముట్టిన తెంపుగలరు
కోరి పతులుగఁ జేయు మక్షోహిణులకు. 109

అ. పటు + పరాక్రమనిధి = గొప్పదగు శౌర్యమునకు నెలవైన వాడగు ; పాంచాలపతియున్ = పాంచాల దేశరాజగు ద్రుపదుడు ; అమానుష + తేజుండు = దివ్యమైన ప్రతాపము కలవాడగు; మత్స్య + విభుండు= మత్స్యదేశాధీశుడగు విరటుడు ; శత్రు + భీకర+ మూర్తి = శత్రువులకు భయమును కల్గించు ఆకారము కలవాడు ; సాత్యకియును = సాత్యకి ; జరాసంధ + అగ్రతనయుండు = జరాసంధుని పెద్దకుమారుడును ; శౌర్య + ఘనుఁడు = శౌర్యముచే గొప్పవాడును అగు ; సహదేవుఁడు; ధైర్య + శాలి = ధైర్యముతో ఒప్పువాడును ; యాదవ + శిరోమణి = యాదవులలో శ్రేష్ఠుడునగు ; చేకితానుండు మహిత + వైభవ + ఖని + అగు = మహావైభవ సంపన్నుడగు ; శిశుపాల + తనయుండు = శిశుపాలనందనుడు; దోః + దర్ప + ధుర్యుఁడు = భుజబలము కలవారిలో శ్రేష్ఠుడైన; ధృష్టకేతుండు; సమరలంపటుండు = యుద్ధా సక్తి కలవాడైన ; శిఖండియున్ ; లావును = బలమును; వెరవుఁన్ = నేర్పును, కలరు = కలవారు; నీ + యెడన్ = నీపట్ల; అనురక్తి + కలరు = అభిమానం కలవారు; చాలన్ = మిక్కుటముగా; పెంపు + కలరు= పూనికకలవారు ; ఉక్కుముట్టిన + తెంపు = ఉక్కును మించిన కాఠిన్యం; కలరు = కలవారు ; కోరి = వేడి; అక్షోహిణులకు; పతులుగన్ = సేనాధిపతులుగా ; చేయుము.

భా. మహాపరాక్రమ సంపన్నుడైన ద్రుపదుడు, దివ్యప్రతాపశాలియైన విరటుడు, అరివీరభయంకరుడైన సాత్యకి, జరాసంధుని పెద్దకుమారుడు, శౌర్యమహితుడైన సహదేవుడు, ధైర్యశాలీ, యాదవాగ్రజుడయిన చేకితానుడు మహాబలవంతుడు, భుజాహంకార విలసితుడైన శిశుపాలనందనుడు ధృష్టకేతుడు, రణాసక్తుడైన శిఖండి, బలము నైపుణ్యము కలవారు. వారికి నీపై అభిమానముఉంది. మహోత్సాహం కలవారు. ఉక్కును మించిన కాఠిన్యం గలవారు. వారందరినీ వేడి అక్షోహిణులకు అధిపతులుగా చేయుము.

వి. ద్రుపదుడు, విరటుడు, సాత్యకి, సహదేవుడు, చేకితానుడు, ధృష్టకేతుడు, శిఖండి అను ఏడుగురిని ఏడు అక్షోహిణులకు అధిపతులుగా చేయుమని శ్రీకృష్ణుని వచనం. సహదేవుడు జరాసంధుని కొడుకు; ధృష్ట కేతుడు శిశుపాలుని కొడుకు; చేకితానుడు -యాదవుడు.

వ. అని దండనాథుల నిశ్చయించి వెండియు. **110**

భా : అని సేనాధినాథులను నిర్ణయించి మరలా

క. కురుసైన్యము నిస్సారం
బరయఁగ మనబలము లెల్ల నతి దృఢములు నీ
వరవాయి గొనక నడపుము
ధరణీశ్వర! సేనమొగము దైవమ నీకున్. **111**

అ. కురు + సైన్యము = కౌరవసేన; నిస్సారంబు = శక్తి విహీనమైనది ; అరయఁగన్= పరికింపగా ; మన + బలము + ఎల్లన్ = మనసేనలన్నీ ; అతిదృఢములు = మిక్కిలి దార్ఢ్యము కలవి ; నీవు ; అరవాయి + కొనక = సందేహింపక ; నడపుము = సేనలనడిపించు ; ధరణీశ్వర= ఓ ధర్మరాజా !; సేన + మొగము = సైన్యము ముందు ; నీకున్ = నీకు ; దైవము + అ = దేవుడే ఉన్నాడు.

భా. కౌరవసేన బలహీనమైనది. మనసేన లన్నీ మిక్కిలి శక్తి వంతములు. కనుక నీవు సంకోచించవలసిన పనిలేదు. సేనను నడిపించు. ధర్మరాజా ! నీ సేనా ముఖాన భగవంతు డున్నాడు.

వి. సేనానాయక ధర్మం పూర్తయ్యాక ఇరుబలాల తరతమాలను పల్కుతూ ధర్మజుని ప్రోత్సహిస్తున్నాడు కృష్ణుడు.

పురుషకారం, దైవం రెండు కలసినపుడు విజయం తథ్యం.

పాండవసైన్యం బలవత్తరమైంది. అది పురుషకార ప్రతీక. కృష్ణుడు సాక్షాత్తు దేవుడే. ఆయన పాండవ పక్షాన వారి ననుగ్రహిస్తూ అర్జున రథసారథిగా ముందుంటాడు. కనుక జయము పాండవులదే.

సంఖ్యాబలమున్నా, దైవబలం లేని కౌరవసైన్యం సారహీనమైన దవుతుంది. కృష్ణుడు సూచించాడు. కనుక ఉత్సాహంతో ముందుకు నడు.

క. నీయనుజులు దివిజులకు న
జేయులు ధృతరాష్ట్ర సుతులఁజెఱచుట వ్రేఁగే

తోయజనాశము గజలీ
లాయత్తము గాదె! యెత్తు మాహవమునకున్. 112

అ. నీ + అనుజులు = నీ తమ్ములు; దివిజులకున్ = దేవతలకు కూడా; అజేయులు = జయింపశక్యము కారు ; ధృతరాష్ట్ర సుతులన్ = దుర్యోధనాదులను ; చెఱచుట = నశింపజేయడం; వ్రేగు + ఏ = భారమా ? ; తోయజ + నాశము = పద్మములనున్మూలించుట; గజ+లీలా+ ఆయత్తము + కాదు + ఎ= ఏనుగుల క్రీడకు విలాస మాత్రమునకు అధీనమైనదికాదా; ఆహవమునకున్ = యుద్ధానికి ; ఎత్తుము = పూనుము.

భా. *నీతమ్ముళ్ళను దేవతలుకూడా జయించలేరు. అట్టివారికి దుర్యోధనాదులను సంహరించడ మేమంత కష్టమైన పనిగాదు. పద్మములను విచ్ఛిన్న మొనర్చడం ఏనుగులకు విలాసప్రాయం కదా ! కనుక సందేహించకు. యుద్ధానికి పూనుకో.*

వి. పాండవులు గజాలు, ధార్తరాష్ట్రులు పద్మాలు. కనుక వారి నవలీలగా కుంతీ నందనులు రూపుమాపగల రని పాండవ, కౌరవుల అంతరాన్ని చెపుతూ పర్యవసానాన్ని శ్రీ కృష్ణుడు ఆలంకారికంగా సూచించాడు.

వ. అని నిర్ణయించి నారాయణుండు నిజనివాసంబునకుం జనియె. ధర్మతనయుండుఁ దమ్ములుం దానునుఁ బ్రియంబంది యా రాత్రి సుఖనిద్రసేసె; రేపకడయ పాండవాగ్రజుం డనుజ తనుజ దనుజాంతక సామంత మంత్రి పురోహిత సహితంబుగాఁ బేరోలగంబున నుండి సమస్త పరివారంబును వినఁ గార్యంబు నిశ్చయంబుఁ దెలియం బలికి తగువారలతో సముచిత సంభాషణంబులు సేసి మహనీయ మహిమ వెలయం బుండరీకాక్షుండు పనిచినట్ల పాంచాల నాథ ప్రముఖుల నక్షోహిణులకు నధిపతులుగా వేరువేర యభిషేకించి శ్వేతవంశజాతుం డగుటం జేసి శ్వేతుం డనం బ్రఖ్యాతుండగు ధృష్టద్యుమ్నున కు నుత్కృష్ట ప్రకారంబున నభిషేకం బొనర్చి సర్వసేనాధిపత్యంబునకుం బట్టంబు గట్టి యయ్యైనమంద్రను దక్కటి దొరలను గనుంగొని మధుర వాక్యంబుల నగ్గించి కౌరవులతోడి కయ్యంబునకుం గురుక్షేత్రంబునకు విడియం బోదమని జెప్పి వారినెల్ల ధనంజయునకుం జూపి. 113

అ : రేపకడయ = ప్రొద్దుటే; పాండవ + అగ్రజుండు = ధర్మరాజు; అనుజ తనుజ, దనుజ + అంతక, సామంత, మంత్రి, పురోహిత సహితంబుగాన్ = తమ్ములూ, కొడుకులూ, కృష్ణుడూ, సామంతరాజులూ, మంత్రులూ, పురోహితులతో కూడా; పేరోలగము = నిండు సభ; సముచిత సంభాషణంబులు చేసి = తగిన మాటలాడి; పనిచిన - అట్ల = ఆజ్ఞాపించినట్లు గానే; పాంచాల నాథ ప్రముఖులన్ = ద్రుపదుడు మొదలయిన వారిని; ఉత్కృష్ట ప్రకారంబునన్ = విశిష్ట విధానంతో; తక్కటి దొరలు = మిగిలిన రాజులు; అగ్గించి = పొగడి; కయ్యము = యుద్ధము;

భా : *ఇలా నిశ్చయించి కృష్ణుడు తన మందిరానికి వెళ్లాడు. ధర్మరాజూ తమ్ములూ సంతోషించి ఆ రాత్రి సుఖంగా నిద్రించారు. ప్రొద్దుటే ధర్మరాజు తమ్ముళ్లతో కొడుకులతో కృష్ణునితో సామంతరాజులతో మంత్రులతో పురోహితులతో కలిసి నిండు సభలో అందరికీ*

తన నిశ్చయాన్ని తెలిపాడు. తగిన వారితో తగినట్లు సంభాషించాడు. కృష్ణుని ఆజ్ఞ మేరకు ద్రుపదాదులను అక్షోహిణీ అధిపతులుగా వేరు వేరుగా అభిషేకించారు. శ్వేత వంశంలో పుట్టిన ధృష్టద్యుమ్నునికి ప్రత్యేక విధానంతో సేనానాయకత్వం ఇచ్చాడు. అపుడా అక్షోహిణీ నాయకులు, సేనాధిపతీ మొత్తం ఎనమండుగురినీ, మిగిలిన రాజులనూ మధురంగా ప్రశంసించి, యుద్ధానికి కురుక్షేత్రానికి పోదామని చెప్పాడు. వారినందరినీ అర్జుననకు చూపి (ఇలా అన్నాడు.)

ఉ. ఎప్పుడు నెయ్యెడం బొదివి యిందఱకుం దగ నీవు కంటికిన్
దెప్పయుఁ బోలె మా టయి నెఱిం బను లారసి యొజ్జచాడ్పునం
జెప్పుచు వీరి బుద్ధి గొని చేయుము కార్యము; నీకు రక్షగా
నిప్పరమేశ్వరుండు గలఁ, డిచ్చు శుభం బని చూపెఁ గృష్ణునిన్. 114.

అ. ఎప్పుడున్ = ఎల్లవేళల యందునూ, ఏ + ఎడన్ = ఎక్కడనైనా ; పొదివి = చేరదీసి ; ఇందఱకున్ = ఇంతమందికీ ; తగన్ = ఒప్పునట్లుగా ; నీవు; కంటికిన్ ; తెప్పయున్ + పోలెన్ = తెప్పవలె ; మాటు + అయి = రక్షకుడవై ; నెఱిన్ = చక్కగా; పనులు + ఆరసి = కార్యములు విచారించి; ఒజ్జ + చాడ్పునన్ = గురువువలె ; చెప్పుచున్ (మంచిచెడులు) తెలుపుతూ; వీరి బుద్ధిన్ + గొని = వీరి ఆలోచనలను గ్రహించి; కార్యమున్ ; చేయుము ; నీకున్ ; రక్షగాన్ = సంరక్షకుడుగా ; ఈ పరమేశ్వరుండు = ఈ కృష్ణపరమాత్మ ; కలఁడు ; శుభంబున్ = శ్రేయమును ; ఇచ్చున్ = ఒసంగును ; అని ; కృష్ణునిన్ ; చూపెన్.

భా . *"ఎప్పుడైనా, ఎక్కడైనా వీరందరినీ ఆదుకొంటూ, కంటికి రెప్పలాగా నీవు రక్షకుడవై, పనులన్నీ పరిశీలించుతూ, గురువువలె ఉపదేశించుతూ, వారి అభిప్రాయాలు కూడా తెలిసికొంటూ వ్యవహరించు. నీకు రక్షకుడై ఈ కృష్ణపరమాత్మ ఉంటాడు సర్వశుభాలు గల్గిస్తాడు " అని శ్రీ కృష్ణుని చూపించాడు.*

వి. రాజు రాజ్యాన్ని, సైన్యాన్ని కాపాడాలి. సైన్యం రాజునూ, రాజ్యాన్నీ కాపాడాలి. ఇలా రాజూ, సేన పరస్పర రక్షకులుగా వ్యవహరించినపుడే విజయానికి దగ్గర కాగలరు.

వ. ఇట్లు గాంభీర్య మాధుర్య ధుర్యుండైన యుధిష్ఠిరుండు వరిష్ఠ ప్రభువుల చిత్తంబు లారాధించి సర్వజన సమ్మతంబుగా సమరోత్సాహంబు సేసి మహోల్లాసంబునం బ్రస్థాన భేరి సఱవం బంచిన. 115

అ . గాంభీర్య ..... ధుర్యుండు ; గాంభీర్య = గాంభీర్యముచేతను ; మాధుర్య = మంచితనము చేతనూ, ధుర్యుండు = గొప్పవాడు ; వరిష్ఠప్రభువులు = శ్రేష్ఠులైన రాజులు ; సఱవన్ + పంచినన్ = మ్రోయింప నియోగింపగాన్.

భా : *ఈ రీతిగా గంభీరుడూ, మధుర హృదయుడూ ఐన ధర్మరాజు పెద్దల హృదయాల నలరించి సర్వజనామోదంతో యుద్ధానికి సముద్యుక్తు డయ్యాడు. ఆనందంతో జైత్రయాత్రా భేరి ఘోషించటానికి నియోగించాడు.*

సీ ॥ బీఱెండ తాఁకున బీఁటలు వాఱిన
పచ్చిగోడల మాడ్కిఁ బగిలె దిశలు
కాఁగిన యెసరుల కరణిఁ బొరింబొరి
శరనిధు లుప్పొంగి పొరలఁ బడియెఁ
గలముపైఁ గీలించి గాలి కెత్తిన చాఁప
పోలె మిన్నంతయుఁ బూరటిల్లెఁ
గులపర్వతావలి గులిశభయంబున
బెదరి వాపోవు న ట్లెదురు సెలఁగె

తే : ధాత్రి కుమ్మరిసారె విధమునఁ దిరిగెఁ
జిత్రరూపుల భంగి నిశ్చేష్టితంబు
లయ్యె సర్వభూతములు ప్రయాణభేరి
భూరి నిష్ఠుర ఘోర భాంకార మడర. 116

అ. ప్రయాణ.... భాంకారము ; ప్రయాణ = జైత్రయాత్ర యందలి ; భేరి = భేరులయొక్క, భూరి = ఎక్కువైన ; నిష్ఠుర = పరుషమైన ; ఘోర = భయంకరమైన, భాంకారము= 'భాం' అను శబ్దము; అడరన్ = వ్యాపించగా ; బీఱు + ఎండ -తాఁకునన్ = గొప్ప ఎండ దెబ్బచేత ; బీఁటలు + పాఱిన = బ్రద్దలయినట్టి ; పచ్చిగోడలమాడ్కిన్ = క్రొత్తగా కట్టిన గోడలవలె; దిశలు = దిక్కులు; పగిలెన్ ;

కాఁగిన + ఎసరుల కరణిన్ = సలసల కాగిన ఎసరు లాగా ; పొరిన్ + పొరిన్= మిక్కిలిగా ; శరనిధులు = సముద్రాలు ; ఉప్పొంగి ; పొరలన్ + పడియెన్ = పొర్లిపడెను ; కలముపైన్ = నావపై; కీలించి = కూర్చి; గాలికిన్ + ఎత్తిన= గాలివాలునకు పైకెత్తిన , చాఁప + పోలెన్ = తెరచాపవలె ; మిన్ను + అంతయున్ = ఆకాశమంతా; బూరటిల్లెన్ = నిండెను ; కులపర్వత + ఆవలి = కులపర్వతముల (ఏడింటా) సమూహం ; కులిశ - భయంబునన్ = వజ్రాయుధ భీతితో బెదిరి; వాపోవు + అట్లు = అరుచునట్లు ; ఎదురు + చెలఁగెన్ = ప్రతిధ్వనించాయి.

ధాత్రి = భూమి; కుమ్మరిసారె విధమునన్ = కుమ్మరివాని చక్రంవలె ; తిరిగెన్; సర్వభూతములున్=సమస్త జీవజాలమును; చిత్రరూపుల భంగిన్ = చిత్తరువులలోని ఆకారాలవలె; నిస్ + చేష్టితంబులు + అయ్యెన్ = కదలలేకపోయెను.

భా : *ప్రయాణకాల సూచకాలైన భేరుల భాంకార నాదాలు వ్యాపించగానే తీవ్రమైన ఎండ తాకిడికి పచ్చిగోడల్లా దిక్కులు పగిలిపోయాయి. సలసల మరిగే ఎసళ్ళ తీరున సముద్రాలన్నీ ఉప్పొంగాయి. గాలికెత్తిన తెరచాపమోస్తరుగా ఆకాశమంతా ఆధ్వనితో నిండిపోయింది. వజ్రాయుధ భీతితో అరచినట్లు పర్వతాలు ప్రతిధ్వనించాయి.*

కుమ్మరిసారెలా భూమి పరిభ్రమించసాగింది. బొమ్మల విధంగా ప్రాణులన్నీ నిశ్చేష్టమైనాయి.

వి : పచ్చిగోడలు, కాగిన ఎసళ్ళు , గాలి కెత్తిన తెరచాపలు, కుమ్మరి సారె తిక్కన లోకజ్ఞానాన్ని ప్రకటిస్తాయి. వాటిని ఉపమాన సామగ్రిగా వాడుకొని చక్కని పద్యాన్ని రచించారు తిక్కన. పద్యంలో అంతస్సూత్రంగా కనిపించీ కనిపించనట్లున్న శబ్దాలంకారం కూడా పద్యానికి అందాన్ని పొందుపరిచింది.

-: పాండవులు గౌరవుల తోడి యుద్ధంబునకు వెడలుట : -
(సం 5-149-49)

వ : ఇట్లు ప్రస్థాన భేరి సెలంగిన సకల సైన్యంబులు దండనాథ సహితంబుగా సన్నద్ధంబు లయ్యె ; మఱునాఁడు. 117

భా : ఈ విధంగా ప్రయాణ సూచకంగా మ్రోగించే భేరీధ్వని చెలరేగగా సర్వసైన్యాలూ, దండనాథులూ యుద్ధానికి సిద్ధమయ్యారు. అ మరుసటి రోజు (తర్వాతి పద్యంతో అన్వయం)

ఉ : భూరి విభూతిఁ బెండ్లికినిఁ బోవు తెఱంగునఁ బాండునందనుల్
దారును బుత్రులున్ హరియుఁ దమ్ముఁడు నుజ్జ్వల చారులీల శృం
గారముసేసి సమ్మద వికాస మెలర్పఁగ వీర సంభ్రమో
దార సముద్ధతిం జనిరి ద్రౌపది యున్నెడ కందఱుం దగన్. 118

అ : పాండునందనుల్ = పాండురాజ కుమారులు ; తారును = తామును ; పుత్రులున్ ; హరియున్ = శ్రీకృష్ణుడూ; తమ్ముఁడున్ = సాత్యకియు ; భూరి విభూతిన్ = గొప్ప సంపదతో ; పెండ్లికినిన్ ; పోవు తెఱంగునన్ = వెళ్లేరీతిగా ; ఉజ్జ్వల-చారు లీలన్ = అందం అతిశయించగా ; శృంగారము + చేసి = అలంకరించుకొని ; సమ్మద-వికాసము= ఆనందస్ఫూర్తి; ఎలర్పఁగన్ = కలుగగా ; వీర......ద్ధతిన్ వీర = వీరులయొక్క ; సంభ్రమ = తొందరచేనైన ; ఉదార = గొప్పదైన ; ఉద్ధతిన్ = గర్వంతో ; ద్రౌపది + ఉన్న + ఎడకున్ = ద్రౌపది ఉన్న తావునకు ; అందఱున్ ; తగన్ ; చనిరి.

భా : మహా వీరులైన పాండవులు తామూ, తమ కుమారులూ, శ్రీకృష్ణుడు, అతని తమ్ముడు సాత్యకీ మహావైభవంగా పెండ్లికి తరలి పోతున్నట్లుగా, అందం అతిశయించేటట్లుగ అలంకరించుకొని ఆనందంతో వీరోచితమైన యుద్ధోత్సాహంతో బయలుదేరి ద్రౌపదివద్దకు వెళ్లారు.

వి : ధీరోదాత్త ప్రవృత్తి గలవారికి ధర్మబద్ధమైన ఏ కార్యమైనా ఉత్సాహాన్ని అందిస్తుంది. కయ్యమైనా, వియ్యమైనా వారికి సమంగానే కనిపిస్తుంది. యుద్ధం క్షత్ర ధర్మంగా ప్రసిద్ధం.

క్షత్రియోత్తములైన పాండవులు చరిత్రాత్మకమైన సంగ్రామానికి సిద్ధపడటం వారికి ఆనందదాయకమే. అందుకే వారి పోకను వివాహప్రస్థానంగా భావిస్తున్నాడు తిక్కన.

వ : **ఇట్లు సని యమ్మహాదేవి నామంత్రణంబుసేసి తత్ప్రభృతి పుణ్య స్త్రీ కరకలితలలితాక్షతంబులు గైకొని విప్రాశీర్వాదంబు లాదరించుచు, భద్రపాఠకశ్లోకంబు లాకర్ణించుచు, శోభన పదార్థంబులు గనుంగొనుచు నాంగిక మాంగల్యసూచకంబులు సేకొనుచు వెడలునప్పుడు.** 119

అ : ఆ మంత్రణంబు + చేసి = వీడ్కొని ; తత్ప్రభృతి = ఆ ద్రౌపది మొదలుగాగల; లలిత + అక్షతంబులు = శుభాక్షతలు ; భద్రపాఠక = మంగళపాఠకుల యొక్క, శ్లోకంబులు= స్తుతులు ; ఆంగిక = అంగములకు సంబంధించిన, మాంగల్య సూచకంబులు = శుభసూచనలు (శకునాలు)

భా : *ఆ విధంగా వెళ్లి వారు ద్రౌపదిని వీడ్కొని పుణ్యస్త్రీల నుండి శుభాక్షతలూ, బ్రాహ్మణుల వలని ఆశీర్వాదాలూ ; మంగళ పాఠకుల శ్లోకాలూ, స్వీకరిస్తూ శుభకరంబైన పదార్థాలను చూస్తూ శరీరావయవాలు అదురుటవంటి శుభసూచనలు గమనిస్తూ వెళ్ళుచుండగా (తర్వాతి పద్యంతో అన్వయం).*

క : **తగ శంఖకాహళాదిక**
మగు మంగళ తూర్య సంచయము గంభీరం
బుగ మ్రోసె జయముఁ దెలుపుచు
జగతీశ్వరు మ్రోల నాకసము దీటుకొనన్. 120

అ : తగన్ = సముచితంగా ; శంఖ-కాహళ + ఆదికము + అగు = శంఖ, కాహళ మొదలుగాగల ; మంగళ - తూర్య-సంచయము = శుభసూచకాలైన వాద్యాల సమూహం ; జయమున్ + తెలుపుచున్ = విజయాన్ని సూచిస్తూ ; జగతీ + ఈశ్వరు-మ్రోలన్ = మహారాజు ఎదుట ; ఆకసము = ఆకాశం ; దీటు కొనన్ = నిండునట్లు ; గంభీరంబుగన్ ; మ్రోసెన్ = నినదించెను.

భా : *ఆ సమయంలో మహారాజవిజయాన్ని సూచిస్తూ శంఖ కాహళాది మంగళ వాద్యాలు మ్రోగాయి. వాటి ధ్వనితో ఆకాశమంతా నిండిపోయింది.*

క : **మనుమని జయ ప్రయాణం**
బనుమోదింపంగ నా సుధాంశుఁడు సనుదెం
చిన కరణి గొడుగు కుంతీ
తనయాగ్రణి మ్రోల నతిసితప్రభ నొప్పెన్. 121

అ : మనుమని -జయ - ప్రయాణంబున్ = మనుమడైన ధర్మరాజు యొక్క విజయయాత్రను ; అనుమోదింపన్ = ఆమోదించుటకై ; ఆ సుధాంశుఁడు = (వంశకర్తయైన) ఆ చంద్రుడు ; చనుదెంచిన కరణిన్ = వచ్చినట్లు ; కుంతీ-తనయ+అగ్రణి-మ్రోలన్ = ధర్మజుని

ఎదుట ; అతిసిత ప్రభన్ = తెల్లని కాంతితో ; గొడుగు + ఒప్పెన్ = గొడుగు ప్రకాశించింది.

భా : *మనవడయిన ధర్మరాజు యొక్క జైత్రయాత్రకు తన ఆమోదం తెలిపేందుకు వచ్చిన చంద్రుడో అన్నట్లుగా ధర్మరాజు దగ్గర తెల్లగొడుగు ప్రకాశించింది.*

వి : ధర్మరాజు చంద్రవంశానికి చెందిన రాజు, కాబట్టి చంద్రుడికి మనవడి వరుస అవుతాడు ధర్మరాజు. జైత్రయాత్రకు బయలుదేరిన ధర్మరాజుకు తెల్లగొడుగు పట్టగా దానిని చంద్రునివలె ఉత్ప్రేక్షించారు తిక్కన.

వ : **అట్టియెడ నమ్మహీ వల్లభుండు.** 122

భా : *అప్పుడా ధర్మరాజు.*

క : **ఉచితగతిఁ జేరి వంది**
ప్రచయము గీర్తింప నెక్కె రథమం దొనరన్
ఖచియించిన వజ్రంబుల
రుచులను బొలుపారు సీవిరులు బెరయంగన్. 123

అ : ఉచితగతిన్ = తగువిధంగా ; చేరి సమీపించి ; వంది ప్రచయము = స్తోత్రపాఠక సమూహం; కీర్తింపన్ = స్తుతింపగా ; అందు = ఆ సమయాన ; ఒనరన్ -ఖచియించిన = బాగుగా పొదిగిన; వజ్రంబుల రుచులను = వజ్రాల కాంతులతో ; పొలుపారు = ప్రకాశించెడి; సీవిరులు = ఆలవట్టములు; బెరయంగన్ = ప్రకాశింపగా ; రథము = రథమును; ఎక్కెన్.

భా : *వజ్రకాంతులతో వెలుగొందే ఆలవట్టాలు ప్రకాశిస్తుండగా వందుల స్తోత్రపాఠాల మధ్య ధర్మరాజు రథ మధిరోహించాడు.*

వ : **తదనంతరంబ.** 124

భా : *ఆ తర్వాత.*

సీ ॥ **వక్షస్థలంబున వనమాల గ్రాలంగ**
వెలిమావు గెడల వాగెలు ధరించి
నొగలపై హరి యొప్పు నగచరకేతువు
మెఱయంగ నరదంబు మెఱుఁగు లడర
దివ్య కిరీటంబు దీప్తులు భూనభో
తరమెల్లఁ గలయంగఁ బరగు చుండ
గాండీవ తూణ యుగ్మములు పూర్వాపర
భాగంబులకు నవాభరణములుగఁ

తే ॥ **దెలిమొగంబుతో నల్ల నేతెంచి యొక్క**
పార్శ్వమునఁ బొడసూపి భూపతికి మ్రొక్కి
దేవదత్తంబు పూరించె దేవదేవు
పాంచజన్యంబునకు మున్న ఫల్గునుండు. 125

అ : వక్షస్ స్థలంబునన్ = రొమ్మున ; వనమాల; గ్రాలంగన్ = ఒప్పగా ; వెలిమావు -గెడల -వాగెలు = ఉచ్చైశ్రవమునకు జతయైన అశ్వములయొక్క కళ్ళెములు ; ధరించి = చేబూని ; నొగలపై = రథంయొక్క కాడికట్టున; హరి ; ఒప్పన్ ; నగచరకేతువు = కపిధ్వజం ; మెఱయంగన్ = ప్రకాశింపగా ; అరదంబు+మెఱుఁగులు = రథకాంతులు ; అడరన్ = అతిశయింపగా ; దివ్యకిరీటంబు + దీప్తులు = దివ్యమైన కిరీటం యొక్క కాంతులు ; భూ+నభః + అంతరము = భూమి-ఆకాశముల నడిమి భాగం ; ఎల్లన్ = అంతయును ; కలయంగన్ + పరగుచుండన్ = వ్యాపించుచుండగా ; గాండీవ -తూణ-యుగ్మంబులు = గాండీవమనేధనుస్సూ, రెండు అమ్ముల పొదులూ ; పూర్వ + అపర భాగంబులకున్ = ముందు వెనుక వైపులకు ; నవ+ ఆభరణములుగన్ = క్రొత్త అలంకారాలు కాగా ; తెలి-మొగంబుతోన్ = ప్రసన్నమైన ముఖంతో ; అల్లనన్ = నెమ్మదిగా ; ఏతెంచి = వచ్చి ; ఒక్క-పార్శ్వమునన్ = ఒక ప్రక్కగా ; పొడ + చూపి = కనిపించి ; భూపతికిన్ = ధర్మరాజుకు ; మ్రొక్కి = నమస్కరించి ; ఫల్గునుండు = అర్జునుడు ; దేవదేవు = దేవదేవుడైన హరియొక్క ; పాంచ జన్యంబునకున్ -మున్ను + అ = శ్రీకృష్ణుడు పాంచ జన్యాన్ని పూరించటానికి ముందుగా ; దేవదత్తంబున్ = దేవదత్తమనే తన శంఖాన్ని ; పూరించెన్ = ఊదెను.

భా : వక్షస్ స్థలంపై వనమాల ప్రకాశిస్తుండగా, ఉచ్చైశ్శ్రవానికి సాటి వచ్చే రథాశ్వాల కళ్ళాలు చేపట్టి శ్రీకృష్ణుడు రథం కాడి కట్టుపై ప్రకాశిస్తున్నాడు. కపిధ్వజం శోభిల్లగా రథకాంతులు ప్రసరిస్తున్నాయి. దివ్య కిరీట కాంతులు భూమ్యాకాశాల మధ్య అలముకొనుచుండగా గాండీవమూ, అక్షయ తూణీరాలూ, ముందు వెనుక భాగాల కాభరణాలుగా ప్రకాశిస్తుండగా ప్రసన్నవదనంతో వచ్చి అర్జును డొకప్రక్క ప్రేమగా నిలిచి రాజుకు నమస్కరించి, శ్రీకృష్ణుడు పాంచజన్యాన్ని పూరించటానికి ముందే తన దేవదత్తాన్ని పూరించాడు.

శా : భీముండుం గవలుం గుమారులును సంప్రీతిన్ గదాద్యాయుధో
ద్దామ స్ఫీతరుచుల్ వెలుంగ రథసంతానంబు రమ్యోజ్జ్వల
శ్రీ మీఱం దగ వచ్చి శంఖములు గర్జిల్లంగఁ బూరించుచున్
భూమీశుం గని యగ్రభాగమున కొప్పుం బెంపునుం జేయుచున్. 126

అ : భీముండున్ ; కవలున్ = నకుల సహదేవులును ; కుమారులును = వారి సంతానంబును ; సంప్రీతిన్ = మహానందంతో ; గదా + ఆది + ఆయుధ = గద మొదలైన ఆయుధాల యొక్క ; ఉద్దామ = విరివియై; స్ఫీత = వ్యాపించిన, రుచుల్ = కాంతులు ; వెలుంగన్ = ప్రకాశింపగా ; రథసంతానంబు = రథాల సమూహం ; రమ్య = అందమైన ; ఉజ్జ్వల = ప్రకాశించెడి, శ్రీ = శోభ, మీఱన్ = అతిశయింగా ; తగన్ వచ్చి ; శంఖములు ; గర్జిల్లంగన్ ; పూరించుచున్ = ఊదుతూ ; భూమి + ఈశున్ = ధర్మరాజును ; కని ; అగ్రభాగమునకున్ = ముందు భాగానికి ; ఒప్పున్ = అందమును ; పెంపునున్ = అతిశయాన్ని; చేయుచున్ = కల్గించుతూ (తర్వాతి పద్యంతో అన్వయం)

భా : భీముడూ, నకుల సహదేవులూ, వారి వారి సంతతీ మహానందంతో గదాద్యాయుధ కాంతులు ఒప్పగా, వారధిరోహించిన రథసమూహాల శోభ వెల్లివిరియగా, శంఖాలు పెద్దగా ఊదుతూవచ్చి, ధర్మరాజునకు కనిపించి, సేనకు ముందుగా నిలిచి అందాన్నీ, అతిశయాన్నీ కల్గించారు.

క : **నిలిచిరి తక్కటి దొరలును**
బలుమానుసులును మహోగ్రభంగి సవరణల్
సెలు వొంద నధిపు చుట్టుల
నలంకరించిరి విభూషణాంశుచ్ఛటలన్. 127

అ : తక్కటి దొరలును = మిగిలిన పెద్దలు కూడా; బలు + మానుసులును = బలవంతులైన వారును ; మహా + ఉగ్ర-భంగిన్ = ఎంతో భయంకరంగా ; సవరణల్ = యుద్ధపరికరాలు ; చెలువు + ఒందన్ = ప్రకాశింపగా ; విభూ..... టలన్, విభూషణ = ఆభరణాల యొక్క, అంశు = కాంతులయొక్క, ఛటలన్ = సమూహాలతో ; అధిపు = రాజుయొక్క; చుట్టులన్ = పరిసరాలను; అలంకరించిరి.

భా : *మిగిలిన పెద్దలూ, బలసంపన్నులైన వీర పురుషులూ, మహా భయంకరంగా యుద్ధ పరికరాలు ప్రకాశిస్తుండగా తాము ధరించిన ఆభరణాల కాంతులతో ధర్మరాజును శోభిల్లజేశారు.*

వ : **అప్పుడు పాండవాగ్రజున కభిముఖంబుగాఁ జనుదెంచి.** 128

అ : అభిముఖంబుగాన్ = ఎదురుగా

భా : *అప్పుడు ధర్మరాజు కెదురుగా వచ్చి (తర్వాతి పద్యంతో అన్వయం)*

క : **సాష్టాంగ మెఱఁగి సమరా**
వష్టంభం బొప్ప దివ్య వాహనలీలో
త్కృష్ట గతిన్ ముంగలియై
ధృష్టద్యుమ్నుండు వొలిచెఁ దేజోమహిమన్. 129

అ : సాష్ట + అంగము + ఎఱఁగి = సాష్టాంగ నమస్కారం చేసి ; సమర = యుద్ధ సంబంధమైన ; అవష్టంభంబు + ఒప్పన్ = అహంకారమొప్పగా : దివ్య = గొప్పదైన, వాహనలీలా= రథంయొక్క సవిలాసమైన, ఉత్కృష్ట గతిన్ = మనోహర గమనంతో ; ముంగలియై = ముందున్న వాడై ; తేజః + మహిమన్ = తేజోవిశేషం చేత ; ధృష్టద్యుమ్నుండు; పొలిచెన్ = ప్రకాశించెను.

భా : *ధృష్టద్యుమ్నుడు ధర్మరాజుకు సాష్టాంగ నమస్కారం చేసి తేజోవిశేషంతో, యుద్ధాహంకారంతో రథంపై సవిలాసంగా ముందుకు వచ్చి నిలిచాడు.*

వ : **ఇవ్విధంబునం జారు భీషణంబుగా సన్నద్ధంబై యుధిష్ఠిరుండు గదలి శుభశకునంబులు గైకొనుచు నడచె ; నట్టి సమయంబున నెల్లవారి పరిచారకులును, శకటాది సకల సాధనంబులును, బటగృహంబులును మొదలుగా వలయు సమస్త వస్తువు లొడఁ గూర్చి వెడలిన దండు పఱపై సముద్రంబు గాఁపు వోవు చందంబయ్యె. నిట్లరిగి ధర్మపుత్రుండు కురుక్షేత్రంబు దఱియంజొచ్చి ఋష్యాశ్రమంబులకు దేవతాయత నంబులకు నలజడి గాకుండం బరిహారంబు సేయుచుం జని తృషకాష్ఠ జల సమృద్ధంబై తగియెడు సమస్థలంబున హిరణ్వతి యను పుణ్యనది పొంత విడిదలగా నిరూపించి యచ్చో నిలిచెఁ ; దదనంతరంబ.** 130

అ : చారు భీషణంబుగాన్=మనోహరంగానూ, భయంకరంగానూ ; పటగృహంబులు = డేరాలు ; దండు = సేన ; పఱపు + ఐ = విస్తృతమై ; కాపు + పోవు = వలసపోవు ; తృణ-కాష్ఠ - జల - సమృద్ధంబు +ఐ = గడ్డి , కట్టెలు, నీరు సమృద్ధిగా లభించెడిదై; దఱియన్ + చొచ్చి = సమీపించి ; పొంత = సమీపమున ; విడిదల = మజిలీ; అలజడి = ఆపద.

భా : *ఇలా చూడముచ్చటగానూ, భయంకరంగానూ సన్నద్ధుడైన ధర్మరాజు బయలుదేరి శుభశకునంచూసి ముందుకు సాగాడు. అందరి సేవకులును, బండ్లు మొదలైన సాధనాలు , డేరాలు మొదలైన అవసరమైన వస్తువులన్నీ సమకూర్చుకొని సైన్యం వెంట నడువగా సముద్రమే కదలి వలస పోతోందా అన్నట్లున్నది. అలా బయలుదేరిన ధర్మజుడు కురుక్షేత్రం సమీపించి మహర్షుల ఆశ్రమాలకూ, దేవాలయాలకు అలజడి కలగకుండా సాగుతూ, తృషకాష్ఠ జల సమృద్ధితో నివాసానికి అనుకూలమైన హిరణ్వతి అనే పవిత్ర నదీ తీరాన్ని మజిలీగా నిశ్చయించి అక్కడ ఆగాడు.*

వి : అనేక - అక్షౌహిణుల సైన్యం వెళ్ళేటప్పుడు మార్గమధ్యంలో గల గ్రామాలకు కొంత ఒత్తిడి కలుగుతుంది. సాధారణ జనావాసాలే గాక ఆశ్రమాలూ, దేవాలయాలు కూడా ఉంటాయి. వాటికి ప్రధానంగా అలజడి కలగకూడదు. ధర్మజ్ఞుడైన ధర్మరాజు ఆ విషయంలో జాగ్రత్త వహించాడు.

తే : విడియుటకు సూచకంబుగ విష్ణుఁ డొత్తెఁ
బాంచజన్యంబు ధర్మజ పార్థు లాది
గాఁగఁ దమ తమ వీర శంఖంబు లెల్ల
దొరలు నొత్తిరి దివి మ్రోఁతఁ దూఁటు గట్టి. 131

అ : విష్ణుఁడు = శ్రీకృష్ణుడు ; విడియుటకున్ = సేనలు బసచేయుటానికి ; సూచకంబుగన్ = సంకేతంగా ; పాంచజన్యంబున్ = పాంచజన్య శంఖాన్ని ; ఒత్తెన్ = పూరించెను; ధర్మజ-పార్థులు + ఆది + కాఁగన్= ధర్మజుడు, అర్జునుడు మొదలైన; దొరలు = పెద్దలు, దివి= ఆకాశం ; మ్రోఁతన్ = చప్పుడుతో ; తూఁటు + కట్టన్ = చిల్లి పడేటట్లు ; వీర శంఖంబులు + ఎల్లన్ = పరాక్రమ సూచక శంఖాలన్నిటినీ ; ఒత్తిరి = ఊదిరి.

భా : *సేనలు బసచేయవచ్చు నని తెలియ జేయటానికై కృష్ణుడు పాంచజన్యాన్ని పూరించాడు. ధర్మరాజు, అర్జునుడు మొదలైన పెద్దలు కూడా తమ తమ శంఖాలను పూరించారు. ఆ ధ్వనికి ఆకాశం చిల్లిపడింది.*

వి : ఆకాశం యథార్థానికి చిల్లిపడకపోయినా అలాపడినట్లు వర్ణించటం అతిశయోక్తి.

వ : తదనంతరంబ, యొక్క రమ్య ప్రదేశంబున రాజమందిరంబును నుచితస్థానంబుల నమస్త జననివాసంబులునై రమణీయు బంధురంబును,

సింధురాశ్వశాలామాలికా మనోహరంబునుంగా వీడెల్ల విడిసె; వీటి చుట్టునుం దిరిగి ధృష్టద్యుమ్నుండు సురక్షితంబు చేసి వచ్చె ; రాజును దొరలును దమ్ములును సకల పరివారంబును దగిన తెఱంగున నుండిరి; నానా వస్తు బహుళ సంభారంబుల మహోదారం బగుచుఁ బాండవ స్కంధావారంబు మహనీయాకారంబున నొప్పె; నంత నక్కడ. 132

అ : రమణీయ బంధురము = చక్కనిదై ఒప్పినది ; సింధుర + అశ్వశాలా - మాలికా- మనోహరంబు = గజశాలలు, అశ్వశాలలు వరుసలచే అందమైనది ; వీడు =సేన ; వీటి చుట్టునున్ = స్కంధావారము చుట్టును.

భా : ఆ తర్వాత ఒక అందమైన తావున ధర్మరాజు విడిదినీ, తగిన ప్రదేశాలలో మిగిలిన వారికి డేరాలూ, గజ-అశ్వశాలలూ, కలిగి సేనలు విడిది చేశాయి. సేనాధిపతియైన ధృష్టద్యుమ్నుడు స్కంధావారం చుట్టూ తిరిగి భద్రతకు సంబంధించిన ఏర్పాట్లు చేశాడు. రాజూ, అతని తమ్ములూ మిగిలిన పెద్దలూ వారి వారి స్థాయిలకు తగినట్లు విడిదిచేశారు. బహువిధాలైన వస్తువులతో, సామగ్రితో సమృద్ధమయిన ఆ స్కంధావారం చాలా పెద్దదిగా కనిపించింది. అప్పు డక్కడ. (తర్వాత అన్వయం).

క : **చారులచే నంతయు విని**
కౌరవపతి విననివి యట్ల కర్ణాదులతోఁ
బేరోలగమున విగతవి
కారుండై యిట్టు లనియె గర్వ మెలర్పన్. 133

అ : చారులచేన్ = గూఢచారుల వల్ల ; అంతయున్, విని ; కౌరవపతి = దుర్యోధనుడు; విననని + అట్ల = వినని వానివలె ; కర్ణ + ఆదులతోన్ = కర్ణుడు మొదలైన వారితో; పేరు + ఓలగమునన్ = నిండుసభలో; గర్వము + ఎలర్పన్ = గర్వము అతిశయించగా ; విగతవికారుండై= గంభీరుడై ; ఇట్లు + అనియెన్.

భా : గూఢచారుల ద్వారా ధర్మరాజ స్కంధావార విషయ మంతా విన్న సుయోధనుడు విననట్లే కనిపించి కర్ణాదులతో గూడి నిండుకొలువు చేసి గర్వాతిశయంతో గంభీరంగా ఇలా అన్నాడు.

వి : దుర్యోధనునికి పాండవుల మీదగానీ, వారుచేసే యుద్ధ ప్రయత్నాల మీదగానీ ఏ పాటి గౌరవమూ లేదు. అంతే కాక తన బలం, తన అనుచర బలం అతనిలో ఆత్మ విశ్వాసాన్ని పెంచాయి. అది గర్వస్థాయికి చేరింది. అందుకే చారులు చెప్పిన మాటలు వినికూడా విననట్లు నటించడం. అది అతని తృణీకార స్వభావాన్ని, పరబలాన్ని లెక్క చేయక పోవటాన్నీ తెలుపుతుంది. చిన్నపామునైనా పెద్ద కర్రతోనే కొట్టాలన్నది రాజనీతిలో, సాధారణరీతిలోకూడా చాలా అవసరమైన మాట.

క : **తన వచ్చిన కార్యము మన**
మనుకూలతఁ జేయకున్న హరి యలుక మెయిన్
జని యప్పాండు తనూజులు
మనములఁ గిను కూనునట్టి మాటలు సెప్పున్. 134

అ : తన - వచ్చిన = తాను వచ్చినట్టి ; కార్యమున్ = పనిని ; మనము ; అనుకూలతన్ = తన కనుకూలంగా ; చేయక + ఉన్నన్ = చేయనందున ; హరి = శ్రీకృష్ణుడు ; అలుక మెయిన్ = కోపంతో ; చని = వెళ్ళి ; ఆ + పాండుతనూజులు = ఆ పాండురాజసుతులు ; మనములన్ = మనస్సులలో ; కినుకన్ + ఊను + అట్టి = కోపపడునట్టి ; మాటలు ; చెప్పన్.

భా : తాను వచ్చిన పని సానుకూలం చేయలేదన్న కోపంతో శ్రీకృష్ణుడు వెళ్ళి పాండవుల మనసులలో మనపై క్రోధం కలిగేటట్లు మాటాడుతాడు.

వి : తన కుటిలనీతి ఇంకా కొనసాగిస్తూనే ఉన్నాడు సుయోధనుడు. బహుశః భీష్మ ద్రోణాదులకు శ్రీకృష్ణునిపై క్రోధం కల్గించేందుకు చేస్తున్న విఫల యత్నం కావచ్చునిది.

చ : మును మన చేత భంగపడ ముచ్చిరి యుండుటఁ జేసి పాండునం
దనులును నెత్తి వత్తు; రుచితంబుగ సంగర మెట్లుఁ గల్గుఁ; బే
ర్చిన బహుసైన్యముల్ బయలఁ జేరఁ దగన్ విడియింత; మెల్లి దం
డని పురిఁ జాటఁ బంచి దొర లందఱకున్ బడి సేయుఁ డేడ్తెఱన్. 135

అ : మును = పూర్వము; మన చేతన్; భంగపడన్ = అవమానాన్ని పొందగా; ముచ్చిరి + ఉండుటన్ + చేసి = పరితపించి ఉండుట చేత ; పాండునందనులును = పాండవులుకూడా; ఉచితంబుగన్ = తగినట్లుగా; ఎత్తి వత్తురు = దాడి చేయుదురు; సంగరము= యుద్ధం; ఎట్లున్; కల్గున్ = తటస్థించున్ ; పేర్చిన = చేలరేగిన; బహుసైన్యముల్ = అనేకాలైన మనసేనలు ; బయలన్ + చేరన్ = (ఊరి) బయటకు చేరగా ; తగన్విడియింతము= బసచేయించుదము; ఎల్లి=రేపు; దండు + అని = దండయాత్ర అని; పురిన్ = నగరంలో; చాటన్ +పంచి = ప్రకటింపజేసి; దొరలు + అందరకున్ = పెద్దలందరికినీ; ఏడ్తెఱన్ = వేగంగా; పడి + చేయుఁడు = ఆజ్ఞాపించండి.

భా : ఇంతకుముందు మన వల్ల అవమానాలు పొంది పరితపించి ఉన్నారు కాబట్టి పాండవులు దండెత్తిరాక మానరు. యుద్ధం అనివార్యం. సైన్యాన్ని బయలుదేరదీసి బహిఃప్రదేశంలో మజిలీ చేద్దాం. రేపే దండయాత్ర అని నగరంలో చాటింపు వేయించండి. సామంతులూ, దండనాథులూ, పెద్దలూ మొదలైన వారి కందరకు ఆజ్ఞ పంపండి.

వ : మనకు విడిదల కురుక్షేత్రం బని పలికి దుశ్శాసనుం జూచి నీవును గర్ణుండును గాంధారపతియును సమస్తంబును సమకట్టుం డనుటయు వారలు ప్రియంబునం బని వూని వెడలి దండు సాటించి తగువారల కెల్ల నెఱింగించి పుచ్చిన సకల పరివారంబును ప్రమోదంబు నొందె. భూవల్లభుండును గొలిచి యున్న వారలం బోవం బంచి వలయు నెడకుం జని తగిన వర్తనంబున నుండె నట్టి సమయంబునఁ బ్రయాణో చితంబులగు బహు ప్రకార వ్యాపారంబులయందుఁ దత్పరులైన దొరల నానా చేష్టితంబులను గరి తురగ రథంబులకు సవరణలు సమకూర్చు చతుర పరిచారకుల సంభ్రమంబునను వివిధాయుధంబులు రవణంబులుగా నాయితంబులు సేయఁ బ్రవర్తించు పదాతి వర్గంబుల సంరంభంబునను నయ్యాయి సరకులు పయనంబున

కనువు సేయు బలుమానుసుల తిరుగుడు వడుటనుం బురంబు సమరోత్సాహ చంద్రోదయంబునకు మహార్ణవంబై ఘూర్ణిల్లుచుండె నపరదిన ముఖంబున. 136

అ : విడిదల = సేన బసచేయుస్థలము ; సమకట్టుండు = సిద్ధము చేయండి ; సవరణ = పరికరాలు ; రవణంబులుగాన్ = అలంకారములగునట్లుగా; అపరదిన-ముఖంబునన్= మరునాటి ఉదయపువేళ ;

భా : మనసేన విడిసేచోటు కురుక్షేత్రమని చెప్పి దుశ్శాసనుని చూచి 'నువ్వు కర్ణుడు, శకుని సర్వం సిద్ధం చేయండి,' అనగానే వారు సంతోషంతో కార్యనిర్వహణకై వెడలి దండయాత్ర విషయం వెల్లడించి తగిన వారందరకు తెలియ జేశారు. అదివిని పరిజనులంతా ఆనందించారు. రాజు పరిజనులను పంపి తానుకూడా కొలువు కూటము విడిచివెళ్ళాడు. ఆరోజు ప్రయాణపు ఏర్పాట్లలో నిమగ్నమైన వీరుల చేష్టలతో, అశ్వరథాదులను సమకూర్చే సేవకుల తొందరతో, పనిలో ఉన్న వ్యక్తుల సంచారంతో నగరమంతా యుద్ధోత్సాహమనే చంద్రోదయానికి సముద్రంలా కన్పించింది.

క : **త్వరితగతి సమయ సముచిత**
కరణీయము లాచరించి కమనీయాలం
కరణోజ్జ్వలుఁడై యెలమిం
గురురా జేతెంచెఁ గొలువు కూటంబునకున్. 137

అ : త్వరితగతిన్ = శీఘ్రంగా ; సమయ = కాలానికి ; సముచిత = తగినట్టి ; కరణీయములు = కృత్యములు ; ఆచరించి = చేసి ; కమనీయ = మనోహరమైన ; అలంకరణ= ఆభరణములచేత ; ఉజ్జ్వలుడై = ప్రకాశించు చున్నట్టివాడై ; కురురాజు = దుర్యోధనుడు ; ఎలమిన్ = ప్రీతితో ; కొలువుకూటమునకున్ = సభాస్థలికి ; ఏతెంచెన్ = విచ్చేసెను.

భా : శీఘ్రంగా ప్రాతః కాలకృత్యాలన్నీ నెరవేర్చుకొని మనోహరమైన ఆభరణాలు ధరించి ప్రకాశిస్తూ దుర్యోధనుడు సంతోషముగా కొలువుకూటమునకు వచ్చాడు.

వ : **వచ్చి దుశ్శాసన ప్రముఖ నిఖిల సహోదర పరివృతుండై యుండి.** 138

భా : వచ్చి దుశ్శాసనుడు మొదలైన సర్వసోదరులతోను కలసియుండి.

-: దుర్యోధనుడు ద్రోణ ప్రభృతుల సేనాపతులం జేయుట :-
సం : 5-152-27

సీ ॥ **అరిభయంకరుఁడు ద్రోణాచార్యుఁడును రణో**
త్సాహలంపటుఁడు రాధాసుతుండు
శరతత్త్వవేది యశ్వత్థామయును భూరి
బాహా విలాసుండు బాహ్లికుండు

శౌర్యవైభవశాలి శల్యుండు ధైర్య సం
పన్నిధి గృపుఁ డును బ్రకటశక్తి
సార దుర్జయమూర్తి భూరిశ్రవుండును
దర్పోజ్జ్వలుండు గాంధారపతియు

తే : నుగ్రతేజుండు గృతవర్మయును బ్రతాప
ఘనుఁడు గాంభోజుఁడును పరాక్రమ ధనుండు
సింధురాజును బయలుగాఁ జేయఁ గోరి
కొనఁగఁ దగు వార లగుదు రక్షోహిణులకు. 139

అ : అరిభయంకరుఁడు=శత్రువులకు భయాన్ని కల్గించే వాఁడైన; ద్రోణాచార్యుఁడును; రణ + ఉత్సాహలంపటుఁడు = యుద్ధోత్సాహమందు అసక్తి కలవాడైన ; రాధాసుతుండు = కర్ణుఁడు ; శరతత్త్వవేది = బాణవిద్యా రహస్యాలు తెలిసిన; అశ్వత్థామయును; భూరి + బాహా - విలాసుండు = గొప్ప భుజ విలాసం కలవాడైన; బాహ్లికుండు; శౌర్యవైభవశాలి=పరాక్రమ సంపదగల; శల్యుండున్, ధైర్య సంపత్ + నిధి = ధైర్య సంపదకు నెలవైన; కృపుఁడును; ప్రకట-శక్తి -సార - దుర్జయ-మూర్తి = బలసంపదచే జయింపరాని ఆకృతికలవాడైన; భూరి శ్రవుండును; దర్ప + ఉజ్జ్వలుండు = గర్వంతో ప్రకాశించే; గాంధారపతియు = శకునియు; ఉగ్రతేజుండు = తీవ్రమైన ప్రతాపం కలవాడైన ; కృతవర్మయు ; ప్రతాపఘనుఁడు = పరాక్రమముచే గొప్పవాడైన; కాంభోజుఁడును = కాంభోజ దేశాధిపతి ; పరాక్రమ ధనుండు = శౌర్యమేధనముగా గలిగిన ; సింధురాజును ; అక్షోహిణులకున్ = సేనల అక్షోహిణులకు ; పతులుగాన్ + చేయన్= అధిపతులుగా చేయుటకు ; కోరికొనఁగన్ ; తగువారలు + అగుదురు = అర్హులు కాగలరు.

భా : *రణభీకరుడైన ద్రోణాచార్యుడు, యుద్ధోత్సాహము గల కర్ణుడు, బాణ విద్య బాగా తెలిసిన అశ్వత్థామ, బాహు విలాసంగల బాహ్లికుడు, పరాక్రమశాలి శల్యుడు, ధైర్యనిధి కృపుడు, మహాబలుడైన భూరి శ్రవుడు, దర్పోజ్జ్యలుడైన శకుని, ఉగ్ర తేజోమూర్తియైన కృతవర్మ, శౌర్యనిధియైన కాంభోజరాజు, పరాక్రమ ధనుడైన సింధురాజు పదకొండు అక్షోహిణులకు అధిపతులుగా చేయదగినవారు.*

చ : అని మది నిశ్చయించి తగ నందఱఁ బిల్వఁగఁ బంచి వారితో
నని పని మాటలాడి వినయంబునఁ బ్రార్థన సేసి మీర లీ
యొనరిన సైన్యముల్ పదునొకొంటికిఁ బ్రాభవ మాచరింపఁ జొ
చ్చిన సకలంబు నొప్పు నభిషేకము గైకొనుఁ డుత్సవంబునన్. 140

అ : అని ; మదిన్ = మనస్సున ; నిశ్చయించి ; తగన్ ; అందఱన్ ; పిల్వఁగన్ = పిలువగా ; పంచి = పంపి ; వారితోన్ = వారందరితో; అని పనిమాటలు + ఆడి = యుద్ధకార్యమును గూర్చి మాట్లాడి ; వినయంబునన్ = వినయముతో ; ప్రార్థన + చేసి = ప్రార్థించి ; మీరలు = మీరు ; ఈ + ఒనరిన + సైన్యముల్ = ఈ ఒప్పిన సేనలు ; పదునొకంటికిన్

= పదకొండింటికిని ; ప్రాభవము + ఆచరింపన్ = అధిపత్యము వహింపగా ; చొచ్చినన్ = పూనినచో ; సకలంబున్ + ఒప్పున్ = అంతయును శోభిల్లును ; ఉత్సవంబునన్ = ఆనందముతో; అభిషేకము + కైకొనుడు = సైన్యాధిపత్యాభిషేకము స్వీకరింపుడు.

భా : అని నిశ్చయించుకొని అందరినీ పిలిపించి యుద్ధం విషయం ప్రస్తావించి, సవినయంగా ఇలా ప్రార్థించాడు. "మీరీ పదకొండ క్షోహిణుల సైన్యానికి ఆధిపత్యాన్ని స్వీకరించినట్లైతే అంతా సుసంపన్న మవుతుంది. ఈ బాధ్యతను ఆనందంతో స్వీకరించండి."

క : **అనవుడు నందఱునౌఁ గా**
కని సంతస మంద నధిపుఁ డభిషేకించెన్
జనులెల్ల సంప్రమోదం
బునఁ బొందఁగ నప్పు డతివిభూతి దలిర్పన్. **141**

అ : అనవుడున్ = అనినవెంటనే; అందఱున్; ఔన్ + కాక + అని= అలానే అగుగాక అని; సంతసము + అందన్ = సంతోషింపగా; జనులు+ఎల్లన్ = ప్రజలందఱును; సంప్రమోదంబునన్+పొందగన్ = మహానందముతో కూడగా; అప్పుడు; అతివిభూతి = మహావైభవము ; తలిర్పన్ = తోపగా ; అధిపుఁడు= దుర్యోధన మహారాజు ; అభిషేకించెన్ = సైన్యాధిపతులుగా నభిషేకించెను.

భా : అలా అనగానే అందఱు అలాగేనని సంతోషించారు. ప్రజలంతా మహానందాన్ని పొందారు. మహారాజు మహావైభవముగా వారినందరి సైన్యాధిపతులుగా అభిషేకించాడు.

వ : **ఇట్లు మహామహిమ వెలయ నక్షోహిణీ నాయకుల సమకట్టి రారాజు పితామహుపాలికి వారిం దోడ్కొని చని సవినయంబుగా నతనికిఁ బ్రణామంబు సేసివారలం జూపి వీరల మన యక్షోహిణులు పదునొకంటికిం బతులఁ గావించితి నిన్ని సైన్యంబులు నొక్కలావున వర్తించు చందంబు సూచి కొనవలయు నని చెప్పుచుఁ జేతులు మొగిచి యిట్లనియె.** **142**

అ : సమకట్టి = ఏర్పఱచి ; ఒక్కలావునన్ = ఒకశక్తితో (ఒకేవిధంగా)

భా : ఇలా తన మహత్త్వం వెల్లడి అయ్యేలా అక్షోహిణీనాథుల నేర్పరచి దుర్యోధనుడు భీష్ముని దగ్గరకు వారందరినీ తీసికొని వెళ్లి వినయంగా నమస్కరించి వారిని చూపించి 'వీరందరినీ మన పదకొండు అక్షోహిణులకు అధిపతులుగా చేశాను. సైన్యాలన్నీ ఒక్కత్రాటిపై నడిచే విధం నీవు చూచుకోవాలి' అని చేతులు జోడించి ఇలా అన్నాడు.

వి : దుర్యోధనుడు అవసరమైతే కాళ్లు పట్టుకొంటాడు. లేదా కసిరి కొడతాడు. అతడు కార్యవాది. బుద్ధికుశలుడు. భీష్మ సహాయం ఇప్పుడు కావాలి కనుక చేతులు జోడించి వినీతుడై పల్కుతున్నాడు. అంతేగాదు ప్రకృతంలో భీష్ముని సర్వసైన్యాధిపతిత్వం వహించమని అర్థించబోతూ కూడా అతని అభిప్రాయాలతో నిమిత్తం లేకుండా తానే అక్షోహిణులను నిర్ణయించాడు. ఆత్మాభిమానం కన్నా ఒకపాలు ఎక్కువగా ఆత్మవిశ్వాసం ఇక్కడ కన్పిస్తుంది.

ఇదే సందర్భంలో ధర్మరాజు సేనాధిపతిత్వ నిర్ణయంలో అనేకుల అభిప్రాయాలను కూడగా శ్రీకృష్ణుని అభిప్రాయాన్ని స్వీకరించిన విషయాన్ని మనం స్మరించాలి.

చ : నెఱిఁ బడి యాజి నీ మొనలు నేరవు గూడి తగం జరింప నిం
దఱమన సొక్కఁడై చనక తప్పుఁగదా బహుదేశవాసు లం
దఱొకటి సేయుచో వెరవు దప్పక చెల్లుట యెట్లు గల్గు ని
త్తెఱఁ గొక చాలు వాని బలు తీర్పున ఁ గాక పొసంగ నేర్చునే. 143

అ : నెఱిన్+ పడి = కుదురుకొని; ఆజిన్= యుద్ధంలో ; ఈ మొనలు = ఈ సేనలు; కూడి = కలసి ; తగన్ + చరింపన్ = తగురీతిగా ప్రవర్తించడం ; నేరవు = ఎరగవు ; ఇందఱ + మనసు = ఇందరి మనస్సు ; ఒక్కడై = ఒక్కటయి ; చనక = పోవక ; తప్పున్ + కదా = తప్పును గదా , బహుదేశవాసులన్ = అనేక ప్రదేశాలలో నివసించే వారిని ; ఒకటి + చేయుచోన్ = ఒక్కటిగాచేసేటప్పుడు ; వెరవు =అనుకూల్యం; తప్పక + చెల్లుట = చెడకుండా కొనసాగడం, ఎట్లు + కల్గును =ఎట్లా సంభవిస్తుంది. ; ఈ + తెఱఁగు = ఈ పద్ధతి ; ఒకచాలు వాని = ఒక సమర్థుని యొక్క ; బలు + తీర్పునన్ + కాక = గొప్పదైన దిద్దుబాటుచేతప్ప; పొసంగన్ + నేర్చునే =కలుగుతుందా.

భా : ఈ సేనలన్నీ స్తిమితపడి యుద్ధరంగంలో కలసి మెలసి మెలగడం ఎరగవు. ఇందరి మనస్సులు ఒక్కటిగా ఉండవుకదా ? రకరకాల దేశాలనుండి వచ్చిన వీరందరినీ ఒక్కటిగా చేసేటప్పుడు అనుకూల్యం చెడకుండా నిర్వహించడం కష్ట సాధనం. అది నీవంటి ఒక సమర్థుడు పూనుకొని సరిదిద్దితేనే కుదురుతుంది.

ఆ : అమరసేనలును దమంతన వర్తింప
నేర కునికి నా కుమారు మొగము
గా నొనర్ప వలసెఁ గాదె సమస్త సే
నలను నీవ యరసి నడప వలయు. 144

అ : అమర + సేనలును = దేవసైన్యాలు కూడా ; తమంతన = తమంతటతాము; వర్తింపన్ + నేరక + ఉనికిన్ = ప్రవర్తింపలేక పోవడం చేతనే ; ఆ + కుమారు + మొగముగా= ఆ కుమారస్వామిని ముఖ్యుడుగా ; ఒనర్పన్ + వలసెన్ + కాదె = చేయవలసి వచ్చినది కాదా; సమస్త సేనలను = సైన్యము లన్నిటిని; నీవు + అ = నీవే ; అరసి = విచారించి ; నడపన్ + వలయున్ = నడుపవలెను.

భా : దేవసైన్యాలు కూడా తమంతట తాముగా నడుచుకొనలేక పోవడం చేత్లనే ఆకుమారస్వామిని ముఖ్యునిగా చేయవలసివచ్చిందికదా! కనుక సేన లన్నిటిని నీవు కనిపెట్టి తగురీతిని నడపాలి.

వి : కుమారస్వామి - దేవతాసర్వసేనాధిపతి సామ్యం తెచ్చి భీష్ముని సంతోషపెట్టే ప్రయత్నం చేస్తున్నాడు రారాజు.

క : తారలకుం జంద్రుని గతి (
గౌరవులకు మేటి వీవ కావున నీ వీ
భారంబు పూని మము (గడ
చేరుప (దగు నెమ్మెయిం బ్రసిద్ధచరిత్రా ! 145

అ : ప్రసిద్ధ చరిత్రా = విఖ్యాతమైన శీలము గలవాడా ఓ పితామహా; తారలకున్ = నక్షత్రములకు ; చంద్రునిగతిన్ = చంద్రునివలె ; కౌరవులకున్ మేటివి = శ్రేష్ఠుడవు ; ఈవు = నీవే; కావునన్ = కనుక ; నీవు ; ఈ + భారంబు + ఈ సర్వ సైన్యాధిపత్య భారమును ; పూని= వహించి; మమున్; ఏ + మెయిన్ = ఏ విధముచేనైనను; కడచేరుపన్ + తగున్ = దరిచేర్పనగును.

భా : నక్షత్రములలో చంద్రునిలా నీవు కురుకులంలో శ్రేష్ఠుడవు కనుక మహాత్మా! ఈ భారం వహించి ఏలాగైనా నీవు మమ్ము దరిచేర్చాలి.

వి : నీవు మమ్ము ఈ కష్టం నుంచి కడతేర్చాలి. నీవు కురు వీరులలో తారలలో చంద్రునివంటి వాడవని భీష్ముని స్తుతిస్తున్నాడు. ప్రసిద్ధ చరిత్రా ! అని ఇక్కడ భీష్ముని సంబోధించటం అందంగా ఉంది. భీష్ముని చరిత్ర అంతా ఆనందాభివృద్ధికై త్యాగాలతోను, ఆ వంశస్థులు చేస్తున్న పొరపాట్లను సరిదిద్దడంతోను, గడిచిపోయింది. ఆవంశోన్నతి కోసం రాజాజ్ఞను పాటించడం కోసం ఎంతటిపనికైనా (ఇష్టంలేకపోయినా) భీష్ముడు సిద్ధమే. అతని ప్రసిద్ధ చరిత్ర ఇన్ని కోణాలలో స్ఫుటమవుతుంది. కాబట్టి ప్రకృతం కూడా సుయోధనుని ప్రవర్తనను తానెలా భావించినా సేనాధిపతిత్వాన్ని స్వీకరించక తప్పదన్న సూచన సంబోధనలో ధ్వనిస్తుంది.

తే : సర్వసేనాధిపత్యంబు నిర్వహింప
నీవు దక్క నిం దొక్కరు నీవ యరసి
పంపుమా కల(డేని రక్షింపు మమ్ము(
బూని పట్టంబు దాల్పుము పొడిచి గెలుము. 146

అ : నీవు + తక్క = నీవుతప్ప ; సర్వసేనాధిపత్యంబున్ = సర్వసైన్యాధిపత్యమును; నిర్వహింపన్ = నెఱపుటకు ; ఇందు = ఈ కౌరవవీరులలో ; కలడేని = ఉన్నచో ; నీవ = నీవే; అరసి = పరిశీలించి ; పంపుమా = ఆజ్ఞాపించు ; మమ్మున్ = మమ్ములను ; రక్షింపు; పూని = ఉద్యమించి ; పట్టంబు + తాల్పుము = సేనాధిపత్య పట్టమును వహింపుము ; పొడిచి గెలుము = యుద్ధముచేసి గెలుపుము.

భా : నీవు తప్ప ఈ కౌరవులలో సర్వ సైన్యాధిపత్యమును నిర్వహింపడానికి వేరొక డున్నచో ఆలోచించి పంపు. మమ్ములను రక్షింపు. సైన్యాధిపత్య పట్టభద్రుడవు కమ్ము. యుద్ధమొనర్చి విజయాన్ని చేకూర్చు.

వి : "మరొకరుంటే నీవే నిర్ణయించు. లేకుంటే సైన్యాధిపతి భారాన్ని స్వీకరించు." అనడంలో భీష్ముడిపై గౌరవంకన్నా తనపనిపై లక్ష్యమే ఎక్కువగా కన్పిస్తుంది.

ధర్మరాజు సుయోధను(డు ఇద్దరు సేనానాయకులను నిర్ణయించుకొన్నారు. కాని ఇద్దరి వ్యూహాల్లో లేడా కన్పిస్తుంది. ధర్మరాజు తన సేనానాయకుణ్ణి నిర్ణయించే ముందు ఎదిరి బలాన్ని ప్రధానంగా అంచనా వేశాడు. సుయోధనుడు ఈ నిర్ణయం చేసేముందు తన

బలాన్ని గూర్చి ఆలోచించాడేగాని శత్రుబలాన్ని పరిగణించలేదు. రాజనీతిలో ఇటువంటి చిన్నలోటు పాట్లకు కూడా మూల్యం చెల్లించక తప్పదు.

వ : అనిన విని గాంగేయుండు గాంధారేయున కిట్లనియె. 147

భా : అనగావిని భీష్ముడు దుర్యోధనునితో ఇట్లు పలికాడు.

ఆ : మీరుఁ బాండుసుతులు నారయ నా కొక్క
రూప; కార్య మున్న రూపు వలుక
వలయుఁ; గయ్యమైన వత్తు మీలోన నా
యునికి చందమునకు నుచిత మిదియ. 148

అ : మీరున్ ; పాండుసుతులున్ = పాండవులును ; అరయన్ = పరికింపగా ; నాకున్ = నాకు ; ఒక్కరూప = సమానమే ; కార్యము = వ్యవహారము యొక్క ; ఉన్నరూపు = నిజస్థితి ; పలుకవలయున్ = వెల్లడింపవలయు ; కయ్యము + ఐనన్ = యుద్ధమైనచోన్ వత్తున్ = వచ్చెదను ; మీలోనన్ = మీ పక్షమున; నాయునికి + చందమునకున్ = నా ఉన్నరీతికి; ఇదియ = ఇదియే ; ఉచితము = తగినది.

భా : మీరు, పాండవులు నాకు సమానమే. వ్యవహార మున్నది యున్నట్లు చెప్పాలి. యుద్ధం తటస్థిస్తే నేను వస్తాను. మీలో ఒక్కణ్ణిగా నే నున్నందుకు యుద్ధానికి రావడమే ఉచితము.

వి : "కార్యమున్న రూపు పల్కాలి" అన్న ఈ మాట భారతంలో కృష్ణ, భీష్మ ద్రోణవిదురుల నోట తరచుగా వినిపిస్తూ ఉంటుంది. వారికి సత్య వాక్యము మీద ఉన్న శ్రద్ధా నిష్ఠ లటువంటివి. కాబట్టి భీష్ముడు వర్తమాన పరిస్థితి ఎలా ఉన్నా విషయాన్ని ఉన్న దున్నట్లుగా పల్కడానికే నిశ్చయించాడు.

క : సేనాధిపత్యమును దగఁ
బూనెద; నను మార్కొనంగఁ బురుషుల నుర్విం
గానఁ; గిరీటికి నొక్కని
కేనోర్వ నతండు శరము లెక్కు డెఱుంగున్. 149

అ : సేనా + అధిపత్యమును = సేనకు అధిపత్యమును ; తగన్ + పూనెదన్ = సముచితముగ వహింతును ;ననున్ = నన్ను ; మార్కొనంగన్ = ఎదుర్కొనగా నైన ; పురుషులన్= శూర పురుషులను ; ఉర్విన్ = ఈ భూమిపై ; కానన్ = చూడను ; కిరీటికిన్ + ఒక్కనికిన్ = ఒక్క అర్జునునకు మాత్రము; ఏన్ = నేను; ఓర్వన్ = చాలను; అతండు; శరములు = అస్త్రములు ; ఎక్కుడు + ఎఱుంగున్ = ఎక్కువగా నెఱుగును.

భా : సేనాధిపత్యబాధ్యతలను స్వీకరిస్తాను. నన్నెదిరించగల పురుషుడు ఈ భూమిపై లేడు. నేనొక్క అర్జునునకు మాత్రము సరిపోను. అతడు నా కంటే అస్త్ర విద్య నెక్కువగా ఎఱిగినవాడు.

వి : ఉత్తమపరాక్రమవంతులు పరుల పరాక్రమాన్ని కూడా గుర్తించి గౌరవిస్తారు. ధర్మజుని కొలువులో భీష్మ ప్రస్తావన, భీష్మునినోట అర్జునుని ప్రస్తావన అందుకే వస్తున్నాయి.

క : **"పెఱవారి నెల్లఁ దరమిడి**
నఱకుదుఁ; బాండుక్షితీశ నందనులను రూ
పఱ సేయం జేయాడదు;
దఱుమరు నామీద నత్యుదగ్రత వారున్ " **150**

అ : పెఱవారిన్ + ఎల్లన్ = ఇతరులందరినీ ; తరమిడి = మునుముపెట్టి ; నఱకుదున్ = ఖండించగలను ; పాండు -క్షితి + ఈశ - నందనులను = పాండురాజకుమారులను; రూపఱ + చేయన్ = నాశనం చేయుటకు; చేయాడదు = నా చేయిపోదు ; వారున్ ; నామీదన్; అతి + ఉదగ్రతన్ = మిక్కిలి క్రూరంగా; తఱమరు = పైబడరు.

భా : ఇతరుల నెందరినైనా మునుముపెట్టి నరుకుతాను. పాండురాజు కుమారులను నాశనం చేయటానికి మాత్రం నాకు చేయాడదు. వారు కూడా క్రూరంగా నామీది కురకరు.

వి : పాండవుల వినాశానికై సుయోధనుడు సిద్ధపడి భీష్ముని సహకారాన్ని కోరుతున్నాడు. అయితే పాండవులపై తాను విజృంభించలే నన్న యథార్థాన్ని ఆ సుయోధనుడితోనే చెప్పగలిగిన భీష్ముని విశుద్ధ ప్రవర్తన ఆదర్శంగా స్వీకరించదగినది.

వ : **అప్పటికిఁ దగిన భంగి యయ్యెడు నది యట్లుండ నిమ్మని పలికి మఱియు నిట్లనియె.** **151**

భా : "అప్పటికి తగిన రీతిగా అవుతుందిలే, అది అటుండనీ" అని మరలా ఇలా అంటున్నాడు (భీష్ముడు).

ఆ : **మున్ను కర్ణు నొండె నన్నొండెఁ గయ్యంబు**
సేయఁ బనుపు; మిట్లు సేయువాఁడ
వైనఁ గాని సకల సేనాధి పత్యంబుఁ
బూన నేరఁ జుమ్ము భూపవర్య! **152**

అ : భూపవర్య = రాజా !; మున్ను = ముందు ; కర్ణున్ + ఒండె = కర్ణునికానీ; నన్నున్ + ఒండె = నన్ను కానీ ; కయ్యంబు + చేయన్ = యుద్ధము చేయటానికి ; పనుపుము = పంపుము ; ఇట్లు + చేయువాఁడవు + ఐనన్ + కాని = ఈ రీతిగా చేయగలిగిన కానీ; సకల సేనాధిపత్యంబు = సమస్త సైన్యాధ్యక్షతను; పూన నేరన్ + చుమ్ము = వహింపలేను సుమా !

భా : రాజా ! ముందు కర్ణునో, నన్నో యుద్ధానికి పంపించు. నువ్వు ఇలా చేస్తేనే కానీ నేను సేనాధిపత్యాన్ని వహించలేను.

వి : "నీకు నా లావుతోడ్పాటు లేక యుండవలయు, నీ తెగునంతకు గలననిలువన్' అని కర్ణుడు భీష్ముని తిరస్కరించి పలికి ఉన్నాడు (2-289). అందుచేత ఒక వేళ దుర్యోధనుని బలవంతం చేత కర్ణుడు రణరంగానికి వచ్చినా తాను అంగీకరించ నని భీష్ముడు కచ్చితంగా చెపుతున్నాడు.

వివేకుల సన్నిధిలో అంతఃకలహాలకు అవకాశ ముండకూడదు. అవి శత్రుకూటానికే లాభదాయకాలవుతాయి. శత్రు విజయానికై చతుర్విధోపాయాలలో భేదోపాయం ఒకటి- విభజించి పాలించటం. అది అంతఃకలహాలరూపంగా అప్రయత్నంగా సిద్ధించితే శత్రువులకు అంతకన్న శుభసూచన ఏముంటుంది. పరస్పర విద్వేషాలతో భీష్మ కర్ణులు పాండవులకే సహకరించారు గదా!

వ : అనినం గర్ణుండు కౌరవపతితో నిట్లనియె. 153

భా: అపుడు కర్ణుడు దుర్యోధనునితో ఇలా అన్నాడు.

క : ఇప్పుడు గ్రొత్తగ దీనిం
జెప్పంగా నేల? మున్న చెప్పితిఁ గాదే!
యెప్పుడు భీష్ముఁడు పడు నే
నప్పు డనికి వచ్చువాఁడ నని సభలోనన్. 154

అ : ఇప్పుడు ; క్రొత్తగన్ = నూతనముగా (మరలా); దీనిన్ ; చెప్పంగాన్ + ఏల ? తెలుపవలసిన అవసర మేముంది ; ఎప్పుడు ; భీష్ముఁడు; పడును = (రణరంగమున) కూలునో ; అప్పుడు ; ఏను = నేను ; అనికిన్ = యుద్ధానికి ; వచ్చువాఁడను + అని = రాగలవాడనని ; సభలోనే = కొలువులోనే ; చెప్పితిన్ + కాదే = పలుకలేదా ?

భా : ఇప్పుడు క్రొత్తగా ఈ విషయాన్ని చెప్పవలసిన అవసరం లేదు. భీష్ముడు రణరంగంలో కూలినప్పుడే నేను యుద్ధానికి వస్తానని ఇంతకుముందే చెప్పాను గదా !

వి: ఇక్కడ ప్రత్యేకించి గమనించవలసిన అంశ మొకటుంది. భీష్ముడు కురువంశానికి పెద్ద. సుయోధనుడు ఎన్ని మార్లు భీష్ముని పెద్దరికాన్ని లెక్కచేయకపోయినా వారి మధ్యనున్న బాంధవ్యం వారిని కలుపుతోంది. గతాన్ని మరచి సుయోధనుడు భీష్ముని సేనాధ్యక్షునిగా కోరటం భీష్ముడు అంగీకరించటం ఆ విధంగా జరిగినవే. భీష్మునికి సుయోధనునిపైగల ప్రేమ కర్ణుడిపై ఉండవలసిన అవసరం లేదు. అలాగే కర్ణుడికి సుయోధనునిపై ఉన్న భక్తిభావం, విశ్వాసం భీష్మునిపై నుండ నవసరం లేదు. అయితే భీష్మునివలె సుయోధన శ్రేయస్సు కోరే కర్ణుడు కూడా ఈ సమయంలోనైనా గతాన్ని విస్మరించి భీష్ముని పెద్దరికాన్ని గౌరవించే ప్రయత్నం చేసుంటే బావుండేది. లోతైన భావానికి తగిన ఆచరణ లేని కర్ణుని సహకారం సుయోధనుణ్ణి బలితీసుకుంది.

ఆ : అనిన నట్లకాక యని సర్వసేనాధి
పత్య భార పట్టబంధమునకు
నియ్యకొనియె భీష్ముఁ; డయ్యగ్గలికఁ గొని
యాడె విభుఁడు ప్రముదితాత్ముఁ డగుచు. 155

అ : అనినన్ ; అట్లకాక+అని=అట్లే అగుగాకయని; భీష్ముండు ; సర్వసేనాధిపత్యభార పట్టబంధమునకున్ = సమస్త సేనలకు అధిపతి అగు భారమునకు పట్టము కట్టుకొనుటకు ; ఇయ్యకొనియెన్=అంగీకరించెను; ఆ+ అగ్గలికన్ = ఆ పూనికను; విభుఁడు = ప్రభువు ;

ప్రముదిత= ఆత్ముఁడు + అగుచున్ = సంతోషించిన మనస్సు కలవాడగుచు; కొనియాడెన్ = ప్రస్తుతించెను.

భా : అనగానే అలాగే కానీ అని భీష్ముడు పలికి సర్వసైన్యాధ్యక్ష భారానికి అంగీకరించాడు. భీష్ముని ఆ పూనికను సంతోషంతో దుర్యోధనుడు అభినందించాడు.

వి : భీష్మద్రోణాదుల శక్తియుక్తులపై దుర్యోధనుడికి అంతటి నమ్మకం. లేకపోతే కర్ణునీ, భీష్మునీ బ్రతిమాలి ఇద్దరినీ యుద్ధానికి ఒప్పించే ప్రయత్నం చేసి ఉండేవాడు.

క : భేరీ మృదంగ శంఖ మ
హారవములు సెలఁగఁ జేయుఁ" డని పనిచి మహో
దార పతాకాద్యుత్సవ
గౌరవముల నడపె నెల్ల కడలం బురిలోన్. 156

అ : భేరీ-మృదంగ - శంఖ - మహా -రవములు = భేరులయొక్కయు, మృదంగముల యొక్కయు గొప్పధ్వనులు ; చెలఁగన్ + చేయుఁడు = మ్రోయింపుడు ; అని ; పనిచి = ఆదేశించి ; మహా .... గౌరవములు ; మహా + ఉదార = మిక్కిలి విశేషంగా ; పతాకా + ఆది = జెండాల నెగురవేయుట మొదలైన, ఉత్సవ గౌరవములు = జైత్రయాత్రా మహోత్సవము నందలి గొప్పతనమును ; నడపెన్ = సాగించెను.

భా : భేరీలు, మృదంగాలు వాయింప జేయండి. శంఖాలు పూరించండి అని ఆజ్ఞాపించి నగరంలో అంతటా పతాకాల నెగరవేయడం వంటి జైత్రయాత్రా మహోత్సవ కార్యక్రమాలు చేయించాడు.

వ : అట్లు పట్టణాలంకారంబు సంఘటించి రత్నకాంచన కలధౌత మయంబులగు కలశంబులఁ దీర్థజలంబులు దెప్పించి మణిప్రకరంబునఁ గుసుమనికరంబున మంగళతరుత్వక్ప ల్లవ ప్రచయంబున మహౌషధి నిచయంబున విహితమంత్రంబుల నుచితతంత్రంబుల ఋత్విక్పురోహితసహితుండై తత్సంస్కార ప్రకారం బాచరించి. 157

అ : సంఘటించి = కూర్చి ; కలధౌత = వెండి ; తరుత్వక్-పల్లవ- ప్రచయంబునన్= చెట్లబెరడు, చిగుళ్లు సమూహముతో ; మహా + ఓషధి ప్రచయంబునన్ = గొప్ప గొప్ప ఓషధుల సమూహంతో -

భా : అలా ఊరంతా అలంకరింపజేసి రత్నాలు, బంగారం, వెండితో తయారైన కలశాలతో పుణ్యతీర్థాల నుండి తెప్పించిన నీటితోనూ, మణులతోనూ పుష్పాలతోనూ, శుభప్రదాలైన చెట్ల బెరళ్ళూ, చిగుళ్ళతోనూ, ఓషధులతోనూ, మంత్ర తంత్ర పూర్వకంగా ఋత్విక్ పురోహితులద్వారా భీష్ముడికి సర్వసైన్యాధిపత్యాభిషేకం జరిపించాడు దుర్యోధనుడు.

క : గురుఁడును గృపుండు లోనగు
గురు లనుమోదింప బాహ్లికుండు మొదలుగాఁ
గురుజాతి యెలర్పఁగ న
న్నరపతి భీష్మాభిషేచనం బొనరించెన్. 158

అ : గురుఁడును = ద్రోణాచార్యుడూ; కృపుండున్ = కృపాచార్యుడు; లోనగు = మొదలైన; గురులు= పెద్దలు; అనుమోదింపన్= అంగీకరించగా ; బాహ్లికుండు మొదలుగాన్ ; కురుజాతి = కౌరవజాతీయులు ; ఎలర్పఁగన్ = సంతోషించగా; ఆ+నరపతి = ఆ దుర్యోధనుడు; భీష్మ + అభిషేచనంబు = భీష్మునకు పట్టాభిషేకం ; ఒనరించెన్ = చేసెను.

భా : ద్రోణుడు, కృపాచార్యుడు మొదలయిన ఆచార్యవర్యుల ఆమోదంతో బాహ్లికాది కురువృద్ధులు ఆనందింపగా కురురాజు భీష్మునికి సర్వసైన్యాధిపత్యాభిషేకం చేశాడు.

తే : ఇవ్విధంబున నభిషేక మెలమిఁ జేసి
పరమభక్తి నక్షోహిణీపతులఁ జూపి
వీరికిని సైన్యములకును మీర యొడయ
లనుచుఁ బట్టంబు గట్టె శంతనుతనూజు. 159

అ . ఈ + విధంబునన్ = ఈ విధముగా ; అభిషేకము = సేనాధిపత్య అభిషేకము; ఎలమిన్ + చేసి = ప్రీతితో జరిపించి; పరమ భక్తిన్ ; అక్షోహిణీపతులన్ + చూపి = అక్షోహిణుల కధిపతులైన పదకొండు మందిని చూపించి; వీరికిని; సైన్యములకున్ = ఆయా సేనలకును; మీరు + అ = మీరే; ఒడయలు + అనుచున్ = ప్రభువులని పల్కుచు; శంతను తనూజున్ = భీష్మునకు; పట్టంబు + కట్టెన్ = పట్టాభిషేకం చేసెను.

భా . ఇలా యథాశాస్త్రంగా అభిషేకం జరిపించి భక్తితో అక్షోహిణీపతులను చూపించి వీరికి వీరి అధీనంలోని సర్వసేనలకును మీరే అధిపతులని పలుకుతూ భీష్ముని సర్వసైన్యాధిపతిగా చేశాడు.

క. అత్తఱిఁ బాషాణంబులు
నెత్తురు నెమ్ములను గురిసె నిష్ఠురనినదా
యత్తమయి నభము; పిడుగుల
మొత్తంబులు వడియె నగరమున నెల్లెడలన్. 160

అ. ఆ+ తఱిన్ = ఆ సమయంలో ; నగరమునన్ = హస్తినలో ; ఎల్ల + ఎడలన్ = అన్ని తావులలో ; నభము = ఆకాశం; పాషాణంబులు = రాళ్ళు ; నెత్తురున్ = రక్తమును; ఎమ్ములను = ఎముకలను; కురిసెన్ = వర్షించెను; నిష్ఠుర - నినద - ఆయత్తము + అయి = కఠినమైన ధ్వనులు కలవై ; పిడుగుల మొత్తంబులు = పిడుగుల సమూహాలు ; పడియెన్

భా. *ఆ సమయంలో హస్తినాపుర మంతటా ఆకాశంనుండి రాళ్ళూ, నెత్తురూ, ఎముకలూ పడసాగాయి. అతి పరుషధ్వనులతో పిడుగులు పడ్డాయి.*

వి . అశుభసూచకాలైన ఇటువంటి ఉత్పాతాలు సంభవించినట్లు వర్ణించటం భారతంలో అనేక సందర్భాల్లో కనిపిస్తుంది.

క . **దానికి జను లుత్సాహవి**
హీనతఁ బొందంగఁ గౌరవేంద్రుఁడు నానా
దానాదు లయిన శాంతివి
ధానము లొనరించి యాన తత్పరమతియై. 161

అ. దానికిన్ = ఆ అశుభసూచనలకు ; జనులు = ప్రజలు; ఉత్సాహవిహీనతన్ = నిరుత్సాహాన్ని; పొందగన్ = పొందగా ; యాన -తత్పర -మతి + ఐ = ప్రయాణమందు లగ్నమైన మతికలవాడై ; కౌరవేంద్రుడు = సుయోధనుడు; నానా దాన + ఆదులు + అయిన= అనేకదానాలు మొదలయిన ; శాంతివిధానములు = అశుభశాంతి పద్ధతులను ; ఒనరించెన్ = చేసెను.

భా . *ఆ అశుభ శకునాలను చూచి ప్రజలు నిరుత్సాహపడగా సుయోధనుడు వానికి తగిన శాంతి ప్రక్రియలను జరిపించాడు.*

క . **తల్లియుఁ దండ్రియు వెఱఁగునఁ**
బుల్లవడన్ వారికడకుఁ బోయి తడయఁగా
నొల్లక పయనపు వీడ్కో
లెల్లను దనయిచ్చ నడపి యేడ్తెఱ వెడలెన్. 162

అ . తల్లియున్ + తండ్రియున్ = గాంధారీధృతరాష్ట్రులు; వెఱఁగునన్ = ఆశ్చర్యంతో; పుల్లవడన్ = నిశ్చేష్టులు కాగా ; వారి కడకున్ + పోయి = వారి దగ్గరకు పోయి; తడయఁగాన్ + ఒల్లక = అలసింప నిష్టపడక; పయనము + వీడ్కోలు + ఎల్లను = సాగనంపే కార్యక్రమమంతా; తన + ఇచ్చన్ + నడపి = యథేచ్ఛగా జరిపించి ; ఏడ్తెఱన్ + వెడలెన్ = వేగంగా వెళ్ళాడు.

భా . *ఆ అశుభసూచనలన్నీ తెలిసి తల్లీ తండ్రీ నిశ్చేష్టులైనా, వారి దగ్గరకు వెళ్ళి ప్రస్తావించి ఆలస్యం చేయటం సుయోధనున కిష్టం లేకపోయింది. కాబట్టి వెళ్ళకుండానే ప్రయాణ కార్యక్రమాలన్నీ తన యిష్టప్రకారం నడిపించాడు.*

వి . సర్వసైన్యాధిపతిని నియమించగానే ఉత్పాతాలు కలగటం భీతిచెందవలసిన విషయం. ఉత్పాతాలకు శాంతి క్రియలు నిర్దిష్టమయి ఉండనే ఉన్నాయి. అవి జరిపించిన తర్వాత ఆందోళన అవసరం లేదు. కానీ పాండవుల బలపరాక్రమాలూ, ధర్మవర్తనమూ తలంచుకొని గాంధారీ, ధృతరాష్ట్రులు ఆందోళన పడ్డారు. అయితే సుయోధనుడు స్థిరచిత్తుడు కాబట్టి ఇవేవీ లెక్కించకుండా ముందుకు సాగాడు.

తే । **వెడలి తమ్ములుఁ దగువారు వివిధ భృత్య**
గణముఁ దానును నేల గ్రక్కదల గదలి
రాజరాజు గాంగేయుఁ బురస్కరించు
కొని సముద్ధతి నడచె దిక్కులు వడంక. 163

అ. వెడలి=వెళ్ళి; తమ్ములున్= తన తమ్ములు ; తగువారున్ = అర్హులైన ఇతరులూ; వివిధ భృత్యగణమున్ = రకరకాల సేవక జనసమూహమూ, తానును; నేల ; క్రక్కదలన్ + కదిలి = కంపించునట్లు బయలుదేరి ; గాంగేయున్ = భీష్ముని ; పురస్కరించుకొని = ముందుంచుకొని; రాజరాజు ; సముద్ధతిన్ = అహంకారముతో ; దిక్కులు ; వడంకన్ = వణకుచుండగా ; నడిచెన్= నడచాడు.

భా. సుయోధనుడు ఆ రీతిగా తన తమ్ములు, ఇతర వీరులూ, సేవకులూ వెంటరాగా భీష్ముని ముందుంచుకొని నేలకంపించి పోయేటట్లుగా, దిక్కులు వణకు నట్లు ఎంతో అహంభావంతో యుద్ధరంగానికి బయలుదేరాడు.

వి. నేల కంపించటం, దిక్కులు వణకటం సేనల సంరంభానికి సూచనలు.

వ . నడచి, కురుక్షేత్రంబు దఱియం జొచ్చి యందొక్క రమణీయ ప్రదేశంబు విడిదలగా నిరూపించి , నిలిచి, భానుసూనుండునుం దానును మెలంగి, యెల్ల వారిని విడియించి, నడుమ నిజనివాసంబు గావించినఁ గౌరవేశ్వరు స్కంధావారంబు వారణపురంబున నెవ్వ రెయ్యెడ వసియింతు రాచందంబున నందంబై యొప్పె ; నిట్లు రెండు వీళ్ళును సన్నద్ధంబులైన సమయంబున. 164

అ . తఱియన్ + చొచ్చి = సమీపించి ; విడిదల = సేనవిడిది చేసే శిబిరం; భానుసూనుండు = కర్ణుడు.

భా . అలా బయలుదేరి కురుక్షేత్ర సమీపంలో ఒక అందమైన తావును విడిదిగా నిశ్చయించాడు సుయోధనుడు. తానూ, కర్ణుడూ కలసి అందరినీ ఆయా తావుల్లో విడిది చేయించాడు. మధ్యలో తనవసతి నేర్పరచుకొన్నాడు. ఆ దుర్యోధనుని సేన హస్తినలో వలె ఎవరెక్కడెక్క డుండాలో అలా భాసిల్లింది. ఇలా ఇరుసేనలూ యుద్ధానికి సిద్ధపడి ఉండగా (తర్వాతి పద్యంతో అన్వయం)

ఉ . సంధికి నేఁగి కార్యము పొసంగక కృష్ణుఁడు రాకయున్ సుహృ
ద్బాంధవ సంఘ యుక్తముగఁ బాండవ కౌరవ వీరు లష్టది
క్సింధుర కంధరంబు లడఁగించు బలంబుల పెల్లుతోడ గ
ర్వాంధత నాజి కెత్తుటయు నాబలభద్రుఁ డెఱింగి యార్తుఁడై. 165

అ . సంధికిన్ + ఏఁగి = రాయబారానికి వెళ్ళి (సంధిచేయటానికి) ; కార్యము పొసంగక = రాజీ కుదరక ; కృష్ణుడు; రాకయున్ = తిరిగి వచ్చుటయు ; సుహృత్ - బాంధవ - సంఘ - యుక్తముగన్ = మిత్రులయొక్కయు , బంధువుల యొక్కయుసమూహాలతో కూడా ; పాండవ -కౌరవ- వీరులు ; అష్ట ....కంధరంబులు = అష్ట = ఎనిమిదైన, దిక్సింధుర = దిగ్గజముల యొక్క ; కంధరంబులు = తలలను ; అడఁగించు = లొంగదీసెడి; బలంబుల= సేనలయొక్క; పెల్లుతోడన్ = ఆధిక్యముతో, గర్వ + అంధతన్ = పొగరుతో కలిగిన గ్రుడ్డితనముతో; ఆజికిన్ + ఎత్తుటయున్ = యుద్ధానికి దండెత్తటమూ; ఎఱింగి = తెలిసికొని; బలభద్రుఁడు = బలరాముడు; ఆర్తుఁడై = కలతపడి (తర్వాతి వచనంతో అన్వయం)

భా. రాయబారానికి వెళ్ళి వ్యవహారం పొసగనందువల్ల కృష్ణుడు తిరిగి రావటమూ, బంధుమిత్రుల సమూహాలతో కూడి కౌరవపాండవ వీరులు దిగ్గజాల తలలను కూడా అణచివేయగల సేనలతో అహంకరించి దండయాత్రకు పూనటమూ తెలిసికొని బలరాముడు ఖిన్నుడైనాడు.

వి. దిగ్గజాలు బలానికి ప్రతీకలు, అవికూడా తలవంచే పరిస్థితి కలిపిస్తోంది కురువంశసేన. కృష్ణుడు ఈవిషయంలో ఎంత సన్నిహితుడో బలరాముడంత నిర్లిప్తుడు.

-: బలరాముఁడు పాండవుల వీడ్కొని తీర్థయాత్ర పోవుట :-
(సం 5-154-15)

వ. కతిపయపరివారంబు పరివేష్టింప రయంబునంజను దెంచి, సముచిత ప్రకారంబున ధర్మనందనుం బేరోలగంబునం గని, సంభ్రమాలింగనాసనార్ఘ్య పాద్యంబుల నతని చేత సంభావితుండయి, దామోదర భీమార్జున నకుల సహదేవుల యభివాదనంబు లాదరించి, పాంచాల విరాట ప్రముఖులగు తగువారల వినయంబుల నభినందించి, యా దొరలతోఁ దత్కాల యోగ్యమిత సంభాషణంబులు సేసి, యనంతరంబ వారల కిట్లనియె. 166

అ. కతిపయ = కొంతమంది, పరివారంబులు = సేవకులు ; రయంబునన్ = వేగంగా ; సముచిత-ప్రకారంబునన్ = తగిన రీతిగా; సంభావితుండు + అయి = గౌరవింపబడి; అభివాదనంబులు = నమస్కారములు ; దొరలు = రాజులు

భా. బలరాముడు కొంతమంది పరిజనులతో కలిసి వచ్చి కొలువుదీరియున్న ధర్మరాజును సందర్శించాడు, ధర్మజుడు బలరాముని కౌగిలించి ఆసనమూ, అర్ఘ్యమూ, పాద్యమూ అందజేశాడు. కృష్ణుడు, భీముడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు నమస్కరింపగా బలరాముడు స్వీకరించాడు. పాంచాల విరాటాదిరాజుల వినయ ప్రవృత్తిని అభినందించాడు. ఆయా రాజులతో ఆ సమయానికి తగినట్లుగా కొద్దిమాటలు మాటాడాడు. ఆ తరువాత వారితో ఇలా అంటున్నాడు.

వి. బలరాముడు పాండవులకు బంధువు. భీమసేనుడికి గదాయుద్ధం నేర్పిన గురువుకూడా. తన శిష్యులైన భీమదుర్యోధనులు పరస్పరం ఢీకొనబోవుచుండగా తనగుండె కలత పడగా శాంతింపజేయటానికి వచ్చాడు బలరాముడు.

క. " కౌరవ పాండవు లెంతయుఁ
గ్రూరత వాటించి బంధుకోటికి నిఖిలో
ర్వీరమణులకుం జేటుగఁ
బోరికిఁ దెగి రిట్టి ఘోరపుంబని యగునే! " 167

అ. కౌరవ పాండవులు = కురుపాండవులు ; ఎంతయున్ = మిక్కిలి; క్రూరతన్ + పాటించి = క్రౌర్యాన్నిపూని; బంధుకోటికిన్ = బంధుసమూహానికీ; నిఖిల - ఉర్వీరమణులకున్ = సర్వరాజులకును ; చేటుగన్ = వినాశనకరముగ ;పోరికిన్ = యుద్ధానికి; తెగిరి = సాహసించారు; ఇట్టి = ఇటువంటి ; ఘోరపున్ + పని = దారుణ కృత్యము ; అగును + ఏ = తగునా !

భా . *కౌరవపాండవులు మిక్కిలి క్రూరులై ఇలా బంధువులకూ, సర్వరాజలోకానికీ చేటు కలిగేటట్టు యుద్ధానికి తెగించారు. ఇంతకన్న దారుణమైనది మరొకటి ఉందా ?*

వి. బలరాముడు కొంచెం ఆవేశపరుడేకానీ బోళాబోళీ. చాలా నిర్లిప్తుడు. కౌరవ పాండవులకు సంబంధించిన వ్యవహారాల్లో ప్రత్యేకించి ఏ పక్షమునూ వహించకుండా, అసలు ఎప్పుడూ నిశితంగా ఆలోచించకుండా తటస్థంగా ఉన్నవాడు, ఇప్పుడు తన ఆందోళనను వ్యక్తం చేసి పోయేందుకు వచ్చాడు.

తే ॥ " ఇట్టి దానికి నోర్వక యెన్నఁ డేనిఁ
గృష్ణతోడనేఁ జెప్పితిఁ గినిసి యిరు దె
అంగు వారికిఁ దగఁ జెప్పి సంగతంబు
సేయు మని యెంత సెప్పినఁ జేయఁడయ్యెఁ" 168

అ. ఇట్టిదానికిన్ = ఇటువంటి యుద్ధానికి; ఓర్వక = సహించలేక; ఎన్నఁడు + ఏని = ఏనాడో ; కినిసి = కోపించి ; ఇరు + తెఱంగులవారికిన్ = రెండు పక్షాల వారికీ ; తగన్ = తగురీతిగా ; చెప్పి = బోధించి (తగన్ + చెప్పి = నచ్చజెప్పి); సంగతంబు + చేయుము + అని = సఖ్యమొనర్పుమని ; ఏన్ = నేను ; కృష్ణతోడన్ ; చెప్పితిన్ ; ఎంత + చెప్పినన్= ఎంతగా చెప్పినా ; చేయఁడు + అయ్యెన్ = చేయకపోయాడు.

భా . *ఇలా ఉభయులూ యుద్ధానికి దిగటం నా కిష్టంలేక సర్దిచెప్పి సంధి చేయుమని శ్రీ కృష్ణునితో నేనేనాడో చెప్పాను . ఎంత చెప్పినా శ్రీకృష్ణుడు చేశాడుకాదు.*

వి. ఈ పద్యాన్ని బట్టి బలరాము డేపాటి బాధ్యతతో ప్రవర్తించాడో అర్థమవుతూనే ఉంది. తాను చెప్పినా కృష్ణుడు పట్టించుకొన లేదని నేరారోపణ చేయజూస్తున్నాడే కానీ యుద్ధానికి పూర్వరంగాన్ని గూర్చి ఏమీ తెలియనట్లుంది. బలరాముడు ప్రత్యక్షంగా కార్యరంగంలోకి దిగినట్లు మన కెక్కడా కనిపించదు. "నేను కోప్పడ్డాను. ఎంత చెప్పినా కృష్ణుడు విన్నాడు కాదు"వంటిమాటలు తన పెద్దరికాన్ని నిలుపుకోటానికి పనికివస్తాయే కానీ కార్యసాధనకు పనికిరావు. కౌరవపాండవు లిద్దరూ తనపై భక్తిభావం గలవారే కాబట్టి అంతకన్నా తీవ్ర ప్రయత్నం చేసి యుండవచ్చు తాను. చివరగా పెద్దమనిషిలా మాటాడుదామని వచ్చాడేకానీ మొదటినుండి ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధలేదు బలరాముడికి.

క. " పలుకుల పొం దెఱుఁగని వా
రల (బూజావాక్యముల (దిరంబై తనకుం
దెలుపం దగదే యేమని
యలుక మెయిన్ సంధి సెఱిచి హరి యేతెంచెన్ " 169

అ. పలుకుల పొందు = మాట పొందిక ; ఎఱుఁగని = తెలియనట్టి ; వారలన్ = వారిని; తిరంబు + ఐ = కుదురుకొని; పూజావాక్యములన్= ప్రియమైన మాటలద్వారా ; తనకున్= (కృష్ణునకు); తెలుపన్ + తగదు + ఏ= నచ్చచెప్పనవసరంలేదా?; ఏమి + అని = ఏమనుకొని; అలుకమెయిన్ = కోపంతో; సంధి + చెఱచి = మైత్రిని కాదని ; ఏతెంచెన్ = తిరిగి వచ్చాడు.

భా. మాటల పొందికా, మన్ననా తెలియని ఆ కౌరవులకు ఏవో అనునయ వాక్యాలతో నచ్చచెప్పి రావలసిన అవసరం శ్రీ కృష్ణుడికి లేదా ? ఏ ఉద్దేశంతో కోపపడి, సంధి కుదర్చకుండా తిరిగి వచ్చాడు?

వి. బలరాముడు శ్రీ కృష్ణుని నిందించటం అతని లోని స్వాభావికమైన ఆవేశానికి నిదర్శనం.ఒకవైపు కౌరవులు పలుకుల పొందెఱుగనివారని తానే అంటున్నాడు. మరోవైపు చేతల పొందుకూడా తెలియనివారని స్పష్టంగా ఎన్నోసార్లు నిరూపితమైంది. ఇక శ్రీ కృష్ణుని ప్రసక్తి ఎంతవరకు కార్యసాధక మవుతుంది. శ్రీ కృష్ణునిపై అవిశ్వాసం కన్న కౌరవులపై తనకున్న అభిమానాన్నే ప్రధానంగా ప్రకటిస్తున్నట్లుంది బలరాముడు.

తే ॥ వీరు వారును సంబంధ విషయబంధు
లగుట సరి గాదె హరికిఁ దానర్జునునకుఁ
బక్షపాతంబు సేయుటఁ బాండవులను
నెట్టి చోటులు గానక పట్టిక్రాలు. 170

అ. వీరున్ + వారును= కురుపాండవు లుభయులు ; సంబంధ విషయ బంధులు= సంబంధ బాంధవ్యం కలవారగుట చేత ; హరికిన్ = శ్రీ కృష్ణునకు ; సరి + కాదె = సమానమే గదా !; తానే = శ్రీకృష్ణుడు; అర్జుననకున్; పక్షపాతంబు + చేయుటన్ = విశేషముగా అభిమానించుటచే ; పాండవులనే; ఎట్టిచోటులు = ఎట్టి స్థితిగతులను ; కానక = పరికింపక ; పట్టి + క్రాలున్ = అనుసరించి వర్తించును.

భా : కురుపాండవ సంబంధ బాంధవ్యాలచేత శ్రీ కృష్ణునకు సమానమే ఐనా అర్జునునిపై పక్షపాతం గలవాడగుట చేత ఎట్టి దశలోను పాండవులను విడిచి పెట్టడు.

వి. ఈ మాట కృష్ణుడే కౌరవులకు పాండవులకు "నారయ నేనొక్కరూప యట్లగుటదగన్ వారును వీరును దమ తమ నేరుపు మెయిధరణినేలి నెగడగ చూతున్ " కురుపాండవులు నాకు ఒక్కటే. అందుకే వీరుభయులు తమతమ రాజ్యాలను పాలిస్తూ సుఖంగా ఉండాలని చూస్తాను" అని అన్నాడు. కలిసిరాని దుర్యోధనుని రణరంగమే చక్కచేయాలి. కంటె వంక పోయ్యే దీర్చాలి గదా ! కాని ఎవరు ఏమనగలరు ? ఇక అర్జునాభిమానం చేత పాండవపక్ష పాతత్వం కృష్ణునకున్నా దానిలో దోషం లేదు. ఈ పక్షపాతంతో కృష్ణుడు దుర్యోధనునకు అవకాశ మియ్యకపోలేదు. అంటే తండ్రిమాట, తల్లిమాట వినలేదు. భీష్మాదుల మాటలు వినలేదు. కృష్ణుని అభిప్రాయం సరైనది కాదని బంధింపజూచాడు. కనుక బలరాముని వచనాలు యథార్థాలు కావు. విదురుడు, కృష్ణుడు రాయబారానికి రాగా " దుష్టబుద్ధి నీచ దుర్యోధనుడు నీమాట వినునే దురభిమాన ఘనుడు ?"అన్నప్పుడు కూడా చుట్టాలమధ్య ఏదైనా ఒప్పమి కలిగినపుడు

అడ్డుపడి వారితో పోట్లాడియైనా దాన్నిఉడుపకపోతే "క్రూరకర్ముడని చెప్పుదురు. కర్మకాండ విదులు" అని పల్కి ఉభయులకు మైత్రి కూర్చాలని శ్రమించాడు. కర్ణుని జన్మరహస్యం చెప్పి యుద్ధాన్ని నివారింప దలచాడు. కాని ప్రయోజనం లేదు. అర్జునుడు శ్రీ కృష్ణుని సాయాన్ని కోరుకున్నాడు. దుర్యోధనుడు బలగాన్ని కోరుకున్నాడు.కనుక బలరాముని మాటల్లో ఆతని దుర్యోధన పక్షపాతమే ధ్వనిస్తోంది. కృష్ణుడు అర్జున పక్షపాతి అనడం పక్షపాతంతో పల్కిన మాటేగాని వాస్తవం కాదు. ఆయన ధర్మపక్షపాతి.

ఉ. కావున వీరికిన్ జయము గల్గుట నిశ్చయ; మెల్ల భంగులం
జావు నిజంబు వారికి; నసంశయమై యిటు లుండ దీని నె
ట్లే వినఁ జూడ నేర్తుఁ దగనింత ప్రవీణుల నేన చేసితిం
జూవె సుయోధనుం బవనసూనుని నొండొరుఁ జంపఁ జూతునే! 171

అ. కావునన్ = కనుక; వీరికిన్ = పాండవులకు ; జయము + కల్గుట = విజయము చేకూరుట ; నిశ్చయము = తథ్యము ; ఎల్లభంగులన్ = సర్వవిధాలచేతను ; వారికిన్ = కౌరవులకు ; చావు ; నిజంబు = తథ్యము ; అసంశయము + ఐ = శంకలేనిదై ; ఇటులున్ + ఉండన్ = ఇట్లుండగా ; దీనిన్ ; ఎట్లు ; ఏన్ = నేను ; వినన్ + చూడన్ + నేర్తున్ = వినగలను, చూడగలను; సుయోధనున్, పవనసూనుని = భీమసేనుని; ఇంత + ప్రవీణులన్ = ఇంతటి గదాయుద్ధ ప్రవీణులుగా ; ఏన్ + చేసితిన్ = నేనే చేసియుంటిని సుమా !; ఒండొరున్ + చంపన్ = ఒకరినొకరు చంపగా ; చూతునే = చూడగలనా?

భా. *కనుక ఈ పాండవులకు జయము కల్గుట నిశ్చయము. ఎన్ని విధాలచేనైనా కౌరవులకు వినాశం తథ్యం. విషయ మిలా నిస్సందిగ్ధమై యుండగా దీన్ని నేను ఎలా వినగలను, చూడగలను? గదాయుద్ధంలో భీమసేన సుయోధనులను నిపుణులుగా తీర్చిదిద్దింది నేనే. అట్టి నేను వారి నొకరి నొకరు చంపుకొనుచుండగా చూడగలనా ?*

వి. జయం నిశ్చయంగా పాండవులకే కలుగుతుంది. అలానే కౌరవు లెలాగూ నశిస్తారని నిశ్చయంగా తెలుసు బలరాముడికి. ఇక బాధపడే దెవరిని గూర్చి ? తాను తీర్చి దిద్దిన దుర్యోధనుని గూర్చి.

శ్రీకృష్ణుడు మాత్రం దుర్యోధనుని తన పరివారంతో చావమనలేదు.పాండవుల రాజ్యభాగమిమ్మన్నాడు. దుర్యోధనుడు వినలేదు. కనుక పక్షపాతానికి అవకాశమేలేదు. పుత్రవ్యామోహంతో ధృత రాష్ట్రుడు పడ్డ బాధకు శిష్యవ్యామోహంతో బలరాము డనుభవిస్తున్న వేదనకు ఏమీ తేడా కన్పించడం లేదు. ఇద్దరూ కూడా సత్యం తెలిసిన వాళ్ళే. ఇద్దరికీ కూడా సుయోధనుని అపమార్గనుండి మరలించాలన్న ఉచిత దృష్టి కన్నా అభిమానపు పాళ్ళే ఎక్కువ.

క. హరి యెఱుఁగని చక్కటియుం
బురుషార్థము నాకెఱుంగఁ బోలునె యీ ని
ష్ఠురత వినఁ జూడఁ జాలక,
సరస్వతీ తీర్థమునకుఁ జనియెదు బుద్ధిన్. 172

అ. హరి = శ్రీకృష్ణుడు ; ఎఱుఁగని = నేర్వని ; చక్కటియున్ = న్యాయము ; పురుష + అర్థమును = ధర్మార్థ కామములు ; నాకున్ + ఎఱుంగన్ + పోలునే = నాకు తెలియ శక్యమగునె ; ఈ నిష్ఠురతన్ = ఈ క్రౌర్యమును ; వినన్ + చూడన్ = వినుటకు, చూచుటకు; చాలక = సమర్థుడనుకాక; సరస్వతీ + తీర్థమునకున్ = సరస్వతీనదీ తీరానికి; చనియెడి + బుద్ధిన్ = పోవనెంచు బుద్ధితో.

భా. *శ్రీ కృష్ణునికి తెలియని న్యాయాలు, పురుషార్థాలు నాకు తెలియ శక్యమౌతాయా? ఈ దారుణాన్ని వినలేక, చూడలేక సరస్వతీ నదీ తీరానికి పోవాలనే బుద్ధితో (తరువాతి పద్యంతో అన్వయం)*

వ. మీకుం జెప్పిపో వచ్చితిఁ బోయి వచ్చెద నని పలికి బలదేవుండు వాసుదేవ ధర్మపుత్రు లొడంబడి యనుపఁ దీర్థయాత్ర వోయెఁ దదనంతరంబ. 173

భా. *"మీకుకూడా చెప్పిపోవాలని వచ్చాను. వస్తాను." అని బలరాముడు శ్రీ కృష్ణ ధర్మరాజులు అంగీకరించి పంపగా తీర్థయాత్రలకు వెళ్ళాడు. ఆపైన.*

- : రుక్మి వృత్తాంతము : -
సం : 5-155-1

సీ॥ కృష్ణుని దేవి రుక్మిణి సోదరుఁడు రుక్మి
యను రాజు బలవిక్రమాన్వితుండు
శార్ఙ్గగాండీవ విజయములు నాఁగల
దివ్యచాపములఁ దృతీయమైన
చాపంబు గలవాఁడు సైన్యసమేతుఁడై
చనుదెంచి ధర్మజుఁ గని తదీయ
సత్కారములు గాంచి సముచితాసనమున
నుండి యక్కొలువున నున్న వీరు
ఆ. లెల్ల వినఁ గిరీటి కిట్లను "సమరంబు
సేయ వెఱచితేనిఁ జెప్పు నాకు
నెదురు లేరు జగతి నెవ్వరు నీకుఁ దో
డ్పడి జయింతు నెట్టి పగఱనైన " 174

అ. కృష్ణుని దేవి రుక్మిణి (కి) సోదరుఁడూ ; బల విక్రమ + అన్వితుండు = బల, పరాక్రమాలతో కూడినవాడూ ; శార్ఙ్గ, గాండీవ, విజయములు నాన్ + కల ; దివ్యచాపములన్ = దివ్యములైన ధనస్సులలో ; తృతీయము + ఐన చాపంబు = మూడవ ధనుస్సు (విజయం); కలవాడు; (అయిన) రుక్మి + అను మహారాజు; సైన్యసమేతుండై = సేనతో కూడి; చనుదెంచి = వచ్చి; ధర్మజున్; కని ; తదీయ -సత్కారములు = అతని ఆదరణములను; కాంచి = పొంది;

సముచిత + ఆసనమునన్ ; ఉండి , ఆ + కొలువునన్ ; ఉన్న ; వీరులు + ఎల్లన్ ; వినన్ ; కిరీటికిన్ = అర్జునుతో ; ఇట్లు + అనున్ ; సమరంబు + చేయన్ ; వెరచితి + ఏని = భయపడి నట్లయిన ; చెప్పు ; నాకున్ ; జగతిన్ ; ఎవ్వరున్ ; ఎదురులేరు ; నీకున్ ; తోడ్పడి = సహకరించి; ఎట్టి పగఱన్ + ఐనన్ = ఎటువంటి శత్రువునైనా; జయింతున్ = గెలువగలను.

భా . *శ్రీ కృష్ణుని పట్టపు దేవియైన రుక్మిణికి సోదరుడు రుక్మి. బలపరాక్రమములు గలరాజు. శార్ఙ్గ, గాండీవ, విజయాలనే మూడు దివ్యచాపాలలో విజయ మతనిదే. ఆ రుక్మి సైన్యంతో కూడా వచ్చి ధర్మరాజును చూచి, అతని సత్కారాలు పొంది, ఉచితాసనముపై కూర్చుండి; అక్కడున్న వీరులంతా వినేట్లు అర్జునునితో ఇలా అన్నాడు "యుద్ధం చేయటానికి భయమయితే చెప్పండి. నాకు ఎక్కడా ఎవ్వరూ ఎదురులేరు. నీకు సహకరించి ఎటువంటి శత్రువు నైనా గెలువగలను"*

వి. శార్ఙ్గము, గాండీవము, విజయము - ఈ మూడునూ దివ్యచాపములు. వీటిలో శార్ఙ్గము కృష్ణునిది. గాండీవం అర్జుననకు చెందింది. ఇక మూడవ చాపం విజయం రుక్మిది. అయితే శార్ఙ్గగాండీవధారులైన కృష్ణార్జునులకున్న వ్యక్తిత్వం, విలువా మరి రుక్మికి లేవు. కృష్ణార్జునులు ధరించుట వల్ల శార్ఙ్గ గాండీవాలకు విలువ పెరిగింది. రుక్మి దగ్గ రుండటం వలన విజయానికి విలువ తగ్గింది.

వ ॥ అని తన్ను నాక్రమించి తన తోఁ బుట్టువు రుక్మిణిం గొని వచ్చిన యా కృష్ణు సన్నిధిన సిగ్గులేక యాడినమాటలు విని చిఱునవ్వు నవ్వుచుం గవ్వడి యాతని యాననం బాలోకించి. 175

అ . ఆక్రమించి = ఉల్లంఘించి ; కవ్వడి = అర్జునుడు.

భా . *అని తనను జయించి తన తోబుట్టువు రుక్మిణిని బలవంతంగా తీసుకొని వచ్చిన ఆ కృష్ణుని ముందు సిగ్గులేక పల్కిన మాటలు విని మందహాసం చేసి అర్జును డాతని ముఖం వంక చూసి.*

వి . రుక్మి కృష్ణుని చేతిలో ఓడింది మొదలు అక్కడనే ఉంటూ వచ్చాడు. రుక్మి తనవెంట అక్షోహిణి సేనను తీసుకొని మరీ వచ్చాడు. శ్రీ కృష్ణుని అనుగ్రహం కోసం వచ్చాడురుక్మి శ్రీకృష్ణుని చేతిలో రుక్మి పరాభూతుడు కావచ్చు. ఐనా అతని శక్తియుక్తులను శంకించనవసరం లేదు. కనుక ధైర్యంగా అర్జుననకు సాయం చేయవచ్చానని అంటున్నాడు.

తే . చెనసి గంధర్వసేన నిర్జించు నపుడు
మత్స్యనాథు గోవర్గంబు మరలఁ దెచ్చు
నెడను దప్పె నీ కందువ యెఱుఁగ నైతి
నింక నెఁ గాని తోడు గ మ్మెచటికైన. 176

అ. చెనసి =ప్రతిఘటించి ; గంధర్వసేనన్ = చిత్రరథుని సైన్యాన్ని; నిర్జించు+అపుడు = జయించుసమయంలోను ; మత్స్యనాథు + గోవర్గంబున్ = విరాటరాజు యొక్క ఆవులను ; మరల + తెచ్చు + ఎడను = మరలించి విరాటనగరానికి తీసుకొనివచ్చే వేళలోను ; తప్పెన్ =

ప్రమాదమైనది; నీకందువ = నీజాడ ; ఎఱుఁగన్ + ఐతిని = తెలుసుకొనలేకపోయాను; ఇంకన్ = ఇకపై ; ఔన్ + కాని = అవుతుందిలే; ఎచటికైనన్ = ఎక్కడికైనా ; తోడుకమ్ము = నాకుసాయంగారా .

భా . *గంధర్వ సైన్యా న్నెదిరించి నిర్జించినపుడు, విరాటరాజుగోవులను మరల్చి తీసుకు వచ్చినపుడు పొరపాటు జరిగింది. నీజాడ తెలిసింది కాదు. ఇకమీద అలానే చేద్దువుగాని. ఎక్కడికైనా నాకు తోడుగా రా.*

వి. ఇక్కడ మూలంలో "యథాయోగం యథాకామం గచ్ఛ వాన్యత్ర తిష్ఠవా' అని అన్నాడు. ఎక్కడికైనాపో. మరోచోట ఎక్కడైనా వుండు అంతేకాని నీ సాయ మక్కరలేదు అని అన్నాడు. అలానే "కథమస్మద్విధోబ్రూయాత్ భీతోస్మీతి యశోహరమ్" నావంటివాడు భయంగా ఉంది అని యశోహరంగా పల్కుతాడా ? అని మాత్ర మన్నాడు. తిక్కన తెలుగులో హాస్యరసపోషణ కనువుగా. "నీ కందువ నెఱుఁగనైతి. నింకనౌగానిఁ దోడుగమ్మెచటికైన" అని అర్జునునిచే పల్కించి మరల "ఒకవేళ నీవు వచ్చినా మా సైన్యం ఒప్పుకోదు. మరెక్కడికైనా పో" అని అనిపించాడు.

" నిహత్య సమరే శత్రుం తవ దాస్యామి మేదినీ " శత్రువులను చంపి భూమిని నీకిస్తాను. "నహిమే విక్రమే తుల్యఃపుమా నాస్తే హ కశ్చన" ఇక్కడనాకు సాటియైన వీరుడు ఎవ్వడు లేడు. వంటి మాటలు పల్కడం అర్జునునికి నవ్వు పుట్టించవచ్చు. కాని పాండవులకు సాయపడవచ్చిన రుక్మిని అర్జునుడు కాదనలేదు.

వ. అని యతని యుత్తరమునకు తగినయట్లు పలికి మరియును. 177

భా . *అని అతని స్థాయికి తగిన రీతిగా పలికి ఇంకనూ -*

క : మున్నే నసహాయుఁ డనై
చన్నగతిం జనఁగ నైన చందం బయ్యెన్
వెన్నుఁ డు తోడు గలఁడు వెఱ
పెన్నఁడును వలవ దింక నేమిటి కైనన్. 178

అ. మున్ను = ఇంతకు పూర్వము ; ఏన్ = నేను ; అసహాయఁడను + ఐ = నిస్సహాయుడనై ; చన్నగతిన్ + చనగన్ = వెళ్ళినరీతిన వెళ్ళగా ; ఐన+ చందంబు = ఐన రీతిగా; అయ్యెన్ = ఐనది; వెన్నుఁడు = శ్రీ కృష్ణుడు ; తోడు + కలఁడు = ఇపుడు సాయంగా నున్నాడు ; ఇంకన్ = ఇకపై ; ఏమిటికైనన్ = దేనికైనను ; ఎన్నడును = ఎప్పుడును ; వెఱపు = భీతి ; వలవదు = వద్దు

భా . *పూర్వంలో ఎవరి సహాయంలేకుండానే ఉన్నవాడిని ఉన్నట్లుగా వెళ్ళగా అలా విజయాలు లభించాయి. ఇప్పుడిక శ్రీ కృష్ణుడు తోడై యున్నాడు. కనుక దేనికీ ఎన్నడు భయపడవలసింది లేదు.*

లి. ఇప్పుడు కృష్ణుడు సాయమున్నా డనుటలో ఆ కృష్ణుని చేత పరాభవింపబడిన నీ సహకారం లభించినా కార్యకారి కాదు అని సూచన.

చ. **వెఱచితి రాఁగదే యనిన వెండి కదా పగఁ దీర్తు నీవు; నా**
వెఱ పెటులున్న నీరథికవీరులు వాపెద; రొల్ల నిన్ను నీ
యుఱుకడ కేఁగి తోడుపడు మొడ్లకు నెవ్వరి కేని; నన్న నే
డ్తెఱ నతఁడేఁగి కౌరవపతిం గని, యట్టుల బెట్టు పల్కినన్. 179

అ. వెఱచితిన్ = భీతిచెందాను ; రాగదే = రావా ; అనిన = అన్న ; వెండికదా = అనంతరము కదా ; నీవు = నీవు ; పగన్ = తీర్తువు = వైషమ్యమును చక్కదిద్దుతావు / శత్రువును సంహరిస్తావు; నా + వెఱపు = నా భయము ; ఎటులు + ఉన్నన్ = ఎట్లా ఉన్నా ; ఈ + రథిక + వీరులు = ఈ రథిక శ్రేష్ఠులు ; పాపెదరు= తొలగిస్తారు ; నిన్నున్ ; ఒల్లన్ = ఇష్టపడను ; నీ+ ఉరుకడకు + ఏగి = నీకు తగిన చోటకు వెళ్లి ; ఒడ్లకున్ = ఇతరులకు; ఎవ్వరికేనిన్ = ఎవ్వరికైనా ; తోడు పడుము = సాయంచెయ్యి ; అన్నన్ = అనగా ; ఏడ్తెరన్ = పూనికతో; అతడు + ఏగి = రుక్మివెళ్ళి ; కౌరవపతిన్ = దుర్యోధనుని ; కని = చూచి ; ఇట్టులు + అ= ఇట్ల ; బెట్టు + పల్కినన్ = గర్వంతో పల్కగా

భా. *శత్రువుల యెడనేను భీతిల్లితిని. నాకు తోడ్పడవా అని నేను నిన్ను కోరినప్పుడుకదా ! నీవు శత్రుసంహారం చేయడానికి వస్తావు. నా భయం మాట ఎటులున్నా ఈ రథిక వీరులు తొలగిస్తారు. నీ సహాయం నా కక్కరలేదు. తగినచోటు కెళ్ళి మరెవ్వరికైనా సహకరించు. అనగా రుక్మి వెంటనే కౌరవ పతి దగ్గరకు పోయి గర్వంగా ఇలాగే అనగా -*

క ॥ **అతఁ డివి యేటిమాటలు**
నీతోడగు టొల్లఁ బొమ్మనిన రుక్మి వృథా
యాతాయాస విషణ్ణుం
డై తనపురమునకు మగుడ నరిగెం బెలుచన్. 180

అ. అతఁడు = ఆ దుర్యోధనుడు ; ఇవి + ఏటిమాటలు = ఇవి ఎక్కడిమాటలు ; నీతోడు = నీ సాయము; అగుట + ఒల్లన్ = కల్గుట కిష్టపడను; పొమ్ము + అనినన్ = పో అనగా ; రుక్మి, వృథా = వ్యర్థముగా ; యాత + ఆయాస + విషణ్ణుండై = వెళ్ళుట వల్లనైన శ్రమచేత దుఃఖమునందినవాడై ; పెలుచన్ = శీఘ్రముగా ; తన పురమునకున్ = తన పట్టణానికి ; మగుడన్ + అరిగెన్ = తిరిగిపోయెను.

భా. *దుర్యోధనుడు "ఇవి ఎక్కడిమాటలు? నీ సహాయం నా కక్కరలే దుపో" అనగా రుక్మి వ్యర్థంగా వెళ్ళినందువల్ల కలిగిన శ్రమకు బాధపడి తన పట్టణానికి వెంటనే తిరిగి వెళ్ళాడు.*

వి. ధర్మమో , అధర్మమో విశ్వాసంతో ఒకరినే నమ్ముకున్న వారినైనా గౌరవిస్తారు. ధర్మవివేకంతో ధర్మనిర్ణయం చేసి ఆ పక్షాన్నాశ్రయించిన వారినైనా గౌరవిస్తారు. కానిధర్మవివేకం కాని ఏ విధమైన కట్టుబాటుగాని లేని రుక్మివంటి వారిని ఎవరూ ఆదరించరు.

తే ॥ **ఇట్లు బలదేవ రుక్ముల కిద్దఱకును**
గయ్యమునకు సన్నాహంబు గలుగ దయ్యెఁ
గాని తక్కు లోకంబునఁ గలుగు నృపతి
కోటి యిరువాగు నందును గూడె ననికి. 181

అ. ఇట్లు = ఈ విధంగా ; బలదేవ + రుక్ములకున్ + ఇద్దఱకును ; కయ్యమునకున్ = యుద్ధమునకు ; సన్నాహంబు = పూనిక; కలుగదు + అయ్యెన్ = తటస్థింపదాయెను ; కాని; తక్కు = మిగిలిన ; లోకంబునన్ + కలుగు = దేశములోనున్న ; నృపతి + కోటి = రాజబృందము; ఇరువాగునందును = రెండుసేనలందును; అనికిన్ = యుద్ధానికి ; కూడెన్ = చేరెను.

భా . ఇలా బలరామ రుక్ములకు యుద్ధ ప్రయత్నం సిద్ధించలేదు. కాని దేశంలో నున్న ఇతర రాజలోకమంతా ఇరు పక్షాలతోను ఏదో వర్గంలో యుద్ధానికి చేరిపోయారు.

వి. మంచి, చెడు నిర్ణయం ఎప్పుడు నియతం కాదు. అది అన్య విషయ సాపేక్షం. కాబట్టి ఒక్కొక్కరికి ఒక్కొక్క పక్షం ధర్మరూప మనిపిస్తుంది. ఆ రీతిగా రాజలోకమంతా కౌరవ పాండవులలో ఎవరికి తోచిన పక్షాన్ని వారు సమర్థించారు. ధర్మభావం లేకున్నా కారణాంతరాల వల్ల ఏదో ఒక పక్షాన్ని సమర్థింపక తప్పని వారు కూడా కొందరు. భీష్మాదులిట్టివారు. కారణాలేమైనా రాజలోకం మొత్తం రెండు పక్షాలుగా చీలిపోయింది. అది మానవ స్వభావం.

వ . అట్టియెడ నిశాసమయంబున ధృతరాష్ట్రుండు సంజయు రావించి యిట్లనియె. 182

భా . ఆ సమయంలో రాత్రివేళ ధృతరాష్ట్రుడు సంజయుణ్ణి రప్పించి ఇలా అన్నాడు.

క ॥ బవరము గీడని యెఱుఁగుదు
నవినీతుండైన కొడుకు నదలిచి యుడుపం
దివిరియు నోరాడమి దైవ
వ వశం బప్పనికి మనకు వగ పింకేలా? 183

అ . బవరము=యుద్ధము; కీడు + అని = చేటని ; ఎఱుగుదున్ ; అవినీతుండు + ఐన = నీతిలేని వాడగు; కొడుకున్ = కుమారుని; అదిలిచి = బెదిరించి; ఉడుపన్ + దివిరియు= మాన్ప ప్రయత్నించి; నోరు + ఆడమి=మాట వెడలకుండుట; దైవవశంబు = దైవాధీనమైన; ఆ + పనికిన్ = ఆ పనికి; మనకున్ , వగపు = దు:ఖము ; ఇంకన్ + ఏల = ఇకనెందుకు.

భా . యుద్ధము చేటు తెస్తుందని నే నెఱుఁగుదును. అవినీతిపరుడైన కుమారుని బెదిరించి నిరోధింప యత్నించినా నోటమాట రాక పోవడం దైవనియతి . కనుక అట్టిదానికి విచారింప నవసరంలేదు.

వి . ఈ పద్యంలో ధృతరాష్ట్రుడు ప్రమాదకరమైన ధోరణిలో మాట్లాడుతున్నాడు. అంతటికి ఆ దైవమే కారణం. మనలో ఉన్న ఆ దైవమే మనచేత మంచి చెడ్డలను చేయిస్తున్నాడు. ఏం జరిగినా అతని ఆదేశానుసారమే జరుగుతుంది. కాబట్టి మనం విచారింప నవసరం లేదంటున్నాడు. ఏమి జరగనున్నదో అది జరుగుతుంది. మనం చేయగల్గిందేమున్నది. రాజులకు యుద్ధంలో మరణించడం కూడా మంచిదే. అవిధ ముత్తమమే. అని అతని అభిప్రాయము.

క॥ ఎయ్యది గానున్నది యది
యయ్యెడుఁ జేయునది గలదె యవనీశులకుం
గయ్యానఁ జచ్చుటయు మే
లయ్యొప్పుట లెస్స గాక యది యట్లుండెన్. 184

అ . ఏ + అది = ఏది; కాన్ + ఉన్నది =జరుగనున్నదో; అది + అయ్యెడున్ = అది జరుగగలదు; చేయు + అది +కలదె = చేయగలదేమున్నది. అవనీ + ఈశులకున్ = భూకాంతులకు; కయ్యానన్ = రణరంగమున; చచ్చుటయు = మరణించుటయును; మేలు = మంచిది; ఆ + ఒప్పుట = ఆవిధము; లెస్స = మంచిది; అది + అట్లుండెన్ = అదియట్లుండనీ.

భా : ఏమి జరుగన్నుదో అది జరుగుతుంది. మనం చేయగల్గిందేమున్నది? రాజులకు యుద్ధంలో మరణించటం కూడా మంచిదే. ఆ విధ ముత్తమమే. అది అలా ఉండనియ్యి.

వ. రెండు వీళ్ళనుఁ గురుక్షేత్రంబున విడిసిన పిదపం బుట్టిన విశేషంబులు గలవేని నెఱింగింపుము. 185

భా : కురుక్షేత్రంలో విడిసిన తరువాత తటస్థించిన విశేషా లుంటే నాకు చెప్పు

వి . ఏది జరగాలో అది జరుగుతుందని, తన కొడుకు విషం త్రాగుతుంటే సమర్థుడని చూస్తూ ఊరుకున్నాడు ధృతరాష్ట్రుడు. ధృతరాష్ట్రుని అభిప్రాయం సరికాదు. యుద్ధంలో క్షత్రియులు చావటం మంచిదే. కనుక యుద్ధాన్ని నివారించ నక్కరలేదని కూడా అంటున్నాడు. అంటే ఉత్తమగతి కలగడం కోసం అనవసరంగా, అకారణంగా యుద్ధాన్ని కొని తెచ్చుకొమ్మన్నది ఉచితమా? యుద్ధంలో చస్తే మంచిదని చావుకోసం యుద్ధాన్ని కొని తెచ్చుకో నవసరం లేదు.

-: సంజయుండు ధృతరాష్ట్రుని కులూకుఁడు పాండవుల నాడిన మాటలు సెప్పుట :-

సం : 5-157-1

**తే॥ అనిన సంజయుఁ డిట్లను నకట కొడుకు
మీఁదఁదప్పు వెట్టెదవు నీ మీఁది కొఱఁత
నీకుఁ గానంగ వచ్చునె నీ వెఱుంగ
కుండఁ బఱిచెనె యాతండు పాండుసుతుల.** 186

అ . అనిన్ = ధృతరాష్ట్రుడట్లు పల్కగా; సంజయుఁడు; ఇట్లు + అనున్ = ఈ విధముగా పల్కును; అక్కటా = అయ్యో; కొడుకు + మీదన్ = దుర్యోధనుపై; తప్పు = అపరాధము; పెట్టెదవు = మోపెదవు, నీ + మీది + కొఱఁత = నీ యెడలనున్న దోషము; నీకున్ = నీకు; కానంగన్ + వచ్చునే = కన్పించునా; నీవు; ఎఱుంగకుండన్ = తెలియకుండగా; ఆతండు = దుర్యోధనుడు; పాండుసుతులన్ = ధర్మజాదులను; పఱిచెనె = దుఃఖపెట్టాడా?

భా . ధృతరాష్ట్రుని మాటలు విని సంజయు డంటున్నాడు. అయ్యో! తప్పంతా కుమారునిపై మోపుతున్నావు. నీలో తప్పు నీకు కన్పిస్తుందా ? నీకు తెలియకుండానే నీ కుమారుడు పాండవులను కష్టపెట్టాడా ?

వి . తన దోషాన్ని కుమారునిపై నెట్టడానికి సంకోచించని వ్యక్తి ధృతరాష్ట్రుడు. అతనికి తెలియక ఏ పనీ జరుగక పోయినా తన వంక ఏ దోషమూ లేదని పల్కడం అతని అజ్ఞానానికి నిదర్శనం. సంజయుడు ధృతరాష్ట్రుని దోషిగా పేర్కొనడం ఇదే మొదలుకాదు.

సంజయుడే కాక ఎందరో మహర్షులు, శ్రీకృష్ణుడు, భీష్మ, విదురాదులు కూడా దుర్యోధనునితో పాటు ధృతరాష్ట్రుడూ దోషసహభాగి అని ఆరోపించే ఉన్నారు.

వ: ఆపని గడవంబడియె వార్తలు వినియెద వేని వినుము, దుర్యోధనుండు దుశ్శాసన, శకుని, కర్ణులతో విచారించి యులూకుం బిలిపించి" నీవు వోయిపాండవులం గని వాసుదేవు సన్నిధిని బాంచాల విరాట ప్రముఖులు వినఁ బలుకు" మని పరుసని మాటలు గఱపి పుచ్చిన నతండును. 187

అ. కడవంబడియెన్ = అయిపోయింది; పరుసని మాటలు = పరుష వచనములు.

భా . ఆ పని ఐపోయింది; ఇక వార్తలు వింటావేమో విను. దుర్యోధనుడు దుశ్శాసనాదులతో ఆలోచించి ఉలూకుని పిలిపించి నీవు పాండవుల యొద్దకు వెళ్ళి కృష్ణుని సమక్షంలో పాంచాల విరాటాది ప్రముఖులు వింటుండగా పాండవులను చూచి యిలా అను అని పరుష వచనాలు చెప్పి పంపాడు. ఆ ఉలూకుడు.

క ॥ చని కొలువున ధర్మసుతుం
గని దుర్యోధనుఁడు సెప్పఁగా నను నియమిం
చిన మాటలు గొన్ని గలవు
విను మలుగక యనిన నతఁడు విని యిట్లనియెన్. 188

అ . చని = వెళ్ళి ; కొలువునన్ = సభలో ; ధర్మసుతున్ = ధర్మరాజును ; కని = చూచి ; దుర్యోధనుడు ; చెప్పగాన్ = చెప్పటకొరకు ; ననున్ = నన్ను ; నియమించిన = నియోగించిన ; మాటలు ; కొన్ని కలవు; అలుగక = కోపింపక; వినుము ; అనినన్ = అనగా ; అతడు = ఆ ధర్మరాజు ; విని ; ఇట్లు + అనియెన్ = ఇట్లా అన్నాడు.

భా . ఉలూకుడు వెళ్ళి కొలువులో నున్న ధర్మరాజును చూసి "నీకు కొన్ని మాటలు చెప్పమని దుర్యోధనుడు నన్ను నియమించాడు. నేను చెపుతాను కోపించక విను" అనగా ధర్మరాజు ఇలా అన్నాడు.

ఆ ॥ నీకు వెఱవ నేల? నిన్ను నా బుద్ధిమం
తుండు సెప్పు మనిన తులువమాట
లెన్ని గలవు వానినన్నింటి ననుమాన
మింత లేక యాడు మెల్ల వినఁగ. 189

అ . నీకున్ = నీకు ; వెరవన్ + ఏల = సంకోచమేల ; నిన్ను ; ఆ బుద్ధిమంతుడు = మహా మేధావియైన ఆ దుర్యోధనుడు ; చెప్పుము + అనిన = చెప్పమన్న; తులువమాటలు = నీచవాక్యములు ; ఎన్ని + కలవు = ఎన్ని ఉన్నవో ; వానినన్నింటిని; అనుమానము= శంక;

ఇంత + లేక = కొంచెమును లేకుండగా ; ఎల్లన్ + వినగన్ = అందరు వినునట్లుగా ; ఆడుము = పల్కుము (వినగన్ = వినుటకొరకు; ఎల్లన్ = సంపూర్ణముగా; ఆడుము = పల్కుము)

భా. నీకు జంకేల ? ఆ కుటిలుడు చెప్పమన్న నీచవాక్యము లన్నిటిని శంకలేకుండా అందరు వినునట్లు పూర్తిగా చెప్పు.

వి. అలుగక వినాలని ఉలూకు డనటంతో అవి అనుచిత వాక్యాలే అయిఉంటాయని ఊహించడం కష్టంకాదు. అందుకే ఇక్కడ ఆ బుద్ధిమంతుడు అని ప్రయోగించడం లాక్షణికం. బుద్ధిహీనుడు అన్న స్ఫూర్తియే కల్గుతుంది.

వ. అనిన నులూకుం డిట్లనియె. **190.**

భా. ధర్మరాజు అలా అనగానే ఉలూకుడు ఇలా చెప్పసాగాడు.

సీ ॥ కయ్యంబునకుఁ బెద్దకాల మేనియుఁ బూఁచి
పట్టివచ్చితి కడు బరవసమున
సంజయుతో మీరు శంక లే కాడిన
యెక్కుడు మాటలు పెక్కు గలవు
భూమి భాగము గోలుపోయిన యలుకకు
ద్రౌపది బన్నంపు దైన్యమునకుఁ
దగ మంచి బంటవై "తఱి యిది బాహు బ
లాస్త్ర విద్యలు సూప నని తలంచి

ఆ. నిలువ వలయు నీకుఁ గలవారి నెల్లను
గూర్చి మోహరించికొని కడంగి
నడవు సమరమునకు వెడ జంకఁ బోదింకఁ
దప్ప గ్రుంకలేదు తఱికిఁ జొరుము. **191**

అ. కయ్యంబునకున్ = యుద్ధమునకు; పెద్దకాలము +ఏనియున్ = ఎంతకాలము నుండియో; కడు + బరవసమునన్ = మిక్కిలి ఉత్సాహముతో; పూచిపట్టి + వచ్చితి = ఉద్యమించి వచ్చావు; సంజయుతో ; మీరు ; శంకలేక ఆడిన ; ఎక్కుడు -మాటలు = అధికప్రసంగాలు ; పెక్కు + కలవు = చాలా ఉన్నాయి; భూమి భాగమున్ = రాజ్యభాగాన్ని; కోలుపోయిన = పోగొట్టుకొన్న ; అలుకకున్ = కోపానికి; ద్రౌపది= ద్రౌపది యొక్క ; బన్నము -దైన్యమునకున్ =పరాభవం వల్ల ఏర్పడిన దురవస్థకు; తగన్ ; మంచి బంటవు + ఐ = మహావీరుడవై ; బాహుబల + అస్త్రవిద్యలు = భుజబలాన్ని నేర్చిన అస్త్ర విద్యలు; చూపన్ = ప్రదర్శించటానికి; ఇదితఱి = ఇది సమయం ; అని తలంచి; నిలువన్ + వలయున్ = నిలబడాలి; నీకున్; కలవారిన్ + ఎల్లన్ + కూర్చి = ఆత్మీయులందరినీ కలుపుకొని; మోహరించుకొని = వ్యూహంగా తీర్చుకొని; కడంగి = పూని ; సమరమునకున్ = యుద్ధానికి ; నడవు = నడు; వెడ + జంకన్ = కొంచెమైన భయపడటానికి; ఇంకన్‌పోదు =ఇంక సాగదు; తప్ప గ్రుంకన్ లేదు = తప్పించుకొన వీలులేదు ; తఱికిన్ + చొరుము = ఉద్యమించు.

భా . యుద్ధానికి ఎంతోకాలంగా పూని ఉత్సాహంతో వచ్చావు. సంజయుడితో మీరు చేసిన అధిక ప్రసంగాలు అనేకా లున్నాయి. రాజ్యభాగం కోల్పోయామన్న కోపానికీ, ద్రౌపది పొందిన పరాభవానికీ తగ్గట్లు శూరుడవై బాహుబలాన్ని అస్త్ర విద్యలను చూపటానికి తగిన సమయం వచ్చిందని భావించి నిలబడు. నీ ఆత్మీయుల నందరినీ కలుపుకొని యుద్ధానికి నడు. తుచ్ఛమైన భీరుత్వమిక సాగదు. తప్పించు కొనటానికి వీలులేదు. సమయం వచ్చిందిక యుద్ధానికి ఉద్యమించు.

క . **ఆతత బలుఁడగు భీష్మని**
చేతి బలువు ద్రోణు నంప సెల లవియుటయుం
జూతు రటు రండు కృష్ణుని
చేతన సకలంబుఁ జక్కఁజేసి కొనుండీ! 192

అ . ఆతత = విస్తృతమైన; బలుఁడు + అగు = బలం గలవాడైన ; భీష్మని = భీష్మనియొక్క ; చేతి- బలువు = బాహు బలము; ద్రోణు = ద్రోణాచార్యుని యొక్క ; అమ్ము + సెలలు = బాణపు ములుకులు ; అవియుటయున్ = తెగుటయును (గ్రుచ్చుకొనుటయును) చూతురు ; అటు రండు = అలా యుద్ధ రంగానికి రండి ; కృష్ణుని చేతన్ + అ = శ్రీ కృష్ణుని సహకారంతోనే ; సకలంబు = సమస్తమూ; చక్కన్ + చేసి కొనుండు + ఈ = చక్కబెట్టుకొనుడు.

భా . మహాబలుడైన భీష్మని బాహు బలమూ, ద్రోణుని బాణపు ములుకులు గ్రుచ్చుకొనుట చూచెదరుగాక. సరే యుద్ధానికి రండి . లేదా శ్రీ కృష్ణుని సహకారంతో అంతా చక్కబెట్టుకోండి.

క . **వారిద్దఱ వాలమ్ముల**
బారిం బడి యర్జునునకు బ్రదుక వశమె మీ
వా రెల్ల నెఱుంగరె! య
వ్వీరుల దివ్యాస్త్ర శస్త్ర విభవ సమృద్ధుల్. 193

అ . వారు + ఇద్దఱ = ఆ భీష్మద్రోణుల యొక్క ; వాలు + అమ్ముల -బారిన్ + పడి = క్రూరమైన బాణాల వాతబడి ; అర్జునునకున్ ; బ్రదుకన్ + వశమె = జీవింప శక్యమా ; మీ వారు + ఎల్లన్ = మీ వారందరు; ఆ + వీరుల = ఆ వీరుల యొక్క ; దివ్య సమృద్ధుల్ ; దివ్య = గొప్పనైన, అస్త్ర = అస్త్రముల యొక్కయూ, శస్త్ర = ఆయుధాల యొక్కయూ, విభవసమృద్ధుల్ = శక్తిసంపదలు ; ఎఱుంగరు + ఏ = తెలియరా ?

భా . భీష్మద్రోణుల కఠిన బాణాలబారిపడి మీ అర్జునుడు బ్రతుకగలడా ! ఆ మహావీరుల అస్త్ర శస్త్ర వైభవం మీకు తెలియదా ?

వ . **అని భీమసేనుం జూచి.** 194

క . **ఈ వాయు పుత్రుఁ డాజిం**
ద్రావుదు నే దుస్ససేను రక్తం బనియెం

ద్రావఁగ శక్యం బేనిం
ద్రావు మనన్ రాదె? యింకఁ దడ వేమిటికిన్? 195

అ. ఈ వాయుపుత్రుఁడు = ఈ భీముడు; ఆజిన్ = యుద్ధంలో; ఏన్ = నేను; దుస్ససేను-రక్తంబు = దుశ్శాసనుని రక్తాన్ని ; త్రావుదున్ + అనియెన్ = త్రాగుతానన్నాడు గదా!; త్రావఁగన్ = త్రావుటకు ; శక్యంబు + ఏనిన్ = సాధ్యమైనచో; త్రావుము + అనన్ + రాదె = త్రాగుమను ; ఇంకన్ ; తడవు = ఆలస్యం ; ఏమిటికిన్ = ఎందుకు ?

భా. *భీముడు రణ రంగంలో దుశ్శాసనుని రక్తాన్ని త్రాగుతానని ప్రతిజ్ఞ చేసినాడు గదా ! చేతనైతే త్రాగమను. ఇంకా ఆలస్య మెందుకు?*

క. విను నూతి కప్ప విధమున
నిను నీవ యెఱుంగు; దెఱుఁగ నేరవు గర్వం
బున నావలికొలఁది; రణం
బున నొకమరి పెట్టువడక పో నేర్చెదవే! 196

అ. (ధర్మరాజా) విను :నూతి కప్ప విధమునన్ = బావిలోని కప్పలా; నినున్; నీవు + అ = నీవే ; ఎఱుంగుదు ; గర్వంబునన్ = అహంకారం వలన ; ఆవలికొలఁదిన్ = ఇతరుల శక్తిసామర్థ్యాలను ; ఎఱుఁగనేరవు = తెలియజాలవు ; రణంబునన్ = యుద్ధంలో ; ఒకమఱి = ఎప్పుడో ఒకసారైనా ; పెట్టు] పడక = దెబ్బతినకుండా ; పో నేర్చెదవే = పోగలవా?

భా. *నూతిలోని కప్పలాగా నువ్వు నీ గురించి ఆలోచిస్తున్నావేకానీ అహంకారం వల్ల పరుల శక్తి సామర్థ్యాలు గుర్తించకున్నావు. రణ రంగంలో ఒక్కసారైనా దెబ్బతినకుండా పోవటం సాధ్యమా ?–*

వి. అహంకారం, స్వపర తారతమ్యం తెలియక పోవటం దుర్యోధన లక్షణాలు. వాటినే అక్కసుతో ధర్మరాజుపై ఆరోపిస్తున్నాడు ఉలూకుడు. అయితే అతడన్న చివరి మాట మాత్రం అంగీకరింపదగ్గది. రణరంగంలో గెలుపు ఓటములు దైవాధీనాలు. ముందే నిర్ణయింప బడేవి కావు.

వ. అని పలికి సవ్యసాచిం జూచి. 197

అ. సవ్యసాచి = అర్జునుడు.

భా. *అలా మాటాడి మరల అర్జునుణ్ణి చూచి (ఇలా అంటున్నాడు)*

తే. వినుము గాండీవ మను నొక విల్లు తాటి
పొడవు గలిమియుఁ గృష్ణుండు పూని తోడు
గూడుకొని వచ్చుటయు నెఱుంగుదుము వీని
కెల్ల శంకించి భూమి పాలీము గాని. 198

అ. వినుము ; గాండీవము + అను; ఒక విల్లు ; తాటిపొడవు = తాటిచెట్టంత ఎత్తు ; కలిమియున్ = కలిగియుండుటయు ; కృష్ణుండు; = పూని; తోడు =సహాయంగా ; కూడుకొని

వచ్చుటయున్ = కూడి రావటమూ : ఎఱుంగుదుము; వీనికిన్ + ఎల్లన్ = వీనికన్నింటికీ; శంకించి= జంకి; భూమి + పాలు = రాజ్యభాగం ; ఈము - కాని = ఇవ్వము గదా !

భా . తాటిచెట్టంత ఉన్నతమైన ఒక విల్లు నీకుండటం, కృష్ణుడు నీ వెన్నంటి రావటం మాకు తెలుసు. అంత మాత్రం చేత వాటికి భయపడి రాజ్యభాగ మివ్వము.

క. పవనజు గదయును నీ గాం
డీవమును నెటవోయె నంగడికిఁ బాంచాలిం
దివిచి కొని వచ్చు నెడఁ బరి
భవ మెఱుఁగవె? బీర మేల పలుకుదు తోడ్తోన్. 199

అ . పవనజు గదయును = భీమసేనుని గదా; నీ గాండీవమును ; అంగడికిన్ = కొలువుకూటానికి; పాంచాలిన్ = ద్రౌపదిని ; తివిచికొని వచ్చు + ఎడన్ = లాక్కొని వచ్చే సమయంలో ; ఎట + పోయెన్ = ఎక్కడికి పోయాయి; పరిభవమున్ = అవమానమును, ఎఱుఁగరె = తెలియరా ; తోడ్తోన్ = వెంట వెంటను ; బీరము = డాంబికాలను ; పలుకుదు + ఏల = మాటాడుతావెందుకు ?

భా . కొలువు కూటానికి ద్రౌపదిని పట్టి యీడ్చి తెచ్చినప్పుడు భీముడి గదా, నీ గాండీవం ఏమయ్యాయి. ఆ నాటి పరాభవాన్ని అప్పుడే మరిచి పోయారా ? మాటి మాటికి డాంబికాలు పలుకుతారు ఎందుకు ?

చ. వలలుఁ డనన్ విరాటు కడ వంటల వాఁడయి భీముఁడున్, బృహ
న్నల యన నాఁడు పేడి వయి నాన యొకింతయు లేక నీవు, న
గ్గల మగు దైన్య మొంది కడుఁగాఱియ వొందితి రుర్వి యేలు నా
సలఁ బడి, సవ్యసాచి! యిది శౌర్యమొ బాహుబలంబొ చెప్పుమా ? 200

అ . సవ్యసాచి; వలలుఁడు + అనన్ = వలలుడనే పేరుతో ; విరాటు కడన్ = విరాటరాజు దగ్గర; వంటల వాఁడు + అయి ; భీముఁడున్ ; బృహన్నల + అనన్ = బృహన్నల పేరుతో ; ఆ ఁడు = నాట్యం చేసే ; పేడివి + అయి = నపుంసకుడివై ; నాన = సిగ్గు; ఒకింతయున్ లేక = కొంచెమూ లేకుండా; నీవు ; ఉర్వి + ఏలు = భూమినేలవలెనను ; ఆసలన్ + పడి = ఆశలచిక్కి; అగ్గలము + అగు = అధికమైన, దైన్యము + ఒంది=క్షీణదశనొంది; కడున్ = మిక్కిలి ; కాఱియ + పొందితిరి= కష్టపడ్డారు; ఇది; శౌర్యము + ఒ = పరాక్రమమో; బాహుబలంబు + ఒ= భుజబలమో; చెప్పుము + ఆ = చెప్పు.

భా . ఓ అర్జునా ! వలలుడనే పేరుతో విరాటరాజు కొలువులో వంటలు చేస్తూ భీమసేనుడూ, బృహన్నల పేరుతో నాట్యాచార్యుడిగా పేడివాడవై నువ్వూ, సిగ్గువిడిచి రాజ్యమేలాలన్న ఆశతో దైన్యాన్ని పొంది కష్టపడ్డారు గదా ! ఇది పరాక్రమ శక్తియా? భుజబలమా ? చెప్పు .

ఉ. **మాయలు నింద్రజాలములు మాధవు (డిందును గొన్ని పన్నినన్**
బాయవు రజ్జు లెప్పుడు నవారణ నీ వెటు లాడి తేనియున్
వేయును నేల పార్థులును విష్ణులు వే పదివేలు వచ్చినం
జేయుదు మేము గయ్యా మొక చీరియు సంపద(బంచి యిత్తుమే! 201

అ. మాధవు(డు = శ్రీ కృష్ణుడు ; ఇందునున్ = యుద్ధ రంగాన కూడా ; మాయలు; ఇంద్రజాలములు ; కొన్ని + పన్నినన్ = కొన్ని ప్రయోగించినప్పటికిని ; పాయవు = తీరవు ; అవారణన్ = తిరుగులేక ; నీవు ; ఎటులు = ఎట్లయినా ; రజ్జులు = ఆత్మస్తుతులు ; ఆడితేనియున్ = పలికినా; పాయవు ; వేయును + ఏల = వేయిమాటలెందుకు ; వే + పదివేలు =వేగంగా పది వేలమంది; పార్థులును = అర్జునులూ, విష్ణులున్ = కృష్ణులూ; వచ్చినన్ ; ఏము = మేము ; కయ్యమున్ = యుద్ధాన్నే ; చేయుదుము ; ఒక చీరియున్ = అణుమాత్రమైనా ; సంపదన్ = ఐశ్వర్యాన్ని; పంచియిత్తుమె = విభజించి యిస్తామా ?

భా. *ఈ రణరంగంలో కూడా శ్రీ కృష్ణుడు మాయలుచేసినా మోసాలు, చేసినా ఇంద్రజాలం ప్రదర్శించినా, నువ్వు నిర్విరామంగా డాంబికాలు పలికినా తీరిపోవు. పార్థులు, కృష్ణులు పదివేలమంది ఎత్తి వచ్చినా మేము యుద్ధమే చేస్తాము కానీ అణుమాత్రమైనా సంపద పంచి ఇవ్వము.*

వి. బాల్యంలో శ్రీ కృష్ణుడు చేసిన లీలలూ, కురుసభలో విశ్వరూప ప్రదర్శనమూ మొదలైనవి ఇంద్రజాలంలాగానో, మాయలాగానో కనిపిస్తున్నాయి కొందరికి. అందుకే ఇటువంటి మాట లనటం జరుగుతుంది.

వ. **అనిన విని భీమార్జున నకుల సహదేవు లొండొరుల మొగంబులు**
సూచుచు నాసనంబులు చలింప మొగంబులు జేవుఱింప(గ్రోధా
యత్తచిత్తులై యున్నం గనుంగొని నవ్వుచు నారాయణుం డులూకున
కిట్లనియె; నీవు పోయి సుయోధనుతో నెల్లవారును విన నిట్లనుము.202

అ. ఒండొరుల మొగంబులు = ఒకరిముఖము వేరొకరు; జేవుఱింపన్ = ఎఱ్ఱపడగా; క్రోధ + ఆయత్త + చిత్తులు = కోపమునకు వశమైన మనస్సులు కలవారు.

భా. *అనగా విన్న భీమార్జున నకుల సహదేవులు ఒకరి ముఖాలు ఒకరు చూచుకొన్నారు. కూర్చున్న ఆసనాలు కంపించాయి. ముఖాలు ఎఱ్ఱబడ్డాయి. కోపవివశ చిత్తు లైనారు. ఆ స్థితిలో ఉన్న భీమాదులను చూచి నవ్వుచు శ్రీ కృష్ణుడు ఉలూకుని చూచి "నీవు వెళ్ళి ఆ దుర్యోధనునితో అందరూ వింటుండగా ఇట్లా చెప్పు.*

వి. ఉలూకుడు భీమార్జునులను, కృష్ణుడినీ కూడా నిందించినా భీమార్జునులు క్రోధానికి లోనయ్యారు.శ్రీ కృష్ణుడు మాత్రం చిరు నవ్వు నవ్వి ఊరుకున్నాడు. ఎంత విలువ ఇవ్వవచ్చో అంతే విలు ఇవ్వగలవాడు కాబట్టి శ్రీ కృష్ణుడు స్థిత ప్రజ్ఞుడు.

వ్యాస భారతంలో పాండవులంతా ఉలూకుని మాటలకు ఆగ్రహించి దుర్యోధనుడికి సమాధాన మిచ్చినట్లుంది. అయితే తిక్కన కృష్ణార్జునులే బదులిచ్చి పంపినట్లు సంక్షేపించాడు.

తే. బవర మెల్లియ బిరుదవై బరవసంబు
గలిగి చావుము చావక తొలఁగ రాదు
కృష్ణ సారథికంబగు జిష్ణురథము
దొడరి నీ వెందుఁ జొచ్చినఁ దోన చొచ్చు. 203

అ. ఎల్లి + అ = రేపే ; బవరము = యుద్ధము; బిరుదవై = శూరుడవై ; బరవసంబు + కలిగి = ధైర్యముకలిగి ; చావుము = రణమున మరణించు ; చావక = మరణింపక ;తొలఁగరాదు = తప్పుకొన శక్యము కాదు; కృష్ణసారథికంబు + అగు = కృష్ణుడు సారథిగా గల్గిన; జిష్ణు + రథము = అర్జునుని రథము ; తొడరి = పూని ; నీవు ; ఎందున్ + చొచ్చినన్ = ఎక్కడకు పోయినను ; తోన + చొచ్చు = నీతో అక్కడకు వచ్చును.

భా. *యుద్ధము రేపే. శూరుడవై ధైర్యముతో నిలిచి రణాంగణమున చావు . చావక తప్పించుకోలేవు. కృష్ణసారథియైన అర్జునుని రథం నీ వెక్కడకు పోయినా నీ వెంటనే వస్తుంది.*

వి. దుర్యోధనుని దురారోపణలన్నిటికీ క్రమంగా కృష్ణుడు సమాధాన మిస్తున్నాడు ఆ మూర్ఖునకు తగిన రీతిగా సమాధానం చెప్పడం ఈ పద్యంలో కన్పిస్తుంది. మదించి యుద్ధం యుద్ధమని కలవరిస్తున్నావు కనుక యుద్ధ పర్యవసానానికి సిద్ధుడవగుము . అని పాండవుల ప్రతినిధిగా కృష్ణుడు హెచ్చరిస్తున్నాడు.

రిత్తలు రజ్జెడు వాఁడే
మత్తగజాయుతబలుండు మారుతి యని ను
ద్వృత్తుఁడగు దుస్ససేనుని
నెత్తు రురము వ్రచ్చి త్రావు నీవుం జూడన్. 204

అ: మత్తగజ+అయుత+బలుండు=పదివేల మదించిన ఏనుగుల బలము కలవాడైన; మారుతి= వాయునందనుడగు భీమసేనుఁడు; రిత్తలు= కల్లలు; రజ్జెడువాఁడు+ఏ=ప్రేలువాడా; అనిన్=యుద్ధమున; ఉద్వృత్తుఁడు+అగు=అవినీతిపరుడగు; దుస్ససేనుని=దుశ్శాసనుని యొక్క; ఉరమున్= రొమ్మును; వ్రచ్చి=చీల్చి; నీవు చూడన్= నీవు చూచుచుండగా; నెత్తురు= రక్తమును; త్రావున్= త్రాగగలడు.

భా: *పదివేల మదపుటేనుగుల బలంగల భీముడు అసత్యాలు పల్కడు. యుద్ధంలో నీవు చూస్తూఉండగానే స్వేచ్ఛా వర్తనుడైన ఆ దుశ్శాసనుని రొమ్ము బ్రద్దలు కొట్టి రక్తాన్ని త్రాగగలడు.*

వ: అని యిట్లు హరి పలికిన యనంతరంబ యర్జునుం డులూకున కిట్లనియె. 205

భా: అలా శ్రీకృష్ణుడన్న తర్వాత అర్జునుడు ఉలూకునితో ఇట్లు పలికాడు.

క: **వారు గలరు వీరు గలరు**
పోరికి నని చెప్పె దీవు పొంగారుచు మీ
వారిని మిమ్మును రేపు గ
దా రూపేర్పడఁగఁ జూచెదం గితవసుతా ! 206

అ : కితవసుతా = జూదరి కొడుకా! ; పోరికిన్ = యుద్ధమునకు ; వారు ; కలరు ; వీరు ; కలరు ; అని ; నీవు ; పొంగారుచున్ = ఆనందించుచు ; చెప్పెదు = పల్కుదువు ; మీవారిని = మీ అభిమానులను ; మిమ్మునున్ = మీ సోదరులను ; రూపు + ఏర్పడన్ = వాస్తవము వెల్లడి కాగా ; రేపు ; కదా ; చూచెదన్ = చూస్తాను.

భా : *జూదరి కొడుకా! యుద్ధానికి నాకు తోడుగా వారున్నారు, వీరున్నారని ఆనందంతో పల్కుతున్నావు. ఆ నిజానిజాలు రేపు మేము చూస్తాం గదా !*

వి : ఉలూకుని కితవ సుతా ! అని సంబోధించటం గమనింపదగ్గది. ఇతడు శకుని కొడుకు గదా!

చ : **తనభుజశక్తి లేక యొరుదర్పము యూఁది పరాక్రమింప వ**
చ్చిన నది సెల్లునే కులవిశిష్టుని సువ్రతు వృద్ధు నార్యు భీ
ష్ముని నెసకొల్పి సేనలకు ముఖ్యుఁడ వీవని యుబ్బఁజేసి యీ
సునఁ దలపెట్టి చంపికొనఁ జూచె సుయోధనుఁ డింత నేమగున్? 207

అ : సుయోధనుఁడు ; తన భుజశక్తి = తనకు బాహుబలము ; లేక ; ఒరు + దర్పము + అ = ఇతరుల కావరమునే ; ఊఁది = ఆలంబనముగాచేసుకొని ; పరాక్రమింపన్ + వచ్చినన్ = శౌర్యము చూపరాగా ; అది , చెల్లును + ఏ = సాగునా ; కులవిశిష్టునిన్ = కురువంశ శ్రేష్ఠుడును ; సువ్రతున్ = బ్రహ్మచర్యాదినియమవంతుడు ; వృద్ధున్ = వయోజ్ఞానముచే పెద్దయు అగు ; ఆర్యున్ = పూజ్యుని ; భీష్మునిన్ = భీష్మాచార్యుని ; ఎసకొల్పి = పురికొల్పి ; సేనలకున్ = సైన్యమునకు ; నీవు + అ = నీవే ; ముఖ్యుఁడు + వు + అని = నాయకుడవని ; ఉబ్బన్ + చేసి = సంతోషపరచి, ఈసునన్ = అసూయతో; తలపెట్టి = తలపడజేసి ; చంపికొనగ + చూచెన్ = చంపింప జూచెను ; ఇంతన్ = ఈ విధమైన సంకల్ప మాత్రం చేత ; ఏమి + అగున్ = ఏమి నెరవేరును.

భా : *ఉలూకా ! సహజంగా తనకంటూ భుజబలం లేక పరుల బల పరాక్రమాలాలంబనగా విక్రమింప వచ్చినచో ఆ ప్రయత్నము ఫలవంతం కాదు. కురువంశ శ్రేష్ఠుడు, నియమవంతుడు, వృద్ధుడు, పూజ్యుడు ఐన భీష్మాచార్యుని పురికొల్పి నీవే సేనాధిపతివని చెప్పి సంతోషపెట్టి అసూయతో తలపడజేసి చంపింపదలుస్తున్నాడు దుర్యోధనుడు. దానివల నేమవుతుంది ?*

వి : ఆత్మశక్తి, మనశ్శక్తి, తనుశక్తి ఇవి మాత్రమే తన బలంగా చెప్పుకోదగినవి. రాజులకు సలహాలకు మంత్రశక్తి, సహకారానికి సైన్యశక్తి ఉంటాయి. ఐతే ఇదింతఉన్నా

శత్రువులను స్వశక్తితో గెలవ గలిడినవాడే శక్తి ఫలితాలను సరిగా పొందగల్గుతాడు. ఆ వ్యక్తికే మాత్రమే శక్తివంతుడ నని చెప్పుకొనే అవకాశముంటుంది.

చ : **తనతలఁ పిట్లు భీష్ముభుజదర్పము లోకము కంటె నెక్కుడీ**
తని నొక భంగి నండగొని తప్పుదుఁ జావున కంచు నున్నవాఁ;
డనిఁ దొలుముద్ద గొందుము రయంబున నాతని; వెండి ద్రోణులం
దునుముదు;మప్డ సూతసుతుఁదోలుదు; మంతట నాస మాలెడున్. 208

అ : తన తలఁపు = తన (దుర్యోధనుని) ఆలోచన ; ఇట్లు = ఇటువంటిది ; భీష్మ = భీష్ముని యొక్క ; భుజదర్పము = బాహుబలం ; లోకముకంటెన్ =లోకులందరి భుజబలం కన్నా ; ఎక్కుడు ; ఈతనిన్ = ఈ భీష్ముని; ఒక భంగిన్ = ఏదో ఒక రీతిగా ; అండ + కొని = అండగా చేసుకొని ; చావునకున్ + తప్పుదున్ + అంచు = నాశాన్ని తప్పించుకొనగల ననుకొని; ఉన్నవాఁడు ; అనిన్ = యుద్ధంలో ; ఆతనిన్ = ఆ భీష్ముని; రయంబునన్ = శీఘ్రంగా ; తొలుముద్ద + కొందుము = మొదటి ముద్దగా కబళిస్తాము ; వెండి = ఆపై ;ద్రోణులన్ + ద్రోణాచార్యుని ; తునుముదుము = సంహరిస్తాము ; అప్డ ; సూతసుతున్ = కర్ణుని ; తోలుదుము + పంపివేయగలము ; అంతటన్ = అక్కడితో ; ఆస+ మాలెడున్ = (సుయోధనుడు) ఆశను వదులుతాడు.

భా : *భీష్ముడు భీమార్జునాదు లందరి కంటే బాహుబలంలో మిన్న అనే భావంతో సుయోధనుడు ఆ భీష్ముని అండజూచుకొని తనకు చావు లేదనుకొంటున్నాడు. రణరంగంలో మొదటి ముద్దగా ఆ భీష్మణ్ణే కబళిస్తాము. ఆ తర్వాత ద్రోణాచార్యుని సంహరిస్తాము. ఆపై కర్ణుని. అక్కడితో సుయోధనుడి ఆశలు కూలుతాయి.*

క : **అనుజుల తనుజుల చావులు**
గనుఁగొని మఱి తాను భీముగదచే నిలఁ గూ
లిన యప్పుడైన దుర్యో
ధనుఁడు మదిం దలఁచుఁగాక తనదుష్కృతముల్. 209

అ : అనుజుల = తమ్ముల యొక్కయు ; తనుజుల = కుమారుల యొక్కయు ; చావులు = మరణము; కనుగొఁని = చూచి ; మఱి = ఆ పైన ; తాను ; భీముగదచేన్ = భీమసేనుని గదచేత ; ఇలన్ = నేలపై ; కూలిన+ అప్పుడు + ఐన = పడినప్పుడైనా ; దుర్యోధనుఁడు ; తన దుష్కృతముల్ = తన దుశ్చేష్టలు; మదిన్ తలఁచున్ + కాక = ఆలోచించుగాక.

భా : *తమ్ముల యొక్కయు, కుమారుల యొక్కయు చావు కళ్ళారా చూచి, ఆపై భీముని గదచేత తాను నేలగూలినప్పుడైనా సుయోధనుడు తన అకృత్యాలను మనసులో తలచుకొనునుగాక!*

వి : అనుజుల తనుజుల చావు చూచినప్పుడైనా తన దుష్కృత్యాలు తలచుకోవటం సుయోధనుడికి రెండుతీరులలో సంభవిస్తుంది. తన వాత్సల్యానికి పాత్రులైన వారినందరినీ పోగొట్టుకోవటం ఒకటి. పరిపాలకుడుగా తాను చేసిన పనికి తన వారంతా బలియైపోవటం రెండవది.

వ : అది యట్లుండె నీవు వేగపోయి రేపకడయ మీరాజుం గలనికి నడపింపు మనియె; నప్పుడు ధర్మనందనుం డులూకునకుం దాంబూలా భరణంబు లిచ్చి వీడుకొలిపి ధృష్టద్యుమ్ను నవలోకించి, "యెల్లి కయ్యంబని మనసైన్యంబుల కెల్ల నెఱింగించి, సర్వసమరసన్నాహంబులు నమకట్టుమని పనిచి, కొలువు విరిసి చనియె ; ధృష్టద్యుమ్నుండును ద్రోణులం దొడరం బడసితి నని యుబ్బుచు వెడలి "భీష్ముం దలపడఁ గంటినని" పొంగు శిఖండి తోడుగా రాజు శాసనంబు నిర్వర్తించె; నిట యులూకుండు వచ్చి దుర్యోధనుం బేరోలగంబునఁ గని, యతనికిఁ గృష్ణార్జునుల పలుకులున్న రూపు విన్నవించిన నతండు కర్ణుదెసఁ గనుంగొని, "సమస్తసేనలకు రేపు బవరంబని చెప్పిపుచ్చుము. సకల సాధనంబులు నాయితంబులు సేయు" మని పనిచిన నతండు నట్లచేసె ; ని ట్లుభయ కటకంబులు రణంబునకు నుత్సహించి, విజృంభించి, యుల్లసిల్లె ; ననిన ధృతరాష్ట్రుండు సంజయున కిట్లనియె. 210

అ : రేపకడయ =ఉదయమే ; ఎల్లి = రేపు; సమకట్టుము = కూర్పుము ; ఉబ్బుచున్ = ఆనందించుచూ ; పేరు + ఓలగంబునన్ = కొలువులో ; బవరంబు=యుద్ధం ; ఆయితంబులు =సిద్ధములు ; కటకంబులు = సేనలు.

భా : 'అది అలా ఉండనీ. నీవు వేగంగా వెళ్ళి ప్రొద్దుటే మీ రాజును యుద్ధానికి పంపించు అన్నాడు అర్జునుడు. అప్పుడు ధర్మరాజు తాంబూలాభరణాదుల నిచ్చి ఉలూకుని వీడ్కొలిపాడు. ఆపై ధృష్టద్యుమ్నునిచూచి రేపే యుద్ధమని మన సైన్యాని కంతటికీ తెలిపి యుద్ధసన్నాహాలు చేయుమని ఆదేశించాడు. ధృష్టద్యుమ్నుడు ద్రోణుని ఎదిరించే అవకాశం వచ్చినందుకు ఆనందించుతూ, భీష్మునితో తలపడ గలిగినందుకు పొంగిపోతున్న శిఖండితో కలిసి అన్ని ఏర్పాట్లు చేశాడు.

ఇక్కడ ఉలూకుడు వచ్చి కొలువు తీరియున్న సుయోధనుడికి కృష్ణార్జునుల మాటలు యథాతథంగా వివరించి చెప్పాడు. ఆ మాటలు విన్న సుయోధనుడు కర్ణుని చూచి "సమస్తసేనకూ రేపే యుద్ధమని చెప్పిపంపి సకల సాధనాలనూ సమాయత్తం చేయించమని చెప్పి పంపగా కర్ణుడు ఆ మాటలు పాటించాడు. ఈ రీతిగా రెండు సేనలూ రణోత్సాహంతో విజృంభించాయి. ఆ మాటలు విన్న ధృతరాష్ట్రుడు సంజయునితో నిట్లంటున్నాడు.

క : **వినుము హరి తోడుగల య**
ర్జును గెలువ నదీసుతునకు జొప్పడునే! యా
పని నిలుపు ములూకుని చె
ప్పిన మాటలకేమి యనిరి పిదపఁ గొలువునన్. 211

అ : వినుము= సంజయా విను ; హరితోడుగల = శ్రీకృష్ణుడు సాయంగా గల ; అర్జునున్ = అర్జునుణ్ణి ; గెలువన్ = ఓడించుటకు ; నదీసుతునకున్ = భీష్మునకుకూడా;

చొప్పగునే = వీలగునా ; ఆ పని ; నిలుపుము = అటుంచు; పిదపన్= ఆ తర్వాత ; కొలువునన్ = సభలో ; ఉలూకుని చెప్పిన మాటలకున్; ఏమి + అనిరి = ఏమన్నారు.

భా : సంజయా ! అర్జునునికి శ్రీకృష్ణుడు తోడుగా ఉంటే గెలవట మన్నది భీష్మునకైనా వీలవుతుందా ? అది అటుండనీ. ఆ కొలువులోఉలూకుని మాటలు విన్న తర్వాత వారేమన్నారు?

వ : అనిన విని యంబికానందనునకు సూతనందనుం డిట్లనియె. 212

అ : అంబికానందనునకున్ = ధృతరాష్ట్రునితో

భా : ఆ మాటలు విన్న సంజయుడు ధృతరాష్ట్రునితో ఇలా అన్నాడు.

ఆ : అయ్యులూకు పలుకు లన్నియు విని భవ
త్తనయుతోడ నిట్టు లనియె భీష్ముఁ
"డేను గలుగ వెఱవ నేటికి సేనలఁ
గాతు నీవు మెచ్చఁ గౌరవేంద్ర! 213

అ : ఆ + ఉలూకు పలుకులు + అన్నియున్ = ఆ ఉలూకుడన్న మాటలన్నీ విని ; భవత్తనయు తోడన్ = నీ కుమారునితో ; భీష్ముఁడు ; ఇట్టులు + అనియెన్ ; కౌరవ + ఇంద్ర =ఓ సుయోధనా ! ; ఏను + కలుగన్ = నేనుండగా ; వెఱవన్ + ఏటికిన్ = జంకనేల ; నీవు; మెచ్చన్ = మెచ్చుకొనేటట్లు ; సేనలన్ ; కాతున్ = రక్షించెదను.

భా : ఉలూకు డన్న ఆ మాటలన్నీ విని భీష్ముడు నీ కొడుకుతో ఇలా అన్నాడు "ఓ మహారాజా ! నేనుండగా నీకు భయమెందుకు ; నీవు మెచ్చేలా సేనా సంరక్షణం నేను చేయగలను.

వి : మంచైనా, చెడైనా నిర్ణయం తీసుకున్న తర్వాత నిజాయితీగా ప్రవర్తించటం అవసరం. ఆ పద్ధతిలోనే భీష్ముడు సుయోధనుడికి అభయ మిస్తున్నాడు.

క : నడిపింపఁగఁ బొడిపింపఁగ
నెడమడువై కలఁగి నప్పు డేర్పఱుపఁగ నేఁ
గడు నేర్తుఁ బేర్చు నాదగు
కడిమియ నీ సైన్యమునకు గొసెన గాదే! 214

అ : నడిపింపఁగన్ = నడిపించుటకూ ; పొడిపింపఁగన్ = సంహరింపజేయుటకూ; ఎడమడువు + ఐ = అస్తవ్యస్తమై ; కలఁగిన + అప్పుడు = బెదరినప్పుడు; ఏర్పఱుపఁగన్ = చక్కబరచటానికి ; ఏన్ = ఏను ; కడు నేర్తున్ = బాగా ఎఱుగుదును ; పేర్చు = విజృంభించునట్టి ; నాది + అగు = నాదైన ; కడిమి + అ = సామర్థ్యమే ; నీ సైన్యమునకున్; గొసెన + కాదే = కవచం కాదా ?

భా : సైన్యాన్ని నడిపించటం , శత్రుసేనను సంహరించటం, పరిస్థితి విషమించి సేనలు బెదరినపుడు వాటిని చక్కచేయటం నాకు బాగా తెలుసు. నా పరాక్రమ విజృంభణమే నీ సేనకు కవచం వంటిది కాగలదు."

వి : 'నా కడిమియ (నా ధైర్యమే) నీ సేనకు రక్ష,' అనుటలో కర్ణాదులు నా వలె నిన్నూ, సేననూ కాపాడలేరన్న భావం ధ్వనిస్తుంది.

క : అనినం గురు రా జిట్లను
"వినుము పితామహ! మహాస్త్రవిత్తము లనఁగాఁ
జను నీవును నాచార్యుం
డును గలుగఁగ నాకు నెన్నఁడును వెఱపేలా ? 215

అ : అనినన్ = అనగా ; కురురాజు = ధుర్యోధనుడు ; ఇట్లు + అనున్ ; పితామహ = తాతా! ; వినుము ; మహా + అస్త్ర - విత్తములు = గొప్ప గొప్ప అస్త్రములు తెలిసిన వారిలో శ్రేష్ఠులు ; అనఁగాన్ + చను = అనగా ఒప్పునట్టి ; నీవునున్ ; ఆచార్యుండును = ద్రోణాచార్యుడును; కలుగఁగన్ = ఉండగా ;నాకున్ ; ఎన్నఁడును = ఎప్పుడైనా; వెఱపు + ఏలా = భయమెందుకు ?

భా : అనగా దుర్యోధను డిట్లన్నాడు " పితామహా ! మహాస్త్రాల నెరిగిన వారిలో గొప్పవారైన మీరూ, ద్రోణాచార్యులూ ఉండగా ఇంక నాకు భయ మెందుకు "?

వి : భీష్ము డిచ్చిన అభయాన్ని పురస్కరించుకొని సమయజ్ఞుడైన దుర్యోధనుడు భీష్మునితో పాటు ద్రోణుని కూడ కలుపుకొని, భీష్మునకు కృతజ్ఞత చెపుతూ ద్రోణుని సహాయాన్ని కూడా సిద్ధించినట్లే భావించుకుంటూ మాటాడుతున్నాడు.

తే : ఏను గంధర్వ కిన్నర దానవాది
దివ్య భూతంబులకును భీతిల్ల ననినఁ
బాండుపుత్రుల మాత్రకు భయము నాకు
నెక్కడిది వ్రేల్మిడిన వారి యుక్కు మడఁతు. 216

అ : ఏను ; గంధర్వ ... లకునున్; గంధర్వ = గంధర్వులూ, కిన్నర = కిన్నరులూ,దానవ + ఆది = రాక్షసులుమొదలయిన, దివ్య భూతంబులకునున్ = దివ్య ప్రాణులకు కూడా ; భీతిల్లను + అనినన్ = భయపడనంటే ; పాండుపుత్రుల మాత్రకున్ = పాండవుల మాత్రమునకు ; నాకున్ భయము + ఎక్కడిది ; వ్రేల్మిడిన్ = చిటికెలో ; వారి + ఉక్కు = వారి గర్వాన్ని ; మడఁతున్ = అణిచెదను.

భా : గంధర్వులూ, కిన్నరులూ, రాక్షసులూ మొదలైన దేవతా విశేషులకు కూడా నేను భయపడను. మానవ మాత్రు లయిన ఈ పాండవులంటే నాకు భయమా ? చిటికెలో అహంభావము నణగిస్తాను.

-: భీష్ముఁడు గౌరవసేనలో నతిరథ మహారథాదుల నిరూపణంబు సేయుట:-
సం 5 - 162 - 15.

వ : అని పలికి మఱియు నిట్లనియె. 217

క : నీయందు వారియందుం
జేయం గల మానుసుల విశేషంబులఁ జి
త్తాయత్తంబుగఁ జెప్పుము
నీ యెఱుఁగనియవియు లేవు నిక్కపుఁ దరముల్. 218

అ : నీయందున్ = నీ సేనలోను ; వారియందున్ = వారిసేనలలోను ; చేయంగల = రణమొనర్పగల ; మానుసుల + విశేషంబులన్ = మనుష్యుల తారతమ్యాలను ; చిత్త ఆయత్తంబుగన్ = మనస్సు కందినంతవరకు ; చెప్పుము ; నిక్కము + తరముల్ = వాస్తవమైన అంతరాలు ;నీ+ ఎఱుఁగని + అవియున్ = నీకు తెలియనివి ; లేవు ;

భా : నీకు తెలిసినంత వరకు మనవారిలోనూ, పాండవులలోనూ యుద్ధం చేయగల మేటి వీరుల తారతమ్యాలను చెప్పు. నీకు తెలియని అంతరాలు వాస్తవానికి లేవు గదా.

క : అనవుడు "నీ విట్లడిగిన
విని యూరక యుండఁ దగదు విను మేర్పడ నె
ల్లను నున్నరూపు సెప్పెద
మన వారల వారి వారి మానము లధిపా "! 219

అ : అనవుడున్ = అన్నవెంటనే ; అధిపా = రాజా ; నీవు ; ఇట్లు + అడిగినన్ = నీవు అడుగగా ; విని ; ఊరక + ఉండన్ + తగదు= ఊరకుండరాదు ; వినుము ; మనవారల = మనవారి యొక్కయు ; వారి వారి = వారి వాళ్ళయొక్కయు ; మానములు = ప్రమాణములు; ఏర్పడన్ = స్పష్టంగా ; ఎల్లను = పూర్తిగా; ఉన్నరూపు = వాస్తవం ; చెప్పెదన్.

భా : సుయోధను డలా అనగానే భీష్ముడు "రాజా ! నువ్వు ఇలా అడిగిన తర్వాత విని ఊరకుండరాదు. మనవారి యొక్క వారివాళ్లయొక్క తారతమ్యాలను పూర్తిగా స్పష్టంగా ఉన్న దున్నట్లు చెపుతాను విను" (అని అన్నాడు)

వి : కలరూపు చెప్పటం భీష్మాదులకు అలవాటు. సుయోధనుడికి అది మనస్సుకు కష్టంగానే ఉంటుంది. **అయినా** తాను సత్యాన్నే చెపుతాడు భీష్ముడు.

వ : అని గాంగేయుం డిట్లనియె. 220

భా : అని భీష్ముడిలా అంటున్నాడు.

సీ : నీ వతిరథుఁడవు, నీతమ్ము లందఱు
సమరథశ్రేష్ఠులు సమరమునకుఁ

బరుసని వీరులు పాంచాలసేన ని
ర్జింతురు; నను నేన చెప్పికొనఁగ
నేర నా యేడ్తెఱ మీ రెఱుంగుదురు; భో
జాగ్రణి కృతవర్మ యతిరథుండు;
దృఢవేధి యీతండు దీర్చు నెంతటి పని
యైనఁ గైకొని; శల్యుఁ డతిరథుండు

ఆ : వాసుదేవుతోడి యీసువాఁ డల్లుర
విడిచె నిన్నుఁగూడి ; విక్రమమునఁ
బేరుకొనఁగఁ జాలు భూరిశ్రవుం డతి
రథుల మొదలి యనికి రక్కసుండు. 221

అ : నీవు; అతిరథుఁడవు; నీ తమ్ములు + అందఱు; సమరథశ్రేష్ఠులు = సమరథులలో గొప్పవారు ; సమరమునకున్ = యుద్ధానికి ; పరుసని వీరులు = దృఢమైన వీరులు ; పాంచాల సేనన్ = ద్రుపదుని సైన్యాన్ని ; నిర్జింపఁగలరు = ఓడింపగలరు ; ననున్ ; ఏను + అ = నేనే; చెప్పికొన ఁగన్ + నేరను = చెప్పుకొనజాలను ; నా + ఏడ్తెఱ = నా సామర్థ్యం ; మీరు+ ఎఱుఁగుదురు = మీకు తెలుసు ; భోజ + అగ్రణి = భోజవంశశ్రేష్ఠుడైన ; కృతవర్మ ; అతిరథుండు; దృఢవేధి = గట్టిగా లక్ష్యాన్ని భేదింపగలవాడు; ఈతండు ఎటువంటిపని + ఐనన్ ;చేకొని = గ్రహించి, తీర్చున్ = నేరవేర్చును ; శల్యుండు ; అతిరథుండు ; వాసుదేవుతోడి + ఈసువాఁడు = శ్రీకృష్ణునిపై అసూయగలవాడు; నిన్నున్ + కూడి = నీతోకలిసి ; అల్లురన్ ; విడిచె ; విక్రమమునన్ = పరాక్రమంలో ; పేరుకొనఁగన్ + చాలు = లెక్కింపదగిన ;భూరి శ్రవుండు ; అతిరథుల = అతిరథుల యొక్క ; మొదలి + అనికిన్ = యుద్ధారంభానికి ; రక్కసుండు = రాక్షసుడు.

భా : *నీవు అతిరథుడవు. నీ తమ్ము లందరు మేటి సమరథులు. యుద్ధానికి అవసరమైన దృఢత్వం కలవారు. పాంచాలసేనను గెలువగలవారు. నన్ను గురించి నేనే చెప్పుకొనవలసిన అవసరం లేదు. నా శక్తి సామర్థ్యాలు మీకు తెలిసినవే. భోజవంశశ్రేష్ఠుడైన కృతవర్మ అతిరథుడు. లక్ష్యాన్ని దృఢంగా భేదింపగలవాడు. ఎటువంటి కార్యాన్ని అయినా చేపట్టి సాధించగలవాడు. శల్యుడు అతిరథుడు. శ్రీకృష్ణుని మీదనున్న అసూయతో అల్లుళ్ళను వదలి నీ పక్షం చేరినవాడు. పరాక్రమ వంతులలో శ్రేష్ఠుడైన భూరిశ్రవుడు అతిరథుడు. అతిరథుల పాలిటికి రాక్షసుడు.*

వి : ఒక విలుకానితో సరిగా నిలిచి యుద్ధం చేయగలవాడు సమరథుడు. అనేక రథికులతో ఒంటరిగా పోరాడగలవాడు అతిరథుడు. యోధులలో అత్యున్నత స్థానం అతిరథులదే.

క : విను సైంధవుఁడు మహారథుఁ
డనిఁ బోక పెనంగు నతని నా ద్రౌపదికై
పెనుపఱిఁ బఱిచిరి కుంతీ
తనయులు వారల కెదుర్పఁదపము జేసెన్. 222

అ : విను ; సైంధవుఁడు మహారథుఁడు ; అనిన్ = యుద్ధంలో ; పోక =వెనుదీయక: పెనంగున్ = పోరుతాడు ; ఈతనిన్ =ఈ సైంధవుని ; కుంతీతనయులు = పాండవులు ; పెనుపఱన్ + పఱచిరి = అతిశయం నశింపగా పరాభవించారు ; వారలకున్ + ఎదుర్పన్ = వారినెదిరించుటకై ; తపమున్ + చేసెన్.

భా : సుయోధనా విను! ఈ సైంధవుడు మహారథుడు. యుద్ధంలో వెనుకంజ వేయక పోరాడగలడు. ద్రౌపదికోసం పాండవులు ఈ సైంధవుని అతిశయం తగ్గేటట్లు అవమానించారు. వారిని ఎదిరించటానికై ఇతడు తపస్సు కూడా చేశాడు.

వి : పదివేల మంది విలుకాండ్రతో అసహాయుడై పోరాడగలవాడు మహారథుడని నిఘంటువుల సూచన.

వ : కాంభోజరాజగు సుదక్షిణుండు సమరథుం డితని పోల రథబృందంబులు మేలుగలుగుఁ బాండవబలంబులం గలంచు; మాహిష్మతీపతియగు నీలుం డర్ధరథుం డితనికి సహదేవునకు, దగనిపగయై యుండు దానంజేసి యాలంబున నోలమాసగొనం ; డవంతిదేశాధీశులగు విందానువిందు లర్ధరథులు ; పరస్పర స్నేహంబున సాహసికులై యొకళ్లొకళ్ళం బెట్టి పోవక పోరుదురు; త్రిగర్తపతులు తోడంబుట్టువు లేవురును మహారథులు, గోగ్రహణంబునం బడిన బన్నంబుఁ బాపికొనం గడంగుదురు, వీరికి భుజబలం బగ్గలంబై యుండు. 223

అ : ఓలము + ఆసగొనండు = యుద్ధానికి వెనుదీయడు ; పెట్టి పోవక = ఆరోపించిపోక ; బన్నంబు = అవమానం ; అగ్గలంబు = అధికము.

భా : కాంభోజ దేశాధిపతియైన సుదక్షిణుడు సమరథుడు. అతని వద్ద మంచి రథసేన ఉన్నది. దానితో పాండవులను సంక్షోభపెట్టగలడు. మాహిష్మతీపురాధిపతి నీలుడు అర్ధరథుడు. ఇతనికి సహదేవునితో తెగని శత్రుత్వం. కాబట్టి యుద్ధంలో వెనుదీయడు. అవంతి దేశాధిపతులైన విందానువిందులు అర్ధరథులు. పరస్పరం స్నేహితులు. సాహసికులు. యుద్ధంలో ఒకరికన్న మిన్నగా వేరొకరు వెనుదీయక పోరాడగలరు. త్రిగర్తపతులైన అయిదుగురు సోదరులు మహారథులు. వీరికి భుజబలమెక్కువ. గోగ్రహణ కాలంలో జరిగిన పరాభవాన్ని తొలగింప జేసుకోవటానికి ప్రయత్నించగలరు.

క : సమరథుడు బిరుదు లక్ష్మణ
కుమారకుం డేచి మొనలఁ గోల్తలనేయున్
మిము నెల్ల మిగులు భుజగ
ర్వము మదముం గలఁడు కొనఁ డరాతుల నధిపా ! 224

అ : బిరుదు = శూరుడైన ; లక్ష్మణకుమారకుండు = నీ పుత్రుడైన లక్ష్మణుడు ; సమరథుఁడు; ఏచి = చెలరేగి ; కోల్తలన్ = యుద్ధమందు ; మొనలన్ = సైన్యాన్ని ; ఏయున్

= సంహరించును ; మిము + ఎల్లన్ = మిమ్మందరినీ ; మిగులు = మించునట్టి ; భుజగర్వము = భుజబలమూ ; మదమున్ = అహంభావమూ ; కలఁడు = కలిగినవాడు ; అధిపా = రాజా అరాతులన్ = శత్రువులను ; కొనఁడు =లెక్కపెట్టడు.

భా : ఓ రాజా ! శూరుడైన లక్ష్మణకుమారుడు సమరథుడు. రణరంగంలో చెలరేగి శత్రుసేనను సంహరింపగలడు. మిమ్ములనందరినీ మించిన భుజబలమూ, అహంకారమూ గలవాడు. శత్రువుల నెవ్వరినీ లెక్కచేయడు.

వ : బృహద్బలుండు సమరథుండు, గోసలబలంబుతోడం గడంగి చిచ్చునుం గరువలియునుం గొని తాఁకు; దండధారుం డర్ధరథుండు సేనపఱపు గలండు బెట్టిదంబుగాఁ గయ్యంబు సేయు. 225

అ : చిచ్చు = అగ్ని ; కరువలి = గాలి ; పఱపు = విస్తృతి ; బెట్టిదంబుగాన్ = భయంకరంగా.

భా : బృహద్బలుడు సమరథుడు. అతడు కోసల సైన్యాలతో గూడి అగ్ని వాయువు కలిసివచ్చినట్లు ఎదిరించగలడు. దండధారుడు అర్ధరథుడు, ఎక్కువ సైన్యం గలవాడు, భయంకరంగా పోరాడగలవాడు.

తే : అతిరథోత్తముఁ డివ్వీటి యందు మేటి
కృపుఁడు తన పెంపు వాటించి గెలుచుఁ జచ్చు
గాని నాలుగు తెఱఁగుల సేనలకును
దివియ (డించుకయును నరదేవముఖ్య ! 226

అ : నరదేవముఖ్య = రాజశ్రేష్ఠా ! ; ఈ + వీటి యందున్ = ఈ సేనలలో; మేటి = గొప్పవాడైన; కృపుఁడు; అతిరథోత్తముఁడు = అతిరథులలో శ్రేష్ఠుడు ; తన పెంపు = తన ఆధిక్యాన్ని పాటించి = ప్రదర్శించి (ఆచరించి), గెలుచున్ + చచ్చున్ +కాని = విజయమో, వీరస్వర్గమో స్వీకరిస్తాడు కానీ ; నాలుగు +తెఱఁగుల సేనలకును = చతురంగబలాలకును ; ఇంచుకయును = కొంచెం కూడా ; దివియఁడు = వెనుదీయడు.

భా : మహారాజా ! కృపుడు అతిరథుడు, ఈ మనసేనలో మేటియైన వాడు. రణరంగంలో విజయమో వీరస్వర్గమో అని పోరాడుతాడే కానీ చతురంగ బలాలకూ కొంచెంకూడా వెనుదీయడు.

క: శకుని విను సమరథుడు పాం
డుకుమారులతోడ నెప్పుడుం బగగొని వా
రికిఁ గీడ రోయు; భృత్యులు
ప్రకటబలులు గలరు; నేర్పు బవరంబునకున్. 227

అ : విను ; శకుని ; సమరథుఁడు ; పాండుకుమారులతోడన్ ; ఎప్పుడున్ ; పగ+కొని = విరోధించి ; వారికిన్ ; కీడు + అ+రోయున్ = కీడే తలచును ; ప్రకటబలులు = ప్రసిద్ధ

బలశాలులు ; భృత్యులు = సైనికులు; కలరు = ఉన్నారు; బవరంబునకున్ = యుద్ధానికి కూడా; నేర్చున్ = సమర్థుడగును.

భా : శకుని సమరథుడు, పాండవులతో ఎప్పుడూ పగబట్టి వారి కీడే కోరుకుంటాడు. అతనికి బలవంతులైన సైనికు లున్నారు. యుద్ధానికి కూడా అతడు సమర్థుడు.

మ : వరదివ్యాస్త్రవిదుండు బాహు ఘనుఁ డశ్వత్థామ, గాండీవితోఁ
బురుడింపం దగువాఁడు వీని కెన యీ భూలోక సంచారు లె
వ్వరు లే రీతఁడు బ్రాహ్మణుండనని భావం బూనఁగా నోర్వమిం
దర మూహింపఁగ లేద కాని జముచందం బయ్యెడుం బోరులన్. 228

అ : అశ్వత్థామ ; వర .... విదుండు ; వర = శ్రేష్ఠమైన, దివ్య = గొప్పవైన, అస్త్ర = అస్త్రములను, విదుండు = తెలిసినవాడు ; బాహు ఘనుఁడు = బాహుబలంగలవాడు ; గాండీవితోన్ = అర్జునునితో ; పురుడింపన్ + తగువాడు = పోల్చతగినవాడు ; వీనికిన్ ; ఎన = సాటి ; ఈ భూలోక సంచారులు = ఈ మానవులలో ; ఎవ్వరున్ ; లేరు ; ఈతఁడు; బ్రాహ్మణుండను + అని ; భావంబున్ = ఆలోచనను ; ఊనఁగాన్ + ఓర్వమిన్ = వహించటానికి సిద్ధపడనందువలన ; తరము = స్థాయి; ఊహింపఁగ లేద = ఊహింప లేము కాని; పోరులన్ = యుద్ధంలో ; జముచందంబు = యముని తీరు ; అయ్యెడున్ = అగును.

భా : అశ్వత్థామ బాహుబలశాలి, దివ్యాస్త్రవేత్త. అర్జునునితో పోల్చదగిన వ్యక్తి. ఇతనికి సాటియైన వారు ఈ భూలోకవాసులలో ఎవ్వరూ లేరనవచ్చు. బ్రాహ్మణుడు కాబట్టి యుద్ధంపై ఇతడు తగినంత శ్రద్ధవహించటంలేదు కానీ రణరంగంలో ఇతడు యమునివంటివాడు.

వి. ఇక్కడ మూలంలో ఇలా ఉంది.
దోష స్తస్య మహానేకో యేనైవ భరతర్షభ
న మే రథో నాతిరథో మత: పార్థివ సత్తమ ఉద్యో. 167-7
జీవితం ప్రియ మత్యర్థ మాయుష్మాను: సదా ద్విజ:
నహ్యస్య సదృశ: కశ్చి దుభయో: సేనయోరపి.

బ్రాహ్మణుడు కాబట్టి జీవితాశ మెండుగా ఉంది. అందుచే ఇతని స్థాయిని నిర్ణయింపలేమని పై పద్యమును సమన్వయింప వలెను.

సీ : అతిరథోత్తముఁడు ద్రోణాచార్యుఁ డందలి
యిందలి విలుకాండ్ర కెల్ల గురుఁడు
హితుఁడు నీ కెంతయు నేర్చిన మొన లితం
డడరినఁ జమరిన యట్ల ప్రుందు
వృద్ధని యితని భావింపరా దనిలోన
నంగ విస్ఫురణంబు భంగి సూడ

నర్జునుపైఁ గూర్మి నతని నో నేయఁడు
సచరాచరంబైన జగము లెల్ల
తే : నొక్కమొగమై కడంగిన (జిక్కువఱుచు
దివ్యబాణజాలంబుల దీటుకొలిపి
ప్రాణములు డాఁపఁ డీతని పాటి దొరలఁ
గాన మే రాజ్యములయందుఁ గౌరవేంద్ర ! 229

అ : ద్రోణాచార్యుఁడు ; అతిరథ + ఉత్తముఁడు ; అందలి + ఇందలి = పాండవకౌరవ పక్షాలలోని ; విలుకాండ్రకున్ + ఎల్లన్ = విలుకాండ్ర కందరికీ ; గురుఁడు ; నీకున్ ; ఎంతయున్ = చాలా ; హితుఁడు = మేలుకోరువాడు ; ఏర్చిన + మొనలు = వ్యూహంగా నున్న సేనలు ; ఇతండు ; అడరినన్ = విజృంభించితే ; చమరిన + అట్లు + అ = చరచినట్లుగా; ప్రమందున్ = నశించును ; అనిలోనన్ = యుద్ధంలో ; అంగవిస్ఫురణంబు = శరీరముప్పొంగెడి ; భంగి + చూడన్ = పద్ధతిని గమనింపగా ; ఇతనిన్ ; వృద్ధు + అని = వృద్ధుడని ; భావింపరాదు = తలచరాదు ; అర్జునునిపైన్ ; కూర్మిన్ = ప్రేమవలన ; అతనిన్ + నోన్ + ఏయ (డు = అతడు నొచ్చుకొనేటట్లు బాణప్రయోగం చేయలేడు ; సచర + అచరంబైన = స్థావర జంగమంబులైన ; జగములు+ ఎల్లన్ = ఒక్క మొగము + ఐ = ఏక ముఖంగా ; కడంగినన్ = ఉద్యమించినను ; దివ్య - బాణ- జాలంబులన్ = గొప్పబాణాల సమూహంతో ; దీటు కొలిపి = ప్రయోగించి ; చిక్కు + పఱచున్ = చీకాకు పెట్టును ; కౌరవేంద్ర = సుయోధనా! ; ప్రాణములు ; డాపఁడు = దాచుకొనడు ; ఈతని సాటిదొరలన్ = ఇతనితో సమానమైన వీరులను; ఏ రాజ్యములయందున్ ; కానము= చూడజాలము.

భా : ద్రోణుడు అతిరథులలో శ్రేష్ఠుడు. కురు పాండవ పక్షాలలోని విలుకాండ్ర కందరకూ ఇతడే గురువు. నీ శ్రేయోభిలాషి. పన్నిన సేనలను ఇతడు విజృంభించి రూపుమాపగలవాడు. యుద్ధ సమయంలో ఇతని శరీరముప్పొంగే తీరు చూస్తే ముసలివాడని అనజాలము. ఇతనికి అర్జునునిపై ప్రేమ ఎక్కువ. కాబట్టి అతడు నొచ్చుకొనేటట్లు బాణ ప్రయోగం చేయజాలడు. కానీ చరాచర ప్రపంచమంతా ఒక్కటై వచ్చినా తన బాణప్రయోగంతో చీకాకు పెట్టగలవాడు. ప్రాణాలకు తెగించి పోరాడ గలవాడు. ఏ రాజ్యంలోనూ ఇంతటి వీరుడు కనరాడు.

వి : కౌరవబలంలో భీష్మద్రోణు లిద్దరిదీ ఒకే ఆలోచన. వారి శరీరాలు వేరైనా వారి మనస్సులు ఒక్కటే. ఇద్దరికీ పాండవ పక్షపాతం - ధర్మపక్షపాతం - ఎక్కువ. అందుకే కలరూపు చెప్పటంలో తన మనస్సుతోపాటు ద్రోణాచార్యుల మనస్సును కూడా స్పష్టంగా ప్రకటించాడు భీష్ముడు.

క : అతిరథుఁడు బాహ్లికుఁడు విను
మతులిత బలుఁ డితని యట్ల యాత్మజుఁడును వి
శ్రుత శక్తి సోమదత్తుం
డితనికి నీతనికి సమర మెన పెండిలికిన్. **230**

అ : వినుము ; బాహ్లికుఁడు ; అతిరథుఁడు ; అతులిత = సాటిలేని, బలుఁడు = బలముగలవాడూ ; విశ్రుత శక్తి = ప్రసిద్ధమైన బలం కలవాడు ; ఆత్మజుఁడును = (ఇతని) కుమారుడునూ అయిన ; సోమదత్తుండు ; ఇతని + అట్ల = ఇతనివంటివాడే ; ఇతనికిన్ = బాహ్లికునకూ ; ఈతనికిన్ = సోమదత్తునకూ ; సమరము = యుద్ధం ; పెండిలికిన్ = కళ్యాణానికి, ఎన = సమానం.

భా : విను. బాహ్లికుడు అతిరథుడు. బాహ్లికుని వలెనే అతని కుమారుడు సోమదత్తుడు కూడా బాహుబలం, విశ్రుతమైన శక్తీ కలవాడు. ఈ ఇద్దరికే యుద్ధమంటే పెళ్ళితో సమానం.

క : అసురవరుఁ డీ యలంబుషుఁ
డసమానబలుండు సమరథాగ్రణి విను పాం
డుసుతుల యెడ రోషము గలఁ
డసంఖ్యమాయాబలమున నరులఁ గలంచున్. 231

అ : విను ; ఈ + అలంబుషుఁడు ; అసురవరుఁడు = రాక్షస శ్రేష్ఠుడు ; అసమానబలుఁడు = సాటిలేని బలంగలవాడు ; సమరథ + అగ్రణి = సమరథశ్రేష్ఠుడు ; పాండుసుతుల + ఎడన్ = పాండవుల పట్ల ; రోషము + కలఁడు = కోపంగలవాడు ; అసంఖ్యమాయాబలమునన్ = అమేయమైన మాయాజాలంతో ; అరులన్ = శత్రువులను ; కలంచున్ = కలతపెట్టును.

భా : ఈ అలంబుషుడు మహాబలశాలి. రాక్షసశ్రేష్ఠుడూ, సమరథులలో మేటియైనవాడు. పాండవులపై ఇతనికి ద్వేషముంది. తన మాయాబలంతో యుద్ధంలో శత్రువులను కలత పెట్టగల వాడితడు.

వి : అలంబుషుడు జటాసురుడి కొడుకు. బకకిమ్మీరుల సోదరుడు. ఇతని సోదరులను భీముడు సంహరించి నందువల్ల పాండవులపై అతనికి ద్వేషం. అందుకే కౌరవపక్షంలో చేరి యుద్ధం చేశాడు. చివరకు ఘటోత్కచుడి చేతిలో మరణిస్తాడు.

తే : వినుము ప్రాగ్జ్యోతిషాధీశుఁ డనుపమాన
శక్తి యీ భగదత్తుండు సమరథుండు
గజము నెక్కి తా నేనిక కయ్యమైన
నేర్చు నైరావణము మీఁది యింద్రుఁ బోలి. 232

అ : వినుము ; ప్రాగ్జ్యోతిష + అధీశుఁడు = ప్రాగ్జ్యోతిష ప్రభువు ; ఈ భగదత్తుండు; అనుపమానశక్తి = సాటిలేని శక్తిగలవాడు ; సమరథుండు ; ఏనిక కయ్యము + ఐనన్ = గజసేనల మధ్య యుద్ధమేర్పడగా ; గజమున్ + ఎక్కి ; ఐరావతము మీఁది = ఐరావతము పైనున్న; ఇంద్రున్ + పోలి = ఇంద్రునివలె ; తాను ; ఏర్చును = బాధించును.

భా : దుర్యోధనా విను. ప్రాగ్జ్యోతిష నగరానికి ప్రభువైన ఈ భగదత్తుడు మహాబలుడు. గజసేనతో యుద్ధం చేసేటప్పు డితడు ఐరావతము నెక్కిన ఇంద్రునివలె పరులను బాధించగలడు.

వి : భగదత్తుడు నరకుని కుమారుడు. నరకుడు తాను సంపాదించిన వైష్ణవాస్త్రాన్ని ఇతనికే ఇచ్చాడు. భగదత్తు వాహనం ఏనుగు. దాని పేరు సుప్రతీకం.

-: భీష్ముఁడు గర్ణుని నర్ధరథుండని చెప్పుట :-

సం : 5-165-3

వ : గాంధారరాజు లగు వృక్షుండును నచలుండును సమరథులు, మానిసితనంబును మానుసులుం గలవారు; వీరి సమరోత్సాహం బజేయంబై యుండు. 233

భా : *గాంధారరాజులైన వృక్షుండు, అచలుడు సమరథులు. మానవత్వమూ, మానవసహకారమూ గలవారు. వారియుద్ధోత్సాహం జయింప శక్యంకానిది.*

సీ : నీకుఁ బ్రెగ్గడయును నెయ్యంపుఁ జెలియు నై
కయ్యంబునకు నెప్డుఁ గాలు ద్రవ్వుఁ
బాండుపుత్రులతోడి పగకు ని న్నెసకొల్పుఁ
గొలువున రజ్జులు వలుకునట్టి
రాధాసుతుం డర్ధరథుఁడు గుండలములుఁ
గవచంబుఁ బోవుట కారణముగ
బీఱు వాఱిన వాఁడు వీఱిఁడి కృప పెద్ద
పరశురాముండు శాపమున వీని
తే : యస్త్ర వీర్యంబుఁ జెఱిచె నట్లగుట వీఁడు
పార్థు మార్కొని మానంబుఁ బ్రాణములును
దనకు సొమ్ముగఁ దక్కించు కొనఁగలేమి
యెల్ల వారికి నెంతయుఁ దెల్ల మధిప! 234

అ : అధిప = రాజా! ; నీకున్ ; ప్రెగ్గడయును = మంత్రియూ ; నెయ్యము + చెలియును + ఐ = ప్రియమిత్రుడూ అయి; కయ్యంబునకున్ = యుద్ధానికి ; ఎప్డున్ ; కాలు + త్రవ్వున్ = కాలు దువ్వుతూ ఉంటాడు ; పాండు పుత్రులతోడి ; పగకున్ ; నిన్నున్ + ఎసకొల్పున్ = రెచ్చకొడుతూ ఉంటాడు ; కొలువునన్ ; రజ్జులు + పలుకును = డాంబికాలు పలుకుతాడు ; అట్టి ; రాధాసుతుండు = కర్ణుడు ; అర్ధరథుఁడు ; కుండలములున్ ; కవచంబున్ ; పోవుట కారణముగ ; బీఱువా ఱినవాఁడు = బలహీనుడైనవాడు ; వీఱిడి = అవివేకి ; కృప = దయ ; పెద్ద = ఎక్కువ ; పరశురాముండు ; శాపమున ; వీని ; అస్త్రవీర్యంబున్ = అస్త్రశక్తిని ; చెఱిచెన్ = పోగొట్టాడు ; అట్లు + అగుటన్ ; వీఁడు = ఈ కర్ణుడు ; పార్థున్ = అర్జునుని ; మార్కొని = ఎదుర్కొని ; మానంబున్ = గౌరవమును ; ప్రాణములును ; తనకున్ + సొమ్ముగన్ = తన సొత్తుగా ; తక్కించుకొన ఁగన్ + లేమి = దక్కించుకొనలేక పోవటం ; ఎల్లవారికిన్ = అందరికీ ; ఎంతయున్ ; తెల్లము = స్పష్టమే.

భా : నీకు మంత్రీ, ప్రియమిత్రుడూ అకారణంగా కయ్యానికి కాలుదువ్వేవాడూ, పాండవులతో యుద్ధానికి నిన్ను పురికొల్పేవాడూ, సభలో డంబాలు పలికే వాడూ అయిన కర్ణుడు అర్ధరథుడు. కవచకుండలాలు కోల్పోయి బలహీనుడయ్యాడు. అవివేకి. దయ ఎక్కువ. పరశురాముని శాపం వల్ల అస్త్రశక్తిని కోల్పోయాడు. అందువల్ల అర్జునుని ఎదిరించి మాన ప్రాణాలు దక్కించుకొనలేడు. ఈ విషయం అందరికీ తెలిసినదే -

వి : భీష్ముడు కర్ణునిస్థాయిని నిర్ణయిస్తూ అతనిలోనున్న లోపాలను ఏకరువు పెట్టాడు. వ్యక్తిత్వంలోని లోపాలు కొన్నీ, సహజ కవచకుండలాలను పోగొట్టు కోవటం, గురుశాపాన్ని పొందటం. మూడూ చాలా తీవ్రమైన లోపాలే. అయితే కర్ణుడు "గురువు ముందు శపించినా ఆ తర్వాత తనప్రార్థన నంగీకరించి మరల అనుగ్రహించినట్లు" చెప్తాడు. (2-266)

కౌరవసేనలో అతిరథ మహారథ సమరథ-అర్ధరథులు - పట్టిక

క్రమ సంఖ్య	పేరు		విశే.
1.	దుర్యోధనుడు	అతి	
2.	తమ్ములు అందరు	సమ	
3.	భీష్ముడు		
4.	కృతవర్మ	అతి	భోజాగ్రణి
5.	శల్యుడు	అతి	
6.	భూరిశ్రవుడు	అతి	
7.	సైంధవుడు	మహా	
8.	సుదక్షిణుడు	సమ	కాంభోజరాజు
9.	నీలుడు	అర్ధ	మాహిష్మతీపతి
10.	విందానువిందులు	అర్ధ	అవంతి దేశాధీశులు
11.	త్రిగర్తపతులు (5) గురు	మహా	గోగ్రహణ వైరం
12.	లక్ష్మణ కుమారుడు	సమ	దుర్యోధనుని కొడుకు
13.	బృహద్బలుడు	సమ	కోసలాధిపతి
14.	దండధారుడు	అర్ధ	
15.	కృపుడు	అతి	
16.	శకుని	సమ	
17.	అశ్వత్థామ		చెప్పలేము
18.	ద్రోణుడు	అతి	
19.	బాహ్లికుడు	అతి	వీరిరువురికి యుద్ధమంటే
20.	సోమదత్తుడు	అతి	పెండ్లితో సమానం.
21.	అలంబుషుడు	సమ	
22.	భగదత్తుడు	సమ	
23.	వృక్షుడు, అచలుడు	సమ	గాంధారరాజులు
24.	కర్ణుడు	అర్ధ	

కర్ణు డర్ధరథుడనటానికి కారణాలివి అని ద్రోణుడు చెప్పాడు. 1. ముందుకు దూకుతాడు. (మున్నుగడగు) 2. పారిపోవడానికి వెనుకాడడు (రోయడు పాఱన్) 3. ఏమరుపాటుతో ఉంటాడు (ఏమరియుండున్)

క : **అనవుడు గురుఁ డిట్లనుఁ గ**
ర్ణుని చందము; మున్ను గడఁగు; రోయడుఁ పాఱన్
విను మేమరియుండుం గా
వున నీతం డర్ధరథుఁ డవుం దలపోయన్. 235

అ : అనవుడున్ = అనగా ; గురుఁడు = ద్రోణాచార్యుడు ; ఇట్లు + అనున్ ; కర్ణుని చందము = కర్ణుని పద్ధతి; వినుము ; మున్ను = ముందుగా ; కడఁగున్ = ఉత్సహించును ; పాఱన్ = పరుగిడుటకు ; రోయఁడు = అసహ్యంచుకొనడు ; ఏమరి + ఉండున్ = ఆదమరచి ఉండును ; కావునన్; తలపోయన్ = పరికించగా; ఈతండు; అర్ధరథుఁడు + అవున్ = అర్ధరథుడే అగును.

భా : *భీష్ము డట్లనగానే ద్రోణాచార్యుడు ఇలా అంటున్నాడు "కర్ణుని విధానం చెపుతాను విను. ముందుగా పూనుకుంటాడు. ఆ తర్వాత పారిపోవటానికి కూడా సందేహించడు. ఏమరుపాటుతో ఉంటాడు. కాబట్టి కర్ణుడు అర్ధరథుడే".*

వి : భీష్ముడు ఒక వ్యక్తి, పెద్దగా కర్ణునిలోని లోపాలను ప్రకటించాడు ముందరి పద్యంలో. ఇప్పుడు ద్రోణుడు ఒక ధనురాచార్యుడుగా, యుద్ధనీతి విశారదుడుగా కర్ణునిలోను మరి కొన్ని లోపాలను తెలియజేస్తున్నాడు. ముందు సిద్ధ పడటం, తర్వాత పారిపోవటానికి కూడా వెనుదీయకపోవటం సామాన్య వ్యక్తులకు కూడా తగనిపని. అటువంటిది కర్ణునంతటి వానిలో నున్న ఆలోపానికి మూల్యం చాలా ఎక్కువగానే చెల్లించవలసి ఉంటుంది.

వ : **అనిన విని రాధేయుండు క్రోధతామ్రాక్షుం డగుచు గాంగేయున కిట్లనియె.** 236

భా : *అనగానే ఆ మాటలు విన్న కర్ణుడు కోపంతో కన్నులు ఎఱ్ఱబడగా భీష్మునితో ఇలా అంటున్నాడు.*

క : **ఒంటమిని లేని యొంటర**
మింటరములు వల్కు టుచితమే యర్ధరథుం
డంటి నను నేమి తక్కువ
గంటి చెపుమ; దీన నీవు గన్నది గలదే ? 237

అ : ఒంటమిని = పగచేత ; లేని = కనరానట్టి ; ఒంటరమింటరములు = పరుషవచనాలు; పల్కుట ; ఉచితము + ఎ = తగునా ? ; ననున్ ; అర్ధరథుండు అంటి = అన్నావుగదా ; ఏమి ; తక్కువ ; కంటి = చూచితివో ; చెపుమా = తెలుపుము ; దీనన్ = ఇట్లు పలుకుటద్వారా ; నీవు + కన్నది = నీవు పొందినది ; కలదే = (ఏమైనా) ఉన్నదా ?

భా : *పగతో లేనిపోని పరుషవాక్యాలు పలుకుతున్నావు. నీకిది తగునా? నన్ను అర్ధరథు డన్నావా? నాకున్న లోపమేమిటి ? ఇలా మాటాడటం వల్ల నువ్వు సాధించిన దేమిటి ?*

వి : భీష్మద్రోణులు కర్ణుని కున్న లోపాలను చాలా స్పష్టంగా విశ్లేషించి చెప్పారు. అయినా కర్ణుడు "నాకున్న లోపమేమి"టని అడుగుతున్నాడు. వారన్నదానికి సమాధానం చెప్పకుండా ఇలా రెచ్చిపోవటం కూడా ఒక లోపంగానే పరిగణింపవలసి వస్తుంది. ఆత్మాభిమానాన్ని కాపాడుకోవచ్చు కానీ ఇది పద్ధతి కాదు.

తే : **నొవ్వఁ బలుకుదు సభలోనఁ జివ్వ కొల్ల**
కేను గురుపతిఁ జూచి సహించి పోదు
సురనదీ పుత్ర ! విను నాకుఁ జూడ నర్ధ
రథుఁడ వగు దీవు లావు బీరంబు నరయ. **238**

అ : సభలోనన్ ; నొవ్వన్ + పలుకుదు = నొచ్చుకొనేటట్లు మాటాడతావు ; చివ్వకున్ =కలహానికి ; ఒల్లక = ఇష్టపడక ; ఏను ; కురుపతిన్ + చూచి = సుయోధనుని చూచి ; సహించి పోదున్ = ఓర్చుకొంటున్నాను ; సురనదీపుత్ర = గాంగేయా ?; విను ; నాకున్ + చూడన్ = నేను గమనించగా ; లావు + శక్తి ; బీరంబు = పరాక్రమం ; అరయన్ = పరిశీలించగా ; ఈవు = నీవు ; అర్ధరథుఁడవు ; అగుదువు.

భా : *కలహానికి ఇష్టపడక నేనూరకుంటున్నాను కానీ నేను నొచ్చుకొనేటట్లు సభలో మాటాడుతున్నావు. సుయోధనునిచూచి నేను ఓర్చుకొంటున్నాను. గాంగేయా ! విను నా మట్టుకు నాకు నీ శక్తినీ, పరాక్రమాన్నీ పరిశీలిస్తే నువ్వే అర్ధరథుడ వనిపిస్తోంది.*

వి : ఈ మాటలన్నీ కర్ణుని వ్యక్తిత్వాన్ని పెంచేందుకు దోహదం చేసేవి కావు. అన్న మాటనే పట్టుకొని ఎదుటి వారినైనా అలాగే నిందించటం ఉదాత్తుల లక్షణంకాదు. కయ్యానికి అనవసరంగా కాలు దువ్వుతాడన్న భీష్ముని మాట నిరూపించటానికే ఇది ఉపయోగపడుతుంది. అభిమానం దెబ్బతిన్నా హుందాతనాన్ని కోల్పోకూడదుగదా.

వ : **అని పలికి కొలువుఁ గలయం గనుంగొని.** **239**

భా : *అంటూ కొలువు కూటమంతా కలయజూచి (ఇంకా ఇలా అంటున్నాడు)*

చ : **హితుఁ డని నమ్మఁగాఁ దగునె యీతనిఁ, గార్యపుమాట లిట్టివే**
పతిదెసఁ గూర్మి వాపుటకుఁ బట్టుగ నెక్కువ తక్కువంచు ను
న్నతులగు మేదినీశులకు నానగఁ బల్కుట గాక యిట్టివా
రితవులు తండ్రికిన్ సుతుల కేమన నేర్తుము పెద్దరాజులన్. **240**

అ : ఈతనిన్ = ఈ భీష్ముని ; హితుఁడు + అని = శ్రేయోభిలాషి అని ; నమ్మగాన్ + తగునె = నమ్మవచ్చునా ?; కార్యము + మాటలు = వ్యవహారాన్ని చక్కచేసే పలుకులు ; ఇట్టివి + ఏ = ఇటువంటివా; పతిదెసన్ = రాజు పక్షాన ; కూర్మిన్ = స్నేహాన్ని; పాపుటకున్ = పోగొట్టడానికి ; పట్టుగన్ = దీక్షగా ; ఎక్కువ-తక్కువ + అంచున్; ఉన్నతులు + అగు =

పెద్దవారైన ; మేదినీ + ఈశులకున్ = రాజులకు ; నానగన్ + పల్కుట కాక = అవమానకరంగా మాటాడటం కాక ; ఇట్టివారు ; తండ్రికిన్ = ధృతరాష్ట్రునకూ ; సుతులకున్ = సుయోధనాదులకు ; ఇతవులు = శ్రేయోభిలాషులు ; పెద్దరాజులన్ = వృద్ధరాజులను గూర్చి ; ఏమనన్ + నేర్తుము = ఏమనగలము ?

భా : *ఈ భీష్ముని శ్రేయోభిలాషి అని నమ్మవచ్చా ? వ్యవహారవేత్తలు ఇలాగే పలుకుతారా ? రాజుకు నాపై గల ప్రేమను రూపుమాపటానికి కాక, అర్ధరథుడూ, సమరథుడూ అంటూ పెద్ద రాజుల కవమానం కలిగేటట్లు మాటాడటం తప్ప ఇటువంటి వారు రాజశ్రేయోభిలాషులు కాగలరా ? పెద్దవారిని గూర్చి మనం ఏమనగలం ?*

వి : సుయోధనుడు తన బలంలోని వీరుల తారతమ్యాలను చెప్పమని అడిగినాడు కాబట్టి ఆ ప్రార్థన మేరకు భీష్ముడు వాస్తవాన్ని వాస్తవంగా చెపుతానని ముందే అని అందరి స్థాయిలను నిర్ణయించి నిక్కచ్చిగా చెపుతున్నాడు. ఆ సమయంలోనే కర్ణుని గురించికూడా చక్కగా విశ్లేషించి చెప్పాడు. అయితే ఆత్మవిశ్వాసం ఎక్కువగా ఉన్న కర్ణుడు ఆ మాటలలోని సత్యాన్ని గ్రహించకపోగా మరలా సుయోధనుని రెచ్చగొట్టేటట్టుగా మాటాడుతున్నాడు. కర్ణుని ఆవేదన అర్థంచేసుకొన దగినదే అయినా ఆవేశం, ఆత్మపరిశీలనా రాహిత్యం, ఉద్రేక పడి మాటాడటం అతని వ్యక్తిత్వాన్ని కించపరిచేవే కానీ వ్యక్తిత్వానికి మెరుగు పెట్టేవి కావు. క్రియతో సమాధానం చెప్పవలసినచోట, చెప్పగలిగి నప్పుడు వివేకవంతులు మాటలు మిగలరు. పని చేసిచూపుతారు.

వ : అని దుర్యోధనుం జూచి యిట్లనియె. 241

భా: *అంతటితో ఆగక దుర్యోధనునితో ఇలా అంటున్నాడు.*

ఉ : కర్జము దప్పె నీయెదుర; (గష్టపు మాటల కేల యోర్తు రీ
దుర్జనుఁడైన శాంతనవు దోర్బల మేటిది ? యీతఁ డొక్కఁడున్
వర్జితుఁ డైన నేమి నృపవర్గము గుందుట యొంటఁ బాయునే
యర్జున పక్షపాతి యితఁ డాలము మేకొని చేయఁడుం జుమీ! 242

అ . నీ + ఎదురన్ = నీ ఎదుటనే ; కర్జము + తప్పెన్ = కార్యభంగమైనది; కష్టము + మాటలకున్ = పరుషవాక్యాలకు ; ఏలన్+ ఓర్తురు = ఎందుకు సహిస్తారు ; దోర్బలము = భుజశక్తి ; ఏటిది = ఎంతటిది ?; ఈతఁడు ; ఒక్కఁడున్; వర్జితుఁడు + ఐనన్ = విడువబడినచో ; ఏమి ? = నష్టమేమిటి ,; నృపవర్గము = రాజసమూహం; కుందుట = దు:ఖించుట ; ఒంటన్ + పాయున్ = ఈ ఒక్కని చేత పోతుందా ?; ఆలమున్ = యుద్ధాన్ని; మేకొని = అంగీకరించి; చేయఁడున్ + చుమీ = చేయబోడుసుమా ?-

భా : *నీ ఎదుటనే కార్యభంగమైనది. ఇటువంటి కష్టపుమాటలను ఎందుకు సహిస్తారు. దుష్టుడైన ఈ భీష్ముని శక్తిఎంత ? ఈతడొకడు లేకపోయినంత మాత్రాన నష్టమేమిటి ? రాజులందరి వ్యథ ఇతని ఒక్కని వల్ల తీరుతుందా ? అంతేగాక అర్జున పక్షపాతి అయిన ఇతడు సరిగా యుద్ధం చేయడు కూడా !*

వి: ఇది ఎప్పుడూ ఉన్న వ్యవహారమే. భీష్మకర్ణులు పరస్పరం నిందించుకోవటం. ఉత్తరగోగ్రహణం వంటి గత చరిత్రలు సాక్ష్యం.

తే ॥ చాలఁ గాలంబు వోవక చతురులైన
వృద్ధ జనముల బుద్ధులు విండ్రు గాక
ముదియ మతి దప్పి నోరికి నొదవినట్లు
పలుకు వెడఁగుల మాటలు పాడి యగునె? 243

అ . చాలన్ + కాలంబు = ఎంతో వయసుస ; పోవక = గడవకుండా ; చతురులు + ఐన = నేర్పరులైన ; వృద్ధజనముల ; బుద్ధులు = హితవచనాలు (ఆలోచనలు); విండ్రు + కాక = వింటారుకానీ ; ముదియన్ = వార్ధక్యంరాగా ; మతితప్పి ; నోరికిన్ =నోటికి; ఒదవినట్లు = వచ్చినట్లు ; పలుకు = మాటాడునట్టి ; వెడఁగుల = వివేకహీనుల యొక్క ; మాటలు ; పాడి + అగునె = తగునా ?

భా : ఎక్కువ వయస్సు చెల్లిపోకుండా ఉన్న నిపుణులయిన పెద్దల (పెద్దతనం నిపుణతచేగాని వయసు చేతకాదని) సలహాలు వినాలి కానీ, వార్ధక్యం వచ్చి మనసు స్తిమితం లేక నోటికి వచ్చినట్లు పలికే అవివేకులమాటలు ధర్మసమ్మతాలు కావు.

వి. కర్ణుడు పలికే ఈ మాటలు సాధారణ పరిస్థితులలో వాస్తవాలే. మతి తప్పిన వారి సలహాలు వినవలసిన అవసరం లేదు. అయితే కర్ణుడు పర్ణించిన మానసిక స్థితిలో భీష్ముడున్నాడా ? అన్నది విచారించవలసిన అంశం. కర్ణుడికి ఆప్తుడైన సుయోధనుడే భీష్ముని సలహాలు కోరాడన్నది జగమెరిగిన సత్యం. కాబట్టి క్రోధ పూరితమైన మనస్సుతో కర్ణుడే తొందరపడుతున్నాడని గ్రహించవలసి ఉంటుంది.

క . సేన మొగ మీతఁ డైనం
బూని మహీశ్వరులు నీకుఁ బొడిచెదరే ? దు
ర్మాని యని కాదె యీతని
తో నడచుట కొల్ల నైతి దురమున కధిపా! 244

అ. అధిపా = రాజా !; సేన మొగము = సేనాగ్రణిగా ; ఈతఁడు + ఐనన్ = ఈ భీష్ముడైతే ; మహీ + ఈశ్వరులు = రాజులు ; నీకున్ + పొడిచెదరే ? = నీ కోసం యుద్ధం చేయగలరా ? ; దుర్మాని = దురభిమాని ; అని + కాదె = అనియేకదా !; దురమునకున్ = యుద్ధానికి ; ఈ తనితోన్ = ఈ భీష్మునితో ; నడచుటకు =సాగుటకు ; ఒల్లన్ + ఐతిన్ = ఇష్టపడకపోతిని.

భా . మహారాజా! సేనకు ముందు ఈ భీష్ముడుంటే ఈ రాజులంతా నీ కోసం యుద్ధం చేస్తా రనుకుంటున్నావా ? ఇతడు దురభిమాని అన్న భావంతోనే గదా నేను ఇతనితో కలిసి యుద్ధంలో నడవటానికి అంగీకరించనిది.

వి . భీష్ముడు సేనాధిపతిగా ఉంటే చాలు ఎంతో సాధించినట్టే అని సుయోధనుడు భావించి అంగీకరింప జేస్తే, దానికి పూర్తిగా విరుద్ధంగా మాటాడుతున్నాడు కర్ణుడు. దురభిమాని

సేనాధిపతిగా ఉంటే అనుచరులు సరిగా యుద్ధం చేయలేని మాట నిజమే కావచ్చు. అయితే భీష్ముడు దురభిమాని అని కర్ణుడు తప్ప మరెవ్వరూ అనటం లేదు. అన్ని విషయాల్లో సుయోధనుడికి సలహాదారుగా ఉండే శకుని కూడా ఇటువంటి అభిప్రాయంలో లేడు. కర్ణుడు మాత్రమే వ్యక్తిగత ద్వేషంతో వ్యవహరిస్తున్నట్లు అనిపిస్తుంది.

వ. అనిన భీష్ముండు సూతసుతున కిట్లనియె. 245

భా. అనగా విని భీష్ముడు కర్ణునితో ఇలా అంటున్నాడు.

చ. ముదుకఁడనైన నాదు బలముం జలమున్ వివిధాస్త్ర శస్త్ర సం
పదయును బోయి నీ గురుఁడు భార్గవుచే విను; మాజి భూమి నా
కెదిరిన వారు పెక్కెడల నేమయిరో యెఱుఁగున్ జగంబు; నా
ముదిమియు నీ కుమారుతనమున్ వరుసన్ విజయుం డెఱింగెడున్. 246

అ. ముదుకఁడన్ + ఐన = ముసలివాడనైన ; నాదు బలమున్ + చలమున్ = నా శక్తినీ , దీక్షనూ; వివిధ ... పదమును ; వివిధ = అనేకాలైన, అస్త్ర = అస్త్రముల యొక్క, శస్త్ర =ఆయుధాలయొక్క, సంపదయును = సంపదలను; పోయి = వెళ్ళి; నీ గురుఁడు = నీకు ఆచార్యుడైన ; భార్గవుచేన్ = పరశురామునితో ; వినుము ; ఆజిభూమిన్ = రణభూమిలో ; నాకున్ + ఎదిరినవారు = నన్నెదిరించినవారు ; పెక్కు + ఎడలన్ = ఎన్నోచోట్ల ; ఏమయిరో ; జగంబు = లోకం ; ఎఱుఁగున్ = తెలియును ; నా ముదిమియున్ = నా వార్ధక్యాన్నీ ; నీ కుమారుతనమున్ = నీ కౌమారాన్నీ ; వరుసగాన్ ; విజయుండు = అర్జునుడు ; ఎఱింగెడున్ = తెలుసుకొనును.

భా. ముసలివాడినైన నా బలమూ, పట్టుదలా. అస్త్రశస్త్ర పాండిత్యమూ తెలియాలంటే వెళ్ళి మీ గురువైన పరశురాముణ్ణి అడుగు. యుద్ధ రంగంలో ఎన్నో మార్లు నన్నెదిరించిన వారేమయ్యారో లోకానికి తెలుసు. ఇక నా వార్ధక్యాన్ని, నీ కుఱ్ఱ తనాన్ని అర్జునుడే గ్రహిస్తాడు.

వి. పరశురాముని పరాక్రమం జగద్విదితమైనది. అటువంటి పరశురాముడే భీష్మునితో చాల రోజులు యుద్ధం చేసి వెనుకంజ వేయవలసి వచ్చింది. అదికూడా అందరికీ తెలిసిన విషయమే. భీష్ముడు కేవలం గుర్తుచేస్తున్నాడు. వృద్ధుడైనా బలపరాక్రమాలుంటే యువకులను జయించవచ్చు. యువకుడైనా పరాక్రమ హీనుడై వృద్ధుల చేతిలో ఓడవచ్చు. యౌవనమన్నది శక్తియుక్తుల ప్రదర్శనకూ, విజృంభణకూ అనుకూలమైన వయస్సు కావచ్చు కానీ అదొక్కటే శక్తియుక్తులను నిర్ధారించే కొలబద్ద కాదు. ధర్మవిషయాలు, శౌర్యం విషయంలో వయస్సు నిమిత్తమాత్రమే కాని నిర్ణాయకం కాదు. అర్జునుడే మన ఇద్దరి తారతమ్యాలను గ్రహిస్తాడని భీష్ము డనటం కూడా తగిన సమాధానమే.

క. అనుమానింపక సభలో
ననునేఁ జెప్పికొనవలసె నా కిమ్మెయి దు
ర్జనితుఁడ వగు నీ యెడ నీ
సున నా కిటు పలుకవలసె సూతతనూజా ! 247

అ. సూతతనూజా = సూతపుత్రా (కర్ణా)! ; అనుమానింపక = సందేహింపక ; సభలోన్ ; నాకున్ ; ఈ + మెయిన్ = ఈ విధంగా ; ననున్ = నన్ను గురించి ; చెప్పికొనవలసెన్ = చెప్పికొనవలసి వచ్చినది; దుర్జనితుఁడవు + అగు = దుష్టజన్ముడవైన ; నీ + ఎడన్ = నీ పట్ల; ఈసునన్ = అసూయచే ; నాకున్ ; ఇటు ; పలుకవలసెన్ = మాటాడవలసి వచ్చినది.

భా. ఇందరున్న సభలో శంకించకుండా నన్ను గురించి నేను చెప్పుకొనవలసి వచ్చింది. ఓ సూతనందనా! దుర్జాతుడవైన నీపై అసూయచేత నాకిట్లు మాటాడవలసి వచ్చింది.

వి. తన ఘనతను తాను చెప్పుకోకూడదు. అలా చేయవలసి వచ్చినందుకు భీష్ముడు ఖేదపడుతున్నాడు. అలానే కర్ణునిపై అసూయచేత తానా విధంగా పలికానని అంటూ అసూయాగుణ దోషాన్ని ప్రకటించి దుస్సాంగత్యం వలన ఏర్పడే అనర్థాన్ని సూచిస్తున్నాడు భీష్ముడు. జితేంద్రియుల వలె మెలగా లనుకునే భీష్మాదులకు కూడా కౌరవసాహచర్యం వలన దుర్గుణాలకు లోనుకాక తప్పటం లేదని సూచన. ఆత్మశ్లాఘ ఆత్మహత్యతో సమానమని శాస్త్రాలు నిరూపిస్తున్నాయి.

తే. కార్యమును ఖడ్గమును నింత గలుగు నీవు
గలుగఁ జేటు వాటిల్లె నిక్కౌరవులకు
దీని మము బోఁటు లెల్లను దీర్పనెట్లు
చాలెదము మంచి బంటవు చక్క నగుము. 248

అ. కార్యమును, ఖడ్గమును = కార్యఖడ్గముల జ్ఞానం; ఇంత + కలుగు = ఇంతగా కలిగిన ; నీవు ; కలుగన్ = లభింపగా ; ఈ + కౌరవులకున్ ; చేటు + వాటిల్లెన్ = కీడు కలిగింది ; దీనిన్ ; మముబోఁటులు + ఎల్లన్ = మా వంటి వారమందరం ; తీర్పన్ = చక్కచేయుటకు ; ఎట్లు + చాలెదము = ఎట్లు సమర్థులమగుదుము ; మంచి బంటవు = మంచి వీరుడవు ; చక్కన్ + అగుము = సిద్ధము కమ్ము (యుద్ధానికి).

భా. కార్యఖడ్గముల రెండింటియందును ఇంత పరిజ్ఞానం కలిగిన నువ్వుండగానే (నీ వల్లనే) కురుకులానికి చేటు మూడింది. మావంటి వారమేం చక్కజేయగలం. మంచి వీరుడవు కదా నీవు. ఇక యుద్ధానికి సిద్ధం కమ్ము.

చ. నెపమిడి యోహటించి యిటు నీవు దొలంగినఁ బోవ వచ్చునే
కుపిత మనస్కుఁ డై నరుఁడు గూల్పఁ గ్రమంబున దొడ్డ లెల్లఁ జ
న్న పిదప నెట్లుఁ జొచ్చెదు రణంబున నప్పుడు పావకున్న దై
న్యపుఁ బరివారముం బతియు నైన నెఱింగెద రెల్ల చందముల్. 249

అ. నెపము + ఇడి = (ఏదో) సాకుచూపి ; ఓహటించి = వెనుదీసి ; ఇటు = ఈ విధంగా ; నీవు ;,తొలంగినన్ = తప్పుకొన్నచో ; పోవవచ్చునే = యుద్ధానికి రాకుండా పోతావా ? ; కుపితమనస్కుఁడు + ఐ = కోపించిన మనస్సు గలవాడై ; నరుఁడు = అర్జునుడు; కూల్పన్ = (నన్ను) నేల గూల్పగా ; క్రమంబునన్ ; దొడ్డలు + ఎల్లన్ = పెద్దలంతా ; చన్న + పిదప =

మరణించిన తర్వాత ; ఎట్లున్ = ఎట్లైనా ; రణంబునన్ = యుద్ధరంగంలో ; చొచ్చెదు = రాగలవు ; అప్పుడు = అప్పటికి ; చావక + ఉన్నన్ = చావకుండా బ్రతికి యున్నచో ; దైన్యము + పరివారమున్ = దీనులైన సైనికులునూ ; పతియున్ + ఐనన్ = ప్రభువైన సుయోధనుడూ ; ఎల్ల + చందమున్ = అన్ని సంగతులూ ; ఎఱింగెదరు = తెలుసుకొందురు గాక !

భా . నువ్వేదో సాకుచూపి ఇప్పుడు యుద్ధానికి రాక తప్పుకుంటే యుద్ధానికి రాకపోవు. కోపించిన అర్జునుడు నన్ను కూల్చిన తర్వాత, వరుసగా పెద్దలంతా ఒకరి తర్వాత ఒకరు గతించగా ఆ పైన నీ వెలాగూ రణరంగ ప్రవేశం చేస్తావు. అప్పటికీ చావకపోతే పరిజనమూ, దుర్యోధన మహారాజూ అందరి తీరులూ తెలుసుకొనగలరు.

వి . ఉరుమురిమి మంగలం మీద పడిం దన్నది తెలుగు సామెత. కర్ణుడు ఆ రీతిగా భీష్మునిపై కోపంతో భీష్ము డున్నంతవరకు విల్లుపట్టనని శపథం చేశాడు. దాని పర్యవసానాన్ని తెలియజేస్తున్నాడు భీష్ముడు. కర్ణుడు అస్త్ర సన్యాసం చేస్తే నష్టం అతని ప్రాణమిత్రుడైన సుయోధనునకే గదా! కనీసం అతడైనా మిగిలి ఉంటే నీ పరాక్రమాన్ని చూపవచ్చని కర్ణుని నిష్ప్రయోజన కోపాన్ని తెలుపుతున్నాడు భీష్ముడు.

వ . అని పలికి దుర్యోధను నుపలక్షించి కర్ణుతో వెండియు నిట్లనియె. 250

అ . ఉపలక్షించి = చూచి

భా . భీష్ముడా రీతిగా పలికి, దుర్యోధనుని చూచి కర్ణునితో మరలా ఇలా అంటున్నాడు.

ఆ . సూతపుత్ర ! ఇతఁడు నాతలఁ బెద్ద మో
పెత్తి నమ్మియున్న యిట్టిచోటఁ
గ్రందు సేయ నాకుఁ గాదని సైరించి
యున్న బ్రదికి తింక నూర కుండు. 251

అ . సూతపుత్ర = కర్ణా! ; ఇతఁడు = ఈ సుయోధనుడు ; నాతలన్ = నా శిరస్సుపై; పెద్దమోపు = ఎంతో భారం ; ఎత్తి = ఉంచి; నమ్మి + ఉన్న + ఇట్టి చోటన్ = నమ్మిఉన్న సమయంలో ; క్రందు + చేయన్ = ఉపద్రవం కల్పింపగా ; నాకున్ + కాదు + అని = నాకు భావ్యం కాదని ; సైరించి + ఉన్నన్ = సహించి యుండగా ; బ్రతికితివి ; ఇంకన్ + ఊరకుండు = ఇక మిన్నకుండుము.

భా . ఓ సూతనందనా! దుర్యోధనుడు నన్ను నమ్మి నాతలపై పెద్ద బరువు పెట్టాడు. అటువంటప్పుడు నేను ఉపద్రవం కల్గించటం భావ్యంకాదు. అందుకే సహించి ఊరకున్నాను. కనుక బ్రతికి పోయావు. చాల్లే! ఇక ఊరుకో .

వి . నమ్మిఉన్న చోట నష్టం కలిగించ రాదన్న భీష్ముని మాట కర్ణుడికి ఒక చురక. గతంలో కర్ణుని నమ్మి సుయోధనుడు నష్టపోయాడు. ఇప్పుడూ నష్టపోయాడు. అటువంటి పని తగదని హితవు.

వ . అని యాడి మొగంబు గంటు వెట్టుకొని యున్న సురనదీసూను దిక్కు మొగంబై సుయోధనుండు " నీకుం గోపింప నగునె, నన్నును గార్యభారంబునుం జూచి నా బ్రదుకునకై సర్వంబును సహింపవలయు" నని తేర్చి, యంగరాజుం గనుంగొని "మీ రిద్దఱు నొక్కటి యై భరంపడి యిప్పని సక్కం జేసి కాక మీలోన నిట్టి యెరవు మాటలేల" యని పొదివి పలికి తదనంతరంబ పాండవ పక్షంబు వారల తారతమ్యంబులు వినువాఁడై యమ్మాట పుట్టించిన నతనికి భీష్ముం డిట్లనియె. 252

అ . గంటు + పెట్టుకొని = ముడుచుకొని ; తేర్చి = ప్రసన్నుని చేసి ; పొదివి = అనునయించి, ఎరవుమాటలు = అరమరికలుగల మాటలు ; భరంపడి = కష్టపడి.

భా . అని పలికి ముఖం ముడుచుకొని ఉన్న భీష్ముని చూచి సుయోధనుడు "నువ్వు కోపించుట భావ్యమా ? నన్నూ నేను తలపెట్టిన కార్యభారాన్నీ గమనించి, నా బ్రతుకు కోసం అన్నీ సహించాలి" అని భీష్ముని ప్రసన్నుని చేసి: కర్ణుని చూచి "మీ రిద్దరూ ఒక్కటై కష్టపడి పనిని చక్కచేయాలికానీ ఈ అరమరికలు ఎందు"కని బ్రతిమాలి పలికి, ఆ తర్వాత పాండవ పక్షంలోని వీరుల తారతమ్యాలు తెలుసుకొన గోరి ఆ సంగతి ప్రస్తావించాడు. అప్పుడు భీష్ముడిలా అంటున్నాడు.

వి . దుర్యోధనుడు కార్యవాది. ఏ రీతిగానైనా పనిని సానుకూలం చేసుకోవటం అతనికి తెలుసు. ప్రస్తుతం ఆ తెలివి తేటలనే ఉపయోగించి పరిస్థితిని చక్క బరుచుకున్నాడు.

తే . పాండుపుత్రుల నద్దెస దండిమగలఁ
గల నిజం బేను జెప్పినఁ గర్ణుమనసు
నొచ్చు నీ చిత్త మెట్లగునో యెఱుంగ
నాకు నిది యేమి పని రిత్త నడుమ నుండి. 253

అ . పాండు పుత్రుల + ఆ+ దెసన్ = పాండవ పక్షాన ; దండిమగలన్ + పరాక్రమవంతులైన వీరులయందు; కలనిజంబు = ఉన్న వాస్తవాన్ని; ఏను + చెప్పినన్ = నేను వివరిస్తే; కర్ణ మనసు ; నొచ్చున్ = బాధపడును ; నీ చిత్తము = నీ మనస్సు ; ఎట్లు + అగునో = ఎట్లు భావించునో ; ఎఱుంగను = తెలియను ; రిత్త = ఊరికే ; నడుమనుండి ; నాకున్ ; ఇది + ఏమి ; పని= కార్యమో !

భా . పాండవుల పక్షంలో గల మహావీరులలోని తారతమ్యాలను చెపితే కర్ణుని మనస్సు నొచ్చుకుంటుంది. నీ మనస్సు ఏమవుతుందో నే నెరుంగను. ఊరకే మీ మధ్యనుండి నా కెందుకు వచ్చిన పని ఇది?

వ . అనిన మఱియు దుర్యోధనుఁడు దఱిమి యడుగుటయు నిట్లనియె.254

భా . అనగానే దుర్యోధనుడు మరలా తరచి తరచి అడిగాడు. అప్పుడు భీష్ముడిలా అంటున్నాడు.

-: భీష్ముండు పాండవ వీరులం దతిరథ మహారథుల నిరూపించి చెప్పుట:- (సం 5-166-14)

తే. అతిరథుండు యుధిష్ఠిరుం డగ్నికల్పుఁ
డాహవంబున నప్రతిహతుఁడు భీముఁ
డతిరథ శ్రేష్ఠుఁ డతని మహాబలం బ
మానుషము విక్రమం బసమాన మధిప! 255

అ. అధిప = రాజా !; యుధిష్ఠిరుండు ; ధర్మరాజు ; అతిరథుండు ; అగ్నికల్పుఁడు= అగ్నితో సమానమైన వాడు ; ఆహవంబునన్ = రణరంగంలో ; అప్రతిహతుఁడు = ఎదురులేని వాడు ; భీముఁడు ; అతిరథ శ్రేష్ఠుడు = అతిరథులలో గొప్పవాడు ; అతని మహాబలంబు , అమానుషము = మానవులందు కనరానిది ; విక్రమంబు = పరాక్రమం ; అసమానము = సాటిలేనిది.

భా. *సుయోధనా! ధర్మరాజు అతిరథుడు. అగ్నిసమానుడు. యుద్ధంలో అతనికి ఎదురులేదు. భీము డతిరథ శ్రేష్ఠుడు . అతని బల సంపద మానవాతీతమైనది. అతని పరాక్రమం నిరుపమానం .*

క. సమరథులు గవలు భుజగ
ర్వము పటు విక్రమము దుర్నివారంబుల వా
రి మనంబులు నిర్భయములు
దమ మొనలకు మించి బెట్టు దాఁకుదు రధిపా! 256

అ. అధిపా = రాజా !; కవలు = నకుల సహదేవులు ; సమరథులు ; భుజగర్వమున్ = భుజబలగర్వమూ; పటు విక్రమము = సమర్థమైన పరాక్రమమూ; దుర్నివారములు = నివారింప శక్యము కానివి; వారి మనంబులు= వారి మనస్సులు; నిర్భయములు = భీతి నెరుగనివి ; తమ- మొనలకున్ = తమ సేనలకు; మించి = అతిశయించి ; బెట్టు = భీకరంగా (అధికంగా), తాఁకుదురు= ఎదుర్కొందురు.

భా. *రాజా ! నకుల సహదేవులు సమరథులు. వారి భుజముల గర్వమూ, మహా పరాక్రమమూ అప్రతిహతాలు. వారి మనస్సులు భీతి నెరుగనివి. తమ సేనలకు మించి భీకరంగా వారు ప్రతిఘటిస్తారు.*

సీ. వారందఱును ధర్మవైభవంబునఁ దప
స్సంపద నెక్కుడు జనుల కెల్ల;
ధనువు నాఱంగంబులను బరిణతులు దాఁ
కోర్తురు పరులకు నోర్వ రాని

కోల్తల గలరు; పెక్కులు పరాక్రమములు
వేర్వేఱ చేసిన వీరు లొక్క
మొగమయి తాఁకిన వెగడొందకుండునే
మనసేన; ము న్నవమాన పాటు
ఆ. దుఃఖపాటు గలిగి తొడరంగ వచ్చిన
వారు గాన నలఁతిఁ బోరు; ప్రాణ
మాసపడక యోపి నంతయుఁ బెనఁగుదు
రది సహించి నిలుచు టరిది మనకు. 257

అ. వారు + అందఱును = ఆ పాండవులంతా ; ధర్మ వైభవంబునన్ = ధర్మ సంపద చేత ; తపస్సంపదన్ = తపస్సంపదచేత ; జనులకున్ + ఎల్లన్ = జనులందరికన్నా ; ఎక్కురు = అధికులు ; ధనువు + నాఱంగంబులను = ధనుర్బాణములయందు: పరిణతులు = పండితులు; తాఁకు + ఓర్తురు = దాడిని సహింపగలరు ; పరులకున్ = శత్రువులకు; ఓర్వరాని = సహింపరాని ; కోల్తల + కలరు = యుద్ధోత్సాహం గలవారు ; పెక్కులు = అనేకాలైన ; పర + ఆక్రమములు = శత్రువుల పై దాడులను ; వేర్వేఱ + చేసిన = విడివిడిగా జరిపిన ; వీరులు ; ఒక్కమొగము +ఐన = ఏకముఖమై ; తాఁకినన్ = తలపడినట్లైన ; మనసేన ; వెగడు; ఒందక + ఉండునే = తల్లడిల్ల కుండునా ?; మున్ను = ఇంతకుమునుపు ; అవమానపాటు = భంగపాటునందుట ; దుఃఖపాటు = దుఃఖముననుభవించుట ; కలిగి ; అలఁతిన్ + పోరు = (అంత) తక్కువగా ఊరుకొనరు ; ప్రాణము + ఆసపడక = ప్రాణాలపై ఆశనుకూడా విడిచి ; ఓపిన + అంతయున్ = సాధ్యమైనంత వరకు ; పెనఁగుదురు = పోరాడుదురు; అది = ఆ దాడి ; సహించి ; నిలుచుట ; మనకున్ ; అరిది = సాధ్యము కానిది.

భా. *పాండవు లందరి కన్నా ధర్మాత్ములు, తపస్సంపన్నులూ, ధనుర్విద్యా విశారదులునూ, మార్కొంటే జయింపగలవారు, శత్రుదుస్సహమైన రణోత్సాహం గలవారు. వారు విడివిడిగా శత్రువులపై దండయాత్రలు జరుపగల శూరులు. అట్టి వారంతా ఏకముఖంగా తలపడితే మనసేనలు తల్ల డిల్లక మానవు. ఇంతకు ముందు మనవల్ల అవమానమూ, దుఃఖమూ పొంది దండెత్తి వచ్చినవారు కావటం చేత వారిని అంతంత ప్రయత్నంతో తొలగ జేయలేము. ప్రాణాలకు కూడా తెగించి వారు పోరాడుతారు. వారి తాకిడిని తట్టుకొని నిలువటం మనకు అసాధ్యమైన విషయం.*

మ. నరుఁడీ మానమువాఁ డనంగ వశమే నా కంత వా రెందు నె
వ్వరు లే రింకను బుట్ట రా పులికి దుర్వారోద్యముండైన యా
హరియుం దోడటె యేమి చెప్పుదు నతం డా సేనలం గాచు నొ
క్కరుఁడుం గీటడఁగించు నీ బలములన్ గాండీవ దుర్దాంతుఁడై.258

అ. నరుఁడు = అర్జునుడు ; ఈ - మానమువాఁడు = ఈ స్థాయిగలవాడు ; అనంగన్ = అనుటకు ; నాకున్ ; వశమే = శక్యమా ? ; అంతవారు = అంతటివారు ; ఎందున్;

ఎవ్వరున్ ; లేరు ; ఇంకను = ఇకమీదట ; పుట్టరు = జనింపబోరు ; ఆ పులికిన్ ; దుర్వార + ఉద్యముండైన = నివారింపవీలుకాని ప్రయత్నం గలిగిన ; ఆ హరియున్ = ఆ శ్రీహరి కూడా (ఆ సింహం కూడా) ; తోడు + అట = తోడైనాడట ; ఏమి - చెప్పుదును ; ఆ సేనలన్ + కాచున్ = పాండవసైన్యాన్ని రక్షించును ; ఒక్కరుఁడున్ = అతడొక్కడే ; గాండీవ - దుర్దాంతుడై = గాండీవ ధనుస్సుచే ఎదురులేనివాడై; నీ బలములన్ = నీ సేనలను ; కీటడఁగించున్ = మట్టుబెట్టును

భా. *అర్జును డీస్థాయి వాడని చెప్పడం నావల్లకాదు. అంతటి వాడు ఎక్కడా ఎవ్వడూ లేడు. ఇక మీదటా పుట్టబోడు. పెద్ద పులి వంటి అతనికి సింహం వంటి శ్రీ కృష్ణుడు తోడైనాడు. ఇక చెప్పవలసిన దేమున్నది? అతడొక్కడే పాండవ సైన్యమంతా రక్షిస్తాడు. గాండీవంతో నీ సైన్యాన్ని మట్టుబెడతాడు.*

వి. అర్జునిని పులితోనూ, శ్రీకృష్ణుని మృగరాజైన సింహంతోనూ పోల్చి చెప్పా డిక్కడ. పులీ, సింహం ఒకటైతే వన్యమృగాలు బ్రతికే అవకాశముందా ? ప్రస్తుతం కౌరవసేనస్థితి కూడా అంతేనని భీష్ముని అభిప్రాయం.

అంతే కాక అర్జునుడంతటివాడు ఎక్కడా లేడు ఇక పుట్టడూ అని చెప్పటంలోనే ఈ జరుగబోయే యుద్ధం యొక్క ఫలితాన్ని కూడా ధ్వనింపజేస్తున్నాడు భీష్ముడు.

వ. **అనిన విని యక్కొలువున నున్న రాజుల మనంబు లెల్లను**
జేవ సెడియె; భీష్ముండు వెండియు నిట్లనియె. 259

అ. చేవ + చెడియెన్ = శక్తి కోల్పోయెను ;

భా. *అనగా విన్న ఆ కొలువులోని రాజులందరి మనస్సులూ ధైర్యస్థైర్యాలను కోల్పోయాయి. భీష్ముడు మరలా ఇలా అంటున్నారు.*

సీ. **ద్రౌపదేయులు మహారథు లేవురును, వారి**
తరమ యుత్తరుఁడును ధరణీ నాథ !
యతిరథవర్యుఁ డయ్యభిమన్యుఁ డర్జున
వాసుదేవుల కెనవచ్చు వాఁడు
లఘు చిత్రములు నేర్పులావును దాల్మియుఁ
గలఁడు తండ్రుల పాటు దలఁచుచుండుఁ
గావున బెడిదంబుగాఁ బోరు, సాత్యకి
యతిరథోత్తముఁడు శౌర్యాన్వితుండు

తే. **పాండవ స్నేహసక్తుఁడై యుండుఁగాన**
యలుక మనమీఁదఁ బెద్దయుఁ గలిగి పెనఁగు
వీర లిరువురుఁ బరుసని వారు సమర
పరుల నొప్పింతు రీ యోధవరుల నెల్ల. 260

అ. ద్రౌపదేయులు + ఏవురును = ద్రౌపదీ పుత్రులు అయిదుగురును: (ప్రతివింధ్యుడు , శ్రుత సేనుడు , శ్రుతకీర్తి, శతానీకుడు, శ్రుతకర్ముడు); మహారథులు ; ధరణి నాథ = రాజా ; ఉత్తరుఁడును= ఉత్తర కుమారుడును (విరాటరాజ పుత్రుడు) ; వారి తరము = వారి స్థాయికి చెందిన వాడే ; ఆ + అభిమన్యుడు ; అతిరథ వర్యుఁడు = అతిరథ శ్రేష్ఠుడు ; అర్జున వాసుదేవులకున్ ; ఎనవచ్చువాఁడు = సాటియైనవాడు ; లఘుచిత్రములు = లగువులు ; నేర్చున్ ; లావును = శక్తియూ ; తాల్మియున్ + కలఁడు = ఓర్పు గలవాడు ; తండ్రులపాటు = ధర్మజాదుల శ్రమను గూర్చి; తలంచు చుండున్ = ఆలోచిస్తుంటాడు : కావునన్ ; బెడిదంబుగాన్ = భీకరంగా; పోరున్ = యుద్ధం చేయును ; సాత్యకి ; అతిరథ + ఉత్తముఁడు = అతి రథులలో మేటి; శౌర్య + అన్వితుండు = పరాక్రమవంతుడు; పాండవ స్నేహ- సక్తుఁడై = పాండవుల యెడ మైత్రి కలిగి; ఉండున్ + కాన = ఉంటాడు కనుక ; మన మీఁదన్ ; అలుక = కోపం ; పెద్దయున్ + కలిగి = ఎక్కువగా కలిగి ; పెనఁగున్ = పోరాడును; వీరలు + ఇరువురున్ = వీరిద్దరూ (అభిమన్యుడు, సాత్యకి); పరుసని వారు= కఠినులు; సమర - పరులన్ = యుద్ధాసక్తులయిన ; యోధవరులన్ + ఎల్లన్ = యోధాగ్రేసరుల నందరినీ ; నొప్పింతురు = బాధింపగలరు.

భా. ద్రౌపది కుమారులు అయిదుగురు మహారథులు. ఉత్తరకుమారుడు వారి తరగతికి చెందినవాడే. అభిమన్యుడు అతిరథులలో శ్రేష్ఠుడు. కృష్ణార్జునులకు సాటియైనవాడు. యుద్ధంలోని లగువులు తెలిసిన వాడు. తన తండ్రుల కష్టాలను తలంచుకొని భీకరంగా పోరాడగలడు. సాత్యకి అతిరథులలో మేటి. పరాక్రమవంతుడు. పాండవులతో అత్యంతమూ స్నేహం గలవాడు. కాబట్టి మనపై మరీ కోపంతో విరుచుకు పడతాడు. వీరిద్దరూ కఠినులై యుద్ధలంపటులైన వీరుల నందరినీ బాధిస్తారు.

మ. అలఁతిం బోరు మహారథుల్ ద్రుపద మత్స్యాధీశు లుద్యద్భుజా
బల శౌర్యాఢ్యులు పాండురాజ సుత సంబంధ ప్రియ స్నేహముల్
గలిమిం జేసి తదీయ సైన్యమునకుంగా నొచ్చియుం జచ్చియున్
గెలిపింపన్ దమకించి చొత్తు రని కేకీభూత చేతస్కులై. 261

అ. ఉద్యత ....ఢ్యులు ; ఉద్యత్ = ఉద్యమించు, భుజాబల = బాహుబలముచేత, శౌర్య = పరాక్రమం చేతా ఆఢ్యులు = శ్రేష్ఠులైన ; ద్రుపద - మత్స్య + అధీశుల్ = ద్రుపదుడూ, మత్స్యదేశ ప్రభువునూ, (విరాటుడు) ; అలఁతిన్ - పోరు = తేలికగా వెళ్లరు; పాండు ..... స్నేహముల్ ; పాండురాజసుత = పాండవులతో, సంబంధ = వియ్యమునూ, ప్రియస్నేహముల్ = గాఢమైన మైత్రి ; కలిమిన్ + చేసి = ఉన్నందువలన ; తదీయ- సైన్యమునకున్ = ఆ పాండవసేన కోసం; నొచ్చియున్ = బాధపడియూ ; చచ్చియున్ = ప్రాణముల వీడియూ; గెలిపింపన్ = గెలిపించుటకై; తమకించి = ఉద్యమించి; ఏకీభూత - చేతస్కులై = ఏకోన్ముఖమైన తలపుగలవారై; అనికిన్ = యుద్ధానికి ; చొత్తురు = ప్రవేశింతురు.

భా. మహాబల పరాక్రమవంతులైన విరాట, ద్రుపదమహారాజులు అనాయాసంగా పోయేవారుకాదు. పాండవులతో వియ్యమంది ద్రుపదుడు, ప్రియస్నేహం

కలిగి విరాటుడూ ఎంతకైనా కడకు ప్రాణాలకైనా తెగించి పోరాడి పాండవులకు విజయాన్ని చేకూర్చాలన్న ఏకలక్ష్యంతో యుద్ధ భూమికి వస్తారు.

ఆ. వీరగుణము బలము వీఁకయుఁ గలఁడు మ
హారథుఁడు శిఖండి యతని తమ్ముఁ
డతిరథుండు దర్పయుతుఁడు ధృష్టద్యుమ్నుఁ
డుగ్రతేజుఁ డనికి నుగ్రు నట్లు. 262

అ. మహారథుఁడు; శిఖండి; వీరగుణము; బలము ; వీఁకయున్ = ఉత్సాహమును; కలఁడు = కలవాడు; అతని తమ్ముఁడు= ఆ శిఖండి తమ్ముడునూ, దర్పయుతుఁడున్ = గర్వం కలవాడునూ; అతిరథుండున్ = అతిరథుడూ అయిన ; ధృష్ట ద్యుమ్నుఁడు ; అనికిన్ = యుద్ధానికి ; ఉగ్రు + అట్లు = రుద్రునివలె ; ఉగ్రతేజుఁడు = తీక్ష్ణమైన తేజస్సు గలవాడు.

భా. వీర ప్రకృతీ, బలోత్సాహాలూ గల శిఖండి మహారథుడు. అతని తమ్ముడు ధృష్టద్యుమ్నుడు. అతిరథుడూ, మదశాలి అయిన అతడు యుద్ధరంగంలో రుద్రునివలె తీవ్రతేజస్సును ప్రదర్శింపగలడు.

క. అతని సుతుఁ డర్ధరథుఁ డా
ధృతవర్ముఁడు పిన్ననాఁడు త్రిమ్మట కాఁడై
మతిహీనత శస్త్రాస్త్ర
ప్రతతి పరిశ్రమము లేక పాలసుఁ డగుటన్. 263

అ. పిన్ననాఁడు = చిన్నప్పుడు; త్రిమ్మటకాఁడు + ఐ = తిరుగుబోతై ; మతిహీనతన్ = బుద్ధిలేకపోవుటవల్ల ; శస్త్ర - అస్త్ర - ప్రతతి = శస్త్రాస్త్ర సమూహంపట్ల ; పరిశ్రమయున్ = అభ్యాసం ; లేక ; పాలసుఁడు + అగుటన్ = మూర్ఖుడైనందువలన ; అతని సుతుఁడు = ఆతని కుమారుడైన ; ధృతవర్ముఁడు ; అర్ధరథుఁడు

భా. ధృష్టద్యుమ్నుని కుమారుడు ధృతవర్మ, చిన్నప్పుడు తిరుగుబోతుగా ఉండి శస్త్రాస్త్ర పరిశ్రమ చేయని వాడు. మూర్ఖుడు. కాబట్టి అతడు అర్ధ రథుడు.

ఆ. చేదిభూవిభుండు శిశుపాల తనయుండు
ధృష్టకేతుఁ డధిక ధీరమతి మ
హారథుండు; భోజుఁ డజుఁడనురాజులు
నట్టివార తెంపు నలవుఁ గలరు. 264

అ. చేది భూ విభుండు = చేది భూపాలుడూ ; శిశుపాల తనయుండున్ = శిశుపాలుని కుమారుడూ అయిన ; ధృష్టకేతుఁడు ; అధికధీరమతి = మిక్కిలి ధైర్యం గలవాడు; మహారథుండు; భోజుఁడు+అజుఁడు+ అను రాజులును ; అట్టివారు + అ = అటువంటివారే; తెంపున్ = తెగింపూ; అలవున్ = సామర్థ్యమూ; కలరు = కలవారు-

భా . చేది దేశాధిపతీ, శిశుపాలుని కుమారుడూ అయిన ధృష్టకేతుడు మిక్కిలి ధైర్యం కలవాడు. అతడు మహారథుడు. అట్లే భోజుడు, అజుడూ కూడా మహారథులే. వారు గొప్ప సాహసమూ, సామర్థ్యమూ గలవారు.

వి . శిశుపాలుడు పాండవులనూ, శ్రీ కృష్ణునీ ఎదిరించి నిందించి శ్రీ కృష్ణుని చేతిలో మరణించినవాడు. అయితే అతని కుమారుడు మాత్రం పాండవ పక్షంలో చేరాడు. దీనిని బట్టి పగ, ప్రతీకారాలతో పాటు నిష్పాక్షిక ధర్మచింతన వల్ల కూడా పాండవులకు సహాయసహకారాలు లభించినట్లు తెలుస్తుంది.

వ . ఉత్తమౌజుండును, యుధామన్యుండును, క్షత్రదేవుండును, జయంతుం డును, నమితౌజుండును, విరాటుండును, సత్యజితుండును ననం బరగు పాంచాల కుల ప్రదీపకులు మహారథులు; మత్తమాతంగ బృందంబు చందంబునం బ్రతిబలంబు పయిం గవిసి కోలాహల బహుళంబుగాఁ గలఁపం జాలుదురు; కేకయపతు లేవురు సహోదరులు మహారథులు; గడింది మగలు; గెంపు రథంబుల మొత్తంబులతోఁ గార్చిచ్చు పగిదిం బొదువుదురు; కాశీశుండు నీలుండు, సూర్యదత్తుండు, మదిరాక్షుండు, శంఖుండు, విరాట జ్ఞాతులు మహారథులు; వివిధాయుధ విద్యావిశారదులు; వారి పోరు భరంబై యుండు. 265

భా . ఉత్తమౌజుడు, యుధామన్యుడు, క్షత్రదేవుడు, జయంతుడు, అమితౌజుడు, విరాటుడు, సత్యజితుడు అనువారు పాంచాలవంశ దీపకులు, మహారథులు. మదగజ సమూహంవలె శత్రుసేనలపై బడి కోలాహల పూర్వకంగా కలత పెట్టగలరు. కేకయదేశాధిపతులు అయిదుగురు సోదరులు మహారథులే. వారు మహావీరులు. ఎఱ్ఱని రథాలపై వచ్చి కార్చిచ్చులాగా వ్యాపించగలరు. కాశీపతి నీలుడు; సూర్యదత్తుడు, మదిరాక్షుడు, శంఖుడు, విరాటుని దాయాదులు. వారంతా మహారథులే. వివిధ యుద్ధ విద్యలలో నేర్పు గల వారి పోరు భరించటం కష్టంగా ఉంటుంది.

సీ . " చిత్రాయుధుండును జేకితానుండు మ
హారథు లిద్దఱు నర్జుననకుఁ
గూర్తురు కయ్యాన కోర్తురు నేర్తురా
యుధముల కెల్ల నత్యుగ్రు; లవ్వి
ధము వార చంద్రదత్త వ్యాఘ్రదత్తులు;
వినుము సేనాబిందుఁ డను నృపాలుఁ
డతిరథోత్తముఁడు మారుతపుత్రు నెన యతం
డొక్క రుండును వారి యుఱిది లావు
ఆ . పాండ్యుఁ డతిరథుండు బలఁగంబు గలవాఁడు
సమరథుండు గాశ్యుఁ డమిత బలుఁడు

కుంతిభోజుఁ డాజికోవిదుఁ డతిరథుం
డతని యొద్ది జోదు లధిక బలులు. 266

అ . చిత్రాయుధుండును ; చేకితానుండును; మహారథులు ; ఇద్దఱున్ ; అర్జుననకున్ ; కూర్తురు = ఇష్టులు ; కయ్యానకున్ = యుద్ధానికి; ఓర్తురు = చాలుదురు; ఆయుధములకున్ + ఎల్లన్ ; నేర్తురు ; అతి + ఉగ్రులు = మిక్కిలి క్రూరులు; చంద్రదత్త, వ్యాఘ్రదత్తులు ; ఆ + విధము వారు + ఎ = అటువంటివారే (మహారథులే) ; వినుము ; సేనాబిందుఁడు ; అను ; నృపాలు ఁడు = రాజు ; అతిరథ + ఉత్తముఁడు = అతిరథ శ్రేష్ఠుడు; మారుత పుత్రు + ఎన = భీమునికి సాటియైన వాడు; అతండు + ఒక్కరుండును = అతడొక్కడే ; వారి = ఆ పాండవులయొక్క; ఉఱిది = తీవ్రమైన; లావు = శక్తి ; పాండ్యుఁడు = పాండ్యదేశాధిపతి ; అతిరథుండు ; బలఁగంబు = సేన; కలవాడు ; అమిత బలుఁడు = మిక్కిలి బలశాలియైన ; కాశ్యుఁడు ; సమరథుండు ; ఆజి కోవిదుఁడు = యుద్ధంలో నేర్పరియైన ; కుంతి భోజుఁడు, అతిరథుండు ; అతని + ఒద్ది + జోదులు = అతని దగ్గరగల వీరులు; అధిక బలులు= మిక్కిలి బలవంతులు -

భా . *చిత్రాయుధుడూ, చేకితానుడూ మహారథులు. వీరిద్దరూ అర్జునునకు చాలా ఇష్టమైనవారు. యుద్ధంలో సమర్థులు; సర్వాయుధ ప్రయోగాలూ తెలిసిన వారూ, ఉగ్రమైన వారు, చంద్రదత్త వ్యాఘ్ర దత్తులు కూడా అటువంటివారే. సేనా బిందుడు అతిరథుడు. భీమసేనునితో పోల్చదగినవాడు. అతడొక్కడే పాండవులకు గొప్ప బలం. పాండ్యరాజు అతిరథుడు.మంచి సేన కలవాడు. బలశాలి శౌర్యుడు సమరథుడు. యుద్ధ విశారదుడైన కుంతి భోజుడు అతిరథుడు. అతని సైనికులు మహాబలవంతులు.*

వ . **రోచమానుండు మహారథుండు దేవసమానుండు. 267**

భా . *రోచమానుడు దేవతలతో సమానుడూ, మహారథుడు.*

తే . **అతిరథుల కెల్లఁ దల దండ్రి యట్టివాఁడు**
యసుర విభుఁడు ఘటోత్కచుం డా హిడింబ
కొడుకు మాయాబలంబున నొడుచుఁ బగఱ
నతనికడ దానవానీక మగ్గలంబు.. 268

అ . అసుర విభుఁడు = రాక్షసరాజైన ఘటోత్కచుడు ; అతిరథులకున్ + ఎల్లన్ = అతిరథులందరిలో ; తల = శిరస్సు వంటివాడు; తండ్రి + అట్టివాఁడు = తండ్రి యంతటివాడు ; ఆ హిడింబ కొడుకు = ఆ ఘటోత్కచుడు ; మాయాబలంబునన్ = మాయాశక్తిచేత ; పగఱన్ = శత్రువులను ; ఒడుచున్ = జయించును ; అతనికడన్ = ఆ ఘటోత్కచుని దగ్గర ; దానవ + అనీకము = రాక్షససేన ; అగ్గలంబు = అధికం .

భా . *హిడింబా తనయుడూ, రాక్షసరాజూ అయిన ఘటోత్కచుడు అతిరథులందరిలో శ్రేష్ఠుడు, తండ్రియైన భీమునంతటి వాడు. తన మాయా బలంతో శత్రువులను జయింపగలవాడు. అతని దగ్గర రాక్షససేన సమృద్ధంగా ఉంది.*

వ. నాకుం దోచినవారిం బేరుకొంటి నింతియకాని రెండు వీళ్ళను మంచి మగలు పెక్కండ్రు గలరని చెప్పి గాంగేయుండు. **269**

అ. వీళ్ళను = సేనలయందును; మంచి మగలు = గొప్పవీరులు.

భా. నాకు తోచిన వారిని గురించి నేను చెప్పాను. ఇంతేగాక ఇరుపక్షాల సేనలలోను మహావీరులు ఎంతో మంది కలరు అని పలికి భీష్ము డింకా ఇలా అంటున్నాడు.

పాండవ సేన - అతిరథాదుల పట్టిక

1.	ధర్మరాజు	అతి	
2.	భీముడు -	అతి	
3.	నకుల సహదేవులు	సమ	
4.	అర్జునుడు	ఏమనాలో లెక్కించ లేము.	
5.	ఉపపాండవులు	మహా	
6.	ఉత్తరుడు	మహా	
7.	అభిమన్యుడు	అతి	
8.	సాత్యకి	అతి	
9.	ద్రుపదుడు	మహా	
10.	విరాటుడు	మహా	
11.	శిఖండి	మహా	
12.	ధృష్టద్యుమ్నుడు	అతి	
13.	ధృతవర్ముడు	అర్థ	ధృష్టద్యుమ్నుని కొడుకు
14.	ధృష్టకేతుడు	మహా	శిశుపాలుని కొడుకు
15.	భోజుడు - అజుడు	మహా-	
16.	ఉతమౌజుడు	మహా	వీరు పాంచాలకుల ప్రదీపకులు
17.	యుధామన్యుడు	"	"
18.	క్షత్రదేవుడు	"	"
19.	జయంతుడు	"	"
20.	అమితౌజుడు	"	"
21.	విరాటుడు	"	"
22.	సత్యజితుడు	"	"
23.	కేకయరాజులు 5	"	"
24.	నీలుడు	"	కాశీరాజు

25.	సూర్యదత్తుడు	"	వీరు విరాటజ్ఞాతులు.
26.	మదిరాక్షుడు	"	"
27.	శంఖుడు	"	"
28.	చిత్రాయుధుడు	"	
29.	చేకితానుడు	"	
30.	చంద్రదత్తుడు	"	
31.	వ్యాఘ్రదత్తుడు	"	
32.	సేనాబిందుడు	అతి	
33.	పాండ్యుడు	"	
34.	కాశ్యుడు	సమ	
35.	కుంతిభోజుడు	అతి	
36.	రోచమానుడు	మహా	
37.	ఘటోత్కచుడు	అతి	

క. **పాండవుల దిక్కు రథికు ల**
ఖండిత బలు లైన నా మొగంబునఁబడి యు
ద్దండత చూపఁగ లేరు శి
ఖండిని నొక్కరునిఁ జంపఁ గాని కుమారా! 270

అ. కుమారా ! ; శిఖండినిన్ = శిఖండిని ; ఒక్కరునిన్ = ఒక్కని మాత్రమే ; చంపన్ + కాని = చంపలేను కానీ ; పాండవుల దిక్కు = పాండవ పక్షంలో నున్న ; రథికులు ; అఖండిత - బలులు + ఐనన్ = మొక్క వోని బలం గల వారైననూ ; నా మొగంబునన్ + పడి = నా యెదుట పడి ; ఉద్దండత = తీవ్రతను ; చూపఁగన్ లేరు = ప్రదర్శింపలేరు.

భా. *పాండవ పక్షంలోని రథికులెవ్వరూ, ఎంత బలవంతులైనా నా ఎదుట పడి తమ తీవ్రతను ప్రదర్శింపజాలరు. అయితే నేను ఒక్క శిఖండిని మాత్రం చంపలేను.*

క. **అనవుడు దుర్యోధను"ఁ డా**
తని మీరు వధింపమికిఁ గతం బేమియొకో!
వినఁదగు నేనిం జెపుఁడా"
యనుటయు నిట్లనియె భీష్ముఁ డతనికి నెమ్మిన్. 271

అ. అనవుడున్ = అన్న వెంటనే; దుర్యోధనుఁడు; ఆతనిన్ = ఆ శిఖండిని ; మీరు ; వధింపమికిన్ = సంహరింపలేకపోవటానికి ; కతంబు = కారణం ; ఏమి + ఒకో = ఏమిటో ? ; వినన్ = తగున్ + ఏనిన్= వినదగినదైతే ; చెప్పుడు + అ = చెప్పండి ; అనుటయున్ = అనగా ; భీష్ముడు ; నెమ్మిన్ = ప్రేమతో ; అతనికిన్ ; ఇట్లు + అనియెన్ .

భా. భీష్ము డట్లు పలుకగానే సుయోధనుడు " మీరు శిఖండిని సంహరింపలేక పోవటానికి కారణమేమిటి ? వినదగినదైతే వినిపించండి' అని భీష్ముని అడిగాడు. అప్పుడు ప్రేమతో భీష్ముడు సుయోధనునితో ఇలా అన్నాడు.

వ. ఏనా శిఖండినిఁ జంపమికి మూలంబు సాలం గలదు; తత్ప్రపంచం బంతయు వివరించెద నాకర్ణింపుము. 272

అ. మూలంబు = కారణం; తత్ ప్రపంచంబు = దాని వివరము

భా. నేనా శిఖండిని చంపలేక పోవటానికి కారణం చాలా ఉంది. ఆ సంగతంతా నీకు వివరిస్తాను. విను.

-: భీష్ముఁడు దుర్యోధనున కంబోపాఖ్యానంబు సెప్పుట :-
(సం 5-170-1)

సీ ॥ శంతను పిమ్మట సత్యవతీదేవి
యనుమతి తోడ (జిత్రాంగదునకు
సామ్రాజ్య పట్టంబు సమ్మతి ఁగట్టితి
నల్పకాలంబున నతఁడు దీఱెఁ
దత్పరోక్షావస్థఁ దదనుసంభవుని వి
చిత్రవీర్యుని రాజుఁ జేసి పెండ్లి
సేయంగ ఁదివిరి" కాశీపతి కూఁతులు
కన్యలు ముప్వురు గలుగుటయును

తే. నాతఁ డర్థిఁ దదీయ స్వయంవరమున
కఖిల నృపతులఁ బిలిపించె ననియు నెఱిఁగి
తల్లి కెఱిఁగించి యొంటిమైఁ దత్పురమున
కాయితంబయి పోయితి నరద మెక్కి. 273

అ. శంతను పిమ్మటన్=శంతను మహారాజు తర్వాత; సత్యవతీదేవి + అనుమతితోడన్; చిత్రాంగదునకున్ ; సామ్రాజ్య పట్టంబు = సామ్రాజ్య పట్టాభిషేకం ; సమ్మతిన్ = ఆనందంతో; కట్టితిన్ ; అల్పకాలంబునన్ = కొద్దిరోజులలోనే ; అతఁడు ; తీఱెన్ = మరణించెను ; తత్ + పరోక్ష + అవస్థన్ = అతడు లేని ఆ దశలో ; తత్ + అనుసంభవునిన్ = అతని తమ్ముడైన; విచిత్ర వీర్యునిన్ ; రాజున్ + చేసి ; పెండ్లి + చేయంగన్ ; తివిరి = పూని ; కాశీపతి కూఁతులు = కాశీరాజ పుత్రికలు; కన్యలు = అవివాహితలు ; ముప్వురు + కలుగుటయును ; ఆతఁడు = ఆ కాశీపతి ; అర్థిన్ = ప్రీతితో ; తదీయ - స్వయం వరమునకున్ = వారి స్వయం వరానికి ; అఖిల - నృపతులన్ = సమస్తరాజులను ; పిలిపించెననియున్ = ఆహ్వానించినాడనీ ; ఎఱిఁగి = తెలిసికొని ; తల్లికిన్ ; ఎఱిఁగించి = తెలియజేసి ; ఒంటిమైన్ = ఒంటరిగానే; ఆయతంబు + అయి = సిద్ధపడి ; అరదము + ఎక్కి = రథమెక్కి ; తత్పురమునకున్ = ఆ కాశీరాజనగరానికి; పోయితిన్ .

భా. శంతను మహారాజు తర్వాత సత్యవతీదేవి అంగీకారంతో చిత్రాంగదుని రాజ్యాధిపతిని చేశాను. కొద్దికాలంలోనే అతడు మరణించగా అతని తమ్ముడైన విచిత్ర వీర్యుని రాజును చేసి పెండ్లి చేసే ప్రయత్నంలో ఉన్నాను. అప్పుడు కాశీరాజుకు పెండ్లి కావలసిన కుమార్తెలు ముగ్గు రున్నారనీ, వారి స్వయంవరాన్ని ఏర్పాటు చేస్తున్నారని తెలిసి, తల్లికి కూడా చెప్పి నేను ఒంటరిగానే సిద్ధమై రథంపై ఆ పురానికి ప్రయాణమై పోయాను.

వ. ఇవ్విధంబునం జని యమ్మహోత్సవంబున నలంకృతలై యున్న యంబయు, నంబికయు, నంబాలికయు నను ముద్దియల ముువ్వురం బట్టి, రథంబు పయిఁ బెట్టుకొని రా నచ్చటి రాజు లెల్లను జతురంగ బలంబులతో వచ్చి నన్నుం బొదివినఁ బటు విశిఖానల శిఖాకలాపంబున వేఁడిమి సూపి, వారి నిలువరించి, యరుగుదెంచి, సత్యవతికి నప్పొలంతుల నొప్పించిన న ద్దేవి విచిత్రవీర్యునకు వారల వివాహంబు సేయ నుద్యోగించె ;నట్టి యెడ నమ్మువ్వుర యందుం బెద్దయది యైన యంబయను కన్యక నాతో నిట్లనియె. 274

అ. ముద్దియలన్ = స్త్రీలను ; చతుర్ + అంగ - బలంబులతోన్ = నాల్గువిధాలైన సేనలతో; పొదివినన్ = చుట్టుముట్టగా ; పటు . కలాపం బునన్ ; పటు = సమర్థమైన ; విశిఖ = బాణములనెడి ; శిఖా = అగ్ని జ్వాలలయొక్క ; కలాపంబునన్ = విన్యాసములతో; వేఁడిమి = పరాక్రమం; పొలంతులన్ = స్త్రీలను.

భా. ఈ విధంగా పోయి ఆ స్వయంవర మహోత్సవంలో అలంకరించుకొని ఉన్న, అంబ, అంబిక, అంబాలిక లనెడి కన్యకల ముగ్గురినీ బలవంతంగా పట్టి తెచ్చి రథం పై నుంచుకొని వస్తున్నాను. అప్పుడు స్వయంవరానికి వచ్చిన రాజులంతా చతురంగ బలాలతో నన్ను చుట్టుముట్టారు. నేను వాడియైన బాణాలను ప్రయోగించి, నా ప్రతాపం ప్రదర్శించి, వారి నందరినీ నిరోధించి, వచ్చి ఆ కన్యలను సత్యవతీదేవి కప్పగించాను. ఆమె ఆకన్యకలను విచిత్ర వీర్యునకిచ్చి వివాహం చేయ సంకల్పించింది. ఆ సమయంలో వారిలో పెద్దది అయిన అంబ నాతో ఇలా అన్నది.

తే. సౌంభ పురవల్లభుండైన సాళ్వుమీఁదఁ
దలఁపు గలదు నా, కతఁడును దగులు గలిగి
యుండు నా దెస; నీవు ధర్మోత్తరుండ
వతని పాలికిఁ దగ నన్ను ననుపవయ్య. 275

అ. సౌంభపుర - వల్లభుండు + ఐన = సౌంభపురప్రభువైన; సాళ్వుమీఁదన్ = సాళ్వునిపై ; నాకున్ ; తలఁపు = వలపు ; కలదు ; అతఁడును; నాదెసన్ = నాపై; తగులు + కలిగి = వలపు కలిగి; ఉండున్ ; నీవు ; ధర్మ+ ఉత్తరుండవు = ధర్మాన్ని ప్రధానంగా భావించెడి వాడివి ; నన్నున్ ; అతని పాలికిన్ = అతని దగ్గరకు ; తగన్ = తగురీతిగా ; అనుపవు + అయ్య = పంపవా?

భా . *సౌంభ పురాధిపతియైన సాళ్వుని నేను వలచి యున్నాను. అతడికి కూడా నాపై వలపు కలదు. నీవు ధర్మ స్వరూపం తెలిసిన వాడివి కాబట్టి దానికి తగినట్లు నన్ను అతని దగ్గరకు పంపు.*

వి . అంబ తల్లి చాటు బిడ్డయినా భీష్మునితో ఉన్న విషయం ధైర్యంగా చెప్పగలిగింది. ఆ తెగింపే తర్వాత తర్వాత జరిగే మలుపు లన్నింటిలో కనిపిస్తుంది.

ధర్మోత్తరుడని భీష్ముని సంబోధించటంలో అంబకు భీష్ముని పట్లగల విశ్వాసం వ్యక్తమవుతుంది. "ప్రవృత్తిలో శరీరాని కన్నా మనస్సునకే ప్రాధాన్యమన్నది ధర్మం" అని అంబ అభిప్రాయం.

క . అన విని సత్యవతికిఁ జె
ప్పిన నాయమ వనుప నంబ (బెంపుగ వృద్ధాం
గనలం దోడుగ నప్పుడ
పనిచి యనిచితిని జనంబు ప్రస్తుతి సేయన్. 276

అ . అనన్ ; విని ; సత్యవతికిన్ ; చెప్పినన్ ; ఆ + అమ = ఆమె; పనుపన్ = ఆదేశింపగా ; అంబన్, పెంపుగన్ = గౌరవంగా ; అప్పుడు + అ = అప్పుడే ; వృద్ధ + అంగనలన్ = వృద్ధురాండ్రను ; తోడుగన్ + పనిచి = తోడుగా నియోగించి ; జనంబు = ప్రజలు ; ప్రస్తుతి + చేయన్ = ప్రశంసించుచుండగా ; అనిచితిని = పంపితిని .

భా . *ఆ మాటలు విని సత్యవతికి చెప్పి ఆమె ఆదేశం మేరకు వృద్ధాంగనలను తోడిచ్చి, గౌరవంగా అంబను అప్పుడే సాగనంపాను. ప్రజకూడా అది చూచి ప్రస్తుతి చేసింది.*

వి . భీష్ముడు చేస్తున్న ప్రతిపనికీ తల్లి అనుమతి తీసుకుంటున్నాడు. అది అవివాహితయైన స్త్రీకి సంబంధించిన విషయం కాబట్టి ఆమె శ్రేయస్సు దృష్ట్యా అలా చేయవలసి వస్తోంది.

'జనంబు ప్రస్తుతి చేయన్' అన్న మాట తనగొప్పతనాన్ని చాటుకోవటానికి చెప్పినది కాదు. తాను చేస్తున్న పనికి ప్రజల ఆమోదం కూడా ఉందని తెలియ జెప్పటమే అక్కడ లక్ష్యం.

వ . ఇట్లు పనిచి తక్కిన కన్నెల నిరువురం బాణిగ్రహణంబు సేయించితి.277

భా . *ఈ రీతిగా అంబను (సాళ్వుని వద్దకు) పంపి మిగిలిన ఇరువురు కన్యలకు (విచిత్ర వీర్యునితో) పెండ్లి జరిపించాను.*

క . అంబయు నటు సాళ్వుని కడ
కుం బోయిన నతఁడు " భీష్ముకొనిపోయిన దా
నిం బరచుం గైకొన ధ
ర్మంబే కన్యాత్వ మెడలె మగువా నీకున్. 278

అ . అంబయున్ ; అటన్ ; సాళ్వునికడకున్ ; పోయినన్ ; అతఁడు ; భీష్ముకొని పోయిన దానిన్ = భీష్ముడు కొని పోయిన దానిని; పరచున్ = తెగించిపోయిన దానిని ; కైకొనన్

= స్వీకరించుట ; ధర్మంబు + ఏ = ధర్మమగునా ?; మగువా = కాంతా ; నీకున్ ; కన్యాత్వము = కన్నెతనము ; ఎడలెన్ = చెడినది. (తర్వాత పద్యంతో అన్వయం)

భా . *అక్కడ అంబ సాళ్వుని దగ్గరకు వెళ్ళగా అతడిలా అన్నాడు. 'భీష్ముడెత్తుకొని పోయినదానివి, తెగించి పోయిన దానివి నువ్వు. అటువంటి నిన్ను స్వీకరించటం అధర్మ మవుతుంది. నీ కన్యాత్వం చెడింది.*

వి . నలుగురి ముందు భీష్ముని ఎదిరించి అంబను స్వీకరించలేని సాళ్వుడు తన అసామర్థ్యాన్ని కప్పిపుచ్చుకొనేందుకే అంబను తేలిక చేసి మాటాడుతున్నాడు. భీష్ముడు తీసుకొని పోవటమే సాళ్వునకు తెలుసుకానీ ఎందుకు తీసుకొని పోయినదీ తెలియదు. ఏది ఏమైనా సాళ్వుడు భీష్ముని ఎదిరించగలిగి ఉంటే అంబ పరచ అయ్యే అవకాశమూ లేదు. ఆమె కన్యాత్వం నశించే పరిస్థితీ లేదు. అతని అసమీక్ష్య కారిత్వం, అశక్త దుర్జనత్వం అంబను బలిగొన్నాయి.

వ . ఇంక నిన్ను భార్యగా వరియింపఁ దగునే యనినఁ గామ
శర పీడిత యగుచు నక్కామిని యాతని కిట్లనియె. 279

అ . కామ-శర- పీడిత = మదనుని బాణాలచే పీడింపబడినది ; కామిని = కాంత.

భా . *కాబట్టి ఇక నిన్ను భార్యగా చేసుకొనరాదని సాళ్వు డనగానే అంబ మదన బాణాలచే బాధింపబడి అతనితో ఇలా అన్నది.*

వి . అరవిందమూ, అశోకమూ, చూతమూ, నవమల్లికా, నీలోత్పలమూ మదనుని బాణాలు

తే . తమ్మునికిఁ గాఁగ భీష్ముఁ డుదగ్రవృత్తిఁ
గన్నియలఁ గొని పోయెడుఁ గాన బలిమి
నన్నుఁ గొని పోయె; నాచేత నిన్ను వినిన
యపుడె పుత్తెంచె; దూషింప ననఘ! తగునె? 280

అ . భీష్ముఁడు ; తమ్మునికిన్ + కాఁగన్ = తన తమ్ముని కోసమై ; ఉదగ్రవృత్తిన్ = భయంకర ప్రవర్తనతో ; కన్నియలన్ = కన్యల మైన మమ్ము ; కొనిపోయెడున్ = తీసికొని పోయెను ; కానన్ ; బలిమిన్ = బలవంతంగా; నన్నున్ ; కొనిపోయెన్ ; నా చేతన్ = నా వలన; నిన్నున్ = నీ గురించి; వినిన + అపుడె = విన్నప్పుడే ; పుత్తెంచెన్ = పంపెను ; అనఘ = మహాత్మా ; దూషింపన్ = తగునె = నిందింపవచ్చునా ?

భా . *తన తమ్ముడైన విచిత్రవీర్యుని కోసం స్వయంవర కన్యకలను తీసికొని పోతూ వారిలో నొకదానినైన నన్ను కూడా బలవంతంగా తీసికొని పోయాడు. నేను నీ గురించి చెప్పిన వెంటనే నన్ను నీ దగ్గరకు పంపించాడు. కాబట్టి నిందించటం న్యాయమా?*

వి . " నిందించటం భావ్యమా " అని కర్మనిరపేక్షంగా ప్రయోగించటంలో తనను కానీ, భీష్ముని కానీ నిందింపవలసిన అవసరం లేదన్న భావం స్ఫురిస్తుంది. ఇద్దరమూ నిర్దోషులమే అని అంబ అభిప్రాయం.

'నువ్వు తెగించి పోయా ' వన్న సాళ్వుని ఆరోపణకు అంబ తగిన రీతిగా సమాధాన మిచ్చింది.

వ . " మా తండ్రి యెఱుంగక స్వయంవరాలంకారంబు నాకుం జేయించిన కతంబున నింతవుట్టె; భీష్ముండు నా చెలియండ్ర దన తమ్మునికిచ్చి, నన్ను నీ కడకుం దగ ననిచె; దీన నేమి తప్పని" మఱియు ననేక ప్రకారంబులం బలికిన వినక తన్నుం జేకొనక సాళ్వుండు. 281

అ . స్వయంవర + అలంకారంబు = స్వయంవరానిక తగినట్లు చేసే ముస్తాబు ; అనిచెన్ = పంపెను ; అనేక ప్రకారంబులన్ = నానా విధాలుగా ; చేకొనక = స్వీకరింపక.

భా . " మా తండ్రి మన సంగతి తెలియక మా చెల్లెళ్ళతో పాటు నాకు కూడా స్వయంవరాలంకారం చేయించినందువలన ఇంత అనర్థం జరిగింది . భీష్ముడు నా చెల్లెళ్ళను తన తమ్మునికిచ్చి నన్ను నీ దగ్గరకు పంపినాడు. దీనిలో తప్పేమిటి" అని అనేక విధాలుగా అంబ మాటాడినా సాళ్వుడు అంబను స్వీకరించలేదు.

క. కరుణంబుగ నేడ్చు తలో
దరిఁ "బో పొమ్మిచట నింకఁ దడయకు" మని మం
దిరము వెడలంగ నడిచిన
నరిగె నదియు నార్త చిత్తయై వికల గతిన్. 282

అ . కరుణంబుగన్ = దీనంగా ; ఏడ్చు; తలోదరిన్ = కాంతను ; పో పొమ్ము ; ఇచటన్ ; ఇంకన్ ; తడయకుము = ఆలస్యం చేయవద్దు; అని ; మందిరమున్; వెడలంగన్ + అడిచినన్ = వెళ్ళగొట్టగా ; అదియున్ ; ఆర్తచిత్తయై = బాధతో కూడిన మనస్సుకలదై ; వికల గతిన్ = కలత పడి (అడుగులు తడబడగా); అరిగెన్= వెళ్ళెను.

భా . ఆ రీతిగా దయనీయంగా విలపిస్తున్న అంబను చూచి సాళ్వుడు"పో పో . ఇంక ఇక్కడ ఆలస్యం చేయవద్దు" అని మందిరంనుండి వెళ్ళగొట్టాడు. అప్పుడు అంబ ఆర్త చిత్తయై అడుగులు తడబడగా అక్కడి నుండి వెళ్ళింది.

వి. అంబ తాను చేయని నేరానికి శిక్షను అనుభవించ వలసి వస్తోంది. మంచిలో అయినా చెడులో అయినా మనసున ఒక రీతిగా , ప్రవర్తన ఒక రీతిగా ఉన్నప్పుడు ఏర్పడే పరిస్థితులు ఇటువంటివే.

స్వయంవర సమయంలో భీష్ముడు అంబనుకొని పోయాడు కాబట్టి ఆమె అన్యాక్రాంత అయినట్లే అన్న సాళ్వుని అభిప్రాయం కూడా సరిఅయినదే. తన విషయం తండ్రికి ముందే చెప్పకుండా స్వయంవరాలంకారం చేయించుకోవటం అంబ తప్పు. అయినా స్వయంవరం కాబట్టి అందులో నిర్ణయించుకునే అధికారం ఆమెదే కాబట్టి అదికూడా పెద్ద సమస్య కాదు. తన తమ్ముని కోసమే కన్యకలను తీసుకొని పోతున్నట్లుగా భీష్ముడు ముందే చెప్పవలసి ఉంది. అలా చెప్పనప్పుడు సాళ్వుని అభిప్రాయం తప్పుకాదు. భీష్ముడు తాను ఆజన్మ బ్రహ్మచారిగా శపథం చేసిన సంగతి లోకానికి తెలుసు కదా అని సమాధానం చెప్పి తప్పించుకునే అవకాశముంది. అయితే అది ధర్మ నిర్ణయానికి నిలిచేదికాదు. కాబట్టి అంబ నిలకడ మీద భీష్ముడే దానికి

కారణమని నిర్ణయించుకోవటం, చివరకు దాని ఫలితాన్ని కూడా భీష్ముడే అనుభవించవలసి రావటం జరిగింది.

వ. చని చని యవ్వేలంది యిట్లని వితర్కించు. 283

అ. వెలంది = స్త్రీ ; వితర్కించున్ = ఆలోచించును.

భా. *అంబ అలా పోయి పోయి ఇలా ఆలోచించింది.*

తే. సాళ్వునకుఁ గాని యపుడ సంసారమునకుఁ
బాసితిన యింక భీష్ముని పాలి కేల
యరుగ నాతండు మూల మీహాని కెల్లఁ
గాన నాతని సాధింతుఁ గాక యేను. 284

అ. సాళ్వునకున్ ; కాని + అపుడు + అ = కాని దాననైనపుడే ; సంసార మునకున్; పాసితిని + తొలగితిని ; ఇంకన్ ; భీష్ముని పాలికిన్ = భీష్ముని దగ్గరకు ; అరుగన్ + ఏల = వెళ్ళవలసిన అవసరమే మున్నది ?; ఈ హానికిన్ + ఎల్లన్ = ఈ చేటు కంతకూ ; అతండు ; మూలము + కాన = కారణం కాబట్టి ; ఏను = నేను ; ఆతనిన్ ; సాధింతున్ + కాక = నాశనం చేయుదును గాక !

భా . *సాళ్వునికి కానిదాని నైనపుడే సంసారానికి దూరమైపోయాను. ఇక భీష్ముని దగ్గరకు వెళ్ళి అడగవలసిన దేమున్నది ; ఈ హాని కంతటికీ భీష్ముడే కారణం కాబట్టి అతన్నే సాధించాలి కానీ !*

క . " గాంగేయు గెల్వ నెవ్వరి
కిం గొలఁదియె! తపము పేర్మి గెలిచెదఁగా కం"
చుం గాంత సనియె సంయమి
పుంగవు లొక కొంద ఱున్న పుణ్యస్థలికిన్. 285

అ . గాంగేయున్ = భీష్ముని; గెల్వన్ = జయించుటకు ; ఎవ్వరికిన్ = ఎవరికైనా ; కొలదిఁయె= శక్యమగునా ?; తపము + పేర్మిన్ = తపఃప్రభావంతో; గెలిచెదన్ + కాక; అంచున్ ; కాంత ; సంయమిపుంగవులు = ముని శ్రేష్ఠులు; ఒక కొందరు = కొంత మంది ; ఉన్న ; పుణ్యస్థలికిన్ = పుణ్యక్షేత్రానికి ; చనియెన్ = వెళ్ళినది.

భా . *భీష్ముని గెలవటం ఎవ్వరికైనా అంత తేలికైన పనికాదు. కాబట్టి నేను తపస్సుచేత అతనిని గెలవాలి అని అనుకొని కొంతమంది మునీశ్వరులున్న ఒక పుణ్యక్షేత్రానికి వెళ్ళింది అంబ.*

వ. చని వారలకుం దన వృత్తాంతం బెఱింగించిన వా 'రిది రాజులు సేసిన పని, సాధుల చేతఁ జక్కంబడునే' యనిన నవ్వనిత "దపశ్చరణంబునకు వచ్చితి" ననుటయు "నీవు సుకుమారవు, నీ కిది సొప్పడునే! తండ్రి పాలికిం బొ మ్మిదియ పరమ ధర్మం" బని పలికిన వారి కన్నారీ రత్నం బిట్లనియె. 286

అ . చొప్పడునే = సాధ్యమగునా ; నారీ రత్నము = ఉత్తమమైన కాంత.

భా . అలా మునీశ్వరుల వద్దకు వెళ్లి అంబ తనసంగతి వారికి చెప్పగా వారు "ఇది రాజులు చేసిన పని. మా వంటి సాధువుల వలన నెరవేరుతుందా" అని అన్నారు. అప్పుడు అంబ "తపస్సు చేయటానికి వచ్చానని పలికింది." దానికా మునులు "నీవు సుకుమారివి. తపస్సు నీ వల్ల కాదు. నీ తండ్రి దగ్గరకు వెళ్ళు, అది ఉత్తమ ధర్మ"మని బోధించారు. అప్పుడు అంబ వారితో ఇలా అన్నది.

క . " ఎవ్వరు నెఱుఁగక యుండఁగ
నివ్వనమునఁ దపము సేఁత యిది నిర్ణయ మే
నెవ్వారి కడకు నేమని
యెవ్విధిఁ బో నేర్చుదాన? నేటికి బంధుల్?" 287

అ . ఎవ్వరున్ ; ఎఱుఁగక + ఉండఁగన్ ; ఈ + వనమునన్ = ఈ అరణ్యంలో ; తపము + చే ఁత = తపస్సు చేయుట ; ఇది ; నిర్ణయము ; ఏను = నేను ; ఏ + వారి కడకున్ = ఎవరి వద్దకు ; ఏమి + అని ; ఏ + విధిన్ = ఏ రీతిగా ; పోన్ + నేర్చుదానన్ = వెళ్ళగలదానను ; బంధుల్ = బంధువులు ; ఏటికిన్ = ఎందుకు ?

భా . ఎవ్వరికీ తెలియకుండా ఈ అరణ్యంలో తపస్సు చేయటానికే నిశ్చయించుకున్నాను. ఎవరి దగ్గరకు ఏమని నేను వెళ్ళగలను ? నాకు బంధువుల ప్రమేయం కూడా ఎందుకు ?

వ . అని చెప్పు నవసరంబున నయ్యాశ్రమంబునకు హోత్రవాహనుం డను రాజర్షి వచ్చిన నమ్మును లభ్యాగత పూజలు సేసిన యనంతరంబ యంబ గనుంగొని 'యిక్కన్నియ యెక్కడిది ; దీని విషాదంబునకుం గారణం బే'ఘుని యడిగి వారి వలన దాని జన్మ ప్రకారంబును దద్వృత్తాంతంబును విని, తన కూఁతురగుట యెఱింగి, యయ్యంగన వినం దపస్వి జనంబులకుం జెప్పి, యప్పొలంతిం దన యంకతలంబున నునిచికొని, వెండియు నడుగ; సవిస్తరంబుగా నచ్చేడియ సెప్పిన విని, శోకించి, య వ్విషమ ప్రకారంబునకు నిస్తారంబుఁ జింతించి. 288

అ . విషమ ప్రకారంబునకున్ = సంకటస్థితికి; నిస్తారంబు = ఉపాయము. అవసరంబు = సమయం

భా . అంబ అలా చెప్పేటప్పుడే హోత్రవాహను డనే రాజర్షి ఆ ఆశ్రమానికి వచ్చాడు. మునులు అభ్యాగతుడైన అతనిని తగినట్లు పూజించిన తర్వాత అంబను చూచి అతడు "ఈమె ఎవ్వరు? ఈమె దుఃఖానికి కారణమే"మని అడిగాడు. వారు అంబ జన్మ వృత్తాంతాన్ని, అప్పటికి జరిగిన వృత్తాంతాన్ని చెప్పగానే ఆ రాజర్షి అంబ తన మనుమరాలని గ్రహించాడు. ఆ విషయాన్నే అంబకూ, మహర్షులకూ చెప్పి అంబను తన ఒడిలో

కూర్చుండబెట్టుకొని మరలా ఆ విషయమడిగి అంబద్వారా తెలుసుకున్నాడు. కొంత దుఃఖించి ఆ సంకటస్థితినుండి బయటపడే ఉపాయాన్ని ఆలోచించాడు.

ఉ. **" నీ కిది యేటికిం దప మనింద్య చరిత్రవు నీవు; నిన్ను నేఁ**
జేకొని కాతు; నొక్కగతిఁ జెప్పెద; భార్గవరాము నాశ్రిత
శ్రీకరుఁ గాన్పు; మాపదలు సెందఁగ నీఁ డతఁ డాశ్రయించినన్
శోకము దక్కు; మన్న విని సుందరి యల్లన యత్తపస్వితోన్. 289

అ. నీకున్ ; ఇది ; తపము ; ఏటికిన్ = ఎందులకు ?; నీవు ; అనింద్య చరిత్రవు = దూషింపరాని నడవడి గలదానవు ; ఏన్ = నేను ; నిన్నున్ ; చేకొని = ఆదరించి ; కాతున్ = రక్షించెదను ; ఒక్కగతిన్ = ఒక మార్గాన్ని; చెప్పెదన్ ; ఆశ్రిత శ్రీ కరున్ = ఆశ్రయించిన వారికి శుభము కల్పించెడి ; భార్గవ రామున్ = పరశురాముని; కాన్పుము = చూడుము; అతఁడు ; ఆశ్రయించినన్ = ఆశ్రయింపగా ; ఆపదలు = కష్టాలు ; చెందఁగనీఁడు = అనుభవింపనీయడు ; శోకము = దుఃఖాన్ని ; తక్కుము = విడువుము ; అన్నన్ ; విని ; సుందరి= ఆ అంబ; అల్లన = మెల్లగా ; అత్తపస్వితోన్ = ఆ రాజర్షితో (తర్వాతి పద్యంతో అన్వయం).

భా. *" నీకీ తపస్సేమిటి ; ఏ దోషమూ లేని నడవడి కలదానవు నీవు. నిన్ను నేను చేరదీసి రక్షిస్తాను. నీ కొక మార్గం చెపుతాను. తన్ను ఆశ్రయించిన వారిని రక్షింపగల పరశురాముని దర్శనం చేయి. అతడు ఆపదలు రానీయడు. విచారం వదలిపెట్టు "అనగా విని ఆ సుందరి ఆ రాజర్షి తో (ఇలా అన్నది)*

ఆ **"పరశురాముఁ గానఁ బడయుట యెక్కడఁ**
గలుగు నాతఁ డెట్లు కరుణసేయు"?
ననఁ దపస్వి యిట్టులను, "మహేంద్రంబను
పర్వతమునఁ జేయుఁ బరమతపము " 290

అ. పరశురామున్ ; కానన్ + పడయుట = చూడగలుగుట ; ఎక్కడన్ + కలుగున్ = ఎక్కడ సంభవిస్తుంది ?; అతఁడు ; ఎట్లు ; కరుణ + చేయున్ = దయచూపును ; అనన్ = అనగా ; తపస్వి = రాజర్షియైన హోత్రవాహుడు; ఇట్టులు + అనున్ ; మహేంద్రంబు + అను = మహేంద్రమన్న పేరుగల ; పర్వతమునన్ = కొండపై; పరమతపము = ఘోరతపస్సు ; చేయున్ = చేయుచుండును.

భా. *" ఆ పరశురాముని ఎక్కడ చూడగలుగుతాను ? అతడు నాపై ఎలా దయ చూపగలుగుతాడు ? " అని అంబ అడగగానే ఆ తపస్వి " మహేంద్రపర్వతంపై అతడు గొప్ప తపస్సు చేస్తుంటాడు" అని పలికాడు.*

వ. " నన్ను మన్నించుం గావున మదీయ దౌహిత్రి వగుట యెఱింగిన నిన్ను రక్షించు; నందుఁ బొమ్మను సమయంబునం బరశురామ శిష్యుం డగు నకృతవ్రణుం డను ముని వచ్చి యతిథి సత్కారంబులం బూజితుండై యున్నఁ బ్రియ పూర్వకంబుగా నా హోత్రవాహనుండు" భార్గవుం డెయ్యెడ నున్నవాఁ" డని యడిగిన నతం డిట్లనియె.291

అ. మన్నించున్ = గౌరవించును ;. మదీయ దౌహిత్రి = నా కూతురి కూతురు; భార్గవుండు = పరశురాముడు.

భా. *"ఆ పరశురాముడు నాపై గౌరవం గలవాడు కాబట్టి నా మనుమరాలైన నిన్ను రక్షింపగలడు. అక్కడకు వెళ్లు" మని హోత్ర వాహనుడు అంటున్న సమయానికే పరశురామ శిష్యుడైన అకృతవ్రణుడనే ముని అక్కడకు వచ్చాడు. వచ్చి అతిథి సత్కారాలు పొందిన తర్వాత హోత్ర వాహనుడు ఆదరపూర్వకంగా "పరశురాముడు ఇప్పుడెక్క డున్నా"డని ఆ అకృతవ్రణుని అడిగాడు.*

క. తన ప్రియ సఖుఁడవు నీవని
ముని జనులకుఁ జెప్పుచుండు ముదమున నిన్నుం
గనుఁగొనఁగ నెల్లి యిచటికిఁ
జనుదెంచు ననేక శిష్యసంఘము తోడన్. 292

అ. నీవు ; తన ప్రియ సఖుఁడవు = తన ప్రియ మిత్రుడవు ; అని ; మునిజనులకున్ = మహర్షులకు ; ముదమునన్ = ఆనందంతో ; చెప్పుచుండున్ ; నిన్నున్ ; కనుగొనఁగన్ = చూడటానికై ; ఎల్లి = రేపు ; అనేక - శిష్య - సంఘముతోడన్ = పెక్కు శిష్యులతో ; ఇచటికిన్; చనుదెంచున్ = వచ్చును.

భా. *నీవు తనకు ప్రియ మిత్రుండ వని ఆనందంతో మునులకు చెప్తుంటాడు. నిన్ను చూడనికి అనేక శిష్యులతో కూడి రేపిక్కడకు వస్తున్నాడు.*

తే. అనిన విని యెల్లవారును నధిక హర్ష
మెసఁగ నున్నంత మఱునాఁడ యేఁగుదెంచె
భార్గవుం డమ్మునీంద్రులు పరమభక్తి
నర్చ లిచ్చిరి హోత్ర వాహనుఁడుఁ గనియె. 293

అ. అనినన్ ; విని ; ఎల్ల వారును = అందరునూ ; అధిక హర్షము = అమితమైన ఆనందం ; ఎసఁగన్ = ఒప్పగాన్ ; ఉన్న + అంతన్ = ఉండగా ; మఱునాఁడు + అ = మరుసటిరోజే ; భార్గవుండు = పరశురాముడు ; ఏఁగుదెంచెన్ = వచ్చెను ; ఆ + ముని + ఇంద్రులు = అక్కడున్న మహర్షి శ్రేష్ఠులు ; పరమభక్తిన్ = మిక్కిలి భక్తితో ; అర్చలు + ఇచ్చిరి = పూజలు చేసిరి ; హోత్రవాహనుఁడున్ ; కనియెన్ .

భా. *అనగానే అందరూ మహానందపడిపోయారు. ఆ మరునాడే పరశురాముడు అక్కడకు వచ్చాడు. మహర్షులంతా పరమ భక్తితో పరశురాముని పూజించారు. హోత్రవాహనుడు కూడా పరశురాముని దర్శించాడు.*

వ. కని, పరశురాముని సంభావనంబును, సంభాషణంబును బడసి కాశిరాజు కన్యకం జూపి"యిది నా దౌహిత్రి. దీని వృత్తాంతం బంతయు విను" మని యమ్మానినిం గానిపించిన నదియును. 294

అ. సంభావనంబును = మన్ననయు ; మానిని = స్త్రీ

భా. హోత్ర వాహనుడు పరశురాముని ఆదరణను, సంభాషణ భాగ్యాన్ని పొంది ఆపై అంబను చూపించి "ఇది నా మనుమరాలు. దీని కథంతా వినవలసినది" అని అనగానే అంబ ఇలా ప్రవర్తించింది.

చ. కనుఁ గవ నశ్రుధారలొలుకం జరణానతయైన రాముఁ డి
ట్లను "విను హోత్రవాహనుని యట్టుల యేనును నీకు, నీ మనం
బునఁ గల చింత యంతయును బుచ్చెద, నాకడఁ జేరి, తింక నీ
వనటఁ దొలంగఁ బెట్టి గరువంబుగఁ జెప్పుము దీని మూలమున్." 295

అ. కను + కవన్ = రెండు కళ్ళనుండి; అశ్రుధారలు = కన్నీటి ధారలు ; ఒలుకన్ = ప్రవహింపగా ,; చరణ + ఆనత + ఐన = పాదములపై బడగా ; రాముఁడు = పరశురాముడు; ఇట్లు + అనున్ ; విను ; నీకున్ ; ఏనును ; హోత్రవాహనుని + అట్టుల = హోత్రవాహనుని వంటివాడను ; నీ మనంబునన్ + కల = నీ మనస్సులో నున్న ; చింత = బాధ ; అంతయును = పూర్తిగా ; పుచ్చెదన్ = తొలగించగలను ; నా కడన్ = నా దగ్గరకు ; చేరితి = చేరితివి ; ఇంకన్ ; నీ వనట = నీ దుఃఖాన్ని ; తొలంగన్ + పెట్టి = పోగొట్టి ; దీని మూలమున్ = నీ బాధకు గల కారణాన్ని; గరువంబుగన్ = ధీమాగా ; చెప్పుము.

భా. అంబ రెండు కళ్ళనుండి నీరు కారుస్తూ పరశురాముని కాళ్ళపై పడింది. అప్పుడు పరశురాముడు "నీకు హోత్రవాహనుడు ఎటువంటి వాడో నేనుకూడా అటువంటి వాడినే. నీ మనస్సు లోని బాధను పూర్తిగా తొలగించి వేస్తాను. నా చెంత చేరావు కాబట్టి ఇక నీవు దుఃఖాన్ని దిగమ్రింగి దీనికి కారణమేమిటో ధైర్యంగా చెప్పు" అన్నాడు.

వి. పూర్వాపరాలు తెలియకుండా " నీ మనంబున గల చింత యంతయునుఁ బుచ్చెద" నని పరశురాముడు పలకటం అతని ఆర్త త్రాణ పరాయణతను సూచిస్తుంది. అయితే దీనిలో కొంత తొందర పాటు లేకపోలేదు. అదే ఆ తర్వాత పరశురాముని కూడా ఇబ్బందుల పాలు చేసింది.

వ. అనిన విని, యమ్మహాత్మునకు నంబ దన వృత్తాంతం బంతయు సవిస్తరంబుగాఁ జెప్పి " నీ వార్తశరణ్యుండవు ; నా పరిభవంబు దీర్చి నన్ను రక్షింపు", మనవుడు నతం డిట్లనియె. 296

అ. ఆర్త శరణ్యుండవు = పీడితులకు రక్షకుడవు; పరిభవంబు = అవమానము ; తీర్చి = పోగొట్టి ; అనవుడున్ = అన్నవెంటనే

భా. పరశురాముని మాటలు విన్న అంబ పరశురామునికి తన వృత్తాంత మంతా విశదంగా చెప్పి " నీవు దీన జన రక్షకుడవు కాబట్టి నాకు జరిగిన పరాభవాన్ని తీర్చి కాపాడుమని" అడిగింది. అప్పుడు పరశురాము డిలా అన్నాడు .

క . పరిభవము రెండు తెఱఁగులఁ
దరుణీ తోఁచినది, సాళ్వుఁ దగఁ దేర్తునొ ? యు
ద్ధురుఁడగు భీష్ముని ఁదీర్తునొ ?
కరము ప్రియం బెద్ది ? హృదయ గతముం జెపుమా ? 297

అ . తరుణీ = వనితా ;,పరిభవము = (నీకు జరిగిన) అవమానం; రెండు తెఱఁగులన్ = రెండు విధములుగా ; తోఁచినది = కన్పించినది; సాళ్వున్ ; తగన్ = తగినట్లుగా ; తేర్తున్ + ఒ = సంహరించుదునా ? ; ఉద్ధురుఁడు + అగు = దృఢప్రవర్తనకల ; భీష్మునిన్ ; తీర్తున్ + ఒ = సంహరించనా ?; ఎద్ది = ఏది ; కరము = మిక్కిలి ; ప్రియంబు = (నీకు) ఇష్టమైనదో ? హృదయగతమున్ (నీ) మనస్సులోని దానిని ; చెపుమ + ఆ = తెలుపుము.

భా . అమ్మా ! నీకు జరిగిన పరాభవం రెండు విధాలుగా ఉంది. సాళ్వుని సంహరించమంటావా ? భీష్ముని వధించమంటావా? ఈ రెండింటిలో నీ కేది యిష్టమో నీ మనసులోని భావాన్ని చెప్పు.

వి. అంబ జీవితం అస్తవ్యస్తం కావటానికి కారణం సాళ్వుడూ, భీష్ముడూ అనిపిస్తున్నా దీనినొక ఘటనగా స్వీకరించటం అవసరం. ఆ ఘటనలో నిమిత్త మాత్రత ఇద్దరికీ ఉంది. ప్రస్తుతం పరశురాముని జోక్యంకూడా అంతే కాబోతోంది.

చ . అనవుడు నింతి యిట్లను " మహాపురుషా ! నను సాళ్వుఁ డింకఁ గై
కొనఁ డది సాలు భీష్మదెసఁ గోపము నామదిఁ గల్గియుండు నా
తని వధియింపఁ బూని యిట తాపసవృత్తికి వచ్చి యిచ్చటన్
నినుఁ గని యీ పరాభవము నీఁగఁగ నీ శరణంబుఁ జొచ్చితిన్. 298

అ . అనవుడున్ = అన్నవెంటనే ; ఇంతి = స్త్రీ (అంబ) ; ఇట్లు + అనున్ ;,మహాపురుషా = మహాత్మా ; సాళ్వుఁడు; ఇంకన్ ; ననున్ ; కై కొనఁడు = స్వీకరింపడు ; అది + చాలు = అది తగినదే; భీష్మదెసన్ = భీష్మునిపై ; నా మదిన్ = నా మనస్సులో ; కోపము ; కల్గి + ఉండున్ = నిలిచి యున్నది ; ఆతనిన్ = ఆ భీష్ముని ; వధియింపన్ + పూని = చంప గోరి; ఇట = ఈ ఆశ్రమంలో; తాపస వృత్తికిన్ = తపస్సు చేయటానికి ; వచ్చి; ఇచ్చటన్ ; నినున్ ;కని ; ఈ పరాభవమున్ = ఈ అవమానాన్ని; ఈ ఁగఁగన్ = తొలగింప జేసుకొనుటకై ; నీశరణంబున్ = నీ ఆశ్రయాన్ని ; చొచ్చితిన్ = పొందాను.

భా . అప్పుడు అంబ ఇలా అంటోంది. " మహాత్మా, సాళ్వుడిక నన్ను పరిగ్రహింపడు. అది యుక్తంకూడా. నాకు భీష్ముని మీదనే ఎంతో కోపముంది. అతనిని చంపటానికే నేను తపస్సు చేయాలని ఈ ఆశ్రమానికి వచ్చాను. ఇక్కడ నిన్నుచూచి నీ శరణు జొచ్చాను. ఈ పరాభవాన్ని పోగొట్టవలసినది".

వి. సాళ్వునిపై మమకారం చావకపోవటమో, అతని ప్రవర్తన సమంజసమే అని భావించటమో కారణంగా అంబ సాళ్వునిపై పగబూన లేదు. భీష్ముని తొందరపాటే దీనికి కారణ మన్న స్థిర నిర్ణయం ఆమెలో ఉన్నది.

తే : అనిన "నా చెప్పినట్ల గంగాత్మజుండు
సేయుఁ జేయక తక్కిన శితశరముల
నతనిఁ బడవైతు నూఱడు మబల నీకుఁ
దపము సేయంగ నేటికిఁ దనువు డయ్య." - 299

అ : అనినన్ = అంబ అట్లనగానే ; (పరశురాముడు) ; నా + చెప్పిన + అట్ల = నేను ఆదేశించినట్లే ; గంగా + ఆత్మజుండు = భీష్ముడు ; చేయున్ ; చేయక + తక్కినన్ = చేయనట్లైతే; శితశరములన్ = వాడియైన బాణాలతో; అతనిన్ పడనైతున్ = వధింపగలను ; ఊఱడుము = ఊరడిల్లుము; అబల = కాంతా; తనువు = శరీరం; డయ్యన్ = అలిసి పోవునట్లు; నీకున్ ; తపము + చేయంగన్ ; ఏటికిన్ = ఎందులకు ?

భా : అంబ అలా అనగానే పరశురాముడు "అమ్మా! భీష్ముడు నేను ఆదేశించనట్లే చేయగలడు. చేయకపోతే నేను వాడియైన బాణాలతో అతనిని వధిస్తాను. ఊరుకో, నువ్వు అబలవు. శరీరం అలసిపోయేటట్లు తపస్సు చేయవలసి పని నీ కెందుకు?" అన్నాడు.

-: పరశురాముఁ డంబం దోడుకొని భీష్ముని యొద్దకు వచ్చుట :- (సం 5-178-23)

**క : అని పలికి పరశురాముఁడు
సనుదెంచెను మునిజనంబు సమ్మదమునఁ దోఁ
జనుదేరఁ గురుక్షేత్రం
బున కుద్ధతిఁ గాశిరాజ పుత్రిం గొనుచున్. 300**

అ : అని ; పలికి ; పరశురాముఁడు ; కాశిరాజపుత్రిన్ = అంబను ; కొనుచున్ = తీసికొని పోతూ ; మునిజనంబు = మహర్షులు ; సమ్మదమునన్ = ఆనందంతో ; తోన్ +చనుదేరన్ = వెంటరాగా ; కురుక్షేత్రంబునకున్ ; ఉద్ధతిన్ = గర్వంగా ; చనుదెంచెను = వచ్చెను.

భా : అంబతో అలా అని పరశురాముడు ఆమెను వెంటబెట్టుకొని, మహర్షులంతా ఆనందంగా వెంటరాగా మహోల్లాసంతో కురుక్షేత్రానికి వచ్చాడు.

వ : వచ్చి, సరస్వతీ తీరంబున విడిసి, తనరాక నా కెఱింగించి పుత్తెంచిన ; నేను ఋత్విక్పురోహిత ప్రభృతి విశిష్ట బ్రాహ్మణ సమేతంబుగాఁ బూజా ద్రవ్యంబులుగొని, తత్ప్రదేశంబున కరిగిన, నమ్మహాత్ముండును మదీయ భక్తి వినయ సంభ్రమంబులు సంప్రీతి నభినందించి, యర్చనలు గైకొని కాశిరాజ కన్యకం జూపి నాతో నిట్లనియె.301

అ : విడిసి = బసచేసి ; పుత్తెంచినన్ = పంపగా ; ఋత్విక్ = యాజకుడు, పురోహిత = పురోహితుడూ, ప్రభృతి = మొదలైన, విశిష్ట = పరమ పూజ్యులైన, బ్రాహ్మణ సమేతంబుగాన్ = బ్రాహ్మణులతో కూడి ; సంభ్రమంబులు = గౌరవములు ; అభినందించి = మెచ్చుకొని.

భా : పరశురాముడు అలావచ్చి, సరస్వతీనది యొడ్డున బసచేసి, తాను వచ్చిన సమాచారం నాకు తెలియబంపాడు. నేను ఋత్విక్కులు, పురోహితులు మొదలైన పూజ్యులైన బ్రాహ్మణులతో గూడి, పూజాద్రవ్యాలను కూడా కొనిపోయితిని. పరశురాముడు కూడా నా భక్తీ, వినయం, గౌరవం, చూచి ఆనందించి, నన్ను అభినందించి, నా పూజలు స్వీకరించి, అంబను చూపి నాతో ఇలా అన్నాడు.

తే : బలిమి మున్నేల తెచ్చి తిప్పడఁతి మగుడఁ
ద్రోచి పుచ్చుంగఁ దగునయ్య నీచవృత్తి;
వచ్చె దీనిఁ దమ్మునికి వివాహ మింక
నైనఁ జేయుము; చేయమి యనుచితంబు. 302

అ : ఈ పడఁతిన్ = ఈ అంబను ; మున్ను = తొలుత ; బలిమిన్ = బలాత్కారంగా ; ఏల - తెచ్చితి = ఎందుకు కొనివచ్చావు ; మగుడన్ = మరల ; నీచవృత్తిన్ = హీనమైన ప్రవర్తనతో ; త్రోచి పుచ్చుంగన్ = నిరాకరించుట ; తగును + అయ్య = భావ్యమటయ్య ; వచ్చెన్ = (ఇప్పుడు అంబ) వచ్చినది ; ఇంకనైన్ = ఇకనైనా ; దీనిన్ ; తమ్మునికిన్ ; వివాహము ; చేయుము ; చేయమి = చేయకుండుట ; అనుచితంబు = తగనిది .

భా : ముందీమెను బలవంతంగా ఎందుకు తెచ్చావు ? ఆ తర్వాత ఎందుకు నిరాకరించావు ? అది భావ్యమా ? ఇదిగో ఇప్పుడు అంబ వచ్చింది. దీని కిప్పుడైనా నీ తమ్ముడితో వివాహం జరిపించు. జరిపించక పోవటం అనుచితమైనది.

క. అనుటయు ననఘా తెలియన్
విను మిది నాతోడ "సాళ్వవిభునకు నేఁ గూ
ర్చిన దాన నతని పాలికి
ననుపుము న"న్ననినఁ గాదె! యనిచితి మగుడన్. 303

క : అనుటయున్ = పరశురాము డట్లనగానే ; అనఘా ! = మహాత్మా ; తెలియన్ ; వినుము ; ఇది = ఈ అంబ ; సాళ్వ విభునకున్ = సాళ్వరాజుకు ; ఏన్ = నేను ; కూర్చిన దానను = ఇష్టమైన దానను ; అతని పాలికిన్ = అతని దగ్గరకు ; నన్నున్ + అనుపుము = నన్ను పంపుము ; అని ; నాతోడన్ ; అనినన్ + కాదె = అనుట చేతనే కదా ; మగుడన్ = మరలా ; అనిచితిన్ = పంపితిని.

భా : పరశురాము డట్లనగానే నేను "మహాత్మా ! జాగ్రత్తగా విను. ఈ అంబ 'నేను సాళ్వరాజున కిష్టమైన దానను. నన్ను అతని దగ్గరకు పంపు' మని నన్ను అడిగినందువలననే మరలా ఈమెను అతని దగ్గరకు నేను పంపించవలసి వచ్చినది" (అన్నాను)

తే : "ఇంక నా తమ్మునికిఁ దీని నెట్లు పెండ్లి
సేయ నేరుతు ననుడు "నా చెప్పి నట్లు

సేయ వైతేని నిన్ను నీ చెలులఁ జుట్ట
ములను జంపుదు ననియె నమ్ముని వరుండు. **304**

అ : ఇంకన్ ; నా తమ్మునికిన్ ; దీనిన్ ; పెండ్లి + చేయన్ ; ఎట్లు ; నేరుతును ; అనుడున్ (అనినేను) అనగానే ; (అతడు) ; నా -చెప్పినట్లు = నేను చెప్పిన రీతిగా ; చేయవు + ఐతి + ఏని = చేయకున్నచో ; నిన్నున్ ; నీ చెలులన్ = నీ మిత్రులను ; చుట్టములను = బంధువులను ; చంపుదును ; అని ; ఆ మునివరుండు = ఆ పరశురాముడు; అనియెన్.

భా : ఇంక ఈ అంబను నా తమ్ముడి కిచ్చి ఎలా పెండ్లి చేయగల నని అనగానే పరశురాముడు "నేను చెప్పినట్లు చేయకుంటే నిన్నూ, నీ మిత్రులనూ, నీ బంధువులనూ అందరిని చంపుతా"నన్నాడు.

వి : ఇక్కడ పరశురాముని తొందరపాటూ, ఆశ్రిత పక్షపాతం రెండూ వ్యక్త మవుతాయి.

వ : ఏను వినయంబు వదలక వినతుండ నగుచు వివిధ వాక్యంబులం దెలుప నంత కంతకు నతనికిఁ గోపం బగ్గలంబైన వెండియు. **305**

అ : వినయంబున్ = అణకువను ; వినతుండను = విధేయత గలవాడను ; అగ్గలంబు = అధికం.

భా : పరశురాముడు అలా మాటడినా నేను మర్యాదను అతిక్రమింపక, అణకువతోనే పలువిధాలుగా మాటాడినా, అతనికి అంతకంతకూ కోపమెక్కువైనది. నేను మరలా (ఇలా అన్నాను).

ఆ : "గురుఁడవై సమగ్ర కోదండ విద్యామ
హత్త్వ మిచ్చినాఁడ వలుగఁ దగునె
కారణంబు లేక యీరసమెత్తి యి"
ట్లనినఁ బరశురాముఁ డాగ్రహమున. **306**

అ : గురుఁడవు + ఐ = ఆచార్యుడవై ; సమగ్ర ... మహత్త్వము ; సమగ్ర = సమస్తమైన, కోదండవిద్యా = ధనుర్విద్యయందలి ; మహత్త్వము = సామర్థ్యాన్ని ; ఇచ్చినాఁడవు = ప్రసాదించినవాడవు ; ఈ రసము + ఎత్తి = కోపమతిశయించి ; ఇట్లు = ఈ రీతిగా ; కారణంబు లేక = నిష్కారణంగా ; అలుగన్ + తగునె = కోపపడవచ్చునా ; అనినన్ = అనగానే ; పరశురాముఁడు ; ఆగ్రహమునన్ = పట్టుదలతో (తర్వాతి పద్యంతో అన్వయం).

భా : 'నాకు ఆచార్యుడవై ధనుర్విద్యయందలి సమస్త సారాన్ని బోధించినవాడవు నీవు. అటువంటి వాడవై ఇట్లు నిష్కారణంగా నాపై కోపింపవచ్చునా' అని అన్నాను. అప్పుడు పరశురాముడు ఆగ్రహంతో (ఇలా అన్నాడు)

చ : గురుఁ డని న న్నెఱుంగు దనఘుండవు నా వచనంబునం దనా
దరణము సేసి తెన్నియొ విధంబులఁ బల్కెదు భక్తితోడ; నీ
వెరవులు దక్కు; మీయబల వేగమ పెండిలి సేయు; మంతతో
మరలు మదీయ కోపశిఖి; మానదు వేఱొక వేయిఁ జేసినన్. **307**

అ : గురుఁడు + అని = ఆచార్యుడనని ; నన్నున్ ; ఎఱుంగుదు = తెలుసుకొన్నవాడవు; అనఘుండవు = నిర్మలుడవు; నా వచనంబు నందున్ = నా మాటపై; అనాదరణము + చేసితి = తిరస్కారాన్ని చూపావు ; ఎన్నియొ విధంబులన్ = ఎన్నో రకాలుగా ; భక్తితోడన్ = భక్తితో ; పల్కెదు = మాటాడుతున్నావు ; నీ వెరవులు = నీ నేర్పులు; తక్కుము = విడిచిపెట్టు; ఈ + అబల = ఈ అంబను ; వేగము + అ = వెంటనే ; పెండిలి + చేయుము ; అంతతో = ఆ పనితో ; మదీయ కోపశిఖ = నా యొక్క కోపాగ్ని ; మరలు = శాంతించును ; వేఱొకవేయి = అదికాక ఇతరములైన వేయి పద్ధతులు ; చేసినన్ = పాటించిననూచీ మానదు = చల్లారదు.

భా : నేను నీ గురువునని నీకు తెలుసు. నువ్వు నిర్మల చిత్తం కలవాడవు. నా మాటను మన్నించకుండా భక్తిని ప్రదర్శిస్తూ ఎన్నో మాటాడుతున్నావు. నీ చాతుర్యాన్ని ఇక కట్టిపెట్టు. వెంటనే ఈ అంబ పెండ్లి జరిపించు. అప్పుడే నా కోపం శాంతిస్తుంది. అట్లుగాక మరో వేయి మార్గాలను నీవు పాటించినా నా కోపాగ్ని చల్లారదు.

వ : అనిన విని "యధర్మాచరణంబున కింత వట్టి పెనంగ నగునె ; పరానురక్త చిత్తయగు మగువ నిల్లాలిం జేయువారుం గలరె; యిట్టి యకృత్యం బాచరించుట కంటె నీ చేత నెట్లయినను లెస్స; తొల్లి పెద్దలు చెప్పిన చొప్పవధరింపు"మని యిట్లంటి.308

అ : అధర్మ + ఆచరణంబునకున్ = తప్పుడు పని చేయుటకు ; పర + అనురక్త + చిత్త = ఇతరుల యెడ వలపుగలది ;మగువ = స్త్రీ ;లెస్స =మేలు ; చొప్పు = రీతి ; అవధరింపుము = వినుము.

భా : పరశురాము డట్లనగానే నేను "అధర్మాన్ని ఆచరించటం కోసం ఇంత పట్టి పెనగులాడవచ్చునా? ఇతరులపై అనురక్తమైన కాంతను ఎవరైనా ఇల్లాలిని చేయగలరా? ఇటువంటి అకృత్యాన్ని చేయటం కన్న నీ చేత ఏమయినా మేలే ! పెద్దలు చెప్పిన మాటలను అవధరించండి" అని ఇలా అన్నాను.

వి : 'గృహీత ఇవ కేశేషు మృత్యునా ధర్మమాచరేత్' అని సుభాషితం. మృత్యుముఖంలో ఉన్నట్లుగా భావించుకొని ధర్మాన్ని ఆచరించాలట. అటువంటప్పుడు మృత్యువుకు భయపడి ధర్మాన్ని త్యజించి అధర్మాన్ని పాటించ నవసరం లేదని భీష్ముని నిర్ణయం. అధర్మం చేసి బ్రతకటం కంటె ధర్మం కోసం చావటం మంచిదని భావం.

తే : గర్వియై కార్య మిట్టి దకార్య మిట్టి
దని యెఱుంగక లోకంబు చను పథమునఁ
దిరుగ కున్మద వృత్తి వర్తించునట్టి
వాని గురునైన దండింప వలయు నండ్రు. 309

అ : గర్వియై = ఉద్ధతుడై ; ఇట్టిది = ఇటువంటిది ; కార్యము = చేయదగినది ; ఇట్టిది ; అకార్యము = చేయదగనిది ; అని ; ఎఱుంగక = తెలుసుకొనలేక ; లోకంబు = శిష్టజనులు ; చను = నడిచెడి ; పథమునన్ = మార్గంలో ; తిరుగక ; ఉన్మదవృత్తిన్ = మదించిన ప్రవృత్తితో ; వర్తించునట్టివానిన్ = మెలగుచున్నట్టి వానిని ; గురువు + ఐనన్ = అతడు గురువైనా ; దండింపవలయును ; అండ్రు = పలుకుదురు.

భా : *గర్వంతో కర్తవ్యాకర్తవ్య జ్ఞానాన్ని కోల్పోయి, పెద్దలు పదిమంది నడిచిన దారిన నడవక ఉన్మాదంతో ప్రవర్తించే వారు గురువైనా సరే శిక్షించాలని పెద్దలంటారు.*

వి : గురుశిష్యులలో ఎవరి మాట ఎవరు పాటించాలి అన్నది ఇక్కడ తలెత్తిన ప్రశ్న. ధర్మబద్ధంగా ఉన్నంతవరకు గురువు మాటను శిష్యుడు తిరస్కరించటం నేరం. అయితే ధర్మాన్ని తప్పినప్పుడు ఆ గురువునైనా శిష్యుడు దండించటం నేరం. కాదట. మొత్తం మీద పెద్ద పీట ధర్మానికే. మిగిలిన సంబంధ బాంధవ్యాలన్నీ నీటి బుడగలవంటివే !

క : **అనుమాటకుఁ గాలానల**
మును బోలెను మండి కయ్యమున కాయితమై
మొన లేర్చి వేగ యిచటికిఁ
జనుదె మ్మని భార్గవుండు సంరంభమునన్. 310

అ : అనుమాటకున్ = అన్న నా మాటలకు ; కాల + అనలమున్ + పోలెను = ప్రళయకాలాగ్నివలె ; మండి ; కయ్యమునకున్ = యుద్ధానికి ; ఆయితమై = సిద్ధపడి ; మొనలు + ఏర్చి =వ్యూహరచన చేసికొని ; వేగ =వెంటనే ; ఇచటికిన్ = ఇక్కడకు ; చనుదెమ్ము + అని = రమ్మని ; భార్గవుండు = పరశురాముడు ; సంరంభమునన్ = ఉద్రేకంతో (అన్నాడు).

భా : *ఆ నా మాటలు విని పరశురాముడు ప్రళయ కాలాగ్నివలె మండిపడి, యుద్ధానికి సిద్ధపడి నీ సేనను సిద్ధంచేసి కొని వెంటనే ఇక్కడకు రా అని ఉద్రేకంగా (అన్నాడు).*

వ : **పల్కిన నేనును.** 311

భా : *పలుకగా నేను కూడా (ఇట్లంటిని)*

క : **చులుకఁదనంబున విప్రున**
కలుగంగాఁ దగదు గురుఁడునై యున్నాఁ డం
చలయక తలఁచితిఁ గా కిటు
నిలుమీ నీ రణము సేఁత నిజమగునేనిన్. 312

అ : విప్రునకున్ = బ్రాహ్మణునిపై ; చులుకఁదనంబునన్ = తేలికగా ; అలుగంగాన్ + తగదు = కోపింపరాదు ; గురుఁడును + ఐ = ఆచార్యుడునై; ఉన్నాడు + అంచు = ఉన్నాడని ; అలయక = కోపింపక ; తలఁచితిన్ + కాక = భావించినాను కానీ ; నీ రణము + చేఁత = నీవు యుద్ధం చేయుట ; నిజము + అగు + ఏనిన్ = నిజమే అయితే ; ఇటు నిలుమీ = ఇదిగో నిలబడు.

భా : *బ్రాహ్మణునిపై తేలికగా కోపపడరాదు. పై పెచ్చు నీవు ఆచార్యుడవుకూడా. అందుకని నెమ్మదితో ఊరుకున్నాను కానీ నాతో యుద్ధం చేయటమే నిజమైన పక్షంలో ఇదిగో నేను సిద్ధమే ఎదురునిలు.*

క : **క్షత్రియులఁ దొల్లి యలుకకుఁ**
బాత్రము సేసి తటె! నాఁడు బలియుఁడు గంగా
పుత్రుఁడు పుట్టమిఁ గా కిది
యాత్రయి నింకేలఁ జెల్లు నెఱుఁగవె నన్నున్? 313

అ : తొల్లి = మున్ను ; క్షత్రియులన్ = రాజులను ; అలుకకున్ = కోపానికి ; పాత్రము + చేసితి + అటె = గురి చేసినావట గదా! ; నాఁడు = అప్పుడు ; బలియుఁడు = బలశాలియైన ; గంగాపుత్రుఁడు = భీష్ముడు , పుట్టమిన్ కాక = పుట్టనందువలన కానీ ; ఇది = ఈ నీ కోపం ; ఈత్రయిన్ = ఈ మూడులోకాలలో ; ఇంకన్ ; ఏల + చెల్లున్ = ఎలా సాగుతుంది ; నన్నున్ + ఎఱుఁగవె =నా గురించి తెలియదా ?

భా : *గతంలో నీవు రాజుల నందరినీ నీ కోపాగ్నికి పాత్రముచేసి నావట గదా ! అప్పుడు బలశాలియైన ఈ భీష్ముడు పుట్టలేదు కాబట్టి సరిపోయింది. ఇక ఈ నీ కోపం మూడులోకాలలోనూ సాగే అవకాశం లేదు. నా గురించి తెలియదా ?*

వి : ఉత్తములు హద్దు మీరరు. కానీ మీరిన తర్వాత వారినాపటం ఎవ్వరికీ సాధ్యంకాదు. భీష్ముడు సహించగలిగినంత సేపు సహించాడు. ఇక తప్పుదన్నప్పుడు గతంలోని పరశురాముని ప్రాభవాన్ని కూడా అధిక్షేపించటానికి వెనుకంజ వేయటం లేదు. బ్రాహ్మణుడైన పరశురాముడే యుద్ధోన్మాదంతో మాటాడినపుడు క్షత్రియుడైన భీష్ముడు మాటాడటంలో వింతలేదు.

క : **ఏ నొకరుండన వచ్చెదఁ**
గాని బలము దేను నీవు గఱపిన శస్త్రా
స్త్రానేక విధ విలాసము
దాన వలయు సేన గాదె తథ్యం బరయన్. 314

అ : ఏను + ఒకరుండన్ + అ = నేనొక్కడనే ; వచ్చెదన్ ; కాని ; బలము + తేను = సైన్యాన్ని తోడు తెచ్చుకొనను ; నీవు గఱపిన = నేర్పినట్టి ; శస్త్రా .... లాసము ; శస్త్ర = శస్త్రముల యొక్కయు, అస్త్ర = అస్త్రముల యొక్కయు ; అనేకవిధ = ఎన్నో రీతులనున్న ; విలాసము = లీల ; తాన = అదియె ; తథ్యంబు = సత్యం ; అరయన్ = ఆలోచింపగా ; వలయుసేన + కాదె = అవసరమైన సైన్యం కాదా ?

భా : *నేనొక్కడినే యుద్ధానికి వస్తాను. నువ్వు నేర్పిన శస్త్రాస్త్రాల వివిధలీలయే నాకు యథార్థంగా తోడుగా నిలిచే సేన కాగలదు.*

వ : **అని పలికి, యతనికిం బ్రణమిల్లి, చనుదెంచి, సత్యవతి కింతయు విన్నవించి యద్దేవి యనుమతి వడసి, సర్వసన్నాహ సమేతంబగు రథం బెక్కి, విప్రాశీర్వాదంబులు సెలంగ వెడలి వచ్చి, కురుక్షేత్రంబు దఱియం జనునెడ, భాగీరథి భామినీ రూపంబున నరుగుదెంచి, తన్నెఱింగించి, మదీయ భక్తి నభినందించి, యే**

నాయితంబై పోవుటకుఁ గారణం బడిగి, నా చేత నత్తెఱం గెఱింగినదియై నన్నుం గినిసి, భార్గవుపాలికిం జని, "నీ శిష్యుండు నిరపరాధుండు నా కొడుకున కలుగం దగునే" యని చెప్పి యతని యందుఁ బిక్కు గానక మగుడ నేతెంచి, నా వలనను మెత్తంబాటు లేకున్నం జనియె; నప్పుడు సిద్ధవిద్యాధరముని గణంబులు గౌతుకంబునం గనుంగొనుచుండ నేను జమదగ్ని తనయున కనతిదూరంబునం దేరు డిగి, వినతుండనై నిలిచి, "నీవు భూచారివై యున్నవాఁడవు ; రథికుండనైన నాకు నీ తోడ సమరంబు సేయనగునే" యనిన, యనంతరంబ యతండు దివ్యంబులగు రథ రథ్యంబులు, శస్త్రాస్త్రంబులునుం గలిగి యకృతవ్రణుండు సారథిగా సమరసన్నద్ధుండై తోఁచినం జూచి, రథారోహణంబుచేసి, శంఖంబు పూరించి, గుణంబు సారించి, సూతు నగ్గించి తనకు నమస్కరించి, కడంగిన నప్పరశురామదేవుండు. 315

అ: ప్రణమిల్లి=నమస్కరించి; భాగీరథి= గంగాదేవి; భామినీ రూపంబునన్= స్త్రీ రూపంతో; ఆయితంబై = సన్నద్ధమయి, సిద్ధమయి; కినిసి=కోపించి; నిరపరాధుండు =తప్పుచేయనివాడు; పిక్కు=వెనుబాటు; అనతిదూరంబునన్= కొద్ది దూరంలో దగ్గరగా; భూచారి= నేలమీద తిరుగువాడు; రథికుడు= రథము మీద నిలిచి యుద్ధము చేయువాడు; రథారోహణంబుచేసి= రథమెక్కి; గుణంబు= వింటినారి; అగ్గించి= పొగడి;

భా: అని చెప్పి, ఆతనికి నమస్కరించి వచ్చి, సత్యవతికి విషయమంతా చెప్పి, ఆమె అనుమతి పొంది, అన్ని ఆయుధములతో కూడిన రథమెక్కి, బ్రాహ్మణుల ఆశీస్సులతో బయలుదేరి కురుక్షేత్రం దగ్గరకు వచ్చేసరికి, మాతల్లి గంగాదేవి స్త్రీ రూపంలో వచ్చి, నా భక్తికి మెచ్చుకొని, నేను యుద్ధానికి సిద్ధమవటానికి కారణ మడిగి తెలిసికొని, నన్ను కోపపడి, మళ్ళీ పరశురాముని దగ్గఱకు వెళ్ళి 'తప్పు చేయని నీ శిష్యుని, నా కొడుకుపై కోపమెందుకులకు' అని అడిగి అతనిలో వెనుబాటు లేకపోవడం చేత తిరిగి వచ్చి, "నేను కూడ మెత్తబడకపోవటం చేత" వెళ్ళిపోయింది. అపుడు సిద్ధులూ, విద్యాధరులూ, మహర్షులూ చూస్తూ ఉండగా నేను పరశురామునికి కొద్ది దూరంలో రథందిగి నమస్కరించి నిలిచి "నీవు నేలమీద ఉన్నావు. నేను రథం మీద ఉండి నీతో యుద్ధం చేయదగదు" అన్నాను. అపుడు అతడు దివ్యమయిన రథాశ్వాలతో, శస్త్రాస్త్రములతో, అకృతవ్రణుని సారథిగా చేసికొని సమరానికి సిద్ధుడయ్యాడు. అపుడు నేను రథమెక్కి శంఖంపూరించి ధనుష్టంకారంచేసి, నా సారథిని ప్రశంసించి, గురువైన పరశురామునకు మ్రొక్కి యుద్ధానికి సిద్ధపడ్డాను. అపుడు ఆ పరశురాముడు...

-: భీష్ముఁడు పరశురామునితో యుద్ధంబు సేయుట :-
(సం 5-180-18)

క : **శర వర్షము నామీఁదం**
గురిసిన నే నాకసమునఁ గుదియించితి నా
యరదంబు పొంతకును న
చ్చెరువుగ నొక బాణమైనఁ జేరక యుండన్. **316**

అ : నా మీఁదన్ =నాపై ; శరవర్షమున్ = బాణవృష్టిని ; కురిసినన్ = కురిపింపగా; నేను; నా అరదంబు పొంతకును = నా రథానికి దగ్గరగా కూడా; ఒక బాణము + ఐనన్ ; చేరక + ఉండన్ ; అచ్చెరువుగన్ = ఆశ్చర్యకరంగా ; ఆకసమునన్ = ఆకాశముననే ; కుదియించితిన్ = అణగించితిని.

భా: పరశురాముడు నాపై బాణవర్షాన్ని కురిపించాడు. అయితే నేను ఒక్క బాణమైనా కనీసం నా రథం దగ్గరకు కూడా రానట్లు ఆశ్చర్యకరంగా అన్నిటినీ ఆకాశం మీదనే అణిచివేశాను.

క : **ఒక మొగి నఱువది యమ్ములఁ**
బ్రకటబలుండైన పరశురాముఁడు నా యం
గకములు దాఁకఁగ నశ్వ
ప్రకరము నొ నాఁట సూతుపైఁ బడ నేసెన్. **317**

అ : ఒకమొగిన్ = ఒక్కసారే ; అఱువది + అమ్ములన్ = అరవై బాణాలను ; ప్రకటబలుండు + ఐన = ప్రసిద్ధబలశాలియైన ; పరశురాముఁడు ; నా + అంగకములు = నా శరీరావయవాలు ; తాఁకఁగన్ = తగులు నట్లుగానూ ; అశ్వప్రకరము = గుఱ్ఱాల సమూహం ; నో నాఁటన్ = నొచ్చుకొనునట్లుగానూ ; సూతుపై పడన్ = సారథిపై బడునట్లుగానూ, ఏసెన్ = ప్రయోగించెను.

భా : మహాబలశాలియైన పరశురాముడు నా అవయవాల్లో గుచ్చుకొనేటట్లు, నా గుఱ్ఱాలు నొచ్చుకొనేటట్లు, నా సారథిపై బడేటట్లు ఒకేసారి అరవై బాణాలను ప్రయోగించాడు.

క : **దానికి నవ్వుచు వేగం**
బే నొక భల్లంబు దొడిగి యేసితి సాంద్ర
జ్యా నాద భరిత రోదసి
యైన తదీయోగ్రచాప మఱిముఱిఁ దునియన్. **318**

అ : దానికిన్ = ఆ ప్రయోగానికి; నవ్వుచున్ = పరిహసిస్తూ; ఏను = నేను ; వేగంబు + అ = శీఘ్రంగా; ఒక భల్లంబున్ = ఒక బాణాన్ని; తొడిగి = సంధించి; జ్యా ....యై. జా = అల్లె త్రాటియొక్క, నాద = శబ్దంతో, భరిత = నిండినట్టి, రోదసి + ఐన = భూమ్యాకాశాల మధ్యభాగం కలదియైన; తదీయ = ఆ పరశురాముని యొక్క; ఉగ్రచాపము = గొప్పధనుస్సు; అతిముఱిన్= వెంటనే ; తునియన్ = ముక్కలగునట్లు ; ఏసితిన్ = ప్రయోగించితిని.

భా : ఆ పరశురాముని బాణ ప్రయోగానికి నేను నవ్వుకొని వెంటనే ఒక బాణాన్ని సంధించి ప్రయోగించాను. దాని టంకార ధ్వనితో భూమ్యాకాశాలు నిండిపోయాయి. ఆ బాణం పరశురాముని ధనుస్సును తుత్తునియలు చేసింది.

ఉ : ఒండొక విల్లు పుచ్చికొని యుజ్జ్వల రోషమహానలార్చు లొం
డొండ మొగంబుపై నెగయ నుర్వి చలింప గుణధ్వనిన్ సము
ద్దండత(దీవ్ర మార్గణ శతంబున నాయరదంబు ముంచె రా
ముండు వియచ్చర ప్రకరముల్ వెఱఁ గందుచుఁ బ్రస్తుతింపఁగన్. 319

అ : ఒండొక విల్లు = వేరొక్క ధనుస్సు ; పుచ్చుకొని = తీసికొని ; రాముండు = పరశురాముడు; ఉజ్జ్వల ...... ర్చులు ; ఉజ్జ్వల = ఎగసిన; రోష = కోపమనెడి; మహా + అనల = తీవ్రాగ్ని యొక్క; అర్చులు = కాంతులు ; ఒండు + ఒండ = ఒకదానిపై ఒకటిగా; మొగంబుపైన్; ఎగయన్= వ్యాపించఁగా; గుణధ్వనిన్ = అల్లె త్రాటి శబ్దంతో; ఉర్వి = భూమి ;చలింపన్ = వణికిపోగా; సముద్దండతన్ = భయంకరంగా; తీవ్ర ... శతంబునన్; తీవ్ర = తీవ్రమైన, మార్గణ= బాణాలయొక్క; శతంబునన్= నూరింటిచే; వియచ్చర-ప్రకరముల్ =దేవతాసమూహాలు; వెఱఁగు+ అందుచున్= ఆశ్చర్యపడుతూ ; స్తుతింపఁగన్ = ప్రశంసింపగా; నా + అరదంబున్ = నారథమును; ముంచెన్.

భా : మరొక్క వింటిని చేపట్టిన పరశురాముడు అడ్డులేని కోపాగ్ని జ్వాలలు ఒకదాని వెంట ఒకటిగా ముఖంపై వ్యాపించగా, ధనుష్టంకారంతో భూమి కంపింపగా, దేవతలంతా ఆశ్చర్యంతో అభినందించుచుండగా నూరు బాణాలతో నా రథాన్ని ముంచెత్తాడు.

క : ఉఱక మదీయాంగంబులు
గిఱిగొన నట్లేయుటయును గినుక గదిరినన్
మెఱుఁగారు నారసమ్ములు
దఱచుగ నించితిఁ గడంగి తద్గాత్రమునన్. 320

అ : ఉఱక = ఊరికే ; మదీయ + అంగంబులు = నా అవయవాలు ; గిఱి+కొన = చుట్టుకొనగా ; అట్లు + ఏయుటయును = ఆ రీతిగా ప్రయోగింపగా; కినుక =కోపం ; కదిరినన్ = అతిశయింపగా ; మెఱుఁగారు =ప్రకాశిస్తున్న ; నారసమ్ములు = బాణాలను ; కడంగి =పూని ; తత్ + గాత్రమునన్ = అతని శరీరంపై ; నించితిన్ = నింపివేసితిని.

భా : ఊరికే నా శరీరావయవాలు చుట్టుముట్టేటట్లు అలా బాణాలు ప్రయోగించగానే నేను కోపంతో వాడియైన బాణాలతో అతని శరీరాన్ని నింపి వేశాను.

తే : ఉచ్చిపోయిన యేటుల నొలుకు శోణి
తమున సర్వాంగకంబులుఁ దడిసి యొప్పెఁ
జిగురుఁదఱచునఁ గెంజాయ మిగిలి చెలువు
వడయు క్రొమ్మావి చాడ్పున భార్గవుండు. 321

అ : చిగురు + తఱచునన్ = చిగుళ్లు ఎక్కువగుటచే ; కెంపు + చాయ = ఎఱ్ఱని కాంతి ; మిగిలి = అతిశయించి ; చెలువు + పడయు = అందగించునట్టి ; క్రొమ్మావి చాడ్పునన్ = మావిగున్నవలె ; ఉచ్చిపోయిన = చీలినట్టి; ఏటులన్ = దెబ్బలనుండి ; ఒలుకు = కారుతున్న ; శోణితమునన్ = నెత్తుటితో ; సర్వ + అంగకంబులు = సమస్తములైన అవయవములూ, తడిసి ; భార్గవుండు = పరశురాముడు ; ఒప్పెన్ = ప్రకాశించెను.

భా : లోతుగా నాటుకున్న దెబ్బలనుండి కారుతున్న రక్తంతో శరీరమంతా తడిసిన పరశురాముడు దట్టమైన చిగుళ్ల కెంజాయతో ప్రకాశిస్తున్న గున్న మామిడి చెట్టువలె ప్రకాశించాడు.

వి : యుద్ధవర్ణన సహజంగా సౌందర్యరహితంగా సాగే అవకాశముంటుంది. అయితే కవి నేర్పుగల వాడైతే అవకాశం తీసుకుని ఇటువంటి సుందర వర్ణనలు చేసినప్పుడు రణరంగం కూడా రమణీయంగా, రసనీయంగా రూపుదిద్దుకుంటుంది.

క : నెత్తురు వడసిన మూర్ఛా
యత్తుండై సొగయుటయును నాతనిఁ గని యు
ద్వృత్తక్షత్రియ ధర్మో
పాత్తంబగు తేజ మొల్లఁబాటై తోఁచెన్. 322

అ : నెత్తురు = రక్తం ; వడసినన్ = కారగా; మూర్ఛా + ఆయత్తుండు + ఐ = స్పృహతప్పి ; సొగయుటయునున్ = సొమ్మసిల్లిపోగా ; ఆతనిన్ + కని = అతనిని చూచి ; ఉద్వృత్త = నిరంకుశమైన, క్షత్రియధర్మ = క్షాత్ర ధర్మంచేత , ఉపాత్తంబు + అగు = పొందినట్టి ; తేజము = తేజస్సు ; ఒల్లఁ బాటు + ఐ = అప్రియమై ; తోఁచెన్ = కనిపించినది.

భా : ఆ రీతిగా నెత్తురు కారుతూ పడిపోయిన పరశురాముని చూడగానే అతిశయించే ఈ క్షత్రియ ధర్మం వల్ల కలిగే తేజస్సు వద్దనిపించింది.

వి : 'క్షత్రధర్మమింత కష్టమగునె' అని ధర్మరాజు వాపోతాడు. ఇక్కడ భీష్ముడు యుద్ధం చేయవలసి రావటం క్షత్రధర్మం. గురువుగారి పరిస్థితిని చూచి దానికి తాను కారకుడైనందుకు తన్ను తాను నిందించుకొనవలసి రావటం శిష్యధర్మం. ధర్మవైరుధ్యాలు, ధర్మసంకటాలు ఏ జీవితంలో అయినా పోటీపడితే మనిషిని క్రుంగదీస్తాయి.

వ : అప్పుడు మనంబున నన్ను నేన గర్హించుకొను చుండితి. 323

అ : గర్హించుకొనుచుండితిన్ = అసహ్యించుకొనుచున్నాను.

భా : ఆ సమయంలో మనస్సులో నన్ను నేనే అసహ్యించుకొంటూ ఉన్నాను.

ఆ : అంతఁ దెలిసి రాముఁ డతి కుపితాత్ముఁడై
యేఱువాఱుతెంచు నెసక మెసఁగ
నప్రమేయశరము లడరించె నవి సత్వ
రముగ నేను బ్రతిహతములు సేసి. 324

అ : అంతన్ = అపయిన ; తెలిసి = స్మృతి వచ్చి ; రాముఁడు = పరశురాముడు ; అతి + కుపిత + ఆత్ముఁడై = మిక్కిలి కోపించిన మనస్సు గలవాడై ; ఏఱు = నదియై ; పాఱు తెంచు = ప్రవహించెడి ; ఎసకము = తీరు , ఎసఁగన్ = ఒప్పునట్లుగా ; అప్రమేయ -శరములు = లెక్కలేనన్ని బాణాలు ; అడరించెన్ = ప్రయోగించెను ; అవి = ఆ బాణాలను ; నేను ; సత్వరముగన్ = వెన్వెంటనే ; ప్రతిహతములు + చేసి = త్రిప్పికొట్టి (తర్వాతి పద్యంతో అన్వయం).

భా : *ఆ తర్వాత పరశురాముడు స్మృహలోనికి వచ్చి తీవ్రకోపంతో ఉప్పెనవలె నా పై బాణపరంపరను ప్రయోగించాడు. నేను వాటిని వెంటనే త్రిప్పి కొట్టాను.*

క : మరుదస్త్ర మేయ గుహ్యక
శరమున వారించె నతఁడు సరభసముగ ను
ద్ధురశిఖిబాణం బేసిన
గురుఁడు వరుణవిశిఖనిహతిఁ గుదియం జేసెన్. 325

అ : మరుత్+అస్త్రము = వాయవ్యాస్త్రం; ఏయన్ = ప్రయోగింపగా; అతఁడు = ఆ పరశురాముడు; గుహ్యకశరమునన్ = యక్షాస్త్రముతో; వారించెన్ = నిరోధించెను; సరభసముగన్= వేగంతో; ఉద్ధురశిఖి బాణంబు = దృఢమైన ఆగ్నేయాస్త్రాన్ని; ఏసినన్ =ప్రయోగింపగా; గురుఁడు= గురువైన పరశురాముడు, వరుణ విశిఖ - నిహతిన్ = వరుణాస్త్రప్రయోగంతో; కుదియన్ + చేసెన్ = నివారించెను.

భా : *నేను వాయవ్యాస్త్రాన్ని ప్రయోగింపగా పరశురాముడు గుహ్యకాస్త్రంతో దాన్ని నివారించాడు. నేను కోపంతో ఆగ్నేయాస్త్రాన్ని ప్రయోగింపగా గురువు వారుణాస్త్రంతో దాన్ని శాంతింపజేశాడు.*

క : ఇమ్మెయి నతఁడును దివ్యా
స్త్రమ్ములు నామీఁద నేయ రయమునఁ బ్రతిఘా
త మ్మొనరించితి దివిజ గ
ణ మ్మంబరవీథిఁ గీర్తన మ్మొనరింపన్. 326

అ : ఈ + మెయిన్ = ఈ విధంగా ; అతఁడును = పరశురాముడు కూడా ; దివ్య + అస్త్రమ్ములు = దివ్యమైన బాణాలను ; నామీఁదన్ = నాపై; ఏయన్ = ప్రయోగింపగా ; దివిజగణమ్ము = దేవతా సమూహం ; అంబరవీథిన్ = ఆకాశవీథిలో ; కీర్తనమ్ము + ఒనరింపన్ = ప్రస్తుతించగా ; రయమునన్ = శీఘ్రంగా ; ప్రతిఘాతమ్ము + ఒనరించితిన్ = త్రిప్పికొట్టితిని.

భా : ఈ రీతిగానే పరశురాముడు నాపై దివ్యాస్త్రాలు ప్రయోగించాడు. నేను వాటి నన్నిటినీ త్రిప్పికొట్టాను. ఆకాశవీథిలో దీనిని తిలకిస్తున్న దేవతలు నన్ను ప్రస్తుతించారు.

తే : రాముఁ డంత్య కాలానలోద్దామలీల
మండి నా యురస్థలి యొక్క మార్గణమున
నేసె నంతంత నున్న మునీశ్వరులును
గాశిరాజ కన్యకయును గడఁగి యార్వ. 327

అ : రాముఁడు = పరశురాముడు ; అంత్య .....లీలన్; అంత్యకాల = ప్రళయ కాలమందలి; అనల = అగ్నివంటి; ఉద్దామలీలన్ = భీకర విలాసంతో; మండి = భగ్గుమని ; నా + ఉరస్థలి = నా రొమ్ము; ఒక్క మార్గణమునన్ = ఒక బాణంతో; అంతన్ + అంతన్ = అక్కడక్కడ ఉన్న ; ముని + ఈశ్వరులును = మహర్షి శ్రేష్ఠులును; కాశిరాజకన్యకయును = అంబయు; కడఁగి = ఉత్సహించి, ఆర్వన్ = అరవగా; ఏసెన్ =కొట్టెను.

భా : అప్పుడు పరశురాముడు ప్రళయాగ్నివలె మండిపడి ఒక బాణంతో నా రొమ్ముపైన కొట్టారు. అది చూచి అక్కడున్న మహర్షులూ, అంబకూడా ఉత్సాహంతో బొబ్బలు పెట్టారు.

క : ఆనిశితాస్త్రం బెయ్యది
యో నాకుం దెలియ దది మహోగ్రత నాఁటం
గా నొచ్చి పడితి నరదము
పై నప్పుడు సూతుఁ డచట వాపె రథంబున్. 328

అ : ఆ నిశిత + అస్త్రము = వాడియైన ఆ బాణం ; ఏ + అదియో = ఎటువంటిదో; నాకున్ ; తెలియదు ; అది మహా + ఉగ్రతన్ = మిక్కిలి భయకరంగా : నాఁటంగాన్ = నాటుకొనగా ; నొచ్చి = బాధపడి ; అరదముపైన్ = రథముపై ; పడితిన్ ; అప్పుడు ; సూతుఁడు = సారథి ; అచట = అక్కడనుండి ; రథంబును ; పాపెన్ = తొలగజేసెను.

భా : పరశురాముడు ప్రయోగించిన ఆనిశితాస్త్రమేదో నాకు తెలియదు. కానీ అది చాలా దారుణంగా నాటుకొనగానే రథముపై పడిపోయాను. అప్పుడు సారథి రణరంగంనుండి రథాన్ని తప్పించాడు.

వి : పరశురాముడింతవరకు ప్రయోగించిన అన్ని అస్త్రాలనూ భీష్ముడు నివర్తింపగలిగాడు. అయితే భీష్మునికికూడా తెలియకుండా పరశురాముని దగ్గర ఇంకా అస్త్రాలున్నాయి. గురు శిష్య సంబంధాలలో ఇది కూడా ఒక విచిత్ర స్థితి. గురువుల దగ్గర నుండి శిష్యులెంత పొందినా ఇంకా మిగిలినది ఏదో ఉంటూనే ఉంటుంది. అది స్థాయీ భేదం వల్లనైనా కావచ్చు, వయోభేదం వల్లనైనా కావచ్చు.

తే : చేతనుండనై నేను మత్సూతుఁ గినిసి
రాముఁ డున్నెడ కప్పుడుఁ గ్రమ్మఱంగ
రథముఁ దోలించి బాణ పరంపరా ని
మగ్నుఁ జేసితి నంబ నెమ్మనము దలఁక. 329

అ : నేను ; చేతనుండను + ఐ = స్మృతి కలిగినవాడనై ; మత్ + సూతున్ = నా సారథిపై ; కినిసి = కోపించి ; రాముఁడు + ఉన్న + ఎడకున్ = పరుశురాముడున్న చోటికి ; క్రమ్మఱంగన్ = మరల ; రథమున్ తోలించి = నడిపించి ; అంబ = అంబయొక్క ; నెఱ + మనము = హృదయం ; తలఁకన్ = భయపడునట్లు ; బాణ .... మగ్నున్ ; బాణ = బాణములయొక్క; పరంపరా = వరుసల యందు ; నిమగ్నున్ = మునిగిన వానినిగా ; చేసితిన్

భా : నాకు స్మృతి వచ్చిన తరువాత సారథిపై కోపపడి పరశురాము డున్న చోటికి మరలా రథాన్ని తోలించాను. అంబమనస్సు కలత పడేటట్లు పరశురాముని బాణ పరంపరలో ముంచివేశాను.

వి : తన రథికుని కాపాడటం ధర్మంగా భావించి సారథి రథికుడు సొమ్మసిల్లినప్పుడు రథాన్ని రణరంగంనుండి తప్పించవచ్చు. అయితే తర్వాత నిర్ణయం తీసుకొనవలసినది రథికుడే. కాబట్టి భీష్ముడు స్మృతి వచ్చిన తర్వాత తన నిర్ణయానికి అనుగుణంగా మరలా రణరంగంలో దుమికాడు.

వ : ఇట్లు బహు ప్రకారరంబులం బోరుచుఁ బ్రొద్దు గ్రుంకి నప్పుడు రణం బుపసంహరించుచు, రేపకడ దొడంగుచుం బెనంగ నిరువది రెండు దివసంబులు చెల్లిన మఱునాఁటి కయ్యంబున నేనునుం గడంగి. 330

అ : బహుప్రకారంబులన్ = అనేక విధాలుగా ; ఉపసంహరించుచున్ =ఆపుతూ ; రేపకడ = ఉదయంవేళ ; దివసంబులు = దినాలు

భా : ఈ రీతిగా పలురకాలుగా పోరాడుతూ, సూర్యాస్తమయం కాగానే యుద్ధాన్ని విరమించుతూ, ఉదయం మరలా ప్రారంభించుతూ పోరాడగా ఇరవై రెండురోజులు గడిచాయి. ఇరవైమూడవరోజు యుద్ధంలో నేను(ఇలా ప్రవర్తించాను).

వి : సంస్కృత భారతంలో ఈ యుద్ధం ముప్పది రోజులు నడిచినట్లుగా ఉన్నది.

**క : కడు బెట్టిదముగఁ గదియం
బడి హయములు నొవ్వ ధనువు భగ్నంబుగఁ జే
డ్పడి సారథి దెరలఁగఁ దన
యొడలు సిరుఁగ నేసినను మహోద్ధతి గురుఁడున్. 331**

అ : కడు = మిక్కిలి; బెట్టిదముగన్ = క్రూరంగా; కదియన్ + పడి = తలపడి ; హయములు = అశ్వాలు ; నొవ్వన్ = నొచ్చుకొనగా ; ధనువు = విల్లు ; భగ్నంబుగన్ = విరుగునట్లుగా ; చేడ్పడి = చెడి; సారథి ; తెరలఁగన్ =కలతపడగా ; తన + ఒడలు = తన శరీరం ; చిరుఁగన్ = తూట్లు పడునట్లుగా ; ఏసినను = కొట్టగా ; గురుఁడున్ = పరశురాముడు కూడా ; మహా + ఉద్ధతిన్ = మిక్కిలి పౌరుషంతో (తర్వాతి పద్యంతో అన్వయం) -

భా : అలా చాలా భయంకరంగా తలపడి గుఱ్ఱాలు నొచ్చుకోగా, విల్లు విరిగిపోగా, సారథి క్షోభపడగా, తన శరీరం తూట్లుపడగా కొట్టాను. అయినా పరశురాముడు మిక్కిలి అతిశయంతో (ఇలా ప్రయోగించాడు).

క : ఒక శక్తి వైవ నఱికితి
నకుటిలముగ శక్తి దశక మడరించిన స్రు
క్కక త్రుంచితి బహుశక్తుల
నికరము పరగించినం దునిమితిం బెలుచన్. 332

అ : ఒక శక్తిన్ = ఒక శక్తిని ; వైవన్ (నాపై) ప్రయోగించగా ; అకుటిలముగన్ = తిన్నగా ; నఱికితిన్ ; శక్తి దశకమున్ = పదిశక్తులను ; అడరించినన్ = ప్రయోగింపగా ; స్రుక్కక = వెనుదీయక ; త్రుంచితిన్ = ఖండించితిని ; బహుశక్తుల నికరము = అనేక శక్తుల సముదాయాన్ని ; పరగించినన్ = ప్రయోగింపగా ; పెలుచన్ = తేలికగా ; తునిమితిన్ = ఖండించితిని.

భా : పరశురాముడు నాపై ఒక శక్తిని ప్రయోగింపగా తిన్నగా నరికివేశాను. పదిశక్తులు ప్రయోగించాడు. వెనుదీయక ఖండించాను. శక్తుల నెన్నిటినో ఒక్కసారే గుప్పించాడు. తేలికగా నరికివేశాను.

క : విస్మయము నొందు భార్గవు
నస్మత్కర మపుడు లాఘవారూఢముగా
సస్మితుఁడ నగుచుఁ బటుదీ
ప్తి స్మేరాస్త్రముల నేసితిం బరవశుఁగన్ 333

అ : విస్మయము + ఒందు = ఆశ్చర్యపడునట్టి ; భార్గవున్ = పరుశురాముని ; అస్మత్ + కరము = నా చేయి ; అపుడు = ఆ సమయంలో ; లాఘవ + ఆరూఢముగాన్ = నేర్పుకలదికాగా ; సస్మితుఁడన్ + అగుచున్ = నవ్వుతూ ;పటు ...... స్త్రములన్ పటు = తీక్షణమైన, దీప్తి = కాంతిచే, స్మేర = వికసించిన, అస్త్రములన్ = అస్త్రాలచేత ; పరవశుఁగన్ = స్మృతి తప్పునట్లుగా ; ఏసితిన్ = కొట్టితిని.

భా : అప్పుడు ఆశ్చర్యంలో మునిగిన పరశురాముని చూచి చిరునవ్వు నవ్వుతూ నిపుణంగా దివ్యాస్త్రాలను ప్రయోగించి అతని మూర్ఛితుని చేశాను.

వ : ఇట్లతండు మూర్ఛిల్లిన ముని జనంబులును నంబయు నధికశోక సమాకులత్వంబు నొంది హాహాకారంబులు సెలంగఁ బొదివి; రంత. 334

భా : ఇలా పరశురాముడు మూర్ఛిల్లగా మహర్షులూ, అంబా కూడా అతిశయించిన దుఃఖంతో కలతపడి, హాహాకారాలు చేస్తూ పరశురాముని చుట్టుముట్టారు.

ఆ : తెలిసి భార్గవుండు దృఢ తీవ్ర నారాచ
పంక్తిఁ గురిసి నన్నుఁ బారవశ్య
మంది నేల కొఱగునట్లుగాఁ జేసి మ
త్సూతు మస్తకంబుఁ దునియ నేసె. 335

అ : భార్గవుండు = పరశురాముడు ; తెలిసి = తెలివినంది ; దృఢ ... పంక్తిన్ ; దృఢ = గట్టివీ, తీవ్ర = తీక్షణమైనవీ అయిన, నారాచ = బాణాల యొక్క, పంక్తిన్ = వరుసను ; కురిసి = కురిపించి ; పారవశ్యము + అంది = స్పృహ తప్పి ; నేలకున్ + ఒఱగు నట్లుగాన్ = నేలపై బడునట్లుగా ; నన్నున్ చేసి ; మత్సూత = నా సారథియొక్క ; మస్తకంబు = తల ; తునియన్ + ఏసెన్ = ఖండించెను.

భా : *పరశురాముడు స్పృహలోనికి వచ్చి దృఢమూ, తీవ్రమూ అయిన బాణ పరంపరను కురిపించి నేనే స్పృహ తప్పి నేలపై పడేటట్లు చేసి నా సారథి తలను ఖండించాడు.*

వ : అట్టి యెడ నెనమండ్రు విప్రులు సమానవయోరూపంబుల నొప్పువారలు నన్నెత్తి సేదదేర్చి రథంబు పయిం బెట్టి గగన గమనంబునంబోయి; రంతకు మున్న మందాకిని మున్ను నాకన్న చందంబున నొగలపయినుండి మదీయరథ్యంబుల పగ్గంబులు ధరియించి యున్న; నేనునుం గనుంగొని నమస్కరించిన దీవించి చనియె; వెండియు. 336

అ : విప్రులు = బ్రాహ్మణులు ; సమాన -వయో - రూపంబులన్ = సమానమైన వయస్సుతోనూ, రూపంతోనూ; సేద+ తీర్చి = శ్రమ తీర్చి ; గగన గమనంబునన్ = ఆకాశయానంతో; మందాకిని = ఆకాశగంగ ; నొగలపయిన్ = రథంయొక్క కాడికట్టుపై ; మదీయ -రథ్యంబులు = నా గుఱ్ఱాలు.

భా : *ఆ సమయంలో ఒకే వయస్సూ, ఒకే రూపమూ కలిగిన ఎనిమిది మంది బ్రాహ్మణులు నన్ను లేవనెత్తి, అలసట పోగొట్టి, రథముపై నుంచి ఆకాశచారులై వెళ్లిపోయారు. అంతకుముందే గంగాదేవి గతంలో నాకు కనిపించిన రూపంతో నా రథంయొక్క కాడికట్టుపై పగ్గాలు పట్టి కూర్చొని కనిపించింది. నేను నమస్కరించగా నన్ను దీవించి ఆమె వెళ్లిపోయింది.*

వి: ఆ కనిపించిన ఎనిమిది మంది విప్రులూ వసువులు. భీష్ముడు కూడా అష్టవసువులలో ఒకడు. అయితే భీష్ముడు అంశమాత్రంగానే శాపాన్ని అనుభవిస్తున్నాడు కాబట్టి ఎనిమిది మంది వసువులు వారి వారి కర్తవ్యాలను నిర్వహిస్తునే ఉన్నారు.

క : సారథ్యంబును జేయుచు
ధీరత వాటించి రామదేవుని తోడం

క్రూరాస్త్రంబులఁ సమరవి
హారం బొనరించితిని సురావలి వొగడన్. 337

అ : సారథ్యంబునున్ + చేయుచున్ = రథాన్ని కూడా నేనే తోలుకుంటూ ; ధీరత = ధైర్యాన్ని ; పాటించి = వహించి; రామదేవుని తోడన్ = పరశురామునితో ; క్రూర + అస్త్రంబులన్ = తీవ్రమైన అస్త్రాలతో ; సుర + ఆవలి =దేవతాసమూహం ; పొగడన్ = ప్రశంసించునట్లు ; సమర విహారంబు + ఒనరించితిన్ = యుద్ధ విహారం చేశాను.

భా : ధైర్యంతో నా రథాన్ని నేనే తోలుకుంటూ, పరశురామునిపై క్రూరాస్త్రాలను ప్రయోగిస్తూ, దేవతలు ప్రస్తుతించేటట్లు రణక్రీడ జరిపాను.

-: భీష్మునకు వసువులు స్వప్న సాక్షాత్కారంబున మోహనాస్త్రం బిచ్చుట :- (సం 5 - 184-1)

వ : ఇవ్విధంబునం బోరి సూర్యాస్తమయం బగుటయు నెప్పటి యట్ల చని యే నారాత్రి యేకాంతంబున దర్భశయనంబున నుండి సురభూసురవర్గంబులం దలంచి భక్తిం బ్రణామంబులు సేసి, పరశురాముని జయింపరాదయ్యెడు, దినంబులు పెక్కులు సనియె నతని నాజి జయించుట గలుగునేని మీరు నాకుం దోఁచి యూఱడింప వలయునని ప్రార్థించి, నిద్రించుచుండం బవలు నన్నెత్తి రథంబు పయిం బెట్టిన యెనమండ్రునుం బ్రభాతసమయంబునం గలలోన వచ్చి. 338

అ : దర్భశయనంబునన్ = దర్భతో చేయబడిన పడక ; ఆజి = యుద్ధం ; తోఁచి = ప్రత్యక్షమై ; ప్రభాతసమయంబునన్ = తెల్లవారుజామున.

భా : ఇట్లు పోరాడి సూర్యాస్తమయం కాగానే ఎప్పటివలె వెళ్ళి ; నేనారాత్రి ఒంటరిగా దర్భశయ్యపై శయనించి; దేవతలనూ, బ్రహ్మణులనూ, స్మరించి ; భక్తితోనమస్కరించి" రోజులు గడిచి పోతున్నాయికానీ యుద్ధంలో పరశురాముని జయించటం అసాధ్యమవుతోంది. మీరు నాకు కనిపించి యూరడింపుమాటలు చెప్పాలని' ప్రార్థించి నిదురించాను. అప్పుడు ప్రభాతకాలంలో నన్ను ఆ పగటివేళ ఎత్తి రథంపై కూర్చొన బెట్టిన ఎనిమిది మందీ కలలో కనిపించారు.

**తే : "నీవు నేమును నొక్కటి నీకు వెఱవ
నేల గాంగేయ ! రాము జయించునట్టి
శరము సు మ్మని మోహనాస్త్రంబు నాకు
నిచ్చి పోయిరి క్రమ్మఱ నెక్కడేని.** 339

అ : గాంగేయా ! = భీష్మా ; నీవునున్ ; ఏమునున్ = మేమును ; ఒక్కటి = ఒకటే ;నీకున్ ; వెఱవన్ + ఏల = భయపడనవసరం లేదు ; రామున్ = పరశురాముని ; జయించు + అట్టి = గెలువగలిగినట్టి ; శరము సుమ్ము = బాణం సుమా ; అని ; మోహన + అస్త్రంబు =

సమ్మోహనాస్త్రాన్ని ; నాకున్ ; ఇచ్చి ; క్రమ్మఱన్ = తిరిగి ; ఎక్కడన్ + ఏని = ఎక్కడికో ; పోయిరి.

భా : *"భీష్మా ! నువ్వు మేము ఒకటే. నువ్వు భయపడవలసిన అవసరం లేదు. ఇది పరశురాముని జయింప గలిగినట్టి అస్త్రం" అని చెప్పి, నాకు సమ్మోహనాస్త్రాన్ని ఇచ్చి వారెక్కడికో మరలిపోయారు.*

వ : ఏను మేలు కాంచి, సంతోషించి, తన్మంత్రస్వరూపంబును బ్రయోగోప సంహార ప్రకారంబులను జిత్తంబున నిలిపి కొనుచు (గాలోచిత కృత్యంబు లాచరించి, యొక్క సారథి నంగీకరించి, యరదంబు పూన్పించి, సన్నద్ధుండనై సత్వరంబుగా సమరంబున కరిగినం; బరశురామ దేవుండు. 340

అ : తత్ + మంత్ర స్వరూపంబు = ఆ సమ్మోహనాస్త్రం యొక్క మంత్రాన్ని ; ప్రయోగ + ఉపసంహారంబులును = ప్రయోగించుటనూ, త్రిప్పి తీసుకొనుటనూ ; చిత్తంబునన్ + నిలిపికొనుచున్ = ధారణ చేస్తూ ; కాల + ఉచిత కృత్యంబులు = ఆయా కాలములకు తగిన నిత్యకర్మలు.

భా : *నేను, మేలుకొని, ఆనందించి సమ్మోహనాస్త్ర మంత్రాన్ని, దాని ప్రయోగోప సంహారాలను ధారణ చేస్తూ, ఉదయపువేళ నిర్వర్తించవలసిన పనులు ముగించి, ఒక సారథిని ఏర్పరచుకొని, రథమెక్కి, సిద్ధపడి వేగంగా యుద్ధానికి వెళ్ళాను. అప్పుడు పరశురాముడు (తర్వాతి పద్యంతో అన్వయం).*

క : విన్న నఱ సచ్చి పోయితి
వున్న యఱయు నేఁడు దీర్చి యుడిపెద నీగ
ర్వోన్నతి; యింకెట వోయెదు?
నన్ను నెఱుఁగ వెట్టు? లనుచు నాపైఁ గవిసెన్. 341

అ : నిన్నన్ = నిన్నటి దినమున ; అఱ + సచ్చిపోయితివి = సగం మరణించావు ; ఉన్న + అఱయున్ = మిగిలిన సగం కూడా ; నేఁడు = ఈనాడు ; తీర్చి = చక్కచేసి ; నీ గర్వ + ఉన్నతిన్ = నీ గర్వాతిశయాన్ని; తుడిపెదన్ = పోగొట్టెదను; ఇంకన్; ఎటు + పోయెదు = ఎక్కడికి వెళ్ళగలవు; ఎట్టులు = ఎలా; నన్నున్; ఎఱుఁగవు = తెలుసుకొనవు; అనుచున్; నాపైన్; కవిసెన్ = కలబడెను.

భా: *"నిన్న సగం చచ్చి వెళ్లావు. మిగిలిన సగం కూడా ఈ రోజు తీరుస్తాను. నీ గర్వం అంతా తుడిచివేస్తా. ఇంకా ఎక్కడికి పోతావులే. నేనెంత వాడినో నీకింకా తెలియలేదు" అంటూ నా మీదికి దూకాడు.*

క : కవిసినఁ గడంగి పెల్లుగ
గవియించితి నంప వెల్లిఁ గడు క్రూరత భా
ర్గవుఁడును మద్గాత్రంబున్
వివిధాస్త్ర ప్రతతి నించి వెగడొందించెన్. 342

అ : కవిసినన్ = (పరశురాముడు) నన్ను తాకగా ; కడంగి = పూని ; పెల్లుగన్ = అధికంగా ; అమ్ము + వెల్లి = బాణవర్షాన్ని; కవియించితిన్ = ప్రయోగించాను ; భార్గవుఁడును= పరశురాముడు కూడా ; కడు క్రూరతన్ = మిక్కిలి క్రౌర్యంతో ; మత్ + గాత్రంబునన్ = నాతనువుపై; వివిధ ..... ప్రతతి .... వివిధ = అనేకములైన ; అస్త్ర = ఆయుధాలయొక్క ; ప్రతితిన్ = సమూహాన్ని; నించి = ప్రయోగించి; వెగడు + ఒందించెన్ = తల్లడపడజేశాడు.

భా : పరశురాముడలా నా పై బడగానే నేను పూనికతో అతనిపై బాణవర్షాన్ని కురిపించాను. అతడు కూడా ఎంతో క్రూరంగా వివిధాస్త్రాలను నా శరీరంపై ప్రయోగించి నన్ను కలవరపెట్టాడు.

వ : ఏనుం గోపించి. 343

భా : నేను కూడా కోపపడి (తర్వాతి పద్యంతో అన్వయం)

తే. రయము మెఱయంగ నొక్క నారసము ఫాల
దేశమున యందు నాఁటించి తీవ్ర శక్తి
నురము వైచినఁ దూఁగాడి యొఱగ నూఁది
పట్టి యకృతవ్రణుఁడు దేర్చెఁ బరశురాము. 344

అ : రయము + మెఱయంగన్ = వేగమొప్పగా ; ఒక్క; నారసమున్ = బాణాన్ని ; ఫాలదేశమున యందున్ = నుదుటిపై ; నాఁటించి = గ్రుచ్చుకొన జేసి ; తీవ్రశక్తిన్ = తీవ్రమైన శక్తి అనే ఆయుధాన్ని; ఉరముపైచినన్ = రొమ్మున వేయగా ; తూఁగాడి = కంపించి ; ఒఱఁగన్= (పరశురాముడు) వ్రాలిపోగా ; ఊఁది పట్టి = పోటీయై పట్టుకొని ; అకృత వ్రణుఁడు ; పరశురామున్; తేర్చెన్ = స్మృతికలుగజేసెను.

భా : నేనే వేగంగా నొక బాణం నుదిటిపై నాటుకొనేటట్లు వేసి, ఆ పై శక్తిని రొమ్ముపై ప్రయోగించాను. దానితో పరశురాముడు కంపించి వ్రాలిపోయాడు. అకృత వ్రణుడు అతన్ని పొదివి పట్టుకొని స్మృతి కలుగజేశాడు.

క : అప్పుడు దెప్పిఱి కన్నుల
నిప్పులు రాలంగ నన్ను నిశ్చల దృష్టిం
దప్పక చూచి యలఁతి న
వ్వొప్పఁగ బ్రహ్మాస్త్ర మాతఁ డుగ్రత నేసెన్. 345

అ : అప్పుడున్ ; తెప్పిఱి = తెప్పరిల్లుకొని ; కన్నులన్ = కళ్లనుండి ; నిప్పులు రాలంగన్ ; నన్నున్ ; నిశ్చలదృష్టిన్ = ఏకాగ్రదృష్టితో ; తప్పక చూచి = తిన్నగాచూచి ; అలఁతినవ్వు = మందహాసం ; ఒప్పఁగన్ = శోభిల్లగా ; ఆతఁడు = పరశురాముడు ; బ్రహ్మ + అస్త్రమున్ ; ఏసెన్ = ప్రయోగించెను.

భా : అప్పుడు తేరికొని పరశురాముడు నిప్పులు కురిపించే కళ్ళతో ఏకాగ్రదృష్టితో నన్ను చూచి, మందహాసం చేసి, నాపై బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు.

క : తెగ (గొని బ్రహ్మాస్త్రమ యేఁ
దగ నేసిన నొక్కటొకటి దార్కొని రెండున్
గగనం బంతయుఁ దేజః
స్థగితముగాఁ జేయ సురలు దైత్యులు దలఁకన్. 346

అ : తెగన్ + కొని = వింటినారిని బాగాలాగి ; ఏన్ = నేను ; బ్రహ్మాస్త్రమున్ ; తగన్ + ఏసినన్ = తగినట్లు ప్రయోగించగా ; రెండున్ = ఆ రెండూ ; ఒక్కటొకటి = ఒకదానితోఒకటి; తార్కొని = ఢీకొని ; గగనంబు + అంతయున్ = ఆకాశమంతా; తేజః స్థగితముగాన్ = తేజస్సుతో కప్పబడినట్లు ; చేయన్ ; సురలు = దేవతలూ; దైత్యులు = రాక్షసులూ ; తలఁకన్ = భయపడేటట్లు.

భా : *వింటినారి లాగి నేను కూడా అప్పటికి తగినట్లుగా బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాను. ఆ రెండు బ్రహ్మాస్త్రాలూ ఒకదానితో ఒకటి ఢీకొని ఆకాశమంతా తేజస్సుతో కప్పివేశాయి. దేవతలూ, రాక్షసులూ కూడా అది చూచి భయపడ్డారు.*

వి : బ్రహ్మాస్త్రాన్ని ఎదుర్కోవటానికి బ్రహ్మాస్త్రానికే తప్ప మరే అస్త్రానికీ శక్తి చాలదు. వజ్రాన్ని వజ్రంతోనే భేదించాలి గదా !

తే : సకల భూత సంక్షోభ సంజనక మైన
యట్టి యెడఁగని యిది దఱి యని తలంచి
మోహనాస్త్రంబు నంచితా వాహనంబు
సేయుటయును జరాచరశ్రేణి మ్రోసె. 347

అ : సకల .... మైన ; సకల = సమస్తములైన,భూత = ప్రాణులకు, సంక్షోభజనకము + ఐన = కలతను కల్గించెడి ; అట్టి + ఎడన్ = ఆ సమయంలో ; కని = చూచి ; ఇది ; తఱి = అదను ; అని ; తలంచి ; మోహన + అస్త్రంబున్ = సమ్మోహనాస్త్రాన్ని ; అంచిత - ఆవాహనంబు = తగిన ఆవాహన కలదిగా ; చేయుటయును = చేయగా ; చర + అచర శ్రేణి = చరాచరప్రాణి సమూహం ; మ్రోసెన్ = ఆక్రోశించెను.

భా : *సకల జీవకోటికీ కలవరపాటును కల్గిస్తున్న ఆ సమయాన్ని గమనించి ఇదే అదనని భావించి సమ్మోహనాస్త్రాన్ని ప్రయోగించటానికి ఆవాహన చేశాను. అది గమనించి చరాచర ప్రాణులన్నీ ఆక్రోశించాయి.*

వ : తదవసరంబున. 348

భా : తత్ + అవసరంబునన్ = ఆ సమయంలో (తర్వాతి పద్యంతో అన్వయం).

క : "ఉడు గుడుగు మోహనాస్త్రము
విడువకు"మను నెలుఁగుతోడ వేగంబున న
య్యెడ కేఁగు దెంచి నారదు (
డెడమడు గించుకయు లేక యిట్లను నాతోన్. 349

అ : ఉడుగుము + ఉడుగుము = విరమించు, విరమించు ; మోహన + అస్త్రమున్ = సమ్మోహనాస్త్రాన్ని ; విడువకుము + అను ; ఎలుఁగు తోడన్ = కంఠధ్వనితో ; వేగంబునన్ = త్వర త్వరగా ; నారదుఁడు ; ఆ + ఎడకున్ = ఆ ప్రదేశానికి ; ఏఁగుదెంచి = వచ్చి ; ఇంచుకయున్ = కొంచెంకూడా ; ఎడమడుగులేక = అరమరిక లేకుండా ; నాతోన్ ; ఇట్లు + అనున్.

భా : "ఆగాగు ! సమ్మోహనాస్త్రాన్ని ప్రయోగించవద్దు "అని ఎలుగెత్తి పలుకుతూ వెంటనే నారదు డక్కడకు వచ్చి, అరమరిక ఏపాటీ లేకుండా నాతో ఇలా అన్నాడు.

వి : పురాణేతిహాసాల్లో సంక్షోభసమయంలో నారదపాత్ర ప్రవేశానికి ప్రాధాన్య ముంటుంది. సహజమైన వైరుధ్యం శత్రుత్వం లేకపోయినా కారణాంతరాల వలన శత్రుత్వ మేర్పడిన వారిమధ్య సౌహార్దాన్ని పెంపొందింప జేయటానికీ, సహజ సాధు ప్రవర్తనను మేల్కొల్పటానికీ నారదుడు సహకరిస్తాడు.

క : గురునకు నవమానము ని
ష్ఠుర వృత్తిం జేసె దీవు సూచితిమే యి
ప్పురుసునఁ బరుసపు నడవడిఁ
గురువంశ ప్రవర ! యిట్లు గూడునె చేయన్. 350

అ : కురు వంశప్రవర = కురువంశశ్రేష్ఠా ; ఈవు = నువ్వు; నిష్ఠుర వృత్తిన్ = పరుషమైన ప్రవర్తనతో ; గురునకున్; అవమానమున్ ; చేసెదు = చేస్తున్నావు; ఈ పరుసునన్ = ఈ విధంగా ; పరుసము నడవడిన్ = పరుషమైన ప్రవృత్తి ; చూచితమే = ఎందైనా గమనించామా? ; చేయన్ + కూడునె = చేయవచ్చునా ?

భా : ఓ కురువంశశ్రేష్ఠా! భీష్మా! కఠినమైన ప్రవర్తనతోనే గురువునే పరాభవిస్తున్నావు. ఇటువంటి దెక్కడైనా చూచామా? ఈ విధమైన పారుష్యం నీకు తగినదా?

వ : అని సువ్యక్తంబుగాఁ జెప్పి. 351

అ : సువ్యక్తంబుగాన్ = మిక్కిలి స్పష్టంగా

భా : అని సుస్పష్టంగా జెప్పి (తర్వాతి పద్యంతో అన్వయం)

క : "వీరె వసువు లాకసమున
గారవమున బుద్ధిసెప్పఁగా నీ కడకుం
దా రేఁగు దెంచి రని క
న్నా రంగాఁ జూపె నాకు నయ్యెనమండ్రన్. 352

అ : వీరు + ఎ = ఇరుగో ; ఆకసమునన్ = ఆకాశమందు ;వసువులు ; గారవమునన్ = ప్రేమతో ; బుద్ధి + చెప్పఁగాన్ = (నీకు) బుద్ధి చెప్పటకు ; నీకడకున్ = నీ చెంతకు ; తారు = తాము ; ఏగుదెంచిరి = వచ్చిరి ; అని ; కన్నారంగాన్ = నేత్రపర్వంగా ; ఆ + ఎన మండ్రన్ = ఆ ఎనిమిది మందినీ ; నాకున్ ; చూపెన్

భా : 'ఇరుగో ! ఆకాశంలో అష్టవసువులూ నీకు ప్రేమతో బుద్ధి చెప్పటానికై నీ

దగ్గరకు వచ్చియున్నా'రని కనులారా ఆ ఎనిమిది మందిని నాకు చూపాడు నారదుడు.

వి : ఆపుడు, ధ్రువుడు, సోముడు, ధరుడు, అనిలుడు, అనలుడు, ప్రత్యూషుడు, ప్రభాసుడు అన్న వారు అష్టవసువులు. వీరిలో ప్రభాసుని అంశంగానే భీష్ముడు అవతరించాడు. వసిష్ఠుని శాపంవలన వీరు మర్త్యలోకంలో పుట్టవలసివచ్చింది. ప్రభాసుడే చాలాకాలం మర్త్యలోకంలో జీవించినవాడు. మిగిలిన వారందరినీ గంగ పుట్టిన వెంటనే నదిలో పడవేసి శాపవిముక్తులను చేసింది.

వ : ఇవ్విధంబున నెప్పటి విప్రవరులు సన్నిధిసేసి, నన్నుంజూచి, నగు మొగంబులతో నెఱుఁగని వార పోలె నిట్లనిరి. 353

అ : సన్నిధి + చేసి = సాక్షాత్కరించి

భా : ఇలా పూర్వంలో కనిపించిన బ్రాహ్మణ శ్రేష్ఠులైన వారు ప్రత్యక్షమై నన్ను చూచి నవ్వుముఖాలతో అపరిచితులవలె ఇట్లన్నారు.

క : నారదముని త్రైలోక్య స
మారాధ్యుం డితని పలుకు లాగమ వాక్యో
దారములు వినుము వీనిం;
గ్రూరత వాటింపఁ దగదు గురువిషయమునన్. 354

అ : నారదముని ; త్రైలోక్య - సమారాధ్యుండు = మూడు లోకాల వారికి పూజింపదగినవాడు ; ఇతని పలుకులు ; ఆగమవాక్య + ఉదారములు = వేదవాక్యాల వలె గొప్పవి ; వీనిన్ వినుము ; గురు విషయమునన్ =గురువుల యెడ ; క్రూరత = క్రౌర్యం ; పాటింపన్ + తగదు = పూనరాదు.

భా : నారదమహర్షి మూడులోకాల వారికినీ ఆరాధ్యుడు. అతని మాటలు వేదవాక్యాలు. వాటిని ఆలకించు. గురువు పట్ల క్రూరత పనికిరాదు.

వ : అనిన విని యేను సమ్మోహనాస్త్రం బేయుట యుడిగి బ్రహ్మాస్త్రంబు దీపింపఁ జేసితి ; నప్పుడు జామదగ్న్యుం డది యెల్ల నెఱింగి, యోటమి యెక్కించుకొని, చలంబు మిగిలి యున్నం దజ్జనకుండు జమదగ్నియుఁ దదీయ పితృవర్గంబును నతనికి సన్నిధి సేసి వేఁడికొని శాంత వచనంబులం దేర్చి యిట్లనిరి. 355

అ : ఉడిగి = విరమించి ; ఎక్కించుకొని = కలిగించుకొని

భా : అనగా విని నేను సమ్మోహనాస్త్ర ప్రయోగాన్ని విరమించి, బ్రహ్మాస్త్రాన్ని ఉద్దీపింప జేశాను. అప్పుడు పరశురాము డది గ్రహించి తానోడినట్లు భావించి పట్టుదల పెంచుకొనగా జమదగ్నియు, అతని పితృదేవతలూ ప్రత్యక్షమై శాంత వచనాలు పలికి అతనిని ప్రసన్నుని చేసి ఇలా అన్నారు.

వి : సమానమైన బల పరాక్రమాలు గల వారి మధ్య జరిగే సంఘర్షణలో గెలుపు

ఓటములు తాత్కాలికాలే కానీ బలనిర్ణయంలో నిశ్చల ప్రమాణాలు కావు. కాబట్టి అటువంటి పరిస్థితులలో జగద్ధిత కాంక్షతోనైనా ఆ సంఘర్షణ వారించటానికి పెద్దలు ప్రయత్నం చేస్తారు.

క : వినుము వసుమూర్తి యీతం
డనన్య సామాన్య తేజుఁ డాహవభూమిన్
మనకు జయింప వశమె భీ
ష్మని? విప్రున కగునె రోషమును మత్సరమున్. 356

అ : ఈతండు = ఇతడు ; వసుమూర్తి = వసువులలో ఒకడు ; వినుము = ఆలకించు ; అనన్య సామాన్య -తేజుఁడు = ఇతరులలో కనిపించని తేజస్సు గలవాడు ; ఆహవభూమిన్ = రణరంగంలో; మనకున్ ; భీష్మునిన్ ; జయింపన్ + వశమె = గెలుచుట సాధ్యమా ; విప్రునకున్ = బ్రాహ్మణునకు ; రోషమును =కోపమును ; మత్సరమున్ ; అసూయయును ; అగునె = తగునా?

భా : ఇతడు వసువులలో ఒకడు; అసాధారణమైన తేజస్సు గలవాడు. ఈ భీష్ముని రణరంగంలో జయించుట మనకు అసాధ్యం. బ్రాహ్మణులకు కోపమూ, అసూయ పనికిరానివి గదా !

తే : సమర ముడుగు నారాయణ సఖుఁడు నరుఁడు
సవ్యసాచి నా నింకొక జన్మ మొంది
యితని వధియించుఁ గాని తక్కితరజనము
లకు నసాధ్యుండు భీష్ముఁ డాలంబులోన. 357

అ : సమరము + ఉడుగు = యుద్ధాన్ని ఆపు ; నారాయణ సఖుఁడు = నారాయణుని మిత్రుడైన నరుఁడు; సవ్యసాచినాన్ = సవ్యసాచి అని ; ఇంకొక జన్మమున్ = వేరొక జన్మను ; పొంది ; ఇతనిన్ ; వధియించున్ + కాని = సంహరించును కానీ ; తక్కు + ఇతర జనంబులకున్ = మిగిలిన వారికీ; ఆలంబులోనన్ = యుద్ధంలో ; భీష్ముండు ; అసాధ్యుండు = జయింపశక్యము గానివాడు.

భా : యుద్ధాన్ని విరమించు. నారాయణుని మిత్రుడైన నరుడు సవ్యసాచిగా మరొక జన్మను పొంది యద్ధంలో భీష్ముని వధిస్తాడు. అతనికి తప్ప ఇతరులకు భీష్ముడు అజయ్యుడు (జయింపవీలుకానివాడు).

వ : అనిన నతండు వెండియుం బోక పెనంగిన ననేక ప్రకారంబులం జెప్పి, యమ్మునులు నాకడకుం జనుదెంచి, యుపశమన వాక్యంబులు పలికి, జామదగ్న్యుతోడం దమ యాడిన మాటలు దేటపఱచి, యప్పుడు పొడసూపిన జాహ్నవియుం దారు బహువిధంబుల నన్ను ననునయించి, భార్గవుపాలికి నమ్మహాదేవిం దోడ్కొని యరిగియుం గ్రమ్మఱ మత్సమీపంబునకు వచ్చియు నెట్టకేలకుం జలం బుడిపిన నేమిరువురమును దివ్యాస్త్రంబు లుపసంహరించి సమరం బుడిగితి; మట్టియెడ నయ్యేనమంద్రు విప్రులం

358
జేరి నాతో నిట్లనిరి.

అ : చలంబు = పట్టుదల

భా : అని పలికినా పరశురాముడు అప్పటికీ ఆగక పోరాడుచుండగా, అనేక విధాలుగా అతనికి చెప్పి ఆ మహర్షులు నా దగ్గరకు వచ్చి శాంతి వచనాలు పలికి, పరశురామునకు తాము చేసిన ఉపదేశాన్ని నాకు తెలిపారు. అప్పుడు ప్రత్యక్షమైన గంగాదేవీ, తామూ కలసి నన్ను పలురకాలుగా బ్రతిమాలి పరశురాముని దగ్గరకు గంగాదేవిని తోడ్కొని పోయి మరలా నా చెంతకు వచ్చి ఎట్టకేలకు మా పట్టుదలలు ఉపశమింపజేశారు. అప్పుడు మేమిద్దరమూ దివ్యాస్త్రాలు ఉపసంహరించి యుద్ధం విరమించాము. ఆ సమయంలో ఆ ఎనిమిది మంది విప్రులూ వచ్చి నాతో ఇలా అన్నారు.

ఆ : గురుఁడు బ్రహ్మవిదుఁ డకుంఠిత తేజుండు
పరశురాముఁ డతని పాలి కీవు
భక్తి మెఱయ నేఁగి ప్రణమిల్లి తదనుగ్ర
హంబు వడయవలయు ననఘ ! యిపుడు. 359

అ : అనఘ ! = మహాత్మా! ; పరశురాముఁడు; గురుఁడున్ = నీకు ఆచార్యుడునూ ; బ్రహ్మవిదుఁడు = బ్రహ్మతత్త్వమెరిగిన వాడునూ ; అకుంఠిత తేజుండు= మొక్కవోని తేజశ్శాలి ; అతని పాలికిన్ = అతని చెంతకు; ఈవు = నీవు ; భక్తిమెఱయన్ = భక్తి ఒప్పగా , ఏఁగి = వెళ్లి; ప్రణమిల్లి = నమస్కరించి ; ఇపుడు ; తత్ + అనుగ్రహంబు = అతని దయను ; పడయవలయున్ = పొందవలెను.

భా : పరశురాముడు నీకు గురువూ, బ్రహ్మవేత్తా, తేజశ్శాలి. అతని దగ్గరకు నువ్వు వెళ్లి భక్తితో నమస్కరించి, అతని అనుగ్రహాన్ని పొందాలి.

వ : అని చెప్పి యతని కడకుం దారును నారదమునీశ్వరుండును జమదగ్ని ప్రముఖులును, భాగీరథియును జని "నీ శిష్యుండు దేవవ్రతుండు. వానియెడ నలుగం దగునె! వాఁడు దగవు మాలినపనిఁ జేయంజాలక పెనంగె నింతియకాని విరోధి గాఁడు; వానిం గరుణింపు" మని తెలిపి నన్నుం బిలిచినం బోయి యే నమ్మహాత్మునకు సాష్టాంగదండ ప్రణామంబు సేసిన నతఁడు దీవనతో గ్రుచ్చి యెత్తి కౌగిలించి కొని గాంగేయా! నీ శక్తికి భక్తికిం బ్రీతుండ నైతినని సస్నేహంబుగా సంభావించి యంబ నవలోకించి, "నన్ను భీష్ముండు గెలిచె నా వలన నయ్యేడు పని యింతియ, నీవింక నీకుం జూడం బోలిన గతిం బొ"మ్మనిన నమ్మానిని " దేవా! యిది యిట్టిది, నీ యోపినంతయుం జేసితి నీ చేతం బోకున్న నేమి సేయుదు. నేను దపంబు పెంపున భీష్ముని వధించెద జన్మాంతరంబున నైననుం జలంబు సాధ్యంబు సేయుదు నటు సూడు" మని పలికి పోయెఁదదనంతరంబ యమ్ముని జన పితృదేవతా సమూహంబును

భృగునందను నన్ను నామంత్రణంబుసేసి యంతర్ధానంబు సేసె. భార్గవుండును నన్ను వీడ్కొలిపి మున్ను దనతో వచ్చిన తపోధన వర్గముం దానును మహేంద్ర శైలంబునకుం జనియె. నేను మగిడి యెడనెడ నుర్వీసురుల యాశీర్వాదంబులు సంభావన వచనంబులుఁ బ్రస్తుతి వాక్యంబులుఁ గర్ణంబుల కింపుసేయ నిట వచ్చి సత్యవతికి నమస్కార పూర్వకంబుగా నంతయు నెఱింగించిన నద్దేవి యభినందించె. 360

అ : పెనంగెన్ = యుద్ధం చేశాడు; తగవు మాలినపని = అధర్మకార్యం;సంభావించి = ఆదరించి; అవలోకించి = చూసి; ఓపినంత = చేతనైనంత; తపంబుపెంపు = తపస్సు యొక్క అధిక్యము; జన్మాంతరము = మరియొక జన్మము; చలంబు = పట్టుదల; ఆమంత్రణము చేసి = వీడ్కోలిచ్చి; మగిడి = తిరిగివచ్చి, మరలి; ఎడనెడ = అచ్చటచ్చట; ఉర్వీసురులు = బ్రాహ్మణులు;

భా : అని చెప్పి పరశురాముని దగ్గరకు ఆ ఎనమండుగురు విప్రులూ, నారదుడూ, జమదగ్ని మొదలయిన వారూ, గంగానదీ వెళ్లి "నీ శిష్యుడు కాదా దేవవ్రతుడు. వాని మీద నీవు కోపపడవచ్చునా? అధర్మమాచరింపలేక అతడు యుద్ధంచేశాడు కాని నీకతడు శత్రువు కాదు, వానిని కరుణించు" అని ప్రార్థించి నన్ను పిలిచారు. నేను వెళ్లి గురువుగారికి సాష్టాంగ నమస్కారం చేశాను. అతడునన్ను ఎత్తి కౌగిలించుకొని "భీష్మా! నీ శక్తికీ భక్తికీ ప్రీతి చెందాను." అని అంబను చూసి" నన్ను భీష్ముడు గెలిచాడు. ఇంతకంటె నేనేమీ చేయలేను. నీ యిష్టం వచ్చినట్లు పో" అన్నాడు.అపుడామె "మహాత్మా! నీకు చేతనయినంత చేశావు. నీ చేత కాకపోతే నీవేమి చేస్తావు. నేను తపస్సు చేత భీష్ముని వధిస్తాను. మరోజన్మలో అయినా నా పట్టుదల సాధిస్తాను చూడు" అంటూ వెళ్ళిపోయింది. తరువాత ఆమహర్షులూ, పితృదేవతలూ, నన్నూ పరశురామునీ వీడ్కొని అంతర్ధానమయ్యారు. పరశురాముడూ మహర్షులూ నన్నువిడిచి మహేంద్ర పర్వతానికి వెళ్లారు. నేనూ బ్రాహ్మణుల ఆశీర్వాదాలతో ప్రశంసలతో వచ్చి సత్యవతికి నమస్కరించి జరిగినదంతా చెప్పాను. ఆమె నన్ను అభినందించింది.

-: నారదుఁడు భీష్మున కంబ వృత్తాంతం బంతయుఁ జెప్పుట :- (సం 5-187-16)

తే : అంబ వృత్తాంత మరయంగ ననుదినంబుఁ
దగినవారలఁ బుచ్చుచుఁ దలఁకు చుందు
నేను నది యాదిగాఁ జింత నేపు దక్కి
స్రుక్కి యుండియు రాజుల నుక్కు మడఁతు. 361

అ : అనుదినంబున్ = ప్రతిదినమును ; అంబ + వృత్తాంతమున్ = అంబసమాచారమును ; అరయంగన్ = విచారించుటకు ; తగిన వారలన్ = యోగ్యులను ; పుచ్చుచున్ = పంపుచు ; తలఁకుచుందున్ = భయపడు చుందును ; ఏను = నేను ; అది + ఆదిగాన్ = అది మొదలుగా ; చింతన్ = విచారముతో; ఏపు + తక్కి = హెచ్చరికను కోల్పోయి; స్రుక్కి యుండియున్ = శుష్కించియు ; రాజుల + ఉక్కున్ = రాజుల అహంకారమును ; మడఁతున్ = నశింపజేయుదును.

భా : *ప్రతి దినమూ అంబ వృత్తాంతం తెలిసికొనడానికి తగిన వారిని పంపిస్తూ నేను భయపడుతూనే ఉన్నాను. అది మొదలు కొని చింతతో ఉత్సాహం నశించి శుష్కిస్తూ కూడా రాజుల అహంభావాన్ని అణగిస్తూనే ఉన్నాను.*

వ : ఒక్కనాడు పారాశర్య నారదులం గని యక్కార్యంబు భయంబు దోఁప విన్నవించిన వారలు దైవాధీనం బగుదాని మానుషంబున మానిపింప వశంబుగా దాచింత విడువు మని రందు నారదుం డక్కాశీశ్వరకన్యక తెఱంగు విను మని యిట్లనియె. 362

భా : *ఒకనాడు వ్యాస నారదులను చూచి భయంతో అంబ వృత్తాంతాన్ని చెప్పగా విధి విధానాన్ని పురుష ప్రయత్నం చేత తొలగించడం సాధ్యంకాదు. నీవా ఆలోచనను విడిచిపెట్టు అన్నారు. వారిలో నారదుడు కాశీరాజు కన్యయైన అంబ సంగతి చెపుతూ ఇలా అన్నాడు.*

**సీ : ఆ తన్వి యమునానదీ తీరమున కేఁగి
యత్యుగ్ర మగు తప మాచరించి
యందుండి కౌశికు నావాస మాదిగాఁ
గలుగు సిద్ధాశ్రమంబులకు నెల్లఁ
జని చని తత్రదేశంబుల నిష్ఠుర
వ్రతములు సలుపంగ, వచ్చి నీదు
జనని జాహ్నవి యిట్లు వనితల కతిదుష్క
రములగు బహునియమములు నీకు**

తే: నడపఁ గతమేమి" యనుఁడు నన్నాతి పలుకుఁ
"దద్ద యవమానపడితి శాంతనవు చేత
నపరజన్మంబు నందైన నతనిఁ జంప
నేను జాలుటకై యిట్టి దాన నైతి." 363

అ : ఆ తన్వి = అంబ; యమునా నదీ తీరమునకున్ + ఏఁగి; అతి + ఉగ్రమగు = మిక్కిలి తీవ్రమయిన; తపము; ఆచరించి = చేసి; అందుండి = అక్కడనుండి; కౌశికు + ఆవాసము + ఆదిగాన్ = విశ్వామిత్రుని ఆశ్రమం మొదలుగా; కలుగు; సిద్ధాశ్రమంబులకున్ + ఎల్లన్ + చని చని = సిద్ధాశ్రమాలన్నిటికీ వెళ్లి వెళ్లి; తత్ప్రదేశంబులన్ = ఆ ప్రదేశాలలో; నిష్ఠుర వ్రతములు + చలుపంగన్ = కఠిన వ్రతాలు చేయగా; నీదు జనని = నీ తల్లి; జాహ్నవి = గంగ; వచ్చి; ఇట్లు = ఈ విధంగా; వనితలకున్ = స్త్రీలకు; అతిదుష్కరములు+ అగు = మిక్కిలి కష్టములయిన; బహునియమములు; నడపన్ = ఆచరించటానికి; నీకున్; కతమేమి? = కారణమేమిటి?; అనుఁడు + అనగానే; అన్నాతి = ఆ స్త్రీ (అంబ); పలుకున్ = చెపుతోంది; శాంతనవుచేతన్ = భీష్ముని చేత; తద్ద = మిక్కిలి; అవమానపడితిన్; అపరజన్మంబునందు-ఐనన్ = మరోజన్మలో అయినా; అతనిన్ = భీష్ముని; చంపన్ = చంపటానికి; నేను; చాలుటకై = సమర్థురాలనవటానికి; ఇట్టిదానన్‌ఐతి = ఇట్టి కఠినవ్రతాలు ఆచరించే దాని నయ్యాను.

భా : ఆ అంబ యమునా నదీతీరంలో ఘోరమయిన తపస్సు చేసింది. అక్కడ నుండి విశ్వామిత్రుని ఆశ్రమం మొదలయిన ఆశ్రమాల్లో కఠిన తపస్సు చేసింది. అంతలో గంగాదేవి వచ్చి "నీవీ కఠిన తపస్సు ఎందుకు చేస్తున్నావు?" అని? అడిగింది. అపుడా అంబ "నేను భీష్ముని వల్ల చాలా భంగపడ్డాను. అందుచే మరోజన్మలో నయినా అతనిని వధించాలని యింత కఠిన తపస్సు చేస్తున్నాను" అంది.

వ : అనిన విని భాగీరథి గుటిల ప్రచార వగుట నీవీ తనువు విడిచి యేఱయి పాఱం గల దాన వింతియ కాని యొండు గానేర వనిన నవ్వేలంది నవ్వుచు సరకు సేయక యరిగి తొంటి కంటెను దీవ్రం బగు తపశ్చరణంబునం బ్రవర్తిల్లుచు మత్స్యదేశ వాసినియై యుండి యొక్కనాడు నిజవ్రత ఫలంబులో సగంబున నంబ యనుపేర నదియై యమ్మండలంబునం బరగి యున్న సగంబునను దనరూపు సెడకుండ వహించికొని జాహ్నవీ ప్రభావంబు నాత్మీయ ప్రభావంబున గెలిచి వెండియు. 364

అ : భాగీరథి = గంగ ; కుటిల ప్రచారవు = వంకర నడత కలదానవు ; తనువు = శరీరము ; ప్రభావము = మహిమ ; జాహ్నవి = గంగ.

భా : అనగా విని గంగ నీవు కుటిల వర్తనవు. కనుక నీవీ శరీరాన్ని విడిచి ఏరుగా ప్రవహించగల వంతేగానీ మరేం కాలేవు. అనగా అంబనవ్వి ఆ మాటలు లెక్కచేయక పూర్వంకన్నా తీవ్రంగా తపస్సు చేస్తూ మత్స్యదేశంలో ఉండి ఒకనాడు తన తపఃఫలంలో సగం ధారపోసి అంబ అన్న పేరుతో నదిగా ఆమండలంలో ప్రవహించి మిగిలిన తపః ఫలంతో తనరూపు చెడకుండా నిలుపుకొని గంగా ప్రభావాన్ని తనమహిమచే గెలిచింది.

క : పుణ్యాశ్రమ దేశముల న
గణ్యం బగు తపము సేయఁగా రుద్రుఁడు గా
రుణ్యము వాత్సల్యము దా
క్షిణ్యము మెఱయంగ నింతికిం బొడసూపెన్. 365

అ : పుణ్య + ఆశ్రమ దేశములన్ = పవిత్రమైన ఆశ్రమ ప్రదేశాలలో ; అగణ్యంబు + అగు = విశేషమైన ; తపము + చేయఁగాన్ = తపస్సు చేయగా ; రుద్రుఁడు = ఈశ్వరుడు ; కారుణ్యము = దయ ; వాత్సల్యము = ప్రేమ ; దాక్షిణ్యము = అనుకూల్యము; మెఱయంగన్ = ఒప్పగా; ఇంతికిన్ = అంబకు ; పొడసూపెన్ = ప్రత్యక్షమయ్యెను.

భా : పవిత్రమైన ఋష్యాశ్రమ సీమలలో అంబ అలా తపస్సు చేయగా ఈశ్వరుడు దయా, ప్రేమా, అనుకూల్యమూ వెల్లడి కాగా ప్రత్యక్షమయ్యాడు.

క : మును లచ్చెరు వంది కనుం
గొన శంభుఁడు నిల్చి వరము గోరు మనుఁడు భీ
ష్ముని నాకుఁ జంపఁగా దొర
కొను నట్లుగ నొసఁగు మనియెఁ గోమలి యెలమిన్. 366

అ : మునులు =మహర్షులు; అచ్చెరువు + అంది = ఆశ్చర్యపడి ; కనుంగొనన్ = చూస్తుండగా ; శంభుఁడు = ఈశ్వరుడు ;నిల్చి = ఎదుట నిలిచి ; వరము + కోరుము = నీ అభీష్టము నడుగుము ; అనుఁడున్ = అనగా ; కోమలి = అంబ ; ఎలమిన్ = ప్రీతితో; భీష్మునిన్ ; నాకున్ = నాకు ; చంపగాన్ + దొరకొను + అట్లుగ = చంపశక్యమగునట్లుగా ; ఒసఁగుము = వరమియ్యి ; అనియెన్ = అంది.

భా : మహర్షులు ఆశ్చర్యంతో చూస్తుండగా ఈశ్వరుడు ప్రత్యక్షమై నీ కిష్టమైన వరాన్ని కోరుకో అనగానే అంబ సంతోషించి భీష్ముని నేను సంహరించ గలిగే లాగున నన్ననుగ్రహించు అని కోరింది.

వి : అత్యుగ్రమైన తపస్సుచేసి అసాధారణమైన ఈశ్వరానుగ్రహం పొంది ఒక వ్యక్తిని చంపగలిగేలా అనుగ్రహించమనడం ఎంతటి అవివేకం ? కామ క్రోధాదుల ప్రభావం ఎంత భయంకరమైనదో ఈ సన్నివేశం ద్వారా మనం గ్రహించవలసి యుంది.

అంబ సంకల్పబలం, దృఢమైన దీక్షాదక్షతలు దీనివల్ల మనకు వ్యక్తమవుతాయి. భాగవతంలో నృసింహస్వామి నీ అభీష్టమైన వరం కోరుకో అన్నప్పుడు ప్రహ్లాదుడు "యస్త ఆశిష ఆశాస్తే న సభృత్యః స వై వణిక్" స్వామీ ! నీ వల్ల తనకోరికలను తీర్చుకునే సేవకుడు సేవకుడు కాడు. ఇచ్చి పుచ్చుకునే వ్యాపారి అవుతాడు. అని నాకేవరాలు వద్దు నాకు వరమీయాలని ఉంటే నా హృదయంలో కోరికలు కలుగకుండా అనుగ్రహించ వలసిందిగా కోరాడు.

ప్రహ్లాదుని వంటి సాత్విక మనోవృత్తి అంబకెక్కడిది?

వ : అనవుడు నద్దేవుం డట్లు కాక యని యనుగ్రహించిన నంబ యెత్తెఱంగున నది యయ్యెడు నని యడిగిన. 367

భా : అనగా ఈశ్వరుడు అలాగే అని వర మనుగ్రహించగా అంబ ఎలా తాను భీష్ముని సంహరింప గలుగుతానని యడుగగా.

సీ. "ఈమేను విడిచి నీ వేఁగిన యప్పుడు
ద్రుపద భూవిభునకుఁ దొల్త పుత్రి
వై పుట్టి పిదపఁ బుత్రాకృతిఁగాంచి శి
ఖండి నామమున నుద్దండ బాహు
బలమునఁ గోదండ పాండిత్యమును బటు
శౌర్యంబు నొప్పఁ బ్రశస్తి కెక్కి
యనిఁజంపఁగల దాన వాతని; నీమాట
దప్పు దూఱదు"మని చెప్పి హరుఁడు
తే. సనియె నా ప్రొద్దు సమిధలు సాలఁ గూడ
వైచి యనలంబు గూర్చి యవ్వనిత.క్రోధ
దీప్త మూర్తియై" భీష్మ వధించు దాన"
ననుచు సొద సొచ్చె మునులకు నద్భుతముగ. 368

అ: ఈ మేను = ఈ శరీరాన్ని; విడిచి; నీవు - ఏఁగిన - అప్పుడు = నీవు వెళ్లిపోయి నపుడు (చనిపోయాక); ద్రుపదభూవిభునకున్ = ద్రుపదమహారాజుకు; తొల్త = మొదట; పుత్రివై పుట్టి = కూతురుగా పుట్టి; పిదపన్ = తరువాత; పుత్ర+ఆకృతిన్+కాంచి = కొడుకు రూపాన్ని పొంది; శిఖండి నామమునన్ = శిఖండి పేరుతో; ఉద్దండ బాహుబలమునన్ = అధికమయిన భుజబలంతోనూ; కోదండ పాండిత్యమును = విలువిద్యలో నేర్పూ; పటుశౌర్యంబున్ = గొప్ప పరాక్రమమూ; ఒప్పన్ = కలిగి; ప్రశస్తికిన్ - ఎక్కి = ప్రసిద్ధివహించి; ఆతనిన్ = ఆ భీష్ముని; అనిన్ = యుద్ధంలో చంపగలదానవు; నీ మాట తప్పదు; ఊఱదుము = ఊరడిల్లుము; అని, చెప్పి; హరుఁడు; చనియెన్ = వెళ్లిపోయాడు; ఆ ప్రొద్దు = ఆ రోజునే; సమిధలు = హోమద్రవ్యమగు కట్టెలు; చాలన్ కూడన్ వైచి = చాలా వేసి; అనలంబున్ + కూర్చి = అగ్నిని ప్రజ్వరిల్లజేసి; ఆ + వనిత = ఆ స్త్రీ (అంబ); క్రోధ దీప్తమూర్తియై = కోపంతో ప్రకాశించే రూపం కలదై; భీష్మున్ = భీష్ముని; వధియించుదానన్ = చంపుతాను; అనుచున్; మునులకున్; అద్భుతముగన్ = ఆశ్చర్యము కల్గునట్లు; సొద చొచ్చెన్ = అగ్నిలో ప్రవేశించెను.

భా : నీవీ శరీరాన్ని విడిచిపోయాక ద్రుపదమహారాజుకు కూతురుగా పుడతావు ముందుగా. తరువాత కొడుకు రూపాన్ని పొందుతావు. శిఖండి అనే పేరుతో భుజబలం కలిగి ధనుర్విద్యలో నేర్పుతో, పరాక్రమముతో ప్రసిద్ధి వహించి భీష్ముని యుద్ధంలో

చంపుతావు. నీ మాట జరిగి తీరుతుంది. ఊరుకో అని చెప్పి శివుడు అంతర్ధాన మయ్యాడు. ఆ రోజే అంబ కోపంతో సమిధలు మరిన్ని చేర్చి "భీష్ముని చంపుతాను." అంటూ అగ్ని ప్రవేశం చేసింది. అది చూసి మునులంతా ఆశ్చర్య పోయారు.

వ : అట్టియెడ ద్రుపదుం డనపత్య యగు తన మహిషి విషాదంబు దీర్పం దివురుటను గాంగేయుతోడి రోషంబునను శివుని నుద్దేశించి తపంబు సేసిన నద్దేవుండు ప్రత్యక్షంబయి వరంబు వేఁడు మనిన భీష్మవధియించు నట్టివాని నొక్క పుత్రుని నొసంగ వలయు ననుడు. 369

అ. అనపత్య = సంతతిలేనిది ; మహిషి = పట్టపురాణి ; తివురుటను = ప్రయత్నించుటచేత.

భా. ఆ సమయంలో ద్రుపదుడు సంతానంలేని తన పెద్దభార్య దుఃఖాన్ని పోగొట్ట బూనుకొని, భీష్మునిపై కోపంతోనూ శివునిగూర్చి తపస్సు చేయగా ఈశ్వరుడు ప్రత్యక్షమై వరాన్ని కోరుకో అనగా భీష్ముని వధించే ఒక్క కుమారుని నా కీయ వలె ననగానే.

తే ॥ కూఁతురై పుట్టి పదపడి కొడుకుఁదనము
గాంచి భీష్ముని నాజిరంగమునఁ జంపు
నట్టి యుజ్జ్వలాపత్యంబు పుట్టు నీకుఁ
దప్పదిది యని రుద్రుండు సెప్పి చనియె. 370

అ. కూతురు + ఐ = కుమార్తెగా; పుట్టి; పదపడి = ఆ తర్వాత; కొడుకు + తనము= కుమారరూపమును ;,కాంచి = పొంది ; భీష్మునిన్ = భీష్ముని ; ఆజిరంగమునన్= యుద్ధరంగమున; చంపు+ అట్టి = సంహరించెడు; ఉజ్జ్వల + అపత్యంబు = శోభిల్లు సంతానము; నీకున్; పుట్టున్; ఇది; తప్పదు; అని; రుద్రుండు; చెప్పి; చనియెన్ = వెళ్ళెను.

భా. కుమార్తెయై పుట్టి తర్వాత కుమారుడై యుద్ధరంగంలో భీష్ముని సంహరించు గొప్ప సంతానము నీకు కల్గుతుంది. దీనికి తిరుగులేదని ఈశ్వరుడు పలికి అంతర్ధాన మయ్యాడు.

వ . ద్రుపదుండును బ్రీతుండయి నిజప్రియకు నవ్విధం బెఱింగించెఁ దదనంతరంబ కాశీశ్వర కన్యక చైతన్యం బుదరంబు ప్రవేశించిన. 371

అ. చైతన్యము = జీవము

భా. ద్రుపదుడు సంతోషించి ప్రియ భార్యకు ఆసంగతి తెలిపాడు. ఆ తర్వాత కాశీరాజు కుమారి యైన అంబ జీవము ద్రుపద భార్య గర్భమున ప్రవేశించింది.

క ॥ పాంచాల రాజ భార్య స
మంచిత గర్భంబుఁ దాల్చి మఱువడఁ గూఁతుం
గాంచి నిజ పతియుఁ దానును
వంచనఁ గొడు కనిరి యెల్ల వారును వినఁగన్. 372

అ. పాంచాలరాజభార్య = ద్రుపదుని పట్టపుదేవి ; సమంచిత = ఒప్పినట్టి ; గర్భంబున్ + తాల్చి = గర్భమును ధరించి ; మఱువడన్ = రహస్యమున ; కూతున్ + కాంచి = ఆడుబిడ్డను కని ; నిజపతియున్ + తానును = తన భర్తయును, తానును ; వంచనన్ = మోసమున ; ఎల్లవారును ; వినగన్ ; కొడుకు + అనిరి = కొడుకని పలికిరి.

భా. *ద్రుపదపత్ని కోకిలాదేవి గర్భవతియై రహస్యంగా కూతురుని కనగ భార్యాభర్త లిరువురును కుమారుడు కల్గినట్లు అందరికీ చెప్పారు.*

వి. పుట్టింది కూతురైనా తర్వాత కుమారుడుగా మారుతుందన్న ఈశ్వర వచనం మీద నమ్మకంతో కుమారుడు కలిగాడని చెప్పారు. కూతురు పుట్టిందని నిజం చెప్పి ఆ తర్వాత ఆ పిల్లకు వివాహం చేసి ఆమె మగవాడైతే కలిగే చీకాకులు ఎక్కువ. కనుకనే కుమారుడు కల్గినట్లు ప్రకటించారు.

వ. ఇట్లు పుట్టిన బిడ్డకుఁ బుత్ర ప్రకారంబున జాతకర్మాది కృత్యంబులు నిర్వర్తించి శిఖండి యను పేరుపెట్టి యతి ప్రచ్ఛన్నంబుగాఁ బెనిచి రహస్యంబు తెఱం గా కన్నియకుం జెప్పి యక్షర శిక్షాదు లాచరించి ద్రోణాచార్యుకడ శస్త్రాస్త్ర పరిశ్రమంబు సేయించుచుండ జవ్వనంబు చేరువకుం దఱి యగుటయు నమ్మగువం జూచి వగచి తల్లి దండ్రులు తమలో విచారించి వేగంబ వివాహంబు సేయవలయు బరమేశ్వరు వరంబు కొఱంత వడునె తన నెఱసి నప్పుడు నెఱయుంగాక యని నిశ్చయించి దశార్ణ దేశాధీశుండగు హేమవర్మయను రాజుకన్యకం దగిన తెఱంగున బాణిగ్రహణంబు సేయించి తెచ్చి యున్నంత. 373

అ. జాతకర్మ + ఆది + కృత్యంబులు = బిడ్డ పుట్టిన వెంటనే చేయు షోడశసంస్కారములు; నిర్వర్తించి = నెరవేర్చి ; ప్రచ్ఛన్నంబుగా = రహస్యముగా ; అక్షర శిక్ష + ఆదులు = విద్యాభ్యాసము మొదలైనవి ; తఱి = సమయము ; వగచి = విచారించి; కొఱంత + పడునె = తప్పునా ; నెఱసినప్పుడు = సిద్ధించినప్పుడు ; పాణిగ్రహణము = వివాహము..

భా. *ఇలా పుట్టిన సంతతికి కుమారునికి వలె జాతకర్మాది సంస్కారములు జరిపించి శిఖండియను పేరు పెట్టి మిక్కిలి రహస్యంగా పెంచి ఆ విషయం ఆ పిల్లకు కూడా చెప్పి విద్యాభ్యాసాదులు జరిపించి ద్రోణుని యొద్ద శస్త్రాస్త్ర విద్యా పరిశ్రమ చేయింప సాగెను. యౌవన వంతురాలు కాబోతుండగా ఆమెను చూచి తల్లిదండ్రులు త్వరలో ఈమెకు వివాహం చేయాలని అనుకొని పరమేశ్వరు డిచ్చిన వరం తప్పుతుందా ? సిద్ధించి నప్పుడే సిద్ధిస్తుంది అని నిశ్చయించి దశార్ణదేశా న్నేలు హేమవర్మ కుమార్తెతో పాణిగ్రహణం జరిపించి ఇంటికి తీసికొని వచ్చారు.*

ఆ॥ అక్కుమారి చతుర యగుట శిఖండి వ
వర్తనము నెడఁ బ్రమాదమున నెఱింగి

యుగ్గడింప నొల్ల కూరక యెఱుఁగని
యదియ పోలె నుండె నాత్మ నొచ్చి. 374

అ. ఆ + కుమారి = ఆ హేమవర్మ కుమార్తె; చతుర+అగుటన్ = నిపుణురాలవుటచేత; శిఖండి+ వర్తనమున్ = శిఖండి ప్రవర్తనము ; ఎడన్ + ప్రమాదమునన్ = మనస్సున ఏమరియుండుటచేత ; ఎఱింగి = గ్రహించి; ఉగ్గడింపన్ + ఒల్లక = వెల్లడించడానికి ఇష్టపడక; ఆత్మన్ + నొచ్చి = మనస్సులో బాధపడి ; ఊరక ; ఎఱుఁగని + అదియ + పోలెన్ = తెలియనిదివలె; ఉండెన్ = ఉండిపోయింది.

భా. *హేమవర్మ కుమార్తె చాలా చతురురాలు. శిఖండి ఏమరుపాటు చెందినపుడు ఆమె నిజస్వరూపం గ్రహించి, మనసులో నొచ్చుకొని, పైకి చెప్పకుండా ఎరుగని దానివలె ఉండిపోయింది.*

వి. "తతఃసా వేద తాం కన్యాం కంచిత్కాలం స్త్రియంకిల"

అత్యల్పకాలంలోనే శిఖండి స్త్రీ అని ఆమె గ్రహించిది' అనిమూలం. శిఖండిని స్త్రీగా గ్రహించడానికి హేమవర్మ కూతురుకి ఎంతో కాలమక్కరలేదు. ప్రవర్తనలో ఎంత జాగ్రత్తగా ఉన్నా సాన్నిహిత్యం చేత గ్రహించవచ్చు. లోకం గ్రహించలేని సత్యాన్ని ఈమె శిఖండి ఏమరిన కారణంగా గ్రహించిందని భావం .

వ. **ఇట్లు దశార్ణ విభుపుత్రి యెఱింగి శిఖండి పురుషుండుగామి దన దాదికిం జెప్పిన నదియు నప్పు డన్నరనాథున కెఱింగించి పుచ్చిన నతండు విషాదరోషంబుల నొంది దూతం బుత్తెంచిన వాఁడు వచ్చి పాంచాల పతిం గాంచి యిట్లనియె. 375**

అ. ఎఱింగించి పుచ్చినన్ = తెలిపి పంపగా

భా. *ఇలా దశార్ణ దేశాధిపతి కూతురు శిఖండి పురుషుడు కాదని గ్రహించి తన దాదికి చెప్పగా; అది తన రాజుకు తెలుప పంపగా; అది విని ఆతడు ఒక వంక దుఃఖము, మరోవంక కోపమూ కలిగి దూతను పంపగా; ఆతడు వచ్చి ద్రుపదుని చూచి యిలా అన్నాడు.*

చ॥ **కొడుకని చెప్పి యిట్లగునె కూఁతు వివాహము సేయ, దీన నీ**
పడసిన లాభమేమి? నగుఁబా టగు నింతియ కాక, యెల్ల నే
ర్పడ నెఱుఁగంగ వచ్చితి, నరాతిభయంకరు హేమవర్మ నా
గడమున గాసిచేసితి, మగంటిమి నీ దెసనైనఁ జూపుమా. 376

చ॥ కొడుకు + అని = కుమారుడని ; చెప్పి ; ఇట్లు ; కూతున్ = కుమార్తెను ; వివాహము + చేయన్ = పెండ్లిచేయుట ; అగును + ఎ = తగునా ; దీనన్ = దీనిచేత ; నీపడసిన = నీవు పొందిన ; లాభము + ఏమి = ప్రయోజనమేమున్నది ; నగుఁబాటు + అగు = అపహాస్యత కలుగును ; ఇంతియకాక = ఇంతేకాని ; ఎల్లన్ = అంతయును ; ఏర్పడన్ = స్పష్టముగా , ఎఱుఁగంగన్ + వచ్చితిన్ = తెలియవచ్చితిని ; అరాతి + భయంకరున్ = శత్రుభీకరుడైన ; హేమవర్మన్ = హేమవర్మను ; ఆగడమునన్ = కూడని పనిచేత ; గాసి + చేసితి = బాధపెట్టితివి ; మగంటిమిన్ = మగతనమును /పౌరుషమును ; నీ దెసన్ + ఐనన్ = నీయందైనను ; చూపుము + ఆ = చూపింపుము.

భా . కొడుకని చెప్పి కుమార్తె నిచ్చి వివాహం చేయడం నీకు భావ్యమా : అపహాస్యం పాలుకావటం తప్ప దీనివల్ల నీవు పొందిన ప్రయోజనమేమిటి ? అంతా వివరంగా తెలుసుకోడానికే వచ్చాను. శత్రుభయంకరుడైన ఈ హేమవర్మను అకార్యమొనర్చి బాధపెట్టావు. మగతనాన్ని నీ యెడనైనా చూపించు.

వి . " మగంటిమి నీ దెసనైన చూపుమా" నీకుమారునిలో మగటిమి నీవెలాగైనా చూపలేవు. నీవు చేసిన అకార్యానికి సుప్తసింహంవంటి హేమవర్మ వేచి ఆగ్రహోదగ్రుడయ్యాడు. కనుక పౌరుషం, మగతనం నీవైనా, నీ విషయంలో నైనా ప్రదర్శించు అన్న దూతపలుకు పద్యానికి కొసమెరుపువంటిది.

ఆ ॥ అనిన నగుచు వాని కను ద్రుపదుం డివి
యేటి మాట లిట్టు లేల చేయ
వచ్చు నింత వెఱ్ఱివారును గలరె? యి
త్తెఱంగు పొసఁగకునికి యెఱుఁగరాదె! 377

అ . అనిన్ = అనగా ; నగుచున్ = నవ్వుచు ; వానికిన్ = ఆ దూతకు ; ఇట్టులు = ఈ విధముగా ; ఏల = ఎందుకు ; చేయవచ్చున్ = చేయవలె ; ఇంత ; వెఱ్ఱి వారును ; కలరె = ఉన్నారా ; ఈ + తెఱఁగు = ఈ పద్ధతి ; పొసఁగక + ఉనికి = ఒప్పకుండుట ; ఎఱుఁగరాదె = తెలియవద్దా ?

భా . అనగా ద్రుపదుడు నవ్వుతూ ఆ దూతకిలా అన్నాడు. ఇవేమి మాటలు ఇలా ఎందుకు చేస్తాము ? అంత వెఱ్ఱివా రుంటారా ? ఇది కుదరని విషయమని తెలుసుకోవద్దా ?

వి . ద్రుపదుని మేధాసంపద ఈ నటన వల్ల తెల్ల మవుతుంది.

వ ॥ అని వెండియు నేర్పునం దీర్పు మాట లనేకంబు లాడి నిక్కం బరయం జూచిన వానికిం జొరవ యీక త్రోపు సేసి వీడ్కొలిపి పుచ్చినం బోయి వాఁడును నిజనాథున కవ్విధంబు విన్నవించిన. 378

అ . వెండియు = మరల ; తీర్పు మాటలు = వివాద పరిష్కారపు మాటలు ; చొరవ = ప్రవేశము.

భా . అని ఇంకా తెలివిగా వివాద పరిష్కార వచనా లనేకం పలికి వాస్తవం పరిశీలించి తెలుసుకో దలచిన వాని కవకాశమీయక త్రోసిపుచ్చి సాగనంపగా వాడు వెళ్ళి తమ మహారాజుకు ఆ సంగతంతా వివరించాడు.

వి . ద్రుపదునికి ప్రస్తుతం అవసరమైనది కాలయాపన. కూతురు కొంత కాలానికి కొడుకుగా మారుతుందన్న ఈశ్వర వరంమీద విశ్వాస మున్నది గదా ! అందుకే అంత ధైర్యంగా తాత్కాలికోపశమన వాక్యాలు చెప్పి పంపివేశాడు.

క ॥ కోపోద్రేకంబున నతఁ
డా పాంచాల పతిమీఁద నతులిత సైన్యా
టోపమున వచ్చి పురపరి
ఖా పరిసర తలము చుట్టుఁ గైకొని విడిసెన్. 379

అ. కోప + ఉద్రేకంబునన్ = కోపాతిశయముచేత ; అతఁడు ; ఆ పాంచాల పతిమీదన్ = ద్రుపదునిపై ; అతులిత = సాటిలేని; సైన్య + ఆటోపమునన్ = సైన్యాతిశయంతో ; వచ్చి= దండెత్తివచ్చి ; పుర = ద్రుపద రాజధానియొక్క ; పరిఖా = అగడ్త యొుక్క ; పరిసరతలము + చుట్టు = సమీప ప్రదేశం చుట్టూ; కైకొని = ఆక్రమించుకొని ; విడిసెన్ = నిలిచెను.

భా. *హేమవర్మ కోపాతిశయంతో గొప్ప సేనతో ద్రుపదుని నగరంపై దండెత్తివచ్చి అగడ్త సమీపభాగంలో చుట్టూ విడిశాడు.*

వ ॥ ఇట్లు విడిసిన. 380

భా. *ఇలా బసచేయగా*

ఆ ॥ పట్టువడ్డ ముచ్చు పగిదిఁ బాంచాల భూ
నాయకుండు దనకు నానచేటు
రాక కుమ్మలించి యేకాంతమునఁ బత్ని
యొక్కతియును గొల్వ నూరకుండె. 381

అ. పట్టు + పడ్డ = చేచిక్కిన ; ముచ్చుపగిదిన్ = దొంగవలె ; పాంచాల భూనాయకుండు = ద్రుపదమహారాజు ; తనకున్ = తనకు ; నానచేటు+రాకకున్= సిగ్గుచేటు అయినందుకు; ఉమ్మలించి= బాధపడి; ఏకాంతమునన్= రహస్య ప్రదేశంలో; పత్ని+ఒక్కతెయును = భార్య ఒక్కతే; కొల్వన్= తనను సేవింపగా; ఊరకయుండెన్= ఊరకే ఉన్నాడు.

భా: *దొరికిన దొంగలా ద్రుపదమహారాజు తనకు సిగ్గు చేటయి, అవమానమూ కీడూ కలిగినందుకు కలతచెంది భార్య సేవిస్తుండగా ఏకాంతంలో ఉండి పోయాడు.*

వి. ద్రుపదుని పట్టుబడ్డ దొంగతో పోల్చారు. ప్రస్తుత స్థితిలో ఉభయులకూ అవమానం జరుగుతుంది. కీడూ కలుగుతుంది. కాదనడానికి అవకాశం లేని పరిస్థితి. కనుక ద్రుపదుడు ఏకాంతంలో ఉండిపోయాడు.

వ. తదీయదండనాథులు సమరోత్సాహంబునం బ్రవర్తిల్లి రంత సూర్యాస్తమయ సమయం బగుటయు రెండు వీళ్లును భండనంబు తోడి వేడుకం జేసి వేగుటకు వేచియుండె. 382

అ. తదీయ + దండనాథులు = ద్రుపదుని సేనాధిపతులు ; రెండు వీళ్లును = ఉభయసైన్యములు ; భండనంబు = యుద్ధము ; వేగుటకు = తెల్లవారుటకు.

భా. *ఆ ద్రుపదుని సేనానులు యుద్ధోత్సాహముతో నున్నారు. సూర్యుడస్తమించే సమయం కాగా రెండు సేనలు యుద్ధంపై మక్కువతో సూర్యోదయాన్ని నిరీక్షింప సాగినారు.*

క. అప్పుడు శిఖండి మరణము
దప్పఁగ సడి కొండు ప్రతి విధానము సేయం
జొప్పడమిఁ దలఁచి యొరులకుఁ
జెప్పక వెస నరిగెఁ బురము చెంత యడవికిన్. 383

అ. అప్పుడు = ఆ సమయమున ; శిఖండి ; మరణము + తప్పఁగ = చచ్చుట తప్ప ; సడికిన్ = నిందకు ; ఒండు + ప్రతివిధానము = మరియొక ప్రతిక్రియ; చేయన్ + చొప్పడమిన్ = చేయుటకు శక్యం కాకపోవుటను ; తలఁచి = ఆలోచించి ; ఒరులకున్ = ఇతరులకు ; చెప్పక ; పురముచెంత + అడవికిన్ = నగరసమీపముననున్న అడవికి ; వెసన్ + అరిగెన్ = శీఘ్రముగా వెళ్ళెను .

భా. *అప్పుడు శిఖండి తాను మరణించడం తప్ప వచ్చిన నిందకు వేరు ప్రతిక్రియ లేదని తలచి యెవరికీ చెప్పకుండా నగరానికి దగ్గరలో నున్న అడవికి వెళ్ళిపోయాడు.*

-: శిఖండి యక్షుని వలన పురుషత్వంబు నొందిన వృత్తాంతము :-
(సం 5-192-20)

వ. అవ్విపినంబు స్థూలకర్ణుండను నొక్కయక్షునికి నివాసంబై యునికిం జేసి నిర్జనంబై యుండు; శిఖండియు నత్తెఱం గెఱుంగుం గావున నతని నుద్దేశించి యందుఁ జొచ్చి తత్ప్రదేశంబున మహనీయ సుందరంబగు తదీయ మందిరంబున కరిగి యచ్చటఁ బ్రాణవియోగం బగువిధం బాచరింపం బూనిన. 384

అ . ప్రాణ వియోగంబు + అగు విధంబు = ప్రాణములు పోయే విధానము

భా . *ఆ అరణ్యము స్థూలకర్ణుడనే యక్షునికి నివాసస్థానమైన కారణంగా నిర్మానుష్యంగా ఉంటుంది. శిఖండి ఆ విషయ మెరిగిన వాడవటంచేత ఆతనికోసం ఆ అరణ్యంలోకి పోయి, అక్కడ మహత్తరమూ, సౌందర్యవిలసితము ఐన ఆతని భవనం లోకి వెళ్ళి ప్రాణాలు విడిచే ప్రయత్నం చేయబోయాడు.*

ఉ. యక్షుఁ డెఱింగి వచ్చి యిటు లాఱడి చావఁగ నేల చెప్పు మ
బ్జాక్షి భవన్మనోరుజకు నౌషధ మే నొనరింతు నన్న ఫా
లాక్షుఁడు దక్క నొడ్లకును నా పని సేయఁగ రాదు నాదు చి
త్రక్షతి పుంస్త్వ మేను దగఁ దాల్చక మానదు గుహ్యకోత్తమా! 385

అ . యక్షుఁడు = స్థూల కర్ణుఁడు ; ఎఱింగి + వచ్చి = ఆ విషయమును తెలిసి కొనివచ్చి ; ఇటు = ఈ విధంగా ; ఆఱడిన్ = వ్యర్థముగా ; చావఁగన్ + ఏల = చావనేల ; అబ్జాక్షి = తామరపూలవంటి కనుల గల ఓ చిన్నదానా! ; చెప్పుము = చెప్పు ; భవత్ + మనః +

రుజకున్ = నీ మనోవ్యాధికి ; ఏన్ = నేను ; ఔషధమున్ = మందును ; ఒనరింతున్ = ఒనగూర్తును ; అన్నన్ = అనగా ; ఫాల + అక్షుఁడు + తక్క = ఈశ్వరుడు తప్ప ; ఒడ్లకును = ఇతరులకు ; ఆపని ; చేయఁగన్ + రాదు; గుహ్యకోత్తమా = ఓ యక్షశ్రేష్ఠుడా ; నాదు + చిత్తక్షతి = నా మనస్సు నందలి గాయము ; ఏను ; పుంస్త్వమున్ = మగతనమును; తాల్పక = పూనక; మానదు .

భా. యక్షు డావిషయం తెలుసుకొని వచ్చి ఓ పద్మేక్షణా ! ఇలా వ్యర్థంగా నీ వెందుకు ప్రాణాలు విడువదలచావో చెప్పు. నీ మనోవ్యథను నే తొలగిస్తాను అన్నాడు. ఆ మాటలు విన్న శిఖండి ఈశ్వరుడు తప్ప మరొక రాపని చేయలేరు. నేను మగతనం పొందక నామనస్సులోని గాయం నయంకాదు.

క ॥ **అని తన వృత్తాంతం బా**
తని కెఱిఁగించుటయు నతఁడు దనదగు చిత్తం
బునఁ గరుణ వుట్టి యెంతటి
పని యిది యే నిత్తు సమయ పరిపాలనతోన్. 386

అ . అని ; తన వృత్తాంతంబు = తన సంగతి ; ఆతనికిన్ = ఆ స్థూలకర్ణునకు ; ఎఱింగించుటయున్ = చెప్పగా ; ఆతఁడున్ = ఆతడుకూడా ; తనది + అగు= తనదైన ; చిత్తంబునన్ = మనసున ; కరుణ + పుట్టి = దయకలిగి ; ఇది ; ఎంతటి + పని ; సమయపరిపాలనతోన్ =నియమ పాలనతో ; ఏన్ + ఇత్తు = నేనిస్తాను .

భా . అని శిఖండి తన వృత్తాంతమంతా స్థూల కర్ణుడికి తెలియజేయగా ఆతనికి దయకలిగి 'అదెంతపని' ఒక షరతుపై నేనిస్తాను.

క ॥ **నా పురుషత్వము గైకొని**
వేపోయి దశార్ణపతికి వెలయించిన మీ
యాపదలు దొలఁగి చనఁ బొడ
సూపుము పదినాళ్ళ యంత సూనృత మొప్పన్. 387

అ . నా + పురుషత్వమున్ = నా మగతనమును ; కైకొని = గ్రహించి ; వేపోయి = శీఘ్రముగా వెళ్ళి ; దశార్ణపతికిన్ = హేమవర్మకు ; వెలయించిన = ప్రకటించిన; మీ + ఆపదలు; తొలఁగిచనన్ = తొలగిపోగా ; పదినాళ్ళ + అంతన్ = పది రోజుల తర్వాత ; సూనృతము + ఒప్పన్ = సత్యనిష్ఠతో ; పొడసూపుము = కనిపించు.

భా . నా మగతనం తీసుకొని పోయి హేమవర్మ ముందు వెల్లడించి మీ కష్టాలు తీరిన పదిరోజుల తర్వాత అన్నమాట ప్రకారం సత్యవ్రతుడవై నా దగ్గరకు రా .

వి . సత్యవాక్యపరిపాలనపై ఆనాటి వారికంత విశ్వాసము . శిఖండి రాకపోతే స్థూలకర్ణుడు శాశ్వతంగా స్త్రీరూపంతో ఉండాలి. శిఖండి అలాంటి పనిచేయడు. సత్యంపట్ల భక్తి విశ్వాసాలు ఉభయులకూ ఉన్నాయి.

క ॥ అం తవు నంతకు నీ దగు
కాంతా రూపంబు నేను గైకొనియెద ని
శ్చింతమున మగుడఁ జను మని
యింతికిఁ బురుషత్వ మిచ్చె నెంతయు వేడ్కన్. 388

అ . అంత + అవునంతకున్ = అంతవరకు ; నీ దగు = నీ యొక్క ; కాంతారూపంబున్ = స్త్రీ రూపమును ; ఏను = నేను ; కైకొనియెదన్ = స్వీకరింతును ; నిశ్చింతమునన్ = విచార రహితుడవై ; మగుడన్ + చనుము = తిరిగివెళ్ళు ; అని ; ఇంతికిన్ = శిఖండికి ; ఎంతయున్ + వేడ్కన్ = ఎంతో సంతోషముతో ; పురుషత్వమున్ + ఇచ్చెన్ = తన మగతనమును నిచ్చెను.

భా . అంతదాకా నీ స్త్రీ రూపాన్ని నేను ధరిస్తాను. నిశ్చింతగా నీవు తిరిగి వెళ్లు. అని అమితానందంతో స్థూలకర్ణుడు శిఖండికి తన పుంస్త్వ మిచ్చాడు.

వి . స్థూలకర్ణుడు యక్షుడు. దేవతలలో ఒక జాతికి చెందిన వాడు. కనుక తన పుంస్త్వమును శిఖండి కిచ్చి తాను స్త్రీత్వాన్ని తీసికొనగలిగాడు.

తే ॥ ఇచ్చి తాను భామాకృతి నెలమిఁ దాల్చి
వీడుకొల్ప శిఖండియు వీటికేఁగు .
దెంచి నిజమందిరంబు సొత్తెంచి తల్లి
దండ్రులకు మ్రొక్కి నిలిచి ముదం బెలర్ప. 389

అ. ఇచ్చి; తాను ; భామా + ఆకృతిన్ = స్త్రీ రూపాన్ని ; ఎలమిన్ + తాల్చి = ప్రీతితో ధరించి; వీడుకొల్పన్ = సాగనంపగా ; శిఖండియున్ ; వీటికిన్ + ఏఁగుదెంచి = నగరానికి వచ్చి; నిజమందిరంబు చొత్తెంచి = తన మందిరం ప్రవేశించి ; తల్లి + తండ్రులకున్ ; మ్రొక్కి = నమస్కరించి ; నిలిచి ; ముదంబు + ఎలర్పన్ = సంతోష మతిశయింపగా.

భా . ఇచ్చి స్థూలకర్ణుడు తాను స్త్రీ రూపాన్ని ఆనందంగా గ్రహించి శిఖండిని సాగనంపగా ఆతడు తన నగరానికి వచ్చి తల్లి దండ్రులకు నమస్కరించి నిలిచి ఆనందాతిశయంతో -

వి . తిక్కన ఔచిత్యాన్ని పాటించి ఆ రాత్రికి రాత్రే శిఖండిని యింటికి రప్పించాడు.శిఖండి స్థూలకర్ణుల మధ్య జరిగిన సంఘటనమంతా సూర్యాస్తమయ సూర్యోదయాల మధ్య కాలంలో జరిగినట్లు చెప్పాడు.

మూలంలో ఎన్నో రాత్రులు శిఖండి ఆహారం విసర్జించి శుష్కించినట్లుంది. ఇంటిచుట్టూ శత్రుసేన విడిసి యుండగా వెళ్ళిన శిఖండి అక్కడ ఉపవాసాలు చేసి, శుష్కించి స్థూలకర్ణుని దృష్టిపడి పుంస్త్వమందుకొని తిరిగి వచ్చే వరకూ సైన్యం ఊరుకుంటుందా ? అంతకుమించి ద్రుపదుని పరువు దెబ్బతినదా? కనుక తిక్కన తెల్లవారేసరికి శిఖండిని ఇంటికి రప్పించాడు. ప్రాణ వినాశానికి ఉపవాసాలే అక్కరలేదు. కనుక " ప్రాణ వియోగంబగు విధం బాచరింప బూనిన" అని వ్రాశారు. తెల్లవారిన తర్వాత శిఖండి పుంస్త్వాన్ని ప్రదర్శించి హేమవర్మ ఆగడాన్ని నిరోధించాడు. ఇది ఎంతైనా సముచితంగా ఉంది.

క : తన తెఱఁ గంతయు నెఱిఁగిం
చిన నద్భుత హర్ష మగ్న చేతసులై త
జ్జననీ జనకులు బహు విధ
వినుతులఁ గొనియాడి రంత వేకువ యయ్యెన్. 390

అ : తన + తెఱఁగు + అంతయున్ = తన సంగతినంతా ; ఎఱిఁగించినన్ = తెలుపగా ; అద్భుత + హర్ష + మగ్న + చేతసులై = ఆశ్చర్య ఆనందములతో మునిగిన మనస్సులు గలవారై ; తత్ + జననీ జనకులు = ఆతని తల్లిదండ్రులు ; బహువిధ + వినుతులన్ = అనేక విధాలైన అభినందనలతో ; కొనియాడిరి = ప్రస్తుతించారు ; అంతన్ = అంతలో ; వేకువ + అయ్యెన్ = ప్రభాతమైనది.

భా : *తన సంగతంతా చెప్పగా విని ఆనందాశ్చర్యాలతో మునక లేసిన శిఖండి తల్లి దండ్రులు ఆతని ననేక విధాలుగా స్తుతించారు. అంతలో తెల్లవారింది.*

వి : శిఖండికి లభించిన పుంస్త్వమువల్ల ద్రుపదుడికి అవమానమూ, చేటూ తప్పాయి. శిఖండి భార్య మనఃక్లేశం తొలగిపోయింది. ఆందోళనతో సతమతమవుతున్న కుటుంబానికి శాంతి లభించింది. ఈశ్వరుడిచ్చిన వరం ఈ శాపంతో ఈనాటికి ఫలించింది. శాశ్వత పరిష్కారం దొరికింది. ఇదంతా శిఖండి తనకు తానే సాధించింది. దానికి ఎంతగా ప్రస్తుతిస్తే సరిపోతుంది. ఇది ఎంతటి ఆనందప్రదమైన ఘటన. అందువల్ల వారికి ఆశ్చర్యము, ఆనందము కలిగాయి. శిఖండికి అభినందన పరంపర లభించింది.

వ : తదనంతరంబ సూర్యోదయం బగుటయుఁ గాలోచితకరణీయంబులు నిర్వర్తించి పాంచాల విభుండు సంబంధితో వలయు మాటలాడం దగువారలం బనిచి రావించి సంభ్రమంబు లేక వేగిరపడక నాగరిక ప్రకారంబున శిఖండి పురుషత్వంబు దేటపఱిచి యతని మాట గీడ్పఱిచి సపరివారంబుగా నద్దశార్ణపతికి విందు వెట్టి కట్టనిచ్చి యతని యనునయాలాపంబులు గైకొని యనిచి పుచ్చిన నతండు తన్నుం దాను నిందించుకొనుచు నిజపురంబునకుం బోయె నట్టియెడ నయ్యక్షవరు మందిరంబు చక్కటికిం గ్రీడార్థంబు గిన్నర విభుండు విమానారూఢుండయి చని దాని యొప్పు గనుంగొని యగ్గించుచు నిల్చి యొక్కింత సేపునకుం జుట్లు నున్న గుహ్యకులతో నిట్లనియె. 391

అ : కాలోచిత + కరణీయంబులు =కాలానికి చేయదగ్గ పనులు ; సంబంధితోన్ = బంధువునితో (వియ్యంకునితో) ; సంభ్రమంబు = భయము ; వేగిరపడక = త్వరపడక ; నాగరిక + ప్రకారంబునన్ = గౌరవప్రదమైన రీతిచేత ; కీడ్పఱచి = తక్కువచేసి.

భా : *ఆ తర్వాత ద్రుపదుడు సూర్యోదయం కాగానే అప్పటికయిన పనులు పూర్తి చేసికొని వియ్యంకునితో మాట్లాడడానికి తగినవారిని పంపి రప్పించాడు. భయంకాని, తొందరపాటుకాని లేకుండా ద్రుపదుడు హుందాగా శిఖండిపుంస్త్వాన్ని ప్రకటించి ఆతని ఆరోపణను అర్థరహితం చేసి హేమవర్మకు సపరివారంగా విందిచ్చి నూతన వస్త్రాలిచ్చి*

సత్కరించాడు. హేమవర్మ తన తప్పిదానికి ప్రార్థన పూర్వకంగా పలికిన మాట లాలించి ఆతని సాగనంపాడు. హేమవర్మ తనను తాను నిందించు కొంటూ తన నగరానికి వెళ్లాడు. ఆ సమయంలో కుబేరుడు విహారార్థంగా విమానమెక్కివస్తూ స్థూలకర్ణుని మందిరసమీపానికి వచ్చి ఆ మందిరం యొక్క అందచందాలను చూచి చుట్టు ఉన్న యక్షులతోఇలా అన్నాడు.

క : మన మిచట నిలిచి యుండఁగ
మనమున శంకింప కిట్లు మసలినవాఁ డీ
తని గర్వమేల యిక్కఁడ
జను దేరక నిల్చు టెట్లు సైఁపగ వచ్చున్? 392

అ : మనము ; ఇచటన్ ; నిలిచి + ఉండఁగన్ = వేచియుండగా ; మనమునన్ ; శంకింపక = సంకోచింపక ; ఇట్లు ; మసలినవాఁడు = ఆలసించిన వాడు ; ఈతని + గర్వము = ఈతని అహంకారం ; ఏల = ఎందులకు ; ఇక్కడన్ =ఇక్కడకు ; చనుదేరక = రాక ; నిలుచుట = ఉండుట ; ఎట్లు ; సైపఁ గన్ + వచ్చున్ = సహింపనగును.

భా : మనమిక్కడ ఆగియుండగా మనస్సులో సంకోచమే మాత్రము లేకుండా ఇట్లు ఆలస్యంచేసిన యాతనికీ గర్వమెందుకు ? ఈతడు ఇక్కడకు రాకపోవడాన్ని సహించడ మెలా?

వి : ఆయిల్లు స్థూల కర్ణుని దని కుబేరునికి తెలుసు. ప్రభువులు వచ్చిన వెంటనే సేవకులు వారి దర్శనం చేయడం మర్యాద.

వ : అని పలికి యలుక మొగంబున ముడివడ నున్నంతఁ గిన్నరులా గుహ్యకు నరసి తద్వృత్తాంతం బంతయు నెఱింగించి దేవా! సిగ్గు పెంపున రానేరకున్న వాఁడని విన్నవించిన. 393

అ : ముడివడు = వ్యాపించు

భా : అలా పలికి ముఖాన కోపం కన్పిస్తూఉండంగా చూచి కిన్నరు లాయక్షుని విచారించి వచ్చి అతని వృత్తాంత మంతా తెలిసి 'ప్రభూ ! లజ్జాతి శయంచేత రాలేకున్నా' డని విన్నవించగా -

ఆ : అయిన నేమి పిలువుఁ డని పిలిపించిన
వచ్చి మ్రొక్కుటయును వనిత యైన
యతనిఁ జూచి యింక నవు దాని కిట్టుల
యుండుఁ గాక యని విభుండు పలికె. 394

అ : అయినన్ + ఏమి = ఐతేమాత్రమేమి ; పిలువుఁడు = ఆతని పిలువుడు; అని; పిలిపించినన్ ; వచ్చి; మ్రొక్కుటయును = నమస్కరింపగా ; వనిత + ఐన + అతనిన్ + చూచి + ఇంకన్; అవుదానికిన్ = కాబోవుదానికి గాను ; ఇట్టులు + అ = ఇట్లాగనే ; ఉండున్ + కాక = ఉండనీ ; అని ; విభుండు = కుబేరుడు ; పలికెన్ = అనెన్

భా : అయితే ఏమి ? పిలవండి అని పిలిచి రప్పించగా వచ్చి స్థూల కర్ణుడు నమస్కరించాడు. వనితయైన అతన్ని చూచి యిక మీద కూడా కాబోయే దానికి ఈతడిట్లే ఉండుగాక అని కుబేరుడు పలికాడు.

వి : ఈశ్వరుడు ద్రుపదుడికి పుత్రిక జన్మించి తర్వాత పుత్రుడవు తాడనీ, అంబకు ద్రుపదుడికి జన్మించి భీష్మమరణానికి కారణ మవుతాడనీ వరాలిచ్చాడు.

ఆకారణంగా భీష్మవధకోసం, అంగనాపూర్వుడైన శిఖండికోసం నీవు స్త్రీత్వాన్నే పొంది యుండుమని యక్షుడు శపించాడు.

-: స్థూల కర్ణునకుఁ గుబేరుని వలన స్త్రీత్వము కలుగుట :- (సం . 5-193-39)

వ : స్థూలకర్ణుండును దలరి దండ ప్రణామంబు సేసియుండె నప్పుడు గొలిచియున్న దొరలు ధనదునకుం గృపవుట్ట నల్లన తెలిపిన నట్లేని వీఁడు శిఖండి యాయువు గలంత గాలంబును గాంతాకృతియై యుండి పదంపడి నిజరూపంబు దాల్చుంగాక యని యనుగ్రహించి యరిగిన. **395**

అ : తలరి = భయపడి ; అల్లనన్ = మెల్లగా ; కాంతాకృతియై = స్త్రీరూపం కలిగి ; పదంపడి = తర్వాత ; ధనదుఁడు = కుబేరుడు ; దండ + ప్రణామంబు = దండమువలెపడి నమస్కరించుట.

భా : స్థూల కర్ణుడు భయపడి కుబేరునకు సాష్టాంగనమస్కారం చేశాడు. అక్కడనున్న పెద్దలు కుబేరుడికి దయగలిగేలా నెమ్మదిగా చెప్పగా 'అట్టయితే వీడు శిఖండి జీవించినంతవరకూ స్త్రీగా ఉండి ఆపైన స్వస్వరూపాన్ని పొందుగాక' అని అనుగ్రహించి వెళ్ళాడు.

తే : గుహ్యకుండు విషాదంబు గూరి యుండ
నచ్చటికిఁ గొన్ని దినముల కరుగుదెంచెఁ
దల్లిదండ్రుల కెఱిఁగించి తగవు మెఱయ
సమయనిష్ఠ వాటించి పాంచాల సుతుఁడు. **396**

అ : గుహ్యకుండు = యక్షుడైన స్థూలకర్ణుడు ; విషాదంబు =దుఃఖము ; కూరి + ఉండన్ = కలిగి యుండగా ; అచ్చటికిన్ = ఆతావునకు ; కొన్ని దినములకున్ = కొన్ని నాళ్ళకు; పాంచాల సుతుఁడు = ద్రుపద నందనుడైన శిఖండి ; తల్లిదండ్రులకున్ ; ఎఱిఁగించి = తెలిపి; తగవు + మెరయన్ = న్యాయమొప్పగా ; సమయనిష్ఠన్ = ఒప్పందము నందలి శ్రద్ధతో ; అరుదెంచెన్ = వచ్చాడు.

భా: *స్థూలకర్ణుడలా దుఃఖిస్తుండగా కొన్ని రోజుల తర్వాత శిఖండి తల్లిదండ్రులతో చెప్పి అనుకొన్న ఒప్పందం ప్రకారం న్యాయంగా స్థూలకర్ణుడి దగ్గరకు వచ్చాడు.*

క: **వచ్చినఁ గనుఁగొని నీదెసఁ**
బొచ్చెము లే దిట్ల మగిడి పొ మ్మిది విధి నీ
కిచ్చిన రూపని గుహ్యకుఁ
డచ్చుపడం బలికి యెల్ల నతనికి జెప్పెన్. 397

అ: వచ్చినన్=శిఖండిరాగా; కనుఁగొని=చూచి; నీదెసన్=నీయెడ; పొచ్చెము+లేదు=దోషములేదు; ఇట్లు+అ=ఇలానే; మగిడిపొమ్ము=వెనుదిరిగిపో; ఇది=ఇది; విధి=దైవము; నీకున్; ఇచ్చిన-రూపము=ఒసగినట్టి ఆకారము; అని; గుహ్యకుండు; అచ్చుపడన్=స్పష్టముగా; పలికి; ఎల్లన్=అంతయు; అతనికిన్; చెప్పెన్;

భా: *శిఖండిగా చూచి స్థూలకర్ణుడు 'నీయెడ దోషంలేదు. వచ్చినట్లే వెనుదిరిగిపో. దైవమే నీకీ రూపమిచ్చాడు'అని స్పష్టంగా విషయ మంతా శిఖండికి వెల్లడించాడు.*

వి: ఇటువంటి ఘటనలనే దైవికాలంటారు. ఎరవుతీసికొన్న పుంస్త్వము దైవానుగ్రహంచేత శాశ్వతంగా నిలిచింది. దానికి శిఖండి సత్యవర్తన మానవ ప్రయత్నమైతే కుబేరునిశాపం దైవమై కలసి వచ్చింది.

ఈశ్వరానుగ్రహం వల్ల అంబ అంగనాపూర్వుడైన శిఖండిగా భీష్ముని ముందుకు రావాలి. అర్జునుడు కొట్టాలి. భీష్మమృతికి కారణం కావాలి కదా!

వ: **చెప్పి వీడుకొలిపిన శిఖండి యత్యంత ప్రమోదంబునం దండ్రికడకు వచ్చి యత్తెఱం గెఱింగించిన నాతండు ప్రీతుండయి దేవగురు ద్విజపూజనంబు లాచరించి ద్రోణాచార్యుపాల సవిశేషంబుగా శిష్యభావంబు ప్రతిష్ఠించె.** 398

అ: వీడుకొలిపినన్=సాగనంపగా; ప్రమోదంబునన్=సంతోషముతో; సవిశేషంబుగాన్ = ఘనంగా; ద్రోణాచార్యుపాలన్=ద్రోణునియొద్ద.

భా: *అలాచెప్పి సాగనంపగా శిఖండి అమితానందముతో తండ్రి దగ్గరకు వచ్చి ఆ విషయమంతా చెప్పగా ఆతడుకూడా సంతోషించి దేవబ్రాహ్మణగురు పూజచేసి ద్రోణునియొద్ద శిష్యునిగా చేర్పించినాడు.*

క: **అనిచెప్పి నారదుఁడుఁ దా**
నును సత్యవతీసుతుండునుం దమ యిచ్చం
జనిరి శిఖండి చరిత్రము
జనకర్ణపరంపరం బ్రశస్తం బయ్యెన్. 399

అ: అని+చెప్పి=అని తెలిపి; నారదుఁడున్=నారదుడుకూడా; తానును; సత్యవతీసుతుండునున్=వ్యాసుడును; తమ+ఇచ్చన్+చనిరి=యథేచ్ఛగా వెళ్ళిరి; శిఖండి చరిత్రము=ఈ శిఖండి వృత్తాంతము; జన+కర్ణ+పరంపరన్=జనులు ఆనోటా ఆనోటా చెప్పగా వినుచుండుటచే; ప్రశస్తమయ్యెన్=ప్రసిద్ధినందెను.

భా: అనిచెప్పి నారదమహర్షికూడా తానూ, వ్యాసుడూ తమదారిన తాము పోయారు. ఈ శిఖండి గాథ ఆనోట ఆనోట పడి ప్రఖ్యాతమయింది.

వ: ఇవ్విధంబునఁ గాశీపతికన్యక సిద్ధమూర్తి యయి నెగడె నేను నంగనల నంగనాపూర్వుల నంగనాభిధానుల నంగనాకారులను వధియింపకుండ వ్రతంబు పూనిన వాఁడం గావున నంగనాపూర్వుండగు శిఖండి నాడభండనంబునం గోదండపాండిత్యంబు నెఱపి ననుఁ జంపను నొంపను గడంగితిన యేని నింతకంటె దుర్యశంబు గలదె యెట్లయిన నగుదుం గాని భగ్నవ్రతుండ నగుట కొర్వనిది నాతెఱంగు. 400

అ: సిద్ధమూర్తి=భీష్మ సంహారానికి అనువుగా సిద్ధించిన రూపం కలది; నెగడెన్=వర్ధిల్లింది.

భా: ఇలా కాశీరాజు పుత్రియైన అంబ సిద్ధరూపంతో వర్ధిల్లింది. నేను ఆడవాళ్ళను, పూర్వం ఆడవాళ్లయి తర్వాత మగవాళ్ళయిన వాళ్ళను, ఆడవారి పేర్లు పెట్టుకున్నవారిని, ఆడవారి రూపం కలవారినీ సంహరింపనని నియమం కలవాడను కనుక అంగనా పూర్వుడైన శిఖండి యుద్ధరంగంలో విలువిద్యాపాండితిని ప్రదర్శించినా వానిని చంపడానికీ, బాధించడానికీ పూనుకున్నట్లయితే ఇంతకన్నా అకార్య మేముంటుంది? నేనేమైనా అవుతాను, గాని వ్రతాన్ని మాత్రం విడనాడని పద్ధతి నాది.

క: అని చెప్పిన దేవవ్రతు
వినుత వచనములు విభుండు విని తన చిత్తం
బున నొక్కింత వగచి యీ
తనికి మగతనంబు పూన్కి తగు నని పలికెన్. 401.

అ: అని+చెప్పిన; దేవవ్రతు+వినుత+వచనములు=భీష్ముని విలువైన పలుకులు; విభుండు=రాజు; విని; తనచిత్తంబునన్=తన మనస్సులో; ఒక్కింత=కొంచెము; వగచి=విచారించి; ఈతనికిన్; మగతనంబు+పూన్కి=పౌరుషము వహించుట; తగును+అని=ఉచితమని; పలికెన్=అన్నాడు.

భా: భీష్ముని పౌరుషగాథ విన్న దుర్యోధనుడు ఆతడు పడ్డ కష్టాలకు కొంత బాధపడి ఈతడు పౌరుషాన్ని ప్రదర్శించడం ఎంతైనా సముచితమే అన్నాడు.

వ: తదనంతరంబ కొలువునం గలయ సమర విషయంబు లయిన సల్లాపంబులు సెల్లుచుండఁ గొండొకసేపు వినుచుండి సుయోధనుండు సురనదీ సూనున కిట్లనియె. 402.

అ: తత్+అనంతరంబు+అ=ఆ తర్వాత; కొలువునన్=సభలో; సమర విషయంబులు +అయిన=యుద్ధసంబంధులైన; సల్లాపంబులు= సంభాషణలు; సురనదీసూనునకున్=భీష్మునకు; కలయన్=అంతటను.

భా: ఆ తర్వాత కొలువులో అంతటా యుద్ధానికి సంబంధించిన ప్రస్తావనలు కొనసాగుతూ ఉండగా కొంతసేపు దుర్యోధనుడు విని భీష్మునితో ఇలా అన్నాడు.

ఆ: పాండవులకు గలుగు బలము లన్నియు సమ
యింప నీకు దినము లెన్ని పట్టు
గురుడుఁ గృపుఁడు గురుని కొడుకుఁ గర్ణుండు నెం
తెంత మానమున వధింతు రనఘ! 403

అ: పాండవులకున్; కలుగు+బలములు+అన్నియున్=కలసేనలన్నిటిని; సమయింపన్=సంహరించుటకు; నీకున్; ఎన్ని+దినములు+పట్టున్; గురుఁడున్=ద్రోణుడును; కృపుఁడున్; గురుని కొడుకున్=అశ్వత్థామయును; కర్ణుండున్; అనఘ=ఓ పుణ్యాత్మా; ఎంతెంత+మానమునన్=ఏయే ప్రమాణములలో; వధింతురు=సంహరిస్తారు.

భా: *మహాత్మా! పాండవుల కున్న సేనలన్నిటిని సంహరించడానికి నీకెన్ని దినాలు పడతాయి? ద్రోణుడు,కృపుడు, అశ్వత్థామ, కర్ణులు ఎన్నెన్ని దినాలలో సంహరింపగలరు?*

వ: అనిన విని గాంగేయుం డతని కిట్లనియె. 404.

భా: *అనగా ఆమాటలు విని భీష్ముడు దుర్యోధనునితో అన్నాడు.*

క: అనిఁ బాండవసేనలఁ జం
పను జెఱుపను నేము సాలుభంగుల నీ కి
ట్లనుమానము వాయఁగ నడు
గన తగుఁ గడు లెస్స విందు గాక నరేంద్రా! 405

అ: నర+ఇంద్రా=ఓమహారాజా; అనిన్=యుద్ధమున; పాండవ సేనలన్; చంపను=సంహరించుటకు; చెఱుపన్=విధ్వంస మొనర్చుటకును; ఏము=మేము; చాలుభంగులన్=సమర్థులమైన విధాలనూ; నీకున్; ఇట్లు; అనుమానము; పాయఁగన్= తొలగునట్లు; అడుగన్+అ+తగున్=అడుగ తగును; కడులెస్సన్=బాగుగా; విందుగాక=విందువుగాక.

భా: *మహారాజా! యుద్ధరంగంలో పాండవ సైన్యాన్ని సంహరించడానికీ, ధ్వంసం చేయడానికీ గల మా మా సామర్థ్యాలను నీ అనుమానం పోయేందుకు అడుగవచ్చు. మంచిది. విను.*

వ: ఏను నా సాలెడు కొలంది సెప్పెదఁ దక్కటివారుఁ దమతమ చాలుటలు దార చెప్పెద రదియెల్లను బిదప విందుగాని మున్ను నీకొక్క బాస యిచ్చెద నాకర్ణింపుము. 406

భా: *నేను నాశక్తి కొలదిని చెబుతాను. మిగిలినవారు కూడా తమతమ సామర్థ్యాలను తాము చెపుతారు. అది తరువాత విందువుగాని ముందుగా నీకొక మాట ఇస్తున్నాను. దాన్ని విను.*

వి: కురుపతి అడిగింది భీష్మాదులందరి బలప్రమాణాలను వివరించమని. అయితే భీష్ముడు తన 'చాలెడుకొలదిన్' చెబుతున్నాడు. మిగిలినవారి శక్తియుక్తులు వారినుండి విందువుగాని అంటున్నాడు. ఇది విజ్ఞత. వివేకవంతమయినమాట. ద్రోణాదులు ఎన్ని విధాలలో పాండవసేనను సంహరిస్తారో తాను సరిగా చెప్పలేక పోవచ్చు. చెప్పి వారి ఉత్సాహాన్ని పోగొట్టనూ కూడదు. అందుకనే భీష్ముడు తనసంగతి మాత్రం చెప్పి రాజహితాన్ని కోరి ఇతరుల ప్రమాణాల జోలికి పోలేదు.

క: మీఁటు గల రాజరథికుల
నాఁటికి వేవుర వధింతు నరుశరములు నో
నాఁటి పడవైచు నంతకు
వేఁటాడెదఁ బ్రతిబలంబు వీరుల నెల్లన్. 407

అ: మీఁటుగల=ఎదురుపాటు గల; రాజరథికులన్=రథికులైన రాజులను; నాఁటికి=ఒకనాటికి; వేవురన్=వేయిమందిని; వధింతున్=సంహరిస్తాను; నరుశరములు=అర్జునుని బాణములు; నోనాఁటి=బాధాకరముగా నాటుకొని; పడవైచు+అంతకున్=రణాంగణమున నన్ను పడవైచునంతవరకు; ప్రతిబలంబు+వీరులన్+ఎల్లన్=శత్రువీరులనందరిని; వేఁటాడెదన్ =సంహరిస్తాను.

భా: *ఉద్రేకంగల రథికులైన రాజులను ఒక్కదినంలో వేయిమందిని సంహరిస్తాను. అర్జునుని బాణాలు నా శరీరంలో బాధాకరంగా నాటుకొని నేలకూల్చేదాకా శత్రువీరుల నందరినీ వధిస్తాను.*

వ: అట్లు గాక నాకయ్యంబు సేయు దివసంబులలోన. 408

భా: *అలాకాక నేను యుద్ధం చేసే దినాలలో.*

క: పదివేలఁ జంపగా నో
పుదు నే నను నెత్తికోలు వుట్టిన యది నీ
పదునొకఁ డక్షోహిణులను
జదురున నడపింతు నెదిరి సైన్యము గలఁతున్. 409

అ: పదివేలన్=పదివేలమందిని; చంపఁగాన్+ఏన్; ఓపుదును=చాలుదును; అను; ఎత్తికోలు+పుట్టిన+అది=సంకల్పము కలిగినది; నీ=నీయొక్క; పదునొకఁ డక్షోహిణులను= పదుకొండు అక్షోహిణుల సేనను; చదురునన్=నైపుణ్యముచే; నడపింతున్; ఎదిరి+సైన్యమున్= శత్రుసైన్యమును; కలఁతున్=క్షోభపెట్టెదను.

భా: *పదివేలమందిని నేను చంపగల నను పూనిక కలిగింది. నీ పదుకొండు అక్షోహిణుల సేనను నేను నడిపిస్తాను. శత్రుసేనను సంక్షోభింపజేస్తాను.*

వ: అని పలికి వెండియు. 410

క: నీ వడిగిన పని యేర్పడఁ
గా విను మేనొక్క నెలఁ దెగం జేయుదు నా

నావిధ దివ్యాస్త్రంబుల
లావున నప్పాండవుల బలంబుల నెల్లన్. 411

అ: నీవు; అడిగిన; పని=కార్యము; ఏర్పడఁగాన్=స్పష్టముగా; విను= వినుము; ఏన్; ఒక్కనెలన్=ఒక్కనెలలో; నానావిధ=పలురకములైన; దివ్య+అస్త్రంబులన్=గొప్ప అస్త్రముల యొక్క; లావునన్=శక్తిచే; ఆ పాండవుల; బలంబులన్+ఎల్లన్=సేనలనంతటిని; తెగన్+ చేయుదున్=సంహరిస్తాను.

భా: నీ వడిగిన విషయం స్పష్టంగా విను. నేనొక్కనెలలో నానావిధ దివ్య శస్త్రాస్త్రబలంతో ఆపాండవసేన నంతటిని సంహరింపగలను.

వ: అనవుడు గురుకృపాశ్వత్థామ కర్ణులం గలయం గనుంగొని గాంధారీ నందనుండు మీమీ చందంబు లెట్లనిన నాచార్యుండు మందస్మితాననుం డగుచు నిట్లనియె. 412

అ: కలయన్ + కనుగొని=బాగుగా చూచి; చందంబులు=విధములు; మందస్మిత+ ఆననుండు=చిరునవ్వుతో కూడిన ముఖము కలవాడు.

భా: అన్న వెంటనే ద్రోణాచార్యుని, కృపాచార్యుని, అశ్వత్థామను, కర్ణుని బాగుగా చూచి దుర్యోధనుడు మీమీ బలాల ప్రమాణ మెంతటిది? అనగా ద్రోణుడు చిరునవ్వు నవ్వుతూ ఇలా అన్నాడు.

తే: ఏను ముదిసిన వాఁడ మహీశ! యెట్టు
లయిన నోపినభంగి నీయనుఁగు దాత
సాలినన్ని దినంబులఁ జాల వచ్చు
నబ్బలంబుల నని సమయంగఁ జేయ. 413

అ: మహీశ=రాజా; ఏను=నేను; ముదిసిన+వాఁడన్=ముసలివాడను; ఎట్టులు+ అయినన్=ఎట్లాగయినా; ఓపిన భంగిన్=శక్యమయిన రీతిలో; నీ+అనుఁగు+తాత= నీ ప్రియ పితామహుడైన భీష్మాచార్యులు; అనిన్=యుద్ధమున; ఆ+బలంబులన్=ఆపాండవసేనను; సమయంగన్+చేయన్=సంహరించడానికి; చాలిన+అన్ని=సరిపోయినన్ని; దినంబులన్=రోజులలో; చాలవచ్చు=శక్తుణ్ణి కావచ్చు.

భా: మహారాజా! నేను వృద్ధుణ్ణి. అయినా మీ తాత పాండవసేనను సంహరించి నన్నిదినాలలో శక్తివంచన లేకుండా నేనూ వారిని సంహరించగలను.

వి: వృద్ధులైన తర్వాత ఎంతటి వీరులైనా రణరంగంలో విక్రమించడం శ్రమ సాధ్యం. అదీ మహావీరులయిన అర్జునాదులు ప్రత్యర్థులైతే మరీకష్టం. ఐతే రాజు ఉప్పు తిన్నందుకు యుద్ధం వచ్చినపుడు తాను పాల్గొనక తప్పదు. అందుకనే ఓపినభంగి ఎట్టులయినా వయోధర్మాన్ని కూడా లెక్కచేయకుండా పోరాడి శత్రువులను సంహరిస్తాను అని ద్రోణాచార్యులు తన ధర్మనిష్ఠను వెల్లడిస్తున్నారు.

క: అనినఁ గృపాచార్యుం డీ
యినుమడి దివసములఁ దీర్ప నే నోపుదు నా
విని గురుతనూభవుఁడు పది
దినములఁ గడతేర్తు ననియె ధీరవిచారా! 414

అ: అనినన్=అనగా; కృపాచార్యుండు; ఈ ఇనుమడి+దివసములన్=ఇంతకు రెట్టింపు దినములలో; తీర్పన్=సంహరించడానికి; ఏన్+ఓపుదున్=నేను చాలుదును; నాన్=అనగా; విని; గురుతనూభవుఁడు= అశ్వత్థామ; ధీరవిచారా=బుద్ధిమంతుడా; పది+దినములన్=పది దినములలో; కడతేర్తున్+అనియెన్=సంహరింతును అనెను.

భా: *అనగా కృపాచార్యులు ఇంతకు రెట్టింపు దినాలలో పాండవసేనను సంహరించగల నన్నాడు. ఆ మాటలు విని అశ్వత్థామ నేను పది రోజులలో కడతేర్చగలను అన్నాడు.*

వ: అందఱ పలుకు లాకర్ణించి కర్ణుండు. 415

భా: *అందరి మాటలు విని కర్ణుడు.*

క: నానాస్త్రశస్త్రచయబడ
బానలముం గవియఁ జేసి యత్యుగ్రత నే
నాళ్ళన యప్పాండవ
సేనాసాగరము నివురఁ జేయుదు నధిపా! 416

అ: అధిపా= మహారాజా; నానా=పలువిధములైన; శస్త్ర+అస్త్ర+చయ= శస్త్రాస్త్ర సమూహమను; బడబ+అనలమున్=బడబాగ్నిని; కవియన్+చేసి=పైకొన జేసి; అతి+ఉగ్రతన్= మిక్కిలి భయంకరముగ; ఏన్=నేను; ఏను+నాళ్ళన=అయిదురోజులలోనే; ఆ+పాండవ+సేనా+ సాగరమున్=పాండవుల సేనా సముద్రమును; ఇవురన్+చేయుదున్=ఇంకిపోవ చేయగలను.

భా: *మహారాజా! బహువిధాలైన శస్త్రాస్త్రాలనే బడబాగ్ని జ్వాలలను ప్రసరింపజేసి పాండవసేనా సాగరాన్ని నేను ఐదు రోజులలోనే ఇంక చేస్తాను.*

వి: కర్ణుని పలుకుబడి సొంపుకు తగ్గట్టుగా తిక్కన కంద పద్యాన్ని చక్కగా రూపకాలంకారంతో పాదిగాడు.

బడబాగ్ని సముద్రాన్ని ఇంకజేసినది అసత్యము

అలానే పాండవసేనా సాగరాన్ని కర్ణబడబాగ్ని క్షోభపెట్టవచ్చునేమో కాని ఇవుర జేయడం వాస్తవదూరమైన విషమయమని సూచిస్తున్నాడు.

శస్త్రాస్త్ర చయమందు బడబానలత్వాన్ని పాండవసేనయందు సాగరత్వాన్ని ఆరోపించారు. కనుక రూపకాలంకారం.

వ: అని ప్రతిన సేసినఁ గలకల నవ్వి గాంగేయుండు. 417

భా: *అని ప్రతిజ్ఞ చేయగా భీష్ముడు కలకలనవ్వి.*

చ: **పలికిన నేమి యన్నియును బల్క నగున్ మనరాజు నొద్ద మా**
ర్పలికెడువారు లేరు విను పాండవ మధ్యము గాండివంబు దీ
ప్తుల మిఱుమిట్లు గొన్న కనుదోయి గుణధ్వని వ్రయ్యలైన వీ
నులు నయినన్ బలే! పలుకు నూల్కొన కుండుదు సూతనందనా !418

అ: పలికినన్+ఏమి=పలికినంత ఏమగును; అన్నియును; పల్కన్+అగున్=పలుక వచ్చును; మన+రాజు+ఒద్ద=మన మహారాజు దగ్గర; మారు+పలికెడువారు= ఎదురు చెప్పువారు; లేరు; విను; పాండవ మధ్యము+గాండివంబు+దీప్తులన్= అర్జునుని గాండీవము యొక్క కాంతులచే; మిఱుమిట్లు+కొన్న= చీకట్లు గ్రమ్మిన; కనుదోయి=రెండుకనులు; గుణధ్వనిన్= అల్లెత్రాటిమ్రోతచే; వ్రయ్యలు+అయిన= బ్రద్దలయిన; వీనులున్=చెవులును; అయినన్= అయితే; బలే=సెభాష్; సూతనందనా=ఓకర్ణా; పలుకు=అన్నమాట; నూల్కొనక+ ఉండుదు= గ్రహించకుండా ఉంటావు.

భా: మాట అనగానే సరా! ఎన్నయినా అనవచ్చు. మనరాజు దగ్గర నీ కెదురు చెప్పేవా రెవ్వరూ లేరు కదా. చూడు అర్జునుని గాండీవ దీప్తులతో నీ కళ్ళకు చీకట్లు క్రమ్మినప్పుడు, వింటినారి మ్రోతతో నీ చెవులు చిల్లులు పడినపుడు అయినా నీవు నోరు మూసుకుంటావు.

వి: ఎప్పుడు కర్ణుడు గొప్పమాటలు చెప్పనారంభించినా భీష్ముడు మందలిస్తూ ఉంటాడు. ఇందుకు గతంలో కర్ణుడు రెండుమూడు సార్లు అర్జునుని పరాక్రమాన్ని చవిచూచికూడా బీరాలు పల్కడం భీష్మ ుడుదహరిస్తాడు.

వ: **అనియె నివ్విధంబున నీ కొడుకు కడం బుట్టిన విశేషంబులు ధర్మతనయుండు చారులవలన విని తమ్ముల రాఁబనిచి వారలతో నిట్లనియె. 419**

భా: *అన్నాడు. ఈవిధంగా నీకుమారుని యొద్ద పుట్టిన విశేషాలన్నీ ధర్మరాజు గూఢచారులవల్ల విని తమ్ములను రప్పించి వారితో ఇట్లన్నాడు.*

సీ. **మనచారు లిప్పుడు సనుదెంచి రావీట**
నుండి దుర్బుద్ధి సుయోధనుండు
గొలువున గాంగేయ కుంభసంభవ కృపా
శ్వత్థామ కర్ణుల వలను సూచి
"యనిఁ బాండవుల బలమంతయు సమయింపఁ
జాలుదు రెంతేసి కాలమాన
మున" నన్న భీష్ముండు దనకొక్క నెలపట్టు
నని యాడె ద్రోణుండు నట్ల పలికెఁ

ఆ. **గృపుఁడు రెట్టి సెప్పెఁ గృపి కొడు కోపుదుఁ**
బది దినముల ననియె బాహువీర్య
ఘనుఁడు గాన సూత తనయుఁ డేనాళ్లన
తీర్ప నేర్తు నని ప్రతిజ్ఞ సేసె. 420

అ : మన చారులు = మన గూఢచారులు; ఇప్పుడు; ఆవీట నుండి; చనుదెంచిరి; దుర్బుద్ధి = దుష్టుడయిన; సుయోధనుండు; కొలువునన్ = సభలో; గాంగేయ, కుంభసంభవ, కృప-అశ్వత్థామ-కర్ణుల వలను+చూచి = భీష్మ, ద్రోణ, కృప, అశ్వత్థామ, కర్ణుల దిక్కు చూసి; అనిన్ = యుద్ధంలో; పాండవుల బలమంతయున్; సమయింపన్ = చంపటానికి; ఎంతేసి కాలమునన్ = ఎంతెంత కాల ప్రమాణంలో; చాలుదురు = సమర్థులవుతారు?; అన్నన్ = అంటే; భీష్ముండు; తనకున్; ఒక్కనెల - పట్టున్ అని; ఆడెన్ = చెప్పాడు; ద్రోణుండున్; అట్ల = అలాగే; పలికెన్; కృపుఁడు; రెట్టి - చెప్పె = రెట్టింపు చెప్పాడు; కృపికొడుకు = అశ్వత్థామ; పదిదినములన్ = పది రోజుల్లో; ఓపుదున్ ; అనియె; బాహువీర్య ఘనుఁడు కానన్ = భుజబలాఢ్యుడు కాబట్టి; సూత తనయుఁడు = కర్ణుడు; ఏ నాళ్లన = ఐదురోజులలోనే; తీర్చనేర్తున్ అని = చంపగలను అని; ప్రతిజ్ఞ చేసె.

భా : మనగూఢచారు లిప్పుడు ఆ శిబిరం నుండి వచ్చారు. దుష్టుడైన దుర్యోధనుడు భీష్మద్రోణాదులను చూసి "మీరు పాండవ సైన్యాన్నంతటినీ చంపటానికి ఎంతెంత కాలం పడుతుంది?" అని అడిగాడు. అపుడు భీష్ముడు ఒక నెల అని చెప్పాడు. ద్రోణుడు కూడ అంతే అన్నాడు. కృపుడు రెండు నెలలు అన్నాడు. అశ్వత్థామ పది రోజులు అన్నాడు. బాహుబలాఢ్యుడయిన కర్ణుడు అయిదు రోజులే చాలు నన్నాడు.

వి. కృపి : కృపాచార్యుని చెల్లెలు, ద్రోణుని భార్య - ఆమె కొడుకు అశ్వత్థామ.

వ: అనిచెప్పి అర్జునుం గనుంగొని వారు తమతమ యోపిన చందంబులు సెప్పిరి నీ చేతం గౌరవబలంబు లెంతదడవునకుం దెగు నాకుం జెప్పు మనిన నతం డిట్లనియె. 421

అ: ఓపిన=చాలిన; తెగును=చచ్చును.

భా: అనిపలికి అర్జునుని చూచి వారు తమతమ సామర్థ్యాలను వెల్లడించారు. మరి నీచేత కౌరవసైన్యము ఎంతకాలమునకు సంహరింపబడుతుందో చెప్పు మనగా అర్జునుడిలా అన్నాడు.

తే: వార లంతకుఁ జాలని వారె! నీబ
లముల సమయింపఁ జాలెడు లావు వెరవుఁ
గలర కాక యారాజుతోఁ బలికి బాస
దప్పవచ్చునె వారికి ధరణి నాథ! 422

అ: ధరణి నాథ=మహారాజా; వారలు= ఆ భీష్మాదులు; అంతకున్= ఆ పనికి; చాలని వారె=అసమర్థులా; నీ బలములన్=నీ సేనలను; సమయింపన్=సంహరించడానికి; చాలెడు=తగినట్టి; లావున్=బలమూ; వెరవున్=నేర్పు; కలరు+అ= కలవారే; కాక=కాపోతే; ఆ రాజుతో=దుర్యోధనునితో; పలికి=అట్లు తమ సామర్థ్యాన్ని గూర్చి బీరాలు పలికి; వారికిన్; బాస+తప్పన్+వచ్చును+ఎ=మాటమీర వచ్చునా?

భా: *మహారాజా! వా రాపనికి తగని వారా? నీ సేనలను సంహరించడానికి తగిన బలాదు లున్నవారే. అయితే దుర్యోధన మహారాజుతో అన్నమాట నిలబెట్టుకోవాలి గదా!*

వి: అంత చాలని వారె', సమయింపజాలెడు లావు వెరవు గలర', బాస తప్పవచ్చునే వారికి' అన్న వాక్యాంతాలలో గల కాకువు అర్జునుని అవహేళనను అతి సమర్థంగా వ్యక్తీకరిస్తుంది. గంభీరమైన భావాన్ని చిన్న చిన్న తెలుగు పదాలలో ప్రతిపాదించగల తిక్కన సామర్థ్యం, శిల్పం ఇక్కడ మనం చూస్తాం.

'రాజుముందు బీరాలు పల్కడం కాక రణరంగంలో తమబలాన్ని ప్రదర్శించి మాట నిలబెట్టుకోవాలి. అది ప్రతిష్ఠాహేతువు.' అంటున్నా డర్జునుడు.

వ: అని దరహాసోల్లాస భాసిత వదనుండై. 423

భా: *అని చిరునవ్వుతోను, ఉత్సాహముతోను ఒప్పునట్టి ముఖము కలవాడై.*

వి: భీష్మాదుల దౌర్బల్యమూ, ముఖ్యంగా కర్ణుని బీరాలు విన్న అర్జునుడు మందహాసం చేశాడు. బలప్రదర్శన ప్రస్తావన వచ్చింది. మహావీరుడు కనుక ఉల్లాసంతో తన పరాక్రమాన్ని అన్నకు విన్నిస్తున్నాడు.

మ: అనుమానం బదియేల నీ మది మదీయస్ఫార బాహాబలం
బు నిరూపింపఁ దలంచితేని విను మేపుం జేవయుం జూపి కృ
ష్ణుని తోడ్పాటునఁ బేర్చి యేఁ గడఁగినం జూర్ణంబు గావింతు నొ
క్కొ నిమేషంబున దేవదానవులతోఁగూడం ద్రిలోకంబునున్. 424

అ: నీ మదిన్=నీమనస్సున; అనుమానంబు+అది=శంకన్నది; ఏల=ఎందులకు; మదీయ=నాయొక్క; స్ఫార=అధికమైన; బాహాబలంబున్=భుజబలమును; నిరూపింపన్=నిశ్చయించుటకు; తలంచితి+ఏనిన్=తలపు కల్గినచో; వినుము; ఏపున్=ఉత్సాహమును; చేవయున్= బలమును; చూపి=ప్రదర్శించి; కృష్ణుని+తోడ్పాటునన్=శ్రీకృష్ణుని సాయముతో; పేర్చి=విజృంభించి; ఏన్=నేను; కడఁగినన్=పూనుకొన్నట్లయిచో; నిమేషంబునన్=ఒక్క నిముషములో; దేవదానవులతోన్+కూడన్=దేవతలతోను, రాక్షసులతోను కలిసి; త్రిలోకంబునున్=ముల్లోకములనే; చూర్ణంబు+కావింతున్+ఒక్కొ=చూర్ణము చేస్తానేమో.

భా: *నీకు అనుమానమెందుకు. నా నమధికమైన భుజబలాన్ని తెలిసికోదలచినచో విను. శ్రీకృష్ణుడు తోడుగా నేను విజృంభించి బలోత్సాహాలను ప్రదర్శించినట్లయితే ఒక్క నిముషములో దేవదానవులతో ముల్లోకాలనే పిండిచేయగలనేమో.*

వి: ఏడు అక్షౌహిణుల పాండవ సేనను రెండునెలలు మొదలుకొని ఐదు రోజుల లోపల సంహరిస్తామని భీష్మాదులు చెప్పగా పదకొండు అక్షౌహిణుల కౌరవసైన్యాన్ని నిముషంలో ధ్వంసమొనర్చడంకాక త్రిలోకాలనే పిండిచేస్తా నంటున్నాడు అర్జునుడు.

దానికంతటికీ కృష్ణుని తోడ్పాటు ఉండా లంటున్నాడు.

దైవసహాయంతో మహావీరులైన భీష్మాదులు చాలాకాలం చేయలేకపోయిన పనిని అర్జునుడు అనతికాలంలోనే చేసి చూపించాడు.

ఇది దుర్యోధనార్జునులలోగల తేడా.

దైవవైముఖ్యం దుర్యోధనునిలోను, భగవత్సమాశ్రయణం అర్జునునిలోను వారివారి పతనోచ్ఛ్రయాలకు కారణమైంది.

వ: అది యెట్లంటేనిఁ గృత్రిమ కిరాతుండైన పశుపతి మెచ్చి జగత్సంహార సమయంబునం దాను బ్రయోగించునట్టి పాశుపతమహాస్త్రంబు నాకిచ్చె; నది నాయందు సన్నిహితంబయి యున్నది గావున శత్రు నిరాసం బనాయాసంబై యుండు; నప్పాశుపతమహనీయ ప్రభావంబు భీష్ముం డున్న రూపెఱుంగఁడు; ద్రోణకృపాశ్వత్థామలు నెఱుంగరు; కర్ణున కెఱుంగ నెంత ద వ్వట్టి ఘోరసాధనంబున సమస్తంబును సమయించుట యుక్తంబు గాదు; తక్కిన యాయుధంబులం బోరి వైరులం బరిమార్చినం బౌరుషంబు దీపించునని తలంచెద; నప్పటికి వలయు విధంబయ్యెడు నది యట్లుండె, నీవా రక్కడివారికిం దక్కువ వారె; భీమసేనుండు, గవ, లభిమన్యుండు, శిఖండి, యుత్తమౌజుండు, యుధామన్యుండు, ఘటోత్కచుండు మొదలైన జగజె ట్లున్న వారు, మఱియు ననేకులు వీరలయట్టి వారలు కలరు; వారల నందఱం జెప్పనేల? యేనుంగు వోలె నీలావు నీవెఱుంగవు; దివిజులకు నజేయుండవు; నీ యొక్కనికిఁ ద్రిభువనంబు నెదురె!! నీవు నిక్కం బలుగవు గాక నీ వలిగిన నెవ్వ రెట్లయ్యెదరో యటు సూడుము నీ సైన్యంబుల నెవ్వరికి నేమి సేయవచ్చు? మనకు విజయానందంబు సులభంబ. యని పలికె నని సంజయుండు ధృతరాష్ట్రున కెఱింగించె నని వైశంపాయనుండు జనమేజయునకుం జెప్పుటయు. 425

అ: శత్రు నిరాసము=శత్రువుల నణచుట; ఉన్నరూపు=యథార్థశక్తి; సమయించుట= నశింపజేయుట; లావు=శక్తి; దివిజులకున్=దేవతలకు; త్రిభువనంబు= మూడు లోకాలు; నిక్కంబు=నిజము; అలుగవు=కోపింపవు.

భా : అది ఎలా అంటే..... (చెపుతా విను) కిరాత వేషంలో వచ్చిన శివుడు నన్ను మెచ్చుకొని తాను జగత్సంహారంలో ప్రయోగించే పాశుపతాస్త్రం నాకిచ్చాడు. అది నా దగ్గరున్నది. కాబట్టి శత్రువులను అనాయాసంగా జయించవచ్చు. ఆ పాశుపతాస్త్ర మహిమ భీష్మునికి తెలియదు. ద్రోణకృపాశ్వత్థామలకూ తెలియదు. కర్ణునకింకా చెప్పాలా? కాని అంత ఘోరమయిన అస్త్రంతో సామాన్యులను వధించటం తగదు. మిగిలిన ఆయుధాలతో శత్రుసంహారం చేస్తే మనపరాక్రమం దీపిస్తుంది అనుకుంటాను. సరే! అప్పటికేది తగునో అది జరుగుతుంది. అది అలా ఉంచు. నీ వారు మాత్రం అక్కడి వారికి తక్కువ వారా? భీముడు, నకుల సహదేవులు, అభిమన్యుడు, ఉపపాండవులు, సాత్యకి, విరాటుడు, ద్రుపదుడు, ధృష్టద్యుమ్నుడు, శిఖండి, ఉత్తమౌజుడు, యుధామన్యుడు, ఘటోత్కచుడు

మొదలయిన మహావీరులున్నారు. ఇంకా ఇంతటివారు ఎంతోమంది ఉన్నారు. వారందరినీ చెప్పడమెందుకు? ఏనుగులా నీబలం నీకు తెలియదు. దేవతలు కూడ నిన్ను జయింపలేరు. నిన్నొక్కణ్ణే మూడు లోకాలూ కలిసినా ఎదిరించలేవు. నీవు కోపింపవు గాని కోపిస్తే ఎవరేమవుతారో తెలియదు. అటుచూడు నీ సైన్యంలో ఎవరికీ ఏమీ చేయలేము. మనకు విజయం తేలికగా లభిస్తుంది. అని చెప్పాడు. ఇలా సంజయుడు ధృతరాష్ట్రునికి చెప్పాడని వైశంపాయనుడు జనమేజయునకు చెప్పాడు.

చ: కమలభవాది దైవతముఖస్ఫుట నిర్గళిత ప్రశస్తవా
గమృత రస ప్రసార కలితాంచిత సేకవిధి ప్రకర్ష సం
గమ సముదీరితోల్లసన కందళితప్రహసద్దయాలతా
సుమహదుపాశ్రయ ప్రమద శోభిత విశ్వజగన్మధువ్రతా! 426

అ: కమల............మధువ్రతా; కమలభవ+అది= బ్రహ్మ మొదలుగాగల; దైవత=దేవతలయొక్క; ముఖ=ముఖములనుండి; స్ఫుట=వికసించి; నిర్గళిత=వెలువడినట్టి, ప్రశస్తవాక్=వేదవాక్కులనెడి; అమృతరస=అమృతరసముయొక్క; ప్రసార=ప్రవాహంతో; కలిత=కూడి; అంచిత=పవిత్రమయిన; సేకవిధి=తడుపుట అనెడి కార్యంయొక్క; ప్రకర్ష= అత్యంతమైన; సంగమ=కలయికతో; సముదీరిత=పలుకబడిన; ఉల్లసన=వికాసముతో; కందళిత= మొలకెత్తినట్టిదై; ప్రహసత్=వికసించుచున్న; దయాలతా=దయ అనెడి లతకు; సుమహత్+ ఉపాశ్రయ=గొప్పదైన ఆలవాలముచే గల్గిన; ప్రమద=ఆనందముతో; శోభిత=ప్రకాశించునట్టి; విశ్వ=సమస్తమైన; జగత్=ప్రపంచమనెడి; మధువ్రతా=తుమ్మెద కలవాడా?

భా: బ్రహ్మ మొదలైన దేవతలు వేదవచనాలతో నిన్ను నుతింతురు. వాటిచే నీయందు ఉదయించిన కరుణావల్లరి వారి స్తోత్రామృత రసముతో వృద్ధినందును. ఆ కరుణాలతను ఆశ్రయించి సమస్త ప్రపంచమును తుమ్మెదవలె ఆస్వాదించి ఆనందించుచున్నది.

క: సమయబహుత్వారణ్య
భ్రమణ పరిశ్రామ్యదంతరంగ నితాంతో
త్తమ సరళ మార్గదర్శన
సమర్థ పుణ్యాభిధాన సకృదుచ్చరణా! 427

అ: సమయ.......... ఉచ్చరణా; సమయ=శాస్త్రనియమాదులయొక్క; బహుత్వ=బాహుళ్యమనెడి; అరణ్య=అరణ్యములందు; భ్రమణ=తిరుగుటచే; పరిశ్రామ్యత్= అలయుచున్న; అంతరంగ=హృదయాలకు; నితాంత+ఉత్తమ=బాగా శ్రేష్ఠమైనదీ; సరళ=మృదువైనదీ అయిన; మార్గ=దారిని; దర్శన=చూపుటయందు; సమర్థ=శక్తిగల; పుణ్య+ అభిధాన=పవిత్రమైన నామంయొక్క; సకృత్+ఉచ్చరణా=ఒకే మారు ఉచ్చరించుట కలవాడా.

భా: హరిహరనాథా! శాస్త్రాది నియమాలనే అరణ్యంలో తిరిగి తిరిగి అంతరంగం అలసిపోయినది. అటువంటి హృదయానికి మోక్షసిద్ధికై సరళమూ, శ్రేష్ఠమూ అయిన మార్గము ఒక్కమారు నీ నామము నుచ్చరించుటయే గదా!

మ: అవగమిత రహస్యాష్టాంగ సమ్యక్ప్రకారో
త్సవ గురుకరుణా విస్తారగాఢ ప్రశాన్తి
ప్రవణ హృదయ పద్మోద్భాసి విజ్ఞాన సారా
వ్యవహిత పరమానందానుభూత్యేక రూపా! 428

అ: అవగమిత...... ఏకరూపా; అవగమిత= తెలియజేయబడిన; రహస్య=గూఢమైన; అష్ట+అంగ=యమనియమాది అష్టాంగముల యొక్క; సమ్యక్-ప్రకార=యథార్థ విధానమనెడి; ఉత్సవ=ప్రమోదంగల; గురు కరుణా= గుర్వనుగ్రహంతో; విస్తార=ఎక్కువైన; గాఢ ప్రశాన్తి= ఉత్తమ శాంతియందే; ప్రవణ=లగ్నమైన; హృదయ పద్మ=హృదయమనెడి తామరయందు; ఉద్భాసి= ప్రకాశించునట్టి; విజ్ఞానసార=విజ్ఞానసారమునకు; అవ్యవహిత=అడ్డులేని; పరమానంద= బ్రహ్మానందము యొక్క; అనుభూతి=అనుభవమే; ఏకరూపా=ప్రధానరూపాలుగా కలవాడా!

భా: (హరిహరనాథా) యమనియమాది అష్టాంగాల యథార్థరీతిని యోగులు గురుకరుణా విశేషం వలన తెలిసికొనుచున్నారు. ఆ జ్ఞానంతో వారి హృదయపద్మాలయందు గాఢప్రశాన్తి కలుగుతోంది. ఆ విజ్ఞానసారాన్నే వారు నీ రూపమైన బ్రహ్మానందసారంగా అనుభవించి ఆనందిస్తున్నారు.

వి: పర్వాంత మందలి మూడు పద్యాలు ఒక్కొక్కటి ఒక్క సమాసంగా ఘటించాడు తిక్కన.

గద్యము

ఇది శ్రీమదుభయకవిమిత్ర కొమ్మనామాత్యపుత్ర
బుధారాధన విరాజి తిక్కన సోమయాజి
ప్రణీతంబైన శ్రీ మహాభారతంబున
నుద్యోగపర్వంబు నందు
సర్వంబును
చతుర్థాశ్వాసము

ఉద్యోగపర్వము
గద్య పద్య ప్రథమ పాద సూచి

ఆ

ఈ

గ

ద

ధ

ప

బ

శ